లోకశాంతికి చండీయాగం

ఆలయానికి వస్తున్న హరినారాయణాచార్యులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: లోక కల్యాణం, సర్వ మానవ సౌభాగ్యాలతోపాటు అందరికీ ఆధ్యాత్మికత వైపు నడిపించడానికి నిర్వహిస్తున్న చండీయాగంలో భక్తులంతా పాల్గొనాలని అన్నమాచార్యుల 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణాచార్యులు పేర్కొన్నారు. అనకాపల్లి గాంధీనగరం, అంజయ్యకాలనీ శ్రీవేంకటేశ్వరాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న చండీయాగ మహోత్సవాలకు హాజరైన ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు అందరినీ భక్తి మార్గంలో నడిపించాలన్నారు. తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులు, అండ అందరికీ ఉంటాయన్నారు. రాష్ట్ర పరీక్షల ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో చండీయాగం, హోమాలు, రుద్రాభిషేకాలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరుకాగా ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గిరిజన యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 6 వరకు పొడిగించినట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) సీవోవో గోపీకృష్ణ శివ్వం తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెంది 27 ఏళ్లలోపు వయసు కలిగి ఐటీఐలో ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ ట్రేడుల్లో, అలాగే డిప్లొమాలో మెకానికల్ పూర్తి చేసిన అభ్యర్థులకు సీఎన్‌సీ ఆపరేటర్ కోర్సులో 2 నెలల ఉచితంగా శిక్షణ, వసతి ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు సింధియా దరి సెమ్స్ కార్యాలయంలో లేదా 8332861237, 0891-2704010 ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

రారండోయ్.. బడిలో వేడుకకు!

పాడేరు, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు మూడోసారి పండగ వచ్చింది. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు (పీటీఎం) పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 5న ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఇప్పటికే రెండుసార్లు పీటీఎం విజయవంతంగా నిర్వహించింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పిల్లల చదువు, వారి నడవడిక తదితర అంశాలను చర్చించారు. భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది జూన్ 10న పీటీఎం జరిగిన విషయం తెలిసిందే. తాజా సమావేశం ఎలా నిర్వహించాలనే దానిపై మార్గదర్శకాలు విద్యాశాఖ జారీ చేసింది.

విద్యాభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 5న మెగా పీటీఎం (తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం) ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్నారు. గతేడాది తల్లిదండ్రులకు ఆటలు, రంగోళీ పోటీలు నిర్వహించారు. ఈసారి అలాంటివి పక్కన పెట్టి విద్యార్థుల ప్రగతిపైనే సమావేశం జరగనుంది. పిల్లల చదువులెలా ఉన్నాయి, వారి పురోభివృద్ధిపై చర్చించనున్నారు.

స్థానిక ప్రజాప్రతినిధికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యారావు తదితరులు

జిల్లావ్యాప్తంగా 22 మండలాల్లో 2,913 పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమావేశాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. 1.2 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హాజరుకానున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల పురోగతి, నెలకొన్న సమస్యలపై చర్చించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం జరుగుతుంది. అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేసి సమావేశం ముగిస్తారు.

5న మెగా పీటీఎం

- జిల్లాలో 30 మంది విద్యార్థులున్న పాఠశాలలు 1,560, వంద మంది ఉన్న పాఠశాలలు 1,038, 250 మంది ఉన్న పాఠశాలలు 166, వెయ్యి మంది ఉన్న పాఠశాలలు 149 ఉన్నాయి. వీటన్నింటిలో పీటీఎం కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం రూ. 54,92,250 నిధులు విడుదల చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేయనున్నారు.
- పీటీఎం కార్యక్రమానికి ఎంపికైన పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పోస్టు ద్వారా ఆహ్వాన పత్రాలు పంపనున్నారు. కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామల్లో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ఆహ్వాన ప్రతులు అందజేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు: సుమారు 3000

చదువుతున్న విద్యారులు: 1.6 లక్షల మంది

కార్యక్రమ వివరాలిలా...

- ఉదయం 9 నుంచి 9.30 వరకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, దాతలు, విద్యావంతులు. పాఠశాల యాజమాన్య కమిటీ, పూర్వ విద్యార్థులకు ఆహ్వానం.
- ఉదయం 9.30 నుంచి 10.50 గంటల వరకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల చదువు, ఆరోగ్య పరిస్థితిపై చర్చిస్తారు.
- 10.50 నుంచి 11 గంటల వరకు పాఠశాలలోని క్రీడా సామగ్రి, గ్రంథాలయాల పరిశీలించాల్సి ఉంటుంది.
- 11 గంటల నుంచి సభా కార్యక్రమం ప్రారంభం. మా తెలుగు తల్లికి మల్లెపూదండ ప్రార్థనా గీతాలాపన. ఉపన్యాసాల అనంతరం విద్యార్థుల ప్రగతి కార్డుల పంపిణీ

కళకళలాడాల్సింది.. కలగానే మిగిలింది

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

అరకులోయ.. ఆంధ్రా ఊటీగా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడి కాఫీ కూడా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. మన్యంలో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే సందర్శకులకు ఇక్కడి కాఫీ రుచి తెలియజేసేలా 2018లో అనంతగిరిలో కాఫీ హౌస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మూతపడిన హరిత రెస్టారెంట్ దీనికి అనువైనదిగా భావించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పాత రెస్టారెంట్ భవనాన్ని రూ. 30 లక్షలతో ఆధునికీకరించారు. దీనిపక్కనే కాఫీ మ్యూజియం నిర్మాణానికి రూ. 50 లక్షలతో టెండర్ పిలిచారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో కాఫీ మ్యూజియం భవన నిర్మాణానికి బిల్లులు చెల్లించలేదు. పనులు పూర్తిగా నిలిపివేశారు.

- గతంలో హరిత రెస్టారెంట్ బాగా నడిచింది. అనంతరం వ్యాపారం సరిగా సాగకపోవడంతో 2014లో పర్యాటక శాఖ దీనిని మూసివేసింది. రెస్టారెంట్ శిథిలావస్థకు చేరుకుంది. 2018లో పర్యాటక శాఖ కాఫీహౌస్ కోసం దీనిని ఆధునికీకరించింది. కాఫీ ప్రాజెక్టు పనులు ముందుకు సాగకపోవడంతో ప్రస్తుతం ఈ రెస్టారెంట్ తుప్పల మధ్యలో దర్శనమిస్తోంది.

సగంలోనే నిలిచిన కాఫీ మ్యూజియ నిర్మాణం

ప్రభుత్వం మారడంతో.. పర్యాటకులకు కాఫీ రుచులను అందించేలా కేరళకు చెందిన రామన్‌మదాల్ సూచనల మేరకు పర్యాటకశాఖ ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అనుకున్న సమయానికి పనులు పూర్తి కాకపోవడం, ప్రభుత్వం మారడంతో కాఫీ ప్రాజెక్టు అటకెక్కింది. ఇప్పటికైనా పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తే సందర్శకులకు సరికొత్త అనుభూతి కలుగుతుంది.

పోషణ.. వైద్యుల పర్యవేక్షణ

కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పడకలు

అరకులోయ, న్యూస్‌టుడే

పోషకాహార లోపంతో అవస్థలు పడుతున్న చిన్నారులకు మంచి వైద్యంతోపాటు బలమైన ఆహారాన్ని అందించేందుకు పోషకాహార కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గిరిజన ప్రాంతంలో శిశు మరణాలను నివారించే చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి 12 ఏళ్ల బాలల వరకు రక్తహీనత, పోషక విలువలలోపంతో బాధపడుతుంటే వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వారికి అవసరమైన ఆహారాన్ని అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

★ అరకులోయలోని ప్రాంతీయ వైద్య కేంద్రంలో ఎనిమిది నెలల కిందట చిన్నారుల పోషకాహార కేంద్రాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. రెండు నెలల పాటు కొనసాగిన ఈ కేంద్రంలో చిన్నారులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించారు. వైద్యుల పర్యవేక్షణలో వారిని ఉంచి పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతులయ్యాక ఇంటికి పంపించే ఏర్పాట్లు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు సైతం బొమ్మలను ఇక్కడ అందుబాటులో ఉంచారు.

★ ప్రస్తుతం పోషకాహార కేంద్రం ఏర్పాటుకు వీలుగా వంటమనిషి, ఆయా, స్టాఫ్‌నర్స్‌లను నియమించారు. వివిధ ఇబ్బందులతో బాధపడుతున్న చిన్నారులకు నిపుణుల సూచన మేరకు బలవర్ధక ఆహారం ఇక్కడే వడ్డిస్తారు. త్వరలో చింతపల్లి, ముంచంగిపుట్టు ప్రాంతీయ వైద్యకేంద్రాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. దీంతో గిరిజన బాలల్లో శారీరక ఎదుగుదల లోపాలను అధిగమించే అవకాశముంది.

సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం నుంచి ఈ నెల 8 వరకు మావోయిస్టులు పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గాలింపు ముమ్మరం చేశారు. ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్ పరిధిలో జి.మాడుగుల సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు. వారోత్సవాలు ముగిసే వరకు ప్రజాప్రతినిధులు మారుమూల ప్రాంతాలకు వెళ్లరాదని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. కుజబంగి, కొత్తూరు, లబ్బూరు, జోలాపుట్టు కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. పాడేరు నుంచి బూసీపుట్టు, జామిగుడ వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసును కుమడ వరకు, జోలాపుట్టు, దోడిపుట్టు వేళ్లే రాత్రి బస్సు సర్వీసులను ముంచంగిపుట్టు వరకు పరిమితం చేశారు. సాయంత్రం ఐదు గంటలు దాటాక బస్సు సర్వీసులను ముంచంగిపుట్టు స్టేషన్ వద్ద నిలిపివేయాలని సూచించినట్లు సీఐ తెలిపారు. గత నెలలో మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వారోత్సవాల్లో మావోయిస్టులు అలజడులు సృష్టించే అవకాశాలు ఉన్నాయని భావించి సరిహద్దున ఉన్న బీఎస్ఎఫ్ బలగాలు ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నాయి.

ముంచంగిపుట్టులో అనుమానితులను ఆరా తీస్తున్న పోలీసులు

పింఛను సొమ్ముతో వెటర్నరీ అసిస్టెంట్ పరారీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: పింఛను సొమ్ము రూ.2.88 లక్షలతో ఎం.మాకవరం గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంటు పరారయ్యాడు. బ్యాంకు నుంచి శనివారం తీసుకువచ్చిన నగదులో 69 మంది పింఛనుదారులకు సంబంధించిన రూ. 2.88 లక్షలు వెటర్నరీ అసిస్టెంట్ కె. చైతన్య వరప్రసాద్‌కు అందజేసినట్లు సచివాలయ కార్యదర్శి శంకర్ తెలిపారు. లొద్దిపాకలు, లుబ్బుర్తి గ్రామాలకు చెందిన పింఛనుదారులు నగదు అందలేదని చెప్పడంతో ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. రెండు రోజులుగా వెటర్నరీ అసిస్టెంట్ ఫోన్ చేసినా స్పందించడం లేదని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. సచివాలయ కార్యదర్శి శంకర్, చింతలపూడి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మండల పరిషత్తు కార్యాలయ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. గూడెంకొత్తవీధి మండలానికి చెందిన చైతన్య వరప్రసాద్ ఇంటికి సిబ్బందిని పంపగా సోమవారమే ఇంటి నుంచి వెళ్లారని కుటుంబ సభ్యులు చెప్పారని శంకర్ తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎంపీడీఓ ప్రసాదరావు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై కిశోర్‌వర్మ చెప్పారు.

పింఛను సొమ్ము కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

మళ్లీ ముంపులో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి మట్టం మూడు రోజులుగా పెరుగుతూనే ఉంది. పోలవరం ప్రాజెక్టు దిగువ కాఫర్ డ్యాం సమీపంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రానికి గండిపోశమ్మ అమ్మవారి ఆలయం చుట్టూ వరద చేరింది. ఆలయ మండపంతోపాటు క్యూలైన్లు ముంపులో చిక్కుకున్నాయి. దుకాణాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు ఖాళీ చేసి తరలివెళ్తున్నారు. పూడిపల్లి, దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం పరిసర ప్రాంతాల్లో మొక్కజొన్న తోటలు నీట మునిగాయి. డి.రావిలంక - దండంగి మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద ఉద్ధృతంగా పెరగడంతో రాకపోకలు స్తంభించాయి. సీతపల్లి వాగుకు గోదావరి పోటెత్తడంతో సీతారం వద్ద, ఇందుకూరుపేట వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

నీటమునిగిన గండిపోశమ్మ ఆలయం

మబ్బులున్నా తగ్గని చలి

చింతపల్లి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో మన్యంలో రెండు రోజులుగా ముసురు వాతావరణం నెలకొంది. వాతావరణం మబ్బులమయంగా ఉన్నప్పటికీ చలి తీవ్రత కొనసాగుతోంది. అరకులోయలో మంగళవారం 13.9 డిగ్రీలు, జి.మాడుగులలో 14.3, డుంబ్రిగుడలో 14.8 చింతపల్లిలో 15.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు.

వణికించే చలిలో బస్టాప్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టట్యో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, క్యూస్ కార్ప్ లిమిటెడ్ - టాటా ఎలక్ట్రానిక్స్, భారత్ బ్యాంక్ సంస్థలు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు www.employment.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

గాల్లో తేలినట్టుందే.. ఊయల ఊగినట్టుందే..!

✦ కైలాసగిరి గాజు వంతెనకు విశేష స్పందన

✦ తొలిరోజు వెయ్యి మంది సందర్శన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరానికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతి కల్పించడానికి కైలాసగిరిపై ఏర్పాటు చేసిన గాజు వంతెనకు తొలిరోజు విశేష స్పందన లభించింది. దీన్ని పీపీపీ విధానంలో రూ.7కోట్ల వ్యయంతో వీఎంఆర్డీఏ నిర్మించింది. దేశంలోనే అతి పెద్ద తేలియాడే గాజు వంతెన కావడంతో నగర పరిధి నుంచే కాక విజయనగరం, శ్రీకాకుళం, అన్నవరం ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు బారులు తీరారు. వంతెన చివరి ప్రాంతానికి చేరుకుని సముద్ర అందాలను వీక్షిస్తూ ఫొటోలు, వీడియోలు, సెల్ఫీలు దిగుతూ సందడి సందడి చేశారు.

ఛార్జీలు ఇలా..: ఒకరికి రూ.250, దంపతులు ఒక కిడ్‌కు రూ.650, ఫ్యామిలీ కాంబో కింద తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలకు రూ. 800, గ్రూపు 10 మందికి మించితే ఒక్కో టికెట్ నూ.200, ఫ్రెండ్స్ కాంబో ఐదుగురు ఉంటే ఒక్కో టికెట్ రూ. 220గా నిర్ణయించారు. ఒక దఫాలో 40 మందిని వంతెనపైకి పంపించారు. అక్కడి నుంచి పది నిమిషాలపాటు ప్రకృతి అందాలు వీక్షించడానికి అవకాశం కల్పించారు. తొలిరోజు మంగళవారం వెయ్యి మంది సందర్శకులు రాగా, రూ.2 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

గాజు వంతెనపై సందర్శకుల సందడి

ఆకాశంలో విహరిస్తున్నట్లు: గాజు వంతెన గాలి వేగానికి ఊగుతూ కనిపించింది. చాలా కొత్తగా అనిపించింది. ఆకాశంలో విహరిస్తున్న విధంగా ఉంది. సముద్రపు అందాలు, మేఘాలు, కొండలు చాలా బాగా కనిపించాయి. మళ్లీ కుటుంబం అంతా కలిసి వస్తాం. – కల్పన, గాజువాక

మరింత పర్యాటక శోభ: దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాలలో చూసి స్నేహితులమంతా వచ్చాం. వంతెనపై నుంచి చూస్తే తీర అందాలు అద్భుతంగా కనిపించాయి. ఇది ఒక మధురానుభూతి. గాజు వంతెనతో విశాఖ నగరానికి మరింత పర్యాటక శోభ వస్తుందని భావిస్తున్నాం.– డాక్టర్ బురిడి కల్యాణి, సీతంపేట

భయంపోయి....: గాజు వంతెనపై నడుస్తుంటే కళ్లు తిరిగినట్లు అనిపించింది. మాలాగే చాలా మంది రావడంతో భయం పోయి ఉత్సాహం వచ్చింది. ఫొటోలు దిగి వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలో పోస్టుచేసి స్నేహితులు, బంధువులతో పంచుకుంటాం. – శ్రీనివాస్ దంపతులు, విజయనగరం.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలకు 15 వరకు గడువు పెంపు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా జిల్లాలో శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు పెంచారని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువతలో డ్రైవింగ్ నైపుణ్యాలు అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఆసక్తి ఉన్న సంస్థలు డీపీఆర్ నకలు, సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. దరఖాస్తు చేసే సంస్థ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ), ట్రస్టు, సహకార సంగం లేదా తయారీదారుల సంస్థగా ఉండాలన్నారు. ఎన్‌జీఓ అయితే దర్పణ్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టర్నోవర్ ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. సంస్థకు సొంతంగా లేదా పదేళ్ల లీజుతో రెండు ఎకరాల స్థలం, వాహనాలు, వర్క్‌షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

రింతాడకు చేరిన చినగంజాం బాలుడు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఉపాధి కోసం వెళ్లి మద్యానికి బానిసైన వ్యక్తి తన ఇద్దరు పిల్లలను రైల్వేస్టేషన్‌లో వదిలేశాడు. ఆ చిన్నారుల్లో ఒకరు గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ తీములబంద గ్రామం చేరుకున్నారు. అధికారులు ఆ చిన్నారిని బాలల సంరక్షణ గృహం నిర్వాహకులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఐసీడీఎస్ అధికారులు మంగళవారం రాత్రి వెల్లడించారు. చింతపల్లి మండలానికి చెందిన పాంగి రాజు, చిన్నారి దంపతులు పొట్టకూటి కోసం బాపట్ల జిల్లా చినగంజాంలో రొయ్యల చెరువులో పనికి వెళ్లారు. పన్నెండేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం. మద్యానికి బానిసైన రాజు భార్య, పిల్లలను ఇబ్బందులకు గురిచేసే వాడు. ఐదుగురిలో ఇద్దరు పిల్లలను ఈ ఏడాది సెప్టెంబరులో చినగంజాం రైల్వే స్టేషన్‌లో వదిలేశాడు. వారిలో ఒకరు గూడెంకొత్తవీధి మండలం రింతాడ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావడంతో కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి ఆదేశాల మేరకు మండల అధికారుల బృందం మంగళవారం రాత్రి రింతాడ తీములబంద చేరుకున్నారు. స్థానికంగా రాజ్‌కుమార్, కాంతమ్మ దంపతుల వద్ద ఆ చిన్నారి ఉన్నట్లు గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నారిని బాలల సంరక్షణ గృహ నిర్వాహకులకు అప్పగించారు. రింతాడ ఉప సర్పంచి సోమేష్‌కుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మోహిని, ఎస్సై సురేష్, మహిళా పోలీసు శాంతి తదితరులు పాల్గొన్నారు.

తీములబందలో కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

మావోయిస్టు దళ సభ్యుడు లొంగుబాటు

పాడేరు, న్యూస్‌టుడే: మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోతే ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా గోగొండా మిస్సిపార గ్రామానికి చెందిన ముచ్చకి నందా మావోయిస్టు పార్టీని వీడి తుపాకీతో మంగళవారం పాడేరులో ఎస్పీ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మావోయిస్టు పార్టీకి చెందిన పోడియం భీమా, ఏరియా కమిటీ సభ్యుడు సాల్వం జోగి, మరో మావోయిస్టు దళ సభ్యుడి ప్రభావంతో 2003లో సీఎన్ఎం సభ్యుడిగా చేరాడు. 2024 నవంబరు వరకు కెర్లపాల్ ఏరియా కమిటీ సభ్యుడిగా పనిచేసిన నందా ప్రస్తుతం 26వ ప్లటూన్‌లో సభ్యుడిగా కొనసాగుతున్నాడని ఎస్పీ చెప్పారు. సానుభూతి కోసం మావోయిస్టు పార్టీ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టులు ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో షెల్టర్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ప్రజాప్రతినిధులు మారుమూల ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. చింతూరు సీఐ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్పీ అమిత్ బర్దార్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యుడు నందా

ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు?

మాజీ నక్సలైట్లు, సానుభూతిపరులపై ఆరా

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ నక్సలైట్లు, సానుభూతిపరులు ప్రస్తుతం ఎక్కడున్నారు... ఏం చేస్తున్నారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నాతవరం మండలంలో మాజీ మావోయిస్టు బత్తుల కృష్ణ, సానుభూతిపరుడిగా ముద్రపడిన షేక్ రజాక్ సహా 12 మందిని గుర్తించారు. వీరందరినీ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. సత్ప్రవర్తన కలిగి ఉంటామని వీరందరి నుంచి ఒకటి, రెండు రోజుల్లో పూచీ (బైండోవర్) తీసుకోనున్నారు. కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ పరిధిలోనూ ఇద్దరు మాజీలను అక్కడి పోలీసులు పిలిపించనున్నారు. మూడున్నర దశాబ్దాల కిందట నాతవరం, కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ల పరిధిలో తాండవ దళం, నాగులకొండ దళం సంచారం ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం మావోయిస్టులు ఈ ప్రాంతాలను షెల్టర్ జోన్‌గా చేసుకునే అవకాశం ఉందన్న అనుమానంతో పోలీసులు ఈ దిశగా చర్యలు చేపట్టారు.

(c) eenadu

జంక్షన్.. టెన్షన్..

ప్రాణాలు మింగేస్తున్న కూడళ్లు

మూడేళ్లలో 361 మంది మృత్యువాత

ఎలమంచిలి, నక్కపల్లి, న్యూస్‌టుడే

చంటిబిడ్డతో దీనంగా దిగువ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు **ఆవాల శివ.** ఉద్దండపురం గ్రామం. ఈమె భర్త దుర్గారావు ఏడాది క్రితం ఉద్దండపురం కూడలిలో కారు ఢీకొని మృత్యువాత పడ్డాడు. అప్పటికే వీరికి మూడేళ్ల కొడుకు ఉండగా, మరో బిడ్డ పుట్టి 14 రోజులైంది. భర్త తాపీపని చేస్తూ తెచ్చే సంపాదనతో కుటుంబం హాయిగా గడిచిపోయేది. ప్రస్తుతం పుట్టింటి వారు, అత్తింటివారే శివను చూస్తున్నారు. భర్తలేని తనకు భవిష్యత్తు కానరాక బిడ్డలతో కలిసి గుండెల నిండా బాధతో రోజులు వెళ్లదీస్తోంది.

జాతీయ రహదారిపై కూడళ్లలో జరిగిన ప్రమాదాలతో అనేకమంది జీవితాలు రోడ్డున పడ్డాయి. వాహనాల అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల అవగాహన రాహిత్యం, కూడళ్లలో లైటింగ్ లేకపోవడం, బ్లింకర్లు పెట్టకపోవడం తదితర రక్షణ చర్యలు కొరవడటం ఇలా అనేక లోపాలు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. అయినా ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రమే.

నర్సింగబిల్లి వద్ద ప్రమాదకరంగా కూడలి

జిల్లాలో నం. 16 జాతీయ రహదారి పొడవు 70 కిలోమీటర్లు
కూడళ్లు : 23
బ్లాక్‌స్పాట్లు : 37

➤ **23 కూడళ్లలో :** జాతీయ రహదారిపై అటు లంకెలపాలెం మొదలు... ఇటు పాయకరావుపేట వరకు 23 కూడళ్లలో తరచూ మృత్యుఘోష వినిపిస్తూనే ఉంది.

ప్రమాదాలు / మృతులు / గాయపడిన వారు:
- లంకెలపాలెం: 20 / 10 / 80
- అనకాపల్లి కాలేజీ జంక్షన్: 22 / 3 / 58
- కశింకోట: 36 / 2 / 76
- తాళ్లపాలెం: 27 / 2 / 43
- నర్సింగబిల్లి: 39 / 1 / 48
- పాయకరావుపేట: 19 / 1 / 29

★ భర్త ఫొటోతో ఉన్న ఈ మహిళ పేరు **పెంకె రాణి.** భర్త వీరన్న వ్యవసాయ కూలీ. అయిదేళ్ల క్రితం పనికి వెళ్తుండగా ఉద్దండపురం కూడలిలో రోడ్డు దాటుతూ.. కారు ఢీకొనడంతో గాయపడి మరణించాడు. రాణికి తొమ్మిదేళ్ల లోపున్న బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం పుట్టింటిలో ఉంటూ కూలికి వెళుతూ పిల్లలతో జీవనం సాగిస్తోంది. బీమా ద్వారా వచ్చిన సొమ్ములు వైద్యం చేయించిన అప్పులకు సరిపోయాయి.

గతంలోనే బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

★ గౌతమి శాలి అనకాపల్లి ఎస్పీగా ఉన్నప్పుడు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అక్కడే ఎందుకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నదీ రవాణా శాఖ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాంకేతిక లోపాలు గుర్తించి వీటిని సవరించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. కానీ ఒక్క సాంకేతిక లోపాన్నీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరిచేయలేదు.

గత మూడేళ్లలో అత్యధికంగా ప్రాణాలు కోల్పోయిందిక్కడే

కూడలి	మృతులు
లంకెలపాలెం	21
కె.ఎన్.ఆర్.పేట	23
తాళ్లపాలెం	30
బయ్యవరం	19
కొక్కిరాపల్లి	19
గోకులపాడు	18
నామవరం	18

భద్రతా చర్యలు చేపడతాం..

జిల్లాలో జాతీయ రహదారి చాలాచోట్ల గ్రామాల మధ్య నుంచి వెళ్లింది. ఇలాంటి చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జనాభా, వాహనాలు పెరుగుతున్న విషయాన్ని గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎస్పీ ఆదేశాలతో ఇలాంటి చోట్ల లైటింగ్, బ్లింకర్లు అవసరాన్ని గుర్తించి వీటిని ఏర్పాటు చేయడానికి నివేదిస్తున్నాం. దీంతో పాటు కూడళ్లలో జరిగిన ప్రమాదాలు, మృతుల వివరాలతో హెచ్చరిక బోర్డులు పెట్టిస్తాం. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెంచుతున్నాం. తద్వారా భద్రతా చర్యలు చేపడతాం.
– పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం



'రాతి'చరామి! యారాడ డాల్ఫిన్ హిల్స్‌పై లైట్ హౌస్ గేటు వద్దకు వెళితే... ఓ మర్రిచెట్టు పెరిగిన తీరు ఆకట్టుకుంటుంది. అక్కడున్న రాతి కట్టడంపై వేళ్లతో విస్తరించి పెరిగిపోయింది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు సేదతీరుతూ, రాతిపై పెరిగిన తీరును ఆశ్చర్యంగా చూస్తుంటారు. –ఈనాడు, విశాఖపట్నం

జిరాయితీ భూముల సమస్య పరిష్కారం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలం రాచపల్లి, రామన్నపాలేనికి చెందిన 246 మంది రైతులకు చెందిన 186.14 ఎకరాల జిరాయితీ భూముల సమస్య 13 ఏళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం చొరవతో పరిష్కారమైందని సభాపతి అయ్యన్నపాత్రుడు చెప్పారు. నర్సీపట్నంలో మంగళవారం మాట్లాడుతూ.. ఏపీఐఐసీ కోసం భూసేకరణ చేయనప్పటికీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఏపీఐఐసీ భూములుగా తప్పుగా నమోదయ్యాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు పొందడానికి, బ్యాంకు రుణాలు తీసుకోవడానికి, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందడానికి, కుటుంబ అవసరాలకు భూమి అమ్ముకోవడానికి రైతులకు వీల్లేకుండా పోయిందన్నారు. తప్పును సరిదిద్ది రైతుల పేరున భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని 2012 నుంచి వారంతా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులందరూ తన దృష్టికి సమస్యను తీసుకురావడంతో పరిష్కరించాలని ఆర్డీఓ రమణకు సూచించినట్లు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో రాచపల్లి వచ్చిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 20 రోజులపాటు ఆర్డీఓ సమక్షంలో అధికారులు, సిబ్బంది రికార్డులను పరిశీలించి నివేదిక పంపడంతో కలెక్టర్ గతనెల 26న ఈ భూములను ఆయా రైతుల పేరున జిరాయితీ భూములుగా వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు ఉత్తర్వులు ఇవ్వడంతోపాటు పాసు పుస్తకాల జారీకి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇన్నేళ్లుగా నష్టపోయిన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

ఆపదలో 'ఆరోగ్య ప్రదాయిని'..!

కేజీహెచ్ పిల్లల విభాగంలో మెరుగైన సేవలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో నవజాతి శిశువులతో పాటు సాధారణ పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మూడేళ్ల నుంచి నవజాతి శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్), శిశుమరణాల రేటు (ఎంఎంఆర్)ను 50 శాతం మేర తగ్గించడంతో రాష్ట్రస్థాయి అధికారుల ప్రశంసలు అందాయి.

వెంటిలేటర్లు, ఫొటోవార్మర్లు

ఇవీ వసతులు...!: ఈ విభాగంలో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ), స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), ఫొటోథెరపి యూనిట్ ఉన్నాయి.

★ వాటిల్లో ఆధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, హెచ్ఎఫ్ఎన్‌సీ, మల్టీపారా మోనిటర్లు, 2డీ ఏకో, పోర్టబుల్ అల్ట్రాసౌండ్ పరికరాలతో పాటు, ఏబీజీ, సీఆర్‌పీ యంత్రాలు ఉన్నాయి.

★ పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు ఎన్ఆర్‌సీ వార్డు, డీఈఐసీ వార్డుల్లో సేవలు అందిస్తూ, స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలు అమలు చేస్తూ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ★ రాణిచంద్రమదేవి, విక్టోరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందే చిన్నారులను అత్యవసర సమయంలో కేజీహెచ్‌లో చేర్పించి, వైద్యం చేస్తున్నామని విభాగాధిపతి **డాక్టర్ బి.శ్రీనివాస చక్రవర్తి,** సూపరింటెండెంట్ **వాణి** తెలిపారు.

సిబ్బంది సంఖ్య

విభాగాధిపతి	1
ప్రొఫెసర్లు	2
సహ ప్రొఫెసర్లు	3
నియోనెటాలజిస్టు	1
పీజీలు	36
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	8

★ హిమోఫిలియా, సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా బాధితులకు ఖరీదైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

సేవలు ఇలా..
★ సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ.
★ ఎన్ఐసీయూ, పీఐసీయూ వార్డుల్లో 24 గంటలు సేవలు.
★ ఆయా వార్డుల్లో మొత్తం పడకలు: 250

తగ్గితే తప్పేం కాదు

ఫలితాలిస్తున్న లోక్ అదాలత్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుంటూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ చాలామంది తిరుగుతున్నారు. కాలాన్ని.. డబ్బుని వృథా చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి లోక్ అదాలత్ రాజీ మార్గం ఊరట కలిగిస్తోంది. పరస్పర అంగీకారంతో చాలావరకు కేసులు పరిష్కరించుకుంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న లోక్‌అదాలత్ ఇందుకు ఎంతో ఉపయోగపడుతోంది.

జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులతో లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవడానికి వీలున్నవాటిపై ఇరుపార్టీలకు ముందే అవగాహన కల్పిస్తున్నారు. వాయిదాలకు తిరగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తున్నారు. దానికి బదులు రాజీపడేందుకు ఇరుపార్టీల సమ్మతి తెలియజేయడంతో పలు కేసులు కొలిక్కి వస్తున్నాయి. మండల న్యాయసేవాధికార సంస్థల ద్వారా లోక్‌అదాలత్ ప్రయోజనాలను న్యాయమూర్తులు వివరిస్తున్నారు.

రాజీ కేసులు ఇలా..: ★ కుటుంబ తగాదాలు, కార్మికుల్లో గొడవలు, ఆస్తివివాదాలు, భూతగాదాలు, ఆర్థిక కేసులు, చెక్కుల చెల్లింపులు, మోటారు వాహన ప్రమాద బీమా, విద్యుత్ చౌర్యం, ట్రాఫిక్ ఉల్లంఘనలు, బ్యాంకు రుణాలు, పెట్టీ కేసులు, పరిశ్రమల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చు.

ఈ ఏడాదిలో కేసుల పరిష్కారం

తేదీ	పరిష్కారం
మార్చి 8	1101
జులై 5	1450
సెప్టెంబరు 13	1524

విస్తృత ప్రచారం: లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమంలో స్టేషన్ల వారీగా రాజీకి అవకాశం ఉన్న కేసులపై ఇరుపార్టీలకు వివరిస్తున్నాం. చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఈనెల 13న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుంది. కక్షిదారులు దీన్ని వినియోగించుకోవాలి. – **తుహిన్‌సిన్హా, ఎస్పీ**

అంతా మా ఇష్టం

గణపర్తిలో వైకాపా నాయకుల ఆధీనంలో ప్రభుత్వ భూమి

మునగపాక, న్యూస్‌టుడే

మునగపాక మండలం గణపర్తిలో సర్కారు స్థలాన్ని వైకాపా నాయకులు దర్జాగా ఆక్రమించేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఆడింది ఆటగా.. పాడింది పాటగా సాగడంతో రూ. 2 కోట్ల విలువైన భూమిని తమ సొంతం చేసుకున్నారు. ఎట్టకేలకు అధికారులు దీనిపై స్పందించి హద్దులు గుర్తించారు. మునగపాక మండలం గణపర్తి-కొంకిలిల మండలం సోమవరం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన సర్వే నం. 33లో 1.92 ఎకరాలు, సర్వే నం. 35లో 40 సెంట్ల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఎక్కువ విస్తీర్ణం వైకాపా నాయకుల స్వాధీనంలోనే ఉంది. వారే దీనిని సాగు చేసుకుంటూ ఫలసాయం పొందుతున్నారు. మరికొంత భూమి పేదరైతుల ఆధీనంలో ఉంది. గణపర్తి గ్రామానికి కైలాసభూమి లేదు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కొంత కైలాసభూమికి కేటాయించాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గం గతంలోనే తీర్మానం చేసి కలెక్టరుకు విన్నవించింది. అధికారులు వచ్చి, స్థలాన్ని పరిశీలించి అప్పట్లో పాలకుల అండదండలు ఉండటంతో స్వాధీనం చేసుకోలేకపోయారు. జీవాల కొండిని ఆ స్థలంలో పక్కాకట్టడాల నిర్మాణం చేపట్టారు. ఎట్టకేలకు తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది మంగళవారం గణపర్తి చేరుకుని రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి హద్దులు గుర్తించి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

గణపర్తిలో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతయే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు అన్నారు. డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ పాఠశాల సమావేశ మందిరంలో ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. చిన్నారుల విద్యా ప్రగతితోపాటు, వారి మానసిక అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు సుందర్‌రావు, గెన్ను, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు

4న మార్గశిర పౌర్ణమి పూజలు

విశాఖపట్నం న్యూస్‌టుడే : ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామి ఆరాధన, 4 గంటలకు ధ్వజస్తంభం పూజలు నిర్వహిస్తామన్నారు. 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు.

'స్క్రబ్ టైఫస్' ప్రాణాంతకం కాదు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: 'స్క్రబ్ టైఫస్' వ్యాధి ప్రాణాంతకం కాదని, ప్రజలు భయాందోళన చెందొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీవి కుట్టినపుడు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, ఆకలి లేకపోవడం, వికారం తగ్గడం, దగ్గు, శ్వాస ఆడకపోవడం మొదలగు లక్షణాలు కనబడతాయన్నారు. డాక్సిసైక్లిన్, ఎజిత్రోమైసిన్ వంటి మందులు వాడటం ద్వారా నివారించవచ్చన్నారు. ఇళ్లలో ఎలుకలు లేకుండా చూసుకోవాలని, యాంటి ఇన్సెక్టిసైడ్స్ స్ప్రేలు వాడటం ద్వారా ఎలుకలు రాకుండా చూసుకోవచ్చున్నారు. ఈ ఏడాది జిల్లాలో 11 మంది ఈ వ్యాధి బారిన పడ్డారని, ఇప్పటివరకు ఒక్క మరణం కూడా సంభవించలేదని వెల్లడించారు. నల్లటి కురుపులు, శోషరస కణుపులు వాయడం, జ్వరం వస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుడిని సంప్రదించి తగు చికిత్స పొందాలని ప్రకటనలో పేర్కొన్నారు.

వృత్తి నైపుణ్యాల పెంపుతో ఉపాధి అవకాశాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన యువత వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ సహాయ కమాండెంట్ బి.శ్రీనివాసన్ సూచించారు. విశాఖ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రానికి సీఆర్‌పీఎఫ్ అధికారులు గిరిజన యువతీ యువకులను ఎంపిక చేసి మంగళవారం పంపారు. పదో తరగతి అర్హతతో బాలికలను, ఇంటర్, డిప్లమా అర్హతతో యువకులను ఈ శిక్షణకు ఎంపిక చేశారు. 45 రోజులపాటు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీఐ వినోద్‌బాబు సూచించారు. ఎస్సై వెంకటేశ్వరరావు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్పన్, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు వెళ్తున్న యువతతో సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ శ్రీనివాసన్, సీఐ వినోద్‌బాబు

సెయిల్ విశ్రాంత అధికారికి జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న నేరం రుజువు కావడంతో సెయిల్ విశ్రాంత అధికారికి మూడేళ్ల సాధారణ జైలు, రూ. లక్ష జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల ప్రధాన ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సీఎన్.మూర్తి తీర్పు ఇచ్చారు. మంగళవారం సీబీఐ అధికారులు అందించిన కేసు వివరాలివి. నగరానికి చెందిన ఆర్.కిషోర్ 1988-2000 కాలంలో విశాఖపట్నం సెయిల్‌లో రీజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి, కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

వేతనాలందక హమాలీల వెతలు

అనంతగిరి, న్యూస్‌టుడే: గిరిజన సహకార సంస్థలో (జీసీసీ) పనిచేస్తున్న హమాలీలకు రెండు నెలలుగా వేతనాలు జమ చేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని సంఘం నాయకులు వెంకటేష్, చందరరావు అన్నారు. హమాలీలందరూ జీసీసీ గోదాం ఎదురుగా మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అక్టోబరు, నవంబరు నెలల వేతనాలు ఇంకా చెల్లించలేదని.. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కుటుంబాలు అర్ధాకలితో గడపాల్సిన పరిస్థితి ఉండగా ఈ తరుణంలో కనీసం ఇప్పటికైనా వేతన బకాయిలు చెల్లించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ప్రస్తుతం అన్ని మండలాల్లో ఉన్న గోదాముల వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు.

ఆందోళన చేస్తున్న హమాలీలు

అదనపు వసూళ్లకు అడ్డుకట్ట ఇలా!

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఆధార్ అత్యంత కీలకం. ఇందులో ఏ చిన్న తప్పు దొర్లినా ముందు ముందు ఇబ్బందులు తప్పవు. ఆధార్‌లో మార్పుచేర్పుల కోసం పలువురు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజల అవసరాన్ని అవకాశంగా చూసుకుని కొందరు కేంద్రాల నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిర్దేశిత రుసుం కన్నా అదనంగా వసూళ్లకు నిర్వాహకులు పాల్పడితే 1947 నంబరుకు ఫిర్యాదు చేయాలి. uidai.gov.in సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. నిర్వాహకులు తప్పుడు ధ్రువపత్రాలతో ఆధార్‌కార్డు నమోదు చేస్తే గతంలో రూ. 10 వేలు జరిమానా విధించేవారు. దీన్ని తాజాగా రూ.లక్షకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 976 ఆధార్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులు నిర్వహించేవారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులతో కేవలం 224 మాత్రమే మిగిలాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 170 కేంద్రాలుండేవి. వీటిలో ప్రస్తుతం పాయకరావుపేట, ఎస్.రాయవరం, చోడవరం, కంచరపాలెంలో మాత్రమే కేంద్రాలు పని చేస్తున్నాయి. మిగతా వాటిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మూసివేయించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: పాడేరు నుంచి జి.మాడుగుల, గెమ్మెలి వస్తున్న ఆర్టీసీ బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ మార్గంలో జాతీయ రహదారి పనులు కొనసాగుతుండగా, వర్షం కారణంగా రోడ్డంతా బురదమయంగా మారింది. కులుపాడు దాటిన తర్వాత ఘాట్ రోడ్డు మలుపు వద్ద బస్సు అదుపుతప్పి ఓ వైపు ఒరిగింది. అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే కిందకు దిగిపోయారు. బస్సు ఇంకొంచెం ముందుకు వెళ్లుంటే లోయలో పడేదని ప్రయాణికులు పేర్కొన్నారు. డ్రైవరు బస్సును వేగంగా నడపడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. అనంతరం వారంతా ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు.

ఏయూ స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు నోటిఫికేషన్

ఏయూ ప్రాంగణం: స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చిట్టిబాబు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2010-11 నుంచి 2025 వరకు వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు అర్హులన్నారు. ఈనెల 4 నుంచి ఏయూ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 20న పరీక్షలు జరుగుతాయన్నారు. థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.1500, ప్రాక్టికల్స్, వైవా ప్రాజెక్టు ఒక్కో సబ్జెక్టుకు రూ.3వేల చొప్పున ఫీజుగా చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ ప్రొఫెషనల్ కోర్సులలో బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు www.exams.andhrauniversity.edu.in వెబ్‌సైట్ చూడవచ్చన్నారు.

అరకు ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి చర్యలు

అరకులోయ: పర్యాటకపరంగా విశేష ప్రాధాన్యం ఉన్న అరకు ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ ఈడీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్‌ని జోన్ ఛైర్మన్ దొన్నుదొరతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు బస్టేషన్ ప్రాంగణాన్ని ఆదర్శంగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పరిసరాల్లో ఖాళీ స్థలాల్లో యువత స్వయం ఉపాధికి వీలుగా దుకాణ సముదాయాలను ఏర్పాటు చేయాలని జోన్ ఛైర్మన్ దొన్నుదొర ఈడీని కోరారు. బయో టాయ్‌లెట్లు, ప్రయాణికులకు విస్తృతమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలను పరిశీలిస్తున్న బ్రహ్మానందరెడ్డి, దొన్నుదొర

సైబర్ నేరాలపై అప్రమత్తం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పాపినాయుడు అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. బాలికల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక అధికారి భవాని, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో మాట్లాడుతున్న ఎస్సై పాపినాయుడు

NAME CHANGE
I, **SAMEERA BANU** (New Name), W/o. MOHAMMAD RIYAZ, previously called as SAMEERA BANU D/o. SYED AHAMED (Old Name) Resident of # 5-60, Main Road, Vattigadda Village, Rajavommangi Mandal, Alluri Sitharama Raju District - 533 436, Andhra Pradesh. Now changed my name from SAMEERA BANU D/o. SYED AHAMED (Old Name) to SAMEERA BANU, W/o. MOHAMMAD RIYAZ (New Name). Henceforth I will be called as **SAMEERA BANU**, W/o. MOHAMMAD RIYAZ for all purposes.

4 నుంచి 7 వరకు ఆర్గానిక్ మేళా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రకృతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులతో ఈ నెల 4 నుంచి 7 వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మేళా నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి కుమారస్వామి మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మేళాను ప్రారంభిస్తారన్నారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 6న మేళాను సందర్శిస్తారన్నారు. వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహీ ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ బృందాలు, గ్రీన్ క్లైమేట్ సంస్థ, అగ్రి డీఎన్ఏ వెంటర్స్ సంస్థల నేతృత్వంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం మేళా కరపత్రం విడుదల చేశారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యంవర్మ, కార్యదర్శి 'పాలెం నేచురల్స్' అశోక్, ప్రకృతి రైతులు రిషి, ఎన్.నరేంద్ర, గ్రీన్ క్లైమేట్ టీం అధ్యక్షుడు జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రహదారా.. రాళ్ల దారా!

గిరిజన గ్రామాలకు అవసరమైన రహదారులు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నా, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో అనుకున్న ప్రయోజనాలు చేకూరడం లేదు. ఫలితంగా ఇప్పటికి అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన పరిస్థితుల్లోనే కొట్టుమిట్టాడుతున్నాయి. మారేడుమిల్లి మండలం సున్నంపాడు నుంచి రామన్నవలస, తుర్రూరు వెళ్లే రహదారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో దీనికి మెటల్ రహదారి నిర్మించారు. ఇది జరిగి దశాబ్దాలు గడిచిపోవడంతో పూర్తిగా శిథిలస్థితికి చేరి, కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా ప్రమాదకరంగా మారింది. అయితే ఇటీవల ప్రభుత్వం ఈ రహదారి నిర్మించడానికి నిధులను మంజూరు చేసింది. ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనిపై రామన్నవలస, తుర్రూరు గ్రామాలకు చెందిన గిరిజనులు అనేకసార్లు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు స్పందించాలని గిరిజనులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

అధ్వానంగా రామన్నవలస రహదారి

7న నవోదయ నమూనా పరీక్ష

చింతపల్లి గ్రామీణం: చింతపల్లిలో ఈ నెల 7న నవోదయ నమూనా పరీక్ష జరగనుంది. ఈ మేరకు ఎన్ఆర్ టెక్ హబ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	117	115
లైవ్	144	135
డ్రెస్డ్	209	240
స్కిన్‌లెస్	238	250

(c) eenadu

జీడి రైతుల ఆర్థికాభివృద్ధికి అడుగులు

రంపచోడవరం, న్యూస్‌టుడే

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు అధికంగా జీడిమామిడి తోటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను పాటించడంపై పెద్దగా అవగాహన లేకపోవడంతో అధిక దిగుబడులు సాధించలేకపోతున్నారు. క్షేత్రస్థాయిలో పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్‌ పుష్పావతి రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

★ జీడిమామిడి తోటలను అధికంగా టీ దోమ, తేయాకు దోమ ఆశిస్తోంది. కోస్తా జిల్లాల్లో తోటలను అధిక నష్టం వాటిల్లుతోంది. టీ దోమ పిల్ల పురుగులు, తల్లి పురుగులు లేత కొమ్మలను, పూత రెమ్మలపై రసాన్ని పీల్చడంతో ఎర్రని జిగురు బిందువులు, పూత రెమ్మలపై నల్లని కండె ఆకారపు మచ్చలు ఏర్పడుతున్నాయి. పూత, పిందెలు మాడిపోయి రాలిపోతుండటంతో దిగుబడులు తగ్గుతున్నాయి.

జీడి చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త పుష్పావతి

★ కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రొటోఫాస్‌ 1.6 మి.లీ., వేప నూనె 5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత వచ్చాక లామ్డాసైహలోత్రిన్‌ 0.6 మి.లీ. / క్లోరిపైరిఫాస్‌ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గింజ బఠానీ సైజులో ఉన్నప్పుడు ప్రోఫెనోఫాస్‌ 1 మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి 10 నుంచి 25 రోజుల వ్యవధిలో పురుగు ఉద్ధృతిని చూసి పిచికారీ చేయాలి. డిసెంబరు నుంచి మార్చి వరకు రెండు, మూడుసార్లు పిచికారీ చేస్తే జీడిమామిడిని ఆశించే పురుగులను నివారించవచ్చని శాస్త్రవేత్త డాక్టర్‌ పుష్పావతి రైతులకు సూచిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రంపచోడవరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. రాజవొమ్మంగి మండలం చెరువుకొమ్ముపాలెంలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. చెరువుకొమ్ముపాలెం పంచాయతీకి చెందిన పలువురు వైకాపాను వీడి తెదేపాలో చేరగా వారికి పార్టీ కండువాలు వేశారు. అనంతరం సమస్యలపై స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ తెదేపా పరిశీలకులు శ్రీనివాసయాదవ్‌, ఏపీఐఐసీ డైరెక్టర్‌, పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్‌ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు, నాయకులు సావిత్రి, గంగాధర్‌, తాతారావు, మధు, సురేష్‌, అనుదీప్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌తో భేటీ

ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పనులపై రంపచోడవరంలోని పీఎంఆర్‌సీలో కలెక్టర్‌ దినేష్‌కుమార్‌తో ఎమ్మెల్యే శిరీషాదేవి జిల్లా భేటీ అయ్యారు. పందిరిమామిడి నుంచి వై.రామవరం మండలం చవిటిదిబ్బలు, పందిరిమామిడికోట, ఆకుమామిడికోట రహదారులను పూర్తి చేయాలని కోరారు. మరమ్మతుకు గురైన ఎత్తిపోతల పథకాలను బాగుచేసి సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. రంపచోడవరం ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని విన్నవించారు. పీఎంఆర్‌సీ భవన మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌, ఈఈ శ్రీనివాసరావు, వెలుగు ఏపీడీ డేగలయ్య, డీఈలు గౌతమి, నాగరాజు, డీటీ జిలాని, ఆర్‌ఐ నిర్మల, వీఆర్వోలు రాజు, శివకుమార్‌, వైటీసీ మేనేజర్‌ సుధీష్‌, తదితరులు పాల్గొన్నారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

అ వీ ఇ వీ

డిప్యూటీ ఎంపీడీవోగా సన్యాసిరావు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల డిప్యూటీ ఎంపీడీవోగా సన్యాసిరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేస్తానన్నారు. ఎంపీపీ అప్పలరాజు, ఎంపీడీవో డేవిడ్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

గిరిజనేతరుల భూములు కొనొద్దు

అడ్డతీగల, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల కోసం చేపట్టిన భూసేకరణలో గిరిజనేతరుల భూములను కొనుగోలు చేయవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్‌ ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అధికారులను కోరారు. తిమ్మాపురంలో మంగళవారం స్థానిక గిరిజనులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ప్రసాద్‌, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: దామనపల్లి పంచాయతీ జోడుమామిడి గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ గ్రామానికి రక్షిత పథకం ఉన్నా మరమ్మతుకు గురవ్వడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సర్పంచి రామకృష్ణ స్పందించి మోటారుకు మరమ్మతు చేయించి మంగళవారం నీటి సరఫరాను ప్రారంభించారు.

అభ్యసన సామగ్రి పంపిణీ

కూనవరం, న్యూస్‌టుడే: మర్రిగూడెం హైస్కూల్‌లో యూటీఎఫ్‌, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా విద్యార్థులకు మంగళవారం అభ్యసన సామగ్రి అందజేశాయి. ఈ నెల 7న జరగనున్న జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ ఉపయోగపడుతుందన్నారు. రాంబాబు, సుబ్బారావు, అప్పారావు, శేఖర్‌, కామేశ్‌, శాంతి, రాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల వితరణ

సీలేరు, న్యూస్‌టుడే: గుమ్మిరేవుల పంచాయతీ పరమసింగవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం దుస్తుల పంపిణీ జరిగింది. అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన ప్రశాంతి వీటిని వితరణగా అందజేశారు. గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ప్రశాంత్‌ అభ్యర్థన మేరకు 50 మంది విద్యార్థులకు వంద జతల దుస్తులు సమకూర్చారు.

ప్రజల్లో చైతన్యం పెంపునకు కృషి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పల్లె ప్రజల్లో చైతన్యం పెంచే కార్యక్రమాలు చేపట్టాలని షేరిన్‌ అల్లూరి ట్రైబల్‌ హెల్త్‌ కౌన్సిల్‌ సొసైటీ సభ్యులకు ఎంపీడీవో ఇమ్మానుయేల్‌ సూచించారు. రేఖపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోను కలిసేందుకు వచ్చిన సంఘం సభ్యులకు పలు సూచనలు చేశారు. నాలుగు మండలాల పర్యవేక్షకులు రమేశ్‌బాబు, మండల సమన్వయకర్త రామారావు, దుర్గాప్రసాద్‌, భూమిక, సుమన్‌ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి మేజర్‌ పంచాయతీ చింతపల్లి అభివృద్ధికి సహకరించాలని కార్యదర్శి వెంకటరమణ కోరారు. పంచాయతీ కార్యాలయం వద్ద సిబ్బంది పన్ను వసూళ్లు ప్రారంభించారు. పంచాయతీ పరిధిలో 3,600 గృహాలు ఉన్నాయని చెప్పారు. జూనియర్‌ అసిస్టెంట్‌ అంబేడ్కర్‌, కంప్యూటర్‌ ఆపరేటర్‌ శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని, భవిష్యత్తు అంతా కంప్యూటర్‌, ఏఐతోనే ముడిపడి ఉంటుందని ఎన్‌ఆర్‌ టెక్‌ హబ్‌, కంప్యూటర్‌ శిక్షణ నిర్వాహకుడు రమేష్‌ పేర్కొన్నారు. స్థానిక ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు మంగళవారం కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. బేసిక్‌ తరగతులు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజు పాల్గొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఎన్నిక

వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు | ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి | ఎలీషాబాబు, కన్వీనర్‌

రంపచోడవరం, న్యూస్‌టుడే: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్‌) అల్లూరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక మంగళవారం రంపచోడవరంలో జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మన్యం శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి రామశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా లండా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కత్తుల ఆదిరెడ్డి, గిరిజన సంక్షేమ విభాగం కన్వీనర్‌గా కోలాటి ఎలీషాబాబు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా సవలం కృష్ణకుమారి, పల్లాల శశికాంత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా పాలగడ్డ కృపారత్నం, కోశాధికారిగా సత్తు కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. ప్రచార కార్యదర్శిగా చోడి ప్రవీణ్‌కుమార్‌దొర, అసోసియేట్‌ అధ్యక్షుడిగా వంతు సన్యాసిదొర, అసోసియేట్‌ కార్యదర్శిగా బి.సుదర్శనరావు వ్యవహరించనున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఆరగాటి భూపతిరెడ్డి అండర్‌-14 విభాగంలో జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. స్థానిక గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించిన కలెక్టర్‌ దినేష్‌కుమార్‌, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌, సబ్‌ కలెక్టర్‌ శుభం నొఖ్వాల్‌, డీడీ రుక్మాంగదయ్య విద్యార్థితోపాటు ప్రిన్సిపల్‌ అహమ్మద్‌ ఆలీషా, వైస్‌ ప్రిన్సిపల్‌ ప్రసాద్‌, వ్యాయామ అధ్యాపకులు ప్రసాదరాజు, శ్రీనివాస్‌, చిన్నయ్యను అభినందించారు.

భూపతిరెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌

నీటి విడుదల నిలిపివేత

మోతుగూడెం, న్యూస్‌టుడే: పొల్లూరు జలవిద్యుత్కేంద్రానికి నీరందించే డొంకరాయి పవర్‌ కెనాల్‌కు నీటి విడుదలను మంగళవారం నిలిపివేశారు. రెండు నెలలపాటు నిలిపివేత కొనసాగుతుందని సీలేరు కాంప్లెక్స్‌ ముఖ్య ఇంజినీర్‌ రాజారావు తెలిపారు. అప్పటివరకు పొల్లూరు జలవిద్యుత్కేంద్రంలో 460 మెగావాట్లు, డొంకరాయి మినీ జలవిద్యుత్కేంద్రంలో 25 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోనుందన్నారు. షట్‌డౌన్‌ సమయంలో పొల్లూరు జలవిద్యుత్కేంద్రంలోని నాలుగు యూనిట్లకు అవసరమైన పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. డొంకరాయి మినీ జలవిద్యుత్కేంద్రానికి క్యాపిటల్‌ ఓవర్‌ హాలింగ్‌ పనులు చేపడతామన్నారు.

డొంకరాయి పవర్‌ కెనాల్‌

బాలికా విద్యను ప్రోత్సహిద్దాం

చింతపల్లి/గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికా విద్యను మరింత ప్రోత్సహించాలని, డ్రాపౌట్స్‌ లేకుండా చూడాలని ఎంఈవో ప్రసాద్‌ సూచించారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో మంగళవారం వర్క్‌షాప్‌ నిర్వహించారు. బాల్య వివాహాల నివారణకు పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత చదువుల విషయంలో బాలికలను ప్రోత్సహించడంతోపాటు వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈఓ-2 బోడంనాయుడు, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్‌ సునీత, ప్రధానోపాధ్యాయులు రాజు, లక్ష్మణ్‌కుమార్‌, సమన్వయకర్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణలో ఎంఈవోలు ప్రసాద్‌, బోడంనాయుడు

నిర్మించారు.. విస్మరించారు

గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించాలనే లక్ష్యంతో నిర్మించిన ఆయుష్మాన్‌ భారత్‌ ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు దూరమయ్యాయి. రూ.లక్షల ఖర్చుతో నిర్మించిన భవనాలు ప్రారంభించక పోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టు మండలంలో కుమడ, ఏనుగురాయి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి చేశారు. కుమడ గ్రామంలో భవనం నిర్మించి మూడేళ్లుగా వినియోగంలోనికి రాలేదు. దీంతో కుమడ, బూసిపుట్టు, కొరవంగి తదితర పంచాయతీలకు చెందిన 48 గ్రామాల ప్రజలు వైద్యం కోసం రూడకోటలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పది నుంచి 20 కి.మీ. దూరం వెళ్లి వైద్యం పొందాల్సి వస్తోందని, విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లను వినియోగంలోనికి తేవాలని గిరిజనులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు

కుమడలో ప్రారంభానికి నోచని భవనం

బాధ్యతగా స్వచ్ఛతే సేవ

వై.రామవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతే సేవను బాధ్యతగా చేపట్టాలని జి/42 బెటాలియన్‌ సీఆర్‌పీఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండర్‌ రాధ సూచించారు. సీఆర్‌పీఎఫ్‌ క్యాంపు వద్ద మంగళవారం జవాన్లతో సమావేశమయ్యారు. ప్లాస్టిక్‌ నిషేధాన్ని దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్‌ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం వై.రామవరంలో ర్యాలీ చేశారు. ఎస్సై రామకృష్ణ, జవాన్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో కమాండెంట్‌ రాధ, జవాన్లు

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో అయ్యప్ప ఆలయ 33వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు కొనసాగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు అయ్యప్ప దీక్షాస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ, అన్న సమారాధన నిర్వహించారు. సర్పంచి ఉషారాణి అన్నదానాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచి రామునాయుడు, పిన్నయ్యదొర, అనిల్‌, ఆదిత్య, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వడ్డన చేస్తున్న సర్పంచి ఉషారాణి, ఆలయ కమిటీ సభ్యులు

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ‘మావోయిస్టులు వద్దు.. అభివృద్ధే ముద్దు..’ అంటూ గిరిజనులు నినదించారు. మారేడుమిల్లిలో మంగళవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా వారంతా ర్యాలీ చేశారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులు వద్దంటూ నినాదాలు చేశారు. మావోయిస్టులు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి కుంటుపడుతోందని, శాంతియుత వాతావరణం చెదిరిపోతోందన్నారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో గిరిజనులను హతమార్చడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. బస్సులను దహనం చేస్తుండటంతో లోతట్టు ప్రాంతాలకు రవాణా సదుపాయాలు నిలిచిపోతున్నాయని, రహదారుల నిర్మాణాలను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

మారేడుమిల్లిలో గిరిజనుల ర్యాలీ

సమాజ సేవలో భాగం కావాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: సమాజ సేవలో విద్యార్థులు భాగం కావాలని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ దశరథ్‌ నాయక్‌ అన్నారు. కళాశాల జాతీయ సేవాపథకం యూనిట్లు 1, 2 వాలంటీర్లు లిట్టిగుడ, రవ్వలగుడ గ్రామాల్లో మంగళవారం నుంచి సేవాకార్యక్రమాలను ప్రారంభించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌, మాజీ ఉపసర్పంచి సత్యానందం, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ చలపతిరావు, ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్ల ప్రోగ్రాం అధికారులు గ్రామంలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌ చలపతిరావు అన్నారు. కళాశాలలో జాతీయ కాలుష్యనియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ప్రపంచీకరణ ఆవశ్యకత, కాలుష్య కారకాలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రపంచ కంప్యూటర్‌ లిటరసీ డే సందర్భంగా కంప్యూటర్‌ విద్యపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లిట్టిగుడలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపు

చింతూరు, న్యూస్‌టుడే: పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో రాత్రి సమయాల్లో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. చట్టి నుంచి భద్రాచలం వైపు, నెల్లిపాక నుంచి చింతూరు వైపు వచ్చే వాహనాలను కూనవరం మీదుగా మళ్లించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ నుంచి మన్యానికి వచ్చే రాత్రి బస్సు సర్వీసులను రద్దు చేశారు.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో ఎస్సై యాసిన్‌ సీఆర్‌పీఎఫ్‌ బలగాలతో సరిహద్దు కూడలిలో ఉదయం, ఐటీఐ కూడలిలో సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించారు. వాహన రికార్డులను పరిశీలించారు. విశాఖ డిపో నుంచి రాత్రి బస్సుల సర్వీసులను ఇప్పటికే రద్దు చేశారు. రాజమహేంద్రవరం నుంచి సీలేరు వచ్చే బస్సు సర్వీసును రద్దు చేసినట్లు గోకవరం డిపో అధికారులు చెప్పారు.

వాహనాలను మళ్లిస్తున్న పోలీసులు

పెంచలయ్యకు సంఘీభావ ర్యాలీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: నెల్లూరులో గంజాయి మాఫియా చేతుల్లో హత్యకు గురైన కె.పెంచలయ్యకు శ్రద్ధాంజలి ఘటిస్తూ అరకులోయ సీపీఎం నాయకులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో డ్రగ్స్‌, గంజాయికి వ్యతిరేకంగా యువతను సన్మార్గంలో నడిపించేందుకు పాటలు, సమావేశాలతో గంజాయి మాఫియాపై పోరాడుతున్న పెంచలయ్య హత్యకు గురికావడాన్ని నిరసించారు. గంజాయి మాఫియాను అరెస్టు చేయాలని డిమాండ్‌ చేశారు. పెంచలయ్య కుటుంబానికి మద్దతు తెలిపారు. సీపీఎం నాయకులు రామారావు, బాలదేవ్‌, హరి, బాబూరావు, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో సీపీఎం నాయకుల ర్యాలీ

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వాహన చోదకులు విధిగా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని ఎస్సై సంతోశ్‌కుమార్‌ సూచించారు. రేఖపల్లిలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించారు. పరిమితి మించి ఆటోలు, జీపుల్లో ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

రేఖపల్లిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఘనంగా ఐక్య క్రిస్మస్‌ వేడుకలు

అనంతగిరి, న్యూస్‌టుడే: భీంపోలు పంచాయతీలో సర్పంచి బీమలమ్మ అధ్యక్షతన ఐక్య క్రిస్మస్‌ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ రీజియన్‌ ఛైర్మన్‌ దొన్నుదొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని చెప్పారు. క్రీస్తు చూపిన బాటలో నడవాలని సూచించారు. అందరి సమక్షంలో ఆయన క్రిస్మస్‌ కేకు కట్‌ చేశారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుబ్బారావు, భీమరాజు, ఈశ్వరావు, బాబురావు పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అరకులోయ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సియ్యారి దొన్నుదొర, నియోజకవర్గ పరిశీలకులు రామకృష్ణ తెలిపారు. తెదేపా ఆధ్వర్యంలో శుక్రవారం అనంతగిరిలో గ్రీవెన్స్‌ నిర్వహించారు. భీంపోలు గ్రామంలో ఐక్య క్రిస్మస్‌ వేడుకలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో గ్రీవెన్స్‌ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. భీంపోలు సర్పంచ్‌ బిమలమ్మ, ఈశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు సివేరి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

వేడుకల్లో దొన్నుదొర తదితరులు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం

వై.రామవరం, న్యూస్‌టుడే: వై.రామవరంలో భవానీ దీక్షలు చేపట్టిన సుమారు 300 మంది భక్తులు మంగళవారం అగ్నిగుండ ప్రవేశం చేశారు. దుర్గమ్మ తల్లి శరణుఘోష చెబుతూ నిప్పులపై నడిచారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నిప్పులపై నడుస్తున్న భవాని దీక్షాస్వాములు

కలవరపెడుతున్న తుపాను

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: తుపానుతో మన్యం రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి జల్లులు పడుతున్నాయి. వరి, సామ, రాగి పంటలు చేతికందుతున్న సమయంలో వర్షాలు కలవరపెడుతున్నాయి. పొలాల్లో కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం కట్టలను కల్లాల్లోకి చేర్చారు. కిలగాడ, దారెల, పెదగుడ, ఏనుగురాయి, బంగారుమెట్ట, మాకవరం, సుజనకోట, లక్ష్మీపురం, జర్జుల ప్రాంతాల్లో రైతులు మంగళవారం వర్షాల నుంచి పంటల ఉత్పత్తులను కాపాడుకునేందుకు కుప్పలపై కవర్లు కప్పారు.

కొండపడలో వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి - రంపచోడవరం రహదారిలో గాలిగోపురం వద్ద రహదారి కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. – క్రాంతి, మారేడుమిల్లి

✓: కోతకు గురైన రహదారిని పరిశీలించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడతాం. – ప్రదీప్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: కిలగాడ కూడలి నుంచి పెదపేట, పేటమాలిపుట్టు గ్రామాలకు వెళ్లే రహదారి ఛిద్రమైంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – బి.శ్రీను

✓: రహదారి మరమ్మతులకు ప్రతిపాదించాం. నిధులు విడుదలైతే పనులు చేస్తాం. – రాముడు, ఏఈ

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలు మండలం జామిగుడ పంచాయతీ కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం అసంపూర్తిగా మిగిలింది. ఈ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి. – రామకృష్ణ, జామిగుడ

✓: ఇటువంటి భవనాల పూర్తి చేయడానికి ఇప్పటికే ప్రాజెక్టు డైరెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. – స్రవంతి, ఐసీడీఎస్‌ పీవో

కలెక్టర్‌ దృష్టికి రహదారి సమస్య

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రంపచోడవరం డివిజన్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని పాడేరు వెళ్తూ కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ మంగళవారం సాయంత్రం రాజవొమ్మంగిలో ఆగారు. అనంతగిరి, లబ్బర్తి గ్రామాల మీదుగా వెళ్తూ స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రాజవొమ్మంగి నుంచి మొల్లుమెట్ట, లబ్బర్తి మీదుగా అడ్డతీగల వెళ్లే రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతగిరిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

ఆందోళన కొనసాగిస్తాం

గూడెంకొత్తవీధి, చింతూరు, న్యూస్‌టుడే: వేతన బకాయిలు చెల్లించాలన్న డిమాండుతో హమాలీలు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. వారంతా మంగళవారం విధులకు హాజరుకాకుండా జీసీసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చింతూరు జీసీసీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్‌, సురేశ్‌, రాజయ్య, మంగరాజు, చంద్రయ్య, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో హమాలీల ధర్నా

రైతులకు తక్కువ ధరకే ఎరువులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు తక్కువ ధరలకే తయారు చేసిన ఎరువులను అందించవచ్చని ఎంపీడీవో ప్రభాకరరావు అన్నారు. మంగళవారం చిలకలగెడ్డలో సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వానపాములను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెత్తను తడి, పొడిగా వేరు వేయాలని అందులో వానపాములను వదలాలన్నారు. తద్వారా ఎరువు తయారు అవుతుందని చెప్పారు. రైతులకు తక్కువ ధరకే అమ్మకాలు చేస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామకార్యదర్శి లావణ్య, ఎంపీటీసీ సభ్యురాలు తడబారికి మితుల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలగెడ్డలో వానపాములను పరిశీలిస్తున్న ఎంపీడీవో

(c) eenadu

ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు



ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం, గుంటూరులో డిసెంబరు 11వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టు మాత్రమే అనుమతి ● మొదటి మూడు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం ● రిజిస్ట్రేషన్ చివరి తేదీ : డిసెంబరు 7

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

రాజధాని భూసమీకరణ సమస్యలపై సమావేశం నేడు

నగరపాలక సంస్థ(గుంటూరు): రాజధాని రెండో విడత భూసమీకరణకు సంబంధించిన సమస్యలపై బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం ఉంటుందని జిల్లా పాలనాధికారి తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు, సీఆర్‌డీఏ అధికారులు, ల్యాండ్స్ డైరెక్టర్(సీసీఎల్‌ఏ), డైరెక్టర్ (సీఆర్), ప్రణాళిక విభాగం డైరెక్టర్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, సర్వే ఏడీ పాల్గొంటారు.

3, 4 తేదీల్లో వ్యవసాయ కోర్సులకు చివరి విడత కౌన్సెలింగ్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో అగ్రి బీఎస్సీ (ఆనర్స్), బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో చివరి విడత మాన్యువల్ కౌన్సెలింగ్ ఈనెల 3, 4వ తేదీల్లో, స్పాట్ కౌన్సెలింగ్ 5న నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వి.రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ angrau.ac.in ను చూడాలని సూచించారు.

జరీబు తేలేది పదిరోజుల్లో

ఈనాడు - అమరావతి

రాజధాని గ్రామాల్లో జరీబు భూముల విషయంలో సందిగ్ధ పరిస్థితిని పరిష్కరించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మండలం, డివిజన్ కమిటీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లా స్థాయి కమిటీ మరోసారి తనిఖీ చేసి సంబంధిత భూములను జరీబుగా పరిగణించవచ్చా? లేదా? అన్నది నిర్ణయిస్తుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూగర్భజల వనరులు, రెవెన్యూ, ఉద్యాన, వ్యవసాయ, సర్వే అధికారులు భూములను తనిఖీ చేస్తున్నారు. అర్హత ఉన్నవాటిని జరీబుగా గుర్తిస్తారు. లేనివాటిని ఎందుకు గుర్తించడం లేదో రిమార్కులు పొందుపరుస్తున్నారు. త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు తుది నివేదిక పదిరోజుల్లో రానుంది.

జరిగిందిది... ● ఏడాది పొడవునా మూడు పంటలు పండే అత్యంత సారవంతమైన భూముల్ని జరీబు. ● సీఆర్డీఏ భూసమీకరణ సమయంలో మెట్ట, జరీబు వర్గీకరించి రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించింది. ● మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, జరీబుకు రూ.50 వేల కౌలు నిర్ణయించారు. ● మెట్ట భూమికి ఎకరాకు వెయ్యిగజాల నివాస, 250 గజాల వాణిజ్య స్థలం, జరీబుకు ఎకరాకు వెయ్యి గజాల నివాస, 450 గజాల వాణిజ్య స్థలమిచ్చారు. ● తొలి విడత జరీబు గుర్తింపుపై అభ్యంతరాలు రావడంతో మలివిడత పరిశీలన చేశారు. దీనిపైనా అభ్యంతరం రావడంతో మూడోవిడతలో కొంతమందికి జరీబు ప్యాకేజీ ఇచ్చారు. మెట్టతో పోలిస్తే దక్కే ప్రయోజనాలెక్కువగా ఉండడమే దీనికి కారణం.

రాజధాని రైతుల అభ్యంతరాలపై కమిటీల పరిశీలన

జరీబుగా గుర్తించిన భూములు...

మండలం	ఎకరాల్లో
తుళ్లూరు	6,984.65
మంగళగిరి	374.35
తాడేపల్లి	2,266.63
మొత్తం	9,625.63

- జరీబు భూమిగా గుర్తించాలని వచ్చిన దరఖాస్తులు: 96
- ఇప్పటివరకు గుర్తించినవి: 13
- దరఖాస్తుల్లో పేర్కొన్న విస్తీర్ణం: 202.205 ఎకరాలు
- జరీబుగా గుర్తించిన విస్తీర్ణం: 18.54 ఎకరాలు
- మిగిలిన దరఖాస్తులను మెట్టభూములుగా గుర్తించడంతో రైతులు అభ్యంతరం తెలిపారు.

ఒకే ఒక్కడు.. రూ.10 కోట్లు

రైతుల రెక్కలకష్టం కొల్లగొట్టిన ఘనుడు ● నకిలీ బాండ్లు, రసీదులతో పదేళ్లుగా స్వాహాకార్యం

ఈనాడు - అమరావతి

మంగళగిరి, కురగల్లు సొసైటీల పరిధిలోని 11 గ్రామాల ప్రజల స్థిర డిపాజిట్లు, పంట రుణాల చెల్లింపులకు సంబంధించిన రూ.10 కోట్లకు పైగా సొమ్మును సొసైటీ సీఈవో రమేష్‌బాబు స్వాహా చేసినా.. అటు సహకారశాఖ, ఇటు జీడీసీసీ అధికారులు పసిగట్టలేకపోయారు. పదేళ్లుగా ఒకేచోట పని చేస్తూ నకిలీ బాండ్లు, నకిలీ రసీదులిచ్చి రైతుల సొమ్మును సొంతానికి వాడుకున్న విషయం సిబ్బందికి, మంగళగిరిలో బ్యాంకు యంత్రాంగానికి తెలిసినా మిన్నకుండిపోవడం, ఆడిట్‌లోనూ గుర్తించకపోవడంతో అక్రమాలు కొనసాగాయి.

నకిలీ బాండ్లతో బురిడీ: ● సభ్యులు స్థిర డిపాజిట్లు చేసిన సొమ్ముకు ఒరిజినల్ బాండ్లు కాకుండా రమేష్‌బాబు నకిలీవి ఇచ్చారు. కొందరికి నెలనెలా, మరికొందరికి ఏడాదికోసారి వారి ఇళ్లకే వడ్డీ డబ్బులు పంపే ఏర్పాటు చేశారు. ● సొసైటీ బాండ్లు ఇస్తే గడువు ముగిశాక వాటి వెనుక మెచ్యూరిటీ తేదీ వేసి ఇవ్వాలి. దీనికి భిన్నంగా అప్పటివరకొచ్చిన వడ్డీ చెల్లించి కొత్త బాండు ఇచ్చేవారు. ● డిపాజిట్ చేసినవారు వచ్చిన వడ్డీలో కొంత వాడుకుని మిగిలింది కురగల్లు సొసైటీలో స్థిర డిపాజిట్ చేస్తూ వచ్చారు. ● ప్రాథమికంగా రూ.7.50 కోట్ల సొమ్ము పక్కదారి పట్టినట్లు గుర్తించారు. 2015 నుంచి దస్త్రాలు కనిపించడం లేదు.

సరికొత్త మార్గాల్లో స్వాహా

మంగళగిరి సొసైటీకి 2021 నుంచి ఇన్‌చార్జి సీఈవోగా పని చేసిన రమేష్‌బాబు డిపాజిటర్లకు ఒరిజినల్ బాండ్లు ఇచ్చి ఆ నగదును మంగళగిరి బ్యాంకులో స్థిర డిపాజిట్ల కింద జమ చేశారు. వీటిపై సంబంధిత వ్యక్తులే రుణాలు తీసుకున్నట్టు నకిలీ బాండ్లు సృష్టించి సొంతానికి మళ్లించుకున్నారు. ● పంట రుణ బకాయి చెల్లించినవారిలో కొందరికి నకిలీ రసీదులిచ్చారు. మరికొందరికి ఇళ్లకొచ్చి రసీదులిస్తానని చెప్పి ఇవ్వలేదు. ● ఇటీవల పెదవడ్లపూడికి చెందినవారు రూ.50 లక్షలు సొసైటీలో డిపాజిట్ చేయగా.. వారికి ఐదు నకిలీ బాండ్లు ఇచ్చారు. ● ప్రాథమికంగా రూ.1.28 కోట్ల అక్రమాలను గుర్తించినా.. అవి రూ.3 కోట్లకుపైగానే ఉంటాయని అంచనా. ● అక్రమాలకు సహకరించినవారిని సింగపూర్, శ్రీలంక, గోవా యాత్రలకు తీసుకెళ్లినట్టు సమాచారం. డీసీసీబీలోని ఏజీఎంస్థాయి అధికారి ఒకరికి విషయం తెలిసినా.. మిన్నకుండిపోయినట్టు ఆరోపణలున్నాయి.

రికార్డుల మాయం వెనుక...

మంగళగిరి, కురగల్లు సొసైటీల పరిధిలో 11 గ్రామాలున్నాయి. బాధితులు, సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంది. రికార్డుల మాయంపైనా అనుమానాలున్నాయి. ఇంటిదొంగల సహకారం వల్లనే ఒక ఉద్యోగి పదేళ్లపాటు నిరాటంకంగా అక్రమాలు సాగించిన విషయం స్పష్టమవుతోంది.

అమ్మకు ప్రేమతో.. 31,200 మందికి అన్నదానం

ఉప్పుటూరి రామ్‌చౌదరి

భోజనాలు చేస్తున్న జనం

ఆయనకు అమ్మంటే కొండంత ప్రేమ. ఆమె భౌతికంగా దూరమైనా ఆమె పేరు కలకాలం గుర్తుండేలా సమాజానికి మేలు చేయాలని భావించారు వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామానికి చెందిన ఎన్నారై ఉప్పుటూరి రామ్‌చౌదరి. అప్పటికే తన తండ్రి పేరుతో ఉన్న ఉప్పుటూరి చిరంజీవులు ట్రస్ట్ ద్వారా నిత్యాన్నదానానికి శ్రీకారం చుట్టారు. ఆయన తల్లి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సీతామహాలక్ష్మి గతేడాది అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె జీవించి ఉండగా పేదలకు అన్నదానం చేసేవారు. రోడ్డు పక్కన బండిపై ఆహారపదార్థాలు పెట్టుకుని నిత్యం ఆకలిగా వచ్చే కూలీలు, పేదలకు స్వయంగా వడ్డించి ఆకలి తీర్చేవారు. దీన్ని ఆదర్శంగా తీసుకున్న రామ్‌చౌదరి..గతేడాది డిసెంబర్1న సీతా మహాలక్ష్మి పేరుతో అన్నదాన క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఇందులో నిత్యం 100 మంది పేదలకు ఉచితంగా భోజనం పెడుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఒంటరి వృద్ధులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన సుమారు 10 మందికి నిత్యం భోజనం ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఆయన తండ్రి చిరంజీవులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఏడాది కాలంలో మొత్తం 31,200 మందికి అన్నదానం చేశామని, భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని చిరంజీవులు చెబుతున్నారు. 'కరోనా సమయంలోనూ అమ్మ ఎంతో చొరవ తీసుకుని ట్రస్ట్ ద్వారా పేదలకు బియ్యం, కోడిగుడ్లు, కూరగాయలు, పండ్లు పంపిణీ చేశారు. ఆమె ఆశయానికి ఆటంకం కలగకుండా కొనసాగిస్తాం' అని రామ్‌చౌదరి తెలిపారు. **- న్యూస్‌టుడే, పుల్లడిగుంట (వట్టిచెరుకూరు)**

పచ్చని వనం.. పాలన ప్రాంగణం

మండు వేసవిలోనూ అక్కడకు వస్తే ఉపశమనం కలుగుతుంది. అదే గుంటూరు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం. కలెక్టరేట్‌లో దాదాపు పదిహేను వరకు ప్రభుత్వ శాఖలున్నాయి. ఇక్కడ ఎటు చూసినా పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో ఎంత ఎండ కాసినా చల్లగా ఉంటుంది. పక్షుల కిలకిలరావాలు.. పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాలన కార్యకలాపాలను అధికార యంత్రాంగం నిర్వహిస్తోంది. వేసవి సమయంలో రోడ్డున వెళ్లేవారు సైతం కాసేపు చెట్ల కిందకు వచ్చి సేద తీరి వెళ్తుంటారు. పాతికేళ్ల క్రితం అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో మొక్కలు నాటించగా.. తర్వాత వచ్చిన వారు వాటిని సంరక్షించడంతో ఇప్పుడు ఉద్యానంలా దర్శనమిస్తోంది. ఎత్తయిన ప్రదేశం నుంచి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తే అటవీ ప్రాంతం మధ్యలో ఉన్నట్లుగా కనిపిస్తుంది. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. **- న్యూస్‌టుడే, కలెక్టరేట్**

గోల్డ్ క్లస్టర్‌కు నిధుల మంజూరు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరిలోని స్వర్ణకారులకు వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఎల్ఎన్ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీకి యంత్రాలు, ఉపకరణాల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం రూ.1.50 కోట్లు కేటాయిస్తూ మంగళవారం జీవో విడుదల చేసింది. మొత్తం రూ.10 కోట్లతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండగా.. ఇందులో 80 శాతం నిధులను కేంద్రం, 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. మిగిలిన అయిదు శాతం నిధులైన రూ.50 లక్షలను స్వర్ణకారుల తరఫున మంత్రి నారా లోకేశ్ ఇచ్చారు. ఇందుకోసం ఆయన తన సొంత నిధులను వెచ్చించారు. దీంతో ఆభరణాల తయారీలో ఇక్కడ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తికానున్నాయి. దీనిపై ఈ ప్రాంతంలో స్వర్ణకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇది 175 ఏళ్ల సంప్రదాయం..!

నేటితో ముగియనున్న పునీతశౌరి తిరునాళ్ల

ముట్లూరు గ్రామంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పునీతశౌరివారి తిరునాళ్లకు 175 ఏళ్ల చరిత్ర ఉంది. 1850లో ఫ్రెంచ్ మత గురువులు ముట్లూరులో మొదలు పెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. బుధవారం నిర్వహించే సమష్టి బలిపూజ ప్రార్థనలతో వేడుకలు ముగియనున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన మత గురువులతో కలిసి గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య ప్రార్థనలు నిర్వహించి విశ్వాసులకు ఆశీస్సులు అందించనున్నారు. ప్రధానంగా తేరు ప్రదర్శన, శౌరి వారికి వత్తుల సమర్పణ సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామంలో సందడి వాతావరణం.. శౌరివారి తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామం అంతా ముస్తాబైంది. గ్రామంలో కొన్ని ప్రధాన వీధులకు విద్యుత్తు దీపాలు అలంకరించారు. వివిధ ప్రాంతాలనుంచి చేరుకున్న బంధువులతో ఇళ్లు కళకళలాడాయి. గుంటూరు నగరం నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.

విద్యుత్తు కాంతుల్లో పునీతశౌరి దేవాలయం

- న్యూస్‌టుడే, ముట్లూరు (వట్టిచెరుకూరు)

అలా సెట్ చేస్తున్నారు

ఈనాడు - అమరావతి

జీఎంసీలో భారీగా సెట్‌బ్యాక్ ఉల్లంఘనలు

అడ్డదారిలో దండుకుంటున్న పట్టణ ప్రణాళిక విభాగం

గుంటూరు నగరంలోని రాజేంద్రనగర్‌లో ఓ భవనం వద్ద సెట్‌బ్యాక్ నిబంధనను పూర్తిగా ఉల్లంఘించారు. చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ప్రణాళిక విభాగం ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా.. అడ్డదారిలో మార్ట్‌గేజ్ విడుదలకు సిఫార్సు చేసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ స్థాయుల్లోని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో రెండు భవనాల వద్ద ఇదే పరిస్థితి. చుట్టూ సెట్‌బ్యాక్ వదలకుండా ఇష్టారీతిగా నిర్మించారు. అరండల్‌పేట నుంచి ఏటీ అగ్రహారం, ఇన్నర్ రింగ్‌రోడ్డు వరకు అనేకచోట్ల ఇదే పరిస్థితి. సెట్‌బ్యాక్‌ల విషయంలో ఎక్కువమంది నిబంధనలు పాటించడం లేదు. రహదారులు లేదా పక్క ప్లాట్ల మధ్య ఖాళీగా వదలాల్సిన కనీస దూరాలు, రక్షణ, భద్రత, సహజ కాంతి, గాలి ప్రసరణ, అగ్ని ప్రమాదాల నివారణ.. ఇలా అనేక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని నిర్మించాలి. నిబంధనలు పాటించేలా పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాలి. అసలు పని మానేసి.. కాసుల పనిలో నిమగ్నమవడంతో అడ్డదారిలో మార్ట్‌గేజ్ చేయించేందుకు సహకరిస్తోంది.

కొత్త నిబంధనల మాటున...

పేదలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎక్కువమంది పేదలు 50 నుంచి వంద చదరపుమీటర్ల స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటారు కాబట్టి.. ఖాళీ స్థలం విడిచిపెట్టే అవకాశం ఉండదు.. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం వాలిపోయి డబ్బు కోసం పీడిస్తుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు వంద మీటర్లలోపు ప్లాట్లలో సెట్‌బ్యాక్ వదలాలన్న నిబంధనను ప్రభుత్వం సడలించింది. 50 చదరపుమీటర్లలోపు విస్తీర్ణంలో నిర్మించే భవనాలకు రూపాయి ఫీజుకే అనుమతులిచ్చేలా గత జూన్‌లో ఉత్తర్వులిచ్చింది. ఇదే అదనుగా కొందరు బడా వ్యాపారులు, నిర్మాణదారులు ఆ మినహాయింపును అడ్డంగా వాడుకుంటున్నారు. భారీ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సెట్‌బ్యాక్ వదలని విషయాన్ని సాక్షాత్తూ జీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయిలో గుర్తించి.. నగరంలోని పరిస్థితిపై ఆరా తీయగా.. అనేకచోట్ల ఇలాగే ఉందని తేలింది. ఎక్కడెక్కడ నిబంధనల ఉల్లంఘన చోటుచేసుకుందో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మరి పట్టణ ప్రణాళిక విభాగం వాస్తవాలను తెరపైకి తెస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

పీఆర్‌లో నూతన అధ్యాయం

4న డీఎల్‌డీవో నూతన కార్యాలయాలు ప్రారంభం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ వ్యవస్థలో నూతన అధ్యాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డివిజినల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన తర్వాత వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని 77 డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభిస్తారు. ఉమ్మడి జిల్లాలో గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, రేపల్లె, బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయాలను కూడా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు. డీఎల్‌డీవోలు పిచ్చిరెడ్డి, రాజగోపాల్, గబ్రూనాయక్‌లతో జడ్పీ కార్యాలయంలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు.

ఆకర్షణీయంగా డీఎల్‌డీవో ఛాంబర్

డివిజన్‌లో పటిష్ఠం: ఇప్పటి వరకు పంచాయతీ రాజ్ శాఖకు డివిజినల్ స్థాయి అధికారులు లేరు. మండల పరిషత్తు కార్యాలయాలపై పర్యవేక్షణకు జడ్పీ సీఈవో, డీఎల్‌పీవోలు ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీలను డీపీవో పర్యవేక్షించేవారు. దీంతో డివిజన్ స్థాయిలో పట్టు లేకపోవడంతో ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోయేది. వైకాపా ప్రభుత్వం డీఎల్‌డీవో కార్యాలయాలకు కనీసం నిధులు కేటాయించకపోవడంతో పాత భవనాల్లో కనీస సదుపాయాలు లేకపోయినా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఉండేది.

కూటమి పాలనలో..: కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్ శాఖలో మార్పులు చేస్తామని ప్రకటించి డీఎల్‌డీవో కార్యాలయాల ఏర్పాటుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. ఇకపై రెవెన్యూ శాఖలో డివిజనల్ స్థాయిలో ఆర్డీవోల మాదిరిగా డీఎల్‌డీవోలు కూడా అభివృద్ధి పథకాల అమలు పర్యవేక్షించనున్నారు. ఉపాధి పథకం ఏపీడీ, డీఎల్‌పీవోలు కూడా డీఎల్‌డీవో పరిధిలో పని చేస్తారు. 15 మంది సిబ్బందిని కేటాయించారు. దాంతో డీఎల్‌డీవోలు సంపూర్ణ అధికారాలు, పర్యవేక్షణ అజమాయిషీ కలిగి ఉంటారు. దీనివల్ల అభివృద్ధి పథకాలు వేగవంతం కానున్నాయి.

పీఆర్ శాఖ బలోపేతం: వి.జ్యోతిబసు, జిల్లాపరిషత్తు సీఈవో

డీఎల్‌డీవో వ్యవస్థతో పంచాయతీరాజ్ శాఖ బలోపేతమవుతుంది. పీఆర్, ఆర్‌డీ విభాగాలను ఒకే వ్యవస్థలో చేర్చడంతో డీఎల్‌డీవోలు తనిఖీలు చేసి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తారు.

వీరిని ఎందుకు వదిలేసినట్టో?

ఎనిమిదేళ్లుగా ఎంఈవోల బదిలీలే లేవు

ఈనాడు - అమరావతి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడోవంతు మండలాల్లో గత ఎనిమిదేళ్లుగా ఎంఈవోల బదిలీల్లేవు. ప్రభుత్వాలు మారుతున్నా.. ఈ విషయంలో నిర్ణయం తీసుకోకపోవడం ఇబ్బందికరంగా పరిణమించింది. కొన్నిచోట్ల సదరు అధికారుల హవా సమస్యలను సృష్టిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 58 మండల విద్యాశాఖాధికారి పోస్టులున్నాయి. చివరిసారిగా 2017లో బదిలీలయ్యాయి. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లకే బదిలీ తప్పనిసరి చేస్తుండగా.. వారికి సమానమైన ఎంఈవో పోస్టులను పట్టించుకోవడం లేదు. 2021లో అప్పటి ప్రభుత్వం అనేక పోస్టులను రద్దు చేసి.. ఎంఈవో-2 పోస్టులను సృష్టించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రతీ మండలంలో ఇద్దరేసి చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంఈవో-1లపరంగా ఎనిమిదేళ్లుగా మార్పుల్లేవు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, కొత్త నియామకాలు చేపట్టినా వీరిని వదిలేసింది. వీరు ప్రైవేటు పాఠశాలలపై పెత్తనం చలాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఖాళీలతోనూ కష్టాలు: ఉమ్మడి జిల్లాలో అనేక మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో స్కూల్ అసిస్టెంట్లతో ఎఫ్ఏసీ కింద కొన్ని ఎంఈవో పోస్టులను తాజాగా భర్తీ చేశారు. ఈ నిర్ణయంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడడం, ఇక్కడ గెజిటెడ్ హోదా విషయంలో ఎంఈవోల మధ్య ఇబ్బందులు నెలకొనడం సమస్యలుగా మారాయి.

కొత్త సమస్యలు..

పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులకు ఉపాధ్యాయుల్లేక పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయి. ఏకోపాధ్యాయుడు ఉన్న పాఠశాలల నుంచి కూడా ఎఫ్ఏసీ ఎంఈఓలుగా పంపడంతో పెదనందిపాడు, కావూరు తదితర చోట్ల బోధనపై ప్రభావం పడుతోంది.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఉత్తర్వులు

గుంటూరు విద్య, దుగ్గిరాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్తు, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో సీవీ రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోదాలో నియమితులైన స్కూల్ అసిస్టెంట్లకు రూ.12,500 చొప్పున; ఎస్జీటీలకు రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 54 మంది స్కూల్ అసిస్టెంట్లకు, ముగ్గురు ఎస్జీటీలకు అవకాశం ఉంటుందన్నారు. అర్హతలున్నవారు deoblogspot.com వెబ్‌సైట్‌లో దరఖాస్తును పూర్తి చేసి సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు ఈ నెల 5లోగా సమర్పించాలని తెలిపారు.

అమృతోత్సాహం

ఈనాడు - అమరావతి

అమృత్ ఘడియలు వచ్చేశాయి. పనులు తిరిగి పట్టాలెక్కనున్నాయి. గత ఐదు నెలలుగా ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్టుగా ఉన్న అమృత్ 2.0 పనులకు సంబంధించి ప్రభుత్వం తాజాగా మరోసారి టెండర్లు పిలుస్తోంది. బుధవారం ఉదయం 11 గంటల నుంచి ఆన్‌లైన్‌లో బిడ్లు తెరుచుకోనున్నాయి. దీంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 86 పనులకు మోక్షం కలగనుంది.

పట్టణాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడంతోపాటు.. మురుగునీటి కాలువల ఆధునికీకరణ, పచ్చదనం పెంపు.. ఇలా అనేక అంశాల మేళవింపుగా అమృత్ 2.0 పనులను కూటమి ప్రభుత్వం సంకల్పించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వీటిని తిరిగి పట్టాలెక్కించేందుకు గత జూన్‌లో టెండర్లు పిలిచింది. పాత ధరలనే ప్రస్తావించడంతో గుత్తేదారులు ఆసక్తి చూపలేదు. దీనిపై ప్రభుత్వస్థాయిలో కసరత్తు చేసి.. అనేక పరిశీలనల అనంతరం రివైజ్డ్ ధరల ప్రకారం తాజాగా టెండర్లు పిలుస్తున్నారు.

ఉమ్మడి గుంటూరు, కృష్ణాలో ఇలా..: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 86 పనులకుగాను 31 పనులు నీటి సరఫరాకు, 6 సీవేజ్ మేనేజ్‌మెంట్, 49 పచ్చదనం, పార్కుల అభివృద్ధికి సంబంధించినవి ఉన్నాయి. వీటి టెండరు విలువ రూ.1,038 కోట్లు. పన్నులు, జీఎస్టీ, సీనరేజి ఛార్జీలు కలిపి రూ.1,595 కోట్లు. టెండర్ల దాఖలుకు గడువు ఈ నెల 23. 27న ప్రైస్ బిడ్స్ తెరుస్తారు.

ఎక్కడెక్కడంటే..: పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, వినుకొండ, చిలకలూరిపేట, నరసరావుపేట;. గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, పొన్నూరు, తెనాలి; బాపట్ల జిల్లాలో బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకిల్లో పనులు చేపడతారు. ● కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప, విజయవాడ, నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేట తదితరచోట్ల పనులు చేపడతారు.

పిల్లలకు కలెక్టర్ పాఠాలు

వాసవీనగర్ మోడల్ ఫౌండేషన్ పాఠశాలలో బోధన

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఉపాధ్యాయినిగా మారారు. మూడో తరగతి పిల్లలను గణితంలో సమస్యలు చెప్పమని ప్రశ్నించారు. ఆంగ్ల పదాల స్పెల్లింగ్ అడిగారు. తర్వాత కొద్దిసేపు ఆ పాఠాలు వివరంగా అర్థమయ్యేలా బోధించారు. గుంటూరు వాసవీనగర్‌లోని మోడల్ ఫౌండేషన్ పాఠశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ఒకటి నుంచి ఐదు తరగతుల గదులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మూడో తరగతి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆట, పాటలతో విద్యా బోధన చేసి.. చిన్నారుల వికాసానికి బాటలు వేయాలన్నారు. నైతిక విలువలతో కూడిన ఉన్నత ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. చిన్నారులు వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. బాలలకు తయారు చేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక, గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, గుంటూరు తూర్పు మండలం తహసీల్దార్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

పాఠం బోధిస్తున్న కలెక్టర్ తమీమ్

అలవాటుగానే అక్రమాలు

గతేడాది పత్తి లావాదేవీలపై సీఐడీ ఆరా

న్యూస్‌టుడే - మిర్చియార్డు

సీసీఐ పత్తి కొనుగోళ్లు.. దూది అమ్మకాల్లో అవకతవకలపై సీఐడీ విచారణ ప్రారంభంకావడంతో అక్రమార్కులు బెంబేలెత్తిపోతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎప్పుడు కొనుగోళ్లు చేపట్టినా అక్రమాలు షరా మామూలే. వీటిని అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా.. అక్రమార్కులు వేరే దారులను ఎంచుకుంటున్నారు. గతేడాది సీసీఐ నిర్వహించిన లావాదేవీల్లో అక్రమాలను కొంతమంది వ్యాపారులు ఇటీవల పేరేచర్లకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవహారం మళ్లీ తెరమీదకొచ్చింది. స్పందించిన ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. సీఐడీ అధికారులు సీసీఐ కార్యాలయానికి వెళ్లి గతేడాది లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తీసుకెళ్లడం ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



బయ్యర్లు, వ్యాపారుల కుమ్మక్కు...: కొంతమంది సీసీఐ బయ్యర్లు.. పత్తి వ్యాపారులతో కుమ్మక్కై వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఏటా ఇదే తంతు. వీటిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్‌యార్డుల్లో కాకుండా నేరుగా జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాయి. బయ్యర్లు రూటుమార్చి దూది బేళ్లల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు వెళ్లాయి. బయ్యర్లు ఎన్ని బేళ్లను పక్కదారి పట్టించారో సీఐడీ కూపీ లాగుతోంది. మొత్తం అక్రమాల లోతెంతో విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలతో రావాలని సీసీఐ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, విజిలెన్స్ మేనేజర్లను సీఐడీ అధికారులు సూచించారు.

గతంలోనూ ఇదే వరుస... 2014-15లోనూ పత్తి కొనుగోళ్లలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. నాడు సీసీఐ 93 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఆ వ్యవహారంలో సీసీఐ, మార్కెటింగ్‌శాఖ అధికారులు.. వ్యాపారులు, దళారులతో కుమ్మక్కై భారీగా అవినీతికి పాల్పడ్డారు. క్వింటాకు రూ.3 వేల వంతున కొనుగోలు చేసి, అదే పత్తిని సీసీఐకి రూ.4,100 వరకు విక్రయించారు. యార్డులకు పత్తిని తీసుకురాకుండానే గ్రామాల నుంచే నేరుగా జిన్నింగ్ మిల్లులకు పంపి... యార్డుల్లో కొనుగోలు చేసినట్లుగా దొంగ లెక్కలు రాశారు. రవాణా ఖర్చుల కింద కోట్లాది రూపాయలు దారి మళ్లించారు. ఈ అక్రమాలపై అప్పట్లో సీబీఐతో పాటు విజిలెన్స్ విచారణ జరిగింది. అప్పట్లో 26 మంది మార్కెటింగ్‌శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది.

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : 03.12.2025.
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

(c) eenadu

సొసైటీల్లో నిధుల గోల్‌మాల్‌పై విచారణ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి, కురగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నిధులు గోల్‌మాల్ జరిగిన ఘటనపై విచారణకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రజలు, రైతులు సొమ్ముతో వ్యాపారం చేసిన ఆయా సొసైటీలపై సహకార కమిషనర్ విచారణకు ఆదేశించారు. కురగల్లు సొసైటీ సీఈవో షేబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దాదాపు రూ.10 కోట్ల నిధులు స్వాహా చేసిన ఘటనపై రైతులు కురగల్లు, కాజ గ్రామానికి చెందిన ప్రజలు, ఆయా సొసైటీల అధ్యక్షులు ఇటీవల మంగళగిరి పట్టణ, గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మంగళవారం ఆయా సొసైటీలను సందర్శించి వివరాలు సేకరించారు. క్రైం బ్రాంచ్ డీఎస్పీ మధుసూదనరావు, మంగళగిరి పట్టణ, గ్రామీణ సీఐలు వీరాస్వామి, బ్రహ్మం కురగల్లులో బాధితులతో మాట్లాడారు. విచారణ వేగవంతం చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

కురగల్లులో డిపాజిటర్లుతో మాట్లాడుతున్న పోలీసులు

THE GUNTUR DISTRICT CO-OP. CENTRAL BANK LTD., TENALI.
Administrative Office, 2/13 Brodipet, Guntur.

E-Tender Notification

The Guntur District Co-operative Central Bank ltd., Tenali invites E-Tender from eligible bidders for providing Cash Management Services at 45 Bank Branches (including Head Office) through e-Procurement Portal. Tender documents maybe downloaded from **www.apeprocurement.gov.in** and tender commences from **03.12.2025** and the last date of Bid submission is **09.12.2025** at **11:00 AM.**

Guntur
Dt: 02-12-2025
Sd/- Chief Executive Officer

మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: నెం.302బి, జైన్ సద్గురు ఇమేజ్‌స్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, విఐపి హిల్స్, మాధాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500081
టెలి: 040-49951666, ఇ-మెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ (M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్)కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువతెలిపిన స్థిరాస్తి, M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు 30.09.2025 నాటికి ఉన్న మొత్తం బకాయి రూ.17,86,51,934/- (పదిహేడు కోట్ల ఎనభై ఆరు లక్షల యాభై ఒక్క వేల తొమ్మిది వందల ముప్పై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలను (సదరు బకాయి 08.08.2023 తేదీ నాటి అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ద్వారా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాచే M/s. మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు అప్పగించబడింది) 1) మెసర్స్ శ్రీ గౌరంగ ఎంటర్‌ప్రైజెస్ మరియు 2) డా. కోడె శశి కిరణ్ & డా.ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ (రుణగ్రహీతలు) మరియు గ్యారంటర్లు అనగా i) డా॥ కోడె శశి కిరణ్, ii) డా॥ ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ మరియు iii) శ్రీ కోడె సత్య ప్రసాద్ నుండి రాబట్టుకునేందుకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన 08.01.2026న విక్రయించబడును.
రిజర్వు ధర: రూ.3,200 లక్షలు. ధరావతు: 320 లక్షలు

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర. సం.	ఆస్తి వివరణ
లాట్-1	1. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర గల డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం. 12, వార్డ్ నెం.5, T.S.నెం.37లో 380 చ.గజాలు లేదా 317.71 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: అలపర్తి ప్రియనందన భూమి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: అలపర్తి లక్ష్మీకుమారి యొక్క భూమి, ఉత్తరం: మేకపాటి సురేష్ భూమి. 2. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం.12, వార్డ్ నెం.5, T.S.నెం.37లో 379 చ.గజాలు లేదా 316.8 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: దేచిరాజు వెంకటరావుకు చెందిన భూమి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: శ్రీమతి అలపర్తి లలిత సుధకు చెందిన భూమి, ఉత్తరం: మేకపాటి సురేష్‌కు చెందిన భూమి. 3. ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం. 12-11-1 దగ్గర, బ్లాక్ నెం. 2, ప్రస్తుత బ్లాక్ నెం.12, T.S.నెం. 37లో 1000 చ.గజాలు లేదా 836.11 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: లలిత సుధకు చెందిన ఆస్తి, దక్షిణం: ఓల్డ్ క్లబ్ రోడ్డు, పడమర: మున్సిపల్ డొంక, ఉత్తరం: కోడె శశికిరణ్ & కోడె లలిత సుధకి చెందిన భూమి. 4. శ్రీ కోడె శశికిరణ్ & ఆలపాటి లలిత సుధ అలియాస్ కోడె లలిత సుధ పేరున గల గుంటూరు, కొత్తపేట్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, బస్టాండు రోడ్డు & మంగళగిరి రోడ్డు, మణిపురం బ్రిడ్జి దగ్గర డోర్ నెం.12-11-1 దగ్గర, బ్లాక్ నెం.2, ప్రస్తుత బ్లాక్ నెం.12, వార్డ్ నెం.5, T.S.నెం. 37లో 1550 చ.గజాలు లేదా 1295.95 చ.మీటర్ల విస్తీర్ణం గల వాణిజ్య భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: దేచిరాజు వెంకటరావు స్థలం, దక్షిణం: అలపర్తి లలిత సుధ, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్. పైన తెలిపిన ఆస్తులు మొత్తం 60325 (సుమారు) చ.అడుగుల నిర్మిత విస్తీర్ణంతో 3 సెల్లార్లు మరియు గ్రౌండ్ ఫ్లోర్ కలిగి నిర్మించబడిన అసంపూర్తి కట్టడాలపై 3309 చ.గజాల విస్తీర్ణపు పట్టణ వాణిజ్య భూమి ఒకదానికి ఒకటి కలిసి ఏకమొత్తంగా ఉన్నది.

రిజర్వు ధర: రూ.3,200 లక్షలు, ధరావతు: రూ. 320 లక్షలు
తెలిసిన ఏవేని ఎన్‌కంబ్రెన్స్‌లు: లేవు
ఆస్తుల తనిఖీ తేది మరియు సమయం: 18.12.2025న ఉ. 11.00 గం. నుండి సా. 4.00 గం.వరకు
వేలం విధానం: https://www.auctionbazaar.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం.
అన్ని లాట్లకు ధరావతు చెల్లింపునకు మరియు బిడ్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 07.01.2026న సా. 5.00 గం.లోపు
ఇ-వేలం తేది: 08.01.2026, ఉ. 10.00 గం. నుండి ఉ.11.00 గం. మధ్య.
బిడ్ పెంపుదల: రూ.10,00,000/-
అమ్మకానికి సంబంధించిన వివరమైన నియమ నిబంధనలకు, మాక్సిమస్ ARC లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారి వెబ్‌సైట్ అనగా www.maximusarc.com/tenders నందు ఇవ్వబడిన లింకును చూడండి.
ఔత్సాహిక కొనుగోలుదార్లు ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 29ఎ క్రింద వారు అనర్హులవ్వలేదని నిర్ధారిస్తూ "నోటరైజ్డ్ అఫిడవిట్" దాఖలు చేయవల్సి ఉంటుంది.
తేది: 26-11-2025 సం/- (ఆర్‌వి రాజు) అధీకృత అధికారి
స్థలం: హైదరాబాద్ మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ – +91 98481 70245

చకచకా భూగర్భ విద్యుత్తు లైన్ల ఏర్పాటు

అమరావతిలో ఇప్పటి వరకు ఉన్న హై టెన్షన్ విద్యుత్ లైన్లను తొలగించి భూగర్భ విధానంలో వాటిని అమర్చనున్నారు. దీని వల్ల రాజధానిలో విలువైన భూమి వృథా కాకుండా ఉండటమే కాకుండా ఎటువంటి ప్రమాదాలు లేకుండా సురక్షిత విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే ప్రైవేట్ ఏజెన్సీ, టెలిఫోన్, ఇంటర్నెట్ కేబుల్ డక్ట్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా దొండపాడు సమీపంలో పొలాల్లో, సీడ్ యాక్సెస్ రహదారి పక్కన గుత్తేదారు సంస్థల ప్రతినిధులు భూగర్భ హెచ్‌టీ లైన్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. - తుళ్లూరు, న్యూస్‌టుడే

దొండపాడు సమీపంలో కొనసాగుతున్న పనులు

నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

'ఇన్నో ట్రైబ్' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వర్సిటీ ప్రతినిధులు, అతిథులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు, అధ్యాపకులు నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఛైర్మన్ ఆచార్య టీజీ సీతారాం పిలుపునిచ్చారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్- 2025 ప్రాంతీయ సమ్మేళనాన్ని ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. విద్యాసంస్థల మధ్య సాంకేతిక రంగ పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యఅతిథి కేంద్ర ఉన్నత విద్యాశాఖ మాజీ కార్యదర్శి డా. ఆర్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంకుర సంస్థల ఏర్పాటు దేశానికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ 'ఇన్నో ట్రైబ్' పేరుతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 అంకుర సంస్థలు ఇక్కడ ఏర్పాటు చేసిన 42 యుక్తి ఇన్నోవేషన్ స్టాళ్లలో తమ ప్రాజెక్టును ప్రదర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గ్రూప్ సీఈవో పి.ధాత్రీ రెడ్డి, ఎన్ఆర్‌డీసీ సీనియర్ రీజినల్ మేనేజర్ డా.బిజయ్ కుమార్ సాహూ, అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా.కృష్ణన్, వర్సిటీ వీసీ ఆచార్య సతీష్‌కుమార్‌లు పాల్గొని ప్రసంగించారు.

జిల్లాలో కేంద్ర మంత్రి జుయల్ ఓరం పర్యటన నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు కె.ఎల్. యూనివర్సిటీలో నిర్వహించే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇ.ఎం.ఆర్.ఎస్) జాతీయ సాంస్కృతిక, సాహిత్య, కళా ఉత్సవ్ (ఉద్భవ్) 2025లో కేంద్ర మంత్రి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన బయలుదేరి విజయవాడ చేరుకుని, అక్కడి నుంచి న్యూదిల్లీ వెళతారని తెలిపారు.

తెలుగు నాటకం వినిపించేలా.. కనిపించేలా..

5న 'అలనాటి నాటక ప్రస్థానం' కళారూపకం ఆవిష్కరణ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

సుమారు 150 ఏళ్ల తెలుగు నాటక రంగ ప్రస్థానంలో అఖిమానుల గుండెల్లో స్థానం పొందిన కళాకారులు ఎందరెందరో ఉన్నారు. వీరి గొంతులో తొణికిసలాడిన పసనతోనల్లాంటి తెలుగు పద్యాలు, నటన గంధాల గుబాళింపులు చిరస్థాయిగా నిలిచేలా.. భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నారు గుంటూరుకు చెందిన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు. 1880 సంవత్సరం నుంచి వర్తమాన కాలం వరకు ఎందరో రచయితలు, మరెందరో నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు ప్రతిభ పాటవాలతో నాటక రంగానికి వన్నె తెచ్చారు. నటీనటుల నటవైభవ గానమాధుర్యాన్ని, నటవైదుష్యాన్ని ప్రత్యక్షంగా ఈ తరానికి రూపకం ద్వారా అందరూ చూసేలా వీలు కల్పించాలని భావించారు సాంబశివరావు. ఇలాంటి ఓ 84 మంది తెలుగు నాటకరంగ ప్రముఖుల సంభాషణలు, దృశ్య శ్రవ్య అంశాలను సేకరించి పది గంటల నిడివితో 'అలనాటి నాటక ప్రస్థానం' పేరున కళారూపకం రూపొందించారు. దీనిని ప్రొఫెసర్ ఆచార్యుల సత్యనారాయణ ఆవిష్కరించి కందిమళ్ల ఫౌండేషన్ సహకారంతో తీర్చిదిద్దారు. ఈ రూపకంలో బళ్లారి రాఘవ, బలిజేపల్లి లక్ష్మీకాంతం, యడవల్లి సూర్యనారాయణ, వేమూరి గగ్గయ్య, స్థానం నరసింహారావు, మాధవపెద్ది వెంకట్రామయ్య, తుంగల చలపతిరావు, బందా కనక లింగేశ్వరరావు, అద్దంకి శ్రీరామమూర్తి, దాసరి కోటిరత్నం మొదలుకొని.. గరికపాటి రాజారావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.ఆర్.కృష్ణ, బందారు రామారావు, బొల్లు శ్రీరాములు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి, జమునారాయలు వరకు 84 మంది మహనీయ నటుల పాటలు, పద్యాలతో పాటు వారి నట విడియోలు రూపంలో పొందుపర్చారు. డాక్టర్ చాట్ల శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక కేంద్రం ఆడిటోరియంలో ఈనెల 5న సాయంత్రం ఆరున్నర గంటలకు ఈ రూపకాన్ని ఆవిష్కరించనున్నారు.

లోగో

భావితరాల కోసమే

"తెలుగు నాటక రంగ చరిత్ర ఎంతో విశిష్టమైనది. ఎందరెందరో మహానుభావులు నాటకానికి తమ జీవితాలను అంకితం చేశారు. వారందరి కృషి నేటి తరంతో పాటు, భావితరాలకు అందించాలనే తపనతోనే ఈ ప్రయత్నం చేశా. పది కాలాల పాటు తెలుగు నాటకం ఈ రూపకం ద్వారా నిలిచి ఉంటుందన్నది నా నమ్మకం." - డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

ఈ-13 పనులు వేగవంతం

డొలాస్‌నగర్ కొండపై రెండు కిలోమీటర్ల ఘాట్ రోడ్డు

అమరావతి నుంచి మంగళగిరి- విజయవాడ మధ్య కోల్‌కతా- చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారిని కలుపుతూ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) చేపట్టిన ఈ-13 రోడ్డు పనులు వేగం పుంజుకున్నాయి. ఎయిమ్స్ పక్కనే ఉన్న అటవీశాఖ కొండపై నుంచి రోడ్డు నిర్మించేందుకు 22 ఎకరాల భూమిని ఆ శాఖ ఇప్పటికే అనుమతులిచ్చింది. దీంతో కొండపై రెండు కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా ఘాట్ రోడ్డు పనులు చేపట్టారు. ఈ మార్గంలో ఉన్న చెట్లు లెక్కకట్టి తొలగిస్తున్నారు. వాటికి ధర నిర్ణయించి చెల్లించనున్నారు. ఈ రోడ్డు నేరుగా డీజీపీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారికి అనుసంధానమవుతుంది. మంగళగిరి-తాడేపల్లి కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ మధ్య రైల్వే లైను పైనుంచి ఈ-13 రోడ్డు వెళుతుంది. ఇందుకోసం ఇక్కడ పైవంతెన నిర్మాణానికి రైల్వేశాఖ రూ. 112 కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే ఆ ప్రాంతంలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. - తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

అటవీశాఖ కొండపై కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం

మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టడమే లక్ష్యం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో తలెత్తే అనర్థాలపై ప్రజలు, యువతకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ మంగళవారం సమావేశమైంది. కలెక్టర్ మాట్లాడుతూ మత్తు ఆకర్షితులవుతున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేలా విద్యాసంస్థలు, వసతి గృహాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వారికి అవసరమైన కౌన్సెలింగ్, డి-అడిక్షన్ కేంద్రాల్లో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులు, సభ్యుల వివరాలను పోలీస్ శాఖకు అందించాలన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ నవంబరు 1 నుంచి 28వ తేదీ వరకు 12 కేసులు నమోదు చేసి, 21 మందిని అరెస్టు చేశామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి యువతకు సంకల్పమ్ కార్యక్రమం ద్వారా సదస్సులు, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం పోలీస్ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, ఏఎస్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు

ప్రత్తిపాడు పాఠశాలలో అగ్ని ప్రమాదం

కాకుమాను (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: ప్రత్తిపాడులోని బీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాత బెంచీలు, ఇతర సామగ్రి నిల్వ చేసే రేకుల షెడ్‌లో మంగళవారం మధ్యాహ్నం 2:45 నిమిషాలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లోపల ఉన్న వస్తువులు దగ్ధం కావడంతోపాటు షెడ్డు పైకప్పు ధ్వంసమైంది. తరగతి గదులు ప్రమాదం జరిగిన షెడ్‌కు దూరంగా ఉండటంతో ఎలాంటి ఇబ్బంది ఏర్పడలేదు. విద్యార్థులందరినీ ఉపాధ్యాయులు సురక్షితంగా బయటకు పంపించారు. ఆ గదిలో ఉన్న బెంచీలు, ఇతర సామగ్రిని వేలం వేసి విక్రయించేందుకు ఇటీవల విద్యాశాఖ అధికారుల నుంచి ఇటీవల అనుమతి ఇచ్చింది. ఇంతలోనే ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఎస్సై నరహరి ట్యాంకర్‌తో నీటిని తెప్పించి గ్రామస్థుల సహకారంతో మంటలను ఆర్పి వేసేందుకు ప్రయత్నం చేశారు. ఇంతలో గుంటూరు నుంచి అగ్నిమాపక అధికారులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సంఘటనా ప్రాంతాన్ని తహసీల్దార్ సుజాత, ఉప విద్యా శాఖాధికారి ఏసురత్నం, ఎంపీడీవో శివపార్వతి, ఎంఈవోలు రమాదేవి, లీలారాణి పరిశీలించారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారని, ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని డీఈవో సీవీ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు.

షెడ్‌లో ఎగసిపడుతున్న మంటలు

పీఆర్ నాలుగో తరగతి ఉద్యోగులకు పదోన్నతులు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖకు చెంది జిల్లాపరిషత్తు యాజమాన్య పరిధిలోని 18 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 13 మంది రికార్డు అసిస్టెంట్లుగా, నలుగురు ల్యాబ్ అసిస్టెంట్లుగా, ఒకరు లైబ్రరీ అసిస్టెంటుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి ఆయా జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులు దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. ఒకేసారి 18 మందికి పదోన్నతులు కల్పించడంతో వారి నిరీక్షణ ఫలించినట్లయింది.

లోకో పైలెట్ల నిరాహారదీక్ష

ఆందోళనకారులకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: లోకో పైలెట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో 48 గంటల నిరాహార దీక్ష ప్రారంభించారు. ఏఐఎల్ఆర్ఎస్ఏ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. న్యూదిల్లీకి చెందిన సీడబ్ల్యూసీ సభ్యులు వెంకటేశ్ ఈ శిబిరం ప్రారంభించారు. విశిష్ట అతిథిగా పర్యావరణ కార్యకర్త గీతికా వెంకటేషన్ పాల్గొని మద్దతు పలికారు. కార్యక్రమంలో నాయకులు కొల్లిపర ప్రసాద్, ఓంప్రకాష్, వెంకట కృష్ణారావు, పార్థసారథి, అబ్దుల్ రెహ్మాన్, జీవీ రావ్, నాగరాజు, పెద్దబ్బాయి, వందమంది రైల్వే లోకో పైలట్‌లు పాల్గొన్నారు.

మహిళలకు అన్నింటా ప్రోత్సాహం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో.. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో అవగాహన కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అదనపు సీఈవో శ్రీరాములునాయుడు అన్నారు. గుంటూరుకు సమీపంలోని లాం కృషి విజ్ఞాన కేంద్రంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి అధ్యక్షతన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ (ఐఎఫ్‌సీ)పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. శ్రీరాములునాయుడు మాట్లాడుతూ సీమ పందులు, గొర్రెలు, పుట్టగొడుగుల పెంపకంతో పాటు డెయిరీల నిర్వహణ, అజోల్లా, సైలేజ్ గడ్డి, చేపల చెరువుల యూనిట్లను రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా నిర్వహిస్తే నాబార్డ్ రాయితీ కల్పిస్తుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ కేవీకేలో సాగు చేస్తున్న పంటలతో పాటు సీమ పందులు, గొర్రెలు, కోళ్ల యూనిట్ల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన కల్పించారు. పంటలను ఆధునిక విధానంలో సాగు చేయడంపై శాస్త్రవేత్తలు వివరించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, డీఆర్‌పీ రామయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ కిరణ్‌కుమార్, వెలుగు డీపీఎంలు అశోక్‌కుమార్, కేశవ్, శివప్రసాద్‌రెడ్డి, ఎఫ్‌పీవోలు, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సెర్ప్ అదనపు సీఈవో శ్రీరాములునాయుడు

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన రెవెన్యూ అర్జీలపై.. ఆ శాఖ నోడల్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. అధికారుల వద్దకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యపై పూర్తి అవగాహన పొందాలని, తర్వాత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు సోమవారం అందుకున్న వినతులపై శుక్రవారం నాటికి స్పష్టమైన సమాచారంతో ఉండాలని, త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు బియ్యం కార్డు సేవలకు సంబంధించి నేరుగా దరఖాస్తు చేసేలా అధికారులు సహకరించాలన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళ్లలో కారం కొట్టి.. మారణాయుధాలతో దాడి

పొన్నూరు, న్యూస్‌టుడే: కళ్లలో కారం చల్లి.. మారణాయుధాలతో దాడిచేసిన ఘటన పొన్నూరు పట్టణ పరిధిలోని 5వ వార్డులో మంగళవారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని 4వ వార్డుకు చెందిన పఠాన్ సలీం, 5వ వార్డుకు చెందిన కరిమూల్లా మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో 5వ వార్డులోని తన స్నేహితుడైన బాబును కలిసి వస్తున్న సమయంలో సలీంపై కరిమూల్లా, తన స్నేహితులతో కలిసి కళ్లలో కారం చల్లి.. మారణాయుధాలతో దాడి చేశాడు. స్థానికులు వెంటనే స్పందించి సలీంను పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరనాయక్ వెల్లడించారు.

చికిత్స పొందుతున్న సలీం

14 అంగన్‌వాడీ కేంద్రాల వర్గోన్నతి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ జిల్లా ఎంపిక కమిటీ (డీఎస్సీ) ఆమోదించింది. కలెక్టరేట్‌లో పాలనాధికారి ఎ.తమీమ్ అన్సారియా అధ్యక్షతన డీఎస్సీ సమావేశం మంగళవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాల్లో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ సహాయకుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి పి.పి.జి.ప్రసూన, డీఈవో సి.వి.రేణుక, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

మిర్చి యార్డు సమాచారం

(నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	45,716
అమ్మకాలు:	43,642
నిల్వలు:	11,317

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	10,000-17,000
నంబర్ 5	11,000-15,000
341	10,500-17,000
సూపర్ 10	11,500-16,000

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,500
బాడిగ	10,500-17,300
దేవనూరు డీలక్స్	11,000-16,800
ఆర్మూర్	10,500-13,300

ఏసీ కామన్ వెరైటీ

334	11,000-17,200
నంబర్ 5	10,500-15,800
341	12,000-16,800
4884	12,000-14,200

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	11,000-15,000
బాడిగ	11,000-17,300
దేవనూరు డీలక్స్	10,500-16,300
తాలు	5,200-7,800

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 – ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 – ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 – మ. 2
సత్యభామ	మ. 2 – సా. 5
లైట్ తీస్కో	సా. 5 – రా. 9
సరదాగా కాసేపు	రా. 9 – రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 – తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఓ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా పోతురాజు కొత్తపాలెంకు చెందిన సురేష్‌రెడ్డి (20) వర్సిటీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం తోటి విద్యార్థులు తరగతులకు వెళ్తుండగా..తాను తర్వాత వస్తానని చెప్పి గదిలో ఉండిపోయాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విద్యార్థులు వచ్చి చూసే సరికి గది తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలో నుంచి చూడగా సురేష్‌రెడ్డి.. బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని హాస్టల్ సిబ్బంది స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించామని, మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా..విద్యార్థి మృతికి కారణాలు తెలపాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యాన కొద్దిసేపు విద్యార్థులు ఆందోళన నిర్వహించారు.

సురేష్‌రెడ్డి (పాత చిత్రం)

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్‌క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

FLAT FOR SALE

INNER RING ROAD

ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్2 లోటస్ అపార్ట్‌మెంట్, శ్రీ కన్వెన్షన్ దగ్గర, మెయిన్ రోడ్ 3000 Sft ఫ్లాట్ అమ్మకం. ఫుల్ ఫినిష్. 94402 60714.

HOUSE FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager. Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Mirchi Godown Supervisor - Must have experience in Mirchi field and own a bike | Contact: 9032431999.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 97039 71968.

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పనిచేయుటకు Male/ Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్ వారు మాత్రమే. 63022 43437.

హోటల్ కుంభకర్ణ, కొరిటిపాడు, గుంటూరు రూమ్ సర్వీస్ బాయ్స్ (ఉ॥8-సా॥6) హౌస్ కీపింగ్ స్టాఫ్ (M) (ఉ॥8-సా॥5) సెక్యూరిటీ గార్డ్స్ (సా॥6-ఉ॥6) కావలెను. 80564 30833.

R.K. ఇంజినీరింగ్ కాలేజీ వారికి బస్ డ్రైవర్స్ కావలెను. కంకిపాడు, ఎనికేపాడు, నందిగామ, మంగళగిరి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు ఆటో మరియు కారు నడుపుటకు డ్రైవర్లు కావలెను. తగిన లైసెన్స్ కల్గి ఉండవలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 94406 81862.

E-KART నందు అర్జెంటుగా Male/Female కావలెను. Q: Inter, Any Degree Salary 15000/- Online Available 9381912123.

మహానాడు మీడియా, గుంటూరులో పనిచేయుటకు "వీడియో ఎడిటర్" కావలెను. Ph: 73372 22004.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

విద్యార్థికి అభినందన

అశోక్‌ను అభినందిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరఫున ఖేలో ఇండియా టోర్నమెంట్‌లో పాల్గొని రజత పతకం సాధించిన విద్యార్థి అశోక్‌ను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మంగళవారం అభినందించారు. ఏఎన్‌యూ పరిధిలోని మాచర్ల ఎస్‌కేబీఆర్ కళాశాలలో బీపీ రెండో ఏడాది చదువుతున్న అశోక్ రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా టోర్నమెంట్‌లో 94 కిలోల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని రజతం సాధించాడని చెప్పారు. మంగళవారం ఏఎన్‌యూకు వచ్చిన విద్యార్థిని వీసీ గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వ్యాయామ కళాశాల సంచాలకులు ఆచార్య పాల్‌కుమార్ అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్రావు, శిక్షకులు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ దేశభక్తి కలిగి ఉండాలి

చేబ్రోలు, న్యూస్‌టుడే: విద్యార్థులందరూ దేశభక్తి కలిగి ఉండాలని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఆయన మంగళవారం ఏకరూప దుస్తులు అందజేశారు. అనంతరం నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన 36 మందితో ప్రమాణం చేయించారు. ఎంఈవో సుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 1200
అత్యల్పం: 800
సగటు: 1000

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

సర్వే త్వరగా పూర్తి చేయండి

సర్వేలోని ఇబ్బందులు తెలుసుకుంటున్న పీడీ ప్రసాద్ పక్కన తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు

పెదకాకాని, న్యూస్‌టుడే: ఇంటి స్థలం ఉండి రుణం తీసుకునే వారితో పాటు స్థలం కావాల్సిన వారి వివరాలు నమోదు చేస్తున్న సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ ప్రసాద్ తెలిపారు. పెదకాకాని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ కల్లా సర్వే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రుణాలు తీసుకున్న 70 గృహాల బేస్‌మెంట్ పూర్తయినట్లు చెప్పారు. అనంతరం సర్వేలోని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కృష్ణకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి.. విజేతలుగా నిలిచి

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

విధి వారితో ఆడుకునే ప్రయత్నం చేసినా.. నిబ్బరంగా నిలిచారు. చదువు వెలుగులో తమ లక్ష్యాలను సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. చిన్నపాటి సాధారణ సమస్యలకే నానా ఇబ్బందులు పడుతున్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి గురించి తెలుసుకుందామా..!

ఉత్తమ టీచర్‌గా..

విద్యార్థులకు పాఠాలు చెబుతున్న జయప్రకాష్

రేపల్లెకు చెందిన 'గేరా జయప్రకాష్' 3 సంవత్సరాల వయస్సులోనే పోలియోకు గురయ్యారు. దానితో ఎడమ కాలు పూర్తిగా, కుడి కాలు సగం వరకు పనిచేయడం లేదు. అయినా కుటుంబ సభ్యుల తోడ్పాటుతో ఎంఎస్సీ బీఈడీ చదివారు. 2000లో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడు కావాలనే తన లక్ష్యాన్ని సాధించారు. తెనాలి పురపాలక ప్రాథమిక పాఠశాలలో చేరి పిల్లలకు చదువు చెప్పడంతో పాటు.. నిరుపేద యువతకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన పదుల సంఖ్యలోని అభ్యర్థులు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆయన సేవలకు గానూ నవంబరు 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ బెస్ట్ టీచర్ పురస్కారాన్ని అందుకున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకుని..

ప్రభుత్వం అందించిన వాహనంపై 'వినుకొండ అనిల్‌ప్రసాద్'

తెనాలికి చెందిన 'వినుకొండ అనిల్‌ప్రసాద్' తన 6వ ఏట పోలియోకు గురయ్యారు. దీంతో కుడి కాలు పూర్తిగా, ఎడమ కాలు మోకాలి వరకు పనిచేయడం లేదు. అయినా ఇనుప బూట్లపై నడక సాధన చేసి చదువు కొనసాగించారు. పదో తరగతి మొదలు పీజీ వరకు ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. కుటుంబ సభ్యులకు ఆర్థికంగా భారం కాకూడదని, ఖాళీ సమయాల్లో తెనాలిలోని దుకాణాల్లో పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధం అయ్యారు. 2019లో సచివాలయంలో ఉద్యోగం సాధించి తెనాలి కొత్తపేటలో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగం చేస్తూనే ఎంఏ (సోషియాలజీ) చదువుతున్నారు.

చీకటిని చిదిమి 'జ్యోతి'లా వెలిగి

విధి నిర్వహణలో 'కృపాజ్యోతి'

తెనాలికి చెందిన 'కృపాజ్యోతి'కి చిన్నప్పటి నుంచి కంటి సమస్యలు ఉన్నాయి. ఆరేండ్ల వయస్సులోనే 50 శాతం కంటి చూపు పోయింది. తదనాంతరం మెట్ల మీద నుంచి జారిపడడంతో కంటి చూపు నూరు శాతం పోయింది. కుటుంబ సభ్యుల సహకారంతో తొలుత గుంటూరులో 1వ తరగతి నుంచి 5 వరకు, విజయవాడలో 6వ తరగతి నుంచి 10వరకు బ్రెయిలీ లిపి విధానంలో చదువుకున్నారు. అటుపై హైదరాబాద్‌లోని నేత్ర విద్యాలయంలో ఇంటర్, బీఏ పూర్తి చేశారు. అక్కడే అంధుల కోసం ప్రత్యేకించిన కంప్యూటర్ కోర్సుల్లోనూ ఉత్తీర్ణులయ్యారు. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సాధారణ విద్యార్థులతో పాటే ఎంఏ (సోషియాలజీ) పూర్తి చేశారు. 2020లో సచివాలయంలో ఉద్యోగం సాధించి ఇప్పుడు విజయవాడ కృష్ణలంకలో విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి సహకారంతో రోజూ ఉదయం తెనాలి నుంచి విజయవాడ వెళ్లి విధులు ముగించుకుని తిరిగి రాత్రి ఇంటికి చేరుకుంటున్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

మోడల్ పేపర్లు అందుకున్న విద్యార్థులతో చినరాములు

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉప్పుటూరి చిన రాములు పేర్కొన్నారు. మండల పరిధిలోని మావడూరు హైస్కూల్ పూర్వపు విద్యార్థిని ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు రామ్ చౌదరి (యూఎస్‌ఏ) ఆర్థిక సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లు అందజేశారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎంఈవో-1 రాజు, ఎంఈవో-2 కె.విజయ భాస్కర్, హెచ్‌ఎం షేక్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల దీక్ష నేడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద బుధవారం నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ల సంక్షేమ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్ కోరారు. ఆయన మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఆన్‌లైన్ పరీక్షలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సచివాలయాల పరిధిలో ఉన్న నిరుద్యోగ యువత వివరాలను ప్రభుత్వం ఇప్పటికే సేకరించింది. కౌశలం పథకం కింద వారికి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించే ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఉదయం ఒకరు, సాయంత్రం మరొకరు ఇలా రోజుకు ఇద్దరికి ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం సచివాలయం నుంచి పరీక్షల నిర్వహణ తీరును ఎంపీడీవో ఏ.దీప్తి పరిశీలించారు.

లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించండి

న్యాయవాదులతో సమావేశంలో న్యాయమూర్తులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని.. వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకారం అందించాలని మండల లీగల్ సర్వీసెస్ అధ్యక్షులు, న్యాయమూర్తి డి.శ్రీనివాసులు కోరారు. తెనాలి న్యాయస్థానాల ప్రాంగణంలో మంగళవారం తెనాలి బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తులు పవన్‌కుమార్, రాజశేఖర్, వివేక్‌వర్ధన్, బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తేమశాతం పరిగణలోకి తీసుకోకుండా గిట్టుబాటు ధరకు ధాన్యం కొనాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివ సాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

నూతన కాంపాక్టర్ ప్రారంభం నేడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: 30 టన్నుల చెత్తను తరలించే సామర్థ్యం కలిగిన నూతన కాంపాక్టర్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ప్రారంభించనున్నట్లు కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మంగళవారం తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో 100 మందికి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా.. సంక్షేమ పథకాల పేరుతో దోపిడీ చేశారని వాపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.రమేషుబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తక్కువ ధరకు విక్రయించొద్దు

రైతుకు కొనుగోలు పత్రం ఇస్తున్న మల్లికార్జునరావు పక్కన మోహనరావు, రమణకుమార్

తక్కెళ్లపాడు (పెదకాకాని), న్యూస్‌టుడే: మండలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్లు గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్.మోహనరావు మంగళవారం తెలిపారు. పెదకాకాని, నంబూరు, ఉప్పలపాడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 75 కేజీల బస్తా ధర రూ.1797గా ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పంట కోత అనంతరం తేమ శాతం 17 ఉండేలా రైతులు ఆరబెట్టుకోవాలని సూచించారు. చేతికి వచ్చిన పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించొద్దని ఆయన తెలిపారు. ఏవో రమణకుమార్, తక్కెళ్లపాడు సొసైటీ మాజీ ఛైర్మన్ మల్లికార్జునరావు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

రాకపోకలకు అడ్డంకులు తొలగించండి

వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోడ్ల మీదకు వచ్చిన ఆక్రమణలను తొలగించాలని.. ప్రజల రాకపోకలకు అడ్డంకులు కలిగిస్తే సహించేది లేదని డీఎస్పీ బి.జనార్దనరావు స్పష్టం చేశారు. ఆయన మంగళవారం తెనాలి శివాజీచౌక్, పరిసర ప్రాంతాల్లో వ్యాపారులు, స్థానికులతో మాట్లాడారు. కాగా పోలీస్ విభాగం ఆధ్వర్యంలో మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆక్రమణల తొలగింపు, ఆటోలు, ఇతర వాహనాలపై కేసుల నమోదు కొనసాగింది.

జూడోలో ప్రతిభ

కొల్లిపర, న్యూస్‌టుడే: తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జూడోలో చక్కని ప్రతిభ కనబరిచి విజయం సాధించారని ప్రధానోపాధ్యాయిని కె.నాగలక్ష్మి మంగళవారం తెలిపారు. గత నెల అనంతపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ 19 విభాగంలో కట్టా శైలు, యేమినేని అజయ్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్ 14 విభాగంలో సమ్మెట దివ్యశ్రీ తృతీయ స్థానం దక్కించుకున్నారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబశివరావు కృషిని పాఠశాల యాజమాన్య కమిటీ, గ్రామస్థులు కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పొన్నూరు: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని విజ్ఞాన్స్ ఉపకులపతి పి.నాగభూషణ్ వెల్లడించారు. మంగళవారం చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. నాగభూషణ్ మాట్లాడుతూ.. జీవనశైలిలో చిన్న చిన్న మార్పుల ద్వారా పచ్చని భవిష్యత్తును నిర్మించుకోవచ్చని చెప్పారు.

ఉచిత కుట్టు శిక్షణ.. భవితకు నిచ్చెన..!

నేడు తెనాలిలో ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

తెనాలి కొత్తపేటలోని మహిళా మండలి భవనం

ఇంట్లోనే ఉంటూ పనిచేస్తూ వచ్చిన డబ్బును కుటుంబ అవసరాలకు వినియోగించుకుందామనేది ఎందరో మహిళల కల. వారి కలను నెరవేర్చేందుకు మంత్రి నాదెండ్ల మనోహర్ సంకల్పించారు. వందలాది మంది మహిళలకు కుట్టులో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఆయన బుధవారం తెనాలి కొత్తపేటలోని మహిళా మండలి భవనంలో కుట్టు శిక్షణ ప్రారంభించనున్నారు. మహిళలు దీనిని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చు.

ఎంతో అనుభవం కలిగిన వారితో..

మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన మేరకు మహిళలకు స్వయం ఉపాధి కోర్సుల శిక్షణలో ఎంతో అనుభవం కలిగిన మదర్ ఫౌండేషన్ వారు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. వీరు ఇప్పటికే ఆసక్తి కలిగిన మహిళలతో అవగాహన సమావేశం నిర్వహించారు. చదువుతో పనిలేకుండా.. నేర్చుకోవాలనే బలమైన కోరిక ఉండి క్రమశిక్షణగా వచ్చే వారికి కచ్చితంగా 45 రోజులు శిక్షణ ఇస్తామని స్పష్టం చేశారు. శిక్షణ ధ్రువపత్రంతో పాటు, ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందిస్తామని తెలిపారు.

ఇప్పటికే 500 మంది గుర్తింపు..

పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ వారు ఇప్పటికే కుట్టు నేర్చుకుంటామని ముందుకొచ్చిన 500 మంది మహిళలను గుర్తించారు. వీరికి పట్టణంలోని మహిళా మండలి భవనంతో పాటు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఐతానగర్, చినరావూరు, పినపాడు, చెంచుపేట, బాలాజీరావుపేట వంటి చోట్ల నడుస్తున్న సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, తదితరాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో దాంట్లో వంద మందికి రెండు షిఫ్టుల్లో శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. తొలుత మహిళా మండలి భవనంలో మొదలు పెడుతున్నారు.

మాటిచ్చారు.. రహదారి పనులు పూర్తి చేశారు

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని 5వ వార్డు డఫ్‌పేటలోని రహదారి పల్లంగా మారడంతో వర్షం కురిసినప్పుడు నీళ్లు నిలబడుతున్నాయని.. రాకపోకలు సాగించేందుకు కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని.. గతేడాది ఫిబ్రవరి 3న 'రహదారి వేయమంటే.. కాలువ తవ్వారు' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని స్థానికులు అప్పటి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిమెంటు రహదారి నిర్మాణ పనులు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొద్ది రోజుల కిందట సిమెంటు రహదారి నిర్మాణ పనులకు రూ.12.28 లక్షల నిధులు కేటాయించడంతో రహదారి నిర్మాణ పనులను పూర్తి చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

కాలువల్లో పూడిక తీయించాలి

పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మురుగు ముందుకు కదలని కాలువలను గుర్తించి పూడిక తీయించాలని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం 37వ వార్డులో పూడిక తీత పనులను పరిశీలించారు. చెప్పినా వినకుండా కాలువల్లో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు సోదరులకు విజ్ఞప్తి
మావద్ద నాణ్యమైన, శుభ్రపరిచిన,
పెసలు, మినుములు
అమ్మకమునకు కలవు.
శ్రీ షిరిడి సాయి పల్సెస్
17-3-6, సుబ్బరాయనగర్, 2వ లైన్, పొన్నూరు
ఫోన్: 08643242051
8074332541, 7981048547

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? నెహ్రూ రోడ్డు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురు వీధిలోని కాలువల్లో మురుగు ముందుకు పారడం లేదు. **- భాస్కర్, నెహ్రూ రోడ్డు** ✔ అడ్డంకులు తొలగింపజేస్తాం.
? గంగానమ్మపేట వేణుగోపాలస్వామి గుడి రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. **- పావని, గంగానమ్మపేట**
✔ మరమ్మతులు చేయిస్తాం. **- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్** ✦ తెనాలి పట్టణ ముత్తంశెట్టివారిపాలెంలో కబేలా వద్ద తోపుడు బళ్లపై మాంస విక్రయాల వల్ల ఇబ్బందిగా ఉందని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. విక్రయాలను కట్టడి చేశారు. ✦ బాలాజీరావుపేటలోని కాలువల్లో మురుగు పారుదల లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించారు. **– న్యూస్‌టుడే, తెనాలి టౌన్** ? పొన్నూరు పరిధిలోని 23వ వార్డులో రహదారి పగుల్చింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.
- పి.డేవిడ్, 23వ వార్డు ✔ రహదారికి మరమ్మతులు చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **-షేక్ హసీనా, సహాయ ఇంజినీరు** ? పొన్నూరు పరిధి ముబారక్‌నగర్‌లోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తుంది.
- షేక్ బాజీ, ముబారక్‌నగర్ ✔వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**
✦ పట్టణ పరిధిలోని పాత పొన్నూరులో రెండు రోజులుగా వ్యర్థాలను తొలగించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. కార్మికులతో శుభ్రం చేయించారు. ✦ 18వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు.
– న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

తెనాలి(కొత్తపేట): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల వేతనాల పెంపును ప్రభుత్వం విస్మరించిందని, ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 12 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్ వలి పేర్కొన్నారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలో సంచరిస్తున్న ఆవులు, పందులు, గాడిదలు, కోతులు, కుక్కలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

వ్రతానికి ఏర్పాట్లు పూర్తి

పొన్నూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధి సహస్రలింగేశ్వరస్వామి దేవస్థానంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమద్వ్రతాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఛైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో అమర్‌నాథ్ మంగళవారం తెలిపారు. తెల్లవారు జామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, 108 మంది దంపతులు హనుమద్వ్రతం, లక్ష తమలపాకులతో పూజలు చేస్తామని చెప్పారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు.

6 నుంచి యువజనోత్సవాలు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల యువజనోత్సవాలు ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఆచార్య మురళీమోహన్ పేర్కొన్నారు. సంగీతం, నృత్యం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, స్కిట్స్, ఏకపాత్రాభినయం, మిమిక్రీ, స్పాట్ పెయింటింగ్, పోస్టర్ మేకింగ్, మట్టి నమూనాలు, చిత్రాలు, ముగ్గులు, స్పాట్ ఫొటోగ్రఫీపై పోటీలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఈ నెల 5లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *TENALI* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
FT VZ	40	1,25,000	50,00,000
FT D	40	50,000	20,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT S	50	6,000	3,00,000
FT N	40	12,500	5,00,000
FT B	40	5,000	2,00,000

Please Contact Branch Manager **Mr. T.SRINIVASA RAO,** for further details. **Mobile No. 99899-92779, Landline: 08644-224334, 222157.**

ఆలయ ఉద్యోగి మృతి

సదాశివరావు (పాతచిత్రం)

పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని కేశఖండనశాలలో విధులు నిర్వహించే ఉద్యోగి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. తక్కెళ్లపాడుకు చెందిన కొమ్మూరు సదాశివరావు (65) కేశఖండనశాలలో పని చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన భోజనానికి వెళ్లి కాసేపు సేదతీరారు. అనంతరం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన సహచరులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వైద్యులకు అభినందన

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ సోకకుండా అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను తెనాలి జిల్లా ఆసుపత్రిలోని ఆ విభాగ నోడల్ అధికారి డాక్టర్ శేషిరెడ్డి, సిబ్బంది రఫీ, రాజ్యలక్ష్మి, లక్ష్మీప్రసన్న ఇటీవల రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నట్లు సూపరింటెండెంట్ టి.సౌభాగ్యవాణి తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన వారి అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డీసీహెచ్‌ఎస్ రంగారావు, ఆర్‌ఎంవో మల్లికార్జునరావు, పలువురు వైద్యులు వారిని అభినందించారు.

ఇసుక రవాణాపై కేసులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సరైన ధ్రువపత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కఠెవరం వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ఐదుగురిని డ్రోన్ ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిని తెనాలి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించినట్లు చెప్పారు.

స్పా పర్యవేక్షకుడికి రిమాండ్ విధింపు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా కేంద్ర పర్యవేక్షకుడిని తెనాలి న్యాయస్థానంలో హాజరుపర్చగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని త్రీ టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

30న ముక్కోటి ఏకాదశి ఉత్సవం

ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవం ఈనెల 30న జరుగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ప్రచార ప్రతులను మంత్రి నారా లోకేశ్ మంగళవారం రాత్రి ఉండవల్లిలోని నివాసంలో ఆవిష్కరించారు. స్వామి వారి దర్శనానికి రావాల్సిందిగా ఆయన్ను ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఆలయ సహాయ కమిషనర్ సునీల్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరిలోని మోడ్రన్ శాఖా గ్రంథాలయంలో నైపుణ్యం పోర్టల్‌కు రూపకల్పన చేశారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలను ప్రకటించారు. ఎలక్ట్రికల్, ఉడ్‌వర్క్, ఏసీ, ఆర్క్ వెల్డింగ్ 34 రంగాల్లో పరిశ్రమలకు తగ్గట్టుగా మంగళగిరి పరిసర ప్రాంత యువతీ, యువకులతో పాటు ఐటీఐ చదివిన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. నియోజకవర్గాన్ని దేశానికి రోల్ మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని మంత్రి లోకేశ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరిలోని మోడల్ లైబ్రరీలో నైపుణ్యం పోర్టల్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందనకు వందనం

తాడికొండ: తాడికొండ గ్రామ శివారు మార్కెట్ యార్డు వద్ద వ్యర్థాలు కుప్పలుగా చేరాయి. సమస్యను ఈవోపీఆర్డీ రమణ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి ఆ ప్రాంతాన్ని కార్మికులతో శుభ్రం చేయించారు. ● మోతడక గ్రామంలో ప్రధాన మురుగుకాలువ పూడిపోయింది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా మోతడక సర్పంచి యడ్లపల్లి పార్వతి దృష్టికి తీసుకువెళ్లగా.. స్పందించి జేసీబీ సాయంతో పూడిక తీయించారు. **– న్యూస్‌టుడే, తాడేపల్లి**

? ఉండవల్లి పోస్టాఫీస్ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా తయారైంది. **- పద్మజాకుమారి, ఉండవల్లి** ✔ రోడ్డును పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. – కమిషనర్, అలీం బాషా, మంగళగిరి నగరపాలక సంస్థ

'తెనాలి రోడ్డు విస్తరణ నిలిపివేయాలి'

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని తెనాలి రోడ్డు విస్తరణను మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ నిలుపుదల చేయాలని కోరుతూ ఆయా ప్రాంతవాసులు, చేనేత వస్త్ర వ్యాపారులు మిద్దెసెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. విస్తరణలో ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించకుండా మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు.

వానొస్తే మునక.. ఎన్నాళ్లీ కినుక..

లోలెవల్ చప్టాలతో ప్రజల ఇక్కట్లు

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే:

లోలెవల్ చప్టాలు, రైల్వే అండర్ పాసులు ప్రజలకు ఇక్కట్లు తెచ్చిపెడుతున్నాయి. వర్షం కురిస్తే ఆయా చోట్ల వరద నీరు భారీగా చేరి రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్య ఏళ్లుగా పట్టిపీడిస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

★ మేడికొండూరు యడ్లపాటి వెంకట్రావునగర్ కాలనీ, అదే గ్రామంలో హిందూ శ్మశాన వాటిక వద్ద, యలవర్తిపాడు, విశదల అడ్డరోడ్డు, మందపాడు - సరిపూడి మధ్య, పొనుగుపాడు, నుదురుపాడు శివారు, బేతపూడి - గుండాలపాడు మధ్య, ఫిరంగిపురం - 113 తాళ్లూరు దారిలో లోలెవల్ చప్టాలు ఉన్నాయి. వీటిని దశాబ్దాల కిందట నిర్మించారు. కాలక్రమేణా చుట్టు పక్కల రోడ్లు ఎత్తు పెరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా చప్టాలను ఆధునికీకరించలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా నిర్మాణాలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల కోతకు గురయ్యాయి.

మేడికొండూరు: యడ్లపాటి వెంకట్రావు నగర్‌లో పల్లంగా మారిన చప్టా

రైల్వే అండర్ పాస్‌ల వద్ద ఇంతే..

ఫిరంగిపురం ఆరోగ్యనగర్, నుదురుపాడు, వేమవరం అడ్డరోడ్డులో రైల్వే అండర్ పాస్‌లు ఉన్నాయి. అవి నిర్మించి 5 ఏళ్లు గడుస్తోంది. అక్కడ నీరు బయటకు పోయేందుకు పైపులు వసతి కల్పించలేదు. దీంతో అక్కడ వాన కురిసినప్పుడు వరద నీరు భారీగా చేరుతుంది. పంచాయతీ అధికారులు కలగజేసుకుని ఇంజిన్లు, మోటార్ల సాయంతో నీటిని బయటకు పంపుతుంటారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఫిరంగిపురం ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో శాంతకుమారి

తాడేపల్లి, న్యూస్‌టుడే: నిరంతరం తరగతి గదుల్లో విద్యార్థులకు పాఠాలు చెబుతూ ఉండే ఉపాధ్యాయులకు రెండురోజుల ఆటవిడుపు లభించింది. పెనుమాకలో మంగళవారం ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలు జరిగాయి. డిప్యూటీ డీఈవో శాంతకుమారి వీటిని ప్రారంభించారు. సుమారు 45 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలకు వెళ్లనున్నారు.

వేతనాలు పెంచాలని వినతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి పథకం క్షేత్ర సహాయకులకు వేతనాలు పెంచాలని కోరుతూ అసిస్టెంట్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యాన తాడేపల్లిలోని గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా వేతనాలు పెరగకపోవడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నాయని వివరించారు. ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరందామయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నిరసన తెలుపుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే 'చలో అసెంబ్లీ' నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళగిరిలోని చేనేత జౌళిశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలుచేయాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176కోట్లు బకాయిలు విడుదల చేయాలని, సొసైటీ వద్ద ఆప్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు కాకి మల్లికార్జునరావు, గోలి దుర్గాప్రసాద్, తిరువీదుల హేమ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

సమావేశంలో నందం అబద్ధయ్య, తెదేపా నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య కోరారు. మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో పట్టణ, వార్డు కమిటీ నాయకులతో నిర్వహించిన సమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరలో జరిగిన అభివృద్ధి పనులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమావేశంలో చర్చించారు. మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, వాటిని ప్రజలకు వివరించాలని సూచించారు. తిరివీధి పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మున్నంగి శివశేషగిరిరావు, ఎండీ ఇబ్రహీం, విన్నకోట శ్రీనివాసరావు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత భూ సమీకరణపై హర్షం

తాడికొండ: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై జీవో విడుదల చేయడం హర్షణీయమని అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా ఏడు గ్రామాల పరిధిలో 16,666.57 ఎకరాల భూ సమీకరణకు సీఆర్డీఏ అనుమతించిన ప్రతిపాదనపై ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఇది ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ ఖాళీలివే..

దుగ్గిరాల, న్యూస్‌టుడే: పెదపాలెం హైస్కూలులో స్కూల్ అసిస్టెంట్(బయోలాజికల్ సైన్స్), పెదపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో ఎస్జీటీ(తెలుగు) అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో కాజ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 5వ తేదీలోపు ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.12500, ఎస్జీటీ పోస్టుకు రూ. 10 వేల వేతనంగా ఇస్తారన్నారు. ఎంపికైన వారు 7వ తేదీ నుంచి విధులు నిర్వహించాలన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

విద్యార్థితో ఉపాధ్యాయులు

తాడికొండ, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటి తమ పాఠశాల విద్యార్థి డీకే కృష్ణమణికంఠ బాబు జాతీయస్థాయికి ఎంపికైనట్లు తాడికొండలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ చట్టపల్లి ప్రియాంక తెలిపారు. త్వరలో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు విద్యార్థిని అభినందించారు.

పని ప్రదేశంలో ప్రమాణాలు తప్పనిసరి

పరికరాల పనితీరును కార్మికులకు వివరిస్తున్న నిపుణులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో శాశ్వత సచివాలయ ఐకానిక్ టవర్స్ 1,2 ప్రాజెక్ట్ నిర్మాణ పనుల వద్ద మంగళవారం సీఆర్డీఏ ఆధ్వర్యంలో కార్మికులకు భద్రతా చర్యలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. భవన నిర్మాణాల్లో అత్యంత ఎత్తైన ప్రాంతంలో పని చేసే సమయంలో కార్మికులు పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై నిపుణులు కార్మికులకు శిక్షణ ఇచ్చారు. కరం సేఫ్టీ సహకారంతో హెచ్‌వోడీ టవర్స్ 1,2 నిర్మాణాలను చేపట్టిన గుత్తేదారు సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీఆర్డీఏ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అనిత వాణి, సీనియర్ ఓహెచ్ఎస్ అధికారి గుడివాడ గోపీ కృష్ణ, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇనుప సామగ్రి చోరీపై కేసు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఈ-6, ఎన్-11 జంక్షన్ వద్ద ఆర్‌వీఆర్ సంస్థకు చెందిన ఇనుప వస్తువులను సోమవారం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై ఆ సంస్థ సబ్ కాంట్రాక్టర్ భూరీ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ శివ కేశవరావు మంగళవారం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. సుమారు 480 కిలోల ఇనుప సామగ్రి చోరీకి గురైనట్టు తెలిపారు.

స్వామిత్వ యాప్ ప్రయోజనకరం

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: స్వామిత్వ యాప్‌తో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్ అన్నారు. మల్లవరం, చల్లావారిపాలెంలో మంగళవారం ఆయన పర్యటించి.. పన్ను వసూలు ప్రక్రియ, వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలను పరిశీలించారు. సర్వేయర్ బాబురావు, ఈవో పీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యాదవ సామాజిక భవనానికి స్థలం కేటాయించండి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో యాదవ సామాజిక భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం కేటాయించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం మంగళవారం కోరింది. నవులూరులో సంఘం ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ యాదవ సామాజిక అవసరాల కోసం రూ.10 కోట్లు కేటాయించి నిర్మాణానికి స్థలం ఇవ్వాలని కోరారు. ఆ సంఘం అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కుర్రా శ్రీనివాస్ యాదవ్, మంగళగిరి యాదవ సేన అధ్యక్షుడు తోట శివరామ్‌ప్రసాద్ యాదవ్, కుర్రా పున్నారావు యాదవ్, రుద్రు వీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తేలి.. వెతలు తెచ్చి..

మండలంలోని సరిపూడి - సిరిపురం మధ్య దారి అధ్వానంగా మారింది. పలు చోట్ల కోతకు గురై కంకర రాళ్లు బయటకు వచ్చాయి. ఒక్కోచోట పూర్తిగా దెబ్బతింది. రాత్రిళ్లు గుంతలు కనిపించ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఒళ్లు హూనం కావడంతోపాటు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగు చేయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మేడికొండూరు**

గడ్డి మొలిచింది.. మురుగు నిలిచింది..

తాడికొండ గ్రామ శివారులో బీసీ కాలనీ ప్రధాన మురుగు కాలువలో పిచ్చి గడ్డి విపరీతంగా పెరిగిపోయింది. దీంతో దుర్వాసన వస్తూ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు దోమలు వృద్ధి చెంది తూట్లు పొడుస్తున్నాయని, చిన్నారులు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా గడ్డి తొలగించి మురుగు పారేలా చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడికొండ**

బస్సు వచ్చేదాకా నిలబడాల్సిందే..!

పేరేచర్ల కూడలిలో ప్రయాణికుల ప్రాంగణం (బస్టాండ్) లేదు. ప్రతి రోజూ కూడలి నుంచి వందల మంది గుంటూరు, నరసరావుపేట, సత్తెనపల్లి వంటి దూర ప్రాంతం వెళ్లి వస్తుంటారు. బస్సు కోసం నిలబడాల్సి వస్తోంది. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, ఉద్యోగులు, విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి షెల్టర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మేడికొండూరు**

పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

మంగళగిరి, న్యూస్‌టుడే: మండలంలో ఇళ్లులేని నిరుపేదలకు రెండు సెంట్లు నివేశన స్థలాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు కోరారు. మండలంలోని కాజ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ పాలేటి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లంక భూములు సాగు చేసే పేదలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు. మంగళగిరి కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. అనంతరం ఆ సంఘం కాజ ఏరియా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ● నెల్లూరులో సీపీఎం నాయకుడు, ప్రజా కళాకారుడు పెంచలయ్య హత్యను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం ఆ పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు.

'రైతులను ముంచిన వ్యాపారి ఆస్తులు జప్తు చేయాలి'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పది గ్రామాలకు చెందిన అమాయక రైతులకు వడ్డీ ఆశచూపి వ్యాపారి అన్నపురెడ్డి నాగిరెడ్డి రూ. 40 కోట్లు ఎగనామం పెట్టారని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. గుంటూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం బాధిత రైతులతో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. తిరుమల ఎంటర్‌ప్రైజెస్ యజమాని నాగిరెడ్డి 2021 నుంచి 200 మంది రైతులను నిట్టనిలువునా ముంచారని, అతడికి అప్పటి ప్రభుత్వం అండగా ఉండటంతో బాధితులకు న్యాయం జరగలేదన్నారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిడితో ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వినుకొండలో నాగిరెడ్డి కుటుంబానికి ఉన్న ఆస్తులను జప్తు చేసి బాధిత రైతులను ఆదుకోవాలన్నారు. న్యాయం జరిగేంత వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

పెదనందిపాడు : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన పారిశ్రామికవేత్త శేషగిరిరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుట్టుశిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. శేషగిరిరావు మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త రమేష్ బాబు, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవాల నిర్వహణకు సన్నాహాలు

మాట్లాడుతున్న రామారావు, పక్కన కేఎస్ లక్ష్మణరావు తదితరులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడులో డిసెంబర్ 30న బాలోత్సవాలు జరిపేందుకు మంగళవారం స్థానిక తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదనందిపాడు, కాకుమాను మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ ఉత్సవాల్లో చిత్రలేఖనం, తెలుగు పద్యాలు, వ్యాసరచన, బృందగానం, నృత్యం, కోలాటం, మట్టితో బొమ్మలు తయారు చేయడం, ఫ్యాన్సీ డ్రస్, ఏకపాత్రాభినయం, ఇంకా ఇతర పోటీలు ఉంటాయన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పి.రామారావు, ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు సుభాని సాహెబ్, కె. వెంకట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. ◆ బాలోత్సవాల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా దాసరి శేషగిరిరావు, కన్వీనర్‌గా ఎం. జవహర్‌రాణి, కోకన్వీనర్‌గా డి. రమేష్‌బాబు, మరో పది మందిని సభ్యులుగా నియమించారు.

చికిత్స పొందుతూ వైద్యురాలి మృతి

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఓ వైద్యురాలు విజయవాడ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కొలనుకొండ వద్ద ఓ బహుళ అంతస్తుల భవనంలో నివాసం ఉండే వేదశ్రీ (27) మత్తు బిళ్లలు తీసుకోవడంతో అస్వస్థతకు గురి అయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. తల్లి త్రివేణి ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదైంది.

కాల్‌మనీ వేధింపుల నుంచి కాపాడండి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: చిరు ఉద్యోగులకు అప్పులు ఇచ్చి అధిక వడ్డీలతో వేధిస్తున్న కాల్‌మనీ వ్యాపారులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. నియోజకవర్గం పరిధిలోని చిరుద్యోగులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వడ్డీ వ్యాపారుల నుంచి కాపాడాలని ఫిర్యాదు చేశారు. గుంటూరు నగరానికి చెందిన కొండమడుగుల రత్నారెడ్డి, ముప్పాళ్ల నాగరాజా కాల్‌మనీ వ్యాపారం చేస్తూ చిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రుణగ్రహీతల నుంచి ఖాళీ చెక్కులు తీసుకుని వేధింపులకు పాల్పడుతున్నారని, వీరిపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరతామని ఎమ్మెల్యే చెప్పారు.

వెలివేశారంటూ ఫిర్యాదు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల శివారు గ్రామం దేవరపల్లి అగ్రహారంలో తమ సామాజిక వర్గానికే చెందిన సంఘ పెద్దలు తమను వెలివేశారంటూ ఆ గ్రామ ప్రజలు కొందరు మంగళవారం తహసీల్దార్ సునీతకు అర్జీ ఇచ్చారు. వాగోలు బాపయ్య, కర్రె సుచరిత, సత్యవతి, పాముల ఎలిజబెత్ తదితరులు మాట్లాడుతూ తాము దాదాపు 8 ఏళ్లుగా ఈ విషయమై పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. ఈ వ్యవహారంలో గ్రామంలోని రెండు వర్గాలపైనా కేసులున్నాయి.

బాధితులకు మంత్రి లోకేశ్ భరోసా



పెదవడ్లపూడిలో చెక్కు అందజేస్తున్న కిరణ్‌చంద్, నాయకులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు తెదేపా నాయకులు మంగళవారం అందజేశారు. 8వ వార్డుకు చెందిన జక్కుల ప్రమీళ రూ. 42,646, 14వ వార్డుకు చెందిన గొజ్జర్లపూడి సదానందం రూ. 30,121, 15వ వార్డుకు చెందిన గడ్డం వెంకటేశ్వర్లు రూ. 25,541, షేక్ హసీనాకు రూ. 20,541 చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ నాగేశ్వరరావు, నాయకులు కొప్రపాటి రమణ, బోదాల రవికుమార్, బెజ్జం బాబురావు, బెజ్జం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి, న్యూస్‌టుడే: పెదవడ్లపూడికి చెందిన దాసరి ఫణి సుమంత్ కార్తీక్ చైతన్యకు మంజూరైన రూ. 40 వేలు విలువైన చెక్కును మార్కెట్‌యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మంగళవారం అందజేశారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్మీ కెప్టెన్‌కు నివాళి

నివాళుర్పిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది

గొరిజవోలుగుంటపాలెం (పెదనందిపాడు), న్యూస్‌టుడే: గొరిజవోలుగుంటపాలెంలో ఆర్మీ విశ్రాంత కెప్టెన్ వై.నరసింహారెడ్డి సోమవారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం గ్రామస్థులు, బంధువుల సమక్షంలో జరిగాయి. ఆయన పార్థివదేహంపై జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది రాజేష్‌కుమార్, సుబ్రహ్మణ్యం, మాజీ సైనికులు, బ్రహ్మారెడ్డి, ప్రతాప్‌కుమార్‌లు జాతీయ జెండా కప్పి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న సౌమ్య రెడ్డి, వేదికపై నాయకులు

కాకుమాను (ప్రత్తిపాడు) న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకురాలు సౌమ్య రెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యకర్తల నిర్ణయం మేరకు జిల్లా అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు. పార్టీని అన్ని స్థాయిల్లో పటిష్ఠపరిచేందుకు సంఘటన్ శ్రీజన్ అభియాన్ పేరుతో జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేస్తుందన్నారు. అనంతరం నాయకత్వ ఎంపికపై అభిప్రాయాలు సేకరించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయకుమార్, నియోజకవర్గ సమన్వయకర్త వినయ్‌కుమార్, రాష్ట్ర పరిశీలకులు ఉమా శంకర్, ఊడా మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభంలోకి వ్యవసాయ రంగం'

మాట్లాడుతున్న అజయ్‌కుమార్

తాడేపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళుతున్న తరుణంలో రైతులను, భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కుంచనపల్లిలో రైతు సంఘం తాడేపల్లి మండల మూడో మహాసభ మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రైతుల నుంచి మరోసారి ప్రభుత్వం భూ సమీకరణకు ముందుకొస్తుందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో వ్యవసాయ భూములు తగ్గి ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. జనవరి 29,30,31, ఫిబ్రవరి ఒకటో తేదీన గుంటూరులో ఆలిండియా కిసాన్ సభ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తాడేపల్లి మండల రైతు సంఘానికి కార్యదర్శులుగా మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాజ వెంకటేశ్వరరావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది.

గంజాయి తాగుతున్న ఏడుగురి అరెస్టు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: మిర్చి యార్డు సమీపంలో గంజాయి తాగుతున్న యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను సీఐ వంశీధర్ వెల్లడించారు. మిర్చి యార్డు సమీపంలో యువకులు గుంపులుగా చేరి గంజాయి తాగుతున్నారని సమాచారం అందటంతో తమ సిబ్బంది దాడి చేశారన్నారు. 7 గురు యువకులు గంజాయి తాగుతుండగా అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. యువకులకు గంజాయి విక్రయించిన ముప్పిరి సుబ్బారావు, వేముల యోహాన్‌లు పరారీలో ఉన్నారని వీరిని త్వరలో పట్టుకుంటామన్నారు.

కారు ఢీకొని ఏఎన్ఎంకు తీవ్ర గాయాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: దొండపాడు నుంచి అనంతవరం వెళ్లే మార్గంలో ఎన్-17 రహదారిపై మంగవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతవరంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్యామల మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని స్కూటీపై దొండపాడు వైపు వస్తున్నారు. అదే సమయంలో వడ్డమాను నుంచి వస్తున్న లోకేష్ రెడ్డికి చెందిన కారు అతివేగంగా వస్తూ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె తీవ్ర గాయాలు అయ్యాయి.

(c) eenadu

గుంటూరు తూర్పు

సాంకేతిక పరిజ్ఞానం సక్రమంగా వినియోగించుకోవాలి

ఎన్జీఓకాలనీ: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాలని కేవీపీ శాల కార్యదర్శి డాక్టర్ కె.శ్యాంప్రసాద్ అన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేవీపీ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబొరేటరీ, జాతీయ కాలుష్య దినోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రత్తయ్య మాట్లాడుతూ పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అకడమిక్ సమన్వయకర్త శైలజ మాట్లాడుతూ జల, వాయు, భూకాలుష్యాలను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 37, వంగ 24, బెండ 44, పచ్చిమిర్చి 38, కాకర 36, క్యారెట్ 44, క్యాబేజీ 26, బీర 30, దొండ 29, బంగాళా దుంప 30, ఉల్లిపాయలు 17, గోరుచిక్కుళ్లు 44, బీట్‌రూట్ 35, కీర 30, క్యాప్సికం 69, అల్లం 80, దోస 25, పొట్ల 39, చామ దుంప 23, మునగ 10, గోంగూర 12, తోటకూర 15, చుక్కకూర 14, కొత్తిమీర 25, ప్రెంచి బీన్స్ 54, సొర 13, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

● వెంకట్రావుపేట మూడోలైన్ మురుగుకాలువలో పూడికలు చేరడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలవ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు హరిబాబు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో పూడిక తీయించారు. ● జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రధానరోడ్డులో చెత్తకుప్పలు రోజులుగా అలాగే ఉండటం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు వలి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త కుప్పలు తీయించి తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, ప్రసాద్‌బాబు, మారియదాసు, చైతన్య, చిన్న

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని ఖాతాదారులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ నగర గౌరవ అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలోని కార్యాలయంలో మాట్లాడారు. మరణించిన 142 బాధిత కుటుంబాలకు గత తెదేపా ప్రభుత్వంలో రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం, రూ. 250 కోట్ల కార్పస్‌ఫండ్ ఇవ్వాలని తెలిపారు. ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్ర నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రసాద్‌బాబు, మారియదాసు, చైతన్య, చిన్న పాల్గొన్నారు.

భూసమస్యలుంటే నేరుగా రండి

'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో తహసీల్దారు మహబూబ్ సుబానీ

న్యూస్‌టుడే – పట్నంబజారు

భూముల సర్వే నంబర్లు.. రేషన్ కార్డుల్లో సమస్యలు... ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులను ప్రజలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తూర్పు విభాగపు తహసీల్దారు మహబూబ్ సుబానీ సూచించారు. మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ప్రజలడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. భూముల సర్వే నంబర్లు మారాయని, వీటివల్ల బ్యాంకులు రుణాలివ్వడం లేదని పలువురు రైతులు తెలిపారు. రేషన్‌కార్డుల్లో సమస్యలను డిప్యూటీ తహసీల్దారు రమాదేవి, ఆర్ఐ కరీముల్లా, మండల సర్వేయర్ రామాంజనేయులు, వీఆర్వోలు నల్లబోతుల నరసింహారావు, మేరుగ కోటేశ్వరరావు, సీహెచ్‌రామారావు, ప్రసన్న, ఆయూబ్ పరిష్కరించారు.

రేషన్ కార్డుల సమస్యలపై...

? రెండేళ్ల కిందట కార్డు తొలగించారు. మా కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతని కుటుంబం చెన్నైలో ఉంటోంది. నా భార్య పేరుతో కార్డు కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. **- శ్రీనివాస్, పాత గుంటూరు**

✔ ఈకేవైసీ చేయించుకున్నాక కార్డులోంచి మ్యాపింగ్ ద్వారా మీ కుమారుడి పేరు తీసేసి మీ దంపతుల పేరుతో కొత్తది పొందొచ్చు.

? రెండు నెలల కిందట మా రేషన్‌కార్డు తొలగించారు. అధికారులు సరైన సమాధానం చెప్పటం లేదు. **- శివకుమార్, నందివెలుగురోడ్డు**

✔ నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా, ఆస్తి వెయ్యి చదరపు అడుగులు (100 గజాలు దాటినా) దాటి ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా కార్డు రాదు. మాగాణి మూడెకరాలు, మెట్ట ఏడెకరాలు మొత్తం కలిపి 10 ఎకరాలు మించి ఉన్నా రాదు. విద్యుత్తు బిల్లు 300 యూనిట్లు దాటి ఉండరాదు. ఆదాయపుపన్ను శాఖకు రిటర్న్స్ దాఖలు చేసి ఉండకూడదు.

? రెండేళ్ల నుంచి ఐటీ రిటర్న్స్ దాఖలు చేయడం లేదు. కొత్తగా రేషన్‌కార్డుకు దరఖాస్తు చేయొచ్చా? **- ప్రకాష్, గుంటూరు**

✔ ఐటీశాఖ నుంచి ధ్రువీకరణ పత్రం తెచ్చి తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించండి.

ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం

? కులధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రీను, సుద్దపల్లి డొంకరోడ్డు**

✔ సమస్యలుంటే నేరుగా తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించొచ్చు.

? ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఎవరికి వర్తిస్తుంది? ఎలా పొందాలి. **- అంకమ్మరావు, బస్టాండు సెంటర్**

✔ ఓసీ కేటగిరీలోని వారు మీ-సేవా కేంద్రంలోగానీ, సచివాలయంలోని డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద దరఖాస్తు ఇవ్వాలి. వంద గజాలకుపై స్థలం ఉన్నా.. వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు ఉన్నా, ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా అనర్హులవుతారు.

పట్టాదారు పాసుపుస్తకం రాలేదు..

? జొన్నలగడ్డలో భూముల రీసర్వే అనంతరం పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసినా రాలేదు. **- నాగరాజు, జొన్నలగడ్డ**

✔ త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటాం

? గతేడాది నుంచి అన్నదాత సుఖీభవ, కిసాన్ పథకాలు నిలిపేశారు. అధికారులను అడిగితే ఈకేవైసీ చేయించుకోవాలంటున్నారు. **- ఎం.లీలావతి, బుడంపాడు**

✔ బుడంపాడులోని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ (వీఏఏ) ఈకేవైసీ చేస్తారు. వీఆర్వోను కలిసి ఆ ప్రక్రియ పూర్తి చేసి పథకాలు పొందొచ్చు.

? నందివెలుగురోడ్డులోని భూముల సర్వే నంబర్లను గతంలో అధికారులు ఇతరులకు కేటాయించారు. అడంగల్, ఆర్‌ఓఆర్‌లో వేరే సర్వే నంబర్లు వస్తున్నాయి. **- వాసు, పాత గుంటూరు**

✔ మీ భూముల వివరాలను తహసీల్దారు కార్యాలయానికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలి.

? మా భూముల సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో అడంగల్‌లో కనిపించడం లేదు. అధికారులు డిజిటల్ సిగ్నేచర్ పెండింగ్‌లో ఉందంటున్నారు. **- ఎన్.సురేష్, బుడంపాడు**

✔ వివరాలతో తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించండి.

? మాకు 3.57 ఎకరాల భూమి ఉంది. రికార్డుల్లో 3 ఎకరాలుగానే నమోదైంది. మిగిలింది శ్రీదేవి అనే పేరుతో కనిపిస్తోంది. **- కె.అరుణ్‌కుమార్, బుడంపాడు**

✔ వివరాలు పరిశీలించి మీకు న్యాయం జరిగేలా చూస్తాం.

? 1బి, అడంగల్ ఎక్కడ తీసుకోవాలి. **- సుబ్బారావు, పొటుకూరురోడ్డు**

✔ మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో పొందొచ్చు.

భృంగివాహనంపై ఊరేగిన ఉమామహేశ్వరుడు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖకు చెందిన కొత్తపేట శివాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అర్చకులు వేణుగోపాల్ బృందం స్వామికి అభిషేకాలు, పూజలు, కుంకుమ పూజ చేసింది. రాత్రి భృంగి వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈవో వీరారెడ్డి, పాలకమండలి ఛైర్మన్ శేషతల్ప సాయి, సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కృష్ణమహల్ రోడ్డులోని ఓ హోటల్‌లో క్యాటరింగ్ పనులు చేసే షరీఫ్ అనే వ్యక్తి మంగళవారం లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వీరయ్య చౌదరి ఘటనాస్థలిని పరిశీలించారు. మృతుడికి శానిటైజర్ తాగే అలవాటు ఉన్నట్లు గుర్తించారు.

షరా మామూలే... అవస్థలు తప్పవాయె

ఇరుకు దారిలో ముందుకు వెళ్లలేక...

పట్నంబజారు, న్యూస్‌టుడే: వ్యాపార సముదాయాలకు కేంద్ర బిందువైన పట్నంబజారు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు.. ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడం, నిషేధ సమయాల్లో లారీల రాకపోకలతో పట్నంబజారు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పరిష్కారానికి పోలీసులు పలు చర్యలు తీసుకుంటున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. పూలమార్కెట్ సెంటర్లో ట్రాఫిక్ పోలీసులున్నప్పుడు ఇబ్బందులు ఉండటం లేదు. వారు వెళ్లిపోయాక పరిస్థితి మొదటికొస్తోంది. పట్నంబజారు, ఏటుకూరుబజారు, బండ్లబజారు పరిసర ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి ఇటీవల పూలమార్కెట్ సెంటర్లో మైక్ సెట్ ఏర్పాటు చేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. కొందరు వ్యాపారులు తమ దుకాణాల ఎదుట లారీలను నిలిపి.. సరకు ఎగుమతులు, దిగుమతులు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య పెరగడానికి ఇదే కారణం. ఇలాంటివారిపై ఇటీవల ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. నిత్యం సాయంత్రం వేళల్లో మినీ లారీలు, ఆటోలను పట్నంబజారులోని దుకాణాల ఎదుట నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని పలువురు చెబుతున్నారు.

యువకుడి అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: శ్రీరామ్‌నగర్‌కు చెందిన దినేష్ రెడ్డి అనే యువకుడు ఈ నెల 1 నుంచి కనిపించడం లేదని మంగళవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ వెల్‌కమ్ హోటల్ ఎదురుగా, జీటీ రోడ్డు చుట్టుగుంట వద్ద ఆయన విగ్రహం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ భాజపా నాయకులు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశానికి విశేష సేవలందించిన మహోన్నత వ్యక్తి వాజ్‌పేయీ అన్నారు. దర్శనపు శ్రీనివాస్, టి.రామకృష్ణ, వి.గంగాధర్, నేరేళ్ల మాధవరావు తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెరుకూరి తిరుపతిరావు, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న లలిత, మంజుల, సరోజ

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అందివ్వాలని ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. మంగళవారం అమరావతిరోడ్డులోని స్త్రీ, శిశు సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలపై పని ఒత్తిడి తగ్గించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, మినీ టీచర్లను ప్రధాన టీచర్లుగా చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మంజుల, ఉపాధ్యక్షులు సరోజ, విజయం, చౌడేశ్వరి, కాంతమ్మ, జులేఖ, తారాదేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ సుబానీ

ప్రతిభ చాటారు.. ప్రశంసలు పొందారు..

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: కొత్తపేటలోని నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు షేక్ గుల్జార్ తస్నీమ్ (7వ తరగతి), షరన్ ఆష్రిన్ ఖాన్ (8వ తరగతి), వి.తారక్ సాయితేజ (9వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌కే.ఎం.సుబానీ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

పట్టాభిపురం: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టి అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. జేకేసీ కళాశాల రోడ్డుకు చెందిన ఓ మహిళ ఫొటోలు గుర్తు తెలియని ఓ వ్యక్తి మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నాడు. ఫేస్‌బుక్‌లో ఇది గమనించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుకు భంగం కలిగించిన ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

బస్ షెల్టర్లు ఎందుకున్నట్లో?

షెల్టర్లు ఉండీ ఉపయోగం లేకుండాపోతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రయాణికులు సిటీ బస్సుల కోసం ఇక్కడి బస్సు షెల్టర్లలో వేచి ఉండేందుకు అధికారులు షెల్టర్లు నిర్మించారు. వీటిపై పర్యవేక్షణ లేక మందుబాబులు వాటిని ఆక్రమించుకుంటున్నారు. మరికొన్ని షెల్టర్ల ఎదురుగా జీపులు, కార్లు నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్సుల రాక కోసం రోడ్ల పక్కన నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది

.- న్యూస్‌టుడే, పట్నంబజారు

బస్టాండు సెంటర్లో బస్సు షెల్టర్ ఎదురుగా జీపులు, కార్లు

విజయవాడ రోడ్డులోని షెల్టర్‌లో మందుబాబు

ఆక్రమణల్లో కాలిబాటలు

నగర ప్రధాన రహదారుల్లోని కాలిబాటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రైతుబజారు సెంటర్లోని కాలిబాటలపై కొంతమంది పూలు, ఇతర వస్తువులు ఉంచుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

అడ్డంగా వేస్తే వెళ్లేదెలా?

రైలుపేట నుంచి జీజీహెచ్‌కు వెళ్లే రహదారిలో కంకర రాళ్లు, ఇటుక, ఇనుప సామగ్రిని రోడ్డుపై అడ్డంగా వేయడంతో ఇబ్బందిగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. గుట్టగా పోసిన కంకర రాళ్లు రహదారి మధ్యలోకి రావడంతో వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. పాదచారులకు కంకర రాళ్లు గుచ్చుకుంటున్నాయని వాపోతున్నారు

- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు

కాలుష్యాన్ని తగ్గించడం అందరి బాధ్యత

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గాలి, నీరు, నేల కాలుష్యాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ పీసీబీ జిల్లా పర్యావరణ ఇంజినీర్ నజీనాబేగం సూచించారు. జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవం సందర్భంగా భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ పాఠశాలలో వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నజీనా బేగం మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించడం కేవలం ప్రభుత్వం, పరిశ్రమల పని మాత్రమే కాదని, ప్రతి వ్యక్తి కుటుంబం, విద్యార్థి, ఉపాధ్యాయులు సమష్టిగా బాధ్యత వహించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

భద్రత విధానాలు తెలుసుకోండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులపై ప్రతి విద్యార్థిని అవగాహనతో ఉండాలని డాక్టర్ శనక్కాయల రాజకుమారి సూచించారు. మంగళవారం అభ్యుదయ మహిళ డిగ్రీ కళాశాలలో మహిళలపై వేధింపుల నిరోధక కమిటీ 'ఎఫ్‌వోజీఎస్ఐ' అవగాహన కార్యక్రమం నిర్వహించింది. డాక్టర్ రాజకుమారి మహిళల భద్రతకు అనుసరించాల్సిన విధానాలు వివరించారు. న్యాయవాది సరిత మాట్లాడుతూ మహిళా శిశుసంక్షేమ విభాగం అందించే సేవలు వివరించారు. సమస్యలుంటే సంబంధిత అధికారులను ఎలా సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి. రోహిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ శనక్కాయల రాజకుమారికి మొక్క అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ రోహిణి

దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పన

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చాక దళితవాడల్లో సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. మంగళవారం 53వ డివిజన్ సంజీవయ్యనగర్, వెంగళరావునగర్, వసంతరాయపురం ప్రాంతాల్లో రూ.2.15 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, పైపులైను నిర్మాణ పనులకు మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే తూర్పులో రూ.26 కోట్లతో సీసీ రహదార్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో తూర్పు నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలవైపు కన్నెత్తి కూడా చూడలేదని, కొన్ని ప్రాంతాలకు నడకదారి కూడా వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు వేగవంతం చేశామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, గోళ్ల ప్రభాకర్, మహంకాళి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, డిప్యూటీ మేయర్ సజీల

ఇతరుల పేరుపై దేవస్థానం భూమి

పట్నంబజారు, న్యూస్‌టుడే: సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వర దేవస్థానానికి చెందిన గోరంట్లలోని 19.60 ఎకరాల భూమికి సంబంధించి ఏడుగురి పేర్లు నమోదై ఉన్నాయని మంగళవారం దేవాదాయశాఖ అధికారులు తూర్పు విభాగపు తహసీల్దారు మహబూబ్ సుబానీని కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డులు సహా భూమిని పరిశీలించాలని వారు కోరారు.

విజేతలకు పతకాలు అందజేసిన గోనుగుంట్ల కోటేశ్వరరావు

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండ

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు ఆయనతో పాటు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు దుర్గాబాయి, శాప్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా క్రీడాధికారి అఫ్రోజ్‌ఖాన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రామస్వామి పతకాలు, బహుమతులు అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొదటిసారిగా విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించిందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 72 మంది హాజరయ్యారన్నారు. పారా క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందజేస్తుందన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాకు కృషి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల్య వివాహ ముక్తభారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్, సిబ్బంది మంగళవారం తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్, మాధవిలను కలిశారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ పత్రాలపై వారి సంతకాలు తీసుకున్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చటానికి తమ సంపూర్ణ మద్దుతు, సహకారాన్ని అందజేస్తామని తెలిపారు.

బాల్యం, న్యాయం పుస్తకాన్ని ఎమ్మెల్యే నసీర్‌కు అందిస్తున్న కోలా సమీర్‌కుమార్

10న మార్కెట్‌యార్డుల వద్ద నిరసన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైతుల సమస్యలపై ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డుల వద్ద నిరసన తెలుపుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కొత్తపేటలోని కార్యాలయంలో మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 18న భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ, సీపీఐ జిల్లా కార్యదర్శి మాల్యాద్రి, సహాయ కార్యదర్శి హనుమంతరావు, నగర కార్యదర్శి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అజయ్‌కుమార్, నాసర్‌జీ, మాల్యాద్రి, హనుమంతురావు, అరుణ్‌కుమార్

భజన మందిరాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భజన మందిరాల ఏర్పాటుకు స్థల దాతల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ గ్రంథి మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భజన మందిరాల ఏర్పాటుకు తితిదే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు సమకూరుస్తామన్నారు. స్థల లభ్యత, పరిస్థితుల ఆధారంగా భజన మందిరాలను మూడు రకాలుగా విభజించినట్లు తెలిపారు. ఐదు సెంట్లలోపు స్థలానికి రూ. 10 లక్షలు, ఐదు సెంట్ల నుంచి 8 సెంట్ల స్థలానికి రూ. 15 లక్షలు, 8 నుంచి 10 సెంట్లకు రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈ నెల 15లోగా గుంటూరు నాజ్‌కూడలిలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో అందివ్వాలని కోరారు.

డ్వాక్రా కార్యకలాపాలపై సమీక్ష

అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ షేక్ సజీల

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిప్యూటీ మేయర్ షేక్ సజీల అన్నారు. కింగ్స్ హోటల్ సెంటర్లోని తన కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా మహిళా గ్రూపుల పీవో సింహాచలం, సీఎంఎం పావనిలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు, బ్యాంకుల లావాదేవీలు, రుణాల వ్యవహారాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఆంధ్ర ముస్లిం కళాశాలలో జాబ్‌మేళా నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఆంధ్ర ముస్లిం కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. మంగళవారం ఆయన ఏర్పాట్లు పరిశీలించారు. స్కిల్, కమ్యూనికేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో 900 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారని తెలిపారు. రూ.10 వేల నుంచి రూ.30 వేల వేతనంతో ఉద్యోగావకాశాలు ఇచ్చేందుకు అనేక కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని తెలిపారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రహదారుల విస్తరణ

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రహదారుల విస్తరణ, ప్రత్యామ్నాయ రహదార్ల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర సూచించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాకాని రోడ్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లేలా రిలయన్స్ బంక్ దగ్గర నుంచి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కేంద్రాల్లో నాణ్యతతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఫీడ్ తప్పనిసరిగా కమాండ్ కంట్రోల్ రూంకు అందించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీఎంసీ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ బి.శ్రీనివాసరావు, సీఐ అశోక్‌కుమార్, జీఎంసీ సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, వివిధ మీడియాబోర్డుల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, చిత్రంలో కమిషనర్ శ్రీనివాసులు

ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పెయర్స్ అసోసియేషన్

పెన్షనర్స్ హోమ్, తాలూకా ఆఫీస్ కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.

ది: 14-12-2025, ఆదివారం నాడు ఉదయం: 10గం॥లకు సర్వసభ్య సమావేశము జరుపబడుతున్నది. ఈ సమావేశములో నూతన పాలకవర్గము ఎన్నిక జరుపబడుతున్నది. కావున సభ్యులు అందరు పైన తెలిపిన అడ్రస్‌కు హాజరు కావలసినదిగా కోరుతున్నాము.

ఇట్లు: మీ – ఓరుగంటి నారాయణరెడ్డి, ప్రెసిడెంట్.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

చరవాణి.. సద్వినియోగంతో లాభాలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: అమరావతి రోడ్డు భారత్‌పేటలోని నారాయణ ఆంగ్ల మాధ్యమ స్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాల్లో చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చరవాణిని సక్రమంగా వినియోగిస్తే లాభాలున్నాయని, దుర్వినియోగం చేస్తే నష్టపోతారని వివరించారు. బి.యోషిత్ (8వ తరగతి), ఎ.నర్మద (9వ తరగతి), ఎ.శ్రీనిధి (9వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎన్.ఎస్.ఎస్.రమ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు యామిని, లీషా తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఏవో శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రమ

ప్రతిభ చూపి.. బహుమతి సాధించి..

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: చంద్రమౌళినగర్‌లోని భాష్యం ఐఐటీ, జేఈఈ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ)తో భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో వై.చైత్రసాయి రెడ్డి ప్రథమ, ఎం.చంద్రభానుశ్రీ ద్వితీయ, పి.తాన్వీ తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ బి.హరిబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అధ్యాపకులు జి.శివలింగ, జయ, రాజు పాల్గొన్నారు.

విజేతలతో ప్రిన్సిపల్ హరిబాబు

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిత్యవసర ధరలు(కిలో రూ.ల్లో): టమాట 39, వంగ 38, బెండ 44, పచ్చిమిర్చి 39, కాకర 38, బీర 45, క్యాలీఫ్లవర్ 26, క్యాబేజీ 29, క్యారెట్ 56, దొండ 27, బంగాళదుంప 29, ఉల్లిపాయలు 23, గోరుచిక్కుడు 44, దోస 28, సొర 20, పొట్ల 32, అరటికాయ 10, పెద్దచిక్కుడు 120, చామదుంప 26, మునగ 10, బీట్‌రూట్ 42, కీరదోసకాయ 29, బీన్స్ 55, క్యాప్సికమ్ 74, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 80, అల్లం 80, వెల్లుల్లి 110. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

వైకల్యాన్ని ఎదిరించి.. క్రీడల్లో జయకేతనం

ఆదర్శంగా విభిన్న ప్రతిభావంతులు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే

చిన్నతనంలోనే పోలియో వచ్చిందని వారు కుంగిపోలేదు. కాళ్లు చచ్చుబడిపోయి నడవలేకపోతున్నామని బెంగపడలేదు. ఎవరిపైనా ఆధారపడలేదు. కష్టపడి చదివి చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూనే.. సమాజంలో గౌరవంగా బతకాలని, గుర్తింపు తెచ్చుకోవాలని భావించారు. మైదానంలోకి అడుగు పెట్టి.. ఆయా క్రీడల్లో రోజూ మూడు గంటలు చొప్పున సాధన చేశారు. ఇప్పుడు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. వారే గుంటూరుకు చెందిన విభిన్న ప్రతిభావంతులైన మురికిపూడి సురేంద్రబాబు, బండారు దుర్గారావు.

పేరు: మురికిపూడి సురేంద్రబాబు

నివాసం: ప్రగతినగర్
విద్య: పదో తరగతి
వృత్తి: డాక్యుమెంట్ రైటర్
ఆడే క్రీడలు: వీల్‌చైర్ బ్యాడ్మింటన్, క్రికెట్, సిట్టింగ్ వాలీబాల్, క్రికెట్, షాట్‌పుట్, డిస్కస్ త్రో..
ఎప్పటి నుంచి: మూడేళ్లుగా నిత్యం రెండు, మూడు గంటల పాటు గుంట మైదానంలో ప్రాక్టీస్..
సాధించిన విజయాలు: జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించి పతకాలు కైవసం చేసుకున్నారు. 2022లో సిట్టింగ్ వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నర్‌గా, 2024 చెన్నైలో జరిగిన సిట్టింగ్ క్రికెట్ పోటీల్లో రన్నర్‌గా, తాజాగా జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు. గతేడాది చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి సిట్టింగ్ క్రికెట్ పోటీల్లోనూ ఆడారు.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా.. వైకల్యం ఉందని ఏనాడూ అధైర్యపడలేదు. క్రీడల్లో రాణించి నిరూపించుకోవాలని ప్రాక్టీస్ చేస్తూ పోటీల్లో పాల్గొంటున్నా. ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. ఎవ్వరిపై ఆధారపడకూడదని డాక్యుమెంట్ రైటర్‌గా చేస్తూ నా కాళ్లపై నేను నిలబడేందుకు ప్రయత్నిస్తున్నా. క్రీడల్లో మరింతగా రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

పేరు: బండారు దుర్గారావు

నివాసం: కాకుమానువారితోట
విద్య: ఎంఏ, బీఈడీ
వృత్తి: ప్రభుత్వాసుపత్రిలో లిఫ్ట్ ఆపరేటర్
ఆడే క్రీడలు: వీల్‌చైర్ క్రికెట్, బ్యాడ్మింటన్, చెస్, సిట్టింగ్ క్రికెట్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో
ఎప్పటి నుంచి: నాలుగైదు ఏళ్లుగా నిత్యం మూడు గంటలు చొప్పున గుంట గ్రౌండ్‌లో ప్రాక్టీస్
సాధించిన విజయాలు: విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించే పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించారు. విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో రాణించి గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 2024 చెన్నైలో జరిగిన సిట్టింగ్ క్రికెట్ పోటీల్లో రన్నర్‌గా నిలిచారు. తాజాగా జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచారు.

సమాజంలో గౌరవంగా జీవించాలని .. వైకల్యం ఉందని ఏనాడూ బెంగపడలేదు. నా కాళ్లపై నేను నిలబడాలని కష్టపడి చదువుకున్నా. సమాజంలో గౌరవంగా జీవించాలన్న తపనతో ముందుకు సాగుతున్నా. అందుకు క్రీడల్ని ఎంచుకున్నా. భార్య ప్రసన్నకుమారి, రెండేళ్ల కుమారుడు కార్తిక్ ఉన్నారు.

భజన మందిరాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: భజన మందిరాల ఏర్పాటుకు స్థల దాతల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ గ్రంధి మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భజన మందిరాల ఏర్పాటుకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు సమకూరుస్తామన్నారు. స్థల అర్హత, పరిస్థితుల ఆధారంగా భజన మందిరాల మంజూరు విభజించినట్లు తెలిపారు. ఐదు సెంట్లలోపు స్థలానికి రూ. 10 లక్షలు, ఐదు సెంట్ల నుంచి 8 సెంట్ల స్థలానికి రూ. 15 లక్షలు, 8 నుంచి 10 సెంట్లకు రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులను ఈ నెల 15లోగా గుంటూరు నాజ్‌కూడలిలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో అందివ్వాలని కోరారు.

అవయవదానంపై అవగాహన అవసరం

రమణను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వం, పావులూరి రమేష్ తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: యువతలో అవయవదానంపై అవగాహన పెరగాలని సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ అన్నారు. మార్కెట్ కూడలిలోని హిందూ కళాశాలలో ఎకోక్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త నిర్వహణలో అవయవదానంపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. సూపరింటెండెంట్ రమణ మాట్లాడుతూ అవయవదానం ఎనిమిది మందికి ప్రాణం పోస్తుందన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను విడిచిపెట్టి అవయవదానానికి ముదుకు రావాలని, జీవనదాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని కార్డు పొందవచ్చని సూచించారు. సదస్సుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పావులూరి రమేష్ అధ్యక్షత వహించారు. సంస్థ ఆర్గాన్ డొనేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.కల్పన, క్లబ్ కన్వీనర్ జీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు: అంకమ్మనగర్ 3, 4 లైన్లలో రోడ్లపై చెత్తతో కూడిన వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి 84 సచివాలయ శానిటరీ కార్యదర్శి సుశీల, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి ట్రాక్టర్ సాయంతో వ్యర్థాలు తొలగింపజేశారు.

కాలువలో పూడికతీత: ఆదర్శనగర్‌లో రహదారి వెంబడి కాలువలో మురుగు ముందుకు కదలకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

నెహ్రూనగర్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని ఖాతాదారులు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ నగర గౌరవ అధ్యక్షుడు ఆకిటి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలోని కార్యాలయంలో మాట్లాడారు. మరణించిన 142 బాధిత కుటుంబాలకు గత తెదేపా ప్రభుత్వంలో రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం, రూ. 250 కోట్ల కార్పస్‌ఫండ్ ఇచ్చారని తెలిపారు. ఈ నెల 3న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్ర నిర్వహిస్తామన్నారు.

ప్రజావసరాలకు ఇసుక సరఫరా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరా జరిగేలా మైనింగ్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరాపై జిల్లాలో ఐవీఆర్ఎస్ ద్వారా నిర్వహిస్తున్న ప్రజల సంతృప్తి స్థాయి మరింత మెరుగుపర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి లింగాయపాలెం వరకు కృష్ణా నదిలో నావిగేషన్ ఛానల్-4లో ఇసుక తవ్వకాలకు ఎన్‌ఓసీ జారీ చేసిన నేపథ్యంలో మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల సామర్థ్యం మేరకు అనుమతించిన టన్నుల వరకే ఇసుకను సరఫరా చేసేలా వాహనాల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, మైనింగ్ జియాలజికల్ అధికారి చంద్రశేఖర్, భూగర్భ జలవనరుల శాఖ ఉపసంచాలకులు వందనం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమాబేగం, పంచాయతీ అధికారి సాయి కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సీతమ్మకాలనీకి దారేదీ?

స్థానిక వెంకటరమణకాలనీ, సీతమ్మకాలనీ ఎక్స్‌టెన్షన్ నుంచి నల్లపాడు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సీతమ్మకాలనీలోకి వెళ్లే రోడ్డులో అడ్డుగా భారీ పైపులు ఉంచడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ కాలువ అభివృద్ధి పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. వెంటనే అధికారులు స్పందించి సీతమ్మకాలనీలోకి వెళ్లే రోడ్డులో అడ్డంకులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

కాలనీలోకి ప్రవేశించే మార్గంలో అడ్డంగా పైపులు

చెత్త తరలింపు ఇలాగేనా..?

నగరం నుంచి చెత్త, ఇతర వ్యర్థాలు డంపింగ్ యార్డుకు తరలించే చెత్త వాహనాలను ఇష్టానుసారంగా తిప్పుతున్నారు. చెత్త, వ్యర్థాలు, చెట్ల కొమ్మలు వేసుకుని తరలించే క్రమంలో దానిపై నెట్ కప్పాలి. చాలా ట్రాక్టర్లు నెట్ లేకుండానే రాకపోకలు చేస్తున్నాయి. దీంతో చెత్త, వ్యర్థాలు రహదారులపై పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తరలించే క్రమంలోనే చెత్త, చెట్ల కొమ్మలు రహదారిపై పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్లపై ఎత్తుగా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, తప్పకుండా నెట్ కప్పి ఉంచేలా చూడాల్సి ఉంది. **-న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

మురుగు పారుదలకు అడ్డంకి

శ్రీనివాసరావుతోట 11వ లైన్ 60 అడుగుల రోడ్డులోని పేర్ల చావిడి వద్ద కొత్త ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో భవన నిర్మాణ సామగ్రి అయిన ఇసుక, కంకర కాలువపై పడేయడంతో నెలలుగా మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి కాలువలో అడ్డుగా ఉన్న నిర్మాణ సామగ్రి తొలగించి, మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు పశ్చిమ**

కాలువలపై గృహ నిర్మాణ సామగ్రి, ఇసుక

ఉంచుతారా.. తొలగిస్తారా..!

అన్నక్యాంటీన్‌ను పట్టించుకోని అధికారులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని గుజ్జనగుండ్ల పలకలూరు రోడ్డులోని అన్నక్యాంటీన్ భవనాన్ని కావాలనే నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక్కడ క్యాంటీన్ ఎదుట గోడకున్న గేటును తీసేసినా నగరపాలక సంస్థ అధికారులు పట్టనట్లు వ్యవహరించడమే దీనికి నిదర్శనం. దీంతో అన్నక్యాంటీన్‌ను పూర్తిగా తొలగించేస్తారేమోనని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అన్నక్యాంటీన్ ఎదుట గోడకు తొలగించిన గేటు

పేదవాడికి రూ.5కే కడుపు నింపే అన్నక్యాంటీన్‌లను గత వైకాపా ప్రభుత్వం మూసివేయించి వాటిని వేరే పనులకు వినియోగించుకుంది. కొన్నిచోట్ల పూర్తిగా వదిలేయడంతో ఆ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని తెరిపించి పూర్వవైభవం తెచ్చారు. పేదలు, కార్మికులు వీటిని పెద్దఎత్తున వినియోగించుకుంటున్నారు. నగరంలో ప్రస్తుతం 7 అన్నక్యాంటీన్లు ఉండగా.. వాటిలో ఒక్కోచోట నిత్యం వెయ్యి మందికి పైగా భోజనం చేస్తూ ఆకలి తీర్చుకుంటున్నారు.

* గుజ్జనగుండ్ల అన్నక్యాంటీన్‌ను మాత్రం అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఇక్కడ క్యాంటీన్ వెనుకగా ఉన్న జీఎంసీ స్థలంలో ఆలయ నిర్మాణం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అవసరాల కోసమే అన్నక్యాంటీన్‌ను తెరవనీయకుండా ఇక్కడ కొందరు అడ్డుకుంటున్నారన్న వాదన వినిపిస్తోంది. ఇక్కడ క్యాంటీన్ ఉన్న సమయంలో పెద్దఎత్తున పేదలు భోజనం చేసేవారు. ఇప్పుడు చుట్టుపక్కల వారు ఆర్టీవో కార్యాలయం వరకు వెళ్లాల్సి వస్తోంది.

భవనం నిరుపయోగంగా మార్చేశారు..

నాడు తెదేపా ప్రభుత్వం గుజ్జనగుండ్ల వద్ద అన్నక్యాంటీన్ భవనాన్ని రూ.40 లక్షలతో నిర్మించింది. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో ఉండేలా.. మన్నిక బాగుండేలా పటిష్ఠంగా నిర్మించారు. ఈ క్యాంటీన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మార్చేశారు. లోపల ఉన్న వస్తువులు, సామగ్రి పాడవుతున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజావసరాలు, విస్తృత ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని జీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అన్నక్యాంటీన్‌ను వెంటనే తెరిపించి.. ఇక్కడ కూడా పేదల కడుపు నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండ

పతకాలు అందుకున్న క్రీడాకారులతో గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు ఆయనతో పాటు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు దుర్గాబాయి, శాప్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా క్రీడాధికారి అఫ్రోజ్‌ఖాన్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రామస్వామి పతకాలు, బహుమతులు అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొదటిసారిగా విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించిందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 72 మంది హాజరయ్యారన్నారు. పారా క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ, సహకారాలు అందజేస్తుందన్నారు.

శిక్షణతో నైపుణ్యాలు వెలుగులోకి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతుల్లోనూ ప్రతిభ దాగి ఉంటుందని, సరైన శిక్షణతో వెలుగులోకి తీసుకురావచ్చని యోగ క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ ముదిగొండ ఉమా సుందరి పేర్కొన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా శ్యామలానగర్ శివారు ప్రభాత సింధూరి రిహాబిలిటేషన్ సెంటర్‌లో విద్యార్థులకు మంగళవారం ఆటలు, పాటలు, నృత్యాలు, వస్తువుల తయారీ, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంస్థ నిర్వాహకురాలు వై.జయలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా వందలాది మంది విభిన్న ప్రతిభావంతులకు సేవ చేసే అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వై.సమీర్, ప్రిన్సిపల్ పి.అన్నపూర్ణ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, గీత, సుజాత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న డాక్టర్ ఉమాసుందరి

కాలుష్యాన్ని తగ్గించడం అందరి బాధ్యత

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గాలి, నీరు, నేల కాలుష్యాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ పీసీబీ జిల్లా పర్యావరణ ఇంజినీర్ నజీనాబేగం సూచించారు. జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవం సందర్భంగా భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నజీనాబేగం మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించడం కేవలం ప్రభుత్వం, పరిశ్రమల పని మాత్రమే కాదని, ప్రతి వ్యక్తి కుటుంబం, విద్యార్థి, ఉపాధ్యాయులు సమష్టిగా బాధ్యత వహించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ మొక్కలు నాటడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ హేమాబా, పర్యావరణ సమన్వయకర్త తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో నజీనాబేగం, రామచంద్రరాజు తదితరులు

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రహదారుల విస్తరణ

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు రహదారుల విస్తరణ, ప్రత్యామ్నాయ రహదార్ల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర సూచించారు. మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాకాని రోడ్డు నుంచి జాతీయ రహదారికి వెళ్లేలా రిలయన్స్ బంక్ దగ్గర నుంచి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కేంద్రాల్లో నాణ్యతతో కూడిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఫీడ్ తప్పనిసరిగా కమాండ్ కంట్రోల్ రూంకు అందించాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీఎంసీ పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ బి.శ్రీనివాసరావు, సీఐ అశోక్‌కుమార్, జీఎంసీ సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, వివిధ మీడియాబోర్డుల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, చిత్రంలో కమిషనర్ శ్రీనివాసులు

ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహిళ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో పెట్టి అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వ్యక్తిపై పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. జేకేసీ కళాశాల రోడ్డుకు చెందిన ఓ మహిళ ఫొటోలు గుర్తు తెలియని ఓ వ్యక్తి మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నాడు. ఫేస్‌బుక్‌లో ఇది గమనించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుకు భంగం కలిగించిన ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ మహిళా కళాశాల గుంటూరు జాతీయ సేవా పథకం యూనిట్-1 ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎండోక్రైనాలజిస్ట్ పట్టాభి అరవింద్, దంత, నేత్ర వైద్యులు వెంకటేష్, లక్ష్మి. . ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు స్థానికులకు వైద్య సేవలందించారు. శిబిరంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వాలంటీర్లు, పీవో ఎం.సంతోష్ కుమారి పాల్గొన్నారు.

6న క్రియా యోగ దీక్షలు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: చంద్రమౌళీనగర్ ఏడో లైన్ సాయికృష్ణ మండపంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో క్రియా యోగ దీక్షలు ఉంటాయని సంఘ సభ్యులు శ్రీనివాసరావు, ప్రసాదరావులు తెలిపారు. ఈసందర్భంగా క్రియాయోగ దీక్షల కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈనెల 5న సాయంత్రం క్రియా యోగపై అవగాహన, 6న ఉదయం దీక్ష, మధ్యాహ్నం సాధన, 7న దీక్ష సాధన ఉంటాయన్నారు.

ఇళ్ల పట్టాలిస్తామని వైకాపా మోసం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇస్తామని మహిళలను మభ్యపెట్టి మోసగించిందని ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె మహిళా గ్రీవెన్స్ మంగళవారం నిర్వహించారు. మహిళలు.. తమ సమస్యలను ఎమ్మెల్యే మాధవికి విన్నవించారు. గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినా స్థలాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని కొందరు, సైడు కాలువలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మరికొందరు పేర్కొన్నారు. వీధి లైట్లు వెలగడం లేదని, గంజాయి బ్యాచ్ ఆగడాలు ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఉన్నాయని మహిళలు ఎమ్మెల్యేకి తెలిపారు. దీనికి మాధవి స్పందిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సరిదిద్దుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కేటాయిస్తామన్నారు. మిగిలిన సమస్యల్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పోలియో ఆదివారం విజయవంతం చేయాలి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని డీఎంహెచ్‌వో కె.విజయలక్ష్మి అన్నారు. ఈనెల 21న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో విజయలక్ష్మి మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 2,14,981 మంది ఉన్నారని, 958 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలియో ఆదివారాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, సర్వలైన్స్ వైద్యాధికారి డాక్టర్ భవానీ మాట్లాడుతూ 21న బూత్ వద్ద వ్యాక్సిన్ వేస్తారని, 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో పీవోలు అన్నపూర్ణ, రోహిణి రత్నశ్రీ, సుజాత, సూపర్‌వైజర్ శాస్త్రి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

సాంకేతిక పరిజ్ఞానం సక్రమంగా వినియోగించుకోవాలి

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాలని కేఎల్‌పీ పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పాఠశాలలో కంప్యూటర్ అక్షరాస్యత, జాతీయ కాలుష్య దినోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ రత్తయ్య మాట్లాడుతూ పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అకడమిక్ సమన్వయకర్త శైలజ మాట్లాడుతూ జల, వాయు, భూకాలుష్యాలను తగ్గించే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు.

ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థులు

కంప్యూటర్‌పై అవగాహన ర్యాలీ

కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. కంప్యూటర్ వినియోగంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య.టి తదితరులు పాల్గొన్నారు. **-గోరంట్ల, న్యూస్‌టుడే**



వాజ్‌పేయీ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతివ్వండి

న్యూస్‌టుడే, గోరంట్ల: నగరంలో మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతివ్వాలని భాజపా నాయకులు కలెక్టర్ తమీమ్ అన్సారియాను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డి.శ్రీనివాస్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.గంగాధర్, సీనియర్ నాయకులు ఎన్.మాధవరావు, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పెయ్యర్స్ అసోసియేషన్
పెన్షనర్స్ హోమ్, తాలుకా ఆఫీస్ కాంపౌండ్, బ్రాడీపేట, గుంటూరు.
ది: 14-12-2025, ఆదివారం నాడు ఉదయం: 10గం॥లకు సర్వసభ్య సమావేశము జరుపబడుతున్నది. ఈ సమావేశములో నూతన పాలకవర్గము ఎన్నిక జరుపబడుతున్నది. కావున సభ్యులు అందరు పైన తెలిపిన అడ్రస్‌కు హాజరు కావలసినదిగా కోరుతున్నాము.
ఇట్లు: మీ – ఓరుగంటి నారాయణరెడ్డి, ప్రెసిడెంట్.

(c) eenadu

దారిచూపు దేవుళ్లు..

రఘుశేఖర్‌సుదర్శి

నారాయణ

సేకరించిన కార్నియా (పాతచిత్రం)

అప్పటి వరకు చీకటి నిండిన వారి బతుకుల్లో వెలుగులు నింపుతూ తమ వంతు సామాజిక బాధ్యత నిర్వర్తిస్తున్నారు. నేత్ర దానంపై విస్తృత ప్రచారం చేస్తూ.. చనిపోయిన వారు మళ్లీ ఈ లోకాన్ని ఎలా చూస్తారో అవగాహన కల్పిస్తున్నారు. . నాగాయలంకలోని సుదర్శి మానవత సేవా సంస్థ నిర్వాహకులు. సామాజిక కార్యకర్తలు తలశిల రఘు శేఖర్, కనగంటి నారాయణలు.. 2008లో సుదర్శి మానవత సేవా సంస్థను ప్రారంభించారు. నాటి నుంచి నేత్రా దానంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ.. మృతుల బంధువులను ఒప్పించి.. చనిపోయిన వారి నేత్రాల నుంచి కార్నియాలు సేకరిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రుల సహకారంతో నేత్ర దానం కార్యక్రమాన్ని ప్రజల్లో తీసుకెళుతున్నారు. వారి కృషితో నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు తదితర మండలాలకు చెందిన ప్రజలు స్ఫూర్తి పొంది.. స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ఇప్పటి వరకు 252 జతల కార్నియాలను సేకరించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించి వెలుగులు నింపుతున్నారు. దాతల సహకారం, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 5వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 7200 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.

- నాగాయలంక, న్యూస్‌టుడే

పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్ల తాత్కాలిక ప్రాధాన్య క్రమం వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ (డిగ్రీ/డిప్లొమా) యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 2170 మంది అభ్యర్థుల తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం వెల్లడించింది. అభ్యంతరాలుంటే 5న ఉదయం 11 గంటలలోగా తెలియజేయాలని, వివరాలకు 90007-80707లో సంప్రదించాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

దందా హద్దుమీరుతోంది!

రీసర్వేలో సర్వేయర్ల వసూళ్లు

ఈనాడు, అమరావతి

● **కూచిపూడి** పరిధిలోని ఓ సచివాలయ సర్వేయర్ వైకాపా పాలనలో రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటి తప్పులు సరిచేసేందుకు దాదాపు 20 మంది రైతుల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేశారు. రేపుమాపంటూ మాయ చేసి గుట్టుచప్పుడు కాకుండా పామర్రు మండలంలోని మరో సచివాలయానికి బదిలీ చేయించుకుని జారుకున్నారు. దీంతో డబ్బులిచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు.

● **గన్నవరం** మండలంలోని ఓ సచివాలయ సర్వేయర్ ఓ రైతుకు పక్క రైతుకు చెందిన 10 సెంట్లు భూమి వచ్చేలా హద్దులు నిర్ణయించారు. ప్రతిఫలంగా రూ. 10వేలు తీసుకున్నారు. సాధారణంగా ఏ సర్వే చేయాలన్నా ఆ ఉద్యోగికి ముడుపులు ఇవ్వాల్సిందే.

ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల ఆమ్యామ్యాల దందా హద్దు మీరుతోంది. వైకాపా పాలనలో జరిగిన రీసర్వేలో భారీగా వసూళ్లు చేసిన అనుభవాలతో తాజా రీసర్వేలోనూ రెచ్చిపోతున్నారు. రైతుల మధ్య వారే హద్దుల వివాదాలు సృష్టించి ముడుపులు తీసుకుని పరిష్కరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, రైతుల అవగాహనా రాహిత్యం వీరికి కాసులు పండిస్తోంది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఓ మండల, కొందరు సచివాలయ సర్వేయర్లు కుమ్మక్కై వసూళ్లు చేస్తున్నారు. ఎల్పీ నంబర్ సబ్‌డివిజన్ చేయాలంటే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ముట్టజెప్పాలి. వివాదాలుంటే ముడుపుల మోతాదు పెరుగుతుంది. గంపలగూడెం మండలంలో ఇద్దరు సచివాలయ సర్వేయర్లు ఇదే తరహా దందా చేస్తున్నారు. రీసర్వేలో వచ్చిన వివాదాలకు ఒక్కో రైతు నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు

రాచమర్యాదలు చేయాల్సిందే...

సచివాలయ, మండల సర్వేయర్లలో చాలా మంది అడ్డగోలు దందా చేస్తున్నారు. ఓ వైపు రీసర్వే లోపాలు..మరోవైపు సాధారణ సర్వేల్లో వసూలు చేస్తున్నారు. కొందరు మండల సర్వేయర్లు సచివాలయ సర్వేయర్లను అడ్డం పెట్టుకుని రైతుల సొమ్ము స్వాహా చేస్తున్నారు. సాధారణంగా సర్వేకి దరఖాస్తు చేస్తే సకాలంలో సర్వేయర్ రావడం దాదాపు అసాధ్యమైంది. ముందుగా బేరం తెగ్గొడితేనే అయ్యవారు అడుగు పెడతారు. హద్దులు తెగ్గొడతారు. ఎకరం సర్వే చేయాలంటే చాలా మంది సర్వేయర్లకు రూ.3వేలు ఇచ్చి రాచమర్యాదలు చేసి పంపాల్సిన పరిస్థితి. దీనిపై ఎన్టీఆర్, కృష్ణా ఏడీ సర్వే మోహన్‌రావు, జోషీలా మాట్లాడుతూ.. ఈ అంశంపై పరిశీలించి వసూళ్లకు పాల్పడిన సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీచ్.. అభివృద్ధికి అడుగులు

20 ఎకరాల్లో రిసార్టులకు భూకేటాయింపు

తీరంలో రూ.157 కోట్ల పెట్టుబడి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. భూమి కేటాయించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.157.33 కోట్ల అంచనా వ్యయంతో మంగినపూడి తీరం వద్ద లార్జ్ అమ్యూజ్‌మెంట్ పార్కు కమ్ రిసార్టులు నిర్మించేందుకు మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పర్యాటక శాఖ తెలిపింది. రిసార్టుల ప్రాజెక్టులో 30వేల చదరపు గజాల్లో అమ్యూజ్‌మెంట్ పార్కు, 25వేల చ.అ. వాటర్ పార్కు, రైడ్స్, 150 గదులు, ఐదు రెస్టారెంట్లు, బార్, 16వేల చ.అ. కన్వెన్షన్ సెంటర్, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం అభివృద్ధి, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందన్న ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది.

83 ఎకరాలకు ప్రతిపాదనలు.. మంగినపూడి తీరంలో పర్యాటకాభివృద్ధికి 83 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఇందులో రోడ్డు పోను మిగిలిన 64 ఎకరాల్లో రిసార్టులు, రెస్టారెంట్లు, స్నానపు గదులు, పలు భవనాలు, హోటళ్లు తదితర ప్రైవేటు, ప్రభుత్వ సౌకర్యాల కల్పన కోసం భూమి కేటాయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ ఏడాది మసూలా బీచ్ ఫెస్టివల్‌కు మంచి గుర్తింపు రావడంతో మంత్రి కొల్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

'బీచ్ పర్యాటకానికి మంగినపూడి అనుకూలమైంది. పలు నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు భూమి కేటాయింపు అనుమతులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాం. త్వరలో తీరంలో సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి' అని కలెక్టర్ బాలాజీ తెలిపారు.

రాజధానికి ఇదే దగ్గర..

రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు ఇదే దగ్గర సముద్ర తీరం. కార్తిక స్నానాల సమయంలోనే లక్షల్లో వచ్చే పర్యాటకులతో బీచ్ కిటకిటలాడుతుంది. వారాంతాల్లోనూ పెద్దఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తారు. సరైన వసతులు లేకపోవడంతో కొద్దిసేపు ఉండి వెళ్లిపోతున్నారు. త్వరలో స్నానపు గదులు, విశ్రాంతి భవనాలు, హోటళ్లు వంటి వసతులు సమకూరనుంది.

ట్రేడింగ్ అంటూ మహిళ టోకరా

రూ.26 లక్షలు మోసపోయిన పెనమలూరు వాసి

పెనమలూరు, న్యూస్‌టుడే: ట్రేడింగ్ వ్యాపారమంటూ ఒకరిని ముగ్గులోకి దింపిన మహిళ అతడి నుంచి రూ. 26.37 లక్షలు కొట్టేసింది. పెనమలూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. కొంతకాలం క్రితం ఆయన సెల్‌ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. తన పేరు అన్నమనేని హేమాచౌదరిగా పరిచయం చేసుకుంది. తన స్వస్థలం రాజమహేంద్రవరం కాగా చెన్నైలో ఉంటున్నట్లు చెప్పుకొంది. షేర్ వ్యాపారంలో ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని నమ్మించింది. వాట్సప్ ద్వారా ఓ లింక్ పంపి ట్రేడింగ్ ఎలా చేయాలో సూచించింది. తొలుత ఆయన రూ.50 వేలతో ట్రేడింగ్ మొదలుపెట్టాడు. కొద్ది రోజుల్లో అతనికి లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించింది. దీంతో ఆ నగదును విత్‌డ్రా చేసుకున్నాడు. నమ్మకం కుదరడంతో విడతల వారీగా రూ.26.37 లక్షలు పెట్టాడు. దీనికి లాభంతో కలిపి రూ.40.96 లక్షలు చూపడంతో ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలని చూడగా వీలు కుదరలేదు. దీనిపై హేమాచౌదరిని సంప్రదించగా అప్పటికే ఆమె సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె సిగలో.. కొత్త పంచాయతీలు

పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, అమరావతి

పల్లె ప్రగతికి పట్టుకొమ్మలైన పంచాయతీ వ్యవస్థలో కీలక మార్పునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండి..పాలనా సౌలభ్యం లేని ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు సమీప పంచాయతీల్లో విలీనం చేయనున్నారు. దీని వల్ల ప్రజలకు పాలనా సౌలభ్యంతో పాటు నిధుల కేటాయింపు, పర్యవేక్షణలో ప్రాధాన్యం ఉంటుంది.

✦ అవనిగడ్డ పంచాయతీలోని పసుమట్ల 2 కి.మీ దూరంలో పులిగడ్డలో కలిసి ఉంటుంది. దీన్ని పులిగడ్డలో కలిపితే పాలనా సౌలభ్యం ఉంటుంది. నాగాయలంక మండలం పర్రచివర పంచాయతీలోని దళితవాడ 2 కి.మీ దూరంలో ఉంటుంది. అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెంలో కలిసి ఉంటుంది. ఆ పంచాయతీలో విలీనం చేస్తే మేలన్న వాదనలు ఉన్నాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి పంచాయతీలో కమ్మవారిపల్లె గ్రామం ఉంది. పంచాయతీకి వెళ్లాలంటే పడవలో రేవు దాటి వెళ్లాలి. మాచవరంలో కలిసి ఉండే ఈ గ్రామాన్ని ఆ పంచాయతీలో కలిపితే మేలుగా ఉంటుంది.

✦ జగ్గయ్యపేట మండలం అన్నవరం పంచాయతీలోని త్రిపురవరం 6 కి.మీ దూరంలో ఉంది. దీంతో పర్యవేక్షణ కొరవడుతోందని గ్రామస్థుల నుంచి అసంతృప్తి ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి. జయంతిపురం పంచాయతీలోని రావిరాల ఏడు కి.మీ దూరంలో ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉంది. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండడం పెద్ద సమస్యగా మారింది. బండిపాలెం పంచాయతీ పరిధిలోని గుండబోయినపాలెంలో వెయ్యి మంది జనాభా ఉన్నారు. 4 కి.మీ దూరంలో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నందిగామ మండలం పెద్దవరం పంచాయతీలోని చెరువుకొమ్ముపాలెంలో 5వేల జనాభా ఉంది. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చందర్లపాడులో కునాయపాలెం పంచాయతీలోని బెల్లంకొండవారిపాలెం, వేలూరు పంచాయతీలోని రామన్నపేట, వీరులపాడు మండలం కొణతాలపల్లిలోని పల్లంపల్లి, చెన్నారావుపాలెం పరిధిలోని తిమ్మాపురం, జుజ్జూరులోని రంగాపురం గ్రామాలను సైతం పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పెడుతున్నారు.

కొత్తగా పంచాయతీల ఏర్పాటు, విలీనంపై ప్రతిపాదనలు పంపాలని అధికారులను ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేయాలంటే అక్కడి

ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి..

ఆదాయం, విస్తీర్ణం, జనాభా నమోదు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15-20 వరకు కొత్త పంచాయతీల ఏర్పాటు, 40 వరకు విలీనం చేయాలన్న అభ్యర్థనలు ఉన్నాయి.

ఆలోచన బాగు.. ప్రమాదాలను ఆపు..

జాతీయ రహదారిపై మరమ్మతులు, ఇతరత్రా పనులు చేసే సమయంలో పనివారు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఆ సమయంలో వాహనదారులను పక్కగా వెళ్లమని సూచించడం కోసం ఒకరిని ప్రత్యేకంగా పెడతారు. కొన్నిసార్లు అలా విధుల్లో ఉన్న వారూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వీటిని నివారించేందుకు జూపూడి వద్ద ఇలా ఓ మనిషిని పోలిన బొమ్మకు దుస్తులు, హెల్మెట్, షూ వేసి నిలబెట్టారు. బాగుంది కదూ ఆలోచన. -ఈనాడు, అమరావతి

ముసురుపట్టిన మేఘం.. ముంచుకొచ్చిన కష్టం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం
-న్యూస్‌టుడే, మోపిదేవి

దిత్వా తుపాను ప్రభావం కల్లాల్లో ధాన్యం ఆరబోసుకున్న రైతులకు కునుకులేకుండా చేస్తోంది. ఆదివారం నుంచి మబ్బులు పట్టి చిరుజల్లులు కురుస్తుండటంతో పంట కోసి రోడ్లపై ధాన్యం ఆరబోసిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఎలాగున్నా కొనుగోలు చేస్తామని అధికారులు, పాలకులు చెబుతున్నా. . క్షేత్రస్థాయిలో సిబ్బంది ముప్పుతిప్పలు పెడుతున్నారు. 5-10 కిలోల కోత పెడుతున్నారు. అంతా దళారుల పెత్తనమే నడుస్తోంది. మరోవైపు లారీలు, గోనె సంచులు అందుబాటులో లేక కర్షకులు ఇబ్బందులు పడుతున్నారు. రంగుమారిన ధాన్యం తరలించేందుకు మిల్లర్లు ముందుకు రావట్లేదు. రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో దళారులు, మధ్యవర్తులే చక్రం తిప్పుతున్నారు. దీంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు ఆశించిన ధర దక్కడం లేదు. మంగళవారం మచిలీపట్నం, పెడన తదితర నియోజకవర్గాల్లో మోస్తరు వర్షం పడటంతో అన్నదాతలకు ఉరుకులు, పరుగులు తప్పలేదు.

మానుగాయ.. రంగుమారిన గింజ

మొంథా తుపాను కారణంగా జిల్లాలో వేల హెక్టార్లలోని పంటలు నేలవాలాయి. నిటారుగా ఉన్న వరిలో తాలు, మానుగాయ వచ్చింది. దీంతో కనిపించని నష్టం వాటిల్లింది. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే క్షేత్రస్థాయిలో సిబ్బంది దళారులకే వత్తాసు పలుకుతూ.. కర్షకులకు చుక్కలు చూపిస్తున్నారు. తేమ శాతం ఎక్కువ ఉందని. . లారీలు వచ్చేవరకు సంచులు ఇవ్వట్లేదు. జిల్లాలో డ్రయ్యర్ మిల్లులు తక్కువగా ఉండటంతో అక్కడికి వెళ్లిన లారీలు ఖాళీ కావాలంటే రెండు రోజులకు పైగానే పడుతోంది. వర్షాలు పడుతుండటంతో రోడ్లపై ధాన్యం ఆరబోసుకున్న రైతులు ఆర్‌ఎస్‌కేల చుట్టూ తిరిగి చివరికి దళారులకే కట్టబెడుతున్నారు. జిల్లాలో వేల టన్నుల ధాన్యం రోడ్లపైనే ఉంది. ★ పెదప్రోలు గ్రామ రైతులు 216 జాతీయ రహదారిపై రాశులు పోసి పట్టాలు కప్పారు. ఆవిరితోడై లోపల నుంచి సెగలు రావడంతో మంగళవారం రాత్రి వాహనాల లైట్ల వెలుతురులో తిరగేసుకున్నారు.

జిల్లాలో సాగు విస్తీర్ణం: 1.62 లక్షల హెక్టార్లు
ధాన్యం కొనుగోలు లక్ష్యం: 7.90 లక్షల టన్నులు
ఇప్పటికి కొనుగోలు చేసింది: 1.90 లక్షల టన్నులు
కోతలు పూర్తయ్యింది: 60వేల హెక్టార్లు
మిల్లులు: 160 డ్రయ్యర్ ఉన్నవి: 75

ఈ చిత్రంలో ఆరబెట్టిన ధాన్యంపై ఆదమరిచి పడుకున్న కౌలు రైతు పేరు జంపన చంటి. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు 17 ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశారు. మంచి దిగుబడితో పంట చేతికొచ్చిన సమయంలో తుపాను హెచ్చరికతో నాలుగు రోజులుగా రాత్రీపగలు పంటకు కాపు కాస్తున్నారు. -ఈనాడు, అమరావతి

1318 రకం కొనేందుకు మిల్లర్లు రావడం లేదు..

1318 విత్తనం తొలిసారిగా వేశా. చినుకులు పడుతుండటంతో నాలుగు రోజులుగా రాశి తిరగేసే అవకాశం లేదు. లోపల నుంచి సెగలు రావడంతో ధాన్యం రంగుమారుతోంది. దీనికి తోడు మానుగాయ రావటంతో కొనేందుకు మిల్లర్లు ముందుకు రావట్లేదు. - కొల్లూరి రాఘవులు, పెదప్రోలు

సృజన.. నవ్య ఆవిష్కరణ

యాప్‌లు రూపొందించిన నగర విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే


యాప్‌లు ప్రదర్శిస్తున్న షెహనాజ్, రిషిక్, కృష్ణ ప్రియాంక, పావని, తనూజ సాయి

సమాజానికి ఉపయోగపడే అనేక ఆవిష్కరణలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నగర విద్యార్థులు. వీరు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా యాప్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

దళారుల మోసాలకు అడ్డుకట్ట

ఆరుగాలం కష్టనష్టాలు ఓర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. నకిలీ విత్తనాలు కొని వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఆన్‌లైన్ వేదికగా అమ్ముకోవడానికి ఓ సరికొత్త యాప్ రూపొందించింది కృష్ణ ప్రియాంక. దీంతో పాటు సాగుకు భూసార పరీక్షల నుంచి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఒకే వేదికలో అందేలా అగ్రి కనెక్ట్ యాప్ తయారు చేసింది.

చేపల అమ్మకం.. కొనుగోలుకు..

మత్స్యకారులతో పాటు తాజా చేపలు కావాలనుకునే వారికి ఉపయోగపడేలా అక్వా కనెక్ట్ పేరుతో యాప్ రూపొందించింది షెహనాజ్. ఇందులో మత్స్యకారులు వారి ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. దీంతో పాటు తాజా చేపలు కొనుగోలుదారులకు అందించే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగపడుతుంది. వ్యాపారులు, కొనుగోలుదారులకు శ్రమ తగ్గిస్తుంది.

ఇంటి నుంచే ఆదాయం వచ్చేలా ...

నైపుణ్య మార్పిడి మహిళా సాధికారత యాప్ ద్వారా మహిళలు వారి నైపుణ్యాలను పెంపొందించుకునేలా తనూజ సాయి యాప్ రూపొందించింది. మహిళలు వారిలోని ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ యాప్ దోహదపడుతుంది. నైపుణ్యాభివృద్ధికి ఉచితంగా ఈ యాప్ దోహదం చేస్తుంది. ముఖ్యంగా గృహిణులకు ఎంతో ఉపయోగం.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే..

ఏదైనా సమస్య మీద పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే గంటల తరబడి పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాలి. ఈ తరుణంలో నిమిషాల వ్యవధిలో ఫిర్యాదు పోలీసులకు అందించేలా రిషిక్ యాప్ అభివృద్ధి చేశాడు. క్షణాల వ్యవధిలో మనం ఉన్న చోట నుంచి పోలీసులకు ఫిర్యాదు ఆన్‌లైన్‌లో అందించ వచ్చంటున్నాడు. ఫిర్యాదు వారికి అందగానే బదులు వచ్చేలా యాప్ రూపొందించాడు.

వేడుకల నిర్వహణకు ఆందోళన వద్దు

ఏదైనా వేడుక చేయాలనుకుంటే ఎన్నో పనులు... ఒత్తిడి ఉంటుంది. ఆ ఇబ్బంది లేకుండా ఒకే యాప్ ద్వారా వేడుక పనులు చేసుకునేలా ఈవెంట్ హబ్ యాప్ రూపొందించింది పావని. పెళ్లిరోజు, పుట్టినరోజు, వివిధ సభలు, సమావేశాలు, ఇతర వేడుకలు నిర్వహించేందుకు ఈ యాప్ ఉపయోగ పడుతుంది. వేడుక నిర్వహణకు సరకులు, వస్తువులు, కూలీలు, నైపుణ్యం కలిగిన కార్మికులు ఒకే చోట లభిస్తారు. ఈ యాప్ ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో ఉంటున్న ప్రజలకు ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుంది.

ఆటో చెరువులో పడి డ్రైవర్ దుర్మరణం

● అకస్మాత్తుగా అనారోగ్యంతో ప్రమాదం
● మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

నాగరాజు (పాతచిత్రం)

ప్రయాణికులను రక్షించే ప్రయత్నంలో స్థానికులు

మంటాడ(పమిడిముక్కల): ఆటో చోదకుడికి ఆకస్మిక అనారోగ్యంతో వాహనం అదుపు తప్పి రోడ్డుకు అవతల వైపు ఉన్న చెరువులో పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ దేసు నాగరాజు(50) మృతిచెందగా, దానిలోని ప్రయాణికులను స్థానికులు రక్షించారు. ఈ సంఘటన మంగళవారం మంటాడ శివారు రెడ్డిపాలెంలో జరిగింది. ఉయ్యూరు నుంచి వీరంకిలాకుకు ముగ్గురు మహిళా ప్రయాణికులతో వస్తున్న ఆటో రెడ్డిపాలెం రామాలయం సమీపంలో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుకు అటువైపు ఉన్న స్తంభాన్ని ఢీకొని చెరువులో పడింది. దుర్ఘటన గమనించిన స్థానికులు ఆటోలోని ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. నీట మునిగిన చోదకుడు దేసు నాగరాజును ఒడ్డుకు చేర్చిన కొద్ది నిమిషాల్లో మరణించాడు. చెరువు సమీపంలోకి వచ్చే సరికి డ్రైవరు బాధగా మూలుగుతూ ఒక్కసారిగా స్టీరింగుపై వాలిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని ఆటోలోని ప్రయాణికులు చెప్పినట్టు తెలుస్తోంది. ఎస్సై శ్రీను, సిబ్బంది క్షతగాత్రులను ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చి ప్రథమ చికిత్స అందించారు. నాగరాజు మృతదేహాన్ని శవపరీక్షకు ఉయ్యూరు తరలించారు.

అపురూప కట్టడం.. అరుదైన రాజగోపురం!

దివిసీమ ప్రాంతం అవనిగడ్డలో చోళరాజుల కాలం నాటి లక్ష్మీనారాయణస్వామి ఆలయం నేటికీ చెక్కు చెదరక అపురూప కట్టడంగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 106 అడుగుల పునాదితో నిర్మితమైన ఏడు అంతస్తుల రాజగోపురం(గాలిగోపురం) ఉన్న ఆలయంగా ఖ్యాతికెక్కింది. అప్పట్లో రవాణా సౌకర్యం లేనందున ఆలయ నిర్మాణానికి అవసరమైన కొండరాయిని విజయవాడ ప్రాంతం నుంచి కృష్ణానది ద్వారా పడవల్లో ఈ ప్రాంతానికి చేర్చినట్లు తెలుస్తోంది. వాటితో పలు శిల్పాలు చెక్కి రాజగోపురానికి అమర్చారు. గోపురం నుంచి ఆలయ ధ్వజస్తంభం వరకు తొమ్మిది పర్యాయాలు ప్రదక్షిణలు చేస్తే అనుకున్నవి నెరవేరతాయని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకుంటే సమస్త పాపాలు పోతాయని దివి వాసులు నమ్ముతారు. దేవాదాయ శాఖ అధ్వర్యంలో నడిచే ఆరాధన మాసపత్రికలో ఒక దశాబ్దం పాటు ముఖచిత్రంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయ రాజగోపురాన్ని ప్రచురించారు. మాస పత్రికకు అవనిగడ్డకు చెందిన ఆగమ పండితులు దీవి నరసింహాచార్యులు సంపాదకత్వం వహించడంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది.

- అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ ఆటోడ్రైవర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ విజయవాడలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బాలిక (15) ఒక కిరాణా దుకాణంలో పనిచేస్తోంది. 2021, జులై 21న తెల్లవారుజామున కంగారుగా ఇంటికి రాగా.. తల్లి ఏమైందని అడిగారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన వల్లెపు వసంతకుమార్ అనే ఆటోడ్రైవర్ తనను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని వెళ్లి ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో అత్యాచారం చేశాడని చెప్పింది. తల్లి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ వి.వి.ఎస్.లక్ష్మీనారాయణ ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం రాజేశ్వరరావు వాదించారు. మొత్తం అయిదుగురు సాక్ష్యులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ.. న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు చెప్పారు. సదరు జరిమానా నుంచి బాధిత బాలికకు రూ.5వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

4న కృష్ణానదిలో బోటు విహారం

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానదిపై బోటులో ప్రయాణం చేస్తూ కవులు, రచయితలు వారి అభిప్రాయాలను తెలియజేసే కార్యక్రమాన్ని ఈనెల 4న నిర్వహించనున్నారు. భవానీపురంలోని హరిత బోటింగ్ పాయింట్ వద్ద నుంచి బోటు గురువారం సాయంత్రం ప్రారంభం కానుంది. విజయవాడ కనకదుర్గమ్మ చారిత్రక నేపథ్యాన్ని రచయిత్రి పద్మ వివరించనున్నారు. విశ్రాంత ఐఏఎస్ వాడ్రేవు చినవీరభద్రుడు రాష్ట్రంలోని గ్రామ దేవతల మూలాలపై విశ్లేషణ చేయనున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

జిల్లాలో ఆరు స్క్రబ్‌టైఫస్ కేసులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు): సకాలంలో గుర్తించి, చికిత్స చేయించుకుంటే నయమయ్యే స్క్రబ్‌టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి యుగంధర్ సూచించారు. రాష్ట్రంలో స్క్రబ్‌టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనులు ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఆరు పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దద్దుర్లు, ఏదైనా కుట్టిన చోట నల్లగా మారడం వ్యాధి లక్షణాలన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

నిలిచిన పనులు.. కళావిహీనంగా పాఠశాలలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే

గత ప్రభుత్వం నాడు-నేడు పథకం ఫేజ్-2 కింద ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసమే, 2022లో చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో ఆయా పాఠశాలలు కళా విహీనంగా కనపడుతున్నాయి. అవనిగడ్డ మండలం, అవనిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాలలో పాత భవనం పైకప్పు తొలగించి, కొత్తగా స్లాబ్ వేసి, రంగులు వేయాల్సిన పనులకు రూ.63 లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయి, రంగులు వేయాల్సిన సమయంలో ప్రభుత్వం మారడంతో తర్వాత పనులు నిలిచిపోయాయి. వంట గది నిర్మాణం కూడా పూర్తయి రంగులు వేయకుండానే నిలిచిపోయింది. అవనిగడ్డ శివారు కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాల మరమ్మతులు, ఫ్లోరింగ్ ఎత్తు పెంచడం, వంటగది నిర్మాణం పూర్తి చేశాక తర్వాత పనులు నిలిచిపోయాయి. స్థానిక లంకమ్మమాన్యం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ నిర్మించి వదిలేశారు. వేకనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి.

పాఠశాల ప్రహరీ నిర్మించి రంగులు వేయకుండా వదిలేసిన వైనం

అసంపూర్తి నిర్మాణంతో విద్యార్థుల ఇక్కట్లు

నాగాయలంక మండలం ఏటిమొగ జడ్పీ పాఠశాల ఆవరణలో మూడున్నర ఏళ్లుగా అసంపూర్తి నిర్మాణంతో అదనపు తరగతి భవనం దర్శనమిస్తోంది. పాఠశాలలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 2022లో అప్పటి వైకాపా ప్రభుత్వం నాడు-నేడు ఫేజ్-2 కింద రూ.30 లక్షల వ్యయంతో వీటి పనులు ప్రారంభించింది. సకాలంలో నిధులు సమకూరకపోవడంతో భవన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. పాఠశాలలో 76 మంది విద్యార్థులు ఉండగా ఇరుకు గదుల్లో ఉపాధ్యాయులు వారికి బోధిస్తున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఏటిమొగ(నాగాయలంక), న్యూస్‌టుడే

స్వర్ణాంధ్ర ప్రయాణంలో ఉద్యోగులు కలసిరండి

మంత్రి పార్థసారథి

మంత్రి పార్థసారథికి పూలమొక్క అందిస్తున్న ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్, అసోసియేషన్ నేతలు

కానూరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు చేస్తున్న ప్రయాణంలో ఉద్యోగులు కలసి రావాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు అసోసియేషన్ నాయకులు తాడిగడప క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలపాటు అభివృద్ధిలో గాడితప్పిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో, దార్శనికతతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు కీలకమైన పారిశ్రామిక రంగంలో విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని భావించి ఉద్యోగులందరూ ఐక్యంగా ఆయనకు మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, డీఎస్ఎన్‌రెడ్డి, పీవీ ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష నేరం: డీఎంహెచ్‌వో

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్య సేవలు వంటి కీలక రంగాల్లో పనిచేసే హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపడం శిక్షార్హమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి పి.యుగంధర్ అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ఏఆర్టీ కేంద్రంలో హెచ్ఐవీ బాధిత పిల్లలకు మంగళవారం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ సామాజిక అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం అనేక వినూత్న చర్యల ద్వారా ప్రజలకు వివరిస్తోందన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి అంబటి వెంకటరావు మాట్లాడుతూ యాంటీ రిట్రో వైరల్ డ్రగ్స్ క్రమం తప్పకుండా వాడితే హెచ్ఐవీ రోగుల జీవితకాలం గణనీయంగా పెరుగుతుందన్నారు. అనంతరం బాధిత పిల్లలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆశాలత, దిశ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజరు మధుసూదనరావు, ఎస్టీడీ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల ఇక్కట్లకు అధికారుల ధోరణే కారణం'

పమిడిముక్కల, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లలో ఏటా సమస్యలు ఉత్పన్నమవుతున్నా.. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడమే రైతుల ఇక్కట్లకు మూలమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. కపిలేశ్వరపురం రైతుసేవాకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సహజంగా ఈ తరుణంలో వచ్చే గోతాలు, రవాణా, ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతులు, సంఘ నాయకులు, మిల్లర్లతో సమావేశాలు ఏర్పాటు చేయాలని తాను అధికారులకు చెప్పినా ఆచరించింది లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మిల్లుల్లో తగిన సంఖ్యలో డ్రయ్యర్లు లేకపోవడం కూడా సమస్యగా మారిందని, ప్రభుత్వం పెద్ద రైతులు, మిల్లర్లు, సహకార సంఘాల ద్వారా డ్రయ్యర్లు ఏర్పాటు చేస్తే తేమ సమస్య త్వరగా తీరుతుందన్నారు. కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ ప్రతి గింజను కొంటామన్న ప్రభుత్వం ఇప్పుడు వెనకడుగు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లను మిల్లర్లే శాసిస్తున్నారని, దళారీ వ్యవస్థను సృష్టించారన్నారు. రైతుసంఘం నాయకుడు తాతినేని శేషగిరిరావు పాల్గొన్నారు.

అనధికార లేఔట్లు, ఆక్రమణలు తొలగించండి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో అనధికార లేఔట్లు, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో జిల్లాలోని పురపాలక సంఘాల కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా

కమిషనర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని, వెంటనే జాబితాలు తయారు చేసి నోటీసులు జారీ చేయాలన్నారు. స్పందించకపోతే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మచిలీపట్నంలోని నారాయణపురం, గుడివాడలోని ధనియాలపేట, బేతవోలులో చేపట్టిన పట్టణ ఆరోగ్య కేంద్రాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తాడిగడపలో మంజూరైన కానూరు కేంద్ర నిర్మాణానికి స్థలం గుర్తించాలన్నారు. పెడన, ఉయ్యూరుల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించాలన్నారు. వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ కమిషనర్లు మనోహర్, రామారావు, నజీర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం

కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జుయల్ ఓరం మంగళవారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. దిల్లీ నుంచి వచ్చిన ఆయనకు గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్లారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

కృష్ణా తరంగ్‌కు సర్వం సిద్ధం

గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న ఉపకులపతి రాంజీ తదితరులు

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనను వెలికితీసేందుకు ఈ నెల 4, 5, 6 తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయంలో కృష్ణాతరంగ్ పేరిట నిర్వహించే యువజనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సంగీతం, నృత్యం, క్విజ్, కార్టూనింగ్, పోస్టర్ మేకింగ్, సంప్రదాయ, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, స్పాట్ పెయింటింగ్ ఇలా 28 అంశాలపై పోటీలు ఉంటాయి. ఇందులోని విజేతలు సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమాల విజయవంతానికి ఇప్పటికే పలువురికి బాధ్యతలు అప్పగించారు. కృష్ణాతరంగ్ ప్రారంభ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరి పలువురు ప్రముఖులు పాల్గొంటారని.. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ తెలిపారు. ఈసారి ఉత్సవాల్లో విశ్వవిద్యాలయ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. విజయవాడలోని పీజీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ఓ భవనం కేటాయించిందని, దీన్ని త్వరలోనే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కేంద్రంలో డిఫెన్స్‌కు సంబంధించిన డిప్లొమో, పీజీ డిప్లొమో కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. సమావేశంలో రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎన్.ఉష, పరీక్షల నియంత్రణ అధికారి పీవీ బ్రహ్మాచారి తదితరులు మాట్లాడారు. అనంతరం కార్యక్రమ గోడ ప్రతులు ఆవిష్కరించారు. కృష్ణా తరంగ్ కార్యక్రమ కన్వీనర్ దిలీప్, కోశాధికారి నవీనలావణ్యలత, కోకన్వీనర్స్ ఎల్.సుశీల, ఆర్.విజయకుమారి పాల్గొన్నారు.

స్వామి ఆదాయం రూ.5.72 లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవిలో స్వయంభుగా వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. 14వేల మంది స్వామి దర్శనానికి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపారు. మొక్కులు చెల్లించి, తలనీలాలు ఇచ్చారు. పలు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. మొత్తం రూ.5.72లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

దండించే అధికారం నీకెవరిచ్చారు?

విధుల నుంచి అనధికార అటెండరు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

మోపిదేవి, న్యూస్‌టుడే: విద్యార్థిని దండించే అధికారం నీకెవరిచ్చారు? ఇష్టారీతిన ప్రవర్తించడమేంటని మోపిదేవి పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో అనధికార అటెండరుగా విధుల్లో ఉన్న దోనే శ్రీధర్‌ను విచారణాధికారులైన ఎంఈవోలు మందలించారు. శనివారం సాయంత్రం 9వ తరగతి చదువుతున్న గుర్రం నాగసంతోష్‌ను శ్రీధర్ బెత్తంతో కొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. 'విద్యార్థిని బెత్తంతో గాయపర్చిన ప్రైవేట్ వ్యక్తి' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై విచారించి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎంఈవోలు గరికపాటి నాగభాస్కరగోపాల్, ఆలా వెంకట రమణలను ఆదేశించారు. దీంతో విద్యార్థి ఇంటి వద్ద వారు తల్లిదండ్రులను విచారించారు. సంతోష్‌ను ఏం జరిగింది? ఎందుకు దండించాడంటూ కూపీలాగారు. ఎంపీపీ రావి దుర్గావాణి, ఇన్‌ఛార్జి హెచ్ఎం సుజాత, కైలా ఉమామహేశ్వరరావు, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనధికార విధులలో ఉన్న అటెండరు దోనే శ్రీధర్‌ను తొలగిస్తున్నట్లు తెలిపారు. విచారణ నివేదికను డీఈవోకు నివేదిస్తామన్నారు.

సంతోష్ ఇంటి వద్ద విచారిస్తున్న ఎంపీపీ,ఎంఈవోలతో ఇన్‌ఛార్జి హెచ్ఎం సుజాత తదితరులు

26 మంది మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: పెనమలూరు ఠాణా పరిధిలో అరెస్టు అయిన 26 మంది మావోయిస్టులకు ఈ 15 వరకు కోర్టు రిమాండ్ పొడిగించింది. మంగళవారం వీరిని వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. విచారించిన కోర్టు రిమాండ్ పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే స్టేషన్ పరిధిలో అరెస్టు అయిన ఇద్దరు మైనర్లను ఈ నెల 5న కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో ఓ బాలిక విశాఖపట్నం జువైనల్ హోంలో.. మరో బాలుడు విజయవాడ జువైనల్ హోంలో ఉన్నారు. కానూరులోని కొత్త ఆటోనగర్‌లో 28 మంది మావోయిస్టులు పట్టుపడటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.

నకిలీ మద్యం కేసులో.. ఇద్దరు నిందితులకు రెండో విడత కస్టడీకి పిటిషన్

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు రెండో విడత కస్టడీ కోసం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు రవి (ఏ4), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) నుంచి కుట్రకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై మంగళవారం ఇరు పక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు నిమిత్తం ఈ నెల 8వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

సొర్లగొంది, గుల్లలమోద అభివృద్ధికి చర్యలేవీ?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం : 'కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సొర్లగొంది, గుల్లలమోద గ్రామాలను వాతావరణ స్థితిస్థాపిక తీరప్రాంత మత్స్యకార గ్రామాల (సీఆర్‌సీఎఫ్‌వీ) కింద గుర్తించడం నిజమేనా.. అయితే వాటి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు' అని ఎంపీ బాలశౌరి మంగళవారం లోక్‌సభలో గళమెత్తారు. దీనికి కేంద్ర మత్స్య, పశుపోషణ, పాడి పరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ స్పందించారు. 'సీఆర్‌సీఎఫ్‌వీలను ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న 100 మత్స్యకార గ్రామాల్లో వాతావరణ స్థితిస్థాపకతను పెంచడానికి ఎంపికయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 15 గ్రామాలు ఉండగా వాటిలో సొర్లగొంది, గుల్లలమోద కూడా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలకు సహాయం అందించడమే పీఎంఎంఎస్‌వై ముఖ్య లక్ష్యం. ఒక్కో మత్స్యకార గ్రామానికి రూ.2కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తారు. ఈ మొత్తం ఖర్చు కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌కు రూ.30కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది. వీటి అమలు కోసం రూ.7.5కోట్లు ఇప్పటికే విడులైంది. గ్రామాలకు కేటాయించే నిధులతో చేపలు ఆరబెట్టేందుకు వేదికలు, సౌరశక్తితో యూనిట్లు, బహుళార్థకసాధక మత్స్య కేంద్రాలు, సాధారణ చేపల మార్కెట్లు, హైమాస్ట్ సోలార్ లైట్లు, జెట్టీల విస్తరణ, సీవీడ్ కల్చర్ ఫామ్‌లు, జీపీఎస్ హ్యాండ్‌సెట్‌లు, ప్రాణాలు రక్షించే ఉపకరణాలు, ఐస్ బాక్సులు, సముద్ర కేజ్ కల్చర్ తదితరాలు కల్పిస్తారు' అని మంత్రి తెలిపారు.

సత్యవర్ధన్ అపహరణ కేసులో నిందితుల కస్టడీ కోసం పిటిషన్

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో లొంగిపోయి, రిమాండ్‌లో ఉన్న నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్‌లను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు గురించి మరింత లోతుగా విచారించాల్సి ఉందని. . ఈ నేపథ్యంలో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. నిందితులు మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నోటీసుల నిమిత్తం కేసును ఈనెల 4వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని కోర్టు ముందు ఉంచాలని కోరుతూ వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్‌కు నోటీసులు జారీ చేసేందుకు, తదుపరి విచారణ నిమిత్తం 4వ తేదీకి వాయిదా పడింది.

విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో కూటమి నేతలు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులతో రెచ్చిపోయిన మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో వారిపై దాడి చేసిన కేసులో నిందితుడికి బెయిల్ ఇవ్వాలని దాఖలైన పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేయగా దీనిపై విచారణ జరగనుంది. అసభ్యకర పోస్టుల కేసులో నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరవగా పోలీసులపై దాడి కేసులో నెల్లూరు జైల్లో విజయ్‌భాస్కర్‌రెడ్డి జుడీషియల్ రిమాండ్‌లో ఉండడంతో బయటకు వచ్చే అవకాశం లేదు.

శతాధిక వృద్ధుడి మృతి

లోకమాన్య

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కంకిపాడులో నివసించే శతాధిక వృద్ధుడు పేటేటి నారాయణ లోకమాన్య(101) సోమవారం వృద్ధాప్య కారణాలతో మృతిచెందారు. ఆయనకు ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలు, తొమ్మిది మంది మనవరాళ్లు, ఆరుగురు మనవళ్లు, 15 మంది మునిమనవళ్లు ఉన్నారు. నారాయణ నిత్యం వ్యాయామం చేయడం, పత్రికలు చదవడం, ఆరోగ్య సూత్రాలు పాటించడంతోపాటు, సంస్కృతం, ఆయుర్వేదంలో సూచనలు చేస్తుండేవారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల స్థానిక బ్యాంకు కాలనీలోని అపార్టుమెంట్ వాసులు, గ్రామంలోని బంధువులు సంతాపం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో/కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ -210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, పశుసంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా
ల్యాబ్ అటెండెంట్ (LAB ATTENDANT) పోస్టుల నియామక ప్రకటన

మొత్తము ఖాళీలు: 6 (పొరుగు సేవల క్రింద మెరిట్ ప్రాతిపదికన)

Category	BC-B		BC-E		SC		ST		Grand Total
	G	W	G	W	G	W	G	W	
Local	1	0	0	1	1	1	1	0	6

విద్యార్హత: S.S.C. ఉత్తీర్ణులై ఉండవలెను.
వేతనము: నెలకు రూ. 15,000/-. వయస్సు: ది. 30-11-2025నాటికి 18-42 సం. (SC/ST అభ్యర్థులకు-5 సం., BC అభ్యర్థులకు 3 సం., PH అభ్యర్థులకు 10 సం. సడలింపు కలదు.)
దరఖాస్తు ఫీజు: రూ. 200/- Bank Crossed D.D.ని Joint Director, Animal Husbandry, Vijayawada వారి పేర తీసి దరఖాస్తునకు జతపరచవలెను.
దరఖాస్తు స్వీకరణ తేది: సంబంధిత సర్టిఫికెట్ నకలు కాపీలను (10th Marks memo, 4th to 10th Study certificates, Caste Certificate, Nativity Certificate) జతపరచి పూర్తి బయోడేటాతో సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, ముత్యాలంపాడు, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర, శివాలయము ఎదురు, విజయవాడ నందు 18-12-2025 సా. 4.00 గం.లోపు అభ్యర్థులు స్వయంగా లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా సమర్పించవలెను. తదుపరి దరఖాస్తులు స్వీకరించబడవు. ఇతర వివరములు కొరకు: సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, విజయవాడ, NTR జిల్లా నందు సంప్రదించవలెను. ఫోన్ నెం. 92466 02731.
సంయుక్త సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా
సం/- శ్రీ D.K.బాలాజీ I.A.S. కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేటు, ఉమ్మడి కృష్ణా జిల్లా

భవానీ భక్తులకు ఇబ్బందులు కలగనీయొద్దు

ఇంద్రకీలాద్రి: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో నాణ్యతా లోపాన్ని సహించమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు లక్షల మంది భవానీ దీక్షాధారులు అమ్మవారి సన్నిధిలో ఇరుముడి సమర్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

క్యూలైన్ పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఈఈ రాంబాబు

4న రాష్ట్ర సీనియర్ త్రోబాల్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర త్రోబాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రాష్ట్ర సీనియర్ (స్త్రీ, పురుషుల) త్రోబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి ఇ.సులోచన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు 28 నుంచి 31 వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో జరిగే జాతీయ సీనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 98484 39137 నంబరులో సంప్రదించాలని కోరారు.

పంచాయతీలకు నిధుల సర్దుబాటు

మచిలీపట్నం కార్పొరేషన్: వివిధ గ్రాంట్లకు సంబంధించిన నిధులను జిల్లాలోని పంచాయతీలకు సర్దుబాటు చేసినట్లు డీపీవో అరుణ తెలిపారు. ఈ ఏడాది జులై నుంచి డిసెంబరు వరకు 497 పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.15,89,814, ప్రొఫెషన్ ట్యాక్స్‌కు సంబంధించి రూ.38,35,944, సర్పంచుల గౌరవ వేతనం ఒక్కొక్కరికి నెలకు రూ.3వేల చొప్పున రూ.86,22,000 సర్దుబాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆయా నిధులు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దోహదపడతాయని చెప్పారు.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూపు, VJA, వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 967670 1122, 97047 41122

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

FLAT FOR SALE

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★ విఘ్నేష్ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

సత్యనారాయణ పురంలో 2/3/4 BHK Flats కొత్త మరియు పాతవి అమ్మబడును ✆ 94901 98654

HOUSE FOR SALE

246 చ.గ.ల్లో G+3+పెంట్‌హౌస్ గల బిల్డింగ్ 80,000 అద్దెలు. లిఫ్ట్ పూర్తి ప్లాన్ అప్రూవల్ E/Fతో ప్రసాదంపాడులో అమ్మకం. రేటు 3.25Cr. ✆ 94403 73594

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370

LAND FOR SALE

ఉయ్యూరు బైపాస్ నుండి 4KM దూరంలో కాటూరు గ్రామ పరిధిలో రైవస్ కాలువ ప్రక్కన 5 ఎకరాల 40 సెంట్లు మాగాణి పొలం అమ్మబడును. ✆ 93488 05256

PLOT FOR SALE

VJA కంచికచర్ల, ఔటర్ రింగ్ రోడ్డు DTCP & APCRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ॥ గ॥ 3,900/- నుండి 7,900/- ✆ 93906 65999

TO LET

COMMERCIAL

విజయవాడ గవర్నర్‌పేట కోదండ రామిరెడ్డి వీధి శ్రీమహేశ్వరీ ప్యాలెస్ నందు గ్రౌండ్ ఫ్లోర్ 2000 Sft ఫస్ట్‌ఫ్లోర్ 3500 Sft అద్దెకు కలదు. ✆ 9490915637

JOBS

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama & Vijayawada and Telecallers. ✆ 94324 54545.

స్వగృహ ఫుడ్స్‌లో VJA లో పనిచేయుటకు సేల్స్‌గరల్స్/సేల్స్ బాయస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 20 సం॥ to 30సం॥లోపు. పార్ట్‌టైం/ఫుల్‌టైం. ✆ 8142545000

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్. HDFC/AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728

Diploma/ITI Civil, Valuer Assistant, Computer Typist, Valuer's Off Ramavarappadu, Vijayawada. ✆ 98492 67445 tnsvaluer@gmail.com

Wanted Female Tele callers. Qualification any Degree. Age limit 25 to 45 years, Salary: 10000/- to 12000/- working location: Master Minds College, Vijaya wada. Contact: 89781 80832.

Wanted Billing Machine Operator For Restaurant. Salary: 16,000/- +. Milap Hotel, 1 Town, Vijaya wada-1. Cont: 83281 56668.

Wanted Telecallers. Q: Inter/ Degree. Salary: Negotiable ★ Gates Institute of Management & Sciences, VJA. ✆ 86449 93322

Required of Advocate Office of Mr.Alapati Vivekananda, High Court Advocate of AP Office in Benz Circle, VJA. Salary offered as per Market Standards. ✆:9390410747

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో మెడికల్‌షాపు (ఫార్మశి)లో పని చేయుటకు B.Pharmacy చదివి అనుభవం కలిగిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర. 93973 41745.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ వారికి బస్ డ్రైవర్స్ కావలెను. కంకిపాడు, ఎనికేపాడు, నందిగామ, మంగళగిరి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

డొమెస్టిక్ కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు గ్రౌండ్ స్టాఫ్ కావలెను. జీ: 18000/-to25000/- డ్యూటి 8:00గం||లు. ✆ 77309 58410, 99819 51405.

ఉప్పులూరు, పటమట, VJA సిటీలో సె||గార్డ్స్ & గాంధీనగర్‌లోని హాస్పటల్‌కు ఆయాలు కావలెను. వయస్సు, చదువుతో పనిలేదు అనుభవం బట్టి జీతం, వసతి కలదు. ✆ 924727 1222, 88019 53666

E-KART నందు అర్జెంటుగా Male/Female కావలెను. Qly:Inter, Any Degree. Salary 15000/- Online Available. 9014120139.

VJA గాంధీనగర్ హోటల్ రూమ్స్ నందు పని చేయుటకు M/F అనుభవం కల్గి డిగ్రీ/ DTP కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్టులు మల్టీ పర్పస్ స్టాఫ్, లేడి స్వీపర్ కావలెను ✆ 81256 69996.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహస్వామి

గూడూరు: రోగులకు మెరుగైన సేవలు అందించాలని డీసీ చైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి అన్నారు. మంగళవారం ఆయన గూడూరు సామాజిక ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాల్లోని రోగులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కృషితో ఆసుపత్రిలో అనేక వసతులు సమకూరాయని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులు సంతృప్తి చెందేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జేకాశీస్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

టమాట 41, వంగ 24, బెండ 42, పచ్చిమిర్చి 40, కాకర 36, క్యాబేజీ 24, క్యారెట్ 56, దొండ 27, బంగాళదుంప 31, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 46, దోస 28, సొర 20, అరటికాయ 7.6, చిక్కుళ్లు 95, బీర 32, చామదుంప 28, మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 44, కీరదోస 32, బీన్స్ 65, క్యాప్సికం 80, అలసందలు 50, చిలకడదుంప 40, కొత్తిమీర 18/09, పుదీనా 15/05 బుధవారం రైతు బజారుకు సెలవు, గురువారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు. - మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: రివాల్వర్ రీటా
మినీరేవతి: ప్రేమంటే
సిరికృష్ణ: రాజా వెడ్స్ రాంబాయి
సిరివెంకట్: ఆంధ్రాకింగ్ తాలూకా

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని ఇంగ్లీషుపాలెం నుంచి సుకర్లాబాదకు వచ్చే దారిలో చెత్త తొలగించపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ బాపిరాజు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

❖ నగరంలో పరాసుపేటలోని వివిధ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల వ్యర్థాలను రోడ్ల పక్కన గుట్టలుగా వేసి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పంచరాత్ర మహోత్సవాలు

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ప్రసిద్ధ ఆంజనేయ స్వామి ఆలయంలో పంచరాత్ర మహోత్సవాలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాట్లం, లక్ష్మీపురం లాకుల వద్ద, ఎండపల్లి గాంధీనగర్, నీలిపూడి తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

సమస్య పరిష్కరించేలా.. చెత్త తరలించేలా..!

నగర జనాభా: 1.80 లక్షలు
మొత్తం ఇళ్లు: 56వేలు
రోజు వచ్చే చెత్త: 84 టన్నులు
డంపింగ్ యార్డు కోసం సేకరించిన స్థలం: 13.40 ఎకరాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు చెత్తను బయో మైనింగ్ చేసే పనులు చేపట్టారు. ఈ ప్రక్రియ అక్టోబరు నాటికి పూర్తిచేసేలా తొలుత లక్ష్యం విధించారు. అయితే బయో మైనింగ్ చేసిన వ్యర్థాలు, ఎరువును పూర్తిస్థాయిలో తరలించకపోవడం, ఇంకా చెత్త ఉండటంతో నగరం నుంచి కొత్తగా పోగయ్యే వ్యర్థాలను రోడ్డుపై వేయాల్సి వస్తోంది.

యార్డుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి

మంత్రి రవీంద్ర ఆదేశాలతో..

ఇక్కడ నుంచి పోగయ్యే చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా సరాసరి జిందాల్ ప్లాంట్‌కు పంపేలా ఏర్పాట్లు చేశారు. అయితే డంపింగ్ యార్డులో వ్యర్థాలు ఎక్కడికక్కడ గుట్టలుగా పడి ఉండటం, కంపాక్టర్‌లు రావడం ఆలస్యం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను రహదారి పక్కన వేసి వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో పశువులు చేరుతున్నాయి. దీంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు బయో మైనింగ్ ద్వారా వేరు చేసిన వ్యర్థాలు, ఎరువు పూర్తిస్థాయిలో ఎప్పటికి తరలిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో మంత్రి రవీంద్ర ఆదేశాలతో సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు.

13.40 ఎకరాల సేకరణ

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోగయ్యే చెత్తను తరలించేందుకు డంపింగ్ యార్డు ఏర్పాటుకు మండల పరిధిలోని రుద్రవరంలో 13.40 ఎకరాలను సేకరించారు. సేకరించిన చెత్తను యార్డుకు తరలించేలా ప్రధాన రహదారి, డంపింగ్ యార్డుకు మధ్య బోదపై వాహనాల రాకపోకలకు వీలుగా కల్వర్టు నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారు. ఆ పనులు పూర్తి కావడంతో వాహనాలు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను రోడ్డుపై వేయకుండా రుద్రవరంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

మార్చిలోపు పూర్తయ్యేలా ప్రణాళిక

డంపింగ్ యార్డులోని చెత్త, బయో మైనింగ్ చేసిన ఎరువును వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తిస్థాయిలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం.

-బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

నిధుల మంజూరుపై హర్షం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరుపై ఎస్సీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మచిలీపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. రూ.10 కోట్లతో అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు కృషి చేసిన ఎంపీ బాలశౌరి, సహకరించిన మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్‌కుమార్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ వేము కోటేశ్వరరావు, అరవిందకుమార్, బుల్లయ్య, పాల్, శ్రీనివాస్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

ప్రతిభ చాటారు.. బహుమతులు సాధించారు

విజేతలతో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట): నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు', 'ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించగా వివిధ తరగతుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి.మాన్విత(9వ తరగతి), ఆర్.రక్షిత(8వతరగతి), పి.ఓజస్విని(8వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, డీన్ పీవీవీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డీన్ జి.మణికంఠతో పాటు ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మీపద్మ, కిశోర్, వెంకటేశ్వరరావు తదితరులు బహుమతులు అందజేశారు.

భగవద్గీత పారాయణంలో బంగారు పతకం

నీలిపూడి (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: ఇటీవల మైసూరు దత్త పీఠం వారు నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పారాయణం పోటీల్లో మండలంలోని నీలిపూడి గ్రామానికి చెందిన పుప్పాల సరళ.. ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఆ మేరకు గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందుకుంది. ఈ సందర్భంగా సరళను గురువు నాగలక్ష్మి, శిష్య బృందం, గ్రామస్థులు అభినందించారు.

గణపతి సచ్చిదానంద స్వామీజీ నుంచి బంగారు పతకం అందుకుంటున్న సరళ

పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

చల్లపల్లి: ప్రభుత్వం అందించే సహకారం ఉపయోగించుకుని ప్రతి ఇంటి నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా మారి లబ్ధి పొందాలని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్ర భూపాల్ అన్నారు. మంగళవారం చల్లపల్లి మహిళా సమాఖ్య భవనంలో మండల స్థాయి ఉద్యం రిజిస్ట్రేషన్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను అందిస్తున్నాయన్నారు. వ్యాపారవేత్తలంతా తమ యూనిట్లకు సంబంధించి ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఎంపీడీవో ఆనందకుమారి, డీఆర్‌డీఏ ఏపీఎం కె.శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..!

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని 50 డివిజన్ల పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిలో ఎక్కువ శాతం మందికి కరగ్రహారం లేఅవుట్ పరిధిలో స్థలాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 15,998 మందికి కేటాయించారు. వైకాపా హయాంలో కనీస వసతులు కల్పించకపోవడంతో ఉన్నా ఉపయోగం లేకుండా పోయాయని లబ్ధిదారులు వాపోతున్నారు. కాలనీలో కొంత మేర మెరక చేసి, చాలా ప్రాంతాన్ని చేయకుండా వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షం పడితే చాలు చెరువులా తయారవుతోంది. ప్రధాన రహదారి కూడా బురదమయంగా మారుతోంది. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్లడానికి అవకాశం ఉండదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కాలనీపై ప్రత్యేక దృష్టి సారించి పల్లపు ప్రాంతాన్ని మెరక చేయించడంతో పాటు వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అడ్డుగా వ్యర్థాలు.. ముంపులో పొలాలు!

పెడన, న్యూస్‌టుడే: డెల్టా ఆధునికీకరణలో బంటుమిల్లి కాలువపై కమలాపురం వద్ద కొత్త లాకులు నిర్మించారు. వీటి ద్వారా నీటి ప్రవాహాన్ని అధిక మొత్తంలో దిగువన ఉన్న బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు మళ్లిస్తున్నారు. అయితే పురాతన లాకులను నిరుపయోగంగా వదిలేయడంతో ఆ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకున్నాయి. కాలువలో అత్యధిక ప్రవాహ స్థాయి 600 క్యూసెక్కుల వరకు ఉంటుంది. గత వారం రాత్రి సమయంలో ఒక్కసారిగా ప్రవాహ స్థాయి పెరిగి బంటుమిల్లి మండలం సాతులూరు బంగ్లా వద్ద కాలువ గట్లను దాటి నీరు పొలాల్లోకి ప్రవేశించింది. కమలాపురం పాత లాకులకు మరమ్మతులు నిర్వహించి కొంత ప్రవాహాన్ని ఇక్కడ నిలుపుదల చేస్తే దిగువ ప్రాంతాల్లో ముంపు బాధలు తప్పుతాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

కమలాపురం లాకుల వద్ద ఇలా..

అసలే కోత.. ఆపై చెరువు!

పెడన, న్యూస్‌టుడే: వడ్లమన్నాడు-చెన్నూరు ప్రధాన రహదారి నుంచి కొప్పల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కొప్పల్లి గ్రామంలో పంచాయతీ చెరువు పక్కగా కోతకు గురై వాహనదారులను భయపెడుతోంది. అటుగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కొప్పల్లి, ముచ్చిలిగుంట, చేవేంద్రపాలెం, మర్రిగుంట, ఉప్పలకలవగుంట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు ఈ దారిని వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన గ్రామస్థులను వేధిస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రిస్మస్ సంబరాలు ప్రారంభం

కృత్తివెన్ను (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలో క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లోయ స్టార్లు ఏర్పాటు చేసి పండగకు స్వాగతం పలుకుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది.

కృత్తివెన్నులో నక్షత్రం

మెరుగైన భవితకు ప్రణాళికలు సిద్ధం చేయండి

దేశాయిపేట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్ (మచిలీపట్నం): విద్యార్థుల మెరుగైన భవితకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నేపథ్యంలో మంగళవారం నగర పరిధిలోని వివిధ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజుపేట నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) బేస్‌లైన్ పరీక్షలను పరిశీలించారు. దేశాయిపేట ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ జాదూయి పిటారా పథకం ద్వారా వచ్చిన పరికరాలు, క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడా సామగ్రిని చూశారు. మెగా సమావేశానికి పాఠశాలల్లో చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీసి.. ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల పురోగతి తెలిపే హోలిస్టిక్ కార్డులు, బేస్‌లైన్ పరీక్షల నివేదికలు అందజేసి వారి బిడ్డలు ఏస్థాయిలో ఉన్నారో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ పరికరాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగాలన్నారు. మెగా సమావేశంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. కలెక్టర్ వెంట డిప్యూటీ ఈవో శేఖర్‌సింగ్, ఎంఈవోలు దుర్గాప్రసాద్, గురుప్రసాద్, శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కబడ్డీ పోటీలకు సిద్ధంకండి

గుడివాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏపీల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలు 2026 జనవరి 19 నుంచి 23 వరకూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నామని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. దేశం నలుమూలల నుంచీ వచ్చే బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు, కోచ్‌లు, కావాల్సిన వసతిపై ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సుమారు 45 జట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.బాల సుబ్రహ్మణ్యం, పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎంఈ ప్రసాద్, జాతీయ కబడ్డీ పోటీల నిర్వహణ కార్యదర్శి ఎస్.గంగాధర్, సభ్యులు రవిబాబు, అనీల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గుడివాడ, గుడ్లవల్లేరు - న్యూస్‌టుడే: గంజాయి అమ్ముతున్న 9 మంది యువకుల నుంచి 3.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు వెల్లడించారు. ఎస్.ఐ సత్యనారాయణతో కలసి మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కౌతవరం రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయితో ఉన్న గుడ్లవల్లేరు, పమిడిముక్కల, గుడివాడ, మచిలీపట్నానికి చెందిన ఎరికపాటి సందీప్, బెజ్జం గిరీష్, నత్తా ధనేష్, దరిశం పవన్‌కల్యాణ్, ఎరిసే అజయ్, లవుడియా సాంబయ్య, మేకా మోక్షజ్ఞ, ప్రత్తిపాటి రాజేశ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 3.100 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరికి గంజాయిని సరఫరా చేస్తున్న హరీష్ అనే వ్యక్తి వేరే రాష్ట్రీయుడని, అతడిని గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. మాదక ద్రవ్యాలు అమ్మే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదానికి మలుపు

నగరంలోని శివగంగ ప్రాంతం నుంచి కృష్ణావిశ్వవిద్యాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఆ ప్రాంతంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పాటు ముళ్లపొదలు రోడ్డుపైకి చొచ్చుకొచ్చాయి. కనీసం సూచిక కూడా లేకపోవడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. కృష్ణావిశ్వవిద్యాలయానికి వెళ్లే అధ్యాపకులు, విద్యార్థులతోపాటు బందరు మండలంలోని పాతేరు, కోన తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కూడా అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి పొదలు తొలగించి సూచిక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే

కోటి దీపోత్సవానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి తెలుగు బుక్ ఆఫ్‌రికార్డ్స్ గుర్తింపు లభించడం ఆధ్యాత్మిక రంగంలో కొత్త అధ్యాయమని తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చారిత్రక రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల కార్తిక మాసం సందర్భంగా నిర్వహించిన కోటి దీపోత్సవం ప్రత్యేక గుర్తింపు దక్కించుకొని, బందరు కీర్తిని ఇనుమడింపజేసిందన్నారు. ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి మాట్లాడుతూ నవంబరు 13న ఆలయ ప్రాంగణంలోని పరమశివుని విగ్రహం ఎదుట 3,900 మంది భక్తులతో కోటి దీపోత్సవం నిర్వహించగా.. తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందని వివరించారు. ఆ మేరకు సంబంధిత పత్రాన్ని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ దేసు నీరజ, ఈవో ఆంజనేయస్వామిలకు తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ సంస్థ వ్యవస్థాపకుడు డా.చింతపట్ల వేంకటాచారి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్‌కుమార్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద తదితరులు పాల్గొన్నారు.

ఈవో ఆంజనేయస్వామికి పత్రం అందజేస్తున్న వేంకటాచారి

వద్దు కొనుగోలు చేయడం లేదని ఆందోళన

గూడూరు: మండల పరిధిలోని ముక్కొల్లులో పలువురు రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదంటూ మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఏవో శివరామకృష్ణలు అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అందరి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ గ్రామోత్సవం

పెడన, న్యూస్‌టుడే: పెడన గ్రామ దేవత పైడమ్మ ఉత్సవాలు ఈ నెల 4న ప్రారంభంకానున్న నేపథ్యంలో స్థానిక పాతపేటలోని ముత్యాలమ్మ ఘటం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం ఆచారంగా వస్తోంది. గత నెల 26 నుంచి పురవీధుల్లోకి వస్తోన్న ముత్యాలమ్మకు భక్తులు పసుపు, కుంకుమలతో స్వాగతం పలుకుతున్నారు. ఈ నెల 3 వరకు ఘటం అమ్మవారి గ్రామోత్సవం చేస్తారు. మంగళవారం మఠంవీధి, బంగ్లా స్కూలు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉత్సవం నిర్వహించారు.

ఎక్కడి ధాన్యం అక్కడే..!

దిత్వా తుపాను కారణంగా కురుస్తున్న తేలికపాటి వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బందరు, పెడన నియోజకవర్గాల్లో ఎక్కువ శాతం యంత్రాలతో వరి కోతలు కోయగా.. ఆ ధాన్యం అంతా రహదారుల పక్కన, పొలం దిబ్బలపై ఉంది. వర్షాలతో ఆ ధాన్యాన్ని పరదాలతో కప్పి కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. గూడూరు, పెడన, బందరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఏ ప్రాంతంలో చూసినా రహదారుల పక్కన ధాన్యం రాశులపై పరదాలు కప్పి ఉండటం.. అన్నదాతల దయనీయ పరిస్థితిని తెలియజేస్తున్నాయి. పట్టుబడి చేయడానికి కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. వరి కోతలను రెండ్రోజులు నిలిపివేయాలని పెడన తహసీల్దార్ అనిల్‌కుమార్ రైతులకు సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని భద్రపర్చేందుకు మండల వ్యాప్తంగా 400 టార్పాలిన్లను పంపిణీ చేసినట్లు ఏవో సజ్జా జెన్నీ చెప్పారు. పెడన ప్రాంతంలో బుధవారం కూడా వర్షాలు కురుస్తాయని తహసీల్దార్ తెలిపారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట), పెడన

కొంగంచర్లలో రహదారి పక్కన రాశులు

శిథిల భవనం.. భయం భయం..

న్యూస్‌టుడే, పెడన

పెడన మండల విద్యుత్తు సెక్షన్ కార్యాలయం శిథిలస్థితికి చేరింది. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారడంతో విధుల నిర్వహణకు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక తోటమూలలో 1990 దశకంలో విద్యుత్తు సెక్షన్ కార్యాలయం, 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. అప్పట్లో దివంగత మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి ఈ భవనాలను ప్రారంభించారు. అప్పటి నుంచి నిర్వహణ లేక కార్యాలయ భవనం ప్రమాదకరంగా మారుతోంది. అధికారులు మరమ్మతులు చేయించినప్పటికీ తాత్కాలికంగా మారాయి. ఇప్పటికే పలుమార్లు పెచ్చులు కింద పడి ఉద్యోగులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ కార్యాలయంలో ఏఈ, సబ్ ఇంజినీర్‌తో పాటు సబ్‌స్టేషన్ షిఫ్ట్ లైన్‌మెన్లు ఉంటారు. సందర్శకుల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. పెడన అర్బన్, రూరల్ మండలాల్లో పనిచేసే ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న భవనం ప్రమాదకరంగా మారడం ఆందోళన కలిగిస్తోంది.

విశాల ప్రాంగణం..

అప్పట్లో సబ్‌స్టేషన్, సెక్షన్ కార్యాలయాల కోసం దాదాపు 30 సెంట్ల స్థలాన్ని తోటమూలలో సేకరించారు. అప్పటితో పోల్చితే ప్రస్తుతం సర్వీసులు వేలల్లో పెరిగాయి.

ఆందోళన చెందుతున్న ఉద్యోగులు

పెడన సెక్షన్‌లో దాదాపు 25వేల సర్వీసుల వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ భవనం సరిపోక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక పెడనకు పదేళ్ల కిందట విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయం వచ్చింది. ఈ కార్యాలయ పరిధిలోకి పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలు వస్తాయి. ప్రస్తుతం ఈ కార్యాలయాన్ని మార్కెట్ యార్డు ఎదురుగా ఒక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్తు కార్యాలయాలకు సరైన భవనాలు లేని నేపథ్యంలో సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాలను తోటమూలలోని సెక్షన్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చొరవ తీసుకుని ట్రాన్స్‌కో నుంచి నిధులు సమీకరించాలని ప్రజలు సూచిస్తున్నారు.

సంపద కేంద్రాలను పక్కాగా నిర్వహించాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కొంకేపూడి సంపద కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లాప్ మిత్రలు పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించొద్దని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో కౌసల సర్వే కింద ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం నుంచి సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభమైనట్లు ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి రోజుకి ఇద్దరికి చొప్పున పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

ప్రకటన

నా క్లయింటు కృష్ణా జిల్లా, మచిలీపట్నం, లక్ష్మణరావుపురం వాస్తవ్యులు పెంటా సాయి జితేంద్ర గారి సంజాయిషీ మేరకు ఇచ్చిన ప్రకటన. నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని రాజులపాటి వీర వసంతరావు గారి వద్ద కొనుగోలు చేయుటకు నిశ్చయించుకొనియున్నారు. సదరు రాజులపాటి వీర వసంతరావు గారు సదరాస్తిని తాడికొండ మల్లిఖార్జున ప్రసాద్ గారి వద్ద మచిలీపట్నం స.రి. వారి ఆఫీసులో ద.నెం. 2490/2025 రు ద్వారా క్రయం పొందియున్నారు. సదరాస్తిని కాశీనాధుని గాయత్రి గారు పాలకీర్తి సీతమ్మ గారి వద్ద మచిలీపట్నం స.రి. వారి ఆఫీసులో ద.నెం. 5313/1987 రు ద్వారా క్రయం పొందియున్నారు. తదుపరి కాశీనాధుని గాయత్రి గారు సదరాస్తిని గురించి ఎట్టి లిఖితపూర్వకమైన ఏర్పాట్లు చేయకుండా ఇంటెస్టేట్‌గా ది.03-07-1997వ తేదీన మరణించినారు. అంతేగాక కాశీనాధుని గాయత్రి గారికి ఆమె భర్త గారైన మట్టిగుంట మదన్‌మోహన్ గారికి సంతానము లేనందున సదరాస్తికి మదన్‌మోహన్ గారే ఏకైక వారసునిగా సదరాస్తిని మట్టిగుంట మదన్‌మోహన్ గారు సదరాస్తిని తాడికొండ మల్లికార్జున ప్రసాద్ గారికి మచిలీపట్నం స.రి. వారి ఆఫీసులో ద.నెం 1301/2006రు ద్వారా విక్రయించియున్నారు. పాలకీర్తి సీతమ్మ గారు సదరాస్తిని చలమలశెట్టి చంచలరావు వగైరాల వద్ద ద.నెం. 1050/1987 ద్వారా క్రయం పొందియున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు ఆస్తికి కాశీనాధుని గాయత్రి గారికి, మట్టిగుంట మదన్మోహన్ గారు కాక యింకా ఎవ్వరైనా వారసులు గానీ, హక్కుదారులు గానీ, ఆక్షేపణలు గాని, మరియు సదరాస్తిపై తాకట్టులు గానీ, ఎగ్రిమెంటులు గాని పొంది ఉన్న యెడల మీ యొక్క అభ్యంతరములు దిగువ అడ్రసుకు ఏడు రోజులలోగా వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినది. లేని యెడల సదరాస్తి నిష్పేచి ఆస్తిగా పరిగణించబడును.

షెడ్యూలు ఆస్తి:- కృష్ణా జిల్లా, మచిలీపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, మచిలీపట్నం టౌన్, చిలకలపూడి, లక్ష్మణరావుపురం, సర్కారుతోట, ఆర్.యస్. నెం. 402 రులో మున్సిపల్ వార్డు నెం. 19 రు, డోరు నెం. 19/257 రునకు సమీపమున గల 250 చ.గ.లు లేక 209.03 చ.మీ.లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.
తూర్పు: వడ్లమూడి శాంత గారి యిల్లు స్థలము అ. 50-0లు,
దక్షిణం: 30 అడుగుల వెడల్పు గల రోడ్డు అ. 45-0లు,
పడమర: మోకా తులసీకృష్ణ గారి స్థలము అ. 50-0లు,
ఉత్తరం: చలమలశెట్టి జయలక్ష్మి గారి స్థలము అ. 45-0లు

సం/- కోట మెహర్‌ప్రసాద్
అడ్వకేట్, డోరు నెం. 17-305ఎ, ఈడేపల్లి,
మచిలీపట్నం, ఫోన్ నెం: 94407 72309
మచిలీపట్నం, తేది: 01-12-2025

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మహానందీశ్వరుడికి అభిషేకం

యనమలకుదురు, న్యూస్‌టుడే: యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం త్రయోదశి సందర్భంగా ప్రదోషకాలంలో మహానందీశ్వరుడికి అభిషేకం, అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నర్సింహారావు, ఈవో భవానీ, అర్చకులు సాగర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

★ కానూరు కృష్ణానగర్‌లో గత కొన్ని రోజులుగా మురుగు కాల్వలో పూడిక తీత పనులు జరగక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ షేక్‌నజీర్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ★ కానూరు పంటకాలువరోడ్డులో కొన్ని రోజులుగా చెత్త తీయడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన శానిటరీ అధికారి సుధాకర్ సిబ్బందిని పంపి చెత్త తొలగించారు. ★ యనమలకుదురు డొంకరోడ్డులోనూ చెత్త తొలగించట్లేదని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ★ గన్నవరం రాయ్‌నగర్ పరిసరాల్లో డ్రెయిన్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలతో చాలా ఇబ్బందిగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఈవో చెన్నకేశవులు వ్యర్థాలను తొలగించారు. సమస్య పరిష్కారంతో ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ★ గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయని.. స్తంభం పక్కకు మార్చాలని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన విద్యుత్తు శాఖ అధికారులు తీగలు సరి చేసి సమస్య పరిష్కరించారు.

-కానూరు, యనమలకుదురు, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

చినుకు రాలకున్నా.. చింత తీరలేదు..!

నాలుగు రోజులుగా మబ్బు వాతావరణం • ధాన్యం ఆరబోతకు వెతలు

హనుమాన్‌జంక్షన్, గన్నవరం గ్రామీణం, ఉయ్యూరు గ్రామీణం, పెనమలూరు, న్యూస్‌టుడే

ఖరీఫ్ వరి పంటకు వరుణుడి బెడద వీడటం లేదు. నవంబరులో వచ్చే తుపాన్లు, భారీ వర్షాల బారిన పడకుండా రైతులకు పంట చేతికొచ్చేలా ప్రభుత్వం ముందస్తుగానే సాగునీరు విడుదల చేసినా, ఐదు రోజుల క్రితం దిత్వా తుపాను హెచ్చరికలు అన్నదాతల్ని ఆందోళనకు గురి చేశాయి. ఇప్పటివరకు వాన పడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నా, ముసురు వాతావరణం వీడకపోవడం, మంగళవారం అక్కడక్కడా స్వల్పంగా చినుకులు రాలడం కలవరానికి గురి చేసింది. ఇప్పటికే కోతలు పూర్తి చేసి, నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టడం ఇప్పుడు కర్షకులకు ప్రహసనంగా మారింది. ఓ వైపు ఎండ జాడ లేకపోవడం, మరోవైపు ఎప్పుడు జల్లులు విరుచుకుపడతాయో తెలియకపోవడంతో రైతులకు కంటి మీద కునుకు కరవైంది. పనల మీద ఉన్న పంటను చకచకా కుప్పలుగా వేయడం, నూర్పిడి చేసిన ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు వీలుగా రోడ్లపై ఆర

పెరికీడులో రహదారిపై ధాన్యం ఆరబోత

బెట్టడం మంగళవారం గన్నవరం నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాల్లో కనిపించింది. మరో పది రోజులు వాతావరణం అనుకూలిస్తే కోతలు పూర్తయి, కుప్పలు వేసే పరిస్థితులు నెలకొనడంతో పాటు, నూర్పిడి చేసిన ధాన్యం అమ్ముకునే వెసులుబాటు లభిస్తుందని అన్నదాతలు భావిస్తున్నారు.

రైస్‌మిల్లుల పరిశీలన

దిత్వా తుపాను ప్రభావం వల్ల ఇప్పటికే కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా ఉయ్యూరు తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని చిన ఓగిరాల, సాయిపురం, జబర్లపూడి, ముదునూరు, పెద ఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. రైస్‌మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇప్పటివరకు ఏడు వేల టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామని తెలిపారు. భారీ వర్షాలు కురిసిన 1016 వరి విత్తనం దెబ్బతినలేదని, దీన్ని కొనుగోలు చేయడానికి మిల్లర్లు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

☛ పెనమలూరు మండలంలో 4 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తవ్వాల్సి ఉంది. కోసి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోకుండా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు 350 టార్పాలిన్ పట్టాలు అందజేశారు.

చిన ఓగిరాల రైస్‌మిల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

సామాజిక సేవ అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: దాదాపు రెండు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న ప్రవంతి ట్రస్టు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ట్రస్టు తరఫున హనుమాన్‌జంక్షన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు మంచినీటి శీతల యంత్రం, స్వయం ఉపాధి నిమిత్తం బాపులపాడుకు చెందిన కొప్పాక సాంబ సత్యనారాయణకు బడ్డీ కొట్టుని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం, స్వయం ఉపాధి విభాగాలలో సేవా కార్యక్రమాలు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు వీరమాచనేని బుజ్జి, కనగల శ్రీనివాసరావు, గొట్టాపు వాసుదేవరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉపన్యాస పోటీలు

తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజేతలతో ప్రిన్సిపల్ కనకదుర్గ, ఉపాధ్యాయులు జానకి, విజయ

తాడిగడప(కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థి జీవితంపై చరవాణి ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన శ్రీలక్ష్మీప్రవల్లిక, షైనీ, సంధ్యలను ప్రిన్సిపల్ కనకదుర్గ, ఉపాధ్యాయులు జానకి, విజయ బహుమతులు అందించారు.

రహదారులకు మరమ్మతులు చేయండి: ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలో గుంతలు పడిన పంచాయతీరాజ్ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆ శాఖ చీఫ్ ఇంజినీర్ విజయకుమారిని విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. గన్నవరం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యేను మంగళవారం ఆమె కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో మురుగు పారుదల సమస్యలు తలెత్తకుండా అవసరం ఉన్నచోట కాల్వలు నిర్మించాలని ఆదేశించారు. నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని.. సంబంధిత మంత్రితో మాట్లాడి మంజూరు చేయిస్తానని యార్లగడ్డ చెప్పారు.

విజయకుమారితో మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే వెంకట్రావు

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మాట్లాడుతున్న డీఈవో పి.వి.జె.రామారావు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు అన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉయ్యూరు డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న జరిగే జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షా కేంద్రాల వివరాలు, విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతుల గురించి చెప్పారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సిన బాధ్యతలను వివరించారు. అనంతరం మండలస్థాయి ఉపాధ్యాయుల క్రీడాపోటీలను డీఈవో ప్రారంభించారు. ఈ సమావేశానికి డీవైఈవో పద్మారాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జాకీర్ అహ్మద్, డివిజన్‌లోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.23 వేలు అందజేత

ఉయ్యూరు, న్యూస్‌టుడే: బీవీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా పేద విద్యార్థిని జొన్నలగడ్డ అఖిలకు ట్రస్టు ఛైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో రూ.23 వేలు ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో మంచి ఉత్తీర్ణత సాధిస్తే ప్రతి ఏడాది ఇదే విధంగా ఆర్థిక సహాయం చేస్తానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'రోలర్ బాస్కెట్‌బాల్'లో క్రీడాకారిణి ప్రతిభ

కంకిపాడు, న్యూస్‌టుడే: 'రోలర్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం పునాదిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కంకిపాడులోని సెయింట్ మేరీస్ హైస్కూలుకు చెందిన విద్యార్థిని గోగులమూడి ఇష్మిత రెండు విభాగాల్లో ప్రతిభ చూపి బంగారు, రజత పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. అప్పనవీడుకు చెందిన పొట్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 350 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, ఈవో పి.తారకేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు. గన్నవరం మండలం ముస్తాబాద పీహెచ్‌సీ పరిధిలో నీతోడు మానసిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ జలం.. పథకం నిరుపయోగం

రామన్నగూడెంలో మంచినీటి పథకాల నిర్వహణపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా, అధికార యంత్రాంగంలో కదలిక కనిపించడం లేదు. రక్షిత పథకానికి అనుసంధానంగా నిర్మించిన ఫిల్టర్ బెడ్లు ఏళ్ల కిందటే మూలకు చేరగా, సురక్షితమైన తాగునీరు అందించేందుకు వీలుగా నిర్మించిన ఆర్వో నీటి పథకం కూడా నిరుపయోగంగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో దీనిని అసలు పట్టించుకోకపోవడంతో పరికరాలు చెడిపోయి పూర్తిగా రూపురేఖలు కోల్పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా అధికారులు స్పందిస్తారనుకుంటే నిధుల సాకుతో మిన్నకుండిపోవడంతో, బయటి ప్రాంతాల నుంచి ఆటోల్లో వచ్చే మంచినీటి డబ్బాలను కొనుగోలు చేయడం గ్రామస్థులకు అనివార్యంగా మారింది.

- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

గాంధీపార్కు.. నిర్వహణ అధ్వానం

కంకిపాడు, న్యూస్‌టుడే

కంకిపాడు బస్టాండ్ కూడలిలో ఉన్న 30 సెంట్ల గాంధీపార్కు డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. గతంలో పచ్చదనం, విద్యుత్ వెలుగులు, చిన్నారులు, పెద్దలతో కళకళలాడిన పార్కు క్రమంగా వైభవాన్ని కోల్పోయి అసాంఘిక పనులకు నిలయంగా మారింది. 12 ఏళ్ల కిందట అప్పటి 'ఉడా' నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. ఆ తర్వాత నిర్వహణ మరిచారు. గత రెండేళ్లలో వివిధ సేవా సంఘాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 20 సార్లు సుమారు 500 మొక్కలు నాటినా, వాటి సంరక్షణ చేపట్టలేదు. కంకిపాడు ప్రధాన కూడలిలో ఉన్న దీని ప్రస్తుత మార్కెట్ విలువ రూ.15 కోట్ల వరకు ఉంటుందని అంచనా. కేవలం గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం రోజు శుభ్రం చేయడంతో సరిపెడుతూ వస్తున్నారు. నిర్వహణ లోపంతో గేట్లు తుప్పుపట్టి ధ్వంసమయ్యాయి. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాల్సిన చోట పాముల పుట్టలు, వ్యర్థాల గుట్టలు, ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. దీంతో 15 వేల జనాభా కలిగిన కంకిపాడులో సేదతీరడానికి చోటు కరవైంది. ప్రతి గ్రామంలో పార్కులు ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికకు అనుగుణంగా 'గాంధీ పార్కు'కు పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పార్కులో పేరుకుపోయిన వ్యర్థాలు

తుప్పుపట్టి ధ్వంసమైన గేట్లు

ఈ భవనాల గతి ఇంతేనా?

కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్ర (సీహెచ్‌సీ) పాత భవన సముదాయం, ప్రాంగణాలను గత మూడున్నర ఏళ్లుగా నిరుపయోగంగా ఉంచడంతో విష పురుగులకు నిలయంగా మారింది. బందరు రోడ్డుకు సమీపంలో ఉన్న విశాలమైన స్థలం విలువ రూ.కోట్లలో ఉంటుంది. సంబంధితశాఖ సకాలంలో స్పందించకపోవడంతో విద్యుత్ బకాయిలు రూ.లక్షలకు చేరాయి. ఇక్కడ ఉన్న నాలుగు భవనాల్లో మూడు పటిష్ఠంగా ఉన్నాయని మరమ్మతులతో ఉపయోగంలోకి తీసుకురావచ్చని గతంలో సాంకేతిక నిపుణులు నివేదిక పంపారు. ఈ మేరకు పీహెచ్‌సీగానైనా ఉపయోగించుకోవాలని గ్రామస్థులు సూచిస్తున్నారు.

- న్యూస్‌టుడే, కంకిపాడు

PUBLICATION REQURING APPEARANCE OF ACCUSED IN THE COURT OF THE HON'BLE X ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT VUYYURU
C.C.NO 204/2018

Between:
Kondraju Narasimha Raju. S/o. Pullam Raju, Hindu, aged above 36 years, R.M.P. Doctor, Kapileswarapuram Village, Pamidimukkala Mandal, Krishna District. **...Complainant**
And
Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, Hindu, aged above 50 years, House wife, Resident of Katuru Village, Vuyyuru Mandal, Krishna District. **...Accused**
To, Bolisetty Padma,
W/o. Late Venkata Rama Subrahmanya Prasad,
Hindu, aged above 50 years, House wife, Resident of Katuru Village, Vuyyuru Mandal, Krishna District.
Where as complainant has been made by one Kondraju Narasimha Raju. S/o. Pullam Raju. Hindu. aged above 36 years, R.M.P. Doctor, Kapileswarapuram Village, Pamidimukkala Mandal, Krishna District. against Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahmanya Prasad, Hindu, aged above 50 years, House wife, Resident of Katuru Village, Vuyyuru Mandal, Krishna District. before X Addl. Judicial Magistrate of First Class Court, Vuyyuru, Krishan District for the offence punishable under Sec.138 R/w. 142 of Negotiable Instruments Act. It has been returned to a warrant of arrest there upon issued that the said Bolisetty Padma W/o. Late Venkata Rama Subrahamnaya Prasad, cannot be found and whereas it has been shown to the satifaction of the honourable Court that the Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahamnaya Prasad, as absconded (or is concealing herself to avoid the service if the said warrant). Thereafter you are hereby informed that you-Bolisetty Padma, W/o. Late Venkata Rama Subrahamnaya Prasad, aged about 50 years, House wife, Resident of Katuru Village, Vuyyuru Mandal, Krishna District, is hereby request to appear before the Hon'ble X Addl. Judicaial Magistrate of First Class Court at Vuyyuru, Vuyyuru Town and Vuyyru Mandal, Krishna District either in person or through advocate, to answer the said complaint on 19-12-2025 to which date the above case was posted for your appearance, or else it will be followed further in th above case.

KAGITHA GOPI CHANDU, ADVOCATE
VUYYURU-521165, Cell No. 98492 86239
Vuyyuru, Dt. 1-12-2025.

ప్రకటన

నా క్లయింటు అయిన Visakhapatnam Congregation of Jehovah's Witnessess Trust, చినగంట్యాడ, గాజువాక, విశాఖపట్నం తరఫున ఛైర్మన్ శ్రీ దండ బాబూరావు గారు, కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, గన్నవరం వాస్తవ్యులైన మూలె జయరామిరెడ్డి & మూలె వెంకటరెడ్డి గారల నుండి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు ఒప్పందం కుదుర్చుకుని, కొంత సొమ్ము బయానాగా ఇచ్చియున్నారు. షెడ్యూలు ఆస్తిని సదరు మూలె జయరామిరెడ్డి & మూలె వెంకటరెడ్డి గారలు ది. 11-10-2006 తేదీన గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి గారి వద్ద నుండి క్రయ దస్తావేజు నెం. 6030/2006 ద్వారా క్రయం పొందినారానిన్నీ, తదాది సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారనిన్నీ, ఈ ఆస్తి తాలూకు పూర్వపు లింకులలో అట్లూరి రామబ్రహ్మయ్య గారి మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు సదరు మూలె జయరామిరెడ్డి & మూలె వెంకటరెడ్డి గారలకు వారికి పూర్వపు యజమానులు ఇవ్వలేదనిన్నీ తెలియజేసినారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎవరికైననూ చెల్లదగిన అభ్యంతరములు, హక్కులు, క్లయిములు, జప్తులు, ఇంజక్షన్లు, ఇతర దావా తగాయిదాలు వగైరాలు వున్న యెడల వారు 7 రోజుల లోపు వ్రాతపూర్వకముగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలియజేయవలయును. లేని యెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాద ఆస్తిగా పరిగణించి నా క్లయింటు సక్రమమైన క్రయ దస్తావేజు పొందగలరు. దరిమిలా వచ్చు క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు.

షెడ్యూలు: కృష్ణా జిల్లా, గన్నవరం స॥రి॥ వారి యిలాకా, గన్నవరం మండలం, చిన అవుటపల్లి గ్రామ ఆర్.ఎస్.నెం. 116/5 (సర్వే రిపోర్టు ప్రకారం రీ.సర్వే/సబ్ డివిజన్/ఎల్.పి.ఎం. నెం: 73) దాఖలా య. 0.25 సెంట్లలో ఉత్తరము వైపున గల య. 0.20 సెంట్లు భూమికి హద్దులు: **తూర్పు:** బొల్లా హిమబిందు గారి భూమి, **దక్షిణం:** పాతూరి పూర్ణేందుముఖి గారికి విక్రయించిన భూమి, **పడమర:** గన్నవరం పొలిమేర డొంక, **ఉత్తరం:** బొల్లా హిమబిందు గారి భూమి.

ఇట్లు: **అంబటి సంజయ్‌కుమార్**
న్యాయవాది, # 24-25-73, 2nd క్రాస్ రోడ్, బాలాజీ నిలయం
దుర్గాపురం, విజయవాడ-3.
విజయవాడ,
తేది: 02-12-2025 సెల్: 98490 77779

పురపాలిక ఖాళీగా..

తాడిగడపలో పూర్తిస్థాయిలో లేని ఉద్యోగులు

కానూరు, తాడిగడప, పోరంకి, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలక సంఘం ఏర్పాటై 60 నెలలు పూర్తికావస్తుంది. కానీ, ఇప్పటివరకు అన్ని శాఖలకు పూర్తిస్థాయిలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కీలకమైన టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, అకౌంట్స్, పారిశుద్ధ్య విభాగాల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేరు. సిబ్బంది విషయంపై ఇక్కడ పనిచేసిన కమిషనర్లు అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితుల్లో మార్పు లేదు. కొత్త సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో ఉద్యోగులు వస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

✦ తాడిగడప పురపాలక సంఘంలో సుమారు రెండు లక్షల మంది నివసిస్తున్నారు. కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు సర్కిల్స్ ఉండగా 19 సచివాలయాలు ఉన్నాయి.

తాడిగడప పురపాలక సంఘం కార్యాలయం

అకౌంట్స్ విభాగంలో.. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులలో ఎవరూ లేరు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో రెండు టీపీవో పోస్టులు, 19 వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగంలో.. రెండు ఏఈ పోస్టులలో ఉద్యోగులు రావాల్సి ఉంది. మొత్తం 425 మంది పారిశుద్ధ్య కార్మికుల అవసరం ఉండగా రెగ్యులర్‌గా 304 మంది ఉన్నారు. 69 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇంకా 52 మందిని నియమించాల్సి ఉంది. 'సిబ్బంది కొరత ఉన్నా ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని సేవలు అందిస్తున్నాం. వివిధ శాఖలలో ఉన్న ఖాళీల సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించాం' అని కమిషనర్ షేక్‌నజీర్ తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గుణదల-కానుమోలు, గుణదల-రంగన్నగూడెం 132 కె.వి విద్యుత్తు మార్గంలో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు గన్నవరం విమానాశ్రయం ఉపకేంద్రానికి ఫీడర్లను అనుసంధానం చేసే పనులు చేపడుతున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నారు. ఈ కారణంగా సాధారణ విద్యుత్తు వినియోగదార్లకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో విజయవాడ ఈఈ ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

Smt. VELAGAPUDI DURGAMBA
SIDDHARTHA LAW COLLEGE
Kanuru, VIJAYAWADA-7 Ph:0866-2582592
(Affiliated to Krishna University) Approved by Bar Council of India)
Sponsored by: Siddhartha Academ of General & Technical Education, Vijayawada -10

SPOT ADMISSIONS FOR 3&5- YEAR (UG) & 2-YEAR LL.M(PG) LAW COURSES FROM 03-12-2025 TO 06-12-2025

Vacant seats in 3-year LL.B & 5-Year B.A.LL.B and 2-Year LL.M Courses in the college arose due to non-reporting of candidates allotted by Convenor, LAWCET-2025 will be filled by the College from **03-12-2025 to 06-12-2025** in the college through "Spot Admissions" in accordance with the guidelines issued by the Convenor, LAWCET-2025. Candidates seeking admission are informed to be present with all their original certificates including LAWCET-2025 rank card, Hall ticket and the prescribed Tuition fee on that day.
Note: The admissions made in the institution are provisional only and subject to ratification by the Convenor, LAWCET-2025. As per the guidelines, the students admitted through "spot admissions" are not eligible for tuition fee reimbursement.
Vijayawada,
Dt. 02-12-2025 **Sd/- PRINCIPAL**

సచివాలయాల ద్వారా సత్వర సేవలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలందేలా సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి కె.సంపత్‌కుమార్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం మండల కేంద్రమైన బాపులపాడులోని మూడు సచివాలయాలను సందర్శించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమీక్షించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందితో పేర్కొన్నారు. మండల పరిషత్తు పరిపాలనాధికారి త్రినాథ్ తిరుమలరావు పాల్గొన్నారు.

బాపులపాడు-3 సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి సంపత్‌కుమార్

భార్యను కత్తితో పొడిచిన భర్తపై కేసు

పెనమలూరు: మద్యం మత్తులో భార్యను కత్తితో పొడిచిన భర్తపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాణావతి పద్మ యనమలకుదురు నివాసి. ఆమె భర్త రాము ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం తాగొచ్చి భార్యతో గొడవపడి కొడుతున్నాడు. ఈ నెల ఒకటో తేదీన కూడా మద్యం మత్తులో భార్యతో వివాదానికి దిగాడు. ఒక్కసారిగా ఆగ్రహంతో కూరగాయలు కోసే కత్తితో ఆమెను విచక్షణారహితంగా పొడిచాడు. ఈలోగా వీరి కుమారుడు అక్కడికి వచ్చి తీవ్రగాయాలపాలైన తల్లి పద్మను ఆసుపత్రికి తరలించారు. పద్మ చికిత్స పొందుతూ మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా భర్త రాముపై కేసు నమోదు చేశారు.

అయ్యప్ప నామకీర్తన

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం గండిగుంటలోని వంశీస్ రాయల్ సిటీలో మంగళవారం రాత్రి నూకల వంశీకృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పూజ, నామకీర్తన కార్యక్రమం ఘనంగా జరిగింది. కాటూరు రవి గురుస్వామితో అయ్యప్పపూజ, పెడన బాలాజీ గురుస్వామి నేతృత్వంలో భజన, నామకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

ఐకమత్యమే మహాబలం

సభ్యత్వ నమోదు కార్డులు చూపుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉద్యోగులు ఐక్యతతోనే ఏదైనా సాధించుకోవచ్చని, ఐకమత్యమే మహాబలమని ఏపీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఉయ్యూరు పురపాలక సంఘం కార్యాలయం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉయ్యూరు తాలూకా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి శ్రీదేవి, ప్రతినిధులు కృష్ణమోహన్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

శ్రద్ధాంజలి

చిరునవ్వుల పలకరింపులతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొందిన నీవు మా మధ్య లేకపోయిననూ, నీ మధుర స్మృతులు మా మదిలో మెదలుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

మరణం: 23-11-2025

తండ్రి: దోనేపూడి వెంకటేశ్వరరావు
తల్లి: రమాదేవి
అన్నయ్య : దోనేపూడి రాజేష్
వదిన: స్ఫూర్తి
కుమారుడు: దోనేపూడి తేజాన్ష సాయి

కీ॥ శే॥ దోనేపూడి రాకేష్, తాడిగడప

పెద్దకర్మ: 03-12-2025 (బుధవారం) శ్రీకృష్ణా రెసిడెన్సీ, విద్యానగర్ కాలనీ, తాడిగడప నందు జరుగును.

(c) eenadu

బహుమతులు అందుకున్న బాలలు

బాలోత్సవంలో చిన్నారుల జయకేతనం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో నిర్వహించిన బాలోత్సవంలో నిర్వహించిన వివిధ పోటీలలో విశ్వభారతి పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులను సొంతం చేసుకున్నారని పాఠశాల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. విశ్వభారతి పాఠశాలలో మంగళవారం విజేతలను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

5న ఘనంగా పాఠశాలల పండగ

అవనిగడ్డ (గ్రామీణం, మోపిదేవి - న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల సమగ్ర నిర్వహణకు విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కోసం ఈ నెల 5న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల మెగా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ సంబంధిత పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ సమావేశం జరపాలని విద్యా శాఖ ఆదేశించింది. సమావేశాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు ఆహ్వాన పత్రాలను ముద్రించి తల్లిదండ్రులకు, గ్రామంలోని ప్రముఖులకు ఉపాధ్యాయులు పంపిణీ చేసి వారిని ఆహ్వానించాలని అవనిగడ్డ ఎంఈవో-2 ఏ.పిచ్చయ్య పేర్కొన్నారు. ఈ సమావేశం ఒక పండుగగా జరగాలన్నారు.

ధాన్యం సేకరణకు చర్యలు

ఘంటసాల, న్యూస్‌టుడే: అచ్చెంపాలెంలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. మంగళవారం అచ్చెంపాలెంలో రెవెన్యూ అధికారులు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ధాన్యాన్ని భద్రపరుచుకోవడానికి అనేక కష్టాలు పడుతున్నట్లు సర్పంచి గాజుల నాగశ్రీనివాసరావు, రైతులు పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రంలో సమావేశమై తేమశాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి ఏవో డి.అనూష, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్వామివారి అభిషేకంలో నాగిరెడ్డి దంపతులు

దోకిపర్రు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని దోకిపర్రు శ్రీభూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఆలయ, ఉపాలయాల్లోని దేవతామూర్తులకు అభిషేకాలు, స్నపన తిరుమంజనం, సేనాధిపతి ఉత్సవం, అంకురారోపణ, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నాగిరెడ్డి ప్రసన్న దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'దళారులను నమ్మి నష్టపోవద్దు'

చల్లపల్లి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చల్లపల్లి మండలంలో 25, 26 తేమశాతం ఉన్న వరిధాన్యాన్ని సైతం ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కొనుగోలు చేస్తామని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. మంగళవారం లక్ష్మీపురం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనెసంచులు, వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. దళారుల వద్దకు వెళ్లి తమ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించుకోవద్దని రైతులకు సూచనలు చేశారు.

లక్ష్మీపురం సొసైటీలో తహసీల్దార్ వనజాక్షి

రైతులకు పట్టాల పంపిణీ

పామర్రు(గ్రామీణం: మండలంలోని అడ్డాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం భద్రపర్చుకునేందుకు పట్టాలను ఉచితంగా పంపిణీ చేశామని పీఏసీఎస్ కార్యదర్శి బొప్పన తోయజాక్షి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు ప్రభుత్వం పట్టాలను సరఫరా చేసిందన్నారు. వీటిని సంఘ అధ్యక్షుడు డాక్టర్ గోపాలరావు ఆధ్వర్యంలో రామకృష్ణ పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో తెదేపా నేత శ్రీనివాసరావు, వీఏలు, రైతులు పాల్గొన్నారు.

గుంతల దారిలో అవస్థల ప్రయాణం

అవనిగడ్డ 4వ వార్డు కృష్ణా కరకట్ట నుంచి అశ్వారావుపాలెం వరకు ఉన్న ఆర్ అండ్ బీ రహదారిపై ఎక్కడ చూసినా గుంతలు దర్శనం. వర్షం పడితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆ రహదారిని అభివృద్ధి చేయాలంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని గత దశాబ్దకాలంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకుండా మరమ్మతులతో సరిపెడుతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కావడంలేదు. వర్షం వస్తే స్టేట్ బ్యాంకు, ఎల్ఐసీ కార్యాలయానికి, ఎస్సీఆర్ క్రాంతి కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో ఈ రహదారితోపాటు నాగాయలంక మండలంలో మరో 2 రహదారులకు రూ. 4.5 కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. అయితే ఈ 3 రహదారులకు ఆ మొత్తం సరిపోదని అంటున్నారు. దీంతో రహదారుల నిర్మాణం కనీసం టెండరు ప్రక్రియకు కూడా చేరుకోకుండా అలాగే నిలిచిపోయిందని సమాచారం. ఆర్ అండ్ బీ డీఈ రమేష్‌ను వివరణ కోరగా సుమారు నెల రోజులలో టెండర్లు పిలిచే అవకాశం ఉందన్నారు. - అవనిగడ్డ, న్యూస్‌టుడే

ఏఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలో..

స్టేట్‌బ్యాంక్ రోడ్డులో రాళ్లు పైకి లేచి..

నేలకొరిగిన చెట్లు మాయమైపోతున్నాయ్!

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మొంథా తుపానుకు వందలాది చెట్లు నేలకొరిగాయి. వాటిలో ప్రభుత్వ స్థలాల్లోని, రహదారి మార్జిన్లలోని, కాల్వగట్ల వెంబడి ఎక్కువగా పడిపోయాయి. అడ్డంకుల తొలగించడం ప్రథమ ప్రాధాన్యంగా యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించారు. తర్వాత వాటిని వేలం ద్వారా సంబంధిత శాఖ అధికారులు విక్రయించాల్సి ఉంది. కానీ, ఎక్కడా వేలం నిర్వహించిన దాఖలాలు లేవు. కానీ పడిపోయిన చెట్లు మాత్రం కాళ్లు నడిచి వెళ్లి పోయాయన్న చందంగా మాయం అయ్యాయి. వాటిని ఎవరైనా అపహరించుకుపోయారా, లేక ఏమయ్యాయో స్పష్టత కరువైనట్లుగా మారింది. సుమారు వంద టన్నులకుపైగా ఈ కలప ఉంటుందని అంచనా. ఈ విషయాన్ని అప్పట్లో ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ కలప లారీలలో తరలిపోతున్నా పట్టించుకునే అధికారులు మాత్రం కానరావడం లేదు. కనీసం పోలీసులు కూడా ఈ కలప గురించి పట్టించుకోవడం లేదు. మరి అడవులు నరికి తరలిస్తున్నా కూడా ఇంతేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అవనిగడ్డ నుంచి తరలిపోతున్న కలప

పేదల వైద్యానికి ముఖ్యమంత్రి తొలి ప్రాధాన్యం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 50 మందికి మంజూరైన రూ. 51,89,869లు చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అత్యవసర వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం కోరుతూ పేదలు సమర్పించే దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా ఆమోదిస్తూ పేదలకు సహాయం అందిస్తున్నారని చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బాలికల కబడ్డీ పోటీలకు సిద్ధంకండి

గుడివాడ, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏపీల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్ 14 బాలికల కబడ్డీ పోటీలు 2026 జనవరి 19 నుంచి 23 వరకూ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నామని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్షించారు. దేశం నలుమూలల నుంచీ వచ్చే బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడా కారులకు, కోచ్‌లు, కావాల్సిన వసతిపై ముందుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సుమారు 45 జట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో జి. బాల సుబ్రహ్మణ్యం, పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్, ఎంఈ ప్రసాద్, జాతీయ కబడ్డీ పోటీల నిర్వహణ కార్యదర్శి ఎస్. గంగాధర్, సభ్యులు రవిబాబు, అనీల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రాము

సమయపాలన పాటించండి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని వెంట్రప్రగడ సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో విమాదేవి సూచించారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు, హాజరు పట్టిక పరిశీలించారు. ఈసందర్భంగా విమాదేవి మాట్లాడుతూ ఉద్యోగులు తప్పనిసరిగా 10 గంటలకల్లా కార్యాలయంలో ఉండాలన్నారు. సచివాలయానికి వచ్చిన గ్రామ స్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

అవనిగడ్డ, గ్రామీణం, న్యూస్‌టుడే: సొంత స్థలం ఉండి ప్రధాన మంత్రి గృహనిర్మాణ పథకం కింద దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు అవనిగడ్డ మండల గృహనిర్మాణ సంస్థ ఏఈ టి.కార్తికేయ తెలిపారు. ఈమేరకు గ్రామ సచివాలయాల్లోని అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక మచిలీపట్నం రోడ్డులోని వాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు తెదేపా మచిలీపట్నం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు శేఖర్ వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వృద్ధులతోకలిసి కేకు కోసి పంచారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఘంటసాల భరతుడు, శ్రీకాకులపు రామ్‌కిషోర్, గొళ్లపూడి రాజశేఖర్, మానేపల్లి వెంకటనాగేశ్వరరావు, బసవపూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల దిరిశంవానిగూడెంలో 60మంది వృద్ధులకు రగ్గులు, దుప్పట్లను షింఛోంజీ చర్చి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చర్చి ప్రతినిధులు సందీప్, అభిషేక్, పాస్టర్లు దానియేలు రాజు, ప్రేమ్‌చంద్ సహకారంతో వీటిని అందజేశారు.

'శ్రావ్యకృష్ణ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు'

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లిలో ప్రజలందరికీ నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా శ్రావ్యకృష్ణ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ శీలం అశ్వనీకుమార్ చెప్పారు. దివిసీమ ముఖ్య కేంద్రమైన చల్లపల్లిలో ప్రారంభించిన శ్రావ్యకృష్ణ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలను అందిస్తామన్నారు. శస్త్రచికిత్సలను కుట్లు లేకుండా లాప్రోస్కోపిక్ ద్వారా చేస్తామని చెప్పారు. చర్మ వ్యాధుల నిపుణులైన మహిళా డాక్టర్ శ్రావ్య కృష్ణ ఉత్తమ సేవలందిస్తారని చెప్పారు. ఆసుపత్రిని ప్రారంభానికి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ శీలం అశ్వనీ కుమార్, డాక్టర్ శ్రావ్యకృష్ణ

క్యాన్సర్ వైద్య పరీక్షలు వాయిదా

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డ సచివాలయం 5 (కొత్త పేట)లో మంగళవారం జరగాల్సిన క్యాన్సర్ వైద్య పరీక్షలు తుపాను కారణంగా గురువారం నాటికి వాయిదా వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం జరిగే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండల డిప్యూటీ ఎంపీడీవోగా నెమలికంటి శ్రీలక్ష్మి కృష్ణవేణి బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో డి.సుహాసిని తెలిపారు. ఆమె మండలంలోని కోసూరు గ్రామ పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆమెను ఎంపీడీవోతోపాటు ఎంపీపీ కొండేటి ఇందిర, చందు దంపతులు అభినందించారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పెదపారుపూడి గ్రామ, వార్డు సచివాలయం డిప్యూటీ ఎంపీడీవోగా పి.పూర్ణచంద్రరావు మంగళవారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో విమాదేవి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పామర్రు మండలం పెదమద్దాలి పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా పెదపారుపూడి వచ్చారన్నారు. ఈసందర్భంగా పలువురు కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఆయనను అభినందించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాసరావు, మండల పరిషత్తు సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బాయిపై బాబాయి కత్తితో దాడి

గుడివాడ, న్యూస్‌టుడే: బాబాయి తనకు అబ్బాయి వరుసయ్యే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన ఇది. గుడివాడ రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఈనెల 1వ తేదీన మండల పరిధిలోని దొండపాడు కాలనీలో చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు అనే వ్యక్తి భార్యతో గొడవ పడుతున్నాడని పట్టణంలోని పెద్ద వీధిలో నివాసం ఉండే నాగేంద్రబాబుకు స్థానికులు సమాచారం ఇచ్చారు. తనకు బాబాయి వరుసయ్యే వెంకటేశ్వరరావు పిన్నితో గొడవ పడుతున్నాడని తెలిసి నిలువరించేందుకు అతడు దొండపాడు కాలనీకి వెళ్లాడు. దీంతో నాగేంద్రబాబుపై వెంకటేశ్వరరావు కత్తితో దాడి చేసి కుడి వైపున పొట్టలోనూ, ఎడమ చేతిపైనా గాయపరిచాడు. వెంటనే స్థానికులు అతడిని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై...

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక బందలాయి చెరువులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ టి.విద్యాశ్రీ ఆదేశాల మేరకు అవనిగడ్డ, మోపిదేవి ఎస్.ఐలు, సిబ్బంది ఆకస్మికంగా మంగళవారం దాడిచేసి సుమారు 27 మందిని అదుపులోకి తీసుకుని రూ. 33,090లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ శ్రీనివాస్ చెప్పారు. సంఘటన స్థలంలో 30 ద్విచక్ర వాహనాలు, 16 సెల్‌ఫోన్లు, 2 కార్లు, 2 కోళ్లు, 2 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు.

మద్యం మత్తులో దంపతులపై...

గుడివాడ, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అకారణంగా ఓ వ్యక్తి దంపతులపై దాడి చేసిన సంఘటనలో గుడివాడ రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మోటూరు గ్రామంలో నివాసం ఉండే దారం మల్లేశ్వరరావు, అతని భార్య నవంబర్ 30వ తేదీన ఇంటి ముందు కూర్చుని ఉండగా మద్యం సేవించిన కుమార్ అక్కడికి వచ్చి వారితో అకారణంగా గొడవ పడ్డాడు. కర్రతో దాడి చేసి చేతులు, కాళ్లపై గాయపరిచాడు. దీంతో బాధితులకు రక్తగాయాలు కాగా వారిని స్థానికులు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వివాదం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ టిడ్కో కాలనీలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము జన్మదిన బ్యానర్‌ను స్థానిక నేత నిరంజన్ చింపారనే విషయంపై జనసేన నేతలు మంగళవారం టిడ్కో కాలనీలో నిరసన ప్రదర్శన చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాము వెంటనే నిరంజన్‌ను పిలిపించి మందలించి ఇరు వర్గాల మధ్య సయోధ్య చేయడంతో వివాదం ముగిసింది.

హుండీల కానుకలు చోరీ

పామర్రు : స్థానిక కరుమారి అమ్మవారి ఆలయంలో(అంకమ్మతల్లి) సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిందని సీఐ సుభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవాలయం స్టోర్‌రూమ్‌లో ఉన్న ఒక గునపంతో తాళాలు పగలగొట్టి గుడిలోకి ప్రవేశించి అక్కడ ఉన్న రెండు హుండీలను తెరిచి నగదు దోచుకున్నారన్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ద్వారా సీఐ సుభాకర్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌లు వివరాలను సేకరిస్తున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

రైతులు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేర్చి ట్రక్‌షీటు వచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు తన ధాన్యం విషయమై సదరు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఏదైనా సమస్య ఉంటే కస్టోడియన్, రైతుసేవాకేంద్రం సిబ్బంది చూసుకుంటారని తహసీల్దారు స్పష్టం చేశారు. స్థానిక రైతుసేవాకేంద్రం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుసంఘం ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ధాన్యం కొనుగోళ్లలో రైతుల సమస్యలపై చర్చించారు. రైతుసేవాకేంద్రాల సిబ్బంది పంపిన ధాన్యం వివరాలపై మిల్లర్లు ఇష్టమొచ్చినట్టు వ్యాఖ్యలు చేస్తూ..సరకు దింపుకొనేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. తేమశాతం ఎక్కువగా ఉందని, ధాన్యం నాణ్యత లేదంటూ తీసుకోబోమని కొందరు మిల్లర్లు మాట్లాడుతున్నారని మరికొందరు తెలిపారు. ధాన్యం తీసుకునే విషయంలో రైతులను మిల్లర్లు పలు ఇబ్బందులు పెడుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా వారితో మాట్లాడి సమన్వయ పరిచే పరిస్థితి కనపడడం లేదని కొందరు ఆరోపించారు. ఈ ఫిర్యాదులపై తహసీల్దారు మాట్లాడుతూ ఏకారణంతోనైనా రైతుల ధాన్యం తీసుకొనేందుకు మిల్లర్లు తిరస్కరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిశీలించి అవసరమైతే మిల్లర్లపై కేసు పెడతానని తెలిపారు. రైతుసంఘం నాయకుడు తాతినేని శేషగిరిరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

రైతులు, సంఘ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దారు

అవకతవకలకు పాల్పడితే సహించం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. వానపాముల గ్రామంలోని రేషన్‌షాపును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్డుదారులతో గోవిందరావు మాట్లాడారు. రేషన్ పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా కార్డుదారులు వెంటనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనిపై నిర్వహిస్తున్న ఐ.వి.ఆర్.ఎస్. కాల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనునాయక్ పాల్గొన్నారు.

కార్డుదారులతో మాట్లాడుతున్న గోవిందరావు

అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : నీకు వయసు మీరిపోయింది..నీ ఉద్యోగం పీకేసీ ఇంకొకరికి ఇస్తానంటూ సూపర్‌వైజర్ సుజాత గత మూడు నెలల నుంచి వేధిస్తోందని వల్లూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రం-2 ఆయా నాగేశ్వరమ్మ ఆరోపించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకే ఆమె కేంద్రానికి వచ్చి అరల్లోని రికార్డులు, పుస్తకాలు, వస్తువులను కిందపారేశారని పేర్కొన్నారు. మరోవైపు అంగన్‌వాడీ కార్యకర్త కడియాల సుధారాణి మాట్లాడుతూ మా కుమార్తెకు ప్రసవం కోసం అప్పటి సీడీపీవోకు తెలిపి తొలుత రెండు నెలలు సెలవు పెట్టానని.. కుమార్తె కాన్పు ఇబ్బందిగా మారడంతో మళ్లీ రెండు నెలల చొప్పున నాలుగు నెలలు రిజిస్టర్ పోస్టు ద్వారా సెలవు లేఖ పంపించానని తెలిపింది. ఆ సమయంలోనే నీకు ఎందుకమ్మా ఉద్యోగం..రాజీనామా చేసి వెళ్లిపో అని అనేక రకాల మాటలతో సూపర్‌వైజర్ ఇబ్బందులకు గురిచేసిందని తెలిపింది. అక్టోబరు 10వ తేదీ నుంచి పోస్టింగ్ ఇవ్వమని పామర్రు ప్రాజెక్టు కార్యాలయానికి తిరుగుతున్నానని తెలిపింది.

హెచ్చరించడానికే అలా చేశా..

ఈ విషయంపై సూపర్‌వైజర్ సుజాతను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచడం లేదని హెచ్చరించడానికి అలా చేశానని తెలిపింది. ఇన్‌ఛార్జి సీడీపీవో ఉషాను సంప్రదించగా కార్యకర్త సుధారాణి సమాచారం ఇవ్వకుండానే మానేసిందని తెలిపారు. ఆమె ఫైల్ పీడీ వద్ద ఉందన్నారు.

గంజాయి విక్రేతలు 9 మంది అరెస్ట్

గుడివాడ, గుడ్లవల్లేరు - న్యూస్‌టుడే: గంజాయి అమ్ముతున్న 9 మంది యువకుల నుంచి 3.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు వెల్లడించారు. ఎస్.ఐ సత్యనారాయణతో కలసి మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కౌతవరం రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయితో ఉన్న గుడ్లవల్లేరు, పమిడిముక్కల, గుడివాడ, మచిలీపట్నానికి చెందిన ఎరికపాటి సందీప్, బెజ్జం గిరీష్, నత్తా ధనేష్, దరిశం పవన్‌కల్యాణ్, ఎరిసే అజయ్, లవుడియా సాంబయ్య, మేకా మోక్షజ్ఞ, ప్రత్తిపాటి రాజేశ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 3.100 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీరికి గంజాయిని సరఫరా చేస్తున్న హరీష్ అనే వ్యక్తి వేరే రాష్ట్రీయుడని, అతడిని గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. మాదక ద్రవ్యాలు అమ్మే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పట్టుబడిన యువకులతో సీఐ సోమేశ్వరరావు, ఎస్.ఐ సత్యనారాయణ సిబ్బంది

రైతులకు మినుము విత్తనాల అందజేత

వెంకటపురం(మోపిదేవి), న్యూస్‌టుడే: రైతులకు మినుము విత్తనాలను వెంకటపురం రైతు సేవా కేంద్రంలో మండలి వెంకటరామ్ పంపిణీ చేశారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన సదస్సులో భూమి ఆరోగ్యం భూసార పథకం 2025-26 ద్వారా భూసార నిర్దేశిత పత్రాలను రైతులకు అందించారు. జిల్లా వనరుల కేంద్ర అధికారిణిలు పద్మజారాణి, జ్యోతిర్మయి, ఏవో హెప్సిబారాణి, మోపిదేవి సొసైటీ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాసరావు, భాజపా నేత సనకా ప్రశాంత్, వీఏఏలు అనూష, యశ్వంత్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మినుము విత్తనాలను పంపిణీ చేస్తున్న మండలి వెంకటరామ్

పెంచలయ్యకు నివాళి

గరికపర్రు(తోట్లవల్లూరు): నెల్లూరులో పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ఖమ్మం కొండలబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గరికపర్రులో ప్రజానాట్య మండలి, సీపీఎం ఆధ్వర్యంలో పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఎం నాయకులు బుల్లయ్య, ఆదిశేషు, ప్రభుదాసు, నాగరాజు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా సౌకర్యం పునరుద్ధరించాలి

చల్లపల్లి: నిరుపేదల కుటుంబాల్లో యజమాని ప్రమాదవశాత్తూ, అనారోగ్యంతోనో మరణిస్తే రాష్ట్రప్రభుత్వం చెల్లించే చంద్రన్న బీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడారు.

పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహం

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే సహకారం ఉపయోగించుకుని ప్రతి ఇంటి నుంచి ఒకరు పారిశ్రామిక వేత్తగా మారి లబ్ధి పొందాలని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై. నాగేంద్రభూపాల్ అన్నారు. మంగళవారం చల్లపల్లి మహిళా సమాఖ్య భవనంలో మండల స్థాయి ఉద్యం రిజిస్ట్రేషన్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను అందిస్తున్నాయన్నారు. వ్యాపారవేత్తలంతా తమ యూనిట్లకు సంబంధించి ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఎంపీడీవో ఆనంద కుమారి, డీఆర్‌డీఏ ఏపీఎం కె.శ్రీనివాస్, సీసీలు, వ్యాపారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారి వై.నాగేంద్రభూపాల్

(c) eenadu

దారిచూపు దేవుళ్లు..

రఘుశేఖర్

నారాయణ

సేకరించిన కార్నియా (పాతచిత్రం)

అప్పటి వరకు చీకటి నిండిన వారి బతుకుల్లో వెలుగులు నింపుతూ తమ వంతు సామాజిక బాధ్యత నిర్వర్తిస్తున్నారు. నేత్ర దానంపై విస్తృత ప్రచారం చేస్తూ.. చనిపోయిన వారు మళ్లీ ఈ లోకాన్ని ఎలా చూస్తారో అవగాహన కల్పిస్తున్నారు. నాగాయలంకలోని సురభి మానవత సేవా సంస్థ నిర్వాహకులు. సామాజిక కార్యకర్తలు తలశిల రఘుశేఖర్, కనగాని నారాయణలు.. 2008లో సురభి మానవత సేవా సంస్థను ప్రారంభించారు. నాటి నుంచి నేత్రా దానంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ.. మృతుల బంధువులను ఒప్పించి.. చనిపోయిన వారి నేత్రాల నుంచి కార్నియాలు సేకరిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన శంకర, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రుల సహకారంతో నేత్ర దానం కార్యక్రమాన్ని ప్రజల్లో తీసుకెళుతున్నారు. వారి కృషితో నాగాయలంక, అవనిగడ్డ, కోడూరు తదితర మండలాలకు చెందిన ప్రజలు స్ఫూర్తి పొంది.. స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ఇప్పటి వరకు 252 జతల కార్నియాలను సేకరించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స చేయించి వెలుగులు నింపుతున్నారు. దాతల సహకారం, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారితో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 56వేల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 7200 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.

- నాగాయలంక, న్యూస్‌టుడే

పీజీ మెడికల్ యాజమాన్య కోటా సీట్ల తాత్కాలిక ఆరోగ్య ప్రాధాన్య క్రమం విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: రాష్ట్రంలోని పలు ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్న పీజీ మెడికల్ (డిగ్రీ/డిప్లొమా) యాజమాన్య కోటా సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న 2170 మంది అభ్యర్థుల తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. అభ్యంతరాలుంటే 5న ఉదయం 11 గంటల్లోగా తెలియజేయాలని, వివరాలకు 90007-80707లో సంప్రదించాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

దందా హద్దుమీరుతోంది!

రీసర్వేలో సర్వేయర్ల వసూళ్లు

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో సర్వేయర్ల అమ్యామ్యాల దందా హద్దు మీరుతోంది. వైకాపా పాలనలో జరిగిన రీసర్వేలో భారీగా వసూళ్లు చేసిన అనుభవాలతో తాజా రీసర్వేలోనూ రెచ్చిపోతున్నారు. రైతుల మధ్య వారే హద్దుల వివాదాలు సృష్టించి ముడుపులు తీసుకుని పరిష్కరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, రైతుల అవగాహనా లేమి వారికి కాసులు పండిస్తోంది.

- **కూచిపూడి** పరిధిలోని ఓ సచివాలయ సర్వేయర్ వైకాపా పాలనలో రీసర్వేలో విస్తీర్ణంలో తేడాలు వంటి తప్పులు సరిచేసేందుకు దాదాపు 20 మంది రైతుల నుంచి రూ.లక్షల వరకు వసూలు చేశారు. రేపుమాపంటూ మాయ చేసి గుట్టుచప్పుడు కాకుండా పామర్రు మండలంలోని మరో సచివాలయానికి బదిలీ చేయించుకుని జారుకున్నారు. దీంతో డబ్బులిచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు.
- **గన్నవరం** మండలంలోని ఓ సచివాలయ సర్వేయర్ ఓ రైతుకు పక్క రైతుకు చెందిన 10 సెంట్లు భూమి వచ్చేలా హద్దులు నిర్ణయించారు. ప్రతిఫలంగా రూ. 10వేలు తీసుకున్నారు. సాధారణంగా ఏ సర్వే చేయాలన్నా ఆ ఉద్యోగికి ముడుపులు ఇవ్వాల్సిందే.

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఓ మండలం, కోదాడ సచివాలయ సర్వేయర్లు కుమ్మక్కై వసూళ్లు చేస్తున్నారు. ఎల్‌పీ నంబర్ సబ్‌డివిజన్ చేయాలంటే రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ముట్టజెప్పాలి. వివాదాలుంటే ముడుపులు మోతాదు పెరుగుతుంది. గంపలగూడెం మండలంలో ఇద్దరు సచివాలయ సర్వేయర్లు ఇదే తరహా దందా చేస్తున్నారు. రీసర్వేలో వచ్చిన వివాదాలకు ఒక్కో రైతు నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు

రాచమర్యాదలు చేయాల్సిందే..

సచివాలయం, మండల సర్వేయర్లలో చాలా మంది అడ్డగోలు దందా చేస్తున్నారు. ఓ వైపు రీసర్వే లోపాలు..మరోవైపు సాధారణ సర్వేల్లో వసూలు చేస్తున్నారు. కొందరు మండల సర్వేయర్లు సచివాలయ సర్వేయర్లను అడ్డం పెట్టుకుని రైతుల సొమ్ము స్వాహా చేస్తున్నారు. సాధారణంగా సర్వేకి దరఖాస్తు చేస్తే సకాలంలో సర్వేయర్ రావడం దాదాపు అసాధ్యమైంది. ముందుగా బేరం తెగ్గొడితేనే అయ్యవార్లు అడుగుపెడతారు. హద్దులు తెగ్గొడతారు. ఎకరం సర్వే చేయాలంటే చాలా మంది సర్వేయర్లకు రూ.3వేల ఇచ్చి రాచమర్యాదలు చేసి పంపాల్సిన పరిస్థితి. దీనిపై ఎన్టీఆర్, కృష్ణా ఏడీ సర్వే మోహన్‌రావు, జోషీలా మాట్లాడుతూ.. ఈ అంశంపై పరిశీలించి వసూళ్లకు పాల్పడిన సర్వేయర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీచ్.. అభివృద్ధికి అడుగులు

20 ఎకరాల్లో రిసార్టులకు భూకేటాయింపు
తీరంలో రూ.157 కోట్ల పెట్టుబడి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడుతున్నాయి. భూమి కేటాయించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో పలు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.157.33 కోట్ల అంచనా వ్యయంతో మంగినపూడి తీరం వద్ద లార్జ్ అమ్యూజ్‌మెంట్ పార్కు కమ్ రిసార్టులు నిర్మించేందుకు మైరా బే వ్యూ రిసార్ట్స్ సంస్థకు 20 ఎకరాల భూమి కేటాయించినట్లు పర్యాటక శాఖ తెలిపింది. రిసార్టుల ప్రాజెక్టులో 30వేల చదరపు అడుగుల్లో అమ్యూజ్‌మెంట్ పార్కు, 25వేల చ.అ. వాటర్ పార్కు, రైడ్స్, 150 గదులు, ఐదు రెస్టారెంట్లు, బార్.. 16వేల చ.అ. కన్వెన్షన్ సెంటర్, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా 380, పరోక్షంగా 600 మందికి ఉపాధి లభించనుంది. దీంతో మంగినపూడి తీరం ఆతిథ్య, వినోద కేంద్రానికి నెలవుగా మారనుందన్న ఆశాభావం అందరిలో వ్యక్తం అవుతోంది.

83 ఎకరాలకు ప్రతిపాదనలు.. మంగినపూడి తీరంలో పర్యాటకాభివృద్ధికి 83 ఎకరాలు భూమి కేటాయించాలని మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఇందులో రోడ్లు పోను మిగిలిన 64 ఎకరాల్లో రిసార్టులు, రెస్టారెంట్లు, స్నానపు గదులు, పలు భవనాలు, హోటళ్లు తదితర ప్రైవేటు, ప్రభుత్వ సౌకర్యాల కల్పన కోసం భూమి కేటాయించేందుకు అనుమతించాలని కోరారు. ఈ ఏడాది మసులా బీచ్ ఫెస్టివల్‌కు మంచి గుర్తింపు రావడంతో మంత్రి కొల్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

'బీచ్ పర్యాటకానికి మంగినపూడి అనుకూలమైంది. పలు నిర్మాణాలు, సౌకర్యాల కల్పనకు భూమి కేటాయింపు అనుమతులపై ప్రభుత్వానికి ప్రతిపాదన పెట్టాం. త్వరలో తీరంలో సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయి' అని కలెక్టర్ బాలాజీ తెలిపారు.

రాజధానికి ఇదే దగ్గర..

రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు ఇదే దగ్గర సముద్ర తీరం. బీచ్ ఫెస్టివల్ తర్వాత స్నానాల సమయంలో అక్కడ్లో వచ్చే పర్యాటకులతో బీచ్ కిటకిటలాడుతుంది. వారాంతాల్లోనూ పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తారు. సరైన వసతులు లేకపోవడంతో కొద్దిసేపు ఉండి వెళ్లిపోతున్నారు. త్వరలో స్నానపు గదులు, విశ్రాంతి భవనాలు, హోటళ్లు వంటి వసతులు సమకూరనుంది.

5న తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల సమావేశాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఈ నెల 5న విద్యా సంస్థల్లో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల ప్రగతి నివేదికలపై ముఖాముఖీగా చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడంపై దృష్టి సారించనున్నారు. పిల్లలు పరీక్షలు ఎలా రాశారు, వారు సాధించిన పురోగతి, పొందిన ఫలితాలు ఇవన్నీ ప్రోగ్రెస్ కార్డులో ఉంటాయి. మార్కులే కాకుండా విద్యాభివృద్ధి, శారీరక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేధో సామర్థ్యాలు సైన్స్ ప్రయోగ సామర్థ్యాలు వంటివి నమోదు చేస్తారు. ఇందులో ఎగ్జిబిషన్లు, తరగతి గదుల సందర్శన, కెరీర్ గైడెన్స్‌తో పాటు మనో వికాసానికి సంబంధించి వీడియోల ప్రదర్శన తదితరాలు ఉంటాయి.'మెగా పీటీఎంకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని, తల్లిదండ్రులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని' కలెక్టర్ లక్ష్మీశ కోరారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆయన అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యాధికారి ప్రభాకర్, డీఈవో సుబ్బారావు, సమగ్రశిక్షా ఏపీసీ ఎం.రజనీకుమారి పాల్గొన్నారు.

పల్లె సిగలో.. కొత్త పంచాయతీలు

పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, అమరావతి

పల్లె ప్రగతికి పట్టుకొమ్మలైన పంచాయతీ వ్యవస్థలో కీలక మార్పునకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండి..పాలనా సౌలభ్యం లేని ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు సమీప పంచాయతీల్లో విలీనం చేయనున్నారు. దీని వల్ల ప్రజలకు పాలనా సౌలభ్యంతో పాటు నిధుల కేటాయింపు, పర్యవేక్షణలో ప్రాధాన్యం ఉంటుంది.

- అవనిగడ్డ పంచాయతీలోని వసుమట్ల 2 కి.మీ దూరంలో పులిగడ్డలో కలిసి ఉంటుంది. దీన్ని పులిగడ్డలో కలిపితే పాలనా సౌలభ్యం ఉంటుంది. నాగాయలంక మండలం పక్కపట్లవారిపాలెం పంచాయతీలో దళితవాడ 2 కి.మీ దూరంలో ఉంటుంది. అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెంలో కలిసి ఉంటుంది. ఆ పంచాయతీలో విలీనం చేస్తే మేలన్న వాదనలు ఉన్నాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి పంచాయతీలో కుమ్మరిరేవు గ్రామం ఉంది. పంచాయతీకి వెళ్లాలంటే పడవలో రేవు దాటి వెళ్లాలి. మోపిదేవిలో కలిసి ఉండే ఈ గ్రామాన్ని ఆ పంచాయతీలో కలిపేస్తే వెసులుబాటు ఉంటుంది.
- జగ్గయ్యపేట మండలం అన్నవరం పంచాయతీలోని త్రిపురవరం 6 కి.మీ దూరంలో ఉంది. దీంతో పర్యవేక్షణ కొరవడుతోందని గ్రామస్థుల నుంచి అసంతృప్తి ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉన్న ఈ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి. జయంతిపురం పంచాయతీలోని రావిరాల ఏడు కి.మీ దూరంలో ఉంది. వెయ్యికి పైగా జనాభా ఉంది. పంచాయతీకి దూరంగా ఉండడం పెద్ద సమస్యగా మారింది. బండిపాలెం పంచాయతీ పరిధిలోని గుండబోయినపాలెంలో వెయ్యి మంది జనాభా ఉన్నారు. 4 కి.మీ దూరంలో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నందిగామ మండలం పెద్దవరం పంచాయతీలోని చెరుకుంపాలెంలో 5వేల జనాభా ఉంది. ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చందర్లపాడులో కునాయపాలెం పంచాయతీలోని బెల్లంకొండవారిపాలెం, వేలూరు పంచాయతీలోని రామచంద్రాపురం, గుడిమెట్ల పంచాయతీలోని రాయన్నపాలెం, వీరులపాడు మండలం కొణతాలపల్లిలోని పల్లంపల్లి, చెన్నారావుపాలెం పరిధిలోని తిమ్మాపురం, జుజ్జూరులోని రంగాపురం గ్రామాలను సైతం పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు పెడుతున్నారు.

కొత్తగా పంచాయతీల ఏర్పాటు, విలీనంపై ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేయాలంటే అక్కడి

ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయ్..

ఆదాయం, విస్తీర్ణం, జనాభా నమోదు చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15-20 వరకు కొత్త పంచాయతీల ఏర్పాటు, 40 వరకు విలీనం చేయాలన్న అభ్యర్థనలు ఉన్నాయి.

ఆలోచన బాగు.. ప్రమాదాలను ఆపు..

జాతీయ రహదారిపై మరమ్మతులు, ఇతరత్రా పనులు చేసే సమయంలో పనివారు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఆ సమయంలో వాహనదారులను పక్కగా వెళ్లమని సూచించడం కోసం ఒకరిని ప్రత్యేకంగా పెడతారు. కొన్నిసార్లు అలా విధుల్లో ఉన్న వారూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వీటిని నివారించేందుకు జూపూడి వద్ద ఇలా ఓ మనిషిని పోలిన బొమ్మకు దుస్తులు, హెల్మెట్, షూ వేసి నిలబెట్టారు. బాగుంది కదూ ఆలోచన. –ఈనాడు, అమరావతి

నిఘా నేత్రం.. ఆగితే అప్రమత్తం

- విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో కొత్త ప్రయోగం
- త్వరలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి

విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలను బిగించారు. మొరాయిస్తున్న నిఘా నేత్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయడం సమస్యగా మారింది. దీనికి విజయవాడ పోలీసులు సాంకేతికతతో చెక్ పెట్టబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేక డ్యాష్ బోర్డు రూపొందించారు. దీనికి అన్ని నిఘా నేత్రాలను అనుసంధానం చేశారు. పరీక్షలు సత్ఫలితాలు ఇవ్వడంతో పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చే ఆలోచనలో సీపీ రాజశేఖరబాబు ఉన్నారు. త్వరలో దీనిని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు.

ఆర్టీఎంపీ ద్వారా..

ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఇటీవలి కాలంలో కమిషనరేట్‌లో దాదాపు 10వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాలు, విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలు, కాలనీల్లో ఇవి ఏర్పాటయ్యాయి. విద్యుత్తు సరఫరా సమస్యతో ఆగిపోయేవి కొన్ని అయితే.. ఇంటర్నెట్ కనెక్షన్ సరిగా లేక మొరాయించేవి మరికొన్ని ఉంటున్నాయి. కేసుల దర్యాప్తులో సీసీ కెమెరా దృశ్యాల కోసం వెళ్తే అసలు విషయం వెలుగుచూస్తోంది. పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జబ్బిక్స్ అనే సాఫ్ట్‌వేర్‌లో డీహెచ్ఎంఎస్ (డివైజ్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం) పేరుతో డ్యాష్ బోర్డు రూపొందించారు. ప్రతి కెమెరాకు ఉండే నంబరు, అక్షాంశ, రేఖాంశాలను అందులో నమోదు చేస్తున్నారు. ఆర్టీఎంపీ (రియల్ టైమ్ మెసేజ్ ప్రొటోకాల్) ద్వారా నిర్దేశిత సమయం ప్రకారం దానంతట అదే ప్రతి సీసీ కెమెరా పనితీరును సాఫ్ట్‌వేర్ విశ్లేషిస్తుంది. వాటి ఫలితాలను పోలీసు అధికారులకు అందిస్తుంది. ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినవైతే వారికే అలర్ట్ మెసేజ్ వెళ్తుంది. సాంకేతిక ఇబ్బందులను సరిచేసేందుకు ప్రతి సబ్‌డివిజన్‌కు టెక్నీషియన్‌ను నియమించనున్నారు.

డీహెచ్ఎంఎస్ డ్యాష్ బోర్డ్

6వేల సిమ్‌ల వినియోగం

విజయవాడ నగరంలో ఓ ప్రైవేటు సంస్థకు చెందిన ఫైబర్ నెట్ ద్వారా సీసీ కెమెరాలను అనుసంధానించారు. గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధానత కోసం ప్రతి సీసీ కెమెరాలో సిమ్‌లు వేశారు. ఇందుకోసం దాదాపు 6వేల కొత్త సిమ్‌లు తీసుకుని యాక్టివేట్ చేశారు. ప్రతి కెమెరాలో రికార్డింగ్ కోసం మెమొరీ కార్డు వేయనున్నారు. పెట్రోలింగ్‌లో వాడే ట్యాబ్‌లు, డ్రోన్లనూ డ్యాష్ బోర్డుకు అనుసంధానించారు. వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.10లక్షలు ఖర్చవుతుందని అంచనా. ప్రత్యేక నిధులకు ప్రయత్నించడం, లేదంటే స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించాలని యోచిస్తున్నారు.

4న బోటు విహారం

భవానీపురం, న్యూస్‌టుడే: కృష్ణానదిపై బోటులో ప్రయాణం చేస్తూ కవులు, రచయితలు వారి అభిప్రాయాలను తెలియజేసే కార్యక్రమాన్ని ఈనెల 4న నిర్వహించనున్నారు. భవానీపురంలోని హరిత బోటింగ్ పాయింట్ వద్ద నుంచి బోటు గురువారం సాయంత్రం ప్రారంభం కానుంది. విజయవాడ కనకదుర్గమ్మ చారిత్రక నేపథ్యాన్ని రచయిత్రి పద్మ వివరించనున్నారు. విశ్రాంత ఐఏఎస్ వాడ్రేవు చినవీరభద్రుడు రాష్ట్రంలోని గ్రామ దేవతల మూలాలపై విశ్లేషణ చేయనున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

సృజన.. నవ్య ఆవిష్కరణ

యాప్‌లు రూపొందించిన నగర విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

సమాజానికి ఉపయోగపడే అనేక ఆవిష్కరణలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నగర విద్యార్థులు. వీరు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా యాప్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని వారు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

యాప్‌లు ప్రదర్శిస్తున్న షెహనాజ్, రిషిక్, కృష్ణ ప్రియాంక, పావని, తనూజ సాయి

దళారుల మోసాలకు అడ్డుకట్ట

ఆరుగాలం కష్టనష్టాలు ఓర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. నకిలీ విత్తనాలు కొని వ్యాపారుల చేతిలో మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఆన్‌లైన్ వేదికగా అమ్ముకోవడానికి ఓ సరికొత్త యాప్ రూపొందించింది కృష్ణ ప్రియాంక. దీంతో పాటు సాగుకు భూసార పరీక్షల నుంచి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఒకే వేదికలో అందేలా అగ్రి కనెక్ట్ యాప్ తయారు చేసింది.

చేపల అమ్మకం.. కొనుగోలుకు..

మత్స్యకారులతో పాటు తాజా చేపలు కావాలనుకునే వారికి ఉపయోగపడేలా అక్వా కనెక్ట్ పేరుతో యాప్ రూపొందించింది షెహనాజ్. ఇందులో మత్స్యకారులు వారి ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. దీంతో పాటు తాజా చేపలు కొనుగోలుదారులకు అందించే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగపడుతుంది. వ్యాపారులు, కొనుగోలుదారులకు శ్రమ తగ్గిస్తుంది.

ఇంటి నుంచే ఆదాయం వచ్చేలా ...

నైపుణ్య మార్పిడి మహిళా సాధికారత యాప్ ద్వారా మహిళలు వారి నైపుణ్యాలను పెంపొందించుకునేలా తనూజ సాయి యాప్ రూపొందించింది. మహిళలు వారిలోని ప్రతిభను నిరూపించుకోవడానికి ఈ యాప్ దోహదపడుతుంది. నైపుణ్యాభివృద్ధికి ఉచితంగా ఈ యాప్ దోహదం చేస్తుంది. ముఖ్యంగా గృహిణులకు ఎంతో ఉపయోగం.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే..

ఏదైనా సమస్య మీద పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే గంటల తరబడి పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాలి. ఈ తరుణంలో నిమిషాల వ్యవధిలో ఫిర్యాదు పోలీసులకు అందించేలా రిషిక్ యాప్ అభివృద్ధి చేశాడు. క్షణాల వ్యవధిలో మనం ఉన్న చోట నుంచి పోలీసులకు ఫిర్యాదు ఆన్‌లైన్‌లో అందించ వచ్చంటున్నాడు. ఫిర్యాదు వారికి అందగానే బదులు వచ్చేలా యాప్ రూపొందించాడు.

వేడుకల నిర్వహణకు ఆందోళన వద్దు

ఏదైనా వేడుక చేయాలనుకుంటే ఎన్నో పనులు... ఒత్తిడి ఉంటుంది. ఆ ఇబ్బంది లేకుండా ఒకే యాప్ ద్వారా వేడుక పనులు చేసుకునేలా ఈవెంట్ హబ్ యాప్ రూపొందించింది పావని. పెళ్లిరోజు, పుట్టినరోజు, వివిధ సభలు, సమావేశాలు, ఇతర వేడుకలు నిర్వహించేందుకు ఈ యాప్ ఉపయోగ పడుతుంది. వేడుక నిర్వహణకు సరకులు, వస్తువులు, కూలీలు, నైపుణ్యం కలిగిన కార్మికులు ఒకే చోట లభిస్తారు. ఈ యాప్ ప్రధానంగా నగరాలు, పట్టణాల్లో ఉంటున్న ప్రజలకు ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుంది.

124 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ

16.32 లక్షల సంచులు సిద్ధం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 149 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలోని 124 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్ తెలిపారు. 1,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలన్నది లక్ష్యంగా ఉంది. దీనికి 18,75,000 గోనె సంచులు అవసరం. ప్రస్తుతం జిల్లాలో 16,32,950 గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని మంగళవారం తెలిపారు. తుపాను నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యం తడవకుండా 2,200 టార్పాలిన్లను పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. జేసీ ఇలక్కియా నేతృత్వంలో అక్టోబరు 17 నుంచి ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రస్తుత సీజనులో ఇప్పటి వరకు 38,637.000 మెట్రిక్ టన్నుల సేకరించినట్టు వెల్లడించారు. 5,098 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, రూ.77.96 కోట్లను 24 గంటల్లోగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు. గత సీజనులో నవంబరు నెల వరకు 19,947.120 మెట్రిక్ టన్నుల సేకరణ జరిగింది. ధాన్యం రవాణా నిమిత్తం 1,550 వాహనాలను సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు.

గోనె సంచులు..

తిరువూరు	9,44,900
విజయవాడ	4,42,250
నందిగామ	2,45,800

వాహనాలు..

తిరువూరు	787
విజయవాడ	345
నందిగామ	418

కేంద్రాలు..

తిరువూరు	53
నందిగామ	41
విజయవాడ	30

రైతన్నకు క్షణమొక యుగం

ఈ చిత్రంలో ఆరబెట్టిన ధాన్యంపై ఆదమరిచి పడుకున్న కౌలు రైతు పేరు జంపన చంటి. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన ఈ రైతు 17 ఎకరాలు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేశారు. మంచి దిగుబడితో పంట చేతికొచ్చిన సమయంలో తుపాను హెచ్చరికతో నాలుగు రోజులుగా రాత్రీపగలు పంటకు కాపు కాస్తున్నారు. -ఈనాడు, అమరావతి

అపురూప కట్టడం.. అరుదైన రాజగోపురం!

దివిసీమ ప్రాంతం అవనిగడ్డలో చోళరాజుల కాలం నాటి లక్ష్మీనారాయణస్వామి ఆలయం నేటికీ చెక్కుచెదరక అపురూప కట్టడంగా చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 106 అడుగుల పునాదితో నిర్మితమైన ఏడు అంతస్తుల రాజగోపురం(గాలిగోపురం) ఉన్న ఆలయంగా ఖ్యాతికెక్కింది. అప్పట్లో రవాణా సౌకర్యం లేనందున ఆలయ నిర్మాణానికి అవసరమైన కొండరాయిని విజయవాడ ప్రాంతం నుంచి కృష్ణానది ద్వారా పడవల్లో ఈ ప్రాంతానికి చేర్చినట్లు తెలుస్తోంది. వాటితో పలు శిల్పాలు చెక్కి రాజగోపురానికి అమర్చారు. గోపురం నుంచి ఆలయ ధ్వజస్తంభం వరకు తొమ్మిది పర్యాయాలు ప్రదక్షిణలు చేస్తే అనుకున్నవి నెరవేరతాయని ఈ ప్రాంత ప్రజల విశ్వాసం. లక్ష్మీనారాయణస్వామిని దర్శించుకుంటే సమస్త పాపాలు పోతాయని దివి వాసులు నమ్ముతారు. దేవాదాయ శాఖ అధ్వర్యంలో నడిచే ఆరాధన మాసపత్రికలో ఒక దశాబ్దం పాటు ముఖచిత్రంగా లక్ష్మీనారాయణస్వామి ఆలయ రాజగోపురాన్ని ప్రచురించారు. మాస పత్రికకు అవనిగడ్డకు చెందిన ఆగమ పండితులు దీవి నరసింహాచార్యులు సంపాదకత్వం వహించడంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది.

- అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఓ ఆటోడ్రైవర్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ విజయవాడలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన బాలిక (15) ఒక కిరాణా దుకాణంలో పనిచేస్తోంది. 2021, జులై 21న తెల్లవారుజామున కంగారుగా ఇంటికి రాగా.. తల్లి ఏమైందని అడిగారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన వల్లెపు వసంతకుమార్ అనే ఆటోడ్రైవర్ తనను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని వెళ్లి ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో అత్యాచారం చేశాడని చెప్పింది. తల్లి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ వి.వి.ఎస్.లక్ష్మీనారాయణ ఆటో డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం రాజేశ్వరరావు వాదించారు. మొత్తం అయిదుగురు సాక్ష్యులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో అతనికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ.. న్యాయమూర్తి వేల్పుల భవానీ తీర్పు చెప్పారు. సదరు జరిమానా నుంచి బాధిత బాలికకు రూ.5వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

స్క్రబ్ టైఫస్‌తో ఆందోళన వద్దు

విజయవాడ పాతాసుపత్రి: స్క్రబ్ టైఫస్‌తో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని మంగళవారం తెలిపారు. ఎలీసా పరీక్షలతో సహా మందులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

(c) eenadu

విజ్ఞానం.. నూతన ఆవిష్కరణలకు దోహదం

- అందుబాటులోకి ఆధునిక ప్రయోగశాల
- సందర్శిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రయోగశాలల సందర్శన విద్యార్థుల్లో ప్రయోగాత్మక విద్యపై ఆసక్తిని పెంచుతుంది. బట్టీ చదువుకు దూరంగా వాస్తవ అంశాలపై ఆలోచన రేకెత్తిస్తుంది. కళ్లెదుట ప్రత్యక్షంగా చూసింది మెదడులో నిక్షిప్తమై అది పరీక్షల్లో గుర్తు తెచ్చుకుని స్పష్టంగా రాసేందుకు ఉపకరిస్తుంది. పాఠ్యాంశాల్లో చదివింది నేరుగా ప్రయోగశాలలో చూస్తే గుర్తుండిపోతుంది. అందుకే ల్యాబ్‌ల్లో అధిక సమయం ఉండేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతారు. కానీ జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. పుస్తకాల్లో తరచూ వినిపించే పరికరాల పేర్లు వల్లె వేయడం తప్పిస్తే వాటిని నేరుగా చూసిన అనుభవం కూడా చాలా మందికి లేదు. ఈ లోటును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో తీరుస్తున్నారు.

* పాఠ్యాంశాలపై ఆసక్తి.. పదో తరగతి పరీక్షలకు సమయం సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు శాస్త్రవిజ్ఞానం పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు వీలుగా ఎన్టీఆర్ జిల్లా పరిధిలో హ్యాండ్స్ ఇన్ సైన్స్ పేరిట సైన్సుల్యాబ్ సందర్శన నిర్వహిస్తున్నారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రాల్లోని అనేక అంశాలపై అత్యాధునికమైన సాంకేతికతతో కూడిన వందకు పైగా కంప్యూటర్లతో ప్రత్యేక ల్యాబ్‌ను విజయవాడ కేబీఎన్ కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ ల్యాబ్‌లోని సౌకర్యాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు కూడా వినియోగించుకునేందుకు కళాశాల యాజమాన్యం అంగీకరిస్తూ పాఠశాల విద్యాశాఖకు ఓ లేఖ రాసింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతగా తమ సమ్మతిని తెలియజేయడంతో ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధికారులు సైన్సు ల్యాబ్‌లు లేని 54 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులను కేబీఎన్ కళాశాలకు పంపుతున్నారు. సుమారు మూడు గంటలు వివిధ అంశాలపై ప్రయోగాత్మక విద్యను నేర్చుకునేలా అవకాశం కల్పించారు. దీంతో రోజుకు మూడు, నాలుగు పాఠశాలల నుంచి విద్యార్థులు ల్యాబ్‌ను సందర్శిస్తున్నారు. ఇక్కడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పదో తరగతి సిలబస్‌లోని భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రాల్లోని ప్రయోగాలు, వివిధ ఆసక్తికరమైన అంశాలను ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా చూపించి.. ఆయా పరికరాలు, ఫలితాలను చూపించి వివరిస్తున్నారు.

వివరిస్తున్న కేబీఎన్ కళాశాల విద్యార్థిని

విజ్ఞానాన్ని పెంచుకోవడానికి..

పాఠ్య పుస్తకాల్లో చదివిన విషయాలను ల్యాబ్‌లో ప్రయోగాత్మకంగా చూస్తే విద్యార్థులకు స్పష్టంగా అర్థమవుతాయి. తద్వారా విజ్ఞానం పెంపొందుతుంది. పదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత శాతం పెరగడానికి ఉపయోగపడుతుంది. కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు.

-యు.వి.సుబ్బారావు, డీఈవో

పలు అంశాలపై అవగాహన..

భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించి తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అందులోని అంశాలు ఎలా ఉంటాయో తెలియదు. ల్యాబ్‌లో వాటిని చూశాం. కంప్యూటర్లు ఎలా ఓపెన్ చేయాలి.. అవి పనిచేసే విధానం తెలుసుకున్నాం. -కీర్తి, పదో తరగతి విద్యార్థిని

నీటి డిమాండ్.. సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గిద్దాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాగునీటి డిమాండ్, సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో, భూ ఉపరితలంలో లభించే నీరు, భూగర్భ జలాల సమన్వయ వినియోగం ద్వారా సమాన, సమర్థవంతమైన పంపిణీకి కృషి చేయాలని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ (ఎన్.ఎస్.పి. పీసీ) ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సూచించారు. పంట క్యాలెండర్లు, వారా బందీ అమలులో సహకరించడం, జల వివాదాల పరిష్కారం, నేల, నీటి నాణ్యతను అంచనా వేయడం అంశాలు ముఖ్యమని వివరించారు. ఉమ్మడి కృష్ణా ఎన్.ఎస్.పి. పీసీ పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు బాధ్యతలు పెంపొందించడంపై, నగరంలోని జల వనరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విస్సన్నపేట సర్కిల్ ఎస్ఈ ఎం.ఆర్.మొహిద్దీన్ అధ్యక్షత వహించారు. ఎన్.ఎస్.పి. పీసీ ఛైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ.. పీసీ పరిధిలో ఆయకట్టు పెంపుదలపై దృష్టిపెట్టాలని సూచించారు. నీటి సంఘాల అధ్యక్షులకు, డీసీ ఛైర్మన్లకు అప్పగించిన పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఆళ్ల గోపాలకృష్ణ, వేదికపై కోట వీరబాబు, మొహిద్దీన్, నాగమల్లేశ్వరరావు తదితరులు

లష్కర్ల నియామకానికి ప్రతిపాదనలు

ఎస్ఈ మొహిద్దీన్ మాట్లాడుతూ.. నీటి నిర్వహణ మెరుగు పరచడానికి తొమ్మిది సబ్ డివిజన్ల పరిధిలో పొరుగు సేవల కింద 90 మంది లష్కర్ల (కలాసులను) నియమించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. వాగులపై చెక్ డ్యాంలను నిర్మించడం, సాగునీటి చెరువులు, కాల్వల్లో పూడిక తీత తదితర నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈఈలు కె.రామదాసు, కె.కిశోర్, డీఈఈలు, ఏఈఈలు, డీసీ ఛైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఎస్.ఎం.ఈ యూనిట్లకు సహకారం అందించండి

పటమట, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట ఎం.ఎస్.ఎం.ఈ భూ కేటాయింపులో సహకారం అందించాలని.. ఎన్టీఆర్ జిల్లాను పరిశ్రమల ప్రధాన హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. మంగళవారం దిల్లీ పర్యటనలో భాగంగా పార్లమెంట్‌లోని తెదేపా పార్లమెంటరీ కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌కు ఎంపీ కేశినేని శివనాథ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేటలో ప్రతిపాదించిన ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ప్రాజెక్టుకు సంబంధించి పలు విషయాలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎం.ఎస్.ఎం.ఈ పార్క్‌లో సుమారు 826 ఎకరాల్లో పలు విభాగాల్లో 198 యూనిట్ల స్థాపనకు రూ.2,872 కోట్ల పెట్టుబడితో 57 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎం.ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ముందుకొచ్చిందని వివరించారు. ప్రాజెక్టుకు అనుకూలమైన 826 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. అసోసియేషన్, జిల్లా అధికారుల సహకారంతో ప్రాజెక్టు ప్రారంభ దశలు పూర్తి చేసుకుని కీలకదశకు చేరుకుందని వెల్లడించారు. ప్రాధాన్యం గుర్తించి సహకారం అందించాలని మంత్రిని కోరారు. మంత్రి వివరాలు తెలుసుకుని సహకారం అందిస్తానని భరోసా ఇచ్చినట్లు ఎంపీ వెల్లడించారు.

మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శివనాథ్

భవానీ భక్తులకు ఇబ్బందులు కలగనీయొద్దు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లలో నాణ్యతా లోపాన్ని సహించమని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు లక్షల మంది భవానీ దీక్షాధారులు అమ్మవారి సన్నిధిలో ఇరుముడి సమర్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హోమగుండాల ఏర్పాటు, ప్రసాదాల పోటు, ఘాట్ల వద్ద క్లోక్ రూమ్స్, తాత్కాలిక కేశఖండన శాల, క్యూలైను ఏర్పాటు పనులను దీక్షల విరమణకు ముందస్తు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాంబాబు, డీఈలు అశోక్, రవీంద్ర పాల్గొన్నారు.

క్యూలైన్ పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఈఈ రాంబాబు

నేను రాస్తేనే ఫైనల్ అనుకోవద్దు

క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ సూచన

మైలవరం, న్యూస్‌టుడే: ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని, నేను రాస్తేనే ఫైనల్ అనే మనస్తత్వం వద్దని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. కొంతమంది నేను చెబితేనే అవుతుందన్న ధోరణిలో ఉంటున్నారని, అది సరికాదని సుతిమెత్తగా హెచ్చరించారు. నియోజకవర్గ ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను మంగళవారం స్థానిక ఎస్వీఎస్ కల్యాణమండపంలో నిర్వహించారు. అన్ని మండలాల నుంచి వందలాది మంది ప్రజలు పోటెత్తగా, సాయంత్రం వరకు సుమారు 600 వరకు వినతులు అందాయి. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కార్యక్రమంలో దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలు, రీసర్వేలో ఇబ్బందులు, భూ వివాదాలపైనే అధికంగా అర్జీలు వచ్చాయని వివరించారు. న్యాయ వివాదాలున్నవి మినహా.. ఇతర అర్జీలను వారం నుంచి 2 నెలల వ్యవధిలోనే పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులను ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అయినా పరిష్కారమవకపోతే తనకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. తమకొచ్చే ఫిర్యాదులపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సైతం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇక మీదట వారానికో నియోజకవర్గంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు అర్హతల ప్రకారం అందరికీ అందుతాయన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సరైన విధంగా పరిష్కారం చూపాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోగానే, అర్హులైన దరఖాస్తుదారులకు దక్కుతాయన్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో ఒకరోజు చొప్పున ప్రజాదర్బారు నిర్వహించామన్నారు. అంతకుముందు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లు పని విధానం బాగాలేదని కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. పదేపదే చెప్పినా పని చేయడం లేదని చెప్పగా, తాను పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు.

కొండపల్లి ప్రధాన రహదారి విస్తరణపై కలెక్టర్, ఎమ్మెల్యేకి వివరిస్తున్న అఖిలపక్ష నాయకులు

తెలుగు మహాసభల విజయవంతానికి చేయూత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 27, 28 తేదీల్లో ఆర్ట్ ఫౌండేషన్ నేతృత్వంలో విజయవాడలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు కవులు, రచయితల మహా సభల విజయవంతానికి చేయూతనివ్వాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పొట్లూరి హరికృష్ణ, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మహా సభల్లో పాల్గొనేందుకు ఇప్పటికే 1,500 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు వారు తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంతో పాటు 5 వేదికలపై సభలను నిర్వహించనున్నట్టు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహాసభల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం, పర్యాటక, సాంస్కృతిక శాఖ సహకరం ఉంటుందన్నారు. కవులు, రచయితలు తమ కళా నైపుణ్యంతో అక్షర సత్యాలతో దేశ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నారన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా సంపదను వన్నె తగ్గకుండా భావితరాలకు అందించేందుకు ప్రయత్నిస్తున్న ప్రతి ఒక్కరికీ, ప్రతి సంస్థకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

స్వర్ణాంధ్ర ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలపండి

కానూరు, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు చేస్తున్న ప్రయాణంలో ఉద్యోగులు అడుగులు కలపాలని మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ నేతృత్వంలో పలువురు అసోసియేషన్ నాయకులు తాడిగడప క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలపాటు అభివృద్ధిలో గాడితప్పిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో, దార్శనికతతో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు కీలకమైన పారిశ్రామిక రంగంలో విశేషంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ.విద్యాసాగర్ మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని భావించి ఉద్యోగులందరూ ఐక్యంగా ఆయనకు మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం కూడా ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, డీఎస్ఎన్‌రెడ్డి, పీవీ ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పార్థసారథికి పూలమొక్క అందిస్తున్న విద్యాసాగర్ తదితరులు

4న రాష్ట్ర సీనియర్ త్రోబాల్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర త్రోబాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4న స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రాష్ట్ర సీనియర్ (స్త్రీ, పురుషుల) త్రోబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి ఇ.సులోచన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్‌కార్డుతో అదే రోజు ఉదయం 9 గంటల్లోపు హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు 28 నుంచి 31 వరకు కేరళ రాష్ట్రం కొట్టాయంలో జరిగే జాతీయ సీనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 98484 39137 నంబరులో సంప్రదించాలని కోరారు.

13న మెగా లోక్ అదాలత్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఈ నెల 13న న్యాయస్థానాల ప్రాంగణంలో జరిగే మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ పేర్కొన్నారు. మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్ ఆవశ్యకతను వివరించారు. న్యాయస్థానాల్లో రోజు రోజుకు కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయని తెలిపారు. న్యాయవాదులు సహకరించి కక్షిదారులతో మాట్లాడి వారి మధ్య సయోధ్య కుదర్చాలని కోరారు. తద్వారా కేసులను పొడిగించకుండా మెగా లోక్ అదాలత్‌లో రాజీ చేయాలని కోరారు. కేసుల రాజీతో మానవ సంబంధాలు మెరుగుపడి.. నవ సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి, 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి సత్యానంద్. చిత్రంలో భూపాల్‌రెడ్డి, సునీల్‌కుమార్ తదితరులు

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

భవానీపురం, న్యూస్‌టుడే: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. మంగళవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందా బాజ్జీ అనుచరులతో కలిసి భాజపాలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదరికం లేని సమాజం కోసం అన్ని వర్గాల వారికి మోదీ చేయూత అందిస్తున్నారని తెలిపారు. మన సనాతన ధర్మాన్ని ఇతర దేశాల ప్రజలు పాటిస్తున్నారని పేర్కొన్నారు. బీసీలు చట్టసభలకు వెళ్లేందుకు యాభై శాతం.. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఏపీలో భాజపా బలోపేతం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్రా శివన్నారాయణ మాట్లాడుతూ.. చేతి వృత్తుల వారిని, కళాకారులను గౌరవించిన వ్యక్తి మోదీ అని తెలిపారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు భాజపా అండగా ఉంటుందని తెలిపారు. కూటమి పాలనలో అన్ని విధాలుగా ఏపీ అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నాయకులు గోపిశ్రీనివాస్, రాధాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

రైతుబజార్‌లో మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలు

పటమట, న్యూస్‌టుడే : ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరలతో ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం విజయవాడ పటమట రైతుబజార్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేసి కూరగాయల ధరలను పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి రైతు బజార్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతపురం నుంచి సాధారణంగా వస్తున్న గింజ రకం చిక్కుడు కాయలు, గోరుచిక్కుడు, టమాటా అందుబాటులో లేవని వినియోగదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బియ్యం, ఇతర ధాన్యాలు నాణ్యతతో విక్రయించాలన్నారు. రైతుబజార్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఎం.రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారుతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

నేటి నుంచి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలు

గాంధీనగర్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా.. బాధితులకు న్యాయం జరగకపోవడం విచారకరమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.వి.నాయుడు అన్నారు. మంగళవారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ బుధవారం నుంచి ధర్నా చౌక్‌లో ఆవేదన దీక్షలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా ధర్నాచౌక్‌కు చేరుకొని దీక్షలు చేపడతామన్నారు. సీఐడీ అటాచ్ చేసిన కంపెనీ ఆస్తులు విక్రయిస్తే బాధితులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. యాజమాన్యం వద్ద ఇంకా రూ. వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. దీక్షలకు గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

శతాధిక వృద్ధురాలి మృతి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వినగడపకు చెందిన శతాధిక వృద్ధురాలు శెట్టిపల్లి చిట్టెమ్మ(105) సోమవారం రాత్రి మృతి చెందారు. 10 రోజుల క్రితం వరకు ఈమె తన పనులు తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురై తుది శ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం జరిగాయి. చిట్టెమ్మ భర్త రత్తయ్య 20 ఏళ్ల క్రితం చనిపోయారు.



చిట్టెమ్మ (పాత చిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, పశుసంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా
ల్యాబ్ అటెండెంట్ (LAB ATTENDANT) పోస్టుల నియామక ప్రకటన

మొత్తము ఖాళీలు: 6 (పొరుగు సేవల క్రింద మెరిట్ ప్రాతిపదికన)

Category	BC-B		BC-E		SC		ST		Grand Total
	G	W	G	W	G	W	G	W	
Local	1	0	0	1	1	1	1	0	6

విద్యార్హత: S.S.C. ఉత్తీర్ణులై ఉండవలెను.
వేతనము: నెలకు రూ. 15,000/-. వయస్సు: ది. 30-11-2025నాటికి 18-42 సం. (SC/ST అభ్యర్థులకు-5 సం., BC అభ్యర్థులకు 3 సం., PH అభ్యర్థులకు 10 సం. సడలింపు కలదు.)
దరఖాస్తు ఫీజు: రూ. 200/- Bank Crossed D.D.ని Joint Director, Animal Husbandry, Vijayawada వారి పేర తీసి దరఖాస్తునకు జతపరచవలెను.
దరఖాస్తు స్వీకరణ తేది: సంబంధిత సర్టిఫికెట్ నకలు కాపీలను (10th Marks memo, 4th to 10th Study certificates, Caste Certificate, Nativity Certificate) జతపరచి పూర్తి బయోడేటాతో సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, ముత్యాలంపాడు, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర, శివాలయము ఎదురు, విజయవాడ నందు 18-12-2025 సా. 4.00 గం.లోపు అభ్యర్థులు స్వయంగా లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా సమర్పించవలెను. తదుపరి దరఖాస్తులు స్వీకరించబడవు. ఇతర వివరముల కొరకు సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, విజయవాడ, NTR జిల్లా నందు సంప్రదించవలెను. ఫోన్ నెం. 92466 02731.

సంయుక్త సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా
సం/- శ్రీ D.K.బాలాజీ I.A.S., కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేటు, ఉమ్మడి కృష్ణా జిల్లా

మావోయిస్టులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: పెనమలూరు ఠాణా పరిధిలో అరెస్టు అయిన 26 మంది మావోయిస్టులకు ఈ 15 వరకు కోర్టు రిమాండ్ పొడిగించింది. మంగళవారం వీరిని వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. విచారించిన కోర్టు రిమాండ్ పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే స్టేషన్ పరిధిలో అరెస్టు అయిన ఇద్దరు మైనర్లను ఈ నెల 5న కోర్టులో హాజరు పరచనున్నారు. వీరిలో ఓ బాలిక విశాఖపట్నం జువైనల్ హోంలో.. మరో బాలుడు విజయవాడ జువైనల్ హోంలో ఉన్నారు. కానూరులోని కొత్త ఆటోనగర్‌లో 28 మంది మావోయిస్టులు పట్టుపడటం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే.

విజయ్‌భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ వాయిదా

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: సామాజిక మాధ్యమాల్లో కూటమి నేతలు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకర పోస్టులతో రెచ్చిపోయిన మాలపాటి విజయ్‌భాస్కర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన క్రమంలో వారిపై దాడి చేసిన కేసులో నిందితుడికి బెయిల్ ఇవ్వాలని దాఖలైన పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలు చేయగా దీనిపై విచారణ జరగనుంది. అసభ్యకర పోస్టుల కేసులో నిందితుడికి షరతులతో కూడిన బెయిల్ మంజూరవగా పోలీసులపై దాడి కేసులో నెల్లూరు జైల్లో విజయ్‌భాస్కర్‌రెడ్డి జుడీషియల్ రిమాండ్‌లో ఉండడంతో బయటకు వచ్చే అవకాశం లేదు.

సత్యవర్ధన్ అపహరణ కేసులో నిందితుల కస్టడీకి పిటిషన్

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో లొంగిపోయి, రిమాండ్‌లో ఉన్న నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్‌లను కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు గురించి మరింత లోతుగా విచారించాల్సి ఉందని.. ఈ నేపథ్యంలో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని అందులో కోరారు. నిందితులు మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. నోటీసుల నిమిత్తం కేసును ఈనెల 4వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని కోర్టు ముందు ఉంచాలని కోరుతూ వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాసిక్యూషన్‌కు నోటీసులు జారీ చేసేందుకు, తదుపరి విచారణ నిమిత్తం 4వ తేదీకి వాయిదా పడింది.

నకిలీ మద్యం కేసులో రెండో విడత కస్టడీకి..

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు రెండో విడత కస్టడీ కోసం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు రవి (ఏ4), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) నుంచి కుట్రకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్లపై మంగళవారం ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పు నిమిత్తం ఈ నెల 8వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

స్వామి వివేకానంద గ్రూపు, VJA, వృద్ధులకు పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 967670 1122, 97047 41122

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

REAL ESTATE

FLAT FOR SALE

నందిగామ రైతుపేట సెంటర్ నందు నిర్మించిన ★ విఘ్నేష్ ప్లాజా నందు కమర్షియల్ షాప్స్ & 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 73829 81107.

సత్యనారాయణ పురంలో 2/3/4 BHK Flats కొత్త మరియు పాతవి అమ్మబడును ✆ 94901 98654

HOUSE FOR SALE

246 చ.గ.ల్లో G+3+పెంట్‌హౌస్ గల బిల్డింగ్ 80,000 అద్దెలు. లిఫ్ట్ పూర్తి ప్లాన్ అప్రూవల్ E/Fతో ప్రసాదంపాడులో అమ్మకం. రేటు 3.25Cr. ✆ 94403 73594

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000+Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370

LAND FOR SALE

ఉయ్యూరు బైపాస్ నుండి 4KM దూరంలో కాటూరు గ్రామ పరిధిలో రైవస్ కాలువ ప్రక్కన 5 ఎకరాల 40 సెంట్లు మాగాణి పొలం అమ్మబడును. ✆ 93488 05256

PLOT FOR SALE

VJA కంచికచర్ల, ఔటర్ రింగ్ రోడ్డు DTCP & APCRDA ఇళ్ళ మధ్య ప్లాట్స్ చ|| గ|| 3,900/- నుండి 7,900/- ✆ 93906 65999

TO LET

COMMERCIAL

విజయవాడ గవర్నరుపేట కోదండ రామిరెడ్డి వీధి శ్రీమహేశ్వరీ ప్యాలెస్ నందు గ్రౌండ్ ఫ్లోర్ 2000 Sft ఫస్ట్‌ఫ్లోర్ 3500 Sft అద్దెకు కలదు. ✆ 9490915637

JOBS

Wanted Real Estate Door to Door Field Marketing Executives in Nandigama & Vijayawada and Telecallers. ✆ 94324 54545.

స్వగృహ ఫుడ్స్‌లో VJA లో పనిచేయుటకు సేల్స్‌గరల్స్/సేల్స్ బాయస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. 20 సం|| to 30సం||లోపు. పార్ట్‌టైం/ఫుల్‌టైం. ✆ 8142545000

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆:76599 88728

Diploma/ITI Civil, Valuer Assistant, Computer Typist, Valuer's Off Ramavarappadu, Vijayawada. ✆ 98492 67445 tnsvaluer@gmail.com

Wanted Female Tele callers. Qualification any Degree. Age limit 25 to 45 years, Salary: 10000/- to 12000/- working location: Master Minds College, Vijaya wada. Contact: 89781 80832.

Wanted Billing Machine Operator For Restaurant. Salary: 16,000/- +. Milap Hotel, 1 Town, Vijaya wada-1. Cont: 83281 56668.

Wanted Telecallers. Q: Inter/ Degree. Salary: Negotiable ★ Gates Institute of Management & Sciences, VJA. ✆ 86449 93322

Required of Advocate Office of Mr.Alapati Vivekananda, High Court Advocate of AP Office in Benz Circle, VJA. Salary offered as per Market Standards. ✆:9390410747

ప్రముఖ గైనిక్ హాస్పిటల్‌లో మెడికల్‌షాపు (ఫార్మశి)లో పని చేయుటకు B.Pharmacy చదివి అనుభవం కలిగిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సంప్ర. 93973 41745.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ వారికి బస్ డ్రైవర్స్ కావలెను. కంకిపాడు, ఎనికేపాడు, నందిగామ, మంగళగిరి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

డొమెస్టిక్ కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు గ్రౌండ్ స్టాఫ్ కావలెను. జీ: 18000/-to25000/- డ్యూటీ 8:00గం||లు. ✆ 77309 58410, 99819 51405.

ఉప్పులూరు, పటమట, VJA సిటీలో సె||గార్డ్స్ & గాంధీనగర్‌లోని హాస్పటల్‌కు ఆయాలు కావలెను. వయస్సు, చదువుతో పనిలేదు అనుభవం బట్టి జీతం, వసతి కలదు. ✆ 924727 1222, 88019 53666

E-KART నందు అర్జెంటుగా Male/Female కావలెను. Qly:Inter, Any Degree. Salary 15000/- Online Available. 9014120139.

VJA గాంధీనగర్ హోటల్ రూమ్స్ నందు పని చేయుటకు M/F అనుభవం కల్గి డిగ్రీ/ DTP కంప్యూటర్ నాలెడ్జ్ గల రిసెప్షనిస్టులు మల్టీ పర్పస్ స్టాఫ్, లేడీ స్వీపర్ కావలెను ✆ 81256 69996.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

నందిగామ

●నందిగామ ●జగ్గయ్యపేట

ఉపన్యాస పోటీల్లో విద్యార్థుల సత్తా

విజేతలతో పాఠశాల డైరెక్టర్ అమరకృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ రజని

నందిగామ గ్రామీణం: మండలంలోని చందాపురం తపస్య ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై 'సెల్‌ఫోన్' ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎం. స్నేహిక, కె.రుత్విక్‌రెడ్డి, వి.బాలశ్రీ వెన్నెల వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులను పాఠశాల డైరెక్టర్ శాఖమూరి అమరకృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ రజని అందజేశారు.

గృహాల మంజూరు పత్రాల పంపిణీ

లబ్ధిదారుకు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట: పట్టణంలో పీఎంఏవై 2.0 కింద పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ధ్రువపత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రూ.2.5 లక్షలతో నిర్మించుకునే ఇంటికి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే ప్రభుత్వ సాయం జమ అవుతుందని, విడతల వారీగా ఇంటి నిర్మాణంలో అవసరమైన సామగ్రి కూడా అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జి, నాయకులు రామకృష్ణ, జోజి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి తాగునీరు వృథా

మండలంలోని చందాపురం గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. నందిగామ మునేటి ఒడ్డున తాగునీటి పథకం నుంచి ఈ గ్రామానికి నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్నారు. చిన్న వంతెనపై పైపులైన్ పగిలి మంగళవారం తాగునీరు వడుగుల కట్టింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి హాలిం మహ్మద్‌ను అడుగగా పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రాణం పోతున్నా పట్టించుకోరే?

శిరస్త్రాణం ధరించక మృత్యువాత ● అవగాహన కల్పిస్తున్నా మారని వాహనదారులు

● గత ఏడాది అక్టోబరు 30న లారీడ్రైవర్‌గా పని చేస్తున్న కంచికచర్ల అంబేడ్కర్ కాలనీకి చెందిన బళ్ల హరీష్ మూలపాడు నుంచి కంచికచర్ల వచ్చే క్రమంలో పరిటాల సమీపంలోని అండర్ పాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్ర గాయాలవడంతో మృతి చెందాడు.

● గత ఏడాది అక్టోబరు 4న వీరులపాడు మండలం వెల్లంకి గ్రామానికి చెందిన వేల్పూరి ధనవంత్ వెంకట్, అచ్చి పసికుమార్ ద్విచక్ర వాహనంపై కంచికచర్ల మండలం పరిటాలలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా రహదారిపై ఉన్న ట్రాక్టరును వారి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే

శిరస్త్రాణం వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

● ఈ ఘటనల్లో వారంతా తలకు శిరస్త్రాణం ధరించక మృతి చెందారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం విధిగా ధరించాలని నిబంధనలు ఉన్నా వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం ప్రమాదాలకు కారణమవుతోంది. అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆచరణలో పెట్టడం లేదు. మన ప్రాణాలను కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉందని.. ప్రతి ఒక్కరూ గుర్తించి శిరస్త్రాణం ధరిస్తే రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే వారి సంఖ్యను తగ్గించగలమన్న సంగతి వాహనదారులు గుర్తించాలని అధికారులు కోరుతున్నారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా..

ఏటా పెరుగుతున్న రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాల్లో మృతి చెందినవారు అత్యధికంగా ద్విచక్ర వాహనం నడిపే సమయంలో శిరస్త్రాణం ధరించక పోవడమే మృతికి ప్రధాన కారణం. సబ్ డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డ్రైవ్ నిర్వహించాక దీని వినియోగం పెరిగింది. మొదటిసారి కౌన్సెలింగ్ నిర్వహించి వదిలి పెడుతున్నాం. తర్వాత శిరస్త్రాణం ధరించని వారిని రహదారి పైకి అనుమతించం.

- బాల గంగాధర్ తిలక్, ఏసీపీ, నందిగామ

ఉద్దేశం ఘనం... నిర్మాణం నిరుపయోగం

నిధులున్నా వినియోగంలోకి రాని భవనం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే

జగ్గయ్యపేట ముక్త్యాల రోడ్డులో నిర్మించిన భవనం

జగ్గయ్యపేట పట్టణంలోని మానవ వ్యర్థాల పునరుత్పాదకాల ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) భవనం నిర్మాణం పూర్తి చేసుకొని రెండేళ్లు అవుతున్నా ఇంకా వినియోగంలోకి రావడం లేదు. ముక్త్యాల రోడ్డులో అనధికార డంపింగ్ యార్డ్ పక్కనే రూ.2 కోట్ల స్వచ్ఛాంధ్ర నిధులతో చేపట్టిన నిర్మాణంలో ప్రధాన భవనం పూర్తైనా ఏర్పాటు చేయాల్సిన యంత్రాలు, నిర్మించాల్సిన ట్రాన్స్‌ఫార్మర్, భవనానికి అవసరమైన విద్యుత్తు సరఫరా ఇంకా సమకూర్చలేదు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన స్వచ్ఛంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ భవనాన్ని నిర్మించారు. పురపాలక సంఘానికి సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను తరలించే వాహనాలూ కూడా ఇచ్చారు. ప్రస్తుతానికి ఇవి ఉపయోగంలోకి రాలేదు.

➤ సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను తరలించే ప్రైవేటు వాహనాలు ఇష్టారాజ్యంగా గ్రామాల బయట ఖాళీ ప్రదేశాల్లో, కాల్వల పక్కన, చెరువుల పక్కన వదిలేస్తున్నారు. వాయుకాలుష్యం, నీటి కాలుష్యం వీటిని నియంత్రించేందుకు రూపొందించిన భవనాన్ని వినియోగంలోకి తేవడంలో పురపాలక సంఘం విఫలమైంది.

➤ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను గించే పనిని ఇటీవలే ఎంపీ, ఎమ్మెల్యే చౌరవతో ప్రారంభించిన పురపాలక సంఘం ఒక అడుగు ముందుకు వేస్తున్నారు. ఈ ఎఫ్ఎస్‌టీపీ విషయంలో కూడా చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

➤ సెప్టిక్ ట్యాంకుల నుండి తరలించిన వ్యర్థాన్ని ఇక్కడ ఎనరోబిక్ విధానంలో శుద్ధి చేసి జలాన్ని, ఘనాన్ని వేరు చేస్తారు. ఆ ఘనాన్ని మట్టిగా మార్చి రసాయన పరీక్షల అనంతరం ఎరువుగా రైతులకు విక్రయిస్తారు. దీంతో పురపాలిక సంఘానికి ఆదాయం కూడా లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని నవాబుపేటలో మంగళవారం రాత్రి సైబర్ నేరాలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని..డిజిటల్ అరెస్టులు

మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన ఏసీపీ తిలక్

ఉండవని చెప్పారు. ఫోన్లు చేసి బెదిరిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచితులు అధిక లాభాల పేరుతో మభ్యపెట్టి ఓటీపీలు అడిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ బాలగంగాధర్ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అర్జున్, ఏఎస్సై సామినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్‌స్థాయి ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుల జిల్లా బయాలజికల్ సైన్స్ ఫోరం తరఫున విజయవాడ హ్యాపీలైఫ్ ఫౌండేషన్ ముద్రించిన పదో తరగతి బయాలజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను 75 ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సైన్స్ ఫోరం సభ్యులు యు.సత్యనారాయణ, మెట్లే, ఎన్.అరిపిన్ రెడ్డి, ముక్కా, సత్యనారాయణ, తాతకుమార్, ఎం.వెంకటకృష్ణ రావు, శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ పొదిలి విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ ఆర్.రాంబాబునాయక్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోకు అభినందనలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం ప్రజా పరిషత్తు కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధుల్లో చేరిన షేక్ ఇమామ్‌ను జగ్గయ్యపేట బీసీ సంక్షేమ సంఘ సభ్యులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో టి. కృష్ణ, పెంటి శ్రీనివాసరావు, ఉద్దండి వాసు, తంగెళ్ల శ్రీనివాసరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో నియోజకవర్గ అధ్యక్షుడిగా కుమార్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట నియోజకవర్గ ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆరేపల్లి కుమార్‌ను మంగళవారం పట్టణ స్పెన్సర్స్ అసోసియేషన్ సభ్యులు ఏపీ ఎన్‌జీవో కార్యాలయంలో కలిసి సత్కరించి అభినందించారు. గోపాలకృష్ణ సొసైటీ ఛైర్మన్ అశ్వినీప్రసాద్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కుమార్‌ను సత్కరిస్తున్న స్పెన్సర్స్ అసోసియేషన్ సభ్యులు

ధూళిపాళ లక్ష్మణరావు, చావా ప్రేమ్‌చంద్, వక్కలగడ్డ వాసు, ఆట్లూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ శ్రీను, ఎన్‌జీవో సంఘం కార్యదర్శి కె.

ధాన్యం ఆరబోతకు అష్టకష్టాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కల్లంలో ఆరబోసిన ధాన్యం

కల్లాల్లో ధాన్యం ఆరబోతకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దిత్వా తుపానుతో యంత్రాలతో నూర్పిడి చేసిన ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతుసేవా కేంద్రాల వద్ద ప్లాట్‌ఫారాలు లేవు. పంట పొలాల్లో పట్టాలు పై ఆరబోస్తున్నారు. వర్షం కురిస్తే తడవకుండా పట్టాలు కొంటున్నారు. సొసైటీల్లో పౌర సరఫరాల శాఖ పట్టాలు ఇచ్చినా కొద్ది మంది రైతులు అవసరాలకే అవి సరిపోవడం లేదు. నందిగామ నియోజకవర్గంలో 58 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోతకు ప్లాట్‌ఫారాలు, డ్రయ్యర్ వంటి యంత్రాలు అందుబాటులో లేవు. తుపాను భయంతో రైతులు హడావుడిగా ధాన్యం నూర్పిడి చేయించి పంట పొలాల్లో ఆరబోస్తున్నారు. ఒక్కసారిగా ఎక్కువ మంది రైతులు వరి పంట నూర్పిడులు చేయిస్తుండటంతో ధాన్యం తరలించడానికి ట్రాక్టర్లు అందుబాటులో లేవు. డిమాండును తగ్గట్టుగా రైతులు గోనెసంచులు అందుబాటులో లేవని రైతులు వాపోతున్నారు.

కాలుష్యం నియంత్రించాలి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట ప్రాంతంలో కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త అంకిపల్లి రవిప్రసాద్ కమిషనర్ రామకృష్ణకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ★ పట్టణంలోని ఏడో వార్డులో మౌలిక వసతులు కల్పించాలని వార్డు ప్రతినిధి గద్దం రాంబాబు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం వినతిపత్రం అందజేశారు. పేపల వాగు వరద వల్ల రహదారులు ధ్వంసం అవుతున్నాయని మరమ్మతులు చేయాలని కోరారు.

విశాఖ మహాసభ జయప్రదానికి పిలుపు

కంచికచర్ల, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా శాఖ కార్యదర్శి కోట కల్యాణ్ ఆరోపించారు. ఈ నెల 30 నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కంచికచర్ల, పెండ్యాలలో మంగళవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలపై మహాసభ ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లాశాఖ కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ.. లక్ష మందితో జనవరి 4న విశాఖపట్నంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల శాఖ కన్వీనర్ బి.భూషణం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాకపోకలకు కష్టం.. ఎమ్మెల్యే ఆపన్నహస్తం

చెన్నారావుపాలెం (వీరులపాడు), న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్, నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య సొంత ఖర్చుతో ఏనుగుగడ్డ వాగుపై రాకపోకల సమస్యకు చెన్నారావుపాలెం గ్రామస్థులకు సాంత్వన కలిగించారు. వాగుపై వంతెన దెబ్బతిని దశాబ్ద కాలంగా చెన్నారావుపాలెం రైతులు, పశు పోషకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ సంవత్సరం కురిసిన అధిక వర్షాలకు వంతెన పూర్తిగా కోతకు గురై బండరాళ్లు బయట పడ్డాయి. తెదేపా నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆమె కృషితో వాగుపై వంతెన నిర్మాణానికి మట్టి పరీక్షలు నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఈ నేపథ్యంలో ధ్వంసమైన వంతెన తొలగించి, రాకపోకలకు తాత్కాలికంగా రోడ్డు నిర్మించడానికి ఎమ్మెల్యే సొంత నిధులు రూ.80 వేలు కేటాయించగా సోమవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి.

వాగు వద్ద రోడ్డు పనులు

అడ్డంకులు ఇలా.. వాగు పారేదెలా?

మండలంలోని అడవిరావులపాడు వద్ద నల్లవాగు వ్యర్థాలతో నిండింది. వాగుపై పాత చప్టా తొలగించి కొత్తది నిర్మించారు. పాత చప్టా పగులగొట్టి వ్యర్థాలను నల్లవాగులో పడేశారు. ఇవి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. వర్షాకాలం నల్లవాగుకు వరదనీరు పోటెత్తి పంట పొలాలను ముంచుతుంది. వ్యర్థాల వల్ల నీరు పారక ఎక్కువ నష్టం కలుగుతుంది. వాగుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి వాగు కుంచించుకుపోతోంది. జలవనరుల శాఖ అధికారులు స్పందించి వాగులో వ్యర్థాలు తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వ్యర్థాలు, కంపచెట్లతో నల్లవాగు

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

మున్సిపల్ అధికారులపై చర్యలకు ఆదేశాలు

నందిగామ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలకు బాధ్యులైన అప్పటి మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గవర్నర్ ఆదేశం ప్రకారం మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఆర్.టి. 1375 ప్రకారం జీవో జారీ చేశారు. పురపాలక సంఘ పరిధిలో గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. దీనికి విరుద్ధంగా ఐదారు అంతస్తుల్లో అక్రమంగా అపార్టుమెంట్లు నిర్మించారు. అదనంగా నిర్మించే ప్రతి అంతస్తుకు రూ.మూడు లక్షల వరకు మామూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై నందిగామకు చెందిన సామాజిక కార్యకర్త కురగంటి హనుమంతరావు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ సింహాని జయరాం, పట్టణ ప్రణాళిక అధికారి కె.యూసోఫ్‌అలీ, టీపీఎం బి.సీహెచ్.వెంకయ్య, సూపర్‌వైజర్ కె.అశ, పట్టణ ప్రణాళిక బిల్డింగ్ ఓవర్‌సీర్ షేక్ నాగుల్‌మీరాలతో పాటు ఉద్యోగులు అబీనేష్, బాణాల భవ్య, జి.వంశీకృష్ణను బాధ్యులుగా గుర్తించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5 నుంచి యోగ శిక్షణ తరగతులు

నందిగామ, న్యూస్‌టుడే: మండలంలో 5 నుంచి మహిళలకు యోగ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగ గురువు కీలారు పాపారావు తెలిపారు. మాజీ ఎంపీపీ కోవెల మూడి వెంకటనారాయణ సౌజన్యంతో స్థానిక సాయి అయ్యప్ప దేవాలయానికి ఎదురుగా ఉన్న కొంగర సదన్‌లో ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామని చెప్పారు. వివరాలకు ఫోన్ నం: 9989448383లో సంప్రదించాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ కొండూరులో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన కార్మికులను పంపి దీపాలకు మరమ్మతులు చేయించారు. ★ మాగల్లులో పంచాయతీ తాగునీటి పథకం విద్యుత్తు మోటారు చెడిపోయి తాగునీరు రావడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి రవి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన మోటారుకు మరమ్మతులు చేయించి నీటిని విడుదల చేశారు. ★ కమ్మవారిపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి ఆకుల హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన దీపాలకు మరమ్మతులు చేయించారు.

- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

కౌన్సిలర్ చొరవతో సమస్యకు పరిష్కారం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎస్ కాలనీలో నెహ్రూప్యాలెస్ కేంద్రం వద్ద రోడ్డుకు అడ్డంగా కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో కౌన్సిలర్ పట్టెం నాగమల్లేశ్వర హర్ చొరవ చూపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. మంగళవారం ఆయన ప్రత్యేకంగా జేసీబీ ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించారు. దీనిపై స్థానికులు ఆయన్ను అభినందించారు.

మాలధారులకు అన్నదానం

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో వస్తువాహన సేవాసమితి ఆధ్వర్యంలో నిత్యం 500 మంది స్వాములకు ఏర్పాటుచేస్తున్న అన్నసమారాధన కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములకు భోజనం వడ్డించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించి ప్రోత్సహించాలని సూచించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చందర్లపాడు: కోనాయపాలెంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు వ్యవసాయ సహకార పరపతి సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఉమలపూడి వెంకటరత్నం, నతనేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నరసింహారావుపాలెం (వీరులపాడు): మృతుని కుటుంబ సభ్యులకు జుజ్జూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ (పీఏసీఎస్) సిబ్బంది మంగళవారం ఆర్థిక సాయం చేశారు. నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన గుర్రాల కోటిరెడ్డి నవంబర్ 28న మృతి చెందారు. అతను సొసైటీలో సభ్యుడు. రుణం కలిగి ఉన్నందున అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు కుటుంబ సభ్యులకు అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు షేక్ రహ్మతుల్లా, కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి భాస్కరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల మండల స్థాయి క్రీడా పోటీలను కంచికచర్ల సమీపంలోని మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) గురునాథం, బాలాజీ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రికెట్, త్రోబాల్ జట్లు ఈ నెల 13, 14న నిర్వహించే నందిగామ డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

కంచల మేజర్ ఆయకట్టు చివరకు సాగునీరు

నందిగామ, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ కంచల మేజర్ కాలువ దిగువ వరకు సాగునీరు సరఫరా చేయాలని కోరారు. కన్నెకుల సాగునీరు ఆయకట్టు చివరి వరకు అందక రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నెస్పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రాయపూడి చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షులు కాలువపై పర్యవేక్షణ చేస్తుండటంతో మంగళవారం నాటికి చివరి వరకు సాగునీరు సరఫరా అవుతోంది. నీటి సంఘాల అధ్యక్షులు మన్నెం శ్రీనివాసరావు, రామిరెడ్డి శ్రీనివాసరావు, రైతులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

అనిగండ్లపాడు మాజీ సర్పంచి మృతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని అనిగండ్లపాడు మాజీ సర్పంచి నెల్లూరి రామనాథం(96) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

నేటి నుంచి దత్త జయంతి కార్యక్రమాలు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: మండల పరిధి జుజ్జూరులోని యజ్ఞ దత్త దేవాలయంలో దత్త జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మద్దూరి యజ్ఞనారాయణ మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు ప్రతిరోజు విశేష పూజలు నిర్వహిస్తారని, 03న తైలాభిషేకం, పల్లకి సేవ, 04న దత్త హోమం, స్వామి కల్యాణం, గరుడోత్సవం, 05న స్నపన తిరుమంజనం, పల్లకిసేవ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ సర్వే పరిశీలన

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు మోహనరావు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్లమూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ సర్వేను జిల్లా డైట్ అధ్యాపకుడు మంగళవారం పరిశీలించారు. డాక్టర్ కొప్పర్తి మోహనరావు పాఠశాల రికార్డులు, బోధనా తీరు, విద్యార్థుల ప్రగతి నివేదికలు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ఆరేపల్లి భిక్షాలు, ఉపాధ్యాయులు షేక్ నవాబ్‌జాని, ఎం.రజని, మేకల సుధాకర్ పాల్గొన్నారు.

ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు

సీసీ కెమెరాల ఏర్పాటు పర్యవేక్షిస్తున్న సీఐ నాయుడు

నందిగామ: పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు నందిగామ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న విజయవాడ హైవే రోడ్డులో అనాసాగరం వై వంతెన వద్ద మంగళవారం సీసీ కెమెరాలు అమర్చారు. సీఐ వైవీఎల్ నాయుడు వాటి పనితీరు పరిశీలించారు. అపార్ట్‌మెంట్ల నిర్వాహకులు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం కొణకంచిలోని ప్రభుత్వ రేవ వైద్యశాల వైద్యాధికారి వాణి ఆధ్వర్యంలో ఆయుష్ ప్రతిభ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆశావర్కర్లకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురాతన భారతీయ ఆయుర్వేద వైద్యంతో ఇంటి వద్దనే అనేక రోగాలకు చికిత్స చేసుకునే వచ్చని చెప్పారు. వంటింటి మందులు వినియోగించే వల్ల ప్రయోజనాలు కంటి సమస్య ఎక్కువ అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

17 నెలల్లోనే సూపర్-6 హామీల అమలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను 17 నెలల్లోనే కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. మంగళవారం కార్యాలయంలో 87 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.54.11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మైనేని రాధ, యానాల గోపి, కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జి, కానూరి కిశోర్, మీసాల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కానుకల లెక్కింపు నేడు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. ఉదయం ఏడు గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు.

పాఠశాల బస్సుల తనిఖీ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేటు పాఠశాల బస్సులను జగ్గయ్యపేట ఎంవీఐ నారాయణరాజు, జయచంద్ర మంగళవారం తనిఖీ చేశారు. పట్టణంలో ఎన్ఓసీ కాలేజ్‌లో నిర్వహించిన తనిఖీల్లో పాఠశాలల బస్సుల్లో సురక్షిత ప్రయాణ నిబంధనలు పాటించాలని యాజమాన్యాలకు చెప్పి వాటిని సూచించారు.

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD

పబ్లిక్ నోటిఫికేషన్

ఇండియన్ బ్యాంక్, నందిగామ శాఖకు చెందిన ఈ క్రింది రుణ ఖాతాలలో మోసపూరిత వ్యవహారాల తనిఖీపై బ్యాంకు విచారణ ప్రక్రియను ప్రారంభించింది:

వ.నెం.	ఖాతా నెంబరు	ఋణగ్రహీత యొక్క పేరు	మంజూరైన అమౌంట్ (లక్షలలో)	మంజూరైన తేదీ
1	7322706317	అమరావతి SHG	3.00	26.10.2022
2	7574344652	మహాలక్ష్మి SHG	8.00	07.08.2023
3	7562896629	శ్రీ వెంగమాంబ SHG	9.00	07.08.2023
4	7449869628	సాయిరామ్ SHG	3.00	09.03.2023
5	7475652309	తులసి SHG	6.00	06.04.2023
6	7737242499	నసీరుద్దీన్ బాబా SHG	6.00	12.03.2024
7	7397583635	అపర్ణ SHG	3.00	11.01.2023
8	7544231938	శ్రీ దుర్గ SHG	8.00	04.07.2023
9	7322870026	రాజేశ్వరి SHG	3.00	26.10.2022
10	7314927100	వంశీ SHG	3.00	14.10.2022
11	7400543792	అయ్యప్పన్ SHG	3.00	12.02.2023
12	7574350371	శ్రీ వెంకటేశ్వర SHG	8.00	07.08.2023
13	7592954359	శ్రీ వెంకట రమణ SHG	9.00	30.08.2023
14	7464996342	అల్లా హుందులిల్లా SHG	8.00	23.03.2023
15	7288595601	రుతిక SHG	9.00	23.03.2023

ఈ విషయమునకు సంబంధించి, ఈ క్రింది వ్యక్తికి 31.07.2025 తేదీగల షోకాజ్ నోటీసు జారీ చేయబడినది. సదరు వ్యక్తిపై బ్యాంకు చేసిన ఆరోపణలు ఈ షోకాజ్ నోటీసులో ఉన్నాయి. నోటీసు అందిన 21 రోజులలోపు ఆ ఆరోపణలకు సంబంధించి ఆమె తన వివరణను సమర్పించుకోవడానికి అవకాశం కల్పిస్తూ దీనిని జారీ చేయడం జరిగింది. బ్యాంకు రికార్డులలో నమోదైన చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ఈ నోటీసు పంపబడినది. అయితే, పోస్టల్ ట్రాక్ కన్‌సైన్‌మెంట్ ప్రకారం, సదరు వ్యక్తికి జారీ చేసిన షోకాజ్ నోటీసు బట్వాడా కాకుండా వెనక్కి వచ్చినది. ఆ చిరునామాదారుని వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

వ.నెం.	పేరు	హోదా	చిరునామా
1	శ్రీమతి వెల్లంకి సాయి కుమారి	బిజినెస్ కరస్పాండెంట్ (15 రుణ ఖాతాలు మంజూరు చేయబడిన సమయంలో)	భర్త: శ్రీ వెల్లంకి వెంకటేశ్వరరావు, హెచ్.నెం. 23-166, వాసిరెడ్డి వారి స్ట్రీట్, నెహ్రూ నగర్, నందిగామ, కృష్ణా జిల్లా.

ఈ పత్రికా ప్రకటన ద్వారా, పైన పేర్కొన్న వ్యక్తి వెంటనే కృష్ణా జిల్లా, నందిగామ, మెయిన్ బజార్, గాంధీ సెంటర్, 18-213 లో ఉన్న మా **ఇండియన్ బ్యాంక్, నందిగామ శాఖను** సంప్రదించి, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు నోటీసును స్వీకరించవలసిందిగా మరియు నోటీసు స్వీకరించిన తేదీ నుండి 21 రోజులలోపు స్పందించవలసిందిగా బ్యాంకు సూచించడమైనది. ఒకవేళ ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజులలోపు నోటీసు తీసుకోకపోయినా లేదా నోటీసు తీసుకున్న తర్వాత 21 రోజులలోపు ఎటువంటి స్పందన రాకపోయినా, ఈ విషయంలో ఆమె చెప్పదలచుకున్నది ఏమీ లేదని భావించి, బ్యాంకు తదుపరి చర్యలను తీసుకుంటుంది.

తేదీ: 01.12.2025, ప్రదేశం: నందిగామ — ఇండియన్ బ్యాంక్, నందిగామ బ్రాంచి

(c) eenadu

విజయవాడ తూర్పు

అనర్గళంగా ప్రసంగించి... విజేతలుగా నిలిచి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ పద్మజ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పాఠశాల స్థాయిలో వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ప్రతిభ, నైపుణ్యాలు మెరుగు పడతాయని నలంద విద్యానికేతన్ ప్రిన్సిపల్ మాదల పద్మజ అన్నారు. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని నలంద విద్యానికేతన్‌లో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల్లో సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనర్గళంగా ప్రసంగించి ఆకట్టుకున్నారు. ఇరిడిమా నస్పహిని (9వ తరగతి), చేతన సాయి తులసి (7వ తరగతి), వివేక్ రెడ్డి (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ మాదల పద్మజ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : రింగు రోడ్డు పరిధిలోని 11 కేవీ కానూరు ఫీడర్ విద్యుత్తు లైను మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదు. కానూరు, నలంద స్కూల్ ప్రాంతం, మున్సిపల్ ఉద్యోగుల కాలనీ, మహాత్మా గాంధీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నామని గుణదల కార్య నిర్వాహక ఇంజినీర్ పి.పాపారావు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

నగరాభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థకు సంబంధించి 2026- 2027 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలను పూర్తిస్థాయిలో తయారు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలపై విభాగాల అధికారులతో సమీక్షించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ అంచనాల రూపకల్పన చేయాలని అన్నారు. రెవెన్యూ ఆదాయం, వ్యయాలు, పెట్టుబడుల ఆదాయ, వ్యయాల అంచనాలను వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని సూచించారు. నగర స్వచ్ఛత, ప్రజారోగ్యం వంటి అంశాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బడ్జెట్ అంచనాలపై శాఖాధిపతులు మరోసారి తమ సిబ్బందితో సమావేశమై చర్చించి, తగిన అంచనాలను వచ్చే వారం మరోసారి నిర్వహించే బడ్జెట్ సమీక్ష సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పర్హీన్ జాహిద్, అదనపు కమిషనర్లు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, అర్బన్ ప్లానర్, సత్యనారాయణ, జి.సృజన, ఎ.శ్రీధర్, ఎ.శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, లత, మాల్యాద్రి, పి.వెంకట నారాయణ, బి.సత్య నారాయణమూర్తి పాల్గొన్నారు.

చదువుతూ... ప్రకృతి సాగు చేస్తూ..

★ కళాశాల మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు ★ పండిస్తున్న విద్యార్థినులు

ప్రదర్శనలో గోంగూర, వంగ, బెండకాయలు

మొక్కల పక్కన కలుపు తొలగిస్తున్న విద్యార్థినులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : తరగతి గదిలో పాఠాలు వినడమే కాదు.. కళాశాల మిద్దెనే వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు ఆ విద్యార్థినులు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగించే జీవామృతం, ఘనజీవామృతం తయారు చేస్తున్నారు. విద్యార్థి దశలోనే ఇలా చేయడం వల్ల వారు భవిష్యత్తులో ప్రకృతి సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉంది. ★ సిద్ధార్థ మహిళా కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఇందుకు భవనంపై ఉన్న ఖాళీనే ఎంచుకున్నారు. ఆకుకూరలు, బెండ, వంగ, సొర, కాకర, చిక్కుడు, పచ్చిమిర్చి సాగు చేస్తూ భళా అనిపిస్తున్నారు. పంట ఉత్పత్తులతో సోమవారం కళాశాలలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిని ఆధ్యాపకులు, తోటి విద్యార్థులు కొన్నారు. గోమూత్రం, పేడ, శనగపిండి, బెల్లం, మట్టిని కలిపి ద్రవ, ఘన జీవామృతాలు తయారు చేస్తున్నారు. వీటిని పావు లీటరు రూ.20, పిడక రూ.10తో విక్రయిస్తున్నారు. ఈ ఆదాయంతో విత్తనాలు కొనేందుకు ఉపయోగిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. రెండేళ్ల నుంచి ఇలా సాగు చేస్తున్నారు.

అవగాహన కలిగింది

నాకు ఇష్టమైన మెంతికూర, గోంగూర సాగు చేస్తున్నా. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయడం, కలుపు రాకుండా బాగు చేయడం చేస్తున్నా. సేంద్రియ, ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల విద్యార్థులు, ఆధ్యాపకులు ఉత్పత్తులు కొంటున్నారు. ఈ పనుల వల్ల వ్యవసాయంపై అవగాహన కలిగింది. -సిహెచ్ అక్షయ, బీఎస్సీ (బోటనీ) ప్రథమ సంవత్సరం

రైతులకు తెలియజేస్తున్నాం

మేం కళాశాలలో చేస్తున్న సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం గురించి కొంతమందికి రైతులకు వివరించాం. వారు సానుకూలంగా స్పందించారు. వంగ, పచ్చిమిర్చి విత్తనాలు చల్లుతున్నాం. కాయలు కాసే వరకు సస్య రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. -తిలోత్తమ నాయుడు, బీఎస్సీ (బోటనీ), ప్రథమ సంవత్సరం

4 నుంచి వర్సిటీ పురుషుల వాలీబాల్ టోర్నీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : స్థానిక శాతవాహన కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్య నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఎం.బ్రహ్మయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల కళాశాల జట్లు మూడు సెట్ల అర్హత పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డులతో 4న ఉదయం 9 గంటల్లోపు కళాశాల ప్రాంగణంలో పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి బీసీహెచ్ సంగీతరావు రిపోర్టు చేయాలన్నారు. జట్టు లేకుండా వ్యక్తిగతంగా వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో పాల్గొనే క్రీడాకారులు అర్హత పత్రాలతో 5న ఉదయం 9 గంటలకు కళాశాల మైదానంలో హాజరవ్వాలని, వివరాలకు ఫోన్ 94929 39377 నంబరులో సంప్రదించాలని కోరారు.

నైపుణ్యాలతో విజయాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో బహుళ నైపుణ్యాలతో విజయాలు సొంతం చేసుకోవచ్చని వ్యాపారవేత్త వాసిరెడ్డి మురళీకృష్ణ సూచించారు. కేబీఎన్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'మీట్ ద సీఈవో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, వ్యాపార సంస్థ విజయానికి నాయకత్వం కీలకమైన పోషిస్తుందని చెప్పారు. ఉద్యోగంతో పాటు వ్యాపార నిర్వహణ గురించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయాలని అన్నారు. రాష్ట్రం సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న పరిస్థితులు, టైం మేనేజ్‌మెంట్ తదితర అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు వాస్తవ పరిస్థితులపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పీజీ కోర్సెస్ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి రవికిరణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు పూర్తి శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నగరంలోని రామకృష్ణాపురం, అజిత్ సింగ్‌నగర్, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణను ఉదయం కాలువలు, ఇబ్బందులు ఏర్పడుతున్నాయా వెంటనే తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. అంతర్గత, ప్రధాన రహదారులు, డివైడర్ల వెంట చెత్త, చెదారం లేకుండా చూడాలని, సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్లో వ్యర్థాల నిర్వహణ కట్టుదిట్టంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సేకరించిన వ్యర్థాలను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు ఆలోచనలు చేయాలని, అందుకు అనువైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు కె.ప్రభుదాస్, బాబూ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయిస్తాం

ఆర్వో యూనిట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్, చిత్రంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : మూడో డివిజన్ గుణదలలోని దారి గిరిదర్, అవనిత నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌గా అభివృద్ధి చేసేందుకు అనుమతికి కృషి చేస్తానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడతానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జెమ్స్ సహకారంతో మరమ్మతులు చేసిన తాగునీటి ప్లాంటును మంగళవారం ఆయన ప్రారంభించారు. లయన్స్ క్లబ్ దాతను అభినందించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మాల్యాద్రి ఓ.వి.రెడ్డి మాట్లాడుతూ ... ఆర్వో యూనిట్ మరమ్మతులకు ముందుకు వచ్చిన జాస్తి నవీన్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మురళీకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గుడ్డేటి అనిల్ కుమార్, జాస్తి ప్రసాద్, రంగా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీటీ టోర్నీ విజేత కేవీఎస్ఆర్ ఫార్మసీ జట్టు

అతిథి నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జట్టు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల మహిళా టేబుల్ టెన్నిస్ టోర్నీలో కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నీలో మొత్తం నాలుగు జట్లు తలపడగా.. ఎస్ఆర్ఆర్ సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు రన్నర్స్ ట్రోఫీని సొంతం చేసుకోగా, ఎన్ఆర్ఐ న్యాయ కళాశాల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ క్రీడా కమిటీ సభ్యుడు ఎల్.కె.మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యు.అరవింద్ బాబు, టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్.వినయ్‌శేఖర్ పాల్గొన్నారు.

మైక్రో బయాలజీ విభాగానికి ఉత్తమ ప్రదర్శన అవార్డు

సిబ్బందితో కలిసి ధ్రువపత్రం చూపుతున్న ప్రిన్సిపల్ ఏడుకొండలరావు తదితరులు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన సిద్ధార్థ వైద్య కళాశాల మైక్రో బయాలజీ విభాగానికి కలెక్టర్ అవార్డు అందజేశారని కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు తెలిపారు. మంగళవారం ఆ విభాగం వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య నగరపాలక సంస్థ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీ, ఫార్మాటింగ్, ప్రాథమిక సూత్రాలతో సహా మైక్రోసాఫ్ట్ ఎక్సెల్‌లో ప్రాథమిక పరిజ్ఞానం గురించి తెలియజేసినట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ ఉప విభాగాధిపతి కోనేరు సుధీర్, వైజేఎస్ లక్ష్మీ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లతో ఆర్థిక భరోసా

చిట్టినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు జీవితాలకు భరోసాగా నిలుస్తున్నాయని కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం 49వ డివిజన్ సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్న కందుల సౌజన్య పింఛను కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం వెంటనే స్పందించి మంజూరు చేసిందని వివరించారు. అనంతరం పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న క్రాంతికుమార్, నేతలు

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : 19వ డివిజన్ లబ్బీపేటలోని వైవీరావు హాస్పిటల్ సమీపంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. తెదేపా యువనేత గద్దె క్రాంతికుమార్ హాజరయ్యారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డివిజన్ తెదేపా అధ్యక్షుడు భాగం సాయిప్రసాద్, ఎస్.ఫిరోజ్, వటాల హరిప్రసాద్, జితేంద్ర, ఖలీల్, సిరాజ్ పాల్గొన్నారు.

అదుపు తప్పితే... ప్రమాదమే

ప్రమాదకరంగా డ్రెయిన్

మొగల్రాజపురంలోని ఏఎస్ రామారావు రోడ్డులో జమ్మిచెట్టు కూడలి వద్ద మురుగు కాలువ ప్రమాదకరంగా మారింది. రహదారి అవతలి వైపు మురుగు వెళ్లేందుకు రహదారి కింద తూము ఏర్పాటు చేశారు. దీని వల్ల ఇక్కడ రహదారి మార్జిన్ కూడా లేదు. రాత్రి వేళ గమనించకుండా పక్కకు వెళ్లితే ప్రమాదమేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

మారథాన్‌లో మెరిసిన ఆర్టీసీ ఉద్యోగి

సాధించిన పతకంతో రామకృష్ణ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : విజయవాడలో ఆర్టీసీ ఉద్యోగిగా విధులు నిర్వర్తిసున్న పి.రామకృష్ణ (59) మారథాన్‌లో సత్తా చాటి కాంస్య పతకం సాధించాడు. గత నెల 30న విశాఖలో నిర్వహించిన 'సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ 32 కి.మీ. రోడ్డు రన్'లో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన రామకృష్ణ.. మారథాన్‌ను 3 గంటల 32.57 నిమిషాల్లో పూర్తి చేసి తృతీయ స్థానంలో నిలిచాడు. ఐజీఎంసీ స్టేడియంలో సాధన చేస్తూ పలువురు అథ్లెట్లకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు. అథ్లెట్‌ను పలువురు అభినందించారు.

విజేతలకు అభినందనలు

వైష్ణవితో ప్రిన్సిపల్ పద్మజ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న టి.వైష్ణవి జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.పద్మజ తెలిపారు. గత నెల 22 నుంచి 30 వరకు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం ఇటానగర్‌లో జరిగిన 42వ జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ పోటీల్లో వైష్ణవి రాష్ట్ర రికర్వ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి మెరుగైన ప్రతిభతో తృతీయ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.తనూజ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్- 19 హ్యాండ్‌బాల్ పోటీల్లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి జట్టు తృతీయ స్థానం సాధించడానికి దోహద పడిందని తెలిపారు. గత నెలలో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ త్రోబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. క్రీడాకారిణులను పలువురు అధ్యాపకులు అభినందించారు.

బాగుపడిన రహదారి

ఈనాడు కథనాలకు స్పందన

రహదారి మరమ్మతులు చేశాక ఇలా..

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఏఎస్ రామారావు రోడ్డు (ఐదో నంబర్)లో మొగల్రాజపురం గుహల వద్ద కొంత మేర రహదారి దెబ్బతింది. ఎగుడు దిగుడుగా ఉండటంతో రాకపోకలకు అసౌకర్యం కలుగుతోంది. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారని స్థానికులు తెలపగా.. ఈ సమస్యపై గత నెల 27న 'దెబ్బతిన్న రహదారి.. రాకపోకలకు ఇక్కట్లు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి.. రహదారిలో మరమ్మతులు చేయించారు. దీంతో వాహనదారులకు ఇక్కట్లు తొలగాయి.

తాగునీటి వాల్వ్‌కు మరమ్మతులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : మూడో డివిజన్ కరెన్సీనగర్ నడిపల్లి సుందరాచారి, బాయన బాబూజీ రహదారి, శాఖమూరి శివయ్య వీధుల్లో వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోందని 'ఈనాడు'లో మంగళవారం 'తాగునీరు వృథా...పట్టించుకోరా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాల్వ్‌కు మరమ్మతులు చేసి.. వృథా నీటికి అడ్డుకట్ట వేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ఫిట్‌నెస్ ఛార్జీలు పాత పద్ధతిలో కొనసాగించాలి

పోస్టర్లు ప్రదర్శిస్తున్న సంఘ సభ్యులు

ఆటోనగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం గూడ్స్ రవాణా వాహనాలపై అమలు చేస్తున్న ఫిట్‌నెస్ ఛార్జీలను పాత పద్ధతిలో కొనసాగించాలని న్యూ ఆంధ్ర మోటర్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆటోనగర్ 5వ లైన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని చెప్పారు. ఫిట్‌నెస్ పెంపుతో నిత్యావసర సరకుల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. రవాణా ఛార్జీలు పెరిగితే రైతులకు వ్యవసాయ వ్యయాలు మరింత అధికమవుతాయన్నారు. గతంలో ఫిట్‌నెస్ ఛార్జీలు రూ.900 నుంచి రూ.1400 వరకు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అవి మూడు రెట్లు అధికంగా పెరగడంతో లారీ యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లు ప్రదర్శించారు. సమావేశంలో కోశాధికారి డీవీ నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా బాధ్యుడు గరికపాటి భాస్కరరావు, సభ్యులు ఏడుకొండలు, మధుబాబు, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌రావు, నవీన్‌కుమార్, కృష్ణారావు, సామెలు రాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సినిమాలు

★ ఆంధ్ర కింగ్: జీ-3(రాజ్-యువరాజ్), శైలజ, మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ రివాల్వర్ రీటా: జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ ప్రేమంటే, 12ఏ రైల్వేకాలనీ: జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తార స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ రాజు వెడ్స్ రాంబాయి: జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ పాంచ్‌మినార్: మీరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు). ★ మఫ్టిపోలీస్: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణ కాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు). - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆకతాయిల సమాచారం ఇవ్వండి

మహిళలతో మాట్లాడుతున్న సీఐ పవన్ కిషోర్

పటమట, న్యూస్‌టుడే : ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టామని పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్ అన్నారు. మంగళవారం రామలింగేశ్వరనగర్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పట్టణ సీఐ, ఎస్సైలు శ్రీకృష్ణవర్మ, హరికృష్ణ, సీతారామ్, భారతి, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు జరిగే సమయాల్లో పోలీసులకు సమాచారమిస్తే.. నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వాలంటీర్లతో సమగ్ర సామాజిక సర్వే


ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : ఆంధ్రా లయోల కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల వాలంటీర్లు 5వ డివిజన్ అరుల్‌నగర్, విజయనగర్ కాలనీ, గంగిరెద్దుల దిబ్బ ప్రాంతాల్లో దత్తత తీసుకున్న సామాజిక భవనాల్లో వారం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నివాసితులతో ఆరోగ్య, పరిశుభ్రత, పౌర బాధ్యత, సామాజిక అవగాహన కల్పించారు. దీంతో పాటుగా ఇంటింటికీ సమగ్ర సామాజిక సర్వే నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర నినాదాన్ని తీసుకెళుతూ వ్యర్థాల విభజన, కంపోస్టింగ్, ప్లాస్టిక్‌లను బాధ్యతాయుతంగా పారవేయడం, పరిశుభ్రమైన పరిసరాలను నిర్వహించడంపై అవగాహన కల్పించారు. రాజ్యాంగ విలువలు, పౌరులు విధులు, ప్రజాస్వామ్య భాగస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడానికి జాతీయ రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఎ.శామ్యూల్ దయాకర్, పి.ఆర్.జాన్, కె.ప్రకాశరావు పర్యవేక్షించారు. దాదాపు 150 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

అన్నదానం సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనం

అన్న ప్రసాదం వడ్డిస్తున్న అనురాధ

పటమట, న్యూస్‌టుడే : అన్నదానమే హిందూ సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనమని, అన్నదానాన్ని మించిన మరో దానం లేదని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. మంగళవారం అయ్యప్ప నగర్‌లోని అయ్యప్ప మాలధారుల అన్నదాన కేంద్రంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుటుంబ సభ్యుల పేరుతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరికి ఏ దానం చేసినా ఇంకా మరేదో కావాలనిపించవచ్చు.. కానీ అన్నదానం స్వయంపూర్తి కలిగించే మహాదానమని అన్నారు. ఆకలితో ఉన్న మనిషికి అందించే అత్యుత్తమ సేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్, శాయన బుజ్జి, యుగంధర్, గల్లా రవి, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Smt. VELAGAPUDI DURGAMBA
SIDDHARTHA LAW COLLEGE
Kanuru, VIJAYAWADA-7 Ph:0866-2582592
(Affiliated to Krishna University) Approved by Bar Council of India)
Sponsored by: Siddhartha Academ of General & Technical Education, Vijayawada -10
SPOT ADMISSIONS FOR
3&5- YEAR (UG) & 2-YEAR LL.M(PG)
LAW COURSES FROM 03-12-2025 TO 06-12-2025
Vacant seats in 3-year LL.B & 5-Year B.A.LL.B and 2-Year LL.M Courses in the college arose due to non-reporting of candidates allotted by Convenor, LAWCET-2025 will be filled by the College from **03-12-2025 to 06-12-2025** in the college through "Spot Admissions" in accordance with the guidelines issued by the Convenor, LAWCET-2025. Candidates seeking admission are informed to be present with all their original certificates including LAWCET-2025 rank card, Hall ticket and the prescribed Tuition fee on that day.
Note: The admissions made in the institution are provisional only and subject to ratification by the Convenor, LAWCET-2025. As per the guidelines, the students admitted through "spot admissions" are not eligible for tuition fee reimbursement.
Vijayawada,
Dt. 02-12-2025
Sd/- PRINCIPAL

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పాఠశాల భవనం పరిశీలన

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తచంద్రగూడెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరగా, మంగళవారం పంచాయతీరాజ్ ఎస్ఈ బాపిరెడ్డి స్థానిక అధికారులు, ఏఎంసీ ఛైర్మన్ పి.నవ్యశ్రీతో కలిసి పరిశీలించారు. ఇబ్బందిగా ఉన్నందున కూల్చేందుకు అంచనాలు రూపొందించాలని స్థానిక అధికారులకు సూచించారు.

కంప్యూటర్ బహూకరణ

జి.కొండూరు: కుంటముక్కల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఇంటూరి రామారావు ఆయన తండ్రి రంగయ్య జ్ఞాపకార్థం పాఠశాలకు కంప్యూటర్ అందజేశారు. హెచ్ఎం షేక్ నాగుల్‌మీరాషరీఫ్‌కు కంప్యూటర్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు రహదారి పూర్తి

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం-కవులూరు ఆర్అండ్‌బీ రహదారి పనులు అసంపూర్తిగా నిలిచి రాకపోకలకు అవస్థలు పడుతన్నామని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ సమస్యపై గత నెల 20న 'అసంపూర్తి రహదారి.. నరకంగా మారి..' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారి పనులు చేపట్టి పూర్తి చేశారు. రాకపోకలకు అవస్థలు తొలగడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు వందనం

ప్రతిభ చాటి..బహుమతులు గెలిచి..

మైలవరం: విజేతలతో ప్రధానోపాధ్యాయుడు సతీష్, ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే: మారుతున్న కాలంలో సెల్‌ఫోన్ వాడకం పెరిగినందున, వాటిని మంచి విషయాలు తెలుసుకోవడానికే వాడాలని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాటితో కలుగుతున్న అనర్థాలపై వివరించిన విద్యార్థులు బహుమతులు సాధించారు. ఎస్కే. నాగుల్ షరీఫ్, ఎం.లక్ష్మీనారాయణ, ఎస్.అభిరామ్‌లు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, బి.జ్ఞానప్రకాశరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు, ఎం.గోపాలరత్నయ్యలు బహుమతులు అందజేసి అభినందించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన వెలికితీయడానికి ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని సెయింట్ థెరిస్సా హైస్కూల్ హెచ్ఎం సిస్టర్ సరిత అన్నారు. మంగళవారం స్కూల్‌లో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై జరిగిన పోటీల్లో బి.భవాని, వి.రోహిత్, బి.జీవిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు హెచ్ఎం సిస్టర్ సరిత బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు మాచిన సావిత్రి, ఎ.ముస్సీ, విజయరాణి, జి.విజయకుమారి పాల్గొన్నారు.

విస్సన్నపేట: విజేతలతో సెయింట్ థెరిస్సా హైస్కూల్ హెచ్ఎం సరిత, ఉపాధ్యాయినులు

మెగా పీటీఎంకు చురుగ్గా ఏర్పాట్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే:

తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో విడత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశం శుక్రవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సమావేశానికి ఆహ్వానించేందుకు ప్రభుత్వం నుంచి తాజాగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు మెగా పీటీఎం విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 డిసెంబర్ 7న మొదటి విడత, 2025 జులై 10న రెండో విడత పీటీఎం నిర్వహించారు. మూడో విడత సమావేశం నిర్వహణకు సన్నద్ధమయ్యారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ప్రభుత్వ

గంపలగూడెం మండలం తునికిపాడు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాలలు 239 ఉన్నాయి. ఆ పాఠశాలల్లో 14,098 మంది విద్యార్థులు చదువుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని 9,665 మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో చదివిస్తున్నారు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహిస్తారు. 9 గంటలకు తల్లిదండ్రులు, దాతలు, పూర్వవిద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా స్వాగతం పలుకుతారు. తదుపరి విద్యార్థులతోపాటు ఆహ్వానితులు, ఉపాధ్యాయులు తరగతి గదిలో కూర్చోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ముఖాముఖి చర్చల్లో పాల్గొంటారు. విద్యార్థుల ప్రగతిపై హోలిస్టిక్ పత్రాలు అందజేస్తారు. బాలికల విద్య, మంచి-చెడు స్పర్శ తదితర అంశాలపై వీడియో ప్రదర్శన ఉంటుంది. క్రీడా సామగ్రి, గ్రంథాలయ పుస్తకాలు, ఎఫ్ఎల్ఎన్ అభ్యసన కిట్టు కూడా సందర్శిస్తారు. 'మా తెలుగు తల్లి'కి ప్రార్థనా గీతం ఆలపించాల్సి ఉంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఆహ్వానితులు అందరూ పాల్గొని భోజనం చేయాల్సి ఉంది. మెనూ ప్రకారం పిల్లలకు వడ్డించే భోజనాలు రుచి, శుచిని నిశితంగా పరిశీలిస్తారు. విద్యార్థులకు ప్రశ్నావళి, జవాబులు రాబట్టడం కూడా కార్యక్రమంలో భాగమే. అందరూ బడి భోజనం చేశాక కార్యక్రమం ముగిస్తారు.

తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాలు ఇలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	తల్లిదండ్రులు
తిరువూరు	63	4,160	2,471
గంపలగూడెం	65	3,691	2,546
ఎ.కొండూరు	51	2,947	1,785
విస్సన్నపేట	60	3,300	2,863

పురపాలక కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

ఎన్నికైన కో-ఆప్షన్ సభ్యులతో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలక సంఘం కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తెదేపా నుంచి మాబూ సుభానీ, జనసేన పార్టీ నుంచి యర్రంశెట్టి సాంబశివరావు, భాజపాకు చెందిన షేక్ నగీనా ఎన్నికయ్యారు. వీరితో ఇన్‌ఛార్జ్ కమిషనర్ వెంకటరత్నం ప్రమాణస్వీకారం చేయించారు. కూటమి ఒప్పందంలో భాగంగా ఈ సర్దుబాటు జరిగింది. ఉదయం పది గంటలకు జరగాల్సిన ఎన్నిక మెజారిటీ కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో జాప్యం జరిగింది. ఈ సమయంలో ఛైర్మన్ చిట్టిబాబు ఒక్కొక్క కౌన్సిలర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా సంఖ్య 16కు చేరకపోవడంతో పరిస్థితి సందిగ్ధంలో పడింది. ఈ సమయంలో వైకాపాకు చెందిన కౌన్సిలర్ పుర కార్యాలయానికి చేరుకొన్నారు. దీంతో కోరం ఏర్పడింది. ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ బయలుదేరి పురపాలక కార్యాలయానికి వచ్చారు. అనంతరం ఎన్నిక నిర్వహించారు. అయితే కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక అస్తవ్యస్తంగా జరిగిందని, పుర ఎన్నికలు జరిగిన సందర్భంలో కేవలం తెదేపాకు చెందిన వారే పోటీలో ఉన్నారని ఆపార్టీ కౌన్సిలర్లలో అసంతృప్తి కనిపించింది. దీనికితోడు కొండపల్లి తెదేపా అధ్యక్ష పదవి నిర్ణయం కూడా ఏకపక్షంగా సాగడంతో ఆ పార్టీ కౌన్సిలర్లు, మరికొందరు నాయకులు.. ముఖ్యంగా ఇబ్రహీంపట్నంకు చెందిన ఓ కౌన్సిలర్ వర్గం ఎన్నికకు దూరంగా ఉంది. ఏది ఏమైనప్పటికీ పురపాలిక అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని కూటమి పార్టీల నాయకులకు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ స్పష్టం సూచించారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్ట దాసాంజేయస్వామి ఆలయంలో మంగళవారం పవన ముడి గిరి ప్రదక్షిణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి 45 రోజులు హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులకు పూజాసామగ్రితో పవన ముడి పూజ నిర్వహించారు. సాయంత్రం భక్తులు పవనముడిని తలపై పెట్టుకుని పదునాలుగు సార్లు గిరిప్రదక్షిణకు బయలుదేరారు. ఆలయం నుంచి స్వామివారి రథంతో భీమరాజు గుట్ట వెనుక ప్రసాదనగర్, సీ కాలనీ సొరంగం ద్వారా ఏ కాలనీ మీదుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. దీక్షాధారులకు ఆలయ కమిటీతోపాటు భక్తులు భిక్షప్రసాదాన్ని అందించారు. బుధవారం ఆలయంలో హనుమత్ వ్రతం, హోమం, పూర్ణాహుతితో దీక్ష విరమణ జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌స్వామి తెలిపారు.

సాయిబాబాకు అన్నాభిషేకం

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో షిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజులుగా జరుగుతున్న గీతా జయంతి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజున సాయిబాబా విగ్రహానికి భక్తులు అన్నాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణశర్మ అధ్వర్యంలో సాయిబాబా, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. భక్త బృందం హనుమాన్ చాలీసా పారాయణం పఠించింది.

మండల స్థాయి జట్ల ఎంపిక

త్రోబాల్ జట్టుకు ఎంపికైన ఉపాధ్యాయినులతో పీడీలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఉపాధ్యాయులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటలపోటీలు మంగళవారం ముగిశాయని ఎంఈవో కేశవరావు తెలిపారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపిక చేశామన్నారు. ఈనెల 14న జరిగే డివిజన్ స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో మండల జట్లు పాల్గొంటాయని ఆయన తెలిపారు.

భక్త బృందానికి బహుమతులు అందజేత

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరు వేంకటాచల స్వామి దేవస్థానంలో గీతా జయంతి సందర్భంగా భవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేసిన భక్త బృందానికి నిర్వాహకులు సన్మానం చేసి బహుమతులు అందజేశారు. సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వి.రాజు, డా.రామకోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కె.సుబ్బారావు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జనవరి 3న నియోజకవర్గ బాలోత్సవం

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మాధురి, బాలోత్సవ కమిటీ సభ్యులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గ స్థాయిలో జనవరి 3న వాహిని కళాశాలలో జరగబోయే బాలోత్సవం(పిల్లల పండగ)కార్యక్రమ గోడపత్రికను ఆర్డీవో కె.మాధురి తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకత వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు మంచి వేదికలవుతాయని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ 24 విద్య, 8 సాంస్కృతిక అంశాల్లో పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు కె.పాపారావు, నాగమల్లేశ్వరావు, పి.రామకృష్ణ, కేవీఆర్ ఆంజనేయులు, ఎస్‌డీ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం ఆకస్మిక తనిఖీ

జి.కొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని డీఎస్ డబ్ల్యూవో ఎం.రమాదేవి సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చదవాలని కోరారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎం చంద్రమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయాలు.. వృథాగా భవనాలు

మైలవరం, న్యూస్‌టుడే

తాళాలు తీయని రైతు సేవా కేంద్రం

వైకాపా హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో మండలంలోని కొత్త చంద్రగూడెంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఆ పంచాయతీలో రెండేసి చొప్పున గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మించాల్సి ఉంది. కానీ ఒక్కొటి చొప్పున నిర్మాణానికి ప్రతిపాదించారు. స్థలాభావం పేరిట ప్రధాన రహదారి పక్కనున్న ప్రాథమిక పాఠశాలలో గ్రామ సచివాలయం, గ్రామం లోపలున్న జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రైతు సేవా కేంద్రం, విలేజ్ క్లినిక్ నిర్మాణానికి ప్రతిపాదించారు. అసలే స్థల సమస్యతో ఇబ్బంది పడుతుంటే, ఉన్న కొద్ది జాగాలో భవనాలు నిర్మిస్తే విద్యార్థులు ఇబ్బంది పడతారని కొందరు ముందుగానే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినా వాటిని పట్టించుకోకుండా భవనాలు నిర్మించారు.

గ్రామ సచివాలయంలో పాఠశాల

ఆయా నిర్మాణాల తర్వాత విద్యాసంస్థల ప్రాంగణాల్లో భవనాల నిర్మాణం వద్దని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో భవనాలు వృథాగా మారాయి. అనేక వినతుల అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని రెండేళ్ల కిందట బడికే అప్పగించగా ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. హైస్కూల్ ప్రాంగణంలో నిర్మించిన భవనాలపై ఎవరికీ అంతుచిక్కక అలాగే వదిలేశారు. రెండు భవనాలూ తాళాలకే పరిమితమవుతుంటే, రూ.లక్షల సొమ్ము వృథా చేశారంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కాపాడుకునేందుకు అన్నదాతల అవస్థలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:

దిత్వా తుపాను అన్నదాతను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మారిన వాతావరణం రైతులను పరుగు పెట్టించింది. ధాన్యం రాశులు తడిచి పోకుండా కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఆది, సోమవారాల్లో పడిన జల్లులు భయపెడుతుండగా.. వర్షం పడితే నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. రెడ్డిగూడెం మండలంలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాలతో కోసిన ధాన్యం రహదారుల వెంట, ఖాళీస్థలాల్లో పోసి ఆరబెడుతున్నారు. మండలంలో 9,550 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటివరకు 3,950 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. బీపీటీ 1224, 1061 రకాలు మందుగా కోతకు వచ్చాయని, కొన్ని రకాలు ఇంకా కోతకు రాలేదని వెల్లడించారు.

మిట్టగూడెం వద్ద ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు

ప్రకృతి సాగును ప్రోత్సహించండి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని రెడ్డిగూడెం ఏవో డి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రణాళిక తయారీ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానం పాటించేలా చూడాలన్నారు. వ్యవసాయంతోపాటు పశుపోషణ, ఉద్యాన పంటల సాగుకు రైతులను ప్రోత్సహించి ఆదాయం పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని వివరించారు.

అడ్డదారిన వస్తూ..ప్రమాదాలు తెస్తూ..

ఇబ్రహీంపట్నం రైతుబజారు ఎదుట డివైడర్‌పై రెయిలింగ్ తొలగించి ఏర్పాటు చేసి దారి

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఇబ్రహీంపట్నం-చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిలో ఇబ్రహీంపట్నం కొండపల్లి గ్రామాల పరిధిలో డివైడర్లపై ఏర్పాటు చేసిన ఐరన్ రెయిలింగ్‌ను తొలగించి ఏర్పాటు చేసుకున్న అనధికార దారులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కడబడితే అక్కడ పాదచారులు జాతీయ రహదారి దాటుతూ వేగంగా వస్తున్న వాహనాల కారణంగా ప్రమాదాలకు గురి కాకుండా డివైడర్లపై ఎన్‌హెచ్ సంస్థ రెయిలింగ్ ఏర్పాటు చేసింది. ఈ మార్గంలో రాకపోకలు చేసే వేలాది వాహనాలతోపాటు పాదచారులు రహదారిని దాటేందుకు ప్రతి అర కిలోమీటరుకు ఒక యూటర్న్ ఏర్పాటు చేశారు. అయితే ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాల మధ్య రహదారికి ఇరువైపుల ఉన్న దుకాణాల వద్దకు వెళ్లడానికి గ్రామస్థులు దగ్గర మార్గంగా డివైడర్‌పై ఉన్న రెయిలింగ్ తొలగించి అనధికార దారులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో జాతీయరహదారి దాటుతూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెలలో కొండపల్లి శ్రామికనగర్, ఇబ్రహీంపట్నం రైతుబజారు వద్ద రెయిలింగ్ తొలగించిన ప్రదేశంలో ఇద్దరు వ్యక్తులను వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

✦ తిరువూరు 4వ వార్డులోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు రాజేశ్వరరావు సమస్యను మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

✦ తిరువూరు 9వ వార్డులో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు బాబూరావు సమస్యను మున్సిపల్ శానిటరీ అధికారికి వివరించారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి దోమల మందు చల్లించారు.

✦ తిరువూరు 6వ వార్డులో డ్రెయినేజీలో పిచ్చిమొక్కలు పెరిగి మురుగు పారుదలకు అటంకంగా ఉందని స్థానికుడు నాగేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ మున్సిపల్ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కుటుంబానికొక పారిశ్రామికవేత్త అనే ప్రభుత్వ నినాదం ఆచరణ దాల్చేలా చూడాల్సిన బాధ్యత పొదుపు సంఘ మహిళలదేనని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో రూపొందించిన అవని వార్షిక పత్రికను కొండపల్లి పురపాలికలో మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను వ్యాపార సామ్రాజ్య నిర్ణేతలుగా చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. అందులో భాగంగానే అనేక పథకాలను ఆచరణలో పెట్టారన్నారు. పొదుపు సంఘ మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మేనేజర్ శ్రీధర్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలువలు లేక.. మురుగు పారక..

చెవుటూరులో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

జి.కొండూరు, న్యూస్‌టుడే: చెవుటూరు ఎస్సీ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై మురుగు నిలిచి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రహదారి పక్కనే ఉన్న కుళాయి నుంచి నీరు వృథాగా పోతూ ఇరువైపులా కాలువలు లేకపోవడంతో రహదారి పైకి చేరుతోంది. ఈ దారిలో ద్విచక్ర వాహన చోదకులు వేగంగా వెళ్తున్న సమయంలో మురుగు చింది పాదచారులపై పడుతోంది సంబంధిత అధికారులు స్పందించి కాలువల ఏర్పాటుకు చర్యలు చేపట్టి.. అవస్థలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆశ వర్కర్లు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నం కేంద్రంగా జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని తెల్లదేవరపల్లిలో సీఐటీయూ శ్రేణులు గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, కో కన్వీనర్ చిలకమ్మ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్తులో ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో మహాసభల్లో నిర్ణయం తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జయశ్రీ, ప్రమీల, సుహాసిని, స్వరూప, నాగమణి, శాంతి, చిన్నమ్మ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ప్రదర్శన

మొర్సుమిల్లి(మైలవరం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సూచించారు. ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం గ్రామంలో, పాఠశాలలో స్వచ్ఛభారత్, ఓటు నమోదుపై అవగాహన ప్రదర్శన, ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులకు సూచనలు చేశారు. చెత్తను రహదారులపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

కోట వెంకటి (పాతచిత్రం)

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం పడమర ఎస్సీవాడకు చెందిన కోట వెంకటి(42) చెట్టుపై నుంచి కింద పడి ప్రాణాలు కోల్పోయినట్లు గంపలగూడెం హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీధర్ తెలిపారు. సోమవారం సాయంత్రం వెంకటి ఎస్సీవాడ సమీపంలోని తోటలో ఉసిరికాయలు కోసేందుకు చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తిరువూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా..అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంకటి మృతదేహానికి మంగళవారం తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించినట్లు శ్రీధర్ తెలిపారు.

నకిలీ లింకులు క్లిక్ చేయొద్దు

తిరువూరు టౌన్: తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, డ్రగ్స్ నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యసనం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందన్నారు. సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో సంబంధాలు పెట్టుకోవడం, నకిలీ లింకులు క్లిక్ చేయడం వంటివి ఎంతటి ఉపద్రవానికి దారితీస్తాయో వివరించారు. తప్పుడు ఓటీపీ మోసాలపై వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో పోక్సో చట్టం తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రధాన అధ్యాపకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కీర్తిరాయునిగూడెంలో మంగళవారం చంద్రాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షురాలు రాయల సత్యబాలాకుమారి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.రాము ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడుతోందని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్లోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా బయలాజికల్ సైన్స్ ఫోరం తరఫున విజయవాడ హ్యాపీలైఫ్ ఫౌండేషన్ ముద్రించిన పదో తరగతి బయలాజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను 75 ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సైన్స్ ఫోరం సభ్యులు యు.సత్యనారాయణ, మెర్లో, ఎన్ఆర్‌పీఎస్ రెడ్డి, ముక్కా సత్యనారాయణ, తాజ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ పొదిలి విజయలక్ష్మి, కో-ఆర్డినేటర్ ఆర్.రాంబాబునాయక్ పాల్గొన్నారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య నగరపాలక సంస్థ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీ, ఫార్మాటింగ్, ప్రాథమిక సూత్రాలతో సహా మైక్రోసాఫ్ట్ ఎక్సెల్‌లో ప్రాథమిక పరిజ్ఞానం గురించి తెలియజేసినట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ ఉప విభాగాధిపతి కోనేరు సుధీర్, వైజేఎన్ లక్ష్మీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు పూర్తి శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నగరంలోని రామకృష్ణాపురం, అజిత్‌సింగ్‌నగర్, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు ఆటంకాలు ఉన్నా, ఇబ్బందులు ఏర్పడుతున్నా వెంటనే తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. అంతర్గత, ప్రధాన రహదారులు, డివైడర్ల వెంట చెత్త చెదారం లేకుండా చూడాలని, సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్లో వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సేకరించిన వ్యర్థాలను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు ఆలోచనలు చేయాలని, అందుకు అనువైన చర్యలు చేపట్టాలని అన్నారు. అధికారులు కె.ప్రభుదాస్, బాబూ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

★ కబేళా నుంచి జక్కంపూడి కాలనీకి వెళ్లే సీవీఆర్ ఫ్లైఓవర్‌పై గుంతలు ఏర్పడ్డాయని ప్రజలు పలుమార్లు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు వంతెనపై గుంతలు ఏర్పడ్డ చోట మరమ్మతులు చేశారు.

★ చిట్టినగర్ అమ్మవారి ఆలయం వెనుక వీధిలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు పలు వీధి కుక్కలను పట్టారు. ★ కేఎల్‌రావు నగర్ సౌమ్య థియేటర్ ప్రాంతాల్లో కార్పొరేషన్ సరఫరా చేసే మంచినీరు రంగుమారి వస్తున్నాయని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన మంచినీటి విభాగం అధికారులు ఆ ప్రాంతంలో మంచినీటి పరీక్షలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

? గొల్లపాలెం గట్టు ఆర్‌సీఎం పాఠశాల సమీపంలో రోడ్లపై ఆవులు వేస్తున్న పేడ ప్రతి రోజు తరలించేలా చర్యలు తీసుకోగలరు. - **కృష్ణవేణి, స్థానికురాలు** ✔ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - **కృష్ణ, స్థానిక శానిటరీ అధికారి**

? వించిపేట సీఎస్ఐ చర్చి వద్ద రోడ్డుపై చెత్త కుండీలోని చెత్తను మూడు రోజులుగా తరలించడం లేదు.
- **రామబ్రహ్మం, స్థానికుడు** ✔ పరిశీలించి చెత్త తరలిస్తాం.
- **దుర్గారావు, స్థానిక శానిటరీ అధికారి**

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

ఆకతాయిల సమాచారం ఇవ్వండి

పటమట, న్యూస్‌టుడే : ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టామని పటమట సీఐ వల్లభనేని పవన్ కిషోర్ అన్నారు. మంగళవారం రామలింగేశ్వరనగర్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పట్టణ సీఐ, ఎస్సైలు శ్రీకృష్ణవర్మ, హరికృష్ణ, సీతారామ్, భారతి, సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు జరిగే సమయాల్లో పోలీసులకు సమాచారమిస్తే.. నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విధికి ఎదురీత.. మారింది తలరాత..!

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

విధి చిన్నచూపు చూసిందని కుమిలిపోలేదు. పోటీ ప్రపంచంలో వెనకపడతామని బాధపడలేదు. తమకు తాము ధైర్యం చెప్పుకొన్నారు. అడుగు ముందుకు వేశారు.. శ్రమించారు. ఎంచుకున్న మార్గంలో దూసుకెళుతున్నారు.. నగరానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు. నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

విభిన్న ప్రతిభావంతుల సత్తా

దేశబోయిన మానస

నూతంగి పర్ణిక

❖ తండ్రి ప్రోత్సాహంతో...

వన్‌టౌన్‌కు చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు, నాగజ్యోతి దంపతుల కుమార్తె మానస డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. పుట్టుకతోనే బధిరురాలు (మూగ, చెవిటి). తండ్రి ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ల వయసులో ఈత సాధన ప్రారంభించింది. వీఎంసీ కోచ్ రఫీ వద్ద శిక్షణ పొందుతోంది. 2014 విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14 కేటగిరీలో తలపడి 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం కైవసం చేసుకుంది. ఇప్పటి వరకు సాధారణ కేటగిరీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో 25 పతకాలు తన ఖాతాలో జమ చేసుకుంది. 2019 చెన్నైలో జరిగిన జాతీయ బధిరుల ఈత పోటీల్లో సీనియర్ కేటగిరీలో ఒక పసిడి, నాలుగు రజత పతకాలు కైవసం చేసుకుంది. 2023 మధ్యప్రదేశ్‌లో జాతీయ పోటీల్లో ఒక రజత, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కేరళలోని తిరువనంతపురంలో సీనియర్ కేటగిరీలో 50మీ., 100మీ., 200మీ.ల బ్రెస్ట్ స్ట్రోక్, 50మీ.ల బ్యాక్ స్ట్రోక్, 100మీ.ల ఫ్రీ స్టైల్‌లో రజత పతకాలు కైవసం చేసుకుంది. 2023లో చెన్నైలో జరిగిన ఆలిండియా ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో కృష్ణా వర్సిటీకి ప్రాతినిధ్యం వహించింది. డెఫ్ లింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని చెబుతోంది మానస.

❖ చేతిలో కదలిక లేకపోయినా..

సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీకి చెందిన నూతంగి చాణక్య, మాధవి దంపతుల కుమార్తె పర్ణిక(11) ఏడో తరగతి చదువుతోంది. పుట్టుక నుంచి కుడి చేయి పూర్తిస్థాయిలో కదలిక లేదు. తల్లిదండ్రులు గమనించి ఫిజియోథెరపీ చేయించారు. గత ఏడాది మేలో ఈత శిక్షణ ఇప్పించేందుకు గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో చేర్పించారు. మెరుగ్గా రాణించడం ద్వారా కోచ్ లక్ష్మణరావు సూచనల మేరకు సాధన కొనసాగించారు. ఈ ఏడాది అక్టోబరు 12వ తేదీన ఏలూరులో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో సబ్ జూనియర్ (అండర్-12)ఎస్-8 కేటగిరీలో తలపడింది. 50మీ., 100మీ. ఫ్రీ స్టైల్, 50మీ.ల బ్యాక్ స్ట్రోక్‌లో మూడు పసిడి పతకాలు కైవసం చేసుకుంది. వచ్చే ఏడాది జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తోంది.

ఆటోలో మరచిపోయిన 18 తులాల బంగారు నగలు అప్పగింత

ప్రయాణికురాలికి సంచి అందజేస్తున్న పోలీసులు

హైదరాబాద్‌:ప్రయాణికురాలు ఆటోలో మరచిపోయిన బంగారు నగల సంచిని పోలీసులు స్వాధీనం చేసుకొని మహిళకు అప్పగించారు. అల్వాల్ డీఐ తిమ్మప్ప కథనం ప్రకారం.. విజయవాడ పట్టణానికి చెందిన షేక్ సన శనివారం తుర్కపల్లిలోని బంధువుల గృహ ప్రవేశానికి హాజరైంది. అనంతరం రాత్రి సమయంలో తిరుగు ప్రయాణానికి రైల్వేస్టేషన్‌కు వెళ్లగా రైలు వెళ్లిపోయింది. దీంతో ఆమె తిరిగి ఆటోలో బంధువుల నివాసానికి వచ్చింది. ఆదివారం ఉదయం ఆమె వెంట తెచ్చుకున్న సంచులను పరిశీలించగా 18 తులాల బంగారు నగలు ఉన్న సంచి కనిపించలేదు. ఆటోలో మరచిపోయినట్లు గ్రహించి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరా ఆధారంగా పోలీసులు ఆటోను మూడు గంటల్లో గుర్తించారు. ఆటో డ్రైవర్ రాజేశ్‌ను స్టేషన్‌కు రప్పించడంతో నగల సంచిని పోలీసులకు అప్పగించాడు. దాన్ని మంగళవారం బాధిత మహిళకు అందజేశారు. నగల విషయంలో డ్రైవర్ రాజేశ్ బాధ్యతగా వ్యవహరించారని పోలీసులు అభినందించారు.

రోడ్డు ఆక్రమిస్తే కఠిన చర్యలు

దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, పక్కన సీఐ ఉమామహేశ్వరరావు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తే కఠిన చర్యలు ఉంటాయని వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు హెచ్చరించారు. పాతబస్తీ శివాలయం వీధిలో వన్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. శివాలయం సెంటర్, బ్రాహ్మణ వీధి, కాళేశ్వరరావు మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసే వారికి ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణదారుల వల్ల పాతబస్తీలో పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారని, వాహనదారుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ అంచనాలపై సమీక్ష

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థకు సంబంధించి 2026- 2027 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలను పూర్తిస్థాయిలో తయారు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలపై విభాగాల అధికారులతో సమీక్షించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ అంచనాలు రూపకల్పన చేయాలని అన్నారు. రెవెన్యూ ఆదాయం, వ్యయాలు, పెట్టుబడుల ఆదాయం, వ్యయాల అంచనాలను వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని సూచించారు. నగర స్వచ్ఛత, ప్రజారోగ్యం వంటి అంశాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బడ్జెట్ అంచనాలపై శాఖాధిపతులు మరోసారి తమ సిబ్బందితో సమావేశమై చర్చించి, తగిన అంచనాలను వచ్చే వారం మరోసారి నిర్వహించే బడ్జెట్ సమీక్ష సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పర్వీన్ జహాన్, అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, అర్జునరావు, సత్యకుమారి, బి.సృజన, ఎ.శ్రీధర్, ఎ.శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, లత, మాల్యాద్రి, పి.వెంకట నారాయణ, బి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఫిట్‌నెస్ ఛార్జీలు పాత పద్ధతిలో కొనసాగించాలి

ఆటోనగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం గూడ్స్ రవాణా వాహనాలపై అమలు చేస్తున్న ఫిట్‌నెస్ ఛార్జీలను పాత పద్ధతిలో కొనసాగించాలని న్యూ ఆంధ్ర మోటర్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆటోనగర్ 5వ లైన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రవాణా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని చెప్పారు. ఫిట్‌నెస్ పెంపుతో నిత్యావసర సరకుల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. రవాణా ఛార్జీలు పెరిగితే రైతులకు వ్యవసాయ వ్యయాలు మరింత అధికమవుతాయన్నారు. గతంలో ఫిట్‌నెస్ ఛార్జీలు రూ. 900 నుంచి రూ.1400 వరకు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం అవి మూడు రెట్లు అధికంగా పెరగడంతో లారీ యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. కౌంటర్ సిగ్నేచర్ ఫైల్‌ను తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లలో ఆమోదించి పంపిందని.. కానీ ఆ ఫైల్ ఎనిమిదేళ్లుగా ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లు ప్రదర్శించారు. సమావేశంలో కోశాధికారి డీవీ నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా బాధ్యుడు గరికపాటి భాస్కరరావు, సభ్యులు ఏడుకొండలు, మధుబాబు, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌రావు, నవీన్‌కుమార్, కృష్ణారావు, సామేలు రాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

4 నుంచి వర్సిటీ పురుషుల వాలీబాల్ టోర్నీ

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే : స్థానిక శాతవాహన కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 4, 5 తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్య నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఎ.బ్రహ్మయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల కళాశాల జట్టు మూడు సెట్ల అర్హత పత్రాలతో పాటు క్రీడాకారుల గుర్తింపు కార్డులతో 4న ఉదయం 9 గంటల్లోపు కళాశాల ప్రాంగణంలో పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి బీసీహెచ్ సంగతరావుకు రిపోర్టు చేయాలన్నారు. జట్టు లేకుండా వ్యక్తిగతంగా వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అర్హత పత్రాలతో 5న ఉదయం 9 గంటలకు కళాశాల మైదానంలో హాజరవ్వాలని, వివరాలకు ఫోన్ 94929 39377 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలి

గాంధీనగర్, న్యూస్‌టుడే : గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు యాక్షన్ ప్లాన్‌ను అనుసరించి.. సెలవు దినాల్లోనూ పనిచేసిన ఉపాధ్యాయులకు కాంపెన్సేటరీ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది కూడా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నందున సెలవులు మంజూరు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉపయోగకరంగా చేసిన సందర్భంగా డీటీఎఫ్ నాయకులు అభినందించారు.

తవ్వారు.. వదిలేశారు

భీమనవారిపేట, విశ్వబ్రాహ్మణ వీధి అడ్డరోడ్డులో పైపులైన్ మరమ్మతు కోసం రెండు చోట్ల తవ్వారు. గోతులతో పాటుగా మట్టి కుప్పలు అక్కడే వదిలేశారు. మట్టి కుప్పలు రోజుల తరబడి ఉండడంతో అధ్వానంగా తయారైంది. దీనికి తోడు ఆ మట్టి జారి మురుగు కాలువలో పడుతుంది. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదని.. తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. అదే ప్రాంతంలో చేతిపంపు మరమ్మతులకు గురైందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంపు మరమ్మతులతో పాటు గోతులు పూడ్చి, మట్టి కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

వీధి దీపాలు వెలగక ఇబ్బంది

భవానీపురం హౌసింగ్‌బోర్డు ప్రాంతంలో అంధకారం నెలకొంటుంది. కాలనీలోని వీధుల్లో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే నివాసాలకు వెళ్లాలంటే మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. రాకపోకల సమయంలో పాదచారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భవానీపురం

అధ్వానంగా రహదారి

భవానీపురం ఐరన్‌యార్డులోని రహదారులు అధ్వానంగా మారాయి. రహదారులపై గోతులు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని.. ప్రయాణ సమయాల్లో అవస్థలు పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది ఐరన్ యార్డులోని రహదారులపై వెళ్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భవానీపురం

చదువుతూ... ప్రకృతి సాగు చేస్తూ..

★ కళాశాల మిద్దెపై కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్న విద్యార్థినులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

తరగతి గదిలో పాఠాలు వినడమే కాదు.. కళాశాల మిద్దెనే వ్యవసాయ క్షేత్రంగా మార్చేశారు ఆ విద్యార్థినులు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగించే బయో ఎరువులు తయారు చేస్తున్నారు. విద్యార్థి దశలోనే ఇలా చేయడం వల్ల వారు భవిష్యత్తులో ప్రకృతి సాగుపై ఆసక్తి చూపే అవకాశం ఉంది.

ప్రదర్శనలో గోంగూర, వంగ, బెండకాయలు

మొక్కల పక్కన కలుపు తొలగిస్తున్న విద్యార్థినులు

★ సిద్ధార్థ మహిళా కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఇందుకు భవనంపై ఉన్న ఖాళీనే ఎంచుకున్నారు. ఆకుకూరలు, బెండ, వంగ, సొర, కాకర, చిక్కుళ్లు, పచ్చిమిర్చి సాగు చేస్తూ భళా అనిపిస్తున్నారు. పంట ఉత్పత్తులతో సోమవారం కళాశాలలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిని అధ్యాపకులు, తోటి విద్యార్థులు కొన్నారు. గోమూత్రం, పేడ, శనగపిండి, బెల్లం, మట్టిని కలిపి ద్రవ, ఘన జీవామృతాలు తయారు చేస్తున్నారు. వీటిని పావు లీటరు రూ.20,. పిడక రూ.10తో విక్రయిస్తున్నారు. ఈ ఆదాయంతో విత్తనాలు కొనేందుకు ఉపయోగిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్ తెలిపారు. రెండేళ్ల నుంచి ఇలా సాగు చేస్తున్నారు.

అవగాహన కలిగింది

నాకు ఇష్టమైన మెంతికూర, గోంగూర సాగు చేస్తున్నా. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పోయడం, కలుపు రాకుండా బాగు చేయడం చేస్తున్నా. సేంద్రియ, ప్రకృతి విధానంలో సాగు చేయడం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు ఉత్పత్తులు కొంటున్నారు. ఈ పనుల వల్ల వ్యవసాయంపై అవగాహన కలిగింది. **-సీహెచ్ అక్షయ, బీఎస్సీ (బోటనీ) ప్రథమ సంవత్సరం**

రైతులకు తెలియజేస్తున్నాం

మేం కళాశాలలో చేస్తున్న సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం గురించి కొంతమందికి రైతులకు వివరించాను. వారు సానుకూలంగా స్పందించారు. వంగ, పచ్చిమిర్చి విత్తనాలు చల్లుతున్నాం. కాయలు కాసే వరకు సస్య రక్షణ చర్యలు తీసుకుంటున్నాం.

- తిలోత్తమ నాయుడు, బీఎస్సీ (బోటనీ), ప్రథమ సంవత్సరం

బహుళ నైపుణ్యాలతో విజయాలు

మాట్లాడుతున్న మురళీకృష్ణ

చిట్టినగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో బహుళ నైపుణ్యాలతో విజయాలు సొంతం చేసుకోవచ్చని వ్యాపారవేత్త వాసిరెడ్డి మురళీకృష్ణ సూచించారు. కేబీఎన్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'మీట్ ద సీఈవో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, వ్యాపార సంస్థ విజయానికి నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. చదువుతో పాటు వ్యాపార నిర్వహణ గురించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయాలని అన్నారు. రాష్ట్రం సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న పరిస్థితులు, టైం మేనేజ్‌మెంట్ తదితర అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో వాస్తవ పరిస్థితులపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పీజీ కోర్సెస్ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి రవికిరణ్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

టీటీ టోర్నీ విజేత కేవీఎస్ఆర్ ఫార్మసీ జట్టు

అతిథి నుంచి విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటగిరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల మహిళా టేబుల్ టెన్నిస్ టోర్నీలో కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నీలో మొత్తం నాలుగు జట్లు తలపడగా.. ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు రన్నరప్ ట్రోఫీని సొంతం చేసుకోగా, ఎస్వీడీ న్యాయ కళాశాల తృతీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ కన్వీనర్ కమిటీ సభ్యుడు ఎల్.కె.మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యు.అరవింద్‌బాబు, టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎల్.వినయ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

4న మాదిగల విజయోత్సవ సభ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను చట్టం చేసి.. సామాజిక న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ నెల 4న గాంధీనగర్‌లోని జింఖానా మైదానంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. మంగళవారం నగరంలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లోని 59 కులాలకు సమాన అవకాశాలు రావాలంటే ఏబీసీడీ గ్రూపుల వర్గీకరణ చేయాలని గత 32 ఏళ్లుగా మాదిగలు పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. వాటి ఫలితంగా వర్గీకరణ సాధించినట్లు వివరించారు. యావత్ మాదిగ జాతి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహించే సభకు 13 జిల్లాల నుంచి శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏసుపాదం, శేఖర్‌బాబు, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లతో ఆర్థిక భరోసా

చిట్టినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు జీవితాలకు భరోసాగా నిలుస్తున్నాయని కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం 49వ డివిజన్ సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూత్రపిండాల వ్యాధితో బాధ పడుతున్న కందుల సౌజన్య పింఛను కోసం దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం వెంటనే స్పందించి మంజూరు చేసిందని వివరించారు. అనంతరం పలువురికి పింఛన్లు పంపిణీ చేశారు.

నగదు అందిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్ తదితరులు

40వ డివిజన్‌లో

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం 40వ డివిజన్‌లో నివాసం ఉంటున్న ఇద్దరికి మంజూరైన స్పౌజ్ పింఛన్లను తెదేపా అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య మంగళవారం అందజేశారు. నాయకులు శివాజీ, వంశీకృష్ణ, నారాయణ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మైక్రో బయాలజీ విభాగానికి ఉత్తమ ప్రదర్శన అవార్డు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచిన సిద్ధార్థ వైద్య కళాశాల మైక్రో బయాలజీ విభాగానికి కలెక్టర్ అవార్డు అందజేశారని కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావు తెలిపారు. మంగళవారం ఆ విభాగం వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

సినిమాలు

★ **ఆంధ్ర కింగ్:** జీ-3(రాజ్-యువరాజ్), శైలజ, మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **రివాల్వర్ రీటా:** జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **ప్రేమంటే, 12ఏ రైల్వేకాలనీ:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **రాజు వెడ్స్ రాంబాయి:** జీ-3(రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). ★ **పాంచ్ మినార్:** మీరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు). ★ **మఫ్టీపోలీస్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), పీవీపీ, పీవీఆర్ మాల్(బందరురోడ్డు). - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

Smt. VELAGAPUDI DURGAMBA
SIDDHARTHA LAW COLLEGE
Kanuru, VIJAYAWADA-7 Ph:0866-2582592
(Affiliated to Krishna University) Approved by Bar Council of India)
Sponsored by: Siddhartha Academ of General & Technical Education, Vijayawada -10
SPOT ADMISSIONS FOR
3&5- YEAR (UG) & 2-YEAR LL.M(PG)
LAW COURSES FROM 03-12-2025 TO 06-12-2025
Vacant seats in 3-year LL.B & 5-Year B.A.LL.B and 2-Year LL.M Courses in the college arose due to non-reporting of candidates allotted by Convenor, LAWCET-2025 will be filled by the College from 03-12-2025 to 06-12-2025 in the college through "Spot Admissions" in accordance with the guidelines issued by the Convenor, LAWCET-2025. Candidates seeking admission are informed to be present with all their original certificates including LAWCET-2025 rank card, Hall ticket and the prescribed Tuition fee on that day.
Note: The admissions made in the institution are provisional only and subject to ratification by the Convenor, LAWCET-2025. As per the guidelines, the students admitted through "spot admissions" are not eligible for tuition fee reimbursement.
Vijayawada,
Dt. 02-12-2025
Sd/- PRINCIPAL

(c) eenadu

విజయవాడ మధ్య

రైతుబజారుల్లో కూరగాయల ధరలు

వంకాయలు-24/35, టమాటా-40, బెండ-42, పచ్చిమిర్చి-40, కాకర-36, బీర-32/38, క్యాలీ ఫ్లవర్-20, క్యాబేజి-24, క్యారెట్-56, దొండ-26, బంగాళదుంప-30, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-46, దోస-28, సొర-20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-26, అల్లం-80, మునగ-20/18, ఆకు కూరలు (కట్ట)-3/7, కంద-40, బీట్ రూట్-44, కీరదోస-32, బీన్స్-65/55, క్యాప్సికమ్-80, చింతకాయలు-60, నిమ్మ (డజను)-24/18, కొత్తిమీర-8/16, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - **ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందనకు వందనం

పాయకాపురం, న్యూస్‌టుడే : అజిత్‌సింగ్‌నగర్ భరతమాత మందిరం రోడ్డులో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై మంగళవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు.. కార్మికులతో చెత్తను సేకరించారు. ❖ వాంబేకాలనీ నుంచి ప్రశాంతినగర్ చెరువు మార్గంలో రోడ్డుపై చెత్త పేరుకుపోయిందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై వచ్చిన వార్తకు పారిశుద్ధ్య అధికారులు స్పందించి.. వ్యర్థాలు తీయించారు.

? తోటవారి వీధి తొమ్మిదో లైనులో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. - **సుధాకర్, స్థానికుడు**

✔ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - **బాబూ శ్రీనివాసన్, సర్కిల్-2, ఏఎంవోహెచ్**

తోట వారి వీధిలో పిచ్చి మొక్కలు

? అజిత్‌సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ గంగానమ్మ ఆలయం వద్ద రోడ్డుపై చెత్త దర్శనమిస్తోంది. - **సత్యనారాయణ, స్థానికుడు**

✔ రోడ్డుపై చెత్తను తరలిస్తాం. - **శ్రీనివాసరావు, శానిటరీ అధికారి** - న్యూస్‌టుడే, పాయకాపురం

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు పూర్తి శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నగరంలోని రాజరాజేశ్వరిపేట, అజిత్‌సింగ్‌నగర్, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో ఆటంకాలు ఉన్నా, ఇబ్బందులు ఏర్పడుతున్నా వెంటనే తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. అంతర్గత, ప్రధాన రహదారులు, డివైడర్ల వెంట చెత్త చెదారం లేకుండా మార్చాలని, సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వ్యర్థాల నిర్వహణ కచ్చితంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సేకరించిన వ్యర్థాలను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు ఆలోచనలు చేయాలని, అందుకు అనువైన చర్యలు చేపట్టాలని అన్నారు. అదనపు కమిషనర్ కె.ప్రభుదాస్, బాబూ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల సమాచారం ఇవ్వండి

పటమట, న్యూస్‌టుడే : ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టామని పటమట సీఐ పవన్ కిశోర్ అన్నారు. మంగళవారం రామలింగేశ్వరనగర్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో సీఐ మాట్లాడారు. అల్లర్లు జరిగే సమయాల్లో పోలీసులకు సమాచారమివ్వాలి. నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విధికి ఎదురీత.. మారింది తలరాత..!

❖ విభిన్న ప్రతిభావంతుల సత్తా

విజయవాడ క్రీడలు, విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే

విధి చిన్నచూపు చూసిందని కుమిలిపోలేదు. పోటీ ప్రపంచంలో వెనకపడతామని బాధపడలేదు. తమకు తాము ధైర్యం చెప్పుకొన్నారు. అడుగు ముందుకు వేశారు. శ్రమించారు. ఎంచుకున్న మార్గంలో దూసుకెళుతున్నారు.. నగరానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు. నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ధైర్యంతో ముందుకు సాగుతూ..

సత్యనారాయణపురానికి చెందిన జి.లక్ష్మీనారాయణకు చిన్నప్పుడే రెండు కాళ్లకు పోలియో సోకింది. తల్లిదండ్రులు కూడా చిన్న తనంలోనే చనిపోయారు. నడవలేని పరిస్థితుల్లో ఉన్నా.. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలు నేర్చుకున్నారు. టైపింగ్ చేయడంలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. డీటీపీ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వైకల్యానికి తోడు రెండేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. చాలా కాలం మంచానికే పరిమితం అయ్యారు. మనోధైర్యంతో కోలుకొని.. తిరిగి తన పనులు తాను చేసుకుంటున్నారు. ప్రతి నెలా రూ.20 వేల వరకు సంపాదిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.6వేల పింఛను వస్తుండడంతో.. ఎవరిపైనా ఆధారపడకుండా జీవిస్తున్నారు.

లక్ష్మీనారాయణ

దివ్యాంగులకే సేవలు అందిస్తూ..

పోలియో బాధితుడు.. దివ్యాంగులకు సేవ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు దేవీనగర్‌కు చెందిన పి.భాస్కరరావు. కర్రసాయంతో నడుస్తుంటారు. శారీరక ఇబ్బందులతో అధైర్యపడకుండా తన పనులు తానే చేసుకుంటున్నారు. ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఖాళీ సమయంలో దివ్యాంగులకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, మూడు చక్రాల సైకిళ్లు తదితర పథకాల గురించి తెలియజేస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందేలా సహకారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా తనకు వచ్చిన జీతంలోనే దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 50 మందికిపైగా దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, కుట్టు మిషన్లు అందేలా కృషి చేశారు.

పి.భాస్కరరావు

❖ తండ్రి ప్రోత్సాహంతో...

వన్‌టౌన్‌కు చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు, నాగజ్యోతి దంపతుల కుమార్తె **మానస** డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. పుట్టుకతోనే బధిరురాలు (మూగ, చెవిటి). తండ్రి ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ల వయసులో ఈత సాధన ప్రారంభించింది. వీఎంసీ కోచ్ రఫీ వద్ద శిక్షణ పొందుతోంది. 2014 విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14 కేటగిరీలో తలపడి 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజత పతకం కైవసం చేసుకుంది. ఇప్పటి వరకు సాధారణ కేటగిరీలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో 25 పతకాలు తన ఖాతాలో జమ చేసుకుంది. 2019 చెన్నైలో జరిగిన జాతీయ బధిరుల ఈత పోటీల్లో సీనియర్ కేటగిరీలో ఒక పసిడి, నాలుగు రజత పతకాలు కైవసం చేసుకుంది. 2023 మధ్యప్రదేశ్‌లో జాతీయ పోటీల్లో ఒక రజత, మూడు కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కేరళలోని తిరువనంతపురంలో సీనియర్ కేటగిరీలో 50మీ., 100మీ., 200మీ.ల బ్రెస్ట్ స్ట్రోక్, 50మీ.ల బ్యాక్ స్ట్రోక్, 100మీ.ల ఫ్రీ స్టైల్‌లో రజత పతకాలు కైవసం చేసుకుంది. 2023లో చెన్నైలో జరిగిన ఆలిండియా ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో కృష్ణా వర్సిటీకి ప్రాతినిధ్యం వహించింది. డెఫ్‌లింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని చెబుతోంది మానస.

చేతిలో కదలిక లేకపోయినా..

సత్యనారాయణపురం శ్రీనగర్ కాలనీకి చెందిన నూతంగి చాణక్య, మాధవి దంపతుల కుమార్తె **పర్ణిక**(11) ఏడో తరగతి చదువుతోంది. పుట్టుక నుంచి కుడి చేయి పూర్తిస్థాయిలో కదలిక లేదు. తల్లిదండ్రులు గమనించి ఫిజియోథెరపీ చేయించారు. శారీరక శ్రమ, వ్యాయామం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో గత ఏడాది మే నెలలో వేసవి ఈత శిక్షణ శిబిరంలో గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో చేర్పించారు. మెరుగ్గా రాణించడం ద్వారా కోచ్ లక్ష్మణరావు సూచనల మేరకు సాధన కొనసాగించారు. ఈ ఏడాది అక్టోబరు 12వ తేదీన ఏలూరులో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో సబ్ జూనియర్ (అండర్-12)ఎస్-8 కేటగిరీలో తలపడింది. 50మీ., 100మీ.ల ఫ్రీ స్టైల్, 50మీ.ల బ్యాక్ స్ట్రోక్‌లో మూడు పసిడి పతకాలు కైవసం చేసుకుంది. వచ్చే ఏడాది జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తోంది.

నిరుపేదలకు పీ4తో భరోసా

లబ్ధిదారులకు బండ్లు అందజేసిన ఎమ్మెల్యే ఉమా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పేదరికంగా పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయం వద్ద పీ4 పథకం అర్హులైన 24వ డివిజన్, కస్తూరిబాయిపేటకు చెందిన గోపాడ దుర్గయ్యకు ఇస్త్రీ బండి, 62వ డివిజన్ పాయకాపురానికి చెందిన గాదె దివ్యకు ఆయన అల్పాహార బండి అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ.. ఈ పథకం ఎందరి జీవితాల్లో వెలుగులు నింపుతోందని చెప్పారు. వారి ఆర్థ్యున్నతికి తోడ్పడటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి మంతెన కృష్ణమోహన్, 62వ డివిజన్ ఇన్‌ఛార్జి పైడి శ్రీను, 24వ డివిజన్ అధ్యక్షుడు ఇజ్జాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

4న ఘంటసాల జయంతి మహోత్సవాలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఈ నెల 4వ తేదీన ఢిల్లీలో ఘంటసాల జయంతి మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆది కళా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణ, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చితకాయల చిట్టిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 14వ జాతీయ మహా సభలను తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. అభిమానులు, ప్రేక్షకులు తరలిరావాలని వారు కోరారు.

'అవన్నీ దొంగ సంతకాలే'

పాయకాపురం, న్యూస్‌టుడే : వైద్య కళాశాల ప్రైవేటీకరణ అంటూ వైకాపా కోటి సంతకాల సేకరణ చేపట్టిందని 61వ డివిజన్ అధ్యక్షుడు ఆకుల సూర్యప్రకాశ్ విమర్శించారు. ప్రజలు సంతకాలు పెట్టకపోయినా.. వారే దొంగ సంతకాలు పెడుతున్నారని దుయ్యబట్టారు. మంగళవారం ఆయన ప్రశాంతినగర్‌లోని తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా చేపట్టిన కోటి సంతకాలు కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శించారు.

ఉచితంగా కంప్యూటర్ శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య నగరపాలక సంస్థ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. డేటా ఎంట్రీ, ఫార్మాటింగ్, ప్రాథమిక సూత్రాలతో సహా మైక్రోసాఫ్ట్ ఎక్సెల్‌లో ప్రాథమిక పరిజ్ఞానం గురించి తెలియజేసినట్లు ప్రిన్సిపల్ మేకా రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ ఉప విభాగాధిపతి కోనేరు సుధీర్, వైజేఎన్ లక్ష్మీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు వినతి

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం లేక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలను పంపాలన్నా, గర్భిణులు సరకులు తెచ్చుకోవాలన్నా నందమూరి నగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ ఎరుబోతు శ్రావణి రామారావు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

నగరాభివృద్ధి.. సంక్షేమానికి బడ్జెట్‌లో పెద్దపీట

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థకు సంబంధించి 2026- 2027 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలను పూర్తిస్థాయిలో తయారు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం కార్పొరేషన్ బడ్జెట్ అంచనాలపై విభాగాల అధికారులతో సమీక్షించారు. నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ అంచనాల రూపకల్పన చేయాలని అన్నారు. రెవెన్యూ ఆదాయం, వ్యయాలు, పెట్టుబడుల ఆదాయ, వ్యయాల అంచనాలను వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని సూచించారు. నగర స్వచ్ఛత, ప్రజారోగ్యం వంటి అంశాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. బడ్జెట్ అంచనాలపై శాఖాధిపతులు మరోసారి తమ సిబ్బందితో సమావేశమై చర్చించి, తగిన అంచనాలను వచ్చే వారం మరోసారి నిర్వహించే బడ్జెట్ సమీక్ష సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పర్వీన్ జాహిద్, అధికారులు డి.చంద్రశేఖర్, సంజయ్ రత్నకుమార్, అర్జునరావు, సత్యకుమారి, జి.సృజన, ఎ.శ్రీధర్, ఎ.శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్, లత, మాల్యాద్రి, పి.వెంకట నారాయణ, బి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఖాళీ స్థలాలతో అవస్థలు

కండ్రిక, ఉడా కాలనీలో వందలకొద్దీ ఖాళీ స్థలాలున్నాయి. వీటిలో పిచ్చి మొక్కలు, గడ్డి భారీగా పెరిగిపోయాయి. వర్షపు నీరు నిల్వ ఉంటున్నాయి. విషసర్పాలు, జంతువులకు ఆవాసాలుగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య అధికారులు చొరవ చూపి, వాటిని శుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలంతా కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

సీపీఎం నిరసన ఉద్రిక్తం

గవర్నర్‌పేట: గంజాయి, మత్తుమందులను అడ్డుకుని నెల్లూరులో ప్రజలకు అండగా నిలిచిన పెంచలయ్యను చంపిన వారిని అరెస్టు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ విషయమై బీసెంట్‌రోడ్డు మహంతిమార్కెట్ వద్ద మంగళవారం గంజాయి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చివరకు పోలీసులు దిష్టిబొమ్మను లాక్కోవడంతో అది పూర్తిగా విరిగిపోయింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సి.హెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్‌లు మాట్లాడుతూ.. నెల్లూరు కల్లూరుపల్లి హెచ్‌బీ కాలనీలో పెంచలయ్య తన కళారూపాలతో ప్రజలను చైతన్య పరుస్తూ గంజాయి, మత్తు మందులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. గంజాయి ముఠా కక్ష కట్టి ఆయన్ని వెంటాడి దారుణంగా నరికి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి ముఠాను నడుపుతున్న కామాక్షిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎవరు అధికారంలో ఉంటే వారి అండదండలు ఆమెకు ఉంటాయని విమర్శించారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి కనీసం స్పందించలేదన్నారు. పెంచలయ్య కుటుంబానికి రూ.50లక్షలు సాయం, భూమి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూపతి రమణ, సత్తిబాబు, నారాయణ, దుర్గారావు, సీతారాములు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ లాక్కునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

బాధితులకు న్యాయం చేయాల్సిందే

గవర్నర్‌పేట: నెల్లూరులో గంజాయి మూకల చేతిలో దారుణహత్యకు గురైన పెంచలయ్య కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, శాంతిభద్రతలను కాపాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా)లు డిమాండ్ చేశాయి. మంగళవారం రాత్రి పెంచలయ్యకు నివాళులు అర్పిస్తూ లెనిన్ సెంటరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి మాట్లాడారు. రాష్ట్రంలో గంజాయి మూకలు పేట్రేగుతుంటే.. ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. గతంలో కంటే సాగు తగ్గలేదన్నారు. గంజాయి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి అమరుడైన పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించే స్థితిలో ప్రభుత్వం లేకపోవడం బాధాకరమన్నారు. హోంమంత్రి అయినా పెంచలయ్య కుటుంబాన్ని పరామర్శించి ఉంటే బాగుండేదన్నారు. ప్రభుత్వం స్పందించి.. గూండాలను పెంచి పోషిస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, కుమారస్వామి, కిరణ్ వెంకటేశ్, నవిత, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

లెనిన్‌కూడలిలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా కొవ్వొత్తుల ప్రదర్శన

టేబుల్ టెన్నిస్‌లో జయకేతనం

క్రీడాకారులను అభినందిస్తున్న బ్రహ్మయ్య, సంగీతరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : సీతారాంపురంలోని శాతవాహన కళాశాలకు చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు వర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో విజేతగా నిలిచారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.బ్రహ్మయ్య తెలిపారు. ఈ నెల 1వ తేదీన నగరంలోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కృష్ణా వర్సిటీ అంతర కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. కళాశాల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జి.సాయితేజ, ఎ.గోవింద్, కె.నికుంజ్‌లతో కూడిన బృందం విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుందని బ్రహ్మయ్య పేర్కొన్నారు. జి.సాయితేజ, ఎ.గోవింద్.. వర్సిటీ జట్టులో స్థానం సాధించారని వివరించారు. విన్నర్ ట్రోఫీ సాధించిన జట్టు సభ్యులు, పీడీ సంగీతరావును మంగళవారం అధ్యాపకులు అభినందించారు.

కంప్యూటర్ కోర్సులపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్‌బాబు, శ్రావణి

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 'కృత్రిమ మేధస్సు, క్వాంటం కంప్యూటింగ్, కంప్యూటర్ రంగంలో నూతన పోకడల'పై అవగాహన సదస్సు నిర్వహించామని ప్రిన్సిపల్ ఎస్.కృష్ణకాంత్ తెలిపారు. ప్రపంచ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేబీఎన్ కళాశాల అధ్యాపకుడు ఎం.సురేష్‌బాబు, బి.శ్రావణిలు రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారు. అధ్యాపకులు కె.విష్ణుకాంత్, ఎం.హరితశ్రీలు పాల్గొన్నారు.

81 మందికి జరిమానా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా 2, 4, 5 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల అధికారులు.. 81 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని సంబంధిత కోర్టుల్లో ప్రవేశపెట్టగా 12 మందికి రూ.15వేలు, 69 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు తీర్పు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు

మధురానగర్, న్యూస్‌టుడే : తమ కూతురు (22) కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ పరిసర ప్రాంతానికి చెందిన యువతి.. పదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటున్నారు. గత నెల 19న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఘటనపై తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పాయకాపురం, న్యూస్‌టుడే : నున్నలోని పోలవరం కుడి కాలువలో ఓ వ్యక్తి (35) మృతదేహం మంగళవారం లభ్యమయింది. స్థానికులు గమనించి వీఆర్వో, నున్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించారు. శరీరం అంతా ఉబ్బిపోయి, కుళ్లిపోయి, గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయోగాత్మక విద్యతో పరిజ్ఞానం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : నిజ జీవితానికి అనుగుణంగా.. ప్రయోగాత్మకంగా విద్యార్థులకు విద్య నేర్పించడం.. వారి ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో విద్యార్థులకు నాసా కిట్‌లు (పెన్ను, టీషర్టు, రాత పుస్తకాలు) అందజేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు.. బుధ గ్రహంపై మానవుడు ఎలా జీవించాలనే అంశంపై ప్రాజెక్టు చేసి నాసాకు అందించనున్నట్లు ప్రిన్సిపల్ పి.సుమకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చైతన్యం.. పరిజ్ఞానం పెంపొందించేందుకు ఇలాంటి ప్రాజెక్టులు మరెన్నో చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ పి.సాయికిరణ్, ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి ఐజీవిక పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

సాధారణ సెలవులు మంజూరు చేయాలి

విజయవాడ(గాంధీనగర్): గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి యాక్షన్ ప్లాన్‌ను అనుసరించి.. సెలవు దినాల్లోనూ పనిచేసిన ఉపాధ్యాయులకు కాంపెన్సేటరీ క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది కూడా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నందున సెలవులు మంజూరు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జయప్రదం చేసిన సందర్భంగా డీఈవోను నాయకులు సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజు, శ్రీనివాస్, శిరీష, జోనయ్య, పి.సుబ్రహ్మణ్యం, కుమారరాజా తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న శ్రీను

గీతాశ్రమంలో గురుపురస్కార మహోత్సవం

సీతారాంపురం, న్యూస్‌టుడే : సీతారాంపురంలోని శ్రీప్రశాంతి గీతాశ్రమంలో గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) ఆధ్వర్యంలో మంగళవారం గురుపురస్కార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, వేదపండితులు, సేవా సంస్థ ప్రతినిధులు భగవద్గీత మహత్యం, గురు-శిష్యుల సంప్రదాయం ప్రాముఖ్యత, ధర్మాచరణ విలువలపై సందేశాన్నిచ్చారు. గీతాపారాయణం, విష్ణు సహస్రనామం, అయ్యప్ప స్వామికి అష్టాభిషేకం నిర్వహించారు. ఆధ్యాత్మిక విద్య, సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక సేవలో విశిష్ఠ సేవలందించిన 20 మంది గురుస్వాములను గురు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గురువుల మార్గదర్శకత్వం సమాజానికి అందించే విలువలు, యువతపై చూపుతున్న ప్రభావాన్ని వక్తలు కొనియాడారు. శబరిమల నారాయణ తోడులో జరుగుతున్న మహా అన్నదాన కార్యక్రమానికి వస్తు సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏబీఏపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొల్లి సీతారామ్, ఏబీఏపీ ట్రస్టీ లంకా బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.గురునాథ్, కోశాధికారి రాజశేఖర్, అజయ్‌బాబు, గోవింద్, వీరబాబు, శివనాగేంద్ర, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గురువులను సత్కరిస్తున్న వక్తలు

4న మాదిగల విజయోత్సవ సభ

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను చట్టం చేసి.. సామాజిక న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ నెల 4న గాంధీనగర్‌లోని జింఖానా మైదానంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. మంగళవారం నగరంలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లోని 59 కులాలకు సమాన అవకాశాలు రావాలంటే ఏబీసీడీ గ్రూపుల వర్గీకరణ చేయాలని గత 32 ఏళ్లుగా మాదిగలు పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. వాటి ఫలితంగా వర్గీకరణ సాధించినట్లు వివరించారు. యావత్ మాదిగ జాతి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహించే సభకు 13 జిల్లాల నుంచి శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏసుపాదం, శేఖర్‌బాబు, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు మాదిగ

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

Smt. VELAGAPUDI DURGAMBA
SIDDHARTHA LAW COLLEGE
Kanuru, VIJAYAWADA-7 Ph:0866-2582592
(Affiliated to Krishna University) Approved by Bar Council of India)
Sponsored by: Siddhartha Academy of General & Technical Education, Vijayawada -10

SPOT ADMISSIONS FOR
3&5- YEAR (UG) & 2-YEAR LL.M(PG)
LAW COURSES FROM 03-12-2025 TO 06-12-2025

Vacant seats in 3-year LL.B & 5-Year B.A.LL.B and 2-Year LL.M Courses in the college arose due to non-reporting of candidates allotted by Convenor, LAWCET-2025 will be filled by the College from **03-12-2025 to 06-12-2025** in the college through "Spot Admissions" in accordance with the guidelines issued by the Convenor, LAWCET-2025. Candidates seeking admission are informed to be present with all their original certificates including LAWCET-2025 rank card, Hall ticket and the prescribed Tuition fee on that day.

Note: The admissions made in the institution are provisional only and subject to ratification by the Convenor, LAWCET-2025. As per the guidelines, the students admitted through "spot admissions" are not eligible for tuition fee reimbursement.

Vijayawada,
Dt. 02-12-2025 Sd/- PRINCIPAL

(c) eenadu

కదలదు బండి... ప్రాణం నిలిచేదెలాగండీ?

ఆపద వేళ ప్రాణాలు నిలిపే అత్యవసర వాహనం అంగుళం కూడా కదలడం లేదు. ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేసిన బి. అప్పారావును మూడునెలల కిందట అనకాపల్లి బదిలీ చేశారు. అప్పటి నుంచి వాహనం ఆసుపత్రి వద్ద వృథాగా ఉండి ఉంది. పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి, విశాఖపట్నం పంపిస్తారు. ఇలాంటి సమయంలో రోగుల బంధువులు తప్పనిసరై ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వీరు రూ. 3 వేల నుంచి రూ. 7 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇది పేదలకు భారంగా మారింది. - ఎలమంచిలి, న్యూస్‌టుడే

లోకశాంతికి చండీయాగం

ఆలయానికి వస్తున్న హరినారాయణాచార్యులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: లోక కల్యాణం, సర్వ మానవ సౌభాగ్యాలతోపాటు అందరికీ ఆధ్యాత్మికత వైపు నడిపించడానికి నిర్వహిస్తున్న చండీయాగంలో భక్తులంతా పాల్గొనాలని అన్నమాచార్యుల 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణాచార్యులు పేర్కొన్నారు. అనకాపల్లి గాంధీనగరం, అంజయ్యకాలనీ శ్రీవేంకటేశ్వరాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న చండీయాగ మహోత్సవాలకు హాజరైన ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అందరినీ భక్తి మార్గంలో నడిపించాలన్నారు. తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులు, అండ అందరికీ ఉంటాయన్నారు. రాష్ట్ర పరిషత్ ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో చండీయాగం, హోమాలు, రుద్రాభిషేకాలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరుకాగా ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

జంక్షన్... టెన్షన్...

ఎలమంచిలి, నక్కపల్లి, న్యూస్‌టుడే

టీవీపై దీనంగా దిగాలు చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు ఆవాల శిరీష. ఉద్దండపురం గ్రామం. ఈమె భర్త దుర్గారావు ఏడాది క్రితం ఉద్దండపురం కూడలిలో కారు ఢీకొని మృత్యువాత పడ్డారు. అప్పటికే వీరికి మూడేళ్ల కొడుకు ఉండగా, మరో బిడ్డ పుట్టి 14 రోజులైంది. భర్త తాపీ పనిచేస్తూ తెచ్చే సంపాదనతో కుటుంబం హాయిగా గడిచిపోయేది. ప్రస్తుతం పుట్టింటి వారు, అత్తింటివారే శిరీషను చూస్తున్నారు. భర్తలేని తనకు భవిష్యత్తు కానరాక బిడ్డలతో కలిసి గుండెల నిండా బాధతో రోజులు వెళ్లదీస్తోంది.

జాతీయ రహదారిపై కూడళ్లలో జరిగిన ప్రమాదాలతో అనేకమంది జీవితాలు రోడ్డున పడ్డాయి. వాహనాల అతివేగం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల అవగాహన రాహిత్యం, కూడళ్లలో లైటింగ్ లేకపోవడం, బ్లింకర్లు పెట్టక పోవడం తదితర రక్షణ చర్యలు కొరవడటం ఇలా అనేక లోపాలు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. అయినా ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రమే.

ప్రాణాలు మింగేస్తున్న కూడళ్లు
మూడేళ్లలో 361 మంది మృత్యువాత

నర్సింగబిల్లి వద్ద ప్రమాదకరంగా కూడలి

జిల్లాలో నం. 16 జాతీయ రహదారి పొడవు 70 కిలోమీటర్లు
కూడళ్లు : 23
బ్లాక్‌స్పాట్లు : 37

భర్త ఫొటోతో ఉన్న ఈ మహిళ పేరు పెంకె రాణి. భర్త వీరన్న వ్యవసాయ కూలీ. అయిదేళ్ల క్రితం పనికి వెళ్తుండగా ఉద్దండపురం కూడలిలో రోడ్డు దాటుతూ.. కారు ఢీకొనడంతో గాయపడి మరణించాడు. రాణికి తొమ్మిదేళ్ల లోపున్న బాబు, పాప ఉన్నారు. ప్రస్తుతం పుట్టింటిలో ఉంటూ కూలికి వెళుతూ పిల్లలతో జీవనం సాగిస్తోంది. బీమా ద్వారా వచ్చిన సొమ్ములు వైద్యం చేయించిన అప్పులకు సరిపోయాయి.

మృత్యుఘోష: జాతీయ రహదారిపై అటు లంకెలపాలెం మొదలు... ఇటు పాయకరావుపేట వరకు 23 కూడళ్లలో మూడేళ్లలో మొత్తం 361 మంది మృత్యువాత పడ్డారు.

★ గౌతమి శాలి అనకాపల్లి ఎస్పీగా ఉన్నప్పుడు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అక్కడే ఎందుకు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నదీ రవాణా శాఖ అధికారులతో కలసి స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో సాంకేతిక లోపాలు గుర్తించి వీటిని సవరించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులకు సూచించారు. కానీ ఒక్క సాంకేతిక లోపాన్నీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరిచేయలేదు.

గత మూడేళ్లలో అత్యధికంగా ప్రాణాలు కోల్పోయిందిక్కడే

కూడలి	మృతులు
లంకెలపాలెం	21
కె.ఎన్.ఆర్.పేట	23
తాళ్లపాలెం	30
బయ్యవరం	19
కొక్కిరాపల్లి	19
గోకులపాడు	18
నామవరం	18

భద్రతా చర్యలు చేపడతాం..

జిల్లాలో జాతీయ రహదారి చాలాచోట్ల గ్రామాల మధ్య నుంచి వెళ్లింది. ఇలాంటి చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జనాభా, వాహనాలు పెరుగుతున్న విషయాన్ని గుర్తించి, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎస్పీ ఆదేశాలతో ఇటీవల చోట్ల లైటింగ్, బ్లింకర్లు అవసరాన్ని గుర్తించి వీటిని ఏర్పాటు చేయడానికి నివేదిస్తున్నాం. కూడళ్లలో జరిగిన ప్రమాదాలు, మృతుల వివరాలతో హెచ్చరిక బోర్డులు పెట్టిస్తాం. వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు పెంచుతున్నాం. తద్వారా భద్రతా చర్యలు చేపడతాం.
– పి.శ్రీనివాసరావు, డీఎస్పీ, నర్సీపట్నం

అదనపు వసూళ్లకు అడ్డుకట్ట ఇలా!

పాయకరావుపేట, న్యూస్‌టుడే

ఆధార్ అత్యంత కీలకం. ఇందులో ఏ చిన్న తప్పు దొర్లినా ముందుముందు ఇబ్బందులు తప్పవు. ఆధార్‌లో మార్పుచేర్పుల కోసం పలువురు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజల అవసరాన్ని అవకాశంగా చూసుకుని కొందరు కేంద్రాల నిర్వాహకులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. నిర్దేశిత రుసుం కన్నా అదనపు వసూళ్లకు నిర్వాహకులు పాల్పడితే 1947 నంబరుకు ఫిర్యాదు చేయాలి. uidai.gov.in సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. నిర్వాహకులు తప్పుడు ధ్రువపత్రాలతో ఆధార్‌కార్డు నమోదు చేస్తే గతంలో రూ. 10 వేలు జరిమానా విధించేవారు. దీన్ని తాజాగా రూ. లక్షకు పెంచారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 976 ఆధార్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులు నిర్వహించేవారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులతో కేవలం 224 మాత్రమే మిగిలాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 170 కేంద్రాలుండేవి. వీటిలో ప్రస్తుతం పాయకరావుపేట, ఎస్. రాయవరం, చోడవరం, కంచరపాలెంలో మాత్రమే కేంద్రాలు పని చేస్తున్నాయి. మిగతా వాటిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా మూసివేయించారు.

అంతా మా ఇష్టం

గణపర్తిలో వైకాపా నాయకుల ఆధీనంలో ప్రభుత్వ భూమి

మునగపాక, న్యూస్‌టుడే

గణపర్తిలో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక మండలం గణపర్తిలో సర్కారు స్థలాన్ని వైకాపా నాయకులు దర్జాగా ఆక్రమించేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఆడింది ఆటగా.. పాడింది పాటగా సాగడంతో రూ. రూ. 2 కోట్ల విలువైన భూమిని తమ సొంతం చేసుకున్నారు. ఎట్టకేలకు అధికారులు దీనిపై స్పందించి హద్దులు గుర్తించారు. మునగపాక మండలం గణపర్తి-కశింకోట మండలం సోమవరం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే సర్వేనం. 33లో 1.32 ఎకరాలు, సర్వే నం. 35లో 40 సెంట్ల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఎక్కువ విస్తీర్ణం వైకాపా నాయకుల స్వాధీనంలోనే ఉంది. వారే దీనిని సాగు చేసుకొంటూ ఫలసాయం పొందుతున్నారు. మరికొంత భూమి పేదరైతుల ఆధీనంలో ఉంది. గణపర్తి గ్రామానికి కైలాసభూమి లేదు. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కొంతభూమిని కైలాసభూమికి కేటాయించాలని కోరుతూ పంచాయతీ పాలకవర్గం గతంలోనే తీర్మానం చేసి కలెక్టరుకు విన్నవించింది. అధికారులు వచ్చి, స్థలాన్ని పరిశీలించినా అప్పట్లో పాలకుల అండదండలు ఉండటంతో స్వాధీనం చేసుకోలేక పోయారు. ఇటీవల కొందరు ఆ స్థలంలో పక్కాకట్టడాల నిర్మాణం చేపట్టారు. ఎట్టకేలకు తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది మంగళవారం గణపర్తి చేరుకుని రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి హద్దులు గుర్తించి మార్కింగ్ చేశారు. ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

తప్పించుకోవద్దు.. తప్పకుండా రండి!

అచ్యుతాపురం, నెహ్రూచౌక్ (అనకాపల్లి), పాయకరావుపేట, న్యూస్‌టుడే

తల్లిదండ్రులూ.. పీటీఎంకు హాజరైతేనే మేలు

ప్రతి పేదింటి కుసుమం జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధం. ఇటువంటి ఆయుధాన్ని కొందరు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరానికి చేరుకుంటుంటే.. మరి కొందరు అవగాహన లేక, తల్లిదండ్రులు పట్టించుకోక పాఠశాల స్థాయిలోనే చదువులకు టాటా చెబుతుంటారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలపై తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నారు. నిరంతరం పాఠశాలను సందర్శించడంతో పాటు వారి ప్రవర్తన, విద్యపై ఉపాధ్యాయులతో చర్చిస్తూ మంచి ఫలితాలు పొందుతున్నారు. ఇటువంటి ప్రయత్నం ప్రభుత్వం పాఠశాలల్లోనూ జరగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఒక వేదికపైకి తెచ్చి విద్యార్థి పురోభివృద్ధికి పాటుపడడానికి మెగా పేరెంట్స్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించనుంది. పిల్లల ఎదుగుదలను రూపొందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్రని భావించి పండగ వాతావరణంలో ఈనెల 5న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. వీటిపై విద్యాశాఖాధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

సమావేశం ఉద్దేశాలివీ...

➤ పిల్లలు తరగతి గదిలో ఎలా రాణిస్తున్నారు, సహ విద్యార్థులతో ఏవిధంగా ప్రవర్తిస్తున్నారు? ఇంటి వద్ద ఏ విషయాల్లో శ్రద్ధ తీసుకోవాలని వంటి అంశాల్లో పిల్లల పురోగతిపై ఉపాధ్యాయులతో చర్చించడానికి ఇది ప్రధాన వేదిక.

➤ పిల్లల అలవాట్లు, సవాళ్లు, నైపుణ్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించడానికి అవకాశం ఉంటుంది.

➤ విద్యార్థులకు మెరుగైన విద్యను అందివ్వడానికి ఉపాధ్యాయులతో కలిసి తల్లిదండ్రులు అడుగులు వేయడానికి ఇది మూలస్తంభంగా పనిచేస్తుంది. తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల వాతావరణ మార్చడానికి ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుంది. చెడు అలవాట్లు, పాఠశాలలకు తరచూ గైర్హాజరు అయ్యేవారు, క్రమశిక్షణ కొరవడిన విద్యార్థుల ప్రవర్తను తల్లిదండ్రులకు వివరించడంతోపాటు వారిని సరైన రీతిలో నడిపించడానికి ఉపాధ్యాయులకు వీలు కలుగుతుంది.

ఈ సవాళ్లు అధిగమించాలి: ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభంలో జులై 10న మెగా పీటీఎం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ లక్ష్యాలు, ఉద్దేశ్యాలను తల్లిదండ్రులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమావేశానికి భారీగా హాజరైన తల్లిదండ్రులు తరువాత మాత్రం పాఠశాల ముఖాన్ని చూడలేదు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు: 1,831
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 22
విద్యార్థుల సంఖ్య: సుమారు రూ.2.50 లక్షలు

▸▸ ప్రతినెల జరగాల్సిన సమావేశాలకు పాఠశాల కమిటీ ఛైర్మన్, ఒకరిద్దరు డైరెక్టర్లు తప్ప తల్లిదండ్రుల భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొందరు ఉపాధ్యాయులు సైతం దీనిని అంతగా పట్టించుకోకుండా కాగితాల్లో సమావేశాలను చూపించారు.

▸▸ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో సింహభాగం పేద కుటుంబానికి చెందినవారే కావడంతో రోజు కూలీకి వెళ్తే తప్ప కడుపునిండని పరిస్థితులు వల్ల వారు ఈ సమావేశాలకు రావడంలేదు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: పీటీఎం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశాం. పండగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాం.
– జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

తగ్గితే తప్పేం కాదు

ఫలితాలిస్తున్న లోక్ అదాలత్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

చిన్నచిన్న తగాదాలతో కేసులు పెట్టుకుంటూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ చాలామంది తిరుగుతున్నారు. కాలాన్ని.. ధనాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి లోక్ అదాలత్ రాజీ మార్గం ఊరట కలిగిస్తోంది. పరస్పర అంగీకారంతో చాలావరకు కేసులను పరిష్కరించుకుంటున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న లోక్‌అదాలత్ ఇందుకు ఎంతో ఉపయోగపడుతోంది.

జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవడానికి వీలున్నవాటిపై ఇరుపార్టీలకు ముందే అవగాహన కల్పిస్తున్నారు. వాయిదాలకు తిరగడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తున్నారు. దానికి బదులు రాజీపడేందుకు ఇరుపార్టీలు సమ్మతి తెలియజేయడంతో పలు కేసులు కొలిక్కి వస్తున్నాయి. మండల న్యాయసేవాధికార సంస్థల ద్వారా లోక్‌అదాలత్ ప్రయోజనాలను న్యాయమూర్తులు వివరిస్తున్నారు.

రాజీ కేసులు ఇలా..: ★ కుటుంబ తగాదాలు, కాపురంలో గొడవలు, ఆస్తివివాదాలు, భూతగాదాలు, ఆర్థిక కేసులు, చెల్లని చెక్కులు, మోటారు వాహన ప్రమాద బీమా, విద్యుత్తు చౌర్యం, ట్రాఫిక్ ఉల్లంఘనలు, బ్యాంకు రుణాలు, పెట్టీ కేసులు, పరిశ్రమల కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చు.

ఈ ఏడాదిలో కేసుల పరిష్కారం

తేదీ	పరిష్కారం
మార్చి 8	1101
జులై 5	1450
సెప్టెంబరు 13	1524

విస్తృత ప్రచారం: లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమంలో స్టేషన్ల వారీగా రాజీకి అవకాశం ఉన్న కేసులపై ఇరుపార్టీలకు వివరిస్తున్నాం. చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఈనెల 13న జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుంది. కక్షిదారులు దీన్ని వినియోగించుకోవాలి. – తుహిన్‌సిన్హా, ఎస్పీ

నమ్మకమే నడిపిస్తోంది

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నేడు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వైకల్యం కారణంగా కాలు కిందకు పెట్టి అడుగు ముందుకు వేయలేని వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేశారు. తనలాంటి ఎంతోమంది జీవితాలకు వెలుగురేఖ చూపే బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. ఆయన చేసిన ప్రయత్నం ఇప్పుడు ఎన్నో బతుకులను మార్చుతోంది.

దివ్యాంగులైన పిల్లలను కుటుంబపెద్దలా సాకుతున్నారు మోసయ్యపేటకు చెందిన పి.ఎస్.టి.పట్నాయక్. దివ్యాంగుడైన ఆయన ఎక్కడకు వెళ్లాలన్నా చక్రాల కుర్చీలోనే వెళ్తుంటారు. అలాంటి ఆయన పాతికేళ్ల క్రితం దివ్యాంగుల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. కేవలం పది మందితో తాటాకు పాకలో ప్రారంభమైన పాఠశాల నేడు పక్కా భవనాలతో రూపుదిద్దుకుంది. 14 మంది దివ్యాంగ బోధకులతో విద్యాబుద్ధులను నేర్పిస్తున్నారు. ఇప్పటికే 15 బ్యాచ్‌లను పదో తరగతి పరీక్షలకు పంపించారు. ఇటీవలే డీఎస్సీ ఫలితాల్లో ఇదే పాఠశాలలో చదివిన ఒకరు ఉద్యోగం సాధించారు.

పట్నాయక్ నిర్వహిస్తున్న పాఠశాల

దాతలే ఆదరవు!: పట్నాయక్ ఈ పాఠశాలను దాతల సహాయంతో నడుపుతున్నారు. దివ్యాంగుల విద్యార్థులను ఉన్నత వర్గాలకు చెందిన వారికి దత్తత ఇచ్చి వారు అందించే సహాయంతో విద్య, వసతి, భోజనం అందిస్తున్నారు. పలువురు పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి శుభకార్యాలు ఇక్కడే ఏర్పాటు చేసుకొని దివ్యాంగులతో కలిసి ఆనందంగా గడుపుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, వైజాక్‌ఫోపైల్, ఎన్టీపీసీ, కృష్ణా ప్యాన్స్, రోటరీక్లబ్, విశాఖడెయిరీ, ఎంపీ నిధులు, మహిళా సమితి సహాయంతో పాఠశాలను నిర్వహిస్తున్నారు. పట్నాయక్ సేవలను గుర్తించి ప్రభుత్వం ఇప్పటికే సత్కరించింది.

పొందిన అవార్డులు...

» 2006లో జాతీయస్థాయిలో ఉత్తమ సేవకునిగా అప్పటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం అవార్డు
» 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా సేవా పురస్కారం. » దివ్యాంగుల సమస్యలపై అధ్యయన కమిటీలో సభ్యత్వం

ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యం: తాము ఎందుకు పనికిరామనే అభిప్రాయాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యం. ఈ దిశగానే ప్రతిరోజు ఆలోచన చేస్తుంటాను. ప్రభుత్వానికి అందించే నివేదికలో ఈ విషయాలనే ఉంచాలనుకుంటున్నాను. దివ్యాంగులపై జాలిచూపి సహాయం అందించి వదిలివేయకూడదు. ఆర్థికంగా నిలబడేవిధంగా వారిని తయారుచేయడానికి నిర్మాణాత్మకమైన చర్యలు అవసరం. మా పాఠశాలలో 200 మంది వరకు వసతి ఉండేవిధంగా ఏర్పాట్లు ఉన్నాయి. రక్షణగోడ లేక కొంత ఇబ్బంది పడుతున్నాం. బాలురుకు డార్మెటరీ లేదు.
– పీఎస్‌టీ పట్నాయక్, పాఠశాల నిర్వాహకుడు

ఇతని పేరే అనకాపల్లి!

ఇతని పేరు అనకాపల్లి. ఇది నిజమేనండీ! ఇతను దేవాలయాలకు వచ్చినా, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినా ఇలా ఎక్కడకి వెళ్లిన అనకాపల్లి అని చెబితే మీ ఊరు పేరు కాదు.. మీ పేరు చెప్పండి అంటూ పదేపదే అడుగుతుంటారు. ఆధార్‌కార్డు చూపిస్తే తప్ప నమ్మని పరిస్థితి. అచ్యుతాపురం మండలం లంకధర్మవరానికి చెందిన పాతినాయుడు, నూకాలమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. తరవాత పుట్టిన అనకాపల్లిని చూసేందుకు వచ్చిన గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు 'అనకాపల్లి' అని ఉయ్యాల్లో ఉన్నప్పుడు పిలిచింది. ఆమె నోటి నుంచి వచ్చిన మొదటిమాట తరవాత కాలంలో అదే పేరును తల్లిదండ్రులు కొనసాగించారు. అనకాపల్లి అని పేరు పెట్టడం వల్లే తరవాత మరో తమ్ముడు పుట్టాడని సెంటిమెంట్‌గా చెబుతున్నాడు. 58 ఏళ్ల అనకాపల్లి ఇంటిపేరు తోకల. – అచ్యుతాపురం, న్యూస్‌టుడే

ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారు?

మాజీ నక్సలైట్లు, సానుభూతిపరులపై ఆరా

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ నక్సలైట్లు, సానుభూతిపరులు ప్రస్తుతం ఎక్కడున్నారు... ఏం చేస్తున్నారన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నాతవరం మండలంలో మాజీ మావోయిస్టు బత్తుల కృష్ణ, సానుభూతిపరుడిగా ముద్రపడిన షేక్ రజాక్ సహా 12 మందిని గుర్తించారు. వీరందరినీ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. సత్ప్రవర్తన కలిగి ఉంటామని వీరందరి నుంచి ఒకటి, రెండు రోజుల్లో హామీ (బైండోవర్) తీసుకోనున్నారు. కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ పరిధిలోనూ ఇద్దరు మాజీలను అక్కడి పోలీసులు పిలిపించనున్నారు. మూడున్నర దశాబ్దాల కిందట నాతవరం, కృష్ణదేవిపేట పోలీసుస్టేషన్ల పరిధిలో తాండవ దళం, నాగులకొండ దళం సంచారం ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం మావోయిస్టులు ఈ ప్రాంతాలను షెల్టర్ జోన్‌గా చేసుకునే అవకాశం ఉందన్న అనుమానంతో పోలీసులు ఈ దిశగా చర్యలు చేపట్టారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలకు గడువు పెంపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా జిల్లాలో శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు పెంచారని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువతలో డ్రైవింగ్ నైపుణ్యాలు అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. 10 లక్షల జనాభాకు ఓ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆసక్తి ఉన్న సంస్థలు డీపీఆర్ నకలు, సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. దరఖాస్తు చేసే సంస్థ స్వచ్ఛంద సంస్థ (ఎన్‌జీఓ), ట్రస్టు, సహకార సంగం లేదా తయారీదారుల సంస్థగా ఉండాలన్నారు. ఎన్‌జీఓ అయితే దర్పణ్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టర్నోవర్ ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. సంస్థకు సొంతంగా లేదా పదేళ్ల లీజుతో రెండు ఎకరాల స్థలం, వాహనాలు, వర్క్‌షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అన్ని దరఖాస్తులు కలెక్టర్ ఆమోదంతో వెళ్తాయన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా రవాణా కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పుస్తకాలు చదివారు... పోటీపరీక్షల్లో నెగ్గారు

గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం యువత జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. అనకాపల్లి శాఖ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఆర్థికంగా స్తోమత లేని వారికి ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇక్కడ చదివిన వారిలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

ఎంతో ఉపయోగం: మాది పద్మనాభం మండలం అనంతవరం. 2022లో బీటెక్ పూర్తి చేశాను. అనకాపల్లి వచ్చి ఇక్కడే ఉంటూ రోజూ శాఖ గ్రంథాలయానికి వెళ్లి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. ఇక్కడ పుస్తకాలు నాకు చాలా ఉపయోగపడ్డాయి. ఇటీవల ఇస్రోలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చింది. గ్రంథాలయాల్లో పుస్తకాలు వినియోగించుకోవాలి. – కసిరెడ్డి వాసుదేవ్

కావాల్సిన పుస్తకాలు తెప్పించారు: మాది అనకాపల్లి. 2022 నుంచి గ్రంథాలయానికి వస్తూ ఇక్కడి పుస్తకాల ఆధారంగా పోటీ పరీక్షలు రాస్తూ వచ్చా. ఏడాదిన్నర పాటు ఇలా నా ప్రయత్నం కొనసాగించా. అవసరమైన పుస్తకాలు కావాల్సిన వాటి జాబితాలో రాస్తే వాటిని రప్పించేవారు. ఇవి మాకు చాలా ఉపయోగంగా ఉండేవి. క్రమం తప్పకుండా చేసిన సాధన ఫలించింది. ఇటీవల సేల్స్ టాక్స్ విభాగంలో నాకు ఉద్యోగం వచ్చింది.
– విజ్ఞత్రి

నిర్వాసితుల పిల్లలకు ఉద్యోగాలు: అయ్యన్న

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలంలో అన్‌రాక్ అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటుకు అప్పట్లో భూములిచ్చిన రైతుల కుటుంబాల్లో పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి చూపేందుకు చర్యలు చేపడుతున్నట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. నర్సీపట్నంలో మంగళవారం మాట్లాడుతూ.. అల్యూమినియం పరిశ్రమలో 50 శాతం వాటాను రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతినిధులు తీసుకున్నారని వెల్లడించారు. ఇటీవల వారితో ఉద్యోగాలు, ఉపాధి విషయమై చర్చించినట్లు పేర్కొన్నారు. నిర్వాసితుల కుటుంబాల్లో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారి అర్హతకు తగిన ఉద్యోగాల్లో తీసుకోవాలని, చదువు లేనివారికి రుణాలు మంజూరు చేసి టిప్పర్లు కొనుగోలు చేసేలా ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న వారిని గుర్తించేందుకు సర్వే చేయాలని ఆర్‌డీఓ రమణను ఆదేశించారు. నిర్వాసితుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరాన్ని పరిశ్రమ ప్రతినిధులకు వివరించినట్లు పేర్కొన్నారు.

వంగ రైతుకు తీరిన బెంగ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జిల్లాలో వంకాయలకు రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. మంగళవారం ఎలమంచిలి మార్కెట్‌లో 20 కేజీల వంకాయలకు రూ. 1000 ధర పలికింది. అనకాపల్లి, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మార్కెట్లకు గతంలో ఇతర ప్రాంతాల నుంచి వంకాయలు దిగుమతి అయ్యేవి. ఎలమంచిలి పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది వంగ పంట బాగా పండింది. దీంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

(c) eenadu

భూముల సమస్య పరిష్కారం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండలం రాచపల్లి, రామన్నపాలేనికి చెందిన 246 మంది రైతులకు చెందిన 186.14 ఎకరాల జిరాయితీ భూముల సమస్య 13 ఏళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం చొరవతో పరిష్కారమైందని సభాపతి అయ్యన్నపాత్రుడు చెప్పారు. నర్సీపట్నంలో మంగళవారం మాట్లాడుతూ.. ఏపీఐఐసీ కోసం భూసేకరణ చేయనప్పటికీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఏపీఐఐసీ భూములుగా తప్పుగా నమోదయ్యాయన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు పొందడానికి, బ్యాంకు రుణాలు తీసుకోవడానికి, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద ఆర్థిక సాయం పొందడానికి, కుటుంబ అవసరాలకు భూమి అమ్ముకోవడానికి రైతులకు వీల్లేకుండా పోయిందన్నారు. తప్పును సరిదిద్ది రైతుల పేరున భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని 2012 నుంచి వారంతా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులందరూ తన దృష్టికి సమస్యను తీసుకురావడంతో పరిష్కరించాలని ఆర్డీఓ రమణకు సూచించినట్లు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబరులో రాచపల్లి వచ్చిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 20 రోజులపాటు ఆర్డీఓ సమక్షంలో అధికారులు, సిబ్బంది రికార్డులను పరిశీలించి నివేదిక పంపడంతో కలెక్టర్ గతనెల 26న ఈ భూములను ఆయా రైతుల పేరున జిరాయితీ భూములుగా వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు ఉత్తర్వులు ఇవ్వడంతోపాటు పాసు పుస్తకాల జారీకి ఆదేశాలు ఇచ్చారన్నారు. విశాఖపట్నం, విజయవాడకు చెందిన కొందరు రికార్డులు లేకుండానే కొంత మంది రైతుల నుంచి భూములను దక్కించుకున్నట్లు తెలిసిందన్నారు. అమ్మినవారు ఎవరో, కొనుగోలు చేసినవారు ఎవరో పరిశీలించాలని ఆర్డీఓకు సూచించారు. ఇన్నేళ్లుగా నష్టపోయిన రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం తహసీల్దారు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీవో రమణ తదితరులతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న సభాపతి అయ్యన్న

సిబ్బంది స్థానికంగా ఉండాల్సిందే.. ఎస్పీ తుహిన్‌సిన్హా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో భాగంగా సిబ్బంది పోలీస్ స్థానికంగా ఉండాల్సిందేనని ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. పాయకరావుపేట పోలీసుస్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఏమాత్రం రాజీ పడవద్దన్నారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా గస్తీ చేపట్టాలని పేర్కొన్నారు. చోరీల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రిపూట గస్తీలో రేడియం జాకెట్లు, హెల్మెట్లు తప్పనిసరిగా సిబ్బంది ధరించాలని సిబ్బందికి సూచించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అప్పన్న పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పోలీసు నివాస సముదాయం ఏర్పాటుకు స్థల పరిశీలన

అనకాపల్లి గ్రామీణం: కోడూరు పాత ఇసుక స్టాక్ పాయింట్ స్థలాన్ని మంగళవారం పోలీసు నివాస సముదాయం ఏర్పాటుకు సంబంధించి గ్రామీణ సీఐ అశోక్ కుమార్, తహసీల్దార్ ఆనందరావు పరిశీలించారు. దీనికి సమీపాన మరో స్థలాన్ని చూశారు. పూర్తి నివేదిక రూపొందించి ఉన్నత అధికారులకు అందించనున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపదలో 'ఆరోగ్య ప్రదాయిని'..!

కేజీహెచ్ పిల్లల విభాగంలో మెరుగైన సేవలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో నవజాతి శిశువులతో పాటు సాధారణ పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మూడేళ్ల నుంచి నవజాత శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్), శిశుమరణాల రేటు (ఎంఎంఆర్)ను 50 శాతం మేర తగ్గించడంతో రాష్ట్రస్థాయి అధికారుల ప్రశంసలు అందాయి.

పిల్లల చికిత్స విభాగంలో వైద్య పరికరాలు

ఇవీ వసతులు: ఈ విభాగంలో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ), స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), ఫొటోథెరపి యూనిట్ ఉన్నాయి. ★ వాటిల్లో ఆధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, హెచ్ఎఫ్ఎన్‌సీ, మల్టీపారా మోనిటర్లు, 2డీ ఏకో, పోర్టబుల్ అల్ట్రాసౌండ్ పరికరాలతో పాటు, ఏబీజీ, సీఆర్‌పీ యంత్రాలు ఉన్నాయి.

★ పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు ఎన్ఆర్‌సీ వార్డు, డీఈఐసీ వార్డుల్లో సేవలు అందిస్తూ, స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలు అమలు చేస్తూ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

★ ప్రభుత్వ ఆర్సీడీ, విక్టోరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందే చిన్నారులను అత్యవసర సమయంలో కేజీహెచ్‌లో చేర్పించి, వైద్యం చేస్తున్నామని విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాస చక్రవర్తి, సూపరింటెండెంట్ వాణి తెలిపారు.

సిబ్బంది సంఖ్య

విభాగాధిపతి	:1
ప్రొఫెసర్లు	:2
సహ ప్రొఫెసర్లు	:3
నియోనెటాలజిస్టు	:1
పీజీలు	:36
అసిస్టెంట్ ప్రొఫెసర్లు:	8

★ హిమోఫిలియా, సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా బాధితులకు ఖరీదైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

సేవలు ఇలా..

★ సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ.

★ ఎన్ఐసీయూ, పీఐసీయూ వార్డుల్లో 24 గంటలు సేవలు.

★ ఆయా వార్డుల్లో మొత్తం పడకలు: 250

చిత్రలేఖనంలో మాడుగుల విద్యార్థికి స్వర్ణపతకం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నైలో ఇటీవల జరిగిన బాలల చిత్రలేఖనం పోటీల్లో మాడుగుల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి పుట్టా రోహిత్ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. చెన్నైలోని శ్రీధరిని కళాయ కూడమ్ సంస్థ 21న వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. చోడవరం చిత్రకళా నిలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు పతకాలు సాధించారు. వీరిలో మాడుగులకు చెందిన రోహిత్ బంగారు పతకం సాధించాడు. రోహిత్‌ను మంగళవారం పాఠశాలలో యాజమాన్య కమిటీ ఛైర్మన్ బొజ్జపల్లి రమేష్, ప్రధానోపాధ్యాయుడు ముత్యాలనాయుడు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యార్థి రోహిత్‌తో ఉపాధ్యాయులు

కరాటే పోటీల్లో మూడు బంగారు పతకాలు

పతకాలతో కరాటే క్రీడాకారులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అనగనపూడిలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో ఎలమంచిలికి చెందిన ముగ్గురు క్రీడాకారులకు బంగారు పతకాలు లభించాయి. ఈ పోటీల్లో 8 మందికి వెండి, 20 మందికి కాంస్య పతకాలు లభించాయన్నారు. ఎలమంచిలి చెందిన క్రీడాకారులకు ఇన్ని పతకాలు రావడం అభినందనీయమని పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ ఎలమంచిలి ఇన్‌స్పెక్టర్ నక్కా వెంకట రమణ చెప్పారు. ఈ కార్యక్రమంలో కశింకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బాలికలను బడిలో చేర్చిన డీఈఓ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు మంగళవారం దేవరాపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయన పర్యటన సాగింది. దేవరాపల్లి పరిసరాల్లో నివాసం ఉంటున్న వలస కుటుంబాల్లో బడి ఈడు కలిగిన పిల్లలున్నారని తెలుసుకున్న ఆయన ఆయా కుటుంబాల వద్దకు మండల విద్యాశాఖాధికారి ఉమతో కలిసి వెళ్లారు. ముగ్గురు బడి పిల్లల్ని గుర్తించిన ఆయన.. ఒక బాలికను దగ్గర్లోని అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి అప్పగించారు. మిగిలిన ఇద్దరిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ ముగ్గురు బాలికలకు తాను స్వయంగా దుస్తులు, తువ్వాళ్లు కొనుగోలు చేసి అందజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల హాజరును అడిగి తెలుసుకున్నారు. ఒక ఉపాధ్యాయుడు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నట్లు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. బాల, బాలికలతో మాట్లాడారు. అక్కడి నుంచి బొడ్డపాడు ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సాయంత్రం మండలంలోని ఉపాధ్యాయులతో ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 5న నిర్వహించే మెగా పేరెంట్స్ డేని విజయవంతం చేయించాలని కోరారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. తామరబ్బ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు వెంకన్న డీఈఓను కలిసి కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ అప్పారావు నాయుడు, చిత్రంలో ఎంఈఓ ఉమ తదితరులు

సరకులు అందక పడిగాపులు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండం కోనాం రేషన్ డిపోలో సరకులు పంపిణీ కాలేదు. ప్రతినెలా ఒకటో తేదీ నుంచి డిపోలో కార్డుదారులకు సరకులు పంపిణీ చేయాల్సి ఉన్నా.. రెండు రోజులుగా డిపో తెరవలేదు. దీంతో రేషన్ కోసం కార్డుదారులు సరకుల కోసం ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు లబ్ధిదారులు డిపో వద్దనే పడిగాపులు కాస్తున్నారు. దీనిపై పౌరసరఫరాల అధికారి రవిబాబును ఫోన్‌లో సంప్రదించగా.. ఇక్కడ ఇన్‌ఛార్జి డీలర్‌కు మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు అప్పగించామన్నారు. సరకులను తక్షణమే లబ్ధిదారులకు అందేలా చేస్తామన్నారు.

కోనాం రేషన్ డిపో వద్ద సరకుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల సబ్ సెంటర్‌ను వైద్యారోగ్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. డీపీఎంఓ ప్రశాంతి, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు కలిసి, అయూష్ వైద్య విభాగానికి, సిబ్బంది పని తీరు రికార్డులను తనిఖీలు చూశారు. రోగులకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో డీపీఓ జగదీష్, ఎస్ఓలు రామచంద్ర, జనార్దన్, ఎంపీహెచ్ఈఓ బుల్లిబాబు, హెచ్‌వీ.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

కశింకోట, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం.హైమావతి సూచించారు. కశింకోట మండలం తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. సిబ్బంది, ఆశా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ డిసెంబరు 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం, ఏసీడీ 4.0 కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఆశా దినోత్సవం సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. వైద్యాధికారి ఎం.సుమ, ఎంపీహెచ్ఓ వి.ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రశాంతి

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గంతో కలెక్టర్ విజయకృష్ణన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం గిరిజన, సాంఘిక సంక్షేమ, బీసీ, కస్తూర్బా తదితర వసతి గృహాల సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులు అందరూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు అందరూ వసతి గృహాల్లో ఉండాలన్నారు. పరీక్షలు పూర్తయిన తరవాతే ఇంటికి పంపించాలన్నారు. బాలికల వసతి గృహాల్లో సిబ్బందికి తప్ప ఇతరులకు ప్రవేశం కల్పించకూడదన్నారు. విద్యార్థులకు రక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం, నిరంతరం వైద్యపరీక్షలు అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిత్యం చదవడం, రాయడం, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి కె.శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జి.మంగవేణి, సాంఘిక సంక్షేమ అధికారి బి.రామనాథం, ఇంటర్మీడియట్ అధికారి వినోద్ బాబు పాల్గొన్నారు.

▮ జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేసి పూర్తి స్థాయిలో సేవలను అందించాలని రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యక్రమాల వివరాలను, సేవా కార్యక్రమాలను వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

▮ జిల్లాలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం డీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈఈ అనీల్ కుమార్, డీఈ సావిత్రి, ఏఈలు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించని ప్రభుత్వం

చీడికాడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పే రివిజన్ కమిషన్ వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పరదేశి డిమాండు చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలైనా ఏ ఒక్క సమస్యపై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. విద్యాశాఖ మంత్రి దశలో చర్చలకు సంఘాలతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కారానికి చొరవ చూపాలని, నెలవారి పదోన్నతులు, హైస్కూల్ ప్లస్‌లో భర్తీ చేయడం, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కోశాధికారి గంగాధర్, ఉపాధ్యక్షులు వరహాలదొర, రామయ్యరెడ్డి, ఉమామహేశ్ పాల్గొన్నారు.

ఖండివరంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి, సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు

ముహూర్తం కుదిరింది!

4న డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభోత్సవం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: డివిజినల్ అభివృద్ధి కార్యాలయాలను ఈ నెల 4న ప్రారంభించనున్నారు. నర్సీపట్నంలో పాత మున్సిపల్ కార్యాలయంలో, అనకాపల్లి పరిధిలోని కొత్తూరులో వీటిని ఏర్పాటు చేశారు. డివిజినల్ పంచాయతీ అధికారి కార్యాలయం, ఉపాధి హామీ పథకం ఏపీడీ కార్యాలయం వీటిలోనే ఉంటాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నర్సీపట్నం డీఎల్‌డీఓ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జెన్‌టీయు అసిస్టెంట్ ప్రొఫెసర్ తిరుమలరావు తెలిపారు. డైట్ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ సాక్షరత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా రాబోయే రోజుల్లో కంప్యూటర్ మార్పులను అందిపుచ్చుకునేలా విద్యార్థులు సాధన చేయాలని సూచించారు. సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విభాగపతి సుజాత తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనుగోలు. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనుగోలు. ✆ 9908645224.

FINANCIAL SERVICES

✆ 9396 999 669.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

Vastu Consultants Genuine India's Best Vastu for Industries / Houses Rural / Urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

FLAT FOR SALE

GAJUWAKA

2 BHK Flat 2 Nos For Sale Jawahar Nagar Sriharipuram. Contact Phone : 9100062243.

NAD

3Bhk flat E/f., 5th floor, 2Bhk 865sft S/f 3rd & 5 flor 2Bhk 620sft N/f 5th floor for sale at Vimanagar. Ph: 9446139989.

LAND FOR SALE

MADHURAWADA

LAND FOR SALE 5.33 ఎకరాల భూమి సర్వే నెం. 296/14 P.M పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా, మధురవాడ, హైవేలో అమ్మకమునకు కలదు. 6300711986 7382716164

PLOT FOR SALE

GAJUWAKA

296 Sq. Yards North Facing, Srinagar, Ginger Hotel Backside, Gajuwaka, Visakhapatnam. Cont.: 9346717891, 9949839498.

TO LET

COMMERCIAL

GENERAL

Available 3000 sq.ft in Basement Floor, Crescent Towers, Seethammadhara, Visakhapatnam. Contact: 8332864233

JOBS

Wanted Business Managers (M/F), Telecallers (M/F), Customer Adviser age below 35 yrs. Walk-in 2nd Floor, RK Vijaya Lakshmi Nilayam, Visalakshinagar Main Rd. ✆ 7993187448.

Wanted Autocad Designer Min. 1 year experience req. to work in a leading interior off. Dwarakanagar. ✆ 9849332399.

WALK-IN-INTERVIEW

CHIEF ADMINISTRATIVE OFFICER : M/F Package: 20 Lakhs to 30 Lakhs PA (Negotiable)

BUSINESS DEVELOPMENT MANAGERS: M/F Package: 10 to 15 Lakhs PA (Nego.)

Interview on: 3rd & 4th Dec-25

Con: M.B.N.SATYANARAYANA DOCTORS COLONY, VSP Ph: 9573222999

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు కావలెను. గాజువాక, అనకాపల్లి, గోపాలపట్నం ఏరియాల్లో 30 రోజులు పనిచేయుటకు రోజుకి రూ॥ 500/-. ✆ 9963157250 / 9381533726.

FACULTY/ TEACHERS

Primary Teachers 1-5th All Subj., Higher Maths & 10th (Incharge), Tutors 1-6.30pm, 2.30-7pm. Quincy School, Sec-8, MVP Colony. ✆ 9440693003, 8121406394.

MEDICAL

గమనిక

విద్యుత్తు పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న, సబ్ స్టేషన్లలో ఖాళీ అవుతున్న పోస్టులన్నీ వెంటనే భర్తీ చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రకటన జారీ చేసి ప్రతిభ, రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేయాలన్నారు.

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ ప్రాంగణం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. మరిన్ని వివరాలకు www.employment.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

బేకరీ దుకాణంలో అగ్నిప్రమాదం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: శారదా నగర్ పోస్టాఫీసు సమీపంలోని బేకరీ దుకాణంలో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 5 గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు దుకాణ యజమాని రుత్తల పాత్రుడు, అగ్నిమాపక అధికారి పీఏ స్వామికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఫ్రిజ్‌లు, టీవీ, తినుబండారాలు, ముడిసరకులు దగ్ధమయ్యాయి. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక అధికారి స్వామి చెప్పారు.

మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



అవగాహన కల్పిస్తు న్న విద్యార్థులు

కశింకోట, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను దూరం చేయాలని విద్యార్థులు ఇంటింటా అవగాహన కల్పించారు. అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో తీడ, చరకాం గ్రామాలలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రచారం చేశారు. తీడ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ కోఆర్డినేటర్ యు.నాగేశ్వరరావు, ఎస్.ఆర్.జమీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో శతశాతం ఫలితాలు సాధించండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ డీఎస్‌డబ్ల్యూఓ బి.రామానందం సూచించారు. అచ్యుతాపురం సమీకృత వసతి గృహాన్ని సోమవారం రాత్రి సందర్శించి రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం ఉదయం అల్పాహారం వడ్డించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ, పదోతరగతి విద్యార్థుల సన్నద్ధతపై ఆరా తీశారు. కష్టపడి చదువుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని పిల్లలకు సూచించారు. వసతి గృహంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వార్డెన్ గిరిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను తెలుసుకుంటున్న డీఎస్‌డబ్ల్యూఓ రామానందం

17 మద్యం సీసాల స్వాధీనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: అక్రమ మద్యం అమ్మకాలపై పోలీసులు కొరడా ఝళిపించారు. అరట్లకోటలోని పాన్‌షాపులో అమ్ముతుండగా 11, మంగవరంలో ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ అప్పన్న తెలిపారు. దాడుల్లో ఎస్సై పురుషోత్తం, ఏఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

చోరీకేసులో నిందితుడి అరెస్టు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: కొప్పాక గ్రామంలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడిని అనకాపల్లి గ్రామీణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ ఏడాది మార్చి నెలలో కొప్పాకలోని ఇంట్లో పరవాడ మండలం కన్నూరు గ్రామానికి చెందిన గేదెల రాజశేఖర్ చోరీకి పాల్పడి బంగారం వస్తువులు కాజేశాడు. నిందితుడిని మంగళవారం అనకాపల్లిలో అరెస్ట్ చేసినట్లు గ్రామీణ సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఇతని నుంచి 17.6 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎలమంచిలి: రేగుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ సుబాన్ (69) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని గ్రామీణ ఎస్సై ఉపేంద్ర చెప్పారు. గత నెల 30న విశాఖ నుంచి రేగుపాలెం భార్యతో కలిసి స్కూటీపై వస్తున్న ఇతను ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో భార్యాభర్తలు గాయపడ్డారన్నారు. వీరిని విశాఖ తరలించగా భర్త సుబాన్ చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై కొట్లాట

ఎలమంచిలి: కొత్తలి గ్రామంలో సోమవారం రాత్రి ఫ్లెక్సీల చించివేశారన్న ఘర్షణ ఇరుపార్టీల మధ్య కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డాడు. ఇతనిని విశాఖ తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ చేపట్టారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	117	115
లైవ్	144	135
డ్రెస్‌డ్	209	240
స్కిన్‌లెస్	238	250

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: రాజు వెడ్స్ రాంబాయి, సత్యనారాయణ స్క్రీన్2: స్కూల్ లైఫ్, పర్తిసాయి: ప్రేమంటే, షిర్డిసాయి: రివాల్వర్ రీటా, రామచంద్ర: జనతాబార్, సత్యనారాయణ స్క్రీన్1: ఆంధ్ర కింగ్ తాలూకా, వెంకటేశ్వర: బిజినెస్ మేన్, అచ్యుతాపురం: ఎస్టీబీఎల్ స్క్రీన్-1 ఆంధ్ర కింగ్ తాలూకా, స్క్రీన్-2: రివాల్వర్ రీటా

సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తూరు (అనకాపల్లి): పట్టణంలోని 82వ వార్డులో మంగళవారం కూటమి నాయకులు పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు. కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, పోలారపు త్రినాథ్, తాడి రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. వార్డులో సమస్యలు తెలుసుకొని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సహకారంతో వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు.

శిథిల భవనం.. బోధన భారం

శిథిల, అసంపూర్తి పాఠశాల భవనాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొంది. భవనాలు సరిగాలేక పరాయిపంచన సైతం ఉపాధ్యాయుల తరగతులు నిర్వహిస్తున్నారు.

రాంబిల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. కొండవారిపాలెం, అప్పన్నపాలెం, పెదయాతపాలెం పాఠశాలలు అంగన్‌వాడీ భవనాల్లో కొనసాగుతున్నాయి. నాడు-నేడు కింద అప్పన్నపాలెంలో ప్రారంభించిన భవనం మధ్యలోనే నిలిచిపోయింది. కొండవారిపాలెం, పెదయాతపాలెం పాఠశాల భవనాల పై కప్పు పెచ్చులు ఊడిపడటంతో అంగన్‌వాడీ కేంద్రానికి ఈ పాఠశాలలను తరలించారు. అయిదు తరగతుల వరకు 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడే అకేంద్రాలకు చెందిన సామగ్రి కూడా ఉండడంతో వీటి నిర్వహణ ఇబ్బందిగా మారింది.

కొండవారిపాలెంలో అంగన్‌వాడీ భవనంలో తరగతులు

విద్యార్థుల బిక్కుబిక్కు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చదువులమ్మ ఒడిలో ప్రమాదం పొంచి ఉంది. పాయకరావుపేట ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిల భవనాలు భయపెడుతున్నాయి. ఇక్కడ గతంలో జూనియర్ కళాశాలను నిర్వహించేవారు. భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉండటంతో నూతన భవనాలను ఆటస్థలం పక్కన నిర్మించారు. దీంతో తరగతుల నిర్వహణ నిలిపివేశారు. ఇక్కడే ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటలు ఆడుతుంటారు. సుమారు 500 మంది విద్యనభ్యసిస్తున్నారు. భవనాలు శిథిలం కావడంతో ఏ క్షణాన కుప్పకూలతాయో తెలియక బిక్కుబిక్కుమంటూ పాఠశాలకు వస్తున్నారు. వీటిని తొలగించాలని అధికారులకు పలుమార్లు అర్జీలు ఇచ్చారు. అయినప్పటికీ భవనాల తొలగించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. లింగాలతోట కాలనీ, రాజానగరం ఆవరణలోని తుపాను రక్షిత భవనాలను సైతం తొలగించాల్సి ఉంది. ఏ ప్రమాదం చోటు చేసుకోకముందే అధికారులు స్పందించాల్సి ఉంది.

పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిల భవనాలు

ఏ క్షణంలో కూలుతుందో..


ఊడిపడుతున్న పెచ్చులు

తుమ్మపాల ఇందిరానగర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుని దయనీయంగా మారింది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి రెండో తరగతి వరకు ముగ్గురు విద్యార్థులు చదువుతున్నారు.. ప్రధానోపాధ్యాయురాలు రోజా రమణి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. భవనం స్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. స్తంభాలు బీటలు వారి ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఇటీవల మొంథా తుపాను ధాటికి పాఠశాల భవనం మరింత దెబ్బతింది. వర్షం పడితే కారిపోతోంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రధానోపాధ్యాయులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, అనకాపల్లి గ్రామీణం

అనకాపల్లిలో మాట్లాడుతున్న విద్యార్థిని

విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ తదితరులు

ఆకట్టుకున్న ప్రసంగం.. అందుకున్న బహుమానం

అనకాపల్లి పట్టణం: పట్టణంలోని హిమశేఖర్ జూనియర్ కళాశాల విద్యార్థులు వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్‌లో వచ్చే మార్పులు' అంశంపై నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో ఆకట్టుకునేలా మాట్లాడారు. వీరిలో ప్రతిభ చూపిన కె.హర్షిణి, ఎం.హేమ, ఎ.నవతేజ్‌కు కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్, సురేష్ బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ జనార్దన్, సౌరబ్, అధ్యాపకులు పూర్ణ, సూర్య పాల్గొన్నారు.

శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలలో..

విద్యార్థులకు బహుమతులు అందజేత

పాయకరావుపేట: శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు, ఈటీవీ' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఎస్.రాజేష్, కె.శృతి, పి.దివ్యశ్రీ బహుమతులు గెలుచుకున్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపల్ వీవీఎస్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌ఛార్జి డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: 'ఈనాడు, ఈటీవీ' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన కె.షారోన్ దివ్య, ఎన్.మహాలక్ష్మి, ఎస్.బాలాజీలకు బహుమతులు దక్కాయి. హెచ్.ఎం. జి.రామారావు, ఆర్.వెంకన్న, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

గుంటపల్లి జడ్పీ హైస్కూల్‌లో..

బహుమతులతో విద్యార్థులు

మలుపుల్లో పొంచి ఉంది ప్రమాదం

పాల్తేరు - ఈదటం ప్రధాన మార్గంలో అత్యంత ప్రమాదకరమైన మలుపు ఉంది. ఈ భారీ మలుపు వద్ద చోదకులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారినపడినట్లే. గతంలో జరిగిన పలు సంఘటనలతో పలువురు వాహనదారులు క్షతగాత్రులయ్యారు. ఈ మలుపులో వాహనాల వేగం అదుపు చేసేలా బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ దారి నుంచే ఈదటం, కుడిపూడి, పాల్మాన్‌పేట తదితర గ్రామాలతోపాటు కాకినాడ, తొండంగి ప్రాంతాలకు అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. – న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

పాల్తేరు సమీపంలో ప్రమాదకర మలుపు

మురుగు పోయే మార్గమేదీ..?

కుమారపురం గ్రామంలో డ్రైనేజీల్లో మురుగు పోయేందుకు వీలుగా నిర్మించిన కల్వర్టు గ్రామస్థులకు శాపంగా మారింది. ఈ కల్వర్టు కాలువకు తక్కువ ఎత్తులో నిర్మించడంతో మురుగు పారడం లేదు. దీంతో ఎగువ ప్రాంతం నుంచి మురుగు చేరి పూడిక పేరుకుపోయి దోమల వ్యాప్తి పెరుగుతున్నాయి. రోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణంలో లోపాల కారణంగా ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు తెలుపుతున్నారు. మురుగు ప్రవహించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. మురుగు నిల్వ కారణంగా దుర్వాసన వస్తోందని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

గ్రామంలో కాలువపై నిర్మించిన కల్వర్టు

వినియోగిస్తే ఎందరికో మేలు...

ఎస్.రాయవరం మండలంలో కొన్నేళ్ల క్రితం వరకు వినియోగించిన భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. దార్లపూడి ఉన్నత పాఠశాల సమీపంలో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని రెండేళ్ల క్రితం మూసివేశారు. అప్పటి నుంచి ఈ భవనాన్ని వినియోగించకపోవడంతో... శిథిలావస్థకు చేరుతోంది. ఇప్పటికే ఆవరణలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయమవుతున్నాయి. ఎస్.రాయవరం సచివాలయం సమీపంలో ఏళ్ల క్రితం దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు ఈ భవనాలపై దృష్టి సారించి, అవసరాలకు వినియోగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎస్.రాయవరం

దార్లపూడి బాలికల వసతిగృహం

గోతులతో ప్రయాణం కష్టం

రహదారి పొడవునా గుంతలతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. పూడిమడక-కొత్తపట్నం రహదారి కుండలమైపోయి పాలెం కొత్తపట్నం నుంచి వెంకయ్యపాలెం వరకు సుమారు 2.5 కిలోమీటర్ల రహదారి గోతులమయంగా మారింది. ఇదే మార్గంలో గజిరెడ్డిపాలెం, లోవపాలెం గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి పొడవునా గుంతలతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. రహదారిని అభివృద్ధి చేసి రాకపోకలు సజావుగా సాగేలా చొరవ తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, రాంబిల్లి

రైతుబజార్ స్థలంలో ఆవాసం

ఎలమంచిలి రైతుబజార్ స్థలం పందులకు నిలయంగా మారింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీపంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడికి రైతులు కూరగాయలు తెచ్చుకుని విక్రయించుకునేవారు. వినియోగదారులకు తక్కువ ధరకు దొరికేవి. రైతుబజారు ఎత్తివేయడంతో ఈ స్థలంలో తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతుబజారు పునరుద్ధరణకు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎలమంచిలి గ్రామీణం

విద్యుత్తు వినియోగంపై అప్రమత్తం

మునగపాక: విద్యుత్తు వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని ఏఈ జగదీష్ కోరారు. మడకపాలెంలో మంగళవారం వినియోగదారులకు అవగాహన కల్పించారు. సర్పంచి సత్యవతి పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

నేడు హోంమంత్రి పర్యటన

ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం గుడివాడలో బుధవారం హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారు. ఇక్కడి రైతులతో ఉదయం 10 గంటలకు ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు. నక్కపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రజాదర్బార్ నిర్వహిస్తారని పీఏలు ప్రకటనలో తెలిపారు.

దళిత నాయకుడు ఆనందరావు మృతి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడకకు చెందిన దళిత నాయకుడు రేవిడి ఆనందరావు (53) గుండెపోటుకు గురై మంగళవారం మృతిచెందారు. సోమవారం రాత్రి ఇంటి వద్ద గుండెపోటుకు గురికాగా విశాఖలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా ఉపయోగంలేకపోయింది.

తక్షణమే పశువైద్యాధికారిని నియమిస్తాం

మునగపాక, న్యూస్‌టుడే: తోటాడ పశువైద్యశాలకు తక్షణమే వైద్యాధికారిని నియమిస్తామని జిల్లా అధికారి రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఈ పోస్టు భర్తీచేయక పశువులకు వైద్యసేవలందడంలేదని ఈ ప్రాంత పాడిరైతులు కోరిబిల్లి చంద్రశేఖర్, వెంకటి, కొండయ్య తదితరులు ఇటీవల స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తోటాడ వచ్చి రైతులతో మాట్లాడారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దిబ్బపాలెం సెజ్‌కాలనీ, జంగుళూరు, యర్రవరం, మల్లవరం, ఉప్పవరం, ఎం.జగన్నాథపురం, నరేంద్రపురం గ్రామాలకు బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం

నక్కపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉందని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద నియోజకవర్గంలోని మత్స్యకారులకు రాయితీపై మంజూరైన బోటు ఇంజిన్లను పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా అధికారి విజయ మంగళవారం ఏర్పాటు చేశారు. ఇక్కడకు నాలుగు మండలాల తెదేపా నాయకులు విచ్చేశారు. కార్యక్రమంలో గింజాల లక్ష్మణరావు, దేవర సత్యనారాయణ, పెదిరెడ్డి చిట్టిబాబు, విల్లియం రెడ్డి, కోసూ శ్రీకాంత్, చింతలపు ప్రదీప్, యాళ్ల వరహాలు, అమలకంటి అబద్ధం, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంజిన్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

భూసార పరీక్షలతో మేలు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: భూమిలో ఉన్న పోషకాలు, సారం, లోపాలు గుర్తించడానికి భూసార పరీక్షలు మేలు చేస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి తెలిపారు. తగరంపూడిలో మంగళవారం రైతులకు భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్పొరేట్‌కు దీటుగా సహకార బ్యాంకులు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా దేశంలో మొదటి స్థానంలో నిలపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సొసైటీలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కశింకోటలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పర్సన్ ఇన్‌ఛార్జి సిదిరెడ్డి శ్రీనివాసరావు, డైరెక్టర్లు శిష్టి అప్పారావు, గండిబోయిన కాశీరావులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని సత్కరించారు. ప్రజలు, ఖాతాదారుల సేవల కోసం కశింకోట పీఏసీఎస్‌లో సీఎస్‌సీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్పొరేషన్ ఛైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, మండల తెదేపా అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే కొణతాల, తెదేపా నేత పీలా

అనకాపల్లి, లక్ష్మీదేవిపేట (అనకాపల్లి): పట్టణంలోని జనసేన కార్యాలయంలో బొడ్డేడ ఆదిబాబుకు రూ.4.97 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అందజేశారు జీవీఎంసీ భవనంలో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. పట్టణంలోకి ప్రవేశించే జలగలమదుం, పూడిమడక కూడలిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నరేంద్రపురంలో నూకాలమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ సుందరపు సతీష్‌కుమార్, ఎంపీపీ కోన సంధ్య, బుజ్జి, మళ్ల కూసరి సర్పంచి పిన్నంరాజు వాసు, పిన్నంరాజు రవీంద్రరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

గ్రామీణ యువజన మందిరానికి రూ.లక్ష అందజేత

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక గ్రామీణ యువజన మందిరానికి ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ చెక్కును మంగళవారం మందిర అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి శ్రీకాంత్, సూర్యచంద్రరామారావుకు అందజేశారు. నాయకులు ఆడారి గంగమహేష్, మళ్ల రామజగన్నాథం, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

కమిటి సభ్యులకు చెక్కును అందజేస్తున్న ప్రసాదు

ఏఎంఏఎల్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తాం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో 1960-63 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల ప్రతినిధులు సందర్శించారు. వారిలో ఒకరైన దూళిపాల రామ జోగారావు రూ. 10 వేల చెక్కును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబుకు అందజేశారు. పర్యవేక్షకురాలు పెంటకోట అనూరాధ, పీడీ డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐగా పదోన్నతి

అనకాపల్లి: అనకాపల్లి జోన్‌లో ట్యాక్స్ కలెక్టరుగా పనిచేస్తున్న ఉగ్గిన శ్రీనివాసరావుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా మంగళవారం పదోన్నతి కల్పించారు. అనకాపల్లి జోన్‌లో ఇరువురు ఆర్ఐలకు ఒక్కరే ఉన్నారు. రెండో స్థానంలో శ్రీనివాసరావును నియమించారు.

విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో మంగళవారం విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా ఎన్టీఆర్ క్రీడామైదానంలో దివ్యాంగులకు ట్రై సైకిల్‌రన్, క్యారమ్స్ పోటీలు జరిగాయి. పోటీలో ప్రతిభ చూపిన వారికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి పూజారి శైలజ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ప్రభుత్వ భూమిని కాపాడాలని దీక్షలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పెదపల్లి సమీపాన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామ యువకులు చేపట్టిన దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, పలువురు భాజపా నాయకులు శిబిరంలో కూర్చుని దీక్ష చేస్తున్న వారికి మద్దతు ఇచ్చారు.

సీఐటీయూ మహాసభలకు విరాళం

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభలకు అచ్యుతాపురం సెజ్‌లోని ముఠా కార్మికులు విరాళం అందించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రొంగలి రాముకు ఈ నగదు అందించారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్‌లో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తనతో మెలగాలని సెంటర్ ప్రతినిధి మంజులావాణి, పట్టణ ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750 | ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి/ పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ ఆలయ వీధి, జాతీయ రహదారిలో పూర్తిస్థాయిలో వెలగడం లేదు. – బుద్ధ ప్రసాద్, రామప్రసాద్, అనకాపల్లి, ✓: అన్ని దీపాలు వెలిగిస్తాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: మల్లవరం నుంచి నరేంద్రపురం, మునగపాక మండలంలోని చెర్లోపాలెం, మడకపాలెం వరకు ఉన్న రోడ్డులో విద్యుత్తు దీపాలు లేవు. – రమేష్, నరేంద్రపురం, ✓: పంచాయతీ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తా. – భానుప్రకాశ్, ఏఈ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: సత్యవరంలోని తాగునీళ్ల ట్యాంకు రోడులో బహిరంగ మల విసర్జన చేస్తున్నారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో దుర్వాసన వచ్చి ఇబ్బంది పడుతున్నాం. – గ్రామస్థుడు, సత్యవరం, ✓: బహిరంగ మల విసర్జన చేయకుండా క్లాప్‌మిత్రను కాపలా ఉంచి పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం. – కె.డేవిడ్, డిప్యూటీ ఎంపీడీఓ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని రాజుగారిబీడులోని గ్రామ సచివాలయం పక్క వీధి రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. ఈ రోడ్డులో కొంత భాగం మాత్రమే సిమెంట్ రోడ్డు వేశారు. మిగతాది వదిలేశారు. – పి.శ్రీను, స్థానికుడు, ✓: రోడ్డుకు కొత్తరూపు తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సమస్య పరిష్కరిస్తాం. – కె.డేవిడ్, ఈవో

ఎస్.రాయవరం: ?: ఎస్.రాయవరం నుంచి వెంకటాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై కర్రివానిపాలెం కల్వర్టు మూడేళ్ల క్రితం కుంగిపోయింది. అప్పటి నుంచి అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. – పోతు చిట్టిబాబు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కర్రివానిపాలెం, ✓: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. – సత్యవేణి, ఏఈ, ఆర్అండ్‌బీ

శ్రద్ధాంజలి

అనురాగం, ఆప్యాయతలు మాకు పంచి మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసి ఆకస్మికంగా మానుండి దూరమై దైవ సన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. శ్రీమతి బొడ్డేడ సుబ్బలక్ష్మి గారు
జననం: 23-11-1951 మరణం: 19-11-2025
భర్త: బొడ్డేడ అచ్చియ్యనాయుడు
కుమారులు: బొడ్డేడ పద్మకృష్ణ, బొడ్డేడ శ్యామసుందర్

WALK IN INTERVIEW on 3rd & 4th Dec. 2025
Amul THE TASTE OF INDIA
• స్టోర్స్ అసిస్టెంట్ Qlf: Any Degree with computer knowledge
• ప్యాకింగ్ ఆపరేటర్ Qlf: Electrical ITI
• CIP ఆపరేటర్ Qlf: Elec. ITI / Fitter
• రిఫ్రిజిరేషన్ ఆపరేటర్ Qlf: Refregeration ITI / Elec. ITI
• Experience in similar field is an added advantage • Freshers also encouraged
SUPRAJA DAIRY PVT. LTD.
Pudimadaka Road, Atchutapuram (V), Atchutapuram (M), Anakapalli Dt.
76192 57024
kumaraswamy@suprajadairy.in

అనకాపల్లి శ్రీ గౌరి PACS కమిటీ
ప్రమాణ స్వీకార మహోత్సవ ఆహ్వానం
శ్రీ కర్రి మహాలక్ష్మినాయుడు — శ్రీ గౌరి PACS ఛైర్మన్
శ్రీ యల్లపు శ్రీనివాసరావు — శ్రీ గౌరి PACS డైరెక్టర్
శ్రీ కాండ్రేగుల చిన్న — శ్రీ గౌరి PACS డైరెక్టర్
నేడు ఉ॥ 10 గంటలకు అనకాపల్లి శ్రీ గౌరి PACS కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరుగును.

ప్రమాణ స్వీకార శుభాకాంక్షలు
అనకాపల్లి గౌరి PACS ఛైర్మన్‌గా శ్రీ కర్రి మహాలక్ష్మినాయుడు గారు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ కర్రి మహాలక్ష్మినాయుడు గారు
కాండ్రేగుల గోపికృష్ణ

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** రివాల్వర్ రీటా, జనతా బార్, స్కూల్ లైఫ్, రాజు వెడ్స్ రాంబాయి, **ఆడి 2:** ది గర్ల్ ఫ్రెండ్, రాజు వెడ్స్ రాంబాయి, నాట్ ఆల్ మూవీస్ ఆర్ ది సేమ్ డ్యూయల్ **ఆడి 3:** ఆంధ్రా కింగ్ తాలుకా, **ఆడి 4:** జూటోపియా, ఆంధ్రా కింగ్ తాలుకా, **బంగార్రాజు:** ప్రీ వెడ్డింగ్‌షో, **రాజు:** జింగిరి, **చోడవరం:** శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా **సాయిలక్ష్మి:** శివ, **పూర్ణా:** రాజు వెడ్స్ రాంబాయి

వడ్డాది కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం 5న

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం 3.0) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ చిన్నారావు తెలిపారు. ఈ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులను మంగళవారం కలిసి ఆహ్వానపత్రాలు అందజేశారు.

సీఎం సహాయ నిధి అందజేత

రోలుగుంట, న్యూస్‌టుడే: బలిజిపాలెం గ్రామానికి చెందిన గోకాడ రాజబాబు అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు మంగళవారం అందజేశారు. జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు బలిజి మహారాజు, నాయకులు సన్యాసిరావు, బలిజి కోటి, కేశరపూడి శివాజీ, పరవాడ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న రాజు

మిత్రుడికి అండగా...

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: సీతయ్యపేటలో కొందరు యువకులు మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కాండ్రకోటశ్రీను తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అతని కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. విషయం తెలుసుకున్న యువసేన సభ్యులు ముందుకు వచ్చి తమవంతు సాయం చేశారు. గ్రామానికి చెందిన సీఎం శివ, వై.శ్రీను, టి.రాజు, ఎం.సతీష్, వి.లోవరాజు తదితరులు కలిసి రూ. 22 వేల మొత్తాన్ని శ్రీను కుటుంబానికి అందజేశారు.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న యువకులు

శుద్ధజల కేంద్రాల ప్రారంభమెప్పుడో..!

దేవరాపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులకు శుద్ధజలాన్ని మాత్రమే అందించాలంటూ ప్రభుత్వం పదే.. పదే చెప్తోంది. ఈ మాట మాత్రం అధికారుల చెవికి ఎక్కడం లేదనిపిస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం పాఠశాలలకు పంపించిన శుద్ధ జల కేంద్రాలు (ఆర్ఓ ప్లాంట్లు) నేటికి ప్రారంభించలేదు. దీంతో అవి ఓ మూలన పడి ఉన్నాయి. రూ. లక్షలు వెచ్చించి అమర్చిన వీటి దిక్కు చూసే వారేలేరు. ఆర్వో ప్లాంట్లు ఉన్నా వాటిని నెలల తరబడి ప్రారంభించక పోవడంతో పంచాయతీ కుళాయి నీళ్ళు, ఇతర వనరుల ద్వారా వచ్చే నీళ్ళ సహా ఇంటి దగ్గర నుంచి తెచ్చుకున్న నీళ్లే పిల్లలు తాగుతున్నారు.

దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచెయ్యని పాత ఆర్ఓ ప్లాంటు

▶ సుమారు 150 మంది విద్యార్థులు చదువుతున్న దేవరాపల్లి ప్రభుత్వ కళాశాలలో వైకాపా పాలనలో కొత్త ఆర్వో ప్లాంటుని అమర్చారు. నాటి నుంచి నేటి వరకు దీన్ని వినియోగించలేదు. పిల్లలు తాగడానికి నీళ్ల లేక పోవడంతో గ్రామ పంచాయతీ కొళాయి ద్వారా ట్యాంకులో నింపిన నీళ్లను పిల్లలు తాగుతున్నారు. ఇదే ప్రాంగణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 350 మంది వరకు బాల, బాలికలు చదువుతున్నారు.

▶ గతంలో ఈ పాఠశాలలో అమర్చిన శుద్ధజల కేంద్రం మూలనపడింది. మళ్లీ కొత్తది తెచ్చారు. దానిని అమర్చకుండా అలాగే వదిలేశారు. దీంతో పిల్లలతో ట్యాంకు నుంచి వస్తున్న నీటిని మంచినీళ్లుగా వాడుతున్నారు. ఇదే పరిస్థితి చాలా పాఠశాలల్లో ఉంది. అధికారులు స్పందించి ప్రతీ శుద్ధజల కేంద్రం పనిచేసే విధంగా చర్యలు తీసుకుని పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిభ చూపి .. ప్రశంసలు పొంది

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ ప్రసంగాల్లో ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక అమరావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన ప్రతిభా పాటవ పోటీల్లో ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై మాట్లాడారు. సెల్‌ఫోన్లను పక్కన పెడితే చదువులో బాగా రాణిస్తారని పేర్కొన్నారు. స్కూల్ డైరెక్టర్ యు.కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఉపాధ్యాయిని ఎస్.శివజ్యోతి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన పి.మోక్షిత్, ఎస్.శ్రీవల్లీ, కె.శర్వాణికి హెచ్ఎం ఎం.రామకృష్ణ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రామకృష్ణ

మాట్లాడుతున్న విద్యార్థిని

కాయకల్ప బృందం సందర్శన

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిని కాయకల్ప జిల్లా బృందం మంగళవారం సందర్శించింది. విజయనగరానికి చెందిన వైద్యుడు చైతన్య, నాణ్యత పరిశీలన సభ్యుడు శ్రీనివాస్ తదితరులు వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడారు. ప్రసూతి, అత్యవసర వైద్య సేవల విభాగాలు, ప్రయోగశాల, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుధాశారద, వైద్యులతో సమావేశమయ్యారు. ఈ బృందం నివేదిక ఇచ్చాక రాష్ట్ర బృందం పరిశీలనకు రానుంది.

ఆసుపత్రి ఆవరణలో ఇంకుడు గుంత పరిశీలిస్తున్న వైద్యులు

బురద రోడ్డుతో బిక్కుబిక్కు

కోనాం - బీఎన్ రోడ్డులోని సిరిజాం గదబూరు సమీపంలో రోడ్డుపై బురద ప్రమాదకరంగా మారింది. మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నప్పుడు తారురోడ్డుపై కుప్పలుగా మట్టి పడేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డంతా పూర్తిగా బురదగా మారింది. తారురోడ్డంతా చిత్తడిగా మారడంతో వాహనాలు అదుపుతప్పుడుతున్నాయి. ఈ సమస్యపై ఇన్‌ఛార్జి ఆర్అండ్‌బీ ఏఈ సాయిశ్రీనివాస్‌ను సంప్రదించగా పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. — చీడికాడ, న్యూస్‌టుడే

కార్యాలయాలకు కాలిబాటేనా?

నాతవరం, న్యూస్‌టుడే: ప్రజాసౌకర్యం కోసం నిర్మించిన భవనాలకు చేరేందుకు సరైన దారి లేక సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. పెద గొలుగొండపేట సచివాలయం పరిధిలో రైతు సేవా, ఆరోగ్య కేంద్రాలను గత ప్రభుత్వం నిర్మించింది. వీటికి చేరేందుకు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించలేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాల్సిన అవసరముంది.

ఆటస్థలంలో అవరోధాలు

నాతవరం మండలం మల్లుభూపాలపట్నం జడ్పీ పాఠశాల ఆటస్థలంలో విద్యుత్తు స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. పంచాయతీ నుంచి పాఠశాల వరకు సుమారు 70 సెంట్ల స్థలాన్ని ఆటల నిర్వహణకు కేటాయించి ప్రహరీ నిర్మించారు. బాల బాలికలకు క్రీడా పోటీలు ఇక్కడే నిర్వహిస్తున్నారు. మధ్యలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. — న్యూస్‌టుడే, నాతవరం

కార్పొరేట్‌కు దీటుగా సహకార బ్యాంకులు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా దేశంలో మొదటి స్థానంలో నిలపడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సొసైటీలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కశింకోటలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పర్సన్ ఇన్‌ఛార్జి సిదిరెడ్డి శ్రీనివాసరావు, డైరెక్టర్లు శిష్టి అప్పారావు, గండిబోయిన కాశీరావులతో ప్రమాణ స్వీకారం చేయించి వారిని సత్కరించారు. కార్పొరేషన్ ఛైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, మండల తెదేపా అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నెల రోజులుగా బురద నీరే!

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎం.కొత్తపల్లిలో గ్రామస్థులు నెలరోజుల నుంచి బురద నీరే దిక్కవుతోంది. ఇక్కడ జల జీవన్ మిషన్ కింద పది వేల లీటర్ల తాగునీటి పథకంతోపాటు అవసరమైన చోట తాగునీటి పైపులు ఏర్పాటు చేశారు. అయితే నాణ్యతాలోపం కారణంగా పైపులు విరిగిపోయి ఎక్కడపడితే అక్కడ నీరు వృథా అవుతోంది. బురదనీరు కలిసిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

'అధికారుల తీరు అనుమానాస్పదం'

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖకు చెందిన 30 ఎకరాల్లో రెండు నెలలుగా సౌర ఫలకలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలు తావిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. వైకాపా నాయకులతో కలిసి మంగళవారం ఈ భూములను పరిశీలించారు. ఇక్కడ రైతులు కాయగూరలు పండించేవారన్నారు. ఇప్పుడా భూములను సౌర విద్యుత్తు ప్రాజెక్టు ఏర్పాటుకు చదును చేస్తున్నారన్నారు.

ఏటా రూ. 9.3 లక్షల చెల్లించేలా లీజు

బలిఘట్టంలోని దేవాదాయ శాఖకు చెందిన 30 ఎకరాల భూమిని మెగా కంపెనీ ఏటా రూ. 9.3 లక్షలు చెల్లించే ఒప్పందంపై లీజుకు తీసుకుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తెలిపారు. ఏటా రెండు శాతం లీజు మొత్తం పెరుగుతుందన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవే భూములను రూ.35 వేల లీజుకు ఇచ్చారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆరోపణలో వాస్తవం లేదన్నారు.

అ వీ ఇ వీ

పంచాయతీ విస్తరణ అధికారిగా గౌరీశంకర్

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ విస్తరణ అధికారిగా పి.గౌరీశంకర్ మంగళవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌ పని చేస్తూ పదోన్నతిపై మండల పంచాయతీ విస్తరణ అధికారిగా ఇక్కడికి వచ్చారు.

వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.1.94కోట్లతో నిర్మించిన కేజీబీవీ టైప్-4 బాలికల వసతిగృహంలో తొమ్మిది నుంచి 12 తరగతులలో విద్యార్థులను చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అవసరమైన సిబ్బందిని నియమించారు. ఈమేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు. తొమ్మిది నుంచి ఇంటరు వరకు చదవదలచుకున్న బాలికలు ఇప్పటి నుంచే దరఖాస్తులు తమకు అందివ్వాలన్నారు. పూర్తి వివరాలకు తనను సంప్రదించాలన్నారు. ఈ వసతిగృహంలో బాలికలకు అన్ని వసతులను సమకూర్చి నిర్మించారు.

నేటి నుంచి చీడికాడలో ధాన్యం కొనుగోలు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడలో బుధవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రం అందుబాటులోకి రానుంది. ఈ కేంద్రాన్ని ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. అనంతరం 'రైతున్నా.. మీకోసం' కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఖండివరంలో కంటి వైద్య శిబిరం నేడు

చీడికాడ, న్యూస్‌టుడే: జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం చీడికాడ మండలం ఖండివరంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక తులసీ కల్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కంటి సమస్యలున్న సమీప గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల సంఘం నాయకులు కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ మహాసభలు ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4 వరకు విశాఖలో నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను మంగళవారం చోడవరంలో ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు నాయుడు, సంతోషి, లక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

చీడికాడ, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న మద్యం మంగళవారం చీడికాడ పోలీసులకు పట్టుబడింది. వాహనాలు తనిఖీ చేస్తుండగా పిల్లా జగదీష్ కోనాంకు మద్యం తరలిస్తుండగా పది సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సతీష్ చెప్పారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థుల విజయానికి ప్రణాళిక

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సంకల్ప్-2026 ప్రణాళిక రూపొందించినట్లు ప్రిన్సిపల్ ఎల్.సత్యవతి చెప్పారు. విద్యార్థులను 'ఎ' గ్రేడ్ సాధించే ప్రతిభ స్థాయి విద్యార్థులుగా తయారుచేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. దీనిలో 50 రోజుల కార్యాచరణ ప్రణాళిక తయారు చేశామన్నారు. ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపల్ సత్యవతి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ షేక్ [illegible] అందించారు.

కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిందితురాలిపై కఠిన చర్యలకు డిమాండ్

కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న బాలికలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నెల్లూరు ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్యను ఖండిస్తూ ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. పాల్ఘాట్ కూడలి సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా నాయకులు గౌరి, సూర్యప్రభ మాట్లాడుతూ.. నిందితురాలు కామాక్షిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి వ్యాపారులకు అడ్డుగా ఉన్నాడనే పెంచలయ్యను హతమార్చారని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు కె.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యకేంద్రాల్లో మూగ రోదన

కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గంలో పశువుల ఆసుపత్రుల పరిస్థితి దయనీయంగా మారింది. దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో ఎక్కడ చూసినా సరైన వసతులు లేవు. భవనాలూ లేవు. ఉన్నవి మేడిపండు [illegible]

■ నిధులు మరికొన్ని మంజూరుచేస్తేనే ఇది పూర్తవుతుంది. ప్రస్తుతం దీనిని పరాయిపంచన కొనసాగిస్తున్నారు. దేవరాపల్లి, ఎం.అలమండ పశువుల ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరాయి. [illegible] మామిడిపల్లి పశువుల ఆసుపత్రి భవనం [illegible] వేసవిలో [illegible] పశుఆరోగ్య ఉపకేంద్రం సొంతభవనం ఉన్నా మరమ్మతులు చేయాల్సి ఉంది.

■ చౌడువాడ పశువుల ఆసుపత్రిని చూస్తే దీనికన్నా పశువులపాకే నయం అనిపిస్తుంది. లోపల అడుగుపెడితే సిబ్బంది వైద్యాధికారి తప్ప రైతులు కూర్చోవడానికి వసతి లేదు. శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. కొరువాడ పశువుల ఆసుపత్రికి సొంత భవనం లేదు. దీనికి మంజూరైన నిధులతో నిర్మించిన భవనం అసంపూర్తిగా ఉండిపోయింది.

శిథిలావస్థకు చేరిన చౌడువాడ ఆసుపత్రి

■ దేవరాపల్లి, ఎం.అలమండ, చౌడువాడల్లోని పశు ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలను సంబంధిత అధికారుల ద్వారా ఇదివరకే పంపాం. మామిడిపల్లి భవనం మరమ్మతులు, కొరువాడలో అసంపూర్తిగా ఉన్న భవనం పూర్తి చేసేందుకు ప్రతిపాదించాం. నిధులు మంజూరైతే పనులు చేస్తాం. — దినేశ్‌కుమార్, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ, కె.కోటపాడు.

సంప్రదాయ వృత్తిదారులకు ప్రోత్సాహం

చోడవరం, న్యూస్‌టుడే: సంప్రదాయ చేతివృత్తిదారులను చిన్న వ్యాపారులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం ఎంతోగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. చోడవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రధాన మంత్రి విశ్వకర్మ లబ్దిదారులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారులకు మార్గదర్శకత్వం, సాంకేతిక సాయం తదితర అంశాలపై అవగాహనకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ(విశాఖ) అసిస్టెంట్ డైరెక్టర్ అప్పికొండ శ్రీను, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు పీకేపీ ప్రసాదు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరు సత్యనారాయణ, జిల్లా చిన్న అభివృద్ధి అధికారి గోవిందరాజు, శృతి, జగదీష్, పీఎం విశ్వకర్మ అధ్యక్షుడు దిమిల్లి రాజేష్‌లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ఇళ్ల పన్నుల చెల్లింపు.. ఇక ఆన్‌లైన్‌లో...

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఇళ్ల పన్నులను ఇకపై అంతా ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని ఒంటర్లపాలెంలో మంగళవారం ఇళ్ల పన్నులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో చెల్లింపులు చాలా సులభంగా జరుగుతాయన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఇంటిపై పన్ను ఎంత ఉందో తెలుసుందని, దాని ప్రకారం కట్టాల్సి వస్తుందన్నారు. గ్రామపెద్దలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు అభ్యసన పుస్తకాలు

పుస్తకాలు అందజేస్తున్న సూర్యచంద్ర

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అభ్యసన పుస్తకాలు పంపిణీ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర పుస్తకాలను సమకూర్చారు. నాయకులు సురేష్, హరినాథ్, మంగ, రాజు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండల తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగయ్యపేట సర్పంచి కర్రి పుష్ప నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం నుంచి ఆమెకు నియామక పత్రాలను పంపించారు. కాగా తనకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని పుష్ప దంపతులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు ఆమెను ఎమ్మెల్యే అభినందించారు. తన పట్ల మండల తెదేపా నాయకులతోపాటు పార్టీ అధిష్ఠానం ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పార్టీ మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన పుష్ప

బాల్యవివాహాల సంస్కృతి సరికాదు

రోలుగుంట, న్యూస్‌టుడే: వైద్యరంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నా నేటికీ కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాల సంస్కృతి కొనసాగుతూనే ఉందని డిప్యూటీ డీఎంహెచ్ఓ. కె.వీరజ్యోతి పేర్కొన్నారు. ప్రధానంగా వీటిపైనే చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో మంగళవారం 'ఆశా డే' ని పురస్కరించుకుని కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వీరజ్యోతి పాల్గొన్నారు. ప్రధానంగా తల్లిపాల ప్రాధాన్యం, తల్లీబిడ్డల ఆరోగ్యం, పోలియో, క్యాన్సర్ తదితర కేసులను గుర్తించడంలో అవసరమైన సూచనలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మజీదాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ వీరజ్యోతి

సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమం ద్వారా విద్యార్థులు సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గాంధీగ్రామంలో ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయభావం, సేవాగుణం, మానవతాదృక్పథం అలవర్చుకుంటే వ్యక్తిత్వ వికాసంతో బయటకు వెళ్తారన్నారు. సర్పంచి గాడి అప్పారావు, విశ్రాంత అధ్యాపకుడు దేముడు, వైస్ ప్రిన్సిపల్ సత్యవతి, అధ్యాపకులు రత్నభారతి, మాల్యాద్రి, బిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు

చీడికాడ, న్యూస్‌టుడే: వరికి పొట్టదశలో ఆశించే రెల్లరాల్చు పురుగు, మానిపండు తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. సిరిజాంలో వరి పొలాలను క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల బృందం పరిశీలించింది. వరిలో మానిపండు తెగులు రాకుండా నివారించడానికి పొట్ట దశలోనే చర్యలు చేపట్టాలన్నారు. ప్రాపికొనోజోల్ ఒక మిల్లీ లీటరు.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రెల్లరాల్చు పురుగు ఆర్జీఎల్ రకానికి వ్యాపిస్తుందన్నారు. నివారణకు ఫిప్రోనిల్ రెండు మిల్లీ లీటర్లు.. లేకుంటే క్లోరిపైరిపాస్ 1.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కేవీకే సమన్వయకర్త రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు సత్తిబాబు, సౌజన్య, కిశోర్ కుమార్, చీడికాడ మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి పాల్గొన్నారు.

సిరిజాంలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, కొండపాలెంలో ఏర్పాటుచేసిన తాగునీటి పథకం వద్ద వృథా నీరు పోయేందుకు వీలుగా కాలువలను ఏర్పాటు చేయలేదు. నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. — **అప్పలనాయుడు, కొండపాలెం**, ✓: సమస్య పరిష్కారానికి తాత్కాలిక చర్యలు చేపట్టాం. వృథా నీరు పోయేందుకు వీలుగా కాలువ నిర్మిస్తాం. — **లక్ష్మి, సర్పంచి**

ఎట్టకేలకు తుప్పల తొలగింపు

స్పందనకు వందనం

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ శివారు ఉప్పరగూడెం కూడలి వద్ద ఉన్న మండల గృహనిర్మాణ సంస్థ కార్యాలయానికి వెళ్లే మార్గం, ప్రాంగణంలో ఎట్టకేలకు తుప్పలను తొలగించారు. ఇక్కడ తుప్పలు దట్టంగా పెరగడంతో 'గృహనిర్మాణ కార్యాలయానికి దారేది' శీర్షికన 'ఈనాడు'లో గతనెల 12న వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గృహ నిర్మాణ సంస్థ అధికారులు తుప్పలు తొలగించి, శుభ్రం చేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ చోడవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో..

EP 3/2024 OS 148/2020

కురచా వెంకటలక్ష్మి .....D.Hr

సాలాపు చినతల్లి Etc ....JDRs

ప్రజలు యావన్మందికీ యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై JDRs చెందిన యీ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని పై కోర్టులో 2025వ సంవత్సరం డిసెంబరు నెల 22వ తేదీన ఉదయం గం॥ 10.30ని॥ల నుండి సాయంత్రం గం॥ 5.00ని॥ల మధ్యలో పై నెంబరు డిక్రీ బాకీ రాబట్టుకోరి వేలం వేయబడును. కావున సదరు వేలంపాటలో పాల్గొనదలచినవారు పైన తెలిపిన తేదీన పై కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరయి వేలంపాటలో పాల్గొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

District : Anakapalli, **Mandal** : Chodavaram
Village: Jannavaram

ITEM No.1: Dry Land Comprised in S.No. 20-1-A-2 in an extent Ac 0.10 Cents and is bounded by:
East: Tank, **South:** Tank, **West:** Dry Land of Salapu Venkata Appala Naidu, **North:** Dry Land of Salapu Eswara Rao

ITEM No.2: Dry Land Comprised in S.No.133-17-A in an extent of AC 0.20 Cents and is bounded by:
East: Yetikaluva, **South:** Dry Land of Salapu Venkata Appalanaidu, **West:** Rainfed Channel; **North:** Dry Land of Salapu NarasimhaMurthy.

ITEM No.3: Dry Land Comprised in S.No.108-6-A in an extent AC. 0.10 Cents is bounded by:
East: YetiKaluva, **South:** Dry Land of Salapu Venkata Appala Naidu, **West:** Rainfed Channel, **North:** Dry Land of Salapu Ramunaidu.

గమనిక: పై వేలంపాటకి సంబంధించి ఎవ్వరికైననూ ఎటువంటి సందేహములు ఉన్నయెడల పై కోర్టులో గాని D.Hr తరపు అడ్వకేట్ గారిని సంప్రదించవలెను.

D.Hr తరపు న్యాయవాది
KOTAKALA LAKSHMANA RAO
Advocate. Cell: 9949931167
Chodavaram

చోడవరం
తేది: 21-11-2025

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ థ్రిల్స్-1
ఆంధ్ర కింగ్ తాలూకా
థ్రిల్స్-2 - రాజు వెడ్స్ రాంబాయి

నేడు హనుమత్ వ్రతం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్టుడే: జీవీఎంసీ 79వవార్డుపరిధి లంకెలపాలెం కూడలిలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశినాడు నిర్వహించే ఈ వ్రతాన్ని 12ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్శర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎఫ్ఎల్ఎన్ సర్వేపై శిక్షణ

సబ్బవరం, న్యూస్టుడే: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఏవిధంగా ఉన్నాయో అంచనా వేసేందుకు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) సర్వేకు ఆదేశించింది. ఇప్పటికే మండలంలో 60శాతం సర్వేను సీఆర్పీలు నిర్వహించారు. మిగిలిన 40శాతం వెంటనే పూర్తి చేయాల్సి ఉన్నందున వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను పరిశీలించాల్సి ఉంటుందని ఎంఈవో ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం వారికి శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 5వతేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎంఈవో రవీంద్రబాబు, ఆర్పీ దుర్గాప్రసాద్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్టుడే: ?: అప్పన్నపాలెం-భరత్నగర్ రహదారిలో భూగర్భ డ్రైనేజీ సంప్ వద్ద గోతులు ప్రమాదకరంగా మారాయి. -త్రినాథరావు, అప్పన్నపాలెం. ✓: భూగర్భ డ్రైనేజీ విభాగం అధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటాం. -శంకర్రావు, ఇన్ఛార్జి జోనల్ కమిషనర్, జోన్-8

సబ్బవరం, న్యూస్టుడే: ?: సబ్బవరం పాత సినిమాహాలు వినాయక కాలనీ సమీప గెడ్డలో మురుగు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. -కె.రామారావు, సబ్బవరం. ✓: ఈ విషయాన్ని మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించి చర్యలు తీసుకుంటాం. -వై.రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం

?: సబ్బవరం పీహెచ్సీకి వెళ్లే రహదారిపై గోతులు ఏర్పడి రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. -మామిడి శంకరరావు, బల్లిపారం. ✓: రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. -పి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

పరవాడ, న్యూస్టుడే: ?: పరవాడ గొర్లె వానిపాలెం జేఎన్ఎన్యూఆర్ఎం కాలనీ వద్ద బస్షెల్టర్ లేక అవస్థలు పడుతున్నాం. -రమేష్, స్థానికుడు ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. -రమేష్నాయుడు, ఎంపీడీవో, పరవాడ

?: పరవాడ మండలం వెంకటపతిపాలెం(?)లోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. -నాయుడు, స్థానికుడు ✓: సంబంధిత భవనానికి మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తాం. -త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి, నాయుడుపాలెం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వెలిగిన వీధి దీపాలు

పెందుర్తి, న్యూస్టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని దుర్గా ఆదర్శనగర్లో కొన్నాళ్లుగా వీధిదీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలువురు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వార్డు వీధిదీపాల నిర్వహణ ఏఈ సోమేశ్ స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మెగా వేదిక.. విద్యా వేడుక..

పాఠశాలల్లో పీటీఎం సమావేశాలకు ఏర్పాట్లు

తోరణాలతో తీర్చిదిద్దిన బాపడుపాలెం పాఠశాల

పరవాడ, న్యూస్టుడే: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒక వేదికపైకి తీసుకొచ్చి వారి మధ్య స్నేహపూర్వక బంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేసేందుకు మెగా పీటీఎం-3 (పేరెంట్ టీచర్ మీటింగ్) ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు పీటీఎంల కంటే ఈసారి మరింత సమర్థంగా నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. వీటి నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు సైతం కేటాయించింది.

కార్యక్రమం నిర్వహణ ఇలా..

★ మెగా పీటీఎం ఈనెల 5వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉంటుంది. తొలుత తల్లిదండ్రులకు, పూర్వవిద్యార్థులు, దాతలు, పీఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు స్వాగతం పలుకుతారు. ★ 9.30 గంటల నుంచి విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, అసైన్మెంట్ బుక్లెట్, విద్యార్థుల బేస్లైన్ స్థాయి తదితర వాటిపై తల్లిదండ్రులకు వివరిస్తారు. విద్యార్థుల హోలిస్టిక్ కార్డులు, ఆరోగ్యంపై చర్చిస్తారు. కెరీర్, మానసిక, ఆరోగ్య కౌన్సెలింగ్, మాదకద్రవ్యాల వల్ల అనర్థాలు, గుడ్టచ్, బ్యాడ్టచ్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధానంపై వీడియోలు ప్రదర్శిస్తారు. ★ 11 గంటల నుంచి స్పోర్ట్స్ కిట్లు, లైబ్రరీ పుస్తకాలు, ఏటీఎల్ ల్యాబ్, విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వస్తువులు, పోటీ పరీక్షల పుస్తకాలు, టీఎల్ఎం ప్రదర్శన తిలకిస్తారు. తర్వాత ఉపన్యాసాలు ఉంటాయి. పాఠశాల పురోగతి, పదో తరగతి 100 రోజుల ప్రణాళిక హెచ్ఎంలు వివరిస్తారు.

★ 11.10 గంటల నుంచి విద్యార్థులతో పద్యాలు, కథలు, కవితలు, ఆత్మ రక్షణ విద్య తదితర వాటిపై చెప్పిస్తారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ప్రసంగం, పాఠశాలల అవసరాల కోసం దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు విజ్ఞప్తి చేస్తారు. ★ 12:45 గంటల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. ★ ఈ సమావేశాల కోసం విద్యాలయాలను తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలిలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
పెందుర్తి	76	6827	02	783
పరవాడ	65	4579	02	360
సబ్బవరం	53	3758	01	590
పెదగంట్యాడ రూరల్	13	850	01	82
మొత్తం	207	16,014	06	1815

పండగ వాతావరణంలో నిర్వహిస్తాం

మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను ఈనెల 5వ తేదీన పండగ వాతావరణంలో నిర్వహిస్తాం. ఈ మేరకు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తర్వులు పంపాం. ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టారు. అందరి సహకారంతో పీటీఎం-3ని విజయవంతం చేస్తాం.

-దివాకర్రావు, ఎంఈవో, పరవాడ

సమస్యలు పరిష్కరించేందుకే 'మన పల్లెకు-మన ఎమ్మెల్యే'..

అక్కిరెడ్డిపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్బాబు

గుర్రమ్మపాలెం (పెందుర్తి), న్యూస్టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కారమార్గం చూపించడమే లక్ష్యంగా 'మన పల్లెకు-మన ఎమ్మెల్యే' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీపీ మరుపాక నాగమణి, సర్పంచి ఉగ్గిన గోవింద్, ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతి, ఎంపీడీవో గుండు అప్పలరాజు, తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, సీఐ కె.వి.సతీశ్కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ సింహాచలంనాయుడు, భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

125 మంది బాలికలకు రగ్గుల పంపిణీ

రగ్గులు అందుకున్న బాలికలతో రాంకీ ప్రతినిధులు ఎర్రయ్య, శ్రీకాంత్

పరవాడ, న్యూస్టుడే: మండల కేంద్రం పరవాడ ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన 125 మంది బాలికలకు మంగళవారం విశాఖ ఫార్మాసిటీ ఆధ్వర్యంలోని రాంకీ ఫౌండేషన్ సహకారంతో రగ్గులు వితరణ చేశారు. రాంకీ సంస్థ సమన్వయాధికారి పి.ఎర్రయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి బాలికలకు రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సహాయ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, వార్డెన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రేపు కథాకళి ఉత్సవాలు

మురళీనగర్, న్యూస్టుడే: మురళీనగర్ జాతీయ రహదారి సమీపంలోని కేరళ కళా సమితి ఆడిటోరియంలో గురువారం మెగా కథాకళి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళీయుల సంప్రదాయ కళలను ప్రోత్సహించే దిశగా సాయంత్రం 7 గంటలకు కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుందని కార్యదర్శి కె.హరిదాసు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకుని ప్రవేశ అనుమతి పత్రంతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98481 98231 నెంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా భూలోకమాంబ పండగ

భక్తులకు వడ్డిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, తదితరులు

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం బీసీకాలనీలో గల భూలోకమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, భూలోకమాంబ యూత్ సభ్యులు, పెద్దలు ముత్తానాయుడు, సాలాపు రమణ తదితరులు పాల్గొన్నారు. సుమారు 3వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా అంబలం పూజ

సబ్బవరం, న్యూస్టుడే: సబ్బవరం మండలం ఎల్లుప్పి శివారు మర్రిపాలెంలో మంగళవారం దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. లోకిరెడ్డి దుర్గారావు, అమరపిన్ని నర్సింగరావుల ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. లోకిరెడ్డి అప్పలరాజు, బాలాశ్రీ గురువుల సూచనల మేరకు దుర్గాదేవి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి నామస్మరణతో ఆప్రాంతమంతా మార్మోగింది. అనంతరం హాజరైన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

గాజువాకలో అదృశ్యం.. పెందుర్తిలో ప్రత్యక్షం

వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి, న్యూస్టుడే: మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు గాజువాకలో అదృశ్యం కాగా.. పెందుర్తిలో ఆచూకీ లభించినట్లు సీఐ కె.వి.సతీశ్కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో ఒంటిపై బంగారు ఆభరణాలున్న ఓ వృద్ధురాలు చలికి వణుకుతూ అనాథగా ఉండడాన్ని గ్రామానికి చెందిన కావ్య, చింతలమ్మ మంగళవారం గమనించి చేరదీశారు. తర్వాత పెందుర్తి పోలీసులకు సమాచారం అందించగా.. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆమెను చేర్పించారు. ఈ మేరకు సంబంధిత విషయాన్ని పలు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయగా.. గాజువాకలోని ఆమె బంధువులు స్పందించారు.

★ ఇదిలా ఉండగా గత నెల 30వ తేదీన బూరల పెంటమ్మ (65) అనే మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తప్పిపోయిన ఆ వృద్ధురాలి ఆచూకీని పెందుర్తి పోలీసులు గుర్తించడంతో ఆమెను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. ఆమెను సంరక్షించిన రాంపురం గ్రామ మహిళలను సీఐ అభినందించారు.

అలరించిన సాహితీ సభ

ప్రసంగిస్తున్న మాటూరి శ్రీనివాస్

సీతంపేట, న్యూస్టుడే: సమతా సాహితీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం సాహిత్య సభ నిర్వహించారు. గుంటూరు లక్ష్మీనరసయ్య సంకలనం చేసిన 'చిక్కనవుతున్న పాట' కవిత్వ సంపుటిని సాహితీవేత్త మాటూరి శ్రీనివాస్ విశ్లేషించారు. 1995లో వచ్చిన ఈ సంపుటి సంచలనం సృష్టించిందన్నారు. అక్షరాల్లో ఆర్ద్రత ఉండేదే గొప్ప కవిత్వమన్నారు. సమావేశంలో కత్తి పద్మ, ఉప్పల అప్పలరాజు, ఆచార్య వెలమల సిమ్మన్న, మరడాన సుబ్బారావు, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపు.. 'కౌశలానికి' అవరోధం

వేపగుంట సచివాలయంలో పరీక్షకు హాజరైన అభ్యర్థి

పెందుర్తి, న్యూస్టుడే: ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహించ తలపెట్టిన కౌశలం పరీక్షకు పెందుర్తి మండలంలోని గ్రామీణ సచివాలయాల్లో తొలిరోజు ఆటంకం ఏర్పడింది. ఈ ప్రక్రియ కోసం ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రభుత్వం కౌశలం సర్వే నిర్వహించి వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల పేర్లు నమోదు చేసింది. వారందరికీ మంగళవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఆన్లైన్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం సచివాలయాలకు వెబ్ కెమెరాలు, ఇతర పరికరాలు సరఫరా చేసింది. తొలిరోజు పరీక్షకు హాజరవ్వాల్సిన అభ్యర్థులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు. పెందుర్తి మండలంలోని పదిహేను పంచాయతీల నుంచి 90మందికి తేదీల వారీగా పరీక్షకు హాజరు కావాలని సందేశం అందింది. ఆ మేరకు గ్రామ సచివాలయాలకు అభ్యర్థులు హాజరు కాగా సర్వర్ మొరాయించింది. ఆధార్ అథెంటికేషన్ జరగనందున పరీక్ష జరగలేదు. ఉదయం 11 గంటలు, మధ్యాహ్నం 3 గంటల స్లాట్లకు ఇదే పరిస్థితి ఎదురైంది. వీరందరినీ రీషెడ్యూల్ చేసుకోవాలని సందేశాలు అందినట్లు అధికారులు తెలిపారు. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ముందస్తు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పట్టణ పరిధిలో సజావుగా..

వేపగుంట, న్యూస్టుడే: ఈ పరీక్షలు జీవీఎంసీ జోన్-8 పరిధిలో సజావుగా జరిగాయి. జోన్ పరిధిలోని 73 వార్డు సచివాలయాల్లో మొత్తం 146 మంది హాజరైనట్లు జెడ్సీ శంకరరావు పేర్కొన్నారు. వేపగుంట 484వ సచివాలయంలో ఉదయం కార్యదర్శి కాశిమల్ల భవానీ ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరీక్ష రాసే సమయంలో వెబ్ కెమెరాలో మరో వ్యక్తి కనిపిస్తే సంబంధిత అభ్యర్థి అనర్హులవుతారని అన్నారు. అందుకే ప్రజల నుంచి కాస్త దూరంగా అర్జీలు స్వీకరించినట్లు ఆమె పేర్కొన్నారు.

గురుకులంలో వన మహోత్సవం

లికేశ్ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నరవ(వేపగుంట), న్యూస్టుడే: నరవలోని జ్యోతిబా పులే గురుకుల పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రిన్సిపల్ ఎం.రూప ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీకి వెళ్లిన ఎస్.లికేశ్ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సత్కరించి అభినందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ముగిసిన గీతాజయంతి వేడుకలు

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు చేపట్టిన గీతాజయంతి వేడుకలు మంగళవారం ముగిశాయి. చింతలగ్రహారం కృష్ణాలయంలో ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు, అర్చకులు సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో రెండు రోజులు ఆలయంలో గీతాజయంతి పూజలు జరిగాయి. 24 గంటల పాటు గీతాపారాయణం చేసి భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా 31 శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. హరేకృష్ణ మూవ్మెంట్ అధ్యక్షులు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో ప్రహ్లాదపురంలోనూ ఈ వేడుకలు జరిగాయి. స్థిరాస్తి వ్యాపారి కృష్ణమూర్తి దంపతులు భక్తులకు 108 భగవద్గీత పుస్తకాలను వితరణగా అందించారు.

పూజలందుకున్న శ్రీకృష్ణుని విగ్రహాలు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్టుడే : ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారుడు ఎం.తరుణ్ (88 కిలోల విభాగం) సత్తాచాటి రజత పతకం గెలుపొందాడు. పోటీలు రాజస్థాన్లోని పూర్ణిమ యూనివర్సిటీలో సోమవారం ముగిశాయి. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి తదితరులు తరుణ్ను అభినందించారు. కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ లక్ష్మణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తరుణ్ను అభినందిస్తున్న కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ జి.ఎస్.కె.చక్రవర్తి, తదితరులు

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

మల్లికార్జునరావును సత్కరిస్తున్న తెదేపా నాయకులు

పరవాడ, న్యూస్టుడే: పరవాడ మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెందుర్తి మండలం సరిపల్లి పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పరవాడ మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నెలపాలెం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు మల్లికార్జునరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన

పెందుర్తి, న్యూస్టుడే: వాతావరణ కాలుష్య నియంత్రణకు యువత నడుం కట్టాలని పెందుర్తి ఆదర్శ్ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కాలుష్య నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రిన్సిపల్ ఫ్లోరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రాజ్కుమార్, ఏవో రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్టుడే: విద్యార్థుల భద్రత విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. ఈ మేరకు పరవాడ పోలీస్స్టేషన్లో మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్తో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్లు చూడాలని, బాలికల రక్షణ నిమిత్తం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీసులకు విద్యాసంస్థలకు మధ్య వేగవంతమైన సమాచారం మార్పిడి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు.

లంకెలపాలెం(పరవాడ), న్యూస్టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. జీవీఎంసీ 79వవార్డు పరిధి లంకెలపాలెం శాంతి టాలెంట్ స్కూల్లో మంగళవారం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బ తీస్తాయని వీటికి దూరంగా ఉండాలని చైతన్యపర్చారు. విద్యార్థులంతా బాల్యం నుంచే మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ శ్రీధర్రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

వేపగుంట, న్యూస్టుడే: భూముల ధరలు బాగా పెరగడంతో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపించినా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఆ వివరాలిలా..జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లి సమీప బ్రహ్మంగారి మఠం వెనుక సుమారు 7ఎకరాల వివాదాస్పద భూమి ఉంది. దానిని ఆనుకొని కొంత ప్రభుత్వ భూమి ఉంది. దాని విలువ సుమారు రూ.కోటి విలువ చేస్తుంది. ఆ స్థలంలో ఎరుకుల సామాజికవర్గానికి చెందిన కొందరు గుడారాలు వేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ఆర్.ఐ హరిప్రసన్న ఆధ్వర్యంలో పలువురు వీఆర్వోలు అక్కడకు చేరుకుని ప్రభుత్వ స్థలంలో వెలసిన గుడారాలను జేసీబీతో తొలగించారు. ఈ విషయంలో ఆక్రమణదారులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయ క్రీడా పోటీలకు జట్ల ఎంపిక

త్రోబాల్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయినులతో ఎంఈవోలు

పెందుర్తి, న్యూస్టుడే: బడిలో చదువుకునే పిల్లలతో పాటు ఉపాధ్యాయులకూ మానసిక ఉల్లాసం ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువులకు క్రీడాపోటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డివిజన్ స్థాయిలో జరగనున్న క్రీడాపోటీల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు రెండు రోజుల పాటు జరిగాయి. పెందుర్తి మండలం పినగాడిలోని వెల్ఫేర్ క్రీడా మైదానంలో ఉపాధ్యాయినులకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గురువులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెందుర్తి ఎంఈవో-1, 2 కె.సువర్ణ, మధుమూర్తి, పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన వారు

రహదారి విస్తరణ తొలి దశ పనులు ప్రారంభం

పనులు పరిశీలిస్తున్న ఏసీపీ రామలింగారెడ్డి, టీపీవో గోపన్న

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట-పినగాడి రహదారిని 60 అడుగులకు విస్తరించే పనుల్లో భాగంగా తొలి దశ పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చేపట్టారు. ఏసీపీ రామలింగారెడ్డి పర్యవేక్షణలో టీపీవో గోపన్న పలువురు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఇటీవల జీవీఎంసీలో జరిగిన స్టాండింగ్కమిటీ సమావేశంలో వేపగుంట-పినగాడి, వేపగుంట-జుత్తాడ రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సర్కారు ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పనపై ఆరా

వన్టౌన్, న్యూస్టుడే : మార్గశిర మాసం సందర్భంగా బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయ పరిసరాల్లో పర్యటించి, ఏర్పాట్లు పరిశీలించారు. రెండో గురువారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రసాదాల కౌంటర్, క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ ఆనంద్కుమార్, రాజేంద్ర, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

ఈనాడు అనంతపురం

మురారీ.. దశావతారధారీ..

చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల వేణుగోపాలస్వామి ఆలయంలో ఎవరికీ తెలియని విశేషాలున్నాయి సుమా.. సంవత్సరంలో రెండు మార్లు అదీ పౌర్ణమి వేళలలో సూర్యకిరణాలు గుడిలోకి ప్రసరించే విధంగా ఏర్పాట్లున్నాయి. గుడిలోని శ్రీకృష్ణుడి విగ్రహంలో వెంకటేశ్వరుడు ఇమిడి ఉండటమే కాకుండా.. తల చుట్టూ దశావతార ముఖాలుండటం మరో ప్రత్యేకత. కోవెలను నిర్మించింది మాత్రం క్రీస్తు పూర్వం జనమేజయ మహర్షి.

- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

విశేషాలు ఆలయ ముఖద్వారం, గర్భగుడి రాతి స్తంభాలపై గజ మహాలక్ష్మి గుర్తులు (ఈ ఆనవాళ్లు కేవలం ఉడిపి శ్రీకృష్ణాలయం, ఆహోబిల లక్ష్మీనరసింహ స్వామి, మహానంది ఆలయాల్లోనే ఉంటాయి)

విశ్వాసం ఉత్తరాయణ పౌర్ణమి మడియల్లో దర్శించుకుంటే.. వృద్ధాప్యంలో ఈతి బాధలు తొలగి మానసిక ప్రశాంతత చేకూరుతుందని భక్తుల నమ్మకం

15న బీటీ ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు

గుమ్మఘట్ట: బీటీ ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టుకు 15న నీటిని విడుదల చేస్తామని ఈఈ సురేంద్ర తెలిపారు. కుడి కాలువ కింద 6వ డిస్ట్రిబ్యూటరీ నుంచి బ్రహ్మసముద్రం మండలంలోని చివరి ఆయకట్టు వరకు 1,940 ఎకరాలు, గుమ్మఘట్ట మండలానికి సంబంధించి ఎడమ కాలువ కింద 1వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 9వ డిస్ట్రిబ్యూటరీ వరకు 3,162 ఎకరాలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

సీడీపీఓ, గుత్తేదారులకు తాఖీదులు జారీ

జిల్లా సచివాలయం: అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరఫరాలో జాప్యం, లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంపై వలువురికి తాఖీదులు జారీ అయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు సీడీపీఓతోపాటు 11 మంది గుత్తేదారులకు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి నోటీసులు ఇచ్చారు. రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవంబరులో బియ్యం, కందిపప్పు, నూనె.. డీలర్ల నుంచి సకాల సమయంలో కేంద్రాలకు ఇవ్వలేదు. పాలు, కోడిగుడ్లు, బాలామృతం సకాలంలో చేరడం లేదు.

గుత్తి కోటపై బృంద సభ్యులు

ప్రకృతిలో ఆరోగ్య పాఠాలు!

ఈనాడు, అనంతపురం: ప్రస్తుతం దేహ దారుఢ్యం, ఆరోగ్యంపై అన్ని వయసుల వాళ్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యోగాతోపాటు వ్యాయామశాలల్లో చేరి కసరత్తు చేస్తున్నారు. ఆసనాలతోపాటు బరువులెత్తడం, ట్రెడ్‌మిల్‌పై పరుగు, సిక్స్‌ప్యాక్ కోసం కసరత్తు చేస్తూ శరీర దృఢత్వాన్ని పెంచుకుంటున్నారు. జిమ్‌లో చేసే ఈ ప్రక్రియలు యాంత్రికంగా మారిపోయాయనే భావన యువతలో మొదలైంది. ఈనేపథ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఫిట్‌నెస్ పొందవచ్చని చెబుతున్నారు నగరానికి చెందిన తాజుముల్.. అతని మిత్ర బృందం. 'ట్రెక్కర్స్ ఆఫ్ అనంతపురం' పేరుతో వారు నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠాలు ఆసక్తిగా మారాయి.

బరువును బట్టి..

శరీర బరువునే ఆసరాగా చేసుకుని వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్ పొందే ప్రక్రియను కలిస్తానిక్ అంటారు. ఈ విధానంలో డిప్‌బార్లు, పుల్-అప్ బార్లు, స్ట్రెచింగ్ తరహాలు ఉంటాయి. నిర్వాహకులు వ్యాయామంతో పాటు వారాంతాల్లో సమీపంలోని కొండల్లో ట్రెక్కింగ్ చేపడుతున్నారు. నడవడం, వాగులు, వంకలు దాటడం, ఒక రాయి నుంచి ఇంకో రాయికి దూకడం తదితర ప్రక్రియలతో శరీరంలోని కొవ్వు సహజసిద్ధంగా కరిగిపోతుందని చెబుతున్నారు.

ప్రతి వారాంతంలో..

- తాజుముల్, దినేష్, వసీం, సిద్ధార్థ్ మిత్ర బృందం అనంత చుట్టుపక్కల కొండల్లో ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది సభ్యులు ఉన్నారు. ఆసక్తి ఉన్నవారిని ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా చేస్తున్నారు.
- ట్రెక్కింగ్‌లో జాగ్రత్తలు, నియమాలపై ముందుగా వివరిస్తారు. అనుమతి పత్రంపై సంతకం తీసుకున్న తర్వాతే తీసుకెళ్తున్నారు. బయట నుంచి వచ్చేవారి కోసం మెడికల్ కిట్ అందిస్తున్నారు.
- గంపమల్లయ్యకొండ, దేవరకొండ, గోనిమడుగుల ఆలయం, గుత్తి కోట వంటి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేపట్టారు. ఇప్పటివరకు 30 ప్రాంతాల్లో నిర్వహించారు.



చదం గొల్లలదొడ్డి

పాలు పితకరు.. కంది, ఉలవలు, కొర్రలు తినరు

రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి గ్రామంలో 400 కుటుంబాలు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాయి. వీరిలో శ్రీఎర్రినాగ ముత్యాలస్వామిని కొలిచే కుటుంబాలు 200లకు పైగా ఉన్నాయి. వీరందరికీ ఓ విచిత్ర సంప్రదాయం ఉంది. ఈ స్వామిని కొలిచే కుటుంబాల ఇళ్లలో పెంచే ఆవులు, గేదెల నుంచి ఆది, సోమవారాలు పాలు పితకరు. దేవుడి పేరుతో లేగ దూడలకు వదిలేస్తారు.. కంది, ఉలవ, కొర్రలతో ఆహార పదార్థాలను ఇళ్లలో వండరు. నిల్వ చేసుకోవడం కూడా తప్పుగా పరిగణిస్తారు. వందేళ్ల నుంచే ఈ ఆచారం కొనసాగుతోందట. ఎవరైనా ఆంక్షలను ధిక్కరిస్తే ఏడాదిలో ఒక్కసారిగా నిర్వహించే ఆవుల దేవర పండగనాడు ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

అత్యవసర సేవలకు 1033 ఉందండోయ్!

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జాతీయ టోల్ ట్యాక్స్ కట్టడమే కాదు.. కొన్ని సేవలనూ పొందవచ్చు. ప్రధానంగా 1033 సేవలు వినియోగం. అత్యవసర సేవలు పొందాలంటే ఆ టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సేవల్ని పొందవచ్చు.

మకుటం

✦ వాహనాలు బ్రేక్‌డౌన్, ప్రమాదాలు జరిగినపుడు, టోల్‌ప్లాజా, ఫాస్టాగ్ సమస్య తదితరాలు. రోడ్డు వినియోగదారుల సౌకర్యార్థం వివిధ భాషల్లో వినియోగించుకోవచ్చు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ నంబరును నిర్వహిస్తుంది. 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయి.

✦ జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగినపుడు, వాహనాలు మరమ్మతుకు గురైనపుడు 1033కు ఫోన్ చేస్తే హైవే అంబులెన్సులు, పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులోకి వస్తాయి. ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలిస్తారు. పెట్రోల్, డీజిల్ లేక వాహనాలు ఆగిపోయినా ఇంధనంతోపాటు ఆహార పదార్థాలు కూడా అందిస్తారు.

ఫిర్యాదులూ చేయవచ్చు..

✦ రోడ్డు బాగోలేకపోయినా, గుంతలు, వీధిలైట్లు వంటి సమస్యలు ఈ నంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ✦ టోల్‌ప్లాజా నిర్వహణపై ఫిర్యాదులు కూడా చేయవచ్చు. ✦ టోల్‌ప్లాజా వద్ద తప్పకుండా మరుగుదొడ్లు ఉంటాయి. వాటిని శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గుత్తేదారుపై ఉంటుంది. శుభ్రంగా లేకపోతే వాహనదారులు మొబైల్‌ఫోను ద్వారా ఫొటో తీసి 'రాజమార్గ యాత్ర' యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఇలా ఫిర్యాదు చేస్తే జాతీయ రహదారులశాఖ బహుమతి ఇస్తుంది. ఫాస్టాగ్‌లో రూ.1000 జమ చేస్తారు.

ఆ ఊరి పెరుగు తింటే.. మళ్లీ కావాలంటారు

రాయదుర్గం పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామం. రెండు వందల కుటుంబాలకు పాడి పోషణే ఆధారం. ఉదయం పితికిన పాలను పట్టణంలో విక్రయిస్తారు. సాయంత్రం పాలను తోడు వేసి ఉదయాన్నే రాయదుర్గం పట్టణంలో పెరుగును మహిళలు విక్రయిస్తారు. ఎన్ని పాల ప్యాకెట్లు కంపెనీలు వచ్చినా సిరిగేదొడ్డి పెరుగుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నాణ్యత, రుచిలో దేనికదే సాటి. గత 50 ఏళ్లుగా పట్టణంలో పెరుగును విక్రయిస్తూ భర్తలకు తోడుగా నిలుస్తున్నారు. సుమారు వంద మంది మహిళలు ఉదయాన్నే నెత్తిన పెరుగు పాత్ర పెట్టుకుని నడుచుకుంటూ వచ్చి పట్టణంలో విక్రయించేవారు. ప్రస్తుతం కూడా 40 మంది దాకా ప్రతి రోజూ ఆటోలో వెళ్లి.. విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

కక్ష కట్టకు నా ఊపిరి తీయకు..

● నీడి చిన్న పిల్లల మన స్తత్వం. కోపం వస్తే తట్టుకోలేవు. భావోద్వేగాలను అదుపులో పెట్టుకోలేవు. ఎదుటి వాడికి హాని తలపెట్టి అందులో ఆనందం చూస్తావు. చివరకు నా ఊపిరి తీస్తావు. ఇది నీకే చేటు

- నిన్ను ఊపిన ఊయలనై చెబుతున్నా..

● ఎవరినీ నొప్పించకు.. కొన్ని గాయాలు మానవు.. మనసును కుదుట పర్చుకొని ఎదుటి వారి సుఖశాంతుల కోసం పరితపించు. ఆనందంగా జీవించు..

- నీ తనువు గాయాన్ని మాన్పిన ఔషధాన్నై చెబుతున్నా..

● లేనిపోని స్వార్థాలు, అహాలు, ఆవేశాలు, అసూయాకార్పణ్యాలతో నిన్ను నువ్వు దిగజార్చుకోకు.. మంచి మనసున్న మనిషివి నీవు.. స్వచ్ఛంగా ఆలోచించు.. గొప్పగా జీవించు, నలుగురినీ జీవించనీ..

- నిన్ను కాపాడే అమ్మగా చెబుతున్నా..

నియోజకవర్గం	నేలకూలినవి జనవరి నుంచి
శింగనమల	12,700
కళ్యాణదుర్గం	6,570
తాడిపత్రి	1600
ధర్మవరం	1000
మడకశిర	796
ఉరవకొండ	220

● కరువు నేలలో ఉన్నావు. ఇక్కడ బతకడమే నిత్య సమరం. నెత్తురుంది, సత్తువుంది.. నాకు తెలుసు నీవు శ్రమ జీవివని.. ఎలా కష్టపడాలో నీకు అన్నీ తెలుసు.. ముందుగా నీడ, నీరు, తిండి ఆవి ఎలా వస్తున్నాయో తెలుసుకో..

- నిన్ను నడిపించే శ్వాసనై చెబుతున్నా..

● నీ కోసం ఏమైనా చేస్తా.. నువ్వు కూర్చుంటే కుర్చీనౌతా.. నిద్రపుచ్చే పందిరి మంచాన్నవుతా.. నింగిలో పరిగెత్తే మేఘాల్ని సైతం నీ కోసం కరిగించి చేసి వర్షంలా తీసుకొస్తా.. నీవు పీల్చే ప్రతి ఊపిరిలో నేనుంటా, కడకు నీ చితిలో సైతం తోడుగా నేను నడుస్తా.. తెలిసీ తెలియక నన్ను నరికినా.. చిగురులేసి నీ కోసం మళ్లీ పుడతా.. నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా.. ఎందుకు నాపై ఇంత కక్ష.

- పచ్చని చెట్టు చెబుతున్న ఆవేదన

✹ ఈ నెల ఒకటో తేదీ.. ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రిలో ఒక మహిళా రైతు తోటలో 75 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నేలకూల్చారు.

✹ ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెట్లను నరికే విషసంస్కృతి కొనసాగుతుండటం ఆందోళన కల్గించే అంశం. కక్షలు పెంచుకొని ఎదుటి వారిని దెబ్బతీయడం కోసం వారి ఆర్థిక దన్నుగా ఉన్న చీనీ, అరటి చెట్లను నరికివేయడం అమానుష చర్య. ఇప్పటికే వేల చెట్లు ఇలా కక్షల కోసం కూలిపోయాయి. క్షణక్షణం మారుతున్న కాలంలో ఉంటున్నాం. ఈ దారుణం ఇకనైనా ఆగాలి.

- న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

నిస్సహాయులకు అందని చేయూత

ప్రహసనంగా ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ

ఈనాడు, అనంతపురం: 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరకులు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి కొందరు అధికారులు, డీలర్లు తూట్లు పొడుస్తున్నారు. ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు చూపించి ప్రభుత్వాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు డీలర్లు నిస్సహాయులకు చేరాల్సిన బియ్యాన్ని నొక్కేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, దివ్యాంగులకు అందజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ముందుగానే డీలర్లు బియ్యం సరఫరా చేస్తున్నారు. తరువాత నెల ఆరంభం నుంచి మిగతా సాధారణ కార్డుదారులకు పంపిణీ చేయాలి. డీలర్లు మాత్రం 26 నుంచే సాధారణ కార్డుదారులకూ బియ్యం పంపిణీ చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసుకుని వెళ్లిపోతున్నారు. సరకులు మాత్రం దుకాణం వద్దకు వచ్చి తీసుకోవాలని చెబుతున్నారు.

దొంగ లెక్కలు

జిల్లా వ్యాప్తంగా 64,173 కార్డుదారులకు ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెలలో ఇప్పటివరకు 36,354 కార్డులకు అందించినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం 5 నుంచి 10 శాతం కూడా ఇళ్లకు చేరవేయడం లేదు. ప్రతి నెలా 80 శాతం నుంచి 90 శాతం వరకు అందజేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు.

పక్కదారి పట్టిస్తూ..

వృద్ధులకు, దివ్యాంగులకు అందించాల్సిన బియ్యాన్ని కొందరు డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారు. డబ్బులు ఎరచూపి బియ్యాన్ని నొక్కేస్తున్నారు. బియ్యం వదులుకుంటే కేజీకి రూ.15 నుంచి రూ.18 చొప్పున ఇస్తామని చెబుతున్నారు. నగరంలో పాటు ఉరవకొండ, రాయదుర్గం, తాడిపత్రి పరిధిలో అక్రమ రవాణాకు తెర తీస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఈ విషయంగా జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా స్థానికంగా అందుబాటులో లేనివారికి మినహా వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే వెళ్లి సరకులు ఇస్తున్నాం. ఎవరికైనా అందకపోతే, ఫిర్యాదు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పంట తెగుళ్ల భరతం పట్టారు!

సుడోమోనాస్ పొడి మందును సిద్ధం చేస్తున్న కూలీలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరువు నేల. ఇక్కడ ఏ పంట వేసినా వాతావరణం అనుకూలించకపోవడం, అన్నీ బాగున్నా వివిధ రకాల తెగుళ్ల బెడదతో పంట నాశనమవడం చూస్తూనే ఉన్నాం. తెగుళ్ల భరతం పట్టేందుకు అనంతపురంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని జీవ నియంత్రణ ప్రయోగశాల నడుం బిగించింది. ఎన్నో ప్రయోగాల ఫలితంగా ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాస్‌ను తయారు చేసింది. వీటిని ఉమ్మడి జిల్లా పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చేయడం విశేషం. వేరుశనగ, కాండం కుళ్లు, మాగుడు ఎండు తెగుళ్ల నివారణ, బ్యాక్టీరియా జాతికి చెందిన జీవన క్రిమినాశిగా పని చేస్తున్నాయి. విత్తన శుద్ధిలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. చెట్లు కాండానికి రక్షణ కవచంలా ఉంటూ అధిక దిగుబడులకు ఊతమిస్తాయి. ఆయా మందులను వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలకు 50 శాతం రాయితీ, రైతులకు పూర్తి ధరతో విక్రయిస్తున్నామని జీవ నియంత్రణ ప్రయోగశాల బాధ్యుడు సుంకర 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వలసొచ్చి.. అదే పేరు పెట్టి!

అమరాపురం మండలంలో ఓ గ్రామం పేరు విచిత్రంగా ఉంటుంది. కారణాలు ఆరాతీస్తే ఆసక్తికర విషయం తెలుస్తుంది. మండలంలోని వలసోచ్చి అనే గ్రామం ఉండేది. ఇక్కడ 25 నుంచి 30 కుటుంబాలు నివసించేవి. వందేళ్ల క్రితం భూములు ఉన్నా పంటలు పండక కాదు. ఏళ్ల తరబడి గ్రామంలో కరవు కాటకాలు ఉండటంతో ఆ గ్రామాన్ని వదిలి వేరో చోటికి వెళ్లి ఏమైనా ఫలితం ఉంటుందని ఊరికి కి.మీ దూరంలో ఉన్న స్థలంలోకి మారారు. వెళ్లి నివసించడం ప్రారంభించారు. అందులో ఇళ్లు నిర్మించుకుని అక్కడే స్థిరపడ్డారు. గ్రామం పేరు వలస అని పెట్టుకున్నారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 500 ఇళ్లు 3 వేల జనాభా ఉంది. పాతూరు ఊరి వాకిలి వద్ద పురాతన చిన్న మారెమ్మ దేవి ఆలయం ఉండేది. ఇక్కడ ఉన్న విగ్రహాన్ని కూడా పెకలించి తీసుకు వచ్చి కొత్త ఊర్లో ప్రతిష్ఠించుకుని పూజలు చేసుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, మడకశిర, అమరాపురం

సాధనా తరుణి.. పావని

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో క్షణం తీరిక లేదు. కానీ ఏదో సాధించాలన్న ఆరాటం ఆమెను ఏకంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. తాడిమర్రి మండలం ఆత్మకూరులో పుట్టి పెరిగిన ఎం. పావనికి బాల్ బ్యాడ్మింటన్ అంటే ప్రాణం. బాల్యం నుంచే సాధన చేసింది. పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు నంద్యాలలో పూర్తి చేసింది. ఎంతో ఇష్టపడిన ఆటకు విరామం ఇచ్చింది. చదువు తర్వాత అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం సాధించింది. ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాల్లో సాధన చేసి అంతర్జాతీయ పోటీలకు ఎంపికై ఆదర్శంగా నిలిచింది.

జాతీయ జట్టులో స్థానం లభిస్తుందని ఊహించలేదు. ఉద్యోగం చేస్తూ సాధన చేయడానికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు అవకాశం కల్పించారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, కార్యదర్శి బాలాజీలు సహకారం అందించడం వల్లే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యా. నేపాల్‌లో జరగనున్న పోటీల్లో కూడా సత్తాచాటి దేశ జట్టును గెలిపించాలన్నదే నాలక్ష్యం.

- పావని

తల్లిదండ్రులు ఇద్దరూ కూలీలే..

తాడిమర్రి మండలం ఆత్మకూరుకు చెందిన ఎం.ఈరప్ప, శివమ్మ దంపతుల కుమార్తె ఎం.పావని. తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీలే. వీరి రెక్కల కష్టంతోనే కూతుర్ని చదివించారు. ఆటల్లో ప్రోత్సహించారు. ఇంటర్ చదువుతూ బాల్ బ్యాడ్మింటన్ సాధన చేసింది. బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి వెంకటేశ్‌లు ఈమెకు మెలకువలు నేర్పించడంతోపాటు అన్ని విధాలా ప్రోత్సహించారు. గత సెప్టెంబరు చివరి వారంలో తమిళనాడు దిండిగల్ పట్టణంలో జాతీయస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఈమె అద్వితీయ ప్రతిభ పాటవాలతో ఆకట్టుకుంది. ఆటతీరును మెచ్చిన సెలెక్టర్లు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ లీగ్ పోటీలకు ఎంపిక చేశారు. జనవరి ఒకటి నుంచి ఖాట్మాండులో అంతర్జాతీయ పోటీల్లో దేశం తరఫున ఆడుతుంది.

మట్టి రేణువుల్లో స్వర్ణకాంతులు

బంగారం నిక్షేపాలకు రాష్ట్రాడు నియోజకవర్గం రామగిరి ఎంత ప్రసిద్ధో అందరికీ తెలిసిందే. మట్టిని తవ్వి బంగారు తీసిన పల్లె మది.. 30 ఏళ్ల కిందటి గనుల్లో తవ్వి తీసే ప్రక్రియ గిట్టుబాటు అయ్యే పరిస్థితులు లేక ఆగిపోయింది. దీంతో గనుల్ని మూసివేశారు. ఇప్పుడు ఆ గ్రామానికి చెందిన 70 కుటుంబాలకు ఉపాధి మార్గం ఉంది. ప్రత్యేక సారవలు, టబ్బులు ఏర్పాటు చేసుకుని మట్టిని కడుకుతారు. కుర్రచేసి అందులోని నల్లని పదార్థంలో దాగిన పచ్చని వర్ణం ముక్కలను పోదరయంతో ఓడిసి పట్టి బంగారాన్ని వెలికి తీస్తున్నారు. సేకరించిన ముక్కలకు ధర్మవరం తదితర పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండటంతో ఆర్థికంగా ఆదుకుంటోందని చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, రామగిరి

సంచుల కూర్పు.. సులువుగా మొక్కల మార్పు

అనంతపురం కోర్టు రోడ్డులో మొక్కల పెంపకంలో కొత్త పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇంటి ముందు ఇనుప కుర్చీలు వేసి దానిపైన రెండు సంచుల్లో మొక్కలను ఇలా పెంచుతున్నారు. యూరియా బస్తాలను ఇలా చిన్న సంచులుగా తయారు చేసి అందులో మట్టిని వేసి మొక్కలను ఇంటి ముందు మెట్ల వద్ద ఆకర్షణీయంగా కనిపించేలా పెట్టారు. రోడ్డు మీద పోయే ప్రతి ఒక్కరు ఈ సంచులేంటి అంటూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇంకోచోటికి మార్చుకోవడానికి సులువుగా ఉంటుందని ఈ మార్గాన్ని అనుసరిస్తున్నారు.

- ఈనాడు అనంతపురం

రైలు బండి.. రిపేరు చేస్తారండి

విధులకు హాజరవుతున్న మహిళా మెకానిక్‌లు

మహిళా మెకానిక్‌లు అదుర్స్

గుంతకల్లు, న్యూస్‌టుడే: మనసు పెడితే మహిళలు నేర్వలేని విద్య అంటూ ఉండదని ఈ అతివలు నిరూపిస్తున్నారు. ఎంతో కష్టమైన రైల్వే ఇంజిన్ల మరమ్మతులను సులభంగా చేస్తున్నారు. ఓ మహిళ డీజిల్ షెడ్డులో హెల్పర్‌గా చేరి పురుషులతో సమానంగా పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు రాణిస్తున్నారు.

ఎక్కడ పని: గుంతకల్ డీజిల్ షెడ్

ఎందరు: 60 మంది మహిళలు

ఏం చేస్తున్నారు: విద్యుత్తు ఇంజిన్ల మరమ్మతులు

ఎన్ని చేశారు: 25 డీజిల్, 150 విద్యుత్తు లోకోలు

ప్రత్యేకత: కళాసీలు, హెల్పర్లుగా చేరి 3, 2, 1 గ్రేడ్ మెకానిక్‌లుగా పదోన్నతి

గ్రేడ్-1 మెకానిక్‌లు: పుష్ప, టి.రాజేశ్వరి, మహబూబ్‌బీ

ప్రోత్సాహం: డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్త, ఏడీఈఎం సుధాకర్

ఇంజిన్ లోపల మరమ్మతులు చేస్తున్న మహబూబ్‌బీ

అతివలకు ఆషామాషీ కాదు..

రైలు డీజిల్ షెడ్డులో పనిచేయడం పురుషులకే కష్టం. అలాంటిది అతివలకు కత్తిమీద సామే. ఎంతో బరువైన ఇంజిన్ విడిభాగాలను బయటకు తీసి షెడ్డులోకి తీసుకెళ్లాలంటే శరీరక దారుఢ్యం అవసరం. పైగా ఇంజిన్ల కింద దూరి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఎంతో ఒత్తిడితో కూడుకున్న పని. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా చేతులు విరిగే ప్రమాదముంది. ఈ క్రమంలో ఎన్నోసార్లు ఇంజిన్ విడి భాగాలు తగిలి గాయాలపాలయ్యాం. మరోవైపు చెప్పిన గడువులోపు రిపేర్లు ముగించాలి. ఇన్ని ప్రతికూలతల నడుమ విధులు నిర్వహిస్తున్నందుకు శభాష్ అంటున్నారు.

ధైర్యంగా ముందుకు: -పుష్ప, గ్రేడ్-1 మెకానిక్

లోకో షెడ్డులో మొట్టమొదటి మహిళా మెకానిక్ నేనే. మొదట హెల్పర్‌గా చేరి ఎంతో కష్టపడి గ్రేడ్-1 మెకానిక్ స్థాయికి చేరుకున్నా. ఇంజిన్లు లోపలను కచ్చితంగా గుర్తించడంలోనే మన సామర్థ్యం దాగి ఉంటుంది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది మహిళలు ధైర్యంగా షెడ్డులో పనిచేస్తున్నారు.

10వ తరగతి విద్యార్థినులకు ఉపకారవేతనాలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన 10వ తరగతి విద్యార్థినులకు ఉపకార వేతనాలు ట్రస్టు ద్వారా అందజేస్తున్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. గర్ల్స్‌ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ టెస్ట్-2026 ఈ నెల 14న నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఉపకార వేతనాలు అందిస్తారు. ఆసక్తి గల వారు www.ntrcollegeforwomen.education వెబ్‌సైట్‌లో ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7660002627/28 ఫోను నంబరును సంప్రదించవచ్చు.

మొదటి 10 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5వేలు,	
ఆ తరువాత 15 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.3వేల చొప్పున ఇస్తారు.	

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

ఖాద్రీశుని ఆర్జిత కల్యాణోత్సవ తేదీలివే!

కదిరి, న్యూస్‌టుడే : శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి డిసెంబరులో భక్తులు ఆర్జిత కల్యాణోత్సవం జరిపించేందుకు తేదీలను ఖరారు చేశారు. ఈనెల 3 నుంచి 15 వరకు 10 రోజులు కల్యాణానికి అనువైన సుముహూర్తాలను నిర్ణయించారు. ఈనెల 3, 4, 5, 7వ తేదీలు, 9 నుంచి 15వ తేదీ వరకు వరుసగా ముహూర్తాలు పెట్టారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 ఆలయంలోని కల్యాణ మండపంలో వేడుక జరుపుతారు. భక్తులు ముందస్తుగా టికెట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

టోల్‌ప్లాజా చెంతన ఆక్రమణలు

వాహనదారులకు తప్పని తిప్పలు

టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కాశేపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ఇరువైపులా ఉన్న స్థలాలను కొందరు ఆక్రమించుకుని హోటళ్లను ఏర్పాటు చేసుకోవడంతో పలు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. టోల్‌ప్లాజా సమీపంలో వాహనాల నిలుపుదలకు స్థలాలు కేటాయించగా కొందరు దర్జాగా కబ్జాచేయడంతో పాటు మరికొందరు వ్యాపారాలు సాగిస్తున్నారు. వాహన డ్రైవర్ల విశ్రాంతి కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. నాలుగు వరసల రహదారిలో ఇరువైపులా నాటించిన మొక్కలను తీసివేసి హోటళ్లు ఏర్పాటు చేసుకున్నారు. సంబంధిత అధికారులు, పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు.

వేబ్రిడ్జి సైతం..

నిత్యం రద్దీగా ఉండే కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద యాజమాన్యం ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి సైతం కొందరు ఆక్రమించుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉంటున్నాయి. వేబ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో పగలు, రాత్రివేళల్లో వాహనాలు నిలిపివేసి హోటళ్లలో భోజనం చేయడానికి వెళుతున్నారు. దీంతో ఇతర వాహదారులు అనేక ఇబ్బందులకు గురై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

● ఈ విషయంపై జాతీయ రహదారి ఉప తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టిని వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారికి కేటాయించిన హద్దులను గుర్తిస్తాం. ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గం విద్యార్థి అదుర్స్

అండర్-14 క్రికెట్ జట్టులో చోటు

మహమ్మద్ తన్వీర్

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై ఉన్న మక్కువకు తోడు తల్లిదండ్రుల శ్రద్ధ, ప్రత్యేకంగా ఇప్పించిన శిక్షణతో ఆ విద్యార్థి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం అండర్- 14 జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. కళ్యాణదుర్గం పట్టణంలోని మారెంపల్లికి చెందిన షేక్ దాదాపీర్(సత్యసాయి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్)- అయిషాల కుమారుడు షేక్ మహమ్మద్ తన్వీర్. కుడిచేతి వాటం బ్యాటింగ్ చేస్తూ ఆటలో సత్తాచాటుతున్నాడు. నవంబరు 29, 30, డిసెంబరు 1న గుంటూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ స్కూల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభతో జాతీయస్థాయి జట్టుకు ఎంపికవడం గమనార్హం.

● ప్రస్తుతం అనంతపురంలో 9వ తరగతి చదువుతున్న మహమ్మద్ తన్వీర్ ఆరేళ్లుగా ఆర్ట్స్ కళాశాలలో దాదా ఖలందర్ నిర్వహించే శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. అనంతపురం ఆర్డీటీ, మదనపల్లి వాయల్పాడు, గుత్తి, తాడిపత్రి తదితర ప్రాంతాలతోపాటు బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో అకాడమి తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నిరంతరం కృషిచేసి జాతీయస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు.

భక్తిశ్రద్ధలతో నెట్టికంటయ్య శోభాయాత్ర

రథంలో అంజన్న ఉత్సవమూర్తి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 3న జరిగే హనుమద్ వ్రతం సందర్భంగా గుంతకల్లులో మంగళవారం ఉదయం హనుమాన్ సర్కిల్ నుంచి కసాపురం ఆలయం వరకు స్వామి శోభాయాత్ర కనులపండువగా కొనసాగింది. తెదేపా మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, ఈవో విజయరాజు తదితరులు స్వామి రథానికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగింపు కసాపురానికి చేరింది. దీక్ష చేపట్టిన మాలధారులు ఇరుముడితో కాలినడకన కసాపురానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులు, మాలధారులతో కిక్కిరిసిపోయింది. బుధవారం ఆలయంలో హనుమద్ వ్రతం, దీక్ష విరమణ ఉంటుందని ఈవో తెలిపారు.

ఘనంగా బాబయ్యస్వామి ఉరుసు మహోత్సవం

బాబయ్యస్వామి దర్గాకు ప్రభుత్వం తరఫున ఊరేగింపుగా చాదర్ తీసుకెళుతున్న మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్

పెనుకొండ, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన పెనుకొండ బాబయ్యస్వామి దర్గా 753వ గంధం, ఉరుసు వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దర్గాకు చాదర్ సమర్పించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సవిత భక్తిశ్రద్ధలతో చాదర్‌ను తలపై మోసుకుని ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు బాబయ్యస్వామి సమాధికి చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జాతీయ సర్వమత సమ్మేళనం నిర్వహించారు. రాత్రి బాబయ్యస్వామి సమాధికి పీఠాధిపతి నజరూహుస్సేని ఆధ్వర్యంలో గంధం సమర్పించారు. పకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు.

'ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి'

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అతని కుమారుడు భీమిరెడ్డి నుంచి తమకు ప్రాణహాని ఉందని శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భాగస్వాములు శ్రీనివాసరావు, రామచంద్ర, శ్రీలతలు ఎస్పీ జగదీశ్‌కు విన్నవించుకున్నారు. వారు మంగళవారం సాయంత్రం పోలీసు కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సాయినగర్ మూడో క్రాస్‌లో ఉన్న పాత పావని ఆసుపత్రి భవనాన్ని తమతోపాటు సత్యనారాయణరెడ్డి 30 శాతం వాటాతో కొనుగోలు చేశామన్నారు. అయితే ఆసుపత్రిని సుందరీకరణ చేసి కొత్తగా నిర్వహించాలని అనుకున్నాం. అయితే తమ ముగ్గురూ, సత్యనారాయణరెడ్డితో పదేళ్ల పాటు లీజు అగ్రిమెంటు తీసుకున్నామన్నారు. అతనికి భవనం అద్దెలో మాత్రమే వాటా ఉందన్నారు. అయితే అతడు తనకు ఆసుపత్రిలో కూడా వాటా ఇవ్వాలని అడ్డం తిరిగి, బెదిరింపులకు పాల్పడేవాడన్నారు. కాగా ఆసుపత్రిని సుందరీకరణ పూర్తి చేసి ప్రారంభించాలని అనుకుంటున్న సమయంలో గత 23న ఆసుపత్రిపై సత్యనారాయణరెడ్డి, అతని అనుచరులు దాడి చేసి రూ.కోట్ల విలువైన సామగ్రి, యంత్రాలను ధ్వంసం చేశారన్నారు. అందులో తమకు తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. అయితే ఈ దాడి వెనుక మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కుమారుడు భీమిరెడ్డి ఆసుపత్రిలో వాటా కావాలని అడిగారన్నారు. అందుకు తాము అంగీకరించలేదని, తమపై కక్ష పెంచుకుని దాడి చేశారన్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మద్దతు ఉందని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

వైకాపా నాయకుడి రాసలీలలు

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గానికి చెందిన ఓ వైకాపా నాయకుడి రాసలీలల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నార్పల మండలానికి చెందిన వజ్రెడ్డి కొండిరెడ్డి కొంతకాలంగా ఆ మండలంలో వైకాపా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. మూడు నెలల కిందటే అతన్ని వైకాపా ఆ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈక్రమంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆమె ఏకాంతంగా ఉన్న సమయంలో తన ఫోన్‌లో వీడియో తీశాడు. మంగళవారం ఉదయం సదరు రాసలీలల వీడియోలు స్థానిక వాట్సప్ గ్రూపులో పోస్టు చేసి వెంటనే తొలగించాడు. అప్పటికే ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, గుంతకల్లులోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు ఆయన తెలియజేశారు.

టెట్ నిర్వహణకు కేంద్రాల సమస్య

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2025 నిర్వహణకు పరీక్ష కేంద్రాల సమస్య తలెత్తింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్లు పుష్కలంగా ఉంటాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లోనే టెట్, డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో 6 కేంద్రాలు నిర్ణయించారు. ఇందులో 3 కళాశాలలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించలేదు. తాడిపత్రి, గుత్తి, రుద్రంపేటలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి కేంద్రాల నిర్వహణకు అభ్యంతరం తెలిపారు. 3నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు షెడ్యూల్‌లో ప్రకటించారు. బుధవారం నుంచి హాల్‌టికెట్లు తీసుకోవాల్సి ఉండగా మంగళవారం సాయంత్రం వరకూ పరీక్ష కేంద్రాలు ఓ కొలిక్కిరాలేదు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులతో చర్చిస్తున్నారు. కానీ కళాశాలల నుంచి సుముఖత లేదు. ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షలు, కంప్యూటర్ల కొరత కారణంగా పరీక్ష కేంద్రాలకు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. ఉపాధ్యాయ ఉద్యోగార్థులు మాత్రమే కాకుండా, ఈ సంవత్సరం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్‌కు దరఖాస్తు చేశారు. ఈ నెల 10 నుంచి 20 వరకూ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని కళాశాలలు అంగీకరించకపోతే ఇతర జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. అభ్యర్థులు దూరప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాయడానికి వ్యయప్రయాసలు తప్పదు.

పట్టణ రక్షణకు కొరియన్ల చేయూత

రూ.15 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలు, డ్రోన్లు వితరణ

జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, సిబ్బందికి సీసీ కెమెరాలు, డ్రోన్లు అందజేస్తున్న కొరియన్ అసోసియేషన్ ఇన్ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్, సభ్యులు

పెనుకొండ,న్యూస్‌టుడే: పెనుకొండ పట్టణ రక్షణకు చేయూతనిస్తూ కాబా(కొరియన్ అసోసియేషన్ ఇన్ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్) ఛైర్మన్ జంగ్ యంగ్‌హో ఆధ్వర్యంలో 6 సీసీ కెమెరాలు, 3 డ్రోన్లు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్‌కు మంగళవారం స్థానిక పోలీస్ సర్కిల్‌కార్యాలయం వద్ద అందజేశారు. పట్టణ అభివృద్ధి, రక్షణకు సహకరించిన కొరియన్ బృందాన్ని జిల్లా ఎస్పీ సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అవసరమైన 1 నైట్ విజన్ డ్రోన్లు, 2డే విజన్‌డ్రోన్లు, 6ఏఎన్‌పీఆర్(ఆటోమెటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్) సీసీ కెమెరాలు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. కాబా వైస్‌ఛైర్మన్ జిన్ ఊ యంగ్, సీనియర్ సలహాదారులు రా బ్యూంగ్ గీ, కిమ్ టే హైప్, సీక్ యుంగ్ లీ, డీఎస్పీ నరసింగప్ప, సీఐ రాఘవన్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

3BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అందుబాటు ధరతో అనంతనగర నడిబొడ్డున నిర్మిస్తున్న మీనాక్షిఅపార్ట్మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. 7416560179, 9515651111

JOBS

Wanted: (1) ITI Electrician/ Operators (Cold Storage) (2) Supervisor @ Fresh Cart Agro (P) Ltd., Kldroad, ATP (Intervie 03/12/2025) Cell: 9490571605, 8143697965

ట్రాక్టర్ అమ్మడంలో 4-5 సం||ల అనుభవం కల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. స్వరాజ్ ట్రాక్టర్స్ మార్కెటింగ్ కొరకు రామగిరి, నార్పల, గుత్తి, వజ్రకరూరు, తాడిపత్రి, పప్పూరు, BKS, కనగానపల్లి, యల్లనూరు, పుట్లూరు మండలాలకి. 8465066566, 8374559867.

ప్రభుత్వ పాఠశాలలో అవుట్సోర్సింగ్ పద్ధతిలో Vocational Faculty కావలెను, జీ: 28000, అన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలకు # 9848771117, 9849848817

FACULTY/ TEACHERS

Wanted Teachers to Teach Maths, Physics Classes 8 to 10 in ATP. 3 yrs Experience & Residential Preferred Send CV to 9346511313.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆంధ్ర జట్టు 415 పరుగులకు ఆలౌట్

ఎదురీదుతున్న కర్ణాటక జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్ రాష్ట్ర అండర్-19 కూచ్‌బెహర్ నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు పటిష్ఠస్థితిలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కర్ణాటక జట్టుపై 122 ఓవర్లలో 415 పరుగులకు ఆలౌటైంది. కర్ణాటక జట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 62 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసి కష్టాల్లో పడింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 300/5తో తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ ఆరంభించిన ఆంధ్ర జట్టు మరో 115 పరుగులు జోడించి ఆలౌటైంది. కర్ణాటక బౌలర్లు బీఆర్ రతన్ 4/80, ఎం.హిరేమత్ (3/120) మెరుగైన బౌలింగ్‌తో ఆంధ్ర బ్యాటర్లను కట్టడి చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటక జట్టు 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఎదురీదుతున్న సమయంలో మణికంఠ శివానంద్ (56), సిద్ధార్థ్‌అఖిల్ (60 బ్యాటింగ్) ఆదుకున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఆంధ్ర జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించే అవకాశం మెండుగా ఉంది. పోటీలను ఆంధ్ర సెలెక్షన్ కమిటీ సభ్యులు శ్రీవాస్‌రెడ్డి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శర్మాస్‌వలి, ఏసీఎల్‌ఓ సి.వెంకటేష్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి ఆంధ్ర లైజన్ మహేశ్వర్ పర్యవేక్షించారు.

ట్రైనీ ఇంజినీర్లుగా 139 మంది ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హెచ్‌సీఎల్ బెంగళూరు వారు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల విద్యార్థులు మొత్తం 400 మంది ఈ ప్రాంగణ నియామకాల పరీక్షలకు హాజరయ్యారు. వీరికి రాత పరీక్ష, బృంద చర్చలు, టెక్నికల్ రౌండ్లలో ప్రతిభ చూపిన వారిని ట్రైనీ ఇంజినీర్లుగా ఎంపిక చేశారు. మొత్తం 139 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం రూ. 2.40 లక్షలుగా నిర్ణయించారు. ఎంపికైన వారిని కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు, నియామకాల అధికారి ఎం.సురేంద్రనాయుడులు అభినందించారు.

8న ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ మేళా

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 8న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాయపరెడ్డి తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో కోర్సులు పూర్తిచేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనాలని ఆయన సూచించారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్, రెండో ఫొటోలు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, కుల ధ్రువీకరణలు మూడు సెట్లు తీసుకుని ఈ మేళాలో హాజరు కావాలని ఆయన సూచించారు. ఐటీఐ ఉత్తీర్ణులైన లేదా చివరి సంవత్సరం చదువుతూ పరీక్షలు రాసిన వారు కూడా ఈ మేళాలో పాల్గొనవచ్చని సూచించారు. ఐటీఐ పూర్తిచేసి నిరుద్యోగులు ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు

మాట్లాడుతున్న పౌరసరఫరాల డీఎం, జేడీఏ

కణేకల్లు, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 4 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకొంటున్నట్లు పౌరసరఫరాల జిల్లా మేనేజరు రమేష్‌రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లు ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ, సొసైటీ సిబ్బందికి ధాన్యం కొనుగోళ్లు, తేమ శాతం, నాణ్యత పరిశీలనపై శిక్షణ ఇచ్చిన సందర్భంగా వారు మాట్లాడారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలతో పాటు 13 సొసైటీ కేంద్రాల పరిధిలోని ఆర్‌ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 25 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ధర క్వింటాలు రూ.2,389, కామన్ రకం రూ.2,369గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పౌరసరఫరాల సహాయ మేనేజరు ప్రసాద్, తహసీల్దారు బ్రహ్మయ్య, ఏఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకి తల్లిదండ్రులు హాజరుకండి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే మెగా పీటీఎం కార్యక్రమాన్ని ఆయా పాఠశాలలోల చదివే విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పకుండా హాజరుకావాలని డీఈవో ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పాఠశాలకు హాజరు, వారి అభ్యసన తీరు, సాధించిన మార్కులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేస్తారన్నారు. పాఠశాల ప్రగతి, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రధానోపాధ్యాయుడు నివేదిస్తారు. తమపిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలంటే తల్లిదండ్రులు సమావేశంలో విద్యార్థుల గురించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మెగా పీటీఎం కార్యక్రమానికి అనధికార వ్యక్తులకు అనుమతి లేదని డీఈవో తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఉద్యోగాల ఆశ చూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశ చూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడు పాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజ మహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ.75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌ట్యాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎం కార్డులు, పలు నెట్‌వర్కులకు చెందిన సిమ్‌కార్డులు, రూ.53 వేల నగదు, 20 గ్రాముల బంగారం, సంబంధిత కంపెనీ దుస్తులు, ప్రమోషన్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

ఇతర రాష్ట్రాలకు చెందిన 8 మంది.. దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మందిని స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్ (గుండుమల్ల, సత్యసాయి జిల్లా), సిద్దేశ్ శ్రీధర్, సిద్దేశ్ సుదీప్ (మల్లనాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్ (హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య (పార్వతీపురం), నాగప్ప కావ్య (మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి (ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

భార్య గొంతుకోసిన భర్త

ఇన్‌స్టాగ్రామ్‌లో యువకుడితో పరిచయమే కారణం

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని కొత్తపేటలో ఓ వివాహితపై భర్త కత్తితో దాడి చేసి గొంతుకోశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని మంగళవారం కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శాంభవికి ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు పరిచయమయ్యాడు. సదరు వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భర్త పలుమార్లు దండించాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఫోన్‌లో యువకుడితో మాట్లాడుతున్న భార్యను గుర్తించి కత్తితో దాడి చేసి మెడపై కోశాడు. తర్వాత తన ఇద్దరు కుమారులను తీసుకెళ్లాడు. ఈవిషయాన్ని స్థానికులు గుర్తించి బాధితురాలి తల్లికి సమాచారమిచ్చారు. బాధితురాలు ఆసుపత్రిలో కోలుకుంటోంది. తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కేజీబీవీ ఆవరణలోకి ముంపు నీరు!

విద్యాలయం ప్రవేశ గేటు వద్ద ఇలా...

కణేకల్లు, న్యూస్‌టుడే: కొత్తపల్లి సమీపంలోని కేజీబీవీ ఆవరణలోకి కణేకల్లు చెరువు నీరు చేరింది. మంగళవారం ప్రధాన ప్రవేశ గేటువద్ద అడుగు లోతు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సిబ్బంది వాపోయారు. ప్రతిఏటా చెరువు నీటితో విద్యాలయం ఆవరణ ముంపునకు గురవుతున్నా.. అధికారులు నివారణ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఎస్‌ఓ మంజుళ వాపోయారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఎంపీడీఓలకు ఆమె వినతిపత్రం సమర్పించారు. సమస్య ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఎస్ఎస్ఏ డీఈ, ఏఈ, పీఆర్ ఏఈలు క్షేత్రస్థాయిలో విద్యాలయం పరిశీలించి నివారణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పురిటి బిడ్డలపై ప్రత్యేక దృష్టిసారించాలి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: పురిటి బిడ్డలపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించి వారిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సకాలంలో వైద్య చికిత్సలు అందిస్తే మెదడు ఎదుగుదల ఉంటుందని తద్వారా మానసిక వైకల్య సమస్యలు తలెత్తవని సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ షంషాద్‌భేగం, డిప్యూటి ఆర్ఎంవో డాక్టర్ హేమలత తెలిపారు. మంగళవారం అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో నిర్వహించిన చిన్నపిల్లల మెదడు ఎదుగుదలకు ప్రోత్సాహం చూపించటం (న్యూరోడెవలప్‌మెంటల్‌హాబిటేషన్‌డే) కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్ఎన్‌సీయూలో చేరిన బిడ్డలకు సకాలంలో వైద్యసేవలు అందించటంతో పాటు తల్లిపాలు తాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎద్దుల బండిపై నుంచి పడి ఒకరి మృతి

పవన్‌కుమార్

బ్రహ్మసముద్రం: ఎద్దుల బండిపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... కళ్యాణదుర్గానికి చెందిన పవన్‌కుమార్(35) బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లిలో పెయింటింగ్ పనులు చేసుకొంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి సూగేపల్లి చన్నమల్లప్ప స్వామి జాతరకు వెళ్లేందుకు స్థానికులతో కలిసి ఎద్దుల బండిలో బయలుదేరాడు. ప్రమాదవశాత్తు బండిపై నుంచి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ANANTAPUR DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD.,
Sahakara Bhavan, Subash Road, ANANTAPURAMU - 515001
Estd: 1919 Email: adccbankatp@gmail.com, Web: anantapurdccb.com
EXPRESSION OF INTEREST
ADCC Bank Ltd., Anantapur, Invites expressions of Interest for the Printing and Supply of Calendars, Diaries and Table Calendars for the year 2026, For details regarding quantity, specifications and other information, Please Visit the Bank's Website: anantapurdccb.bank.in
02-12-2025 Sd/- Cheif Executive Officer

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

అశోక్‌కుమార్

బత్తలపల్లి న్యూస్‌టుడే : భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయిందని మనస్థాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనా బత్తలపల్లిలోని ఎస్‌బీఐ కాలనీలో జరిగింది. బత్తలపల్లికి చెందిన మినమనూరి మధు పెద్దకుమారుడు అశోక్‌కుమార్ (28)కు కొన్ని రోజుల నుంచి భార్యతో గొడవలున్నాయి. ఈక్రమంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె ఇంటికి రాలేదని దిగులు చెంది మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల కిందట తల్లిదండ్రులు, తమ్ముడు స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చారు. ఎంత సేపటికీ ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులను పిలిచారు. తలుపులు తెరచి చూడగా హాల్‌లో ఉరేసుకొని వేళాడుతూ అశోక్ కుమార్ కనిపించారు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందారని తండ్రి మధు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

హిందూపురం: హిందూపురం పట్టణం డీబీ కాలనీ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి శ్రీకంఠపురం వైపు నడచుకొని వెళుతున్న శంకర్(40)ను వెనకవైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికి అక్కడే దుర్మరణం చెందారు. ఇతను తాపి పనిచేసుకొని జీవనం సాగిస్తుండగా ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను ఏమార్చి నగదు చోరీ

సీసీ ఫుటేజీలో దుండగులు

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వద్దకు వచ్చిన ఓ మహిళను ఏమార్చి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె వద్ద నుంచి నగదును చోరీ చేశారు. బాధితురాలు రమణమ్మ తెలిపిన మేరకు వివరాలు ఇలా... మంగళవారం పులిమివాండ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొండ రమణమ్మ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు బ్యాంకు వద్దకు వచ్చింది. బ్యాంకు అధికారులు సూచనతో నగదుకు సంబంధించిన ఓచర్ రాసుకొని నగదు డిపాజిట్ చేయడానికి క్యూలైనులో నిలబడింది. రమణమ్మను గమనించిన ఇద్దరు దుండగులు నగదును డిపాజిట్ చేయడానికి వచ్చిన విధంగా ఆమె వెనకే నిలుచుని ఆమె నగదును డిపాజిట్ చేస్తుండగా ఓచర్లో సంతకం తప్పుగా ఉందంటూ ఓ వ్యక్తి ఆమెను వెనక్కి పిలిచారు. ఈక్రమంలో ఆమె చేతిలోని ఖాతా పుస్తకం తన చేతిలోకి తీసుకొని కొంత నగదును తన జేబులోకి వేసుకొని తిరిగి మళ్లీ బాధితురాలు చేతికి ఇచ్చి అక్కడి నుంచి ఇద్దరు దుండగులు జారుకున్నారు. ఇది గమనించకుండా బాధితురాలు డిపాజిట్ చేయడానికి క్యాషియర్ వద్దకు వెళ్లగా రూ.52 వేలు ఓచర్ రాసి అందులో రూ.18,500 తక్కువగా ఉండటంతో క్యాషియర్ బాధితురాలకు చెప్పాడు. వెంటనే ఖాతా పుస్తకం తీసుకొన్న వ్యక్తి కోసం వెతగ్గా అక్కడ లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బ్యాంకులోని సీసీకెమెరా సీసీ ఫుటేజ్ తీసుకొని పోలీసులు గాలింపు చర్యలు తీసుకున్నారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

మురడి- తమ్మేపల్లి మార్గం సుగమం

డి.హీరేహాళ్: మురడి నుంచి తమ్మేపల్లి గ్రామానికి వెళ్లే దారి గతంలో గుంతలుపడి, రాళ్లు తేలడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడ్డారు. ఐదు నెలల కిందట 'దారి ఇలా.. ప్రయాణం ఎలా?' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందించి రూ.70 లక్షలు మంజూరు చేయించారు. పనులు సైతం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయగా.. బుధవారం ఈ దారిని ప్రారంభించనున్నట్లు స్థానిక ఎంపీటీసీ సభ్యులు తలారి గంగాధర, అధికారులు పేర్కొన్నారు.

షంషేర్ ఊరేగింపు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం చాబాలలో దర్గా వన్నూరుస్వామి ఉరుసు సందర్భంగా సోమవారం రాత్రి షంషేర్ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్ద కుళ్లాయప్ప ఇంటి నుంచి పుర వీధులలో షంషేర్ ఊరేగింపు వేడుకగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వన్నూరుస్వామి మహోత్సవం

కౌలు రైతులను గుర్తించాలని ధర్నా

ఉరవకొండ, న్యూస్‌టుడే: కౌలు రైతులు కష్టనష్టాలు ఎదుర్కొని సాగు చేస్తున్నారని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్ పేర్కొన్నారు. ఈ- పంట నమోదులో కౌలు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ పలువురు మంగళవారం ఉరవకొండ వ్యవసాయ ఏడీ కార్యాలయంలో ఎదుట ధర్నా చేపట్టారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుతోపాటు మద్దతు ధర కల్పించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు ముష్టూరు వెంకటేశ్, జ్ఞానమూర్తి, శీనప్ప, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

పూడికతీత.. ఏటా మేత

రాయదుర్గం ప్రధాన కాలువ ఇలా...

మొక్కుబడిగానే పనులు

మురుగులో కలుస్తున్న ప్రజాధనం

న్యూస్‌టుడే, రాయదుర్గం, కళ్యాణదుర్గం

ప్రతిఏటా ప్రధాన కాలవలో పూడిక తీత పేరుతో గుత్తేదారులు పండుగ చేసుకుంటున్నారు. కష్టనష్టాలు మాత్రం ప్రజలకు తప్పటం లేదు. దుర్గం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలువల నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. అధికారుల అండతో నాయకులే గుత్తేదారులుగా మారారు. మార్చిలో పూడిక పనులు ప్రారంభించి జులై వరకు నామమాత్రంగా చేసి... పద్దులు చూపించి రూ.లక్షల్లో నిధులు వేనకేసుకున్నారు.

కళ్యాణదుర్గం పురపాలక సంఘంలో రూ. లక్షలు వెచ్చించినా పూర్తిస్థాయిలో పూడిక తొలగలేదు. ధర్మవరం రోడ్డు, ఎర్రనేల వీధి నుంచి సుబేదార్ చెరువు వరకు 7 కిలోమీటర్ల దూరం ప్రధాన కాలవలో 2024లో పూడికతీతకు రూ.30 లక్షలు మంజూరైనా.. జేసీబీలతో పైపైనే పూడిక తొలగించి వదిలేశారు. దీంతో ఎర్రనేల వీధి, జమ్మిచెట్టు సమీపంలో భారీగా చెత్త పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. రాయదుర్గం పట్టణం శాంతినగర్ నుంచి ముత్తరాశి కాలనీ వరకు 6 కిలోమీటర్ల మేర పూడికతీతకు 2024లో రూ.10 లక్షలు, 2025లో రూ.12 లక్షలు, అంతకుముందు మరో రూ.6 లక్షలు కలిపి మొత్తం రూ.28 లక్షలు వెచ్చించినా మురుగు మాత్రం ముందుకు కదలని స్థితి నెలకొంది. అక్కడక్కడ పనులు చేపట్టి మధ్యలో మొక్కుబడిగా ముగించారు. ప్రధాన లక్ష్మీబజారులో బ్రిడ్జి కింద సక్రమంగా పూడిక తీయకపోవటంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. నేతాజీ నుంచి బుడేన్ సాబ్ వీధి, 7, 8 వార్డుల పరిధిలో పూడిక పేరుకుపోయింది.

గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం

- వంశీకృష్ణభార్గవ, వి.దివాకర్‌రెడ్డి, కమిషనర్లు కళ్యాణదుర్గం, రాయదుర్గం

పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సక్రమంగా చేయని గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం. వర్షాల వల్ల వచ్చిన మట్టితో ప్రధాన కాలవలు పూడిపోయాయి. త్వరలో పూడిక తొలగించి మురుగు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: మండలంలోని తిమ్మాపురం గ్రామ వీధులు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. వెంటనే శుభ్రం చేయించాలి.

-గంగప్ప, గ్రామస్థుడు

సమస్య: తిమ్మాపురం పంచాయతీ ఓబుగానిపల్లి గ్రామ వీధుల్లో చెత్తాచెదారం వేయడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు.

-శివ, స్థానికుడు

సమాధానం: పై రెండు గ్రామాల్లోని వీధులను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- పరమేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి, తిమ్మాపురం**

– న్యూస్‌టుడే, కంబదూరు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం: పయ్యావుల

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. దారులు నిర్మించాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రేగటి నాగరాజు, తెదేపా మండల కార్యదర్శి విజయభాస్కర్, కార్యదర్శి గోవింద, పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు పెద్ద కొట్ల రాజేశ్, ప్రతాప్, ముక్కర జయరామిరెడ్డి, శంకరయ్యస్వామి, కుమారస్వామి, చెన్నకేశవులు, వెల్లల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

బైపాస్ వేగంగా పూర్తిచేయండి: ఉరవకొండలో నిర్మిస్తున్న బైపాస్ దారి నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ ఏఈఈ నాగభూషణ, సూపర్‌వైజర్ సుంకన్న పాల్గొన్నారు.

విద్యాలయాల వేళకు బస్సులు నడపాలి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: కళాశాలు, పాఠశాలల వేళలకు ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉంతకల్లు క్రాస్ వద్ద ఎస్‌ఎఫ్ఐ, సీఐటీయూ విద్యార్థి సంఘ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నబిరసూల్, హెడ్ కానిస్టేబుల్ కమలేశ్వర చేరుకుని ఆర్టీసీ అధికారులతో మంతనాలు జరిపి బుధవారం నుంచి వేళకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు శివ, సీఐటీయూ నాయకులు నాగమణి, బాషా తదితరులు పాల్గొన్నారు.

బైఠాయించిన ఎస్‌ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు, విద్యార్థులు

చెత్తరహిత దుర్గంగా తీర్చిదిద్దండి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణాన్ని చెత్తరహిత దుర్గంగా మార్చేందుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం సమైక్యాంధ్ర భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, తిమ్మరాజు, మధు, ఓబులేషు, తిప్పేస్వామి, ఆంజనేయులు, నగేష్ నాయక్, రమేష్, ఆంజనేయులు, నాగ, రుద్రలు పాల్గొన్నారు.

డిపో క్లర్క్‌ను మార్చాలని వినతి

రాయదుర్గం: రాయదుర్గం డిపోలో(ఏడీసీ) సహాయ డిపో క్లర్క్‌గా పనిచేస్తున్న వ్యక్తిని ఇతర విధుల్లోకి మార్చాలని మేనేజరు శ్రీనివాసరావుకు మంగళవారం ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు వినతి సమర్పించారు. ఆయన అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఛార్ట్ దగ్గర విధులు నిర్వహిస్తున్న ఓ కంట్రోలర్, క్లర్క్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో ఇతరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు యు. రామాంజినేయులు, కార్యదర్శి హెచ్‌టీ తిప్పేస్వామి, గ్యారేజీ కార్యదర్శి సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి ఏ. రాఘవ, సీసీఎస్ డెలిగేట్ నాగరాజు పాల్గొన్నారు.

మేళాకు తరలిన రైతులు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలంలో రూపానాయక్‌తండా, వెంకటంపల్లితండా నుంచి 30 మంది రైతులు మంగళవారం తెలంగాణలో నిర్వహించే క్షేత్ర ప్రదర్శన కిసాన్ మేళాకు తరలివెళ్లారు.

కుందుర్పి: తెదేపా కేంద్ర కార్యాలయం మంగళగిరిలో తెదేపా ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణకు మండల పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ధనుంజయ, నాగరాజు తదితరులు మంగళవారం హాజరయ్యారు.

డీటీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పంటలకు మద్దతు ధర కల్పించండి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: రైతులు పండించిన మొక్కజొన్న, వరి, పత్తి ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దారు సురేష్‌బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

కణేకల్లు, న్యూస్‌టుడే: స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెదేపా కార్యకర్త పనిచేయాలని రజక కార్పొరేషన్ డైరెక్టర్, యర్రగుంట, బ్రహ్మసముద్రం గ్రామాల బూత్ పరిశీలకులు పరమేశ్వర పేర్కొన్నారు. మంగళవారం తెదేపా మండల కన్వీనర్ వన్నారెడ్డి ఆధ్వర్యంలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ కన్వీనర్ లాలెప్ప, ఆనందరాజు, మారుతి, గిరి, రామప్ప, రామాంజినేయులు, రఘు, రామాంజినేయులు, రమేష్, చంద్రశేఖరగుప్త, జగన్నాథ, రంగనాథ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా బూత్ పరిశీలకుడు పరమేశ్వర

యాజమాన్య పద్ధతులు పాటించండి

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: అరటి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని డివిజన్ ఉద్యాన అధికారిణి యామిని పేర్కొన్నారు. మంగళవారం కూడేరు, గొట్కూరు గ్రామాల్లోని అరటి తోటలు పరిశీలించిన సందర్భంగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు.

అరటి రైతులతో మాట్లాడుతున్న యామిని

కర్ణాటక మద్యం ప్యాకెట్లు పట్టివేత

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కర్ణాటక నుంచి అక్రమంగా రాయదుర్గంకు మద్యం తరలిస్తున్న వేపరాళ్లకు చెందిన బోయ రామాంజినేయులును మంగళవారం అరెస్టు చేసినట్లు ఆబ్కారీ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. అతడి నుంచి 126 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ ఎస్సై దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాహొన్నూరు దారి తగాదా పరిష్కారం

బొమ్మనహాళ్ న్యూస్‌టుడే: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో ఏళ్ల తరబడి గ్రామ కంఠం నుంచి పొలాలకు వెళ్లే దారి తగాదాను ఎట్టకేలకు మంగళవారం రెవెన్యూ, పోలీసు అధికారులు పరిష్కరించారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణదుర్గం: గొప్ప అవకాశాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం గంధం శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆ పాఠశాలలో మాదిరి పరీక్షల ప్రశ్నాపత్రాలు విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. 60 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉపాధ్యాయులు చిత్తయ్య, గోవింద్, రాజులు, రాఘవేంద్ర, నాగిరెడ్డి, శీనా తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వేగేటు మూసివేత

రాయదుర్గం: రాయదుర్గం- అనంతపురం మార్గంలోని రైల్వే గేటు వద్ద మరమ్మతుల నిమిత్తం బుధవారం రాత్రి 10 గంటల నుంచి గురువారం ఉదయం 7 గంటల వరకు మూసివేస్తున్నట్లుగా రైల్వే అధికారులు తెలిపారు.

దుర్గంలో ఎలుగుబంటి హల్‌చల్

రాయదుర్గం, న్యూస్‌టుడే: ముత్తరాశి కాలనీ సమీపంలోని బైపాస్ రోడ్డులో మంగళవారం ఉదయం ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. స్థానికులు వెంబడించటంతో కొండల్లోకి వెళ్లింది.

కరకముక్కలలో స్వామిత్వ గ్రామసభ

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, ఈఓ లోకేష్ ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులకు పీపీఎం ధ్రువ పత్రాలపై అవగాహన కల్పించారు. సభలో ఈఓఆర్డీ సత్యబాబు, ఏఓ భాస్కర్ బాబు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సులు సామర్థ్యంతో ఉండాలి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పాఠశాలల యాజమాన్యం ఎప్పటికప్పుడు బస్సులను పరిశీలిస్తూ పూర్తిస్థాయిలో సామర్థ్యం ఉండేలా చూడాలని రవాణాశాఖ ప్రాంతీయ అధికారి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం దొడగట్ట రోడ్డులో పలు పాఠశాలల బస్సులను ఏఎంవీఐ శ్రీనివాసులుతో కలిసి తనిఖీ చేసిన అనంతరం మాట్లాడారు. అగ్నిమాపక యంత్ర సామగ్రికి లేని బస్సుల్లో వెంటనే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఎరువుల విక్రయాలు నిలుపుదల

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. డివిజన్ తాడిపత్రి వ్యవసాయ సంచాలకులు రవి ఆధ్వర్యంలో ఏడీఏ యల్లప్ప, ఏవో శ్రావణ్‌కుమార్‌లు సాయి, జయలక్ష్మీ ఫర్టిలైజర్స్, రాయల్ ట్రేడర్స్‌లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పరిశీలించారు. కొన్నింటికి అనుమతులు లేవని గుర్తించారు. రూ.8,66,242 విలువ చేసే ఎరువుల విక్రయాలు నిలుపుదల చేసినట్లు వారు తెలిపారు.

గ్రామీణ పోలీసుస్టేషన్ సీఐగా గణేశ్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతరం జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న గణేశ్ మంగళవారం కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన వంశీకృష్ణ అనంతపురం వీఆర్‌కు వెళ్లారు.

అర్హత ఉన్న వారందరికీ గోకులం షెడ్లు

ఉరవకొండ, బెళుగుప్ప, న్యూస్‌టుడే: పశు సంరక్షణలో భాగంగా అర్హత ఉన్న రైతులందరికీ గోకులం షెడ్లను మంజూరు చేస్తామని డ్వామా పీడీ సలీం బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన కూడేరు మండలం ఇప్పేరు, కూడేరు, చోళసముద్రం, బెళుగుప్ప మండలం అంకంపల్లి, రామసాగరం గ్రామాల్లో పర్యటించారు. పీఏబీఆర్ కుడి కాలువలో పూడిక తీత పనులను పరిశీలించారు. శ్రామికుల హాజరు శాతాన్ని తనిఖీ చేశారు. ఏపీవోలు పోలేరయ్య, మురళీ తదితరులు ఉన్నారు.

శ్రామికుల హాజరు తనిఖీ చేస్తున్న పీడీ సలీంబాషా

పీఎం ఆవాస్ యోజన గడువు పెంపు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ ప్లస్, ఎన్టీఆర్ పథకం సర్వే గృహ నిర్మాణం నిమిత్తం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు రాయదుర్గం హౌసింగ్ ఇన్‌ఛార్జి డీఈ రామమూర్తి, ఏఈ రాంమోహన్ తెలిపారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణానికి చెందిన 'నవ్యాంధ్ర మెకానిక్ 2 వీలర్స్' సంఘ సభ్యుడు శ్యాంసుందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఆ కుటుంబానికి మంగళవారం యూనియన్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. రాయదుర్గం నవ్యాంధ్ర మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు అన్వర్‌బాష, సభ్యులు శ్యాంసుందర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రుద్రంపల్లి పంచాయతీ ఏర్పాటుకు వినతి

కుందుర్పి: పెద్ద పంచాయతీగా కొనసాగుతున్న ఎనుముదొడ్డి నుంచి రుద్రంపల్లిని విడదీసి పంచాయతీగా ఏర్పాటు చేయాలని రుద్రంపల్లి, గురువేపల్లి గ్రామాలకు చెందిన తెదేపా నాయకులు మంగళవారం ఎంపీడీఓ లక్ష్మీశంకర్, ఆర్డీఓ కార్యాలయం ఏఓకు వినతిపత్రాలు అందజేశారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ఆసుపత్రిలో పింఛను అందజేత

కుందుర్పి: గురువేపల్లికి చెందిన పింఛనుదారుడు నాగేష్ అనారోగ్యంతో..అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛను అందించేందుకు ఎనుములదొడ్డి కార్యదర్శి సోమశేఖర్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పింఛను నగదు అందజేశారు. తెదేపా నాయకులు మల్లికార్జున, శివలింగప్ప, బొజ్జప్ప పాల్గొన్నారు.

దీక్షకు అంగన్‌వాడీ సిబ్బంది మద్దతు

కళ్యాణదుర్గం గ్రామీణం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు చేపడుతున్న రిలే దీక్షలకు మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు పాతక్క, వన్నూరమ్మ మద్దతు తెలిపారు. రిలే దీక్షలో సీఐటీయూ తాలూకా అధ్యక్షుడు రంగనాథ్, కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజరు అశోక్, తిప్పేస్వామి, మల్లేష్ పాల్గొన్నారు.

పోలీసు క్వార్టర్స్ స్థలం పరిశీలన

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పోలీసు స్టేషన్ వెనుక భాగంలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్‌ను మంగళవారం ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు నీలకంఠేశ్వరరెడ్డి, రవిబాబు, గ్రామీణ సీఐ నీలకంఠేశ్వరలు తదితరులు పరిశీలించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృత్యువాత

కళ్యాణదుర్గం గ్రామీణం: ఎన్.వెంకటంపల్లిలో ఆనంద్ అనే కాపరికి చెందిన గొర్రెల మందపై సోమవారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేయగా సుమారు 40 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దీనివల్ల సుమారుగా రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించేలా చూడాలని బాధితుడు కోరుతున్నారు.

మెగా పీటీఎంకు ఆహ్వానం

కుందుర్పి: పాఠశాలల్లో 5న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని అపిలేపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం బీసీ తిమ్మప్ప ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలకు ఆహ్వాన పత్రాలు అందించారు.

టీచర్ల భర్తీకి దరఖాస్తులు..

రాయదుర్గం, రాయదుర్గం గ్రామీణం: వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 28 ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేసే నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఇర్షాద్ అహమ్మద్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 3 నుంచి 5వ తేదీలోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వైభవంగా శ్రీచన్నమల్లప్ప స్వామి జాతర

సూగేపల్లి(బ్రహ్మసముద్రం): సూగేపల్లిలో కొలువైన శ్రీ ఆరూఢ చన్నమల్లప్ప స్వామి జాతర వైభవంగా సాగింది. చన్నమల్లప్ప స్వామి మఠంలో ప్రస్తుత మఠాధిపతి శివలింగాలకు రుద్రాభిషేకం, బిల్వార్చన విశేష అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 12 గంటల సమయంలో మఠాధిపతి అశ్వరథం ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు.

అశ్వరథంపై ఊరేగుతున్న చన్నమల్లప్ప స్వామి మఠాధిపతి

రాఘవేంద్రస్వామి మఠంలో...

కళ్యాణదుర్గం: దొడగట్ట రోడ్డులో కొత్తగా నిర్మించిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. మఠం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రాలయ రాఘవేంద్ర స్వామి పీఠాధిపతులు 1008వ శ్రీశ్రీశ్రీ సుబుధేంద్రతీర్థ శ్రీపాదులవారు హాజరయ్యారు.

గుమ్మఘట్ట: తాళ్లకెర వీరభద్రస్వామి రథోత్సవ వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా మార్గశిర మాసంలో జరిగే రథోత్సవానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతం నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు.

మల్లిపల్లిలో హనుమద్ వ్రతం

కళ్యాణదుర్గం గ్రామీణం: మల్లిపల్లి గ్రామంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రత పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ అధికారులు, మాజీ సర్పంచి కరణం సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగాయి.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమద్ వ్రతంను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్, ఆలయ ధర్మకర్త శ్రీనాథ్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తే.. నీటి ఇక్కట్లు

విడపనకల్లు మండలం మాళాపురంలోని శ్మశాన వాటిల్లోని రెండు ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. ఈ విషయాన్ని మూడు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా.. పట్టించుకునే వారే కరవయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. అంత్యక్రియలకు వచ్చిన వారు స్థానిక ట్యాంకుల్లో నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకులకు నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విడపనకల్లు**

అందని సేవలు.. అవస్థల్లో రోగులు

వజ్రకరూరు మండలం కొనకొండ్లలో దూర ప్రాంతాలకు రాలేని చిన్నారులు, బాలింతలు, గర్భవతులకు స్థానికంగానే వైద్యం అందించాలనే లక్ష్యంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం(విలేజ్ హెల్త్ క్లినిక్) రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. దీంతో ఆ భవనం చుట్టూ ముళ్లచెట్లు, పొదలు పెరిగాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై స్థానిక సచివాలయ కార్యదర్శి సుదర్శన్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గుత్తేదారు భవనాన్ని అప్పగించలేదని, ఉన్నతాధికారులతో మాట్లాడి ఆస్పత్రి భవన పరిసరాలు శుభ్రం చేయించి వైద్య సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, వజ్రకరూరు**

అల్లుకున్న నిర్లక్ష్యం

ఉరవకొండలో ప్రధాన దారి నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే దారిలోని ఎస్‌బీఐ సమీపంలోని నియంత్రిక, స్తంభానికి పచ్చని తీగ నిండుగా అల్లుకుంది. అది విద్యుత్తు తీగలను సైతం తగులుకుని ఉంది. దారి అంచునే ఇది ఉండడంతో పచ్చని తీగ ద్వారా విద్యుత్తు సరఫరా అవుతుందేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతుంటారు. దీనిని విద్యుత్తు అధికారులు గుర్తించి తీగను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

రక్తస్రావంతో బాలింత దుర్మరణం

కణేకల్లు: బాలింత తీవ్ర రక్తస్రావంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.హీరేహాళ్ మండలం కల్యంకు చెందిన హెచ్ **గంగమ్మ**(26) మాల్యంకు చెందిన డ్రైవర్ సురేష్‌తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. 7 నెలల గర్భిణిగా ఉన్న గంగమ్మ నెలన్నర కిందట పుట్టింటికి వెళ్లింది. సురేష్ తన భార్యను చూడటానికి సోమవారం అత్తారింటికి వెళ్లగా.. ఆమె కడుపునొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించిన ఆయన కుటుంబ సభ్యుల సాయంతో రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి, తదుపరి కళ్యాణదుర్గం ఆర్డీటీకి తీసుకెళ్లారు. పరీక్షించిన ఆర్డీటీ వైద్యులు గర్భంలోని శిశువుకు గుండె స్పందన లేదని చెప్పడంతో వెంటనే అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బిడ్డ అడ్డం తిరిగి మృతిచెందిందని చెప్పి సిజేరియన్ చేసి ఆడ శిశువును బయటకు తీశారు. తదుపరి కుట్లు వేసినా. . రక్తస్రావం ఆగకపోవడంతో గంగమ్మ అపస్మారక స్థితికి చేరుకుని మృతిచెందింది. ఏడాదిన్నర కొడుకు తల్లిలేని అనాథ అయ్యాడని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

మాట్లాడుతున్న తులసిరెడ్డి

'భాగవత పఠనంతోనే మోక్షప్రాప్తి'

నార్పల, న్యూస్‌టుడే: భాగవతం పఠనంతో మోక్షప్రాప్తి కలుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించిన భాగవత సప్తాహం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. భాగవతం, రామాయణ పురాణాలు భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బ్రహ్మేంద్రస్వామి, భక్తులు నరేంద్రనాయుడు, చిన్నబయన్న, నారాయణప్ప, మునీంద్ర, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మద్దయ్య

నార్పల, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం బి.పప్పూరు వైద్యశాలలో సీజనల్ వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. మురుగు ఆవాసాలపై బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, సూపర్‌వైజర్ శ్రీధర్‌మూర్తి, నూర్‌బాషా పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం ఎదుట మురుగు పారుతోంది. భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
-అంకన్న(గూగూడు).

సమాధానం: పంచాయతీ అధికారులతో మాట్లాడి ఆలయం ఎదుట మురుగు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటాం.
-మమత, ఎంపీడీవో, నార్పల
- న్యూస్‌టుడే, నార్పల

సమస్య: తాడిపత్రిలోని టైలర్స్ కాలనీలో భూగర్భ కాలువలు బ్లాక్ అయ్యాయి. **- మహబూబ్‌బాషా, స్థానికుడు**

సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాను.
-నాగేంద్ర, మున్సిపల్ ఏఈ

సమస్య: తాడిపత్రిలో నంద్యాల రోడ్డు నుంచి సాయిబాబా ఆలయానికి వెళ్లే దారి దుస్థితికి చేరింది. దుమ్ముధూళి భారీగా రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- రామాంజనేయులు, వాహనదారుడు**

సమాధానం: రోడ్డు నిర్మించాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.**- తేజ, మున్సిపల్ ఏఈ. - న్యూస్‌టుడే, తాడిపత్రి**

సమస్య: గుంతకల్లులో అంజుమాన్ రోడ్డులో గుంతల ఏర్పడి వాహన చోదకుల అవస్థలు పడుతున్నారు. **- బాలు.**

సమాధానం: తొందరలోనే ప్యాచ్ వర్కులు చేపడతాం.**- హరికృష్ణ, ఏఈ**

సమస్య: టీబీ రోడ్డులో విజ్ఞాన స్కూల్ దగ్గర రోడ్డు పక్కన డ్రైనేజీ గుంత ఓపెన్‌లో ఉంది. దానికి మూత ఏర్పాటు చేయాలి.
- నాగరాజు.

సమాధానం: పరిశీలించి దాని పై బండను ఏర్పాటు చేస్తాం.**- హరికృష్ణ, ఏఈ**
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

కాలనీలు.. సమస్యలకు లోగిళ్లు!

● ప్రజలకు తప్పని పాట్లు ● ఏళ్లుగా పట్టించుకోని తీరు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఏళ్లుగా సౌకర్యాలు లేక కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు సౌకర్యాలు కల్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. ప్రధానంగా రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్తు లైన్లు లేని కారణంగా అవస్థలు పడుతున్నారు.

● అంబమ్మగుడి కాలనీకి సంబంధించి మున్సిపల్ అధికారులు గతంలో నిర్మించిన సిమెంటు రోడ్డు కంకరతేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. కూలగొట్టిన ఇంటి నిర్మాణాల వ్యర్థాలను రోడ్ల పైనే పడేస్తున్నారు. వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గుడికి సమీపంలోని కాలనీకి చెందిన కల్వర్టు సగభాగం కూలిపోయింది. నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. శివారులో రహదారి సౌకర్యం లేదు.

● ఏకలవ్యనగర్‌లోనూ రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధానంగా నివాస గృహాల వద్ద ఉన్న బండ రాళ్లను తొలగించలేదు. మురుగు కాలువలు లేని కారణంగా ఇళ్ల మధ్యలో మురుగు పెద్దఎత్తున నిలుస్తోంది. చుట్టపక్కల జనం రోగాల బారిన పడుతున్నారు. వీధి దీపాల కొరత వేధిస్తోంది. సగం కాలనీకే విద్యుత్తు స్తంభాలున్నాయి. మిగతా కాలనీల్లో ఏర్పాటు చేయలేదు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

ఏకలవ్యనగర్‌లో మురుగు కాలువల ఏర్పాటుతో పాటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను రూపొందించి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. అంబమ్మగుడి కాలనీ రోడ్డు మరమ్మతుకు అవసరమైన చర్యలు చేపడతాం. కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తాం.
- షబానా, మున్సిపల్ డీఈ

ఏకలవ్యనగర్ కాలనీలో ఇళ్ల ముందే మురుగు మధ్య బండరాళ్లు

పురపాలిక : గుంతకల్లు | కాలనీలు : పాతగుంతకల్లు ఏకలవ్యనగర్, అంబమ్మగుడి కాలనీ | నివాస గృహాలు : 2 వేలు | వార్డులు : 2

రైతులు ఆందోళన చెందవద్దు

రెడ్డిపల్లిలో అరటి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి ఉమాదేవి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: అరటి ధరలు పెరుగుతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందవద్దని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె రెడ్డిపల్లిలో అరటి తోటలు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ధరలు పెరుగుతున్నందున జిల్లాలో రైతులు పంటను నాశనం చేసుకోవద్దని కోరారు. వ్యాపారులతో మాట్లాడి అరటి పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా వ్యాపారులతో చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు దేవానంద్, శైలజ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

బుక్కరాయసముద్రం, గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి అనారోగ్యంతో బాధపడుతున్న పేదల పాలిట వరమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె పలువురికి ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు.

సీఎం సహాయనిధి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

● గార్లదిన్నె మండల పరిధిలోని ఇల్లూరుకు చెందిన శంకర్‌కు రూ.30,833లు, పాత కల్లూరుకు చెందిన శ్రీకాంత్‌కు రూ.1,80,000ల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ పాండు, నాయకులు సామల మధు, నల్లపరెడ్డి పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల చోరీ

ఘటనా స్థలం వద్ద ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: కోనాపురం గ్రామ సమీపంలో కార్తికేయ ఎంటర్‌ప్రైజస్ స్టోరేజ్ పాయింట్‌లో భూగర్భ గనులకు ఉపయోగించే పేలుడు పదార్థాలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తాడిపత్రికి చెందిన శ్యామ్‌కిరణ్ అనే వ్యక్తి సమీపంలో ఉన్న కొండలో గనులు నిర్వహిస్తున్నారు. అందులో ఉపయోగించే పేలుడు పదార్థాలను ఇక్కడ నిల్వ చేసుకోగా గోడకు రంధ్రం పెట్టి సుమారు రూ.8లక్షలు విలువ చేసే మందు గుండు సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం గనుల వద్దకు వెళ్లి పరిశీలించగా చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరితోపాటు సీఐ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో అక్కడికి చేరుకుని డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

వ్యవసాయ సామగ్రి ఇప్పిస్తానని మోసం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని మొలకతాళ్లకు చెందిన నలుగురు రైతులకు వ్యవసాయ పరికరమైన పవర్ టిల్లర్ తక్కువ ధరలకు ఇప్పిస్తానని బ్రహ్మసముద్రం చెందిన పోలేపల్లి నవీన్ మోసం చేశాడని బాధిత రైతులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొలకతాళ్లకు చెందిన రామాంజనేయులు, ఆదినారాయణ, భార్గవ్, నరసింహలకు పవర్‌టిల్లర్ తక్కువ ధరకు ఇప్పిస్తానని, ఒక్కో టిల్లర్ ధర రూ.60వేలని చెప్పి నలుగురు రైతులతో నవీన్ రూ.2.4లక్షలు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయించుకున్నాడు. మూడు మాసాలు అవుతున్నా పరికరాలు ఇవ్వకుండా మోసం చేశారని, డబ్బు ఇవ్వమని ఫోన్ చేద్దామంటే చరవాణి పనిచేయడంలేదని బాధితులు పోలీసులకు మొరపెట్టుకున్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు నిర్వహించారు. ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్సును అమలు చేసి పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వం 29 శాతం ఐఆర్‌ను ప్రకటించి, బకాయిలను చెల్లించాలని అన్నారు. సంఘం నాయకులు గంగాధర్, చిరంజీవి, లక్ష్మీనారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'ఆ అధికారిని బదిలీ చేయండి'

గుంతకల్లు: పట్టణంలో విద్యుత్తు సమస్యతో వినియోగదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని తెదేపా కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని రెండో డిస్ట్రిబూషన్‌కు చెందిన ఎ.ఇ. రఘునాథ్ సక్రమంగా విధులు నిర్వహించడంలేదని, సమస్యలను చెప్పినా పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అతన్ని వెంటనే బదిలీచేసి మరో ఇంజినీరును నియమించాలని కోరారు. దీనిపై స్పందించిన ఏడీఈ తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. కౌన్సిలర్లు నగేశ్, లక్ష్మి, నాగరత్న, మాజీ కౌన్సిలర్లు రంగన్న, అహమ్మద్ బాషా, తెదేపా పట్టణ మాజీ అధ్యక్షుడు అంజి, సీపీఐ నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.

తాడిపత్రి తహసీల్దార్‌గా ట్రైనీ ఐఏఎస్ అధికారి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి తహసీల్దార్‌గా శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారి సచిన్ రహర్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 బ్యాచ్‌లో ఐఏఎస్ ఉత్తీర్ణత సాధించారని, శిక్షణ సమయంలో తాడిపత్రికి నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అయితే జనవరి 4వ తేదీ వరకు విధుల్లో ఉంటారని, ఆ తరువాత గతంలో ఉన్న తహసీల్దార్ యథావిధిగా కొనసాగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బాలికలకు ఎలక్ట్రిక్ బైకు వితరణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లుకు చెందిన అక్కాచెల్లెళ్లు అమూల్య, నందిని ఎస్‌జీఎఫ్ ఆంధ్రాజట్టులో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. దీంతో మంగళవారం మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా గుత్తిలోని తన నివాసంలో రూ.60వేల విలువ చేసే కొత్త ఎలక్ట్రిక్ బైకును అందజేశారు. భారత జట్టులో స్థానమే లక్ష్యంగా సాధన చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చేనెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే ముందు ఆర్థిక సాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు బాలికల తండ్రి ధనుంజయ తెలిపారు.

ఎలక్ట్రిక్ బైకును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా

అవినీతికి పాల్పడితే చర్యలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఎవరైనా రేషన్ దుకాణదారులు అక్రమాలకు పాల్పడితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక గన్నెవారిపల్లి కాలనీలోని రేషన్‌దుకాణాలను తనిఖీ చేశారు. కాలనీలోని 1209034 దుకాణంలో ఈ-పోస్ యంత్రంలో ఉన్న సరకుల నిల్వలు, భౌతికంగా ఉన్నవాటిలో వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. 240 కిలోల బియ్యం, 5 కిలోల జొన్నలు, 230 రాగులు వ్యత్యాసం ఉన్నట్లు తేలడంతో దుకాణాన్ని జప్తు చేసి నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సమస్యలు చెబితే పరిష్కరిస్తాం

తాడిపత్రి, న్యూస్‌టుడే: కాలనీలలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే వాటికి పరిష్కారం చూపుతామని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కడపరోడ్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలలో తాగునీటి, మురుగు, సీసీ దారులు, పారిశుద్ధ్యం, విద్యుత్తు వంటి సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని ఆయన సూచించారు. అనంతరం ప్రభుత్వం నుంచే వచ్చే పథకాల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

కళ్లప్పగించి చూస్తున్నారంతా!

నిమిషానికి 200కు పైన వాహనాలు ప్రయాణించే గుంతకల్లులోని ప్రధాన రహదారిలో (మహాత్మాగాంధీరోడ్డు) గుంతలు పడి దారుణంగా ఉంది. ఇక్కడ తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆసుపత్రి సమీపంలో, పొట్టిశ్రీరాములు కూడలి, కసాపురంరోడ్డు క్రాస్, పెట్రోలు బంకు సమీపంలో గుంతలు ఎక్కువగా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులకు రోడ్డు పరిస్థితి తెలిసి కూడా మరమ్మతులు చేయకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, గుంతకల్లు

ఏడేళ్లైనా మోక్షం లభించదా!

గుత్తి గ్రామీణంలోని మహిళలకు భవనాన్ని నిర్మించారు. గుత్తిఆర్.ఎస్.కు మంజూరైన భవనాన్ని ఇప్పటికీ పూర్తి చేయలేదు. డ్వాక్రా మహిళల సౌకర్యార్థం ఏడేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వం ఆయా పనులు ప్రారంభించింది. తర్వాత ఎన్నికల్లో తెదేపా అధికారాన్ని కోల్పోవడంతో వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు గుత్తేదారుడు అంటున్నాడు. అధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గుత్తి

కల్వర్టు నిర్మించరూ!

గుత్తి-బేతాపల్లి రోడ్డులో చెట్నేపల్లి వద్ద పంచాయతీ రాజ్ ఇంజినీర్లు కల్వర్టును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. తారురోడ్డు శిథిలం కావడంతో మట్టితో రోడ్డును ఏర్పాటు చేసి వర్షపునీటి ప్రవాహానికి వీలుగా సిమెంట్ పైపులను సమకూర్చారు. మట్టిరోడ్డుతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. కల్వర్టును సిమెంట్‌తో నిర్మించి తారురోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, గుత్తి

వృథాగా కుళాయిలు

గుంతకల్లు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులు కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు మూడేళ్లుగా వృథాగా ఉన్నాయి. రోగులు తాగునీటి కోసం బయటకు రావాల్సి వస్తోంది. ఆసుపత్రి లోపల వృథాగా ఉన్న కుళాయిలను ఆర్వోప్లాంటుకు అనుసంధానం చేసి వినియోగంలోకి తీసుకొని వస్తే ఇబ్బందులు ఉండవని సహాయకులు ఆసుపత్రి అధికారులను అంటున్నారు.
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

గేటు పడితే ఆపదే!

గుంతకల్లులో హనుమాన్ సర్కిల్‌లో రైల్వే గేటు పడిదంటే ప్రజలకు అవస్థ తప్పటం లేదు. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేసినప్పుడు గేటు తీయడానికి పది నుంచి 15 నిమిషాల వరకు సమయం పడుతోంది. విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యం కోసం వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. 108 వాహనం ఆగాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. డీఎంఎం రైలు గేటు, కసాపురం రోడ్డులో రైల్వే బ్రిడ్జి వల్ల ట్రాఫిక్ సమస్యలతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, గుంతల్లు పట్టణం

బడి పిల్లలకు అనుకూలంగా బస్సులు నడపాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి అనుకూలంగా బస్సులు నడపాలని మంగళవారం గుంతకల్లులో ఆర్టీసీ డిపో వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు పాతకొత్తచెరువులో గ్రామంలోకి రావటం లేదు, హైవేమీదుగా వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. గ్రామంలోకి బస్సులు వచ్చే విధంగా చూడాలని ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. బస్సులను సర్దుబాటు చేస్తామని డీఎం చరవాణిలో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆటలకు దూరంగా విద్యార్థులు

యాడికి, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యం. అయితే చాలాచోట్ల క్రీడా స్థలాలు లేకపోవడంతో ఒత్తిడి మధ్య చదువులు అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో తొమ్మిది ప్రభుత్వ, ఎనిమిది ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఒకటి, రెండు మినహా మిగతా పాఠాలలకు ఎటు వంటి ఆట స్థలాలు లేవు. దాదాపు వేల మంది విద్యార్థులు ప్రతిరోజూ విద్య అభ్యసించడానికి మాత్రమే వెళ్లొస్తున్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదు. ప్రధానమైన యాడికి జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం ఉన్నా, ఆ స్థలం తమదంటూ స్థానికుడొకరు సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. రాయలచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఆటలకు కావలసిన స్థలం లేక ఉన్నదాంట్లోనే సర్దుబాటు చేసుకుంటున్నారు. చందన, నగరూరు, తూట్రాళ్లపల్లి, కేజీబీవీ, ఆదర్శలో స్థలమే లేదు. కోనఉప్పలపాడులో దాత చవ్వా గోపాల్‌రెడ్డి ఇచ్చిన స్థలంలో విద్యార్థులు ఆటలాడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో స్థలాల ఆచూకీ అసలు కనబడదు.

కోర్టు వివాదంలో ఉన్న యాడికి జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం

క్రీడలు ముఖ్యమే..

ఆటల్లో మంచి ప్రావీణ్యం సాధిస్తే ప్రభుత్వ కొలువుల్లో చేరడానికి కొంత ఆస్కారం ఉంది. గ్రామీణ స్థాయి నుంచే ఆటలు ఆడటానికి పాఠశాలల్లో స్థలం లేకపోవడం చాలా బాధాకరం. క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ, పాఠశాలల్లో క్రీడా స్థలం ఏర్పాటుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. **- హాజీపీరా, యాడికి**

ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గ సభ్యులు

ఉద్యోగుల పక్షాన నిర్విరామ పోరాటం

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తాము ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూనే ఉన్నామని ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ అన్నారు. మంగళవారం ఎన్జీఓ కార్యాలయంలో గుంతకల్లు తాలూకా విభాగం గెజిటెడ్, నాన్ గెజిటెడ్ సాధారణ, మహిళా విభాగానికి ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ముగిసిన తరువాత విజయం సాధించిన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీఎన్జీజీఓ మహిళా విభాగం గుంతకల్లు తాలూకా అధ్యక్షురాలిగా గ్రేస్‌లత, సహ అధ్యక్షురాలు స్రవంతి, ఉపాధ్యక్షుడు అక్షలోయాస్, లక్ష్మి, కన్వీనర్ హేమ, సంయుక్త కన్వీనర్లు విజయలక్ష్మి, శ్రీవిద్య, కోశాధికారిగా లావణ్య ఎన్నికయ్యారు. సాధారణ ఏపీఎన్జీజీఓ తాలూకా విభాగానికి అధ్యక్షురాలిగా సంపూర్ణ ఎస్తర్, అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ జవయవర్ధన్ రెడ్డి, ఎర్రిస్వామి, టి.కృష్ణ, కార్యదర్శి చాంద్‌బాషా, సంయుక్త కార్యదర్శులు సి.కె. రామాంజనేయులు, సుధాకర్, నారాయణస్వామి, వెంకటలక్ష్మి, కోశాధికారి ఎ.రామాంజనేయులు ఎన్నికయ్యారు.

వృద్ధురాలి మృతి

గార్లదిన్నె: రామదాసుపేట సమీపలో రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బసిరెడ్డి నాగమ్మ(76) మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. రెండు రోజుల కిందట పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరుకు చెందిన బసిరెడ్డి నాగమ్మ కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా కిందపడటంతో గాయాలైన విషయం తెలిసిందే.

అంబేడ్కర్ సర్కిల్‌లో బోర్డు వివాదం!

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బోర్డు ఏర్పాటు తీరు రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దళితసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. రెండు రోజులకు గుర్తుతెలియని వ్యక్తులు దానిని బోర్డును తొలగించారు. ఈ విషయంపై దళిత సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అదే ప్రదేశంలో బోర్డు ఏర్పాటు చేయడానికి దళిత సంఘాల నాయకులు యత్నించడంతో స్థానిక బీసీ కాలనీవాసులు అభ్యంతరం తెలిపారు. దీనిని అడ్డుకుని అక్కడే భైఠాయించారు. పోలీసులు వారందరినీ అక్కడ నుంచి పంపేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని గంజాయిని విక్రయిస్తున్న యాశర్‌అలీ, షేక్ మహమ్మద్ అనే ఇద్దరు నిందితులు కటకటలాపాలయ్యారు. మంగళవారం గుంతకల్లులో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ మనోహర్, ఎస్సై కొండయ్యతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రెండున్నర కిలోల గంజాయిని సీజ్ చేశామని తెలిపారు. గుంతకల్లులో గంగానగర్ కాలనీకి చెందిన యాశర్‌అలీ అలియాస్ హాజీ ఉజ్జీత్ అలీ, షేక్ మహమ్మద్, మరో ముగ్గురు కలిసి ఆరు నెలలుగా మహారాష్ట్రలోని థానే జిల్లా కోసా పట్టణం మురముర రైల్వే స్టేషన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులతో గంజాయిని కొనుక్కొని వచ్చి గుంతకల్లులో రైల్వే స్టేషన్ ప్రాంతం వాసులకు అమ్మేవారని వివరించారు. షేక్ మహమ్మద్ వారం రోజుల క్రితం మహారాష్ట్రకు వెళ్లి రెండున్నర కిలోల గంజాయిని రూ.25వేలుకు కొనుక్కొని వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మాలని ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో రైల్వే ఆసుపత్రి వెనకలా పాడుబడిన రైల్వే క్వార్టర్స్‌కు దగ్గరలో ఉన్నారన్న సమాచారం మేరకు నిందితులను అరెస్టు చేశారు. గంజాయి, నగదు సీజ్ చేశామని, మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ మనోహర్, పక్కన ఎస్సై కొండయ్య, సిబ్బంది

'పది' పరీక్షల నమూనా పత్రాలు ఆవిష్కరణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ నేతలు పదో తరగతి పరీక్షల నమూనా పత్రాలను ఎంపీడీవో దేవదాసు, ఎంఈవోలు మస్తాన్‌రావు, సబ్బురాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర తెలిపారు.

సీపీఎం కార్యకర్తల నిరసన

గుత్తి, న్యూస్‌టుడే : గంజాయి ముఠా నెల్లూరులో తమ నాయకుడు పెంచలయ్యను హత్య చేసినందుకు మంగళవారం గుత్తిలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను ముఠా హత్య చేసినట్లు వాపోయారు. తమ నాయకుడి హత్యకు నిరసనగా గుత్తిలోని గాంధీచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్మల, రేణుక, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ షేక్షావలి S/o షేక్ అమీర్‌హుస్సేన్, R/o D.No.7/32-G, భాగ్యనగర్, గుంతకల్లు. నా క్లయింట్ షేక్షావలి తేది 02-10-2025న పాత ఇంటి నుండి కొత్త ఇంటికి మారుతున్నప్పుడు అతనికి సంబంధించిన Sale Deed Document No.1435/1991, Dt: 26-10-1991, S.R.O Guntakal (Link Document) తప్పిపోయినది. దీనికి సంబంధించి 11-11-2025న I Town Police Stationలో ఫిర్యాదు చేయడమైనది. ఇందుకు గాను పోలీసు వారు పైన తెలిపిన Sale Deed కొరకు ప్రయత్నించినా అది దొరకనందున పోలీసువారు దాన్ని Missing Document క్రింద Certificate జారీ చేయడమైనది. Dt: 21-11-25. కావున ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పైన తెలిపిన Document ఎవరికైనా దొరికినా లేదా తెలిసినా నాకు గానీ నా Claintకు గానీ తెలియచేయవలసినది.

షేక్షావలి, గుంతకల్లు. సెల్: 9052163413

మాదినేని రవిశంకర్, అడ్వకేట్, గుంతకల్లు
సెల్ నెం: 9247832306

(c) eenadu

'సమస్యలు పరిష్కరించకపోతే రోడ్లు దిగ్బంధిస్తాం!'

అనంతపురంగ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులతో కలిసి రోడ్లు దిగ్బంధిస్తామని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అన్నదాతల కష్టాలు వర్ణనాతీతంగా మారాయన్నారు. 18 నెలలుగా ఒక్క పంటకు కూడా మద్దతు ధర కల్పించడం లేదని విమర్శించారు. జిల్లాలో లక్ష ఎకరాలు బీడుగా మారినా పట్టించుకోలేదన్నారు. దళారులు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. రాయలసీమను రైతు ఆత్మహత్యల నిలయంగా మార్చారన్నారు. జిల్లాకు నీళ్లు వస్తున్నా ప్రభుత్వం సరిగా అందించడంలేదని విమర్శించారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

'రాజకీయంగా దెబ్బతీసేందుకే తప్పుడు కథనాలు'

రుద్రంపేట, న్యూస్‌టుడే: రాజకీయంగా దెబ్బతీసేందుకే సాక్షి తప్పుడు కథనాలు రాస్తోందని.. తన కళాశాల, ప్రభుత్వంపైన వస్తున్నవన్నీ అవాస్తవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఖండించారు. మంగళవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతూ.. ఫీజు చెల్లిస్తేనే తరగతి గదిలోకి వెళ్లనిస్తారు అంటూ ఆ పత్రికలో తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 40 శాతం మందికి ఉచితంగా విద్యను అందించానని పేర్కొన్నారు. మా విద్యా సంస్థల్లో చదువుకున్న లక్షల మంది విద్యార్థులు విదేశాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారని, అటువంటి వారిని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోటాలో సీటు పొందిన వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులపై ఎటువంటి ఫీజు ఒత్తిడి చేయలేదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శ్రీనివాస్‌నగర్ : 8008573000
మూడోరోడ్డు : 8008573002
ఆజాద్‌నగర్ : 9652620265

సమస్య: భాగ్యనగర్ మొదటి క్రాస్ వివరలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **-ఖాదర్**

సమాధానం: కాలువలు శుభ్రం చేసే విధంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆదేశిస్తాం.

సమస్య: రాజురోడ్డులో సిద్ధప్ప బంగారు గని లయకారం వద్ద రోడ్డు మధ్యలో కొన్ని విభాగినులు తొలగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **-శ్రీనివాసులు**

సమాధానం: రోడ్డు మధ్యలో విభాగినులు తొలగించడం తగదు. వెంటనే ఏర్పాటు చేస్తాం. **-నగరపాలక ఈఈ షాకీర్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహా**

– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

ప్రయాణ ప్రాంగణం.. సమస్యల మయం!

వెళ్లేందుకు దారి లేకుండా అడ్డంగా ఉంచిన నీళ్ల బాటిళ్లు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: ప్రయాణ ప్రాంగణంలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోనే పెద్ద ప్రయాణ ప్రాంగణం అనంతపురంలో ఉంది. నిత్యం వేలాది మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అమేరకు సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ ఉంది. జిల్లా కేంద్రంలోని పలు బస్టాప్‌ల వద్ద విచిత్రకరమైన పరిస్థితి నెలకొంది. రాప్తాడు వైపు వెళ్లే ఆయా ప్రాంతాల్లో బస్‌బేల్లో దారుణమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- జీఎస్టీ తగ్గించడంతో బస్టాండ్‌లోని స్టాళ్లలో రేట్లు తగ్గిందనుకున్నా తగ్గించడం లేదు. ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగానే వసూళ్లు చేస్తున్నారు.
- చిన్న పిల్లల తల్లులు ఉంటే ప్రత్యేకంగా గది ఉంది. ఆ గది వినియోగించడానికి అవకాశం లేకుండా పోయింది. తలుపు విరిగింది. గోడ మూలలు పాడుకుంటున్నారు.
- స్టాళ్ల వద్ద నడవడానికి అవకాశం లేకుండా రోడ్ల మీదకు వచ్చేశారు. సరకులు అన్నీ అడ్డంగా పెట్టడంతో ఇబ్బందిగా మారింది.

ప్రాంతం:	అనంతపురం
పరిధి మండలాలు:	6
గ్రామాలు:	97
రోజుకు వచ్చి వెళ్లే సర్వీసులు:	960
ప్రయాణ ప్రాంగణం వినియోగించుకొనే ప్రయాణికులు:	60,500

రూ.2కి రూ.10 వసూళ్లు!

బోర్డుకే పరిమితం

ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మూత్రశాలలు, మరుగుదొడ్ల యాజమాన్యాలు ఐదు రెట్లు ఎక్కువ వసూళ్లు చేస్తున్నా అధికారులకు మాత్రం అది కన్పించదు. ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. మూత్రవిసర్జనకు ఉచితం, మల విసర్జనకు రూ.2మాత్రమే అని బోర్డు రాసి ఉంటుంది. ప్రయాణికులతో మాత్రం మూత్రానికి వెళ్లితే రూ.5, మలవిసర్జనకు వెళితే రూ.10 వసూలు చేస్తున్నారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ మహేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం గోడపత్రికను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడి చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా సమాన వేతనం అందడం లేదన్నారు. కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం అందించాలని కోరారు. ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 31 జనవరి 4 వరకు సీఐటీయూ 18వ అఖిలభారత సభలను విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహిళలే కుటుంబాలకు ఆధారం

మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (కమలానగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర పురోగతితో మహిళలు కుటుంబాలకు ఆధారంగా మారారని, మహిళలకు కుటుంబంలో ఉన్న భర్తలు కచ్చితంగా సహకారం అందించాలని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రాప్తాడు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన మన డబ్బులు-మన లెక్కలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని స్వయం సహాయక సంఘాలకు వివిధ పథకాల ద్వారా వచ్చిన రుణాలకు చెక్కును అందించి మాట్లాడారు. మహిళలు ఆటో నడిపే స్థాయి నుంచి విమానాలు నడిపే స్థాయికి వచ్చామని, ఇలాంటి సందర్భాల్లో మహిళలు మోసపోకూడదన్నారు. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం వచ్చినా మహిళల పేరుపైన వస్తాయన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు మొదటి రోజులతో పోల్చుకుంటే ఇప్పటికీ ఎంతో ప్రగతి సాధించారన్నారు. 639 సంఘాలలో ఉన్న 3858 సభ్యులకు రూ.32 కోట్ల 47 లక్షల 50 వేల చెక్కును అందించారు.

అతిగా మొబైల్ ఫోన్లు వాడితే అనర్థమే

కేశవరెడ్డి పాఠశాలలో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు అనవసరంగా మొబైల్ ఫోన్లు వాడకూడదని పలువురు ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఈనాడు ఆధ్వర్యంలో మంగళవారం సాయినగర్‌లోని కేశవరెడ్డి, కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

విజేతలు: కేశవరెడ్డి పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులు భవ్యశ్రీ ప్రథమ, మైథిలి ద్వితీయ, 9వ తరగతి విద్యార్థి షాగుఫ్త తృతీయ విజేతలుగా నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ సులోచన బహుమతులు అందజేశారు.

శ్రీచైతన్య పాఠశాలలో బహుమతులతో విద్యార్థులు

- శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు పూజశ్రీ ప్రథమ, మేఘన ద్వితీయ, సాత్విక తృతీయ బహుమతులు అందుకున్నారు. విజేతలకు పాఠశాల డీన్ భవిత బహుమతులు అందజేశారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచండి: ఎమ్మెల్యే

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో కాలువలు, పరిసర ప్రాంతాలు చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ వెల్లడించారు. ఇక ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదని ఆదేశించారు. మంగళవారం అనంతపురం అర్బన్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్, నగర కమిషనర్ బాలస్వామి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, శానిటరీ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, ప్రతి వారం ప్రజాదర్బార్‌లో ప్రజలు నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నగరపాలక సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కుదరదన్నారు. వారంతా ఉదయం క్షేత్రస్థాయిలో తిరిగితే వాస్తవ పరిస్థితి తెలుస్తుందన్నారు. కొత్తగా నియమించిన పారిశుద్ధ్య సూపర్‌వైజర్లు బాధ్యతగా పని చేయాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన ఆశయమన్నారు. అందులో భాగంగా నగరంలో తృప్తి క్యాంటిన్లు, స్మార్ట్‌స్ట్రీట్ మార్కెట్ల ఏర్పాట్లపై మెప్మా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వీటిపై లబ్ధిదారులను ఎంపిక చేసి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

అనంత నేరవార్తలు: జిల్లాలో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సహచరులు ఆర్థిక చేయూతనందించారు. జిల్లా ఎస్పీ జగదీశ్ చేతుల మీదుగా మంగళవారం మృతుడి భార్య మంజుకి రూ.4,31,200 నగదు అందజేశారు. అనంతపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సతీష్ కుమార్ ఇటీవలే మృతి చెందారు. 2011 బ్యాచిమేట్లు ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో నగదు పోగు చేసి అందించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, గాండ్ల హరినాథ్, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు హనుమద్ వ్రతం

అనంత సాంస్కృతికం: హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 3 బుధవారం హనుమద్ వ్రతం వైభవంగా జరుపుతున్నట్లు ఆలయ అధ్యక్షుడు పరచూరు రమేశ్‌బాబు, మేనేజరు రాజశేఖర్‌బాబు తెలిపారు. ఉదయం 6.30కు శ్రీవారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం, 9 గంటలకు గోపూజ, 108 మందితో హనుమద్ వ్రతం జరుగుతుందన్నారు. వ్రతంలో పాల్గొన్న వారితో శ్రీవారి వెండి విగ్రహానికి భక్తుల స్వహస్తాలతో క్షీరాభిషేకం చేస్తారు. 12 గంటలకు మంగళ హారతుల అనంతరం రాత్రి 7 గంటలకు పల్లకీ సేవ జరుగుతుందని తెలిపారు.

అధ్వానంగా నీటి వాల్వు గుంత

నగర శివారులోని కల్యాణదుర్గం రోడ్డు బసవ తారక నగర్‌లో నీటి వాల్వు ఉండే గుంత అధ్వానంగా మారింది. పక్కనే ఉన్న వాటర్‌ట్యాంకు నుంచి వచ్చే నీరు అందులోకి చేరి మురుగు గుంతగా మారింది. వాల్వు అందులోనే ఉండటంతో నీరు కలుషితం అవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శారదానగర్

శుభ్రత లోపించిన గదుల్లో వంటావార్పు

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: నార్పలలో కొందరు రెస్టారెంట్, డాబా, హోటళ్ల నిర్వాహకులు శుచి, శుభ్రత, లోపించిన వంట గదుల్లో వంటలు వండి వారుస్తున్న తీరు ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలు అమలు శాఖ అనంతపురం జిల్లా ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరు దేవరాజ్, తనిఖీ అధికారిణి తస్లీమ్ జరిపిన ఆకస్మిక తనిఖీలో నిర్వాహకుల నిర్లక్ష్యం, పలు లోపాలు వెలుగు చూశాయి. ప్రియ హోటల్, లక్కీడాబా, ప్రియహోటల్ టీస్టాల్, అభిరుచి రెస్టారెంట్, బబ్లూ యాదవ్ వారి ఫ్రెండ్స్ హోటళ్లను తనిఖీ చేశారు. కేవలం ఒకరు మినహా మిగతా వారు వ్యాపార నిర్వహణకు అనుమతి తీసుకోలేదని గుర్తించారు. మూతలేని పాత్రలో నిల్వ చేసిన ఇడ్లీ పిండి, చెక్క, లవంగాలు, మిరియాల నమూనాలు సేకరించి నాణ్యత పరీక్షకు పంపించామని, వంటగదుల్లో శుచి, శుభ్రత, వ్యాపార నిర్వహణకు అనుమతి తీసుకోవాలని నిర్వాహకులకు తాఖీదులు జారీ చేశామని ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలరు దేవరాజ్, తనిఖీ అధికారిణి తస్లీమ్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే...

రుద్రంపేట పరిధి జాతీయ రహదారిలో ప్రమాదకరంగా కల్వర్టు గుంత

రహదారికి అమర్చిన రాతి కట్టడానికి నెర్రెలు

రుద్రంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారి-44లో ఎక్కడ చూసినా ప్రమాద గంటికలు కనబడుతున్నాయి. రహదారికి నిర్మించిన కల్వర్టుల వద్ద గుంతలు పిచ్చి మొక్కలతో కప్పుకున్నాయి. వాహనదారులకు రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లు నేల మట్టవుతున్నాయి. జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి వచ్చేందుకు రహదారి పొడవునా అడ్డుదారులు ఏర్పాటు కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

నిబంధనలు అతిక్రమించిన భవనాల క్రమబద్ధీకరణ

అనంత నగరపాలక: నగరపాలక అనుమతులు పొంది నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలు, అనధికారికంగా కట్టిన నిర్మాణాలకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీము ద్వారా దరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరణ పొందడానికి అవకాశం కల్పించామని కమిషనర్ బాలస్వామి తెలిపారు. భవన నిర్మాణ యజమానులు 31 ఆగస్టు 2025 లోపు కట్టిన భవనాలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన వారు 11 మార్చి 2026లోగా ఎల్‌టీపీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్) : గంగ : **ఖైదు,** గౌరి : **రివాల్వర్ రీటా,** గాయత్రి : **జనతా బార్,** త్రివేణి : **బిజినేస్‌మ్యాన్,** తేజస్విని : **జూటోపియా-2,** ఎస్వీ సినిమా : **రాజు వెడ్స్ రాంబాయి,** శాంతి : **ఆంధ్రకింగ్ తాలుకా.**

8 ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు సంస్థ ప్రాంగణ నియామకాల్లో పాల్గొంది. ఒక్కో విద్యార్థి రూ.4.75లక్షలు వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉద్యోగాలు రాని విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ దేవన్న, డైరెక్టర్లు భానుమూర్తి, కిరణ్మయి, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, ప్రాంగణ నియామకాల అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ఉపయోగంలోకి తీసుకురాలేరా?

ఆత్మకూరు: లక్షల రూపాయలు వెచ్చించి సామగ్రి కొని వాటి నిర్వహణ గాలికి వదిలిపెడితే అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. దీని వల్ల ప్రజాధనం వృథా అవుతోంది. ఆత్మకూరు మేజర్ పంచాయతీలో ఇళ్ల నుంచి చెత్తను సేకరించే ఈ-ఆటోలు, ట్రైసైకిళ్లు కొనుగోలు చేశారు. కొద్ది సంవత్సరాల నుంచి నిర్వహణ లేక అవి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. ఈ-ఆటోలకు మరమ్మతులు చేయించి చిన్నపంచాయతీలకు అందిస్తే ఉపయోగపడుతాయి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, అనంతపురము

E.P.No.37/24 in O.S 556/2017

Between :-

K.లక్ష్మన్న S/o పెద్దబాలప్ప, నివాసము మేధావి కాలేజీ రోడ్డు, బళ్లారి రోడ్డు, అనంతపురం ...D.Hr

AND

B.ఆదినారాయణ, S/o B.నాగన్న, కొడిమి గ్రామము, అనంతపురము రూరల్ మండలం, అనంతపురం జిల్లా ...J.Dr No.1

వేలము ప్రకటన

అర్జీదారుడు తన EP మొత్తము రాబట్టుటకు J.Drకు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పైన తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నాడు. సదరు వేలములో పాల్గొనదలచిన వారు తేది 02-01-2026న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరయి కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

అనంతపురం రి.డి., అనంతపురం రూరల్ సబ్.రి.డి. అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామ పొలంలో వ్యవసాయ భూమి వివరము:

Govt-Dry, సర్వేనెం-256-1, AC.4-80 పైకి, AC.2-50 లేదా 1.012 హెక్టార్లు.

ఇందుకు చెక్కుబందీలు:

తూర్పు : అడ్రలింగన్న జమీను, **పడమర :** హనుమంతు నాయక్ జమీను, **ఉత్తరం :** సూర్యనారాయణ జమీను, **దక్షిణం :** లింగన్న జమీను.

SRO వెల రూ. 8,75,000-00
అమీన వెల రూ. 50,00,000-00
D.Hr వెల రూ.4,17,094
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

భాస్కర రవిప్రసాద్, న్యాయవాది, అనంతపురము, ఫోన్ నెం: **9849663288.**

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగేందుకు కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నందమూరి నగర్‌కు చెందిన కామేశ్వర్ గౌడ్ (45) మద్యానికి అలవాటు పడి డబ్బుల కోసం కుటుంబ సభ్యులను వేధిస్తుండేవాడు. రోజులాగే సోమవారం రాత్రి భార్య, కుమారులను డబ్బులివ్వాలని అడిగాడు. లేవు అనడంతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. తెలిసిన వారి దగ్గర ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. మంగళవారం ఉదయం కళ్యాణదుర్గం రోడ్డులోని ఇంటెల్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడి అదృశ్యం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం త్రీటౌన్ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు అదృశ్యమయ్యాడు. నగరంలోని నీలిమ థియేటర్ సమీపంలో నివాసముంటున్న నీలకంఠారెడ్డి స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపాన ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత ఆదివారం అతడు పని ఉందంటూ బయటకు వెళ్లాడు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కాసేపటికి అతను తన భార్య సెల్‌కు 'తాను డీఎస్సీ పరీక్ష కోసం కోచింగ్‌కు హైదరాబాద్ వెళ్తున్నాననీ, తనకు ఎవరూ ఫోన్ చేయొద్దని' వాట్సప్ మెసేజ్ పంపాడు. తర్వాత స్విచ్ఛాఫ్ చేశాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తున్నా స్పందించలేదు. తెలిసిన వాళ్లను, బంధువులను, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో భార్య భార్గవి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నగరంలో యువతి..

అనంత నేరవార్తలు: అనంతపురం వన్‌టౌన్ పరిధిలో మంగళవారం యువతి అదృశ్యమైంది. కర్నూలు నగరానికి చెందిన హైమావతి నగరంలో ఉన్న తన అన్న ఇంటికి రెండు రోజుల క్రితం తల్లితో పాటు వచ్చింది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అండగా ఉంటాం

కనగానపల్లి, న్యూస్‌టుడే: తెదేపా పార్టీతో పాటు పరిటాల కుటుంబం అన్ని విధాల అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తామని తెదేపా ధర్మవరం సమన్వయకర్త పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు ఆవుల ముత్యాలప్ప అకస్మికంగా మృతి చెందడంతో నివాళి అర్పించారు. డీసీఎంఎస్ ఛైర్మెన్ నెట్టం వెంకటేశు, మాజీ సర్పంచి బాలయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా వద్దని నిరసన

కనగానపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మద్దులచెరువుతండాలో విధులకు సక్రమంగా హాజరు కాకుండా పిల్లలు, గర్భిణులకు గుడ్లు, పాలు అందించని అంగన్‌వాడీ ఆయా మాకొద్దని తల్లిదండ్రులు నిరసన తెలిపారు. మండలానికి చివరి గ్రామం కావడంతో పిల్లలకు ఇబ్బంది కలగకుండా అప్పటి మంత్రి పరిటాల సునీత సొంత నిధులు వెచ్చించి పదేళ్ల కిందట భవనాన్ని నిర్మించారన్నారు. ఇక్కడ టీచర్‌గా పని చేస్తున్న చక్కెరమ్మ భర్త కొద్ది రోజుల కిందట మృతి చెందడంతో ఆమె సెలవుపై వెళ్లిందన్నారు. ఆయాగా విధులు నిర్వర్తిస్తున్న లలితాబాయి సక్రమంగా రాకుండా భవనాన్ని సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. 2020 సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రంలో సారా అమ్ముతూ పోలీసులకు దొరికినా అధికారులు మాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. 15 మంది చిన్నారులు ఉన్నా నెలకోసారి హాజరవుతోందని ఆరోపించారు.

పిల్లలతో కలసి నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: వైద్యరంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కేఎల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఓటీపీఆర్‌లో బీ-ఫార్మసీ, ఫార్మాడీ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగిస్తూ కరోనా సమయంలో ఫార్మాసిస్టులు విశిష్ట సేవలు అందించారన్నారు. వైద్యశాస్త్ర పురోభివృద్ధిలో ఔషధశాస్త్ర విజ్ఞానం, సాంకేతికత చాలా ముఖ్యమన్నారు. విద్యార్థులకు క్లినికల్ పోస్టింగ్‌లో తగిన సహకారం అందిస్తామన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన వన్‌టౌన్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు.

డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఇళ్ల కూల్చివేత

కమలానగర్, న్యూస్‌టుడే: 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చవద్దంటూ కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇంటి బాధితులు సులార్, అరిఫా ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలిక టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇళ్లను జేసీబీలతో కూల్చివేయించారు. ఇళ్లు నిర్మించుకొని ఉన్న బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. 50 ఏళ్లుగా నివాసం ఉన్నామని, నగరపాలికకు ఇంటి గుత్తలు చెల్లిస్తున్నామన్నారు. పట్టాల కోసం ఇటీవల ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిశామని, అయితే నగరపాలిక టౌన్ ప్లానింగ్, సచివాలయ అధికారులు అత్యుత్సాహంతో ఇళ్లను కూల్చి వేయించారని ఆరోపించారు. తమకు సంబంధించిన పూర్తి ఇంటి అడ్రస్, ఆధార్ అన్ని వివరాలు ఇక్కడే ఉండేలా చేసుకున్నామని, అధికారులు ఇలా చేయటం సరికాదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి న్యాయం చేయాలని కోరారు. నగరపాలిక టౌన్ ప్లానింగ్ అధికారిని నీరజాక్షి వివరణ ఇస్తూ. ఇటీవల డీసీఎంఎస్ అధికారులు తమ స్థలంలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని ఫిర్యాదు చేశారన్నారు. నోటీసులు జారీ చేసినా ఖాళీ చేయకపోవడంతోనే కూల్చి వేయించామని వివరణ ఇచ్చారు.

తమ ఇంటిని కూల్చొద్దంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

సెలవు రోజుల్లో 100 రోజుల కార్యాచరణ వద్దు

అనంతపురం విద్య: సెలవు రోజుల్లో 100 రోజుల కార్యాచరణ మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. డీఈవో ప్రసాద్‌బాబుకి ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. రెండో శనివారం, ఆదివారం ఇతర సెలవు రోజుల్లో ఈ కార్యక్రమం నిర్వహించకూడదన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమస్యలపై సదస్సు

రుద్రంపేట: ప్రభుత్వ పెన్షనర్లు జనవరి, ఫిబ్రవరి మాసాల్లో సమర్పించాల్సిన డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర అంశాలపైన బుధవారం ఎన్జీఓహోమ్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్ప తెలిపారు.

ఈనాడు అన్నమయ్య

అర్జీలు చూడరు.. కబ్జాలు కనరు

భూముల వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

గాలివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరిపి, గుట్టలను చదును చేసి పంటలు సాగు చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. సరిహద్దు ఫిర్యాదు చేసినా వెబ్‌ల్యాండ్‌లో పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాలివీడు మండలం గరుగుపల్లె గ్రామంలోని సర్వే నంబరు 697లో 5.40 ఎకరాలు, మరో సర్వే నంబరులోని 3.80 ఎకరాలతో పాటు పలుచోట్ల ప్రభుత్వ భూములున్నాయి. సొంత వ్యవసాయ భూముల పక్కనే ఉండటంతో ఆక్రమణదారులు ప్రభుత్వ భూముల్ని అందులో కలిపేసుకున్నారు. భారీ యంత్రాలతో ఇష్టారీతిన గుట్టలను చదును చేసి వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నారు. భూముల ఆక్రమణపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. పశువులు, జీవాల మేతకు ఉపయోగపడే భూములను కబ్జా చేశారని అధికారులకు అర్జీ ఇచ్చినా పట్టించుకోవడం లేదని మంగళవారం ఆందోళన చేశారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

హరితం.. హరిణం

అడవుల్లో చెంగు చెంగున గెంతుతూ కనిపించే జింకలు ఇప్పుడు పొలాల బాట పట్టాయి. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు పంటలు సాగు చేశారు. దీంతో వనం వీడిన హరిణులు మైదాన ప్రాంతాలకు చేరుతున్నాయి. ఆహారం, నీరు సమృద్ధిగా దొరుకుతుండటంతో పొలాల్లోనే ఉండిపోతున్నాయి. కమలాపురం- ఎర్రగుంట్ల మధ్య రైతులు సాగు చేసిన మినుము పొలాల్లో గుంపులుగా విహరిస్తున్న జింకలను చిత్రాల్లో చూడొచ్చు. - ఈనాడు, కడప

ఆగని పేలుళ్లతో భయం.. భయం

13 ఏళ్లుగా బాధితుల నిరీక్షణ

డేంజర్ జోన్ పరిధిలోనే అగ్రహారం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మంగంపేట బెరైటీస్ (ముగ్గురాయి) గనులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. అంతర్జాతీయ స్థాయిలో అత్యంత నాణ్యమైన బెరైటీస్ నిక్షేపాలు మంగంపేట సొంతం. అలాంటి కీలకమైన గనులను 1975 నుంచి ఏపీఎండీసీ వర్గాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గనులను విస్తరించే దిశగా ప్రభుత్వం అడుగేస్తోంది. చుట్టూ ఉన్న గ్రామాలను మొదటి విడతలో ఖాళీ చేయించింది. రెండో విడతలో భాగంగా అగ్రహారం గ్రామాన్ని డేంజర్‌జోన్‌గా గుర్తించి తరలించేందుకు 2012లో బాధితులకు పరిహారం చెల్లించారు. అయినా తరలించకపోవడంతో పద మూడేళ్లుగా అభివృద్ధి పడకేసింది.

కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న అధికారులు

ప్రాణాలు పోతున్నా పట్టదా!

● 2022 నవంబర్ 17వ తేదీన శిథిలావస్థలో ఉన్న ఓ ఇంటి గోడ కూలి ఈశ్వర్ అనే మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. దీంతో గ్రామస్థులంతా ఏపీఎండీసీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఇంకెన్ని ప్రాణాలు పోతే తమను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారని అధికారులను నిలదీశారు. ఇప్పటికే ఏపీఎండీసీ అధికారులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ● గని విస్తరణతో భారీ ఎత్తున పేలుళ్లు జరుగుతుండడంతో ఇళ్లు కూలిపోతున్నాయి. గతంలో గనిలో బ్లాస్టింగ్ చేయడంతో పెద్ద బండరాయి జాతీయ రహదారిపై పడి పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికే చాలా గృహాలు వర్షాలు పడినప్పుడు కూలిపోతున్నాయి.

పరామర్శలు తప్ప పనులేవీ!

అధికారులు, పాలకులు వస్తున్నారు.. పోతున్నారు తప్ప పనులు మాత్రం సాగడం లేదు. గత కలెక్టర్లతో పాటు ప్రస్తుత కలెక్టర్ నిషాంత్‌కుమార్ మంగంపేట ముగ్గురాయి గనిని సందర్శించి, స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ● అప్పటి ఎండీ వెంకయ్యచౌదరి, మధుసూదన్‌రెడ్డి, ప్రస్తుత ఎండీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వచ్చి మంగంపేటలోని ముగ్గురాయిని చూసి సంతోషించారే తప్ప.. డేంజర్ జోన్ పరిధిలోని బాధితుల సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదని వాపోతున్నారు.

ముక్కావారిపల్లె వద్ద ఏర్పాటు

డేంజర్ జోన్ పరిధిలో ఉన్న అగ్రహారం గ్రామం కోసం ఇంటి స్థలం ఏర్పాటు చేస్తున్నాం. ముక్కావారిపల్లె రెవెన్యూ పరిధిలో 1099, 1098 సర్వేనంబర్లలో సుమారు 30 ఎకరాలు స్థలం సేకరిస్తున్నాం. పూర్తి స్థాయిలో స్థలం సేకరించి కలెక్టర్‌కు నివేదిస్తాం. అగ్రహారం బాధితులకు న్యాయం చేస్తాం.

- యామిని, తహసీల్దార్, ఓబులవారిపల్లె

గ్రామాన్ని తరలిస్తాం

అగ్రహారం గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ఉన్నతాధికారుల స్థాయిలో చర్చలు జరిగాయి. మొదటిసారి చెల్లించిన పరిహారంలో 50 శాతం చెల్లించి ఆ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తాం. ఉన్నత స్థాయిలో ఇంకా రావాల్సిన పరిహారం, ఇంటి స్థలాలు, ఇతర వసతులపై చర్చలు ముగిశాయి.

- గోపినాథ్, మంగంపేట ఏపీఎండీసీ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీపీవో)

అక్రమాలు కళ్లకు కట్టారు



ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె నేరవార్తలు: ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారం పలుమలుపులు తిరుగుతోంది. కేసులో ఏ-2గా ఉన్న కట్టా రాజు రాసిన డైరీ పలువురి తలరాతలను మార్చుతోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ భాస్కర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. మరో నలుగురిపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ఎక్సైజ్ నోడల్ అధికారి, చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. నకిలీ మద్యం కేసులో ఇప్పటికే సిట్ అధికారులు విచారణ చేయడంతో పాటు పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. నకిలీ మద్యం కేసులో సిబ్బంది పాత్రపై విచారణ ప్రారంభించారు. కట్టా రాజు రాసిన డైరీతో పాటు కాల్‌డేటాను పరిశీలించారు. నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులతో పాటు బెల్ట్ షాపులు నడిపిన వ్యక్తులతో ఫోన్ సంభాషణలు చేసినట్లు తేలింది. ఇందులో భాస్కర్ పాత్ర కీలకంగా ఉండటంతో సస్పెన్షన్ వేటేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ కానిస్టేబుల్ జి.మణిని చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి, బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీలో పనిచేసే ఎం.కిరణ్‌ను వి.కోట చెక్‌పోస్టుకు, చిత్తూరు జిల్లా పుంగనూరు ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేసే ఎ.వినోద్‌కుమార్‌ను నరహరిపేట చెక్‌పోస్టుకు, ఎం.నరేంద్రరెడ్డిని క్యాటిల్ ఫాం చెక్‌పోస్టుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అత్యాధునిక వసతులతో ఇండోర్ స్టేడియం

రాయచోటి, న్యూస్‌టుడే: అత్యాధునిక వసతులతో జిల్లా కేంద్రం రాయచోటిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో క్రీడా ప్రాధికార సంస్థ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె రోడ్డులోని రవ్వలగుట్ట వద్ద మూడెకరాల ప్రభుత్వ భూమిలో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇండోర్ స్పోర్ట్స్ మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. డీఎస్ఏ క్రికెట్ గ్రౌండ్, ఇండోర్ సదుపాయాలు, రన్నింగ్ ట్రాక్, ఇతర క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. డీఎస్ఏలో ఖాళీగా ఉన్న కోచ్ పోస్టులు, కార్యాలయ సిబ్బంది కొరత, నిధుల అభావం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికార అధికారి జె.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మెగా పీటీఎం 3.0.. విద్యాభివృద్ధికి నిచ్చెన

దళవాయపల్లెలో తల్లిదండ్రులను సమావేశానికి ఆహ్వానించేందుకు పుష్పగుచ్ఛాలతో విద్యార్థులు

చిన్నమండెం, పుల్లంపేట, న్యూస్‌టుడే: విద్యార్థి వృద్ధే ధ్యేయంగా ఈ నెల 5న మెగా పీటీఎం 3.0 (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం) అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గత సంవత్సరం మొదలు పెట్టారు. అప్పట్లో తల్లిదండ్రులకు పలు రకాల ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు వంటివి నిర్వహించారు. ఈసారి మాత్రం వాటిని పక్కన పెట్టి విద్యార్థుల ప్రగతిపైనే సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల చదువు ప్రగతి గురించి ఇందులో సమీక్షించనున్నారు.

5న సమావేశం

ఈ నెల 5న జరిగే సమావేశానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలి. విద్యార్థుల ప్రగతి, నెలకొన్న సమస్యలపై చర్చించనున్నారు.

అజెండా ఇదీ

● ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం జరగనుంది. విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతలతో పాటు పలువురు పాఠశాలలోనే సామూహిక భోజనం చేసి సమావేశాన్ని ముగిస్తారు.

● సమావేశాన్ని ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు, విద్యావంతులు, పాఠశాల కమిటీ సభ్యులకు ఆహ్వానం పలుకుతారు.

● ఉదయం 9.30 గంటల నుంచి 10.50 వరకు తరగతి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య చర్చ ఉంటుంది. విద్యార్థుల చదువుల ప్రగతి, ఆరోగ్య విషయాలపై చర్చిస్తారు.

● 10.50 నుంచి 11.00 గంటల వరకు పాఠశాలల్లో ప్రదర్శనకు పెట్టిన క్రీడా పరికరాలు, జాదుయి పిటారా, బోధనోపకరణాలు, గ్రంథాలయ పుస్తకాల వంటివి పరిశీలిస్తారు.

● 11.00 గంటల నుంచి సభ కార్యక్రమం మా తెలుగుతల్లికి మల్లెపూదండ ప్రార్థన గీతంతో సమావేశం ప్రారంభిస్తారు. అందరి ఉపన్యాసాల తర్వాత విద్యార్థులకు ప్రగతి కార్డులను అందజేస్తారని 12.45 గంటలకు అందరు కలిసి భోజనం చేస్తారని డీఈవో డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం తెలిపారు.

లక్ష్మీ రావే మా ఇంటికి

కలికిరి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి మాతృ వందనం కింద లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిరుపేద గర్భిణులందరికీ పథకం ద్వారా నగదు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ బృహత్తర పథకం మహిళా శిశు సంక్షేమ శాఖలకు అప్పగించింది. పథకంలో అర్హులైన వారికి మొదటి కాన్పు అయితే రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడ పిల్ల పుడితే రూ.6 వేలు చొప్పున రెండు విడతల్లో రూ.11 వేలు అందించనుంది. ఈ మొత్తాన్ని పోషకాహారం, బీమాలు, ఇతర ఖర్చులకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. తెల్ల రేషన్‌కార్డు దారులంతా పథకానికి అర్హులే. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంప్రదిస్తే వివరాలు నమోదు చేస్తారు. జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల మంది తల్లులు ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారు.

మట్టి రాజుల చిహ్నం.. గజారోహణ కేసరి

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్ధవటాన్ని రాజధానిగా చేసుకుని దాదాపు ప్రత్యేకమైన కోట నిర్మించి పాలించిన మట్టిరాజుల అధికార రాజ చిహ్నం 'గజారోహణ సింహం'గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి ఈ రాజచిహ్నాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సిద్ధవటంలోని పురాతన కాలం నాటి మట్టిరాజుల కోటను ఇటీవల తాను సందర్శించామన్నారు. కోట ప్రవేశ ద్వారం ఎడమ వైపున పైభాగంలో సుమారు ఐదు అడుగుల ఎత్తులో పద్మపీఠముఖంగా మట్టిరాజుల అధికార రాజ లాంఛనం చెక్కబడి ఉన్నట్లు తెలిపారు. గుర్రపైకి లంఘించే సింహంతో పాటు ఖడ్గం, సూర్యచంద్రులు ఈ రాజచిహ్నంలో ఉన్నట్లు వివరించారు. ఇప్పటి వరకు విజయనగర సామ్రాజ్యానికి చెందిన వరాహం, ఖడ్గం, సూర్య, చంద్రుల రాజచిహ్నామే మట్టిరాజుల చిహ్నంగా భావించే వారని గుర్తుచేశారు. శ్రీకృష్ణదేవరాయల రెండో కుమార్తె కృష్ణాంబను వివాహం చేసుకున్న మట్టి వరద రాజుకు 'గజసింహ' అనే బిరుదు ఉండేదన్నారు. కంచిలోని వరద రాజ స్వామి ఆలయంలోని తూర్పు కుడ్యంపై తమిళభాషలో చెక్కిన క్రీ.శ.1544 నాటి దాన శాసనంలో మట్టి వరద రాజును గజసింహ బిరుదాంకితుడిగా పేర్కొన్నట్లు ఆయన వెల్లడించారు.

రుచిలో బాద్‌షా.. సాగేదెలా బేనీషా!

జిల్లాలో మామిడి సాగు (ఎకరాల్లో): 75 వేలు

దిగుబడి ఇస్తున్న తోటలు: 44 వేలు

తొలగించినది: 2,200

మధుర ఫలం మామిడి పేరు చెబితేనే జిల్లాలో గుర్తుకు వచ్చేది వీరబల్లి.. ఆ ఊరి పేరుతో పండే వీరబల్లి బేనీషా రకం మామిడి పండ్లంటే జాతీయ, అంతర్జాతీయ ఎగుమతులకు పేరు.. రుచిలో బాద్‌షాగా పేరొందిన ఈ ఫల రాజం నేడు కనుమరుగవుతోంది. నష్టాలు భరించలేక రైతులు తొలగిస్తున్నారు. ఈ రకం పదేళ్లుగా ఆశించిన దిగుబడులు ఇవ్వడం లేదు. మరోవైపు తోటల సస్యరక్షణ, ఎరువులు, నీటి ఆధారం కోసం రూ.లక్షలు వ్యయం చేయాల్సి వస్తోంది. తీరా సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడులు రావడం లేదు. దీంతో రైతులు పెట్టుబడి కూడా చేతికందక మామిడి తోటలను నరికేస్తున్నారు. జిల్లాలో వీరబల్లి, రాయచోటి, సుండుపల్లి, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం, సంబేపల్లి, పీలేరు, గుర్రంకొండ, గాలివీడు మండలాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. చెట్లు తొలగించడంతో మొదళ్లు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు రూ.లక్షల ఆదాయం సంపాదించి పెట్టిన చెట్లు నేడు తెగుళ్లు, వర్షాభావంతో తొలగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని రాయచోటి మండలం కాటిమాయకుంటకు చెందిన రైతు రామచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మూడెకరాల్లో తొలగించామని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, రాయచోటి, వీరబల్లి

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ మంగళవారం తెలిపారు. బి.కొత్తకోట, గాలివీడు, కురబలకోట, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, నిమ్మనపల్లె, పెద్దతిప్ప సముద్రం, రామాపురం, రామసముద్రం, తంబళ్లపల్లె, వాల్మీకిపురం, వీరబల్లిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.2,369, గ్రేడ్-ఏ రకం క్వింటాకు రూ.2,389 చొప్పున కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

బుద్ధం.. శరణం.. రక్షామి

ఎత్తైన కొండపై చెయ్యేరు తీరాన కన్పిస్తున్న ఈ గుట్టపై శిథిలాలు చూశారా.. ఇవి గుప్త నిధుల కోసం అక్రమార్కులు చేపట్టిన తవ్వకాలు. జిల్లాలోని నందలూరుకు సమీపంలోని ఆడపూరులో క్రీ.శ. 3 నుంచి 11వ శతాబ్దం మధ్యకాలంలో బౌద్ధం విలసిల్లింది. ఈ ప్రాంతంలో 13 ఆరామాలను నిర్మించారు. బౌద్ధ భిక్షువులు నివసించడంతో పాటు ధ్యానం చేసేందుకు, ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా వీటిని నిర్మించారు. పవిత్రమైన ఈ స్థలాలు రక్షణ లేక నేడిలా శిథిల గుట్టలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

వైభవం ఉట్టిపడేలా గండికోట ఉత్సవాలు

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో వారసత్వ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. సాస్కి పథకం కింద గండికోటలో రూ.77 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. పనులు, చిత్రపటాలను పరిశీలించి సలహాలిచ్చారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, పీఆర్ ఎస్ఈ మద్దన్న, హౌసింగ్ పీడీ రాజారత్నం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ గోపీనాథ్, సైట్ ఇంజినీర్ విజయ్, ఆర్కిటెక్చర్ డిజైనర్ ఇర్ఫాన్, అబ్దుల్ తదితరులున్నారు.

పెన్నాలోయ వద్ద చేపట్టబోయే పనులను తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా చేస్తారంటే...

● జనవరి మొదటి వారంలో ఉత్సవాలుంటాయి. ఆలోగా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తాం. ● పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టాం. ● పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టూరిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటరు, నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్ఫర్మేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ● గండికోట ముఖద్వారం నుంచి సందర్శకుల సెంటర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మిస్తాం. ● వ్యూ పాయింట్‌తో పాటు చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని నెలకొల్పుతాం. ● లోయ సమీపంలో ఏకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్‌తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ● రోప్‌వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను ఏర్పాటు చేస్తాం. ● పెన్నా లోయను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలీరైడ్స్ సదుపాయం కల్పిస్తాం.

శ్రమకు తగ్గట్టు మెరవని శనగ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: శనగ ధరలు ఆశాజనకంగా లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్లుగా గోదాముల్లోనే దిగుబడులు మగ్గిపోతున్నాయి. ఈ ఏడాది జనవరిలో క్వింటా ధర రూ. 6,500 పలకగా. . ప్రస్తుతం రూ. 5,400కు పడిపోయింది. విదేశాల నుంచి శనగలు దిగుమతి కారణంగా ఇక్కడ ధరల పతనానికి కారణమని రైతులు వాపోతున్నారు.

● **మద్దతు ధరకు రైతుల ఎదురు చూపు:** గతేడాది రబీలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల ఎకరాల్లో శనగ సాగైంది. ఎకరాకు రూ. 35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సరాసరి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా నాఫెడ్ కొనుగోలుకు ప్రయత్నించింది. జిల్లాలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధర క్వింటాకు రూ. 5,650 ప్రకటించింది. అయినా రైతులు విక్రయించేందుకు ముందుకు రాలేదు. ధర ఆశాజనకంగా లేకపోవడంతో గోదాముల్లోనే ఉంచారు. ఇలా ఇప్పటికీ సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల శనగలు గోదాముల్లో మగ్గుతున్నట్లు అంచనా. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

చిత్తూరు.. బురద రాసుకుంటేనే వెళ్తారు



పీలేరు పట్టణంలో చిత్తూరు, మదనపల్లె మార్గాల్లో వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో రెండు దారులు బురదమయంగా మారాయి. ఈ దారుల్లో అడుగు వేసే పరిస్థితి లేదు. వర్షం కురిస్తే బురద, లేదంటే దుమ్ముతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలకు దారులు బురదమయం కావడంతో ప్రస్తుతం ప్రజలు నడిచే పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ద్విచక్ర వాహనం, ఆటోల్లో వెళ్తున్నారు. ప్రజల కష్టాలతో మాకు సంబంధం లేదన్న తీరులో అధికారులు వ్యవహరిస్తున్నారు. చిత్తూరు మార్గంలో ప్రత్యామ్నాయ దారి లేనందున బురద దారిలోనే వెళ్తున్నారు. పీలేరు పట్టణంలోకి మదనపల్లె మార్గంలో వెళ్లే బస్సులు అనుమతించనందున అన్ని వాహనాలు బస్టాండు నుంచి నేరుగా నాలుగు రోడ్ల కూడలి వరకు వచ్చి జాతీయ రహదారుల్లో మదనపల్లె, తిరుపతి పట్టణాలకు వెళ్తున్నారు. - న్యూస్‌టుడే, పీలేరు

కన్నా.. నీకు రక్షణగా నేనున్నా!

సర్వజన ఆసుపత్రిలో మెరుగైన సేవలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాయి. ప్రభుత్వం వైద్యం అంటే సేవలు సక్రమంగా అందవని, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తారన్న అపనమ్మకం సామాన్య ప్రజల్లో ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఆ అపోహను చెరిపేస్తూ ఆసుపత్రులకు ఆధునిక యంత్రాలను సరఫరా చేస్తోంది. దీంతో సేవలు మెరుగవడంతో పాటు నిరుపేదలకు ఆధునిక యంత్ర వైద్యం ఉచితంగా అందుతోంది. మెరుగైన వైద్య పరికరాలు, అనుభవం ఉన్న వైద్య నిపుణులు, పరీక్ష కేంద్రాలతో ఆసుపత్రిలో సేవలు అందుతున్నాయని చంటి బిడ్డల ప్రాణ రక్షణకు వైద్యులు భరోసా ఇస్తున్నారు. రాజంపేటలోని వంద పడకల ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డులో అందుతున్న ఆధునిక సేవలపై కథనం.

రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వెంటిలేటర్లు

● **వెంటిలేటర్ :** పుట్టుకతో రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గిన వారు, 30 వారాల కంటే ముందే పుట్టిన వారు శ్వాస సరిగ్గా తీసుకోలేరు, వీరికి వెంటిలేటర్ సాయంతో చికిత్స అందించాలి. నేరుగా ఊపిరితిత్తులకు ప్రాణవాయువు అందించాలి. ఆ వెంటిలేటర్లు కేవలం మూడు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ సమస్య ఎక్కువగా వర్షాకాలంలో వస్తుంది.

● **ఫొటో థెరపీ :** నవజాత శిశువులకు పుట్టుకతో వచ్చే కామెర్ల నివారణకు ఫొటో థెరపీ యంత్రాలను అందుబాటులో ఉంచారు. ఇందులో వారం రోజుల పాటు శిశువులను ఉంచి ఫొటోథెరపీ చేస్తారు. ఆసుపత్రిలో డబుల్ సర్ఫేస్ 2, సింగిల్ సర్ఫేస్ యంత్రాలు రెండు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రిలో వీటికి రోజుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఫీజు వసూలు చేస్తారు.

● **వార్మర్లు :** చలికాలం చంటిబిడ్డలకు వెచ్చదనం అవసరం. బరువు తక్కువ ఇన్‌ఫెక్షన్ ఉన్న చిన్నారులను రేడియంట్ బేబీ వార్మర్స్‌లో ఉంచాల్సి వస్తుంది. ఈ పరికరాలు తక్కువ మందికి అవసరమవుతాయి. చిన్న పిల్లలకు తగిన ఉష్ణోగ్రతలు అందించేందుకు ఇవి ఉపయోగపడతాయి. బయట ఆసుప్రతిలో డిమాండ్‌ను బట్టీ రూ.2 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు.

24 గంటలూ వైద్య సేవలు: నవజాత శిశువు నుంచి పదేళ్ల వరకు వయసున్న పిల్లలకు అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. వార్డులో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రిలో పల్స్ ఆక్సీమీటర్లు, మల్టీపెరా మానిటర్లు, మొబైల్ ఎక్స్‌రే యూనిట్ వంటి వైద్య పరికరాలు ఉన్నాయి. - నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, రాజంపేట ఆసుపత్రి

(c) eenadu

రోజూ ఇదే తంటా!

పీలేరు పట్టణంలో మూడేళ్లుగా సాగుతున్న ఆర్వోబీ పనుల ఆలస్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని చిత్తూరు మార్గంలో ఆర్వోబీతో పాటు ఆర్‌యూబీ పనులు ప్రారంభించారు. ఇక్కడ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు ఇరుకుగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ వాహనాలు ఎదురుపడితే ఇరుక్కుపోయి ఇరువైపులా వాహనాలు బారులు తీరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. – న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

ఇక విద్యా ప్రగతి నివేదికల రూపకల్పన సులభం

125 పాఠశాల కాంప్లెక్స్‌లకు కంప్యూటర్లు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుకొచ్చింది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సాంకేతికత వైపు దృష్టి సారించింది. విద్యా వ్యవస్థకు సంబంధించిన కార్యక్రమాలు, జిల్లా, రాష్ట్ర స్థాయి నివేదికలు సకాలంలో పంపేలా పాఠశాలలకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కొత్త కంప్యూటర్లు అందజేసింది. గతంలో నివేదికలను తయారు చేయడానికి ఉపాధ్యాయులు ఇంటర్నెట్ కేంద్రాలపై ఆధారపడేవారు. నెట్ బిల్లులు చెల్లింపునకు సొంత నిధులు ఖర్చు పెట్టేవారు. ఇటీవల కంప్యూటర్లు, అవసరమైన సామగ్రి అందజేయడం వల్ల ఉపాధ్యాయులకు ఉపశమనం కలిగింది. జిల్లాలో 125 పాఠశాల కాంప్లెక్స్‌లు ఉన్నాయి. అన్ని కాంప్లెక్స్‌లకు కంప్యూటర్లు అందజేశారు. ప్రస్తుతం నివేదికలకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

కొత్త విధానంతో మేలు

గతంలో పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించేటప్పుడు ప్రధాన అంశాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అమలు చేస్తున్న పథకాలు, బోధన పద్ధతులు, విద్యార్థుల సమగ్ర ప్రగతి, ఇతర అంశాలను జిల్లా, రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించాల్సి ఉండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. విద్యాశాఖ కంప్యూటర్లు ఇవ్వడం వల్ల సమస్య తీరింది. కొత్త కంప్యూటర్లు రావడంతో పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలు, ఇతర సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం ఆన్‌లైన్‌లో పనుల నిర్వహణకు అవకాశం ఏర్పడింది. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఒక్కో కాంప్లెక్స్‌కు సుమారు రూ.50 వేలు విలువ చేసే కంప్యూటర్, పరికరాలు అందజేశారు.

కంభంవారిపల్లెలో పాఠశాల కాంప్లెక్స్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు తగ్గిన శ్రమ

పాఠశాలల కాంప్లెక్స్‌లకు కంప్యూటర్లు ఉండటం వల్ల పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే ఉన్నతాధికారులకు అందజేయవచ్చు. సమాచారం ఇవ్వడానికి ఉపాధ్యాయులకు శ్రమ తగ్గింది. విద్యార్థులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

– సుబ్రహ్మణ్యం, డీఈవో, అన్నమయ్య జిల్లా.

శీతలీకరణ కేంద్రం.. నిరుపయోగం

గుర్రంకొండ, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయమార్కెట్‌లో కూరగాయలు నిల్వ చేసుకోడానికి ఏర్పాటు చేసిన శీతలీకరణ కేంద్రం నిరుపయోగంగా మారింది. కొంత కాలం కిందట శీతలకరణ కేంద్రం మరమ్మతులకు గురైంది. నాటి నుంచి ఆ కేంద్రం మరమ్మతులకు నోచుకోకపోవడంతో శీతలీకరణ కేంద్రంలో నిల్వ ఉంచాల్సిన కూరగాయాలు రైతులు కురబలకోటకు తీసుకెళ్తున్నారు. స్థానికంగా ఉన్న నిల్వ కేంద్రాన్ని మరమ్మతులు చేయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరతున్నారు.

టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ మూర్తిని రైతులు కోరారు. మంగళవారం మదనపల్లె మండలంలోని అంకిశెట్టిపల్లె, మాలేపాడు, పెంచుపాడు, బొమ్మనచెరువు గ్రామాల్లో టమాట రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. టమాట పంట సాగు, ఖర్చు, ఎగుమతులు, ధరల వివరాలు తెలుసుకున్నారు. సాధారణ సమయంలో 200 టన్నుల వరకు పంట దిగుబడులు ఉంటాయని, సీజన్‌లో మార్చి నుంచి జూన్ వరకు వెయ్యి నుంచి 2 వేల టన్నుల వరకు మార్కెట్‌కు అన్నదాతలు సరుకు తరలిస్తుంటారని రైతులు పేర్కొన్నారు. ముఖ్యంగా మదనపల్లె ప్రాంతంలో టమాటా ఆధారిత పరిశ్రమలను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని రైతులు తెలిపారు. అదేవిధంగా రాయితీపై టమాటా క్రేట్లు ఇవ్వాలని, ప్రతి పంచాయతీలో గ్రేడింగ్ మిషన్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రైతుల అభిప్రాయాలను సేకరించి వీటిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ ప్రతినిధి బాలకృష్ణ, డీపీఎంలు గంగరాజు, శ్రీలక్ష్మి, ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు, వీవోలు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రాజెక్టు మేనేజర్ ఎస్.ఎస్.ఆర్.మూర్తి తదితరులు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వ రంగ షెడ్యూల్డు బ్యాంకు) రీజినల్ ఆఫీస్ : మదనపల్లె.

లీజు ప్రాతిపదికన ఆవరణ కావలెను

... 24.12.2025 ... 5.00 ...

సం/- రీజినల్ మేనేజర్
స్థలం : మదనపల్లె
తేది : 03.12.2025
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, D.No.IV-261, ముగ్గు కాంప్లెక్స్, అవెన్యూ రోడ్డు, మదనపల్లె.

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
వెబ్‌సైట్: www.shriramfinance.in
బ్రాంచ్ కార్యాలయం : మదనపల్లె

లాంఛనంగా స్వాధీనతా ప్రకటన

రుణగ్రహీత పేరు మరియు చిరునామా:
1) ఎస్.షాహీనా, తండ్రి రఫీ, డి.నెం.5-58-తి-ఎస్., అప్పారావు తోట, మదనపల్లె,చిత్తూరు జిల్లా – 517325
2) సయ్యద్ రఫీ, డి.నెం.5-58-తి-ఎస్., అప్పారావు తోట, మదనపల్లె,చిత్తూరు జిల్లా – 517325
3) ఎస్.షంషీర్ ఖాన్, తండ్రి రహీం ఖాన్, డి.నెం.6-59, దేవాలయం వీధి, మదనపల్లె,చిత్తూరు జిల్లా – 517325

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి సొమ్ము: రూ.75,71,608/-
రుణమొత్తం: రూ.50,00,000/-
రుణ ఖాతా నెంబరు: MNDPLTF2403130021
డిమాండ్ నోటీసు తేదీ: 17.07.2025 స్వాధీనం తీసుకున్న తేదీ: 26.11.2025

ప్రదేశం: మదనపల్లె
తేదీ: 26.11.2025
సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

జగన్‌ను ఎమ్మెల్యేగా కూడా గుర్తించట్లేదు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఎమ్మెల్యేగా కూడా గుర్తించే పరిస్థితిలో ప్రజలు లేరని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నెలకు ఒక్కసారి మీడియా ముందుకు వచ్చి ప్రభుత్వాన్ని విమర్శించాలనే ఉద్దేశంతోనే మాట్లాడుతున్నారన్నారు. విజయవాడ వరదలు, ఇటీవల వచ్చిన తుపాన్ల సమయంలో వైకాపా ఎమ్మెల్యేల పాత్ర ఏమైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. అధికారులు 48 గంటలు ముందే అప్రమత్తం చేసి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా సీఎం చంద్రబాబు గట్టి చర్యలు తీసుకున్నారన్నారు. కేవలం క్యాడర్‌ను నిలబెట్టుకునేందుకే వైకాపా నాయకులు తాటాకు చప్పుళ్ల మాటలు చెబుతున్నారని ఆయన విమర్శించారు. నిజంగా వైకాపాపై ప్రజల మీద విశ్వాసం ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రజల తరఫున మాట్లాడాలని ఆయన కోరారు. రాబోయే రోజుల్లో జిల్లాకు సంబంధించిన హెచ్‌వోడీల భవనాలు అన్ని ప్రభుత్వ భవనాలే ఉండేలా చూస్తానన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకొంటామన్నారు. 5 ఎకరాల భూమి కేటాయించి రాయచోటిలో సబ్ జైల్ ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆర్టీసీ రెండో బస్టాండు ఏర్పాటు, కోర్టు భవనాల నిర్మాణం పనులు వెంటనే చేపడతామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, కౌన్సిలర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పురాతన సీఎస్ఐ చర్చి తిరునాల

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడులోని పురాతన 'పరిపేతురు-పరిపౌలు' చర్చి వార్షికోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నంద్యాల డయాసిస్ బిషప్ కె.సంతోష్ ప్రసన్నరావు, బ్యూలా సంతోష్, పలువురు ప్రముఖులను చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు చర్చిలో ప్రార్థనలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. దీపాల ఆరాధన చేశారు. బిషప్ భక్తులకు సందేశమిచ్చారు. క్రైస్తవ సంగీత విభావరి, దీపాల ఆరాధన, 'యేసుక్రీస్తు' క్రైస్తవ బైబిల నాటకం, పలుసాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తుల కోసం జర్మన్ షెడ్, చలువపందిర్లు ఏర్పాటు చేశారు. చర్చి చరిత్ర ప్రతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై తిమోతి 200 మంది పోలీసులతో భారీ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో 271 రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 3న నిర్వహించే రైతన్న మీ కోసం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ఆధునిక సాగు విధానాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రైతుల జీడీపీ పెంపే ప్రధాన లక్ష్యంగా చేసుకుని మండల, జిల్లా స్థాయి అధికారులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, గ్రామ రైతులు వర్క్ షాప్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే : కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కంభంవారిపల్లె మండలం గ్యారంపల్లె, గర్నిమిట్ట, జిల్లేళ్లమంద పీహెచ్‌సీలను తనిఖీలు నిర్వహించారు. కాలానుగుణంగా డెంగీ, చికెన్ గున్యా, డయేరియా తదితర వ్యాధులపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి ఈ వ్యాధులపై అప్రమత్తంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన చెప్పారు. వైద్యులు రమేశ్ రెడ్డి, రేష్మా, సాయి శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి

పంచాయతీ దస్త్రాలు స్వాధీనం

దస్త్రాలను స్వాధీనం చేసుకుంటున్న డిప్యూటీ ఎంపీడీవో భారతి, నిమ్మనపల్లె మండల పరిషత్ కార్యాలయ ఏవో రమేశ్ తదితరులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని కురవంక పంచాయతీ దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కురవంక, కోళ్లబైలు -1 పంచాయతీలకు మంజుల కార్యదర్శిగా ఉన్నారు. ఆమె ఇటీవల సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి రికార్డులను దస్త్రాలను అధికారులకు అప్పగించలేదు. మంగళవారం కురవంక పంచాయతీ దస్త్రాల విచారణకు డిప్యూటీ ఎంపీడీవో భారతి, నిమ్మనపల్లె మండల పరిషత్ కార్యాలయం ఏవో రమేశ్ విచారణకు వచ్చారు. సస్పెండ్ అయిన కార్యదర్శి నుంచి దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా నియమించిన కార్యదర్శి సంబంధి దస్త్రాలు తీసుకునేందుకు నిరాకరించడంతో దస్త్రాలను ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల వెంట కార్యదర్శులు పవన్‌కుమార్, గిరిధర్‌లు ఉన్నారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోటలోని పౌరసరఫరాల గోదామును మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత గోదాములో నిల్వ ఉన్న బియ్యం, చక్కెర, రాగుల నిల్వలతో పాటు స్టాకు రిజిస్టర్‌లో నమోదు చేసిన గణాంకాలను సరిపోల్చారు. అయితే గత నెలకు సంబంధించిన నిల్వల వివరాలు అసంపూర్తిగా ఉన్నట్లు గుర్తించారు. నిత్యావసరాల స్టాకు రిజిస్టర్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన గోదాము ఇన్‌ఛార్జిపై సబ్ కలెక్టర్ అసహనాన్ని వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల నిల్వలతో పాటు రికార్డులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి తనకు నివేదిక అందజేయాలని పౌర సరఫరాలశాఖ డీటీ వెంకట సుబ్బయ్యను ఆదేశించారు. మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీలో బి.కొత్తకోట - మదనపల్లె ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులను చేపట్టడానికి భూమిని పీకేఎం - ఉడా పట్టణాభివృద్ధి సంస్థ కోరిన నేపథ్యంలో ఈ అంశంపై దృష్టిని కేంద్రీకరించారు. స్థానిక తహసీల్దారు ఎ.బావాజాన్, మండల ఆర్ఐ వీరాంజనేయులు, మండల సర్వేయరు ముబారక్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

బి.కొత్తకోట పౌరసరఫరాల గోదామును తనిఖీ చేసి స్టాకుపై వివరాలను ఆరా తీస్తున్న మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

పోలీసుల అదుపులో యువకులు

పోలీసుల అదుపులో ఉన్న బ్రహ్మాజీ వెంకటరమణ, చెన్నూరి రాజు, ముగ్గు చిన్నపల్లయ్యలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం మండలంలోని మంచూరు పంచాయతీలో మంగళవారం కాషాయి వస్త్రాలు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొనసీమ ప్రాంతానికి చెందిన బ్రహ్మాజీ వెంకటరమణ, చెన్నూరి రాజు, ముగ్గు చిన్నపల్లయ్యలు కారులో మండలంలోని మంచూరు పంచాయతీ పెరుమల్లయ్యగారిపల్లెకు వచ్చారు. కాషాయ వేషధారణలో ఉన్న వారు గ్రామంలో తచ్చాడుతుండటంతో ఎవరో అపరిచితులు వచ్చారని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిని, కారును స్టేషన్‌కు తీసుకెళ్లారు. వీరు గత మూడు రోజుల నుంచి వాల్మీకిపురం పరిసర ప్రాంతాల్లో వీరు తిరుగుతున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. మూడు రోజుల కిందట వారు మంచూరుకు చెందిన ఒక నాయకుడిని నమ్మించి, నీ బిడ్డ చదువులో సరిగా లేదని, బాగా చదివేలా తాము చేస్తామంటూ రూ.5000 ఫోన్‌పే వేయించుకున్నారని, కొద్దిసేపటి తరువాత పరారయ్యారని బాధితుడు పోలీసులకు తెలిపారు. పోలీసులు వారిని విచారణ చేస్తున్నారు. స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ బురిడీ బాబాలను ఎవరూ నమ్మవద్దని, అలాంటి వ్యక్తులు కనబడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పరీక్షకు గట్టు విద్యార్థిని

కె.గౌరీప్రియ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం గట్టు జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.గౌరీప్రియ రాష్ట్ర స్థాయి కౌశల్ ప్రతిభ అన్వేషణ పరీక్షకు ఎంపికైంది. గత నెల 27న జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ ప్రతిభ అన్వేషణ పరీక్షకు హాజరైన ఈ అమ్మాయి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర స్థాయి పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం దక్కిందని గట్టు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి తెలిపారు. ఈ విద్యార్థినికి గైడ్ ఉపాధ్యాయుడిగా భాస్కర్ వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటకలో ప్రైవేట్ బస్సు బోల్తా

● ఒకరి మృతి.. కడపకు చెందిన పలువురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తున్న హరితా ట్రావెల్స్ బస్సు కర్ణాటక రాష్ట్రంలో మంచినీళ్లకోట వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కడప నుంచి బెంగళూరుకు వెళ్తున్న బస్సు రాయల్పాడు, శ్రీనివాసపురం మధ్యలోని మంచినీళ్లకోట వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న కృష్ణగిరికి చెందిన అనిత (50) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న సుమారు 40 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో కడపకు చెందిన షేక్ ఫయాజ్ (27), సయ్యద్ జునైద్ (22), సి.అట్లయ్య (26), అట్లూరుకు చెందిన వి.నరసింహులు (29) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సల అనంతరం బెంగళూరుకు వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన పలువురిని రాయల్పాడు, శ్రీనివాసపురంలోని ఆసుపత్రులకు తరలించినట్లు రాయల్పాడు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బస్సు డివైడర్‌ను వేగంగా ఢీకొట్టి బోల్తాపడినట్లు తెలిపారు. బస్సు వేగంగా నడపడం, మంచు కారణంగా రహదారి కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి అవుట్‌పోస్టు సిబ్బంది సమాచారాన్ని రాయల్పాడు పోలీసులకు తెలియజేశారు.

మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులు

7న భక్త కనకదాస జయంతి వేడుకలు

జబ్బల శ్రీనివాసులును ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : భక్త కనకదాస జయంతి వేడుకలకు రావాలని ఏపీ షెపర్డ్ ఇండియా, ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులును ఆహ్వానించారు. ఈ నెల 7వ తేదీ చిత్తూరు జిల్లా వి.కోటలో కనకదాస విగ్రహం కూడలిలో నిర్వహించనున్న జయంతి వేడుకలకు రావాలని నిర్వాహకులు వి.కోట కురుబ సంఘం అధ్యక్షుడు ఎం.సి.కృష్ణప్పగౌడ్, కార్యదర్శి అమరనాథ్, బాలు, ఉమాపతి మదనపల్లెకు వచ్చి జబ్బల శ్రీనివాసులును ఆహ్వానించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

MH Fruits కంపెనీ నందు ... 15000 నుండి 20000/- Tel: 7075663936.

BUSINESS OFFER

... Tel: 7382114647.

JOBS

ప్రతిష్ఠాత్మక ... Vocational Faculty ... 9848771117, 9849848817

గమనిక

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే

Contact:
KDP: 9989997626 8008514248
PDTR: 8008597620

'ప్రజా పోరాటాలతోనే మదనపల్లె జిల్లా సాధించాం'

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రజాపోరాటాలతోనే మదనపల్లె జిల్లాను సాధించామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతంకుమార్, మాలమహానాడు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు యమలా సుదర్శన్ అన్నారు. మంగళవారం మదనపల్లెలో మదనపల్లె జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యమకారుల విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానం నుంచి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ కూడలి వరకు సాగింది. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వక్తలు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో రోడ్లపైకి వచ్చి అనేక పోరాటాలు, నిరసన తెలిపిన జిల్లా సాధన ఉద్యమకారులపై నిర్బంధం, అరెస్టులు చేసినా వెనకడుగు వేయలేదన్నారు. ప్రజా పోరాటాలను, ప్రజాభిప్రాయాలను పెడచెవిన పెడితే ఎలాంటి గతి పడుతుందో వైకాపా రుచి చూసిందన్నారు. భవిష్యత్తులో మదనపల్లె జిల్లా అభివృద్ధిపై జేఏసీ ఏర్పాటు చేసి మరిన్ని సమస్యలపై స్పందిస్తామన్నారు. మదనపల్లె జిల్లా సాధన సమితి చేపట్టిన విజయోత్సవ ర్యాలీకి మాజీ ఎమ్మెల్సీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బి.నరేశ్‌కుమార్‌రెడ్డి మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్, సీపీఐ నాయకులు మురళి, కృష్ణప్ప, బహుజనసేన అధ్యక్షుడు శ్రీచందు, భారతీయ అంబేడ్కర్‌సేన నాయకుడు ఎం.మోహన్, మాలమహానాడు నాయకులు గుండా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

(c) eenadu

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

మండలాభివృద్ధికి కృషి చేయండి

మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరమ్మ

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని ప్రతి ప్రజాప్రతినిధి, అధికారులు మండలం అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఈశ్వరమ్మ మంగళవారం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో, ఎంఈవో, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

రామసముద్రం, న్యూస్‌టుడే : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేశ్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని చెంబకూరులో ఆయన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో కలిగే నష్టాలు, నేరపూరిత ప్రవర్తన, సైబర్ నేరాలు, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.

నీతి వాక్యం : ముందుకు వెళ్లలేని ప్రతి మనిషీ వెనక్కు వెళ్లాల్సిందే.. గెలవాలన్న తపన తగ్గితే ఓటమి దగ్గరయినట్లే..!

చిత్తడి దారులతో చికాలు

సీటీఎం క్రాస్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : దిత్వా తుపాను కారణంగా మదనపల్లె మండలంలో చిరుజల్లులు కురుస్తున్నాయి. వర్షం కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో చిన్న గుంతలు పెద్దగా మారుతున్నాయి. ఫలితంగా ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతోంది. రహదారులకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షంనీరు రోడ్లపై నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

● సీటీఎం క్రాస్‌రోడ్డులో వర్షంనీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో నీరంతా అంగళ్ల రహదారిపై నిలిచి. . బురదగా మారింది. తారురోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కంకరతేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

● పొన్నూటిపాళ్యం, కొళ్లబైలు గ్రామ పంచాయతీ కేంద్రాలకు వెళ్లే మార్గం కూడా వర్షాల కారణంగా బురదగా మారాయి. రామిరెడ్డిగారిపల్లె, మేకలవారిపల్లె క్రాస్ వద్ద తారులేచిపోయి వర్షపునీరు నిలిచింది. గుంతలతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇదే తరహాలో ఓబుల్‌పల్లె నుంచి పోతబోలు పంచాయతీ కేంద్రం మీదుగా నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు వెళ్లే రహదారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టమాట రైతులు పండించిన పంటను ట్రాక్టర్లు, మినీ లారీలు, ఆటోల ద్వారా సరకును మదనపల్లె మార్కెట్‌కు తరలిస్తున్నారు. గుంతల కారణంగా వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ఆరోగ్యవరంలోని తురకపల్లె మీదుగా బూచేపల్లె, పోతబోలు, చిన్నాయనచెరువుపల్లె మార్గాల్లో రహదారులకు ఇరువైపులా గుంతలు ఏర్పడ్డాయి. తురకపల్లెలో కాలువలు లేక వర్షపు నీటితోపాటు మురుగు రహదారులపై పారడంతో దుర్వాసనతోపాటు బురదగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఆటో ప్రయాణం కూడా నరకయాతనగా మారింది.

పోతబోలు రహదారిపై గుంతలు..

మరమ్మతులు చేయిస్తాం

పంచాయతీ రాజ్, రహదారుల భవనాల శాఖ అధికారులతో చర్చించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టేలా సంబంధిత అధికారులకు సూచిస్తాం. కనీసం తాత్కాలిక పనులు చేపట్టేలా చూస్తాం. **- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**

చౌక దుకాణాల తనిఖీ

కలికిరి గ్రామీణ : మండలంలోని పౌర సరఫరాల గోదాముతో పాటు 34, 6వ నంబరు చౌక దుకాణాలను మదనపల్లె సబ్ కలెక్టరు కల్యాణి మంగళవారం తనిఖీ చేసి స్టాకు రిజిస్టరును పరిశీలించారు. అనంతరం మర్రికుంటపల్లె గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించి తగు సూచనలు చేశారు. తహసీల్దారు హరికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME
SHAIK KEREEMULLAH BASHA (OLD NAME), S/o S.ABDUL ROUFF, D.No.7-141, BALIJA GADDA STREET, GURRAMKONDA P & M, ANNAMAYYA District - 517297, Andhra Pradesh. I Changed my name to SHAIK KAREEMULLAH BASHA. Henceforth, I will be known as SHAIK KAREEMULLAH BASHA.

ప్రసంగంతో మెరిసి.. బహుమతులతో మురిసి

బహుమతులందుకున్న విద్యార్థులతో విజయభారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ఛైర్మన్ ఎన్.సేతు, ప్రధానోపాధ్యాయిని రాణి, ఉపాధ్యాయులు సరిత, శారద

విజేతలతో జ్ఞానోదయ ఇంగ్లిషు మీడియం హెచ్ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, శ్రావణి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలోని విజయభారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాసం (స్పీచ్) పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో డి.చతురశ్రీ (9వ తరగతి), డి.వన్షిక (9వ తరగతి), ఎన్.మిశ్చలి రావ్ (8వ తరగతి) నిలిచారు. వీరికి పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, ప్రధానోపాధ్యాయిని రాణి, ఉపాధ్యాయులు సరిత, శారద బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

● మదనపల్లెలోని జ్ఞానోదయ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీల్లోగా భాగంగా 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎస్.కుబ్రా (9వ తరగతి), ఎస్.సాదియా (9వ తరగతి), ఎ.జశ్విత (8వ తరగతి) నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, శ్రావణిలు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

గ్రామంలో పారిశుద్ధ్య పనులు

కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ బండమీద ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే వ్యర్థపు నీరు ఇళ్ల ముందర నిల్వ చేరుతూ దోమలు వ్యాప్తికి నిలయంగా ఉండేది. ఈ సమస్యపై ఈ నెల 2న 'ఇళ్ల ముంగిట మురుగుతో తంటా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సిగ్మతుల్లా గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. రేగళ్లు పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది గ్రామంలో దోమల వ్యాప్తి చెందకుండా కాలువల్లో మందు పిచికారీ చేశారు.



అభ్యంతరాలుంటే తెలపాలి

రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రం మండలం దిన్నిపల్లెలోని శ్రీపవిత్ర సంతాన వేణుగోపాలస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోనికి తీసుకోవడానికి ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలపాలని దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ కోరారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు మంగళవారం మదనపల్లె దేవాదాయశాఖ ఈవో రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ఎవరికి ఎలాంటి అపోహలు ఉన్నా రాతపూర్వకంగా తెలపవచ్చని సూచించారు. అభ్యంతరాలు లేని పక్షంలో ఆలయాన్ని దేవాదాయశాఖలో రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

కార్యకర్తలతో మాట్లాడుతున్న రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే : తెదేపా బలోపేతానికి నాయకులు, కార్యకర్తలందరూ కృషి చేయాలని రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వడ్లకుంట గ్రామంలో గత శాసనసభ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో ఎందుకు తెదేపాకు తక్కువ వచ్చాయి, పరిస్థితి ఏమిటి అని విచారించారు. ఓట్ల శాతాన్ని పెంచి తెదేపాను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షురాలు గీతాంజలి, నాయకుడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమల పరిశీలకుడిగా నౌషాద్

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని తరిగొండకు చెందిన తెదేపా నాయకుడు, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నౌషాద్‌ను పుంగనూరు నియోజకవర్గం సోమల మండల పరిశీలకుడిగా నియమిస్తూ తెదేపా అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. గత శాసనసభ ఎన్నికల్లో తెదేపాకు తక్కువ ఓట్లు వచ్చిన పోలింగ్ బూత్‌ల పరిధిలో పరిశీలించి అక్కడి పరిస్థితులపై అధిష్ఠానానికి నివేదిక పంపే బాధ్యత ఆయనకు అప్పగించింది. ఎందుకు ఓటర్లు వైకాపా వైపు మొగ్గు చూపారు..? అవకతవకలు జరిగాయా..? ప్రలోభాలు చేశారా..? అని విచారించి పరిస్థితిని నివేదిక పంపనున్నారు.

దస్త్రాలు సక్రమంగా నిర్వహించాలి

కలకడ, న్యూస్‌టుడే : గ్రామ సచివాలయల్లో దస్త్రాలు సక్రమంగా నిర్వహించాలని ఉప ఎంపీడీవో చక్రపాణి సూచించారు. మండలంలోని కోన, గుడిబండ, నడిమిచెర్ల సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దస్త్రాలను పరిశీలించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు త్వరగా మంజూరు చేయాలని సిబ్బందికి సూచించారు.



జిలేబీలు వేసిన న్యూజిలాండ్ ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ జిలేబీలు వేస్తూ సందడి చేశారు. ఆక్లాండ్‌లోని టకానినిలో సిక్కు వర్గీయులు నిర్వహించిన క్రీడలకు స్థానిక ఎంపీ రిమా నక్వేతో కలిసి న్యూజిలాండ్ ప్రధాని హాజరయ్యారు. అందరితో ముచ్చటించిన అనంతరం జిలేబీలు వండుతున్న చోటుకు వెళ్లి.. సరదాగా కాసేపు జిలేబీలు వేశారు. అక్కడున్న వారికి స్వయంగా తానే జిలేబీలు అందించారు. ఈ వీడియోను క్రిస్టఫర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది.

హిట్లర్ కాలం నాటి 5 కిలోల ఫోను!

ఈటీవీ భారత్: అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్లు వాడుతున్న నేటి తరానికి 5 కిలోల బరువైన ఫోను అంటే వింతగానే ఉంటుంది. జర్మన్ నియంత హిట్లర్ కాలం నాటి ఈ ఫోన్‌ను చూడాలంటే పంజాబ్‌లో జరుగుతున్న హస్తకళల ప్రదర్శనకు వెళ్లాలి. రాజస్థాన్‌కు చెందిన వినయ్‌కర్ణ పోలండ్ నుంచి దీన్ని కొన్నారు. "గతకాలపు పిలుపు" పేరుతో ఆయన ఏర్పాటుచేసిన స్టాల్‌లో పాతకాలపు కెమెరాలు, ఫోన్లు, గడియారాలు, రేడియోలు ఆకట్టుకుంటున్నాయి. గత కాలపు ప్రాముఖ్యం, మన పెద్దల కృషిని ఈ తరం గుర్తించాలన్నదే తన అభిమతమని ఆయన చెబుతారు.

గొప్ప జీవక్రియతో శ్రమలేని ఆరోగ్యం

మన జీవక్రియల పనితీరు బాగుంటే శ్రమలేకుండానే ఆరోగ్యం సొంతమైనట్లు. అవి ఉత్తమంగా ఉన్నాయనడానికి నిదర్శనం ఇవి..
✦ గాఢమైన నిద్ర. ✦ రోజంతా స్థిరమైన శక్తిని కలిగిఉండటం.
✦ చక్కటి జీర్ణశక్తి. ✦ శరీరంలో కొవ్వు సులువుగా కరుగుతుండటం..
ఆకలిపై నియంత్రణ.
– సుమిత్ శర్మ, డాక్టర్

ఈఎన్‌టీ వైద్యుడి అంబులెన్స్ కారు
పేదలకు అండగా సేవలు

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వ్యాధుల వైద్యుడు జె.ఎస్. గజ్జేర్ వృద్ధులు, పేదల సహాయార్థం టెలిమెడిసిన్ సేవలు ప్రారంభించారు. సొంత కారును అంబులెన్స్‌గా మార్చారు. వారానికి ఒకసారి వేర్వేరు గ్రామాలకు వెళ్లి, అక్కడి పేదలకు సేవలు అందిస్తున్నారు. కలిసి ఈ అంబులెన్సులో ఉన్న పరికరాలతో వారిని పరీక్షిస్తారు. ఇండోర్‌లో ఉన్న మా క్లినిక్ నుంచి వీడియో కాల్ ద్వారా టెలిమెడిసిన్ సేవలు అందిస్తాం' అని వివరించారు. ఈ సేవలకు 'నేను, నా సహోద్యోగి డాక్టర్ సోనమ్ లెస్' ఇండోర్‌లో బాగా ప్రాచుర్యం పొందింది.

షాజహాన్‌కు ఓటేయాలని
సోషల్ మీడియాలో ప్రజల ప్రచారం

కేరళలోని నిలంబూర్ మున్సిపాలిటీ 11వ డివిజను కార్పొరేటరుగా బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న షాజహాన్ గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. బరిలో ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నా.. షాజహాన్ చర్చనీయాంశంగా మారారు. సామాజికసేవలో ముందుండే ఆయన గతంలో అంబులెన్స్ డ్రైవరుగా పనిచేశారు. గతేడాది వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. అయినా నిలంబూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో షాజహాన్ ఇవేవీ చెప్పుకోవడం లేదు. ఆయన సేవాగుణం గురించి స్వయంగా ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొట్టాయంకు చెందిన ఓ కుటుంబం పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. అయిదేళ్ల కిందట.. ఈ కుటుంబంలో అందరికంటే చిన్నదైన వర్షన్యకు ఉచితంగా కిడ్నీ ఇచ్చి షాజహాన్ ప్రాణదానం చేశారు.

సర్‌పై రుసరుస

- పట్టువీడని విపక్షాలు
- పార్లమెంటులో ప్రతిష్టంభన
- ప్రతిపక్ష నేతల్ని చర్చకు ఆహ్వానించిన ప్రభుత్వం

దిల్లీ: ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) అంశంపై విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీయడంతో మంగళవారం పార్లమెంటు ఉభయసభలు స్తంభించిపోయాయి. వివిధ అంశాలను చర్చకు చేపట్టాలని ప్రభుత్వం తరఫున ప్రయత్నం జరిగినా ప్రతిపక్షాల ఆందోళనలతో కార్యకలాపాలు ముందుకు సాగలేదు. ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రతిపక్ష నేతల్ని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. అంతా చర్చించాలని సిద్ధమేనని, నిర్దిష్ట సమయ పరిమితి మాత్రం విధించలేమని తెలిపింది. లోక్‌సభ ఉదయం సమావేశమయ్యాక రెండుసార్లు వాయిదాపడింది. భోజన విరామానంతరం మళ్లీ సమావేశమైనప్పుడు విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్‌పై చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, సభను కొనసాగనివ్వాలని సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా కోరారు. ఓటమి చెందిన ఆగ్రహాన్ని సభలో చూపించరాదని, మాజీ ప్రధాని వాజ్‌పేయీ సభను ఉపయోగించే విధానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శుక్రవారం వరకు పది నిమిషాల్లో మూగబోయిన సభలో పార్టీలు సమర్థించాయి.

ఆందోళనలో పాల్గొన్న రాహుల్, కేసీ వేణుగోపాల్, సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

మకరద్వారం వద్ద నిరసన

విపక్షాలకు చెందిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీ, కనిమొళి, టి.ఆర్.బాలు, జాన్ బ్రిట్టాస్ సహా పలువురు నేతలు పార్లమెంటు మకరద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమైన చర్చల నుంచి ప్రధాని మోదీ నిరంతరం తప్పించుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఓటుహక్కుకు మించిన పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రశ్నించారు. మాట్లాడుతూ ప్రభుత్వానికి విపక్షాలు నిర్దేశాలు ఇవ్వజాలవని స్పష్టంచేశారు.

తిరస్కరణకు కారణమేమిటో చెప్పండి

ఇదే అంశంపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 267 నిబంధన కింద చర్చకు అనేక పార్టీలు పట్టుపడుతున్నప్పుడు చర్చ చేపట్టాల్సిందేనని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. వాయిదా తీర్మానాలకు ఇచ్చిన 21 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఎవరి నోటీసులను తిరస్కరించారోననేదైనా చెప్పాలని ఖర్గే ప్రశ్నించారు. వందేమాతరంపై కంటే సర్‌పై చర్చకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం తిరస్కరించడంతో విపక్షసభ్యులు వాకౌట్ చేశారు.

9న చర్చించడానికి అంగీకారం

వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తికావడంపై ప్రత్యేక చర్చను ఈ నెల 8న, ఎన్నికల సంస్కరణలపై 9న లోక్‌సభ చర్చించనుంది. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశానికి ముందు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రిజిజు 'ఎక్స్'లో తెలిపారు. ఒక్కో చర్చకు ఒక్కో సభకు 10 గంటలు చొప్పున సమయం కేటాయించారు. అంతకుముందు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆప్, ఎస్పీ, సీపీఎం తదితర పార్టీల సభాపక్ష నేతలతో జరిగిన సమావేశంలో రిజిజు

నేడు విపక్ష నేతల భేటీ

సమావేశాల్లో ఉమ్మడిగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి విపక్ష నేతలు బుధవారం ఉదయం ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నారు.

రేపే భారత్‌కు పుతిన్

మన దేశంతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు ఆమోదం

మాస్కో: భారత్‌తో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు దిగువ సభ డ్యూమా ఆమోదం తెలిపింది. రవాణాలో పరస్పర మార్పిడి సహకారానికి (రెలోస్) గత ఫిబ్రవరిలో కుదుర్చుకున్న ఈ ఒప్పందానికి సై అంది. గురు, శుక్రవారాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ఒప్పందానికి సభ ఆమోదం తెలపడం విశేషం. పుతిన్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. వాణిజ్యం, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలకు వారు శ్రీకారం చుట్టనున్నారు. అమెరికాతో సంబంధాలు దెబ్బతిన్న ఈ తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, చైనా, భారత్ బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పుతిన్ తెలిపారు. 'గత మూడేళ్లలో ఈ దేశాల మధ్య వాణిజ్య బంధం మరింత విస్తరించింది. ఇంధనం, పారిశ్రామికం, అంతరిక్షం, ఇతర రంగాల్లో ఇప్పటికే ఎన్నో సంయుక్త భాగస్వామ్యాలున్నాయి. నా భారత్ పర్యటనలో ఆర్థిక అంశాలపైనా చర్చిస్తాం' అని పుతిన్ తెలిపారు.

రెలోస్ ఎంతో కీలకం

రెలోస్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాల మధ్య సైనిక నిర్మాణాలు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల పరస్పర మార్పిడి ఉంటుంది. బలగాల పంపిణీలోనే కాకుండా పరికరాలు, రవాణానూ రెలోస్ నియంత్రిస్తుంది. ఈ ఏర్పాటును సంయుక్త విన్యాసాలు, శిక్షణ, మానవతా సాయం, విపత్తుల సమయంలో వినియోగిస్తారు. డ్యూమా వెబ్‌సైట్‌లో నోట్ ప్రకారం.. రష్యా పార్లమెంటు ఆమోదించిన పత్రాల్లో.. రెండు దేశాల గగనతలాన్ని, పోర్టులను రష్యా, భారత్ యుద్ధ నౌకలు వినియోగించుకుంటాయి.

రెండు దశల్లో జన గణన

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తాం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

దిల్లీ: దేశంలో జన గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026 ఏప్రిల్-సెప్టెంబరు మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ సంబంధిత వివరాలను పేర్కొన్నారు. అదే సమయంలో కుల గణనను కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

■ **తొలి దశలో...** గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు) ■ **రెండో దశలో...** జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)

■ లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ప్రతికూల వాతావరణ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబరు- అక్టోబరు 1. ■ ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగానే కుల గణన కూడా జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

30 ప్రశ్నలతో వివరాల సేకరణ

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా 30కి పైగా ప్రశ్నలతో జన గణన పత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు.

■ సర్వేలో.. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు నిర్మాణం తీరు, నివాసితుల సంఖ్య, గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

డిజిటల్ విధానంలో ..

ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

■ మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

ఐరోపా కోరుకుంటే యుద్ధానికి సై: పుతిన్

మాస్కో: ఐరోపా ఖండం యుద్ధం కోరుకుంటే తాము అందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో వివాదంపై ఒక అంగీకారం కుదరకుండా ఐరోపా నేతలు అడ్డు తగులుతున్నారని ఆయన ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంతానికి చర్చలు జరిపేందుకు అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మాస్కోకు వచ్చి తనతో సమావేశమైన తరుణంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "యూరప్‌తో యుద్ధం చేయాలని మేం అనుకోవడం లేదు. యూరప్ తానుగా యుద్ధం కోరుకుంటుంటే, యుద్ధాన్ని ప్రారంభిస్తే మేం అందుకు సిద్ధంగా ఉన్నాం" అని పుతిన్ విలేకరులకు చెప్పారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో సవరణలపై జెలెన్‌స్కీ సానుకూలంగా స్పందించారు. మార్పుల అనంతరం ప్రణాళిక మెరుగ్గా ఉందన్నారు.

విద్యా రుణాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రుస్తుమ్‌ఖాన్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు విద్యా రుణాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రుస్తుమ్‌ఖాన్ సూచించారు. మంగళవారం స్థానిక మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా లభించే రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తక్కువ వడ్డీ రేట్లతో ప్రభుత్వం అందిస్తున్న విద్యా రుణాల గురించి తెలియజేశారు. విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా రుణ దరఖాస్తు ప్రక్రియ పారదర్శకంగా, సులభంగా ఉండటంతో పాటు విద్యను నిరవధికంగా కొనసాగించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.7.5 లక్షలు రుణం పొందొచ్చన్నారు. ఇందుకు ఆధార్, పాన్, మంచి సిబిల్ స్కోర్ ఉండాలన్నారు. విద్యార్థులు రుణాలను సద్వినియోగం చేసుకుని విద్యను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకార వేతన విభాగాధిపతి డాక్టర్ అతహర్ సమీనాఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టినట్లు విద్యాశాఖాధికారి నారాయణ తెలిపారు. జనవరి నుంచి ఏప్రిల్ నెలలో పని చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 5వ వరకు స్థానిక ఎంఆర్‌సీ భవనంలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

వారపుసంత.. దారుల చింత

వారపుసంత ఎగువ ప్రాంతంలో బురదలోనే సంత

పీలేరు, న్యూస్‌టుడే : ఏడాదికి రూ.30 లక్షల ఆదాయం వస్తున్న పీలేరులో మంగళవారం జరిగే వారపుసంతలో కనీస వసతులు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు వారపుసంత బురదమయంగా మారింది. దీంతో వ్యాపారులు కూరగాయలు బురదనీటి పక్కనే పెట్టుకుని వ్యాపారం చేశారు. కొనుగోలుదారులు కూడా బురదలో నడిచి కూరగాయలు కొనుగోలు చేశారు. సమస్యను పరిష్కరించే విషయంలో పాలకులు, అధికారులు తాత్సారం చేస్తుండటంతో సంతకు వచ్చే వారికి ఇబ్బందులు పరిపాటిగా మారాయి. అధికారులు చర్య తీసుకుని వ్యాపారులు సరకులు ఉంచుకునేందుకు సంత స్థలం మొత్తం సిమెంటు దిమ్మెలు, షెడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యపై జిల్లా పంచాయతీల అధికారి రాధమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పంచాయతీ ఆదాయం దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే సంతలో కొన్ని సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశామన్నారు. వ్యాపారులకు అనువుగా షెడ్ల నిర్మాణానికి నిధుల లభ్యతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కల పెంపకంతో ఆహ్లాదం

మొక్క నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు వెంకటనరసయ్య

పెద్దమండ్యం, న్యూస్‌టుడే : కళాశాలల్లో చదివే విద్యార్థులు మొక్కల పెంపకంలో తగిన చొరవ చూపాలని కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటనరసయ్య సూచించారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతో మంచి ఆహ్లాద వాతావరణం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వినాయకరెడ్డి, రవీంద్ర, ఆంజనేయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

టమాటా సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

రామసముద్రం, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రామసముద్రం మండలంలోని చెంబకూరు, కప్పల్లె గ్రామాల్లో మదనపల్లె ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి జాఫర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక ఎరువులకు బదులుగా రైతులు వర్మీకంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలన్నారు. తెగుళ్ల నివారణకు జీవామృతం పిచికారీ చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ దిగుబడులకు మంచి గిట్టుబాటు ధరలు ఉంటాయన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్మిషన్లకు తత్కాల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఈ నెల 6వ తేదీ వరకు పొడగిస్తూ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ విభాగం మదనపల్లె ఇన్‌ఛార్జి మహమ్మద్‌ఖాన్ తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిషు మాధ్యమాల్లో అడ్మిషన్లు చేసుకోవచ్చన్నారు. వివరాలకు చరవాణి నం: 81218 52786కు సంప్రదించాలని ఆయన కోరారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు పట్టణం తిరుపతి మార్గం కృష్ణానగర్‌లో నివాసముంటున్న దేవులపల్లె భాస్కర్‌రెడ్డి ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వచ్చి అదృశ్యం అయ్యాడని ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టామని పోలీసులు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

మదనపల్లె గ్రామీణ: వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కురవంక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు డిమాండు చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పంచాయతీలో 12 వార్డుల్లో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, ముగ్గురు వాటర్‌మెన్లకు అక్టోబరు, నవంబరు మాసాలకు సంబంధించి వేతనాలు ఇంత వరకూ చెల్లించలేదన్నారు. వేతన బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి వార్డు సభ్యులు మద్దతు పలికారు.

సీఎంపీ జిల్లా కన్వీనర్‌గా రమణారెడ్డి

నూతన కన్వీనర్ రమణారెడ్డిని పార్టీ కండువాతో సన్మానిస్తున్న రాష్ట్ర కన్వీనర్ రమణ తదితరులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ జిల్లా కన్వీనర్‌గా పోరెడ్డి రమణారెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కన్వీర్ రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అనపగుట్టలోని ఆ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు కోకన్వీర్‌గా హరిని నియమించారు. ఈ మేరకు వారి నుంచి పార్టీ ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చోదకులకు శిరస్త్రాణం తప్పనిసరి

శిరస్త్రాణం ధరించి ప్రయాణించాలని సూచనలిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం (హెల్మెట్) లేకుండా ప్రయాణించడం ప్రాణాలమీదకు తెచ్చుకోవడమేనని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం నిమ్మనపల్లె మండలంలోని పలు ప్రాంతాల్లో వాహన చోదకులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన చోదకులు మద్యం తాగి ప్రయాణాలు సాగించడం నేరమన్నారు. అతివేగంగా వాహనాలు నడపడం మంచి పద్ధతి కాదన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆత్మహత్యకు యత్నించిన మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కూలీ రవీంద్రారెడ్డి (38) తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇదివరకే ఇద్దరిని వివాహం చేసుకుని వదిలేసిన ఆయన మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనీకి చెందిన రమణమ్మతో సహజీవనం సాగిస్తున్నాడు. కుటుంబ విషయమై ఆమెతో గొడవపడి ఈ నెల 1న అతను పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆయన తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు అతని తండ్రి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

తంబళ్లపల్లెలో రైతులకు వేరుసెనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

ములకలచెరువు, న్యూస్‌టుడే : రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా తంబళ్లపల్లె మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి అన్నారు. మంగళవారం ఏవో రమణకుమార్ ఆదేశాలతో మండలంలోని పలు సచివాలయాల్లో రబీ సీజన్‌కు సంబంధించిన రాయితీ వేరుసెనగ కాయలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రాయితీ వేరుసెనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీలో వ్యవసాయ బోర్లు, బావులు, కాలువ కింద సాగు చేసే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, కరెంటు బిల్లు జిరాక్సులను వ్యవసాయ శాఖ సిబ్బందికి అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనకాయలు పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సురేశ్, సుధాకర్, రెడ్డిశేఖర్, నవ్యశ్రీ, కూటమి నాయకులు పురుషోత్తం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, సుధాకర్‌రెడ్డి, నరసింహులు, సోము, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గాయపడిన రమణారెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం ములకలచెరువులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఈతోడుకు చెందిన రమణారెడ్డి, శంకర్ ద్విచక్ర వాహనంపై సొంత పనుల నిమిత్తం ములకలచెరువుకు బయలుదేరారు. ములకలచెరువు షాదీ మహాల్ సమీపాన ములకలచెరువు నుంచి కదిరి వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా కుడి వైపు రావడంతో ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని సీఎంకు వినతి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజంపేటను జిల్లా కేంద్రంగా చేయాలని సీఎం చంద్రబాబును కోరినట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. విజయవాడలోని సచివాలయంలో మంగళవారం సీఎంను కలిసి ఇక్కడి ప్రజల ఆకాంక్షను ఆయనకు వివరించామన్నారు. గత వైకాపా హయాంలో రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాయచోటిని జిల్లా కేంద్రంగా చేసి రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల ప్రజలకు నష్టం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపట్టాలని విన్నవించినట్లు వివరించారు.

తుపాను వేళ అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాపై దిత్వా తుపాన్ ప్రభావం ఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రతిభకు పురస్కారం

ఉపన్యసిస్తున్న విద్యార్థిని

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ తులసి ఎడ్యుకేషనల్ అకాడమీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. వారిలో 9వ తరగతికి చెందిన జి.దీపిక, ఎన్.రూపశ్రీ, 8వ తరగతి చదువుతున్న కె. నవ్యశ్రీ విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ తులసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు అలెగ్జాండర్, శ్రీనివాసులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ తులసి, ఉపాధ్యాయులు

నోరు తెరిచిన కాలువలు
ఆదమరిస్తే అంతే సంగతులు!

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట పురపాలకలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన మురుగు కాలువలు, చిన్న కాలువలు, ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉంటున్నాయి. మురుగు కాలువలపై పైకప్పు(పలకలు), కనీసం రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారుతున్నాయి. ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలు నీటిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని ప్రధాన మురుగు కాలువల్లో నీటి ప్రవాహం పెరిగింది. కాలువలపై రక్షణ పలకలు లేని ప్రాంతాల్లో ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. 15 ఏళ్లుగా అధికారుల నిర్లక్ష్యంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కడప-తిరుపతి ప్రధాన రహదారిలో ఇలా..

ప్రణాళికలు సిద్ధం చేశాం

రాజంపేట పురపాలక పరిధిలో ఉన్న మురుగు కాలువలపై పలకలు ఏర్పాటు చేయడానికి రూ.20 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే కౌన్సిల్ సమావేశంలో చర్చించాం. పనులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుటాం.

- శ్రీనివాసులు, పురపాలక కమిషనర్, రాజంపేట

ప్రమాదకర ప్రాంతాలు

● **ఆర్టీసీ ప్రాంతం:** పట్టణంలోని ఎర్రబల్లి వద్ద మురుగు కాలువలు దారుణంగా ఉన్నాయి. ఎర్రబల్లి జాతీయ రహదారి వద్ద మురుగు చేరి చెరువును తలపిస్తోంది. ఆర్టీసీ ప్రధాన రహదారి నుంచి బైపాస్ రోడ్డు వరకు ఉన్న 500 మీ. ప్రధాన కాలువపై పలకలు లేవు.

● **ఎన్టీఆర్ సర్కిల్:** రాజంపేట పట్టణంలోని మురుగు కాలువలు నుంచి వచ్చే నీరంతా ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ప్రధాన కాలువలో కలుస్తోంది. అక్కడ నుంచి చక్రాల మడుగులోకి చేరుతుంది. ఇక్కడ కాలువ దాదాపు 10 అడుగుల లోతు ఉంటుంది. ఏదైన ప్రమాదం జరిగి అందులో పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది.

● **సాతపల్లి వద్ద:** కూచివారిపల్లి నుంచి చక్రాల మడుగు వరకు దాదాపు రెండు కి.మీ కాలువ ఇళ్ల మధ్య ఉంది. దీంతో కొందరు అక్రమార్కులు ఆక్రమించారు. మిగిలిన ప్రాంతాల్లో కాలువపై పైకప్పు ఏర్పాటు చేయలేదు. వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారుతోంది.

● **మార్కెట్ ప్రాంతం:** పట్టణంలోని మార్కెట్- నూనెవారిపల్లి ప్రధాన రహదారి, బీఎస్ హాల్ కూడలి వద్ద ఉన్న మురుగు కాలువలో చెత్త వేయడంతో మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. ఇక్కడ కాలువ, రోడ్డు సమానంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

చక్రాలమడుగు వద్ద ప్రమాదకరంగా ఉన్న కాలువ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

స్పందనకు వందనం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని జగదాంబ సెంటర్లో ప్రభాకర్ సీడ్స్ కంపెనీ ఎదురుగా ఉన్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈ సమస్యపై ఈ నెల 1న 'చెత్త ఎత్తక అవస్థలు తొలగక' అను శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చెత్త నిల్వలు తొలగించారు.

గాలివీడు, న్యూస్‌టుడే: అంగన్వాడీ కేంద్రాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో జహరాబీ సూచించారు. గాలివీడులోని పక్కీరారెడ్డిగారిపల్లె అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ నెల1న ఈనాడులో 'వసతులు కల్పించి ..అవస్థలు తీర్చండి' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆరవణలోని పిచ్చిమొక్కలను తొలగించారు. మరుగుదొడ్ల తలుపులు సరి చేయించారు. అభివృద్ధి పనులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు.

?: పట్టణంలోని మదనపల్లె రోడ్డు మార్గంలో ప్రధాన రహదారిపై వాహనాలకు పశువులు అడ్డుగా వస్తున్నాయి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. **-ఆంజనేయులు, స్థానికుడు.**

✓: ఇప్పటికే పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చాం. వారు స్పందించకపోతే రోడ్లపై తిరుగుతున్న పశువులను కడపలోని గోశాలకు తరలిస్తాము. **-రవి, పురపాలక కమిషనర్, రాయచోటి**

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

?: గాలివీడు ఆర్టీసీ బస్టాండు సమీపంలో మాంసం దుకాణాల నుంచి వెలువడే వృథా నీటితో పాటు వర్షపు చినుకులు పడి సంత దారి అధ్వానంగా ఉంది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

- గంగాధర్‌నాయుడు, గాలివీడు

✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి సంత దారిలో పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **-లక్ష్మీదేవి, గాలివీడు గ్రామ సంచాయతీ సర్పంచి**

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఎస్.రామ్‌చరణ్

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట సంజీవపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రామ్‌చరణ్ అండర్-14 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మన్సూర్‌అలీ మంగళవారం అన్నారు. త్వరలో జాతీయ స్థాయిలో నిర్వహించే ఖోఖో పోటీలకు అన్నమయ్య జిల్లా నుంచి ఆంధ్ర జట్టు తరపున పాల్గొంటారాన్నరు.

వీరబల్లి : మట్లి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు హెచ్‌ఎం వి.జయన్న, పీడీ జగదీశ్వరయ్యలు మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో 9వ తరగతికి చెందిన సి. జగదీష్, అండర్-17 విభాగంలో పదోవ తరగతికి చెందిన వి. హర్షవర్ధన్‌లు ఎంపిక అయ్యారన్నారు. వీరు త్వరలో దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

విజేతలతో హెచ్.ఎం జయన్న, ఉపాధ్యాయులు

కౌశల్ విజ్ఞాన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కె.వెన్నెల..

ఎ.హర్షిత

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బీపీ రాచపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కె.వెన్నెల, ఎ.హర్షితలు రాష్ట్రస్థాయి కౌశల్ విజ్ఞాన పోటీలకు ఎంపిక అయ్యారని ప్రధానోపాధ్యాయులు కె.ఉజ్వల్‌కుమార్ మంగళవారం తెలిపారు. విద్యార్థుల్లో సైన్సుపై ఆసక్తిని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడేందుకు భారత విజ్ఞాన మండలి కౌశల్-2025 పేరుతో ప్రతి ఏటా విజ్ఞాన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి ఈ నెల 27వ తేదీన తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి కౌశల్ విజ్ఞాన పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జిల్లా కేంద్రాన్ని సాధించుకుందాం'

సమావేశంలో పాల్గొన్న జిల్లా సాధన సమితి ప్రతినిధులు

రాజంపేట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం విషయంలో రాజంపేటకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు విన్నవిద్దాం.. జిల్లా కేంద్రాన్ని సాధించుకుందామని రాజంపేట జిల్లా సాధన సమితి నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రం ఏర్పాటుకు నిరసనలు, పోరాటాలు, ర్యాలీలపై మంగళవారం స్థానిక ర.భ.శాఖ అతిథిగృహంలో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3న రాజంపేట పాతబస్టాండు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్‌కలెక్టర్‌కి వినతిపత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సంపూర్ణ మద్దతు తెలిపి స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లక్కిరెడ్డిపల్లె సీఐ టీవీ కొండారెడ్డి తెలిపారు. మగళవారం మండల పరిధిలోని కోనంపేట గ్రామ సచివాయంలో వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ టీవీ కొండారెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

నుండువల్లి, నందలూరు, న్యూస్‌టుడే: రాయవరం జిల్లా ఉర్దూ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌కు అర్హులైన వారు ఈ నెల 5వ తేదీలోగా మండల విద్యా భవనంలో దరకాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటేశునాయక్ మంగళవారం కోరారు. నెలకు రూ.12500 జీతం ఇస్తారని, ఉర్దూలో బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. నందలూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా పని చేయడానికి ఈ నెల 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖ అధికారులు ఎల్ నాగయ్య, అనంతకృష్ణలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎస్జీటీగా, నందలూరు జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల్లో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం బోధించడానికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4న మండల సర్వసభ్య సమావేశం

సంబేపల్లె, న్యూస్‌టుడే: సంబేపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకట సుబ్బారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా శాఖల అధికారులంతా నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్

రాజంపేట, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్‌లో ఎలాంటి సమస్యల్లేకుండా చూడాలని పురపాలక కమిషనర్ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. క్యాంటీన్‌లో చిన్న చిన్న సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని, వాటిని వెంటనే పరిష్కరించి ఇక్కడికి వచ్చే ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తామన్నారు. క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పుర డీఈఈ హేమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పుర కమిషనర్ శ్రీనివాసులు

ఉరకలేస్తున్న గుంజనేరు

చిట్వేలి, పుల్లంపేట, న్యూస్‌టుడే: దిత్వా తుపాన్‌తో కురుస్తున్న వర్షాలకు చిట్వేలి మండలంలో గుంజనేరు, పుల్లంపేటలోని పుల్లంగేరు ఉద్ధృతంగా పారుతున్నాయి. సోమవారం రాత్రి నుంచే నీటి ప్రవాహ వేగం పెరిగి పారుతుండటంతో స్థానిక ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏరులను చూడ్డానికి పోటీ పడుతున్నారు. సాగు, తాగునీటి కొరత ఉండకపోవచ్చునని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గంతలు తీయండి.. గుంతలు చూడండి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తారు, కంకర తేలిపోయి రహదారి గుంతలమయంగా మారాయి. కొత్త బస్టాండుకు వెళ్లే అప్రోచ్ రోడ్డు ప్రారంభంలోనే లోతైన గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జూలై, ఆగస్టులో కురిసిన వర్షాలకు ఇక్కడి దారి దెబ్బతినింది. అప్పుడు అధికారులు కొంత కంకర, మట్టితో తత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. దీనికి తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కార మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై రోడ్లు, భవనాలశాఖ డీఈ జయప్రకాష్‌ను వివరణ కోరగా వర్షాలు తగ్గిన వెంటనే రోడ్డును బాగు చేస్తామన్నారు.

ప్రహరీ లేక.. రక్షణ ప్రశ్నార్థకంగా

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో వెనుక వైపు నుంచి కీటకాలు, విషపురుగులు తరగతి గదిలోకి వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదుండ్రులు కోరుతున్నారు.

మహారాజశ్రీ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No.353/2023
శ్రీరామ మంజుల, భర్త శ్రీనివాసులు, వయస్సు 47 సం॥, హిందూ, R/o డి.నెం.43/110, బోస్ నగర్, కొత్తపేట, రాయచోటి టౌన్, అన్నమయ్య జిల్లా మరియు ఇతరులు ...వాదులు
V/s
D4: ఈతకోటి బాలాజి, తండ్రి శేషాద్రి, వయస్సు 24 సం॥, వ్యవసాయం, R/o డి.నెం.1/36, మంగళవీధి, చిన్నమండెం గ్రామం మరియు మండలం, అన్నమయ్య జిల్లా. ...4వ ప్రతివాది
దావా సమను
పై దావాలో వాదులు, ప్రతివాదులు Suit దాఖలా ఆస్తిపై బాగపరిష్కారము కోరుతూ మరియు 5.6.2023 విక్రయ దస్తావేజులు చెల్లవని నిర్ధారించుటకు దావా దాఖలు చేసియున్నారు. 4వ ప్రతివాది అయిన ఈతకోటి బాలాజి అయిన మీరు 9.12.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజర్తె మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
ఇట్లు: డి.ఈశ్వరయ్య, M.Com., B.L.,
టి.వి.రమణ, B.A., B.L.,
వాది తరఫున న్యాయవాదులు
రాయచోటి, అన్నమయ్య జిల్లా.

వ్యక్తిత్వ వికాసంపై ఫార్మసీ విద్యార్థులకు అవగాహన

పాల్గొన్న ఫార్మసీ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పలుకూరి శంకర్ మంగళవారం తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించడానికి భవిష్యత్తు ప్రణాళిక చాలా అవసరమన్నారు. క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు మీ వద్దకు చేరుతాయన్నారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో సుబ్బరాయుడు, విశ్రాంత హెల్త్ ఎడుకేషన్ అధికారి గుణ శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులకు రూ. 20 కోట్లతో ప్రతిపాదనలు

కాలువను పరిశీలిస్తున్న డీఈ కిషోర్‌కుమార్

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతులకు రూ.20 కోట్ల మేర అంచనా వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని వెలిగల్లు ప్రాజెక్టు డీఈ కిషోర్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెలిగల్లు కుడి కాలువను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి 1.4 టీఎంసీల నీరును విడుదల చేశామన్నారు. ప్రస్తుతం 75 చెరువులు నీరు నిండాయని ఇంకా కొన్ని చెరవులకు నీరు సక్రమంగా వెళ్లడం లేదన్నారు. దీంతో కుడి కాలువను మరమ్మతులు చేయిస్తే సరాసరి చెరువలకు నీరు చేరుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాజంపేట, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా కల్లూరుపల్లికి చెందిన డీవైఎఫ్ఐ నేత పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పి.మణి కోరారు. రాజంపేటలో మంగళవారం వారు మాట్లాడుతూ గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు. రైల్వేకోడూరుకు చెందిన యువతి(27) వివాహమై భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులు దగ్గరే ఉంటోంది. శ్రీసిటీలో ఉద్యోగ అన్వేషణలో భాగంగా వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని సోదరి ఇంటికి వచ్చింది. నవంబర్ 30వ తేదీన శ్రీసిటీలో ముఖాముఖీకి వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన యువతి ఇంతవరకు రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

కూలీల హాజరును పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

సుండుపల్లి, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఈ నెలాఖరులోగా లక్ష్యాలను పూర్తి చేసి అదనపు పని దినాలలోకి వెళ్లేలా కూలీల సంఖ్యను పెంచాలని పీడీ వెంకటరత్నం సూచించారు. ఈడిగపల్లి సచివాలయ పరిధి పెద్దబలిజపల్లి సమీపంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రైతులకు లబ్ధి చేకూర్చే పనులు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మాలిక్‌భాష, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రాజశ్రీ గౌరవ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాయచోటి
O.S. No.9/2024
వాదులు: Mr దేశముఖ్ షఫియున్నీసా ఖానం & others
ప్రతివాదులు: Mr S.K.ఫజెలే ఇలాహి, షాహీ జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్, అన్నమయ్య జిల్లా, రాయచోటి & others
Notice to Defendant Nos.
102. దేశముఖ్ అంజాద్ ఖాన్, తండ్రి డి.అజీజ్ ఖాన్, సుమారు 49 సంవత్సరాలు, R/a 30/45-A, మహబూబ్ బాషా వీధి, ఉమర్ మసీదు దగ్గర, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా.
103. దేశముఖ్ ఎజాస్ ఖాన్, తండ్రి డి.అజీజ్ ఖాన్, వయస్సు సుమారు 40 సంవత్సరాలు, R/a 35/102, సుబ్బారెడ్డి వీధి, రాయచోటి.
106. దేశముఖ్ సర్ఫరాజ్ ఖాన్, తండ్రి డి.నవాబ్ ఖాన్, సుమారు 21 సంవత్సరాలు, R/a 3/177, ఉరబ్ స్ట్రీట్, చిన్నమండెం - 516 214.
107. షేక్ సలీమ్, S/o దేశముఖ్ రహీమా బీ, సుమారు 50 సంవత్సరాల వయస్సు, R/a D.No. 4-331, రాజుల కాలనీ, మెయిన్ రోడ్, రాయచోటి. ...ప్రతివాదులు
Sirs, పై నెంబర్ గల కేసును వాదులు రాయచోటి పట్టణం మరియు గ్రామం నందు Sy.No.693/1 A, Ext Ac.6.00 cents తమ పూర్వీకుల నుండి తమకు వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తిని రాయచోటి జామియా మస్జిద్ సభ్యులు దురుద్దేశంతో ఆక్రమించాలని చూస్తున్నారని, అట్టి ఆస్తిలో దౌర్జన్యంగా కట్టడాలు చేశారని, అట్టి మసీదు వారికి సదరు ఆస్తిపై ఎట్టి హక్కులు లేవని, అట్టి దావా ఆస్తి (suit property) Sy.No.693/1 A Ext Ac.6.00 సంపూర్ణంగా తమకే చెందునని దాఖలు చేసిన పై తెలిపిన కేసు నందు మీరు కూడా పార్టీలుగా ఉన్నారని, అట్టి కేసు నందు మీరు 22.12.2025వ తేదీన పై కోర్టు నందు ఉ.10.30 గం.లకు హాజరై మీ అక్షేపణలను తెలుపుకోవచ్చును. లేనంతట పై కేసు మీ పరోక్షములో తీర్మానించబడును.
//By Order of the Court //
Rayachoty, Dt 1.12.2025
మందా నాగేశ్వరరావు, అడ్వకేట్, రాయచోటి.
సరస విద్యాసాగర్, అడ్వకేట్, మదనపల్లె.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

కంచాలమ్మ గండి చెరువుకు జల హారతి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పురపాలక పరిధిలోని ఎగువ అబ్బవరంలోని కంచాలమ్మ గండి చెరువు నిండుకుండను తలపిస్తోంది. మంగళవారం అలుగు పారడం ప్రారంభం కావడంతో తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అధికారులతో కలిసి జలహారతి ఇచ్చారు. రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్ల నుంచి నీటిని నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంతో పాటు గ్రామాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, సాగునీటి సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జలహారతి ఇస్తున్న తెదేపా నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి

(c) eenadu

ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..! ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టేలా ప్రయోగాలను చేసేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం, గుంటూరులో డిసెంబరు 11వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ● మొదటి మూడు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం ● రిజిస్ట్రేషన్ చివరి తేదీ : డిసెంబరు 7

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

షామియానా.. ధాన్యానికి రక్షణ

అన్నదాతలు మాసూళ్ల చేసిన ధాన్యాన్ని కల్లాల్లో, రహదారులపై ఆరబోస్తున్నారు. దిత్వా తుపాను ప్రభావంతో వర్షపుజల్లులు కురుస్తుండటంతో ధాన్యం కాపాడుకునేందుకు ఉరుకులుపరుగులు పెట్టి పట్టలు కప్పుతున్నారు. మంగళవారం వర్షం కురవడంతో సంగుపాలెం కోడూరులో రైతు గుట్టగా చేసిన ధాన్యంపై పట్ట కప్పి.. దానిపై వాటర్ ప్రూఫ్ షామియానా వేశారు. రైతు ప్రయత్నాన్ని అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

ఈనాడు బాపట్ల

బుధవారం డిసెంబరు 3, 2025 5

సచివాలయాలకు సారథులు

పేటేరు (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే

ఇక నుంచి నిరంతర పర్యవేక్షణ

సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకొచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 4,284 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. పర్యవేక్షణ అధికారితో పాటు జాబ్ చార్టు లేకపోవడంతో కొంత మంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో మండల, పురపాలక సంఘానికి ఒక్కొక్కరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు.

పంచాయతీరాజ్‌లో గ్రేడ్-1 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, ఈవోఆర్‌డీల ఉద్యోగోన్నతి కల్పించి డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. గతంలోని ఈవోపీఆర్డీ పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్చారు. తాజాగా వీరికి అదనంగా సచివాలయ పర్యవేక్షణకు మరో డిప్యూటీ ఎంపీడీవోను నియమించారు.

విధులు ఇలా.. డిప్యూటీ ఎంపీడీవో గ్రామ, వార్డు సచివాలయాల అభివృద్ధి ప్రణాళికలో పాల్గొనాలి. ప్రభుత్వ పథకాల అమలు, విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరుల సమాచారం సేకరించాలి. విపత్తు సమయంలో అత్యవసర సేవలందించాలి. సచివాలయాల ద్వారా వస్తున్న ఫిర్యాదుల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. సమయపాలన పాటించేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..	
మండలాలు	25
మున్సిపాలిటీలు	4
గ్రామ సచివాలయాలు	408
వార్డు సచివాలయాలు	69
ఉద్యోగుల సంఖ్య	4,284

28 మంది నియామకం.. 'ప్రతి మండలానికి, పురపాలక సంఘానికి ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమించింది. తద్వారా సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రజలకు వేగవంతమైన, నమ్మకమైన సేవలను ఇంటి వద్దే అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో 24 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలు, రేపల్లె, బాపట్ల, అద్దంకి, చీరాల మున్సిపాలిటీలకు సచివాలయ పర్యవేక్షణ అధికారులను నియమించాం' అని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి విజయలక్ష్మి తెలిపారు.

నిబంధనలకు నీళ్లు.. పిచ్చుక గూళ్లు!

నిబంధనలకు నీళ్లొదిలారు.. పిచ్చుక గూళ్లను తలపించేలా అక్రమ నిర్మాణాలు చేసేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం.. కొందరి స్వార్థం.. వెరసి బాపట్ల - చీరాల మధ్య సముద్ర తీరం వెంబడి ఈ తంతు యథేచ్ఛగా సాగుతోంది. సూర్యలంక బీచ్‌లోని అసైన్డ్ భూముల్లో రిసార్టులు ఏర్పాటు చేస్తున్నారు. చీరాల - చినగంజాం మధ్య కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నియమావళిని ఉల్లంఘించి కథ నడిపిస్తున్నారు. మొత్తంగా పర్యాటకుల భద్రత గాల్లో దీపంలా మారుతోంది.

ఈనాడు, అమరావతి – న్యూస్‌టుడే, బాపట్ల

సముద్రతీరం వెంబడి అక్రమ నిర్మాణాలు

జిల్లాలో 74 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. బాపట్ల నుంచి చీరాల, చినగంజాం వరకు అందమైన తీరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సూర్యలంక బీచ్ ఆంధ్ర గోవాగా ప్రసిద్ధి. ఇంతటి కీలక ప్రాంతంలో గత కొన్నేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తుండటం గమనార్హం. ప్రధానంగా రాష్ట్రంతో పాటు తెలంగాణ నుంచి సూర్యలంక బీచ్‌ను సందర్శించేందుకు పర్యాటకులు ఎక్కువగా వస్తుండటంతో రద్దీగా ఉంటోంది. ఇక్కడ ఏపీ టూరిజం హరిత రిసార్టులు సరిపోకపోవడంతో పర్యాటకులు వసతి కోసం ఇతర మార్గాల్ని అన్వేషిస్తున్నారు. బాపట్ల నుంచి సుమారు 9 కిలోమీటర్ల దూరం ఉండటం మరో సమస్య. ఈ క్రమంలో స్థానికంగా కొందరు ప్రైవేటు రిసార్టులు విరివిగా ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

అసైన్డ్ భూముల్లో..

సూర్యలంక తీరం వెంబడి అసైన్డ్ భూముల్లో అనధికారికంగా రిసార్టుల నిర్మాణం చేపడుతున్నారు. ఇక భద్రత ఏర్పాట్లు అంతంతమాత్రమే. సమీపంలోనే ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఉంది. రిసార్టుల్లోకి ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళుతున్నారో.. అర్థం కాని పరిస్థితి. ఈ వ్యవహారంపై గతంలో అధికారులు నోటీసులు ఇచ్చినా.. అవి కాగితాలకే పరిమితం.

నియమావళి ఉల్లంఘన

చీరాల నుంచి చినగంజాం వరకు సముద్ర తీరం వెంబడి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జడ్) నియమావళిని గండికొడుతుండటం కనిపిస్తోంది. బాపట్ల పరిసరాలు బావుడా పరిధిలో.. చీరాల, చినగంజాం పరిసరాలు ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్నందున ఇరుపక్షాల పర్యవేక్షణ కొరవడింది. స్థానిక రెవెన్యూ అధికారులు ఆడిందే ఆటగా మారింది. కొందరు పంచాయతీ కార్యదర్శులు నిబంధనలు ఉల్లంఘించి అనుమతులిస్తున్నారు. మరికొన్ని అనుమతి లేకుండానే కట్టేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి.. నిబంధనలు పక్కాగా అమలయ్యే చూడాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై కలెక్టర్ వి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిస్థితిపై దృష్టి పెడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని వివరించారు.

కలల సాధానికి గడువు పెంపు

బేతపూడి (రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన గడువును పొడిగించారు. గత నెల 30 తోనే గడువు ముగిసినా ప్రజల నుంచి వినతులు వస్తుండటంతో పెంచారు. జిల్లాలోని 25 మండలాల పరిధిలో కొద్ది నెలల కిందట ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో అధికారులు ప్రతి గ్రామానికో సర్వే బృందాన్ని నియమించారు. వీరు పల్లెల్లో పర్యటించి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. వారి వివరాలను పీఎంఏవై 2.0 పోర్టల్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేల దరఖాస్తులు వచ్చాయి. ఆసక్తి అర్హత ఉన్నవారంతా ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులను సచివాలయాల్లో, సర్వే బృందాలకు ఇవ్వొచ్చు. పథకంలో అర్హత పొందిన వారికి కేంద్రం రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుంది.

14 వరకు అవకాశం

నియోజకవర్గం	దరఖాస్తులు
రేపల్లె	3,338
బాపట్ల	1,716
చీరాల	1,540
వేమూరు	1,767
అద్దంకి	5,405
పర్చూరు	5,258

అర్హులందరికీ ఇళ్ల నిర్మాణమే లక్ష్యం.. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ్ పథకం కింద గృహాల నిమిత్తం చేస్తున్న సర్వే గడువును ఈ నెల 14 వరకు పొడిగించారు. ఇంకా అర్హులుంటే వారికీ అవకాశం కల్పించాలన్నదే ధ్యేయం. 2029 నాటికి పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం' అని గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వరరావు తెలిపారు.

చిరుజల్లు.. అన్నదాత కుదేలు

పేరలిలో..

బాపట్ల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ముప్పు తప్పినా జిల్లాపై స్వల్పంగా ప్రభావం చూపించింది. ఆకాశం మేఘావృతమై ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురిశాయి. డెల్టాలో కోత, నూర్పిడికి వచ్చిన వరి పంట నేల వాలింది. చలి బాగా ఉండటంతో ప్రజలు వణికిపోయారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు సగటున 26.8 మి.మీ. వర్షం కురిసింది. చలిగాలులు బుధవారమూ కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నెల 5 వరకు బీచ్‌లు మూసివేసి ప్రవేశాలను నిలిపివేశారు.

నేలవాలిన వరి పంట

❖ ఆకాశం మబ్బులు కమ్మి ఉండటంతో వరి కోతలు, యంత్రాలతో నూర్పిడులను రైతులు నిలిపివేశారు. వర్షపు జల్లులకు బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని వేల ఎకరాల్లో వరి పంట నేల వాలింది. నేల వాలిన పంటను యంత్రాలతో నూర్పిడి చేయడానికి ఎకరాకు రూ.4 వేల వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కోతలు కోయాలన్నా ఇదే పరిస్థితి. కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యంలో తేమ శాతం తగ్గడం లేదు. ధాన్యాన్ని కాపాడుకోలేమని భావిస్తున్న కొందరు కర్షకులు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావొద్దు

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించే రైతులు ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావద్దని సీసీఐ ఏజీఎం సంజయ్ ద్వివేది విజ్ఞప్తి చేశారు. నాదెండ్ల మండలం గణపవరం శ్రీ వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నాణ్యమైన పత్తిని కేంద్రానికి తీసుకొచ్చి గరిష్ఠ మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో తెస్తే నాణ్యత తగ్గి ధర కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. తేమశాతం 8 నుంచి 12లోపు ఉండాలని, రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్దిష్ట సమయానికి సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకొచ్చి మంచిధర పొందాలని సూచించారు.

పత్తిని పరిశీలిస్తున్న సంజయ్ ద్వివేది

డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: డ్రైవింగ్ శిక్షణ ద్వారా యువత ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ అన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ పాఠశాలలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 16 మందికి డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి రుణాలు ఇచ్చి వాహనాలు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. డీటీవో పరంధామరెడ్డి, డీపీటీవో విమల తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ నాలుగో తరగతి సిబ్బందికి ఉద్యోగోన్నతులు

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖకు చెంది జిల్లాపరిషత్తు యాజమాన్య పరిధిలోని 18 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 13 మంది రికార్డు అసిస్టెంట్లుగా, నలుగురు ల్యాబ్ అసిస్టెంట్లుగా, ఒకరు లైబ్రరీ అసిస్టెంటుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి ఆయా జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులు దీర్ఘకాలంగా ఉద్యోగోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. ఒకేసారి 18 మందికి ఉద్యోగోన్నతులు కల్పించడంతో వారి నిరీక్షణ ఫలించినట్లయింది.

పారదర్శకంగా ధాన్యం సేకరణ

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం సేకరణ పారదర్శకంగా సాగుతోందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రైతుల నుంచి ఇప్పటి వరకు 7,600 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. డిసెంబరు రెండో వారం నుంచి నూర్పిడులు పెరిగి మార్కెట్లోకి లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. 2500 టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేసి ఆర్‌ఎస్‌కేలకు ఇచ్చామన్నారు. ధాన్యం తడవకుండా నిల్వ చేయడానికి గోదాములు సిద్ధం చేశామని తెలిపారు.

మీ పిల్లలెలా చదువుతున్నారు?

5న మెగా పీటీఎం 3.0

చీరాల అర్బన్, పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే

పిల్లలు బడికి వెళుతున్నారు.. వస్తున్నారు.. అనేది కాకుండా వారు పాఠశాలలో ఎలా చదువుతున్నారు.. తరగతి గదిలో ప్రవర్తన ఎలా ఉంది.. ఇంట్లో ఎలా ఉంటున్నారు.. వారి భవిష్యత్తు కోసం ఇంకేం చేయాలనే తదితర విషయాలపై చర్చించేందుకు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం వేదికగా నిలవబోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడోసారి (మెగా పీటీఎం-3) నిర్వహిస్తోంది. ఆ రోజు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను విద్యా శాఖ విడుదల చేసింది.

ఇలా నిర్వహిస్తారు

❖ ఈ నెల 5వ తేదీ ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, దాతలు, అధికారులను పాఠశాల ప్రాంగణంలోకి ఆహ్వానిస్తున్నారు. ❖ ప్రతి విద్యార్థితో వారి తల్లిదండ్రులను తరగతి గదిలో కూర్చోబెట్టి వారి అభ్యసన సామర్థ్యాలపై మాట్లాడతారు. బోధనలో నూతన పద్ధతులను వీడియో ద్వారా ప్రదర్శిస్తారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ, నైపుణ్యాంధ్ర తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు.

● టీఎల్ఎం, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్టెమ్ ల్యాబ్‌లు, క్రాఫ్ట్ ప్రాజెక్టులపై విద్యార్థులతో ప్రదర్శన ఏర్పాటు చేయించి అందరు తిలకించేలా చూస్తారు.

● చివరిగా సమావేశం ఏర్పాటుచేసి మా తెలుగు తల్లి పాటతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థులు ప్రగతి నివేదికలు (ప్రోగ్రెస్ రిపోర్టు) చదివి వినిపించడంతో పాటు వాటిని అందిస్తారు. విద్యాభివృద్ధికి ముందుకొచ్చే దాతల సహకారాన్ని తీసుకుంటారు. వారు అందించిన విద్యా సామగ్రిని పంపిణీ చేస్తారు.

❖ ప్రభుత్వ పాఠశాలలు : 1405
❖ విద్యార్థుల సంఖ్య: 85,358
❖ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 15
❖ విద్యార్థుల సంఖ్య: 2775

కొడవళ్లకు చిరునామా వి.కొప్పెరపాడు

వి.కొప్పెరపాడు.. కొడవళ్ల తయారీకి ప్రసిద్ధి చెందింది. ఇక్కడి కొడవళ్లు నాణ్యంగా ఉంటాయని పేరు రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు ప్రాంతానికి చెందిన రైతులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకీ గ్రామానికి చెందిన ఏడు కుటుంబాల వారు మూడు దశాబ్దాల క్రితం బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు వలస వచ్చారు. మాగాణి వరి పంట ఎక్కువగా ఉండటంతో కోత కొడవళ్ల తయారీని ఉపాధిగా మలుచుకున్నారు.

సొంతంగా సామగ్రి తెచ్చుకుని అందంగా, నాణ్యంగా తయారు చేయడమే కాకుండా అందుబాటు ధరలకు విక్రయిస్తుండటంతో తమ కొడవళ్లను కొనుగోలు చేస్తుంటారని తయారీదారులు వీరవల్లి వెంకట్రావు, సముద్రాచారి, వెంకటేశ్వరరావు తెలిపారు.

–న్యూస్‌టుడే, వి.కొప్పెరపాడు (బల్లికురవ, అద్దంకి)

నిబంధనల ప్రకారమే బీపీఎస్ అమలు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరిస్తామని పట్టణ ప్రణాళికా విభాగం ఉప సంచాలకుడు మధుకుమార్ అన్నారు. జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాల పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బందితో బాపట్ల పురపాలక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతికి మించి నిర్మించిన భవనాలకు, అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాల క్రమబద్ధీకరణకు వేర్వేరు రుసుములు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బీపీటీ-2025 జీవోపై భవన యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. 2025 మార్చి ఒకటిలోగా నిర్మించిన భవనాలు మాత్రమే క్రమబద్ధీకరించాలని సూచించారు. 1997కు ముందు నిర్మించిన భవనాలకు 25 శాతం, మురికి వాడల్లో కట్టడాలకు 50 శాతం ఫీజును ప్రభుత్వం తగ్గించినట్లు వివరించారు. వివరాల కోసం బీపీఎస్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, బావుడా ప్రణాళికా అధికారి శోభన్‌బాబు, అధికారులు మల్లికార్జునరావు, పూర్ణచంద్రారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికా విభాగం ఉప సంచాలకుడు మధుకుమార్

భావనారాయణస్వామి ఆలయ దస్త్రాలు తనిఖీ

బాపట్ల, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఆదేశాల మేరకు భావనారాయణస్వామి ఆలయ దస్త్రాలు తనిఖీ చేసేందుకు గుంటూరు ఉప కమిషనర్ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈవో రజనీకుమారి కార్యాలయానికి వచ్చిన దేవాదాయ శాఖ ప్రత్యేక బృందం 2020 సెప్టెంబరు 9 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు అప్పటి ఈవో వెంకటేశ్వర్లు హయాంలోని లెక్కలను పరిశీలించారు. ఆలయ భూముల వివరాలు తెలుసుకున్నారు. భూముల కౌలు, రామానుజ కూటమి భవన లీజు ద్వారా ఏడాదికి రూ.27.33 లక్షల ఆదాయం వస్తున్నట్లు గుర్తించారు. జమాఖర్చుల వివరాలు తనిఖీ చేశారు. బంగారు, వెండి ఆభరణాలను బీమా చేయకపోవడంపై ప్రశ్నించారు. ప్రత్యేక బృంద అధికారులు నరహరి, చాణిక్య, సాయితేజ, రంగలక్ష్మి మాట్లాడుతూ సమగ్ర నివేదిక రూపొందించి ఆర్‌జేసీ, డీసీకి సమర్పిస్తామన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

మామూళ్లు ఇస్తేనే బిల్లు!

ఐవీఆర్ఎస్‌లో లబ్ధిదారుల అభిప్రాయం

నరసరావుపేట, న్యూస్‌టుడే

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని.. లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కూటమి ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసి బిల్లు పెట్టాలని కోరితే.. కొందరు అధికారులు, ఉద్యోగులు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు. తమ చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. ప్రభుత్వం పక్కాఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇంటి బిల్లు మంజూరుకు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్కువమంది చెప్పారు. అలాగే బిల్లులు నిదానంగా పెడుతున్నారని, గృహ నిర్మాణ సమయంలో ఉద్యోగుల సహాయ సహకారాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వం అక్టోబర్లో ఐవీఆర్ సర్వే వివరాల్ని క్షేత్రస్థాయికి పంపింది. దీనిపై పర్యవేక్షక అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు.

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వివిధ పథకాల కింద సుమారు 75 వేల పక్కాఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద వేలాది ఇళ్ల నిర్మాణాల్ని వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇలాంటి పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు నిర్మించుకునే ఇళ్ల నిర్మాణాల్లో బిల్లుల జాప్యం, అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న పక్కా ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సర్వే వివరాలిలా (శాతాల్లో)..

ఇల్లు నిర్మించినంత వరకు బిల్లులు అందుతున్నాయా?	త్వరగా 48.8	నిదానంగా 51.2
అధికారులు, ఉద్యోగులు సహాయ సహకారాలు అందిస్తున్నారా?	అవును 66.7	లేదు 33.3
బిల్లుల మంజూరుకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారా?	అవును 61.6	లేదు 38.4

పీఆర్‌లో నూతన అధ్యాయం

4న డీఎల్‌డీవో కార్యాలయాలు ప్రారంభం

గుంటూరు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ వ్యవస్థలో నూతన అధ్యాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డివిజనల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన తర్వాత వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని 77 డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, రేపల్లె, బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు. డీఎల్‌డీవోలు పిచ్చిరెడ్డి, రాజగోపాల్, గఫ్రూనాయక్‌లతో జడ్పీ కార్యాలయంలో మంగళవారం సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో మార్పులు చేస్తామని ప్రకటించి డీఎల్‌డీవో కార్యాలయాల ఏర్పాటుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. ఇకపై రెవెన్యూ శాఖలో డివిజనల్ స్థాయిలో ఆర్డీవోల మాదిరిగా డీఎల్‌డీవోలు కూడా అభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. ఉపాధి పథకం ఏపీడీ, డీఎల్‌పీవోలు కూడా డీఎల్‌డీవో పరిధిలో పనిచేస్తారు. మొత్తం 15 మంది సిబ్బందిని కేటాయించారు.

❖ గుంటూరు డీఎల్‌డీవో కార్యాలయాన్ని జడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మిగిలిన ఆరు డివిజన్లలోనూ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మొత్తం రూ.1.15 కోట్లు ఖర్చు చేసి కార్యాలయాల్ని తీర్చిదిద్దారు.

పీఆర్ శాఖ బలోపేతం.. 'ఉమ్మడి జిల్లాలో ఏడు డీఎల్‌డీవో కార్యాలయాలను ఈ నెల 4న ప్రారంభించేలా ఏర్పాట్లు చేశాం. డీఎల్‌డీవో వ్యవస్థతో పంచాయతీరాజ్ శాఖ బలోపేతమవుతుంది. పీఆర్, ఆర్డీ విభాగాలను ఒకే వ్యవస్థలో చేర్చడంతో డీఎల్‌డీవోలు తనిఖీలు చేసి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తారు' అని జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు తెలిపారు.

మహిళలకు అన్నింటా ప్రోత్సాహం

గుంటూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో... వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో అవగాహన కల్పించి యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అదనపు సీఈవో శ్రీరాములునాయుడు అన్నారు. గుంటూరుకు సమీపంలోని లాం కృషి విజ్ఞాన కేంద్రంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి అధ్యక్షతన ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ (ఐఎఫ్‌సీ)పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. శ్రీరాములునాయుడు మాట్లాడుతూ సీమ పందులు, గొర్రెలు, పుట్టగొడుగుల పెంపకంతో పాటు డెయిరీల నిర్వహణ, అజొల్లా, సైలేజ్ గడ్డి, చేపల చెరువుల యూనిట్లను రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా నిర్వహిస్తే నాబార్డ్ రాయితీ కల్పిస్తుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త యుగంధర్‌కుమార్ కేవీకేలో సాగు చేస్తున్న పంటలతో పాటు సీమ పందులు, గొర్రెలు, కోళ్ల యూనిట్ల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన కల్పించారు. నాబార్డ్ డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, డీఆర్‌పీ రామయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : 03.12.2025.
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

(c) eenadu

రైతన్నా.. మీ కోసం కార్యశాలల విజయవంతానికి కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: రైతన్నా.. మీ కోసం కార్యక్రమాన్ని అన్ని ఆర్ఎస్‌కేల్లో బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్‌కేలో నిర్వహిస్తున్న కార్యశాలలో తహసీల్దారు, మండల ప్రత్యేకాధికారులు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. రైతుల ఆదాయం పెంచటంపై చర్చించాలన్నారు. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. స్వామిత్వ సర్వేను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పొదుపు సంఘాల మహిళలకు 1200 పాడిగేదెలు పంపిణీ చేయాల్సి ఉండగా, 154 మాత్రమే ఇవ్వటమేమిటని ప్రశ్నించారు. భూసేకరణకు సంబంధించి కోర్టు కేసుల దస్త్రాలను పక్కాగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఈవో పురుషోత్తం, పీడీ లవన్న పాల్గొన్నారు.

జీడిమామిడిలో నూతన వంగడాలు

జీడిమామిడి దిగుబడులు పెంచేందుకు రైతులకు నూతన వంగడాలు అందజేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. జీడిమామిడి పరిశోధనా కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అంటుమొక్కలు పరిశీలించారు. కేంద్రంలో చేస్తున్న పరిశోధనల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్లలో ఉత్పత్తి చేసున్న అంటుమొక్కలను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు, అటవీ అభివృద్ధి సంస్థకు పంపుతున్నట్లు కలెక్టర్‌కు ప్రధాన శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు తెలిపారు.

పత్తి రైతు చిత్తు

మొంథా ప్రభావంతో తగ్గిన దిగుబడులు

మార్టూరు, అద్దంకి, పర్చూరు, న్యూస్‌టుడే

మార్టూరు ప్రాంతంలో దెబ్బతిన్న పత్తి చేను

తెల్లబంగారంగా భావించి రైతులు సాగుచేసిన పత్తి పంట కర్షకులను ఆందోళనలో ముంచింది. నల్లబర్లీ సాగును ప్రభుత్వం ఖరీఫ్ లోనే నిషేధించడంతో వాణిజ్య పంటైన పత్తి వైపు మరలారు. కౌలు ముందుగానే చెల్లించి, సేద్యం చేయగా మొంథా తుపానుతో నష్టాల బారిన పడ్డారు.

జిల్లాలో విస్తారంగా పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో 4586 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. కౌలు నుంచి విత్తనం, వ్యవసాయం, పురుగు, ఎరువు మందులు, కూలి వరకు రైతు ఎకరాకు సుమారు రూ.70 వేలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. దిగుబడి మాత్రం 3-6 క్వింటాళ్ల మధ్య రావడంతో రైతులను చిత్తు చేసినట్లైంది. వచ్చిన దిగుబడిని అమ్ముకుని పెట్టుబడిదారుడికి కొంతైనా చెల్లిద్దామంటే వ్యాపారులు కనిపించక ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం పత్తి పొడవు రకానికి రూ.8110 మద్దతు ధర కల్పించినా స్థానిక వ్యాపారులు క్వింటా రూ.5-6 వేలకు కొనుగోలు చేస్తామనడంతో సాగుదారు డీలా పడిపోయారు.

ఎకరాకు మూడు క్వింటాళ్లూ రాలేదు



బర్లీ సాగును నిషేధించడంతో ఈ ఏడాది రూ.20 వేలు కౌలు చెల్లించి, మూడెకరాల్లో పత్తి సాగు చేశాను. విత్తనాలు, వ్యవసాయం, ఎరువులు, పురుగుమందులు పిచికారీకి మరో రూ.25 వేలు ఖర్చయింది. ఇటీవల సంభవించిన తుపానుకు వాన, గాలులు తోడవడంతో చేతికొచ్చిన పైరు పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి రాలేదు. చేలో క్వింటా పత్తి తీయాలంటే కూలీలకు రూ.1500 అయ్యింది. అది కొనుగోలు చేసేవారు కనిపించడం లేదు. ప్రభుత్వం సీసీఐ ద్వారా కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులు కొంతమేరైనా కోలుకుంటారు. - **సాంబశివరావు, పత్తిరైతు, పూనూరు**

భాను పోరాడితే పతకమే

తండ్రి ప్రోత్సాహంతో తైక్వాండోలో రాణిస్తున్న యువతి

బెస్తపాలెం(చీరాల అర్బన్), న్యూస్‌టుడే:

సాధించిన పతకాలతో భానురేఖ

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యం.. తైక్వాండోతో సొంతం. . అలాంటి పోరాట క్రీడలో ఆ యువతి రాణిస్తోంది. బరిలోకి దిగితే ప్రత్యర్థిని బెంబేలెత్తించి.. పతకం కైవసం చేసుకుంటోంది. ఆ యువతి చీరాలకు చెందిన పందరబోయిన భానురేఖ. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతోంది. సోదరి రేఖశ్రీ తైక్వాండో క్రీడాకారిణి కావడంతో ఆమె స్ఫూర్తితో తండ్రి రాంబాబు ప్రోత్సాహంతో నాల్గో తరగతి నుంచి ఈ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. శిక్షకుడు సల్లా ఉద్దీన్ వద్ద మెలకువలు నేర్చుకుంటోంది. గడిచిన పుష్కర కాలంగా జాతీయ, రాష్ట్రస్థాయితో పాటు వివిధ పోటీల్లో ప్రతిభ చూపి అనేక పతకాలు సాధించి, అందరి ప్రశంసలు అందుకుంటోంది. కళాశాల యాజమాన్యంతో పాటు వ్యాయామ అధ్యాపకులు ఈమెను వెన్నుతట్టి సహకారం అందిస్తున్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన 41వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ కైరుజి తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో 57 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. నిత్యం నాలుగు గంటల పాటు సాధన చేస్తోంది.

ఇప్పటి వరకు సాధించినవి..

రాష్ట్రస్థాయిలో 2022లో నంద్యాలలో జరిగిన పోటీల్లో బంగారు, 2023లో అనకాపల్లిలో రజతం, ఇదే ఏడాది నంద్యాలలో ఖేలో ఇండియాలో పసిడి, 2025లో కాకినాడలో రజత పతకాలు కైవసం చేసుకుంది. ఇక జాతీయ స్థాయిలో ఖేలో ఇండియా తరఫున సేలంలో 2024లో కాంస్యం, ఈ ఏడాది విజయవాడలో జరిగిన పోటీల్లో రజతం, 2022, 2024లో ఆల్ ఇండియా యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ఎంపికై అమృతసర్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా పీటీఎం

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలపై విశ్వసనీయత, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఈ నెల 5న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1405 ప్రభుత్వ పాఠశాలలు, 19 జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం జరుగుతుందన్నారు. హెచ్‌పీసీ ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి లోపాలు పూడ్చేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి అమ్మానాన్నలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఐదు నెలలకు జిల్లాలో ఖాళీగా ఉన్న 23 ఉపాధ్యాయుల పోస్టులను విద్యా వాలంటీర్ల ద్వారా భర్తీ చేస్తామన్నారు. పాఠశాలకు మంజూరైన క్రీడా పరికరాలు, వస్తువులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలల, సామగ్రిని ప్రదర్శనగా ఉంచుతామన్నారు. సమావేశంలో డీఈవో పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి సాధిక్ పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల్లో చూపిన తేమ శాతాన్నే ఫైనల్ చేయాలి

సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ భావన

నగరం, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో చూపిన తేమ శాతాన్నే మిల్లర్లు ఫైనల్‌గా తీసుకోవాలని జేసీ భావన అన్నారు. మండలంలోని పూడివాడ రైతు సేవా కేంద్రంతో పాటు స్థానిక రైస్ మిల్లును మంగళవారం ఆమె పరిశీలించారు. రైతు వెంకటేశ్వర్లు అమ్మకానికి తీసుకొచ్చిన ధాన్యంలో తేమను ఆమె స్వయంగా పరిశీలించారు. ధాన్యం అమ్మకానికి సంబంధించి ఆమె రవాణాపరమైన సాంకేతిక, ఇతర సమస్యలను గ్రామ రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల్లో చూపిన శాతానికి రైస్ మిల్లుల్లో చూపే శాతానికి తేడా వస్తుందని రైతులు ఆమె ముందు వాపోయారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పక్కాగా శాతం తీయాలని ఇక్కడ వచ్చిన శాతం ప్రకారమే రైస్ మిల్లులు కొనుగోలు చేయాలని సూచించారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు నాంచారయ్య, ఏవో రమేష్ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ నిరుద్యోగులకు వరం

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం విద్యావంతులైన నిరుద్యోగులకు కల్పిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ ఉపయోగించుకోవాలని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ (గ్రామ, వార్డు సచివాలయాల) అధికారిణి విజయలక్ష్మి అన్నారు. వెస్ట్ బాపట్ల సచివాలయంలో మంగళవారం జరిగిన ఆన్‌లైన్ పరీక్షను ఆమె పరిశీలించారు. వర్క్ ఫ్రమ్ హోం జాబ్ నిమిత్తం అప్లికేషన్ పెట్టుకున్నవారికి డిసెంబరు 2 నుంచి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారిణి వెస్ట్ బాపట్ల పరీక్ష సెంటర్‌ను పరిశీలించారు. పరీక్షను ఎంపీడీవో బాబూరావు, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, మండల జి.ఎస్.డబ్ల్యు.ఎస్. అధికారి పి.శ్రీరాములు, కార్యదర్శి రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు విధానాలతో అధిక ఆదాయం

హైడ్రోపోనిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఆచార్యులు కృపావతి

బాపట్ల, న్యూస్‌టుడే: నీరు, సారవంతమైన భూముల కొరత నేపథ్యంలో రైతులు ఆధునిక సాగు విధానాలపై దృష్టి సారించాలని ఎన్జీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాల ఏడీ బీఎస్ స్మిత్ అన్నారు. మంగళవారం కళాశాలలో ఎస్సీ ఉప ప్రణాళిక కింద రైతులు, మహిళలకు హైడ్రోపోనిక్స్ విధానంలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మట్టికి బదులుగా నీటి ద్వారా మొక్కలకు పోషకాలు అందించడం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తుల్ని సాధించవచ్చని తెలిపారు. ఆచార్యులు కృపావతి మాట్లాడుతూ విదేశీ కూరగాయలు పండించడం ద్వారా గిరిజన రైతులు ఆదాయం సంపాదించవచ్చునని సూచించారు. కొత్త తరహా పరికరాలు రూపొందించి తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసేలా రైతులకు తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆచార్యులు రవిబాబు, రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విష్ణువర్ధన్, కరుణ్య పాల్గొన్నారు.

ఏడాదిన్నర పని చేయించుకుని పొమ్మన్నారు

దేవాదాయ శాఖ అధికారుల తీరుపై ఎస్టీ యువతి ఆవేదన

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయంలో ఏడాదిన్నర పాటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేయించుకుని జీతం చెల్లించకుండా అధికారులు ఉద్యోగం లేదు వెళ్లిపొమ్మని చెప్పారని పల్నాడు జిల్లాకు చెందిన బి. మంగాబాయి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టరేట్లో మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి తనకు ఉద్యోగం ఇవ్వాలని సీఎంవో అధికారులు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని అందజేసి, న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు. దేవాదాయ శాఖ ఏసీ ప్రకారంగా నియామక ఉత్తర్వులు అధికారి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉన్నతాధికారులు నివేదించి వేతనం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఉద్యోగం దక్కాలంటే రూ.లక్షల్లో అడుగుతున్నారని ఓ అధికారి నగదు చెల్లించాలని యువతితో బేరసారాలు చేసినట్లు తెలిసింది.

పట్టు.. ప్రమాదాన్ని ఆపుతుందా?

పమిడిపాడు(మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలంలోని రావినూతల-పమిడిపాడు మధ్యలోని ర.భ.శాఖకు చెందిన రోడ్డులో తూము కల్వర్టుపై కొద్ది రోజుల క్రితం గుంత ఏర్పడింది. దీన్ని గుర్తించేందుకు అక్కడ చిన్నచెట్టు పెట్టి హెచ్చరిక ఏర్పాటు చేశారు. అదీ పక్కకు పడిపోయింది. దీంతో రాత్రి సమయంలో ఆ దారిలో వెళ్లే చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత ఏర్పడిన ప్రదేశంలో మరమ్మతులు చేయించాలని చోదకులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

బేతపూడి(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం బేతపూడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జేసీ భావన సందర్శించారు. ఇప్పటి వరకు ఎంత మంది రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చారని ఆరా తీయగా 225 టన్నులు కొనుగోలు చేశామని సిబ్బంది చెప్పారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని తేమశాతం 17-25 వరకున్నా నిబంధనల మేరకు కొనుగోలు చేస్తారని కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దారు శ్రీనివాసరావు, ఏవో మహేష్, వీఆర్వో వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకుడు శివకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర కౌశల్ పోటీలకు ఎంపిక

రేపల్లె అర్బన్, జె.పంగులూరు, న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి రాసంశెట్టి శేష శివసుబ్రహ్మణ్యం జిల్లా స్థాయి 2025 కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాబూజీ తెలిపారు. ఈనెల 27న తిరుపతి జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఎన్ఎవీఆర్‌కే ప్రసాద్‌ను మంగళవారం సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

★ జె.పంగులూరు మండలం కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.అంకమ్మ పత్ర సమర్పణ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనిత తెలిపారు.

శేష శివసుబ్రహ్మణ్యం

పి.అంకమ్మ

THE GUNTUR DISTRICT CO-OP. CENTRAL BANK LTD., TENALI.
Administrative Office, 2/13 Brodipet, Guntur.

E-Tender Notification

The Guntur District Co-operative Central Bank ltd., Tenali invites E-Tender from eligible bidders for providing Cash Management Services at 45 Bank Branches (including Head Office) through e-Procurement Portal. Tender documents maybe downloaded from www.apeprocurement.gov.in and tender commences from 03.12.2025 and the last date of Bid submission is 09.12.2025 at 11:00 AM.

Guntur
Dt: 02-12-2025

Sd/- Chief Executive Officer

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే: బస్టాండ్లలో ప్రయాణికుల దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ కర్రెద్దుల లలితను బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. నిందితురాలి నుంచి రూ.15 లక్షల విలువైన 136 గ్రా. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని వైకుంఠపురానికి చెందిన లలిత అలియాస్ పద్మ తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీగా ఉండే కూడళ్లు, వ్యాపార సముదాయాల్లో చోరీలకు పాల్పడుతోంది. నిందితురాలిపై ఏపీ, తెలంగాణాలో 17 చోరీ కేసులు నమోదయ్యాయి. చోరీ కేసులో 2020లో వరంగల్ పోలీసులు అరెస్టు చేసి ఆమెను జైలుకు పంపించారు. మహిళల వద్ద సంచుల్లో ఉన్న విలువైన వస్తువులపై కన్నేసి చాకచక్యంగా చోరీ చేస్తుంది. ఇటీవల ఇంకొల్లు, పలుచోట్ల ఆర్టీసీ బస్టాండ్లలో చోరీ కేసులు నమోదు కావటంతో ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి నిందితురాలిపై నిఘా పెట్టించారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్సై సురేష్ పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లలితను గుర్తించి పట్టుకున్నారు. నిందితురాలిపై ఇంకొల్లు, అద్దంకి, నరసరావుపేట, తుని పీఎస్‌లలో చోరీ కేసులు ఉన్నాయి. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్న ఇంకొల్లు సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. చీరాల డీఎస్పీ మొయిన్ పాల్గొన్నారు.

మెరక మట్టి రుసుం విషయంలో రగడ

బల్లికురవలో వాదోపవాదనలు

బల్లికురవ, అద్దంకి, న్యూస్‌టుడే: రైతుల ఇళ్ల వద్ద మెరకలకు తోలుకునే మట్టి రుసుం విషయమై బల్లికురవ కూడలిలో స్థానికులకు, ఏఎంఆర్ సిబ్బందికి మధ్య మంగళవారం వివాదం తలెత్తింది. దీనిపై పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

బల్లికురవ గ్రామానికి చెందిన ఓ రైతు ఇంటి వద్ద మెరకల కోసం రెండు ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. కూడలిలో ఏఎంఆర్ సంస్థ సిబ్బంది వాటిని అడ్డుకుని, రుసుం చెల్లించాలని భీష్మించారు. ఆగ్రహించిన రైతుకు స్థానికులు జతకలిశారు. ఆ సంస్థ సిబ్బందితో వాదోపవాదనలు జరుగుతుండగా పోలీసులు వచ్చారు. రుసుం వసూలులో మట్టి వాహనాలకు మినహాయింపు ఉందని తేలడంతో ఏఎంఆర్ సిబ్బంది మట్టి ట్రాక్టర్లను వదిలేశారు. కాగా, ఆ సంస్థ సిబ్బందికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వసూలు వివరాలు ప్రదర్శించండి

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన ఏఎంఆర్ సంస్థకు చెందిన రుసుం వసూలు కేంద్రాల వద్ద పారదర్శక విధానాలు అమల్లో ఉండాలని ఎస్సై వై.నాగరాజు అన్నారు. సంస్థలో పనిచేసే సిబ్బంది పూర్తి వివరాలు, నేరచరిత్ర వంటి వివరాలు తమకు అందించాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద వసూలు వివరాలు ప్రదర్శనగా ఉంచాలన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. టోల్ రుసుం వసూలులో అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అనుసరించాలన్నారు. ప్రజలు ఎవరైనా కఠినంగా మాట్లాడిన సమయంలో విషయాన్ని ఉన్నతాధికారులకు, పోలీసులకు తెలియజేయాలని ఆ సంస్థ సిబ్బందికి సూచించారు. అంతేగాని ప్రజలపై ప్రతిదాడులకు ప్రయత్నించరాదన్నారు. తక్షణం ఈ విధానం అమల్లోకి వచ్చేలా చూడాలని ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులకు ఎస్సై సూచించారు.

విద్యతోనే సామాజిక సమానత్వం

మండల స్థాయి అధికారులతో రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్

సంతమాగులూరు: విద్యతోనే సామాజిక సమానత్వం సాధ్యమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. సంతమాగులూరు మండల పరిషత్తు కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. స్థానిక అధికారులతో మాట్లాడారు. సమాజంలో సమానత్వాన్ని సాధించడానికి దళితులు విద్యపరంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తహసీల్దారు కె.రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవో వి.కోటేశ్వరరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు, ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్‌క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

FLAT FOR SALE

INNER RING ROAD

ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్2 లోటస్ అపార్ట్‌మెంట్, శ్రీ కన్వెన్షన్ దగ్గర, మెయిన్ రోడ్ 3000 Sft ఫ్లాట్ అమ్మకం. ఫుల్ ఫినిష్డ్. 94402 60714.

HOUSE FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000-Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager. Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Mirchi Godown Supervisor - Must have experience in Mirchi field and own a bike | Contact: 9032431999.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 97039 71968.

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పనిచేయుటకు Male/ Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్ వారు మాత్రమే. 63022 43437.

హోటల్ కుంభకర్ణ, కొరిటిపాడు, గుంటూరు రూమ్ సర్వీస్ బాయ్స్ (ఉ॥8-సా॥6) హౌస్ కీపింగ్ స్టాఫ్ (M) (ఉ॥8-సా॥5) సెక్యూరిటీ గార్డ్స్ (సా॥6-ఉ॥6) కావలెను. 80564 30833.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ వారికి బస్ డ్రైవర్స్ కావలెను. కంకిపాడు, ఎనికేపాడు, నందిగామ, మంగళగిరి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు ఆటో మరియు కారు నడుపుటకు డ్రైవర్లు కావలెను. తగిన లైసెన్స్ కల్గి ఉండవలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 94406 81862.

E-KART నందు అర్జెంటుగా Male/Female కావలెను. Q: Inter, Any Degree Salary 15000/- Online Available 9381912123.

మహానాడు మీడియా, గుంటూరులో పనిచేయుటకు "వీడియో ఎడిటర్" కావలెను. Ph: 73372 22004.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

హ్యాండ్‌బాల్ పోటీల విజేత పశ్చిమగోదావరి జట్లు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 560 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం తుది పోటీలు నిర్వహించారు. అండర్ 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, కడప, విజయనగరం జిల్లాల జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-15 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, విజయనగరం జట్టు ద్వితీయ, కడప, గుంటూరు జిల్లాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి.

రింతాడకు చేరిన చినగంజాం బాలుడు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఉపాధి కోసం వెళ్లి మద్యానికి బానిసైన వ్యక్తి తన ఇద్దరు పిల్లలను రైల్వే స్టేషన్‌లో వదిలేశాడు. ఆ చిన్నారుల్లో ఒకరు అల్లూరు సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ తీములబంద గ్రామం చేరుకున్నారు. అధికారులు ఆ చిన్నారిని బాలల సంరక్షణ గృహం నిర్వాహకులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఐసీడీఎస్ అధికారులు మంగళవారం రాత్రి వెల్లడించారు. చింతపల్లి మండలానికి చెందిన పాంగి రాజు, చిన్నారి దంపతులు పొట్టకూటి కోసం బాపట్ల జిల్లా చినగంజాంలో రొయ్యల చెరువులో పనికి వెళ్లారు. పన్నెండేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం. మద్యానికి బానిసైన రాజు భార్య, పిల్లలను ఇబ్బందులకు గురిచేసే వాడు. ఐదుగురిలో ఇద్దరు పిల్లలను ఈ ఏడాది సెప్టెంబరులో చినగంజాం రైల్వే స్టేషన్‌లో వదిలేశాడు. వారిలో ఒకరు గూడెంకొత్తవీధి మండలం రింతాడ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావడంతో కలెక్టర్, స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి ఆదేశాల మేరకు మండల అధికారుల బృందం మంగళవారం రాత్రి రింతాడ తీములబంద చేరుకున్నారు. స్థానికంగా రాజ్‌కుమార్, కాంతమ్మ దంపతుల వద్ద ఆ చిన్నారి ఉన్నట్లు గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చిన్నారిని బాలల సంరక్షణ గృహ నిర్వాహకులకు అప్పగించారు. రింతాడ ఉప సర్పంచి సోమేష్‌కుమార్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మోహిని, ఎస్సై సురేష్, మహిళా పోలీసు శాంతి తదితరులు పాల్గొన్నారు.

చిన్న కీటకం.. పెద్ద భయం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినికి చిన్న కీటకం కాటేసింది. తొలుత జ్వరం, ఒంటినొప్పులు వచ్చాయి. జీర్ణకోశ సమస్యలు తలెత్తాయి. సాధారణ జ్వరం, అనారోగ్య సమస్య అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారింది. జ్వరం ప్రబలిన వారం రోజుల తర్వాత కీటకం కాటేసిన జాడ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షలో వెల్లడైంది. అప్పటికే నష్టం జరిగిపోయి ఇంటర్ విద్యార్థిని మృత్యువాత పడింది. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమూనాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు.

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఓ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల మండలం పోతురాజు కొత్తపాలెంకు చెందిన సురేష్ రెడ్డి (20) వర్సిటీ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం ఉదయం తోటి విద్యార్థులు తరగతులకు వెళ్తుండగా.. తాను తర్వాత వస్తానని చెప్పి గదిలో ఉండిపోయాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విద్యార్థులు వచ్చి చూసే సరికి గది తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలో నుంచి చూడగా సురేష్‌రెడ్డి.. బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతడిని హాస్టల్ సిబ్బంది స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించామని, మృతికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సురేష్‌రెడ్డి (పాత చిత్రం)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల • రేపల్లె • వేమూరు

పిచ్చిమొక్కల తొలగింపు

గణపవరం పంచాయతీ పరిధిలోని విద్యుత్తు స్తంభాలకు తీగలు అల్లుకున్నాయని ఈనాడులో గత నెల 29న ప్రచురితమైన చెలగామేల అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ మధు ప్రసాద్ సిబ్బందిని పంపి పిచ్చిమొక్కలు తొలగించారు.

ఆవాస్ యోజన దరఖాస్తు గడువు పెంపు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు గడువు గత నెల 30తో ముగియగా ప్రభుత్వం మరింత మందికి అవకాశం కల్పించే దిశగా గడువును ఈనెల 14 వరకు పొడిగించినట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వరి పంటకోత ప్రయోగం

ప్యాపర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్యాపర్రులో మంగళవారం వరి పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. రెండు ప్రాంతాల్లోని పొలాల్లో జరిపిన ప్రయోగాల్లో ఎకరాకు వరుసగా 48, 43బస్తాల దిగుబడి వచ్చినట్లు ఏఈవో మణికంఠ తెలిపారు. ఈ ప్రయోగాలను పర్యవేక్షించేందుకు గుంటూరులోని జాతీయ నమూనా సర్వే కార్యాలయం నుంచి గణాంకాధికారి రాజశేఖర్ హాజరయ్యారు.

పీజీఆర్ఎస్ 4న

కొల్లూరు, న్యూస్‌టుడే: ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి విజయ ప్రకాష్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని తమ సమస్యల పరిష్కారం కోసం వినియోగించుకోవాలని కోరారు.

వాణి వినిపించారు.. విజేతలయ్యారు

విజేతలతో ఎస్‌జీబీహెచ్ పాఠశాల హెచ్‌ఎం శివపార్వతి

బహుమతులు అందజేస్తున్న జెమ్స్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో పట్టణంలోని సరస్వతీ స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జెమ్స్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌జీబీహెచ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు యశ్వంత్, తాహీరా, పర్వీన్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల హెచ్‌ఎం కె.శివపార్వతి, ఉపాధ్యాయిని ఫాతిమున్నీసా బహుమతులు ప్రదానం చేశారు. జెమ్స్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో రాణించి విద్యార్థులు దేవహర్షిణి ప్రథమ, సింధు ద్వితీయ, సిరి సాహితీ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఎ.విజయ్‌కుమార్, ఉపాధ్యాయుడు ఎస్.శివవరప్రసాద్ బహుమతులు అందజేశారు.

తడి ఆరదు.. ధర పెరగదు!

☛ ఆర్‌ఎస్‌కే, మిల్లుకు మధ్య తేమ శాతంలో వ్యత్యాసం ☛ చిరుజల్లులతో నిల్వకు చోటులేక వరి రైతుల ఆందోళన

వేమూరు, న్యూస్‌టుడే

ఆకాలం వర్షం క్రమంలో పండించిన పంటను అమ్ముకోవడానికి రైతుకు అవస్థలు తప్పడంలేదు. వరి నూర్పిడులు చేసి ధాన్యం విక్రయానికి సిద్ధం చేసినా తేమ శాతంలో వ్యత్యాసం కలవరానికి గురిచేస్తోంది. నిర్ణయించిన శాతానికంటే ఎక్కువగా ఉంటే మద్దతు ధర లభించదు. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు అయినకాడికి ధాన్యం అడుగుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. వేమూరు మండలం జంపనికి చెందిన రైతు నాగేశ్వరరావు రెండు ఎకరాల్లో వరిసాగు చేశారు. నాలుగు రోజుల క్రితం పంటను కోసి ఆరబెట్టారు. రైతు సేవా కేంద్రంలో తేమశాతం 18 రాగా, అదే శాంపిల్ ధాన్యం మిల్లర్ వద్ద 25శాతం వచ్చింది. ఆర్‌ఎస్‌కే, మిల్లుకు మధ్య 7శాతం వ్యత్యాసం రావడంతో రైతు ఆశ్చర్యపోయారు. అధికారులు, మిల్లర్లు పొంతన లేని సమాధానం చెప్పడంతో ధాన్యం విక్రయించలేదు. వర్షాల నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టుకోలేక, నిల్వకు చోటులేక అవస్థలు చెందుతున్నారు. మరో రైతుకు కూడా ఇలాగే తేమ విషయంలో గందరగోళం నెలకొంది. ఇలా జిల్లాలో చాలా మంది రైతులు తేమ శాతంలో వ్యత్యాసం ఉండటంతో ధాన్యం విక్రయించడంలో అయోమయానికి గురవుతున్నారు.

వేమూరులో రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యం

ఆదేశాలు పట్టడం లేదు

బాపట్ల జిల్లాలో 1.18లక్షల హెక్టార్లలో వరిసాగు చేయగా, ఇప్పటి వరకు 45వేల ఎకరాల్లో పంట నూర్పిడి చేశారు. అందులో 10శాతం పంటను రైతులు ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. మరో 15శాతం పంట కల్లాల్లోనే ఉంది. తేమ శాతం కాస్త ఎక్కువ ఉన్నా రైతుకు నష్టం రాకుండా పంటను కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చి వెళ్లి పోతున్నారు. తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మిల్లర్లు తేమశాతం విషయంలో అధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదని, అధికారులు ఇప్పటికైనా ధాన్యం కొనుగోలుపై మిల్లర్లు వ్యవహరిస్తున్న తీరును పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు.

తుపాను ప్రభావం

వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో ముమ్మరంగా వరి పంట నూర్పిడి చేస్తున్నారు. ధాన్యంలో తేమ శాతం 18 నుంచి 25 వరకు ఉంటోంది. ఈ ధాన్యాన్ని కొనడానికి మిల్లర్లు ఇష్టపడడం లేదు. ప్రైవేటు వ్యాపారులు 75కిలోల బస్తాకు రూ. 1300కు మించి చెల్లించడం లేదు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం తేమ ఉంటే రూ.1792 చెల్లిస్తోంది. తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల రైతులు ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవడం కుదరడం లేదు. అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని తేమ శాతం కాస్త ఎక్కువగా ఉన్నా పంటను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది లేకుండా చర్యలు

ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్ణయించిన మేరకు తేమ శాతం ఉంటే వరికి మద్దతు ధర లభిస్తుంది. రైతుసేవా కేంద్రాలకు, మిల్లర్ల వద్ద తేమ శాతంలో వ్యత్యాసం ఉండకూడదు. తేమ శాతం తేడాపై మిల్లర్ల వద్ద యంత్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం విక్రయించుకునేలా చూస్తాం. **- అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి**

సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందజేత

పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు: ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్న మండలంలోని ఎనిమిది మందికి సీఎం సహాయనిధి నుంచి రూ. 3,11,306ను ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది. కొల్లూరుకు చెందిన తోటకూరపల్లి రూ.42,456, బొద్దులూరుపాడుకు చెందిన పెద్దిబోయిన నాగ దుర్గ భవానికి రూ.22,954, చిలుమూరుకు చెందిన కమ్మెల రవీంద్రబాబుకు రూ.72,581, చినపులివర్రుకు చెందిన ఉప్పల సుబ్బారావుకు రూ.26,566, దోనేపూడికి చెందిన కర్రి రత్నగిరిరావుకు రూ.45,564, పెసర్లంకకు చెందిన గాజుల ఆదినారాయణకు రూ.16,000, అనంతవరానికి చెందిన దాసరి రాజశేఖర్‌కు రూ.42,000, క్రాపకు చెందిన విష్ణుసాయి సుబ్బారావుకు రూ.43,184 మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆనందబాబు మంగళవారం స్థానికంగా జరిగిన ఓ కార్యక్రమంలో బాధితులకు అందజేశారు.

ధ్రువపత్రాలు పంపిణీ

ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భట్టిప్రోలు: జీవీ రావు ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులకు 10ఏ బాలికల బెటాలియన్‌కు గుంటూరు వారు నిర్వహించిన 'ఏ' సర్టిఫికెట్ పరీక్షల్లో 23 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. వీరికి పాఠశాలలో ధ్రువ పత్రాలు అందించారు. ఎన్‌సీసీ శిక్షణ ద్వారా దేశభక్తి పెరగడంతో పాటు క్రమ శిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. బెటాలియన్ హవల్దార్ రాజపుర్ అమూల్, కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు శ్రమించండి

ఈనాడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

వెదుళ్లపల్లి (బాపట్ల టౌన్) : పాఠశాల దశ నుంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రతిఒక్క విద్యార్థి శ్రమించాలని ఎస్సై భాగ్యరాజు అన్నారు. వెదుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఎమ్ జయకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు, పోక్సో చట్టం, మత్తు పదార్థాల వాడకం వల్ల నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల బాలికలను ఈవ్‌టీజింగ్‌కు గురి చేస్తే వారిపై పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితిలోనైనా అత్యవసర నంబర్ 112ను సంప్రదిస్తే పది నిమిషాల్లో పోలీసులు మీముందు ఉంటారన్నారు. డిజిటల్ నేరాలపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి వివరించాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవటం వల్ల చిన్న వయస్సులోనే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఎవరైనా శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసుల్లో ఎవరికైనా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. నాగేశ్వరరావు, జి. శివశంకర్, జి.శ్రీనివాసరావు, సురేష్, రాంబాబు, ప్రసాదు, వాసవి, సుప్రియ, సునీత, ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాగ్యరాజు

హాజరైన విద్యార్థులు

విద్యా వాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్లపాలెం, న్యూస్‌టుడే: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ విద్యా వాలంటీర్లకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారిణి టీయూ మనోరంజని తెలిపారు. ఎంవీరాజుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, ఆంగ్లంతో పాటు జీవ శాస్త్రం, సాంఘిక శాస్త్రానికి నియామకాలు చేపట్టనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈనెల 3, 4 తేదీల్లో సంబంధిత పత్రాలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆస్తి ధ్రువీకరణకు స్వామిత్వ సర్వే ప్రామాణికం

నగరం, న్యూస్‌టుడే: సమగ్ర ఆస్తి ధ్రువీకరణకు స్వామిత్వ సర్వే ప్రామాణికమని ఎంపీడీవో బొర్రా శ్రీను అన్నారు. తోటపల్లిలో మంగళవారం నిర్వహించిన స్వామిత్వ గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కచ్చితమైన రికార్డులను సృష్టించడంతో పాటు ఆస్తి సంబంధిత వివాదాలను పరిష్కరించేందుకు సర్వే ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో సర్వే పూర్తైందన్నారు. 332 స్థలాలు సర్వే చేస్తే కేవలం రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలు అందించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: శంకర వేద పాఠశాలలో దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కూచిపూడి కళానికేతన్ ఆధ్వర్యంలో చొప్పకట్ల వైష్ణవి బృందం మంగళవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కళాకారులకు శంకర వేద విద్యాలయ కమిటీ ప్రతినిధులు జ్ఞాపికలు అందజేశారు.

కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న వైష్ణవి బృందం

తెగుళ్లు తట్టుకునే రకాలు ఎంపిక చేసుకోండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే : వరి మాగాణుల్లో రెండో పంటగా మినుము, పెసర సాగుచేసే రైతులు పల్లాకు తెగులు, ఎండు తెగులు తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ సూచించారు. విత్తే ముందు విత్తన శుద్ధి చేయాలన్నారు. కిలో విత్తనానికి 2 గ్రాముల మాంకోజెబ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయటం ద్వారా తెగుళ్లు కొంత వరకు నివారించవచ్చన్నారు. పల్లాకు తెగులు రసం పీల్చే పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి మరొక మొక్కకు వ్యాపిస్తుందన్నారు. కిలో విత్తనానికి 5 గ్రాముల థయామెడాక్సామ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయటం ద్వారా పైరు తొలిదశలో రసం పీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఎల్‌బీజీ- 752, ఎల్‌బీజీ- 6456, ఎల్‌బీజీ-685, ఎల్‌బీజీ-402 మినుము రకాలు వేయటానికి అనుకూలంగా ఉంటాయన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్గిస్తూ నినాదాలు చేశారు. వ్యాధి నియంత్రణ అందరి బాధ్యతని తెలిపారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

చామంతికి నల్లమచ్చ తెగులు

మండల పరిధి లోని బేతపూడి, వెదుళ్లపల్లి గ్రామాల పరిధిలో చామంతి తోటలు ఎండిపోతున్నాయి. మొక్కలకు అధికంగా మచ్చ తెగులు సోకి చనిపోతున్నాయి. ఆకులకే కాకుండా పూలకు సైతం ఈ తెగులు సోకడంతో పువ్వు వాడిపోతోంది. వంద మందికి పైగా రైతులు పంట సాగు చేశారు. పసుపు, తెలుపు, వంకాయ రంగు పూలకు నల్లమచ్చ తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచనలతో కొందరు రైతులు మందులు పిచికారీ చేసినా తెగులు సోకిన మొక్కలు చనిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఉద్యాన అధికారిణి ఉషా మాట్లాడుతూ నల్లమచ్చ తెలుగు సీజనల్‌గా వచ్చే తెగులని, కార్బండజిమ్ మందు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. **- న్యూస్‌టుడే, బేతపూడి (బాపట్లటౌన్)**

నిప్పుపెట్టకండి.. కట్టలు కట్టండి

ప్రస్తుతం చాలా మంది రైతులు కంబైన్డ్‌హార్వెస్టర్‌తో నూర్పిడి చేసి వరిగడ్డిని వృథాగా తగలబెడుతున్నారు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడటంతో పాటు గ్రామాల్లో వాయు కాలుష్యం ఏర్పడుతోంది. కొందరు రైతులు పంటను నూర్పిడి చేసిన తర్వాత గడ్డిని యంత్రం సాయంతో కట్టలు కట్టిస్తున్నారు. మిగతా రైతులు కూడా నిప్పుపెట్టకుండా ఇలాగే కట్టలు కట్టించి పశువులకు ఉపయోగపడేలా చేయాలని పశుపోషకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వేమూరు**

ప్రమాదమని తెలిసి.. నిర్లక్ష్యంగా తరలించి

ప్రమాదం అని తెలిసినా కొందరు అజాగ్రత్తగా వ్యవహరిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. కట్టడాలకు వినియోగించే ఇనుప చువ్వలు సుమారు ఒక్కోటి 20 అడుగుల పొడవు ఉన్నవాటిని పది అడుగులు పొడవు ఉండే ఆటోల్లో, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అవి బయటకు వేళాడుతూ ఉండటంతో వాహన చోదకులు హడలిపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు. రేపల్లె, చెరుకుపల్లి నుంచి ఇలా నిర్మాణ సామగ్రి ప్రమాదకరంగా తరలిస్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. **- న్యూస్‌టుడే, నగరం**

శౌచాలయాలు వినియోగించేదెలా!

చందోలు పంచాయతీ పరిధిలోని జడ్‌పీ వీధిలోని ప్రాథమిక పాఠశాల మరుగుదొడ్ల వద్ద ముళ్ల పొదలు, పచ్చి మొక్కలు పెరగడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. మరుగుదొడ్ల గోడ పైకి గుమ్మడి మొక్క తీగలు అల్లుకున్నాయి. విష పురుగులు కూడా ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో-2 రాజారత్నం మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి రాలేదని, అక్కడ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి వెంటనే ముళ్ల పొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)**

దివ్యాంగులకు ఆటల పోటీలు

అమృతలూరు, న్యూస్‌టుడే: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అమృతలూరు భవిత కేంద్రంలో దివ్యాంగ బాలబాలికలకు క్యారమ్స్, పరుగు పందెం, పెయింటింగ్, బక్కెట్లో బంతి వేయడం లాంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేస్తామని భవిత ఉపాధ్యాయుడు రాజు తెలిపారు.

మరమ్మతులు చేశారు.. సరఫరా మరిచారు

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని నడింపల్లిలో మంచినీటి సరఫరా వ్యవస్థకు మరమ్మతులు చేశారు. ఏర్పాటు చేసిన కొళాయికి మాత్రం నీటి సరఫరా మాత్రం చేయండం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి కొళాయికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

పంట తడవకుండా.. కష్టం కన్నీటిపాలు కాకుండా

దిత్వా తుపాను ప్రభావంతో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కేల్లో విక్రయించి రైతులు ట్రాక్టర్లలో రైస్‌మిల్లులకు హడావుడిగా తరలించారు. వర్షానికి తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పిన ధాన్యం ట్రాక్టర్లు బాపట్ల పారిశ్రామికవాడలోని రైస్‌మిల్లుల ముందు బారులు తీరాయి. ధాన్యం తడవకుండా కాపాడుకోవటానికి ఆర్‌ఎస్‌కేల వద్ద రైతుల కోసం 2500 టార్పాలిన్ పట్టలు అధికారులు అందుబాటులో ఉంచారు. **- బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే**

నిలిచిన పనులు.. ఎప్పటికి అందేను సేవలు

వెల్లటూరు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే

భట్టిప్రోలు పరిసర గ్రామాల ప్రజలకు వెల్లటూరు లోకల్ ఫండ్ సత్రం ఒకప్పుడు సేవలు అందించేది. కుటుంబంలో ఎవరైనా చనిపోతే నిద్ర చేసేందుకు సత్రానికి వెళ్లేవారు. కాలి నడకన బాటసారులు ప్రయాణించేటప్పుడు పూర్వం భోజన సదుపాయం ఉండేది. కొన్నేళ్లుగా సత్రం శిథిలావస్థకు చేరి లక్ష్యానికి దూరమైంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో సత్రం నిర్మాణానికి అప్పటి సత్రం ఈవో డి.వెంకటప్పలాచారి దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి రూ. 70 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఏడాది క్రితం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో సుమారు రూ. 20 లక్షల వరకు పనులు జరిగాయి. సత్రంతో పాటు ఆదాయ వనరులు పెరిగేందుకు పది దుకాణాలను నిర్మిస్తున్నారు. కొద్ది నెలలుగా నిలిచిపోవడంతో లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందోనని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. ప్రస్తుతం సత్రం కింద సాగులో ఉన్న 6 ఎకరాల భూమి నుంచి రూ. లక్షకు పైగా ఆదాయం వస్తోంది.

అసంపూర్తిగా సత్రం భవనం

దుకాణాలు పూర్తయితే ఆదాయమే

వెల్లటూరు గ్రామానికి చుట్టుపక్కల లంక గ్రామాలు ఉండటంతో వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోంది. సత్రం తరఫున నిర్మిస్తున్న దుకాణాల పనులు పూర్తైతే సంవత్సరానికి ఆదాయం మరింత పెరగనున్నది. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తోనే పనులు జాప్యమవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే నిలిచిన పనులు పట్ల ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారులను అడిగి తెలుసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంపై సత్రం మేనేజరు మల్లెల రామచంద్రరావు మాట్లాడుతూ సంబంధిత గుత్తేదారుడితో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర ఉద్యోగులకు ఇచ్చినట్లు రాష్ట్రంలో డీఏ ఇవ్వాలి

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : కేంద్ర ఉద్యోగులకు ఆరు నెలలకే డీఏ ఇచ్చినట్లు రాష్ట్ర ఉద్యోగులకు అలాగే ఇవ్వాలని బాపట్ల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 70 ఏళ్లు నిండిన పింఛను దారులకు 7 నుంచి 10 శాతం క్వాంటమ్ పెంచాలన్నారు. ఈనెల 18న జరిగే పెన్షనర్స్ డే సమావేశానికి అందరూ రావాలని పిలుపునిచ్చారు.

విజయబాబు క్రమశిక్షణ ఉన్న నాయకుడు

వేమూరు, న్యూస్‌టుడే: బాపట్ల పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పుట్టిన రోజు వేడక వేమూరులో తెదేపా కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ విజయబాబు క్రమశిక్షణ కలిగిన నాయకుడని తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెదేపా అభివృద్ధి కోసం విజయబాబు శక్తి వంచనలేకుండా పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం కేకు కోసి విజయబాబు దంపతులకు తినిపించారు. వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి. పూర్ణకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజయబాబు దంపతులకు కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

చిన్నారి కంటి వైద్యానికి ఆర్థిక సాయం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల రాజీవ్‌నగర్‌కు చెందిన అయిదేళ్ల చిన్నారి నందిగామ తన్వి అరుదైన కంటి వ్యాధితో బాధపడుతుంది. చిన్నారికి హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనికి రూ.4 లక్షల వరకు అవసరమని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా తెదేపా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావు, రవ్వవరపు అపర్ణ, ఇతరుల సహకారంతో రూ.75 వేలు సేకరించారు. ఆ నగదును పాప తల్లిదండ్రులకు మంగళవారం అందించారు. ఉప సర్పంచి మన్నె దుర్గారావు, సుబ్బారావు, జి.నారాయణస్వామి, మన్నె యుగంధర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, క్రాంతి పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన చేయాలి

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పర్చూరు, కారంచేడు ఎంఈవోలు ఎ.శివకోటేశ్వరరావు, ఎం.వి సత్యనారాయణలు తెలిపారు. మంగళవారం పర్చూరు మండలం నూతలపాడు మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాల, కారంచేడు మండలం ఆదిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలను అకడమిక్ ఫోరం కమిటీ సభ్యులు పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థులు చదవడం, రాయడం, గణితంపై పట్టు వంటి అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సిలబస్ పూర్తి, పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు.

ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సేవలు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : మండల పరిధి మరుప్రోలువారిపాలెంలో బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ సేవలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఔషధ రంగంలో జనరిక్ మందుల గురించి గ్రామస్థులకు వాలంటీర్లు వివరించారు. పీఎం జనరిక్ ఔషధ కేంద్రాల్లో తక్కువ ధరకే మందులు దొరుకుతాయని గ్రామస్థులకు తెలిపారు. గ్రామంలో ఆశా, ఏఎన్‌ఎం కార్యకర్తలతో కలిసి సర్వే నిర్వహించారు.

దిత్వా భయం.. అన్నదాత కలవరం

చందోలు(పిట్టలవానిపాలెం), నగరం, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో రైతుల్లో ఆందోళన తగ్గలేదు. సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో చోటుచేసుకున్న మార్పు మంగళవారం కూడా కొనసాగడంతో పంట సవ్యంగా చేతికొస్తుందో, లేదోనన్న దిగులు పట్టుకుంది. చందోలు, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, అల్లూరులో రైతులు రహదారి పక్కన పోసిన ధాన్యం గుట్టలపై పట్టలు కప్పి, జల్లుల నుంచి పంటను కాపాడుకుంటున్నారు. తేమ శాతం 17 ఉంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని, అధికారులు తెలపటంతో రైతులు వర్షం ఆగితే ధాన్యం ఆరబెట్టేందుకు నిరీక్షిస్తున్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల పరిధిలో సుమారు 80 వేల ఎకరాల్లో ఈ ఏడాది వరి సాగు చేశారు. మొంథా తుపాను ముప్పు నుంచి బయట పడ్డామనుకునే లోపే దిత్వా రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. వారం పది రోజుల్లో పంట ఇంటికి చేరుతుందన్న తరుణంలో తుపాన్లు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి.

చందోలు సమీపంలో ధాన్యం రాశులపై కప్పిన పట్టలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అప్పికట్ల బ్రాంచి (07211)
డి.నెం.1-7, అప్పికట్ల మెయిన్ రోడ్డు,
అప్పికట్ల, గుంటూరు జిల్లా, సెల్: 9321707211.

ఋణగ్రహీతకు బకాయి తిరిగి చెల్లించమని అడ్వాన్స్ నోటీసు

డియర్ సార్ / మేడమ్,
ఋణగ్రహీత: శ్రీమతి గర్నెపూడి కమలమ్మ, భర్త: గర్నె ఇసాక్, డి.నెం. 1-4ఎ, చందూరు పల్లి, బాపట్ల జిల్లా-522310.

గోల్డ్ లోన్ ఖాతా నెం. 072116540009088, తేది: 19.04.2024, రూ. 65,000/-
మీకు తెలియజేయడమేమనగా, మా లెటర్ నెం.లు 17.07.2025 & 08.10.2025 ద్వారా మీరు మా బ్యాంక్ లో బంగారు ఆభరణాలు తాకట్టులో ఉంచి తీసుకున్న ఋణ బకాయి గురించి మీకు తెలియజేస్తు పంపిన నోటీసులు వాపసు తిరిగి వచ్చినవి. కావున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు దయవేసి 7 రోజులలోగా మీ ఋణ దరఖాస్తులోని నియమ & నిబంధనల మేరకు తేది. 16.07.2025 నాటికి వడ్డీతో సహ మీరు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ. 72,885/- చెల్లించవలసినదిగా కోరడమైనది. అలా చెల్లించని పక్షంలో మా బకాయి రాబట్టుకొనుటకు మీరు మా వద్ద ఉంచిన బంగారు ఆభరణములు వేలం వేయడం జరుగుతుంది. ఆ విధంగా వేలము వేసినప్పుడు వచ్చిన మొత్తం మీరు చెల్లించవలసిన బకాయి కంటే తక్కువ ఉన్నట్లయితే మీరు ఇంకా చెల్లించవలసిన బకాయి కొరకు న్యాయపరమైన చర్యలు తీసుకొనుటకు మరియు బకాయి పూర్తిగా రాబట్టుకొనుటకు బ్యాంక్ వారికి పూర్తి అధికారము కలదు.
తేది: 02-12-2025, స్థలం: అప్పికట్ల బ్రాంచి మేనేజర్

(c) eenadu

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? స్థానిక బండావారి వీధిలోని కన్వెంట్ వద్ద చెత్త, పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వస్తోంది. - రామచంద్రావు, వేటపాలెం ✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ బాగుచేయిస్తా. - బి.సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వేటపాలెం - వేటపాలెం, న్యూస్‌టుడే

? స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు వెళ్లే వీధిలో రెండు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తేవాలి. - స్థానికులు, ఏల్చూరు ✔ తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. - పూర్ణచంద్, పంచాయతీ కార్యదర్శి ఏల్చూరు. - సంతమాగులూరు, న్యూస్‌టుడే

అనుమతి లేకుండా ఇసుక తరలింపుపై చర్యలు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఇసుక తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ డివిజనల్ అధికారి టి.చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. మంగళవారం చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులోని మన్నం అపార్ట్‌మెంట్ వద్ద అనధికారికంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఆర్డీవో స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పోలీసు, రెవెన్యూ అధికారులు వ్యవహరించాలని, అనుమతి పొందిన వారు మాత్రమే నిర్మాణాల కోసం ఇసుక తరలించుకోవాలని సూచించారు.

స్టాపర్లతో సరి.. మరమ్మతులు ఎప్పుడో మరి!

గుంత చుట్టూ ఇలా..

ఈ చిత్రంలోని దృశ్యం ఏరియా వైద్యశాలకు వెళ్లే రహదారి. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఆరు నెలల క్రితం గుంత పడటంతో వాహనచోదకులకు ఇబ్బంది లేకుండా ఇలా స్టాపర్లు పెట్టారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న సమయంలో దీనివల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతకి మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - ఓడ్‌నగర్(చీరాల అర్బన్), న్యూస్‌టుడే

నేడు పరికరాల పంపిణీ

చినగంజాం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం 350 మందికి చెవిటి మిషన్లు, హ్యాండ్‌స్టిక్‌లు, నడుము, మోకాలి, మెడ బెల్ట్‌లు, వీల్‌ఛైర్లను శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు చేతులమీదుగా పంపిణీ చేయనున్నట్లు వెలుగు ఏపీఎం జి.పెద సుబ్బారావు తెలిపారు. పూలవారిపాలెం కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

మార్టూరు, యద్దనపూడి: రెవెన్యూ సిబ్బంది విధుల పట్ల సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో పి.గ్లోరియా సూచించారు. ఆయా కార్యాలయాల్లో మంగళవారం తహసీల్దార్లు ప్రశాంతి, రవికుమార్‌తో కలిసి ఆయా మండలాల్లోని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఓట్ల తొలగింపు, దిత్వా తుపాను నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. డీటీ విష్ణు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి, పర్చూరు, కారంచేడు: 2025-26 విద్యా సంవత్సరానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్చూరు, కారంచేడు, యద్దనపూడి ఎంఈవోలు ఎ.శివకోటేశ్వరరావు, ఎం.వి సత్యనారాయణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉప్పుటూరు, స్వర్ణ జడ్పీ ఉన్నత పాఠశాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, యద్దనపూడి, పూనూరు, పోలూరు, గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈనెల 6వ తేదీలోపు ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మినీ బైపాస్ నిర్మాణానికి మరో అడుగు

రామ్‌నగర్ (అద్దంకి), న్యూస్‌టుడే

అద్దంకి పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న మినీ బైపాస్ నిర్మాణానికి మరో అడుగు పడింది. నిర్మాణం చేపట్టదలచిన ప్రదేశానికి ఇరువైపులా సరిహద్దులను గుర్తించారు. కాకానిపాలెం వద్ద నుంచి రామ్‌నగర్ వరకు సుమారు 1.5 కి.మీ. పొడవున కాలువ ప్రదేశాన్ని గుర్తించి, రంగులు వేశారు. ఆరంభంలో 85 అడుగుల వెడల్పు ఉండగా క్రమంగా 70 అడుగులకు సర్దుకుంది. ఈ కొలతల్లోనే అద్దంకి మేజరు కాలువ ప్రవహించాల్సి ఉంది. సుమారు 10-12 అడుగుల వెడల్పు కాలువకు వదిలేసి, మిగిలిన దాన్లో రెండువైపులా రహదారులు నిర్మించనున్నారు. దీనికిగాను గతనెల

నిర్మించాల్సిన రహదారి ఇదే

17న అద్దంకిలో పర్యటించిన పురపాలక మంత్రి పొంగూరు నారాయణ రెండు విడతల్లో మినీ బైపాస్ నిర్మాణం చేపట్టేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. దీనిలో భాగంగా కాలువ కట్టపై నివసించే 65 మందిలో 55 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. మరో పది మందికి గతంలోనే బొమ్మనంపాడు సమీప వెంచర్‌లో పట్టాలు ఉండటంతో వారిని అక్కడ సర్దుబాటు చేశారు.

రూ.17 కోట్లతో అంచనాలు

మినీ బైపాస్ నిర్మాణానికి మొత్తంగా రూ.17 కోట్ల వరకు అంచనాలు తయారు చేశారు. రామ్‌నగర్ ఎన్నెస్పీ కాలువ నుంచి కాకానిపాలెం-రేణింగవరం రహదారి వరకు తొలివిడతలో విస్తరణ చేపడతారు. ఎన్నెస్పీ కాలువ ఆధునికీకరణ, రెండు వైపులా రహదారి విస్తరణ, అభివృద్ధి, మొక్కలు నాటడం, సైడు కాలువల నిర్మాణం, విద్యుదీకరణతో సుందరంగా మినీబైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే కొందరు లబ్ధిదారులకు ఇచ్చిన ప్లాట్లను కొత్తవారికి అమ్ముకుంటున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీపై వేగం పెంచారు. తక్షణం నిర్వాసితులకు అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తూ పునరావాస ప్రదేశాలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు.

సమాజంలో మార్పు విద్యార్థులతోనే సాధ్యం

ప్రదర్శనలో విద్యార్థులు

అద్దంకి, న్యూస్‌టుడే: సమాజంలో మార్పు విద్యార్థులతోనే సాధ్యమని సీఐ ఎ.సుబ్బరాజు అన్నారు. శింగరకొండ కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శింగరకొండపాలెంలో చేపట్టిన ఎన్.ఎస్.ఎస్. శిబిరం మంగళవారం రెండో రోజు కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు, పోక్సో తదితర చట్టాల గురించి వివరించారు. తొలుత కళాశాల నుంచి శింగరకొండపాలెం వరకు విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనను ప్రిన్సిపల్ డాక్టర్ వెల్లాల మోహనరావు ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ మాధవి, ఎస్.షర్మిలారాణి, అధ్యాపకులు డి.రాజశేఖర్, వి.ప్రసాద్, బి.అశోక్‌కుమార్, ఎ.శివాజీ, సీహెచ్.వెంకటనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను గ్రామపెద్ద స్వాములు ఆహ్వానించారు.

దేవాలయాల పునరుద్ధరణకు రూ.5.85 కోట్లు

గుడి	మంజూరైన నిధులు	గ్రామస్థుల వాటా	మొత్తం (రూ.లక్షల్లో)
భీమలింగేశ్వరస్వామి ఆలయం ధర్మవరం	53.33	26.67	80
భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గుడి, కుందుర్రు	116.67	58.33	175
మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, రేణింగవరం	72.00	18.00	90
శ్రీరాములు, ఆంజనేయస్వామి గుడి బల్లికురవ	100.00	50.00	150
వీరాంజనేయస్వామి ఆలయం, రాళ్లపల్లి	33.33	16.67	50
వేణుగోపాలస్వామి దేవస్థానం, నాగులపాడు	26.67	13.33	40
మొత్తం	402.00	183	585

అద్దంకి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ఆలయాల పునరుద్ధరణకు నిధులు మంజూరైనట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. దేవాదాయ శాఖ సర్వశ్రేయోనిధి ద్వారా అద్దంకి మండలం ధర్మవరం, రాళ్లపల్లి, నాగులపాడు, సంతమాగులూరు మండలం కుందుర్రు, మండల కేంద్రం బల్లికురవ, జె.పంగులూరు మండలం రేణింగవరం గ్రామాల్లోని ఆలయాలకు రూ.4.02 కోట్లు, గ్రామస్థుల విరాళం రూ.1.83 కోట్లు కలిపి రూ.5.85 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అతి తక్కువ ఆదాయం ఉన్న జె.పంగులూరు మండలం టి.తక్కెళ్లపాడు పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం, అద్దంకి మండలం ఉప్పలపాడు రేణుకాదేవి దేవస్థానాలకు ధూపదీప నైవేద్యాలకు నెలకు రూ.10 వేలు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి సహకరించండి

మంత్రి రవికుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, న్యూస్‌టుడే: తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో తలెత్తిన విద్యుత్తు సమస్యలు పరిష్కరించేందుకు సహకారం అందజేయాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి రవికుమార్‌ను ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య కోరారు. మంగళవారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే చీరాల నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు ప్రస్తావించారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుత్తు హెచ్చుతగ్గుల సమస్య ఉందని, వేసవినాటికి దీన్ని అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని, సహకారం అందజేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెదేపా నాయకులు తెలిపారు.

పేదలకు కార్పొరేట్ వైద్యసేవలే లక్ష్యం

అర్హులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, తెదేపా నేత రామచంద్రరావు

ఇసుకదర్శి(మార్టూరు), న్యూస్‌టుడే: పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, తెదేపా సీనియర్ నేత గర్ల రామచంద్రరావు తెలిపారు. మంగళవారం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.29.58 లక్షల చెక్కులను అందజేశారు. వైకాపా హయాంలో పేదలకు కార్పొరేట్ వైద్యం దూరమైందని, కూటమి ప్రభుత్వ హయాంలో గత 14 నెలల కాలంలో రూ.10కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ కింద ప్రజలకు అందజేసినట్లు తెలిపారు.

ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

మార్టూరు: స్థానిక వెంకయ్య ఆశ్రమంలోని వృద్ధులకు మంగళవారం మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన చల్లగుండ్ల చంద్రమౌళి అంజలి దంపతులు అన్నదానం చేసి, మిఠాయిలు పంచారు. తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఇది చేసినట్లు వారు తెలిపారు. దాతలకు నిర్వాహకుడు శివరాజేష్ కృతజ్ఞతలు చెప్పారు.

కష్టపడి చదువుకోండి.. ఎదగండి

చిత్రాలు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న చీరాల శక్తి ఎస్సై హరిబాబు తదితరులు

చినగంజాం: ఇబ్బందులు తెచ్చే ఇన్‌స్టాగ్రాం, యూట్యూబు జోలికి ఆడపిల్లలు వెళ్లొద్దని చీరాల శక్తి డివిజన్ ఎస్సై హరిబాబు అన్నారు. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబు తదితర సామాజిక మాధ్యమాల్లో ఎస్సై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల మాటలు వింటూ కష్టపడి బాగా చదువుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. చినగంజాం ఎస్సై రమేష్, ప్రధానోపాధ్యాయుడు ఎన్.రవి, పోలీస్ సిబ్బంది దుర్గారావు, సురేష్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు రూ.10.70 కోట్లు మంజూరు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి నియోజకవర్గం పరిధిలోని పర్చూరు-పెదజాగర్లమూడి-పూరిమెట్ల (పీపీపీ) రాష్ట్ర రహదారిలో 14.745 కి.మీ. మరమ్మతులకు ర.భ. శాఖ ద్వారా రెండు విడతలుగా రూ.10.70కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

బల్లికురవ ప్రాథమిక, కేజీబీవీ పాఠశాలల తనిఖీ

బల్లికురవ, అద్దంకి, న్యూస్‌టుడే: మెగా తల్లిదండ్రుల దినోత్సవం రోజున గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన కిట్లు ప్రదర్శించిన చీరాల ఉప విద్యాధికారి డి.గంగాధర్ అన్నారు. బల్లికురవ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. 1, 2 తరగతుల విద్యార్థులకు ఇచ్చిన 'జాదు పిటారా', 3, 4, 5 తరగతులకు ఇచ్చిన 'టీఎల్ఎం' కిట్‌లను ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి పొందారు. ఎంఈవో-2 కె.రమేష్‌బాబు ఉన్నారు.

ఇలాగుంటే.. వ్యాధులు రావా?

చిత్రంలో మీరు చూస్తున్నది కొత్తపేట స్టేట్‌బ్యాంకు వెనుక వీధి. ఆంటే 12వ వార్డు పరిధిలోకి వస్తోంది. మొంథా తుపాను సమయంలో కురిసిన వర్షాలకు ఈ ప్రాంతంలో నీరు నిలిచింది. అది నేటికీ ఎండలేదు. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో చుట్టుపక్కల గృహాల్లో వినియోగించిన మురుగు నీరు అందులోకి చేరడంతో కుంటను తలపిస్తోంది. దీనివల్ల దుర్వాసన, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, పాములు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి దీన్ని బాగుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే

చీకట్లోనే ఎదురుచూపులు

కొరిశపాడు మండలం మేదరమెట్ల బస్టాండ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. హైదరాబాద్-చెన్నై-విజయవాడ నగరాలకు వెళ్లేందుకు ముఖ్య కూడలి కావడంతో ఎక్కువమంది ప్రయాణికులు ఇక్కడికి వస్తుంటారు. రాత్రి సమయంలో బస్టాండ్ లోపల దీపాలు ఉన్నా ఆవరణలో లేవు. దీంతో ఒంగోలు వైపు ప్రయాణించే ప్రయాణికులు చీకట్లోనే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో దీపాలు ఏర్పాటు చేయిస్తే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉంటారు. - మేదరమెట్ల, న్యూస్‌టుడే

అక్కడికి చేరగానే భక్తిభావం

నూతలపాడు (పర్చూరు), న్యూస్‌టుడే: ఆ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులకు ఆ ప్రాంతానికి చేరగానే ఒక్కసారిగా భక్తిభావం కలుగుతుంది. నూతలపాడు గ్రామ సమీపంలో అద్దంకి వెళ్లే మార్గానికి పక్కనే కొన్నేళ్ల క్రితం దేవతామూర్తుల స్వరూపాలతో విగ్రహాలు నెలకొల్పారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక దైవాన్ని పూజిస్తారనే యోచనతో దీంతో గ్రామరక్షగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పి, ఆ పక్కనే పలు దేవుళ్ల విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతాన్ని కొందరు గుడుల సెంటర్‌గా పిలుస్తున్నారు.

పొలం కాదు.. కాలువలో పెరిగిన మొక్కలు

చిత్రంలో కనిపిస్తుంది పంట పొలం అనుకుంటే పొరపాటు. బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు ఎస్సీ కాలనీ సమీపంలోని సాగర్ కాలువ. వెంపరాల మేజరు కాలువ నుంచి వి.కొప్పెరపాడు చెరువుకు నీరు తరలించేందుకు ఇది ఉపకరిస్తుంది. కాలువ వెడల్పు పెరగడంతో నీటి నిల్వలు పెరిగాయి. ఈ కారణంగా కాలువలో పూర్తిగా చెట్లు పెరిగి, పంట పొలాన్ని తలపిస్తోంది. - వి.కొప్పెరపాడు(బల్లికురవ), న్యూస్‌టుడే

చిన్నారి కంటి వైద్యానికి ఆర్థిక సాయం

సాయం చేస్తున్న మున్నె రమారావు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల రాజీవ్‌నగర్‌కు చెందిన అయిదేళ్ల చిన్నారి సందీప్‌రాజు తన్ని అరుదైన కంటి వ్యాధితో బాధపడుతున్నాడు. చిన్నారికి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనికి రూ.4 లక్షల వరకు ఆపరేషన్ ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా తెదేపా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రమారావు, కర్నాటక్ ప్రభుత్వ ఆప్ఫ్ర, అద్దంకి క్లబ్ కారంతో రూ.75 వేలు సేకరించారు. ఆ నగదును పాప తల్లిదండ్రులకు మంగళవారం అందించారు. ఉప సర్పంచి మన్నె దుర్గారావు, సుబ్బారావు, జి.నారాయణస్వామి, మన్నె యుగంధర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, క్రాంతి పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన చేయాలి

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని పర్చూరు, కారంచేడు ఎంఈవోలు ఎ.శివకోటేశ్వరరావు, ఎం.వి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పర్చూరు మండలం నూతలపాడు మండల పరిధి ప్రాథమికోన్నత పాఠశాల, కారంచేడు మండలం ఆదిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలను ఎంఈఓలు వారు సందర్శించి సిబ్బందితో మాట్లాడిన పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, రాయడం, చదవడం, గణితంపై పట్టు వంటి అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. సిలబస్ పూర్తి, పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి జనరేటరు కేటాయింపు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రానికి జనరేటరును కేటాయించారు. రాష్ట్ర వైద్యసేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.13 లక్షల విలువైన జనరేటరును పాండిచ్చేరి నుంచి దీన్ని ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చారు. క్రేన్ ఉపయోగించి దాన్ని కిందకు దింపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వాహెల్ చౌదరి మాట్లాడుతూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆసుపత్రి అవసరాలకు జనరేటరు ఉపకరిస్తుందన్నారు. మొంథా తుపాను సమయంలో పురపాలక అధికారులు జనరేటరు ఏర్పాటు చేయగా వైద్యసేవలు అందించినట్లు చెప్పారు. జనరేటరు అవసరం ఉందని ఉన్నతాధికారులకు తెలిపిన నేపథ్యంలో మంజూరు చేసినట్లు వాహెల్ చౌదరి తెలిపారు. 58.51 కేవీ సామర్థ్యం గల దీని ద్వారా రెండు ప్రాంగణాలకు విద్యుత్తు సమస్య తీరుతుందన్నారు. బుధవారం నిప్పులు పనులు పట్టిన తరువాత ప్రారంభిస్తామన్నారు.

నాగండ్ల రహదారికి మోక్షం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: పావులూరు-నాగండ్ల మధ్య రహదారి నిర్మాణం పూర్తికావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాల మధ్య వీఆర్ రహదారిని పదేళ్ల క్రితం నిర్మించారు. నిర్మాణ లోపాలతో పాటు భారీ వాహనాల తాకిడికి అనతి కాలంలోనే రోడ్డు గుంతలమయమైంది. 2019 నుంచి ఇటీవల వరకు ద్విచక్ర వాహనాలు ప్రయాణించడం కష్టంగా మారింది. చీరాల, పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో రహదారులకు గ్రావెల్, కంకర ఇటు గాని రవాణా జరుగుతుంది. దీంతో 50 టన్నుల సామర్థ్యంతో ప్రయాణించే భారీ టిప్పర్ల కారణంగా రహదారిలో గుంతలు ఏర్పడ్డా పూడ్చినప్పటికీ ప్రయోజనం కనిపించలేదు. ఇంకొల్లు, కారంచేడు, వేటపాలెం, చినగంజాం మండలాల ప్రయాణికులు పావులూరు, నాగండ్ల, కొలలపూడి మీదుగా 16వ నంబరు జాతీయ రహదారి వైపు ప్రయాణిస్తుంటారు. ఏలూరి మాదిరిగా శాసనసభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పావులూరు నుంచి నాగండ్ల వరకు సుమారు కిలో మీటర్ల మార్గాన్ని రూ.3 కోట్లతో బీటీ రహదారిగా నిర్మించారు. కొన్ని రోజులుగా రోడ్డుపై వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అంచులను ప్రస్తుతం 50శాతం గ్రావెల్‌తో నింపారు. పూర్తిగా నింపి పటిష్ఠం చేస్తే రహదారి ఎక్కువ రోజులు మన్నికగా ఉంటుంది.

రైతన్నా మీకోసంపై కార్యాచరణ

అద్దంకి, న్యూస్‌టుడే: రైతుసేవా కేంద్రాల వద్ద బుధవారం 'రైతన్నా మీకోసం' కార్యాచరణ రూపొందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. 2025-26 రబీ, 2026 ఖరీఫ్, 2027 రబీ పంటలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆదాయం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలు చర్చిస్తామన్నారు.

గోపాలపురంలో స్వామిత్వ గ్రామసభ

గోపాలపురం(అద్దంకి): మండలంలోని గోపాలపురం సచివాలయం వద్ద మంగళవారం స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. చీరాల డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, మండల అభివృద్ధి అధికారి మస్తాన్‌శ్రీధర్, కార్యదర్శి సయ్యద్‌బాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ శ్రీరామ ఫుట్ పెద్దల ఆశ్రమానికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు అందించారు. రోటేరియన్ పసుపులేటి ఆంజనేయులు మనుమరాలు యస్విత పుట్టినరోజు సందర్భంగా వీటిని అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బాచిన శివదర పూర్ణ చంద్రరావు, ఆళహరి హరిప్రసాద్, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు ఉన్నారు.

అవీ ఇవీ

స్వీపర్ మృతికి పోలీసుల సంతాపం

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు పంచాయతీ కార్యాలయం ఎదుట మురుగుకాలువలో పడి అదే రోజు మరణించిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఇందిరా కాలనీకి చెందిన రాపూరు శ్రీనుగా పోలీసులు గుర్తించారు. మంగళవారం ఇందిరాకాలనీ గృహంలో శ్రీను మృతదేహానికి ఎస్సై జీవీ చౌదరి, శిక్షణ ఎస్సై పులి గోపిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు తమవంతు ఆర్థిక సహకారం పర్చూరు పోలీసులు అందజేశారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

కారంచేడు, న్యూస్‌టుడే: అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఓ మహిళ ఉరేసుకుని మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన 50 ఏళ్ల మహిళ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించారు.

కౌశల్ పోటీల్లో ప్రతిభ

వై.వర్షశ్రీ

మణికంఠ

మేఘన

ఇంకొల్లు, జె.పంగులూరు, న్యూస్‌టుడే: కౌశల్ ప్రతిభా పోటీల్లో దుద్దుకూరు ఆదార్లరాజు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉజ్వల మేఘన జిల్లా స్థాయిలో ప్రతిభ చూపింది. గత నెల 25న ఆన్‌లైన్‌లో పోటీలు జరగ్గా 8వ తరగతి విభాగంలో మేఘన జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. విద్యా కమిటీ ఛైర్మన్ నాగుల బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కటారి భాస్కరరావు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయిని ఝాన్సీ లక్ష్మి తెలిపారు. క్విజ్ విభాగంలో వై.వర్షశ్రీ, పోస్టర్ విభాగంలో పి.ఉమల మణికంఠ ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కాలేషావలి, చంద్రశేఖర్, ఎస్.కె.అబ్దుల్ సయ్యద్ అభినందించారు.

నేడు ఆంజనేయ మాల దీక్ష విరమణ

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ఆంజనేయస్వామి మాలదీక్ష విరమణ, హనుమత్ వ్రతం బుధవారం నిర్వహించనున్నట్లు పాలకమండలి అధ్యక్షుడు చుండూరి మురళీకృష్ణ, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన ఆంజనేయస్వామి దీక్షాధారులు సుమారు 500 మంది విరమణ చేస్తారన్నారు. భక్తులు హాజరు కావాలని సూచించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

పర్చూరు, న్యూస్‌టుడే: అడుసుమల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కేంద్రం పరిధిలోని గొల్లపూడి, తిమ్మరాజుపాలెం, బోడవాడ, ఇనగల్లు, అడుసుమల్లి గ్రామాల్లో కరెంటు ఉండదని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

మార్టూరు, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని మార్టూరు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు, డిప్యూటీ ఎంపీడీవో రామరాజు నేయులు, తెదేపా మార్టూరు పట్టణాధ్యక్షుడు కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారి

కొమ్మాలపాడు-కుందుర్రు మార్గంలో ఇలా..

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని కొమ్మాలపాడు నుంచి పరిటాలవారిపాలెం వెళ్లే అనుసంధాన తారు రహదారి అడుగుకో గుంత.. అడుగడుగున అంతే చందంగా మారింది. ఏదేళ్లుగా ఈ దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టేవారే కరవయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నాయకులు ఈ గుంతల్లో అక్కడక్కడ కంకర మిశ్రమం పోయించారు. అది ఆ తరువాత కురిసిన వర్షానికి కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. మామిళ్లపల్లి, కుందుర్రు, కొమ్మాలపాడు గ్రామానికి ఉన్న ఏకైక అనుసంధాన మార్గమిది. ఈ మూడు గ్రామాల్లో వేయి మందికి పైగా ఉన్న జనాభా రాకపోకలు సాగించేందుకు యాతన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మరుభూమి.. ప్రహరీ ఏదీ?

దాదాపు పది వేల జనాభా ఉన్న చీరాల మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన శ్మశానం చుట్టూ గతంలో ప్రహరీ ఉండేది. కొత్తది నిర్మించాలనే ఉద్దేశంతో పాత గోడలను కూలగొట్టారు. ఇది జరిగి పదేళ్లు గడిచిపోయినా.. ఇంతవరకు నిర్మించకపోవడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. దీని చుట్టూ మూడువైపులా ఇళ్లు, ఒక వైపు సీసీ రహదారి ఉంది. మృతదేహాలను కాల్చే దృశ్యాలు చుట్టూ ఉన్న వారందరికీ కనపడటంతో భయంతో వణికిపోతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు పరిస్థితి దీనంగా మారింది. అధికారులు వెంటనే ప్రహరీకి ప్రతిపాదనలు తయారు చేసి, నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు. - చీరాల, రామకృష్ణాపురం (చీరాల గ్రామీణం)



రామకృష్ణాపురంలో శ్మశానం

(c) eenadu

కాళంగి గేట్లు.. ఎంత వరకు భద్రం..?

కాళంగి జలాశయ ప్రధానగేట్ల నుంచి భారీగా నీరు లీకవుతుండటంతో భద్రతపై రైతుల్లో అనుమానం వ్యక్తమవుతోంది. జలాశయ సామర్థ్యం 240 ఎంసీఎఫ్‌టీసీలు కాగా అధికారులు ముందుచూపుతో 170 ఎంసీఎఫ్‌టీసీలు మాత్రమే ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. 2015 నవంబర్‌లో జలాశయ 18 గేట్లతో పాటు అత్యవసర గేట్లు ఎత్తివేసేందుకు అధికారులు యత్నించగా.. ప్రధాన గేట్లలో ఒకటి కొట్టుకుపోయింది. అప్పట్లో తాత్కాలిక గేటు అమర్చి నీరు నిండేలా చర్యలు తీసుకున్నారు. పదేళ్లవుతున్నా తాత్కాలిక గేటే కొనసాగిస్తున్నారు. దీనిపై డీఈ రత్నాకర్‌రెడ్డిని వివరణ కోరగా వర్షాలు తగ్గితే లీకేజీలు పూర్తిస్థాయిలో నివారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - **న్యూస్‌టుడే, కేవీబీపురం**

వైభవంగా చక్రతీర్థ ముక్కోటి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీవారి ఆలయ అర్చకులు, పరిచారకులు, భక్తులు ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీచక్రత్తాళ్వారు, శ్రీ నరసింహస్వామి, శ్రీఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం, హారతి చేపట్టారు.

ఎక్కడా.. 2 వేల ఎకరాలు

- గంగాధరనెల్లూరులో పారిశ్రామిక పార్కుకు పడని అడుగులు

ఈనాడు- చిత్తూరు: 'చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి పూర్తయితే చెన్నైకి 45 నిమిషాల్లో, బెంగళూరుకు 1.30 గంటల్లో చేరుకోవచ్చు. ఈ రోడ్డుకు సమీపంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు 2వేల ఎకరాలు సేకరించాలి. బయటి ప్రాంతాల నుంచి పెద్ద కంపెనీలను తీసుకొచ్చి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'

- ఈ ఏడాది మార్చి 1న ముఖ్యమంత్రి చంద్రబాబు

■ గంగాధర నెల్లూరు పర్యటనలో సీఎం హామీ ఇచ్చి పదినెలలు గడుస్తున్నా ముందడుగు పడలేదు. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు వేగంగా అడుగులు వేస్తేనే భూసేకరణ పూర్తయింది. రాబోయే మూడేళ్లలో పెట్టుబడులు వచ్చి పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమమవుతుంది.

ఎంఎస్‌ఎంఈ పార్కు లేక.. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో చెప్పుకోవడానికి పెద్దగా పరిశ్రమలు లేవు. కేవలం గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోనే ఏపీఐఐసీ పార్కు ఉంది. ఇక్కడా అరకొర యూనిట్లు ఉన్నాయి. వ్యవసాయాధారిత పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి సారించింది. ప్రతి నియోజకవర్గంలో తొలుత ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి, చిత్తూరు నియోజకవర్గాల్లో వీటికి శంకుస్థాపన జరిగినా గంగాధరనెల్లూరులో ముందడుగు పడలేదు.

ఎస్‌ఆర్‌పురం వద్ద 200 ఎకరాలు.. చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రాథమికంగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఎస్‌ఆర్‌పురం మండలంలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేల్చారు. రైతులకు చెందిన 700 ఎకరాలున్నా పరిహారం విషయమై అభ్యంతరాలు ఉన్నాయి. అన్నదాతలను ఒప్పిస్తేనే భూసేకరణ జరుగుతుంది. ఈ లెక్కన కనీసం వెయ్యి ఎకరాల్లోనైనా పరిశ్రమల పార్కు ఏర్పాటవుతుంది.

సహకార సంఘాలు.. దోచేశారు

- పొలం లేకున్నా.. పంట వేయకున్నా రుణాలు
- గత పాలనలో వైకాపా నేతల ఇష్టారాజ్యం

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో నిబంధనలకు విరుద్ధంగా రూ.20 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. భూములు తాకట్టు పెట్టి అంతా సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే అప్పు ఇవ్వాల్సి ఉండగా ఇవేవీ లేకుండానే డబ్బులు ఖాతాల్లో జమచేశారు. లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది వైకాపా నాయకులే కావడం గమనార్హం.

ఈనాడు- చిత్తూరు, తిరుపతి

ఐదేళ్ల జగన్ పాలనలో సహకార సంఘాలు భ్రష్టుపట్టాయి. రైతులకు అండగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సింగిల్ విండో), జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) వైకాపా నాయకులకు దాసోహమయ్యాయి. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అర్హతాలేని వ్యక్తులకు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. గృహనిర్మాణం, ఇతర రుణ విభాగాల్లో రూ.12 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు తేలింది.

పక్కదారి పట్టిన నిధులు

- బైరెడ్డిపల్లె రూ.2 కోట్లు
- పలమనేరు రూ.80 లక్షలు
- శ్రీకాళహస్తి రూ.60 లక్షలు
- సత్యవేడు రూ.60 లక్షలు

అధికారులూ కుమ్మక్కు

వైకాపా హయాంలో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేశారు. పాలకవర్గాలతో అప్పటి అధికారులూ కుమ్మక్కయ్యారు. దాంతో అటు సభ్యులైన ఫ్యాను పార్టీ నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందరూ ఎడాపెడా రుణాలు తీసుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి డీసీసీబీకి చెల్లించలేదు. చాలాచోట్ల ఇదే పరిస్థితి. వసూలు చేయాల్సిన అధికారులు తమ పని కాదన్నట్టుగా వ్యవహరించారు.

సభాసంఘం సిఫార్సులే తరువాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఆర్వో మోహన్‌కుమార్ అక్రమాలపై విచారణ జరిపారు. ఈ క్రమంలోనే 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ అక్రమాలపై రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సభాసంఘాన్ని నియమించారు. ఛైర్మన్‌గా జిల్లాకే చెందిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోని కమిటీ అక్రమాలపై ఎలాంటి చర్యలకు సిఫార్సు చేస్తుందన్నది చూడాలి.

ఇళ్ల నిర్మాణాలకూ

స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకోవాలంటే పాస్‌పుస్తకాలను కుదువపెట్టాలి. లేదంటే అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని బ్యాంకర్లు నిర్ధారించుకోవాలి. భూమిని తాకట్టు పెడితే సంబంధిత మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి. బైరెడ్డిపల్లె, వి.కోట, పలమనేరు, పుంగనూరు, సదుం, మదనపల్లె, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు తదితర శాఖల్లో వైకాపా నేతల కోసం ఈ నిబంధనలు పక్కన పెట్టారు. పొలం లేకున్నా, పంట వేయకున్నా విచ్చలవిడిగా అప్పులు ఇచ్చి ఆ పార్టీ నాయకులను ఆర్థికంగా బలోపేతం చేసి సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. వి.కోట మండలంలో వైకాపా నేత ఇంటి నిర్మాణానికి రూ.40 లక్షల అప్పు ఇచ్చారు. అదే నేతకు రూ.1.60 కోట్ల పంటరుణం మంజూరు చేశారు. ఇదే తరహాలో మరికొందరికి గృహరుణాలు ఇచ్చారు.

ఎప్పుడిస్తారో ఉపాధి వేతనాలు?



జిల్లాలో వివరాలు..

- జాబ్‌కార్డులు: 2,67,000
- వేతనదారులు: 4,79,000 మంది
- హాజరు: 2 నుంచి 3 లక్షలు
- సగటున పనికి వచ్చేవారు: 35 వేలు

ఆగస్టు 15 నుంచి నిలిచిన చెల్లింపులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఉపాధి హామీ వేతనదారులు కూలి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 15 నుంచి చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో వేతనాలు, మెటీరియల్ నిధి బకాయిలు రూ.70 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కూలీల సొమ్ము రూ.35 కోట్లు

రోజుకు సగటున 35 నుంచి 50 వేల మంది వరకు జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఆగస్టు నుంచి 12 లక్షల పనిదినాలు నమోదవగా రూ.35 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

భారీగానే మెటీరియల్ బకాయిలు..

వేతన సొమ్ములో 40 శాతం కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కింద వస్తుసామగ్రి నిధులు విడుదల చేస్తుంది. వీటితో సీసీరోడ్లు, మురుగు కాలువలతో పాటు అభివృద్ధి పనులు చేస్తున్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించారు. వీటికి సంబంధించిన బకాయిలు మరో రూ.35 కోట్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు కేంద్రం విడుదల చేయాల్సి ఉందని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు.

భవితకు.. పటిష్ఠ నిర్మాణం

☛ లీన్ కన్‌స్ట్రక్షన్స్ కాన్ఫరెన్స్‌లో వక్తలు

ప్రదర్శనలను తిలకిస్తున్న పరిశోధక విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: లీన్ కన్‌స్ట్రక్షన్స్‌పై నిరంతర పరిశోధనలతో వినూత్న మార్పులకు అవకాశం లభిస్తోంది. ప్రస్తుతం సాధించిన దానికంటే మరింత సులభతరంగా, తక్కువ సమయంలో, ఖర్చులు తగ్గించుకునేందుకు మరిన్ని సులభతర మార్గాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన ఆవశ్యకతలపై తిరుపతి ఐఐటీ వేదికగా నిర్వహించిన '8వ లీన్ కన్‌స్ట్రక్షన్స్ కాన్ఫరెన్స్' మరింత దోహదపడుతుందని ఔత్సాహిక పరిశోధకులు స్పష్టం చేశారు.

నిరంతర ప్రణాళికలు అవసరం

నిర్మాణరంగంలో నిర్దేశిత ప్రాజెక్టు ప్రారంభం నుంచి నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రణాళిక ప్రకారం పనులు చేయాలి. చేపట్టాల్సిన పనుల గురించి వారానికో పర్యాయం విధిగా చర్చించుకోవడం, అటు నిర్మాణ యాజమాన్యానికి, మానవ వనరుల విభాగానికి మధ్య వారధిగా లీన్ కన్‌స్ట్రన్స్ నిలుస్తుంది. ఆసక్తిగల వారు 'లీన్ బిల్డర్స్' పుస్తకం ద్వారా మరింత సమాచారాన్ని అందిపుచ్చుకోవచ్చు. **- రాఘవి ప్రభాహరన్, అసిస్టెంట్ మేనేజరు, యూఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్**

నవీన పద్ధతులు ప్రోత్సహించాలి

నిర్మాణరంగంలో మూస విధానం విడనాడి నవీన పద్ధతులు ప్రోత్సహిస్తే పనుల్లో నిర్దిష్ట వేగం స్పష్టంగా కన్పిస్తుంది. యాంత్రికీకరణతో పనులు త్వరగా పూర్తిచేసుకోవచ్చు. నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు నిర్మాణరంగంలో మార్పులు గమనిస్తూ చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీన్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్స్‌లెన్స్ (ఐఎల్‌సీఈ) లాభాపేక్ష లేకుండా ఈ తరహా పద్ధతులు ప్రోత్సహిస్తోంది. **- కైజాద్ కరంజవాల్, సెక్రెటరీజనరల్, ఐఎల్‌సీఈ**

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సాంకేతికను అందిపుచ్చుకోవడంలో నిర్మాణసంస్థలు, ఔత్సాహిక పరిశోధకుల పాత్ర ఎంతో ఉంది. వీటిని కూలీలు మొదలు పర్యవేక్షించే వాళ్లందరికీ తెలియజేయడం, ప్రణాళికాబద్ధంగా పనులు అప్పగించడం, నిర్దేశిత సమయంలోగా పనులు జరుగుతున్నాయా లేదా అన్న విషయమై నిశిత పరిశీలనతో పనుల్లో పురోగతి తీసుకురావచ్చు. **- ఆల్‌బర్ట్ థామస్, అసోసియేటెడ్ ప్రొఫెసర్, ముంబయి**

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 70,345 మంది దర్శించుకున్నారు. రూ.3.43 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

రైతుసేవా సదస్సులు నేడు

చిత్తూరు (వ్యవసాయం) : జిల్లాలోని 312 రైతుసేవా కేంద్రాల్లో బుధవారం 'రైతన్నా- మీకోసం'లో భాగంగా వర్క్‌షాప్ (సదస్సు)లు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. 2026, 2026-27కు సంబంధించిన ప్రణాళికలపై అభ్యుదయ రైతులతో చర్చిస్తామన్నారు.

8 నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: ఈనెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈనెల 8వ తేదీన పాఠశాల, పదో తేదీన మండల, 12వ తేదీన జిల్లాస్థాయి ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గత నెల 3 నుంచి 12 వరకు నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ నారాయణమ్మ మంగళవారం విడుదల చేశారు. 95 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

10 వరకు పరీక్ష రుసుం గడువు

చిత్తూరు విద్య: సార్వత్రిక పాఠశాల పరిధిలోని పది, ఇంటర్ పరీక్షలకు తత్కాల్ అపరాధ రుసుము రూ.600తో ఈనెల 10 వరకు చెల్లించవచ్చని డీఈవో వరలక్ష్మి తెలిపారు. దరఖాస్తులను మీ సేవా లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు.

104FM Tirupati

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9154991499

ఆరోగ్య సవాళ్లపై.. అతివల శోధన

పరిష్కారం దిశగా మహిళావర్సిటీ గృహవిజ్ఞాన విభాగం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం సాధ్యమవుతుంది. ఆ దిశగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గృహవిజ్ఞానశాస్త్రం ముందడుగు వేస్తోంది. ఈ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థినులు సమాజంలో మహిళలు ప్రధానంగా యుక్తవయసు బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు సూచించేదిశగా శాస్త్రీయపద్ధతుల్లో పరిశోధనలు చేస్తున్నారు. బత్తుల అర్చన, రామినేని సాహిత్య, విశాలాక్షి లోతైన అధ్యయనాలకు ఆచార్య బిందు మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

రక్తహీనత నియంత్రించేలా..!

కౌమార బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంది. రక్తహీనతతో శరీరంలోని అవయవాలకు ఆక్సిజన్ సరఫరా సరిగ్గా జరగకపోవడం తద్వారా అలసట, బలహీనత, తలనొప్పి, ఏకాగ్రతలోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యకు సహజంగా లభించే ఆకుల నుంచి ఏదైనా పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో మునగ ఆకులపై పరిశోధనలు చేశా. మునగ ఆకు, సజ్జలు, నల్లనువ్వులు, బెల్లంతో లడ్డూ తయారు చేసి క్రమం తప్పకుండా రక్తహీనత ఉన్న బాలికలకు అందించా. రెండునెలల్లోనే వారిలో హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. రక్తహీనత తగ్గించడంలో మునగాకు పాత్ర కీలకంగా మారింది. **- విశాలాక్షి,**

పీసీవోఎస్ సమస్యకు చెక్

పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీవోఎస్) అనేది మహిళల్లో కనిపించే హార్మోన్ల అసమతుల్యత. దీనివల్ల అండోత్పత్తి సక్రమంగా జరగక అండాశయాల్లో చిన్నగడ్డల వంటి సిస్టులు ఏర్పడతాయి. కౌమారదశలో ఉన్న యువతుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. పరిష్కారానికి అవిసెగింజలతో పరిశోధనలు చేస్తున్నా. వాటిలో లభించే లిగ్నాన్స్ శరీరంలో ఈస్ట్రోజెన్ ఉత్పత్తిని నియంత్రించి హార్మోన్ల అసమతౌల్యం తగ్గించడంలో సహాయపడతాయి. **- రామినేని సాహిత్య**

యువతుల్లో ఊబకాయంపై..

'అధిక బరువు, ఊబకాయం ఉన్న బాలికల పోషకస్థితి, ఒత్తిడి'పై పరిశోధన చేస్తున్నా. పౌష్టికాహారం లోపం, జంక్‌ఫుడ్, శారీరక శ్రమలేమితో ఊబకాయం బారినపడిన 18, 19 ఏళ్ల వయసున్న 75 మంది బాలికలను గుర్తించా. నా పరిశోధనలో భాగంగా ఆరునెలలపాటు వారితో డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం రోజూ యోగా, ఏరోబిక్స్ చేయించా. డైట్ ఫాలో అయ్యేలా చేశా. తర్వాత 55 శాతం మంది సాధారణ బరువుకు వచ్చారు. **- బత్తుల అర్చన**

చెప్పినా వినరు.. ప్రమాదాలు కనరు

ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

■ వడమాలపేట మండలం తడుకు రైల్వేస్టేషన్ వద్ద నవంబరు 12న విజయపురం మండలానికి చెందిన రంజిత్‌నాయుడు, ఎస్‌బీఆర్ పురం గ్రామస్థుడు బాబు రాజు రోడ్డు పక్కన నిల్చొని ఉండగా తిరుత్తణి వైపు వెళ్తున్న సిమెంట్ లారీ వీరిని ఢీకొంది. ఇద్దరూ మృత్యువాత పడగా వాహనం ఆపకుండా వెళ్లిపోయారు.

■ తిరుపతి పరిధిలోని నాయుడుపేట- పూతలపట్టు మార్గంలోని అగ్రహారం కూడలిలో రోడ్డు నిర్మాణ పనులకు గ్రావెల్ తీసుకెళ్తున్న వాహనం అపసవ్య దిశలో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ వాహనాలు వేగంగా దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇసుక, కంకర, గ్రావెల్ తీసుకెళ్లే టిప్పర్లు జాతీయ రహదారులపై వేగం మించుతున్నాయి. లోడు ఎక్కువ కావడంతో చోదకులు అదుపు చేయలేకపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పూతలపట్టు- నాయుడుపేట, తిరుపతి- చెన్నై, చిత్తూరు- బెంగుళూరు మార్గాల్లో కొండలు, నదీ పరివాహక ప్రాంతాలు ఎక్కువ. ఆయా చోట్ల నుంచి నిత్యం ఇసుక, కంకర, గ్రానైట్, గ్రావెల్‌ను నిబంధనలు అతిక్రమించి తరలిస్తున్నారు. కడప, కర్నూలు జిల్లాల నుంచి తమిళనాడుకు వందల సంఖ్యలో లారీలు లోడుతో వెళ్తుంటాయి. వీరు వేగం నియంత్రణలో ఉంచుకోకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి.

కానరాని నిబంధనలు.. వాస్తవానికి రవాణాశాఖ నిబంధనల ప్రకారం 12 టైర్ల లారీ 20 టన్నులు, 10 టైర్లుంటే 16 టన్నుల సామర్థ్యం వరకు లోడు చేయొచ్చు. కానీ 35 నుంచి 45 టన్నుల వరకు నింపేస్తున్నారు. 20 టన్నుల సామర్థ్యమున్న లారీ 30- 40 కి.మీ వేగంతో వెళ్లాల్సి ఉన్నా పాటించడం లేదు. 45 టన్నులతో 70 నుంచి 90 కి.మీ వేగంగా వెళ్తుండటంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

తితిదే ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన తితిదే ఉద్యోగులకు బహుమానంగా 10 శాతం పెంపుదలతో మంగళవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. శాశ్వత ఉద్యోగులకు రూ.1,540 పెంచి రూ.15,400, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు రూ.754 పెంచి రూ.7,535 మంజూరు చేస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

13న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. సివిల్, ప్రమాదబీమా, చెక్‌బౌన్స్, కుటుంబ వివాదాలు, రెవెన్యూ తదితరాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

అరుణసారిక, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మహిళలకు ఆపదా.. ఉందిగా 181

సమాజంలో హింసకు గురవుతున్న లేదా ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉచిత ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబరు 181 ఉపయోగపడుతుందని రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద వాహనం ఉంటుందని.. ఈ వాహనాన్ని ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి వినియోగించుకోవచ్చన్నారు. - **న్యూస్‌టుడే, తిరుపతి(కలెక్టరేట్)**

గ్రేటర్‌తోనే తిరుపతి అభివృద్ధి

సమావేశంలో మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన తిరుపతి మరింత అభివృద్ధి చెందాలంటే గ్రేటర్‌తోనే సాధ్యమవుతుందని.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు అడుగులేస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై మంత్రి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మంత్రి మీడియాకు వివరించారు. 'గతనెల విశాఖలో సీఐఐ సమ్మిట్ ద్వారా రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులతో 15 లక్షల మందికి ఉపాధి రానుంది. తిరుపతి కేంద్రంగా రాయలసీమ జోన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా పర్యాటక ప్రాంతం కావడంతో ఎక్కువ ఆదాయం ఈ రంగం నుంచే వస్తోంది. సందర్శకులకు మరిన్ని సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తాం. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో జలాశయాలు నిర్మిస్తాం. త్వరలో శెట్టిపల్లి భూముల లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తాం' అని మంత్రి అన్నారు. కలెక్టర్ డా.వెంకటేశ్వర్, జేసీ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు కల్యాణ చక్రవర్తి, సిపాయి సుబ్రహ్మణ్యం, కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరుగెడితే హర్షా తిరేకమే

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: ఏడేళ్ల వయసులో విద్యుత్తు ప్రమాదంతో కుడి చేయి సగం కోల్పోయినా లక్ష్యం కోసం పరుగు తీస్తున్నాడు తిరుపతికి చెందిన పారా అథ్లెట్ ఉయ్యాల మోహన్ హర్ష(24). క్రీడలకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు. బలహీనతను విడిచి సాధారణ వ్యక్తుల్లా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఇతని ప్రస్థానంపై కథనం.

● తల్లి సుకన్య గృహిణి, తండ్రి బాబు ఎన్‌ఏఆర్‌ఎల్‌లో సహాయ టెక్నికల్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్న హర్ష విద్యలోనూ రాణిస్తున్నాడు. ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ నేతృత్వంలో శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నాడు. వచ్చే ఏడాది జరగనున్న ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు సన్నద్ధమవుతున్నాడు.

ఇవీ విజయాలు

■ దుబాయ్‌లో ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్-2023లో 100మీ పరుగులో రజతం.

■ బెంగళూరులో భారత పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్- 2024లో 100మీ పరుగులో కాంస్య పతకం.

■ పుణెలో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్- 2023లో 100మీ పరుగులో కాంస్య పతకం.

■ బెంగళూరులో జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 100, 200మీ పరుగులో, 2022లో జరిగిన 100మీ పరుగులో స్వర్ణ పతకాలు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

పర్యాటక శాఖ మనుగడ ప్రశ్నార్థకమేనా..?

☛ తిరుపతి డివిజన్‌లో ఇదీ దుస్థితి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నిన్నటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యాటకానికి పెట్టింది పేరు. రాష్ట్రంలో అత్యధిక ఆదాయం ఆర్జిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన తిరుపతి పర్యాటక డివిజన్ ఇప్పుడు మనుగడ సాగించడమే కష్టంగా మారింది. పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించిన ప్రభుత్వం పర్యాటక శాఖను గాలికొదిలేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పురాతన, ప్రఖ్యాత ఆలయాలు, చారిత్రక ప్రాంతాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జలపాతాలు వంటి విభిన్న పర్యాటకావకాశాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, హార్సిలీ హిల్స్, శ్రీకాళహస్తి, కుప్పం, చంద్రగిరి కోట, కైలాసనాథ కోన, పులిగుండు ప్రాంతాలు పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు రిసార్టులు, కాటేజీలు, అద్దె గదులు, సమావేశ మందిరాలు, హోటళ్లు, ఇతర సదుపాయాల ద్వారా రాష్ట్రంలోనే అత్యధిక అదాయం ఆర్జించేది.

పడిపోయిన ఆదాయం

నిన్న మొన్నటి వరకు ఏటా రూ.7 కోట్లకు పైగా ఆదాయం ఆర్జించిన పర్యాటకశాఖ ప్రస్తుతం రూ.2.50 కోట్లకు మించి ఆదాయం దక్కించుకున్న దాఖలాలు లేవు. అందులో జీతభత్యాలు, ఇతర ఖర్చులు రూ.2.10 కోట్ల దాకా వెచ్చిస్తున్నారు. 400 మందికి పైగా ఉద్యోగులు పర్యాటకశాఖలో సేవలు అందిస్తున్నారు.

తిరుమల దర్శన ప్యాకేజీలతోనే ఊరట

పర్యాటక శాఖకు ప్రధాన ఆదాయ వనరు తితిదే. సింహభాగం ఆదాయం తిరుమల దర్శన ప్యాకేజీలు, తిరుమలలో పర్యాటకశాఖ హోటళ్ల ద్వారా లభిస్తోంది. హార్సిలీహిల్స్ మినహా అన్ని యూనిట్లు నామమాత్రంగా ఆదాయం పొందుతున్నాయి. పర్యాటకశాఖ ద్వారా నిత్యం వెయ్యి నుంచి 1500 మంది వరకు శ్రీవారి దర్శనం కోసం అనుమతించేవారు. వారికి అవసరమైన బస్సులు, బస, భోజన వసతి, గైడ్ సౌకర్యాలను పర్యాటకశాఖ సమకూర్చి ఆదాయాన్ని ఆర్జించేది.

పునరుద్ధరిస్తేనే నష్టాలు తీరేదీ?

ఏడాది క్రితం పర్యాటకశాఖకు కేటాయించే రూ.300 టికెట్లను తితిదే రద్దు చేయడంతో పర్యాటకశాఖకు చెందిన 18 అధునాతన వాహనాలు షెడ్డుకే పరిమితమయ్యాయి. 60 మందికి పైగా డ్రైవర్లు, సిబ్బంది విధులు లేక ఖాళీగా ఉంటున్నారు. తిరుమల శ్రీవారి దర్శన ప్యాకేజీలు పునరుద్ధరిస్తే తప్ప పర్యాటకశాఖకు నష్టాల నుంచి ఊరట లభించదు.

ప్రక్షాళన చేసే అధికారులేరీ?

తిరుపతి జిల్లా పర్యాటకశాఖను పట్టిపీడిస్తున్న మరో కీలక సమస్య డిప్యూటేషన్‌పై వచ్చే అధికారులు. ప్రస్తుతం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా రమణ ప్రసాద్ కొనసాగుతున్నారు. పులివెందులలో వైకాపా నేత సమీప బంధువు కావడంతో కడప, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పర్యవేక్షణ బాధ్యతల్ని, రాష్ట్రంలోని ఏకైక స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ బాధ్యతల్ని అప్పగించారు. పర్యాటకశాఖ విధులను పక్కనబెట్టి వ్యక్తిగత ప్రచార కార్యక్రమాలతో ఆయన కాలం గడిపారు. మంత్రి రోజాకు అనధికారిక వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన నాటి సెట్విన్ సీఈవో మురళీకృష్ణారెడ్డి సైతం ఆ పదవిని దక్కించుకునేందుకు కూటమి నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారు. తిరుపతి జిల్లా పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి సైతం వైకాపా హయాంలో కీలక పదవులు అనుభవించి కూటమి ప్రభుత్వం రాగానే తిరిగి జిల్లా స్థాయి పదవికి వచ్చారనే విమర్శలున్నాయి. ఇలాంటి అధికారులతో పర్యాటకశాఖకు పూర్వవైభవం తీసుకుని రావడం ఎలా సాధ్యమనే చర్చ జరుగుతోంది.

గూడు కరవై..

తిరుపతి పర్యాటక శాఖకు ప్రస్తుతానికి నిలువ నీడ లేదనే చెప్పాలి. గతంలో తితిదేకి చెందిన శ్రీనివాసం, శ్రీదేవి కాంప్లెక్స్‌లలో పర్యాటకశాఖ కార్యాలయాలను నడిపింది. అద్దె భారం ఎక్కువ కావడంతో అలిపిరి బైపాస్‌లోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తలదాచుకుంటున్నారు. రుయా ఆసుపత్రి ఎదురుగా పర్యాటకశాఖకు చెందిన భవనం 2011 నుంచి అసంపూర్తిగా ఉంది. దీన్ని పూర్తిచేసి పాలన సాగించాలన్న ఆశ దశాబ్దాలుగా కలగానే మిగిలింది.

శంఖువేది గోవిందా!



తిరుపతి నుంచి తిరుచానూరుకు వెళ్లే మార్గంలో ఉన్న శ్రీనివాస ఉద్యానవనంలో నిరుపయోగ వాహనాల విడిభాగాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, శంఖుచక్రనామాలు తయారు చేశారు. పార్కుకు వచ్చే సందర్శకుల్లో భక్తి భావాన్ని పెంపొందించేలా ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తుప్పు పట్టి పడిపోయిన శంఖు.. శ్రీదేవి అమ్మవారి నమూనాలు కనిపిస్తున్నాయి.

-ఈనాడు, తిరుపతి

బస్సులే కాదు.. నీళ్లూ నిలుస్తాయ్

తిరుపతిలోని ఏడుకొండల బస్టాప్ వద్ద తాజా వర్షాలకు దుస్థితిది. చినుకు పడితే చాలు సెంట్రల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయం అవుతుంది. రహదారి రాళ్లు తేలి గుంతలమయమై ప్రమాదకరంగా మారుతుంది. రాకపోకలు సాగించే భక్తులు, విద్యార్థులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

శాస్త్రోక్తంగా భరణి వైభవం

దీపాలను ఊరేగింపుగా తెస్తున్న అర్చకులు, అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తికం, భరణి నక్షత్రం సందర్భంగా భరణి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చొక్కాని ఉత్సవానికి నాందిగా మంగళవారం ముక్కంటి ఆలయ ఆవరణలోని జ్ఞానాంబిక ఆలయం వద్ద ఈ విశేషోత్సవాన్ని ఆగమోక్తంగా జరిపారు. ఆలయ దీక్షా గురుకుల్ రాజేష్ నేతృత్వంలో పూజలు నిర్వహించారు.

శ్రమించారు.. విజేతలయ్యారు!

జాతీయ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా ఆటగాళ్లు

సాధనలో ఆటగాళ్లు

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: క్రమశిక్షణ, నిత్య సాధనతో ఖోఖో బరిలో దిగి ప్రత్యర్థిని మట్టి కరిపిస్తున్నారు. ప్రయత్నిస్తే అసాధ్యమేమీ కాదని నిరూపిస్తున్నారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బాలబాలికలు. విశాఖలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆటల కోటలో కుంభ స్థలాన్ని కొడతాం అంటూ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

యువశ్రీ కేక

పట్టుదల, నిరంతర సాధనతో ఖోఖోలో సత్తాచాటింది యువశ్రీ. బంగారుపాళ్యం మండలం టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నాలుగేళ్లుగా సాధన చేస్తోంది. గతంలో ఖేలో ఇండియా జాతీయ పోటీల్లో పాల్గొంది. తాజాగా రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం గెలిచి.. జాతీయ పోటీలకు అర్హత సాధించింది. జాతీయ స్థాయిలో పతకం సాధిస్తానని ధీమాగా చెబుతోంది.

గాయాల్ని అధిగమించి..

సూర్యనారాయణ.. బంగారుపాళ్యంలోని ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఇతను ఖోఖో అంటే ఆసక్తితో శిక్షణలో చేరాడు. పలుసార్లు గాయాలపాలైనా మొక్కవోని దీక్షతో ఆటంకాల్ని అధిగమించి నైపుణ్యం సాధించాడు. తాజాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం గెలిచి.. జాతీయ పోటీల్లో పతకం సాధించాలన్న తపనతో సాధన చేస్తున్నాడు.

పరుగు నుంచి ఖోఖోకు

జయశ్రీ.. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. పరుగు పోటీల్లో చురుగ్గా ఉన్న బాలికను గమనించిన శిక్షకులు ఖోఖో శిబిరంలో చేర్పించారు. సాధన చేసిన జయశ్రీ.. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్వర్ణం గెలిచి.. జాతీయ పోటీలకు అర్హత సాధించింది.

బద్రీనాథ్ సత్తా

బద్రీనాథ్.. ఖోఖోలో చిచ్చర పిడుగులా రాణిస్తున్నాడు. బంగారుపాళ్యం ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు దినసరి కూలీలు. విశాఖలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంలో కీలకంగా వ్యవహరించాడు. జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

ఐఐటీలో క్వాంటం సాంకేతికతపై కార్యశాల

మాట్లాడుతున్న శాస్త్రవేత్త అమిత్ సక్సేనా

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నైపుణ్యవంతమైన మానవ వనరులను బలోపేతం చేసేందుకు క్వాంటం టెక్నాలజీ పెంపొందించాల్సిన ఆవశ్యకతపై ఐఐటీలో క్వాంటం నాలెడ్జ్ క్లస్టర్(క్యూకేసీటీ) కార్యశాల నిర్వహించారు. ఐఐటీ, ఐసర్ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించే నేషనల్ క్వాంటం మిషన్(ఎన్‌క్యూఎం)ను మంగళవారం ప్రారంభించారు. క్వాంటం కంప్యూటరింగ్, అల్గారిథం, సురక్షిత కమ్యూనికేషన్, ఎర్రర్ కరెక్షన్, క్వాంటం సిస్టమ్‌లకు సంబంధించిన థర్మోడైనమిక్ సూత్రాలను పుణెకు చెందిన సీడీఏసీ శాస్త్రవేత్త అమిత్ సక్సేనా వివరించారు. మద్రాస్ ఐఐటీలోని సంగ్యాన క్వాంటం కమ్యూనికేషన్ హబ్‌తో నేషనల్ క్వాంటంమిషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ , సీడీఏసీ ఆధ్వర్యంలో నైపుణ్యాలు పెంపొందించేందుకు భాగస్వామిగా మారడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్లు అరిజిత్‌శర్మ, అరవింద్, ఐఐటీఎం, హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ, పుణెతో పాటు పలు ప్రాంతాల ఆచార్యులు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

అర్ధగిరి (తవణంపల్లె), న్యూస్‌టుడే: మండలంలోని అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం కార్తిక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు అభిషేకం, 11కి సుదర్శన హోమం, రాత్రి 7 గంటలకు ఉత్సవ విగ్రహంతో సంజీవరాయ పుష్కరిణి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

4న లక్ష దీపోత్సవం

పాలసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణాజిమ్మాపురం పంచాయతీ కొండం గ్రామంలో ద్రౌపది ధర్మరాజుల ఆలయం ఆవరణలో ఈనెల 4న పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు ధర్మకర్త బాలయ్య నాయుడు తెలిపారు. సాయంత్రం లక్ష దీపోత్సవం ఉంటుందన్నారు. పాల్గొనేవారికి పూజా సామగ్రి ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు.

శ్మశాన వాటిక కోసం.. కాళ్లు పట్టుకున్న వైనం..

తహసీల్దారు రాము ఎదుట మోకాళ్లపై నిల్చున్న మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజా

పుంగనూరు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా, ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా దళితుల శ్మశానాలకు స్థలం కేటాయించడం లేదంటూ పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజా ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో దళితులకు ప్రతి గ్రామంలో శ్మశానాలకు స్థలాలను కేటాయించాలంటూ తహసీల్దారు రాము కాళ్లపై పడి వేడుకొన్నారు. ఇటీవల తోపుమఠం శ్మశానం ఆక్రమణకు గురైందని రాస్తారోకో చేస్తే దాన్ని సర్వేకే పరిమితం చేశారన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తహసీల్దారు హామీ ఇచ్చారు. అధికారులు మహేష్, నారాయణ, సుప్రియ, కమిటీ అధ్యక్షుడు రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

హోంస్టేల నిర్వహణతో ఆర్థికాభివృద్ధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాకం, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాల్లో నివాసం ఉంటున్న ప్రజలు హోంస్టేలు ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్ తెలిపారు. కాణిపాకంలో హోంస్టేల నిర్వహణపై జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి వచ్చే భక్తులకు పూర్తిస్థాయి వసతులు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం హోంస్టే పథకానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి నరేంద్ర, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేని లే-అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి..

కరపత్రాలను విడుదల చేస్తున్న పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, పురపాలక ఛైర్మన్ సెల్వరాజ్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలకు సంబంధించి పురపాలిక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్ బాబు అన్నారు. స్థానిక పురపాలిక కార్యాలయంలో మంగళవారం పురపాలక ఛైర్మన్ సెల్వరాజ్ అధ్యక్షతన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పథకాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలకు సంబంధించి అనుమతులను పొందాలని సూచించారు. అందుకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దాము, సోము, సురేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్ పాల్గొన్నారు.

విద్యుత్తు పనుల పూర్తికి ఆదేశాలు

ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: పట్టణాలతో పాటు పల్లెల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు చేపడుతున్న ఆర్‌డీఎస్ఎస్ (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) మార్చిలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సూచించారు. మంగళవారం ఆ శాఖ ఇంజినీర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 421 ఫీడర్ల పరిధిలో పనులు ప్రారంభించగా 141 చోట్ల పూర్తయినట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు త్వరగా అమర్చాలన్నారు. కుప్పంలో 4 ఉపకేంద్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 2 పూర్తయ్యాయని, మిగిలినవి జనవరి లోపు పూర్తి చేస్తామన్నారు. ఆ శాఖ ఈఈ భాస్కర్‌నాయుడు, ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు ఆనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

TO LET

తిరుపతి శ్రీనివాసం పక్కన వెజ్ రెస్టారెంట్ బాడుగకు ఇవ్వబడును. సంప్రదించండి. Ph: 90303 41903.

JOBS

TELE CALLERS Female Q: Any Degree & Basic System Knowledge. N.Sreenatha reddy Recovery Agency, Bairagipatteda, TPT. 9032801545.

REQUIRE Female Tele callers for Well Reputed Educational Organisation. Qual: Any Degree, Languages: Tamil/ Telugu. Sal: 8000. ✆ 91774 51646.

THE EENADU CLASSIFIEDS WAY — B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

ప్రభుత్వ పాఠశాలలో అవుట్సోర్సింగ్ పద్ధతిలో Vocational Faculty కావలెను, జీ: 28000, అన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలకు # 98487 71117, 98498 48817

అన్న క్యాంటీన్‌కు తిరుపతి నుండి చిత్తూరుకు Food Transport చేయడానికి దోస్త్ వెహికల్‌కు పర్మనెంట్ డ్రైవర్స్ కావలెను. ✆ 99661 29199.

తిరుపతి- ప్రముఖ హోటల్లో పనిచేయుటకు మేనేజర్, రూమ్ బాయ్స్ కావలెను. మంచి జీతం. అనుభవం బాషలు తెలిసిన వారికి ప్రాధాన్యం. రోజు మార్చి రోజు పని. Cont: ✆ 90303 41903.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

AP ట్రాన్స్‌కో 220 KVSS చదళ్ళ పుంగనూరు చిత్తూరు జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు కావలెను. (1) High Skilled - B.Tech (BE), డిప్లొమా EEE- OC, BC-B (W), OC (W), OC. (2) Skilled - ITI Electrical- BC-E, BC-A(W), OC, SC (W). Unskilled - 10th Pass, ST, OC, SC. సంప్ర: P.ఉదయ్‌భాస్కర్, కాంట్రాక్టర్. ✆ 70931 17989, 94402 09459.

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జ్యోతిబాపులే భవనంలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందన్నారు. దివ్యాంగులు, వారి కోసం కృషి చేస్తున్న సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బస్సులో బంగారు నగల చోరీ

కార్వేటినగరం, న్యూస్‌టుడే: బస్సులో ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న బంగారు నగలు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం విప్పమానుపట్టెడకు చెందిన భారతి గత నెల 29న కార్వేటినగరం బయలుదేరారు. 104 గ్రాముల బంగారు నగలను హ్యాండ్ బ్యాగులో పెట్టుకొని పుత్తూరు వచ్చారు. తర్వాత కార్వేటినగరం బస్సు ఎక్కారు. టికెట్ కోసం ఆధార్‌కార్డు తీసిన సమయంలో నగలు బ్యాగులో ఉన్నాయని, బస్సు దిగి ఇంటికి వెళ్లి చూస్తే కనిపించలేదని ఆవేదన చెందారు. బస్సులోనే ఎవరో చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

మామిడి రైతుల ఆందోళన

చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు

గుడిపాల, న్యూస్‌టుడే: గుజ్జు పరిశ్రమల యాజమాన్యం అన్యాయం చేయడం తగదని పలువురు మామిడి రైతులు ఆందోళన చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కిలోకు రూ.8 ఇస్తామని చెప్పి, రూ.3 నుంచి రూ.4 చెల్లించడం ఏంటని ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని తాస గుజ్జు పరిశ్రమ ఎదుట నిరసన తెలిపారు. యాజమాన్యం స్పందించకపోవడంతో చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆరు నెలలుగా బకాయిలు చెల్లించడం లేదన్నారు. కిలోకు రూ.8. చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో అక్కడికి చేరుకొని వారితో చర్చించారు. న్యాయం జరగకపోతే ఈ నెల 5న నిరవధిక నిరసన చేపడతామన్నారు. రైతులు హరిబాబు చౌదరి, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధర చెల్లించే పరిశ్రమల సీజ్

క్రషింగ్ రద్దు చేస్తామని హెచ్చరికలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.8 చెల్లించాలని గుజ్జు పరిశ్రమలను ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశిత ధర కంటే తక్కువ చెల్లించే పరిశ్రమలను సీజ్ చేస్తామని జిల్లా ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి హెచ్చరించారు. గుడిపాల మండలంలోని తాసా మామిడి గుజ్జు పరిశ్రమ కిలోకు రూ.3.50, రూ.4 చొప్పున చెక్కులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీడీ పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. తక్కువ చెల్లిస్తే పరిశ్రమను సీజ్ చేసి, రానున్న ఏడాదిలో మామిడి క్రషింగ్‌ను నిలిపేస్తామన్నారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

హత్యకు గురైన హరి (పాత చిత్రం)

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పాతగొడవల ప్రస్తావనతో మాటా మాటా పెరిగి ఒకరిని హత్య చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై మల్లికార్జున్ కథనం మేరకు.. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట ఎస్సీకాలనీకి చెందిన పోలూరు హరి(33)కి అదేకాలనీలోని గౌతమ్‌కు మధ్య గొడవలు జరిగాయి. తదనంతరం సఖ్యత నెలకొనడంతో ఆదివారం మధ్యాహ్నం గౌతమ్, అతని సోదరుడు ప్రేమ్‌కుమార్‌తోపాటు తమిళనాడుకు చెందిన స్నేహితులు కలిసి మద్యం తాగడానికి పోలూరు హరిని తమ ఇంటికి పిలిచారు. అందరూ మద్యం మత్తులో ఉండగా పాతగొడవల ప్రస్తావనతో వారి మధ్య మాటామాటా పెరిగింది. అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు ఆగ్రహంతో అక్కడే ఉన్న బండరాయితో పోలూరు హరి తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఎవరికీ తెలియకుండా ఇంటి పక్కనే ఖాళీగా ఉన్న ఓ ఇంటి మరుగుదొడ్డిలో మృతదేహాన్ని పడేశారు. మేకలు మేపుతున్న కాపరి మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రవికుమార్, సీఐ మురళి, ఎస్సై మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. పోలీసులు నిందితుడు గౌతమ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సమాచారం. మరో నిందితుడు ప్రేమ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అదే చీరతోనే ఆత్మహత్య

గాయత్రి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: నా చావుకు ఎవరూ బాధ్యులు కారు.. అంటూ ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన ఘటన కుప్పంలో మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. బంగారుపాళ్యం మండలం దండువారిపల్లికి చెందిన యువరాజును 13 ఏళ్ల క్రితం గాయత్రి ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి శశాంక్(8) కుమారుడు ఉన్నాడు. యువరాజ్ కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. వీరు మనస్పర్థల కారణంగా తరచూ గొడవ పడుతుండేవారు. కొన్నినెలల క్రితం గాయత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేచేసరికి ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం సమీపంలో ఓ లేఖ లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

● రెండునెలల కిందట కుటుంబ కలహాలతో భర్త యువరాజ్ చీరతో ఉరివేసుకోవడానికి యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. అదే చీరతోనే ఇప్పుడు ఉరేసుకున్నట్లు బంధువులు తెలిపారు.

రైలు ఢీకొని 13 ఆవుల మృతి

పూతలపట్టు, న్యూస్‌టుడే: పూతలపట్టు సమీపంలో హౌరా- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో 13 ఆవులు మృతి చెందాయి. కనిగిరి కొండపైనున్న ఆంజనేయ స్వామికి భక్తులు ఆవులను సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఈ కొండపై వేల సంఖ్యలో ఆవులు ఉంటాయి. మంగళవారం వేకువజామును 4 గంటలకు అమ్మేపల్లె సమీపంలో ట్రాకుపై ఉన్న 13 ఆవులను రైలు ఢీకొంది. 28 నిమిషాల పాటు రైలు నిలిచిపోయింది. కళేబరాలను తొలగించిన తర్వాత రాకపోకలు ప్రారంభమయ్యాయి.

(c) eenadu

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

మంజూరు పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాశ్

చిన్నారి సర్జరీకి రూ.5 లక్షలు

పుత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన చిన్నారి మేధశ్విని అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. బ్రెయిన్ ట్యూమర్ అని డాక్టర్లు నిర్ధారించారు. శస్త్రచికిత్స చేయాలని చెప్పడంతో బాలిక తల్లిదండ్రులు సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను కలిశారు. ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా 24 గంటల్లో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత పత్రాన్ని వారికి ఎమ్మెల్యే అందజేశారు.

27న విద్యుత్తు ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

చిత్తూరు(మిట్టూరు): ఓసీ విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 సంవత్సర డైరీని ఈనెల 27న కాకినాడలో ఆవిష్కరిస్తామని సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని, ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

ఆక్రమణ ఆగదు.. కాలువ కనపడదు..

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణంలోని ప్రధాన రహదారిలో మురుగు కాలువలు లేవు. దీంతో వర్షం పడితే రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం వాహనాల రద్దీతో పట్టణం కిక్కిరిసిపోతోంది. దీనికి తోడు ఆక్రమణలు పెరుగుతున్నాయి. మురుగు కాలువలను ఆక్రమించి కొందరు దుకాణాల్లో సామగ్రి పెడుతున్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

భూమి పూజతో సరి..

పుత్తూరు పట్టణంలోని తిరుపతి- అరక్కోణం రోడ్డు పైవంతెన నుంచి ఆర్డీఎం రైల్వే గేటు వరకు కిలోమీటరు పొడవు ఉంటుంది. ఈ మార్గంలో ఒకవైపు మాత్రమే కాలువ ఉంది. వర్షం పడినా, తాగునీటి పైపులైన్లు లీకైనా నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. గతంలో తెదేపా హయాంలో ఆక్రమణలు తొలగించగా.. తర్వాత నిర్మాణాలు వెలిశాయి. గత వైకాపా పాలనలో రూ.2.9 కోట్లతో కాలువ నిర్మాణానికి భూమి పూజ చేసి సరిపెట్టేశారు.

కార్వేటినగరంలో రోడ్డుపైనే దుకాణాలు

తొలగించినా.. యథాస్థితి..

పట్టణంలోని పుత్తూరు- కార్వేటినగరం రోడ్డు విస్తరణ పనులు 2006లో చేపట్టారు. 60 అడుగుల మేర నిర్మాణానికి అందరూ అంగీకరించారు. అయితే పనులు ప్రారంభమయ్యాక కొందరు అడ్డుపడి కోర్టుకు వెళ్లారు. దీంతో నిర్మాణం నిలిచిపోయింది. 2012లో కొత్త రోడ్డు వేసినా విస్తరించలేదు. వైకాపా హయాంలో కాపువీధి నుంచి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టి ఆక్రమణలు తొలగించారు. పనులు పూర్తయ్యాక దుకాణాలు యథావిధిగా వచ్చేశాయి.

నిధులకు అనుగుణంగా పనులు..

పురపాలికలకు మంజూరయ్యే నిధుల లభ్యతకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. పుత్తూరు పురపాలిక పరిధిలో ఆక్రమణలు గుర్తించాం. త్వరలోనే వాటిని తొలగిస్తాం. మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదించాం. - నాగేశ్వరరావు, పుర కమిషనర్, పుత్తూరు



రూ.60 లక్షలతో సదాశివకోన అభివృద్ధి

వడమాలపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సదాశివకోన ఆలయం అభివృద్ధికి నిధులు కోరుతూ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సర్వశ్రేయో కింద రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యేకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం సమాచారం ఇచ్చారు. కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తమిళ జడ్పీ పాఠశాలలో బహుమతుల ప్రదానం

గేటు పుత్తూరు జడ్పీ పాఠశాలలో ప్రశంసాపత్రాల అందజేత

ప్రతిభ చూపారు.. బహుమతులు గెలిచారు

పుత్తూరు పట్టణంలోని గేటుపుత్తూరు తమిళ జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ ప్రభుత్వోన్నత పాఠశాలల్లో మంగళవారం 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అంశంపై 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. తమిళ జడ్పీ పాఠశాలలో జనని, షర్మి, జీవనందన్ విజేతలుగా నిలిచారు. వీరికి హెచ్ఎం స్వరూప బహుమతులు ఇచ్చారు. జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో నవ్య, కారుణ్య, తనూజశ్రీ విజేతలుగా నిలవగా హెచ్ఎం ప్రభాకర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, ప్రభావతి, గోపీకృష్ణ, బేబీ కస్తూరి, రవిచంద్రారెడ్డి, వెంకటరమణకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పుత్తూరు

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

కార్వేటినగరంలోని బంగారమ్మ ఆలయంలో తమిళ కార్తిక మాసం మూడో మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. - న్యూస్‌టుడే, కార్వేటినగరం

సభ్యులకు నియామకపత్రం ఇస్తున్న రియాజ్

జామియా మసీదు కమిటీ ఏర్పాటు

నగరి: పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉన్న జామియా మసీదుకు ఏపీ వక్ఫ్‌బోర్డు సీఈవో ఆదేశాల మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మంగళవారం జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్ ప్రొసీడింగ్ పత్రం అందజేశారు. అధ్యక్షుడిగా మజీద్ భాయ్, ఉపాధ్యక్షుడిగా మస్తాన్, కార్యదర్శిగా సలీమ్, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ రహీం, కోశాధికారిగా రహీంను ఎన్నుకున్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమలు రూ.8 ఇవ్వాల్సిందే

పూతలపట్టు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన మామిడి ధర ప్రకారం గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.8 చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. స్థానిక భీమేశ్వర ఆలయంలో మంగళవారం రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ పరిశ్రమలపై ప్రభుత్వం పట్టుసాధించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పూతలపట్టు మండల రైతు సంఘం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాలయ్యనాయుడు, గౌరవాధ్యక్షుడిగా చెంగల్రాయరెడ్డి, సలహాదారులుగా భారతి, ఉపాధ్యక్షులు, తదితరులను ఎన్నుకున్నారు.

చెరువు మొరవ ధ్వంసం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువ ఎద్దులవారి పల్లె సమీపంలో కొమిటిరెడ్డి చెరువు మొరవను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆయకట్టు రైతులు ఆరోపించారు. చెరువు నుంచి నీరు వృథాగా పోతోందన్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువును రూ.10 లక్షలతో బాగు చేశారని, ఎవరో కావాలనే పాడు చేశారని రైతులు చెబుతున్నారు.

ఇళ్ల పనుల వేగవంతంపై దృష్టి

గుడిపాల, న్యూస్‌టుడే: పీఎంఏవై 1.0లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం సూచించారు. బసవాపల్లెలో పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పీఎంఏవై 2.0లో భాగంగా కొత్త ఇళ్ల కోసం 850 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 14 వరకు అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. డీఈ శ్రీధర్, ఏఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సహిత విద్య కార్యక్రమాలపై శిక్షణ

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో అమలవుతున్న సహిత విద్య కార్యక్రమాలపై ఎంఈవోలకు మంగళవారం చిత్తూరు లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక ప్రతిభావంతులకు అందజేస్తున్న పథకాల గురించి డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్షా ఏపీసీ వెంకటరమణ వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు, వైద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పుత్తూరు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు పుత్తూరు పట్టణంలోని కల్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హేమంత్, మోహన్‌ప్రియ ఎంపికైనట్లు హెచ్ఎం ఆనంద బాబు తెలిపారు. అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ బాలుర విజేత జట్టులో హేమంత్, రన్నర్‌గా నిలిచిన బాలికల జిల్లా జట్టులో మోహన్‌ప్రియ ఉన్నట్లు పీడీ జయప్రకాశ్ తెలిపారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు కాంచన, నీరజ, వేమయ్య, షకీలా, రామకృష్ణ, భానుమతి, శ్రీరేఖ అభినందించారు.

హేమంత్, మోహన్‌ప్రియ

జూడోలో రజతం సొంతం

పతకం చూపుతున్న ప్రణతి

వడమాలపేట, న్యూస్‌టుడే: సత్యసాయి జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జూడోలో వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రణతి సత్తా చాటింది. 36 కిలోల విభాగంలో రజతం సొంతం చేసుకుంది. హెచ్ఎం కరుణానవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు అభినందించారు.

అవగాహనతో ఎయిడ్స్ దూరం

పుత్తూరు, న్యూస్‌టుడే: అవగాహనతో ఎయిడ్స్‌ను అరికట్టవచ్చని స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీలమ్మ తెలిపారు. పుత్తూరు సీహెచ్‌సీ ఐసీటీసీ కేంద్రంలో అవగాహన కల్పించారు. 10 మంది రోగులకు నెలకు సరిపడా నిత్యావసర సరకులు, న్యూట్రిషన్ పౌడర్, దుప్పట్లు అందజేశారు. సీహెచ్‌సీ పర్యవేక్షకురాలు డాక్టర్ చంద్రశేఖర్, కౌన్సిలర్ చెంచమ్మ, ఎల్‌టీ సోమశేఖర్, స్టెప్స్ మేనేజరు కళావాణి, భువనేశ్వరి, అరుణలత, అరుల్ ఉన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు

నగరి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ కార్యాలయం తిరుపతి పరిధిలోని నగరి శాఖలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రజలకు బ్యాంకు ద్వారా సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నట్లు బ్యాంకు మేనేజరు జయమాధురి తెలిపారు. వైద్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లను పరీక్షిస్తున్న వైద్యుడు

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) CHITTOOR.
E.P.No. 19 of 2024
O.S.No. 333 of 2007
Between:
Smt. V. Rathna Kumari rep by her G.P.A. Holder V.Yugandhar ....Decree Holder
And:
B.K. Vijay Kumar (died) by his L.Rs and another ..Judgment debtors
SALE NOTICE TO JUDGEMENT DEBTORS. No. 4 to 6
To
R4. B.V. Vamseekrishna, S/o late. B.K. Vijaya Kumar,
R5. K.B.V. Swetha, D/o late. B.K.Vijaya Kumar,
R6. B.V. Muralikrishna, S/o late. B.K. Vijaya Kumar,
All are residents of Gunthur Village, G.K.V.Vandla Vooru post, Bangarupalyam Mandal, Chittoor District.
Sir/Madam,
Please take notice that the above named petitioner filed the above petition against B.K.Vijaya Kumar and yourself, you all being legal representatives of B.K.Vijaya Kumar, for sale of your immovable properties. This is the sale notice for your appearance and filing of objections if any. The above matter is posted to 30-12-2025 for your appearance and for objections if any. Please take notice and be present on the said date before the said Hon'ble court by 10-30 A.M., to raise objections, if any, either in person or through any counsel. If failed to do so, the matter will be decided ex-parte in your absence.
D.RAJENDRA REDDY
Advocate for D.Hr

నీటి సంపులో పడి వృద్ధుడి మృతి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి సంపులో పడటంతో మృతి చెందిన ఘటన చిత్తూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నగరపాలక పరిధిలోని వడ్డారపల్లెకు చెందిన మునిరత్నం (65) సోమవారం రాత్రి మద్యం తాగి సంపులో పడిపోయారు. ఉదయం మృతదేహం తేలడంతో గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పక్కన మద్యం సీసాలు ఉండటంతో ఎక్కువగా తాగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఎస్బీఐలో చోరీకి యత్నం

విజయపురం, న్యూస్‌టుడే: మండలంలోని పన్నూరు ఎస్బీఐ శాఖలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి ప్రయత్నించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌బాబు తెలిపారు. బ్యాంకులో నుంచి ఏమీ ఎత్తుకెళ్లలేదని చెప్పారు.

మూడు మండలాలు తిరుపతిలో కలపాలి

పుత్తూరు, నగరి, పూతలపట్టు, న్యూస్‌టుడే: నగరి నియోజకవర్గంలోని నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.విజయబాబు వినతిపత్రం ఇచ్చారు. వైకాపా నిర్వాకంతో జిల్లా విభజన అస్తవ్యస్తంగా జరిగిందన్నారు. నగరిలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోదండయ్య, నాయకులు డిమాండ్ చేశారు.

కొలువుదీరిన కార్యవర్గం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరులో ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం జీజే చంద్ర అధ్యక్షతన జరిగింది. నూతన కమిటీని ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా పీపీ చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్- ఎస్వీ రావు, సంయుక్త కార్యదర్శి- రమేష్, ప్రచార కార్యదర్శి- శంకర్‌అయ్యప్ప, కోశాధికారి- జీవకుమార్, కన్వీనర్లు- రజని, దేవికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మురుగమ్మ, జిల్లా అధ్యక్షుడు జీఆర్ చంద్ర, కార్యదర్శులు మస్తాన్, సతీష్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

విద్యార్థినులకు బహుమతులు ఇస్తున్న ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు

ప్రతిభతో బహుమతులు సొంతం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓఎల్ఎల్ పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. 'విద్యార్థులపై చరవాణి ప్రభావం' అనే అంశంపై 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉపన్యాసాలు ఇచ్చారు. 9, 8వ తరగతుల విద్యార్థినులు బుష్రా, సంధ్య, భవ్యశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి హెచ్ఎం ఇన్నమ్మ, ఉపాధ్యాయులు బహుమతులు పంపిణీ చేశారు.

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శివాలయం ఆస్తులను దేవాదాయశాఖ అధికారులు వేలం వేశారు. మంగళవారం ఆలయానికి చెందిన 467 సర్వే నంబరులో ఉన్న 16 సెంట్ల ఖాళీ స్థలం 11 ఏళ్లకు, మూడు దుకాణాలను 3 ఏళ్లకు వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.8.80 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. దేవాదాయశాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ పర్యవేక్షణలో వేలంపాట సాగింది.

ఆదాయం రూ.8.80 లక్షలు

వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఇలా వెళ్తే రోడ్డు పాడవదా?

గ్రామీణ రోడ్లు ధ్వంసమైతే ఏళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకోవు. కానీ విద్యుత్తు సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా మంగళవారం కమ్మనపల్లె వద్ద రోడ్డుపై స్తంభాలను ట్రాక్టరుతో ఈడ్చుకెళ్తున్నారు. ఈ పనికి క్రేన్ ఉపయోగించాలి. కానీ ఇలా చేస్తుండటంతో రోడ్డు దెబ్బతింటోందని, ఎవరు బాగు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

అసంపూర్తి భవనం.. తుప్పల నిలయం

పెద్దపంజాణి మండలంలోని కొళత్తూరులో గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. వైకాపా ప్రభుత్వ పాలనలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలేదు. భవనం చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. అధికారులు పనులు పూర్తిచేయించి ప్రజలకు సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దపంజాణి

ఆదమరిస్తే అంతే సంగతి..!

శాంతిపురం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట జాతీయ రహదారిపై గుంతలు ప్రమాదభరితంగా మారాయి. మండల సచివాలయం, ఆసుపత్రి ఎదుట నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై వర్షం నీరు నిల్వ చేరడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శాంతిపురం

మురుగు కదలదు.. దోమలు వదలవు

పెద్దపంజాణిలో జాతీయ రహదారి (చెన్నై-ముంబయి) పక్కన మురుగు కాలువలు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రహదారి విస్తరణలో భాగంగా కొంతమేరకు పనులు చేసి గుత్తేదారు నిలిపేశారు. తర్వాత పనులు చేయకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దపంజాణి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

? పలమనేరు పట్టణంలోని ముత్యాచ్చారిపాళ్యంలో కాలువల్లోని పూడిక తీసి రోడ్డుమీదే పడేశారు. దీంతో వీధిలో దుర్వాసన ఎక్కువైంది. దోమలు పెరిగిపోయాయి. - **వినోద్** ✓ సిబ్బందిని పంపించి చెత్త తొలగిస్తాం.

- ఎస్వీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్

– న్యూస్‌టుడే, పలమనేరు

? పుంగనూరు మండలంలోని మంగళం గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. **- రాజా** ✓ కాలువలను శుభ్రం చేసి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- మహేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి** – పుంగనూరు గ్రామీణ

తాగునీటి గొట్టాలు బాగు

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మొరుంపల్లెలో మంచినీటి సరఫరా చేసే గొట్టాలను బాగు చేసి లీకులు అరికట్టినట్లు కార్యదర్శి సురేంద్రరెడ్డి తెలిపారు. మిట్ట చింతవారిపల్లెలె కార్యదర్శి నరసింహులు మురుగు కాలువలను శుభ్రం చేయించారు. గత నెల 28, 30న మేమున్నాం.. మీకు తోడుగాలో వెలువడిన కథనాలకు స్పందించిన సిబ్బంది సమస్యలను పరిష్కరించారు.

స్పందనకు వందనం

సూరప్ప వీధిలో పారిశుద్ధ్య పనులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని సూరప్ప వీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పనికిరాని మొక్కలను తొలగించారు. వీధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో ఈనాడులో మంగళవారం ప్రచురించిన సమస్యకు అధికారులు స్పందించారు.

పంచాయతీలను స్వచ్ఛంగా మారుద్దాం

కుప్పం గ్రామీణం, శాంతిపురం న్యూస్‌టుడే: పంచాయతీలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లానూరు పంచాయతీ కేంద్రంలో మంగళవారం 19 చెత్త సేకరణ ఆటోలను పంపిణీ చేశారు. అనంతరం పలువురికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్.మునిరత్నం, తితిదే బోర్డు సభ్యులు శాంతారాం తదితరులు పాల్గొన్నారు. ❖ యానాదిపురంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్సీ శ్రీకాంత్ భూమి పూజచేసి ప్రారంభించారు.

పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్ తదితరులు

కౌశలం పరీక్షలకు సర్వర్ ఇబ్బందులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పించడానికి కూటమి ప్రభుత్వం కౌశలం పరీక్షలు నిర్వహించింది. మండలంలో మంగళవారం ప్రారంభమైన ఈ పరీక్షలకు సర్వర్ కష్టాలతో అభ్యర్థులు అవస్థలు పడ్డారు. ఈ నెల ఆరు వరకు జరిగే పరీక్షలకు సంబంధించి తొలిరోజు ఒక్కో సచివాలయంలో ఇద్దరు చొప్పున 28 మంది రాయాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే రాశారు. ఆరుగురు రీషెడ్యూల్ పెట్టుకున్నారు. అయిదుగురు సాంకేతిక సమస్యలతో రాయలేకపోయినట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. సర్వర్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అన్నదాత కష్టం.. తుపానుతో నష్టం

పుంగనూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో నాలుగు రోజులుగా పడమటి నియోజకవర్గాల్లో వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. చిరు జల్లుల నుంచి అక్కడక్కడ మోస్తరు వర్షంతో పాటు ఈదురుగాలులు వీస్తుండటంతో టమాట, పచ్చిమిరప, అనప, కొత్తిమీర, కాలిఫ్లవర్‌తో పాటు చేమంతి, బంతి పూల తోటలు మగ్గిపోతున్నాయి. భూమిలో తేమశాతం పెరగడంతో పాటు ఎండ లేకపోవడంతో చీడపీడలు అధికమై పంటలు దెబ్బతింటున్నాయి. అప్పులు చేసి పంటలు సాగుచేశామని తుపాను కారణంగా చేతికి వచ్చిన సాగు నీటిమయం అవుతోందని రైతులు వాపోతున్నారు.

పుంగనూరు- తిరుపతి రోడ్డులో మగ్గిన టమాట తోట

పరిస్థితి ఇలా..

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో రైతులు చెరువులు, కుంటలు, బోర్ల ఆధారంగా వరి, కూరగాయలు, పూలతోటలు సాగు చేశారు. వరి ప్రస్తుతం కోత దశలో ఉంది. ఈ దశలో తుపాను రావడంతో వాటిని నూర్పిడి చేయడం, ఆరబెట్టడం కష్టతరం. అంతేగాకుండా కూలీల సంఖ్య పెరుగుతోంది. చామంతి, బంతి వంటి పూల తోటల్లో పూలు కుళ్లిపోతున్నాయి.

మూడు రోజులుగా నిలకడ లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతులు పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. పొలాల్లో పడిపోయిన టమాట, చిక్కుడు, అనప, అలసంద తీగలను నిలబెట్టడం, సాళ్లలో నిలిచిన నీటిని తీసేయడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

దెబ్బతింటోన్న నాణ్యత

ఈ నియోజకవర్గాల్లో 10 వేల ఎకరాల్లో పూత దశలో ఉన్న కూరగాయల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 5 వేల ఎకరాల్లో పూలతోటలు, రెండువేల ఎకరాల్లో ఉన్న ఆకుకూరల తోటలనూ ఈ వర్షాలు నష్టపరుస్తున్నాయి. టమాట కాయలు రాలిపోవడం, వైరస్ వ్యాప్తి చెందడంతో పాటు దిగుబడులు తగ్గి నాణ్యత తగ్గుతోంది.

పొలాల్లోనే నిల్వలు

రైతులు తుపానుకు భయపడి ఒక్కసారిగా కోత కోయించి పొలాల్లోనే ధాన్యం నిల్వ చేశారు. ప్రభుత్వం అందిస్తామన్న టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యాన్ని రహదారులపై, పొలాల్లో ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకుంది. రైతుల కోసం ఎన్ఆర్ఈజీఎస్ అమలు చేసిన కొటార్ల నిర్మాణం తిరిగి అమలుచేస్తే ప్రయోజనం చేకూరుతుందని రైతులు వాపోతున్నారు.

రూ.3 లక్షలతో భూగర్భ కాలువ నిర్మాణం

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సుగాలిమిట్ట పంచాయతీ చినతండా గ్రామంలో భూగర్భ మురుగు కాలువ నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచి డి.దేవమ్మ తెలిపారు. మండల నిధులు రూ.3 లక్షలతో మురుగు నీటిని తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రైతు సంక్షేమం.. ప్రభుత్వ ధ్యేయం

కుప్పం గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అగముడి మొదలియార్ డైరెక్టర్ మణి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెక్కునత్తం గ్రామంలో మంగళవారం 'రైతన్నా-మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అందిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కనకరాజ్, కడ అభివృద్ధి సలహా మండలి సభ్యులు రామచంద్రన్, చెక్కునత్తం పంచాయతీ తెదేపా అధ్యక్షుడు బీరప్ప, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న రాష్ట్ర అగముడి మొదలియార్ డైరెక్టర్ మణి

అబ్బురపరచిన అష్టావధానం

పుంగనూరు గ్రామీణం, చౌడేపల్లి, న్యూస్‌టుడే: గణితంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు తిరుపతికి చెందిన అష్టావధాని హసనపురం శివప్రసాద్‌రావు అవలీలగా సమాధానాలు చెప్పారు. మంగళవారం పట్టణంలో 'గణిత అష్టావధానం' నిర్వహించారు. అక్కడికి వచ్చిన వారు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో జవాబులిచ్చారు. హెచ్ఎం రుద్రాణి, అవధానులు అరుణ, శివప్రసాద్, ప్రభాకర్‌రావు, వెంకటపతి, రామలింగయ్య పాల్గొన్నారు. ❖ పిల్లల్లో గణితంపై భయం పోగెట్టేందుకు అష్టావధానం ఉపయోగపడుతుందని శివప్రసాద్‌రావు అన్నారు. కాటిపేరి ఉన్నత పాఠశాలలో అష్టావధానం చేశారు. హెచ్ఎం అశ్వర్థనారాయణ, విశ్రాంత దూరదర్శన్ అధికారి నారాయణ, ఉపాధ్యాయులు సత్కరించారు.

ప్రశ్నకు సమాధానమిస్తున్న అష్టావధాని

మామిడి గుజ్జు పరిశ్రమలు రూ.8 ఇవ్వాల్సిందే

పూతలపట్టు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రకటించిన మామిడి ధర ప్రకారం గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.8 చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. స్థానిక భీమేశ్వర ఆలయంలో మంగళవారం స్వామివారి వద్ద ఉంచాలని అర్చకుడికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మామిడి కాయలకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.8 ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఈ పరిశ్రమలపై ప్రభుత్వం పట్టుసాధించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెలాఖరున కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్న నేపథ్యంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి

రామకుప్పం, న్యూస్‌టుడే: గ్రామాలాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు పీకెఎం హుడా ఛైర్మన్ డా.సురేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం రామకుప్పంలో రూ.75 లక్షల విలువైన 22 ఈ- ఆటోలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో చెత్త సేకరణకు ఈ ఆటోలను వినియోగించనున్నట్లు చెప్పారు. గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, తెదేపా మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నాయకులు చలపతి, చిన్నికృష్ణ, సీతాపతి, రామమూర్తి, అవినాశ్‌రెడ్డి, మురళి, శంకర్‌చలం తదితరులు పాల్గొన్నారు.

రాయితీ సైకిళ్లకు దరఖాస్తు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెడల్ ఆధ్వర్యంలో రాయితీపై ఈ-సైకిల్ కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకోవాలని కడా అధికారులు కోరారు. రూ.34,999 విలువైన ఈ-సైకిల్ రూ.23,999కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు మాత్రమే ఈ అవకాశం ఉన్నట్లు అధికారులు తెలియజేశారు.

అందుబాటులో వైద్య సేవలు

కుప్పం, న్యూస్‌టుడే: కుప్పం ప్రాంత ప్రజలకు అన్ని విధాలా మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వ సహకారంతో చర్యలు చేపడుతున్నట్లు పీఈఎస్ విద్యాసంస్థల ఛైర్మన్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి పేర్కొన్నారు. మంగళవారం పీఈఎస్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సంజీవని, టాటా డీఐఎన్‌సీ ద్వారా అధునాతన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్, డాక్టర్ ఎన్‌కే సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ కృష్ణారావు, ప్రభుత్వాసుపత్రి ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం... భయానకం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు ఇళ్లకు పరిమితం కాకుండా ప్రభుత్వం వసతి గృహాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కానీ అక్కడ సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్ల క్రితం నిర్మించిన రెండు వసతి గృహాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. ప్రహరీలు కూలిపోయాయి. వర్షం పడితే గదుల్లోకి నీరు చేరుతోంది. కుప్పం పట్టణంలోని మునస్వామిపురంలో బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో సమస్యలు ఏర్పడుతున్నాయి.

బీసీ బాలుర గురుకులంలో కూలిన ప్రహరీ

భవనం ఖాళీ చేసి..

బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. పెచ్చులు పడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాన్ని తనిఖీ చేసిన కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశాలతో పక్కనున్న ఎస్సీ బాలుర వసతి గృహానికి వారిని మార్చేశారు. అక్కడ ప్రహరీ కూలిపోయింది. ప్రస్తుతం ఎస్సీ బాలుర వసతి గృహంలోని 5 గదుల్లో 68 మంది అవస్థలు పడుతూ ఉంటున్నారు. ఈ భవనం కిటికీలు సైతం సక్రమంగా లేవు.

నెరవేరని నాటి హామీ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పం పర్యటనకు వచ్చిన కలెక్టర్ వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులతో నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ హామీ నెరవేరక పోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. నూతన భవన నిర్మాణం కోసం వసతి గృహం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

చెరువు మొరవ ధ్వంసం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: బంగారుపాల్యం మండలం ఎగువ ఎద్దులవారిపల్లె సమీపంలో కొమిటిరెడ్డి చెరువు మొరవను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆయకట్టు రైతులు తెలిపారు. చెరువు నుంచి నీరు వృథాగా పోతోందన్నారు. చెరువులోని నీరుతో సమీపంలో 40 ఎకరాల పరిధిలోని వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్ట ఆశాజనంగా ఉంటుందని తెలిపారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా రూ.10లక్షలతో చెరువు కట్ట, మొరవను పటిష్ఠ పరిచారని వివరించారు. కలెక్టరు సుమిత్ కుమార్ అప్పట్లో పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని రైతులు తెలిపారు. పాడు చేసిన మొరవను అధికారులు పరిశీలించి, చెరువు నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరారు.

హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దృష్టికి సమస్యలు

పుంగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కల్యాణ శ్రీనివాస్‌ను మంగళవారం విజయవాడలోని కేంద్ర కార్యాలయంలో పుంగనూరు జేఎస్పీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్నారాయల్, పీఏసీఎస్ ఛైర్మన్ పగడాల రమణ, సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

చిన్నారి సర్జరీకి రూ.5 లక్షలు

పుత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన చిన్నారి మేధశ్విని అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. బ్రెయిన్ ట్యూమర్ అని డాక్టర్లు నిర్ధారించారు. శస్త్రచికిత్స చేయాలని చెప్పడంతో బాలిక తల్లిదండ్రులు సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌ను కలిశారు. ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా 24 గంటల్లో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత పత్రాన్ని వారికి ఎమ్మెల్యే అందజేశారు.

27న విద్యుత్తు ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: ఓసీ విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమ సంఘం 2026 సంవత్సర డైరీని ఈనెల 27న కాకినాడలో ఆవిష్కరిస్తామని సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని, ఉద్యోగులు అందరూ హాజరుకావాలని కోరారు.

నీటి సంపులో పడి వృద్ధుడి మృతి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి సంపులో పడటంతో మృతి చెందిన ఘటన చిత్తూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నగరపాలిక పరిధిలోని వడ్డారపల్లెకు చెందిన మునిరత్నం (65) సోమవారం రాత్రి మద్యం తాగి సంపులో పడిపోయారు. ఉదయం మృతదేహం తేలడంతో గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పక్కన మద్యం సీసాలు ఉండటంతో ఎక్కువగా తాగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

సూచనలు ఇస్తున్న వైద్యులు

గడ్డూరులో వైద్య శిబిరం

పలమనేరు, న్యూస్‌టుడే: మున్సిపల్ పరిధిలోని గడ్డూరు గ్రామంలో దంత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రజలకు దంతాలకు సంబంధించిన ఆరోగ్య సూత్రాలను, బ్రెస్ చేయడంలో మెలకువలు నేర్పించారు. పట్టణానికి చెందిన ప్రైవేటు వైద్యులు భరత్‌కుమార్, భార్గవి శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు.

గుట్టక్కు! అడ్డంగా తవ్వేస్తున్నా పట్టించుకోని అధికారులు

నిఘా

పుంగనూరు, పలమనేరు, న్యూస్‌టుడే: సహజ వనరుల్ని కొందరు అక్రమార్కులు ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. వన్యప్రాణులకు ఆసరాగా నిలిచే కొండలు, గుట్టల్ని తవ్వేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఎక్కువ విస్తీర్ణంలో కొండలు, గుట్టలు ఉన్నాయి. రెండు నెలల కిందటి వరకు చెరువులు, కుంటల్లో గ్రావెల్ తరలించేవారు. గత నెలలో వర్షాలు కురవడంతో 80 శాతం చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరాయి. దీంతో మట్టి తవ్వకాలకు ఆస్కారం లేదు. దీంతో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది. క్షేత్రస్థాయిలో నిఘా నిద్రావస్థలో జోగుతుండగా అధికారుల పర్యవేక్షణ కొరవడింది.

చౌడేపల్లె - సోమల మార్గంలో తవ్విన అంకాలమ్మ గుట్ట

నిబంధనలకు విరుద్ధంగా..

ఇటీవల వ్యవసాయ పొలాల్లో లే ఔట్లు అధికంగా వేస్తున్నారు. వీటిని చదును చేయడానికి, ఎత్తు పెంచి కొనుగోలుదారులను ఆకర్షించడానికి కొండలు, గుట్టల్లోని మట్టిని యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. వాస్తవంగా వాణిజ్య, నిర్మాణ రంగం, అభివృద్ధి పనుల అవసరాలకు మట్టి తరలించాలంటే నిర్ణీత రుసుము చెల్లించాలి. ఈ నియోజకవర్గాల్లో చూస్తే అనధికారిక తవ్వకాలు ఎక్కువగా సాగుతున్నాయి. కొన్నిసార్లు అధికారికంగా అనుమతి పొందినా రెట్టింపుగా తరలిస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో బరి తెగించి యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ మట్టిని తరలిస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లోనూ..

మట్టి, ఇసుక, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు అవసరం. ఎర్ర మట్టి, గ్రావెల్‌కు ఎక్కువ డిమాండు ఉండటంతో జేసీబీలు, పొక్లెయిన్లతో గుట్టల్లో 15 నుంచి 20 అడుగుల లోతు తవ్వేస్తున్నారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట, ఈడిగపల్లె; చౌడేపల్లె అడ్డగుట్ట, అంకాలమ్మ కొండ, మనుకూరు గుట్ట, పలమనేరు నియోజకవర్గంలో పెద్దపంజాణి, గంగవరం మండలాల పరిధిలో ప్రభుత్వ భూముల్లో, కుప్పం నియోజకవర్గంలో తుమ్మిశి, మరసనపల్లె, శెట్టిపల్లె, తప్పలనత్తం, పాతపేట చెరువుల్లో మట్టి తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో విచారిస్తాం

ఇప్పటి వరకు విషయాలు నా దృష్టికి రాలేదు. పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ భూముల్లో, కొండలు, గుట్టల్లో మట్టి తవ్వకాలపై ఆరా తీస్తాం. అక్రమంగా తవ్వినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటాం.

- భవాని, ఆర్డీవో, పలమనేరు

గంజాయి విక్రేతల అరెస్టు

పలమనేరు, పెదపంజాని, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న వారిని పెద్దపంజాణి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. శంకర్రాయలపేట గ్రామానికి చెందిన షేక్‌మస్తాన్, పుంగనూరుకు చెందిన శ్యామలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.31,500 ఉంటుందని డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. వారు విజయవాడ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. గ్రామీణ ఇన్‌స్పెక్టర్ పరశురాముడు ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్నట్లు ఆయన తెలియజేశారు.

బాలిక అదృశ్యంపై కేసు

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన 17 ఏళ్ల బాలిక రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణ తెలిపారు.

ఓపీకే పరిమితం.. సేవలు చేయలేం

✦ పీహెచ్‌సీల్లో అంతంతమాత్రంగా వైద్యం

పలమనేరు, పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం సూచిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం సరైన ఫలితాలు కనిపించడం లేదు. రాత్రి వేళల్లో వైద్యులు విధుల్లో ఉండటం లేదు. పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున వైద్యులను కేటాయించినా ఒకరు 104 సేవలకు వెళ్తున్నారు. ఇంకొక్కరే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

చౌడేపల్లె పీహెచ్‌సీ భవనం

12మందికి ఏడుగురు..

పలమనేరు నియోజకవర్గంలో 6 పీహెచ్‌సీలు, 2 అర్బన్ పీహెచ్‌సీలున్నాయి. 16 వైద్యుల పోస్టులకు గాను 13 మంది ఉన్నారు. మరో మూడు పోస్టులు ఖాళీ. స్టాఫ్ నర్సులు 12 మందికి ఏడుగురే సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు సరైన వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం లేదు. ప్రసవాలు చేయడం తగ్గించారు. ఆక్సిజన్ సిలిండర్లు లేవు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

అందుబాటులో ఒక్కడే..

పుంగనూరు నియోజకవర్గంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల మండలాల్లో 11 పీహెచ్‌సీలున్నాయి. కొన్ని చోట్ల ఒక్క వైద్యుడే సేవలు అందిస్తున్నారు. కల్లూరు, పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీల్లో స్టాఫ్ నర్సులు లేరు. జ్వరాలతో వచ్చే వారికి అంతంతమాత్రంగానే పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రాలున్నా సేవలపై పర్యవేక్షణ లేక ఆశయం నీరుగారుతోంది.

(c) eenadu

క్రిస్మస్ వెలుగులు



తాళ్లరేవు మండలం కొత్త కోరింగలో క్రిస్మస్ సందడి నెలకొంది. ఇక్కడి జాతీయ రహదారి చెంతన పెద్ద క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేశారు. కాకినాడ- అమలాపురం మార్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు చరవాణిలో ఫొటోలు తీసుకుంటున్నారు.

-న్యూస్‌టుడే, తాళ్లరేవు

మెదళ్లు.. ఆలోచన మొలకలు

విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థుల ఆలోచన పరిధి, సృజనాత్మకత పెంచడానికి ఏటా నిర్వహించే ప్రాంతీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు మంగళవారం యానాంలోని పీఎంశ్రీ రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి డాక్టర్ రవి శంకర్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.రత్నప్రభ ప్రారంభించారు. యానాంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు 177 అంశాలను ప్రదర్శించారు. వీటిలో ఉత్తమమైన 16 ప్రాజెక్టులను పుదుచ్చేరిలో నిర్వహించే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నట్లు సమగ్ర శిక్షా అధికారి కమిడి ప్రభాకరరావు తెలిపారు.

-న్యూస్‌టుడే, యానాం

స్వచ్ఛత ఒడిలో బడి

స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయకు 8 ఎంపిక

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

పాఠశాలల్లో స్వచ్ఛత, హరిత శోభ సంతరించుకోవాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ పేరిట అన్ని యాజమాన్య బడులకు రేటింగ్ ఇస్తోంది. క్షేత్ర స్థాయిలో పాఠశాలల స్థితిగతులను స్వీయ మదింపు ద్వారా తెలుసుకొని ప్రోత్సాహక నిధులు, పురస్కారాలు అందజేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల వారీగా రేటింగ్(స్టార్)లను ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో ఆయా పాఠశాలలను సందర్శించిన ప్రత్యేక బృందాలు గత నెల 30న రాష్ట్ర స్థాయికి ఎనిమిది బడులను ఎంపిక చేశాయి.

జిల్లాలో ఇలా..
- పాఠశాలలు: 2,035
- విద్యార్థులు: 1,96,520 మంది
- జూనియర్ కళాశాలలు: 45
- విద్యార్థులు: 25 వేల మంది

రాష్ట్ర స్థాయికి ఎంపికైన అల్లవరం మండలం కొమరగిరిపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల

ఈ అంశాల్లో..

- పాఠశాలల్లో పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణం, పారిశుద్ధ్య నిర్వహణ, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి వసతి, పరిశుభ్రత వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటారు. ఆయా పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో ఫొటోలతో కూడిన వివరాల నమోదుకు స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ కార్యక్రమం కింద దరఖాస్తులను ఆహ్వానించారు.
- అధికారుల బృందం జిల్లాలో 15 పాఠశాలలను సందర్శించి వాటిలో ఎనిమిదింటిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసింది.

త్వరలో ప్రశంసా పత్రాలు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలకు త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించేందుకు సమగ్ర శిక్ష అధికారులు సమాయత్తమవుతున్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రధాని చేతుల మీదుగా పురస్కారం దక్కుతుంది.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాలలకు సంబంధించి ఫొటోలు ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించాం. జాతీయస్థాయికి నామినేట్ అయితే ప్రత్యేక బృందం వచ్చి పరిశీలించాక మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మొదటి 20 స్థానాల్లో నిలిచిన వాటికి రూ.లక్ష అవార్డు వస్తుంది.

-సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్షా అధికారి

మొదటి విభాగంలో.. (మార్కులు శాతంలో..)

పాఠశాల	మార్కులు
ఎంపీపీఎస్ మడికి	93.33
ఎంపీపీఎస్ బట్టేలంక	91.67
ఎంపీపీఎస్ చెయ్యేరు	92.50
సర్ సీవీరామన్(అమలాపురం)	96.67
రెండో కేటగిరీలో..	
జడ్పీహెచ్ఎస్ కొమరగిరిపట్నం	90.40
జడ్పీహెచ్ఎస్ రాయవరం	93.60
జూనియర్ కళాశాలల్లో..	
జీజేసీ మండపేట	94.40
ఎస్‌వీజేసీ రామచంద్రపురం	94.40

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాను కొబ్బరి, అరటి ఫైబర్ ముడి సరకు ఆధారిత పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల ప్రోత్సాహక, ఎగుమతులు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెంలో అరటి ఫైబర్, ద్రాక్షారామంలో పప్పు దినుసులు, ఉప్పలగుప్తంలో క్వాయర్ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జేసీ నిశాంతి, పరిశ్రమల మేనేజర్ అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి
మంచితనానికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచిన నిస్వార్థ ప్రజా సేవకుడు, మాకు అత్యంత ఆత్మీయులు
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి
మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకురాలని భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్
CHVVSS చౌదరి
ప్రెసిడెంట్
సత్తి సత్తిరెడ్డి (చిన్నబాబు)
కార్యదర్శి
వైట్ల కనకదుర్గారావు
స్టేట్ జాయింట్ సెక్రటరి
ది ఆలమూరు తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్
ముత్యాల సత్యనారాయణ (చంటిబాబు), ప్రెసిడెంట్
సత్తి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి
కంచర్ల చినభద్రరావు, కోశాధికారి
పేపర్తి వీరభద్రరావు, ఉపాధ్యక్షులు
వల్లూరి శ్రీనారాయణ ప్రసాద్‌చౌదరి
జాయింట్ సెక్రటరి

బస్తా రూ.1400 లోపే..!

వచ్చిన కాడికి అమ్ముకుంటున్న రైతులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

దిత్వా తుపాను ప్రభావంతో మూడు రోజులుగా పట్టిన ముసురు వీడలేదు. దీంతో వచ్చిన కాడికి రైతులు ధాన్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో 1.69 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేపట్టగా.. ఇప్పటికి 1.10 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా 50 వేల ఎకరాల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. పనలపై ఉన్న పంట వర్షం కారణంగా నీటమునిగింది. భారీ వర్షం పడటంతో వరికోత యంత్రాలతో మాసూళ్లు చేసే పరిస్థితి లేక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కల్లాల్లోని ధాన్యం అయినకాడికి అమ్ముకుంటున్నారు. వరికోత యంత్రాలతో మాసూలు చేసిన ధాన్యం ఆరబెట్టే పరిస్థితి లేకపోవడంతో వెంటనే దళారులకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు బస్తాకు రూ.1777 (కామన్), రూ.1792 (ఎ-గ్రేడ్) మద్దతు ధర ఇస్తుండగా.. 17 శాతం తేమ నిబంధన ప్రకారం ధాన్యం ఆరుదలకు రావాలంటే ప్రస్తుతం అయ్యే పరిస్థితి లేదు. దీంతో బస్తా రూ.1300-1400కు దళారులకు విక్రయిస్తున్నారు. ఇటీవల మొంథా తుపాను ముంచేయడంతో జిల్లాలో 73వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లగా.. మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకునే క్రమంలో ప్రస్తుతం దిత్వా తుపాను రైతులను ముందుకు వెళ్లనీయడం లేదు.

ధాన్యం రాశులను బయటకు తరలిస్తున్న రైతులు

విభిన్న ప్రతిభకు పథకాల తోడు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ముమ్మిడివరం భవిత కేంద్రంలో చిన్నారులు

అవయవలోపాలను అధిగమించి ఎంతో మంది విభిన్న ప్రతిభావంతులు ప్రతిభ కనబర్చి సత్తాచాటుతున్నారు. వీరికి రాజ్యాంగం ప్రత్యేక హక్కులను కల్పించగా.. ప్రభుత్వం వివిధ పథకాలతో చేయూతనందిస్తూ ముందుకు నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కథనం.

జిల్లాలో పరిస్థితి..
- విభిన్న ప్రతిభావంతులు: 34వేల మంది
- భవిత కేంద్రాల్లో పిల్లలు: 489 మంది
- పాఠశాలల్లో చదువుతున్నవారు: 3018 మంది

ఆటిజం కేంద్రాలు కేంద్ర ప్రభుత్వం దేశంలో మొట్టమొదటి సారిగా ఆటిజం కేంద్రాలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. రాష్ట్రానికి 125 ఆటిజం కేంద్రాలు మంజూరు చేశారు. అందులో అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట ఉన్నాయి.

కూటమి ప్రభుత్వంలో..

గతంలో రూ.3 వేలు ఉండే దివ్యాంగుల పింఛనును కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.6 వేలకు పెంచారు. ఉపాధి కల్పనలో భాగంగా నియోజకవర్గానికి 10 మందికి చొప్పున రూ.1.10 లక్షలు విలువ చేసే బ్యాటరీ ద్విచక్ర వాహనాలు అందించారు.

ఆగండి.. సౌకర్యాలు పొందండి

టోల్ ప్లాజాల్లో సదుపాయాలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాల్లో వాహనదారుల నుంచి రుసుం వసూలు చేయడమే కాదు.. కొన్ని సేవలూ అందించాలి. వీటి గురించి చాలా మందికి అవగాహన లేక వినియోగించుకోవడం లేదు. దీంతో కొన్ని చోట్ల వీటి గురించి టోల్‌ప్లాజా నిర్వాహకులు సైతం పట్టించుకోవడం లేదు. ఇక్కడి అందే సేవల వివరాలు ఇవీ..

ముమ్మిడివరం నియోజకవర్గం అన్నంపల్లిలో టోల్‌గేట్

ప్రమాదం జరిగితే..

జాతీయ రహదారులపై ప్రతి 2 నుంచి 3 కి.మీ. దూరంలో రోడ్డు పక్కన స్తంభాలు ఉంటాయి. ఈ స్తంభాలకు ఎస్‌వోఎస్ పెట్టెలు ఏర్పాటు చేశారు. తక్షణ సాయం అవసరమైనప్పుడు ఈ పెట్టెపై ఉండే బటన్ నొక్కి మనం ఉండే ప్రదేశం గురించి చెబితే వెంటనే టోల్ సిబ్బంది అక్కడికి చేరుకుని సాయం అందేలా చూస్తారు.

1033తో తక్షణ సాయం..

టోల్ రోడ్డులో అకస్మాత్తుగా వాహనం ఆగితే వాహనాన్ని లాగడం కోసం ఎక్కడి నుంచో ఎవరినో పిలవాల్సిన అవసరం లేకుండా 1033 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తక్షణ సాయం పొందొచ్చు. పెట్రోల్, డీజిల్ అయిపోయినా ఈ నెంబరు ద్వారా సాయం అందిస్తారు. పోలీసుల సేవలు కావాలనుకుంటే 112 నంబరును సంప్రదించాలి.

జిల్లాలో ఇలా...
- ముమ్మిడివరం మండలం: అన్నంపల్లి
- రావులపాలెం మండలం: ఈతకోట
- జిల్లాలోని టోల్‌గేట్ల నుంచి వెళ్లే వాహనాల సంఖ్య: 40,000 - 50,000

పార్కింగ్.. విశ్రాంతి

వాహనాల పార్కింగ్, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు టోల్ వద్ద ఏర్పాట్లు ఉంటాయి. వీటిని వినియోగించుకునేందుకు ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. పెట్రోలు, డీజిల్ బంకులు, వాహన మరమ్మతుల దుకాణాలు టోల్‌కు సమీపంలో ఉంటాయి. నగదు జమ, ఉపసంహరణ చేసుకునేందుకు వీలుగా ఏటీఎం యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

రాజ్‌మార్గ్ యాప్‌తో రివార్డులు..

జాతీయ రహదారులపై వెళ్లే సమయాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యాలను జాతీయ రహదారుల సంస్థ కల్పించాలి. ఇవి అపరిశుభ్రంగా ఉంటే వాటిని ఫొటో తీసి రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డులు పొందే అవకాశం కల్పిస్తున్నారు.

ఐఐఎఫ్‌టీకి ప్రభుత్వం దన్ను

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.57.10 కోట్ల విడుదలకు సమ్మతి

కోనపాపపేటలో నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవనాలు

ఈనాడు, కాకినాడ

భారత విదేశీ వాణిజ్య సంస్థ (ఐఐఎఫ్‌టీ)కు కాకినాడ జిల్లాలో సొంత క్యాంపస్ త్వరలోనే అందుబాటులోకి రాబోతుంది. ఈ ప్రాజెక్టు వ్యయంలో పరిశ్రమల వాటా ధనం 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి ముందుకు వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐఐఎఫ్‌టీ మంజూరు చేయించింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొనపాపపేటలోని 25 ఎకరాలను దీనికి కేటాయించారు. సుమారు రూ.229.11 కోట్ల అంచనా వ్యయంతో 2018లో నిర్మాణం మొదలు పెట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు మందగించాయి. ఈ ఏడాది విడుదల చేయాల్సిన రూ.57.10 కోట్లపై ఐఐఎఫ్‌టీ, కాకినాడ కేంద్ర విభాగాధిపతి లేఖ రాయగా.. అందుకు ఆర్థికశాఖ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ప్రస్తుతం జేఎన్‌టీయూకే తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది సొంతగూటిలోకి మారనుంది.

అర్జీలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

అమలాపురం కలెక్టరేట్: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లాలో గత నెల 26న పర్యటించిన సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులకు చూపే పరిష్కార మార్గాలపై నివేదిక ఇవ్వాలని జేసీ నిశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు 46 వినతులు అందాయని, వాటికి ఉన్నతాధికారులతో సమీక్షించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. డీఆర్వో కె.మాధవి, ఎల్‌డీఎం వర్మ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నిర్లక్ష్యమే నిండుప్రాణం తీసింది

చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స అందక వ్యక్తి మృతితో కలకలం

గొల్లప్రోలు: చేబ్రోలు పీహెచ్‌సీలో మంగళవారం తెల్లవారుజామున వైద్య సిబ్బందిలేకపోవడంతో చికిత్స అందక ప్రత్తిపాడు మండలం శరభవరానికి చెందిన ఇమంది మాణిక్యం(56) మృతి చెందిన ఘటనపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమైంది. గొల్లప్రోలులోని తన హోటల్‌లో పనిచేస్తున్న మాణిక్యం గుండెపోటుకు గురికాగా యజమాని నాగు అతడిని చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడం, 108ఆలస్యంగా రావడంతో మాణిక్యం మృతిచెందడంపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ డిప్యుటేషన్‌పై వెళ్లారని, ఎల్‌డీసీ, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రిపూట పీహెచ్‌సీ పనిచేయడం లేదని చెబుతున్నారు.



పీహెచ్‌సీలో విచారణ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యుడికి బాధ్యతలు..

మాణిక్యం మృతి ఘటనపై డీఐవో సుబ్బరాజు, డీఎంవో ప్రభాకర్ ఇచ్చిన విచారణ నివేదిక నేపథ్యంలో డీఎంహెచ్‌వో నరసింహానాయక్ చర్యలు తీసుకున్నారు. సస్పెండ్ చేసిన వైద్యుడు సాయిరతన్ స్థానంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు.

అమృతమూర్తికి ఆత్మీయ నీరాజనం

కీ.శే. శ్రీ చుండ్రు శ్రీవర ప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ చైర్మన్, మండపేట
మంచి మనిషి, స్నేహశీలి, అందరి ప్రేమాభిమానాలను పొందిన నాయకుడు
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి అకాల మరణమునకు చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
శోకతప్త హృదయాలతో ....
వేగుళ్ళ జోగేశ్వరరావు
శాసనసభ్యులు, మండపేట
రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్
వేగుళ్ళ అజయ్ కుమార్
మండపేట
వల్లూరి నారాయణమూర్తి (చినబాబు)
వల్లూరి సాయి కుమార్ (కుమార్ బాబు)
వల్లూరి రామన్న చౌదరి
మండపేట

(c) eenadu

గంటకొట్టే భాగ్యం కల్పించు స్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గంటకొట్టే భాగ్యం కల్పించాలని భక్తులు వేడుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి నిత్యం రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివస్తారు. బేడ మండప మార్గంలో ఉన్న ప్రధాన గంటను ఆలయ అధికారులు గతంలో తాళ్లతో కట్టేశారు. దీంతో గంటకొట్టే భాగ్యం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏసీ నాగవర్మప్రసాద్‌ను వివరణ కోరగా కట్టిన తాళ్లు తొలగిస్తామని వెల్లడించారు.

- న్యూస్‌టుడే, అంతర్వేది

భజగోవిందం.. జగమానందం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం మంగళవారం వేలాది మంది భక్తజనంతో అలరారింది. ఆలయంలోని ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్ర పుష్పం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు రమణీయంగా జరిగాయి.

- న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

బసవేశ్వరాయ.. అభిషేక ప్రియ

మండలంలోని రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రంలో బసవేశ్వరునిగా కొలిచే మహానందికి 21 ద్రవ్యాలతో మంగళవారం అభిషేకాలు జరిగాయి. అరుణాచలేశ్వరునికి నిత్య అభిషేకాలు, ఉపాలయాల్లోని పరివార దేవతలకు అర్చనలు అనంతరం ఆలయ మండపంలోని నందికి భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద పర్యవేక్షణలో అర్చకులు ఈ వేడుక నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గం పరిధిలోని శంకరగుప్తం మేజరు డ్రెయిన్‌కు సంబంధించి 2006లో ఆరుగురు సభ్యుల కమిటీ నివేదిక అనంతరం నిర్వహించిన అభివృద్ధి పనులపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ మహేష్‌కుమార్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. శంకరగుప్తం మేజరు డ్రెయిన్ చింతలమోరిలో ప్రారంభమై కరవాక వైనతేయ గోదావరి నది వరకు సుమారు 23 కి.మీ. ప్రవహిస్తుందన్నారు. ఈ డ్రెయిన్ ముంపు వల్ల జరుగుతున్న నష్ట నివారణ చర్యలపై చర్చించారు. ముంపునకు కారణాలు అన్వేషించేందుకు ఈ నెల 11న మరోసారి లైడర్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్రెయిన్స్ ఈఈ కిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. బ్రాంచ్ ఆఫీస్: [illegible] డి.నెం. 6-12-5/1, [illegible] రాజమహేంద్రవరం-533101.

భౌతిక స్వాధీనత ప్రకటన

(రూల్ 8 (1) ప్రకారం U/s 13(4) of SARFAESI Act ప్రకారం)

[illegible]

RAJA2TF2209290008 [illegible] రూ.62,96,704/- [illegible] 27-01-2024 [illegible] Crl.M.P.No. 431/2025 [illegible] 15.10.2025 [illegible] 29.11.2025 [illegible]

[illegible] గ్రామ పంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, ఆర్.ఎస్.నెం. 173/3 లో ఉన్న 135 చదరపు గజాలు లేదా 112.86 చదరపు మీటర్ల స్థలం మరియు గ్రౌండ్, 1వ అంతస్తులతో కూడిన డి.నెం. 2-26, అసెసమెంట్ నెం. 176 గల ఆర్‌సిసి భవనం యొక్క హద్దులు: **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** మట్టపర్తి రుద్ర మూర్తి గారి స్థలం మొదలైనవి, **పడమర:** మట్టపర్తి సుదర్శన రావు గారి ఇల్లు మరియు స్థలం, **ఉత్తరం:** మట్టపర్తి రాఘవులు గారి కుమారులకు చెందిన ఇంటి భాగం.

తేది: 29.11.2025 అధీకృత అధికారి
ప్రదేశం: రాజమండ్రి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పాఠం.. పాల్‌ల్యాబ్‌లో నిక్షిప్తం..!

పి.గన్నవరం, ఐ.పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలు ప్రథమం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

జిల్లాలో పాల్‌ల్యాబ్ వినియోగంలో రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. పి.గన్నవరం, ఐ.పోలవరం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎక్కువ గంటలు వినియోగించినట్లు ప్రకటించినట్లు సమగ్ర శిక్షా జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, జిల్లా పాల్‌ల్యాబ్ నోడల్ ఆఫీసర్ పి.రాంబాబు వెల్లడించారు. జిల్లాలో 31 జడ్పీ ఉన్నత, ముమ్మిడివరంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంతో కలిపి మొత్తం 32 పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లున్నాయి. విద్యార్థుల వ్యక్తిగత అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదపడే వీటిలోని ట్యాబ్‌లపై ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించి ఆయా తరగతుల విద్యార్థులు వారానికి రెండు పీరియడ్(45 నిమిషాలు) చొప్పున వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేసి ఆ విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు.

పి.గన్నవరం జడ్పీ ఉన్నతపాఠశాలలో పాల్‌ల్యాబ్‌లో విద్యార్థులు

వినియోగాన్ని ఎలా లెక్కిస్తారంటే..

ఒక విద్యార్థి తనకు కేటాయించిన ట్యాబ్‌ను ఒక రోజులో కేటాయించిన పీరియడ్ 45 నిమిషాలు వినియోగించాలి. అలా వారానికి వినియోగించిన పీరియడ్‌లను గంటల్లో లెక్కిస్తారు. విద్యార్థులు ల్యాబ్‌లో ట్యాబ్‌లను వినియోగిస్తున్న సమయమంతా స్టేట్ పాల్‌ల్యాబ్ టెక్నికల్ టీముకు ఆన్‌లైన్‌లో చేరుతుంది. అక్కడ ఏ విద్యార్థి ఎన్ని గంటలు ఉపయోగించుకున్నాడు, జిల్లాలో ఏ పాఠశాలలో వీటిని ఎక్కువ గంటలు వినియోగించుకున్నారు అనేది ఆన్‌లైన్‌లో తెలుస్తుంది. ఇటీవల జిల్లాకు వచ్చిన స్టేట్ కోఆర్డినేటర్ వీటిపై సమీక్షించి జూన్ నుంచి అక్టోబరు వరకు జిల్లాలో పి.గన్నవరం, ఐ.పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎక్కువ గంటలు వినియోగించి ప్రథమ స్థానంలో ఉన్నట్లు గుర్తించారు.

ఉపయోగం ఇలా..

పాల్‌ల్యాబ్‌లకు సంబంధించిన ట్యాబ్‌ల్లో ఆయా తరగతుల తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాలకు సంబంధించిన పాఠాలు నిక్షిప్తమై ఉంటాయి. ఉపాధ్యాయుడు తరగతి గదిలో పాఠాలు బోధించిన అనంతరం మరింత లోతుగా వాటిని అభ్యసనం చేసేందుకు ఇవి దోహదపడతాయి. ఉదాహరణకు తొమ్మిదో తరగతి విద్యార్థి గణిత పాఠ్యపుస్తకంలో ఒక లెక్కను ట్యాబ్‌లో చేసినప్పుడు దానికి సరైన సమాధానం వస్తేగాని ముందుకు వెళ్లదు. అక్కడ ల్యాబ్‌లో ఉపాధ్యాయుడు సందేహాలను నివృత్తి చేస్తారు.

కొత్తగా మరో తొమ్మిది బడుల్లో..

జిల్లాలో గత నెల 29న కొత్తగా మరో 9 పాఠశాలల్లో పాల్‌ల్యాబ్‌లు ప్రారంభమయ్యాయి. మామిడికుదురు, దంగేరు, హసనబాద, కడలి, రామేశ్వరం, కొత్తపేట(బాలికలు) జడ్పీ ఉన్నత, ఆనాతవరం ప్రభుత్వ ఉన్నత, రామచంద్రాపురం మున్సిపాలిటీలో ఎస్.బి.జె. మున్సిపల్ ఉన్నత, మండపేట మున్సిపాలిటీలో శ్రీగౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఇవి ఏర్పాటయ్యాయి. వీటితో కలుపుకుని జిల్లా వ్యాప్తంగా 41 ఉన్నత పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

- పి.రాంబాబు, ఏఎంవో,
సమగ్ర శిక్షా, జిల్లా పాల్‌ల్యాబ్ నోడల్ ఆఫీసర్

వాడపల్లి క్షేత్రంలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరుని ఆలయంలో బుధవారం ఉదయం 5 గంటలకు ప్రభాతసేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● 6 గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. ● 11 గంటలకు నిత్య కల్యాణం, 12 గంటలకు అర్చన. ● మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విరామం, 4 నుంచి మళ్లీ దర్శనాలు ప్రారంభం. ● సాయంత్రం 6 గంటలకు అర్చన, 7.30 గంటలకు నివేద్యం. ● 8 గంటలకు పవళింపు సేవ.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం

భీమేశ్వరాలయానికి 'కార్తిక' ఆదాయం రూ.1.05 కోట్లు

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయానికి కార్తిక మాసంలో వివిధ రూపాల్లో రూ.1,05,76,051 ఆదాయం చేకూరిందని ఆలయ ఈవో నీలకంఠం తెలిపారు. మంగళవారం ఆలయంలో దేవాదాయ శాఖ కాకినాడ తనిఖీ అధికారి ఫణికుమార్, ఆలయ ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో హుండీలు తెరిచి ఆదాయం లెక్కించామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ ఆదాయం లభించిందన్నారు. లెక్కింపులో ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అఖిలేష్ శుక్లా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు జిల్లాలో నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ పరిశీలకులు అఖిలేష్ శుక్లా పేర్కొన్నారు. మంగళవారం అమలాపురంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంస్థాగత నిర్మాణంపై ఆయన దిశానిర్దేశం చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నాయకులు పోటీ చేయాలని, అందుకు తగ్గ సంస్థాగత నిర్మాణం అవసరం అన్నారు. కార్యక్రమంలో అయితాబత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణారావు, మొహబూబ్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష పదవికి చిట్టిబాబు రాజీనామా

మామిడికుదురు, న్యూస్‌టుడే: డీసీసీ అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు రాజీనామా చేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు దీనికి సంబంధించిన పత్రాన్ని పంపించినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు ఏడాదికి పైగా తాను డీసీసీ అధ్యక్ష స్థానంలో ఉండి పార్టీ కోసం తనవంతు కృషి చేశానన్నారు. తాను ఏ పార్టీలో చేరుతున్నానన్న విషయాన్ని త్వరలో ప్రకటిస్తానన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు సాంత్వన

80 మందికి రూ.43.41 లక్షల పంపిణీ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడే వారికి ఆర్థికంగా సాంత్వన కలుగుతుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయం వద్ద సీఎంఆర్ఎఫ్‌లో లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. 80 కుటుంబాలకు మంజూరైన రూ.43.41 లక్షల చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, సాగిరాజు సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, దొమ్మేటి రమణకుమార్, కట్టా సత్తిబాబు, మట్ట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఓటరు కార్డులో చిరునామా... మార్చుకోవచ్చు ఇలా..!

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డు ఎన్నికల సమయంలోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగానూ వినియోంచుకోవచ్చనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. పట్టణాల్లో అద్దెకు ఉండేవారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు ఆ కార్డులో చిరునామా మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటారు. అందులోని చిరునామా (ఫారం-8)ని మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నిర్ణీత సమయాల్లో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్లో(ఓటర్స్ సర్వీస్ పోర్టర్) ద్వారా ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించింది.

- న్యూస్‌టుడే, గోపాలపురం

చిన్న తేడా ఉన్నా..

ఆన్‌లైన్లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో అలాగే ఓటరు కార్డుల్లోనూ ఉండాలి. చిన్నపాటి మార్పులు ఉన్నా రిజెక్టు అవుతుంది. ఆన్‌లైన్లో ఫారం-8 పూర్తి చేసిన తరువాత చివరిలో ఓటీపీ వెరిఫికేషన్ ఈ-సైన్ చేయాల్సి ఉంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్టు అవుతుంది. అదే విధంగా పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా అది తీసుకోదు. ఆన్‌లైన్లో దరఖాస్తు పూర్తి చేసే ముందే ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని సూచన ఇస్తుంది. పేరులో తేడా ఉంటే ముందే సరిచేసుకుని తరువాత చిరునామా మార్చుకోవాలని చెబుతుంది. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా సమీపంలోని బీఎల్వోని సంప్రదించాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు తిరస్కరణకు గురైతే..

రెండు కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్లో మార్చుకోవచ్చు. దరఖాస్తు రిజెక్టు అయిన వారు వెంటనే స్థానిక బూత్ లెవెల్ అధికారిని సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బీఎల్వోని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆన్‌లైన్లో దరఖాస్తు పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆఫ్‌లైన్లో చిరునామా మార్చుకోవాలంటే ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే సదరు ఓటరు కార్డులో మారుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

మంద కృష్ణమాదిగకు ఘనస్వాగతం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు రావులపాలెంలో అభిమానులు, సంఘ సభ్యులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన ఆయనకు స్థానిక కళా వెంకట్రావు కూడలిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అనంతరం ర్యాలీగా అమలాపురం బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

రావులపాలెంలో స్వాగతం పలుకుతున్న నాయకులు

కాషాయ వేషధారణలో అనుమానాస్పదంగా సంచారం

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

మంచూరులో అపరిచితులను అడ్డుకున్న గ్రామస్థులు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలోని మంచూరు పంచాయతీలో మంగళవారం కాషాయి వస్త్రాలు ధరించి అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కోనసీమ ప్రాంతానికి చెందిన బ్రహ్మాజీ వెంకటరమణ, చెన్నూరి రాజు, ముగ్గ చిన్నపల్లయ్యలు కారులో మంచూరు పరిధి పెరుమల్లయ్యగారిపల్లెకు వచ్చారు. కాషాయి వేషధారణలో ఉన్న వీరు గ్రామంలో సంచరిస్తుండడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. వీరు గత మూడు రోజుల నుంచి వాల్మీకిపురం పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. మంచూరుకు చెందిన ఒక నాయకుడిని నమ్మించి, నీ బిడ్డ బాగా చదివేలా చేస్తామంటూ రూ.5వేలు ఫోన్‌పే చేయించుకున్నారని, కొద్దిసేపటి తరువాత పరారయ్యారని బాధితుడు పోలీసులకు తెలిపారు. పోలీసులు వారిని విచారణ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కాజులూరు: విద్యుదాఘాతంతో దుగ్గుదూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మూడున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని ఆయన సాగుచేస్తున్నారు. ఆదివారం పొలానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సోమ, మంగళవారాల్లో గాలిస్తుండగా సాయంత్రం పొలానికి సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో తీగలకు చుట్టుకున్న స్థితిలో మృతదేహం కనిపించింది. ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఆతని భార్య ఇటీవల మృతిచెందడంతో కుమార్తె ఇంటిలో ఆయన ఉంటున్నాడు. ప్రమాదంపై గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపై వాహనం బోల్తా

10 గంటలు శ్రమించి బయటకుతీసిన వైనం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: నగర పంచాయతీ మహిపాలచెరువు సమీపంలో జాతీయ రహదారి పక్కన కాంక్రీట్ మిక్సర్ బోల్తాపడింది. ఉదయం 5 గంటల నుంచి ఆ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతాయం ఏర్పడింది. ఆ వాహనాన్ని తీసేందుకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ క్రేన్లను తెప్పించారు. కాంక్రీట్ గడ్డకట్టడంతో బయటకు తీయడం కష్టమైంది. వాహనాన్ని బయటకు తీసేందుకు గంటకోసారి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 10 గంటలు శ్రమించి బయటకు తీశారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

కాంక్రీట్ మిక్సర్‌ను క్రేన్లతో బయటకు తీసేందుకు ప్రయత్నాలు

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో ఏఎస్పీ పర్యవేక్షణలో సీఐతోపాటు, ఎస్సైలు మణికుమార్, జానీబాషాలతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ.75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌ట్యాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎంకార్డులు, పలు నెట్‌వర్కులకు చెందిన సిమ్‌కార్డులు, రూ.53 వేల నగదు, 20 గ్రాముల బంగారం, సంబంధిత కంపెనీ దుస్తులు, ప్రమోషన్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఏఎస్పీ వివరించారు.

పిఠాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనీష్

ఇతర ప్రాంతాలకు చెందిన 8 మంది అరెస్టు..

పోలీసులు తమ దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మందిని స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్(గుండుమల్ల, సత్యసాయి జిల్లా), సిద్ధేశ్ శ్రీధర్, సిద్ధేశ్ సుదీప్(మల్ల నాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్(హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య(పార్వతీపురం), నాగప్ప కావ్య(మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి(ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ||గ||ల్లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Krishna Pradeep's 21st Century IAS
WE ARE HIRING
TELE MARKETERS
10 No's (ONLY FEMALE)
Qlf: Intermediate / Degree with Good communication skills in Telugu & English.
Attractive Pay & Incentives
OPP. Z.P. HIGH SCHOOL, TORREDU, RAJAHMUNDRY.
8247417713

EENADU Classifieds

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

Paytmలో చేయుటకు స్టాఫ్ కావలెను. జీతం, ఇన్సెంటివ్‌తో కలిపి 30,000/- సంపాదించొచ్చు. రాజమండ్రి, మండపేట, రావులపాలెం పట్టణాలకు కావలెను. ✆ 98660 11262.

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్టు పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్స్. 8341177761, 9063222817

రాజమండ్రి: మహిళలకు మాత్రమే, డోర్ టు డోర్ వర్క్, పార్ట్ టైమ్ + ఫుల్‌టైమ్, 8 వేలు నుండి 10 వేలు జీతం + ఇన్సెంటివ్. Contact Cell: 93929 52551.

రాజమండ్రి J.N.రోడ్, ఐరన్ హిల్ పక్కన ఉన్న మా నూతన రెడిమేడ్ బట్టలషాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్ కావలెను. సంప్ర: 98664 11308, 70206 93543.

Wanted 1) Computer Operator 2) Tally Bell Fresh Foods ధవళేశ్వరం ఇండస్ట్రీ. Mobile: 9347336023.

EENADU for Advertisement Contact: 8008597607

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 7702237945.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డిగ్రీ. జీతం:22,000/- (8గం|| 26 రోజులు)+PF, ESI, 50 సం||లోపు Ct: 9666985077, 8688776420

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పైII
ఆనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ|| 5 - ఉ|| 7
ఈ-మార్నింగ్స్	ఉ|| 7 - ఉ|| 11
నువ్వా నేనా	ఉ|| 11 - మ|| 2
సత్యభామ	మ|| 2 - సా|| 5
లైట్ తీస్కో	సా|| 5 - రా|| 9
సరదాగా కాసేపు	రా|| 9 - రా|| 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా|| 12 - తె|| 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ||లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ||లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	145-00
డ్రెస్డ్	210-00
స్కిన్‌లెస్	239-00

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

రాజోలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని రాజోలు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య తెలిపారు. శివకోటి రైతుసేవా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న అన్నదాతను ఆదుకుంటున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు, సర్పంచి నక్కా రామారావు, సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి త్రినాథస్వామి, జనసేన నాయకుడు పినిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

రాజోలు: పొన్నమండ ఉపకేంద్రం వద్ద పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పొన్నమండ, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం, కూనవరం, ములికిపల్లి, మగటపల్లి, కొమరాడ, గోగన్నమఠం, ఆదుర్రు, లూటుకుర్రు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు.

అధ్యయన సామగ్రి అందజేత

సఖినేటిపల్లి: యూటీఎఫ్ ఉపాధ్యాయులు తయారు చేసిన పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను సఖినేటిపల్లి, మోరి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. చక్కగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈవో వెంకటేశ్వరరావు సూచించారు. ఆయా ప్రధానోపాధ్యాయులు కోలా వీరాస్వామి, చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

చెత్తాచెదారం శుభ్రం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం ఊబలంకలోని రోడ్డు చెంతన చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజు దృష్టికి తీసుకుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

పూడికల తొలగింపు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వాడపల్లిలోని డ్రెయిన్లలో పూడికలు ఏర్పడి మురుగునీరు పారక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచి పోచిరాజు సూర్యకుమారి వద్ద ప్రస్తావించగా సిబ్బందితో పూడిక తీయించారు.

ముంపునీటి సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం డ్రెయిన్లలో పూడిక తీయకపోవడంతో వర్షంనీరు రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సబిత దృష్టికి తీసుకుని వెళ్లగా నివారణ చర్యలు తీసుకున్నారు.

పుస్తక పఠనం.. మేధోమథనం

విద్యాశాఖ ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి పలు రకాల పుస్తకాలను సమకూర్చింది. వీటిని విద్యార్థులు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా లైబ్రరీ పిరియడ్ నిర్వహిస్తున్నారు. పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయంలో సుమారు మూడువేల పుస్తకాలు ఉన్నాయని ప్రధానోపాధ్యాయిని కె.ఉమాదేవి తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేవిధంగా ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

శిరస్త్రాణం ధరించు.. ప్రాణరక్షణ పొందు

ప్రాణరక్షణకు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని సీఐ విద్యాసాగర్, ఎస్సై నరేష్ సూచించారు. మంగళవారం ఆలమూరుతో పాటు జొన్నాడ జాతీయ రహదారిపై శిరస్త్రాణం ధరించకపోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటో చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో హైవే పోలీస్ సిబ్బంది, ఆలమూరు పోలీసులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఆలమూరు

దరఖాస్తుల ఆహ్వానం

మలికిపురం, సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: కేశనపల్లి నంబర్-1, జి.పల్లిపాలెం జీపీకాలనీ మండల పరిషత్తు పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులకు, బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎస్ఏ(హిందీ) పోస్టుకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా నియామకాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈవో ఎం.విజయశ్రీ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గౌరవ వేతనం రూ.12,500(ఎస్ఏ), రూ.10,000(ఎస్జీటీ) ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోగా స్థానిక ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

● సఖినేటిపల్లి మండలంలోని అప్పనరామునిలంకలో స్కూల్ అసిస్టెంట్(హిందీ-1), అంతర్వేది దేవస్థానం గ్రామం గుండుబోగులవారి గ్రూపు ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీ(1) పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టనున్నట్లు ఎంఈవోలు కిషోర్‌కుమార్, వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడండి

అంబాజీపేట: అంబాజీపేట మార్కెట్ యార్డుకు అరటిగెలలు తీసుకువచ్చే రైతులు, వ్యాపారులు నిర్దేశించిన ప్రాంతంలోనే వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని కమిటీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన రహదారిపై కార్యకలాపాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఐ.రమేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. ఆమె మనోగతం

నారసంచుల తయారీతో ఉపాధి

– న్యూస్‌టుడే, మలికిపురం

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కుటుంబ బాధ్యతలు చూసుకోవడం, ఖాళీ సమయాల్లో చిన్నపాటి పనులతో కొద్దోగొప్పో ఆదాయంతో గడిపేయడం సర్వసాధారణం. కొద్దిమంది మాత్రం దీనికి భిన్నంగా ఆలోచించి విజయాలు అందుకుంటారు. ఈ కోవకే చెందుతారు మలికిపురం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన తోట ఉమామహేశ్వరి. పర్యావరణ హితమైన నార సంచుల తయారీపై దృష్టి పెట్టి తనతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు.

ఉత్పత్తులు

మహిళకు మెలకువలు నేర్పుతున్న ఉమామహేశ్వరి

ముద్ర రుణంతో..

ఉమామహేశ్వరి నార సంచుల తయారీలో శిక్షణ పొందారు. ముద్ర రుణం రూ.2 లక్షల పెట్టుబడితో 'సేవ్ నేచర్' పేరుతో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసుకున్నారు. ఆర్డరుపై రకరకాల ఆకృతుల్లో ఉత్పత్తులు రూపొందిస్తున్నారు. పెళ్లిళ్లు, పుట్టినరోజు.. ఇలా వివిధ శుభకార్యాల సందర్భంగా కానుకలుగా ఇవ్వడానికి పౌచ్‌లు, హ్యాండ్, లంచ్, వాటర్ బ్యాగులు తయారు చేస్తున్నారు. స్థానిక ఆక్సిజన్ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కేశనపల్లి, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల్లో 90 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఒక మిషనుతో ప్రారంభమైన ఆమె ప్రయాణం ఇప్పుడు 13 మిషన్లతో 23 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. రూ.10 నుంచి రూ.1000 వరకు ధరల్లో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై దృష్టి

ఓఎన్‌డీసీ(ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ద్వారా పలువురి నుంచి ఆర్డర్లు పొందుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. నాబార్డు, డీఆర్‌డీఏ సహకారంతో విజయవాడ, కాకినాడ, గుంటూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం వంటి పట్టణాల్లో స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

అధికారుల సహకారంతో..

సంస్థ ఏర్పాటు చేసిన తొలినాళ్లలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాను. డీఆర్డీఏ, నాబార్డుతో పాటు ఆక్సిజన్ అసోసియేషన్ సభ్యులు సహకారం అందిస్తున్నారు. ఇటీవల స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది.

- తోట ఉమామహేశ్వరి, కేశనపల్లి, సేవ్ నేచర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ

సీఎం సహాయ నిధితో చేయూత

మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రోగులకు వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ఆర్థిక పరమైన చేయూత అందిస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మంగళవారం పి.గన్నవరం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో నియోజకవర్గంలోని 50 మందికి రూ.41.53 లక్షల విలువ గల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. సిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షాలతో అన్నదాతకు అవస్థలు

పోతవరం శివారు చిట్టిలంకపేటలో ..

పి.గన్నవరం: దిత్వా తుపాను ప్రభావంతో మంగళవారం ఏకబిగిన వర్షం కురిసింది. యంత్రాలతో వరి కోతలు కోసేందుకు ఇబ్బందిగా ఉండటంతో పనులు నిలిచిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోకుండా రైతులు బరకాలు వేసి రక్షణ ఏర్పాట్లు చేసుకున్నారు.

లిఖిత్‌కు అభినందన

అంబాజీపేట, న్యూస్‌టుడే: లీడ్ ఐఏఎస్ జూనియర్స్ నిర్వహించిన మాక్ ఐఏఎస్ పోటీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నేలపూడి లిఖిత్‌కార్తికేయను సివిల్ సర్వీసెస్ శిక్షకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర హైదరాబాద్‌లో మంగళవారం అభినందించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కలను సాకారం చేసుకోవాలన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన సిరాపురపు కాశీవిశ్వనాథ్, శేషగిరి శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,61,123 విరాళం మంగళవారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం సిబ్బంది అభినందించారు.

లోవోల్టేజీ లేకుండా చేయడమే లక్ష్యం

ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరప్రసాద్

మలికిపురం, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గాన్ని విద్యుత్తు సమస్యల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శంకరగుప్తంలో సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాల పరిశీలన, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్లకు అవసరమైన స్థలాలను డీఈఈ వెంకట్రావు, ఏడీఈ అశోక్, ఏడీఈ భగవాన్, రాజోలు ఏడీఈ బి.వి.కృష్ణరాజా, ఏఈ బి.ప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం సర్పంచి రాపాక ఆనందకుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతూ త్వరలో లోవోల్టేజీ, సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు సమసిపోతాయన్నారు. గుడిమెళ్లంక, శంకరగుప్తంలో త్వరలో సబ్‌స్టేషన్లు ప్రారంభమవుతాయని చెప్పారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, సర్పంచి రాపాక ఆనందకుమార్, ఎంపీటీసీ ఆచంట మాణిక్యం, ఉప సర్పంచి శిరిగినీడి నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
దేవదాయ ధర్మదాయశాఖ

శ్రీ బాల బాలాజీ స్వామి వారి దేవస్థానం

అప్పనపల్లి, మామిడికుదురు మండలం, డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

RC.No.B5/191/2025-1 Dt.01.12.2025

సీల్డుటెండరు / బహిరంగ వేలం ప్రకటన

స్థలం : అప్పనపల్లి
తేది : 01/12/2025.

ఆర్భాటంగా ఆరంభించి.. ఆదిలోనే ఆపేసి

మెరకపాలెం రైతు భరోసా కేంద్రం పునాదుల దశలో నిలిచిపోయింది. ఐదేళ్ల క్రితం రూ.36 లక్షలతో ఆర్భాటంగా ప్రారంభించారు. ఏళ్లకాలంగా అసంపూర్తిగా ఉండిపోవడంతో ఊచలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. దీనిపై డీఈఈ కృష్ణంరాజును వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

కాలిబాట వంతెన.. చిన్నారులకు యాతన

భూపతివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే పాత కాలిబాట వంతెన దాటాలి. రక్షణ గోడలు లేకపోవడం, మెట్ల సౌకర్యం కొరవడటంతో ఆందోళన చెందుతున్నారు. ఎంఈవో-2 వెంకన్నబాబు వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

పాడైన రహదారితో పాట్లు

రాజవరం వంతెన నుంచి పేరవరం ఎత్తిపోతల పథకం వైపు వెళ్లే సిమెంట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. వాహనదారులు పడిపోయి గాయాల పాలవుతున్నారు. మరమ్మతులు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇవ్వాలి: డీఈవో

కొత్తపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు సంబంధించి ఫీజుల వసూలు విషయంలో బలవంతం చేయరాదని, పరీక్షలకు దూరం పెట్టడం, హాల్‌టికెట్లు నిలిపివేయడం వంటి పనులు చేయరాదని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా సూచించారు. మంగళవారం కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. 5న జరిగే మెగా పేరెంట్స్ డే ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు తనిఖీ చేసి సక్రమంగా రాని వారిని ప్రశ్నించారు. ఎంఈవోలు హరిప్రసాద్, లీలావతి, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి పాల్గొన్నారు.

'సెలయేరు' పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణలో డీఈవో సలీంబాషా, ఉపాధ్యాయులు

అయినవిల్లి, న్యూస్‌టుడే: కవితలు, కథలతో రూపొందించిన 'సెలయేరు' బాలల పుస్తకాన్ని డీఈవో సలీం బాషా ఆవిష్కరించారు. మంగళవారం నేదునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రచయిత మామిడిశెట్టి బాలాజీని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.శ్రీనివాసరావు, సర్పంచి గుమ్మడి ప్రసాద్, డీసీఈబీ సెక్రటరీ హనుమంతరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన అవసరం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కాలుష్య నియంత్రణ బోర్డు కాకినాడ రీజనల్ డైరెక్టర్ పి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, అధ్యాపకురాలు రజని ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా శ్రీరామచంద్రమూర్తి హాజరయ్యారు. ప్రతిఒక్కరూ కాలుష్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గాలి, నీరు, శబ్దం, ప్లాస్టిక్, పరిశ్రమల నుంచి వచ్చే వివిధ రకాల వ్యర్థాలు మానవ మనుగడకు, జీవరాశులకు ప్రమాదకరంగా మారుతున్నాయన్నారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వరప్రసాద్, సుభాషిని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

విజేత విద్యార్థులతో ఎంఈవో తదితరులు

ఆలమూరు, న్యూస్‌టుడే: ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1979-80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా మంగళవారం బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు వివిధ క్రీడా పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భమిడిపాటి అప్పాజీ, పూర్వ విద్యార్థులు కామవరపు మల్లికార్జునరావు, బొబ్బా ఆదినారాయణ, వెత్సా నెహ్రూ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
దేవదాయ ధర్మదాయశాఖ

శ్రీ బాల బాలాజీ స్వామి వారి దేవస్థానం

అప్పనపల్లి, మామిడికుదురు మండలం, డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

RC.No.B5/189/2025-2 Dt.01.12.2025

సీల్డుటెండరు / బహిరంగ వేలం ప్రకటన

(Sri Annapurna Visweswara Swamy Vari Devasthanam, Appanapalli)

9491000720

స్థలం : అప్పనపల్లి
తేది : 01/12/2025.

వైకల్యం అధిగమించి.. పతకాలు సాధించి

నేడు విభిన్న ప్రతిభావంతుల దినం

– న్యూస్‌టుడే, మామిడికుదురు

ప్రత్యేకావసరాలు గల పిల్లలు సహితవిద్యా కార్యక్రమాలు, ఉపకరణాలను వినియోగించుకుంటూ చక్కగా చదువుకోవడమే కాకుండా క్రీడల్లోనూ పాల్గొనడంతో ప్రతిభ చూపుతున్నారు. మామిడికుదురు మండలం నగరం పరిధి మొల్లేటివారిమెరక భవిత కేంద్రంలోని ఇద్దరు విద్యార్థులు ఇటీవల రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందిస్తున్నారు.

● మామిడికుదురు మండలం మాకనపాలేనికి చెందిన యాండ్ర జాహ్నవి 9వ తరగతి చదువుతోంది. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏలూరు జిల్లా అరిగిపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి 50 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, ప్రశంసా పత్రాన్ని సాధించింది. కండరాల వైకల్యంతో ఉన్న విద్యార్థినికి సహితవిద్యా ఉపాధ్యాయినులతో పాటు తల్లిదండ్రులు రామప్రసాద్, నాగవెంకటదుర్గ వెన్నంటి నిలిచారు. తల్లి భవిత కేంద్రంలో ఆయాగా పని చేస్తూ కుమార్తె భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకునేందుకు కృషి చేస్తున్నారు.

యాండ్ర జాహ్నవి

● మామిడికుదురు మండలం మొగలికుదురుకు చెందిన జాన రేఖా చంద్రమౌళి 6వ తరగతి చదువుతున్నాడు. మేధో వైకల్యాన్ని అధిగమించి బేస్‌బాల్ పోటీల్లో ప్రావీణ్యం చూపుతున్నాడు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏలూరు జిల్లా అరిగిపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం, ప్రశంసాపత్రాన్ని కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు గోపి, అరుణ ప్రోత్సాహంతో పాటు సహితవిద్యా ఉపాధ్యాయినుల కృషితో అన్నింటినీ చక్కగా అధిగమిస్తున్నాడు. తల్లి నిత్యం వెన్నంటి ఉంటూ చదువులోనే కాకుండా క్రీడల్లోనూ చురుగ్గా ఉండేలా అండగా నిలవడంతో అందరికన్నా మిన్నగా రాణిస్తున్నాడు.

రేఖాచంద్రమౌళి

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవుడు మా ప్రియతమ నాయకులు

శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు

మృతికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట

ఆలమూరు మండల ఫెర్టిలైజర్స్ & పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్

Priyanka Fertilisers and General Stores, Jonnada, S.Satish Reddy	శ్రీ వీరాంజనేయ ఎంటర్‌ప్రైజెస్, K.రమేష్, ఆలమూరు	Sri Bhanu Agro Service, Modukurru, Yadlapalli Srinivasarao
తులసి ట్రేడర్స్, మడికి, శివ, సురేష్	శ్రీ శ్రీనివాస ఏజెన్సీస్, ప్రొ: కూన సుబ్బారావు, చింతలూరు	శ్రీ గణేష్ ఫెర్టిలైజర్స్ & జనరల్ స్టోర్స్, మూలస్థానం, వి.శ్రీగణేష్, యు.శివ
SRI RAMA AGENCIES, Chemudulanka, M.S.R.S.Kumar	శ్రీ విజయ దుర్గ ఆగ్రో ఏజెన్సీస్, ప్రొ: M.వీరాజు & సన్స్, చొప్పెల్ల	శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్, మడికి, G.దొరబాబు
Sri Ganga Bhavani Traders, Madiki, M.DORABABU	సుగుణ ఆగ్రో ఏజెన్సీస్, నర్సిపూడి, ప్రొప్రైటర్: పిల్లి సూరిబాబు	శ్రీ త్రివేశ్వర ఎంటర్‌ప్రైజెస్, మూలస్థానం, శివ, శ్రీను
శ్రీ అనంతలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, చింతలూరు, ప్రొప్రైటర్: జి.వి.ఎన్.చౌదరి	శ్రీ సిద్ధి వినీత సర్వీస్ & ఏజెన్సీస్, మడికి, ప్రొ: కంచుమర్తి సూర్యకుమారి	వెంకటేశ్వర ఏజెన్సీస్, చింతలూరు, R.శ్రీనివాస చౌదరి
వెంకట సూర్య ఏజెన్సీస్, కొత్తూరు సెంటర్, వై.వీరబాబు	సత్యవెంకట ఆగ్రో ఏజెన్సీస్, నర్సిపూడి, P.శ్రీనివాసరావు	శ్రీ పార్వతి ఆగ్రో ఏజెన్సీస్, మడికి, రజని
శ్రీ సాయిదుర్గా ఏజెన్సీస్, A.S.N.మూర్తి, B.V.లంక	ఆదిలక్ష్మి జనరల్ స్టోర్స్, తోట వెంకన్న, మూలస్థానం	శ్రీ సూర్యతేజ ఏజెన్సీస్, ఆలమూరు, పి.చిన్న

హనుమాన్ మందిరంలో పూజలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం యర్రమిల్లివారి వీధి శ్రీసకలకార్యసిద్ధి మరకత హనుమాన్ మందిర ప్రాంగణంలో మంగళవారం హనుమద్వ్రత పూజా మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష తులసీ పూజ కన్నుల పండువగా చేశారు. అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివకృష్ణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 36, వంకాయలు నలుపు - 38, తెలుపు - 36, బెండకాయలు - 60, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 45, బీరకాయలు - 48, కాలీఫ్లవర్ -26, క్యాబేజీ - 32, క్యారెట్ - 55, దొండకాయలు - 30, బంగాళదుంపలు - 25, ఉల్లిపాయలు - 18, 26, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 80, చేమదుంపలు - 43, కంద - 55, బీట్‌రూట్ - 48, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 90, చిలకడదుంపలు - 45, గుమ్మడి -30, ఉసిరి - 80, ములగ్గాం - 45, కరివేపాకు -55, నిమ్మకాయలు - 30, మామిడికాయ - 70.

ఒక్కొక్కటి చొప్పున.. అనపకాయ - 22, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ - 15, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 25.

ఒక్కో కేంద్రానికి రూ.6వేలు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అల్లవరం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యపరంగా వైద్య సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు దోహదం చేస్తున్నాయి. ఈ కేంద్రాల్లో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.6వేలు చొప్పున నిధులు విడుదల చేసింది.

ఇవీ కార్యక్రమాలు..

- వైకల్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.
- పిల్లలకు క్రీడ, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య శిబిరాలు, చికిత్స సేవలు, పరికరాల పంపిణీ, భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ, ఇంటి వద్ద విద్యార్థికి ఏర్పాట్లు, రవాణా, ఎస్కార్ట్ అలవెన్సు గురించి వివరించనున్నారు.

విజయవంతం చేసేలా..

భవిత కేంద్రాల్లో కార్యక్రమాలు విజయవంతం చేసేలా ఇప్పటికే ఎంఈవోలు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐఈఆర్టీలకు సూచించాం. వారిలో అవగాహన పెంపొందించే ప్రణాళికలు రూపొందించాం.

- సలీం బాషా, డీఈవో

బాలల భవితకు భరోసా

రెండు నియోజకవర్గాల్లో సత్ఫలితాలు ఇస్తున్న భవిత కేంద్రాలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

- బండారులంక కందులపాడు కాలనీకి చెందిన మలపర్తి కృప వయసు 15 ఏళ్లు. మానసిక వైకల్యంతో బాధపడుతోంది. ఆరేళ్ల నుంచి భవిత కేంద్రంలో ఈ బాలికకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది.
- నడిపూడి మెట్ల రాంజీ కాలనీకి చెందిన చింతా మోహిత్ వినయేంద్ర నాలుగేళ్ల నుంచి భవిత కేంద్రంలో సేవలను పొందుతున్నాడు. ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయుల నిర్విరామ కృషి కారణంగా ప్రస్తుతం బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

బండారులంకలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారుల భవితను తీర్చిదిద్దడంలో భవిత కేంద్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. చిన్నారుల్లో మానసిక ధైర్యాన్ని నింపడంతోపాటు చదువులోనూ రాణించేలా ఈ కేంద్రాల్లో పని చేసే ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సేవలపై కథనం.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని భవిత కేంద్రాల్లో వివరాలు

కేంద్రం	చిన్నారులు
బండారులంక	20
గోడిలంక	25
ఉప్పలగుప్తం	18
ముమ్మిడివరం	50
చెయ్యేరు	27
టి.కొత్తపల్లి	20

మెరుగైన సేవలు

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఆరు భవిత కేంద్రాలున్నాయి. వీటిలో 160 మంది చిన్నారులు ఉన్నారు. ఆయా మండలాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నారు. అమలాపురం నియోజకవర్గంలోని బండారులంక, ఉప్పలగుప్తం, గోడిలంక, ముమ్మిడివరం నియోజకవర్గంలోని చెయ్యేరు, ముమ్మిడివరం, టి.కొత్తపల్లిలో ఈ భవిత కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో ఇద్దరు ఉపాధ్యాయులతోపాటు ఒక ఫిజియోథెరపిస్టు, ఒక స్వీపర్ ఉన్నారు. ఆయా చిన్నారులకు అవసరమైన అన్ని సేవలను అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు.

'ఉమా' సంస్థ అలుపెరగని కృషి

దివ్యాంగుల పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలు

యానాం, న్యూస్‌టుడే: తోడుంటే కాని తమ పనుల్ని చేసుకోలేని బుద్ధిమాంద్యులైన దివ్యాంగులకు ఓపికగా చదువు, తమ పనుల్ని సొంతంగా చేసుకొనే అభ్యాసం కల్పిస్తోంది ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ. తమ పిల్లల్ని ఎలా తీర్చిదిద్దాలో తెలియక మనోవేదనకు గురవుతున్న వేల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు నేనున్నానంటూ మనోధైర్యం నింపుతోందీ సంస్థ. 37ఏళ్ల నుంచి వివిధ ప్రాజెక్టుల ద్వారా ఎంతోమందికి సహాయం అందించి, ఆరు ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాలు పొందింది. కాకినాడలోని రాయుడుపాలెం కేంద్రంగా ఎస్‌వీ రెడ్డి నేతృత్వంలో మొదలైన ఈ సంస్థ 2007లో యానాంలో తమ కార్యకలాపాలు మొదలుపెట్టింది. 2012లో దివ్యాంగుల పాఠశాలను ప్రారంభించి సేవల్ని విస్తరించింది. దివ్యాంగుల పాఠశాల నిర్వహణకు ప్రతినెలా ఆర్థిక సహాయం, రోజూ ఉచిత మధ్యాహ్న భోజనం సమకూర్చుతూ యానాం ఓల్డేజ్‌హోం సంస్థ వీరికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఈ సంస్థ ఉద్యోగులు వైకల్యంతో మంచానికే పరిమితమైన పిల్లల ఇంటికి వెళ్లి ఉచిత ఫిజియోథెరపీ చేస్తున్నారు. దివ్యాంగులతో సంఘాలు ఏర్పాటుచేసి ప్రతినెలా పొదుపు చేయిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తుంది. ఉచితంగా విద్య, రవాణా సదుపాయాల్ని కల్పిస్తోంది.

'పొట్టేళ్ల మధ్య చిచ్చు పెట్టే కుట్ర'

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్ పొట్టేళ్ల మధ్య చిచ్చు పెట్టే కుట్ర చేస్తున్నారని ముమ్మిడివరం ఎంపీపీ మాజీ ఛైర్మన్ గొలకోటి దొరబాబు ఆరోపించారు. మంగళవారం ఆయన ముమ్మిడివరంలో విలేకర్లతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కరోనా సమయంలో మాస్కుల కోసం ప్రశ్నించిన దళిత వైద్యుడు సుధాకర్‌ను చిత్రహింసలకు గురిచేసి పిచ్చివాడిగా ముద్రవేసి ఆయన మృతికి కారణమైన ఆయన ఇప్పుడు కులాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

కాలుష్య నియంత్రణకు పాటుపడాలి

సదస్సులో మాట్లాడుతున్న శ్రీరామచంద్రమూర్తి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కాలుష్యం ఏ రూపంలో ఉన్నా దాని నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కాలుష్య నియంత్రణ బోర్డు(కాకినాడ) పర్యావరణ ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. నేషనల్ పొల్యూషన్ ప్రివెన్షన్ డే సందర్భంగా ముమ్మిడివరంలోని తారా జూనియర్, డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ జీవీకే సుమంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జల, వాయు కాలుష్యం కారణంగా రోగాలకు గురవుతున్నామన్నారు. కాలుష్య నియంత్రణపై క్విజ్‌ను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయుడు కృష్ణమోహన్, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి సూరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలు.. విజ్ఞాన సోపానాలు

విజేతలతో డీవైఈవో సూర్యప్రకాశరావు, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు

అమలాపురం పట్టణం: విద్యార్థుల్లో సృజన పెంపునకు ఉపన్యాస పోటీలు ఉపయోగపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణ సత్యనారాయణ పేర్కొన్నారు. అమలాపురం వెత్సావారి అగ్రహారం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీల్లో పాల్గొన్నారు. కె. శాంతిస్వరూప, వి. రోహిణి, ఎన్. అభిరామ్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశరావు, పాఠశాల హెచ్‌ఎం గణ సత్యనారాయణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ప్రసాద్ వర్మ, చంద్రమోహన్, పుల్లాలమ్మ అందజేశారు.

మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపన్యాసం

విజేతలతో భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ రవి, ఇంఛార్జి రాజేశ్వరి

అమలాపురం పట్టణం: పోటీలతో విద్యార్థుల్లోని ప్రతిభ బయటపడుతుందని భాష్యం పాఠశాల ఇంఛార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్ తెలిపారు. అమలాపురంలోని కొంకాపల్లి భాష్యం పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు. టి. శ్రేయ, జి. గీర్వాణి, కె. లోహితలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 'ఈనాడు' సమకూర్చిన బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రిన్సిపల్ సీహెచ్ రవి, ఇంఛార్జి రాజేశ్వరి, సౌజన్య, సురేష్ విజేతలకు అందజేశారు.

భాష్యం పాఠశాలలో విద్యార్థిని ఉపన్యాసం

గొల్లవిల్లి విద్యార్థిని ప్రతిభ

హెచ్‌ఎం కనకదుర్గతో సాయిలక్ష్మి

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని అరవ సత్య సాయిలక్ష్మి బేస్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచింది. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు తరపున కాంస్య పతకం సాధించింది. హెచ్‌ఎం జి.కనకదుర్గ తదితరులు మంగళవారం విద్యార్థినిని అభినందించారు.

ఘనంగా గీతాజయంతి ఉత్సవాలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఉప్పలగుప్తంలోని శాంతి పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం గీతాజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పిల్లలతో శాంతి, గాయత్రి హోమాలు నిర్వహించారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

అభిషేకం చేస్తూ..

కాట్రేనికోన: పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో కొలువైన నందీశ్వరునికి అర్చకులు కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ రకాల ద్రవాలతో అభిషేకం చేశారు. పూలతో విశేషంగా అలంకరించారు.

మరమ్మతులు చేపట్టాలి

ఓల్డ్ అయినాపురం డ్రెయిన్‌పై కాట్రేనికోనలో ఉన్న వంతెన అధ్వానంగా మారింది. సుమారు పదిహేనేళ్ల క్రితం నిర్మించిన వంతెనపై గుంతలు ఏర్పడి, రక్షణగోడలు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అటువైపు ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

కాలువలో నీరు పారేదెలా..

నిర్వహణ గాలికి వదిలేయడంతో పంటకాలువలు అధ్వానంగా మారుతున్నాయి. వానపల్లిపాలెంలోని బొర్రాయిపాలెం వద్ద పెదగాడవిల్లి బ్రాంచ్ కెనాల్ పరిస్థితి ఇది. కాలువలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి మూసుకుపోయింది. గ్రామాల్లో ఇంటి అవసరాలకు, పశువుల దాహార్తి తీర్చేందుకు ఈ కాలువే ఆధారం. మునిపల్లి వరి ఆయకట్టు ఈ కాలువపైనే ఆధారపడి ఉంది. అధికారులు స్పందించి పూడికలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

చెత్త తొలగించేది ఎన్నడో..

చల్లపల్లి- అమలాపురం ప్రధాన పంటకాలువలో పలుచోట్ల చెత్త పేరుకుపోయింది. దీనివల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. కిత్తనచెరువు సమీపంలోని పంటకాలువలో వ్యర్థాలు, జంతు కళేబరాలు కుళ్లిపోయి చుట్టుపక్కలకు దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు చెత్తను తొలగించి కాలువలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

వర్షమొస్తే అష్టకష్టాలు

దొంతికుర్రులోని ధర్మారాజు గ్రామానికి వెళ్లే రోడ్డు పలుచోట్ల అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ కంకర రోడ్డులో వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరుతోంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఆందోళనలో అన్నదాతలు

చేలో తడిచిన వరిపనలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: వర్షాల ప్రభావంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వాతావరణం సహకరించడంతో ముందుగా వరినాట్లు వేసిన వారంతా వరికోత మాసూళ్లు మొదలుపెట్టారు. చాలాచోట్ల ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో ఆరబోసుకుంటున్నారు. చిలకమ్మచెరువు, వెంకమ్మచెరువు, పెనుమల్ల, బంటుమిల్లి, చెయ్యేరు, ఉప్పూడి, గెద్దనపల్లి తదితర ప్రాంతాల్లో వరిపనలు తడిచిపోయాయి. రైతులు కోసిన పంటను గట్టుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉప్పలగుప్తం: వర్షాలకు పలుచోట్ల కోతకొచ్చిన వరి చేలు నేలకొరిగి గింజలు నేలరాలుతున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కొనసాగితే చేతికొచ్చిన పంట చేజారిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● మంగళవారం కురిసిన వర్షాలకు పలుచోట్ల రహదారుల గోతుల్లో నీరు నిలిచింది. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు చేరడానికి ఇబ్బందులు పడ్డారు.

కూనవరంలో నేలకొరిగిన వరి

రహదారి నిండా గుంతలు

అమలాపురం భూపయ్యఅగ్రహారం రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. మూడు వార్డులు కలిసి ఉండే ఈ మార్గంలో పాఠశాల, కళాశాలలు, అపార్టుమెంట్లు ఉన్నాయి. ఈ రోడ్డులో రాకపోకలకు జనం అవస్థలు పడుతున్నారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

నారీమణులు.. స్వశక్తితో ముందుకు

ఆలోచనతో ఆర్థిక స్వావలంబన

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

మహిళలు వివిధ రంగాల్లో సాధికారత దిశగా ముందడుగు వేస్తున్నారు. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లోనూ రాణిస్తున్నారు. అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన మెప్మా ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. పట్టణ స్థాయి సమాఖ్య ఒకటి, మురికివాడల స్థాయి సమాఖ్యలు(స్లమ్ లెవల్ ఫెడరేషన్లు) 31, స్వయం సహాయక గ్రూపులు 830 ఉన్నాయి. ఒక్కో గ్రూపులో సుమారు 10 మంది సభ్యుల చొప్పున 8,301 మంది వివిధ పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందుతున్నారు.

చేతులను శుభ్రపరుచుకోవాలని అవగాహన కల్పిస్తున్న మెప్మా సభ్యులు

రుణాలు వినియోగించుకుని..

ఈ సంవత్సరం ఇప్పటి వరకు 160 స్వయం సహాయక గ్రూపులు రూ.21.50 కోట్ల రుణసదుపాయం పొందాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఉపాధి కోసం వివిధ ఉత్పత్తుల తయారీలతో మెప్మా అర్బన్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. మెప్మా బజార్‌లో వస్తువులు విక్రయిస్తున్నారు. తినుబండారాలు, అల్లిక వస్తువులు తదితర ఉత్పత్తులను దుకాణాల ద్వారా ప్రదర్శనలో ఉండటంతో పాటు అమ్ముతున్నారు. వీటితోపాటు టైలరింగ్, వస్త్ర దుకాణాలు, పచ్చళ్లు, పిండి వంటలు, చక్కీలు, బ్యాగులు, దుస్తుల తయారీ, చీరల అమ్మకం, ఎంబ్రాయిడరీ వంటి ఫ్యాషన్ డిజైనింగ్ పనులు చేస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

చేతుల పరిశుభ్రత, పౌష్టికాహారం, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, పర్యావరణ పరిరక్షణ, లింగ వివక్ష, నీరు, పరిశుభ్రత, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

ప్రతి కుటుంబంలో వ్యాపారవేత్త

కూటమి ప్రభుత్వం మహిళా శక్తిని, యుక్తిని వెలికితీసేలా అనేక పథకాలు ప్రవేశపెట్టింది. ప్రతి కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలని సంకల్పించింది. మహిళలు ఆర్థికంగా బలపడేలా మెప్మా రుణాలు అందిస్తోంది. త్వరలో అమలాపురం పట్టణంలో మీ-సేవ తరహాలో డీజీ లక్ష్మిని ప్రవేశపెడతాం. తృప్తి క్యాంటీన్ ద్వారా మహిళలతో ప్రజలకు చిరుతిళ్లు, భోజనం, టిఫిన్స్ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- దర్శిగుంట పెంచలయ్య, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

యువజన పార్లమెంట్‌తో రాజకీయాలపై అవగాహన

యూత్ పార్లమెంటు సభలో ప్రసంగిస్తున్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధనరావు

యానాం: వివిధ కళాశాలల విద్యార్థులకు వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు కార్యక్రమాన్ని మంగళవారం ఎస్సార్కే కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.భాస్కరరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు దూరంగా ఉంటున్న యువతకు తగిన అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పది మంది విద్యార్థులను యూత్ పార్లమెంట్ చర్చల ద్వారా ఎంపిక చేసి పుదుచ్చేరి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ సదస్సు మంచి వేదికన్నారు. ఎన్నెస్సెస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిద్ధిరెడ్డి శ్రీనివాస్, క్షేమామణి, పొనుగుమట్ల విష్ణుమూర్తి, కనకాల రామదాసు ప్రసంగించారు. 2022లో దిల్లీ యూత్ పార్లమెంటు పోటీల్లో పాల్గొన్న ఎన్.రాజ్యలక్ష్మి తన అభిప్రాయాల్ని సభలో వివరించారు. డాక్టర్ నరేష్, శాంతరాజు, ముత్యాలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇవ్వాలి: డీఈవో

కొత్తపేట: విద్యార్థులకు సంబంధించి ఫీజుల వసూలు విషయంలో బలవంతం చేయరాదని, పరీక్షలకు దూరం పెట్టడం, హాల్‌టికెట్లు నిలిపివేయడం వంటి పనులు చేయరాదని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా సూచించారు. మంగళవారం కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారిపై కోరింగ వద్ద మంగళవారం రాత్రి ఓ కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ వైపు నుంచి వస్తున్న కారు.. తాళ్లరేవు వైపు నుంచి కోరింగ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. పెదబొడ్డు వెంకటాయపాలేనికి చెందిన ద్విచక్రవాహనదారుడు దండుప్రోలు బాబ్జీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతడిని తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించారు.

విద్యార్థిని చదువుకు చేయూత

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆగిన చదువు కొనసాగించడానికి గుడ్‌సీడ్ ఫౌండేషన్ చేయూత నిచ్చింది. ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పెద్దూరుకు చెందిన కొడమంచిలి కృపావతి బి.టెక్ మొదటి ఏడాది చదువుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధినేత కుంచే రమణారావు ఆమెకు రూ.25వేల చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పినిపే జయరాజ్, నేరేడుమిల్లి శ్రీను, నక్కా సంపత్‌కుమార్, పందిరి సుబ్బరాజు, గంటా లక్ష్మీప్రసాద్, వినోద్, జోసెఫ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం మహిపాలచెరువు సమీపంలో జాతీయ రహదారి పక్కన కాంక్రీట్ మిక్సర్ వాహనం బోల్తాపడటంతో నిలిచిన వాహనాలు. - న్యూస్‌టుడే, ముమ్మిడివరం

చేపల చెరువు నందు చేపలు పెంచుకొను లైసెన్సు హక్కునకు

బహిరంగ వేలం ప్రకటన

Dr. B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ముమ్మిడివరం మండలం మరియు గ్రామంలో గల శ్రీ కార్నేషన్ సత్రం సంపూర్ణ హక్కుభుక్తంలో ఉప్పలగుప్తం మండలం, N.కొత్తపల్లి గ్రామంలో గల సర్వే నెంబర్ 438లో య.08.34 సెంట్లులో గల చేపల చెరువు నందు చేపలు పెంచుకుని తీసుకొనే హక్కునకు అప్పగించిన తేదీ నుండి 3 (మూడు) సంవత్సరములకు గాను ది.10-12-2025 బుధవారం మధ్యాహ్నం 3.00 గంటలకు N.కొత్తపల్లి గ్రామ సచివాలయం వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో బహిరంగ వేలంపాట పెట్టబడును. ఆసక్తి గలవారు రూ.25,000/-లు ధరావతు చెల్లించి, ఆధార్ కార్డ్ జిరాక్స్, సాల్వెన్సీ సర్టిఫికేట్ సమర్పించి పాటలో పాల్గొనవలెను మిగిలిన పాట షరతులు పాట కాలమందు తెలియపరచబడును.

ముమ్మిడివరం,
తేది: 01-12-2025.

కార్యనిర్వహణాధికారి
9505361544, 9989154745

(c) eenadu

మండపేట
•మండపేట •రామచంద్రపురం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191

వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం పాలతోడు గ్రామం రామాలయంవీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దుర్వాసనతో పాటు దోమలు వ్యాపిస్తున్నాయి. - కె.రాంబాబు, పాలతోడు

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి చెత్త తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

డిప్యూటీ ఎంపీడీవోగా కృష్ణంరాజు

రాయవరం: డిప్యూటీ ఎంపీడీవోగా వి.వి.కృష్ణంరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వెలగతోడు పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై వచ్చారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

మండపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయనిధి పేదలకు వరమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇటీవల శస్త్రచికిత్సలు చేయించుకున్న 42 మంది బాధితులకు రూ.29,93,957 విలువైన చెక్కులు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహిళకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

అంగర: గతేడాదితో పోలిస్తే 2025లో నేరాల సంఖ్య తగ్గిందని, వచ్చే ఏడాదిలో మరింతగా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. మంగళవారం ఆయన అంగర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు, అంగర ఎస్సై హరీష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చక్కగా చెప్పారు.. బహుమతి పొందారు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల భవిష్యత్‌లో వచ్చే మార్పులు అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో పలు ఆసక్తికర విషయాలు వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్.సత్యశ్రావణి ప్రథమ, బి.దుర్గాప్రశాంతి ద్వితీయ, ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వై.కిరణ్మయి తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను కళాశాల కరస్పాండెంట్ వి.సత్యనారాయణ, ప్రిన్సిపల్ టిదుర్గారావు అందించారు. పోటీలకు ఎం.నాగార్జున, జి.వెన్నెల, డి.కేశవరావు, ఎం.అప్పారావు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

విజేతలకు బహుమతులు అందించిన కరస్పాండెంట్ సత్యనారాయణమూర్తి

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో..

డాక్టర్ పాలడుగు సత్యవతి, డాక్టర్ చంద్రమౌళి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీలో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులు ఆకట్టుకునేలా ప్రసంగిస్తూ విలువైన సూచనలు చేశారు. 9వ తరగతి విద్యార్థిని పి.ప్రహర్షిణిప్రియ ప్రథమ, 7వ తరగతి విద్యార్థిని పి.నమ్రత ద్వితీయ, 10వ తరగతి విద్యార్థిని ఆర్.అలేఖ్య వీరమణి తృతీయ బహుమతి అందుకున్నారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముంగర వెంకటరాజు బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా పి.శ్రీదేవి, వై.అన్నపూర్ణ, ఎం.సుధారాణి వ్యవహరించారు.

జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో..

విజేతలకు బహుమతులు అందించిన హెచ్ఎం ముంగర వెంకటరాజు

తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన, మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైన పలువురు వైకాపా నాయకులు మంగళవారం తెదేపాలో చేరారు. కె.గంగవరం సర్పంచి కోటి లక్ష్మీనరసమ్మ వెంకట్రావు, రామచంద్రపురం మండలం అన్నాయిపేట గ్రామంలో వైకాపా కీలక నేత బొమ్మోతుల అబ్బాయినాయుడుతో పాటు మరో 25 మంది ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మంత్రి సుభాష్, సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పసుపు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులకు సత్కారం

విజేతలను అభినందిస్తున్న జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన ద్రాక్షారామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన స్కూల్ గేమ్స్‌లో రగ్బీ అండర్-17 పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు స్వర్ణ పతకం సాధించింది. జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో కీలకపాత్ర పోషించిన టేకుమూడి మహాలక్ష్మి ఈ పాఠశాలలోనే 9వ తరగతి చదువుతోంది. అలాగే రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో ప్రేమసాయి, కరాటే పోటీల్లో పాల్గొన్న సంతోష్, క్రికెట్ జట్టుకు స్టాండ్‌బైగా ఎంపికైన వైష్ణవి, రగ్బీ జట్టు స్టాండ్‌బైగా వెళ్లిన నవ్యరత్నంలతో వీరికి శిక్షణ ఇచ్చిన శ్రీనివాస్, ఉమలను ప్రధానోపాధ్యాయుడు పేరిచర్ల శేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన స్వామిత్వ సర్వే

కాజులూరు, న్యూస్‌టుడే: మండలంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో జె.రాంబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్వామిత్వ ద్వారా గ్రామాల్లో భూ హక్కులను స్పష్టంగా నిర్ధారించడంతో పాటు ప్రజలకు శాశ్వత హక్కు పత్రాలు అందించడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు మండల పరిధిలో 53 శాతం మాత్రమే సర్వే పనులు పూర్తయ్యాయని వివరించారు. కోలంక, పెదలంక, నామవానిపాలెం, పెనుమళ్ల గ్రామాల్లో 100 శాతం పూర్తయ్యాయని, అన్ని గ్రామాల్లో వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, డిప్యూటీ ఎంపీడీవోలు చక్రపాణిరావు, ముద్రగడ సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు, న్యూస్‌టుడే: కుయ్యేరు నుంచి కాజులూరు వరకు కొత్త విద్యుత్తు లైన్ వేసే పనులు చేపట్టిన కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్యవటం సబ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కుయ్యేరు సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కుయ్యేరు, అయితపూడి, దుగ్గదూరు, ఉప్పుమిల్లి, చింతల్లంక, రేగుబాడవ, పల్లిపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి
మంచిమనిషి, స్నేహశీలి, ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు, మా ప్రియతమ నాయకులు మండపేట పట్టణ మున్సిపల్ మాజీ ఛైర్మన్ మరియు ది. మండపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, అశ్రునయనాలతో వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట
మరణం: 23-11-2025
ది మండపేట లారీ ఓనర్స్ కల్చరల్ అసోసియేషన్
బైపాస్ రోడ్, మండపేట, ఠి.నెం: 564/91
Cell: 8332812259
ప్రెసిడెంట్: కాయల రమేష్
వైస్ ప్రెసిడెంట్: రెడ్డి వీరన్న
జా॥ సెక్రటరి: కావూరి వీర్రాజు
కోశాధికారి: గుత్తుల గోవిందు
లారీ ఓనర్స్, కార్యవర్గం & స్టాఫ్

అశ్రునివాళి
మాకు అత్యంత ఆత్మీయ సన్నిహితులు, స్నేహశీలి, మంచిమనిషి శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్మన్: మండపేట పట్టణ మున్సిపాలిటీ
షేక్ చిన్నబాదుర్ల

COASTAL FOAM PVT. LTD. THE MATTRESSES FACTORY
COASTAL FOAM Pvt, Ltd
Regd. Office: S.No: 522/2
D.No.4-1-25, Taravanipeta, Mandapeta
Factory: Near: Porus Agro Food Pvt. Ltd. YEDITHA, MANDAPETA MANDAL
Dr. B.R.Ambedkar Konaseema Dist., Cell: 96966 63666

"ప్రజాభిమాననేత" ప్రకాష్ గార్కి అశ్రునివాళి
మాకు అత్యంత ఆత్మీయ సన్నిహితులు, స్నేహశీలి, మండపేట పట్టణ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన మంచిమనిషి "ప్రజల మనిషి" గా చిరస్థాయి కీర్తిని పొందిన శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెల్పుతూ..
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్మన్: మండపేట పట్టణ పురపాలక సంఘం
నల్లమిల్లి వీర్రెడ్డి
జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్
అర్తమూరు, సెల్: 98491 36458
శ్రీ గంగా PVC పైప్స్
మే॥పా॥ G.S.భాస్కరరావు, B.E. (MECH)
ఏడిద, సెల్: 93477 11177
పర్వతిన వీర్రాజు
ఏడిద గ్రామ తెదేపా అధ్యక్షులు
గాడవర్తి సత్యనారాయణ (ఎర్రబ్బు)
ఏడిద PACS ఛైర్‌పర్సన్ AMC డైరెక్టర్
కొలుపోటి సత్యనారాయణ మూర్తి (బాబు)
ఏడిద నీటి సంఘం అధ్యక్షులు
యరపోతిన వెంకటేశ్వరరావు (చంటి)
మాజీ సర్పంచ్, ఏడిద
మేకా వీరబ్రహ్మం (జెజిబాబు)
మాజీ అధ్యక్షులు: తెదేపా గ్రామశాఖ
మేకా నాగరాజు
ఏడిద
బొడ్డు సూర్యనారాయణ మూర్తి (దత్తుడు)
E.సతీష్
శ్రీజ హోండా
మెయిన్‌రోడ్, మండపేట
యడ్ల వెంకట్రావు & సన్స్
ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్
YVR Electricals
తెదేపా నాయకులు, ఏడిద
సెల్: 98496 61232
నల్లమిల్లి శ్రీహరిరెడ్డి
మే॥పా॥ వెంకటేశ్వరా అసోసియేట్స్, ద్వారపూడి
అర్తమూరు
సెల్: 96761 77999
పడాల రామకృష్ణారెడ్డి
ఛైర్‌పర్సన్: తాపేశ్వరం PACS
అర్తమూరు
సెల్: 98493 00444
KKSR టెంట్‌హౌస్
కర్రి హరినాథరెడ్డి
అర్తమూరు
సెల్: 90007 99888
పడాల సుబ్బారెడ్డి
A.P. స్టేట్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరి
అర్తమూరు, సెల్: 98491 36444
బూరిగ ఆశీర్వాదం
గ్రామ సర్పంచ్
ఏడిద, సెల్: 76609 62999
బండారు శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు)
ఏడిద నీటి సంఘం డైరెక్టర్

అమృతమూర్తికి అశ్రునివాళి
మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా మండపేటను అభివృద్ధి పథంలో నడిపించిన అభివృద్ధి ప్రదాత, మా ఆత్మీయ శ్రేయోభిలాషి కీ॥శే॥ శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...
కీ॥శే॥ శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట
మరణం: 23-11-25
BALAJI GROUP
జాస్తి వెంకటేశ్వరరావు
మండపేట

అమృతమూర్తికి అశ్రునివాళి
మాకు అత్యంత ఆత్మీయ సన్నిహితులు, పరోపకారి, స్నేహశీలి శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి ఆకస్మిక మరణానికి చింతిస్తూ... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్మన్: మండపేట పట్టణ పురపాలక సంఘం
ది ద్వారపూడి లారీ ఓనర్స్ అసోసియేషన్, ద్వారపూడి
గౌరవ అధ్యక్షులు: నల్లమిల్లి అబ్బు
ప్రెసిడెంట్: చిక్కాల శ్రీనివాసరావు
సెక్రటరి: వేటుకూరి సూర్యనారాయణరాజు
ట్రెజరర్: సత్తి వెంకటరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్: లంక లక్ష్మణకుమార్ (దొరబాబు)
జాయింట్ సెక్రటరి: జమ్మి రవికుమార్
కమిటీ మెంబర్స్: గండి శ్రీనివాసరావు, ఎ.వి.వి.సత్యనారాయణరాజు, అంగర శ్రీను, బుద్దాల పెద్దకాపు, పోకల పార్వతీశం (బాబి), షేక్ మీరాసాహెబ్, కొఠారి రాంబాబు, నల్లమిల్లి వీరరాఘవరెడ్డి (వంశీ), సైనం మురళి, భీమన యుగంధర్ గౌడ్, షేక్ మస్తాన్, గ్రంధి ప్రసాద్ మరియు లారీ ఓనర్స్

అమృతమూర్తికి అశ్రుతాంజలి
మాకు అత్యంత ఆప్తులు, మిత్రులు, శ్రేయోభిలాషి, మండపేట మున్సిపాలిటీ అభివృద్ధి ప్రదాత కీ॥శే॥ శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణమునకు చింతిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, అశ్రునయనాలతో...
కీ॥శే॥ శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట
మరణం: 23-11-2025
కృష్ణప్రభాస్ ఆగ్రో ఆయిల్స్ ప్రై. లిమిటెడ్, మారేడుబాక
మేనేజింగ్ డైరెక్టర్: వంక సత్యనారాయణ (అన్నవరం)
డైరెక్టర్స్: తమ్మిరెడ్డి అబ్బులుచౌదరి, వైట్ల కనకదుర్గారావు, వల్లూరి వెంకట్రావు, వంక ప్రసాదరావు
గుణ్ణం వీరవెంకట సత్య ఆనంద వరప్రసాదరావు
కృష్ణప్రభాస్ ఆగ్రోటెక్ LLP - మండపేట

అశ్రునివాళి
మాకు అత్యంత ఆత్మీయ సన్నిహితులు, స్నేహశీలి, మంచిమనిషి శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్మన్: మండపేట పట్టణ మున్సిపాలిటీ
బలుసు వెంకట్రావు (చిన్నబ్బు)
ఏడిద

అమృతమూర్తికి అశ్రునివాళి
మాకు అత్యంత ఆత్మీయ సన్నిహితులు, పరోపకారి, స్నేహశీలి శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి ఆకస్మిక మరణానికి చింతిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెల్పుతూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్మన్: మండపేట పట్టణ పురపాలక సంఘం
తులా విష్ణుమూర్తి
తులా కృష్ణరామ్
ద్వారపూడి

ఆదర్శమూర్తికి అశ్రునివాళి
మంచి మనిషి, మానవతావాది, స్నేహశీలి, మా మిత్రులు, మా ప్రియతమ నాయకులు శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మృతికి చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్ మండపేట
S.ADINARAYANA MURTHY
M.A., B.L.I.Sc., B.L., P.G.D. in Tax Laws
ADVOCATE & NOTARY
HIGH COURT OF A.P., LIFE MEMBER
Panel Advocate for: SBI, CBI, BOI, TMB, BOM, IDFC
ORIENTAL INSURANCE COMPANY ADVOCATE
COUNCIL MEMBER OF MAHILA POLICE STATION
Kakinada District
Municipal Standing Council of Mandapeta
Cell: 98496 53559, 96525 29939
Office cum Own House: # 11-1-11, SURYA KESAVA NILAYAM, MANDAPETA - 533308
Email:SANM9979.ADV@gmail.com

అమృతమూర్తికి అశ్రునివాళి
మంచిమనిషి, స్నేహశీలి, ఆపదలో ఉన్నవారికి ఆదుకునే ఆపద్బాంధవుడు, మా ప్రియతమ నాయకులు శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి మరణమునకు చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, అశ్రునయనాలతో... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట
మరణం: 23-11-2025
తెలుగుదేశం పార్టీ 12వ వార్డు నాయకులు మండపేట (పాతవీధి)
పాలచర్ల కృష్ణ బ్రహ్మాజీరావు
వేగుళ్ళ భాస్కరరావు
బోళ్ళ సత్తిబాబు
ముత్యాల గనిబాబు
యరమాటి సత్యనారాయణ
నూని పట్టాభిరామన్న
యరమాటి పట్టాభిరామన్న
పోతన వెంకట రామారావు చౌదరి
నిమ్మలపూడి గోవిందరాజు
పాలచర్ల రాంబాబు (శిరీష్)
నూని శ్రీనివాస్
బొడ్డు సత్యనారాయణ
NBK ఫ్యాన్ ప్రెసిడెంట్

(c) eenadu

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥ల్లో ఈస్ట్ పేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Krishna Pradeep's 21st Century IAS

WE ARE HIRING

TELE MARKETERS

10 No's (ONLY FEMALE)

Qlf: Intermediate / Degree with Good communication skills in Telugu & English.

Attractive Pay & Incentives

OPP. Z.P. HIGH SCHOOL, TORREDU, RAJAHMUNDRY.

8247417713

EENADU eClassifieds

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

Paytmలో చేయుటకు స్టాఫ్ కావలెను. జీతం, ఇన్సెంటివ్‌తో కలిపి 30,000/- సంపాదించొచ్చు. రాజమండ్రి, మండపేట, రావులపాలెం పట్టణాలకు కావలెను. ✆ 98660 11262.

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్టు పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్స్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్స్. 8341177761, 9063222817

రాజమండ్రి: మహిళలకు మాత్రమే, డోర్ టు డోర్ వర్క్, పార్ట్ టైమ్ + ఫుల్‌టైమ్, 8 వేలు నుండి 10 వేలు జీతం + ఇన్సెంటివ్. Contact Cell: 93929 52551.

రాజమండ్రి J.N.రోడ్, ఐరన్ హిల్ పక్కన ఉన్న మా నూతన రెడిమేడ్ బట్టలషాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్ కావలెను. సంప్ర: 98664 11308, 70206 93543.

Wanted 1) Computer Operator 2) Tally Bell Fresh Foods దవళేశ్వరం ఇండస్ట్రీ. Mobile: 9347336023.

EENADU for Advertisement Contact: 8008597607

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 7702237945.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డిగ్రీ, జీతం:22,000/- (8గం॥ 26 రోజులు)+PF, ESI, 50 సం॥లోపు Ct: 9666985077, 8688776420

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అంగరలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైద్య సిబ్బంది

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

అంగర, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయడంపై మండలంలోని పలువురు వైద్య సిబ్బంది ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రత్నకుమారి, ఎంపీహెచ్ఈవో మల్లికార్జునుడు, డిప్యూటీ హెచ్ఈవో రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	145-00
డ్రెస్డ్	210-00
స్కిన్‌లెస్	239-00

తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామలోని నున్నవారివీధికి చెందిన తల్లీకుమార్తెల అదృశ్యంపై ద్రాక్షారామ అదనపు ఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేశారు. అదే వీధికి చెందిన పలివెల జ్యోతిబాబు సోమవారం రాత్రి ఇంటికి అవసరమైన కిరాణా సరకులు తీసుకెళ్లగా మరికొన్ని కావాలని అతని భార్య చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆయన అన్నీ ఒకే సారి తీసుకురావాలని చెప్పాలి కదా.. అంటూ భార్యపై కేకలు వేసి మళ్లీ సరకుల కొనుగోలుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య, ఏడేళ్ల కుమార్తె ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్లా వెతికి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్పెషల్ గ్రేడ్ స్థాయితో మరింత అభివృద్ధి

మండపేట పురపాలక స్థాయి పెంపునకు కౌన్సిల్‌లో తీర్మానం

న్యూస్‌టుడే, మండపేట

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మున్సిపాలిటీ వజ్రోత్సవాల సందర్భంగా గత నెల 28వ తేదీన రెండో గ్రేడ్ పురపాలక సంఘం నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా స్థాయిని పెంచారు. 60 సంవత్సరాల క్రితమే అంటే 1964లోనే రెండో గ్రేడ్‌గా ఉన్న ఈ పురపాలక సంఘంలో జనాభా సుమారు 54 వేలు మంది ఉండగా ఇళ్లు 10,873 ఉన్నాయి. పట్టణాన్ని 28 వార్డులుగా విభజించగా ఆదాయం రూ.10 కోట్లతో ఉంది. ఈ పట్టణానికి మించిన జనాభా, వార్డులతో పాటు ఆదాయం కూడా ఎక్కువే ఉన్న మండపేట మున్సిపాలిటీ ఇప్పటికీ రెండో గ్రేడ్‌తోనే కొనసాగుతోంది.

అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు.. మండపేట 1958 అక్టోబర్ ఒకటో తేదీన మూడో గ్రేడ్ పట్టణంగా, 1980లో రెండో గ్రేడ్‌గా ఏర్పడింది. పట్టణంలో 30 వార్డులుండగా 83,000 మంది జనాభా ఉన్నారు. పట్టణంలో 18,451 అసెస్మెంట్లతో ఇంటి పన్ను రూ.7.22 కోట్లు, 2,387 అసెస్మెంట్లతో రూ.0.21 కోట్లు నీటి పన్నుగా వసూలవుతోంది. అలాగే 237 దుకాణాల నుంచి రూ.1.44 కోట్లు, స్టాంపు డ్యూటీగా రూ.1.57 కోట్లు, ఇతరత్రా ఆదాయాలతో ఏడాదికి రూ.11 కోట్లు దాటింది. మండపేటతో పోల్చుకుంటే తక్కువ వార్డులు, జనాభా, ఆదాయం కలిగిన నిడదవోలును ప్రత్యేక గ్రేడ్‌కు ఎంపికచేసిన నేపథ్యంలో తమకూ ఆ స్థాయిని కేటాయించాలని కౌన్సిల్‌లో అజెండాగా ప్రతిపాదించి చర్చించిన అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సహా ఛైర్‌పర్సన్, సభ్యులు నవంబరు 29న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. వర్తక, వ్యాపార కేంద్రంగా, పారిశ్రామిక ప్రాంతంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణానికి ఇప్పటికే ప్రత్యేక గ్రేడ్ రావాల్సి ఉందని చర్చించారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

★ ఇటీవల మండపేట బృహత్ ప్రణాళిక డ్రాఫ్ట్ ప్లాన్‌లో సమీపంలోని కొన్ని గ్రామాలను విలీనం చేయాలని మ్యాప్ తయారుచేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే జనాభా 1.30 లక్షలకు చేరుతుంది. ఈ సంఖ్య సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి అర్హత సాధించగలదు. అయినా మండపేటకు ఆ హోదా రాకపోవడంతో స్థాయి పెంపునకు చర్యలు తీసుకోవాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు.

స్థాయి పెరిగితే ఇవీ ఉపయోగాలు..

కమిషనర్ హోదాతో పాటు అధికారుల స్థాయి కూడా పెరిగి ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరవుతాయి. అమృత్ భారత్ పథకం అమలుతో తాగునీటి సౌకర్యం మెరుగవుతుంది. పట్టణం విస్తరించి వార్డుల సంఖ్య పెరుగుతుంది. మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు. సమీప ప్రాంతాల నుంచి విద్య, వైద్యం, వ్యాపారాల నిమిత్తం వలస వచ్చే వారి సంఖ్య పెరిగి మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

– టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్

ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

బీఎస్సీ విద్యార్థులకు అరుదైన అవకాశం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (మేథమెటిక్స్) విద్యార్థులు పెద్దాల సాయిహిత్, జి.హేమలత ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టు మేథమెటిక్స్ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డా. సీహెచ్.రామకృష్ణ, సీనియర్ అధ్యాపకులు వై.పద్మజ, శ్రీనివాసరెడ్డి తదితరులు వారిని మంగళవారం అభినందించారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఐఐటీ తిరుపతి ఏటా నిర్వహించే శిక్షణ శిబిరం ఈనెల 29 నుంచి జనవరి 3 వరకు జరగనుంది. గణితంపై లోతైన అవగాహన, పరిశోధనా దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పీటీఎం 3.0ని విజయవంతం చేద్దాం

పామర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఈనెల ఐదో తేదీన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.0ని సమన్వయంతో జయప్రదం చేద్దామని ఎంఈవో ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పామర్రు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం యర్రా ఈశ్వరుడు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలని, విద్యార్థి వ్యక్తిగత చదువు ప్రమాణాలను తల్లిదండ్రులకు పూర్తిగా వివరించాలని సూచించారు. వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేయాలన్నారు. ఎంఈవో అలజంగి నాగరాజు, భాజపా జిల్లా రైతు కార్యదర్శి నున్న సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి చుండ్రు చౌదరి, కె.శ్రీనివాసు, సీహెచ్ గోపాలకృష్ణ, మోహనకుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీపై వ్యక్తిగత దూషణలను సహించం'

అంగర, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై వ్యక్తిగత దూషణలకు దిగితే సహించేదిలేదని వైకాపా నేతలు హెచ్చరించారు. కపిలేశ్వరపురం మండలం అంగర వైకాపా కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ సాకా శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు మాట్లాడారు. వైకాపా హయాంలో మెజారీ పంచాయతీలు, మూడు ఎంపీపీ స్థానాలు, మండపేట పురపాలక సంఘం ఏకగ్రీవ తీర్మానాలతో విలీన ప్రక్రియ సాధ్యమైందని, ఎమ్మెల్యే తాను చేసిన కృషితోనే ఇది సాధ్యమైందని జోగేశ్వరరావు సంబరాలు చేసుకోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, నేతలు పలివెల మధు, నక్కా సింహాచలం, పిప్పర సంపతరావు తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

మున్సిపల్ డీఈని సరెండర్ చేయండి

పార్టీలకతీతంగా మంత్రి సుభాష్‌కు కౌన్సిలర్ల వినతి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మున్సిపల్ డీఈ జి.శ్రీకాంత్ అభివృద్ధి పనులకు ఆటంకంగా మారారని, గుత్తేదార్లకు బిల్లులు చెల్లించకుండా పట్టణాభివృద్ధి కుంటుపడేలా వ్యవహరిస్తున్నారని, ఆయన్ను వెంటనే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని పార్టీలకతీతంగా మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మంత్రి సుభాష్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. నామినేషన్ పనులు చేయవద్దని కాంట్రాక్టర్లకు చెప్పడం, ఏఈలు చేయాల్సిన పనులు తానే స్వయంగా చేయడం, వ్యక్తిగతంగా తనకు మేలు జరిగే పనులు చేయాలని కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. దీనిపై మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించారని కౌన్సిలర్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైకాపా చీఫ్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, వైస్ ఛైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కేతా శ్రీను, నల్ల అంజమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం: 6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి వీధి, ఇన్నీసుపేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.

భౌతిక స్వాధీనత ప్రకటన

(రూల్ 8 (1) ప్రకారం U/s 13(4) of SARFAESI Act స్థిరాస్తి కొరకు)

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్") (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై ఆదేశాల మేరకు 09.11.2022న సి.పి.నెం: 69-76 ఆఫ్ 2022 లో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనం చేశారు. తదనంతరం ది.30.11.2022 నుండి మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మార్పుకు అనుగుణంగా ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ & కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద కంపెనీల రిజిస్ట్రార్ ధృవీకరించిన ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది). మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: **1. మట్టపర్తి లక్ష్మి దుర్గ,** భర్త: శ్రీకాంత్, శ్రీ వరసిద్ధి వినాయక సివిల్ కాంట్రాక్ట్ వర్క్స్, డి.నెం. 2-33/2, సిరిపల్లి-533211, అయినవిల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. **2. మట్టపర్తి శ్రీకాంత్,** తండ్రి: జగన్నాథ రావు, శ్రీ వరసిద్ధి వినాయక సివిల్ కాంట్రాక్ట్ వర్క్స్, డి.నెం. 2-33/2, సిరిపల్లి-533211, అయినవిల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. **3. మట్టపర్తి జగన్నాథ రావు,** తండ్రి: పైడింశెట్టి, శ్రీ లక్ష్మి గణపతి సౌండ్ & లైటింగ్ సిస్టమ్ వ్యాపారం, డి.నెం. 2-33/2, సిరిపల్లి-533211, అయినవిల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా. **4. కుడుపూడి లలిత దేవి,** భర్త: దుర్గారావు, డి.నెం. 4-103, అయినవిల్లి పెదపాలెం-533211, అయినవిల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వారు లోన్ అగ్రిమెంట్ నెం. **RAJA2TF2209290008** తాలూకు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.62,96,704/-** (అక్షరాలా అరవై రెండు లక్షల తొంభై ఆరు వేల ఏడు వందల నాలుగు రూపాయలు మాత్రమే) తదుపరి వడ్డీ మరియు ఇతర ఒప్పంద ఛార్జీలు, జరిమానాలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. **27-01-2024**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, వారికి ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, గౌరవనీయమైన ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కమ్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, రాజమహేంద్రవరం వారు Crl.M.P.No. 431/2025 తేది. 15.10.2025 నాడు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు, సదరు చట్టం లోని సెక్షన్ 14 ను అనుసరించి, రూల్ 9 తో కలిపి, సదరు చట్టం లోని సెక్షన్ 13(4) ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని తేది.**29.11.2025**న భౌతికంగా స్వాధీనత తీసుకోపడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.62,96,704/-** (అక్షరాలా అరవై రెండు లక్షల తొంభై ఆరు వేల ఏడు వందల నాలుగు రూపాయలు మాత్రమే) + ఇప్పటి వరకు వడ్డీ మరియు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

స్థిరాస్తి షెడ్యూలు వివరములు

ఆర్థిక సంస్థకు తనఖా పెట్టిన స్థిరాస్తి వివరాలు: పైడింశెట్టి గారి కుమారుడు మట్టపర్తి జగన్నాథ రావు గారి ద్వారా తనఖా చేయబడిన వైడ్ డాక్యుమెంట్ నెం. 10326/2022 (ఎం.ఓ.డీ), ఎస్.ఆర్.ఓ. అమలాపురం.

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం సబ్-జిల్లా, అయినవిల్లి మండలం, సిరిపల్లి గ్రామ పంచాయతీ మరియు గ్రామ ఖాతాలు, ఆర్.ఎస్.నెం. 173/3 లో ఉన్న 135 చదరపు గజాలు లేదా 112.86 చదరపు మీటర్ల స్థలం మరియు గ్రౌండ్, 1వ అంతస్తులతో కూడిన డి.నెం. 2-26, అసెస్మెంట్ నెం. 176 గల ఆర్‌సిసి భవనం యొక్క హద్దులు: **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** మట్టపర్తి రుద్ర మూర్తి గారి స్థలం మొదలైనవి, **పడమర:** మట్టపర్తి సుదర్శన రావు గారి ఇల్లు మరియు స్థలం, **ఉత్తరం:** మట్టపర్తి రాఘవులు గారి కుమారులకు చెందిన ఇంటి భాగం.

తేది: 29.11.2025 అధీకృత అధికారి
ప్రదేశం: రాజమండ్రి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మహారాజశ్రీ రామచంద్రపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

క్రెడిటార్ ఐ.పి.నెం.30/2025

Between:

కొప్పిశెట్టి వెంకన్న తండ్రి:- సూర్యారావు, వయస్సు:- 45, డోర్ నెం.1-214, రామాలయం వీధి, పాలతోడు, మండపేట మండలం ... పిటీషనర్

1.మేడిశెట్టి హరిబాబు, తండ్రి శివాజీ, హిందూ, వయస్సు డోర్ నెం. 1-229, పోస్టాఫీసు వీధి, పాలతోడు, మండపేట మండలం

2.మేడిశెట్టి సీతామహాలక్ష్మి, భర్త: హరిబాబు, హిందూ, వయస్సు డోర్ నెం. 1-229, పోస్టాఫీసు వీధి, పాలతోడు, మండపేట మండలం ...రెస్పాండెంట్స్

పై నెంబరు గల క్రెడిటార్ ఐ.పి.లో 1, 2 రెస్పాండెంట్స్‌ను ఇన్సాల్వెంట్సుగా డిక్లేర్ చేయమనీ, మరియు మొదటి రెస్పాండెంట్ రెండవ రెస్పాండెంట్‌కు రాసిన సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 2754/2025, తేదీ. 6-8-2025 న రద్దు చేయమనీ కోరుతూ పై కోర్టులో క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి ఉన్నారు. వీటిపై ఎవ్వరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఎడల ది. 4-12-2025 తేదీ ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరాలను తెలియ పరుచుకోవచ్చును. లేనిచో సదరు పై పిటీషన్ ను మీ పరోక్ష మందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(గౌరవ శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేదీ: 4-12-2025

టి.వి.గోవిందరావు, టి.ఆర్.లక్ష్మి

అడ్వకేట్స్

రామచంద్రపురం, 1-12-2025. ఎస్.వి.బి. లా ఛాంబర్, సత్యశ్రీ రోడ్ మండపేట-533308, ఫోన్. 7416601159

మహారాజశ్రీ రామచంద్రపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

క్రెడిటార్ ఐ.పి.నెం.31/2025

Between:

నాగదేవర పర ప్రసాద్ తండ్రి:- సత్యనారాయణ, వయస్సు:- 35, డోర్ నెం.1-57, పోస్టాఫీసు వీధి, పాలతోడు, మండపేట మండలం .... పిటీషనర్

1.మేడిశెట్టి హరి బాబు, తండ్రి శివాజీ, హిందూ, వయస్సు డోర్ నెం. 1-229, పోస్టాఫీసు వీధి, పాలతోడు, మండపేట మండలం

2.మేడిశెట్టి సీతామహాలక్ష్మి, భర్త:- హరిబాబు, హిందూ, వయస్సు డోర్ నెం. 1-229, పోస్టాఫీసు వీధి, పాలతోడు,మండపేట మండలం ......రెస్పాండెంట్స్

పై నెంబరు గల క్రెడిటార్ ఐ.పి.లో 1, 2 రెస్పాండెంట్స్‌ను ఇన్సాల్వెంట్సుగా డిక్లేర్ చేయమని మరియు మొదటి రెస్పాండెంట్ రెండవ రెస్పాండెంట్‌కు రాసిన సెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 2754/2025, తేదీ. 6-8-2025న రద్దు చేయమని కోరుతూ పై కోర్టులో క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి ఉన్నారు. వీటిపై ఎవ్వరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఎడల ది. 4-12-2025 తేదీ ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరాలను తెలియపరుచుకోవచ్చును. లేనిచో సదరు పై పిటీషన్ ను మీ పరోక్ష మందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(గౌరవ శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేదీ: 4-12-2025

టి.వి.గోవిందరావు, టి.ఆర్.లక్ష్మి

అడ్వకేట్స్,

రామచంద్రపురం, 1-12-2025. ఎస్.వి.బి. లా ఛాంబర్, సత్యశ్రీ రోడ్ మండపేట-533308, ఫోన్. 7416601159



జిల్లాలో 150 పాఠశాలలకు కిట్ల పంపిణీ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాంబాబు

మండపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని మోడల్ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు జాదూయి పితారా కిట్లు ఎంతో ఉపయోగపడతాయని సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు. జిల్లాలోని 150 పాఠశాలలకు కిట్లు పంపిణీ చేశామన్నారు. మంగళవారం మండపేటలోని పటేల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ కిట్లతో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధనతో విద్యార్థులు చక్కగా అర్థం చేసుకుంటారని వివరించారు. ఈనెల 5వ తేదీన నిర్వహించే మెగా పీటీఎం 3.0ని ప్రధానోపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా ఎఫ్ఎల్ఎన్ సర్వే

పామర్రు, న్యూస్‌టుడే: ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించేందుకు నిర్దేశించిన ఎఫ్ఎల్ఎన్ సర్వేను పకడ్బందీగా చేస్తున్నామని డైట్ అధ్యాపకుడు కె.కృష్ణసాయి చెప్పారు. మంగళవారం కె.గంగవరం మండలం పాణింగిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆయన సర్వే నిర్వహించారు. విద్యార్థులతో గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయించారు. ఆంగ్లంలో పదాలు చదివించి, రాయించారు. తెలుగులో పదాలు, వాక్యాలు రాయించి ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో ప్రగతి పత్రాలు, పోషకాహార తోట, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి పుల్లయ్య పనితీరును మెచ్చుకున్నారు. సీఎంఆర్టీ నాతి నాగరత్నం, ఉపాధ్యాయులు వర్మ, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపోడులో డెంగీ కేసు

పామర్రు: కె.గంగవరం మండలం పేకేరు పీహెచ్‌సీ పరిధిలోని తాళ్లపోడులో డెంగీ కేసు నమోదవడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు గ్రామంలో మంగళవారం పర్యటించారు. వైద్యులు, సిబ్బందితో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. డెంగీ సోకిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. ఇంటింటా రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రై డే పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పేకేరు పీహెచ్‌సీలో ల్యాబ్, దస్త్రాలను పరిశీలించారు. వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రేఖారాణి, యూనిట్ అధికారి బిషప్, పర్యవేక్షణాధికారి మూర్తి, ఎంపీహెచ్ఈవోలు, ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్ల సోమేశ్వరాలయ ఛైర్మన్ ఆకస్మిక మృతి

ద్రాక్షారామ: వెల్ల గ్రామంలోని సోమేశ్వర, వేణుగోపాలస్వామివార్ల ఆలయ కమిటీ ఛైర్మన్ అన్యం జానకిరామయ్య (బేబీలు) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఈ ఏడాది ఆగస్టులో ఆయన ఛైర్మన్‌గా ప్రమాణం చేశారు. మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యం, ఆలయ ఈవో వైవీవీ సత్యనారాయణ, సిబ్బంది, కూటమి నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు..

కాజులూరు: విద్యుదాఘాతంతో దుగ్గుదూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం. . మూడున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని ఆయన సాగుచేస్తున్నారు. ఆదివారం పొలానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సోమ, మంగళవారాల్లో గాలిస్తుండగా సాయంత్రం పొలానికి సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో తీగలకు చుట్టుకున్న స్థితిలో మృతదేహం కనిపించింది. ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఆతని భార్య ఇటీవల మృతిచెందడంతో కుమార్తె ఇంటిలో ఆయన ఉంటున్నాడు. ప్రమాదంపై గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు..

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ భీమేశ్వర థియేటర్ కాంప్లెక్సు ఎదురుగా అరుగుపై మంగళవారం గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధుడు మృతిచెందాడు. దాదాపు ఇరవై ఏళ్లుగా ఈయన భిక్షాటనతో పాటు చిత్తు, కాగితాలు ఏరుకొంటూ జీవిస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. చలి తీవ్రత పెరిగిన కారణంగా మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పంచాయతీ అధికారుల సహకారంతో శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

కీ॥శే॥ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ చైర్‌పర్సన్, పురపాలక సంఘం, మండపేట
గౌ॥ అధ్యక్షులు: శ్రీ రెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సంఘం

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచిన ఆదర్శమూర్తి, మాకు అత్యంత ఆప్తులు శ్రీ చుండ్రు గోవింద రాజు గారి కుమారుడు **శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్** గారి అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

శ్రీ వెంకటేశ్వర ఆయిల్ ఇండస్ట్రీస్ ఎల్.ఎల్.పి., ఏడిద
శ్రీనివాసా ఫుడ్ ఇండస్ట్రీ, మండపేట
M.D.రిమ్మలపూడి రాంబాబు

చిట్టూరి సతీష్
2వ వార్డు కౌన్సిలర్, మండపేట

మేడపాటి జగన్‌మోహన్‌రెడ్డి
M.D. శ్రీరామచంద్ర పేపర్ బోర్డ్ ప్రై॥ లిమిటెడ్, ఏడిద

లయన్ దాసరి తిరుమలరావు
డిస్ట్రిక్ట్ గవర్నర్, మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ
శ్రీ సుధా ఆటోస్పేర్స్, మండపేట
సెల్: 92463 36302

కంచర్ల శ్రీనివాసరావు
ప్రెసిడెంట్: బిల్డింగ్ మెటీరియల్ డీలర్స్ అసోసియేషన్
శ్రీలక్ష్మి పెయింట్స్ & హార్డ్‌వేర్
మండపేట, సెల్: 98853 27453

Rtn. చుండ్రు అగస్తిరాజు
చుండ్రు సతీష్
S/o నారాయణచౌదరి (అబ్బూరావు గారు)
AHUJA ఆథరైజ్డ్ డీలర్, మండపేట

సంకా శ్రీనివాసరంగా
మండపేట

బెల్లపుకొండ దొరబాబు, B.A., LLB
Ex. మున్సిపల్ కౌన్సిలర్

కరాచి వాసు
యరమాటి శ్రీనివాసచౌదరి
మండపేట, సెల్: 93948 01166

వెంకటేశ్వర పౌల్ట్రీస్
మండపేట
మే॥పా॥ రిమ్మలపూడి నారాయణ

వెంకటేశ్వర ఆగ్రో పేపర్‌ప్రొడక్ట్స్ ప్రై॥ లిమిటెడ్
M.D.వంటిపల్లి కాశీవిశ్వనాథం, మండపేట

వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీ, మండపేట
వంటిపల్లి కాశీవిశ్వనాథం
వేగుళ్ళ అచ్చారావు
పసల సత్యనారాయణ

సురేంద్ర సాల్వెంట్ ఆయిల్స్ ప్రై. లిమిటెడ్
MD: చుండ్రు వెంకట్రావు, ఏడిద

శ్రీ లక్ష్మీప్రసన్న జ్యూయలర్స్
P.అబ్బు, నూని హరిబాబు
K.P.రోడ్, మండపేట
సెల్: 90002 33066

సూర్యతేజ రైస్ ఇండస్ట్రీ
కాం॥ గాయత్రి మోడరన్ రైస్‌మిల్లు
మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఏడిదరోడ్, మండపేట

మోహర్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రై॥ లిమిటెడ్
Md: చింతా రామకృష్ణారెడ్డి
ఏడిద

శ్రీ లక్ష్మి ఎలక్ట్రికల్ వర్క్స్
ప్రొ॥ R.గోవిందరాజు, R.సతీష్ & స్టాఫ్
మండపేట, సెల్: 93965 36771

శ్రీ రామకృష్ణ ఎలక్ట్రికల్ రివైండింగ్ వర్క్స్
మే॥పా॥ V.V.రామకృష్ణ & స్టాఫ్
ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ & కాంట్రాక్టర్స్

శ్రీ సీతారామా రా & బాయిల్డ్ రైస్‌మిల్
మండపేట
రెడ్డి వీరవెంకట సత్యనారాయణ

శ్రీ సాయి ఆర్థో & ట్రామా కేర్ హాస్పిటల్
Dr. K.రాము, M.S. Ortho,
మండపేట

సూర్యచంద్ర బుక్ ప్రొడక్ట్స్
మండపేట
K.V.V.శ్రీనివాస్, R.జానకిరామ్

శశి మండపేట దంత వైద్యశాల
డా॥ తాడి శశిధర్‌రెడ్డి, BDS, MDS, Ph.D.
డా॥ తాడి సుమ, MDS, Ph.D. (కృత్రిమ కట్టుడు పళ్ల స్పెషలిస్ట్)
చెన్నా రామన్న కాంప్లెక్స్, K.P.రోడ్, మండపేట, సెల్: 98581 22333

ఛాంబర్ ఆఫ్ కామర్స్, మండపేట
ప్రె॥ కాళ్ళకూరి గాల్లబాబు
సె॥ బొబ్బా సత్యసాయిరామకృష్ణ
ట్రెజరర్: సంకా పవన్

శ్రీ భక్తాంజనేయ స్వీట్స్, మండపేట
పోతంశెట్టి వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు)

ది ఆలమూరు తాలూకా కెమిస్టు & డ్రగ్గిస్టు అసోసియేషన్
ప్రె॥ బొబ్బా సత్యసాయి రామకృష్ణ
సె॥ వెలగల శ్రీనివాసరెడ్డి ట్రె॥ బొడ్డు ప్రసాద్

బుంగ సంజయమాదిగ
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి
వ్యవస్థాపక అధ్యక్షులు
మండపేట, సెల్: 94928 00999

రౌతు తాడియ్య గారి సన్స్
రౌతు రాజు
రౌతు అయ్యప్పస్వామి, మండపేట

రాయల్ ఫ్లెక్స్
మండపేట
Cell : 70957 12345

అక్షయ మల్టీక్యూజన్ ఫ్యామిలీ రెస్టారెంట్
బాబు & బాబు కన్వెన్షన్
ఆలమూరు రోడ్, మండపేట, సెల్: 94410 16116, ఫోన్: 08855 - 231116

శ్రీ మహాగణపతి సీతారామచంద్రస్వామి
కనకదుర్గ అమ్మవారి దేవస్థానం
పాటిమీద, MRO ఆఫీస్ పక్కన, మండపేట

B.S.R.వైన్స్, కేశవరం
బూసాల శ్రీనివాసరావు

కొనగళ్ళ సత్యనారాయణ
(సత్తిపండు), మండపేట

శ్రీ లక్ష్మి దివ్యచంద్ర రా & బాయిల్డ్ రైస్‌మిల్
మే॥పా॥ కొనగళ్ళ విశ్వనాథం, మండపేట

శ్రీ అన్నపూర్ణ రైస్ ఇండస్ట్రీ
మండపేట
మే॥పా॥ మండవిల్లి వెంకటేశ్వరరావు

సువర్ణ వర్తక సంఘం, మండపేట
ప్రె॥ సంకా శ్రీనివాస రంగారావు
సె॥ పేరపు భాస్కరరావు

LIONS INTERNATIONAL
లయన్స్ క్లబ్
మండపేట

గడి రాంబాబు
గడి సత్యవతి
Ex. మున్సిపల్ వైస్‌చైర్మన్, రాష్ట్ర తూర్పుకాపు డైరెక్టర్, మండపేట

కొమ్ము శివకేశవరావు
కొమ్ము వెంకటేష్, మండపేట

రేడీమేడ్ & క్లాత్ మర్చంట్
మండపేట

కాళ్ళకూరి స్వరాజ్యభవాని
17వ వార్డు కౌన్సిలర్,
W/o K.K.శ్రీనివాస్, మండపేట

గుండు రామతులసి, 4వ వార్డు కౌన్సిలర్
గుండు వీరతాతీరాజు, TDP నాయకులు, మండపేట

యరమాటి గంగరాజు, B.A., 3వ వార్డు కౌన్సిలర్
గంగరాజు ఆగ్రో సీడ్స్, మండపేట, సెల్:

యరమాటి సూర్యప్రకాష్, MCA
హరే రామా హరే కృష్ణ టూర్స్ & ట్రావెల్స్
మండపేట, సెల్: 96666 61542

AERO FLEX
MATTRESS PRODUCTS
Mandapeta, Shaik Moulana

షేక్ ఇబ్రహీం, మండపేట
మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు

పిల్లి గణేశ్వరరావు, మండపేట
మున్సిపల్ వైస్‌చైర్మన్
సెల్: 9959 399 899

శ్రీరామ్ స్టూడియో, మండపేట
Ln. చక్కా రాంబాబు, MJF
Cell: 98496 58999

రమేష్ ఇండస్ట్రీస్
ప్రొ: G.గోవిందు, ఆలమూరు రోడ్, మండపేట
సెల్: 99891 21555

కిరాణా వర్తక సంఘం, మండపేట
ప్రెసిడెంట్: బోనగిరి బాబ్జి, సెక్రటరీ: కందుల సూరిబాబు

మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండల ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్

లక్ష్మీచాతుర్య ఆగ్రోస్
ప్రొ: చేవా శ్రీహరిబాబు
H.O.:లొల్ల, B.O: సోమేశ్వరం,
సెల్: 97044 00666

శ్రీ సంతోష్ సౌజన్య ఏజెన్సీస్
మే॥పా॥ సబ్బారాపు సత్యానందం
పసలపూడి, చెల్లూరు

శ్రీ సాయిగణేష్ ట్రేడర్స్
V.V.V.సత్యనారాయణ (బాబి),
కూర్మాపురం, సెల్: 94925 08418

శ్రీ వేణుగోపాల్ ఫెర్టిలైజర్స్
రిమ్మలపూడి సుబ్బారావు,
మాచవరం, సెల్: 77023 11889

ప్రతాప్ ఏజెన్సీస్
ప్రొ: కొవ్వూరి వీరభద్రారెడ్డి,
వెదురుపాక, సెల్: 94913 34443

శ్రీ విజయ ఎంటర్‌ప్రైజెస్, పసలపూడి
మే॥పా॥ సబ్బారపు సంతోష్‌కుమార్

శ్రీ సీతారామ ఏజెన్సీస్,
అంగర
ప్రొ: ప్రగడ అర్జునరావు

CSV ఎంటర్‌ప్రైజెస్, కపిలేశ్వరపురం
ప్రొ: సత్తిబాబు, సెల్: 98665 02233

Satya Sai Traders, Machara
Pro: Adapa Satya Sai Baba
Cell: 98493 31583

లక్ష్మీ ఆగ్రో ఫెర్టిలైజర్స్
వల్లూరు, గుణ్ణం రాజశేఖర్, గుణ్ణం మణి చౌదరి
సెల్: 90000 40707

శ్రీ కల్కి చెన్నకేశవ ఏజెన్సీస్
మెయిన్‌రోడ్, అర్తమూరు
Y.V.V.సత్తిబాబు, సెల్: 99498 46966

లక్ష్మీ శ్రీనివాసా ఏజెన్సీస్
మున్న శ్రీనివాస్, కేశవరం, సెల్: 99120 64836

శ్రీ ధరణి ట్రేడర్స్, నాగిరెడ్డి శ్రీనివాస్,
కేశవరం, సెల్: 99599 12610

శ్రీ పరమేశ్వర ఫెర్టిలైజర్స్, బైలిశెట్టి రాంబాబు,
కేశవరం, సెల్: 94914 38297

సాయి గణేష్ ఫెర్టిలైజర్స్
పురంశెట్టి శ్రీనివాస్, కేశవరం, సెల్: 90597 68229

శ్రీ సత్య సూర్య ఏజెన్సీస్
రిమ్మలపూడి శ్రీనివాస్, ఇప్పనపాడు
సెల్: 98481 26988

M/s. బోడా సుబ్రహ్మణ్యం
బోడా చిరంజీవిరావు & సన్స్, ఇప్పనపాడు

శ్రీ వీరాంజనేయ ఏజెన్సీస్, తుమ్మా వీరబాబు
పాలతోడు, సెల్: 99087 23888

రాజేశ్వరి ట్రేడర్స్, కొండపల్లి బాలాజీ
ఏడిద, సెల్: 91825 01114

రామకృష్ణ ఏజెన్సీస్, మాసిన భాస్కరరావు,
తాపేశ్వరం, సెల్: 7799 33 4142

M/s. ప్రసాద్ ఏజెన్సీస్
ఏడిద, సెల్: 99089 55808

అద్దేపల్లి ముత్యాలరావు & సన్స్,
(పురుగుమందుల వ్యాపారం)
మండపేట, Cell: 91600 75838

శ్రీలక్ష్మి అపూర్వ ఏజెన్సీస్, ప్రొ॥ L.శ్రీనివాసరావు
మండపేట, Cell: 96665 48011

శ్రీలక్ష్మి ఫెర్టిలైజర్స్ & జనరల్ స్టోర్స్
ప్రొ॥ పిల్లా శ్రీనివాస్, B.Sc.,
పాలతోడు, Cell: 94915 19162, 83095 37715

శ్రీ వెంకటసుధీర్ ఏజెన్సీస్
ప్రొ: A.లక్ష్మీనారాయణ, సోమేశ్వరం

శ్రీ కోటేశ్వర ఫెర్టిలైజర్స్
V.నరసింహారావు, అంగర, సెల్: 98666 09046

శ్రీలక్ష్మి కామాక్షి ఆగ్రోస్
బలుసు గోపి, రాయవరం

శ్రీరామా ఏజెన్సీస్
ప్రొ॥ బండారు ఏడుకొండలు, నదురుబాద

శ్రీ వరలక్ష్మి ఏజెన్సీస్
చుండ్రు లక్ష్మీనారాయణ, చెల్లూరు

ఎనర్జీ క్రాప్ సైన్స్
రెడ్డి శ్రీనివాసరావు, పసలపూడి

శ్రీరామా ఏజెన్సీస్
ప్రొ: N.మల్లారెడ్డి, పసలపూడి

హిమరత్న & తారకరామరెడ్డి ఏజెన్సీస్
ప్రొ: K.సత్యనారాయణరెడ్డి, పసలపూడి

పట్టాభిరామ ఏజెన్సీస్
ప్రొ: పసల సూర్యప్రసాద్, చెల్లూరు

శ్రీకృష్ణ ఏజెన్సీస్
ప్రొ: వి.సుందరం, చెల్లూరు

శ్రీ దుర్గా పోలరాజు ఏజెన్సీస్
ప్రొ: దుర్గా పోలరాజు, రాయవరం

N.R.S.ఏజెన్సీస్
ప్రొ: N.S.V.రమణ, చెల్లూరు

ఓం నమశ్శివాయ ఏజెన్సీస్
ప్రొ: బలుసు వరప్రసాద్, రాయవరం

శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్
ప్రొ: కొట్నాల హరినారాయణ, రాయవరం

సూర్యసాయి ఏజెన్సీస్
బండారు వెంకటరమణ, వెదురుపాక, సెల్: 99499 50995

శ్రీ లక్ష్మి ప్రసన్న ఎంటర్‌ప్రైజెస్, మాచర
ప్రొప్రయిటర్: గుర్రాల సత్యతారకృష్ణ
సెల్: 93904 28756, 88865 95333

శ్రీ లక్ష్మి సత్యఏజెన్సీస్, కోరుమిల్లి
ప్రొప్రయిటర్: సుంకర శ్రీనివాసరావు
సెల్: 93944 16666, 98666 30966

ప్రసన్న ఎంటర్‌ప్రైజెస్, మాచరమట్ల
ప్రొ: శీలం రాంబాబు, సెల్: 99597 70378

శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీస్, వల్లూరు
ప్రొ: కె.శ్రీనివాస్
సెల్: 86396 52675, 77024 60177

శ్రీ శ్రీనివాస ఫెర్టిలైజర్స్ & పెస్టిసైడ్స్, టేకి
ప్రొప్రయిటర్: గుత్తుల శ్రీనివాస్, సెల్: 94921 46254

శ్రీ రామసాయి ఎంటర్‌ప్రైజెస్, మాచర
ప్రొప్రయిటర్: చోడిశెట్టి శ్రీనివాసరావు, సెల్: 94907 41497

Sri Venkateswara Enterprises, Kaleru
Proprietor: Gunnam Srinivas
Cell: 89196 16123, 99598 38055

Sri Ramalakshmi Agro Agencies, Vedurumudi
Proprietor: Chundru Srinivas
Cell: 94405 23517, 78930 82517

Sri Lakshmi Janardhana Enterprises, Machara
Proprietor: Karedla Anilkumar
Cell: 63039 53829, 94927 80702

Sri Suryachandra Fertilizers
Macharamatla
Pro: Narala Nagaraju, 97058 39413

శ్రీ మెహెర్‌బాబా మెన్యూర్స్ అండ్ జనరల్ స్టోర్స్, కాలేరు
ప్రొప్రయిటర్: శ్రీమతి & రాయుడు వీర వెంకట సత్యనారాయణ, విజయుందిర బులి రాజ్యలక్ష్మి

Swarupa Sri Enterprises, Teki
Pilla Shiva Shankar
Cell: 95506 89699

Sri Krishnarjuna Fertilisers & Pesticides, Teki
Pro: MVV Satyanarayana, Cell: 6300154124

శ్రీకృష్ణసాయి ఏజెన్సీస్, పడమరఖండ్రిక
ప్రొ: కృష్ణార్జున

SUDHEER FERTILIZERS AND GENERAL
Proprietor : PANTAM RAJU
Angara, Ph: 99895 13500

శ్రీ విజయలక్ష్మి ఫెర్టిలైజర్స్, అంగర
ప్రొ: B.వెంకటేశ్వరరావు, సెల్: 98667 50027

పాలమూరి శ్రీనివాసు, చైర్మన్: ఎల్లారమ్మ దేవస్థానం
మండపేట, సెల్: 93910 85377

శ్రీలక్ష్మి గణపతి ఎంటర్‌ప్రైజెస్,
యలమాల శ్రీనివాసరావు,
వెగలతోడు, Cell: 99485 15098

రామచంద్రపురం టౌన్, మండల ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్

పెనుమర్తి నారయ్యచౌదరి, వంక నారాయణరావు, పుట్టా శ్రీనివాసు, వల్లూరి శ్రీహరి, బలపరెడ్డి సత్యన్నారాయణ, వల్లూరి రవీంద్రచౌదరి, నార్పిన సతీష్‌కుమార్, సుంకర మురళి, సత్యవరపు రాజేశ్వరరావు, చీకటి ఏకాంబరం, దుద్దుకూరి శ్రీనివాస్

(c) eenadu

జిలేబీలు వేసిన న్యూజిలాండ్ ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ జిలేబీలు వేస్తూ సందడి చేశారు. ఆక్లాండ్‌లోని టకానినిలో సిక్కు వర్గీయులు నిర్వహించిన క్రీడలకు స్థానిక ఎంపీ రిమా నక్లేతో కలిసి న్యూజిలాండ్ ప్రధాని హాజరయ్యారు. అందరితో ముచ్చటించిన అనంతరం జిలేబీలు వండుతున్న చోటుకు వెళ్లి.. సరదాగా కాసేపు జిలేబీలు వేశారు. అక్కడున్న వారికి స్వయంగా తానే జిలేబీలు అందించారు. ఈ వీడియోను క్రిస్టఫర్ సోషల్ మీడియాలో షేర్‌చేయడంతో వైరల్‌గా మారింది.

హిట్లర్ కాలం నాటి 5 కిలోల ఫోను!

ఈటీవీ భారత్: అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్లు వాడుతున్న నేటి తరానికి 5 కిలోల బరువైన ఫోను అంటే వింతగానే ఉంటుంది. జర్మన్ నియంత హిట్లర్ కాలం నాటి ఈ ఫోన్‌ను చూడాలంటే చండీగఢ్‌లో జరుగుతున్న హస్తకళల ప్రదర్శనకు వెళ్లాలి. రాజస్థాన్‌కు చెందిన వినయ్‌శర్మ పోలండ్ నుంచి దీన్ని కొన్నారు. "గతకాలపు పిలుపు" పేరుతో ఈయన ఏర్పాటుచేసిన స్టాల్‌లో పాతకాలపు కెమెరాలు, ఫోన్లు, గడియారాలు, రేడియోలు ఆకట్టుకొంటున్నాయి. గత కాలపు ప్రాధాన్యం, మన పెద్దల కృషిని ఈ తరం గుర్తించాలన్నది తన అభిమతమని ఆయన చెబుతారు.

గొప్ప జీవక్రియతో శ్రమలేని ఆరోగ్యం

మన జీవక్రియల పనితీరు బాగుంటే శ్రమలేకుండానే ఆరోగ్యం సొంతమైనట్లు. అవి ఉత్తమంగా ఉన్నాయనడానికి నిదర్శనం ఇవి..
✦ గాఢమైన నిద్ర. ✦ రోజంతా స్థిరమైన శక్తిని కలిగిఉండటం.
✦ చక్కటి జీర్ణశక్తి. ✦ శరీరంలో కొవ్వు సులువుగా కరుగుతుండటం.. ఆకలిపై నియంత్రణ.

– సుమిత్ శర్మ, డాక్టర్

ఈఎన్‌టీ వైద్యుడి అంబులెన్స్ కారు
పేదలకు అండగా సేవలు

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరానికి చెందిన చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వ్యాధుల వైద్యుడు జె.ఎస్. గణ్వీర్ వృద్ధులు, పేదల సహాయార్థం టెలిమెడిసిన్ సేవలు ప్రారంభించి.. సొంత కారును అంబులెన్సుగా మార్చారు. చాలామంది పేద రోగుల ఇబ్బందులు చూసి వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచనతో తన కారు అంబులెన్సును పూర్తి టెలిమెడిసిన్ క్లినిక్‌గా మార్చినట్లు గణ్వీర్ తెలిపారు. "నేను, నా సహోద్యోగి డాక్టర్ సోనమ్ కలిసి ఈ అంబులెన్సులో రోగుల ఇళ్లకు వెళతాం. కారులో ఉన్న పరికరాలతో వారిని పరీక్షిస్తాం. ఇండోర్‌లో ఉన్న మా క్లినిక్ నుంచి వీడియోకాల్స్, ఫోన్‌కాల్స్ ద్వారా టెలిమెడిసిన్ సేవలను అందిస్తాం" అని వివరించారు. ఈ సేవలకు అదనపు రుసుం లేనందున డాక్టర్ గణ్వీర్ 'కారు అంబులెన్స్' ఇండోర్‌లో బాగా ప్రాచుర్యం పొందింది.

ఈటీవీ భారత్ – యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

షాజహాన్‌కు ఓటేయాలని
సోషల్ మీడియాలో ప్రజల ప్రచారం

కేరళలోని నిలంబూర్ మున్సిపాలిటీ 11వ డివిజను కార్పొరేటరుగా టీఎంసీ మద్దతుతో పోటీ చేస్తున్న షాజహాన్ గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. బరిలో ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నా.. షాజహాన్ చర్చనీయాంశంగా మారారు. సామాజికసేవలో ముందుండే ఈయన గతంలో అంబులెన్స్ డ్రైవరుగా పనిచేశారు. గతేడాది వరద ప్రాంతాల సహాయక చర్యల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. అయినా నిలంబూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో షాజహాన్ ఇవేవీ చెప్పుకోవడం లేదు. ఆయన సేవాగుణం గురించి స్వయంగా ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొట్టాయంకు చెందిన ఓ కుటుంబం పెట్టిన వీడియో వైరల్ అవుతోంది. అయిదేళ్ల కిందట.. ఈ కుటుంబంలో అందరికంటే చిన్నదైన ఐశ్వర్యకు ఉచితంగా కిడ్నీ ఇచ్చి షాజహాన్ ప్రాణదానం చేశారు.

సర్‌పై రుసరుస

- పట్టువీడని విపక్షాలు
- పార్లమెంటులో ప్రతిష్టంభన
- ప్రతిపక్ష నేతల్ని చర్చకు ఆహ్వానించిన ప్రభుత్వం

ఆందోళనలో పాల్గొన్న రాహుల్, కేసీ వేణుగోపాల్, సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

దిల్లీ: ఓటర్ల జాబితాల 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) అంశంపై విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీయడంతో మంగళవారం పార్లమెంటు ఉభయసభలు స్తంభించిపోయాయి. వివిధ అంశాలను చర్చకు చేపట్టాలని ప్రభుత్వం తరపున ప్రయత్నం జరిగినా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రతిపక్ష నేతల్ని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. అంశాన్ని చర్చించడానికి సిద్ధమేనని, నిర్దిష్ట సమయ పరిమితి మాత్రం విధించలేమని తెలిపింది. లోక్‌సభ ఉదయం సమావేశమయ్యాక రెండుసార్లు వాయిదాపడింది. భోజన విరామానంతరం మళ్లీ సమావేశమైనప్పుడు విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్‌పై చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, సభను కొనసాగనివ్వాలని సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా కోరారు. ఓటమి చెందిన ఆగ్రహాన్ని సభలో చూపించరాదని, మాజీ ప్రధాని వాజ్‌పేయీకీ ఓటమి తప్పలేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శూన్యగంట పది నిమిషాల్లో ముగిసింది. స్థాయీసంఘాలు నివేదికల్ని సమర్పించాయి.

9న చర్చించడానికి అంగీకారం

వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తికావడంపై ప్రత్యేక చర్చను ఈ నెల 8న, ఎన్నికల సంస్కరణలపై 9న లోక్‌సభ చర్చించనుంది. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశానికి ముందు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రిజిజు 'ఎక్స్'లో తెలిపారు. ఒక్కో చర్చకు ఒక్కో సభకు 10 గంటలు చొప్పున సమయం కేటాయించారు. అంతకుముందు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆప్, ఎస్పీ, సీపీఎం తదితర పార్టీల సభాపక్ష నేతలతో జరిగిన సమావేశంలో రిజిజు మాట్లాడుతూ ప్రభుత్వానికి విపక్షాలు నిర్దేశాలు ఇవ్వజాలవని స్పష్టంచేశారు.

మకరద్వారం వద్ద నిరసన

విపక్షాలకు చెందిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కనిమొళి, టి.ఆర్.బాలు, జాన్ బ్రిట్టాస్ సహా పలువురు నేతలు పార్లమెంటు మకరద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమైన చర్చల నుంచి ప్రధాని మోదీ నిరంతరం తప్పించుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఓటుహక్కుకు మించిన పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రశ్నించారు.

తిరస్కరణకు కారణమైనా చెప్పండి

ఇదే అంశంపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 267 నిబంధన కింద చర్చకు అనేక పార్టీలు పట్టుపడుతున్నప్పుడు చర్చ చేపట్టాల్సిందేనని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. వాయిదా తీర్మానానికి ఇచ్చిన 21 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఎవరి నోటీసులను తిరస్కరించారనేదైనా చెప్పాలని ఖర్గే ప్రశ్నించారు. వందేమాతరంపై కంటే సర్‌పై చర్చకు తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో విపక్షఎంపీలు వాకౌట్ చేశారు.

నేడు విపక్ష నేతల భేటీ

సమావేశాల్లో ఉమ్మడిగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి విపక్ష నేతలు బుధవారం ఉదయం ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నారు.

రేపే భారత్‌కు పుతిన్

మన దేశంతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు ఆమోదం

మాస్కో: భారత్‌తో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు దిగువ సభ డ్యూమా ఆమోదం తెలిపింది. రవాణాలో పరస్పర మార్పిడి సహకారానికి (రెలోస్) గత ఫిబ్రవరిలో కుదుర్చుకున్న ఈ ఒప్పందానికి సై అంది. గురు, శుక్రవారాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ఒప్పందానికి సభ ఆమోదం తెలపడం విశేషం. పుతిన్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. వాణిజ్యం, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలకు వారు శ్రీకారం చుట్టనున్నారు. అమెరికాతో సంబంధాలు దెబ్బతిన్న ఈ తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, చైనా, భారత్ బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పుతిన్ తెలిపారు. 'గత మూడేళ్లలో ఈ దేశాల మధ్య వాణిజ్య బంధం మరింత విస్తరించింది. ఇంధనం, పారిశ్రామికం, అంతరిక్షం, ఇతర రంగాల్లో ఇప్పటికే ఎన్నో సంయుక్త భాగస్వామ్యాలున్నాయి. నా భారత్ పర్యటనలో ఆర్థిక అంశాలపైనా చర్చిస్తాం' అని పుతిన్ తెలిపారు.

రెలోస్ ఎంతో కీలకం

రెలోస్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాల మధ్య సైనిక నిర్మాణాలు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల పరస్పర మార్పిడి ఉంటుంది. బలగాల పంపిణీలోనే కాకుండా పరికరాలు, రవాణానూ రెలోస్ నియంత్రిస్తుంది. ఈ ఏర్పాటును సంయుక్త విన్యాసాలు, శిక్షణ, మానవతా సాయం, విపత్తుల సమయంలో వినియోగిస్తారు. డ్యూమా వెబ్‌సైట్‌లో నోట్ ప్రకారం.. రష్యా పార్లమెంటు ఆమోదించిన పత్రాల్లో.. రెండు దేశాల గగనతలాన్ని, పోర్టులను రష్యా, భారత్ యుద్ధ నౌకలు వినియోగించుకుంటాయి.

రెండు దశల్లో జన గణన

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తాం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

దిల్లీ: దేశంలో జన గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026 ఏప్రిల్-సెప్టెంబరు మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ సంబంధిత వివరాలను పేర్కొన్నారు. అదే సమయంలో కుల గణనను కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

■ **తొలి దశలో...** గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు) ■ **రెండో దశలో...** జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1)
■ లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ప్రతికూల వాతావరణ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబరు- అక్టోబరు 1. ■ ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగానే కుల గణన కూడా జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

30 ప్రశ్నలతో వివరాల సేకరణ

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా 30కి పైగా ప్రశ్నలతో జన గణన పత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు.

■ సర్వేలో.. ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు నిర్మాణం తీరు, నివాసితుల సంఖ్య, గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

డిజిటల్ విధానంలో ..

ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తామని, స్వీయ గణనకు ఇదెంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.
■ మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

ఐరోపా కోరుకుంటే యుద్ధానికి సై: పుతిన్

మాస్కో: ఐరోపా ఖండం యుద్ధం కోరుకుంటే తాము అందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో వివాదంపై ఒక అంగీకారం కుదరకుండా ఐరోపా నేతలు అడ్డు తగులుతున్నారని ఆయన ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంతానికి చర్చలు జరిపేందుకు అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మాస్కోకు వచ్చి తనతో సమావేశమైన తరుణంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "యూరప్‌తో యుద్ధం చేయాలని మేం అనుకోవడం లేదు. యూరప్ తానుగా యుద్ధం కోరుకుంటుంటే, యుద్ధాన్ని ప్రారంభిస్తే మేం అందుకు సిద్ధంగా ఉన్నాం" అని పుతిన్ విలేకరులకు చెప్పారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో సవరణలపై జెలెన్స్కీ సానుకూలంగా స్పందించారు. మార్పుల అనంతరం ప్రణాళిక మెరుగ్గా ఉందన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

"ప్రకాష్ గారు ఇక లేరు" అనే వార్త విన్న అందరి మనస్సులలో
"ఒక నిశ్శబ్ద నైరాశ్యం!" అది మాటలలో వర్ణించలేని "బాధాతప్త హృదయ వేదన!"
ఈ నిజాన్ని ఈ రోజుకూ జీర్ణించుకోలేని "మా నిస్సహాయత!"
మహా మనిషి, అజాత శత్రువు, అందరి వాడు
ఇక 'అందని దూరాలకు' తరలి వెళ్ళాడు.
తన ముద్రను అందరి హృదయాలలో శాశ్వతంగా ముద్రించుకుని వెళ్ళిన "ప్రకాష్"
ఎప్పటికీ చిరస్మరణీయులు, అమరజీవి.
ఆ అమృతమూర్తికి అశ్రునయనాలతో...

కీ॥శే॥ చుండ్రు శ్రీవరప్రకాష్ గారు
మాజీ ఛైర్‌పర్సన్, పురపాలక సంఘం, మండపేట
గౌ॥ అధ్యక్షులు: శ్రీ రెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సంఘం

వేగుళ్ళ లీలాకృష్ణ ఛైర్మన్: ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ (APSIDC)	డా॥ బిక్కిన గోపాలకృష్ణ బిక్కిన నర్సింగ్ హోమ్ శ్రీ కన్వెన్షన్, H.P. గ్యాస్ కంపెనీ	యినపకోళ్ళ సత్యనారాయణ (ISN)	వల్లూరి మెహెర్ చైతన్య	మల్లిపూడి గణేశ్వరరావు సీనియర్ TDP నాయకులు
Sri Gayatri Edible Oils Pvt. Ltd., ABC Fueling Station	వల్లూరి వీర్రాజు (వీరబాబు)	చుండ్రు పట్టాభిరామయ్య (రాంబాబు) Ex.కౌన్సిలర్	మాసిన పళనికుమార్ విజయ్ ఆటోకేర్	శ్రీవత్స కన్వెన్షన్ హాల్ పసల శ్రీనివాసరావు (కొండ), మల్లిపూడి శ్రీనివాస్, మల్లిపూడి అమర్‌నాథ్, 76750 27999
బిక్కిన శ్రీను బిక్కిన బాలయ్య	యినపకోళ్ళ గణేష్ చౌదరి డైరెక్టర్ · కొప్పాక సత్యనారాయణ (బాబి) అకడమిక్ డైరెక్టర్ VIGNAN 31 విజ్ఞాన్ విద్యాసంస్థలు స్కూల్ - జూనియర్ కాలేజి - డిగ్రీ కాలేజి అలమూరు రోడ్, మండపేట, తూ॥గో॥ జిల్లా ఫోన్ : 08855 232876, సెల్ : 99490 30999	AKSHARA EM SCHOOL | GURUKULAM EM SCHOOL విజ్ఞాన్ రాంబాబు బొప్పన వెంకట్రావు	వాసా రవికిరణ్ బాబు Ex.కౌన్సిలర్	బండి గోవిందు టౌన్ ప్రెసిడెంట్: శెట్టిబలిజ సంఘం Ex.కౌన్సిలర్
శిరంగు జ్యోతి ఈశ్వరరావు 10వ వార్డు కౌన్సిలర్	జాగు నెహ్రూ	ఉండమట్ల వాసు మల్లిపూడి రామకృష్ణ వారాహి జనరిక్ మెడికల్స్	వల్లూరి చిన్నారావు MPS స్కూల్స్ & జూనియర్ కాలేజి	పెదపాటి శ్రీనివాస్ శ్రీ భరత్ స్వీట్స్
గంటా మంగబ్బాయి చౌదరి	చుండ్రు పవన్‌కుమార్	యాదగని మధురాజు	NAKSHATRA REALTY భోగిళ్ళ V.V.S.చౌదరి Cell: 99899 00333	వల్లూరి చక్రపాణి VBC ఇంజినీరింగ్ ప్రై॥ లిమిటెడ్

ప్రెసిడెంట్: రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), శ్రీ రెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సంఘం, మండపేట

(c) eenadu

గోదావరి గట్టు.. బలపడేటట్టు..!

సిద్ధమైన ప్రతిపాదనలు

బలహీనపడిన గోదావరిగట్టు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అఖండ గోదావరి తీర ప్రాంతాన్ని పటిష్ఠం చేసే దిశగా సర్కారు దృష్టిసారిస్తోంది. గోదావరికి ఏటా వచ్చే వరదల కారణంగా గట్టు కొంత మేర దెబ్బతింటోంది. పైగా ఇసుక అక్రమ తవ్వకాలకు ఎక్కడికక్కడ బాట వేయడంతో బలహీనమవుతోంది. దీనిలో భాగంగా అటు ధవళేశ్వరం నుంచి సీతానగరం వరకూ, ఇటు బొబ్బర్లంక మీదుగా విజ్జేశ్వరం వరకూ గట్టు రోడ్డు విస్తరించేందుకు జలవనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

ఘాట్‌ల ఆధునికీకరణకు..: పుష్కర ఆతిథ్య నగరం, అఖండ గోదావరి తీరమైన రాజమహేంద్రవరంలో ఘాట్‌లు పూర్తిగా విస్తరించనున్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని వీటిని అనుసంధానం చేస్తున్నారు. ధవళేశ్వరం నుంచి రాజమహేంద్రవరం గ్రామీణం, అర్బన్, కాతేరు మీదుగా సీతానగం వరకూ విస్తరించనున్నారు. వీటి పరిధిలో రూ 41.4 కి.మీ మేర 36 ఘాట్‌లను తీర్చిదిద్దనున్నారు. దీని కోసం రూ 39.15 కోట్లుతో ప్రతిపాదించారు. ఇప్పటికే ధవళేశ్వరం నుంచి కాతేరు వరకూ 17 ప్రధాన ఘాట్‌లు ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో కూడా గతంలో నిర్మించిన ఘాట్‌లను ఆధునికీకరించనున్నారు.

- కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల పరిధిలో విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకూ రూ 33 కి.మీ మేర గట్టు రోడ్డు విస్తరించనున్నారు. దీని కోసం రూ. 66 కోట్లు ప్రతిపాదించారు.
- బొబ్బిల్లంక నుంచి సీతానగరం ఏటిగట్టు బలోపేతానికి 32 కి.మీ మేర విస్తరణకు రూ 115.32 కోట్లతో పనులు చేపట్టనున్నారు.
- రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 13.కి.మీ మేర గట్టు బాగు చేసేందుకు రూ 33.62 కోట్లు వెచ్చించనున్నారు.

మీపైనే ఆశ.. ఇవ్వాలి భరోసా



ఏళ్లుగా ఎర్రకాలువ ముంపు సమస్య.. ● ఎత్తిపోతల పథకాలకూ మోక్షం దక్కాలి

న్యూస్‌టుడే – గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి

ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల మండలంలో పర్యటించనున్నారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొని రైతులతో ముచ్చటిస్తారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలోని ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రకాలువ.. ముంపు చిక్కులు తొలగేనా

ఏలూరు జిల్లా కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి నల్లజర్ల మండలం మీదుగా నిడదవోలు వరకు ఎర్రకాలువ ప్రవహిస్తుంది. ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహించడంతో వేలాది ఎకరాల పంట మునుగుతోంది. నల్లజర్ల మండలం గుండేపల్లి, తెలికిచర్ల, తూర్పు, పశ్చిమ చోడవరం, నబీపేటతో పాటు నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో ముంపు నీరు చేరుతోంది. గట్లు కోతకు గురయ్యాయి. కాలువలో పూడిక తొలగించి గట్లను పటిష్ఠం చేయాలని రైతులు కోరుతున్నారు.

కుడికాలువకు నీటి విడుదల ఏదీ..?

సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2003లో అప్పటి సీఎం చంద్రబాబు హయాంలో కుడి కాలువ నిర్మాణానికి ప్రతిపాదించారు. 2006లో కాలువ పూర్తికాగా.. నల్లజర్ల మండల పరిధిలో 12,325 ఎకరాలకే సాగు నీరు అందింది. కాలువ నిర్వహణ పనులు సక్రమంగా చేయక కొన్నేళ్లుగా నీరు విడుదల చేయడం లేదు. గండ్లను పూడ్చి, పూడిక తీసి నీరు విడుదల చేయాల్సి ఉంది.

తాడిపూడి..ఆశల సడి

బుచ్చియ్యపాలెం వద్ద తాడిపూడి లిఫ్టు-5 కాలువ

దేవరపల్లి, గోపాలపురం మండలాల పరిధిలో సుమారు 12 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు తాడిపూడి లిఫ్టు-5 ఏర్పాటుచేశారు. బంధపురం వద్ద ప్రధాన కాలువ నుంచి ఎత్తిపోసి కొంతమేర పైపులైన్, అక్కడి నుంచి కాలువ పనులు 80 శాతం పూర్తయిన తరుణంలో నిలిచిపోయాయి. ● చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వైకాపా ఐదేళ్ల పాలనలో పట్టించుకోక పనులు నిలిచిపోయాయి. పూర్తిచేస్తే సుమారు 2 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి.

వంతెన పూర్తికాక అగచాట్లు

దేవరపల్లి-లక్ష్మీపురం మధ్య నిలిచిపోయిన వంతెన

దేవరపల్లి నుంచి లక్ష్మీపురం వెళ్లాలంటే పోలవరం కుడికాలువ, తాడిపూడి కాలువ దాటాలి. దీనిపై వంతెన నిర్మాణానికి అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో కొంత పనులు చేసి మధ్యలో నిలిపివేశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. వంతెన లేక లక్ష్మీపురం వెళ్లాలంటే 5 కి.మీ చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

రైతులతో ముచ్చట.. శ్రేణులకు దిశా నిర్దేశం

వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహకిశోర్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. నల్లజర్లలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రాంగణంలోరైతన్నా.. మీకోసం ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. ఉద్యాన, వ్యవసాయ, ప్రకృతి సేద్యం చేస్తున్న 1,200 మంది రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. నియోజకవర్గంలో సుమారు 1000 మంది పార్టీ శ్రేణులతో మాట్లాడి దిశానిర్దేశం చేస్తారు. ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలో తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లజర్ల సభా ప్రాంగణం సమీపంలోని హెలీపాడ్‌కు చేరుకుంటారు. ఇక్కడ ప్రకృతి సేద్యానికి అవసరమైన కషాయాల స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం రైతులు, రైతు కుటుంబాలతో మాట్లాడతారు. ● మధ్యాహ్నం 01.45 నుంచి 3.15 వరకు సభా వేదిక వద్ద పార్టీ శ్రేణులతో మమేకం అవుతారు. ●జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్, ఎమ్మెల్యే వెంకటరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభా వేదిక వద్ద ఏర్పాట్లను ఐజీ అశోక్‌కుమార్ స్వయంగా పరిశీలించారు.

ఈ మాస్టారి జీవితం.. స్ఫూర్తిదాయక పాఠం..!

ఆదర్శం

సాధించాలనే పట్టుదల ఉంటే వైకల్యం అడ్డురాదని రాజమహేంద్రవరం గ్రామీణం ధవళేశ్వరం గ్రామానికి చెందిన మానుపాటి ప్రవీణ్ కుమార్ నిరూపించారు. పుట్టుకతోనే పోలియో సోకినప్పటికీ అధైర్యపడలేదు. డిగ్రీ, బీఈడీ పూర్తి చేశారు. వీల్‌ఛైర్ క్రికెట్, వీల్‌ఛైర్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ ఆడుతూ పలు పోటీల్లో రాణించారు. 2021లో కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి వీల్‌ఛైర్ బ్యాడ్మింటన్ పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలోనూ ప్రతిభ కనబరిచారు. ఈ ఏడాది డీఎస్సీలో క్రీడా కోటాలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఏఎస్ఆర్ జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేటలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని, ఆటవిడుపుగా నేర్చుకున్న ఆట జీవితాన్ని ప్రసాదించిందని ప్రవీణ్ అంటున్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

మానుపాటి ప్రవీణ్, వీల్‌ఛైర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

ఐఐఎఫ్‌టీకి ప్రభుత్వం దన్ను

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.57.10 కోట్ల విడుదలకు సమ్మతి

ఈనాడు, కాకినాడ

భారత విదేశీ వాణిజ్య సంస్థ (ఐఐఎఫ్‌టీ)కు కాకినాడ జిల్లాలో సొంత క్యాంపస్ త్వరలోనే అందుబాటులోకి రాబోతుంది. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ఉన్నత విద్యా సంస్థకు కూటమి ప్రభుత్వం దన్నుగా నిలిచింది. కొలువుదీరిన ఏడాదిన్నరలోనే ఈ విద్యా సంస్థ నిర్మాణాలను 30 నుంచి 95 శాతానికి తీసుకువచ్చింది. తాజాగా ప్రాజెక్టు వ్యయంలో పరిశ్రమల వాటా ధనం 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి ముందుకు వచ్చింది.

ప్రతిష్ఠాత్మక సంస్థ..

రాష్ట్ర విభజన తర్వాత ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐఐఎఫ్‌టీ మంజూరు చేయించింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కోనపాపపేటలోని 25 ఎకరాలను దీనికి కేటాయించారు. సుమారు రూ.229.11 కోట్ల అంచనా వ్యయంతో 2018లో నిర్మాణం మొదలుపెట్టారు. మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉన్నా ప్రభుత్వం మారిన తర్వాత పనులు మందగించాయి. నిర్మాణ వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:35 శాతం, పరిశ్రమలు 15 శాతం భరిస్తాయని ఒప్పందం చేసుకున్నాయి. తర్వాత పరిశ్రమలు నిధులు సమకూర్చలేమంటూ చేతులెత్తేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిధులివ్వడానికి సమ్మతించింది. ఈ ఏడాది విడుదల చేయాల్సిన రూ.57.10 కోట్లపై ఐఐఎఫ్‌టీ, కాకినాడ కేంద్ర విభాగాధిపతి లేఖ రాయగా.. అందుకు ఆర్థికశాఖ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కోనపాపపేటలో నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవనాలు

వచ్చే ఏడాది సొంతగూటిలోకి..

ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ప్రస్తుతం జేఎన్‌టీయూకే తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ● బీబీఏ, ఎంబీఏ కలిపి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు, ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) రెండేళ్ల కోర్సు, ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ కోర్సులు బోధిస్తున్నారు. ● వచ్చే ఏడాది ఐఐఎఫ్‌టీ సొంతగూటిలోకి మారనుంది. 25 ఎకరాల్లో కళాశాల భవనాలు, పరిపాలన బ్లాకు, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, క్రీడా ప్రాంగణం, ఆడిటోరియం, ఇతర సౌకర్యాలన్నీ అందుబాటులోకి రానున్నాయి. ● కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వీటి నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షించి పనులు వేగవంతమయ్యేలా చూశారు. వసతులన్నీ సమకూరితే మరిన్ని అదనపు కోర్సులతో కాకినాడలో కీలక విద్యాసంస్థగా ఐఐఎఫ్‌టీ ఎదుగుతుందని అధికారులు చెబుతున్నారు.

చెట్టుకు ప్రాణ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లో పాత భవనాన్ని తొలగించి, కొత్త భవనం నిర్మించాలని భావించారు యజమాని లక్ష్మణ్. ఇక్కడ ఉన్న రెండు రావిచెట్లను నరికేయడం ఇష్టం లేక మరో ప్రాంతంలో నాటాల్సిందిగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ అధ్యక్షుడు వెంకన్నబాబును కోరారు. మంగళవారం రెండు చెట్లను క్రేన్ సాయంతో తొలగించారు. గీతాఅప్సర థియేటర్ వద్ద ఉన్న రెడ్డి వీరాస్వామి విగ్రహం పక్కన ఒక చెట్టు నాటారు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

గీతాఅప్సర థియేటర్ సమీపంలో నాటిన రావి చెట్టు

నిర్లక్ష్యమే నిండుప్రాణం తీసింది

గొల్లప్రోలు: చేబ్రోలు పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందిలేకపోవడంతో చికిత్స అందక ప్రత్తిపాడు మండలం శరభవరానికి చెందిన ఇమంది మాణిక్యం(56) మృతి చెందిన ఘటనపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమైంది. గొల్లప్రోలులోని హోటల్‌లో పని చేస్తున్న మాణిక్యం గుండెపోటుకు గురయ్యారు. అతడిని చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడం, 108ఆలస్యంగా రావడంతో మాణిక్యం మృతిచెందడంపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ● ఈ ఘటనపై డీఎంహెచ్‌వో నరసింహనాయక్ చర్యలు తీసుకున్నారు. సస్పెండ్ చేసిన వైద్యుడు సాయిరతన్ స్థానంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించామన్నారు.

గుడ్డు ధర.. మళ్లీ పెరుగుతోంది

- హోల్‌సేల్‌గా ఒకటి రూ.6.45
- విడిగా రూ.7 నుంచి రూ.7.50లకు విక్రయం

రంగంపేట: కోడిగుడ్డు ధర మళ్లీ పెరుగుతోంది. కార్తికమాసంలో రికార్డు స్థాయికి చేరి ఒక్కసారిగా తగ్గిన ధర మళ్లీ పైపైకి చేరుతుండడంతో కోళ్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నవంబరు 21న గుడ్డు ధర రూ.6.45లకు చేరి రికార్డుని సృష్టించింది. కార్తికమాసం పూర్తవ్వడంతో ఈ ధర మరింత పెరుగుతుందని అంచనా వేయగా నవంబరు 28న ఒక్కసారిగా 30 పైసలు తగ్గి రూ.6.15లకు చేరింది. దేశవ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువవ్వడంతో గుడ్ల వినియోగం పెరిగింది. మరో వైపు చలి తీవ్రతకు కోళ్లకు వ్యాధుల బెడద పెరగడం, అవి పెట్టే గుడ్ల శాతం తగ్గింది. దీంతో మళ్లీ క్రమక్రమంగా గుడ్డు ధర పెరుగుతూ ఇప్పుడు రూ.6.45లకు చేరింది. సంక్రాంతి వరకు దాదాపు ఇదే ధర కొనసాగవచ్చని కోళ్ల రైతులు, నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడేళ్ల క్రితం 1.30 కోట్ల వరకు కోళ్లు ఉండగా రోజుకి కోటికిపైగా గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. దాణా ధరలు పెరగడంతోపాటు గుడ్డు ధర తగ్గడంతో నష్టాలను భరించలేక కొందరు ఈ పరిశ్రమ నుంచి వైదొలిపోగా మరికొందరు ఫారంలో ఉండాల్సిన కోళ్ల కంటే తక్కువ వాటినే పెంచుతున్నారు. వ్యాధుల బెడద అధికంగా ఉండడంతో ఇప్పుడు రోజుకి 70 లక్షలలోపే గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. కొన్ని రోజులపాటు గుడ్డు ధర తగ్గకుండా ఉంటే గత నష్టాల నుంచి కొంతైనా బయటపడవచ్చని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు.

"జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ। తస్మాదపరిహార్యేర్థేన త్వం శోచితుమర్హసి॥"

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 05-01-1954
మరణం: 21-11-2025

కీ॥శే॥ శ్రీమతి పట్టపగలు అనంత రామలక్ష్మి గారు

ప్రేమ, ఆప్యాయత, మంచితనం, దయాగుణం మూర్తీభవించిన మమతల పెన్నిధి, మా ఇంటి దీపం శ్రీమతి పట్టపగలు అనంత రామలక్ష్మి గారు ది.21-11-2025 శుక్రవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త: Rtn. Dr. పట్టపగలు వెంకటరావు, B.Sc.

కుమార్తెలు : మలసాని బాల ఉమాదేవి, దండుమేను బాల మాలతి దేవి, వంగ్రపాటి బాల శారదా దేవి, ఈశ్వరప్పు బాల నాగ శివ జ్యోతి
అల్లుళ్లు : వీర వెంకట రమణ, వెంకట సుబ్బారావు, నాగేంద్రరావు, తారక వెంకట రవి
మనుమలు మనుమరాండ్రు : శిరీష్, సత్యసాయి శరత్‌చంద్ర, Dr. ఓల్గాద్రి రమ్య శ్రీభార్గవి - Dr. ఓల్గాద్రి ప్రణీత్, Dr. దండుమేను సూర్య వెంకట సాయి సంకీర్త్, సాయి తేజస్విన్, సాయి తన్మయి, వెంకట నాగసాయి శ్రీకర్, సోహన్‌రామ్
వియ్యంకుడు : దండుమేను సూర్యనారాయణ
మరిది : పట్టపగలు ప్రకాశరావు
చెల్లెలు : మహేశ్వరి సత్యవేణి
కుమారుడు : Dr. P.V.B.చంద్రశేఖర్
కోడలు : Dr. రాజరాజేశ్వరి
కుమార్తె : లోయ శ్యామల గౌరి
అల్లుడు : శివప్రసాద్ యాదవ్
మనుమలు మనుమరాండ్రు : మహేంద్ర, దుర్గాహర్షిత్, హన్వికశ్రీ, చైత్ర శివాని

పెద్దకార్యం: ది.03-12-2025 బుధవారం, రాజమండ్రి, KLM షాపింగ్ మాల్ ప్రక్క వీధి, మల్లిన నగర్, JN రోడ్‌లో గల మా స్వగృహమునందు జరుగును.

సర్వేయర్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువత

నైపుణ్యాలు.. ఉపాధి సోపానాలు..

యువతకు ప్రత్యేక తర్ఫీదు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)ల ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో యువతకు ఉచిత శిక్షణ అందిస్తోంది. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ డెవలప్‌మెంట్(సీడప్), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేవై), ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై) ద్వారా శిక్షణ ఇస్తున్నారు.

ప్రయోజనం ఏమిటంటే

● సీడప్ ద్వారా సర్వేయర్, ఫీల్డ్ ఇంజినీర్ కోర్సుల్లో 91 మందికి శిక్షణ ఇచ్చారు. 82 మందికి ఉపాధి కల్పించారు.
● పీఎంఏజేవై పథకం కింద 112 మందికి శిక్షణ ఇచ్చారు. 110 మందికి ధ్రువపత్రాలు ఇచ్చి 25 మందికి ప్లేస్‌మెంట్ చూపారు. ● ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో 120 మంది తర్ఫీదు పొందారు. 55 మందికి వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించారు.

త్వరలో ఈ కోర్సుల్లో శిక్షణ..

ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, రోడ్డువే సర్వేయర్, అసిస్టెంట్ సర్వేయర్, కన్‌స్ట్రక్షన్ ఫిట్టర్ కోర్సుల్లో న్యాక్‌లోని నైపుణ్య కళాశాలలో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు తెలిపారు. వివరాలకు 9866443303 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో కోర్సులు	- 10
శిక్షణ పొందింది	- 336
ధ్రువపత్రాలు ఇచ్చింది	-321
ఉద్యోగాల్లో చేరినవారు	- 162
స్వయం ఉపాధి పొందుతున్న వారు	- 150

అమృతమూర్తికి ఆత్మీయ నీరాజనం



కీ.శే. శ్రీ చుండ్రు శ్రీవర ప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట

మంచి మనిషి, స్నేహశీలి, అందరి ప్రేమాభిమానాలను పొందిన నాయకుడు శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి అకాల మరణమునకు చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

శోకతప్త హృదయాలతో ....

వేగుళ్ళ జోగేశ్వరరావు
శాసనసభ్యులు, మండపేట
రాష్ట్ర అంచనాల కమిటి ఛైర్మన్
వేగుళ్ళ అజయ్ కుమార్
మండపేట

వల్లూరి నారాయణమూర్తి (చినబాబు)
వల్లూరి సాయి కుమార్ (కుమార్ బాబు)
వల్లూరి రామన్న చౌదరి
మండపేట

(c) eenadu

గంటకొట్టే భాగ్యం కల్పించు స్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గంటకొట్టే భాగ్యం కల్పించాలని భక్తులు వేడుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి నిత్యం రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివస్తారు. బేడ మండప మార్గంలో ఉన్న ప్రధాన గంటను ఆలయ అధికారులు గతంలో తాళ్లతో కట్టేశారు. దీంతో గంటకొట్టే భాగ్యం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏసీ నాగనరసింహప్రసాద్ వివరణ కోరగా కట్టిన తాళ్లు తొలగిస్తామని వెల్లడించారు.

- న్యూస్‌టుడే, అంతర్వేది

భజగోవిందం.. జగమానందం

కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం మంగళవారం వేలాది మంది భక్తజనంతో అలరారింది. ఆలయంలోని ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్ర పుష్పం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు రమణీయంగా జరిగాయి.

- న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

బసవేశ్వరాయ.. అభిషేక ప్రియ

ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రంలో బసవేశ్వరునిగా కొలిచే మహానందికి 21 ద్రవ్యాలతో మంగళవారం అభిషేకాలు జరిగాయి. అరుణాచలేశ్వరునికి నిత్య అభిషేకాలు, ఉపాలయాల్లోని పరివార దేవతలకు అర్చనలు అనంతరం ఆలయ మండపంలోని నందికి భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద పర్యవేక్షణలో అర్చకులు ఈ వేడుక నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

కోటసత్తెమ్మ ఆలయ ఆవరణ

చల్లనితల్లి కోటసత్తెమ్మ రేపటి నుంచి 8 వరకు తిరునాళ్లు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలంలో తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ కోరిన వరాలిచ్చే చల్లని తల్లిగా పేరుగాంచారు. నిడదవోలు పట్టణానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పుణ్యక్షేత్రంలో గతంలో కోట ఉండేదని అది కాలగమనంలో అంతరించిందని చెబుతారు. అమ్మవారి విగ్రహం 11వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన తూర్పు చాళుక్యుల కాలం నాటిది. 1934లో తిమ్మరాజుపాలెంకు చెందిన దేవులపల్లి రామమూర్తిశాస్త్రి పొలం దున్నుతుండగా విగ్రహం బయటపడిందని చెబుతారు. ఆయన నిర్మించిన రాతి కట్టడం ఆలయంలో ఏటా మార్గశిర పౌర్ణమి నుంచి ఐదురోజుల పాటు తీర్థం జరుగుతుంది. 4న ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపన పూజలతో తిరునాళ్లు ప్రారంభమై 8వ తేదీ వరకు కొనసాగుతాయి. రోజూ చండీ పారాయణం, హోమం, లక్ష కుంకుమార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 5న జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నాంగల్యవడి దేవస్థానాలు, 6న నిడదవోలు ఆర్యవైశ్య సంఘం వారు చీర, సారె సమర్పిస్తారు. 7న అఖిల తెలుగు సేవ ఏపీ అధ్యక్షురాలు జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలు చీర-సారె, కలశాలు, బోనాలతో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. 8న రాత్రి అమ్మవారికి గరగోత్సవం నిర్వహిస్తారు. ఏటా అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు 50 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఆది, మంగళవారాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఏటా సుమారు రూ. 2.50 కోట్ల ఆదాయం ఉంటుంది. దాతల సహకారంతో నిర్మించిన 9 అంతస్తుతో 100 అడుగుల రాజగోపురం భక్తులను ఆకట్టుకుంటుంది.

ప్రత్యేక ప్రతిభావంతులకు భరోసా

భవిత కేంద్రాలతో మానసిక స్థైర్యం

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, గోపాలపురం

ప్రత్యేక అవసరాల పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని నింపి.. వారి శారీరక అవసరాలకు ఆదరంగా సహాయం చేసే పాఠశాలలు భవిత కేంద్రాలు. సహిత విద్యా విభాగం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేకావసరాలు గల (18 ఏళ్ల లోపు) వారికి విద్యనందిస్తున్నారు. వైకల్యాన్ని నిర్ధరించి ఉపకరణాల పంపిణీ ప్రక్రియ గతంలో డివిజన్ స్థాయిలో నిర్వహించగా తాజాగా కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ చేపడుతోంది. ఈనెల 3న విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. ప్రతి భవిత కేంద్రానికి రూ.5 వేల చొప్పున నిధులు జమ అయ్యాయి.

● మూడు ఆటిజం కేంద్రాలు..: నాడీ సంబంధిత రుగ్మత (న్యూరోలాజికల్ డిజార్డర్)తో బాధపడే వారి కోసం జిల్లాకు మూడు ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాయి. రాజమహేంద్రవరంలోని బాలుర ఉన్నత, సమిశ్రగూడెం, దేవరపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

పాఠశాలలో ట్యాబ్ ద్వారా డిజిటల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు

జిల్లాలో భవిత కేంద్రాలు :	19
వాటిలో చదువుతున్న విద్యార్థులు :	427
శిక్షణ కోసం ఉన్న ఐఈఆర్పీలు :	38
ప్రత్యేక విద్య పాఠశాలలు :	23
అక్కడి విద్యార్థులు :	587
వైకల్యంతో ఇంటి వద్దే చదివేవారు :	190

● రూ.60 లక్షలతో ఉపకరణాలు..: కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు నెలలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ వైకల్యాన్ని నిర్ధరించి ఉపకరణాలు ఇచ్చేందుకు శిబిరాలు నిర్వహించింది. 860 మంది విద్యార్థులు హాజరుకాగా రూ.60 లక్షలు విలువైన 751 ఉపకరణాలు మంజూరయ్యాయి.

● డిజిటల్ బోధనకు ట్యాబ్‌లు..: సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల సాంకేతిక విద్య నైపుణ్యం కోసం జిల్లాలో ప్రత్యేక ఉపాధ్యాయులకు 115 ట్యాబులను అందించారు.

● క్రీడలు.. వృత్తి విద్య శిక్షణ..: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు మండలం, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. నైపుణ్యం ఉన్న వారి సామర్థ్యం ప్రదర్శించేలా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. వృత్తి విద్య శిక్షణకు రాష్ట్ర స్థాయిలో ఇద్దరు నిపుణులను పంపించారు.

● పదో తరగతి ఉత్తీర్ణత ఇలా.. 2024-25 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకావసరాలు గల విద్యార్థులు 146 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. వారిలో 126 మంది ఉత్తీర్ణులయ్యారు.

వివిధ రకాల భత్యాలు.. 2024-25 ఏడాదికి సంబంధించి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను తీసుకొచ్చే 448 మందికి సహాయ, రవాణా భత్యం 589 మంది, ఇంటి వద్ద ఉండి చదివేవారు 190 మంది, బాలిక ఉపకార వేతనాలు 547 మందికి కలిపి మొత్తం 1774 మంది భత్యాలు ఇటీవలే మంజూరయ్యాయి.

ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది..

ప్రత్యేకావసరాలు గల విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచేలా ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. 3న అన్ని కేంద్రాల్లో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం, 4న పారా ఒలింపిక్స్ క్రీడలను రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో జరగనున్నాయి.

- నరహరశెట్టి కనకబాబు, సహిత విద్య సమన్వయకర్త

విజ్జేశ్వరంలో మాట్లాడుతున్న అంబ ప్రసాద్, నాయకులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

నిడదవోలు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయికి వెళ్లాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే అంబా ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా విజ్జేశ్వరంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సభకు మండల అధ్యక్షుడు భావన రమేష్ అధ్యక్షత వహించారు. అంబా ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పట్ల అంకిత భావం ఉన్న కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడానికి అధిష్ఠానం కృతనిశ్చయంతో ఉందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మేడపాటి భద్రందొర మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామానికి వెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, నాయకులు చిన్నం మురళీకృష్ణ, దారపురెడ్డి సుజాత, కాకి కిషోర్, భాస్కర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యా బోధకులు

ఉమ్మడి జిల్లాలో 136 మంది నియామకానికి చర్యలు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాల్లోని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యా బోధకులను (అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల) నియమించడానికి మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో మొత్తం 1,146 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 136 పోస్టుల్లో వీరిని నియమిస్తారు. కాకినాడ జిల్లాలో 47, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 52, తూర్పుగోదావరి జిల్లాలో 21, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 పోస్టులను గుర్తించారు. వీరి నియామకాలతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు ఉండదని, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు అవకాశం కలుగుతుందని విద్యావేత్తలు అంటున్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో పోస్టులు దక్కని వారికి ఇదొక సదావకాశమని చెబుతున్నారు.

ఇవీ వివరాలు..

◗ విద్యా బోధకులు ఆయా పాఠశాలల్లో ఈనెల ఎనిమిదో తేదీ నుంచే విధుల్లో చేరుతారు. వచ్చే సంవత్సరం మే నెల ఏడో తేదీ వరకు మొత్తం అయిదు నెలలు వీరు సేవలందిస్తారు. ◗ నియామకాలను ఆయా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖాధికారి, ఎంఈవోలు పర్యవేక్షిస్తారు. ◗ ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులను సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో సమర్పించాలి. ◗ ఆరో తేదీకి ప్రక్రియను పూర్తిచేసి ఏడో తేదీన ఉత్తర్వులు అందిస్తారు. ఎనిమిదో తేదీ నుంచి విధుల్లో చేరాలి. ◗ సాధ్యమైనంత వరకు ఆసక్తి, అర్హతలున్న స్థానికులనే నియమిస్తారు. అనంతరం మండల పరిధిలోని వారిని ఎంపిక చేస్తారు. ◗ స్కూల్ అసిస్టెంట్లకు రూ. 12,500, సెకండరీ గ్రేడ్ అభ్యర్థులకు రూ. 10 వేల చొప్పున నెలకు గౌరవ వేతనంగా చెల్లిస్తారు. ◗ అకడమిక్ ప్రమాణాలకు 75 శాతం, వృత్తి పరమైన ప్రమాణాలకు 25 శాతం మార్కుల ప్రతిభను గణించి మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులను ఎంపికచేస్తారు. ◗ పాఠశాలల వారీగా ఖాళీల జాబితాలను రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారులు ఎంఈవోలకు పంపారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి నుంచి వివరాలు తెలుసుకోవచ్చు.

నన్నయకు అయిదు ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు

ధ్రువపత్రాలు ప్రదర్శిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితరులు

రాజానగరం, న్యూస్‌టుడే: ఉన్నత విద్యలో శ్రేష్ఠతను, నాణ్యతను అందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ, తగిన వనరులను అందిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయానికి అయిదు ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు లభించాయని, త్వరలో 5 స్టార్ రేటింగ్ దక్కనుందని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మంగళవారం వర్సిటీలో ఐక్యూఏసీ డైరెక్టర్ వి.పెర్సిస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌వైఎం) అధిపతి ఆల పాటి శివయ్య వీసీ ఎస్.ప్రసన్నశ్రీకి ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు అందించారు. వీసీ మాట్లాడుతూ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టం, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ ధ్రువపత్రాలు లభించడం అభినందనీయమన్నారు. శివయ్య మాట్లాడుతూ వర్సిటీలో రెండు రోజులు నిర్వహించిన ఆడిట్ ప్రక్రియపై సంతృప్తి చెందామన్నారు. దానికి నిదర్శనంగా తమ సంస్థ ద్వారా వర్సిటీకి తొలిసారిగా 5 స్టార్ క్వాలిటీ రేటింగ్ ధ్రువపత్రం ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ కె.వి.స్వామి, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.ఎస్.మురళీమోహన్, వర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఆదివారం జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేశామని సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. బావ వరుస అయిన పిల్లి ఆనంద్‌కుమార్‌ను గాడి రాజ్‌కమల్ కత్తితో నరికి చంపిన సంఘటన తెలిసిందే. సీతానగరం మండలం ములకల్లంకకు చెందిన రాజ్‌కమల్‌ను విచారించగా తనపై చేతబడి చేసి చంపేస్తారన్న భయంతోనే ఆనంద్‌కుమార్‌ను చంపినట్లు వెల్లడించారన్నారు. బుధవారం నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ట్రేడింగ్ పేరిట మహిళ టోకరా

రూ.26 లక్షలు మోసపోయిన బాధితుడు

పెనమలూరు: ట్రేడింగ్ వ్యాపారమంటూ ఓ వ్యక్తిని ముగ్గులోకి దింపిన మహిళ అతడి నుంచి రూ. 26.37 లక్షలు కొట్టేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. కొంతకాలం క్రితం ఆయన చరవాణికి మెసేజ్ వచ్చింది. తన పేరు ఎ.హేమాచౌదరిగా పరిచయం చేసుకొన్న ఆ మహిళ.. తన స్వస్థలం రాజమహేంద్రవరం కాగా చెన్నైలో ఉంటున్నట్లు తెలిపింది. షేర్ల వ్యాపారంలో ట్రేడింగ్ చేస్తే లాభాలు వచ్చి పడతాయంటూ నమ్మించి వాట్సాప్ ద్వారా ఓ లింక్ పంపింది. తొలుత ఆయన రూ. 50 వేలతో ట్రేడింగ్ మొదలుపెట్టాడు. కొద్దిరోజుల్లో అతనికి లాభం వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించింది. దీంతో ఆ నగదును విత్‌డ్రా చేసుకొన్నాడు. నమ్మకం కుదరడంతో విడతల వారీ రూ. 26.37 లక్షలు పెట్టాడు. లాభంతో కలిపి రూ. 40.96 లక్షలు చూపడంతో ఈ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలని చూడగా వీలు కుదరలేదు. హేమాచౌదరిని సంప్రదించగా అప్పటికే ఆమె సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇంటి యజమాని దుర్మరణం

రంగంపేట: మండలంలోని రామేశ్వరంపేటలో 11కేవీ విద్యుత్తు తీగ తగిలి పిల్లల తాతబ్బాయి(51) మృతి చెందారు. తాతబ్బాయి తన ఇంటి డాబాపై రెండో అంతస్తు నిర్మాణ పనులు మంగళవారం పర్యవేక్షిస్తున్నారు. సమీపంలోని విద్యుత్తు వైరు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై అతని కుమారుడు కిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం పంపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

ఓటరు కార్డులో చిరునామా... మార్చుకోవచ్చు ఇలా..!

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డు ఎన్నికల సమయంలోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగానూ వినియోగించుకోవచ్చనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. పట్టణాల్లో అద్దెకు ఉండేవారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు ఆ కార్డులో చిరునామా మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటారు. అందులోని చిరునామా (ఫారం-8)ని మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నిర్ణీత సమయాల్లో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్(ఓటర్స్ సర్వీస్ పోర్టల్) ద్వారా ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించింది.

- న్యూస్‌టుడే, గోపాలపురం

చిన్న తేడా ఉన్నా..

ఆన్‌లైన్లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో అలాగే ఓటరు కార్డులోనూ ఉండాలి. చిన్నపాటి మార్పులు ఉన్నా తిరస్కరణ అవుతుంది. ఆన్‌లైన్లో ఫారం-8 పూర్తి చేసిన తరువాత చివరిలో ఓటీపీ వెరిఫికేషన్ ఈ-సైన్ చేయాల్సి ఉంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్టు అవుతుంది. అదే విధంగా పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా అది తీసుకోదు. ఆన్‌లైన్లో దరఖాస్తు పూర్తి చేసే ముందే ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని సూచన ఇస్తుంది. పేరులో తేడా ఉంటే ముందే సరిచేసుకుని తరువాత చిరునామా మార్చుకోవాలని చెబుతుంది. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా సమీపంలోని బీఎల్వోని సంప్రదించాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మీ కోసం

దరఖాస్తు తిరస్కరణకు గురైతే..

రెండు కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్లో మార్చు కోవచ్చు. దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు వెంటనే స్థానిక బూత్ లెవెల్ అధికారిని సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బీఎల్వోని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆన్‌లైన్లో దరఖాస్తు పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆఫ్‌లైన్లో చిరునామా మార్చుకోవాలంటే ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే సదరు ఓటరు కార్డులో మారుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

సోదరిని చూడడానికి వస్తూ.. అనంతలోకాలకు

దేవరపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న అక్కను చూడడానికి మంగళవారం ద్విచక్ర వాహనంపై దేవరపల్లి వస్తుండగా కారు ఢీకొన్న ఘటనలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన కొంపెల్లి శివనాగేంద్ర వరప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరప్రసాద్ నూనె వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సొంత అక్క అనారోగ్యంతో దేవరపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చూడడానికి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యర్నగూడెం జాతీయ రహదారిలో ఏ6 హోటల్ వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. వరప్రసాద్ తల రోడ్డుకు తగలడంతో తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆయనకు పదేళ్లు, మూడేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవరపల్లి పోలీసులు తెలిపారు.

27 వారాలకే శిశువు జననం

ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవం

శిశువును పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ సౌమ్య

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఓ గర్భిణీ నవమాసాలు నిండక ముందే 6నెలలకే నొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా అంబులెన్సులోనే మగశిశువుకు జన్మనిచ్చిన ఘటన ప్రత్తిపాడు సీహెచ్‌సీ పరిధిలో చోటుచేసుకుంది. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన తూరంగి సుహాసిని 27 వారాల గర్భిణి. నొప్పులు రావడంతో 108 వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రసవించింది. పుట్టిన బిడ్డ 800 గ్రాముల బరువుతో ఉలుకూ పలుకూ లేకపోవడంతో కంగారు పడ్డారు. సీహెచ్‌సీలోని ఎస్ఎన్‌సీయూలో ఉంచి డాక్టర్ సౌమ్య బృందం వైద్యం చేసింది. కదలికలు, ఏడవడం తదితర సాధారణ లక్షణాలు శిశువులో కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నెలలు నిండకుండా శిశువు జన్మించడం ఇబ్బందికరమేనని ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగానే ఉన్నారని సూపరింటెండెంట్ తెలిపారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రాజాట్యాంక్‌లోని స్కేటింగ్ రింక్‌లో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పి.సుధారాణి, కె.శ్రీనివాసరావు, టోర్నమెంట్ సంయుక్త ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా జార్జి పర్యవేక్షించారు. అండర్-11, 14, 17, 19 తదితర కేటగిరీల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు విజేతలకు ముఖ్యఅతిథులు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మహబూబ్ బాషా, కోకనాడ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర చేతులమీదుగా పతకాలు అందజేశారు. బుధవారంతో పోటీలు ముగియనున్నాయి.

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనీష్

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ. 75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ. 35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ. 24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ. 13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో ఏఎస్పీ పర్యవేక్షణలో సీఐతోపాటు, ఎస్సైలు మణికుమార్, జానీబాషాలతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ. 75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌ట్యాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎంకార్డులు, పలు నెట్‌వర్కులకు చెందిన సిమ్‌కార్డులు, రూ. 53 వేల నగదు, 20 గ్రాముల బంగారం, సంబంధిత కంపెనీ దుస్తులు, ప్రమోషన్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఏఎస్పీ వివరించారు.

ఇతర ప్రాంతాలకు చెందిన 8 మంది అరెస్టు..

పోలీసులు తమ దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మంది స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్(గుండుమల్ల, సత్యసాయి జిల్లా), సిద్దేశ్ శ్రీధర్, సిద్దేశ్ సుదీప్(మల్ల నాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్(హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య(పార్వతీపురం), నాగప్ప కావ్య(మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి(ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	145-00
డ్రెస్డ్	210-00
స్కిన్‌లెస్	239-00

EENADU e Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥ల్లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Krishna Pradeep's 21st Century IAS

WE ARE HIRING TELE MARKETERS 10 No's (ONLY FEMALE) Qlf: Intermediate / Degree with Good communication skills in Telugu & English. Attractive Pay & Incentives

OPP. Z.P. HIGH SCHOOL, TORREDU, RAJAHMUNDRY. 8247417713

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

Paytmలో చేయుటకు స్టాఫ్ కావలెను. జీతం, ఇన్సెంటివ్‌తో కలిపి 30,000/- సంపాదించొచ్చు. రాజమండ్రి, మండపేట, రావులపాలెం పట్టణాలకు కావలెను. ✆ 98660 11262.

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్టు పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్స్. 8341177761, 9063222817

రాజమండ్రి: మహిళలకు మాత్రమే, డోర్ టు డోర్ వర్క్, పార్ట్ టైమ్ + ఫుల్‌టైమ్. 8 వేలు నుండి 10 వేలు జీతం + ఇన్సెంటివ్. Contact Cell: 93929 52551.

రాజమండ్రి J.N.రోడ్, ఐరన్ హిల్ పక్కన ఉన్న మా నూతన రెడీమేడ్ బట్టలషాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్ కావలెను. సంప్ర: 98664 11308, 70206 93543.

Wanted 1) Computer Operator 2) Tally Bell Fresh Foods దవళేశ్వరం ఇండస్ట్రీ. Mobile: 9347336023.

EENADU for Advertisement Contact: 8008597607

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 7702237945.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డిగ్రీ, జీతం:22,000/- (8గం॥ 26 రోజులు)+PF, ESI, 50 సం॥లోపు Ct: 9666985077, 8688776420

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పై॥

ఆనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజమహేంద్రవరం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతులకు బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోటిలింగాలపేట, సీతంపేట ఎన్టీఆర్ కాలనీ, గోదావరిబండ్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులు మనోధైర్యంతో సాగాలి

ఏవీఏ రోడ్డు, మోరంపూడి, న్యూస్‌టుడే: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు నిరాశకు గురికాకుండా నిరంతరం మందులు వాడి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోలర్ డాక్టర్ వసుంధర అన్నారు. మంగళవారం ఆనం రోటరీ హాల్లో కోనసీమ సేవా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.కృపారావు ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు అవగాహన సదస్సు, పోషక ఆహారం పంపిణీని నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: **83282 39927, 80089 02897**

సమస్య : ఆనంద్‌నగర్‌లో కాలువల్లో పూడికలు తొలగించడం లేదు.- **రాధిక**

సమస్య : జాంపేట వద్ద కాలువలు అధ్వానంగా ఉన్నాయి. - **బేగం**

సమాధానం : సిబ్బందితో కాలువలను శుభ్రం చేయిస్తాం.

సమస్య : స్థానిక వీఎల్‌పురం వద్ద వీధి దీపాలు వెలగడం లేదు.- **శేఖర్**

సమాధానం : మరమ్మతులు చేయిస్తాం.

- విమల, మున్సిపల్ ఎలక్ట్రికల్ ఏఈ

– న్యూస్‌టుడే, టి.నగర్

సమస్య: స్థానిక గణేష్‌చౌక్ రైతుబజార్ వద్ద డ్రెయిన్‌పై మూతలేకుండా ప్రమాదకరంగా మారింది. **-శ్రీనివాసరావు**

సమస్య: పీఅండ్‌టీ కాలనీలో స్మార్ట్ బజార్ రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. **- సత్యనారాయణ**

సమాధానం: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- వినూత్న, ఎంహెచ్‌వో**

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వసతి వెతలు తీరేనా..?

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

భవన నిర్మాణం చేపట్టనున్న ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఖాళీ స్థలం

ఏజెన్సీ ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం నగరానికొచ్చి, గిరిజన ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో (ఎస్టీ హాస్టళ్లు) ఉంటున్న విద్యార్థుల వసతి ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో రెండు గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గతేడాదే మంజూరైన మరో రెండు వసతి గృహాలకు (బాలికల హాస్టల్-3, బాలుర హాస్టల్-3)కు ఇప్పటివరకు అనుకూలమైన భవనాలు సమకూరలేదు. బాలికల వసతిగృహం-3ను స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న బాలికల వసతిగృహం-1లో సర్దుబాటు చేసి కొనసాగిస్తున్నారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువ కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఖాళీస్థలంలోనే హాస్టల్-3కి భవన నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బాలుర వసతిగృహం-3ను లాలాచెరువు వద్ద అద్దె భవనంలో నడుస్తున్న బాలుర వసతి గృహం-2లో సర్దుబాటు చేశారు.

నగరంలో ఇలా...	
గిరిజన వసతి గృహాలు	06
సొంతభవనాలు ఉన్నవి	02
అద్దె భవనాల్లో ఉన్నవి	02
భవనాలే లేనివి	02
విద్యార్థులు	1,091

అద్దె భవనాలు దొరకక..

వసతి గృహ నిర్మాణానికి 2,500 నుంచి 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విశాలంగా ఉండే భవనాలు అవసరం. నగర పరిధిలో ఇలాంటి భవనాలు దొరకడం లేదు. ఒకవేళ దొరికినా చదరపు అడుగుకు రూ.10 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుంది. దీంతో అద్దెకు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. భవన నిర్మాణాలకు ప్రతిపాదనల పంపించామని, త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని జిల్లా గిరిజన సంక్షేమాధికారి జ్యోతి తెలిపారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వర్ణలత తదితరులు

9న 'అవినీతి వ్యతిరేక దినోత్సవం'

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ముత్యాల రాయుడు మిత్రమండలి, మేడా మహామిత్ర మండలి, ముత్యాల రాయుడు మిత్రమండలి వాట్సాప్ గ్రూపుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న ఆర్యాపురంలో నిర్వహించే అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ గోడపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.టి.వి.ఆర్.స్వర్ణలత చేతుల మీదుగా రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, మిత్ర మండలి ప్రజాసంబంధాల అధికారి అనాపు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు వై.వి.ఎస్.శ్యామల కుమారి, అవిడి రూపాశేఖర్, వి.మెర్సీ కుమారి, దర్శనాల కోటేశ్వరరావు, సుంకర వెంకట భాస్కర రామారావు, పలివెల వీర్రాజు తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే గోరంట్ల

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

టి.నగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోందని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న అయిదుగురికి రూ. 9.33 లక్షల చెక్కులు అందించారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన సామగ్రి ఆవిష్కరణ

పుస్తకాలను చూపుతున్న యూటీఎఫ్ నాయకులు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రూపొందించిన అధ్యయన సామగ్రి డీఈవో వాసుదేవరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తయారు చేసినట్లు వివరించారు. ఏపీ వెంకట్రాజు, సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కోశాధికారి ఈవీఆర్ ప్రసాద్, కార్యదర్శులు కె. రమేష్, ప్రకాష్, దయానిధి, రూపసేనా తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేసుకోవాలి

సీతానగరం(కోరుకొండ): రబీ పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని కోరుకొండ ఏడీఏ శశిబిందు సూచించారు. సీతానగరంలో ఏవో గౌరీదేవి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

కూటమి హయాంలోనే నగరాభివృద్ధి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో నగర అభివృద్ధి సాధ్యమని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సింహాచల్‌నగర్‌లో రూ.42 లక్షలతో నిర్మించనున్న పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైకాపా సర్కారు హయాంలో హంగులు, ఆర్భాటాలకు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం ఉన్న చోట మాత్రమే పక్కాగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా పనులు సాగుతున్నాయన్నారు.

కాలుష్య నివారణపై అవగాహన

దేవీచౌక్, న్యూస్‌టుడే: జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం పురస్కరించుకుని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కాలుష్యం వల్ల కలిగే నష్టాలు, నియంత్రణ చర్యలపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎల్. రాజేశ్వరి భోపాల్ వాయువు దుర్ఘటన వివరించారు. అధ్యాపకులు పద్మజ, నరసింహారావు, కె. వెంకట్రావు, శాంతకుమారి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

దేవీచౌక్, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మంగళవారం హుకుంపేట డి.బ్లాక్‌లో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. కాలుష్య నివారణపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం అధికారిణి సుభాషిణిదేవి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని కాకినాడ మెడికేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పృథ్వీ అన్నారు. రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రత్నంపేటలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో వాలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మనిషి జీవితంలో ఆరోగ్యం, సంతోషం, సంపాదన ఉంటే అనారోగ్యాలు దరి చేరవన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భసంచి ముఖద్వార క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను, నానోగ్రఫీ పరీక్ష ద్వారా గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ ముందస్తుగా గుర్తించవచ్చని తెలిపారు. వ్యాక్సిన్ తీసుకుంటే వీటిని నిర్మూలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు దంటు వీరవెంకట్రావు, లక్ష్మీప్రసన్న, క్రాంతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పృథ్వీ

ఆర్థిక సాయం అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గౌతమహార్ట్‌లోని రాజమహేంద్రవరం వర్తక సేవా సంస్థ ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్ బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు మద్దుల మురళీకృష్ణ చేతుల మీదుగా చెక్ అందించారు.

ప్రాథమికస్థాయి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ప్రాథమికస్థాయి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు కార్యక్రమంలో భాగంగా ఎంఈవో రామారావు మంగళవారం తుమ్మలగుంట ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కూడా త్వరలో వంద రోజుల ప్రణాళిక అమలు చేయనున్నామని తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : రానున్న పుష్కరాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. మంగళవారం ఆరోగ్య విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇంటింటా చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం, బ్లీచింగ్ సర్వే తదితర వాటిపై సమీక్షించారు. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను నగరంలో మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. వ్యాపార సముదాయాల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా తప్పదన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎంహెచ్‌వో వినూత్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు అయిన Smt. Manukonda Hemalatha, W/o. Thomas Rathnakar [illegible] Pitta Veera Kota Reddy [illegible] Pitta Devi Prasanna, D/o. [illegible] నెం. 393/2014 [illegible] క్లయింటును బైండు చేయవని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

షెడ్యూలు: Flat No. 302, Second Floor, 840 sft, d.No. 16-3-1/10, Chukka Paradise, 34.43 sq.yards out of 869 sq.yards Sriram Nagar, Rajahmundry Municipal Corporation area.

కవి శ్రీదేవి, అడ్వకేట్
ఫ్లాట్ నెం.303, S-Square అపార్ట్‌మెంట్
శ్రీరామ్‌నగర్, రాజమహేంద్రవరం
సెల్: 94914 46020

కుంగిన పలకలు

నగరంలోని ప్రధాన నివాస ప్రాంతాల్లో ఒకటైన రాజేంద్రనగర్‌లో పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు పలకలు రూపంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ ప్రాంతంలో 3వ వార్డు సచివాలయం వద్ద పలకలు పూర్తిగా కుంగిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఎవరైనా ఏమరుపాటుగా ఉంటే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కదలని మురుగు

రహదారిపై మురుగు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని లోలుగు నగర్ పార్క్‌కు వెళ్లే దారిలో మురుగు నీరు వెళ్లే మార్గం లేక మధ్యలోనే నిలిచిపోతోంది. మంగళవారం కురిసిన వర్షంతో రహదారంతా చిత్తడిగా మారింది. పాదచారులు జారిపడుతున్న సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

అల్లుకున్న నిర్లక్ష్యం

నగరంలో అనేక విద్యుత్తు స్తంభాలకు సరైన నిర్వహణ లేక తుప్పు పట్టి ఒరిగిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో మొక్కలు అల్లుకుని దర్శనమిస్తున్నాయి. ధవళేశ్వరం గట్టు రోడ్డులో రేవుల వద్ద విద్యుత్తు స్తంభం చుట్టూ తీగలు అల్లుకుని ఉండటంతో వీధి దీపం కాంతులు పూర్తిగా రాని పరిస్థితి. ఈ మార్గం నదీ తీరాన్ని ఆనుకుని ఉండటంతో ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

తేలిన నాణ్యత

నగర సుందరీకరణ పేరుతో గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో నాణ్యత కొరవడటంతో కొద్దికాలానికే అవి దెబ్బతిన్నాయి. లాలాచెరువు జంక్షన్ సమీపంలో నిర్మించిన నడక మార్గం అధ్వానంగా మారింది. –న్యూస్‌టుడే, వీఎల్‌పురం

శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషి శ్రీ పట్టపగలు వెంకట్రావు గారి ధర్మపత్ని, శ్రీమతి పట్టపగలు అనంతలక్ష్మి గారి మరణానికి చింతిస్తూ... వారి కుటుంబసభ్యులందరికీ మా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నాం.

దాసరి తమ్మన్నదొర
సొసైటీ మాజీ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, గోకవరం

WANTED TEACHERS

JASVEER invites applications from trained / well experienced teachers for pre - primary , primary and upper - primary classes.
High school : Hindi , Social , English.
Young graduates with English Medium background may also apply.
Salary is not a constraint for right candidates.

JASVEER (E.M) School
Krovvidi Lingaraju - St, Behind Gandhi Park, Danvaipeta, Rajamahendravaram.
Mail I.D : jems.rjy @gmail.com
9704269971, 9966644219

దిగొస్తున్న కూరగాయల ధరలు

రైతుబజారులో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

దేవీచౌక్, న్యూస్‌టుడే : మొంథా తుపాను, కార్తిక మాసం నేపథ్యంలో గత నెల ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయి. స్థానిక పంటలు అందుబాటులోకి రావడంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు పెరగడంతో కొన్ని రకాల ధరలు గత వారంతో పోలిస్తే 50 శాతం వరకు తగ్గాయి. తుపానుకు ముందు వరకు ఏవీ రాజమహేంద్రవరం రైతుబజార్లలో కేజీ రూ.40 తక్కువ లేవు. ఇప్పుడు బెండ, బీర మినహా మిగతా వాటి ధరలు కేజీ రూ.30లోపే ఉన్నాయి. పదిహేను రోజుల కిందట రూ.70 (కేజీ) పలికిన వంకాయ సగానికి పైగా తగ్గి రూ.33లకు లభిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఆనబకాయ రూ.50 వరకు వెళ్లింది. ప్రస్తుతం రైతుబజార్లలో రూ.20 దిగి వచ్చింది. డిమాండ్‌కు సరిపడా సరఫరా ఉండటంతో నాలుగైదు రోజుల నుంచి తగ్గుముఖం పట్టాయి. ఆకుకూరల ధరలు సైతం కట్ట రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గాయి. ధరలు తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించింది.

అందుబాటులో అన్ని రకాలు

నగరంలో తొమ్మిది రైతుబజార్లు ఉండగా ఆల్కాట్‌తోట, మార్కెట్‌యార్డు మినహా మిగతా వాటికి అన్నిరకాల కూరగాయలు కలిపి రోజుకు 150 నుంచి 300 క్వింటాళ్ల వరకు అవసరం అవుతాయి. నిత్యం సామాన్యులు కొనుగోలు చేసే దొండ, బెండ, వంకాయ, బీర వంటి రకాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం పచ్చిమిర్చి, టమాట, బంగాళదుంప, క్యారెట్, బీట్‌రూట్ వంటివి మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అన్ని రకాలు పరిసర ప్రాంతాల నుంచే దిగుమతి అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

కిలో(రూ.లలో)	నవంబరు 16న	డిసెంబరు 2న
వంకాయ	78/70	33/38
కాకర	40	32
బీర	52	40
క్యాబేజీ	30	24
దొండ	54	24
దోస	34	24
క్యారెట్	58	42
ఆనబ	40	20/22
చిక్కుళ్లు	82/98	66/72

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. మంగళవారం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల వేదికపై విద్యార్థులు వీణానాదం, గాత్రకచేరీ, మోహిని భస్మాసుర కూచిపూడి నృత్య రూపకం తదితర ప్రదర్శనలతో అలరించారు. శ్రీసిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం విద్యార్థుల నృత్య రూపకం ఆకట్టుకుంది. ● శ్రీసద్గురు సన్నిధి, శ్రీశారదాంబికా శాస్త్రీయ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలోని వేదికపై విద్యార్థుల భక్తి సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మోహిని భస్మాసుర నృత్య రూపకం

విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన

అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

వి.ఎల్.పురం: అంకితభావంతో బాధ్యతగా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని రాజమహేంద్రరం సహాయ వ్యవసాయ సంచాలకుడు సూర్యరమేష్ అన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో 22 ఏళ్లపాటు వాచ్‌మెన్‌గా సేవలందించి ఉద్యోగవిరమణ చేసిన వెంకటేశులును కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఏఈవో సంఘ అధ్యక్షుడు వేణుమాధవరావు, వ్యవసాయ అధికారుల సంఘ అధ్యక్షుడు కృష్ణ, ఎన్జీవో సంఘ కమిటీ ఛైర్మన్ మాధవరావు, వనరుల కేంద్రం ఏడీ జయరామలక్ష్మి, పలువురు వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు దగ్ధంపై ఫిర్యాదు

కంబాలచెరువు : వెంకటనగరం గ్రామానికి చెందిన మోతా రమేష్ కారు మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు యువకులు పెట్రోలు పోసి నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. దీనిపై బాధితుడు త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటిముందు కారును పార్కింగ్ చేయగా ఈ సంఘటనకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆ గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానిత వ్యక్తుల వివరాలను పోలీసులకు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

శ్రద్ధాంజలి



మాకు అత్యంత ఆప్తులు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ పట్టపగలు వెంకటరావు గారి భార్య శ్రీమతి పట్టపగలు అనంతరామలక్ష్మి గారి మరణానికి చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

చిట్టూరి సూర్యనారాయణమూర్తి (సూరిబాబు)
ప్రెసిడెంట్: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి

యిళ్ల సాయినాథ్
సెక్రటరీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి

మరియు రోటేరియన్స్ ఆఫ్ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి

కొలువే లక్ష్యం.. సడలని సంకల్పం..!

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: వారంతా విభిన్న ప్రతిభావంతులు. అయితేనేం వారి సంకల్పానికి వైకల్యం అడ్డుకాలేదు. అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు కృషి చేశారు. తమ కలలను సాకారం చేసుకున్నారు.

సొంతంగా నోట్స్ రాసుకుని..

నా పేరు **సురేష్‌బాబు.** రాజమహేంద్రవరం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా. బీకాం వరకు చదువుకున్నా. వైకల్యంతో బాధ పడుతున్నా..ఆశయ సాధనకు నిరంతరం కృషి చేశారు. చదువుకునే సమయంలో గురువులు చెప్పిన విషయం అర్థంకాకపోయినా సొంతంగా నోట్స్ రాసుకుని, చదువుకున్నా.

ఆన్‌లైన్‌లో చదివి..

నా పేరు **కాండ్రు చందీశ్.** రాజమహేంద్రవరంలో డిగ్రీ వరకు చదువుకున్నాను. ప్రస్తుతం కొత్తపేట ప్రభుత్వ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నాను. పోటీపరీక్షలకు సాధన సమయంలో ఆన్‌లైన్‌లో చదువుకుంటూ సబ్జెక్టు మెరుగుపరచుకున్నాను.

జాతీయస్థాయి క్రికెటర్‌గా

నా పేరు **ఎం. శ్యామ్యూల్.** బీకాం చదివాను. క్రికెట్ అంటే చాలా ఇష్టం. అందరిలా క్రికెట్ ఆడాలనుకునే వాడిని. వినికిడి లోపం ఉండటంతో రాణించగలనా అనుకునేవాడిని. విభిన్న ప్రతిభావంతుల క్రీడలు నాలో కొత్త ఉత్సాహం నింపాయి. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి జట్టుకు ఎంపికచేశారు. ప్రస్తుతం డెఫ్ దిల్లీ బుల్స్ టీంలో ఆడుతున్నా. ఎప్పటికైనా క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనేది నా లక్ష్యం.

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK Ltd.
Head Office, Rajamahendravaram, REG No:3127

TENDER NOTICE

No: **ACUB/MIS/2025-26/3** Dt: **03-12-2025**

Sealed quotations are invited from authorized vendors for the Supply, Installation and Service Support of **15 Nos. Sophos XGS 88 Firewall** Appliances for a period of 36 months.

Interested vendors may submit their sealed quotations to The Secretary, The Aryapuram Co Operative Urban Bank Ltd, D.No. 20-23-8, Near Gokavaram Bus Stand, Opp. BSNL Sanchar Bhavan, Rajahmundry - 533104. By Hand /Courier on or before 09-12-2025

Cont: 0883-2473550 Sd/- Secretary/CEO

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని కాలసర్పదోష నివారణా పూజలు చేయించారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తుల తాకిడితో దేవాలయం కళకళలాడింది. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

భారీ అన్నదానం

బిక్కవోలు, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవం ముగింపును పురస్కరించుకుని బిక్కవోలులో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాన్ని నిర్వహించి నందుకు వివిధ శాఖల సిబ్బందిని అభినందించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు చిట్టిబాబు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు, న్యూస్‌టుడే: పందలపాక రావిచెట్టు సెంటరులోని శిర్డీ సాయి ఆలయ 26వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం హారతి అనంతరం బాబావారికి క్షీరాభిషేకం, గణపతి పూజ జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, గణేశ్, శివ పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పదనం పెంచాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

బొమ్మూరు, న్యూస్‌టుడే: తెలుగు భాష ఔన్నత్యం, సాహిత్యం, గొప్పదనం తెలియడానికి ఎన్టీఆర్ తెలుగు విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ 40వ వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలుగులోనే బోధన జరగాలన్నారు. భాష, సాహిత్య విలువలు మరచిపోతున్నామని అన్నారు. అభివృద్ధి చెందిన పలు దేశాల్లో మాతృభాషల్లోనే మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. వీసీ డా.డి.మునిరత్నం నాయుడు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన వర్సిటీలో త్వరలో అన్ని సదుపాయాలతో కొత్త కోర్సులు ప్రారంభిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం సహకారంతో కొత్త వైభవం మొదలయ్యిందన్నారు. కళారత్న బిక్కి కృష్ణ, ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడారు. డా.జె.విద్యాధర్ మాట్లాడుతూ దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగువారు వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

సమస్య: పిడింగొయ్యి పంచాయతీ కవలగొయ్యి గ్రామంలో రామాలయం నుంచి బుచ్చయ్యనగర్ వైపు వెళ్లే వీధి పొడవునా విద్యుత్తు వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని వీధుల్లో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. – వెంకన్నబాబు, స్థానికుడు

సమాధానం: ఆ వీధిలో విద్యుత్తు స్తంభాలకు నేరుగా కనెక్షన్ ఇచ్చారు. త్వరలోనే మూడో లైన్ ఏర్పాటు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. – దాసరి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, మోరంపూడి

యంత్రం.. పట్టించుకోని యంత్రాంగం

రాజానగరం మండలపరిషత్‌లో మూలుగుతున్న చెత్తఎత్తే వాహనాలు

అధ్వాన స్థితిలో చెత్త ఎత్తిపోసే యంత్రాలు

రాజానగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా నిర్వహించేందుకు 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి చెత్త ఎత్తిపోసే యంత్రాలు, తరలించే ఆటో(మెకనైజ్డ్ క్లీనింగ్‌మెషీన్, తొట్టెలు)లను కొనుగోలు చేసింది. పల్లెల్లో ఉపాధిలేని వారికి చెత్త సేకరణ ఆటోలను అప్పగించడం ద్వారా ఆసరా కల్పించడం, మరోవైపు గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడం తదితర బహుళ ప్రయోజనాలు సాకారమయ్యేలా వీటిని రూపొందించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 35 శాతం రాయితీపై ఆయా వాహనాలను అందించేందుకు దరఖాస్తులను స్వీకరించి అర్హులను ఎంపిక చేసింది. అప్పటికే గ్రామ పంచాయతీలకు వచ్చిన వాటిలో కొన్నింటిని అందజేశారు. మిగిలినవి లబ్ధిదారులకు అందజేసే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ నిలిచిపోయింది. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అవి తుప్పుపట్టి ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ఇవి అందకపోవడంతో లబ్ధిదారులు పూర్తి నిరుత్సాహానికి గురవుతున్నారు.

గత వైకాపా పాలకుల తీరుతో నష్టం..

ఈ యంత్రాల ద్వారా కాలువల్లో మురుగు తొలగింపు నిర్వహించే వారికి రూ.25 వేలు, ఆటోలతో చెత్త తరలింపు చేసేవారికి రూ.10 వేలు చొప్పున నెలకు ఆయా పంచాయతీలు చెల్లించేలా నిర్ణయించారు. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించింది. పంపిణీ చేయాల్సిన యంత్రాలను గాలికి వదిలేసింది. మురుగునీటి కాలువలను శుభ్రం చేసే యంత్రాలు ఆయా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరుపయోగంగా పడి ఉన్నాయి.

అధికారులు స్పందించాలి..

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 10 మెకనైజ్డ్ క్లీనింగ్ ట్రాక్టర్ తొట్టెలు మంజూరు అయ్యాయి. వాటిని రాజానగరం మండల పరిషత్ ఆవరణలో 2019 ఫిబ్రవరిలో ఉంచారు. వీటి మొత్తం యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా సబ్సిడీ రూ.5.25 లక్షలు. రుణం రూ.9.75 లక్షలు. వాటికి సంబంధించి ట్రాక్టర్ హెడ్‌లు రాలేదు. ఇవన్నీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: మాధవరాయుడుపాలెం చైతన్యనగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి యజ్జల విజయవర్ధన్ ఈ నెల 27న తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన సమ్మేళనం రాష్ట్రస్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయిని మధిర వెంకట కృష్ణ కామేశ్వరి మంగళవారం తెలిపారు. సర్పంచి అన్నందేవుల చంటి బాలుడికి సైన్స్ పుస్తకాన్ని బహుమతిగా అందించి ప్రత్యేకంగా అభినందించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బత్తుల

సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న బత్తుల

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. 2027 లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలలో రాజానగరం నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. లైన్ డిపార్ట్‌మెంట్‌లతో సమీక్షించి రూ.648 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన నివేదికను సీఎంకు ఎమ్మెల్యే అందజేశారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతో నిలిచిన రహదారి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం రైతులకు నష్టపరిహారం అందించాలని, కోరుకొండ భూ సమస్య పరిష్కరించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై పీఆర్ కమిషనర్‌కు వినతి

రాజానగరం, న్యూస్‌టుడే: రానున్న పుష్కరాలకు రాజానగరం కీలకంగా మారనుందని, రాజమహేంద్రవరాన్ని ఆనుకుని ఉండటం వల్ల యాత్రికులకు, రవాణా, పార్కింగ్, వసతి సౌకర్యాలకు ఇది అత్యంత వ్యూహాత్మక ప్రదేశమని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వివరించారు. మంగళవారం తాడేపల్లిలో కృష్ణతేజను ఎమ్మెల్యే కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. పీఆర్ ఇంజినీరింగ్ విభాగం అంచనాల్లో భాగంగా 60 పనుల నిమిత్తం రూ.8,177 లక్షలతో అంచనా వేయించి వాటిలో 30 పనులను తక్షణ ప్రాధాన్యంగా గుర్తించామన్నారు. మూడు మండలాల్లోనూ రూ.12,447 లక్షల అంచనా వ్యయంతో 1,579 సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి, రూ.14,802 లక్షల అంచనా వ్యయంతో 1,130 సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వెంటనే ఎన్నికలు నిర్వహించాలి.. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో నియోజకవర్గంలోని తొమ్మిది పంచాయతీలను విలీనం చేయాలన్న పేరుతో గత కొన్నేళ్లుగా వాటికి ఎన్నికలు జరగలేదన్నారు. వాటికి వెంటనే ఎన్నికలు జరపాలన్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని రూపానగర్, స్వరూపానగర్‌లను రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో విలీనం చేయాలని, ఇప్పటికే విలీనమైన లాలాచెరువు పంచాయతీలో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పీఆర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

విగ్రహ ఏర్పాటును ఎమ్మెల్యే నల్లమిల్లి అడ్డుకోలేదు

మాట్లాడుతున్న ఆసుపత్రి స్థలదాత మనవడు శివారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద తన తాతయ్య, స్థలదాత ద్వారంపూడి బుల్లియ్య విగ్రహం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అడ్డుపడ్డారన్న ఆరోపణల్లో నిజంలేదని ద్వారంపూడి శివారెడ్డి తెలిపారు. అనపర్తిలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. తాము ఎప్పుడూ విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని కోరలేదని, ఆయన తమ వద్ద డబ్బులు తీసుకోలేదని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన వాటికి తన పేరు, జగన్‌మోహన్‌రెడ్డి పేరు పెట్టుకున్నారని విమర్శించారు.

'వైకాపా నాయకుల ఆక్రమణలను తొలగించాలి'

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు ఆక్రమణలకు పాల్పడ్డారని, వాటిని తొలగించాలని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా పాలనలో జరిగిన రీసర్వే, విద్యుత్తు స్తంభాలు, పింఛన్లు, వైకాపా నాయకుల ఆక్రమణల గురించి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. జీబీఆర్ కళాశాలకు సంబంధించి ఆక్రమణలు తొలగించాలని యాజమాన్యానికి మూడు సార్లు నోటీసులు అందించినా వారు వాయిదాలు వేయిస్తున్నారన్నారు. దానికి సంబంధించి మళ్లీ ఫిర్యాదులు అందాయని వాటిని ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. కూటమి నాయకులు మనోజ్‌రెడ్డి, నాగు, సూర్యకుమారి, శ్రీనివాసరెడ్డి, వెంకటరామారెడ్డి, నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో ఉపయోగం

సీతానగరం(కోరుకొండ): రబీ పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని కోరుకొండ ఏడీఏ శశిబిందు సూచించారు. సీతానగరంలో ఏవో గౌరీదేవి ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దమ్ములో 20 కేజీల జింక్ వేసుకోవాలని సూచించారు. బుధవారం అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీ కోసం గ్రామసభలు జరుగుతాయన్నారు. ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట గ్రామాల్లోని సొసైటీలను ఆమె తనిఖీ చేశారు.

దేశం గర్వించేలా విద్యార్థులు ఎదగాలి: అనుపమానందజీ

మాట్లాడుతున్న స్వామి అనుపమానందజీ మహారాజ్

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు దేశం గర్వించేలా ఎదగాలని, అత్యున్నత ఆదర్శాలకు కట్టుబడి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కడప రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి అనుపమానందజీ మహారాజ్ అన్నారు. అనపర్తి జీబీఆర్ కళాశాల సమావేశమందిరంలో మంగళవారం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన వ్యక్తిత్వ వికాస సదస్సు 2025లో ఆయన పాల్గొన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాలు సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువతరం సేవాదృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. రాజమహేంద్రవరం రామకృష్ణమఠం ప్రతినిధి స్వామి సేవ్యానందజీ మహారాజ్ మాట్లాడుతూ సాటిమనిషికి సేవ చేస్తే భగవంతుడికి చేసినట్లేనని అన్నారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. సమితి ఉపాధ్యక్షులు సత్తివెంకటరెడ్డి, తేతలి సుందరామారెడ్డి, సమితి కార్యదర్శులు మల్లిడి శ్రీనివాసరెడ్డి, తాడిచంద్రశేఖర్‌రెడ్డి, సమితి ప్రధానకార్యదర్శి సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా.అబ్బాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడికలు తీయాలి

బొమ్మూరు కాట్రాజ్ బిల్డింగ్ ప్రాంతంలో కాలువ మొత్తం ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో కాలువ పారక మురుగు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్లలో పనికిరాని వస్తువులు, వ్యర్థాలు వేయడం వల్ల చెత్త కుండీలా మారిందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉందని మహిళలు వాపోతున్నారు. కాలువ మొత్తం శుభ్రం చేయాలని కోరుతున్నారు. సమస్యపై కార్యదర్శి కాశీ స్పందిస్తూ పూడికలు తీయించి మురుగు పారేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

మట్టి రోడ్డుతో ఇక్కట్లు

కొంతమూరు అఫీషియల్ కాలనీలో మట్టి రోడ్డు గుంతలమయం అయ్యింది. కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొంతమూరు

వ్యర్థాల గుట్టలు తొలగించరూ

పాలచర్లలో గ్రామంలో ఉత్పత్తి అయిన చెత్తంతా తీసుకువచ్చి నివాసగృహాల పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డ్‌లో వేస్తున్నారు. దీంతో అది అమాంతం పెరిగి కొండలా మారింది. వ్యర్థాల నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో దానికి సమీపంలో ఉన్న నివాసగృహాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రాజానగరం

అమ్మా, నాన్న.. మా బడికి రండి

కోరుకొండ మండల ప్రజాపరిషత్తు ప్రాథమిక పాఠశాల-4లో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు పి.రాజారావు, ఉపాధ్యాయుడు ఎల్.మద్దిరెడ్డి సమక్షంలో విద్యార్థులు మెగా పీటీఎంలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. అమ్మా, నాన్న.. మా బడికి రండి అంటూ అందులో విద్యార్థులు స్వదస్తూరితో రాశారు. – న్యూస్‌టుడే, కోరుకొండ

శ్రద్ధాంజలి

మాకు అత్యంత ఆప్తులు, శ్రేయోభిలాషి శ్రీ పిట్టపగిలు వెంకట్రావు గారి ధర్మపత్ని, శ్రీమతి పట్టపగిలు అనంతలక్ష్మి గారి మరణానికి చింతిస్తూ... వారి కుటుంబసభ్యులందరికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

దాసరి తమ్మన్నదొర

సొసైటీ మాజీ అధ్యక్షులు, టీడీపీ సీనియర్ నాయకులు, గోకవరం

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండకు చెందిన కుర్రా శివ అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటికి వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యులు చూసేసరికి విగతజీవుడై ఉన్నాడు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. దీనిపై ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

పొలానికి వెళ్తున్న వ్యక్తిపై అడవిపంది దాడి

జగ్గంపేట గ్రామీణం, గోకవరం, న్యూస్‌టుడే: పొలం పనులు నిమిత్తం వెళ్లిన వ్యక్తిపై అడవిపంది దాడిచేసిన ఘటన గోకవరం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎం.గంగరాజు రోజువారీ వ్యవసాయ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటాడు. సోమవారం సాయంత్రం కాపలా కోసం పొలానికి వెళ్లగా అడవిపంది దాడిచేసింది. కాలి భాగంలో తీవ్ర గాయాలు కావడంతో సమీపంలో ఉన్న కూలీలు గుర్తించి గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇటుకతో కొట్టారని యానిమేటర్‌పై ఫిర్యాదు

బిక్కవోలు, న్యూస్‌టుడే: డ్వాక్రా రుణం విషయమై కోఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేయడంతో తమపై యానిమేటర్ దాడి చేసిందని కాపవరం శివారు గంగులూరి పాకలకు చెందిన మందనక్క సుధారాణి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సుధారాణి యానిమేటర్ గంగులూరి బుజ్జమ్మను రుణం కావాలని కోరగా, గతంలో తీసుకున్న రుణం సమయానికి చెల్లించకపోవడంతో సిఫారసు చేయలేనని చెప్పారు. దీనిపై సుధారాణి పైఅధికారికి బుజ్జమ్మపై ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా సుధారాణి తల్లికి, బుజ్జమ్మ తల్లి గతంలో దాయమని రూ.10,000 ఇచ్చారు. వాటిని సోమవారం సుధారాణి తల్లితో కలిసి బుజ్జమ్మ తల్లికి ఇవ్వడానికి వెళ్లారు. ఇక్కడకు బుజ్జమ్మ రాకతో వారి మధ్య వివాదం నెలకొంది. దీంతో బుజ్జమ్మ వీరిద్దరిపై ఇటుకరాయితో దాడి చేయగా గాయాలయ్యాయి. వీరు అనపర్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందారు. అక్కడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.

లారీ చక్రం కిందపడి క్లీనర్‌కు గాయాలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: లారీ చక్రం కిందపడి క్లీనర్‌కు గాయాలయిన ఘటన బలభద్రపురంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడానికి చెందిన నండూరి శ్రీనివాస్ బియ్యం లోడుతో బలభద్రపురంలోని ఓ రైసుమిల్లు వద్దకు సోమవారం రాత్రి వచ్చారు. బియ్యానికి సంబంధించిన కాగితాలు తీసుకుని లారీ దిగుతుండగా డ్రైవర్ అజాగ్రత్తతో ముందుకు నడిపాడు. దీంతో క్లీనర్ జారి లారీ చక్రాల కింద పడటంతో ఎడమ కాలికి గాయం అయ్యింది. అతన్ని కాకినాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవిచంద్రకుమార్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఆరుగురి అరెస్టు

గంజాయి నిందితులతో సీఐ, ఎస్సై ఇతర సిబ్బంది

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం నరసాపురం- కణుపూరు రహదారిలో సోమవారం గంజాయి రవాణా చేసిన 12 మందిపై కేసు నమోదు చేశామని సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై కేవీ నాగార్జున మంగళవారం తెలిపారు. రవాణా, విక్రయాలకు సంబంధించి మద్దాల సిద్ధార్థ, స్టీఫెన్ డొనాల్డ్ జాక్సన్, నాగబత్తుల హేమంత్‌కుమార్, నైనపు వెంకట సురేష్, సిద్దా వినయ్‌కుమార్, గాలిదేవర దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి 18 కేజీల గంజాయి, 5 చరవాణులు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు పరారీలో ఉన్నారన్నారు. అరెస్టు చేసిన నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో బాలిక అదృశ్యం అయ్యిందని అందిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాంకుమార్ తెలిపారు. మాటలు సరిగా రాని 13 ఏళ్ల బాలిక సోమవారం సాయంత్రం నుంచి కనబడటం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. కుటుంబ వివరాలు కూడా చెప్పలేదన్నారు. ఎవరికైనా ఆచూకి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు మనోధైర్యంతో సాగాలి

ఏవీఏ రోడ్డు, మోరంపూడి, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులు నిరాశకు గురికాకుండా నిరంతరం మందులు వాడి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోలర్ డాక్టర్ వసుంధర అన్నారు. మంగళవారం ఆనం రోటరీ హాల్లో కోనసీమ సేవా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.కృపారావు ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు అవగాహన సదస్సు, పోషక ఆహారం పంపిణీని నిర్వహించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను సభ్యులకు అధికారులు వివరించారు. మల్లంపూడి, తోకాడ, పుణ్యక్షేత్రం, రామస్వామిపేట గ్రామాలకు చెందిన సర్పంచులు తమ గ్రామాల్లో గల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నెలలో 19 నూతన సామాజిక పింఛన్లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గంగిశెట్టి చంటిబాబు, కార్మిక సంక్షేమశాఖ డైరెక్టర్ నీలపాల అరవరాజు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కోడి వీరరాఘవ, ఏవో సుబ్రహ్మణ్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తనకాల వెంకటరమణమ్మ తదితరులు హాజరయ్యారు.

సమస్యల్ని అధిగమిద్దాం.. ఆదర్శంగా నిలుద్దాం

పీటీఎంకు సిద్ధమవుతున్న పాఠశాలలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తోంది. వీటిలో భాగంగా విద్యార్థుల అభివృద్ధిలో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీలను భాగం చేస్తూ మెగా పేరెంట్స్ సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది రెండో దఫా సమావేశాలు ఈ నెల 5 నుంచి జరగనున్నాయి. అయితే కొన్ని పాఠశాలలో మౌలిక సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. వాటిని అధిగమిస్తే మరిన్ని ఫలితాలు వస్తాయని, సమావేశాల లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరుతుందని పలువురు అంటున్నారు. మరి కొన్ని పాఠశాలలో గత సమావేశాల్లో నిర్ణయించిన విధంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

నిర్మాణం ఎప్పటికో..

బిక్కవోలు, రంగంపేట: బిక్కవోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో అయిదేళ్ల క్రితం నాబార్డు నిధులతో చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. దాదాపు 600 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో గ్రాసిం ఇండస్ట్రీవారు నిర్మించిన మరుగుదొడ్లు తప్ప ఇంకేమీ లేవు. ✦ నాలుగేళ్ల క్రితం రూ.25 లక్షల అంచనాతో రంగంపేట మండలం పెదరాయవరంలోని ప్రాథమిక పాఠశాల(మెయిన్) తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. అవి నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో ఈ పాఠశాల విద్యార్థులు సమీప పాఠశాలలో చదువులు కొనసాగించాల్సి వస్తోంది.



బిక్కవోలులో అసంపూర్తిగా మరుగుదొడ్లు

యాజమాన్య కమిటీల సహకారంతో..

బొమ్మూరు, రాజానగరం: బొమ్మూరు జీపీఆర్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి గత సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో భాగంగా ప్రాంగణంలో కార్యక్రమాలు నిర్వహించడానికి దాతలు, యాజమాన్య కమిటీ సహకారంతో కాటన్ కళావేదిక నిర్మించారు. దానిపై షెడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు. ✦ రాజానగరంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారు సైకిళ్లు పెట్టుకోవడానికి షెడ్డు నిర్మింపజేశామని, తాగునీటి సమస్య పరిష్కరించామని యాజమాన్య కమిటీ ఛైర్మన్ అప్పారావు తెలిపారు.

WANTED TEACHERS

JASVEER invites applications from trained / well experienced teachers for pre - primary , primary and upper - primary classes.
High school : Hindi , Social , English.
Young graduates with English Medium background may also apply.
Salary is not a constraint for right candidates.

JASVEER (E.M) School
Krovvidi Lingaraju - St, Behind Gandhi Park, Danvaipeta, Rajamahendravaram.
Mail I.D : jems.rjy @gmail.com
9704269971, 9966644219

ప్రకటన

నా కక్షిదారుని అనగా **శ్రీ కాకుమల్ల గణపతి,** తండ్రి శ్రీ కాకుమల్ల పెద్ద సత్యనారాయణ, నివాసం: డోర్ నెం.1-155, వినాయకగుడి వీది ఎదుట, కానవరం గ్రామం, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా ఆదేశానుసారం నేను ఇందుమూలంగా ఈ బహిరంగ ప్రకటన సాధారణ ప్రజలకొరకు ఇవ్వడమైనది.

నా కక్షిదారుడగు కాకుమల్ల గణపతి వారు షెడ్యూల్‌లో వివరించిన ఆస్తిని 1) **శ్రీ గంపా అప్పన్నబాబు,** తండ్రి: గంపా వీరవెంకటరత్నం మరియు 2) **శ్రీ గంధం దుర్గారావు,** తండ్రి: గంధం చక్రరావుల నుంచి కొనుగోలు చేయదల్చారు.

ఉద్దేశిత అమ్మకందారులు అనగా 1) **శ్రీ గంపా అప్పన్నబాబు,** తండ్రి: గంపా వీరవెంకటరత్నం మరియు 2) **శ్రీ గంధం దుర్గారావు,** తండ్రి: గందం చక్రరావులు తెలుపడమేమనగా లింకు పత్రంలో ఒకటి అనగా సేల్‌డీడ్ తేది. 19-10-2006 ఎస్ఆర్ఓ, కడియం కార్యాలయంలో పత్రం సం. 3608/2006 గా నమోదైనది పోయినది మరియు ఆ విషయంలో తేది. 05-11-2025న ఈనాడు దినపత్రికలో పేపరు ప్రకటన ఇవ్వబడింది మరియు కడియం పోలీసుస్టేషన్‌లో పోలీసు ఫిర్యాదు కూడా ఇవ్వడమైనది మరియు పోలీసు శాఖ కూడా తేది: 14-11-2025న దొరకనట్టుగా సర్టిఫికెట్ ఇచ్చారు. ఉద్దేశిత విక్రయదార్లు లభించే పత్రాలన్నింటినీ నా కక్షిదారునికి అప్పగించారు మరియు నా కక్షిదారుడు అన్ని పత్రాలను పరిశీలించారు మరియు అవి ఆర్డర్‌లో యున్నట్లు కనుగొన్నారు మరియు సదరు షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయదల్చారు.

ఒకవేళ ఎవరికైనా ఎలాంటి ఇంజంక్షన్ అటాచ్‌మెంట్లు, తనఖా మరియు షెడ్యూల్ ఆస్తి కొనుగోలుపై ఏవిధమైన అభ్యంతరములు ఉన్నచో వారు సదరు విషయాలను నాకు గాని లేదా నా కక్షిదారునికి గాని ఈ నోటీసు ఇచ్చిన తేదీ నుంచి గల 15 రోజులలోగా తెలుపవలెను. అటుల చేయనిచో సదరు షెడ్యూల్ ఆస్తి నిర్వివాద ఆస్తిగా భావించి, ఆస్తి కొనుగోలు చేయుటకు తదుపరి చర్యలు తీసుకొందురు.

__షెడ్యూల్ ఐటం నెం.1__: తూర్పుగోదావరి జిల్లా, కడియం సబ్-రిజిస్ట్రీ, కడియం మండలం, కడియం గ్రామ రెవెన్యూ ప్రాంతం, కడియపుసావరం గ్రామ పంచాయతీ, కడియపుసావరం గ్రామం తాలూకు సర్వే నెం.47, ప్రస్తుత సబ్‌డివిజన్ ఆర్.ఎస్.నెం.47/1 భూమి ఆస్తి ఎక.1.10 సెంట్లు, ఇది విభజించబడింది మరియు గృహ స్థలాలుగా మార్చబడినవి. ఈ స్థలాలలో ప్లాటు నెం.4, బ్లాకు నెం.2 స్థల విస్తీర్ణం 205.33 చ॥గ॥లు ఇందులో దక్షిణ దిశగా స్థలం 128.84 చ॥గ॥లులో లేదా 107.72 చ॥మీ॥లు అయి, సమీప డోర్ నెం.2-9, ఖాళీ స్థలం హద్దులు: **తూర్పు:** 13.0 అ॥ల వెడల్పు రోడ్ 20.1 అ॥లు; **పడమర:** రోడ్ 20.1 అ॥లు; **ఉత్తరం:** 2వ ఐటం స్థలం 56.6 అ॥లు; **దక్షిణం:** ప్లాటు నెం.5లోని స్థలం రావిపాటి రామకృష్ణకు చెందింది 59.0 అ॥లు.

పై హద్దులకు లోబడి స్థలం 128.84 చ॥గ॥లు లేదా 107.72 చ॥మీ॥లులో యున్నది.

__షెడ్యూల్ ఐటం నెం.2__: తూర్పుగోదావరి జిల్లా, కడియం సబ్-రిజిస్ట్రీ, కడియం మండలం, కడియపుసావరం గ్రామ పంచాయతీ, కడియపుసావరం గ్రామం తాలూకు సర్వే నెం.47, ప్రస్తుత ఉప-డివిజన్ ఆర్.ఎస్.నెం. 47/1 ఇందులో భూమి ఆస్తి ఎక.1.10 సెంట్లు, విభజించబడింది మరియు గృహ స్థలాలుగా అయినవి. ప్లాట్లులో ప్లాటు నెం.4, బ్లాకు నెం.2, స్థలం విస్తీర్ణం 205.33 చ॥గ॥లు, ఇందులో ఉత్తర దిశగా మరియు ప్లాటు నెం.3 స్థలం, విస్తీర్ణం 187 చ॥గ॥లు ఇందులో దక్షిణ దిశగా మొత్తంగా 122.8 చ॥గ॥లు లేదా 102.07 చ॥మీ॥లు, సమీప డోర్ నెం.2-9, ఖాళీ స్థలం హద్దులు: **తూర్పు:** 13.0 అ॥ల వెడల్పు రోడ్ 20.02 అ॥లు; **పడమర:** పంచాయతీ రోడ్ 20.02 అ॥లు; **ఉత్తరం:** గట్టి వీరబాబు గారి స్థలం 52.06 అ॥లు; **దక్షిణం:** 1వ ఐటం స్థలం 56.06 అ॥లు.

పై హద్దులకు లోబడి స్థల విస్తీర్ణం 122.8 చ॥గ॥లు లేదా 107.07 చ॥మీ॥లు.

తేది: 02-12-2025, రాజమహేంద్రవరం. **డి.వి.కృష్ణారావు,** న్యాయవాది

కంబాలచెరువు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా, సెల్: 94901 78358, 94937 97448

(c) eenadu

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పర్యావరణ పరిరక్షణ జీవన విధానం కావాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ సంకల్పం అనేది జీవన విధానం కావాలని ఆంధ్రా సుగర్స్ కర్మాగార మేనేజరు ఇ.వి.కృష్ణారావు అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని కొవ్వూరు పట్టణంలోని సంస్కృత కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ పరిశ్రమలు, వాతావరణంలో కాలుష్యాల నియంత్రణకు చేపట్టాల్సిన ప్రణాళికను వివరించారు. మెకానికల్ ఇంజినీరు కేవీవీ సత్యనారాయణ, భద్రత అధికారి ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భోపాల్ దుర్ఘటనకు గల కారణాలు, కాలుష్య కారకాలతో వచ్చే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపల్ జి.గౌరీశంకర్, కర్మాగార హెచ్‌ఆర్ విభాగ అధికారి శుక మహర్షి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గీతా జయంతి ఉత్సవాలు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గీతా జయంతి సందర్భంగా మంగళవారం వేలివెన్నులో మహిళా భక్తులు గీతా పారాయణం చేశారు. ఆలయంలో కొలువైన వేంకటేశ్వర, వేణుగోపాలస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. గీతా జయంతి కేక్‌ను కోసి పంచారు. మోర్త, ఉండ్రాజవరం, తాడిపర్రు, సూర్యారావుపాలెం, పసలపూడిలోని గోపాలస్వామి ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

వేలివెన్నులో వేంకటేశ్వరస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

ఉ॥ 10 - మ॥ 1

స్పందనకు వందనం

దీపాలు వెలిగాయి..

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు పట్టణ పరిధి 10వ వార్డు, ఫ్యాక్టరీ క్వార్టర్ల రోడ్డులో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఆరు దీపాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

చిన్న గుడ్లను తిరస్కరించాలి..

ఈనాడు కథనానికి స్పందన

తాళ్లపూడి: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కొడిగుడ్లను ఎప్పటికప్పుడు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పరిశీలించాలని డీఈవో వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 29న 'ఈనాడు'లో 'గుడ్లా..గోలీలా' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గుత్తేదారు సరఫరా చేస్తున్న గుడ్లను పరిశీలించి బరువు తక్కువ, చిన్నగా, పాడైన వాటిని గుర్తించి తిరిగి గుత్తేదారుకు ఇచ్చేయ్యాలన్నారు. ఆయా మండలాల పరిధిలో ఎంఈవోలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

దివ్యాంగుల సేవలో హృదయాలయం

• నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

దివ్యాంగులతో కలిసి బొమ్మల తయారీలో విశాలాక్షి

నిడదవోలు, న్యూస్‌టుడే: బుద్ధిమాంద్యంతో పుట్టిన చిన్నారులను అక్కున చేర్చుకుంటోంది నిడదవోలు మండలం శంకరాపురంలోని హృదయాలయం. దండే గణేష్‌బాబు, బలగం విశాలాక్షి 2009లో తాళ్లపూడిలో మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, వసతిగృహాన్ని బుద్ధిమాంద్యం గల ఐదుగురు పిల్లలతో ప్రారంభించారు. క్రమంగా వీరి సంఖ్య 50కి చేరింది. అనంతరం 2014లో నిడదవోలులో హృదాలయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 45 మంది వరకు పిల్లలున్నారు. వీరిలో 10 మందికి మాత్రమే తల్లిదండ్రులు ఉన్నారు. మిగిలిన వారందరికీ వీరిద్దరే ఆధారం. తొలుత స్నేహితులు కొంత మంది కలసి సహాయ్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. కొన్ని రోజులకు వీరిలో కొందరు వెనక్కి వెళ్లిపోగా వీరు మాత్రం కొనసాగిస్తున్నారు. బుద్ధిమాంద్యం గల పిల్లలకు అందిస్తున్న సేవలకుగాను విశాలాక్షికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా పురస్కారాన్ని అప్పటి కలెక్టర్ భాస్కర్ అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులకు చేస్తున్న సేవలకుగాను గణేష్‌బాబుకు బెంగళూరులో డాక్టరేట్ ప్రదానం చేశారు.

ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి

మానసిక వైకల్యంతో బాధపడే వారి కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ఎక్కడైనా స్థలాన్ని ఉచితంగా అందిస్తే భవనం నిర్మించాలని, మరింత మందికి వసతితోపాటు సదుపాయాల కల్పనకు అవకాశం ఉంటుందని భావించాం. ఇది సఫలం కాకపోవడంతో మేమే స్వయంగా స్థలం కొనుగోలు చేసి భవనం నిర్మిస్తున్నాం.

- దండే గణేష్‌బాబు, బలగం విశాలాక్షి

మేమున్నామంటూ..!

నిత్యావసరాలు అందిస్తున్న సంఘ సభ్యులు

నిడదవోలుకు చెందిన ర్యాలి సత్యనారాయణ(శివ) దివ్యాంగుడు. 2010లో 11 మంది దివ్యాంగులతో కలిసి జ్యోతిర్మయి వికలాంగుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. నడవడానికి ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులకు స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా మూడు చక్రాల వాహనాలు ఇప్పిస్తున్నారు. విద్యార్థులకు సంఘం ద్వారా రాత పుస్తకాలు అందిస్తున్నారు. పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ప్లేట్లు అందించారు. సంఘ సభ్యులు మృతి చెందినా, ప్రమాదాలకు గురైనా ఆ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నారు. దివ్యాంగులతో పాటు అవసరమైన పేదలకు కూడా సేవలు అందిస్తున్నట్లు జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి దరికి చేరుస్తున్నామన్నారు.

సీఎం సభకు తరలిరండి

మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు అనిల్, పార్టీ నాయకులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: నల్లజర్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ కోరారు. దేవరపల్లిలో తెదేపా నేత పెన్మత్స సుబ్బారావు ఇంటి వద్ద గ్రామ పార్టీ అధ్యక్షులు, సొసైటీ ఛైర్మన్లతో కలసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి రైతులు, పార్టీ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రామారావు, ముళ్లపూడి దొరాజీ, కంటిపూడి సుబ్బారావు, కాట్రగడ్డ పరమేశ్వరరావు, గన్నమని గోపాలకృష్ణ, తదితరులు, పాల్గొన్నారు.

గోపాలపురం: నల్లజర్లలో బుధవారం నిర్వహించనున్న రైతన్నా.. మీకోసం ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొనే సభను విజయవంతం చేయాలని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు కొర్లపాటి రాము పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణంలో మండల నేతలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సభకు అధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మండల కమిటీ, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కౌశల్ ప్రతిభా పరీక్షకు ఎంపిక

ప్రతిభ చూపిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన కౌశల్ ప్రతిభా పరీక్షల్లో నిడదవోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. క్విజ్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని అమరపూరి జస్విక, పోస్టర్ విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న అమరపూరి హన్సిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎన్.అరుణ రాజేశ్వరీ ఫిలిప్స్ తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, ఎస్ఎంఎస్ సభ్యులు అభినందించారు.

క్రికెట్ పోటీల్లో తపస్వి ప్రతిభ

తపస్విరెడ్డి

నిడదవోలు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పేరిచర్లలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలుర క్రికెట్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టులో నిడదవోలు నారాయణ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి ప్రతిభ ప్రదర్శించాడు. మంగళవారం పాఠశాలలో తపస్విని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం పి.రామిరెడ్డి, రీజనల్ ఇన్‌ఛార్జి బి.సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

శోభాయమానంగా పుష్కరాల నిర్వహణ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరులో పుష్కరాలను శోభాయమానంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పర్యాటక, జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులతో కలసి గోదావరి తీరంలో పడవపై పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించారు. గోష్పద క్షేత్రం నుంచి ఆరికిరేవుల తిరిగి శ్రీనివాసా ఘాట్ వరకు పర్యటించారు. అనంతరం వాడపల్లిలో మూడు ఘాట్‌లు, లంక భూములను పరిశీలించారు. రేవుల ఆధునికీకరణ, సౌకర్యాలు, సుందరీకరణ పనులపై త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గోష్పద క్షేత్రం నుంచి సుబ్రహ్మణ్య ఘాట్ వరకు ప్రధాన ఘాట్ విస్తరించే ప్రణాళిక, పర్యాటక సౌకర్యాల కల్పనకు అనువైన స్థలాలను పరిశీలించామన్నారు. శ్రీనివాసా ఘాట్ సమీపంలో అసంపూర్తిగా ఉన్న కాటేజిని పూర్తి చేసేందుకు అంచనాలు రూపొందిస్తామన్నారు. పట్టణం పొడవునా సుందరీకరణ పనులకు అనువుగా గోదావరి తీరం ఉందని, ప్రత్యేక ప్రణాళికతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నామన్నారు. జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, డీవీఎం ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, ఈఈ విజయభాస్కర్, బోటింగ్ మేనేజరు ఆర్.గంగబాబు, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, తెదేపా నాయకులు కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏజీఆర్బీ జేఈఈ మణికంఠ, ఉప తహసీల్దారు అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల పనులపై అధికారులతో గోదావరిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

నిడదవోలు ఆర్టీసీ డీఎంకు ప్రశంస

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు ఆర్టీసీ డిపో పరిధిలో స్త్రీ శక్తి పథకాన్ని సమర్థంగా అమలు చేయడంతోపాటు, సెప్టెంబరులో జీరో బ్రేక్‌డౌన్‌తో పెట్రోల్ తెప్పించినందుకు డిపో మేనేజర్ ధనుంజయకు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్, ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ప్రశంసాపత్రం పంపించారు. దీన్ని మంగళవారం రాజమహేంద్రవరంలో డీపీటీవో వైఎస్‌ఎన్ మూర్తి అందజేశారు.

డీపీటీవో మూర్తి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డిపో మేనేజర్ ధనుంజయ

మాతృ వందనం.. గర్భిణులకు వరం

ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారుల నమోదు

చాగల్లు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి మాతృ వందన యోజన గర్భిణులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకుంటే.. మొదటి ప్రసవానికి రూ.5 వేలు, రెండో ప్రసవానికి రూ.6 వేలు చొప్పున అందిస్తారు. విడతల వారీ ఆర్థిక సాయం అందించడంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహార అందిస్తారు. ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకుంటారు. వారిలో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తారు.

అంగన్‌వాడీలకు బాధ్యతలు..

పీఎం మాతృ వందనం యోజనకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపు, ఎంపిక ప్రక్రియను గతంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా అంగన్‌వాడీలకు అప్పగించారు. లబ్ధిదారుల నమోదు, అర్హులను గుర్తించే బాధ్యత వారే చూసుకుంటారు. కొవ్వూరు నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 355 మంది ఈ పథకంలో ఉన్నారు. నమోదైన 5 నెలల్లోపు రూ.2 వేలు, అన్ని రకాల టీకాలు వేసుకుంటూ సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలల లోపు మరో రూ.2 వేలు, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవమైతే రూ.వెయ్యి అందిస్తారు. రెండో కాన్పులో ఆడ బిడ్డ జన్మిస్తే పుట్టిన మూడున్నర నెలల తర్వాత మొత్తం రూ.6 వేలు బాలింత బ్యాంకు ఖాతాలో వేస్తారు.

ఎంపిక చేసిన వారికే గుర్తింపు

గర్భిణుల వయస్సు 18 ఏళ్ల ఏడు నెలలు నిండితేనే మాతృ వందనం పథకం కింద ఆర్థిక సాయం పొందేందుకు అర్హులని సీడీపీవో కె.నాగలక్ష్మి తెలిపారు. అర్హులు బ్యాంకు ఖాతాలు తీసుకొని ఆధార్, ఫోను నంబర్లు లింక్ చేయాలన్నారు. రేషన్ కార్డులో పోషణ్ ఖాతాలో పేర్లు నమోదు చేసుకోవల్సి ఉంటుందన్నారు.

చాగల్లులోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు

ప్రతిభ చాటి.. బహుమతి సాధించి

కొవ్వూరు పట్టణం: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలోని పీఎం ఎంఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని చక్కగా ఉపన్యసించి ప్రతిభ చాటుకున్నారు. షేక్ షిఫా జువేరియా (10వ తరగతి), కె.సత్యనారాయణ (9వ తరగతి), ఎల్‌డీపీ లోక్‌నాయక్ (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపన్యసిస్తున్న విద్యార్థి

విజేతలతో మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసన్

నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించండి

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గ్రంధి సందీప్ మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాలని గుత్తేదారుకు సూచించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అనపర్తి, రాజానగరం, రంపచోడవరంలో అన్న క్యాంటీన్ భవనాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. గోపాలపురం, కోలమూరులో ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ కర్రి అజయ్, తెదేపా నేత జ్యేష్ఠ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్

వర్షంతో రైతుల ఆందోళన

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో మంగళవారం వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సార్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ఎడతెరపి లేకుండా వర్షం కురవటంతో ధాన్యం తడిసిపోయింది. మండలంలో 12 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం 75 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. 25 శాతం ధాన్యం రహదారులపై, కల్లాల్లో ఉంది. ధాన్యం దక్కించుకోటానికి రైతులు పరుగులు తీశారు. వడ్లూరు, కాల్దరి, సత్యవాడ, పసలపూడి, సూర్యారావుపాలెం, మోర్త తదితర గ్రామాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని హడావిడిగా బస్తాల్లో నింపి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పి భద్రపరిచారు.

తాడిపర్రులో ధాన్యం రాశిపై బరకం కప్పుతున్న రైతులు

యువత ఆధ్యాత్మికతత్వం అలవరచుకోవాలి

పెరవలి: యువత ఆధ్యాత్మికతత్వం అలవరచుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నిడదవోలు అనంతలక్ష్మి సూచించారు. నల్లాకులవారిపాలెంలోని కొత్తపల్లి అగ్రహారం ఆర్యవైశ్య సేవా సంఘ భవనంలో మంగళవారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని, సత్యాన్ని ఆచరించి ఉత్తములుగా మెలగాలన్నారు. తుట్టగుంట అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో అన్నదానం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు అత్త కంకిపాటి మేరీ జ్ఞాపకార్థం మదర్ థెరిసా వీధి బాలల పునరావాస కేంద్రంలో మంగళవారం అన్నదానం చేశారు. క్లబ్ సభ్యుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, జువ్వలపూడి జాన్‌విక్టర్, నాయకుడు కొప్పాక జవహర్ విజయానందకుమార్, ఆశీర్వాదం, శ్యాంబాబు, కేంద్రం నిర్వాహకుడు బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొగతో కాలుష్యం

దేవరపల్లి మండలం యర్నగూడెంలోని గండి చెరువు సమీపంలో ప్రధాన రహదారికి రెండు వైపులా పేరుకుపోయిన వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో పొగతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మంగళవారం సాయంత్రం నిప్పు పెట్టగా వర్షం కారణంగా నల్లని పొగ వెలువడి పరిసరాలు కాలుష్యకారకంగా తయారయ్యాయి. రహదారి కనిపించక వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

గుట్టలుగా వ్యర్థం.. తొలగించక అనర్థం

సంపద కేంద్రాలను వినియోగించకపోవడంతో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోంది. మండలంలో పెద్దగ్రామమైన ఖండవల్లిలో డంపింగ్ యార్డు లేకపోవడంతో జలవనరుల శాఖ కాలువ పక్కనే చెత్తను వేస్తున్నారు. వర్షాలకు దుర్వాసన వ్యాపిస్తుంటడంతో స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పేకోరు-కోడవల్లి రోడ్డుపైకి చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పంచాయతీల విస్తరణాధికారి చంద్రం వెంకటరమణ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెరవలి

ఇలాగైతే.. మురుగు పారేదెలా..

పెరవలి మండలం కానూరు అగ్రహారం నుంచి కానూరు వచ్చే మురుగు కాలువ పూర్తిగా పూడుకుపోయింది. మురుగు పారే దారిలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే పంటలు నీట మునిగి ఏటా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మురుగు కాలువ పూడిక తీయించాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

సంస్థాగత నిర్మాణంతో కాంగ్రెస్ బలోపేతం

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి కార్యాచరణతో పల్లె నుంచి దిల్లీ వరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందని ఏఐసీసీ కార్యదర్శి, తూర్పు గోదావరి జిల్లా పార్టీ పరిశీలకురాలు అంబా ప్రసాద్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ బ్లాక్-2 సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని చాగల్లులోని వలీ నివాసంలో మంగళవారం నిర్వహించారు. బ్లాక్-2 అధ్యక్షుడు ఎస్.బాల వీర్రాజు అధ్యక్షత వహించగా అంబా ప్రసాద్ మాట్లాడారు. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. జిల్లా కార్యవర్గాల ఎన్నికకు ప్రతి కార్యకర్త, వివిధ హోదాలలో ఉన్న నాయకుల అభిప్రాయాలను సేకరించి ఏఐసీసీకి పంపిస్తామన్నారు. ప్రతి కార్యకర్తను స్వయంగా కలసి పార్టీ పటిష్ఠం, కార్యాచరణపై చర్చించే ప్రక్రియ నడుస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పూర్వాధ్యక్షుడు రఫీయుల్లాబేగ్, నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ షఫీయుల్లా బేగ్, కొవ్వూరు పట్టణం, గ్రామీణం, చాగల్లు మండలాల అధ్యక్షులు బచ్చు బుజ్జిబాబు, సుంకర కృష్ణ, మట్టా సుబ్బారావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. మంగళవారం విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల వేదికపై విద్యార్థులు వీణానాదం, గాత్రకచేరీ, మోహిని భస్మాసుర కూచిపూడి నృత్య రూపకం తదితర ప్రదర్శనలతో అలరించారు. శ్రీసిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం విద్యార్థుల నృత్య రూపకం ఆకట్టుకుంది.

వైద్యానికి సాయం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవానికి చెందిన జవ్వాది గంగాభవాని వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 11,500 సాయం అందించినట్లు దేవోక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పి.నాగరాజు మంగళవారం తెలిపారు. జోడాల వెంకటేశ్వరరావు, రమాదేవి మిత్రబృందం సాయం అందించేందుకు ముందుకు వచ్చారన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన సిరాపురపు కాశీవిశ్వనాథ్, శేషగిరి శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,61,123 విరాళం మంగళవారం సమర్పించారు. వీరికి స్వామి వారి చిత్రపటం అందజేసి దేవస్థానం సిబ్బంది అభినందించారు.

జీవనశైలిలో మార్పు రావాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : విధాన సంస్కరణలతోపాటు జీవనశైలిలో మార్పులతో కాలుష్య నియంత్రణ సంకల్పం నెరవేరుతుందని ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రామ్మోహన్ అన్నారు. కళాశాల ఎకో క్లబ్, లైఫ్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కాలుష్యానికి కారణాలు, నియంత్రణ పద్ధతులపై విద్యార్థులు ఇచ్చిన దృశ్య రూప, చిత్ర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణకు పాటించాల్సిన విధానాలు, భోపాల్ ఘటన కారణాలపై అవగాహన కల్పించారు. నాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు మనోధైర్యంతో సాగాలి

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులు నిరాశకు గురికాకుండా నిరంతరం మందులు వాడి ఆరోగ్యంగా జీవించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోలర్ డాక్టర్ వసుంధర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆనం రోటరీ హాల్లో కోనసీమ సేవా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.కృపారావు ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులకు అవగాహన సదస్సు, పోషక ఆహారం పంపిణీ నిర్వహించారు. వసుంధర మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులు ప్రభుత్వం అందిస్తున్న మందులను రోజూ వాడాలన్నారు. లెప్రసీ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర సమన్వయకర్త రాధిక, మానవతా సేవా సంస్థ అధ్యక్షులు మురళి, వైద్యాధికారి డా.డీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనం.. పూర్తికాక దైన్యం

పోతవరంలో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం ఎనిమిదేళ్లుగా సామాజిక భవనంలో కొనసాగిస్తున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో వైద్య సేవలకు వచ్చే 12 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పోతవరంలో రోడ్లు, భవనాల శాఖ ఆధీనంలో ఉన్న బ్రిటీష్ కాలం నాటి జైలు కట్టడాన్ని పడగొట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. 2017లో అప్పటి ప్రభుత్వం రూ.1.24 కోట్లు కేటాయించింది. అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు అదే ఏడాది ఏప్రిల్ 29న శంకుస్థాపన చేశారు. 2019 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2022 ఆగస్టులో ఈ భవనాన్ని సంబంధిత శాఖకు అప్పగించాల్సి ఉన్నప్పటికీ 25 శాతం పనులు పూర్తికాకపోవడంతో అసంపూర్తిగా ఉండిపోయింది. దీనిపై పోతవరం పీహెచ్‌సీ వైద్యురాలు శైలజ మాట్లాడుతూ ఈ సమస్యను సంబంధిత అధికారులకు తెలియజేశామన్నారు. త్వరలో భవన నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

భద్రత కరవాయె: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం సవితా సమాజ సభ్యులు ధర్నాలు కొనసాగించారు. సామాజిక భద్రత కల్పించాలని, వివిధ వర్గాల నుంచి ఎదురవుతున్న దాడులు, అవమానాలు నిలువరించాలని బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో వారంతా నినదిస్తూ.. ఆందోళనలో పాల్గొన్న దృశ్యం **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

న్యాయం కావాలి.. : బదిలీల్లో పారదర్శకత పాటించాలని డిమాండు చేస్తూ బెంగళూరు స్వాతంత్ర్య ఉద్యానవనంలో అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కర్ణాటక శాఖ సభ్యులు మంగళవారం నిర్వహించిన ధర్నా **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

చిన్నారిని.. చిదిమేశారు

చెరకు తోటలో దారుణం

బెళగావి, న్యూస్‌టుడే : చెరకు తోటలోకి ఏడో తరగతి బాలికను లాక్కొని వెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడిన మణికంఠ దిన్నిమని, ఈరణ్ణ సంకమ్మ అనే యువకుల కోసం మురగోడు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు. మురగోడు ఠాణా పరిధిలోని ఓ గ్రామంలో పిండి మరకు వెళుతున్న బాలికను నవంబరు 23న నిందితులు లాక్కొని వెళ్లి పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఎవరికన్నా చెబితే ప్రాణహాని తలపెడతామని బెదిరించారు. భయంతో ఎవరికీ చెప్పకుండా బాలిక కుమిలిపోతూ వచ్చింది. ఆమె ఆందోళనను గుర్తించిన తల్లి.. సముదాయించి అడగడంతో జరిగిన ఘోరాన్ని చెప్పింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. తమపై ఫిర్యాదు నమోదైన వెంటనే నిందితులు పరారయ్యారని పోలీసులు గుర్తించారు. వారెక్కడున్నదీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

బాలికపై లైంగిక వేధింపులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : ఇంట్లో పని చేస్తున్న బాలికపై లైంగిక వేధింపులు, దౌర్జన్యాలకు పాల్పడిన దంపతులకు వ్యతిరేకంగా తలఘట్టపుర పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతర రాష్ట్రానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఏడాది నుంచి మల్లసంద్ర విలేజి రహదారిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పర్జాపత్ రంజిత్ సింగ్, కాకూ తాల్లూకుదార్ దంపతులుంటున్న ఇంట్లో పని చేస్తోంది. పర్జాపత్ రంజిత్‌సింగ్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఆయనకు భార్య సహకరించారనే ఆరోపణలు వచ్చాయి. ఇటీవల అనారోగ్యానికి గురైన బాలికను సెయింట్‌జాన్స్ ఆసుపత్రి వైద్యులు పరీక్షించారు. లైంగిక వేధింపులకు గురైనట్లు గుర్తించారు. బాలల సంక్షేమ సమితి సభ్యులు, వైద్యులు బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించగా ఇంటి యజమాని లైంగిక దౌర్జన్యం, వేధింపులకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. వైద్యులు, సమితి సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

రాజకీయ సూప్.. అదిరే

- డీకే ఇంట మరో విందు
- కొత్త వ్యవహారాలకు వేదిక

ఈనాడు, బెంగళూరు : అధిష్ఠానం సూచించినట్లు అధికార పక్షంలో కుర్చీలాటకు ఓసారి 'బ్రేక్' పడినా.. రాజకీయ నాటకానికి ఇంకా తెరపడలేదు. మొన్న సీఎం అల్పాహార విందుకు హాజరైన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్.. మామధ్య ఇక రాజకీయాలుండవని ప్రకటించారు. ఇలా చెప్పిన మూడ్రోజులకే మరోసారి వీరిద్దరూ అల్పాహార సమావేశంలో పాల్గొని ఆసక్తి రేకెత్తించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు దిల్లీ-బెంగళూరు మధ్య ప్రయాణాలు సాగిస్తూ అలసిపోతుంటే వీరిద్దరూ విందు పేరిట సమావేశమవుతూ కుర్చీ రాజకీయం ఇంకా కొనసాగుతుందన్న సంకేతాలిచ్చారు. పైగా ఇద్దరం ఒకటేనని పదేపదే ప్రకటిస్తూ తెరవెనుక చర్చల గుట్టు విప్పేందుకు ససేమిరా అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

నాటుకోడి రుచి

తాను శాకాహారి అయినా మాంసాహారాన్ని ఇష్టపడే ముఖ్యమంత్రి కోసం ఉపముఖ్యమంత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. 'ముందుగా నేనే అల్పాహారానికి ఆహ్వానించినా సీఎం కోరిక మేరకు గత శనివారం కావేరి నివాసంలో విందుకు హాజరయ్యా. ఈసారి సీఎంను ఆహ్వానించానని డీకే మంగళవారం వెల్లడించారు. ఆయన కోరిక మేరకు రామనగర గ్రామాల నుంచి నాటు కోడి తెప్పించి- కూరవండి.. ఇడ్లీతో కలిపి వడ్డించారు. ఈ అల్పాహారాన్ని డీకే సురేశ్, కుణిగల్ ఎమ్మెల్యేల రంగనాథ్‌తో కలిసి స్వీకరించిన సీఎం అనంతరం ప్రత్యేకంగా డీకేతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నా కోరిక మేరకు పల్లె నాటుకోడి కూర చేయించిన డీకే శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎప్పటిలాగానే ఈ సమావేశంలోనూ రాజకీయాల కంటే పార్టీ వ్యవహారాలపైనే మాట్లాడామన్నారు. మేమిద్దరం ఎప్పటికీ సోదరులమేనని మరోసారి ప్రకటించారు. రానున్న శీతాకాల సమావేశాల్లో అధికార పక్షం అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్రంతో నిధుల కోసం చేయాల్సిన ప్రయత్నాలపై మాట్లాడామన్నారు. నేడు (బుధవారం) నేను, డీసీఎంలు ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమవుతాయని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

సిద్ధు వైరాగ్యం

ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం విధానసౌధలో రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. డీకే ఇంట అల్పాహార సమావేశం తర్వాత ఆయన విధానసౌధకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేళూరు గోపాలకృష్ణతో మాట్లాడుతున్న సందర్భంగా 'నేనెప్పుడూ ఆలోచించి రాజకీయాలు చేయలేదు. రాజకీయం నా తండ్రి సొత్తు కాదు. రాజకీయాలు శాశ్వతం కాదు. అధిష్ఠానం ఏం చేస్తుందో చేయనీ.. ఏమవుతుందో అవనీ' అంటూ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కుర్చీలాటలో అలసిన ముఖ్యమంత్రిలో వైరాగ్యం ఆవరించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి.

అన్నొచ్చిండు! : తన నివాసానికి వచ్చిన సిద్ధరామయ్యతో కరచాలనం చేస్తూ ఆహ్వానిస్తున్న డీకే శివకుమార్

ఎన్నో ప్రశ్నలు..: ఎవరెన్ని అడిగినా.. మేమిద్దరం ఒక్కటేనంటున్న సిద్ధు, డీకే

అధిష్ఠానం సూచిస్తేనే..

ఇదే సమయంలో డీకే శివకుమార్ ఎప్పుడు సీఎం అవుతారన్న ప్రశ్నకు అధిష్ఠానం సూచిస్తే అవుతారని సిద్ధు సూటిగా బదులిచ్చారు. ప్రస్తుతం మా ఇద్దరి మధ్య ఎలాంటి భేదాలు లేవని మరోసారి ప్రకటించారు. ఈ సమావేశంలో నాలుగు క్షేత్రాల ఎమ్మెల్సీ ఎన్నికలు, రానున్న స్థానిక ఎన్నికలు, త్వరలో దిల్లీకి అఖిలపక్ష ఎంపీల సమావేశం, విధానసభ సమావేశాల గురించి చర్చించినట్లు డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. మేకెదాటుపై న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ప్రకారం డీపీఆర్ తయారు, మొక్కజొన్న ధర, గ్రామీణాభివృద్ధి, నగరాభివృద్ధి, నీటిపారుదల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి చర్చించామన్నారు. మా మధ్య అంతరాలు కేవలం విపక్షాలు, మాధ్యమాలు సృష్టించిందే, దిల్లీకి వెళ్లిన సమయంలో సమయం దొరికితే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలతో భేటీకి ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి, డీసీఎంలు ఇదే సందర్భంగా వెల్లడించారు.

విపక్షాల రుసరుస..

ఒకవైపు అధికార పక్షంలో అల్పాహారాల విందు రాజకీయాలు ఊపుమీదుండగా.. విపక్ష భాజపా ఈ వాతావరణంపై రుసరుసలాడుతోంది. పాలన పక్కనపెట్టి.. భోజనాలతో వ్యవహారాలన్నీ సరిపెడుతున్నారని నిరసన వ్యక్తం చేసింది. హనుమద్ జయంతి సేవ ద్యంలో సిద్ధరామయ్య కోడిమాంసం ఆరగించడమేంటని విపక్ష నేత ఆర్.అశోక్ నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రి, హావేరి ఎంపీ బసవరాజ బొమ్మై మరో అడుగు ముందుకేసి 'ఈ బ్రేక్‌ఫాస్ట్ సమావేశాలు మార్చి రాజకీయాల టీజర్ మాత్రమే. అసలైన సినిమా ముందుంది. ఆ సంబరం కూడా ఎంతో దూరంలో లేదు. ఇక మంచి వినోదమే ప్రత్యక్షమవుతుంది' అని రుసరుసలాడారు. మరోవైపు.. హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ మూడో విడత అల్పాహార విందుకు సిద్ధమవుతున్న సమాచారం కాంగ్రెస్ వర్గాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

యడియూరప్పకు ఊరట

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై నమోదైన పోక్సో కేసు విచారణపై సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఫిర్యాదు చేసిన బాలిక, దర్యాప్తు చేస్తున్న సీఐడీకి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జైమాల్య బాగ్చీ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తనపై నమోదైన పోక్సో కేసును రద్దు చేయాలని కోరుతూ యడ్డీ వేసుకున్న అర్జీని కర్ణాటక ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. దీన్ని ప్రశ్నిస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, 88 ఏళ్ల యడియూరప్పను వేధించే ఉద్దేశంతోనే బాలిక తల్లి ఫిర్యాదు చేసిందని వాదనలు వినిపించారు. వాదనలు ఆలకించి, దర్యాప్తు, విచారణపై స్టే ఇస్తూ ధర్మాసనం తీర్పు ఇచ్చింది.

జార్జిపై కేసు కొట్టివేత

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే : విద్యుత్తు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఇంధన శాఖ మంత్రి కేజే జార్జిపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. భాజపా నాయకులు సీఎన్ అశ్వత్ నారాయణ, ఎస్ఆర్ విశ్వనాథ్, ధీరజ్ మునిరాజు దాఖలు చేసిన ప్రైవేటు కేసును రద్దు చేయాలని కోరుతూ జార్జి వేసుకున్న అర్జీని జస్టిస్ ఎంఐ అరుణ్ విచారణకు చేపట్టారు. ఒక రాజకీయ పార్టీ, అధికార పార్టీ నాయకునిపై కక్ష పూరితంగా కేసు దాఖలు చేశారని, అక్రమాలు జరిగాయని రుజువులు కూడా లేవని జార్జి తరఫు న్యాయవాదుల వాదనలను పరిగణనలోకి తీసుకుని న్యాయమూర్తి ఈ ఆదేశాలు ఇచ్చారు.

వికటించిన సహజీవనం

ప్రియురాలిని హత్య చేసి.. ప్రియుడి ఆత్మహత్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వారిద్దరి సహజీవనం.. చివరికి వికటించి విషాదాంతంగా మారింది. ప్రియురాలిని హత్య చేసి ఆ ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అర్ధరాత్రి బెంగళూరు రాజగోపాలనగర పోలీసు ఠాణా పరిధిలో కలకలం సృష్టించింది. హైదరాబాద్ నివాసిగా భావిస్తున్న గదగ లలిత(49) అనే మహిళను హత్య చేసిన ఆమె ప్రియుడు లక్ష్మీనారాయణ(51) ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. లలితకు ఇప్పటికే వివాహమై పిల్లలున్నారు. కొన్ని కారణాలతో కుటుంబానికి దూరమై.. బెంగళూరులోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ ఒంటరిగా ఉండేవారు. ఆమెతో కొరటిగెరె నివాసి లక్ష్మీనారాయణకు పరిచయం ఏర్పడింది. ఆయనదీ అదే తరహా కుటుంబ పరిస్థితి. వారి పరిచయం ప్రేమగా మారి.. ఎనిమిది నెలలుగా ఇందిరా ప్రియదర్శిని నగరలో అద్దె ఇంట్లో సహజీవనం కొనసాగించారు. సోమవారం ఉదయం ఇద్దరూ విధులకు వెళ్లి.. రాత్రికి తిరిగివచ్చారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరూ మద్యం తాగి గొడవపడ్డారని స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. ఆ మత్తులోనే కోపం పట్టలేక ఆమెను కొట్టి, స్పృహ కోల్పోయాక పైన ఫ్యాన్‌కు ఉరివేశాడని అనుమానిస్తున్నారు. అనంతరం.. అదే చీర మరో కొనకు ఉరివేసుకుని అతనూ మరణించాడని తేలింది. మంగళవారం ఉదయం ఆ ఇంటి తలుపులు తెరవక పోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం కలిగింది. కిటికీ నుంచి చూసి.. ఆ ఇద్దరూ మరణించారని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు రంగంలోకి దిగి, ఇంటి తలుపులు పగులగొట్టి మృతదేహాలను విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. హత్య, ఆత్మహత్యలకు కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భాజపా.. అంతా బాగుందట!

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : 'నక్క ఊళ శిఖరం వరకు వినిపించదు..' విధానపరిషత్తులో విపక్ష నేత చలువాది నారాయణ స్వామి (భాజపా) వ్యాఖ్యానించారు. భాజపా రాష్ట్రాధ్యక్షుడు విజయేంద్రను పదవి నుంచి తప్పిస్తేనే మళ్లీ పార్టీకి జవసత్వాలు వస్తాయని కొందరు నేతలు చేస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపాలో రెబల్ నాయకులు రమేశ్ జార్ఖిహొళి, మాజీ ఎమ్మెల్యే కుమార బంగారప్ప తదితరులు దిల్లీలోని కర్ణాటక భవన్‌లో సమావేశమైతే.. ఇక్కడ పరిస్థితుల్లో మార్పు ఏమీ ఉండదన్నారు. విజయేంద్ర నాయకత్వంలో కార్యకర్తలు అందరూ చురుకుగా పని చేస్తున్నారని తెలిపారు. భాజపాలో పార్టీ అధిష్ఠానం చేసే ఆదేశం, తీసుకునే నిర్ణయమే అంతిమమన్నారు. లోక్‌సభ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ధర్మానికి సంబంధించి చేస్తున్న వ్యాఖ్యలు అసంబద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇందిర, రాజీవ్, సంజయ్ గాంధీ ఏ ధర్మం వారిని వివాహం చేసుకున్నారో ముందుగా తెలుసుకుంటే, వారు హిందువులా కాదా అన్నది తేటతెల్లమవుతుందని వ్యాఖ్యానించారు.

కుర్చీ కోసం పాట్లు

చామరాజనగర, న్యూస్‌టుడే : కొత్త ఏడాదిలో ముఖ్యమంత్రి పీఠాన్ని డీకే శివకుమార్‌కు విడిచి పెట్టేందుకు సిద్ధరామయ్య మానసికంగా సిద్ధమవుతున్నారని విధానపరిషత్తులో విపక్ష నేత చలువాది నారాయణ స్వామి వ్యాఖ్యానించారు. మంత్రివర్గ విస్తరణలో హెచ్‌సీ మహదేవప్ప, డాక్టర్ పరమేశ్వర్, కెహెచ్ మునియప్ప తదితరులను పక్కన పెడతారని జోస్యం చెప్పారు. మంత్రివర్గం కూర్పులో పూర్తిగా తన మద్దతుదారులే ఉండేలా డీకే చూసుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి సిద్ధరామయ్య ఒక్కసారి కూడా డీకే శివకుమార్ ఇంటికి వెళ్లలేదని, ఇప్పుడు తన పదవిని కాపాడుకునేందుకే వెళ్లారని వివరించారు. వచ్చే సంక్రాంతి నాటికి సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి పీఠానికి సంబంధించి జరిగిన ఒప్పందం నుంచి అల్పాహార విందులతో శివకుమార్ వెనక్కు ఎలా వెళతారని ప్రశ్నించారు. దళిత నాయకులను అణగదొక్కేందుకు కాంగ్రెస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగిస్తే తాను స్వాగతిస్తానన్నారు.

దిల్లీ : కర్ణాటక భవన్‌లో రమేశ్ జార్ఖిహొళి, కుమార్ బంగారప్ప ఇతర నేతల సమావేశం

విజయగురూజీ కటకటాలపాలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : లైంగిక సమస్యలను పరిష్కరిస్తానని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరును నమ్మించి రూ.48 లక్షలు మోసగించిన మహారాష్ట్ర పుణె నివాసి విజయగురూజీని అరెస్టు చేశామని జ్ఞానభారతి పోలీసులు మంగళవారం ఇక్కడ వెల్లడించారు. లైంగిక సమస్యలతో బాధపడుతూ కెంగేరిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీరు.. రహదారి పక్కన ఉన్న ఆయుర్వేద చికిత్స బోర్డును చూసి సమస్యకు పరిష్కారం చూపించాలని విజయగురూజీని సంప్రదించారు. ఆయుర్వేద చికిత్స ద్వారా సమస్యను పరిష్కరిస్తానని నమ్మించిన గురూజీ.. చెప్పినట్లు మందులు కొనుగోలు చేసేందుకు రూ.48 లక్షలను సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ఖర్చు చేశారు. సమస్య తీరకపోగా మూత్రపిండాల వ్యాధికి గురయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుణ్ని అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.

రామబంటు సేవలో భక్తకోటి

జయ హనుమంత : మెజెస్టిక్ సమీప పాతాళ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమవేషధారుల సందడి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా హనుమ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాత మైసూరు జిల్లాల్లో మొదటి నుంచి హనుమ జయంతిని హిందూ సంఘాలు నిర్వహిస్తూ వస్తుండగా.. తీరప్రాంత జిల్లాల్లో బజరంగదళ, శ్రీరామ సేన నేతృత్వం వస్తున్నాయి. ఆలయాల వద్ద భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసంతర్పణలు, ప్రసాదాల వితరణలు నిర్వహించారు. బెంగళూరులో ఆనందరావు కూడలి, పాత మైసూరు బ్యాంకు కూడలి, విల్సన్ గార్డెన్, మహాలక్ష్మి లేఅవుట్, రాగిగుడ్డ, కోతి బండె, గాళి ఆంజనేయ స్వామి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో స్వామివారిని భండారతో, తమలపాకులు, వడలు, పండ్లతో అలంకరణలు చేశారు. పాతాళ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమవేషధారులు కొంత సమయం సందడి చేశారు.



విల్సన్ గార్డెన్: చిన్నయ్యన పాళ్యలో ఆంజనేయుడికి విశేష అలంకరణ

ఉపాధికి రూ.622 కోట్లు విడుదల

ఈనాడు, బెంగళూరు : పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చలు ఫలప్రదమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే కేంద్రంపై చేస్తున్న ఆరోపణలు, వాటికి బదులివ్వాలని రాష్ట్ర ఎంపీలు వేసే ప్రశ్నలకు సంబంధిత కేంద్ర మంత్రులు వివరణ ఇస్తున్నారు. ఈ సమావేశాల రెండో రోజున కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సభకు వివరిస్తూ కర్ణాటకకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(మన్‌రేగా) ద్వారా రూ.622 కోట్లు చెల్లించాల్సి ఉందని అంగీకరించారు. ఇందులో రూ.8.94 కోట్లను వేతనాలకు, రూ.576 కోట్లు యంత్రోపకరణాల కొనుగోలు, రూ.37 కోట్లు యంత్రాంగ వ్యయం రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు.

ఈవీ బస్సులు: ఇదే సమావేశాల్లో కేంద్రం పీఎం-ఈ-డ్రైవ్ పథకం ద్వారా రాష్ట్రాలకు అందించే విద్యుత్తు బస్సు(ఈవీ)ల్లో ఒక్క బెంగళూరుకే 4,500 బస్సులు కేటాయించామని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ సభకు వివరించారు. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన ఆయన ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్ ఈవీ-ఫేమ్-2 ద్వారా కేటాయించిన బస్సుల్లో ప్రస్తుతం 1,221 బస్సులు సేవలందిస్తున్నాయి. మిగిలిన బస్సులు త్వరలో బెంగళూరు వీధుల్లో సంచరిస్తాయని ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గతేడాది ఓ కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీకి గ్రామీణ ఉపాధి హామీకి సంబంధించి చేసిన ప్రతిపాదనలు, బకాయిలపై రాష్ట్ర ఎంపీలు ఈ సమావేశాల్లో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. మేకెదాటు, కృష్ణ ఎగువ, తుంగభద్ర ప్రాజెక్టులపై కోర్టులు వెల్లడించిన తీర్పులు, డీపీఆర్‌ల కోసం ఈ సమావేశాల్లోనే ఆదేశాలు వెల్లడించేలా ఒత్తిడి తేవాలని సర్కారు యత్నిస్తోంది.

ఆగని అంగన్‌వాడీల ఆందోళన

బెంగళూరు (ఆడుగోడి): దీర్ఘకాలంగా పరిష్కారంకాని సమస్యలను కొలిక్కితేవాలంటూ సోమవారం నుంచి నగరంలోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు చేపట్టిన ధర్నా మంగళవారం నాడూ కొనసాగించారు. సీఐటీయూ నేతృత్వంలో మొదలైన ధర్నాలో వేలాది మంది మహిళలు పాల్గొంటున్నారు. కనీస వేతనాల అమలు, పింఛన్ వసతి, ఆరోగ్యబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. పాలకులు గతంలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని నినదించారు.

బెంగళూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ధర్నా

బస్సు కింద బాంబు పేలుడు

శివమొగ్గ, న్యూస్‌టుడే : శికారీపుర పట్టణం నుంచి ముడుబసిద్ధాపుర మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు కింద సోమవారం రాత్రి నాటుబాంబు పేలింది. హిరేకలవత్తి గ్రామం వద్ద రహదారిపై ఉన్న నాటు బాంబుపై బస్సు చక్రం ఎక్కడంతో అది పేలింది. బస్సు నిలిపిన సిబ్బంది కిందకు వచ్చి చూడగా పేలిన బాంబు శకలాలు కనిపించాయి. వారు ఇచ్చిన ఫిర్యాదుతో శికారీపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అటవీ విభాగంలో పందులు, కుందేళ్లను పట్టుకునేందుకు వాడే నాటుబాంబు, రహదారిపైపడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

దేవరాజ్‌కు నేడు అంతిమ వీడ్కోలు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : తన పుట్టిన రోజు ఆచరణకు ముందస్తుగా చాముండి బెట్టపై అమ్మవారిని దర్శించుకునేందుకు వెళుతూ.. గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచిన మాజీ ఎమ్మెల్యే ఆర్‌వీ దేవరాజ్ (68) భౌతికకాయానికి కనకపుర సమీపంలోని సోమనహళ్లిలోని ఫాంహౌస్‌లో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. చాముండీ బెట్టపైకి వెళుతున్న ఆయన గుండెపోటుకు గురికాగానే అపోలో ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు 'జయదేవ'కు తరలించారు. చికిత్స పొందుతూ, సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. మైసూరు జయదేవ ఆసుపత్రి నుంచి కలాసిపాళ్యలోని ఆయన నివాసానికి భౌతికకాయాన్ని అంబులెన్సులో మంగళవారం తీసుకువచ్చారు. దేవరాజ్ నివాసానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర నాయకులు వేర్వేరుగా వెళ్లి అంతిమ నివాళులు అర్పించారు. సాయంత్రం అనంతరం జేసీ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు అభిమానులు దర్శించుకునేందుకు ఉంచారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి విధానపరిషత్తు సభ్యునిగా ఉన్నారు. అప్పటి ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ పోటీ కోసం 2004లో తన చామరాజనగర నియోజకవర్గాన్ని వదులుకున్నారు. రెండుసార్లు ఆర్టీసీ అధ్యక్షుడిగా, మురికివాడల అభివృద్ధి మండలికి ఒకసారి అధ్యక్షుడిగా సేవలు అందించారు. చిక్కపేట నియోజకవర్గం నుంచి 2018, 2023లో పోటీ చేసి, భాజపా అభ్యర్థి ఉదయ్ గరుడాచార్ చేతిలో ఓటమి పాలయ్యారు.

దేవరాజ్ కుటుంబ సభ్యులకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి

మహిళపై బ్లేడుతో దాడి

కలబురగి, న్యూస్‌టుడే : యడ్రామి తాలూకా ఇజేరి గ్రామంలో ఇంటి ఆవరణలో నిద్రపోతున్న అమీరా పటేల్ అనే మహిళపై కొందరు దుండగులు బ్లేడుతో దాడి చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన అనంతరం ఇంటి ఆవరణలోకి వచ్చి గొంతు కోసం ఆమె ఒంటిపై ఉన్న 60 గ్రాముల ఆభరణాలు, ఇంట్లో ఉన్న రూ. లక్ష నగదు తీసుకుని పరారయ్యారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

వైకల్యమే ఓడేలా..ఈదేశాడు!

● జాతీయ స్థాయిలో దివ్యాంగుడు గోపిచంద్ సత్తా
● నేడు విశ్వ దివ్యాంగుల దినోత్సవం

ఈతలో శిక్షణ పొందుతున్న గోపిచంద్

అంతర్జాతీయ పోటీల్లో రాణించాక..

ఇండియా తరఫున పాల్గొని గెలుపొందిన గోపిచంద్

బళ్లారి, న్యూస్‌టుడే: రెండో తరగతి చదువుతున్నప్పుడే తోటి పిల్లలతో ఆటలాడుతూ రోడ్డు దాటుతున్న సమయంలో కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు పూర్తిగా పోయాయతడికి. ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఎవరికైనా జీవితం అంధకారమే. గోపిచంద్ మాత్రం ఏనాడు కుంగిపోలేదు. గురువులు, తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో చదువుతో పాటు దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఈతలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పారా ఒలింపిక్స్‌లో సత్తా చాటి బళ్లారికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తానంటున్న అతని ప్రస్థానంపై నేడు విశ్వ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రికార్డు సృష్టించాలని..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రి సమీప నారాయణపల్లికి చెందిన రాజశేఖర్ పూర్వీకులు బళ్లారి జిల్లా సండూరు తాలూకా దరోజిలో స్థిరపడ్డారు. రాజశేఖర్, వసంతల రెండో కుమారుడు గోపిచంద్..నేడు స్విమ్మింగ్‌లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పారాలింపిక్స్ జపాన్ క్రీడాకారుడు ఫ్రీస్టైల్ 100 మీటర్ల పోటీలో 1.06 నిమిషాల్లో పూర్తి చేశాడు. గోపిచంద్ ఏషియన్ గేమ్స్‌లో 1.19 నిమిషాలకు పూర్తి చేశాడు. భవిష్యత్తులో జరిగే పారాలింపిక్స్‌లో జపాన్ క్రీడాకారుడి పేరు మీద ఉన్న రికార్డ్‌ను బద్దలు కొట్టడానికి బెంగళూరులోని అంతర్జాతీయ ఈత కోచ్, అర్జున్ అవార్డు గ్రహీత శరత్ గైక్వాడ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

కోచ్ రజని లక్క శిక్షణతో..

బళ్లారి నగరంలో ఈత కోచ్ రజని లక్క వద్ద శిక్షణ పొందిన గోపిచంద్ జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించాడు.. పారాలింపిక్స్‌లో భారత్ తరఫున పాల్గొనేందుకు శ్రమిస్తున్నాడు. ప్రస్తుతం బళ్లారి వాసవి క్యాంపస్‌లో పీయూసీ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. 2022లో చైనాలో జరిగిన ఏషియన్ పారా గేమ్స్‌లో ఇండియా తరఫున పాల్గొని ఫ్రీ స్టైల్స్‌లో 100 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్స్ 100 మీటర్లు ఐ.ఎం విభాగంలో పాల్గొని తన సత్తా చూపించాడు. ఈ పోటీల్లో 1 నిమిషం, 19 మిలియన్ సెకెండ్లలో పూర్తి చేసి 4వ స్థానంలో నిలిచాడు. 2022లో ఈజిప్ట్‌లో జరిగిన వరల్డ్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొని 5వ స్థానంలో నిలిచాడు. బెహ్రాయిన్‌లో జరిగిన యూత్ ఏషియన్ గేమ్స్‌లో 4వ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గోపిచంద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 'మా నాన్న రాజశేఖర్, అమ్మ వసంత బెంగళూరులో ఇంటిని అద్దె తీసుకుని శిక్షణ ఇప్పిస్తున్నారు. పారాలింపిక్స్‌లో వరల్డ్ రికార్డు సృష్టించాలని సాధన చేస్తున్నాను. వారి కష్టం వృథా కానివ్వన'ని పేర్కొన్నాడు.

ఎగతాళి చేసినోళ్లే..పొగిడేలా!

బళ్లారి, న్యూస్‌టుడే: పుట్టుకతోనే రెండు చేతులు వంకరగా ఉన్నా అతను కుంగిపోలేదు.. తల్లిదండ్రులు, గురువులు వెన్నుతట్టి ప్రోత్సహించడంతో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి పెద్దయ్యాక వ్యవసాయం, వ్యాపార రంగంలో చక్కగా రాణిస్తున్నారు. ఒకప్పుడు హేళన చేసిన వారే నేడు శభాష్ అంటున్నారు. కృషి, పట్టుదల ఉంటే మనసుంటే అవయవాలు లేకున్నా రాణించవచ్చని నిరూపిస్తున్నారు బళ్లారికి చెందిన దివ్యాంగుడు కె.వెంకట సుబ్బారావ్.

సవాళ్లను తట్టుకొని...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మట్టూరు మండలం, తాటివారి పాళ్యంకు చెందిన శ్యామ్ సుందరావ్, వీరమ్మ కుమారుడు కె.వెంకట సుబ్బారావ్.. వ్యవసాయ నిమిత్తం చాలా ఏళ్ల కిందట బళ్లారి తాలూకా విజయనగర క్యాంపునకు వచ్చి స్థిరపడ్డారు. ఆయనకు పుట్టుకతోనే రెండు చేతులు సరిగా లేవు. అయినా ఆయన ఏనాడు నిరుత్సాహం చెందలేదు. ప్రకాశం జిల్లాలోనే ప్రాథమిక విద్యా పూర్తి చేశారు. విజయవాడలోని లయోలా కళాశాలల్లో బీఏ (ఆంగ్లం) పూర్తి చేశారు. పాఠశాల, డిగ్రీ చదివే రోజుల్లో పలు క్రీడల్లోనూ సత్తాచాటారు. నాలుగు చక్రాల వాహనాలు, ద్విచక్రవాహనం, ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తారు. సొంతంగా చరవాణిని ఆపరేటింగ్ చేయడం చూస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. గతంలో బళ్లారి జిన్నింగ్ మిల్‌ను నిర్వహించారు. ప్రస్తుతం శీతలీకరణ గడ్డంగి నిర్వహిస్తున్నారు. పక్షులు, వన్యప్రాణులను ఎంతో ప్రేమగా చూస్తారాయన. ఇంటి ఆవరణలో పక్షుల కోసం ప్రత్యేకంగా చెట్లను పెంచి గూళ్లను ఏర్పాటు చేయించారు. బాతులను పెంచుకున్నారు. వాటి సంతానం వృద్ధి చేసుకోవడానికి ప్రత్యేకంగా మట్టికుండలను ఏర్పాటు చేశారు. ఇంటికి సరిపడే ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్లను ఆయనే స్వయంగా పండిస్తున్నారు.



కారు డ్రైవింగ్ చేస్తున్న కె.వెంకట సుబ్బారావ్

వారే భుజం తడుతున్నారు

నేను ప్రాథమిక విద్యాభ్యాసం చేసే సమయంలో స్నేహితులు, తదితరులు హేళన చేసేవారు..ఏనాడూ కుంగిపోలేదు. రెండు చేతులు సరిగ్గా లేవనే ఆలోచన రాలేదు. అందరిలో సమానంగా రాణించాలని ముందుకు వెళ్లాను. అవయవాలు ఉన్న వారితో సమానంగా కారు, ద్విచక్రవాహనం నడుపుతున్నాను. ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్నాను. ఒకప్పుడు హేళన చేసిన వారే నేడు భుజం తట్టి ప్రోత్సహిస్తున్నారు. దివ్యాంగులకు నా వంతు సాయం చేస్తున్నాను. కుటుంబ సభ్యుల సహకారమే నా ఎదుగుదలకు కారణం.

-కె.వెంకట సుబ్బారావ్, బళ్లారి

పెరటితోటలో పనిచేస్తూ..

హనుమదీక్షకు సన్నాహాలు పూర్తి

గంగావతి,న్యూస్‌టుడే: హనుమదీక్ష భక్తుల కోసం అంజనాద్రి వద్ద సకల సన్నాహాలు పూర్తయినట్లు జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ తెలిపారు. ఆయన మంగళవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. బాధ్యతలు అప్పగించిన సమితులన్నీ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారన్నారు. కొండ ఎక్కే సమయంలో అనారోగ్య సమస్యలు ఎదురైతే చికిత్స అందించేందుకు ఏడు వైద్య బృందాలను నియమించామన్నారు. మూడు అంబులెన్స్‌లను సమకూర్చినట్లు చెప్పారు. అన్ని పార్కింగ్ స్థలాల్లో భోజన వసతి కల్పించామన్నారు. ఉదయం నుంచి వేదపాఠశాల వద్ద అన్నదానం చేస్తారన్నారు. ప్లాస్టిక్ నిషేధించినందున చెక్‌పోస్టుల వద్దే వాటిని స్వాధీనం చేసుకుంటారన్నారు. ఎస్పీ రామ్ అరసిద్ధి మాట్లాడుతూ గంగావతి, మునిరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ వ్యవస్థ కల్పించాలన్నారు. జడ్పీ సీఈవో వర్ణిత్ నేగి మాట్లాడుతూ భక్తులకు ఊరూరా స్నానం ఘాట్లు, తాగునీరు, విశ్రాంతి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. డీఎఫ్‌వో నిర్మల మాట్లాడుతూ అంజనాద్రి పరిరాల్లో సంచరిస్తున్న రెండు చిరుతలను పట్టుకుని వేరే చోటికి తరలించినట్లు చెప్పారు. భక్తులు నిర్భయంగా అంజనాద్రిని దర్శించుకోవచ్చన్నారు. తహసీల్దార్ యు.నాగరాజ్, నగరసభ కమిషనర్ విరుపాక్షమూర్తి పాల్గొన్నారు.

అంజనాద్రి వద్ద హనుమదీక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

డి.కె.శివకుమార్ సీఎం కావాలని సంకల్పపూజలు

విద్యానగర్‌లో అయ్యప్పస్వామి పూజలు చేస్తున్న కల్యాణస్వామి, విష్ణుస్వామి అయ్యప్పమాలధారులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యానగర్ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని అయ్యప్పస్వామికి పడిపూజలు, మండల దీక్ష పూజలు చేపట్టామని జిల్లా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు బోయపాటి విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 48 రోజులుగా మాలదీక్షలో అయ్యప్పకు సంకల్పం చేస్తూ పూజలు నిర్వహించామన్నారు. అయ్యప్ప స్వామి దీవెనలతో శివకుమార్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. మాలదారులు భక్తికీర్తనలతో అయ్యప్పకు పూజలు చేపట్టారు. పూజలో పాల్గొన్న కమ్మరచేడు కల్యాణ మఠం మహాపీఠాధిపతి కల్యాణస్వామి, మేయర్ గాదెప్ప, మాజీ మేయర్ రాజేశ్వరి, గురుస్వాములను సన్మానించారు. మేయర్ పూజారి గాదెప్ప పూజలో నృత్యం చేశారు. ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పపూజలో నృత్యం చేస్తున్న మేయర్ గాదెప్ప

వారిదే పెత్తనం.. ఆమెకేదీ అధికారం?

మంత్రి సాక్షిగా ప్రొటోకాల్ ఉల్లంఘన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరాభివృద్ధి నగర యోజన మంత్రి బైరతి సురేష్ అధ్యక్షతన మంగళవారం జరిగిన ప్రగతి పరిశీలన సమావేశంలో మహిళా అధికారం అడ్డుపెట్టుకుని పురుషులు పెత్తనం చెలాయించారు. పాలికెలో పలువురు మహిళా కార్పొరేటర్లు గెలుపొందారు. వారికి బదులుగా భర్తలు, సోదరులు పాల్గొని అధికారులతో సమానంగా కూర్చుని సమస్యలపై చర్చించడం గమనార్హం. ప్రజాప్రతినిధులు సైతం మద్దతుగా నిలవడంతో అధికారులు జీర్ణించుకోలేకపోయారు. అధికారులు, కార్పొరేటర్లు మినహా మిగిలిన వారు బయటకు వెళ్లాలని డీసీ చెప్పారు. ఒకరిద్దరు పోటోలు తీసుకుంటూ, వారిని బయటకు వెళ్లాలని గట్టిగా చెప్పారు. దీనిపై మీడియా ప్రతినిధుల సమావేశంలోనే ఉంటాం. మంత్రి ఏమి మాట్లాడుతారో తెలుసుకోవాలని చెప్పడంతో మంత్రి సరే అన్నారు. 4వ వార్డు కార్పొరేటర్ త్రివేణి బదులుగా తండ్రి సూరి, 7వ వార్డు కార్పొరేటర్ ఉమాదేవి బదులుగా తండ్రి శివరాజ, శ్వేత బదులుగా భర్త సోము, మలన్ బీ బదులుగా భర్త శర్మస్, డి.సుకుం బదులుగా మామ ఆయాజ్, కవిత బదులుగా భర్త హొన్నప్ప, బి.ఆర్.ఎల్.శీన హాజరై సమస్యలపై అధికారులు నిలదీశారు. దీనిపై ఉన్నతాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కార్పొరేటర్ డి.సుకుం తరఫున మాట్లాడుతున్న ఆయాజ్

చర్చలో పాల్గొన్న కార్పొరేటర్ కవిత భర్త హొన్నప్ప

అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

పాలికె అధికారులపై మంత్రి అసంతృప్తి

సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు, అధికారులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికెలో నిధులు గలగల..అభివృద్ధి పనులు వెలవెలబోతున్నాయి. విడదల చేసిన నిధులను కూడా నిర్దిష్ట సమయంలోపు ఖర్చు చేయడం లేదు. స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సహకారంతో పాలికెలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించాలని నగరాభివృద్ధి, నగరయోజన మంత్రి బైరతి సురేష్ అధికారులకు సూచించారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ప్రగతి పరిశీలన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిధుల వినియోగంపై కమిషనర్, ఉప కమిషనర్, ముఖ్య ఇంజినీర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు.

పన్నులు వసూలు చేస్తేనేకదా..

బళ్లారి నగర పాలికెలో మొత్తం 1.31 లక్షలు ఇళ్లున్నాయి. బీ-ఖాతా కేవలం 1,081 ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది రూ.55 కోట్ల ఆదాయం వసూలవగా, ఈ ఏడాది రూ.63 కోట్లు వస్తుందని అంచనా వేసినట్లు ఉప కమిషనర్ నందీశ్ మంత్రికి వివరించారు. బీ-ఖాతా ద్వారా ఎంత ఆదాయం వస్తోందని మంత్రి ప్రశ్నించగా, కమిషనర్, ఉపకమిషనర్ సమాధానం ఇవ్వలేదు. కమిషనర్‌గా బదిలీ అయిన ఖలీల్‌సాబ్ మాట్లాడుతూ బీ-ఖాతా ద్వారా రూ.18 కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందన్నారు. మిగిలిన ఇళ్లకు కూడా బీ-ఖాతా ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం ఇళ్లు అనుమతి లేకుండా నిర్మించుకున్నారు. వాటికి స్థానిక సంస్థల నుంచి నీరు, భూగర్భ, విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. స్థానిక సంస్థలకు మాత్రం ఆదాయం రావడం లేదని మంత్రి విచారం వ్యక్తం చేశారు.

తాగునీటిపై సుదీర్ఘంగా చర్చ

నగర పాలికెకు తుంగభద్ర జలాశయం నుంచి గొట్టాల ద్వారా తాగునీటి సరఫరా కోసం రూ.1,450 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశాం. ప్రస్తుతం అల్లీపురం, మోకా తాగునీటి చెరువుల నుంచి 80 ఎం.ఎల్.డి.ల నీటిని తోడుతున్నామని జలమండలి అధికారి జయకుమార్ వివరించారు. తుంగభద్ర నుంచి గొట్టాలు ఏర్పాటు చేసి 180 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడానికి నివేదిక సిద్ధమైందన్నారు. 43 జోన్లకుగాను 15 జోన్లలో ఉన్న 45 వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్, 15 ట్యాంకులు నిర్మిస్తున్నామని, 9 నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. రూ.450 కోట్లతో యూజీడీ పనులు, నాలుగు ఎస్టీపీ ట్యాంకులకు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

మాట్లాడుతున్న మంత్రి బైరతి సురేష్ చిత్రంలో ఎమ్మెల్యేలు, లోక్‌సభ సభ్యుడు, మేయర్, బుడా అధ్యక్షుడు, డీసీ తదితరులు

సీఎస్ఆర్ నిధులతో రోడ్లను శుభ్రం చేసే యంత్రాలు

బళ్లారి నగర పాలికె రోజు రోజుకు విస్తరిస్తోంది. ఇబ్బంది లేకుండా నగరంలో రహదారులను శుభ్రం చేయడానికి సీఎస్ఆర్ నిధులతో ఆరు వ్యర్థాలు ఊడ్చే యంత్రాలను కొనుగోలు చేస్తామని డీసీ చెప్పారు. నగర పాలికె అధికారులు డీసీతో చర్చించాలన్నారు. నగర పాలికెలో 39 వార్డులకుగాను ప్రస్తుతం మొత్తం 460 మంది పౌరకార్మికులు మాత్రమే పనిచేస్తున్నారు. ప్రస్తుత జనాభా ప్రకారం 1,150 మంది కార్మికులు అవసరమవుతున్నారని పాలికె ఆరోగ్యశాఖాధికారి ముసాప్ మంత్రికి వివరించారు. నగర పాలికెకు మొత్తం 314 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం 93 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. బుడా అభివృద్ధి చేస్తున్న 101 ఎకరాలను తక్షణమే పనులు పూర్తి చేసి అర్హులకు ఇంటి స్థలాలను వితరణ చేయాలని మంత్రి సూచించారు. కొళగల్లు సమీపంలో 21 ఎకరాలు, కొత్తగా మరో 200 ఎకరాలను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, మేయర్ పూజారి గాదెప్ప, బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులు, ఉప మేయర్ ముబీనా, డీసీ నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అధిష్ఠానానిదే తుది నిర్ణయం

బళ్లారి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మార్పు, మంత్రివర్గ విస్తరణ అనే విషయం మా చేతుల్లో లేదు. పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర నగరాభివృద్ధి, నగర యోజన మంత్రి బైరతి సురేష్ తెలిపారు. బళ్లారి నగర పర్యటనలో భాగంగా నూతన జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి పరిశీలన సమావేశానికి ముందు తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అల్పాహారానికి వెళ్లడం, ఉప ముఖ్యమంత్రి నివాసానికి ముఖ్యమంత్రి భోజనానికి వెళ్లడం అనేది కొత్త విషయం కాదన్నారు. ఇప్పటికి 50సార్లకుపైగా వారు భోజనాలు, అల్పాహారం తీసుకున్నారు. నేను కూడా వారితో పలుమార్లు వెళ్లానన్నారు. ప్రస్తుతం ఎలాంటి మార్పులు, చేర్పులు ఉండవు, శీతాకాల అసెంబ్లీ సమావేశాలు 8న నుంచి బెళగావిలో ప్రారంభమవుతున్నాయి. దీనికోసం ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలిపారు. బుధవారం తాను రాయచూరు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

6న హంపీలో ఫలపూజా మహోత్సవం

హొసపేటె, న్యూస్‌టుడే: దక్షిణకాశీగా పిలిచే పుణ్యక్షేత్రం హంపీలో ఈ నెల 4 నుంచి 6 వరకూ విరూపాక్షేశ్వర స్వామి ఫలపూజా మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. హంపీ ఆదిదేవుళ్లు విరూపాక్షేశ్వర, పంపాంబికె అమ్మవారి నిశ్చయ తాంబూల కార్యక్రమాన్ని ఫలపూజాగా పిలుస్తారు. 4న స్వామివారి తెప్పోత్సవం, 6న కోదండ రామాలయం ఆవరణలో రాత్రి ఫలపూజా మహోత్సవం జరుగుతుంది. 4 నుంచి 7 వరకూ స్వామివారిని బంగారు కిరీటంతో అలంకరిస్తారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

సర్కారు తీరుతో అన్నదాతలకు అన్యాయం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు రైతులకు ఈ ప్రభుత్వం రెండో పంటకు నీరివ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని మాజీ మంత్రులు రేణుకాచార్య, కరుణాకర్‌రెడ్డి (భాజపా) దుయ్యబట్టారు. పార్టీ నేతృత్వంలో భాజపా కార్యకర్తలు మంగళవారం పట్టణంలో చేపట్టిన నిరసన ప్రదర్శన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తుంగభద్రలో రెండోపంటకు కావాల్సినంత నీటినిల్వ ఉన్నప్పటికీ ఇవ్వకూడదని ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. నీరివ్వకపోతే జరగబోయే నష్టంపై మాటకైనా రైతులతో ప్రభుత్వం చర్చలు జరపలేదని దెప్పిపొడిచారు. మొదటి పంట చేతికొచ్చే సమయంలో ఏకధాటి వర్షాలతో తెగుళ్లు సోకడంతో దిగుబడి అంతగా రాలేదు, రెండో పంటతోనైనా గట్టెక్కాలనుకున్న రైతులకు చివరికి ఈ ప్రభుత్వం నిరాశే మిగిల్చిందని తూర్పారబట్టారు. రైతుల సంక్షేమం పట్టని ఈ ప్రభుత్వం ఎన్నిరోజులు కొనసాగుతుందో చెప్పడం కష్టసాధ్యమని తేల్చిచెప్పారు. ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవిపై ఆశపట్టుకోవడంతో రైతుల సంక్షేమంపై ఆలోచించే తీరిక లేదని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎడ్లబండిపై ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణానాయక్, జిల్లాధ్యక్షుడు సంజీవరెడ్డి, తాలూకా అధ్యక్షుడు శంకర్‌మేటి పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనకు ఎడ్లబండిపై వస్తున్న భాజపా నాయకులు

హొసపేటె పట్టణంలో భాజపా శ్రేణుల భారీ ప్రదర్శన

ధాన్యనగధీర..సిరుగుప్ప

● 110కి పైగా బియ్యం మిల్లులు ● 10 వేల మందికి ఉపాధి

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పట్టణం బియ్యం మిల్లుల రాజధానిగా విరాజిల్లుతుంది. తుంగభద్ర, హగరి నదీ కాలువలు, బోర్లు, బావుల నుంచి, ఎత్తిపోతల పథకాల ద్వారా నిరంతర పారే జలాలతో ఇక్కడి నల్ల రేగడి భూముల్లో సుమారు లక్ష ఎకరాల్లో ఏటా రెండు పంటలు వరి సాగు చేస్తుంటారు. సోనామసూరి, ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం వంటి ధాన్యం రకాలు పండిస్తున్నారు.

ఎగుమతి-దిగుమతులు

స్థానికంగా పండిన ధాన్యంతో పాటు యాదగిరి, సురపుర, కెంబావి తదితర ప్రాంతాలు, తెలంగాణలోని నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, నెల్లూరు, కర్నూలు, పల్నాడు నుంచి ధాన్యం దిగుమతి చేసుకుని బియ్యంగా ఆడతారు. ఇక్కడ ఆడిన బియ్యం వివిధ బ్రాండ్ల పేరిట రాష్ట్రంలోని బెంగళూరు, మైసూరు, తదితర ప్రాంతాలతో పాటు, మహారాష్ట్రలోని షోలాపూర్, ముంబయి, గోవా, తమిళనాడు తదితర ప్రాంతాలతో పాటు సింగపూర్, దుబాయ్, మలేసియా, కర్తార్, శ్రీలంక తదితర విదేశాలకు ఎగుమతి చేస్తారు.

నూనె తయారీ

బియ్యం మిల్లుల నుంచి వచ్చే తౌడుతో మంచినూనె తయారు చేసే నాలుగు ఆయిల్ సాల్వెంట్లు, క్రూడాయిల్ నుంచి మంచి నూనె తయారు చేసే ఆయిల్ మిల్లు ఏర్పాటు చేశారు. మరో ఆయిల్ మిల్లు నిర్మాణ దశలో ఉంది. ఊకను మర ఆడించే మూడు మిల్లులు ఉన్నాయి. ధాన్యం, బియ్యం తూకం తూచేందుకు 8 వేబ్రిడ్జ్‌లు ఉన్నాయి, ధాన్యం నిల్వకు వ్యవసాయ మార్కెట్ గోదాములతో పాటు ప్రైవేటుగా 10 వరకు గోదాములును రైతులు, వ్యాపారులు నిర్మించారు.

● మిల్లుల్లో మేనేజర్లు, గుమాస్తాలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిట్టర్లు, పొలాల్లో కూలీలు, రవాణాకు హమాలీలు సుమారు 10 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది.

● దాదాపు 15 ఏళ్లుగా బిహారీలు ఎక్కువగా ఇక్కడ పని చేస్తున్నారు. 4 నుంచి 5 వేల మంది అక్కడ నుంచి వలస వచ్చి ఉపాధి పొందుతున్నారు.

● బియ్యం మార్కెట్‌కు తరలించేందుకు 0.06 శాతం చొప్పున ఆర్ఎంసీ సెస్ కట్టాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా ప్రభుత్వానికి ఒక్కో మిల్లు నుంచి సుమారుగా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. అంటే 110 మిల్లుల నుంచి శిస్తు రూ.12 నుంచి 15 కోట్ల మేరకు చెల్లిస్తున్నారు.

● బియ్యం మిల్లుల నుంచి విద్యుత్తు శాఖకు సీజన్లవారీగా నెలకు రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు విద్యుత్తు బిల్లు వసూలు అవుతుందని జెస్కాం ఇంజినీర్ రాఘవేంద్ర తెలిపారు.

వరుసగా బియ్యం మిల్లులు

ఎగుమతులకు సిద్ధమైన ప్యాకెట్లు

లారీ నుంచి ధాన్యాన్ని దింపుతున్న హమాలీలు

మిల్లుల నుంచి రూ.కోటి పన్ను వసూలు



పట్టణ పరిధిలో ఏటా కుళాయిలు, గృహాల పన్ను తదితరాలకు సుమారు రూ.5 కోట్లు వసూలవుతుండగా, బియ్యం మిల్లుల నుంచి అత్యధికంగా రూ.కోటి పన్ను వసూలవుతుంది. ఈ డబ్బును కార్మికుల జీతాలు, అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నాం. **- గంగాధర్, నగరసభ కమిషనర్**

అధికారులూ..జనానికి ఇబ్బందులు కలిగించొద్దు

సింధనూరు, న్యూస్‌టుడే: తాలూకా అంతటా జూదం, విచ్చలవిడిగా అక్రమ మద్యం వ్యాపారాలు..పల్లెల్లో, క్యాంపుల్లో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారు..ఏం చేస్తున్నారు సార్లూ.. మీరూ..! అంటూ తాలూకాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను ప్రశ్నించారు. సమావేశంలో తాహసీల్దారు అరుణ్‌దశాయ్, ఈవో చంద్రశేఖర్, డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్సైలు పాల్గొన్నారు. ఏడాదికాలంగా సాగుతున్న అంబామఠంలోని అంబాదేవి దేవస్థాన భవన నిర్మాణంలో ఎటువంటి ప్రగతి కనిపించడం లేదు అని తహసీల్దారుతో అన్నారు. రూ.2 కోట్ల వరకూ నిధులు అక్రమ మార్గంలో తరలినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..పూర్తి నివేదిక అందించమని కోరారు. ఇదే ఆలయం గర్భగుడి నిర్మాణానికి నేరుగా రూ.80 లక్షలు అందించాను, వాటి గణాంకాలు తెలపమని కోరారు. తమ వద్దకు వచ్చే సామాన్య ప్రజలను అనవసరంగా తిప్పుతూ ఇబ్బందులు పెట్టక సకాలంలో పనులు చేసి పంపాలని అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభా కారంజీ పోటీలు

వివిధ వేషధారణలో పాల్గొన్న విద్యార్థినులతో నిర్వాహకులు

హొసపేటె, న్యూస్‌టుడే: తాలూకా విద్యాశాఖ ఆధ్వర్యంలో జక్కిద మంగళవారం ఏర్పాటు చేసిన తాలూకా స్థాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభా కారంజీ పోటీలు ఆకట్టుకున్నాయి. నగరసభ అధ్యక్షుడు ఎన్.రూపేశ్‌కుమార్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హుడా అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజీ, విద్యాశాఖ అధికారి శేఖరప్ప హొసపేటె, నగరసభ సభ్యుడు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొని, వివిధ వేషధారణ, నృత్య పోటీలతో ఆకట్టుకున్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న అధ్యక్షుడు, తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: యువ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొంది, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ అభినందించారు. రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో యువ క్రీడాకారులైన కె.హాశికాసాయి, మనోజ్ఞసాయి, సమృద్ధి గెలుపొంది జాతీయ పోటీలకు ఎంపికై బళ్లారికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారన్నారు. యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో ముందుకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. మాజీ అధ్యక్షుడు యశవంతరాజ్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు దొడ్డనగౌడ పాల్గొన్నారు.

నేడు మంత్రి సంతోష్ లాడ్ రాక

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ బుధవారం బళ్లారి జిల్లాలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.15 గంటలకు జిందాల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సండూరు తాలూకా విఠలాపుర గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. సాయంత్రం 5 గంటలకు జిందాల్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు వెళ్తారని కార్యదర్శి పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు..చోదకుడి దుర్మరణం

కారు ఢీకొనడంతో బోల్తా పడిన ట్రాక్టర్

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: మొక్కజొన్న బస్తాలతో ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రహదారి పక్కన బోల్తా పడిన ఘటన చెళ్లకెర- బళ్లారి రహదారిలో బుడ్నహట్టి గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఈ విషయాన్ని పోలీసులు తెలిపారు. మొక్కజొన్న బస్తాలను నింపుకొని చెళ్లకెర మార్కెట్‌కు తరలిస్తున్న ట్రాక్టర్ చోదకుడు ప్రకాశ్ (33) ఈ దుర్ఘటనలో ప్రమాద స్థలంలోనే మృతి చెందారని తెలిపారు. చెళ్లకెర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ఎండుతున్న మిరప ఆశలు

శీతలీకరణ గిడ్డంగి పనుల నిలిపివేత

పొలాల్లో ఆరబెట్టిన ఎండు మిరప

బళ్లారి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే బళ్లారి జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో మిరప సాగు.. ఎక్కువ దిగుబడి సాధిస్తున్నా ఎండు మిరప మార్కెట్ నిర్మాణం ఆలస్యమవుతోంది. శీతలీకరణ గిడ్డంగి నిర్మాణానికి టెండర్ ద్వారా పనులు కేటాయించిన స్థలం మార్పుతో మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. దీనిపై మిరప రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కేంఈఆర్‌సీ నిధుల వినియోగం: బళ్లారిలో నిర్మిస్తున్న మిరప మార్కెట్‌కు కేంఈఆర్‌సీ నిధులు ఖర్చు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో మరింత ఆలస్యమవుతోందని రైతులు మండిపడుతున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జిల్లా పాలనాధికారి, ఏపీఎంసీ అధికారులపై ఒత్తిడి తెస్తే మార్కెట్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని కేంద్రమంత్రి స్థాపకుల ఇటీవల ప్రకటించారు.

23.25 ఎకరాల కేటాయింపు

బళ్లారి జిల్లాతో పాటు రాష్ట్ర సరిహద్దులోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ విస్తీర్ణంలో మిరప సాగు చేస్తున్నారు. బళ్లారిలో సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడంతో బ్యాడిగికి తరలిస్తున్నారు. ఈ ప్రాంత రైతులకు రవాణా ఖర్చులతో పాటు సమయం వృథా కావడంతో యడియూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బళ్లారి నగర శివార్లలో ఆలదహళ్లిలో సర్వే నంబరు 25లో 23.25 ఎకరాలను కేటాయించారు. ఈ స్థలంలో కొంత భాగం ఆక్రమణలకు గురికావడంతో రాత్రికిరాత్రే తొలగించి, బళ్లారి ఏపీఎంసీకి అప్పగించారు. బైపాస్‌కు ఓ వైపు 15 ఎకరాలు, మరో వైపు 8.25 ఎకరాలు ఉండటంతో మార్కెట్ నిర్మాణానికి ఇబ్బందిగా మారింది. 8.25 ఎకరాల ప్రదేశంలో ప్రభుత్వం విడుదల చేసిన రూ.12కోట్లతో శీతలీకరణ గిడ్డంగి నిర్మాణానికి టెండర్ ద్వారా పనులు అప్పగించారు. అనంతరం గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో శీతలీకరణ పనులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. 15 ఎకరాల్లో శీతలీకరణ గిడ్డంగి, రహదారులు, మురుగు కాలువ, వాణిజ్య దుకాణాలు, ఇతర అభివృద్ధి పనులపై ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీర్లకు సూచించడంతో పనులు మరింత ఆలస్యమవుతున్నట్లు అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

స్థల సమస్య

జిల్లా కేంద్రంలో ఎండు మిరప మార్కెట్ నిర్మాణం, శీతలీకరణ గిడ్డంగి నిర్మాణానికి పూర్తి స్థాయిలో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాం. శీతలీకరణ నిర్మాణానికి టెండర్ ప్రక్రియను జూలైలోనే పూర్తి చేశాం. స్థలం కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి.

- ఆర్.జయకుమార్, ఏపీఎంసీ కార్యదర్శి

దొంగ అరెస్టు.. నగలు స్వాధీనం

దొంగను అదుపులోనికి తీసుకొని బంగారు నగలను స్వాధీనం చేసుకొన్న పోలీసులు

చెళ్లకెర (చిత్రదుర్గం): పట్టణ శివార్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజా పీర్ (33) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని రూ.2 వేల నగదు, రూ.4.20 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకొన్నారు. మంగళవారం వారు తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు తాలూకాలోని తళకు పోలీసు ఠాణా పరిధిలోని హొన్నూరు గ్రామ నివాసి ధనంజయ రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడన్నారు. నిందితున్ని కోర్టుకు హాజరు పరచగా న్యాయాంగ నిర్బంధానికి పంపారన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పల్స్‌పోలియో కార్యక్రమం

మాన్వి,న్యూస్‌టుడే: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు తాలూకా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి పురురాజ్‌సింగ్ సోలంకి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం సభాంగణంలో నిర్వహించిన తాలూకా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1 నుంచి 5 లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలని, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ మాట్లాడుతూ డిసెంబర్ 21న బూత్‌స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

వీధి వ్యాపారులకు రుణ సదుపాయం

కారటగి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ పథకం కింద వీధి వ్యాపారులకు రుణ సదుపాయం సమకూరుతుందని కారటగి పురసభ ముఖ్యాధికారి సాబణ్ణ తెలిపారు. మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల రుణ సదుపాయం లభించనుంది. పూర్తి వివరాలకు వీధి వ్యాపారులు పురసభ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హంపాదేవనహళ్లి పంచాయతీకి పురస్కారం

గాంధీ గ్రామ పురస్కారం అందుకుంటున్న జీపీ అధ్యక్షురాలు కవిత, పీడీవో బీరలింగ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా హంపాదేవన హళ్లి గ్రామ పంచాయతీకి 2023-24 సంవత్సర గాంధీ గ్రామ పురస్కారం లభించింది. బెంగళూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే పురస్కారాన్ని జీపీ అధ్యక్షురాలు కవిత, పంచాయతీ అభివృద్ధి అధికారి బీరలింగకు అందించారు.

సవిత సముదాయం అధ్యక్షుడిగా నారాయణస్వామి


నూతన జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామికి పత్రం అందజేస్తూ..

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా సవిత సమాజ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం కార్యవర్గ సమితి సభ్యుడు హెచ్.తిప్పణ్ణ, జిల్లా నూతన అధ్యక్షుడిగా నారాయణస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి శాయశక్తులా శ్రమిస్తానన్నారు. సమస్యలు పరిష్కరించడానికి ఐకమత్యంగా ముందుకు సాగుదామని సభ్యులను కోరారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు ఆర్.శేఖణ్ణ, నగర అధ్యక్షుడు ఉమేశ్, సభ్యులు జానకిరామ్, రాము, బాలకృష్ణ, వెంకటేశ్, దేవణ్ణ, నాగేశ్, తిప్పేస్వామి, శివకుమార్, భాస్కర్, అశోక్‌కుమార్, రామకృష్ణ, అయ్యప్ప, హనుమంతరాయప్ప, మహంతేశ్ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో అందరితో పోటీపడదాం'

సోమలాపూరు గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభోత్సంలో ఎమ్మెల్యే బాదర్లి, విధానపరిషత్ సభ్యుడు బసనగౌడ

సింధనూరు, న్యూస్‌టుడే: ఇంకెంతకాలం వెనుకబడిన వాళ్లంగా ఉంటాం.. ముందుకు దూసుకుపోయేది, అందరితో పోటీ పడేది వద్దా అని సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి హంపనగౌడ ఉపాధ్యాయులతో పేర్కొన్నారు. అందరం కలిసి అంకిత భావంతో పని చేయాలి, విద్యా ప్రమాణాలు పెరిగేలా చేయాలన్నారు. నాణ్యమైన చదువులను విద్యార్థులకు అందించడం ద్వారా ముందడుగు వేయాలని సూచించారు. ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తున్నందున చక్కని ప్రగతికి బాటలు వేసే ప్రయత్నం చేద్దామన్నారు. ఆయన విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లితో కలిసి మంగళవారం తాలూకాలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఎఫ్‌ఆర్‌సీఎస్ క్లబ్‌లో టెన్నిస్ పోటీలను ప్రారంభించిన ఆయన అనంతరం ఎమ్మెల్సీతో కలిసి పీడబ్ల్యూడీ క్యాంపు, మాడశిరివార, సోమలాపూరు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాలను ప్రారంభించారు.

కర్ణాటక పబ్లిక్ పాఠశాలలుగా విస్తరణ

మాన్వి,న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని కురుకుందా, చికల్‌పర్వి, తడకల్, మాన్వి నమాజ్‌గిరిగుడ్డ ప్రభుత్వ పాఠశాలల్ని కల్యాణ కర్ణాటక ప్రదేశాభివృద్ధి నిధులతో ఉన్నతీకరించి వాటిని 2025-26 నుంచి కర్ణాటక పబ్లిక్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే హంపయ్యానాయక్ తెలిపారు. క్షేత్ర ప్రజలు, విద్యార్థుల ఆకాంక్ష మేరకు మంత్రి ఎన్.ఎస్.బోసురాజు చొరవ తీసుకుని వీటిని మంజూరు చేయించారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పబ్లిక్ పాఠశాలల తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

7న బెంగళూరులో ఆర్యవైశ్య సమావేశం

మాట్లాడుతున్న రాష్ట్ర నిర్దేశకుడు హనుమంతయ్య

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సమాజం యువతకు మార్గదర్శనం చేసేందుకు ఈనెల 7న బెంగళూరులోని జ్ఞానజ్యోతి భవనంలో ముందస్తు సమావేశం నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.పి.రవిశంకర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిరుగుప్పలో ఆర్యవైశ్య సమాజం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమాజం వారు వ్యాపారం, పిల్లల చదువు, ఉద్యోగం, వారికి ఆస్తులు కూడబెట్టడం, పెళ్లిళ్ల వంటి వాటిపై శ్రమిస్తున్నామన్నారు. రానున్న 25 సంవత్సరాల్లో ఎలా ముందుకు సాగాలనే అంశంపై మేధావులు మార్గదర్శనం చేస్తారన్నారు. సమావేశానికి వచ్చే వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్దేశకుడు హెచ్.జె.హనుమంతయ్య, వ్యాపారులు మత్యాలయ్య శెట్టి, చాగి సుబ్బయ్య శెట్టి, రఘు, వాసవి, సునిల్ దత్త, బద్రినాథ్, అళ్లగడ్డ రవికుమార్ పాల్గొన్నారు.

అక్రమార్కుల చేతుల్లోకి అంబేడ్కర్ నిగమ భూములు

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ నిగమ భూములు, వక్ఫ్ భూములను అక్రమార్కులకు కట్టబెడుతున్నారని జనశక్తి కేంద్రం, మేజర్ షాన్‌వాజ్ సంఘం, దళిత సంఘాల సంచాలకుడు ప్రభురాజ్ కొడ్లి ఆరోపించారు. భూదందాలపై అధికారులకు వ్యతిరేకంగా అనేక పోరాటం చేస్తున్నామన్నారు. పట్టణ సమీపంలోని 120ఎకరాల భూముల్ని మోతుబరులైన వ్యక్తులకు విక్రయించడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సంఘాలు పోరాడాయన్నారు. ఫలితంగా 86ఎకరాల వక్ఫ్ భూమిని రాయచూరు సహాయక అధికారి రద్దుచేయడం పోరాటానికి దక్కిన విజయమన్నారు. ప్రభుత్వ భూములను ఇతరుల పేరుకు మారుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రముఖులు ఎం.షానవాజ్‌ఖాన్, నుసరత్, జయరాజ్‌కొడ్లి, మైనుద్దీన్, పంపాపతి, శ్యామ్‌సింగ్, కొరవి ఆనంద్, యల్లప్ప చికల్‌పర్వి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభురాజ్ కొడ్లి

సమష్టి సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్ హొగిబండి

మాన్వి,న్యూస్‌టుడే: సైబర్ నేరాలను సకాలం ఛేదించటం కత్తిమీద సాములా మారిందని, సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని జిల్లా సబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్ హొగిబండి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాల జాగృతి కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడేవారు సులభమార్గంలో కొల్లగొట్టేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారని తెలిపారు. చరవాణులను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తక్షణం సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని, నగ్న వీడియోలు, మార్ఫింగ్ వీడియోల ద్వారా వచ్చే బెదిరింపులకు భయపడకుండా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంచారసాథీ యాప్‌ను చరవాణుల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ సుమంగళ, సైబర్ క్రైం పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీఐ కంప్లి సోనా అధ్యక్షుడిగా డాక్టర్ భరత్

నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు జేసీఐ కంప్లి సోనా సభ్యులు

కంప్లి, న్యూస్‌టుడే: జేసీఐ కంప్లి సోనా - 2026 అధ్యక్షుడిగా డాక్టర్ భరత్ పద్మశాలి ఎన్నికయ్యారు. భరత్ పద్మశాలి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి సుహాస్ చిత్రగార్ ప్రకటించారు. అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడతానని భరత్ పద్మశాలి తెలిపారు. జేసీఐ వలయ అధికారి బి.రసూల్, ప్రసాద్ గడాద, వాసిం ఫయాజ్, డి.మంజేశ్, సంతోష్ కొట్రప్ప, అక్కి జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్ల వితరణ

కార్మికులకు కిట్లు అందిస్తున్న అధికారి

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలో కట్టడ ఇతర నిర్మాణ కార్మికులకు మంగళవారం కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 150 మంది కార్మికులకు సురక్షిత కిట్లు, 150 మందికి మిషన్ కిట్లు, 40 మందికి ఎలక్ట్రానిక్ కిట్లు, 10 మందికి వెల్డింగ్, 30 మందికి కార్పెంటర్, మరో 30 మందికి పెయింట్, 10 మందికి ప్లంబర్ కిట్లు ఇచ్చారు. కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ తళవార్ మాట్లాడుతూ కంప్లి తాలూకాలో 6,300 మంది కట్టడ ఇతర నిర్మాణ గుర్తింపు పొందిన కార్మికులు ఉన్నారు. సీనియారిటీ ఆధారంగా కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్మిక సంఘం నాయకులు శివకుమార్, హొన్నూర్ సాబ్, నాగరాజ్, ఎమ్మెల్యే ఆప్త సహాయకుడు విరుపాక్షి, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరానికి స్పందన

శిబిరాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్లు అలోక్‌చంద్ర మిశ్రా, మధుశేఖర్, డా.వెంకట మహిపాల్, షకీబ్

బళ్లారి, న్యూస్‌టుడే: భారతీయ రెడ్‌క్రాస్ సంస్థ, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని బ్యాంకు మేనేజర్లు అలోక్‌చంద్ర మిశ్రా, మధుశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. తమ సిబ్బంది, అధికారులు విధి నిర్వహణలో తీరికలేకుండా ఉంటూ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకూడదనే ఉద్దేశంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించామన్నారు. 200మందికి పైగా అధికారులు, సిబ్బంది, ఖాతాదారులకు చికిత్సలు చేసి ఔషధాలను వితరణ చేశారు. రెడ్‌క్రాస్ సభ్యుడు డా.వెంకటమహిపాల్, షకీబ్, శివసాగర్, షమీమ్, వాసు, మహబూబ్ వలి బాషా పాల్గొన్నారు.

వ్యాపారంలో మెలకువలు నేర్చుకోవాలి

బళ్లారి, న్యూస్‌టుడే: వ్యాపారవేత్తలు వ్యాపార అవకాశాల గురించి తెలుసుకోవాలని అల్లం కరిబసప్ప మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యక్షుడు నరేంద్రబాబు పేర్కొన్నారు. జిల్లా వాణిజ్య, పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మేనేజ్‌మెంట్ కళాశాల సభాభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాపార ప్రణాళిక తయారీలో సహకారం, సాంకేతికత, నాణ్యత, చెల్లింపులు, వినియోగదారులతో సంబంధాలు పెంచుకోవడం వల్ల రాణించవచ్చన్నారు. వ్యాపార అభివృద్ధి, సౌకర్యాల గురించి పలువురు వివరించారు. అధికారి సోమశేఖర్, గోపి, అధ్యాపకులు శైలజ, సత్యనారాయణ, తిమ్మనగౌడ, మంజునాథ్, శివానంద, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల అధ్యక్షుడు నరేంద్రబాబు, అధికారి సోమశేఖర్ తదితరులు

మంత్రి మండలిలో చోటు కల్పించాలని వినతి

తిప్పణ్ణకు మద్దతుగా నినాదాలు చేస్తున్న గంగామత సమాజం ప్రతినిధులు, సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామకనూరు తిప్పణ్ణకు మంత్రి మండలిలో చోటు కల్పించాలని తాలూకా గంగామత సమాజం వారు కోరారు. గంగా మతస్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు దేశనూరు హులగప్ప, మంజునాథ, తదితరులు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విధాన పరిషత్ సభ్యుడిగా ఉన్న కామకనూరు తిప్పణ్ణ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి చాలా ఏళ్లుగా సేవలందిస్తున్నారు. త్వరలో విస్తరించే మంత్రి మండలిలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి మంత్రి పదవి కేటాయించాలని పేర్కొని నినాదాలు చేశారు. సంఘం ప్రతినిధులు మారెణ్ణ, రఘు, సణ్ణకల్లప్ప, ముదకప్ప, రాథోడ్, ఈరణ్ణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరించిన బళ్లారి ఉప విభాగ అధికారి ప్రమోద్

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి పురసభ పాలనాధికారిగా బళ్లారి ఉప విభాగ అధికారి పి.ప్రమోద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని పురసభ అధికారులకు సూచించారు. తహసీల్దార్ మంజునాయక్, ముఖ్యాధికారి బి.మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● న్యాయ పోరాటం: పురసభ చట్ట ప్రకారం పురసభ సభ్యులకు అయిదేళ్ల అవకాశం కల్పించాలి. ఈ విషయమై పురసభ సభ్యులందరం ధార్వాడ హైకోర్టును ఆశ్రయించాం. న్యాయ లభిస్తుందన్న భరోసా ఉందని పురసభ మాజీ అధ్యక్షుడు భట్ట ప్రసాద్ తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

02-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1622.63	1629.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,523	2,783
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,301	5,563
నీటి నిల్వ (టి.ఎం.సి)	69.019	93.018

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వైభవంగా.. హనుమద్‌వ్రత పూజలు

బాండ్రావి ఆంజనేయుడికి విశేష పుష్పాలంకరణ

కోట ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయుడికి పుష్పాలంకరణ

అలంకరణలో ఆంజనేయ స్వామి

చెళ్లకెర శివార్లలోని కరేకల్ ఆంజనేయ స్వామి

రాఘవేంద్రమఠంలో హనుమద్ వ్రతపూజలు చేస్తున్న ప్రసన్నాచార్

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని మంగళవారం రాఘవేంద్రస్వామి మఠంలో విశేష పూజలు జరిపారు. స్వామివారికి పుష్పాలతో అలంకరించి భక్తులకు కాషాయమాలను అందజేశారు. కోటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి, సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించారు. బాండ్రావి ఆంజనేయస్వామికి, వన్నళ్లి హనుమంతునికి, సిరుగుప్ప రోడ్డులోని యంత్రోద్ధారకుడికి విశేష అభిషేకాలు చేపట్టారు. పండితులు హనుమద్ వ్రతాన్ని భక్తులకు వివరించారు. ఆలయ కమిటీల అధ్యక్షులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామనగర్: హనుమద్ వ్రతం సందర్భంగా గంగావతి తాలూకా దేవినగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం విశేష పూజలు జరిగాయి. అభిషేకం అనంతరం స్వామి విగ్రహాన్ని అలంకరించి పూజలు జరిపారు. అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. హనుమ మాలధారులు, ప్రజలు పాల్గొన్నారు.

చెళ్లకెర: హనుమ జయంతి పర్వదినం సందర్భంగా ఆంజనేయ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి వందలాది మంది భక్తులు దేవాలయాలను సందర్శించి మొక్కులను తీర్చుకొన్నారు. పట్టణ శివార్లలోని కరేకల్ ఆంజనేయ స్వామి, పాత ఊరులోని హనుమంతుడు, త్యాగరాజనగర్‌లోని బయలు ఆంజనేయ దేవాలయాల్లో హోమాలు నిర్వహించారు.

In the Court of the Ist Addl. District Judge, Anantapuramu.
E.P. No. 359/2021 in A.A. No: 161/2020

Between:
Shriram City Union Finance Limited, D.No. 10-1-136, Kanekal Road, Rayadurg. Rep. By it's Authorized Signatory C.Munisekhar. ...D.Hr

And

K.O.Rudresh and Others. ...J.Drs

Notice to the J.Dr. No:1 and 4

J.Dr1: K.O.Rudresh, S/o H. Obayya, R/at Kerayagalahalli, Thimmappaiahnahalli, Challakera, Chitradurg Dist. Occ: Branch Manager in Vijaya Bank, Chitradurg, Staff Code: 25704

J.Dr4: N.Rama Krishna, S/o N.Venkataiah, R/at, D.No.7-22, Narasingaiah Palli (v), Chellakera (tq), Chitradurg Dist. Occ. Asst. Manager in Vijaya Bank, Chitradurg. Staff Code: 37699

పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 12-12-2025వ తేది ఉదయం 10-30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గాని లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

J.L.నరసింహులు,
D.Hr. వకీలు, అనంతపురము.

మళఖేడ.. చరిత్రకు చెదలు

కాలగర్భంలో కట్టడాలు

ఒక మార్గం నుంచి వెళితే.. కనిపించే నిర్మాణాలు

కోటగోడల మధ్య బాటలో నుంచి కనిపిస్తున్న ఇళ్లు

కల్యాణ కర్ణాటకపై తరచుగా ప్రకటనలు గుప్పించే ఏలికల నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది మళఖేడ కోట. చారిత్రక, పర్యాటకాభివృద్ధికి పెట్టని కోటలాంటి ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి ఆమడదూరంలో వదిలేసిన పాలకుల తీరు తీవ్ర విమర్శలనే మూటగడుతోంది.

కలబురగి, న్యూస్‌టుడే : సేడం తాలూకా భీమా నదీ తీరంలోని మళఖేడ కోటను పర్యాటక శాఖ గాలికి వదిలేసింది. ఆ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని రాష్ట్రకూటులు 8 నుంచి 10వ శతాబ్దం వరకు పాలన కొనసాగించాక.. బాదామి చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు పాలించిన గడ్డ దుమ్ముకొట్టుకుపోయింది. నేటి మళఖేడ.. అప్పటి మాన్యఖేతగా ప్రసిద్ధి. కావేరి నుంచి గోదావరి నది మధ్య ప్రాంతంలో రాష్ట్రకూటుల సామ్రాజ్యం విస్తరించింది. మళఖేడలో వారు నిర్మించుకున్న కోట నుంచి సుమారు 200 ఏళ్ల పాటు ప్రజలను పాలించారు. ఈ కోటలోని ప్రధాన నిర్మాణాలు శిథిలమైనా.. లోపలి, బయట వరుసల గోడలు, కొన్ని నిర్మాణాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కోట మధ్య భాగానికి చేరుకునేందుకు నాలుగు వరుసల గోడలు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలకు 52 బురుజులు ఠీవిగా నిలిచినా.. వాటికి పట్టిన దుమ్ము ఏలికల నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది. కొన్ని ప్రాకారాలు, బురుజుల నుంచి కొండ రాళ్లను స్థానికులు తరలించుకు వెళ్లి తమ ఇళ్ల పునాదుల నిర్మాణానికి వాడుకున్నారు. రాష్ట్ర కూటుల అనంతరం ఈ కోట ఇతర పాలకుల చేతికి వెళ్లింది. మొఘల్ పాలకుల కాలంలో కోట లోపల మసీదును నిర్మించుకున్నారు. ప్రభుత్వం, పురావస్తు శాఖ ఈ కోటను తమ ఆధీనంలోకి తీసుకుని మరమ్మతు చేసి, పర్యాటక, అధ్యయన కేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులు, చరిత్రకారులు చేసుకుంటున్న విన్నపాలు బుట్టదాఖలు అవుతున్నాయి.

బురుజుపైకి వెళ్లే మెట్ల మార్గం వద్ద వ్యర్థాలు

సర్వధర్మ ప్రార్థనలో ఆయా మతాల బోధకులు

అగ్నివీరుల శిక్షణ విజయవంతం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : ఉత్తర విభాగం ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌లో ఆరో బ్యాచ్ అగ్నివీరులు శిక్షణ మంగళవారంతో పరిసమాప్తమైంది. అభ్యర్థుల నుంచి బ్రిగేడియర్ విక్రమ్ శెఖావత్ గౌరవ వందనాన్ని అందుకున్నారు. మెకానికల్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లుగా రక్షణ దళాల్లోకి ఎన్నికైన అగ్నివీరుల తల్లిదండ్రులకు ఆయన గౌరవ పతకాలను ప్రదానం చేశారు. దేశ భద్రతను కాపాడేందుకు గౌరవం, ధైర్యం, సమగ్రత, నిజాయతీ, స్వార్థ రహితంగా, మర్యాదపూర్వకంగా నిర్వహించాలని నూతన సిబ్బందికి ఆయన సూచించారు.

పతకాలను ప్రదానం చేస్తున్న అధికారులు

పట్టాలెక్కిన మైసూరు రైల్వేప్రగతి

రూ.395.73 కోట్లతో పనులు

గ్యాలరీలో ఉన్న చిత్రాలు వీక్షిస్తున్న ముదిత్ మిత్తల్

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు రైల్వే స్టేషన్‌ను రూ.395.73 కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డివిజనల్ మేనేజరు ముదిత్ మిత్తల్ వెల్లడించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో 'స్టేషన్ మహోత్సవాలు', ఫొటో ప్రదర్శన కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. స్వాతంత్య్ర పోరాటయోధుడు వైసీ రేవణ్ణ, విశ్రాంత రైల్వే ఉద్యోగి హెచ్‌ఎస్ రామణ్ణలను ఇదే సందర్భంగా సత్కరించారు. పరంపర గ్యాలరీ, మైసూరు రైలు మ్యూజియాలను సందర్శించారు. లలిత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించాక ప్రసంగించారు. కొత్తగా మూడు ప్లాట్‌ఫారాలు, నాలుగు పిట్ లైన్లు, వాటికి అనుబంధంగా స్టేబ్లింగ్ లైన్లను నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. మైసూరు ప్రాంత అభివృద్ధికి మైసూరు మహారాజులు తొలినాళ్లలో తీసుకున్న చర్యలతోనే ఇక్కడ ఆర్థికాభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ రైల్వేస్టేషన్ 1951 ఏప్రిల్ 14న కేంద్ర రైల్వే శాఖలో విలీనమై దక్షిణ రైల్వేలో చేరిందన్నారు. హుబ్బళ్లిలో ఏర్పాటు చేసిన నైరుతి రైల్వే వలయంలో 2003లో చేరిందని ఆయన గుర్తు చేశారు. రాచనగరి నుంచి బెంగళూరు, దిల్లీ, హువ్‌డా, పట్నా, ముంబయి, చెన్నై, కాకినాడ, తిరువనంతపురం, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు 106 రైళ్లు సంచరిస్తున్నాయి. సగటున 60 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా.. ఈ స్టేషన్‌కు నిత్యం రూ.25 లక్షల ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. అదనపు శ్మాన్ హమీద్, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు, విశ్రాంత ఉద్యోగిని సత్కరిస్తున్న అధికారులు

ఉద్యాన నగరి.. గులాబీ రంగుల సిరి!

ప్రకృతి వాకిట జన పరవశం

ఉద్యానవనం రహదారి పక్కన రమణీయం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్ర పరిపాలన శక్తి కేంద్రం విధానసౌధ, ఉన్నత న్యాయస్థానం భవనం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో విరబూసిన గులాబీ రంగు పూలను చూసి జనం మంత్రముగ్ధులవుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి పులకరిస్తున్నారు. ఏడాదికి ఒకసారే ఈ రమణీయ దృశ్యకావ్యం భాగ్యం దక్కుతుంది. వానాకాలం తర్వాత వచ్చే శీతాకాలంలో గులాబీ రంగు పూల చెట్లు ప్రకృతి అందాలకు మరింత వన్నెలద్దుతున్నాయి. విదేశీ జాతికి చెందిన ఈ పింక్ ట్రంపెట్ ట్రీస్ కనువిందు చేస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానం చుట్టుపక్కల ఈ వృక్షాలు కనిపిస్తాయి. విధానసౌధ నుంచి విధాన మహల్ రహదారి, శేషాద్రి కూడలి వరకు ఈ వృక్షాలు గులాబీ రంగు పూలను విరజిమ్ముతాయి. ఈ చెట్ల ఆకులు రాలిపోయి గులాబీ రంగు పువ్వులు మాత్రమే మిగిలాయి. చెట్టు కొమ్మలకు కేవలం పూలే ఉండటంతో చూపరుల్ని ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ స్వీయచిత్రాలను దిగేందుకు జనం పోటీ పడుతున్నారు. అరుదైన వృక్ష జాతి కావడంతో ఉద్యానవనాల శాఖ సంరక్షిస్తుంది. ఉద్యానవనంలో ఈ చెట్లు 18 ఉన్నాయి. శీతాకాలం పూర్తయితే గులాబీ రంగు పువ్వులు కనపడవు. వీటిని కాగితం జాతి పూలచెట్లుగా అధికారులు పేర్కొన్నారు. చుట్టూ పచ్చదనం మధ్యలో ఈ సిరులు ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.



హైకోర్టు భవనం వద్ద గులాబీరంగు పూల చెట్లు

తిపటూరు కొబ్బరికి గుర్తింపేదీ?

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఆసియా ఖండంలోనే తుమకూరు జిల్లా తిపటూరు కొబ్బరికి చక్కని గుర్తింపు ఉంది. ఇక్కడే అతి పెద్ద కొబ్బరి మార్కెట్ విస్తరించింది. తిపటూరు విభాగంలో సాగవుతున్న కొబ్బరికి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కేటాయించాలని స్థానిక రైతులు పలు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారు. కొబ్బరి గిట్టలను, నూనె, ఇతర అనుబంధ ఉత్పత్తులను పరీక్షకు పంపిస్తున్నామని తిపటూరు రైతు ఉత్పాదకుల సంఘం, కోకోనట్ ఎఫ్‌పీఓ ప్రతినిధులు తెలిపారు. రానున్న రెండేళ్లలో తమ కొబ్బరికి భౌగోళిక గుర్తింపు లభిస్తుందని స్థానిక రైతులు ధీమాతో ఉన్నారు. నాణ్యత కలిగిన కొబ్బరి సాగులో తిపటూరు, గుబ్బి, చిక్కనాయకనహళ్లి, చెన్నరాయపట్టణ, అరిసికెరె, హొసదుర్గ ముందంజలో ఉన్నాయి. వాటన్నింటిలోకి తిపటూరు నేల సారానికి అనుగుణంగా కొబ్బరి నాణ్యత అత్యుత్తమంగా ఉంటుంది. జీఐ గుర్తింపు లభిస్తే తమ కొబ్బరి, అనుబంధ ఉత్పత్తులకు చక్కని ధర లభిస్తుందని స్థానిక రైతులు, వర్తకులు పేర్కొన్నారు.

కొబ్బరి పరిశ్రమ ఆవరణలో పీచు

బిడ్డకు జన్మనిచ్చిన బాలిక

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : కుణిగల్ తాలూకా హులియూరు దుర్గలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని (16) ఒక మగబిడ్డకు జన్మనిచ్చిన సమాచారం సంచలనంగా మారింది. బాలిక ఏడు నెలల గర్భిణి అని నవంబరు 18న ఆమె తల్లిదండ్రులు గుర్తించారట. మల్లేశ్ (35) అనే వ్యక్తి ఆమెపై వరుసగా అత్యాచారానికి పాల్పడ్డాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా కేసు నమోదు కావడంతోనే నిందితుడు పరారయ్యాడు. బాలికను చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించగా బిడ్డకు జన్మనిచ్చింది. గాలింపు పూర్తి చేసి నిందితుడ్ని అరెస్టు చేశామని హులియూరు దుర్గ ఠాణా పోలీసులు తెలిపారు.

'హిందూ జాగరణ' కార్యకర్త అరెస్టు

ఉడుపి, న్యూస్‌టుడే : ఒక యువతిపై అత్యాచారానికి పాల్పడి, హత్యకు యత్నించిన ఆరోపణలపై హిందూ జాగరణ వేదికె నాయకుడు ప్రదీప్ పూజారిని ఉడుపి నగర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అతని చేతి నుంచి తప్పించుకున్న బాధితురాలు హిరియడ్క ఠాణాలో ఫిర్యాదు చేసింది. నిందితుడ్ని అరెస్టు చేసి కారాగారానికి పంపించగా, బెయిలుపై బయటకు వచ్చాడు. మళ్లీ ఆమెను వెంబడించి తనను వివాహం చేసుకోవాలని, కేసును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఆమె అంగీకరించకపోవడంతో మళ్లీ హత్యకు ప్రయత్నించాడని సంబంధిత పోలీసులు మంగళవారం వెల్లడించారు. అతని బారి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

రామభక్త హనుమ.. వేడుక కనుమా!

విద్యుత్తు దీపాల్లో ఆంజనేయుని రూపం

మండ్య, న్యూస్‌టుడే : హనుమ జయంతిని పురస్కరించుకుని పాండవపుర నుంచి మేలుకోటె వరకు రహదారికి ఇరువైపులా విద్యుత్తు దీపాలతో అలంకరించారు. బనఘట్ట, బెళ్లాళె, హోసూరు గేట్ గ్రామాల పరిధిలోని ఆంజనేయుడు, రామాంజనేయుల ఆలయాల వద్ద సోమవారం రాత్రి నుంచే సందడి మొదలైంది. మంగళవారం ఆంజనేయుని విగ్రహాలను అభిషేకాలు చేశారు. రామతారక హోమాలు కొనసాగించారు. ప్రసాద వితరణలు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మేలుకోటెలోని చరిత్ర ప్రసిద్ధి పేటె ఆంజనేయ పార్వేట మండపం పరిధిలోని కార్యసిద్ధి హనుమ సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వారాంతం వరకు ఆయా ఆలయాల పరిధిలో ఉత్సవాలను నిర్వహించేందుకు హిందూ సంఘాల కార్యకర్తలు ఏర్పాట్లు చేసుకున్నారు. అహితకర ఘటనలకు తావివ్వకుండా ఆయా గ్రామాల్లో భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ మల్లికార్జున బాలదండి తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విద్యుత్తు దీపాలు

రత్నప్రభకు అంతర్జాతీయ పురస్కారం

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉబుంటు వ్యవస్థాపకురాలు, కర్ణాటక ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె.రత్నప్రభ 'టున్ డాక్టర్ మహతిర్ మహ్మద్ గుడ్ గ్లోబల్ ఎక్సెంప్లరీ లీడర్‌షిప్ అవార్డు'ను అందుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి, వారికి కావలసిన కౌశల్యాలను, మార్కెటింగ్ సదుపాయాలను అందిస్తున్న ఉబుంటు సంస్థ వ్యవస్థాపకురాలిగా మలేషియాలో నిర్వహించిన ట్రిక్స్-ఆసియాన్ కౌన్సిల్ సమావేశాల్లో నైజీరియా రాయబారి ధయాలన్ నాథన్ నుంచి పురస్కారాన్ని అందుకున్నట్లు సమాఖ్య సంయుక్త కార్యదర్శి జ్యోతి బాలకృష్ణ తెలిపారు. ఉబుంటులో పది వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలను చేర్చుకుని, డిజిటల్ మార్కెటింగ్ శిక్షణను వంద సంఘాలకు విస్తరించే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు రత్నప్రభ వివరించారు.

స్మరణిక అందుకుంటున్న రత్నప్రభ

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	55
క్యారెట్-	70
బీరకాయలు-	60
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	105
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	80
టమాటా(సాధారణ)-	55
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	140

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	165
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	30
ఆరంజి-	95
బత్తాయి-	60

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

రన్యాకు బెయిల్ దక్కేనా?

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : దుబాయ్, ఇతర దేశాల నుంచి అక్రమంగా బంగారాన్ని తీసుకువస్తూ పట్టుబడిన నటి రన్యారావు, నటుడు తరుణ్ రాజు తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వేసుకున్న అర్జీపై ఉన్నత న్యాయస్థానంలో విచారణ పూర్తయింది. తమను అక్రమంగా అరెస్టు చేసి, కాఫిపోసా చట్టం కింద కేసులు నమోదు చేయడాన్ని వారు తమ అర్జీలో ప్రశ్నించారు. విచారణ పూర్తి చేసిన జస్టిస్ అను శివరామన్, జస్టిస్ విజయకుమార్ పాటిల్ పీఠం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

సిద్ధు పదవి పదిలం: మహదేవప్ప

దావణగెరె, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య మరో రెండున్నరేళ్లు కొనసాగుతారని ఆయన స్నేహితుడు, మంత్రి మహదేవప్ప వ్యాఖ్యలు చేశారు. కుర్చీ కదనానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందా అని దావణగెరెలో విలేకరులు అడిగి ప్రశ్నకు.. సిద్ధరామయ్యే పూర్తి సమయం అధికారంలో ఉంటారని మంత్రి వ్యాఖ్యానించారు. విధానసౌధను ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రంగా మార్చుతున్నారని భాజపా చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. తమ వద్ద ఆధారాలు ఉంటే విడుదల చేయాలని సవాలు విసిరారు. భాజపా ఇప్పటి వరకు కర్ణాటకలో ఒక్కసారి కూడా పూర్తి మెజార్టీతో అధికారంలోకి రాలేదని గుర్తు చేశారు.

మళ్లీ 'మంకీ ఫీవర్' భయం

శివమొగ్గ, న్యూస్‌టుడే : మలెనాడు ప్రాంతంలో మళ్లీ మంకీ ఫీవర్ (కేఎఫ్‌డీ) వ్యాప్తి చెందుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. శివమొగ్గ జిల్లా హోసనగర తాలూకా బిళ్లోడికి చెందిన ఒక మహిళ (50)కు ఈ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించి, వైద్య పరీక్షలు చేయగా, కేఎఫ్‌డీ ఉన్నట్లు తేలింది. గత ఏడాది శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో డిసెంబరు, జనవరి నెలల్లో మంకీ ఫీవర్ విస్తృతంగా వ్యాపించగా.. ఇద్దరు మరణించారు. ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా అధికారులు జాగృతి కార్యక్రమాలను చేపట్టారు.

వైకల్యమే ఓడేలా.. ఈదేశాడు!

జాతీయ స్థాయిలో దివ్యాంగుడు గోపిచంద్ సత్తా

అంతర్జాతీయ పోటీల్లో రాణించాక..

బళ్లారి, న్యూస్‌టుడే: రెండో తరగతి చదువుతున్నప్పుడే తోటి పిల్లలతో ఆటలాడుతూ రోడ్డు దాటుతున్న సమయంలో కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు పూర్తిగా పోయాయతడికి. ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఎవరికైనా జీవితం అంధకారమే. గోపిచంద్ మాత్రం ఏనాడు కుంగిపోలేదు. గురువులు, తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో చదువుతో పాటు దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఈతలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. అతడి ప్రతిభను గుర్తించి బెంగళూరుకు చెందిన అంతర్జాతీయ ఈత కోచ్ శరత్‌గైక్వాడ్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ముందుకొచ్చారు. పారా ఒలింపిక్స్‌లో సత్తా చాటి బళ్లారికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తానంటున్న అతని ప్రస్థానంపై కథనం.

ఈతలో శిక్షణ పొందుతున్న గోపిచంద్

రికార్డు సృష్టించాలని..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రి తాలూకా నారాయణపల్లికి చెందిన రాజశేఖర్ పూర్వీకులు బళ్లారి జిల్లా సండూరు తాలూకా దరోజిలో స్థిరపడ్డారు. రాజశేఖర్, వసంతల రెండో కుమారుడు గోపిచంద్.. నేడు స్విమ్మింగ్‌లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు. పారాలింపిక్స్ జపాన్ క్రీడాకారుడు ఫ్రీస్టైల్ 100 మీటర్ల పోటీలో 1.06 నిమిషాల్లో పూర్తి చేశాడు. గోపిచంద్ ఏషియన్ గేమ్స్‌లో 1.19 నిమిషాలకు పూర్తి చేశాడు. భవిష్యత్తులో జరిగే పారాలింపిక్స్‌లో జపాన్ క్రీడాకారుడి పేరు మీద ఉన్న రికార్డ్‌ను బద్ధలు కొట్టడానికి బెంగళూరులోని అంతర్జాతీయ ఈత కోచ్, అర్జున్ అవార్డు గ్రహీత శరత్ గైక్వాడ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు.

శెట్టర్‌కూ సతాయింపులు

బెళగావి, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి, బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్‌కు కొత్త తలనొప్పి మొదలైంది. తనకు కొత్త మోడల్ ఐఫోన్ కొనివ్వాలంటూ ఒక యువకుడు నిత్యం ఫోన్ చేసి వేధిస్తున్నాడని పార్టీ కార్యకర్తల వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతీక్ మలక అనే యువకుడు ఫోన్ చేసి ఐఫోన్ కావాలని కోరడం, అతన్ని శెట్టర్ మందలించి ఫోన్ కట్ చేసిన సంభాషణలు ప్రస్తుతం స్థానికంగా వైరల్‌గా మారాయి.

పాఠశాల బస్సు బోల్తా

కార్వార, న్యూస్‌టుడే : హొన్నావర సుళెముర్కి సమీపాన సంభవించిన రోడ్డుప్రమాదంలో పవన్ (15) అనే విద్యార్థి మరణించాడు. మరో 26 మంది గాయపడ్డారు. మైసూరు తరళబాళు పాఠశాలకు చెందిన విద్యార్థులు గోకర్ణ పర్యటనకు వచ్చిన సమయంలో వారి బస్సు సోమవారం సాయంత్రం బోల్తా కొట్టింది. ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన వారిని చికిత్స కోసం హొన్నావర ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. హొన్నావర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మేలుకోటెకు 'గాంధీ' పురస్కారం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మేలుకోటె గ్రామ పంచాయతీకి నాలుగో సారి గాంధీ గ్రామ పురస్కారం లభించింది. విధానసౌధలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు భవానీ హరిధర్, ఉపాధ్యక్షురాలు జీకే కుమార్ ఈ పురస్కారాలను, రూ.5 లక్షల చెక్కును అందుకున్నారు. ఇదే క్రమంలో వరుసగా పురస్కారాలను అందుకునేందుకు శ్రమిస్తామని పీడీఓ రాజేశ్వర్‌తో కలిసి విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద ప్రమాణం చేశారు. మేలుకోటె గ్రామ పంచాయతీలో ఆన్‌లైన్, సకాల సేవలు, పలు పథకాల జారీ, గ్రామ, వార్డు సభల నిర్వహణ తదితర కార్యక్రమాలకు ర్యాంకింగ్ ఇవ్వడం ద్వారా గ్రామ పంచాయతీలను ప్రభుత్వం గాంధీ గ్రామ పురస్కారాలకు ఎంపిక చేస్తూ వస్తోంది.

పీడీఓతో కలిసి పురస్కారాలను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

భార్యా హంతకునికి పదేళ్ల శిక్ష

శివమొగ్గ, న్యూస్‌టుడే : భార్యపై పెట్రోలు పోసి హత్య చేసిన ఆల్బర్ట్ (45) అనే హంతకునికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ శివమొగ్గ ఒకటో అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు చెప్పింది. తీర్థహళ్లి తాలూకా మూవళ్లికి చెందిన నిందితుడు తన భార్య పనికి వెళ్లడం లేదని రెండేళ్ల కిందట హత్య చేశాడు. మాళూరు ఠాణా పోలీసులు అభియోగపత్రాన్ని దాఖలు చేయడంతో న్యాయమూర్తి అభయ్ ధనపాల్ చౌగలార నిందితునికి శిక్ష, జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చిన్నారిని గుర్తించిన జాగిలం

అనిల్ కాళప్పతో జాగిలం

మడికేరి, న్యూస్‌టుడే : పొన్నంపేట తాలూకా కొంగణ గ్రామంలోని కాఫీ తోటలో సునీల్, నాగిణి దంపతుల రెండేళ్ల కుమార్తె సునన్య కనిపించకుండా పోయింది. ఆదివారం రాత్రంతా పాప కోసం వెతికినా కనిపించలేదు. అనిల్ కాళప్ప అనే వ్యక్తికి చెందిన పెంపుడు జాగిలం తోటలోని ఒక పొదలో పడి ఉన్న సునన్యను గుర్తించింది. ఎవరో పాపను తీసుకువెళ్లి పొదల్లో పడేసి ఉంటారన్న అనుమానంతో ఆ దంపతులు పొన్నంపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అపార్ట్‌మెంట్ల భద్రతకు విన్నపం

బెంగళూరు (హలసూరు) : తమ హితాన్ని, రక్షణను దృష్టిలో ఉంచుకుని బెళగావి శాసనసభ సమావేశంలో చట్టాన్ని చేయాలని అపార్ట్‌మెంట్ నివాసుల, యజమానుల సమాఖ్య, సంఘాలు డిమాండ్ చేశాయి. బెంగళూరులో మంగళవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో బెంగళూరు అపార్ట్‌మెంట్ ఫెడరేషన్, నివాసులు, యజమానుల సంఘం ప్రతినిధులు మాట్లాడారు. నగరంలో 1400కు పైగా అపార్ట్‌మెంట్లు, విల్లాలు తమ సమాఖ్యలో ఉన్నాయని సమాఖ్య అధ్యక్షుడు సతీశ్ మల్య తెలిపారు. సమాఖ్య ప్రతినిధులు కె.అరుణ్ కుమార్, కిరణ్ హెబ్బార్, విశ్వవెంకట్‌రెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సమాఖ్య పరిధిలోకి వచ్చే అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో 15 లక్షల జనాభా ఉందని చెప్పారు. ఆస్తి హక్కుల బదిలీ, యజమానుల సంఘాల నిర్వహణ, వివాదాల పరిష్కరణకు ప్రాధికార, పునరాభివృద్ధి, ఏకీకృత పాలనకు ఈ చట్టం అవసరమవుతుందని వివరించారు.

(c) eenadu

అలరించిన జగన్నాథ నాట్యరూపకం

నగరంలోని నాట్య భైరవి కళాకుటీర వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం సంస్థ వ్యవస్థాపకురాలు మంజు భైరవి ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ నాట్య ప్రక్రియల నూపుర నాదాలు ఆహూతులను సంపూర్ణ ఆనందాన్ని కలుగజేశాయి. కార్యక్రమంలో రచయిత్రి, కళాకారిణి సంధ్యాశర్మ, కామాక్షి, పద్మజా జయరామ్, గౌరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (సాంస్కృతికం)

బెంగళూరు

• బెంగళూరు • కోలారు • మైసూరు • హోసూరు • చిక్కబళ్లాపుర • తుమకూరు

ఆకట్టుకున్న తరంగ్ ఉత్సవాలు

జయనగరంలోని జేఎస్ఎస్ ఆడిటోరియంలో జరిగిన తరంగ్ ఉత్సవ్-ఉత్తరాంగ్ ఉత్సవ్-2025 సాంస్కృతిక కార్యక్రమాలు సంగీతప్రియులను రంజింపజేశాయి. నృత్యకళాకారులు భరతనాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రముఖ కళాకారులు విధ్ మెనన్, పృథ్వీ పార్థసారథి, జగ్గసేని చటర్జీ భరతనాట్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. - న్యూస్‌టుడే, బెంగళూరు (యశ్వంతపుర)

హోసూరు కబుర్లు

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి

హోసూరు, న్యూస్‌టుడే : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బెంగళూరు శివాజీనగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. డెంకణికోట తర్వాత హోసూరు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆశార కల్యాణ మంటపంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. కృష్ణగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని నియామకానికి సంబంధించి ఆశావహుల నుంచి వినతి పత్రాలను రిజ్వాన్ హర్షద్ స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఎస్.ఎ.మురళీధరన్ 15 ఏళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన ఈ సారి కొనసాగుతారా లేక రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉంటారో చూడాలి. జిల్లా అధ్యక్ష పదవికి 12 మంది దరఖాస్తు చేశారు. సమావేశంలో నాయకులు కె.ఎ.మనోహరన్, ఎస్.ఎ.మురళీధరన్, చిన్న బేలగొండపల్లి శ్రీనివాసరెడ్డి, మునిరాజు, ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, కువ్వు స్వామి, సరోజ, అన్బన్, ఆగా కృష్ణమూర్తి, హాశిసేమ హరీశ్, సీలం రామమూర్తి, త్యాగరాజన్, నీలకంఠన్, మైజా అక్బర్, సాదిక్, కీర్తిగణేశ్, వీరమునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిజ్వాన్ హర్షద్

ఎయిడ్స్ నియంత్రణపై దృష్టి సారించాలి

కృష్ణగిరి (డెంకణికోట), న్యూస్‌టుడే : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా కృష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో అవగాహన ప్రతిజ్ఞ చేశారు. ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆరోగ్య సూత్రాలను పాటించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సాధనకుమార్, కలెక్టర్ సహాయకులు గోపు, శక్తి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జలాలుద్దీన్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

వైభవంగా హనుమద్వ్రతం

ఉత్తరహళ్లిలో రథం లాగుతున్న ఎమ్మెల్యే కృష్ణప్ప తదితరులు

బెంగళూరు (సాంస్కృతికం) : పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

బెంగళూరు (కెంగేరి) : జీడిపప్పుతో హనుమంతుని విగ్రహాలంకరణ

చిత్రదుర్గం : ప్రసన్నాంజనేయుడికి తొడుగుల అలంకారం

పావగడ : అలంకారంలో కోటె ఆంజనేయస్వామి

తుమకూరు : రథోత్సవంలో భక్తజనం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఇట్టుమడులోని ఆనంద తిరుపతి క్షేత్రంలో కొలువైన ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం వైభవంగా పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం వర్షం వస్తున్నా భక్తులు వేలసంఖ్యలో స్వామి దర్శనానికి బారులు తీరారు. వివిధ భజన మండళ్లచే నిర్వహించిన భక్తిసంగీత కచేరీలు ఆహూతులను అలరించాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసినట్లు ప్రధాన అర్చకులు మురళీధర్ భట్ తెలిపారు. ఈనెల 30న వైకుంఠ ఏకాదశిని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

బెంగళూరు (యశ్వంతపుర) న్యూస్‌టుడే : హనుమజ్జయంతి సందర్భంగా ఉత్తరహళ్లి కూడలిలోని వీరాంజనేయస్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు. పువ్వులు, పండ్లతో రథాన్ని అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప తదితరులు రథోత్సవంలో పాల్గొన్నారు.

బెంగళూరు (కెంగేరి) : కర్ణాటక హౌసింగ్ బోర్డు కాలనీ నేతాజీ లేఅవుట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. హనుమంతుడి మూల విగ్రహాన్ని జీడిపప్పుతో అలంకరించారు. ఆలయ ఆవరణంలో పవమాన హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హోమం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

బెంగళూరు (మత్తికెరె) : హనుమజ్జయంతి సందర్భంగా సిడెదనహళ్లి ఆంజనేయస్వామి ఆలయంలో చిక్కసంద్ర వార్డు జేడీఎస్ అధ్యక్షుడు భరత్ గుండప్ప ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమంతులని విగ్రహానికి పూలహారాలు వేసి చేశారు. రెండువేల మంది భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక నాయకులు రాజేంద్రబాబు, సూర్య రామ, ప్రముఖులు పాల్గొన్నారు. అబ్బిగెరెలోని వేంకటేశ్వరస్వామి, రామాంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్తలు, ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా నిర్మించిన దేవాలయం వద్ద కలశానికి ప్రదక్షిణ చేసి వేదపండితుల వేద పూజలు చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు విశ్వనాథ్, రాజణ్ణ, కె.నాగభూషణం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తుమకూరు : అలంకరణలో కోటె ఆంజనేయస్వామి

తుమకూరు : తుమకూరు జిల్లా వ్యాప్తంగా ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోటె ఆంజనేయస్వామి, శెట్టిహళ్లి ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, వరప్రసాద వీరాంజనేయస్వామి, బటవాడి సమీపంలోని భక్తాంజనేయస్వామి, విద్యానగర్‌లోని పుట్టాంజనేయస్వామి, హనుమంతపురంలోని బయలాంజనేయస్వామి, బనశంకరిలోని మారుతి దేవాలయం, మెళెకోటెలోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోటె ఆంజనేయస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శిర జ్యోతినగర్‌లోని పంచముఖ ఆంజనేయ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

పావగడ : హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలో కోటె ఆంజనేయస్వామి దేవాలయంలో తెల్లవారుజాము విగ్రహాన్ని పంచలోహ కవచంతో సుందరంగా అలంకరించారు. సుప్రభాతసేవ, సూర్యారాధన, పంచామృత అభిషేకం, ఏకవార రుద్రాభిషేకం చేశారు. లోక కల్యాణార్థం మహాగణపతి, నవగ్రహ మృత్యుంజయ రామ తారక, పవమాన హోమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు రమేశ్ తెలిపారు. మధ్యాహ్నం పూర్ణాహుతి ప్రాకారోత్సవం, మహామంగళారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ప్రసన్నాంజనేయ, గుండ్లహళ్లి ఆంజనేయ స్వామి దేవాలయాల్లో విశేష పూజలు జరిగాయి.

చిత్రదుర్గం : హనుమజ్జయంతి పర్వదినాన్ని పట్టణంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆంజనేయ దేవాలయాల్లో అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. జోగిమట్టి రోడ్‌లోని ప్రసన్నాంజనేయ స్వామికి వెండి తొడుగుల అలంకారం భక్తులను ఆకట్టుకుంది. పాతఊరులోని రామాలయంలో హనుమంతునికి పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

ముళబాగిలు : ఖాద్రిపుర శాంతిధామంలో విగ్రహాలంకరణ

అబ్బిగెరెలో కలశాలతో విశ్వనాథ్ తదితరులు

సిడెదహళ్లిలో పూజలు చేస్తున్న భరత్ గుండప్ప తదితరులు

సంక్షేమ పథకాలు ఆదర్శనీయం

వేపనపల్లి, (బేరికె), న్యూస్‌టుడే : దేశంలో భాజపా ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తోందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆదర్శనీయమని భాజపా కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి కె.సుందరమూర్తి పేర్కొన్నారు. వేపనపల్లి నియోజకవర్గం ఉత్తర యూనియన్ పార్టీ నూతన కార్యనిర్వాహకుల పరిచయ సమావేశం మంగళవారం స్థానిక చౌకశ్రీ కల్యాణమండపంలో జరిగింది. వేపనపల్లి సౌత్ యూనియన్ అధ్యక్షుడు లోకేశ్ అధ్యక్షత జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అన్బరసన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు నారాయణ్, మంజునాథ్, విశ్వనాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీగా వెళుతున్న భాజపా నాయకులు, కార్యకర్తలు

అంటువ్యాధులపై అప్రమత్తం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగర వాతావరణంలో మార్పు రావడంతో పాటు చలితీవ్రత అధికం కావడంతో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) అంటువ్యాధుల నియంత్రణ చర్యలు చేపట్టింది. విష జ్వరాలు, అతిసార వ్యాధులను నియంత్రణకు వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛత పనులతో పాటు, రసాయనిక మందులను పిచికారి చేస్తున్నారు. దోమలు వల్ల విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. నీటినిల్వ, పిచ్చిమొక్కలు లేకుండా చేయడం మొదలు పెట్టారు. నీటినిల్వ తొలగించి దోమల లార్వా నిల్వ కాకుండా రసాయన మందులను చల్లుతున్నారు. ఖాళీ ప్రదేశాలను శుభ్రం చేయడం మొదలు పెట్టారు. బెంగళూరు పడమటి నగరపాలికె పరిధిలోని దొడ్డబిదరకల్లు ప్రాంతంలో పాలికె సిబ్బంది సామూహిక స్వచ్ఛత చర్యలు చేపట్టారు. ఆయా ప్రదేశాలను శుభ్రం చేసి రసాయనిక మందులు, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. విషజ్వరాలు వ్యాపించకుండా రాత్రిళ్లు ఫాగింగ్ చేపట్టారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరమొస్తే వైద్యులను సంప్రదించాలని ప్రాధికార వైద్యాధికారులు విజ్ఞప్తి చేశారు. ఐదు నగర పాలికె పరిధిలో స్వచ్ఛత పనులు చేపట్టి నీరునిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, రసాయనిక మందులు పిచ్చికారి చేయాలని ప్రాధికార చీఫ్ కమిషనర్ మహేశ్వర రావు సంబంధిత అధికారులకు సూచించారు.

నీటి నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

సబర్బన్ రైలు మార్గం పనుల తనిఖీ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్ర రైలు మౌలిక సౌకర్యాల అభివృద్ధి ప్రాధికార నూతన ఎండీ లక్ష్మణ్‌సింగ్ బాధ్యతలు చేపట్టిన తరువాత మంగళవారం బెంగళూరు సబర్బన్ రైలు ప్రాధికార (బీఎస్ఆర్‌పీ) కారిడార్-2లోని మల్లిగె సబర్బన్ రైలు మార్గంలో సాగుతున్న పనులను పరిశీలించారు. చిక్కబాణవార నుంచి యశ్వంతపుర వరకు పనులు, భూస్వాధీనం తదితర పనులను ఆయన పరిశీలించి ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. మైడరహళ్లి, శెట్టిహళ్లి, యశ్వంతపుర ప్రాంతాల్లో సబర్బన్ రైలు పనులు సాగుతున్నాయి. పనుల పరిశీలన అనంతరం లక్ష్మణ్‌సింగ్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సాగుతున్న పనులను సమీక్షించారు. నిర్మాణాల్లో వేగం పెంచాలని సూచించారు. 2023 కల్లా సబర్బన్ మల్లిగె మార్గం పనులు పూర్తవుతాయని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. నేటికీ 50శాతం పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. 2026 కల్లా ఆమార్గంలో రైలు సంచరించే విధంగా చర్య తీసుకుంటామని అధికారులు ప్రకటించారు.

యశ్వంతపురలో పనులను పరిశీలిస్తున్న లక్ష్మణ్‌సింగ్, ఇంజినీర్లు

సభాపర్వంలో ప్రీతి పూజార్ అదుర్స్

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రీతి ఎస్.పూజార్ బెంగళూరులోని టీచర్స్ హాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యువజన అసెంబ్లీ మాక్ సెషన్లో మంచి ప్రదర్శనతో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. మధుగిరి విద్యా జిల్లాకే కాకుండా పావగడ తాలూకాకు ఖ్యాతిని తెచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటేశ్ తెలిపారు. విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా పాఠ్యేతర కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ప్రకాశ్, ఉపాధ్యాయులు గిరీష్, దిలీప్, విజయ్‌కుమార్, వెంకటేశ్, రూపకుమారి, విద్య తదితరులు ప్రీతిని అభినందించి బహుమతులు అందజేశారు.

ప్రీతిని అభినందిస్తున్న ప్రముఖులు

ఎయిడ్స్ నియంత్రణపై జనజాగృతి

మన్మోహన్‌సింగ్ బెంగళూరు నగర విశ్వవిద్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణపై జనజాగృతి నిర్వహించారు. విశ్వవిద్యాలయం గడియార గోపురం సమీపంలో ఉపకులపతి బి.రమేశ్ రిజిస్ట్రార్లు నవీన్‌జోసెఫ్, రమేశ్ బి.కుడేనట్టి, ప్రతినిధి రితికా సిన్హా జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ గురించి ప్రముఖులు అవగాహన కల్పించారు. విద్యార్థులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత చంద్రశేఖర్ కంబార రచించిన రంగగీతతో వీధినాటకం ద్వారా జాగృతి కల్పించారు. **న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : విద్యార్థినులు, మహిళలు మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ మేరీ శైలజా విద్యార్థులకు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక ఎంఈఎస్ రింగ్‌రోడ్డులోని మదర్‌థెరిసా పాఠశాల, కళాశాల, బీఈఎల్ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువతులు, మహిళల రక్షణ కోసం సహాయవాణి 1090ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ వి.రఘు, ప్రిన్సిపాళ్లు వెంకటేష్‌మూర్తి, రత్నమ్మ, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి సుబ్బారెడ్డి

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : సుజాత ఇండస్ట్రీస్‌ఆధ్వర్యంలో చాలా మంది కార్మికులకు జీవనోపాధిని కల్పించి వారికి తోడ్పాటు అందిస్తున్న సుజాత ఇండస్ట్రీస్ అధినేత సంగటి సుబ్బారెడ్డి సేవలు అభినందనీయమని దాసరహళ్లి సీఎంసీ మాజీ అధ్యక్షుడు కె.సి.ఆశోక్ పేర్కొన్నారు. అబ్బిగిరిలోని వేంకటేశ్వర, రామాంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా కార్మికులకు శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించి ప్రయోజకులను చేశారన్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న అశోక్, ఆలయ ధర్మకర్తలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రమాదానికి గురైన బస్సు

చింతామణి, న్యూస్‌టుడే : చింతామణి-మదనపల్లి రహదారి రాయల్పాడు పోలీసుస్టేషన్ పరిధిలో మంచినీళ్లకోట గ్రామం వద్ద కడప నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు బస్సు మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన అనిత (58) అక్కడిక్కడే మృతి చెందారు. కడప, ప్రొద్దుటూరు, బెంగళూరు ప్రాంతాలకు చెందిన పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగ్రాతులను మదనపల్లి, శ్రీనివాసపురం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. బోల్తాపడిన బస్సు ముందు చక్రాలు ఊడిపోయాయి. డ్రైవర్ నిర్లక్ష్యమా, పొగమంచు కారణమా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఎల్‌బీ విద్యార్థి మృతి

హాసన, న్యూస్‌టుడే : బేలూరు తాలూకా హిరిఅసడె గ్రామం వద్ద సోమవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో చందన్ (22) అనే ఎల్ఎల్‌బీ విద్యార్థి మరణించాడు. బైకుపై వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన జీపు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఆరేహళ్లి ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితుల అరెస్టు

శివమొగ్గ, న్యూస్‌టుడే : కుంసిలో బసమ్మ (70) అనే వృద్ధురాలిని హత్య చేసి పరారైన అమాన్ సిఐంగ్ (21), వికాస్ (22) అనే యువకులను శివమొగ్గ పోలీసులు అరెస్టు చేశారు. భర్త చనిపోయాక ఆమె ఒంటరిగా ఉంటోంది. మొదటల్లో బసమ్మ కుమారుడు రమేశ్ హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానించారు. నిందితులు ఇద్దరూ బసమ్మ ఇంటి పక్కనే ఉండేవారు. తమ ఇంట్లో గ్యాసు ఖాళీ అయిందని చెప్పడంతో వారిద్దరినీ ఇంట్లోకి పిలిచి పలావు పెట్టింది. తిన్న అనంతరం ఆమె ఒంటిపై నగలను చూసి, కత్తితో 16 సార్లు పొడిచి హత్య చేశారు. పోగులు, గొలుసు తీసుకుని పరారయ్యారని ఎస్పీ మిథున్ కుమార్ తెలిపారు.

క్రీడాకారులకు ఏకలవ్య, క్రీడారత్న పురస్కారాలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : క్రీడాకారుల సాధనను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర యువజన సేవా క్రీడాశాఖ అందించిన ఏకలవ్యా, కర్ణాటక క్రీడారత్న ప్రశస్తులందుకొన్న క్రీడాకారులను ఆళ్వాస్ శిక్షణ సంస్థ అధ్యక్షుడు ఎం.మోహన్‌ఆళ్వా అభినందించారు. ఆళ్వాస్ తరపున ప్రతిష్టాత్మకమైన అవార్డులు అందుకున్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. బి.ఎన్.ఉషా ఏకలవ్య, కర్ణాటక క్రీడారత్న ప్రశస్తులను దివ్యా, మేఘన, శంకరప్ప అందుకున్నారు. ఉషా జ్ఞాపికతో పాటు రూ.4 లక్షల నగదు పురస్కారం, క్రీడారత్న ప్రశస్తి కింద రూ.3 లక్షల నగదు, జ్ఞాపికను అందుకున్నారు.

● **బి.ఎన్.ఉషా :** హాసన్‌కు చెందిన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి. సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలో బంగారు పతకాన్ని సాధించింది. 2023లో కర్ణాటక ఒలింపిక్ సంస్థ అందించే కేఓఏ అవార్డును అందుకొంది.

● **శంకరప్ప :** బళ్వారికి చెందిన మల్లకంబ క్రీడాకారుడు. అఖిలభారత మల్లకంబ పోటీలో కాంస్య పతకాన్ని సాధించిన ఇతను గుజరాత్‌లో జరిగిన నేషనల్‌గేమ్స్, అఖిలభారత అంతర విశ్వవిద్యాలయం పోటీలు, ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్నాడు.

● **ఎం.ఎస్.దివ్యా :** మండ్యకు చెందిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. ఈమె ఆరు సార్లు ఆలిండియా అంతర విశ్వవిద్యాలయం పోటీల్లో బంగారు పతకాలను సాధించింది. ఈ సాధనతో కర్ణాటక క్రీడా రత్న ప్రశస్తిను అందుకొంది.

● **హెచ్.ఎం.మేఘన :** తుమకూరుకు చెందిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణి. ఆరు సార్లు అఖిల భారత అంతర విశ్వవిద్యాలయం పోటీలు, ఫెడరేషన్ కప్ పోటీలు, జూనియర్ నేషనల్స్ పోటీల్లో పాల్గొని బంగారు, రజత, కాంస్య పతకాలను దక్కించుకొంది.

● **ఎం.బి.ఆత్మీయ :** హాసన్‌కు చెందిన జాతీయ కబడ్డీ క్రీడాకారిణి. ఈమె సీనియర్ భారత మహిళల కబడ్డీ జట్టు తర్ఫీదు శిబిరంలో శిక్షణ పొందింది. కర్ణాటక జట్టు కెప్టెన్‌గా 38వ జాతీయ గేమ్స్, 70వ సీనియర్ జాతీయ కబడ్డీ పోటీలు, సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయం, ఖేలో ఇండియా విశ్వవిద్యాలయం గేమ్స్‌లో పాల్గొనింది.

CHANGE OF NAME

I BATTURI PHANI MADHURI Daughter of PATTIKONDA VIJAYA LAKSHMI Aged About 47 Years Residing at Flat No. B-401, Mantri Serentinity, Opposite City Engineering College, Kanakpura Road, Bangalore Declare that My Daughter Named B. Sai sri sidhvitha (Old Name) Aged about 17 Years here after Changed to Batturi Sai Sri Sidhvitha (New Name) For All Purpose.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: GOOTY

O.S. No: 33/2023

Between:

G.Sunanda ..**Plaintiff**

Vs

1. P.Lakshminarayana Reddy
2. P.Etish Reddy ..**Defendants**

NOTICE TO DEFENDANT NO:1

Pamireddy Lakshminarayana Reddy, Employee, Superintendent Customs, Office of the Chief Commissioner of Customs (Bengaluru Customs Zone) Central Revenue (C.R) Building, No: 1, Queens Road, Bengaluru - 560001.

పై నెంబరు దావాలోని మొదటి ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 18-12-2025వ తేది నాడు వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల పై కేసు మీ పరోక్షము నందు తీర్మానించబడును. అని తెలియచేయడమైనది.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

J.Chittaranjan,
Advocate, Ananthapuramu (A.P)
Mobile No: 9440222366,

M.Chowdeswaraiah,
Advocate, Gooty (A.P.)
Mobile No: 9440525212

ప్రముఖులు, ముఖ్య అతిథులతో విజేతలు

విజేతలకు బహుమతులు ప్రదానం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : గీతాజయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ పరిషత్ దేవస్థాన సంచాలకుడు పి.భుజంగరావు నేతృత్వంలో నవంబరు 23న నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఎల్ఏసీ తితిదే బెంగుళూరు అధ్యక్షుడు, దేవస్థానం సూపరింటెండెంట్ జయంతి, స్థానిక సలహా సమితి ప్రతినిధి రాధాకృష్ణ అడిగ, తదితర ప్రముఖులు బహుమతులు అందజేశారు. వక్తల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంచాలకుడు భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే : ఉద్యోగాలు ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసినట్లు ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణ రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు.

ఇతర ప్రాంతాలకు చెందిన 8 మంది అరెస్టు..

రాజమహేంద్రవరంలో పోలీసులు 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్ (శ్రీసత్యసాయి జిల్లా), సిద్ధేశ్ శ్రీధర్, సిద్ధేశ్ సుదీప్ (మల్లనాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్ (నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు, నాగప్ప కావ్య (అనంతపురం జిల్లా), దేశరి సౌజన్య (పార్వతీపురం), రేపు మహాలక్ష్మి (ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

వినియోగదారులకు పది నిమిషాల్లో సేవలు

బెంగళూరు (బాణసవాడి) : వినియోగదారులకు పది నిమిషాల్లో తమకు అవసరమైన వస్తువులను అందించేందుకు అమెజాన్ నౌ నూతన మైక్రో ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆసంస్థ ఇండియా కంట్రి మేనేజరు సమీర్‌కుమార్ తెలిపారు. వస్తువులను నిమిషాల్లో ఆకేంద్రాల ద్వారా ప్రజలకు అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

పసి బిడ్డలకు ఉత్తమ చికిత్స

బెంగళూరు (ఆడుగోడి) : అపోలో క్రేడల్ చిన్నపిల్లల ఆసుపత్రి సమగ్ర చికిత్స వ్యవస్థను నగరంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. మూడు దశల ఎన్ఐసీయు, వెంటిలేటర్లు, చిన్నపిల్లల వైద్య నిపుణులు 24గంటలు అందుబాటులోకి తెచ్చినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. జయనగర, కోరమంగల, బ్రూక్‌ఫీల్డ్, బన్నేరుఘట్ట రోడ్డు, హెచ్ఆర్‌బీఆర్ లేఅవుట్, దొడ్డనెకుంది అపోలో క్రేడల్ ఆసుపత్రులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

ప్రశస్తిని స్వీకరించిన సంతోష్

మహిళా కళాశాలకు రాష్ట్ర పురస్కారం

రాయచూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లోని రెడ్ రిబ్బన్ క్లబ్‌కు రాష్ట్ర పురస్కారం దక్కింది. మైసూరులోని జీకే మైదానంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమంలో క్లబ్ సంయోజకుడు డాక్టర్ సంతోష్‌కుమార్ రేవూరి ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు చేతుల మీదుగా అత్యుత్తమ క్లబ్ ప్రశస్తిని అందుకున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల చైతన్యం కల్గించే కార్యక్రమాలను జిల్లాలో నిరంతరం నిర్వహిస్తుండడంతో పురస్కారానికి ఎంపికైంది. కళాశాల ప్రిన్సిపల్ సుగుణ, అధ్యాపకులు, విద్యార్థులు సంతోష్‌ను అభినందించారు.

వేతన బకాయిలు చెల్లించరూ!

వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే: 'యరమరాస్ నీటిపారుదల విభాగం పరిధిలోని సింధనూరు, సిరివార, యరమరాస్ ఉప విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి. సకాలంలో చెల్లించని గుత్తేదారు లైసెన్సును బ్లాక్ లిస్టులో చేర్చాలని' తుంగభద్ర కార్మిక సంఘం ఒత్తిడి తెచ్చింది. ఈ మేరకు మంగళవారం అధ్యక్షుడు కె.నాగలింగయ్య, ప్రధానకార్యదర్శి బసవరాజ్ నాయకత్వంలో యరమరాస్ ఎస్ఈ కార్యాలయం అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. తుంగభద్ర నిగమ, కార్మికులకు ఉపయోగపడని టెండర్ పద్ధతిని రద్దు చేయాలని, నేరుగా వేతనం చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయుడికి పూజలు

పతాకాన్ని ఆవిష్కరించిన భక్తులు

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరు తాలూకా కాడ్లూరు గ్రామానికి దగ్గర్లోని కృష్ణానది ఒడ్డున వెలసిన వనవాసి రామ దేవర, ముఖ్య ప్రాణదేవర, రుద్ర దేవుళ్ల ఆలయంలో మంగళవారం హనుమద్ వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో ఆచరించారు. ఉదయం ఆలయం ఆవరణలో వాయుపుత్రుడి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆంజనేయుడి విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి, తమలపాకులతో అలంకరించారు. భక్తులు వాయుస్తుతి పునశ్చరణ మంత్రాన్ని జపించారు. మధ్యాహ్నం స్వామి వారికి మహా మంగళ హారతి పట్టారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కృష్ణమ్మకు జల హారతి ఇచ్చారు. ఆలయ సమితి సభ్యులు రంగరావు దేశాయి, జయకుమార దేశాయి, విజయ కుమార్ దేశాయి, కాడ్లూరు భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ హామీని నిలబెట్టుకోండి

రాయచూరు, న్యూస్‌టుడే: ధార్వాడలో నిరుద్యోగ యువత పోరాట తీవ్రతను చూసైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏఐడీవైఓ జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్ ప్రకటనలో ఒత్తిడి తెచ్చారు. దశాబ్దంగా భర్తీ చేయకనే వందలాది మంది యువకులు ఆందోళన చేపట్టి ఆక్రోశాన్ని వెళ్లగక్కారన్నారు. అధికారంలోకి వచ్చాక మిగిలిన అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని విధానసభ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, భాజపాలు ఇచ్చిన హామీలను విస్మరించడం వల్లే పోరుబాట పట్టామని వివరించారు.

ఎవరీ అభాగిని?

రాయచూరు, న్యూస్‌టుడే: రిమ్స్ (రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ)లో గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతోందని, ఆమె గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని పశ్చిమ ఠాణా పోలీసులు కోరుతున్నారు. వివరాలు.. రాయచూరు రైల్వే స్టేషన్‌కు దగ్గర్లో ఓ స్త్రీ అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వాహన సిబ్బంది ఆమెను రిమ్స్‌లో చేర్పించారు. మహిళకు మాటలు రాకపోవడంతో పోలీసులు వివరాలు రాబట్టలేకపోయారు. 5.2 అడుగుల ఎత్తు కలిగిన ఆమెకు సుమారు 40 ఏళ్లు ఉండొచ్చని, కుడి చేయిపై వెంకటయ్య అని తెలుగులో ఉందని వెల్లడించారు.

రాయచూరులో నేడు మంత్రి పర్యటన

రాయచూరు, న్యూస్‌టుడే: నగరాభివృద్ధి శాఖ మంత్రి బి.ఎస్.సురేష్ బుధవారం రాయచూరు పర్యటన అధికారికంగా ఖరారైంది. నగరానికి సమీపంలోని యరమరాస్‌కు దగ్గర్లో నిర్మితమవుతున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన వసతి సముదాయం నిర్మాణాలను పరిశీలిస్తారు. తర్వాత మావిన చెరువు వద్ద అభివృద్ధి పనులను వీక్షిస్తారు. అనంతరం కిల్లే బృహన్మఠం సభాభవనంలో లబ్ధిదారులకు ఇంటి హక్కుపత్రాల మంజూరు, ఈ-ఆస్తి ఖాతాలు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నగరాభివృద్ధి శాఖ ప్రగతిని సమీక్షిస్తారు.

అనధీకృత దుకాణాల తొలగింపు

రాయచూరు, న్యూస్‌టుడే: నగరానికి సమీపంలోని యరమరాస్ జాతీయ రహదారికి ఆనుకుని అనధీకృతంగా నిర్మించుకున్న దుకాణాలను నగరపాలక సంస్థ మంగళవారం తొలగించింది. హోటళ్లు, పండ్లు, పాన్‌షాపుల షెడ్లను జేసీబీతో కూల్చేశారు. యరమరాస్ హైదరాబాద్ రహదారి మార్గమైనందున, శక్తినగర్ థర్మల్ కేంద్రం, పలు పరిశ్రమలకు ఇదే రహదారి కావడంతో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు వాహన సంచారం అధికంగా ఉంటుంది. యరమరాస్ బైపాస్ మలుపులో సోమవారం లారీ ఢీ కొట్టి తండ్రి కుమారుడు చనిపోవడంతో అధికారులు అక్రమకట్టడాలపై దృష్టి సారించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

02-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1622.63	1629.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,523	2,783
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	7,301	5,563
నీటి నిల్వ (టి.ఎం.సి)	69.019	93.018

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అరకొర నిధులు..
అలమటిస్తున్న అన్నదాతలు

● తొలి విడత రూ.33 కోట్లు మంజూరు
● రెండో విడత సాయానికి ఎదురుచూపులు

రాయచూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సంభవించిన విపత్తు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీసింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అతివృష్టి, తుపాను వల్ల 1,26,512 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్త సర్వేలో తేలింది. తాలూకాల వారీగా ఎకరాల్లో.. మాన్విలో-29,805, రాయచూరు-26, 628, సిరివార-16,768, లింగసూగూరు-15,093, దేవదుర్గ-13,833, మస్కి-13,404, అరకేరా-7807, సింధనూరులో-3,174 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు నమోదు చేశారు. ప్రధానంగా పత్తి, కంది, వరి, సజ్జ, సూర్యకాంతి, జొన్న పంటలను కోల్పోయారు. 15 వేల హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు తొలుత ప్రాథమికంగా అంచనా వేశారు. వీటి ఆధారంగానే ఇటీవల తొలి విడతలో 76,941 మంది రైతులకు రూ. 33,01,97,441 చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. రెండు రోజులుగా ఖాతాల్లో సొమ్ము జమ అవుతోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్టోబరులో వైమానిక పర్యటన చేసి దెబ్బతిన్న పంటలను స్వయంగా చూశారు. వెంటనే రూ. రెండున్నర వేల కోట్ల భారీ సాయాన్ని ప్రకటించారు. హెక్టారుకు అదనంగా రూ. 8,500 ఇస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన సాయం అనువైన సమయంలో అందితేనే రైతులు కోలుకోగలరు. తర్వాత సీజన్‌కు రైతులు సమాయత్తం కావాలంటే ప్రభుత్వ ప్రకటించిన పరిహారం మొత్తం సకాలంలో చేతికొస్తేనే ముందడుగు వేయడం సాధ్యమౌతుంది.

నిబంధనలు మార్చాలి



రెండో దశ పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి. సాయం అందితే రబీకి సిద్ధమవుతారు. పరిహారాన్ని పెంచేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ నియమాలను సవరించాలి. పెట్టుబడి రెట్టింపైనా పాత నిబంధనలే కొనసాగించడం శోచనీయం. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లకు ఒకసారి వేతనాల సవరణకు కమిషన్ వేస్తారు. ఈ నియమం రైతులకు ఎందుకు వర్తింప చేయరు.

- చామరస్ మాలిపాటిల (రాజ్య రైతు సంఘం గౌరవాధ్యక్షుడు)

రాయచూరు తాలూకాలో దెబ్బతిన్న పత్తి పంట

సమష్టి సహకారంతో సైబర్ నేరాల నియంత్రణ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్ హొగిబండి

మాన్వి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలను సకాలం ఛేదించటం కత్తి మీద సాములా మారిందని, సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని జిల్లా సబర్ క్రైం డీఎస్పీ వెంకటేశ్ హొగిబండి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాల జాగృతి కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. నేరాలకు పాల్పడేవారు సులభమార్గంలో కొల్లగొట్టేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారని తెలిపారు. చరవాణులను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తక్షణం సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని, నగ్న వీడియోలు, మార్ఫింగ్ వీడియోల ద్వారా వచ్చే బెదిరింపులకు భయపడకుండా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంచారసాథీ యాప్‌ను చరవాణుల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనేశ్వరయ్య, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ సుమంగళ, సైబర్ క్రైం పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాల్లో ప్రజా భాగస్వామ్యం

రాయచూరు: హెచ్ఐవీ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం కావాలని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత పిలుపునిచ్చారు. వ్యాధిపై చైతన్యం కల్పించేందుకు సోమవారం సాయంత్రం డీహెచ్ఓ కార్యాలయం ఆవరణలో ఆమె కొవ్వొత్తుల ప్రదర్శనను ప్రారంభించారు. స్మిత మాట్లాడుతూ అసురక్షిత లైంగిక సంపర్కం వల్లే అత్యధికుల్లో వైరస్ సంక్రమిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసే కోవడాని యువతకు హితవు పలికారు. డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు ప్రసంగిస్తూ హెచ్ఐవీ నిర్ధారణ తర్వాత తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారిణి డాక్టర్ నందిని, సర్జన్ డాక్టర్ విజయశంకర్, సర్వేక్షణాధికారి డాక్టర్ గణేశ్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అధికారి డాక్టర్ శివకుమార్, మానసిక వైద్యుడు మనోహర్ పత్తార్, జిల్లా ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దాసప్ప, ఉప అధికారి బసయ్య హాజరయ్యారు.

కొవ్వొత్తులతో ఊరేగింపు

ప్రతిష్ఠాత్మకంగా పల్స్‌పోలియో కార్యక్రమం

టాస్క్‌పోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న పురురాజ్‌సింగ్ సోలంకి

మాన్వి,న్యూస్‌టుడే: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు తాలూకా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని తాలూకా పంచాయతీ కార్యనిర్వహణ అధికారి పురురాజ్‌సింగ్ సోలంకి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం సభాంగణంలో నిర్వహించిన తాలూకా టాస్క్‌పోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1 నుంచి 5 లోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలని, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. తాలూకా వైద్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ మాట్లాడుతూ డిసెంబర్ 21న బూత్‌స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. తాలూకాలో 47 వేల మంది 5 ఏళ్లలోపు చిన్నారులున్నారని చెప్పారు. మొత్తం 221 పోలియో కేంద్రాలు, 442 మంది సిబ్బంది, 47 మంది సూపర్‌వైజర్లు, 8 సంచార బృందాలను పోలియో చుక్కల కార్యక్రమానికి నియమించినట్లు చెప్పారు. తహసీల్దార్ అబ్దుల్ వాహిద్, బీఈఓ చంద్రశేఖర్ దొడ్డమని మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన నగరి.. గులాబీ రంగుల సిరి!

ప్రకృతి వాకిట జన పరవశం

ఉద్యానవనం రహదారి పక్కన రమణీయం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్ర పరిపాలన శక్తికేంద్రం విధానసౌధ, ఉన్నత న్యాయస్థానం భవనం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో విరబూసిన గులాబీ రంగు పూలను చూసి జనం మంత్రముగ్ధులవుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి పులకరిస్తున్నారు. ఏడాదికి ఒకసారే ఈ రమణీయ దృశ్యకావ్యం భాగ్యం దక్కుతుంది. వానాకాలం తర్వాత వచ్చే శీతాకాలంలో గులాబీ రంగు పూల చెట్లు ప్రకృతి అందాలను మరింత వన్నెలద్దుతున్నాయి. విదేశీ జాతికి చెందిన ఈ పింక్ ఫ్లవర్ ట్రీస్ కనువిందు చేస్తున్నాయి. ఉన్నత న్యాయస్థానం మెట్లపక్కన ఈ వృక్షాలు కనిపిస్తాయి. విధానసౌధ నుంచి విఠల మల్య రహదారి, శేషాద్రి కూడలి వరకు ఈ వృక్షాలు గులాబీ రంగు పూలను విరబుశాయి. ఈ చెట్ల ఆకులు రాలిపోయి గులాబీ రంగు పువ్వులు మాత్రమే మిగిలాయి. చెట్టు కొమ్మలకు కేవలం పూలే ఉండడంతో చూపరుల్ని ఆకర్షిస్తున్నాయి. ఇక్కడ స్వయంచిత్రాలను దిగేందుకు జనం పోటీ పడుతున్నారు. అరుదైన వృక్ష జాతి కావడంతో ఉద్యానవనాల శాఖ సంరక్షిస్తుంది. ఉద్యానవనంలో ఈ చెట్లు 18 ఉన్నాయి. శీతాకాలం పూర్తయితే గులాబీ రంగు పువ్వులు కనపడవు. వీటిని కాగితం జాతి పూలచెట్లుగా అధికారులు పేర్కొన్నారు. చుట్టూ పచ్చదనం మధ్యలో ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

ప్రకృతి సిద్ధ అందాల్లో సేద తీరుతున్న సందర్శకులు

సర్కారు ఆదేశాలను ప్రశ్నిస్తూ అర్జీ

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : అన్ని సంస్థల్లో పని చేస్తున్న మహిళలకు రుతుచక్రంలో ఉన్నప్పుడు ఒక రోజు సెలవు ఇస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ బెంగళూరు హోటళ్ల సంఘం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కార్మిక శాఖ 2025 నవంబరు 20న వెలువరించిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సంఘం అర్జీ వేసుకుంది. ఇప్పటికే కార్మికులకు ఆరోగ్యం, పని వేళల్లో సురక్షత, వారంలో ఒక రోజు సెలవు, పండగల సమయంలో సెలవులు తదితరాలను ఇస్తుండగా, ఇప్పుడు అదనంగా ఏడాదిలో 12 రోజులు వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం తమకు భారంగా ఉంటుందని సంఘం ప్రతినిధులు తమ అర్జీలో పేర్కొన్నారు. ఇదే వారంలో అర్జీ విచారణకు వస్తుందని సంఘం తరపు న్యాయవాదులు తెలిపారు.

యడియూరప్పకు ఊరట

బెంగళూరు (గ్రామీణం): మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పపై నమోదైన పోక్సో కేసు విచారణపై సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. ఫిర్యాదు చేసిన బాలికకు, దర్యాప్తు చేస్తున్న సీఐడీకి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జైసింగ్ జోయ్ మాల్యల పీఠం తాఖీదులు జారీ చేసింది. తనపై నమోదైన పోక్సో కేసును రద్దు చేయాలని కోరుతూ యడ్డీ వేసుకున్న అర్జీని కర్ణాటక ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. దీన్ని ప్రశ్నిస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. ఆయన తరపున సీనియరు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, 88 ఏళ్ల యడియూరప్పను వేధించే ఉద్దేశంతోనే బాలిక తల్లి ఫిర్యాదు చేసిందని వాదనలు వినిపించారు.

కర్ణాటక పబ్లిక్ పాఠశాలలుగా విస్తరణ

మాన్వి,న్యూస్‌టుడే: నియోజక వర్గంలోని కురుకుందా, చికల్‌పర్వి, తడకల్, మాన్వి నమాజ్‌గిరిగుడ్డ ప్రభుత్వ పాఠశాలల్ని కల్యాణ కర్ణాటక ప్రదేశాభివృద్ధి నిధులతో ఉన్నతీకరించి వాటిని 2025-26 నుంచి కర్ణాటక పబ్లిక్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే హంపయ్యనాయక్ తెలిపారు. క్షేత్ర ప్రజలు, విద్యార్థుల ఆకాంక్ష మేరకు మంత్రి ఎన్.ఎస్.బోసురాజు చొరవ తీసుకుని వీటిని మంజూరు చేయించారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పబ్లిక్ పాఠశాలల తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

అంబేడ్కర్ నిగమ భూములు అక్రమార్కుల పేరిట!

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభురాజ్ కొడ్లి

మాన్వి,న్యూస్‌టుడే: తాలూకాలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ నిగమ భూములు, వక్ఫ్ భూములను అక్రమార్కులకు కట్టబెడుతున్నారని జనశక్తి కేంద్రం, మేజర్ షానవాజ్ సంఘం, దళిత సంఘాల సంచాలకుడు ప్రభురాజ్ కొడ్లి ఆరోపించారు. భూదందాలపై అధికారులకు వ్యతిరేకంగా అనేక పోరాటం చేస్తున్నామన్నారు. పట్టణ సమీపంలోని 120ఎకరాల భూముల్ని మోతుబరులైన వ్యక్తులకు విక్రయించడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సంఘాలు పోరాడాయన్నారు. ఫలితంగా 86ఎకరాల వక్ఫ్ భూమిని రాయచూరు సహాయక అధికారి రద్దుచేయడం పోరాటానికి దక్కిన విజయమన్నారు. ప్రభుత్వ భూములను ఇతరుల పేరుకు మారుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎం.షానవాజ్‌ఖాన్, నుసరత్, జయరాజ్‌కొడ్లి, మైనుద్దీన్, పంపాపతి, శ్యామ్‌సింగ్, కొరవి ఆనంద్, యల్లప్ప చికల్‌పర్వి పాల్గొన్నారు.

రాజకీయ సూప్.. అదిరే!

ఎన్నో ప్రశ్నలు..: ఎవరెన్ని అడిగినా.. మేమిద్దరం ఒక్కటేనంటున్న సిద్ధు, డీకే

ఈనాడు, బెంగళూరు : శాకాహారి అయినా మాంసాహారాన్ని ఇష్టపడే ముఖ్యమంత్రి కోసం ఉపముఖ్యమంత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. 'ముందుగా నేనే అల్పాహారానికి ఆహ్వానించినా సీఎం కోరిక మేరకు గత శనివారం కావేరి నివాసంలో విందుకు హాజరయ్యా. ఈసారి సీఎంను ఆహ్వానించా'నని డీకే మంగళవారం వెల్లడించారు. ఆయన కోరిక మేరకు రామనగర గ్రామాల నుంచి నాటుకోడి తెప్పించి- కూరవండి.. ఇడ్లీతో కలిపి వండించారు. ఈ అల్పాహారాన్ని డీకే సురేశ్, కుణిగల్ ఎమ్మెల్యేల రంగనాథ్‌తో కలిసి స్వీకరించిన సీఎం అనంతరం ప్రత్యేకంగా ప్రత్యేకంగా డీకేతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నా కోరిక మేరకు పల్లె నాటు కోడి కూర చేయించిన డీకే శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో డీకే శివకుమార్ ఎప్పుడు సీఎం అవుతారన్న ప్రశ్నకు అధిష్ఠానం సూచిస్తే అవుతారని సిద్ధు సూటిగా బదులిచ్చారు.

అధికారులూ.. జనానికి ఇబ్బందులు కలిగించొద్దు

తహసీల్దారు, ఈవో, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమైన ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: తాలూకా అంతటా జూదం, విచ్చలవిడిగా అక్రమ మద్యం వ్యాపారాలు..పల్లెల్లో, క్యాంపుల్లో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారు..ఏం చేస్తున్నారు సార్లూ.. మీరూ..! అంటూ తాలూకాలోని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను ప్రశ్నించారు. సమావేశంలో తాహసీల్దారు అరుణ్‌దశాయ్, ఈవో చంద్రశేఖర్, డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్సైలు పాల్గొన్నారు. ఏడాది కాలంగా సాగుతున్న అంబామఠంలోని అంబాదేవి దేవస్థాన భవన నిర్మాణంలో ఎటువంటి ప్రగతి కనిపించడం లేదు అని తహసీల్దారుతో అన్నారు. రూ.2 కోట్ల వరకూ నిధులు అక్రమ మార్గంలో తరలిన ఆరోపణలపై పూర్తి నివేదిక కోరారు.

In the Court of the Ist Addl. District Judge, Anantapuramu.
E.P. No. 359/2021 in A.A. No: 161/2020

Between:
Shriram City Union Finance Limited, D.No. 10-1-136, Kanekal Road, Rayadurg. Rep. By it's Authorized Signatory C.Munisekhar. ...D.Hr

And

K.O.Rudresh and Others. ...J.Drs

Notice to the J.Dr. No:1 and 4

J.Dr1: K.O.Rudresh, S/o H. Obayya, R/at Kerayagalahalli, Thimmappaiahnahalli, Challakera, Chitradurg Dist. Occ: Branch Manager in Vijaya Bank, Chitradurg, Staff Code: 25704

J.Dr4: N.Rama Krishna, S/o N.Venkataiah, R/at, D.No.7-22, Narasingaiah Palli (v), Chellakera (tq), Chitradurg Dist. Occ. Asst. Manager in Vijaya Bank, Chitradurg. Staff Code: 37699

పై నెంబరు కేసులో J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 12-12-2025వ తేది ఉదయం 10-30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గాని లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

J.L.నరసింహులు,
D.Hr. వకీలు, అనంతపురము.

జార్జిపై కేసు కొట్టివేత

బెంగళూరు (రామమూర్తినగర): విద్యుత్తు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఇంధన శాఖ మంత్రి కేజే జార్జిపై నమోదైన కేసును ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. భాజపా నాయకులు సీఎన్ అశ్వత్థ నారాయణ, ఎస్ఆర్ విశ్వనాథ్, ధీరజ్ మునిరాజు దాఖలు చేసిన ప్రైవేటు కేసును రద్దు చేయాలని కోరుతూ వేసుకున్న అర్జీని జస్టిస్ ఎంఐ అరుణ్ విచారణకు చేపట్టారు.

మళఖేడ.. చరిత్రకు చెదలు

కాలగర్భంలో కట్టడాలు

ఒక మార్గం నుంచి వెళితే.. కనిపించే నిర్మాణాలు

కోటగోడల మధ్య బాటలో నుంచి కనిపిస్తున్న ఇళ్లు

కల్యాణ కర్ణాటకపై తరచుగా ప్రకటనలు గుప్పించే ఏలికల నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది మళఖేడ కోట. చారిత్రక, పర్యాటకాభివృద్ధికి పెట్టని కోటలాంటి ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి ఆమడదూరంలో వదిలేసిన పాలకుల తీరు తీవ్ర విమర్శలనే మూటగట్టుకుంటోంది.

కలబురగి, న్యూస్‌టుడే : సేడం తాలూకా భీమా నదీ తీరంలోని మళఖేడ కోటను పర్యాటక శాఖ గాలికి వదిలేసింది. ఆ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని రాష్ట్రకూటులు 8 నుంచి 10వ శతాబ్దం వరకు పాలన కొనసాగించాక.. బాదామి చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు పాలించిన గడ్డ దుమ్ముకొట్టుకుపోయింది. నేటి మళఖేడ.. అప్పటి మాన్యఖేతగా ప్రసిద్ధి. కావేరి నుంచి గోదావరి నది మధ్య ప్రాంతంలో రాష్ట్రకూటుల సామ్రాజ్యం విస్తరించింది. మళఖేడలో వారు నిర్మించుకున్న కోట నుంచి సుమారు 200 ఏళ్ల పాటు ప్రజలను పాలించారు. ఈ కోటలోని ప్రధాన నిర్మాణాలు శిథిలమైనా. . లోపలి, బయట వరుసల గోడలు, కొన్ని నిర్మాణాలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కోట మధ్య భాగానికి చేరుకునేందుకు నాలుగు వరుసల గోడలు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలకు 52 బురుజులు ఠీవిగా నిలిచినా.. వాటికి పట్టిన దుమ్ము ఏలికల నిర్లక్ష్యానికి దర్పణం పడుతోంది. కొన్ని ప్రాకారాలు, బురుజుల నుంచి కొండ రాళ్లను స్థానికులు తరలించుకు వెళ్లి తమ ఇళ్ల పునాదుల నిర్మాణానికి వాడుకున్నారు. రాష్ట్రకూటుల అనంతరం ఈ కోట ఇతర పాలకుల చేతికి వెళ్లింది. మొఘల్ పాలకుల కాలంలో కోటలోపల మసీదును నిర్మించుకున్నారు. ప్రభుత్వం, పురావస్తు శాఖ ఈ కోటను తమ ఆధీనంలోకి తీసుకుని మరమ్మతు చేసి, పర్యాటక, అధ్యయన కేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులు, చరిత్రకారులు చేసుకుంటున్న విన్నపాలు బుట్టదాఖలు అవుతున్నాయి.

బురుజు పైకి వెళ్లే మెట్ల మార్గం వద్ద వ్యర్థాలు

కల్తీ ఔషధాల విక్రయం.. నదులు కాలుష్యం

శాసనసభలో మంత్రుల వెల్లడి

సభలో మాట్లాడుతున్న మంత్రి మహాలింగ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మార్కెట్లలో కల్తీ మందుల విక్రయాలు జరుగుతున్నాయని, నాణ్యత లేనివీ అమ్ముతున్నారని ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ మంగళవారం శాసనసభలో వివరించారు. ఉదయం అసెంబ్లీ కొలువుదీరిన తర్వాత సభాపతి సురమాపాఢి ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టారు. తొలుత సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి మహాలింగ సమాధానమిచ్చారు. 2021-24 (నాలుగేళ్లలో) రాష్ట్రంలో 168 రకాల కల్తీ మందులు, 388 రకాల నాణ్యత లేని మందులు డ్రగ్ కంట్రోలర్, ఇతర అధికారులు గుర్తించినట్లు చెప్పారు. రూ.2.5 కోట్ల విలువ చేసే మందులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిఘా పెంచామని, తరచూ తనిఖీలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు.

మాట్లాడుతున్న మంత్రి నాయక్

తమిళ గుత్తేదార్లు జాప్యం చేస్తున్నారు

2017లో నాటి బిజద ప్రభుత్వం రూ.25 వేల కోట్ల వ్యయంతో 17 మెగా మంచినీటి సరఫరా ప్రాజెక్టుల పనులు తమిళ గుత్తేదారుల (కాంట్రాక్టర్లు)కు అప్పగించిందని, ఇంతవరకు నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని పంచాయతీరాజ్, మంచినీటి సరఫరా శాఖల మంత్రి రబినారాయణ నాయక్ శాసనసభలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 80 శాతం నిధులు తీసుకున్న గుత్తేదారులు పనులు పూర్తిచేయలేదన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న సభ్యుల సూచనలతో ఏకీభవిస్తున్నామని, త్వరలో సమీక్షించి చర్యలకు శ్రీకారం చుడతామన్నారు.

రహదారుల్లేని గ్రామాలు 5,008

25 ఏళ్లుగా రాష్ట్రాన్ని పాలించిన బిజద ప్రభుత్వం 5,008 మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మాణం చేయలేకపోయిందని, గత పాలకుల దయనీయతకు ఇది నిదర్శనమని, తమ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి నాయక్ తెలిపారు.

5,609 వన్యప్రాణుల మృతి

అటవీ, పర్యావరణ శాఖల మంత్రి గణేశ్‌రామ్‌సింగ్ ఖుంటియా సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ గత పదేళ్లలో 5,609 వన్యప్రాణులు మృతి చెందాయని, మూగప్రాణుల దాడుల్లో 1,396 మంది ప్రజలు హతమయ్యారని తెలిపారు. నష్టపరిహారం కింద రూ.6,174.68 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. వన్యప్రాణుల భద్రతకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వివరాలు తెలియజేస్తున్న మంత్రి గణేశ్‌రామ్

37 లక్షల తాటిచెట్లు

పిడుగుపాట్లు ఎంతోమందిని పొట్టన పెట్టుకుంటున్న నేపథ్యంలో అన్నిచోట్లా తాటి మొక్కలు నాటిస్తున్నామని, గత రెండేళ్లలో 37 లక్షలు నాటించినట్లు మంత్రి ఖుంటియా తెలిపారు. పిడుగుపాట్లకు ఇవి రక్షణ కవచంగా నిలుస్తాయని నిపుణులు సూచిస్తున్నారన్నారు. 2025-26 బడ్జెట్‌లో తాటి మొక్కలు నాటడానికి రూ.5.94 కోట్లు కేటాయింపులు జరిగాయన్నారు.

16 చోట్ల కాలుష్యం

రాష్ట్రంలోని 16 ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రవహిస్తున్న నదులు కాలుష్యానికి గురయ్యాయని, మురుగునీరు, వ్యర్థాలు ఆయాచోట్ల నదుల్లో కలుస్తున్నందున కాలుష్యానికి గురయ్యాయని, దీనిపై చర్యలకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి ఖుంటియా తెలిపారు.

46 గ్రామాలకు కోత

తీర ప్రాంతాల్లోని 46 గ్రామాలు సముద్ర అలల కోతకు గురవుతున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖుంటియా చెప్పారు. తీర గ్రామాల పరిధుల్లో విస్తారంగా సరుగుడు తోటలు పెంచుతున్నామని, కెరటాల్లో ఇళ్లు పూర్తిగా శిథిలమైన గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పిస్తున్నామన్నారు.

కటక్‌లో శిథిల భవనాలు తొలగిస్తాం

కటక్ నగర్‌లో ప్రమాదం అంచుల్లో ఉన్న శిథిల భవనాల తొలగింపు తథ్యమని, దీనిపై సర్వే ప్రారంభమైందని పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖల మంత్రి కృష్ణచంద్ర మహాపాత్ర్ అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జీర్ణావస్థలో ఉన్న అన్ని నిర్మాణాలూ తొలగిస్తామన్నారు.

10 వేల పోస్టులు ఖాళీ

రాష్ట్రంలోని 32 కార్పొరేషన్లలో 10 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దశలవారీగా నియామకాలు జరుగుతాయని మంత్రి మహాపాత్ర్ తెలిపారు.

'అన్వేష' కొనసాగిస్తాం

రాష్ట్రంలోని 11 ఆదివాసీ జిల్లాల్లో అన్వేష పథకం కింద ప్రారంభించిన 123 విద్యాలయాల్లో 20 వేల మంది బాలబాలికలు చదువుతున్నట్లు విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండొ చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం అన్వేష పథకానికి సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చ జరిగింది. చిత్తశుద్ధి లేని ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేయాలన్న ఉద్దేశంతో ఉందని విపక్ష సభ్యులన్నారు. సమాధానమిచ్చిన మంత్రి 2025-26లో ఈ పథకం కింద బడ్జెట్‌లో రూ.158.8 కోట్లు కేటాయింపు జరిగినట్లు చెప్పారు. దీన్ని రద్దు చేయకుండా, మరో అయిదేళ్లు కొనసాగించాలన్న ధ్యేయంతో ఉన్నామని, బాలబాలికల విద్యాప్రమాణాలకు ఢోకా ఉండదని నిత్యానంద చెప్పారు.

నష్టాల్లో 41 ఎకో టూరిజం ప్రాజెక్టులు

రాష్ట్రంలోని 51 డివిజన్‌లలో ప్రారంభించిన ఎకో టూరిజం ప్రాజెక్టుల్లో 10 మాత్రమే లాభాలు పొందుతుండగా, 41 ప్రాజెక్టులు నష్టాల్లో ఉన్నాయని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి గణేశ్‌రామ్‌సింగ్ ఖుంటియా సభలో చెప్పారు.

టాటా పవర్ నుంచి సొమ్ము వసూలు చేయండి

రాష్ట్రంలో విద్యుత్తు నిర్వహణ, సరఫరా బాధ్యతలు చేపట్టిన టాటాపవర్ సంస్థ వినియోగదారుల నుంచి అడ్డగోలుగా సొమ్ము పిండుకుందని రూ.7,145 కోట్లు గుంజిందని అసెంబ్లీ శూన్యగంటలో బిజద ఎమ్మెల్యే గణేశ్వరబెహర పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని వసూలు చేయాలని డిమాండ్ చేశారు.

మీ ఆట ప్రశంసనీయం... రాష్ట్రానికి గర్వకారణం

టీ 20 అంధ మహిళా క్రికెటర్లకు సీఎం మాఝి అభినందన

ముఖ్యమంత్రి మోహన్ మాఝితో రాష్ట్ర అంధ మహిళా క్రికెటర్లు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: శ్రీలంకలోని కొలంబోలో జరిగిన మొదటి అంధ మహిళల టీ-20 ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ జట్టులో ఒడిశాకు చెందిన నలుగురు క్రీడాకారిణులు ఉత్తమ ఆట ప్రదర్శించారు. సోమవారం రాష్ట్రానికి చేరుకున్న వీరిని ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా శాఖ తరఫున ఘనస్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి మోహనచరణ్ మాఝి తన నివాసభవనంలో క్రీడాకారిణులు ఫుల్లో సొరెన్, పార్వతి మరాండి, జమునా రాణి టుడు, బాసంతి హంసదాలకు పుష్పగుచ్ఛాలందజేసి శాలువలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి ఆట ప్రశంసనీయమని దేశ, రాష్ట్ర గౌరవం పెంచారని ప్రశంసించారు. ఒక్కొక్క క్రీడాకారిణికి రూ.11 లక్షల నగదు చొప్పున పారితోషికాన్ని చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో క్రీడలశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, ఆ శాఖ కార్యదర్శి సచిన్ యాదవ్, సంచాలకుడు విజయ్ ఎద్దుల, ఒడిశా అంధుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు మహ్మద్ జాఫర్, కోచ్ దేబాశిష్ జెనా పాల్గొన్నారు.

గవర్నరుతో రెవెన్యూశాఖ మంత్రి భేటీ

రెవెన్యూ, విపత్తు నివారణల శాఖ మంత్రి సురేష్‌పూజారి సతీసమేతంగా మంగళవారం భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌కు వచ్చారు. గవర్నరు కంభంపాటి హరిబాబు దంపతులను మర్యాదపూర్వకంగా కలుసుకొని కొద్దిసేపు ముచ్చటించారు. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

హరిబాబు దంపతులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేష్ పూజారి దంపతులు

వేల ఏళ్ల చరిత్రకు సాక్ష్యం కళింగ

కోణార్క్ ఉత్సవాల్లో సీఎం మోహన్

మహిళల ఉత్పత్తులు తిలకిస్తున్న మోహన్

గోపాలపూర్, న్యూస్‌టుడే: భగవత్ ప్రాప్తికి సాధనాలు శాస్త్రీయ నృత్యాలని, పవిత్ర భారతదేశంలో కళామతల్లికివి నీరాజనాలు పడుతున్నాయని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. సోమవారం రాత్రి పూరీ జిల్లాలోని చంద్రభాగ తీరానికి చేరువలో 'కోణార్క్ నృత్యోత్సవాలు-2025' సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల సంవత్సరాల చరిత్రకు సాక్ష్యం పట్టే కళింగ రాష్ట్రంలో జగన్నాథ సంస్కృతికి నీరాజనాలర్పించే గొట్టిపువా, ఒడిస్సీ నాట్యాలు విశ్వవ్యాప్తంగా మన్ననలందుకుంటున్నాయన్నారు. శిల్ప కళారామం కోణార్క్ సూర్యనారాయణమూర్తి ఆలయ ప్రాంగణంలో అయిదు రోజుల నృత్యోత్సవాలు సందర్శకులను అలరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీఎం భార్య ప్రియాంక మరాండి, ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ, జగత్సింగ్‌పూర్ ఎంపీ బిభుప్రసాద్ తరై, ఎమ్మెల్యేలు అశ్రిత్ పట్నాయక్ (పిపిలి), ఓంప్రకాష్ మిశ్ర (సత్యబాది), ఉపాసనా మహాపాత్ర్ (బ్రహ్మగిరి), తుషార్‌కాంతి బెహర (కాకట్‌పూర్), సునీల్‌మహంతి (పూరీ), పూరీ పాలనాధికారి దివ్యజ్యోతి పరిడ, పర్యాటక శాఖ సంచాలకులు దీపంకర్ మహాపాత్ర్, ఎస్పీ ప్రతీక్‌సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

సందేశాత్మక సైకత శిల్పం

సందర్శకుల ఆనందహేళ

అనంతరం జరిగిన శాస్త్రీయ నృత్యాలు సందర్శకులను అలరించాయి. గురు సోనాలి మహాపాత్ర్ బృందం 'నృత్య ఉపాసన' ఒడిస్సీ నృత్యం, జగన్నాథుని మంగళాచరణ, హైదరాబాద్ గురు డాక్టర్ ఆనంద్ శంకర్ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం సమ్మోహనం చేసింది.

సైకత శిల్ప ప్రదర్శన

నృత్యోత్సవాల్లో భాగంగా చంద్రభాగ తీరంలో రాత్రి సీఎం సైకత శిల్ప ప్రదర్శననూ ప్రారంభించారు. 14 మంది కళాకారులు సందేశాత్మక శిల్పాలు జనజాగృతి ధ్యేయంగా తమ నైపుణ్యత చాటుకున్నారు. వీరిలో అయిదుగురు విదేశీయులున్నారు.

ఒర్మాస్ స్టాళ్లు

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని ఒర్మాస్ ప్రదర్శనా స్టాళ్లు ఈ వేడుకల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్వయం సహాయ సంఘాల(ఎస్‌హెచ్‌జీ) మహిళల ఉత్పత్తులూ ప్రదర్శితమవుతున్నాయి. ఇవి సందర్శించిన మోహన్, తదితర ప్రముఖులు తమకు అవసరమైన గృహోపకరణాలు కొనుగోలు చేశారు. ఈ నెల 5 రాత్రి వరకు కోణార్క్ ఉత్సవాలు జరుగుతాయి.

శాస్త్రీయ నృత్యాల అలరింత

సభాపతి మౌనం

సురమాపాఢి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభ శూన్యగంట (జీరో అవర్)లో మంగళవారం సభాపతి సురమాపాఢి విపక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు తాను మాట్లాడకుండా కఠినంగా వ్యవహరించారు. అధికార పక్షం సభ్యులు మాట్లాడేందుకు సభాపతి ఎక్కువ సమయం కేటాయిస్తూ, తమను కళ్లెం వేస్తున్నారని, ఇది పక్షపాతమని విపక్ష సభ్యులు ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన సురమాపాఢి తాను అందరికీ సమాన న్యాయం చేస్తున్నానని సంజ్ఞల ద్వారా చెప్పారు. కొద్దిసేపు మౌనంగా ఉండిపోయారు.

మహిళా పోలీసులకూ తప్పని వేధింపులు

మూడేళ్లలో 18 కేసులు నమోదు

మోహన్‌చరణ్ మాఝి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మహిళా పోలీసులకూ వేధింపులు ఎదురవడం శాంతిభద్రతలను ప్రశ్నార్థకంగా మిగులుస్తోంది. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో మహిళా పోలీసు సిబ్బందిపై వేధింపులకు సంబంధించి 18 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. శాసనసభ సమావేశాల్లో బిజద ఎమ్మెల్యే ప్రతాప్ కేసరిదేవ్ అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. 2023 నుంచి 2025 సెప్టెంబరు మధ్య ఈ కేసులు నమోదయ్యాయి. రాయగడ, బొలంగీర్, సుందర్‌గఢ్, రవుర్కెలా, కేంఝర్, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, కటక్, బౌద్ధ్, భువనేశ్వర్, బాలేశ్వర్‌లోని పోలీసుస్టేషన్‌లు, కార్యాలయాల పరిధిలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటికి సంబంధించి నిందితులపై కఠిన చర్యలు తీసుకున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

ఐదేళ్లలో 25 మెగా తాగునీటి ప్రాజెక్టులు పూర్తి

రబినారాయణ్ నాయక్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో 25 మెగా కుళాయి నీటి సరఫరా ప్రాజెక్టులు పూర్తి చేసినట్లు పంచాయతీరాజ్, తాగునీటి శాఖ మంత్రి రబినారాయణ్ నాయక్ తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యే అరవింద్ మహాపాత్ర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత నివాసాలకు సురక్షిత తాగునీటి సరఫరా కోసం 207 మెగా తాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించినట్లు మంత్రి గుర్తు చేశారు. వీటిలో చాలావరకు వివిధ కారణాల వల్ల పూర్తికాలేదని ఆయన అంగీకరించారు. స్థల సేకరణ సమస్య, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం, చట్టబద్ధమైన ఆమోదాల్లో జాప్యం వంటి కారణాలు వీటి పూర్తికి ఆటంకాలుగా నిలిచినట్లు నాయక్ స్పష్టం చేశారు. తాగునీటి ప్రాజెక్టులకు రూ.35,193.24 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.17,502.12 కోట్ల మేర నిధులు ఖర్చయినట్లు రబినారాయణ్ వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14 ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కార్యాచరణ

గణేష్ రామ్‌సింగ్ ఖుంటియా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సర్కారు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని కార్మికశాఖ మంత్రి గణేష్ రామ్‌సింగ్ ఖుంటియా పేర్కొన్నారు. శాసనసభలో ఎమ్మెల్యే టొంకాధర్ త్రిపాఠి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. ఇందుకోసం క్రమం తప్పకుండా తనిఖీలు, రెస్క్యూ, ఆపరేషన్‌లు, అవగాహన కార్యక్రమాలు, అధికారులకు ప్రత్యేక శిక్షణ వంటి వాటిని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం తొమ్మిది శాఖలను సమన్వయం చేస్తున్నట్లు మంత్రి ఖుంటియా స్పష్టం చేశారు. 1997లో ఆఖరిసారిగా బాల కార్మికుల సర్వే జరిగినట్లు పేర్కొన్న ఆయన, మొత్తం 2,15,222 మంది బాల కార్మికులను గుర్తించినట్లు వెల్లడించారు. బాలకార్మిక నిషేధం, నియంత్రణ చట్టం, 1986 ప్రకారం జిల్లా స్థాయిలో బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించాలని ఖుంటియా గుర్తు చేశారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యాన్ని అందిపుచ్చుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాధారమణునికి 875 రకాల వంటకాలు అర్పణ

గౌరవిహార్ ఆశ్రమంలో నైవేద్యమైన వ్యంజన

గోపాలపూర్, న్యూస్‌టుడే: మార్గశిర మాసం మంగళవారం శుక్లపక్షమి ద్వాదశి తిథి అత్యంత పవిత్రమైనదని, పూరీలోని మఠాలు, ఆశ్రమాల్లో రాధా రమణుల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి వంటకాల నైవేద్యం అర్పించారు. దీన్ని వ్యంజన ద్వాదశిగా చెబుతారు. పూరీలోని గౌరవిహార్ ఆశ్రమంలో గోపాల చూడామణికి తులసి అర్చన జరిగింది. 875 రకాల వంటకాలు (వ్యంజనాలు) నైవేద్యం చేసి భక్తులకు వితరణ చేశారు. సోమవారం నుంచి ఇక్కడ పాకశాలలో వంటకాల తయారీ ప్రారంభం కాగా, మంగళవారం 12 గంటలకు ముగిసింది. ఏడాదికోసారి మార్గశిరంలోని ద్వాదశినాడు స్వామికి వ్యంజనాల అర్పణ జరుగుతుంది.

పాఠశాలలు మూత.. అంధకారంలో బాలల భవిత

అవిభక్త కొరాపుట్‌లో మూతపడిన 686 పాఠశాలలు

రాయగడ జిల్లాలో మూతపడిన ఓ పాఠశాల

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న అవిభక్త కొరాపుట్‌లో వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడటం విద్యార్థుల భవితకు శాపంగా మారుతోంది. అందుబాటులో ఉన్న వాటిని మూసివేయడం లేదా వేరే పాఠశాలల్లో విలీనం చేయడం చిన్నారుల చదువులపై ప్రభావం చూపుతోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా సోమవారం కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఇచ్చిన సమాధానంతో ఈ విషయాలు వెలుగుచూశాయి. అవిభక్త కొరాపుట్‌లో ఉన్న రాయగడ, కొరాపుట్, మల్కాన్‌గిరి, నవరంగపూర్ జిల్లాల్లో 686 పాఠశాలలను రాష్ట్ర సర్కారు మూసివేసింది. దీంతో మొత్తం 8,854 మంది విద్యార్థులపై ప్రభావం చూపగా, వీరిలో ఎస్సీ, ఎస్టీ చిన్నారులు ఉన్నారు. ఆదివాసీ జనాభా అధికంగా ఉన్న దశమంత్‌పూర్(కొరాపుట్) సమితిలో 46 స్కూళ్లు, లమతాపుట్‌లో 35, నందపూర్‌లో 22, కలిమెల(మల్కాన్‌గిరి)లో 27, ఝోరిగావ్(నవరంగపూర్)లో 20, మునిగుడ(రాయగడ)లో మూతపడ్డ 13 పాఠశాలలు తీవ్ర ప్రభావం చూపాయి.

రాయగడ జిల్లాలో సమితుల వారీగా మూతబడ్డ లేదా విలీనం చేసిన పాఠశాలల వివరాలిలా..

సమితి	పాఠశాలలు
బిసంకటక్	5
చంద్రపూర్	9
గుడారి	12
గుడారి ఎన్ఏసీ	1
గుణుపురం	4
గుణుపురం ఎన్ఏసీ	2
కె.సింగ్‌పూర్	15
కాశీపూర్	11
కొల్నార	13
మునిగుడ	13
పద్మపూర్	4
రామన్నగుడ	16
రాయగడ	16

పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి

రాయగడలో 121 పాఠశాలలు

విద్యా మంత్రిత్వశాఖ పేర్కొన్న వివరాలను ఎంపీ ఉలక మీడియాకు వెల్లడిస్తూ మూతపడిన మొత్తం పాఠశాలల్లో రాయగడ జిల్లా నుంచి 121 ఉన్నాయన్నారు. కొరాపుట్‌లో అధికంగా 346 పాఠశాలలు మూతపడగా, నవరంగపూర్-134, మల్కాన్‌గిరి 85 పాఠశాలలకు శాశ్వతంగా తాళాలు పడ్డాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల విషయానికొస్తే కొరాపుట్ జిల్లాలో మొత్తం 2,80,489 మంది ఉన్నారు. వీరిలో 6 ఏళ్లలోపు 11,724 మంది ఉండగా, 6 నుంచి 10 ఏళ్ల లోపు 1,30,855 మంది ఉండగా, మిగతా విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ప్రవేశాలు పొందారు. రాయగడ జిల్లాలో 1,91,121 మంది ప్రవేశాలు పొందగా, 6 ఏళ్లలోపు 9920 మంది, 6 నుంచి 10 ఏళ్లలోపు 90,386 మంది విద్యార్థులు ఉన్నారు.

ఆటో బోల్తా: 10 మంది చిన్నారులకు గాయాలు

గాయపడ్డ బాలికకు చికిత్స

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని కొయిరాసి కూడలి వద్ద మంగళవారం కృష్ణసార జింక (బ్లాక్‌బక్)ను ఢీకొని ఓ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో చోదకుడికి, అందులో ఉన్న పది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుల్ని కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. వీరిలో తీవ్ర గాయాలైన ఆటో చోదకుడ్ని మెరుగైన చికిత్సకు స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. మాణిక్‌పూర్ గ్రామానికి చెందిన పదహారు మంది విద్యార్థులు (అత్యధికులు రెండు, మూడు తరగతులు చదువుతున్నవారు) కొయిరాసిలోని ఓ ప్రైవేటు పాఠశాలకు ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొయిరాసి కూడలిలో హఠాత్తుగా కృష్ణసార రహదారిపైకి రావడంతో ఆటో దాన్ని ఢీకొని అదుపు తప్పి రహదారి పక్కకు బోల్తా పడింది. ఆటో ఢీకొని గాయపడ్డ జింకను అటవీ శాఖ సిబ్బంది చికిత్సకు పశు వైద్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కళ్లికోట ఆరోగ్య కేంద్రం, ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో ఢీకొని గాయపడ్డ కృష్ణసార జింక

హరిహర స్వరూపాయనమః

బ్రహ్మపురలో మార్తాపేటలోని శతాబ్దాల పురాతన శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి మందిరంలో ఏకాదశి సందర్భంగా సోమవారం రాత్రి స్వామిని 'హరిహర స్వరూపం' అవతారంతో అలంకరించి, ప్రత్యేక హారతులిచ్చారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఎమ్మెల్యే అనిల్‌కు ఏసీఏ ఆహ్వానం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఆంధ్రా సంస్కృతి సమితి (ఏసీఏ) ప్రతినిధులు గన్నవరపు ఆనందరావు, రాయప్రోలు సత్యసాయి తదితర ప్రతినిధులు మంగళవారం బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్‌ను భువనేశ్వర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏసీఏ కార్యాలయాన్ని సందర్శించి తెలుగు ప్రతినిధుల్ని కలుసుకోవాలని ఆయనను ఆహ్వానించారు. త్వరలో వస్తానని ఎమ్మెల్యే వారికి చెప్పారు.

ఎమ్మెల్యే అనిల్‌కు సత్కరిస్తున్న ఏసీఏ ప్రతినిధులు

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కన ఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ.7500/- విలువ చేయు పరీక్షలు కేవలం 3500/-కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా|| జి. శివప్రసాద్ రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255, 9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే | ప్రతి ఆదివారం శెలవు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
THE EENADU WAY CLASSIFIEDS
ఈనాడు క్లాసిఫైడ్స్
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

వన్యప్రాణుల సంరక్షణపై సైకత శిల్పం

కోణార్క్ చంద్రభాగ తీరంలో సోమవారం నుంచి అంతర్జాతీయ సైకత మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో బ్రహ్మపురకు చెందిన కళాకారుడు సత్యనారాయణ మహరణా పాల్గొని, అందమైన శిల్పాలు తీర్చిదిద్దుతున్నారు. రెండోరోజు మంగళవారం 'వన్యప్రాణుల సంరక్షణ'పై మహరణా శిల్పాన్ని తీర్చిదిద్దారు. ఇందులో గంజాం జిల్లా ఖ్యాతి 'కృష్ణసార జింక' (బ్లాక్ బక్), బితరకనికా అభయారణ్యంలోని మొసళ్లు, ఇతర వన్య ప్రాణుల ఆకృతుల్ని రూపొందించారు. అంతా విరివిగా మొక్కలు నాటాలని మహరణా కోరారు. –న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

లోమా స్వయిన్‌కు క్రీడాశాఖ కార్యదర్శి అభినందనలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: టోక్యోలో జరిగిన డెఫ్ ఒలింపిక్స్ కరాటే పోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి లోమా స్వయిన్ కాంస్య పతకం గెలుచుకున్న సంగతి తెలిసిందే. సోమవారం రాష్ట్రానికి చేరుకున్న ఆమెకు భువనేశ్వర్‌లోని విమానాశ్రయంలో క్రీడాశాఖ అధికారులు, ఉత్కళ కరాటే స్కూల్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో క్రీడాశాఖ కార్యదర్శి సచిన్ యాదవ్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పోటీల్లో 50 కిలోల కేటగిరీలో కుమితె అంశంలో పోటీపడిన లోమా తృతీయస్థానంలో నిలిచి పతకం కైవసం చేసుకుంది.

లోమా స్వయిన్‌ను పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచిన్ యాదవ్

విద్యా రుణం మంజూరు చేయాలంటూ వినతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: మంజూరైన రుణం బ్యాంకు రద్దు చేయడంతో తనను ఆదుకోవాలని ఓ విద్యార్థిని మంగళవారం నవరంగపూర్ పాలనాధికారి డా. మహేశ్వర్ స్వయిను ఆశ్రయించింది. వివరాల్లోకెళ్తే... టెంటులిఖుంటి సమితి కమత గ్రామానికి చెందిన పవిత్ర నాగ్ కుమార్తె సునేమియా ఇటీవల ప్లస్2 పాసయ్యింది. ఆమె మహారాష్ట్రలో ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ ఇన్ నర్సింగ్ కోర్సు చదివేందుకు సిద్ధమై రూ.19 వేలు ఫీజు కట్టి కళాశాలలో చేరింది. మిగిలిన ఫీజు రూ.3.66 లక్షలు కోసం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రుణం కోసం దరఖాస్తు చేయగా, బ్యాంకు మంజూరు చేసింది. కొద్ది రోజులకే రుణం రద్దు చేసిందని, దీనిపై చర్యలు తీసుకొని, ఆమెకు సాయపడాలని కలెక్టర్‌ను కోరింది.

కలెక్టర్ కార్యాలయం వద్ద తండ్రితో సునేమియా

అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని విచారణ

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితి లంకాపుట్ వసతి గృహం నుంచి సోమవారం ఉదయం ఏ విధమైన సమాచారం లేకుండా 20 మంది విద్యార్థులు బయటకు వెళ్లిపోవడం అంతటా చర్చనీయాంశమైంది. వీరు సురక్షితంగా తిరిగి వచ్చినా, ఆ పరిస్థితులకు దారితీసిన అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సమితి అధికారి దేవాసిస్ గౌడ అధ్యక్షతన విచారణ జరుపుతున్నారు. విచారణ అధికారి వసతి గృహం చేరుకుని అక్కడ విద్యార్థులను, సిబ్బందిని ప్రశ్నించి పలు వివరాలు సేకరించారు. విద్యార్థులు ఎటువంటి సమస్యలతో వెళ్లలేదని, ఆ సమయంలో వసతి గృహంలో ఎవరు లేకపోవడంతో సరదాగా బయటకు వెళ్లినట్లు అభిప్రాయపడ్డారు. పూర్తి విచారణ జరిపి నివేదిక అందజేస్తామన్నారు.

లంకాపుట్ వసతిగృహం వద్ద సమితి అధికారి దేవాసిస్‌గౌడ్

వైభవంగా వెంకన్న పూజలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: హుగ్లీ జిల్లా బన్స్ బేరియా గ్రామంలో తెలుగు వారు శ్రీ బాలాజీ పూజా అసోసియేషన్‌గా ఏర్పడి 2013 నుంచి తెలుగువారి ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామి పూజలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 27న వెంకన్న పూజలు ప్రారంభించి ఐదు రోజులు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ఊరేగింపు, కల్యాణోత్సవం, దీపోత్సవం, ఇతర కార్యక్రమాలు చేశారు.

గీతాపారాయణంలో మహిళలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఆంధ్రా సంస్కృతి సమితి(ఏసీఏ) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు సామూహిక భగవద్గీత పారాయణ, ప్రవచనాది కార్యక్రమాలు జరిగాయి. ఏసీఏ కార్యదర్శి రాయిప్రోలు సత్యసాయి దీపం వెలిగించిన తర్వాత 18 గీతా అధ్యాయాల పారాయణం చేశారు.

భగవద్గీత పారాయణంలో మహిళలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కళ్యాణ సింగుపూర్ ఇందిర కూడలిలో గాయత్రి మందిర ప్రారంభోత్సవం జరుగుతోంది. ఈ సందర్భంగా భక్తులు 108 కలశాలతో నాగావళి, కల్యాణి నదుల పవిత్ర జలంతో కలశయాత్ర జరిపారు. మంగళవారం మందిరంలో గాయత్రి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కలశ యాత్ర చేస్తున్న భక్తులు

కేంద్ర మంత్రికి ధన్యవాదాలు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చొ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గడచిన జులై నెలలో కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. కొరాపుట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలు నిర్మించాలని వినతిపత్రంలో కోరగా, స్పందించిన కేంద్రమంత్రి ఆ దిశగా ఆదేశాలు జారీ చేయడంతో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చొ కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

4న ఉచిత వైద్య శిబిరం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ మలంచా ప్రాంతంలో ఉన్న ఆర్కే డెంటల్, ఐ కేర్ క్లినిక్‌లో 4వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఇందులో దంత, నేత్ర, న్యూరో ఉచిత వైద్య పరీక్షలు జరుగుతాయి. దీనిని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భువనేశ్వర్‌లో జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ

బ్రహ్మపు క్రీడలు, న్యూస్‌టుడే: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఒడిశా బ్యాడ్మింటన్ సంఘం, రాష్ట్ర క్రీడా శాఖల సంయుక్తాధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 37వ జాతీయ సబ్‌జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నీ సోమవారం ప్రారంభమైంది. భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని డీబీసీ బ్యాడ్మింటన్ హెచ్‌పీసీ కేంద్రంలో ఏర్పాటైన దీన్ని రాష్ట్ర క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు ఒడిశా వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహిస్తున్న పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అండర్-15, 17 కేటగిరీల బాలబాలికలు పోటీపడుతున్నారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు సచిన్ యాదవ్, సంచాలకుడు విజయ్ ఎద్దుల, ద్రోణాచార్య పురస్కార గ్రహీత, కోచ్ గంగూలీ ప్రసాద్ పాల్గొన్నారు.

రిబ్బను కత్తిరించి పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి సూర్యవంశీ. చిత్రంలో క్రీడాశాఖ అధికారులు

గురుస్వామి కృష్ణకు సన్మానం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో అయ్యప్ప దీక్షాధారుల సన్నిధానంలో గురుస్వామి కృష్ణకు మాలధారులతో పాటు గురు స్వాములు ఘనంగా సన్మానించారు. కృష్ణ గురు స్వామి గత 35 ఏళ్లుగా మాల ధరించి అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న కారణంగా ఈ సన్మానం చేసినట్లు స్వాములు తెలిపారు.

కృష్ణ గురుస్వామికి సన్మానం చేసిన మాలధారులు

కంబళ్ల పంపిణీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా గొళంత్రా రోడ్డు సమీపాన రురాపల్లి గ్రామంలో బ్రహ్మపురకు చెందిన జయ జగన్నాథ మార్నింగ్ వాకర్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం ప్రజలకు కంబళ్లు పంచిపెట్టారు. క్లబ్ ప్రతినిధులు కామనా పాడి, నాగేశ్వర పృష్టి, సమీర్ కుమార్ నాయక్, లడు కిశోర్ పాత్ర్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి పంచిపెట్టారు.

కంబళి అందజేస్తూ...

పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

కొనసాగుతున్న ఆందోళన

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో ఒడిశా ఆదర్శ విద్యాలయ ఉపాధ్యాయుల సంఘం తరపున జరుగుతున్న ఆందోళన మంగళవారం నాటికి 6వ రోజుకు చేరుకుంది. తమ 13 డిమాండ్లు పరిష్కరించకుంటే డిసెంబరు 8న ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

విధుల్లో చేరిన బిద్యుల్లత

రాయగడ, న్యూస్‌టుడే: హైకోర్టు ఆదేశాలతో రాయగడ జిల్లా బాలల సంక్షేమ కేంద్రం అధ్యక్షురాలిగా బిద్యుల్లత హుహిక మంగళవారం విధుల్లో చేరారు. గత కలెక్టర్ పరుల్ పట్వారి ఆమెను విధుల నుంచి తొలగించడంతో బిద్యుల్లత హైకోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాలు విన్న కోర్టు తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

బిద్యుల్లత హుహిక

రాష్ట్ర ఖోఖో ఛాంపియన్ పూరీ

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో పూరీలో జరిగిన 13వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో పూరీ క్రీడల వసతిగృహం ఛాంపియన్‌గా నిలిచింది. పూరీ మైదానంలో సోమవారం నిర్వహించిన ఇందులో బాలుర తుది పోరులో పూరీ జట్టు క్రీడాకారులు 22 పాయింట్లతో జగత్సింగ్‌పూర్ జట్టు క్రీడాకారులపై గెలుపొంది ఛాంపియన్ బహుమతిని అందుకున్నారు. కెప్టెన్ సుందరగఢ్ జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. టోర్నీలో ఉత్తమ డిఫెండర్‌గా రంజన్‌కుమార్ ప్రధాన్, ఉత్తమ అటాకర్‌గా తరిణి సాహు, ఉత్తమ క్రీడాకారుడిగా రఘు సోయంలు ప్రత్యేక బహుమతులందుకున్నారు. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి ప్రద్యుమ్న మిశ్ర, పూరీ జిల్లా క్రీడాధికారి చందన్ కుమార్ సాహు, అనుగుల్ జిల్లా క్రీడాధికారి అక్షయ కుమార్ సెఠి తదితరులు విన్నర్, రన్నర్ జట్ల క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఛాంపియన్ ట్రోఫీతో పూరీ క్రీడాకారులు. చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

కాశీపూర్‌లో చౌయితి యాత్ర

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయగడలో మంగళవారం కాశీపూర్ సమితి కేంద్రంలో చౌయితి యాత్ర మొదలైంది. స్థానిక మానికేశ్వరి మందిరంలో ప్రత్యేక పూజలు అనంతరం కలెక్టర్ అశుతోష్ కులకర్ణి కాగడాన్ని పట్టుకుని యాత్ర ప్రారంభించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరస్వతి మాఝి పాల్గొన్నారు.

కాగడం పట్టుకున్న కలెక్టర్, కలశంతో జడ్పీ ఛైర్‌పర్సన్

ఆటలతో... ఆరోగ్యం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని మహారాజ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా వార్షిక పోటీలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలు శ్రీకృష్ణ చంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు హైజంప్, లాంగ్ జంప్, పరుగు పందెం, కబడ్డీ లాంటి ఆటలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానాచార్యిణి మోనాలిసా దాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు.

రహదారిపై కొండ చిలువ కలకలం

బ్రహ్మపుర నగరం: బ్రహ్మపుర సమీపంలో అంబగడ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి ఓ కొండ చిలువ కలకలం రేపింది. గ్రామస్థులు దీనిపై ఆంచలిక వికాస్ పరిషత్ అధ్యక్షుడు సాగర్ కుమార్ పాత్రకు తెలియజేశారు. ఆయన ఇచ్చిన సమాచారంతో బ్రహ్మపురకు చెందిన సర్ప ప్రేమికుడు పి.అరవింద కుమార్ దేశిబెహర హుటాహుటిన అక్కడికి చేరుకుని సుమారు ఆరు అడుగుల పామును కాపాడారు. దాన్ని బ్రహ్మపుర అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. అధికారుల సూచన మేరకు కాపాడిన కొండ చిలువను రామగుడ రిజర్వు అడవుల్లోని సురక్షితంగా విడిచిపెట్టారు.

కాపాడిన కొండ చిలువతో సర్ప ప్రేమికుడు అరవింద దేశిబెహర, అటవీ సిబ్బంది, ఆంచలిక వికాస్ పరిషత్ ప్రతినిధులు

మజ్జిగౌరి అమ్మవారి చిత్రపటం ఏర్పాటు చేయండి

రాయగడ, న్యూస్‌టుడే: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు మజ్జిగౌరి అమ్మవారు చిత్రపటాన్ని కొత్తగా నిర్మించిన రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని గవర్నరును కోరారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు, సామాజిక కార్యకర్త పొట్నూరు భాస్కరరావు సోమవారం గవర్నర్ కంభంపాటి హరిబాబును కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన రైల్వే అధికారులకు, ప్రభుత్వానికి సందేశాలు పంపించారు.


గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాస్కరరావు

కాలుష్య నివారణకు సహకరించాలి

చైతన్య ర్యాలీ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం కారణంగా పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతోంది. దీన్ని నివారించడానికి అందరూ సహకరించాలని రాయగడ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి అశోక్ కుమార్ బోయి అన్నారు. జాతీయ కాలుష్య దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయగడ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాయగడ పురపాలక కార్యనిర్వాహక అధికారి కులదీప్, ఇంజినీరు రూపక్ సాహు, రాజేంద్ర సాహు, గోపాల్ జైన్, జలంధర పుసిక పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి ఆమోదం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని వంశధార నదిపై అంతర్రాష్ట్ర వంతెనలు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు నారాయణరావు మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, మంత్రి రబినారాయణ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పనులు పూర్తయితే ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలకు రవాణా సౌకర్యం కలగడంతో పాటు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ సబర్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న కోడూరు నారాయణరావు, పక్కన నబ కిషోర్ సబర్

సరస్వతి శిశు విద్యా మందిర్ వార్షిక క్రీడా పోటీలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన సరస్వతి శిశు విద్యా మందిర్‌లో మంగళవారం వార్షిక క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. బస్టాండ్ వద్ద గల తరణి మందిరంలో పూజల అనంతరం విద్యా మందిరానికి క్రీడాజ్యోతి తీసుకువెళ్లారు. స్కూల్ అధ్యక్షులు ప్రకాష్ పాత్ర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రియ బెహరా, ఉపాధ్యాయులు మానసరంజన్ సాహు పాల్గొన్నారు.

విద్యార్థుల విన్యాసాలు

పుట్టగొడుగుల సాగుపై మహిళలకు శిక్షణ

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సబ్‌డివిజన్ పరిధిలో ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ తరపున స్వయం సహాయక సంఘం మహిళలకు మంగళవారం పుట్టగొడుగుల సాగుపైన శిక్షణ ఇచ్చారు. శిబిరంలో బొయిపరిగుడకు చెందిన ఎస్‌హెచ్‌జీ బృందాలకు చెందిన 60 మంది మహిళలు పాల్గొన్నారు. ఫౌండేషన్ అధికారి తిరుపతి ఖరా, సమితి వ్యవసాయ శాఖాధికారి త్రిలోచన్ పాడి శిక్షణ ఇచ్చారు.

శిబిరంలో ఫౌండేషన్ అధికారులు, స్వయం సహాయక సంఘం మహిళలు

భూ వివాదంపై అధికారుల చర్చ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఉప్పలాడ పంచాయతీలోని చందనకోల గ్రామ వివాదాస్పద రహదారిని సబ్ కలెక్టర్ అనూప్ పండా, సమితి అభివృద్ధి అధికారి గౌరచంద్ర పట్నాయక్‌తో పాటు నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. వివరాల్లోకి వెళితే... చందనకోల గ్రామానికి సుమారు 700 మీటర్ల రహదారి లేకపోవడంతో గ్రామస్థులతో పాటు గుమ్మ సమితికి చెందిన పలు గ్రామాల ప్రజలు పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓట్లను బహిష్కరిస్తామని ప్రజలు కూడా హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం అధికారులు ఆ ప్రాంతానికి చేరుకొని పాటికోట గ్రామస్థులతో సమావేశమై పరిష్కార దిశగా చర్చించారు. పూర్వకాలంలో తమ ప్రాంతానికి సాగు నీరు అందిస్తామంటే రహదారి ఇచ్చామన్నారని ఆ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు అన్నారు. రైతులతో మాట్లాడి భూసేకరణ చేసి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ అనూప్ తెలిపారు.

గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అనూప్ పండా, బీడీఓ గౌర చంద్ర పట్నాయక్

స్కేటింగ్‌లో ఆకట్టుకున్న చిన్నారులు

కొరాపుట్, న్యూస్‌టుడే: పరబ్ ఉత్సవాల్లో భాగంగా మొట్టమొదటి సారిగా స్కేటింగ్ పోటీలు కొరాపుట్‌లో నిర్వహించారు. మూడు విభాగాలుగా చేసి ఈ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల తమ స్కేటింగ్ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

సిమిలిగుడలో వైభవంగా పరబ్ వేడుకలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో ఆదివాసీ కళా సంస్కృతి పరిరక్షించేందుకు నిర్వహిస్తున్న పరబ్ వేడుకల్లో భాగంగా సిమిలిగుడలో సమితి స్థాయి వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలో గడబ వీధిలో ఉన్న నిషాని ముండా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించాక పరబ్ జ్యోతిని ఊరేగించి మినీ స్టేడియంలో సభా వేదిక వద్దకు తీసుకువెళ్లారు. పొట్టంగి మాజీ ఎమ్మెల్యేలు ప్రితమ్ పాడి, ప్రఫుల్ల కుమార్ పంగిలు వేడుకలు ప్రారంభించారు.

ఆకట్టుకున్న ధింసా నృత్యం

జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి పర్యటన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి వేణుధర్ సబర్ లమతపుట్ సమితిలో మంగళవారం పర్యటించారు. సమితి కేంద్రానికి చేరుకొని అక్కడ అధికారులతో సమీక్షించారు. మినీ స్టేడియం నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వివిధ గ్రామాల్లో ఆవాస్ యోజన అమలు తీరు గురించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమితి అభివృద్ధి అధికారి జయంత్ కుమార్ మెహెర్, తహసీల్దార్ దివాకర్ బాగ్ పాల్గొన్నారు.

విజయవంతంగా రక్తదాన శిబిరం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ ఖరీదా ప్రాంతంలో ఉన్న మిలన్ మందిర్ క్లబ్ ఎస్ఐఆర్ దరఖాస్తులు నింపే అంశంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఓటర్లకు సహకరిస్తుంది. సోమవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేసింది. 44 మంది రక్తదానం చేశారు. పురపాలక సంఘ అధ్యక్షురాలు కల్యాణి ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణి ఘోష్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

సునాబెడలో రక్తదాన శిబిరం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ మహిళా కళాశాలకు చెందిన యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రిన్సిపల్ ఇందిరా ప్రియదర్శిని పట్నాయక్ రక్తదాన శిబిరం ప్రారంభించారు. కొరాపుట్ రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో 23 మంది రక్తదానం చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

విజ్ఞానమేళాలో 115 ప్రాజెక్టుల ప్రదర్శన

నవరంగపూర్, న్యూస్‌టుడే: జోరిగావ్ ప్రభుత్వ నోడల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సమితి స్థాయి విజ్ఞానమేళా జరిగింది. బీఈఓ రష్మితా నేతమ్ అధ్యక్షతన జరిగిన మేళాలో 88 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 115 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా బీడీఓ మధుసూదన్ మాఝి, ఏబీఈఓ దశరథ్ గండ్, ప్రధానోపాధ్యాయురాలు రోహిణి తపస్విని పూజారి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న బీడీఓ మధుసూదన్

ఇద్దరి దుర్మరణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నయాగడ్‌కు చెందిన ఇద్దరు యువకులు మంగళవారం పూరీ జగన్నాథుని దర్శనానికి మోటారు సైకిల్‌పై ప్రయాణమయ్యారు. భువనేశ్వర్‌లోని బీరేబీనగర్ కూడలి వద్ద వారు ప్రయాణిస్తున్న బైకు డివైడర్‌ను ఢీకొంది. ఘటనాస్థలంలో ఇద్దరూ మృతిచెందారు. బొడొగొడొ ఠాణా పోలీసులు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేపిటల్ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలిసింది.

బాలికపై అత్యాచారం కేసులో ఒకరి అరెస్టు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా నారాయణ్‌గడ్ ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలికపై ఆదివారం పక్కింటి వ్యక్తి అత్యాచారం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా: 10 మందికి గాయాలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఆటో బోల్తాపడటంతో డ్రైవరుతో సహా 10 మంది గాయపడిన ఘటన నవరంగపూర్ జిల్లా డాబుగావ్ సమితి నువాకోట్ పంచాయతీ ముదిగూడ గ్రామం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. టికరపాల గ్రామానికి చెందిన 9 మంది మంగళవారం డాబుగావ్ సమితి బౌలిగూడ గ్రామంలో దశదిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా ముదిగూడ వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. వారిని మైదల్‌పూర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ప్రాథమిక చికిత్స అనంతరం చోదకుడిని డాబుగావ్ ఆసుపత్రికి తరలించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పట్టుబడిన చోరీ సామగ్రి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జిల్లా చందన్‌పూర్ మార్కెట్ పరిధిలోని రాధాకాంత నగల దుకాణంలో గత నెల 20న నగలు, నగదు చోరీ అయ్యాయి. పూరీ ఎస్పీ ప్రతీక్‌సింగ్ నాలుగు స్క్వాడ్‌లు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం నలుగురు నిందితులను అరెస్టు చేసిన తర్వాత విలేకర్ల సమావేశం చేపట్టి వివరాలు తెలియజేశారు. రూ.6 లక్షల నగదు, 132 గ్రాముల పసిడి, 31 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చోరీ అయిన నగలు, నగదు చూపుతున్న ఎస్పీ సింగ్

వేటగాడి అరెస్టు: నాటు తుపాకీ స్వాధీనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: చిలికా వన్య ప్రాణి డివిజన్ పరిధిలో చిలికా సరస్సు ఒడ్డున సియాండి ప్రాంతంలోని పీఎంజీఎస్‌వై రోడ్డులో సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వేటగాడ్ని గస్తీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది పట్టుకున్నారు. ఆయన నుంచి ఓ నాటు తుపాకీ, తూటాలు, రెండు మృత పక్షులు (లిటిల్ ఎగ్రేట్, కేటల్ ఎగ్రేట్ జాతికి చెందినవి) స్వాధీనం చేసుకున్నారు. వేటగాడు పూరీ జిల్లా కృష్ణప్రసాద్ ఠాణా పరిధిలోని మాలూద్ గ్రామానికి చెందిన షేక్ ముస్తాక్ (27)గా గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని చిలికా వన్యప్రాణి డివిజన్ అటవీ అధికారి (డీఎఫ్‌వో) అమ్లాన్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరెస్టయిన వేటగాడు, చేతిలో నాటు తుపాకీ, మృత పక్షులు (వృత్తంలో). చిత్రంలో అటవీ సిబ్బంది

జయపురం ఘాటీలపై దోపిడీలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్-జయపురం ఘాటీ రహదారిపై ట్రక్కులు, లారీలపై దుండగులు దాడిచేసి దోపిడీలు చేయడంతో ఈ మార్గంలో వెళ్లాలంటే వాహన దారులు భయపడుతున్నారు. ఐఐసీ సచ్చీంద్ర ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘాటీ రహదారిపై ఠాకురాణి ఆలయం వద్ద వరుసగా రెండు రోజులు రాత్రి సమయంలో వాహనాలు మరమ్మతులకు గురవ్వడంతో వాటిని మరమ్మతులు చేసేందుకు వాహనం దిగగానే దుండగులు వారిపై దాడి చేసి రూ.6 వేలు, రూ.3 వేలు దోచుకున్నారు. వాహన అద్దాలను పగులగొట్టారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు.

నగదు దోచుకున్న దుండగులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: కష్టపడి సంతలో చేపలు అమ్మి సంపాదించిన సొమ్మును ముగ్గురు దుండగులు కళ్లల్లో దుమ్ము కొట్టి దోచుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా జోరిగావ్ ఠాణా పరిధిలో జరిగింది. ఐఐసీ ప్రదీప్‌కుమార్ సబర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం చకలపాదర పంచాయతీ కంగర వారపుసంతలో ధనుర్ధన్ మాండియా, ఆయన భార్య సజని మాండియా చేపలు విక్రయించి తిరిగి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ముగ్గురు దుండగులు ముఖాలకు మాస్కులు వేసుకొని కుత్రిచపర పంచాయతీ గొడగుడ వద్ద వారి కళ్లల్లో దుమ్ము కొట్టి, రూ.20 వేలు నగదు దోచుకున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

జూద శిబిరంపై దాడి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం సమితి కంగా పంచాయతీ సాల్పియాగూడ ప్రాంతంలో పోలీసులు సోమవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తూ ముందస్తు సమాచారం మేరకు జూద శిబిరంపై దాడి చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకొని రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు, జూదగాళ్లకు నోటీసులు అందజేసి విడిచిపెట్టినట్లు ఐఐసీ సచ్చీంద్ర ప్రధాన్ తెలిపారు.

గంజాయి మొక్కల ధ్వంసం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ ప్రాంతంలో అక్రమంగా సాగు చేస్తున్న 24 వేల గంజాయి మొక్కలను మంగళవారం ధ్వంసం చేశారు. నందపూర్ ఎక్సైజ్ అధికారి అభయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ.. 20 ఎకరాల్లో 24 వేల గంజాయి మొక్కలు ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ఈడీ ప్రత్యేక బృందం సోదాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా గోపీవల్లభ్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధి ఆటంగి ప్రాంతంలో ఈడీ ప్రత్యేక బృందం సోమవారం సోదాలు జరిపింది. ఇసుక తవ్వకాలు జరుగుతున్న చోటకు వెళ్లి ప్రత్యేక దర్యాప్తు సాగించింది. ఇసుక వ్యాపారి అభిషేక్ పాత్ర్ ఇంట్లో సోదాలు జరిపింది.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

కంబాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాలకు శుద్ధజలం అందించే లక్ష్యంతో వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద రూ.4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇది పనిచేయకపోవడంతో ఇక్కడ చదువుతున్న 60 మంది విద్యార్థులు రక్షిత తాగునీటికి దూరమయ్యారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మురుగు పారేదెలా?

ఇచ్ఛాపురం పురపరిధి చిన్నమేదర వీధిలో కాలువ ధ్వంసమైంది. కనీస మరమ్మతులు లేకపోవడంతో వాడుకనీరు ముందుకు సాగడం లేదు. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోయి, వర్షం పడితే రోడ్డుపై ప్రవహిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పుర కమిషనర్ నల్లి రమేష్‌ను వివరణ కోరగా.. సమస్యను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పేరు.. మారని తీరు

మందస మండలం సాబకోటలోని రైతు సేవా కేంద్రం ఇది. వైకాపా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రంగా పేర్కొనగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు సేవా కేంద్రంగా మార్చింది. ఈ జీవో వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా భవనంపై పాత పేరు ఉండటం గమనార్హం. దీనిపై సర్పంచి సంధ్య స్పందిస్తూ త్వరలోనే పేరు మారుస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

తుప్పలు తొలగించండి

వజ్రపుకొత్తూరు మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయం పరిసరాల్లో ముళ్ల తుప్పలు దట్టంగా పెరిగాయి. రహదారిపైకి రావడంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన విద్యార్థులు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి శిరిబెడ పీఎంశ్రీ విద్యాలయ వసతిగృహంలో ఉంటున్న 35 మంది విద్యార్థులు కడుపు నొప్పితో బాధపడుతూ మంగళవారం ఆసుపత్రిలో చేరారు. అందరికీ మంగళవారం ఒక్కసారిగా కడుపునొప్పిగా ఉండటంతో వారిని హాస్టల్ సిబ్బంది ఆసుపత్రిలో చేర్చగా ప్రస్తుతం వారి పరిస్థితి కుదుటపడింది. బొయిపరిగుడ, రామగిరి వైద్య బృందం హాస్టల్‌కు చేరుకొని పరీక్షలు చేశారు.

చెప్పినా వినరే.. ప్రమాదం కనరే..

ఇచ్ఛాపురం పట్టణంలో శిథిలావస్థలో ఉన్న బాహుదానది పాత వంతెన బలహీనంగా మారడంతో భారీ వాహనాలు రాకపోకలు నిషేధించారు. 2023లో వంతెన కూలింది. తర్వాత తాత్కాలికంగా పునరుద్ధరించారు. ద్విచక్ర, ఆటోలు మాత్రమే వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఇరువైపులా బోర్డులు ఏర్పాటు చేసి గోడలు కట్టి తక్కువ ఖాళీ స్థలం ఉంచారు. ఎన్నికల ముందు గత ప్రభుత్వ హయాంలో కొత్త వంతెనకు శంకుస్థాపన చేస్తామని ఇనుప గేట్లు తొలగించారు. గోడలు కొంత మేర కూల్చివేశారు. దీంతో రాత్రిపగలూ తేడాలేకుండా ఇసుక ట్రాక్టర్లు దూసుకొస్తున్నాయి. అధిక బరువుతో దాటుతుండటంతో మళ్లీ కూలే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పరుగెత్తు కన్నా.. నీవెనుక నేనున్నా

పరుగు పోటీల్లో దివ్యాంగ బాలికలు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: సరిగా నడవలేని వారు కొందరు.. వస్తువును రెండు చేతులతో పట్టుకోలేని వారు మరికొందరు.. అమ్మ ముద్దలు పెడితే తప్ప అన్నం కూడా తినలేని వారు ఇంకొందరు. కానీ క్రీడా పోటీల్లో వారి ప్రయత్నం చూసి చూపరులకు ముచ్చటేసింది. ఇలా చేయాలి కన్నా.. నువ్వు పరిగెత్తగలవు చిన్నా.. నా బిడ్డ బంగారం.. చెబితే చేస్తాడంతే.. అంటూ పిల్లల వెన్నుతట్టిన తల్లుల సందడితో మైదానం మురిసింది. మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పారా ఒలింపిక్స్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు జరిగాయి. భామిని, సీతంపేట, పాచిపెంట, పాలకొండ, సాలూరు తదితర ప్రాంతాలకు చెందిన 80 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు పాల్గొనగా.. బాల, బాలికలకు వేర్వేరుగా 100, 200, 400 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. అర్థో, బుద్ధిమాద్యం, దృష్టిలోపం ఉన్న వారికి వేర్వేరుగా పోటీలు జరిగాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. డీఈవో బి.రాజకుమార్, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త పి.భానుమూర్తి, జిల్లా క్రీడాసాధికారత సంస్థ అధ్యక్షుడు ఎస్.మురళి, ఎంఈవో-2 ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు

పాప్‌కార్న్ పండించి.. ఆదర్శంగా నిలిచి..!

ఒప్పంగిలో పాప్‌కార్న్ పంట

న్యూస్‌టుడే, జలుమూరు

మూడేళ్లుగా పాప్‌కార్న్ మొక్క జొన్న పండించి సంతృప్తికరమైన ఆదాయం చూస్తున్నారు ఒప్పంగి గ్రామానికి చెందిన రైతు మంత్రి అసిరినాయుడు. రెండు ఎకరాల్లో రెండేళ్ల కిందట ప్రయోగాత్మకంగా వేసి విజయం సాధించారు.

● నవంబరు, డిసెంబరు నెలల్లో విత్తనం నాటేందుకు అనుకూలంగా ఉంటుందని, వరి కోసిన వెంటనే దుక్కి చేసైనా.. లేదంటే నేరుగా పంట వేయొచ్చని, నవంబరులో వేస్తే ఎకరాకు 45 క్వింటాళ్లు, డిసెంబరులో అయితే 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు.

● దుక్కి, కలుపు మందులు, నీటి తడులు అందించడం, ఎరువులు ఇలా పంట చేతికి అందే వరకు ఎకరాకు 25 వేల వరకు ఖర్చు అవుతుంది. క్వింటా గింజలు ధర రూ.2200 చొప్పున విక్రయిస్తే 45 క్వింటాళ్లకు రూ.99 వేలు వస్తుంది. 2 ఎకరాల్లో పండించగా రూ.1,48,000 ఆదాయం వచ్చిందని అసిరి నాయుడు తెలిపారు.

● చల్లని వాతావరణంలో విత్తనం నాటితే మంచి దిగుబడులు వస్తాయి. నాతోపాటు చుట్టు పక్కల గ్రామాల రైతులను ప్రోత్సహిస్తాను. అధునాతన పంటల్లో పాప్‌కార్న్ లాభదాయకమే.
- మంత్రి అసిరినాయుడు, రైతు, ఒప్పంగి గ్రామం

వంగపంటకు అగ్నాస్త్రం ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న తొగిరి రైతు దాలయ్య

సేంద్రియ బాట.. రసాయనాలకు టాటా

సారవకోట, న్యూస్‌టుడే: రైతుల ఆలోచన మారుతోంది. పంటల సాగులో పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగానికి దూరం జరుగుతున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రజలు సైతం వాటి వైపే మొగ్గు చూపుతున్నారు.

● సారవకోట మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన రైతు రావాడ దాలయ్య 2 ఎకరాల్లో వరి, వంగ, బరబటి, ఆనప వంటి కూరగాయలు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

కిన్నెరవాడ, అంగూరు, కేలవలస తదితర పంచాయతీల్లో రైతులు అధికంగా సేంద్రియ బాటలో నడుస్తున్నారు.

● ఆవు పేడతో ఘనజీవామృతం, మూత్రం, పేడ, బెల్లం ఉపయోగించి ద్రవ జీవామృతం, జిల్లేడు, వేప, సీతాఫలం, కానుగ వంటి ఆకులతోపాటు ఆవు మూత్రం, వెల్లుల్లి, పొగాకు, పచ్చిమిర్చి వంటివి ఉపయోగించి కషాయాలు తయారు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసే అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటివి వినియోగించి మంచి దిగుబడి సాధిస్తున్నారు.

● 'ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడినప్పుడు దిగుబడి బాగున్నా పెట్టుబడి ఎకరాకు రూ.50వేలు నుంచి రూ.60వేలు అయ్యేదన్నారు. 5 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నట్లు చెప్పారు. పంట ఏపుగా పెరుగుతుందని, పెట్టుబడి లేదు. నాణ్యత బాగుంది. వేరుకుళ్లు తెగులు, ఆకుల పసుపు రంగులోకి మారడం బాగా తగ్గిందన్నారు.

● ఆసక్తి ఉన్న రైతులు సచివాలయాల్లో సంప్రదిస్తే సిబ్బంది నేరుగా వచ్చి ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు నేర్పిస్తారు. జిల్లాలో 60 చోట్ల ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వనరుల కేంద్రాలు ఏర్పాటు చేశాం. తెగుళ్లు, పురుగు నివారణకు కషాయాలు తక్కువ ధరకే లభిస్తాయి. చిరుధాన్యాలు కూడా అందుబాటులో ఉంటాయి.' అని శ్రీకాకుళం ప్రకృతి వ్యవసాయం అదనపు డీపీఎం ధనుంజయరావు తెలిపారు.

సస్య రక్షణ చర్యలు ఇలా..

● నవంబరు 15 నుంచి డిసెంబరు 15లో పంట వేసుకుంటే మంచిది. కిలో విత్తనాలకు సయాంట్రానిలిప్రోల్, తయోమిథాక్సమ్ 4 మి.లీ కలిపి విత్తన శుద్ధి చేయడంతో కత్తెరపురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు. ● సాళ్ల మధ్య 60 సెంటీమీటర్లు, మొక్కల నడుమ 20 సెంటీమీటర్లు దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తిన 30 నుంచి 60 రోజుల్లో ఎకరానికి 90 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 30 కిలోల పొటాషియం, ఎరువులు మూడు దఫాలుగా వేసుకోవాలి. ● కలుపు నివారణకు అట్రాజిన్ ఒక కిలో 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ● కాండం తొలుచు పురుగు ఆశిస్తే క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తొలిదశలో వేపనూనె ఎకరాకు ఒక లీటరు చేయాలి. రెండో దశలో ఇమామెక్టిన్ బెంజోయేట్ మందు 100 గ్రాములు పిచికారీ చేయాలి. గింజల తేమ 30 - 35 శాతం మధ్య ఉన్నప్పుడు కండెలు మొక్కనుంచి వేరుచేసి నీడలో ఆరబెట్టాలి. ఎండలో ఆరబెడితే గింజలు పగిలి పేలాలు సరిగా రావని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.చిట్టిబాబు తెలిపారు.

పొలాలకు వర్మీ కంపోస్టు కావాలా..?

న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సొంతమవుతాయని తొగరాం పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎస్.నీలవేణి తెలిపారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: చోడి పంటలో అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి
– ఎస్.అప్పలనాయుడు, బుడుమూరు

సమాధానం: అనుకూలమైన విత్తన రకాల్లో చంపావతి ఒకటి. పంట కాలం 80-85 రోజులు ఉంటుంది. ఎకరాకు 12 క్వింటాళ్లు, శ్రీ చైతన్య 110-115 రోజులు పంట కాలం, ఎకరాకు 12-16 క్వింటాళ్లు, అలాగే హిమ ఇది తెల్ల చోడి రకం అధిక దిగుబడులు ఇస్తాయి. అగ్గి తెగులు తట్టుకుంటుంది.

ప్రశ్న: వేరు శనగ పంట సాగు చేయాలి అనుకుంటున్నాం. జిప్సం ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేయండి
–కె.శంకరరావు, సనపలవానిపేట

సమాధానం: వేరుశనగ విత్తిన 40 రోజులకు రెండోసారి కలుపు తొలగించిన తరువాత జిప్సం వేసుకోవాలి. ఎకరాకు 200 కిలోల చొప్పున నాలుగు నుంచి 5 సెంటీమీటర్ల లోతులో వేస్తే సాగులో దిగుబడి బాగుంటుంది.

ప్రశ్న: పొలాలకు వినియోగించుకునేందుకు వర్మీ కంపోస్టు ఎక్కడ లభిస్తుందో తెలపండి
- పి.వెంకటలక్ష్మి, శ్రీకాకుళం

సమాధానం: వానపాముల ద్వారా తయారు చేసిన వర్మీ కంపోస్టు ఎరువు ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, నైరా కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తొగరాంలో విక్రయిస్తున్నారు. కొంతమంది రైతులు వద్ద కూడా అమ్మకానికి దొరుకుతుంది.

వ్యాన్, లారీ ఢీ: ఒకరి మృతి

ఘటనా స్థలంలో బొలెరో వ్యాన్

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రెండు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మర్రివలస కూడలి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న బొలెరో వ్యాన్, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న డ్రైవరు, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా డ్రైవరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. మృతుని వద్ద అడ్రస్‌కు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ఒడిశా రాష్ట్రం జైపూర్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దారి కాచిన ప్రమాదం..

మందస మండలం కిల్లోయి నుంచి కుమ్మరకుట్టి వెళ్లే రహదారి దుస్థితి ఇది. బంజరు యువరాజపురం-కొంటాసాయి మధ్య కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వెళ్లేంత వరకు కనిపించకపోవడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని దాదాపు 20 గ్రామాలకు ఈ దారే ఆధారం. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలే రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. ఐటీడీఏ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పరిశీలించి బాగుచేయిస్తామని సీతంపేట ఐటీడీఏ ఈఈ రమాదేవి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

క్యూఆర్ కోడ్.. పరీక్ష కేంద్రానికి దారి చూపుతుంది

పదో తరగతి విద్యార్థులకు మేలు

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పదో తరగతి విద్యార్థులు పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించి సకాలంలో చేరుకోవడానికి వీలుగా కూటమి ప్రభుత్వం హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్ ముద్రించాలని నిర్ణయించింది. గతంలో మాదిరిగా ఎక్కడున్నాయో వెతుక్కునే ఇబ్బందులుండవు. జాప్యం లేకుండా అక్కడికి చేరుకోవచ్చు.

● విద్యార్థుల హాల్ టికెట్లపై పరీక్ష కేంద్రం లొకేషన్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ ముద్రించనున్నారు. దీన్ని సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి.

ఇబ్బందులకు పరిష్కారం

● జంబ్లింగ్ విధానం అమలు చేస్తుండటంతో పరీక్ష రోజున కేంద్రాలకు చేరుకోవడం చాలా మందికి సవాలుగా మారుతోంది. ఎక్కడుందో గుర్తించడానికి తంటాలు పడుతుంటారు.

● మరోవైపు పట్టణాలు, జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటినీ గుర్తించిన ప్రభుత్వం సాంకేతికత సాయంతో ఇబ్బందులను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంది.

● వాటిని పరిశీలించి కేంద్రానికి బయలుదేరితే సమయం ఆదా అవుతుందని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

● జిల్లాలో 450 ప్రభుత్వ, 191 ప్రైవేటు పాఠశాలల నుంచి 28,933 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వీరందరికీ క్యూఆర్ కోడ్‌తో ఏ ఇబ్బంది లేకుండా అందులోని మ్యాప్ ఆధారంగా కేంద్రానికి ఎలా చేరుకోవాలో స్పష్టమవుతుందని.. జాతీయ ప్రతిభా ఉపకారవేతనాలకు (ఎన్ఎంఎంఎస్) సంబంధించి ఎంపిక పరీక్షల హాల్‌టికెట్లపై కూడా క్యూఆర్ కోడ్ ముద్రించనున్నట్లు డిప్యూటీ డీఈవో పి.విలియం తెలిపారు.

జీవ వైవిధ్యం కాపాడాలి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ సాగులో భాగంగా పొడి దుక్కిలో మినుము, కంది, గోంగూర, తోటకూర వంటి విత్తనాలు జల్లడం ద్వారా భూమిలో జీవ వైవిధ్యం వృద్ధి చెంది ప్రధాన పంటకు ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు మంగళవారం అంపురంలో రైతులకు పొడి దుక్కు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ అంతర పంటలతో భూమిలో తేమ శాతం పెరిగి సారవంతమవుతుందని వివరించారు.

వ్యాయామ విద్య.. మిథ్యేనా..!

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కనీస ఆట స్థలం లేని డి.జి.పుట్టుగ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక క్రీడలకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇది విద్యార్థుల శారీరక, మానసిక స్థితిపై ప్రభావం చూపుతోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి పెట్టగలరు. అందుకే పాఠశాలల్లో వ్యాయామ తరగతి తప్పనిసరి చేశారు. మైదానాలు లేకపోవడంతో అది జరగడం లేదు. దీంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాల్లో జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 73 ఉన్నాయి. అందులో కవిటి మండలంలో నెలవంక, గొనపపుట్టుగ, కుసుంపురం, పెద్ద మెళియాపుట్టుగ, ముత్యాలపేట, ఇచ్ఛాపురం మండలంలో బూర్జపాడు, కంద్రా వార్డు, సోంపేట మండలంలో బారువ బాలికల తదితర పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవు. కంచిలి మండలంలో పలు పాఠశాలల్లో చిన్న మైదానాలున్నా అవి ప్రార్థనకు తప్ప ఆటలకు అనుకూలంగా లేవు.

ప్రైవేటు బడుల్లోనూ

నియోజకవర్గంలో 30 వరకు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో 80 శాతం బడుల్లో ఆట స్థలాలు లేవు. క్రీడల కోసం వారు ఇతర మైదానాలను ఆశ్రయిస్తున్నారు. క్రీడా మైదానాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరికొన్ని చోట్ల దాతల సహకారంతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా అవి ఆటలు ఆడేందుకు పనికిరాకుండా ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు

ఏర్పాటుకు చర్యలు చేపడతాం

పలు ఉన్నత పాఠశాలల్లో మైదానాలు కొరత ఉన్న మాట వాస్తవమే. ఆయా చోట్ల క్రీడా మైదానాల ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. దాతల సహకారంతో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – పి.విలియం, డిప్యూటీ డీఈవో, టెక్కలి

శాశ్వత ఆరాటం.. తాత్కాలిక ఆర్భాటం..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అరకొర వసతులతో రథసప్తమి వేడుకలకు సన్నాహాలు

తాత్కాలిక షెడ్డులో సిద్ధం చేస్తున్న అన్నప్రసాదం

అరసవల్లిలో సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధిని దేవాదాయ శాఖ విస్మరించింది. సరైన ప్రణాళిక లేకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఇక్కడ ప్రతిష్ఠాత్మకమైన రథసప్తమి ఉత్సవాలకు ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత మౌనం పాటిస్తున్నారు. ప్రభుత్వం గతేడాది రథసప్తమిని రాష్ట్ర పండగగా ప్రకటించింది. ఆలయ నిధులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 19 నుంచి 25 వరకు ఉత్సవాలు నిర్వహించాలని సంకల్పించినా శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పించే దిశగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరవైంది.

అటకెక్కిన త్రిసభ్య కమిటీ నివేదిక

■ ఈ ప్రక్రియ నిమిత్తం ఆర్డీవో ఆధ్వర్యంలో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ సమీక్షించి ఇటీవల కలెక్టర్‌కు నివేదిక అందజేసింది. దీనిపై నిర్ణయం రాకపోవడంతో కదలిక లేదు.

■ రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణకు టెండర్లు పిలిచినా తక్కువ సమయం ఉండటంతో రథసప్తమి నాటికి ఆయా పనులు పూర్తయ్యే అవకాశం లేదు.

■ భక్తుల అవసరాలు, ఆలయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూ.12 కోట్లతో పనులు చేపట్టి రథసప్తమి నాటికి పూర్తి చేయాలని నెల కిందట మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.

■ అవసరమైన స్థలాన్ని ఆలయానికి ఆనుకుని ఉన్న ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించి, ప్రత్యామ్నాయంగా వారికి మరోచోట ఆలయ భూములివ్వాలని నిర్ణయించారు.

■ ప్రైవేటు స్థలాల సేకరణ సాధ్యపడే పరిస్థితి లేక పాత ప్రతిపాదనల మేరకు దశల వారీగా పనులు చేపట్టి ఇబ్బంది లేకుండా వసతులు కల్పించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు: ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు రథసప్తమి వేడుకల నిర్వహణకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యుద్దీపాలంకరణ, క్యూలైన్ల నిర్మాణం, టెంట్లు సమకూర్చడం ఇతర పనులకు దశల వారీగా టెండర్లు పిలుస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడతాం.
- పీవీవీడీ ప్రసాద్, ఈవో, ఆదిత్యాలయం

ప్రసాద్ పేరిట విధ్వంసం..

◆ గతేడాది రథసప్తమి వేడుకల ఏర్పాట్లలో భాగంగా ఆలయం వద్ద క్యూలైన్ల షెడ్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, షాపింగ్ కాంప్లెక్సు, అన్నదాన, అన్నప్రసాదాల తయారీ, ప్రసాదాల విక్రయ కేంద్రాలను, వివిధ నిర్మాణాలను కూల్చేశారు.

◆ కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం మంజూరు చేయకుండానే ఆ జాబితాలో చోటు దక్కుతుందనే విశ్వాసంతో ఆగమేఘాలపై నిర్ణయాలు తీసుకుని ధ్వంసం చేసేశారు.

◆ మౌలిక వసతుల్లేక భక్తులు ఇబ్బందులు పడుతుండటం, ప్రసాద్ పథకం ఇప్పట్లో మంజూరయ్యే అవకాశం లేకపోవడం, ఇక్కడ నెలకొన్న పరిస్థితులపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

◆ ఆలయ నిధులు రూ.లక్షలు వెచ్చించి తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు, గోశాల, అన్నదాన కేంద్రం, ప్రసాదాల విక్రయశాల నిర్మాణ పనులు చేపట్టారు. ఇటీవల తాటాకు పందిర్లు వేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా శక్తి బృందం ప్రతినిధి ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెదమరికి, కృష్ణపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. శక్తి యాప్ గురించి వివరించారు. 24 గంటల్లో ఎప్పుడైనా ఆపద వస్తే మహిళలు, పిల్లలు ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలని, పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. హెచ్‌సీ గురుమూర్తి, మహిళా కానిస్టేబుళ్లు నిర్మల, పద్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమంలో భాగంగా రెండోరోజు విద్యార్థులు స్థానిక పుచ్చవీధి, గొల్ల, బజారు, సాయిరాం వీధుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. రహదారులకు ఇరువైపులా పొదలు తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. మురుగు నీటి కాలువల వద్ద బ్లీచింగ్ జల్లారు. తెలుగు అధ్యాపకులు కేశవరావు వాలంటీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ రమేష్, క్యాంప్ పీవో రూప్‌సుందర్ పాల్గొన్నారు.

పూర్తి వివరాలతో వినతులు ఇవ్వాలి

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చేవారు అవసరమైన పూర్తి వివరాలు, ధ్రువపత్రాలను అర్జీకి జతచేసి ఇవ్వాలని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 12 అర్జీలు స్వీకరించారు. పుట్టూరు ఎంపీటీసీ స్థానాన్ని గతంలో లాగే పుట్టూరు-పులిగుమ్మి కలిపి ఉండేలా చూడాలని మాజీ సర్పంచి ఉదయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అప్పలనాయుడు, గ్రామస్థులు కోరారు. ★ ఈనెల 5న నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. పార్వతీపురం పట్టణంలోని జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆయన్ను కలిసి సమావేశ ఆహ్వాన పత్రాన్ని అందించారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ నాయుడు, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు

పుట్టూరు ప్రతినిధుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

(c) eenadu

ఈనాడు తమిళనాడు

నవాజ్ కనిని సత్కరిస్తున్న మంత్రి నాజర్

వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తమిళనాడు వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన ఎంపీ నవాజ్ కని చెన్నైలో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర మంత్రి నాజర్ ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బోర్డు సభ్యులుగా ఎమ్మెల్యే అబ్దుల్‌సమద్, గులాం మహ్మద్ మెహదీ ఖాన్, మహరీబా పర్వీన్, ఫాతిమా ముజఫర్, మహ్మద్ బషీర్, నవాజ్ కూడా బాధ్యతలు స్వీకరించారు.

మద్రాసు, అన్నా వర్సిటీ పరీక్షలు వాయిదా

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం జరుగనున్న పరీక్షలను మద్రాసు, అన్నా విశ్వవిద్యాలయాలు వాయిదా వేశాయి. దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో బుధవారం చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లోని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ క్రమంలో సెలవు ప్రకటించిన జిల్లాల్లోనే అన్నా వర్సిటీ పరీక్షలు వాయిదా వేసింది. మిగిలిన జిల్లాల్లో పరీక్షలు జరుగుతాయని ప్రకటించింది. పరీక్షలకు కొత్త తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది.

రాజకీయ ప్రస్థానం ఆగదు

సెంగోట్టైయన్

చెన్నై, న్యూస్‌టుడే: తన రాజకీయ ప్రస్థానం ఆగదని టీవీకే ఉన్నతస్థాయి నిర్వహణ కమిటీ చీఫ్ కో-ఆర్డినేటర్ సెంగోట్టైయన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తాను స్పష్టమైన వైఖరితో ఉన్నానని, ఎడప్పాడి పళనిసామి, ఉదయనిధి స్టాలిన్ వెల్లడించే అభిప్రాయాలపై స్పందించబోనని చెప్పారు. భాజపా దిల్లీ పెద్దలు చెప్పడంతోనే టీవీకేలో చేరినట్లు వస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. ఎంజీఆర్, జయలలిత అద్భుతమైన పాలన అందించారని, అందుకే పలుమార్లు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారని తెలిపారు. పార్టీ నుంచి వైదొలగిన వ్యక్తి గురించి మాట్లాడటం సబబు కాదని, దానిని ఎడప్పాడి పళనిసామి పాటించాలని కోరారు. తనను పార్టీ నుంచి బహిష్కరించేందుకే తనపై నింద వేశారని, అంతమాత్రాన తన రాజకీయ ప్రస్థానం ఆగదని, కొనసాగుతుందని తెలిపారు.

మహానగరాన్ని ముంచెత్తిన వానలు

మెరీనా బీచ్ రహదారిపై ఇలా..

వ్యాసర్పాడి గణేష్‌పురంలో రైల్వే వంతెన కింద నీటినిల్వ

ప్యారిస్, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా చెన్నైలో మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగిపోయాయి. మంగళవారం పాఠశాల, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో వరద చేరడంతో ప్రజలు తమ వాహనాలను వేళచ్చేరి, రాయపురం, కోడంబాక్కం వంతెనలపై ఆపి ఉంచారు. మెరీనా బీచ్‌లో దుకాణాలు నీట మునిగాయి. భద్రతా కారణాల రీత్యా ప్రజలు మెరీనా బీచ్‌కి వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు.

వాయుగుండంగా బలహీనపడిన దిత్వా

దిత్వా తుపాను మంగళవారం వాయుగుండంగా బలహీన పడి చెన్నైకు 40 కి.మీ దూరంలో ఉన్నట్లు, గంటకు 3 కి.మీ వేగంతో కదులుతున్నట్లు వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. బుధవారం రాష్ట్రంలో అనేకచోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నీలగిరి, ఈరోడు, కోయంబత్తూర్ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీవర్షం, తిరుప్పూర్, తేని, దిండుక్కల్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమరి, సేలం, నామక్కల్‌లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గత 24 గంటల్లో అత్యధికంగా ఎన్నూర్(చెన్నై) 26 సెం.మీ, ప్యారిస్(చెన్నై) 25, ఐస్‌హౌస్(చెన్నై) 22, మణలి పుదునగర్(చెన్నై), పొన్నేరి(తిరువళ్లూరు) 21, ఎన్నూర్ ఏడబ్ల్యూఎస్(తిరువళ్లూరు), బేసిన్ బ్రిడ్జ్(చెన్నై), చెన్నై జిల్లా కలెక్టరు కార్యాలయం, పెరంబూర్(చెన్నై) తలా 20 సెం.మీల వర్షపాతం నమోదైంది. చేట్‌పేట్ అరుణాచలపురం ప్రధాన ప్రాంతంలో ఆగి ఉన్న కారుపై గోడ విరిగిపడడంతో ఎలాంటి ప్రాణనష్టం ఏర్పడకుండా దానిని తొలగించినట్లు పోలీసులు తెలిపారు.

కారుపై పడిన గోడ

మెరీనా వద్ద ఎగసిపడుతున్న అలలు

పంటలకు పరిహారం ఇవ్వాలి

పొలంలో దిగి ఆందోళన చేస్తున్న రైతులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. దిత్వా తుపాను కారణంగా నాగపట్నం జిల్లాలో 80వేల ఎకరాలకుపైగా వరిపైర్లు నీట మునిగాయి. కీళ్‌వేలూర్‌లో 20వేల ఎకరాలకుపైగా పంట దెబ్బతిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.35వేలు చొప్పున పరిహారం అందించాలని వడకరై పంచాయతీలో రైతులు పొలంలోకి దిగి ఆందోళన చేశారు

సీఎం నియోజకవర్గంలో మృతుల పేర్లతో 10 వేల ఓట్లు

ట్రిప్లికేన్: ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గంలో 10 వేల ఓట్లు చనిపోయిన వ్యక్తుల పేర్లపై ఉన్నాయని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. కాశీ తమిళ సంగమం 4.0 యాత్ర మంగళవారం తెన్కాశిలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా యాత్ర ప్రారంభించారు. వారణాసికి బయల్దేరిన 15 వాహనాలను నయినార్ నాగేంద్రన్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నయినార్ నాగేంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ఎడప్పాడి పళనిసామి నాయకత్వంలో మంచి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. తమిళనాడులో దాదాపు 75 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగించబడతాయని సమాచారం తెలిసిందన్నారు. ఇందులో 2002 తర్వాత మరణించిన వారి ఓట్లు కూడా ఉంటాయన్నారు. స్టాలిన్ గెలిచిన కొళత్తూర్ నియోజకవర్గంలో పదివేల ఓట్లు చనిపోయిన వ్యక్తుల పేర్లపై ఉన్నాయని తెలిపారు. అందుకే ఓటర్ల తొలగింపును వ్యతిరేకిస్తున్నారన్నారు. పొంగల్ తర్వాత పలు పార్టీలు ఎన్డీయే కూటమిలో చేరుతాయని చెప్పారు.

వాహన యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న నయినార్ నాగేంద్రన్ తదితరులు

సిటీ బస్సులు.. చెరగని జ్ఞాపకాలు

☛ చెన్నైలో మ్యూజియం ఆన్ వీల్స్ ప్రదర్శన

చెన్నైకి, సిటీ బస్సులకు అవినాభావ సంబంధం కొనసాగుతూనే ఉంది. వాటిల్లో ప్రయాణించడం మరుపురాని జ్ఞాపకంగా భావిస్తుంటారు. పాత జ్ఞాపకాల్ని, కొత్త ఆవిష్కరణల్ని కళ్లకు కడుతూ ప్రదర్శనగా జనాల ముందుకు తెచ్చారు. **ఈనాడు-చెన్నై**

1997 నుంచి 2009 వరకు తిరిగిన డబుల్‌డెక్కర్

గత ఆదివారం నుంచి ప్రతి రోజూ సాయంత్రం చెన్నైలోని ఏదోఒక ప్రాంతంలో మ్యూజియం ఆన్ వీల్స్ బస్సును ప్రదర్శనగా ఉంచుతున్నారు. పాతకాలం రూపుతో ఉన్నా లోపలికెళ్లి చూస్తే.. వినూత్నంగా డిజైన్ చేశారు. పాఠశాలలు, కళాశాలల పిల్లలకు, వారి తల్లిదండ్రులకు బస్సు చరిత్రను తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నారు.

మద్రాస్ అంటే గుర్తొచ్చే 'రూట్'..

బస్సులో 13 టీవీలు ఉన్నాయి. పాత కాలం నుంచి ఇప్పటివరకు, భవిష్యత్తులో రాబోయే బస్సు నమూనాలు ప్రదర్శిస్తున్నారు. 1970లలో ఎర్రబస్సులే ఉండేవి. ఇప్పుడు ఈ-బస్సులు వచ్చాయి. చరిత్రను సులువుగా తెలుసుకునేలా తెరలపై తమిళం, ఆంగ్లంలో చూపుతున్నారు. ప్రత్యేకంగా పాతరోజుల నుంచి బాగా ప్రాచుర్యం పొందిన బస్సు రూట్లనూ చూపుతూ అందులోని ఆసక్తికర అంశాలు చెబుతుండటం ఆకట్టుకుంటోంది. కిలాంబక్కం కేసీబీటీ బ్రాడ్‌వే(18ఏ), తాంబరం-మామల్లాపురం(515), పెరంబూర్-బెసెంట్‌నగర్(29సీ).. ప్రజాదరణపొందిన రూట్లలో ఇవి కొన్ని.

● ప్రత్యేక ఆకర్షణగా కామిని..

ఈ మ్యూజియం ప్రదర్శనకు అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ క్రీడాకారిణి తిరుష్ కామిని ఉన్నారు. ఈమె పలు చోట్ల పాల్గొంటున్నారు. తన జీవితంలో నగర బస్సు మరిచిపోలేని జ్ఞాపకాల్ని ఇచ్చిందని గుర్తుచేసుకుంటున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్ నేర్చుకునేందుకు మైదానానికి సమయానికి చేరేందుకు ఈ బస్సులే ఆధారమని వివరిస్తున్నారు.

సినిమా ప్రత్యేకం

సినీనటుడు రజనీకాంత్ బస్సు కండక్టర్ స్థాయినుంచి సినిమాల్లోకి వచ్చి సూపర్‌స్టార్‌గా పేరు సంపాదించారు. ఆయన విశేషాల్ని సైతం ఇందులో ప్రదర్శిస్తున్నారు. ఇక్కడి బస్సుల్లో చాలా సినిమా షూటింగ్‌లే జరిగాయి. 1994లో 'కాదలన్/ప్రేమికుడు' సినిమా కోసం 'ఊర్వశి.. ఊర్వశి' పాటమొత్తం అద్దాలబస్సులో తీశారు. ఆ సమయంలో నగర బస్సులకు విపరీత పేరొచ్చింది. ఆ తర్వాత 1998లో 'సత్య' సినిమా తీశారు. ఈ జ్ఞాపకాలు సైతం ప్రదర్శనకు ఉంచారు.


వివిధ రకాల నమూనాలు తిలకిస్తున్న విద్యార్థులు

ఎంటీసీ చరిత్ర..

▶▶ 1947లో మద్రాస్ ప్రభుత్వం బస్సుల్ని జాతీయం చేస్తూ తొలిసారిగా నగరానికి 30 బస్సుల్ని కేటాయించింది.

ఆర్డినరీ బస్సు నమూనా

పోటీగా ప్రైవేటు బస్సులూ ఉండేవి. ప్రభుత్వ బస్సుల నిర్వహణకు ప్రత్యేకంగా 1972లో పల్లవన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను తెచ్చారు. బస్సుల సంఖ్య 1029కి పెంచారు.

▶▶ 1994లో ఈ బస్సుల సంఖ్య 2332కు చేరింది. అప్పుడే ఈ కార్పొరేషన్‌ను విభజించి.. ఉత్తర చెన్నై మెట్రో నగరంలో బస్సులు తిప్పేందుకు డాక్టర్ అంబేడ్కర్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, దక్షిణ చెన్నై మెట్రో నగరంలో బస్సుల్ని తిప్పేలా పల్లవన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్లకు పరిధులు పెట్టారు. ఈ రెండింటినీ విభజించేదిగా అప్పట్లో ఈవీఆర్ పెరియార్ సాలై ఉండేది.

▶▶ 2021లో ఈ రెండు కార్పొరేషన్లను కలిపి మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎంటీసీ) చేశారు. ప్రస్తుతం మెట్రో పరిధిలో 3,810 బస్సులు నడుస్తున్నాయి.

కలిసొచ్చే స్థానాలపై కమలం దృష్టి

చెన్నై, న్యూస్‌టుడే: కూటమి పూర్తి స్వరూపం సంతరించుకోలేదు. సీట్ల సర్దుబాటూ జరగలేదు. అయినా శాసనసభ ఎన్నికలు దిశగా భాజపా దూసుకెళ్తోంది. పార్టీ గెలిచే నియోజకవర్గాలను గుర్తించడంతో పాటు అక్కడి నుంచి బరిలోకి దింపనున్న అభ్యర్థుల ఉద్దేశ జాబితానూ ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

తమిళిసై సౌందరరాజన్ ▸ నయినార్ నాగేంద్రన్ ▸ శరత్‌కుమార్ ▸ విజయధరణి

50 నియోజకవర్గాలపై దృష్టి

వచ్చే శాసనసభ ఎన్నికల ద్వారా రాష్ట్రంలో తమ పార్టీని మరింత బలోపేతం చేయాలని భాజపా భావించి బలమైన కూటమి ఏర్పాటుకు ప్రయత్నాలు చేపట్టింది. ఒకవైపు టీవీకే అధ్యక్షుడితో స్నేహం కోసం చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతూనే ఉన్నాయి. మరోవైపు డీఎంకేను వ్యతిరేకించే భావసారూప్యత కలిగిన పార్టీలకూ ఆహ్వానం పలుకుతోంది. ఈ ప్రయత్నాలు ఓవైపు సాగుతుండగా తమ పార్టీకి గెలుపు అవకాశాలు ఉన్న నియోజకవర్గాలను గుర్తించడానికి ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా కూటమికి అత్యధిక ఓట్లు నమోదైన 50 శాసనసభ స్థానాలను ఈ కమిటీ గుర్తించింది. వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఆ సీట్ల నుంచి అభ్యర్థులను బరిలోకి దించాలని నిర్ణయించినట్లు సమాచారం.

తొలి విడతగా..

తొలి విడతగా దక్షిణ జిల్లాలపై దృష్టి సారించిందని, అక్కడి 58 నియోజకవర్గాల్లో 15 స్థానాలు పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు గుర్తించిందని తెలిసింది. వాటిలో కన్నియాకుమరి, చెన్నై జిల్లాల్లో మూడేసి చొప్పున, తిరునెల్వేలి, మదురై, శివకాశి, కోయంబత్తూర్ జిల్లాల్లో రెండేసి చొప్పున, ఇతర జిల్లాల్లో ఒకటి చొప్పున నియోజకవర్గాలను ఎంపిక చేసి అభ్యర్థుల ఉద్దేశ జాబితానూ సిద్ధం చేసిందని సమాచారం. ఆ మేరకు నాగర్‌కోవిల్ నుంచి సీనియర్ నేత పొన్.రాధాకృష్ణన్, విళవంకోడు నుంచి మాజీ ఎమ్మెల్యే విజయధరణి, నాంగునేరి నుంచి తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, తిరుచెందూర్ నుంచి నటుడు శరత్‌కుమార్, సాత్తూర్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, చెన్నైలోని త్యాగరాయనగర్ నుంచి వినోజ్ పి.సెల్వం, కోయంబత్తూర్ సౌత్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వానతి శీనివాసన్, పేరావూరణి నుంచి కరుప్పు మురుగానందం, రాశిపురం నుంచి వి.పి.దురైసామిని బరిలోకి దించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

అప్పటివరకు చూడాల్సిందే?

భాజపా పోటీ చేయాలని భావిస్తున్న 50 నియోజకవర్గాల్లో చాలావరకు అన్నాడీఎంకే ప్రాతినిధ్యం వహిస్తోంది. వాటిని భాజపాకు కేటాయించే అవకాశం ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అలాంటి పరిస్థితి ఎదురైతే ఏం చేయాలనే విషయమై భాజపా రాష్ట్ర నాయకులు ఆలోచనలో పడ్డారు. కోరుకున్న స్థానాలు లభించకున్నా సీట్ల సంఖ్యలో మాత్రం వెనక్కి తగ్గకూడదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం అన్నాడీఎంకే, భాజపా మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనే విశ్లేషణలు తెరపైకి వస్తున్నాయి. సీట్ల సర్దుబాటు చర్చలు వరకు వేచి చూడాల్సిందేనని చెబుతున్నారు.

జీసీసీ కౌన్సిల్‌కు నామినేటెడ్ సభ్యులు

ఝాన్సీ ఉమ, బాలాజీ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలకసంస్థ(జీసీసీ) కౌన్సిల్‌కు నామినేటెడ్ సభ్యులుగా ఝాన్సీ ఉమ, బాలాజీ నియమితులయ్యారు. రాష్ట్ర పట్టణ, గ్రామీణ పురపాలక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం అందించేందుకు మార్గం సుగమం చేసే బిల్లులను ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి సమర్పించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు కూడా జారీ చేసింది. ఆ మేరకు చెన్నై మహానగర పాలకసంస్థ కౌన్సిల్‌కు నామినేటెడ్ సభ్యులుగా ఝాన్సీ ఉమ, బాలాజీలను ఎంపిక చేసి సంబంధిత ఉత్తర్వులను కమిషనర్ కుమరగురుభరన్ అందించారు.

అరాచకశక్తుల నుంచి ప్రార్థనా స్థలాలను కాపాడుకోవాలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: అరాచక శక్తుల నుంచి ప్రార్థనా స్థలాలు కాపాడుకోవాలని తీర్మానం ఆమోదించామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు పుదుక్కోట్టైలో ప్రారంభమయ్యాయని బుధవారం రాత్రి వరకు జరుగుతాయన్నారు. సికిందర్‌దర్గాకు సమీపంలో కార్తిక దీపాన్ని వెలిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ అరాచక శక్తుల నుంచి ప్రార్థనా మందిరాలను కాపాడుకోవాలని తీర్మానించామన్నారు. తిరుప్పరకుండ్రం కొండపై ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతుల్లోనే కార్తిక దీపం వెలిగించాలని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు తీర్పునిచ్చారని గుర్తు చేశారు.

కరూర్ తొక్కిసలాట కేసు సీబీఐ దర్యాప్తు చేయకూడదు

● సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన

ప్యారిస్, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట కేసును సీబీఐ దర్యాప్తు చేయాలని జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో అభ్యర్థించింది. తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయాలని టీవీకే తరఫున దాఖలైన పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తరఫున జవాబు పిటిషన్ దాఖలు చేశారు. కరూర్ ఘటనపై అరుణా జగదీశన్ కమిషన్ విచారణ, ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తునకు విధించిన నిషేధాన్ని తొలగించాలని తెలిపారు. మంగళవారం జరిగిన కేసు విచారణ సమయంలో.. తమిళనాడు ప్రభుత్వం తరఫున పూర్తి వివరణ తెలుసుకోకుండా సీబీఐ దర్యాప్తునకు ఉత్తర్వులు ఇచ్చినట్లు, శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, ఈ ఘటనపై ప్రజలకు వివరణ ఇచ్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని తెలిపారు. పోలీసుల నిష్పాక్షికత, న్యాయమైన దర్యాప్తుపై ప్రజల్లో సందేహం ఏర్పడకూడదని, ప్రత్యేక దర్యాప్తు బృందానికి బదిలీ చేయాలని తెలిపారు.

శ్రీలంక నుంచి చెన్నై చేరుకున్న 24 మంది పర్యాటకులు

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీలంకలో చిక్కుకున్న పర్యాటకుల్లో 24మంది సురక్షితంగా చెన్నై చేరుకున్నారు. దిత్వా తుపాను కారణంగా శ్రీలంకలో కురుస్తున్న భారీవర్షాలకు రాష్ట్రానికి చెందిన 150 మంది సహా 300 మంది భారతీయులు చిక్కుకున్నారు. మూడు రోజులుగా విమానాశ్రయంలో చిక్కుకుని తినడానికి తిండి, నిద్రలేకుండా అల్లాడుతున్న వారిని సురక్షితంగా తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే దశలవారీగా వారిని చెన్నై మార్గంగా స్వదేశానికి రప్పిస్తున్న నేపథ్యంలో మరో 24 మంది పర్యాటకులు మంగళవారం శ్రీలంక ఎయిర్‌లైన్స్ విమానంలో చెన్నై చేరుకున్నారు.

మేకెదాటుకు వ్యతిరేకంగా 7న రైల్‌రోకో

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కావేరి నదిలో మేకెదాటు ఆనకట్ట నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ 7న తిరువారూర్‌లో రైల్‌రోకో చేపట్టనున్నట్లు రైతుల సంఘం అధ్యక్షుడు పీఆర్ పాండియన్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రైతులు పాల్గొనాలని కోరారు. తమిళనాడు కావేరి రైతుల సంఘం సమావేశం మన్నార్‌కుడిలో మంగళవారం జరిగింది. పీఆర్ పాండియన్ మాట్లాడుతూ.. కావేరి డెల్టాలో ఎడతెరిపినివ్వని వర్షాలకు చాలా గ్రామాల్లో సాంబా పంటలు కుళ్లిపోయాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులకు పరిహారం అందించాలన్నారు.

తిరువణ్ణామలైలో నేడు కార్తిక మహాదీపోత్సవం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మహా దీపోత్సవం బుధవారం జరుగనుంది. వేకువజామున 4 గంటలకు భరణి దీపం ఆలయంలో వెలిగిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు జరుగుతాయి. సాయంత్రం సరిగ్గా 6 గంటలకు 2,668 అడుగుల ఎత్తైన కొండపై మహాదీపం వెలిగిస్తారు. అంతకు ముందు కింద ఆలయంలో బాణసంచా కాల్చుతారు. తద్వారా కొండపై మహాదీపం వెలిగించాలన్న సంకేతం వెల్లడిస్తారు. ఈ ఉత్సవంలో ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచేకాక విదేశాల నుంచి సుమారు 10 లక్షల మంది భక్తులు వస్తారని రెవెన్యూ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల కోసం అనేక సౌకర్యాలు కల్పించారు.

మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రి వేలు

3 రోజులు మద్యం దుకాణాలు మూత

మహాదీపోత్సవం సందర్భంగా తిరువణ్ణామలైలోని ప్రభుత్వ, ప్రైవేటు మద్యం దుకాణాలు, బార్లు మంగళ, బుధ, గురువారాలు మూసి వేయాలని జిల్లా కలెక్టర్ తర్పగరాజ్ ఆదేశాలు జారీ చేశారు.

4764 ప్రత్యేక బస్సులు..

మంత్రి ఏవీ వేలు మంగళవారం తిరువణ్ణామలైలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం 24 తాత్కాలిక బస్టాండ్లు, 130 కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర రవాణా సంస్థ ద్వారా 4764 బస్సులు ఏర్పాటు చేశామని, తాత్కాలిక బస్టాండుల్లో భక్తుల రద్దీ ఎక్కువైనప్పుడు 40 అదనపు బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. బుధవారం తాత్కాలిక బస్టాండ్లు, కార్ పార్కింగ్, గిరి ప్రదక్షిణ బాట మధ్య ఉచితంగా ప్రయాణించడానికి 220 ప్రైవేటు పాఠశాల, కళాశాల బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఇవి కాకుండా రూ.10 రుసుముతో ప్రయాణించడానికి 200 మినీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 500 బస్సులు నడపనున్నారు. తాత్కాలిక బస్టాండ్లు, కారు పార్కింగ్ ప్రాంతాల్లో భక్తులకు కావలసిన తాగునీరు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, పోలీసు రక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీ తరఫున 51 ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, హైవేస్ శాఖ తరఫున 14 ప్రాంతాల్లో శుద్ధజల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 38 ప్రాంతాలలో 720 తాత్కాలిక మరుగుదొడ్లు, 7 వైద్య కమిటీలు, మాడ వీధి, గిరి ప్రదక్షిణ బాటలో 90 వైద్య కమిటీలు, 108 అంబులెన్స్‌లు, 5 బైక్ అంబులెన్స్‌లు ఉన్నాయన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టరు తర్పగరాజ్, స్థానిక మున్సిపాలిటీ మేయర్ నిర్మలా వేల్‌మారన్, జిల్లా రెవెన్యూ అధికారి సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పాత్ర తరలింపు.. మహాదీపం వెలిగించే లోహపాత్రకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి గిరిపైకి సిబ్బంది తరలించారు.

లోహ పాత్రకు పూజ చేస్తున్న దృశ్యం, కొండపైకి తరలిస్తున్న సిబ్బంది

స్టాలిన్‌తో నేడు కాంగ్రెస్ కమిటీ భేటీ

చెన్నై, న్యూస్‌టుడే: జాతీయ కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన పంచసభ్య కమిటీ డీఎంకే కూటమి నాయకుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో భేటీ కానుంది. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, వీసీకే, సీపీఎం, సీపీఐ, ఎండీఎంకే, ఐయూఎంఎల్, ఎంఎంకే తదితర పార్టీలు ఉండగా వచ్చే శాసనసభ ఎన్నికలకూ ఇదే కూటమి కొనసాగనున్నట్లు స్పష్టత ఇచ్చారు. సీట్ల సర్దుబాటు చర్చలు జరిపేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు గిరీశ్ చోడంకర్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఏఐసీసీ కార్యదర్శులు సూరజ్ ఎం.ఎన్.హెగ్డే, నివేదిత్ అల్వా, కాంగ్రెస్ రాష్ట్ర శాసనసభ పక్ష నేత రాజేశ్‌కుమార్‌లతో కూడిన పంచసభ్య కమిటీని ఏఐసీసీ నాయకత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బుధవారం అన్నా అరివాలయంలో స్టాలిన్‌తో భేటీ కానుంది. శాసనసభ ఎన్నికలు, ప్రచార వ్యూహాలు, కూటమి పార్టీలు ఏకాభిప్రాయంతో వ్యవహరించడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటుకు సంబంధించి తొలి విడత చర్చలు కూడా ఉంటాయని తెలిసింది.

(c) eenadu

ధర్మపురిలో కొంబు-కళికరంబు రోడ్డు నిర్మాణం

ప్రతిపాదన పంపిన డీఆర్‌డీఏ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఐదు నెలల కిందట కొంబు-కళికరంబు రహదారి నిర్మాణానికి ప్రతిపాదన పంపింది. 40 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను ధర్మపురి, బొమ్మిడి, పాపిరెడ్డిప్పట్టి, కడ్తూర్ బ్లాక్‌ల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ప్రతిపాదించారు. రూ.2.70 కోట్లతో 3.96 కి.మీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టును 6 కి.మీ దూరానికి సవరించారు. ఈ రహదారి కొత్త వ్యాపారాలు ప్రారంభమవడానికి, మారుమూల గ్రామాల మధ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడుతుందని స్థానికులు తెలిపారు. గతంలో ప్రతిపాదించిన రహదారిని ఎంచుకుంటే కొండ రోడ్లపై వాహనాలు తిరగడానికి కష్టమవుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రూబన్ శంకర్‌రాజ్ తెలిపారు. సవరించిన ప్రతిపాదన అనుమతి కోసం అటవీశాఖకు పంపామని చెప్పారు.

కరూర్ చేరుకున్న జస్టిస్ అజయ్ రస్తోగి బృందం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి, ఏడీజీపీలు సోనల్ మిశ్రా, సుమిత్ చరణ్ కరూర్ కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజాపనుల శాఖ పర్యాటక భవనానికి చేరుకున్నారు. కలెక్టర్ తంగవేల్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. తొక్కిసలాటలో మృతి చెందిన పళనియమ్మాళ్, కోకిలమ్మాళ్ తల్లిదండ్రులు పెరుమాళ్, సెల్వరాణి వినతి అందజేయడానికి పర్యాటక భవనానికి వచ్చారు. తమిళనాడు కొంగు యువజన పేరవై(తనియరసు) జిల్లా కార్యదర్శి అరుల్‌కుమార్ కూడా అక్కడికి చేరుకొని దుర్ఘటనకు విజయ్ కారణమని ఫిర్యాదు చేశారు.

బీఎల్వోకు అభినందనలు

టీనగర్, న్యూస్‌టుడే: సేలం దక్షిణ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ పనులను వంద శాతం పూర్తి చేసిన పోలింగ్ బూత్ స్థాయి అధికారి కనకసుందరాన్ని సేలం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇళంగోవన్ మంగళవారం అభినందించారు. ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, తిరిగి సేకరించి, వాటిని మొబైల్ యాప్‌లో విజయవంతంగా నమోదు చేశారని కొనియాడారు.

ఉదయనిధి పుట్టినరోజును పురస్కరించుకుని పొల్లాచ్చిలో సామూహిక విందు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజును పురస్కరించుకుని డీఎంకే నిర్వాహకులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కోయంబత్తూరు పొల్లాచ్చి డీఎంకే నగర కార్యదర్శి అముద భరత్ నేతృత్వంలో మంగళవారం కొట్టూరురోడ్డులో 5 వేల మందికి సామూహిక విందును అందించారు. మాజీ కేంద్ర మంత్రి ఎం.కన్నప్పన్, పార్టీ నిర్వాహకులు దళపతి మురుగేశన్, డాక్టర్ మహేంద్రన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కాశీ తమిళ సంగమం యాత్రకు బయల్దేరిన రెండో బ్యాచ్

రైలు వద్ద యాత్రికులు

వడపళని, న్యూస్‌టుడే: కాశీ తమిళ సంగమం యాత్రకు దక్షిణ రైల్వే ఏడు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. కాశీ యాత్రకు బయలుదేరిన రెండో బ్యాచ్ సభ్యులు, కళాకారులకు మంగళవారం చెన్నై డివిజన్ ఘన స్వాగతం పలికింది. 216 మంది సభ్యులు, 48 కళాకారులతో మొత్తం 264 మంది చెన్నై సెంట్రల్ స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు (06003)లో తెల్లవారు జామున 04.15కు బయలుదేరారు. యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొననుండటంతో దక్షిణ రైల్వే ఐఐటీ మద్రాస్, బనారస్ హిందూ వర్సిటీ సహకారంతో ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. మొదటి బ్యాచ్ సభ్యులు నవంబరు 29న కన్నియాకుమరి నుంచి బయలుదేరి వెళ్లారు.

పాఠశాలల మార్గాలు పదిలంగా ఉండాలి

❖ ప్రధాన రహదారులపై ఏర్పాటుకు నిషేధం ❖ చట్టంలో సవరణలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

\- న్యూస్‌టుడే, వడపళని

పాఠశాలల్లో చదువుతున్న పిల్లల భద్రతను మెరుగుపరచాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల ప్రవేశ, బయటికొచ్చే ద్వారాలు జాతీయ లేదా రాష్ట్ర రహదారుల వైపు ఉండటాన్ని నిషేధించింది. దీని గురించి గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ 'తమిళనాడు కంబైన్డ్ డెవలప్‌మెంట్ రూల్స్(టీఎన్‌సీడీఆర్)' 2019లోని సవరణల్లో మార్పు చేసింది. దీని ప్రకారం కొత్తగా పాఠశాల భవనాల నిర్మాణానికి అనుమతులు కోరే వారికి హైవేకు ఎదురుగా ప్రవేశ ద్వారాలు చట్టానికి విరుద్ధమని తెలిపింది. ఏదైనా పాఠశాల ప్రాంగణం హైవేను ఆనుకుని ఉంటే మొత్తం ముందు భాగంలో ఏడు మీటర్ల వెడల్పుతో కూడిన సర్వీస్ లేన్‌ను నిర్మించి, దానిని నిర్వహించాలని, ఈ లేన్‌కు తర్వాతే ప్రహరీ, ప్రవేశ ద్వారాలు 9 నుంచి 12 మీటర్ల వెడల్పుతో ఉండాలని, రెండు గేట్లను మాత్రమే అనుమతించాలని, పాఠశాలలు హైవే, మీడియన్ నుంచి ఒక మీటరు ఎత్తులో గార్డ్‌రైల్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కొత్త చట్టంలో సూచించింది.

రోడ్డు దాటుతున్న విద్యార్థులు

సురక్షిత నడక దారులు అవసరం

ఆర్కాట్ రోడ్డులోని 'లా చాటెలైన్ జూనియర్ కళాశాల' విద్యార్థులు ఇలాంటి ప్రమాదాలను చవి చూస్తున్నారు. ఆర్కాట్ రోడ్డులోని పోరూరు నుంచి కోడంబాక్కం లిబర్టీ వరకు మెట్రో రైలు ప్రాజెక్టు పనులు కూడా తోడవడంతో మార్గం మొత్తం ఇరుకుగా తయారైంది. దీంతో ఈ ప్రాంతంలో నడవటానికి వీలుగా ఫుట్‌పాత్‌లు లేవు. విద్యార్థులు వేగంగా వాహనాల మధ్య నడవాల్సిన పరిస్థితి నెలకొంది. పరిసరాల్లోని రహదారులపై పునరాలోచించాలని పలువురు పట్టణ మొబిలిటీ నిపుణులు పేర్కొంటున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ డెవలప్‌మెంట్ పాలసీకి చెందిన అశ్వతి దిలీప్ మాట్లాడుతూ.. ఈ మార్గాల్లో విశాలమైన కాలిబాటలు, సురక్షితమైన నడక మార్గాలతో పట్టణ వీధులుగా తిరిగి రూపకల్పన చేయాలన్నారు. నడక సౌకర్యం, ప్రయాణికుల భద్రతపై రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలు పాటించాలని సూచించారు.

చాలాచోట్ల ప్రమాదాలకు ఆస్కారం

ప్రస్తుతం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వం తెలిపినట్టుగా అలాంటి రక్షణలు లేవు. దీంతో విద్యార్థులు జీఎస్టీ రోడ్డు, మౌంట్ పూనమల్లి హై రోడ్డు, పూనమల్లి హైరోడ్డు, ఆర్కాట్ రోడ్డు వంటి ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్‌తో సతమతమవుతున్నారు. ప్రమాదాలు జరిగే ఆస్కారాలు మెండుగా ఉన్నాయి. పూనమల్లి హైరోడ్డులోని డేనియల్ థామస్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో చదువుతున్న పిల్లల గురించి ఓ తల్లి మాట్లాడుతూ.. ప్రతి రోజూ ఉదయం ప్రవేశ ద్వారం దుమ్ముతో గందరగోళంగా ఉంటుందని, వాహనాలు ఆపడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ప్రత్యేక సర్వీస్ లేన్ ఉంటే పిల్లలు దిగి వెళ్లడానికి వీలుగా ఉంటుందని చెబుతున్నారు.

కాంచీపురంలో పురాతన రాతి శిల్పం లభ్యం

వెలుగుచూసిన రాతి శిల్పం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీపం వేలింగపట్టరై వేఘావతి నది తీరంలో చరిత్ర పరిశోధకులు డాక్టర్ అన్బళగన్, ప్రభుత్వ మ్యూజియం క్యురేటర్ ఉమా శంకర్ సోమవారం అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నదీ తీరాన వంతెన సమీపంలో ఉన్న తిరువళ్లువర్ వీధిలో 17వ శతాబ్దానికి చెందిన రాతి శిల్పాన్ని గుర్తించారు. దీని గురించి అన్బళగన్ మాట్లాడుతూ... నడుక్కల్ రకానికి చెందిన సతికల్ శిల్పాన్ని గుర్తించామని, అది 51 సెం.మీ వెడల్పు, 55 సెం.మీ ఎత్తు ఉన్నట్లు తెలిపారు. ఈ శిల్పం ఓ నాయకుడు, ఆయన ఇద్దరు భార్యలను సూచిస్తుందన్నారు. ముగ్గురి ఆభరణాలు ధరించి ఉన్నారని, ముఖాలు అస్పష్టంగా ఉన్నాయని, ఎలాంటి శాసనాలు లేని శిల్పం 17వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొత్త విధానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సొంత వినియోగ వాహనాల రిజిస్ట్రేషన్‌కి ఇకపై ఆర్టీవో కార్యాలయాలకు వాహనాలను తీసుకెళ్లే అవసరం లేదు. ఈ కొత్త విధానం సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కు వాహన యజమాని లేదా డీలర్ ప్రతినిధి ప్రాంతీయ రవాణా కార్యాలయానికి వెళ్లాలి. ఈ నేపథ్యంలో ఆటో మొబైల్ డీలర్ల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ మేరకు సొంత వినియోగానికి కొత్తగా కొనుగోలు చేసిన వాహనాల రిజిస్ట్రేషన్‌కు వాహనాలను ఆర్టీవో కార్యాలయానికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఈ విధానం సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

పెరియార్ సిద్ధాంతాలతో జీవిస్తున్న వీరమణి

కె.వీరమణిని సత్కరించిన ఉదయనిధి స్టాలిన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తంద్రై పెరియార్ సిద్ధాంతాలు, ఆశయాలతో ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీరమణి జీవిస్తూ అందరికీ ఆదర్శంగా ఉన్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కొనియాడారు. మంగళవారం కె.వీరమణి 93వ జన్మదినం సందర్భంగా చెన్నై వేపేరిలోని ఆయన నివాసానికి వెళ్లిన ఉదయనిధి స్టాలిన్ ఆయన్ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగిస్తూ.. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తంద్రై పెరియార్‌ను స్మరించుకొంటున్నారని, నేటి యువతరం కూడా ఆయన సిద్ధాంతాల గురించి తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారని, 'ఎస్ఐఆర్' లాంటి ప్రమాదాల నుంచి ప్రజలను హెచ్చరించే విధంగా 'విడుదలై' పత్రికలో కథనాలు ప్రచురిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పెరియార్ మార్గదర్శకాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, ఆయన మార్గంలోనే డీఎంకే ఎప్పుడూ పయనిస్తుందని తెలిపారు.

ఇండిగో విమాన సర్వీసులు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: పరిపాలన కారణాలతో మంగళవారం ఆరు ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేసినట్టు చెన్నై విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. కొచ్చి నుంచి చెన్నైకి రావాల్సిన విమానం, చెన్నై నుంచి గువాహటికి తెల్లవారు జామున 5.30కి బయలుదేరాల్సిన విమానం, భువనేశ్వర్ 5.50, జైపూర్ 6.45, ముంబయి 7.15, కొచ్చి 9.20 సర్వీసులు రద్దయ్యాయి. వాతావరణం లేదా మౌలిక సదుపాయాల సమస్యలతో రద్దు జరగలేదని, ఇతర మార్గాల్లో విమాన సేవలు యథాతథంగా జరిగాయని పేర్కొన్నారు.

హెక్టారుకు రూ.20 వేలు పరిహారం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దిత్వా తుపానుకు దెబ్బతిన్న పంటలకు హెక్టారుకు రూ.20 వేలు పరిహారం అందజేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి సాత్తూర్ రామచంద్రన్ తెలిపారు. చెన్నైలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దిత్వా తుపానుకు 85,521.76 హెక్టార్లలో పంటలు నీటమునిగాయని, నలుగురు ప్రాణాలు కోల్పోయారని, 582 పశువులు మృతి చెందాయని తెలిపారు. దెబ్బతిన్న పంటలకు హెక్టారుకు రూ.20 వేల పరిహారం అందజేయనున్నట్లు చెప్పారు. 54 పునరావాస కేంద్రాల్లో 3,534 మందికి బస వసతి కల్పించామని, చెన్నై నగరంలో తుపాను ఎదుర్కోవడానికి 11 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని వివరించారు.

3, 6 తేదీల్లో 'మెము' సేవల్లో మార్పు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్-అరక్కోణం సెక్షను లోని అరక్కోణం యార్డులో జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా 3, 6 తేదీల్లో 22.55కు బయలుదేరే 66009 ఎంఎంసీ-అరక్కోణం రైలు తిరువాలంగాడు వరకు వెళ్తుంది.

ఊత్తంగరైలో పురాతన ఆలయాల గుర్తింపు

వెలుగులోకి వచ్చిన ఓ ఆలయం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా ఊత్తంగరై సమీపంలోని పట్టపల్లి పంచాయతీ పట్టగనూర్ గ్రామంలో ప్రత్యేక నిర్మాణ శైలిలో ఉన్న మూడు ఆలయాలు వెలుగులోకి వచ్చాయి. దీని గురించి పాతపల్లి గ్రామ పరిపాలనాధికారి అన్నామలై పురావస్తుశాఖ పరిశోధకులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు పురావస్తుశాఖ అధికారుల బృందం అక్కడ పరిశోధనలు జరిపి ఓ నివేదికను విడుదల చేసింది. పల్లవుల కాలం చివరిలో దేవుళ్ల ఆలయాలకు రాళ్లను ఉపయోగించారని, రాజరాజ చోళుని పాలనలో ఆలయాల నిర్మాణం అత్యున్నత స్థాయికి చేరుకుందని, ఆ తర్వాత దేవాలయాల పైభాగంలో ఇటుక నిర్మాణం అభివృద్ధి చెందిందని తెలిపారు. విజయనగర రాజుల పాలనలో ప్రధాన, చిన్న దేవతలను కలిపారని, ఫలితంగా ఇక్కడ ఇటుకలతో 3 కేంద్ర ఆలయాలు నిర్మించబడ్డాయని వివరించారు. నాలుగు వైపులా ఇటుకలతో కూడిన గదిలా నిర్మించి క్రమంగా ఇటుకలను నాలుగు వైపులా లోపలికి అమర్చి పైభాగంలో చిన్న రంధ్రం చేసేలా దాన్ని ఇటుకలతో మూసేస్తారని, ఈ పద్ధతిని 'కదలికా కర్ణం'గా పిలుస్తారని పేర్కొన్నారు.

విజయ్ కటౌట్‌తో సభ్యత్వ కార్డులు పంపిణీ

సభ్యత్వ కార్డు అందిస్తున్న దృశ్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్ కటౌట్‌తో మదురై రైలు ప్రయాణికులకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. మదురై దక్షిణ జిల్లా టీవీకే కార్యదర్శి తంగపాండి నేతృత్వంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ నేతలను ఉత్సాహపరిచేలా ఇలా చేసినట్లు ఆయన తెలిపారు.

వేలూరు జిల్లాలో 1.76 లక్షల ఓట్ల తొలగింపునకు అవకాశం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 13,03,030 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మరణించడం, ఇతర ప్రదేశాలకు శాశ్వతంగా వలస వెళ్లడం, రెండు ఓట్లు ఉండటం, పేర్కొన్న చిరునామాలో లేకపోవడం తదితర కారణాలతో 1.76 లక్షల ఓట్లను తొలగించే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం తెలిపింది. జిల్లాలో ఈ నెల 4వ తేదీ నుంచి 'ఎస్ఐఆర్' పనులు మొదలయ్యాయని, ఇందుకుగాను ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,314 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంది.

భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు

గవర్నర్ ఆర్.ఎన్.రవి

కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

చెన్నై, న్యూస్‌టుడే: భారతదేశపు భిన్నత్వంలో ఏకత్వాన్ని రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు చాటుతున్నాయని గవర్నర్ ఆర్.ఎన్.రవి తెలిపారు. నాగాలాండ్, అసోం రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని తమిళనాడులో నివసిస్తున్న ఆ రాష్ట్రాల ప్రజలతో గిండిలోని లోక్‌భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల గిరిజన కళాకారులు నృత్యాలు ప్రదర్శించగా వాటిని గవర్నర్, లోక్‌భవన్ సిబ్బంది తిలకించారు. కళాకారులను గవర్నర్ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలు ఏ ఒక్క రాష్ట్ర ప్రజలకో సంబంధించినవి కావన్నారు. అవి భారతదేశపు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే అసాధారణ వేడుకలని తెలిపారు. బ్రహ్మపుత్ర, కావేరి నదుల సంస్కృతి, నాగరికతలను తన ప్రసంగంలో ఉదహరించారు. తమిళనాడుకు వెలుపల తమిళాన్ని ప్రోత్సహించే ఉద్దేశంలో భాగంగా గువాహటి విశ్వవిద్యాలయంలో తమిళ డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టగా తమిళాన్ని ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తితో నేర్చుకుంటున్నారని తెలిపారు.

'సీపీఏ' ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్‌గా ఎస్.విశ్వనాథన్

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై పోర్ట్ అథారిటీ (సీపీఏ) ఛెయిర్‌పర్సన్ సునీల్ పాలివాల్ కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, వాటర్ వేస్ మంత్రిత్వ శాఖ పరిధిలోని 'ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' విభాగానికి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. సీపీఏకి డిప్యూటీ ఛెయిర్‌పర్సన్‌గా ఉన్న ఎస్.విశ్వనాథన్ ఇన్‌ఛార్జి ఛెయిర్‌పర్సన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశ్వనాథన్ మెకానికల్ ఇంజినీరింగులో పట్టభద్రుడు, ఎంబీఏ మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్ చదివారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) నుంచి ఎకనమిక్స్‌లో మైక్రోమాస్టర్స్ ప్రోగ్రాంను పూర్తి చేశారు. గతంలో పలు సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేసిన ఆయన 'మారిటైమ్ ఇండియా ఫౌండేషన్'కు మేనేజింగ్ డైరెక్టరుగా కూడా సేవలందించారు.

విద్యార్థినిపై సామూహిక అత్యాచారం రోజున మరొక హత్య చేసిన నిందితులు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం కేసులో అరెస్టైన ముగ్గురు నిందితులు అదేరోజు మేకల వ్యాపారిని కూడా హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది సెంట్రల్ జైలులో ఉన్న నిందితులు ముగ్గురిని గతనెల 27న ఒకరోజు పోలీసు కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. అత్యాచారానికి పాల్పడిన రోజే అన్నూర్ వద్ద సెరైయాంపాళ్యంలో దేవరాజ్ అనే మేకల వ్యాపారిని కొట్టి చంపినట్లు తేలింది. ముగ్గురూ కూర్చుని మద్యం తాగుతుండగా దేవరాజ్ మందలించడంతో కర్రతో దాడిచేసి వెళ్లిపోయారని తెలిసింది. నవంబరు 5న దేవరాజ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని 6న కోవిల్‌పాళ్యం పోలీసు స్టేషన్ సరిహద్దులో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో వైపు నిందితులపై 50 పేజీల ఛార్జిషీట్‌ను కోవై పీళమేడు పోలీసులు మంగళవారం అదనపు మహిళా కోర్టులో దాఖలు చేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం

తిరుత్తణి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు తగిన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో మున్సిపాలిటీలు, టౌన్ పంచాయతీల్లో నామినేటెడ్ సభ్యులుగా నియమించాలని సీఎం స్టాలిన్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుత్తణి మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన సాధారణ కౌన్సిలర్ల సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం నెరవేర్చారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సరస్వతి భూపతి, వైస్ ఛైర్‌పర్సన్ సామిరాజ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వరుని దర్శించుకున్న ఇళయరాజా

ఆలయ ప్రాంగణంలో ఇళయరాజా

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మహా దీపోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

గిరి ప్రదక్షిణ బాటలో 1060 సీసీ కెమెరాల ఏర్పాటు

ఆలయంలో కార్తిక మహా దీపం వెలిగించే ఉత్సవం బుధవారం జరగనుంది. ఇందులో లక్షలాది మంది భక్తులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల భద్రత కోసం ప్రత్యేక క్రైం బ్రాంచ్ పోలీసులు మఫ్టీలో నిఘా ఉంచనున్నారు. ఆలయం వద్ద, గిరి ప్రదక్షిణ బాటలో 1060 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను మంగళవారం జిల్లా కలెక్టరు తర్పగరాజ్ పరిశీలించారు.

52 విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం

వడపళని, న్యూస్‌టుడే: దిత్వా తుపాను, తక్కువ మంది ప్రయాణికులుండటంతో మంగళవారం దాదాపు 52 విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణం అనుకూలించక మధ్యాహ్నం 2 గంటలకు రావాల్సిన, వెళ్లాల్సిన 23 విమానాలు రద్దు చేశారు. ఇందులో అహ్మదాబాద్, అండమాన్, ముంబయి, గువాహటి, భువనేశ్వర్, కొచ్చి, దిల్లీ, కోయంబత్తూరు, బెంగళూరుకు వెళ్లాల్సిన 13 విమానాలు, తెల్లవారు జామున 4.35కు ఇండోనేషియాకు వెళ్లాల్సిన విమానం కూడా ఉంది. పుణె, అండమాన్, భువనేశ్వర్, గువాహటి, ముంబయి, కొచ్చి, జైపూర్, విజయవాడ నుంచి రావాల్సినవి కూడా రద్దయ్యాయి. 29 విమానాలు గంట నుంచి అయిదు గంటలు ఆలస్యంగా వచ్చి చేరుకున్నాయి. ముంబయి, పుణె, హైదరాబాద్, అండమాన్, తిరుచ్చి, సిలిగురి, దిల్లీ, పట్నా, కోల్‌కతా, మదురై, సేలం, సింగపూరుకు వెళ్లాల్సిన 18 సర్వీసులు బాగా ఆలస్యంగా నడిచాయి. మంగళవారం 52 విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగిందని అధికారులు పేర్కొన్నారు.

మతతత్వ శక్తులను ఓడిస్తాం

ఎంపీ సు.వెంకటేశన్

ప్యారిస్, న్యూస్‌టుడే: కార్తిక దీపాన్ని అల్లర్ల దీపంగా మార్చేందుకు యత్నించే మతతత్వ శక్తులను తమిళనాడు ఓడిస్తుందని ఎంపీ సు.వెంకటేశన్ తెలిపారు. తిరుప్పరకుండ్రం కొండపై సికందర్ దర్గాకు 15 మీ. దూరంలో ఉన్న దీప స్తంభంపై కార్తిక దీపం వెలిగించేందుకు మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్ అనుమతించారు. ఈ విషయమై ఎంపీ సు.వెంకటేశన్ తన ఎక్స్ పేజీలో.. మతతత్వ రాజకీయాలను ఏ కుర్చీలో కూర్చుని అమలు చేసినా దానిని ఓడించే బలం తమిళనాడు లౌకిక శక్తులకు ఉందన్నారు.

సెంగోట్టైయన్ ఇంటికి సాయుధ పోలీసు భద్రత ఉపసంహరణ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మాజీమంత్రి సెంగోట్టైయన్ ఇంటికి సాయుధ పోలీసు భద్రత వెనక్కి తీసుకున్నారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన సెంటగోట్టైయన్ గతవారం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటికి నియమించిన సాయుధ పోలీసు భద్రత వాపస్ తీసుకున్నారు. ఆయన ఇంటి భద్రతకు ఉత్తర భారత దేశానికి చెందిన ఇద్దరు బౌన్సర్లను నియమించుకున్నారు.

పుదుచ్చేరి రాజకీయాల్లో మార్పు

☛ సీఎం అభ్యర్థిగా జగద్రక్షగన్?

జగద్రక్షగన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఇండియా కూటమికి నాయకత్వం, సీట్ల విషయమై డీఎంకే, కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. అన్ని నియోజకవర్గాల్లో డీఎంకే బలోపేతానికి సభ్యుల చేరిక కొనసాగుతోంది. ఈ బాధ్యత పార్టీ సిద్ధాంత ప్రచారకార్యదర్శి జగద్రక్షగన్‌కు అప్పగించారు. ఇందుకోసం ఆయన అక్టోబరు నుంచి పుదుచ్చేరిలోనే ఉంటున్నారు. ఈసారి జగద్రక్షగన్ పుదుచ్చేరిలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే చర్చలు ప్రారంభమయ్యాయి. డీఎంకే వర్గీయులు మాట్లాడుతూ..పుదుచ్చేరికి సమీపంలోని కలింగమలై(విలుపురం జిల్లా) జగద్రక్షగన్ సొంతూరని తెలిపారు. ఆయనకు పుదుచ్చేరితో సన్నిహిత వ్యాపార సంబంధాలున్నాయన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో శ్రీపెరంబుదూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారని, ఆ తర్వాత పుదుచ్చేరి నుంచి రాజ్యసభకు వెళ్లే ప్రయత్నం చేయగా వివిధ కారణాలతో కుదరలేదన్నారు. దిశానిర్దేశం లేకపోవడంతో విడిపోయిన పుదుచ్చేరి డీఎంకే వర్గాలు ఇప్పుడు ఎన్నికల కోసం ఏకమవుతున్నాయని పేర్కొన్నారు. అధిష్ఠానం ఆజ్ఞ శిరసావహిస్తామని జగద్రక్షగన్ తెలిపారు. తనను రాయబారిగానే పుదుచ్చేరికి పంపారని చెప్పారు. సీట్ల కేటాయింపును నిర్ణయించే అధికారం తమకు లేదన్నారు.

భారీవర్షాలు నేపథ్యంలో చేపడుతున్న చర్యలపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మంగళవారం రిప్పన్ బిల్డింగ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు కె.ఎన్.నెహ్రూ, పి.కె.శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, చెన్నై

పుదుచ్చేరిలో విజయ్ రోడ్‌షో మానుకోవాలి

స్పీకర్ ఏంబలం సెల్వం

సీఎం రంగసామికి పుస్తకం అందిస్తున్న ఆదవ్ అర్జున, బుస్సి ఆనంద్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో విజయ్ రోడ్‌షో మానుకోవాలని శాసనసభాపతి ఏంబలం సెల్వం తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కరూర్ ఘటనకు సంబంధించిన కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పుదుచ్చేరిలో రోడ్‌షో నిర్వహించేందుకు టీవీకే అనుమతి కోరుతున్నారని చెప్పారు. తమిళనాడులోలా పుదుచ్చేరిలో అతిపెద్ద జాతీయ రహదారులు లేవన్నారు. చిన్నపాటి రోడ్లు ఉన్నాయని, రద్దీ అధికంగా ఉంటుందన్నారు. బహిరంగసభ నిర్వహించుకోవాలని సూచించారు. అందుకు ప్రభుత్వం అనుమతిస్తుందన్నారు.

రంగసామిని కలిసిన టీవీకే నిర్వాహకులు

ఆర్కేనగర్: టీవీకే అధ్యక్షుడు విజయ్ 5న పుదుచ్చేరిలోని కాలాపట్టు నుంచి ఉప్పలం వరకు రోడ్‌షో నిర్వహించేందుకు అనుమతి కోరుతూ పుదుచ్చేరి పోలీసుశాఖకు లేఖ ఇచ్చారు. రోడ్‌షోకు అనుమతి లేదని పుదుచ్చేరి డీఐజీ సత్యసుందరం మంగళవారం తెలిపారు. అందుకుబదులు పుదుచ్చేరిలో బహిరంగసభకు అనుమతిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధానకార్యదర్శి ఆదవ్ అర్జున మంగళవారం పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామిని నేరుగా కలిశారు. రోడ్‌షోకు అనుమతి కోరారు. కామరాజర్ పుస్తకాన్ని రంగసామికి అందించారు. టీవీకే ప్రధానకార్యదర్శి బుస్సి ఆనంద్, మాజీ ఎమ్మెల్యే సామినాథన్ వెంట ఉన్నారు.

1వ తేదీ రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 1న సోమవారం రూ.302 కోట్ల మేర ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగాయని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుభ దినాల్లో ఎక్కువగా భూముల కొనుగోలు, ఇంటి నిర్మాణ ఒప్పందాలు, లీజులు, ఇళ్ల కొనుగోళ్లకు సంబంధించి ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని, ఆ మేరకు సోమవారం శుభ దినం కావడంతో రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో అదనంగా టోకెన్లు కేటాయించారని, తద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ రూ. 302 కోట్ల మేర ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించిందని తెలిపారు.

కలైజ్ఞర్ ఎళుతుకోల్ పురస్కారం ప్రదానం



సుకుమార్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: పత్రికారంగంలో 50ఏళ్లుగా సేవలు అందిస్తున్న సుకుమార్‌కు 2024వ ఏడాదికిగాను 'కలైజ్ఞర్ ఎళుతుకోల్' పురస్కారాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. సామాజికాభివృద్ధి కోసం, అట్టడుగున ఉన్న ప్రజల పురోభివృద్ధి కోసం పత్రికారంగం ద్వారా కృషి చేస్తున్నవారికి ఏటా పురస్కారం, రూ. 5లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేయనున్నట్లు 2021-22వ ఏడాది సమాచార ప్రజాసంబంధాల శాఖ పద్దుల్లో ప్రకటించారు. ఆ మేరకు 2024వ ఏడాది పురస్కారాన్ని దినతంతి దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ టీఈఆర్ సుకుమార్‌కు అందించారు.

ఉద్యోగులకు నివాసాలు

చెన్నై: ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగులకు తండయారుపేట్టైలోని కామరాజర్‌నగర్‌లో నివాసాలు నిర్మించనున్నట్లు 2022-23వ ఏడాది స్టేషనరీ, ప్రింటింగ్ పద్దుల్లో ప్రకటించారు. ఆ మేరకు రూ. 39.30 కోట్లతో ఆధునిక వసతులతో 96 నివాసాలను నిర్మించారు. వాటిని సచివాలయం నుంచి వీసీ ద్వారా మంగళవారం ముఖ్యమంత్రి ప్రారంభించి ఉద్యోగులకు కేటాయింపు ఉత్తర్వులను అందించారు.

'నలం కాక్కుం స్టాలిన్'పై సమీక్ష

చెన్నై: 'నలం కాక్కుం స్టాలిన్' పథకంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. శిబిరాలకు వచ్చే ప్రజలకు తాగునీరు, కుర్చీలు, మరుగుదొడ్డి తదితర కనీస వసతులను కల్పించడాన్ని ధ్రువీకరించాలని అధికారులకు స్టాలిన్ సూచించారు. ప్రజలకు సరైన మార్గదర్శకాలు అందించడానికి సరిపడా వాలంటీర్లను నియమించాలని, శిబిరాల గురించి ప్రజలకు తెలిపేలా ప్రచారం చేయాలన్నారు.

(c) eenadu

విరిగిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది ● వాననీటిని తొలగిస్తూ.. ● పెరంబూర్ రైల్వేస్టేషన్ వద్ద..

చెన్నైలో ముమ్మరంగా వరద సహాయక చర్యలు

ప్యారిస్: లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని పోలీసులు రక్షించారు. దిత్వా తుపాను కారణంగా గాలులతో కూడిన అతిభారీవర్షం కురుస్తుందని హెచ్చరికలు జారీ కావడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరు అరుణ్ ఉత్తర్వుల మేరకు విపత్తు సహాయక చర్యల కోసం కమిషనరు కార్యాలయంలో కంట్రోల్ రూమ్, డిప్యూటీ కమిషనరు కార్యాలయాల్లో 12 కంట్రోల్ రూమ్‌లను, 49 చోట్ల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సోమవారం కురిసిన భారీవర్షం కారణంగా నగరంలో పలుచోట్ల విరిగిపడిన 48 చెట్లను ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి పోలీసులు తొలగించారు. పాండిబజార్‌లో లోతట్టు ప్రాంతంలో చిక్కుకున్న 10 మందిని రక్షించారు. ఫ్లవర్ బజార్‌లో రోడ్డుపై పడిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలు ప్రాంతాల్లో నిలిచిన వాననీటిని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మునీశ్వరుని వాహనంపై చంద్రశేఖరస్వామి అనుగ్రహం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కార్తిక మహా దీపోత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం ఉదయం వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. తర్వాత ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మునీశ్వరుని వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వల్లకోట ఆలయంలో ప్రత్యేక పూజలు

అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సమేత మురుగన్

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా ఒరగడం సమీపంలోని ప్రసిద్ధ వల్లకోట మురుగన్ ఆలయంలో కార్తిక మాసం భరణి నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం శ్రీ వల్లీ దేవసేన ఉత్సవమూర్తులకు, స్వామివారి మూల విరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహించారు.

నేడు వేదపురీశ్వరాలయంలో కార్తిక దీపోత్సవం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా తిరుక్కళికుండ్రంలోని ప్రసిద్ధ వేదపురీశ్వరాలయంలో బుధవారం ఉదయం పంచమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆలయ సిబ్బంది బిందెలతో నాలుగు మాడ వీధుల్లో భక్తుల నుంచి సేకరించే నువ్వుల నూనెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. ఆ నూనెతో సాయంత్రం 6 గంటలకు మహా దీపాన్ని వెలిగిస్తారు. సొక్కబాన వినాయకుడి ఆలయం ఎదుట రాత్రి సొక్కబానం వెలిగిస్తారు. తరువాత పంచమూర్తుల ఊరేగింపు ఉంటుంది.

వైభవంగా ప్రదోషోత్సవం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రదోషోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు, సాయంత్రం నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాననీటి తొలగింపు పనుల పరిశీలన

చెన్నై, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో నగరంలో జరుగుతున్న వాననీటి తొలగింపు పనులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మేయర్ ప్రియ వేర్వేరుగా పరిశీలించారు. భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లోని పరిస్థితులను ఉప ముఖ్యమంత్రి సమీక్షించారు. పురసైవాక్కంలోని తానా వీధి, వెల్లాల వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన వాననీటిని యంత్రాల ద్వారా తొలగించే పనులు, ఓట్టేరి కాలువలో నిరాటంకంగా నీరు ప్రవహించడాన్ని పరిశీలించారు. రిప్పన్ బిల్డింగ్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)ను పరిశీలించి 1913 టోల్‌ఫ్రీ నంబరుకు ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. స్టీఫెన్సన్ కాలువ, ఓట్టేరి నల్లా కాలువల్లో నీటి ప్రవాహాన్ని, పులియంతోప్పులో నిలిచిన వర్షపునీటి తొలగింపు పనులను మేయర్ ప్రియ పరిశీలించారు. పెరంబూర్ సబ్‌వేలో వాహనాల రాకపోకలను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.

చెన్నై నెహ్రూ ఇండోర్ స్టేడియంలో సోమవారం సీఎస్ఐ మద్రాస్ డయోసెస్ తరఫున మంగళవారం 'ఛాంపియన్స్ బియాండ్ బారియర్స్-2025' కార్యక్రమం జరిగింది. ఇందులో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పాల్గొని క్రీడా పోటీలలో గెలుపొందిన దివ్యాంగ క్రీడాకారులకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. మంత్రులు పీకే శేఖర్‌బాబు, మనో తంగరాజ్, జీసీసీ మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు. - ట్రిప్లికేన్, న్యూస్‌టుడే

కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రంగసామి, ఎల్జీ కైలాష్‌నాథన్

2 నెలల్లో 1000 మందికి ఉద్యోగావకాశాలు

పుదువై ముఖ్యమంత్రి రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో రెండునెలల్లో వెయ్యిమంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ తరపున 256 మంది సహాయకులు, 41మంది గ్రామ పరిపాలనా అధికారులు, 54 మంది గ్రామ సహాయకులు, 9 మంది బహుళార్థసాధక ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందించే కార్యక్రమం సోమవారం సాయంత్రం కంబన్ ఆడిటోరియంలో జరిగింది. ఎల్జీ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి మాట్లాడుతూ ప్రతినెల 7వ తేదీన వృద్ధులకు పింఛన్ ఇస్తున్నామన్నారు. ప్రతి రంగంలోనూ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు 3,264 ఖాళీలను భర్తీ చేశామన్నారు. గత పాలనలో ఏ పోస్టు భర్తీ చేయలేదని ఆరోపించారు.

అప్పీల్ దాఖలు చేయాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పరకుండ్రం కొండపై దీపం వెలిగించడానికి సంబంధించిన తీర్పును వ్యతిరేకిస్తూ అప్పీల్ దాఖలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం కోరారు. ఆయన పుదుకోట్టైలో విలేకరులతో మాట్లాడారు. తిరుప్పరకుండ్రంలో ఇప్పటివరకు ఆచరణలో లేని చోటులో దీపం వెలిగించవచ్చని హైకోర్టు మదురై ధర్మాసనం సోమవారం సాయంత్రం తీర్పునిచ్చిందన్నారు. గతంలో ఇచ్చిన అన్ని తీర్పులకు ఇది విరుద్ధంగా ఉందన్నారు. రెండు మతాల ప్రజల మధ్య చాలాకాలంగా ఉన్న సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందన్నారు.

డీఎంకే వ్యతిరేక ఓట్లు ఎన్డీయేకే

నయినార్ నాగేంద్రన్

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నామలై ప్రత్యేక పార్టీ ప్రారంభిస్తారన్న విషయమై బాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ వివరణ ఇచ్చారు. బాజపాతో కూటమి ఏర్పాటు చేయడంతోనే అన్నాడీఎంకే అధికారంలోకి రాలేదనడంలో నిజం లేదని నయినార్ నాగేంద్రన్ తెలిపారు. మదురైలో రాష్ట్ర బాజపా అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడారు. డీఎంకే అన్ని ఎన్నికల హామీలను నెరవేర్చిందా అని ప్రశ్నించారు. ఎవరు ఏ పార్టీలోకి వెళ్లినా 2026 ఎన్నికల్లో కచ్చితంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. డీఎంకే వ్యతిరేక ఓట్లు తమకు వస్తాయన్నారు. అన్నామలై తమ పార్టీలో ఉన్నారని, ఆయన ప్రత్యేక పార్టీ ప్రారంభించరని చెప్పారు. మదురైలో అల్లర్లు ఏర్పడితే ఎంపీ సు.వెంకటేశన్‌దే బాధ్యత అన్నారు.

ప్రబంధ పారాయణం చేయడానికి వడగలై వర్గానికి అనుమతి లేదు: హైకోర్టు

ప్యారిస్: కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రబంధ పారాయణానికి వడగలై వర్గానికి అనుమతిస్తూ మద్రాసు హైకోర్టు సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం రద్దు చేసింది. ఆలయంలో ప్రబంధం, మంత్రాల పఠనం చేసేందుకు వడగలై, తెన్‌గలై వర్గాల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఆలయ బ్రహ్మోత్సవంలో తెన్‌గలై వర్గం మాత్రమే ప్రబంధ పారాయణానికి అనుమతిస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ వడగలై వర్గీయులు హైకోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన హైకోర్టు ఆలయంలో ఉన్న మొదటి మూడు వరుసలో తెన్‌గలై వర్గం, వారి వెనుక వడగలై వర్గం కూర్చునేందుకు అనుమతివ్వాలని, ప్రబంధంలోని మొదటి తెన్‌గలై వర్గం, శ్రీశైల దయాపత్రం చదవాలని, ఆ తర్వాత వడగలై వర్గం శ్రీరామానుజ దయాపత్రం చదవాలని ఆ తర్వాత ఇరు వర్గాలు నాలాయిర దివ్య ప్రబంధం పారాయణం చేసేందుకు అనుమతి ఇవ్వాలని తెలిపింది. మణవాళ మామునికల్ వళి తిరునామం పారాయణం చేసేందుకు తెన్‌గలై వర్గానికి అనుమతివ్వాలని, ఆ తర్వాత దేశికన్ వాళి తిరునామం పారాయణానికి వడగలై వర్గానికి అనుమతివ్వాలని 2022 మే నెలలో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెన్‌గలై తరఫున అప్పీల్ దాఖలైంది. వడగలై వర్గం జోక్యం చేసుకోవడాన్ని అడ్డుకోవడానికి పోలీసు భద్రత కల్పించాలని కేసులు దాఖలయ్యాయి. 1915లో తెన్‌గలై వర్గానికి అనుకూలంగా ఇచ్చిన తీర్పును అమలుపరచాలని తెలిపే ఆలయ సహాయ కమిషనర్ ఉత్తర్వులను కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. వీటన్నింటిపై సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సురేష్‌కుమార్, జస్టిస్ సౌందర్ కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. 200 ఏళ్లకుపైగా సమస్య కొనసాగుతోందని, వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రబంధ పారాయణానికి కాంచీపురంలో ఉంటున్న తెన్‌గలై వర్గానికి మాత్రమే హక్కు ఉందని, వడగలై వర్గం ఆ హక్కులో జోక్యం చేసుకునేందుకు కుదరదని 1915, 1969లో జారీచేసిన తీర్పులు స్పష్టం చేస్తున్నాయన్నారు. గతంలో జారీచేసిన తీర్పులు వడగలై వర్గానికి వర్తించవని వాదనలు చెల్లవని తెలిపి వడగలై వర్గం ప్రబంధ పారాయణం చేసేందుకు అనుమతి ఇస్తూ 2022లో సింగిల్ జడ్జి జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. 1915, 1969లో హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను ఆలయ సహాయ కమిషనర్ అమలు చేయాలని, అవసరమైతే పోలీసు సహాయం కోరవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నగదు కోసం ప్రజాప్రయోజన వ్యాజ్యమా?

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: అవసరాలు తీర్చుకునేందుకు కొందరు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేయడం దిగ్భ్రాంతి కలిగిస్తోందని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. కారైక్కుడి పట్టణ పంచాయతీలో అనుమతి లేకుండా నిర్మించిన భవనం విషయమై తగిన చర్యలు చేపట్టాలని శివగంగై జిల్లా కారైక్కుడికి చెందిన పూల్‌పాండి మదురై ధర్మాసనంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్ ధర్మాసనంలో మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషన్ వెనక్కి తీసుకోనున్నట్లు పిటిషనర్ తరఫున తెలియజేయగా న్యాయమూర్తులు నిరాకరించారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసి దానిద్వారా నగదు వసూలు చేసే పరిస్థితి నెలకొందన్నారు. నగదు లభించిన వెంటనే వ్యాజ్యం వెనక్కి తీసుకుంటున్నారని, ఇది ఆమోదించదగ్గది కాదన్నారు. నాలుగేళ్లుగా ఈ కేసు పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ కేసులో నోటీసులు జారీ చేయకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కారణం లేకుండా వెనక్కి తీసుకోవడానికి అనుమతి కోరితే అధిక జరిమానా విధిస్తారని హెచ్చరించి, పిటిషనర్ 9వ తేదీ హాజరవ్వాలని ఉత్తర్వులు ఇచ్చారు.

తిరుప్పరకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించాలి



తీర్పు నకలుతో రామ రవికుమార్ తదితరులు

కోర్టు తీర్పు నకలుతో ఆలయంలో పూజలు

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుప్పరకుండ్రం కార్తిక దీపం వ్యవహారమై జారీచేసిన మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తీర్పు నకలును సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఉంచి పిటిషనర్ పూజలు చేశారు. కొండపై ఉన్న దీపస్తంభంలో ఆలయం తరపున కార్తిక దీపం వెలిగించాలని మదురైకి చెందిన రామ రవికుమార్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన మదురై ధర్మాసనం దీపం వెలిగించేందుకు అనుమతిచ్చింది. తీర్పు నకలును రామ రవికుమార్, ఆయన తరపు లాయరు అరుణ్ స్వామినాథన్ తిరుప్పరకుండ్రం ఆలయంలో ఉంచి పూజలు జరిపించారు. అరుణ్ స్వామినాథన్ మాట్లాడుతూ.. తిరుప్పరకుండ్రం కొండపై ఉన్న దర్గా నుంచి 15 మీటర్ల దూరంలోని ప్రాంతాల్లో దీపం వెలిగించవచ్చని 1996లో తీర్పు ఉందని, తీర్పును దేవాదాయశాఖ, దేవస్థానం అమలు చేయని నేపథ్యంలో కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. హిందువులు, ముస్లింలకు ఎలాంటి సమస్య లేదని, రాజకీయ లబ్ధి కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

వైగై జలాశయానికి పెరిగిన నీటి ప్రవాహం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తేని జిల్లాలోని వెళ్లిమలై, వరుసనాడు, అయ్యనార్‌కోవిల్, దానా గార్డెన్ తదితర ప్రాంతాల్లో వర్షాల కారణంగా వైగై జలాశయానికి ప్రవాహం పెరిగింది. కండమనూరు చెక్‌డ్యామ్ వద్ద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. స్నానం చేయడం, బట్టలు ఉతకడం, పశువులను తీసుకెళ్లొద్దని యంత్రాంగం సూచించింది. వైగై జలాశయం నీటిమట్టం మంగళవారం ఉదయం 63.29 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 71 అడుగులు. సెకనుకు 1740 క్యూబిక్ అడుగుల నీరు వస్తోంది. తాగు, సాగు ప్రయోజనాల కోసం 1319 క్యూబిక్ అడుగుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైల్వే స్టేషన్లలో, బోగీ లోపల కర్పూర హారతి నిషిద్ధం

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాణిస్తున్న రైళ్లలో, స్టేషన్లలో అయ్యప్ప భక్తులు కర్పూరం వెలిగించడం నిషిద్ధమని మంగళవారం దక్షిణరైల్వే చెన్నై డివిజన్ ప్రకటన విడుదల చేసింది. తోటి ప్రయాణికులు, రైల్వే ఆస్తులకు నష్టాలు జరగకూడదనే అభిప్రాయంతో భక్తులకు ఈ సూచన చేస్తున్నామన్నారు. ఉల్లంఘించిన వారికి రైల్వే చట్టం ప్రకారం జరిమానా విధిస్తామన్నారు.

'పసుమై ఛాంపియన్' అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

విల్లివాక్కం: పర్యావరణ భద్రతకు కృషి చేస్తున్న వారికి అందించే 'పసుమై ఛాంపియన్' అవార్డుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నామక్కల్ కలెక్టర్ దుర్గామూర్తి ప్రకటన విడుదల చేశారు. ఏటా 100 మంది వ్యక్తులు, సంస్థలకు రూ.లక్ష బహుమతిగా అందజేస్తారన్నారు. 2026 జనవరి 20లపు దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు జిల్లా పర్యావరణ ఇంజినీర్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులు పొందిన ఇద్దరు విదేశీయుల అరెస్టు



షిముల్‌దాస్, సెల్వి వలంతియా ఫ్రీడ్రైజ్

ప్యారిస్: బంగ్లాదేశ్‌కి చెందిన షిముల్ దాస్ నకిలీ పత్రాలతో తన బంగ్లాదేశ్ పౌరసత్వాన్ని దాచి శ్రీవాష్ కృపదాస్ పేరుతో భారత పాస్‌పోర్ట్ పొంది మలేసియా వెళ్లేందుకు యత్నించాడు. అదేవిధంగా శ్రీలంకకు చెందిన సెల్వి వలంతియా ఫ్రీడ్రైజ్ నకిలీ పత్రాలతో తన శ్రీలంక పౌరసత్వాన్ని దాచి భారత పాస్‌పోర్ట్ పొంది శ్రీలంక వెళ్లేందుకు యత్నించింది. ఇందుకు సంబంధించి గత నెల 30వ తేదీ చెన్నై విమానాశ్రయ అధికారుల ఫిర్యాదు మేరకు వారిద్దరిని చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో షిముల్ దాస్ 2017లో బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్‌తో పర్యాటక వీసా తీసుకొని భారతదేశానికి వచ్చాడని, అనంతరం మన దేశ ఆధార్, ఓటరు కార్డు పొంది వాటి ద్వారా భారత పాస్‌పోర్ట్ తీసుకుని ప్రస్తుతం మలేసియా వెళ్లేందుకు యత్నించినట్లు తెలిసింది. అదేవిధంగా సెల్వి వలంతియా ఫ్రీడ్రైజ్ తల్లిదండ్రులు 1984లో శ్రీలంక నుంచి పర్యాటక వీసా నుంచి భారతదేశానికి వచ్చారని, వలన్‌తియా ఫ్రీడ్రైజ్ ఊటీలో పుట్టినట్లు తెలిసింది. అనంతరం ఆమె ఆధార్‌కార్డు మొదలైన ధ్రువీకరణ పత్రాలు పొంది వాటి ద్వారా భారత పాస్‌పోర్ట్ తీసుకొని తిరిగి శ్రీలంక వెళ్లేందుకు యత్నించినట్లు తేలింది. అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

కిడ్నాప్ కేసులో ముగ్గురు...

అరెస్టయిన జోసఫ్, దీపక్‌జాన్, ముత్తుకుమార్

ప్యారిస్, వేళచ్చేరి: చెన్నై నీలాంగరైకి చెందిన పచ్చయప్పన్ గత నెల 30వ తేదీ కారులో తిరుప్పోరూర్ ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో ఆయనకు తెలిసిన వెట్రి అనే వ్యక్తి, మరికొందరు కలిసి పచ్చయప్పన్‌ను కిడ్నాప్ చేశారు. రూ. 15 లక్షలు ఇవ్వాలని బెదిరించారు. ఇందుకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి కిడ్నాప్ చేసి దాచిన ప్రాంతాన్ని గుర్తించి అక్కడకు వెళ్లి పచ్చయప్పన్‌ని విడిపించారు. నిందితులు జోసఫ్, దీపక్ జాన్, ముత్తుకుమార్‌ను అరెస్టు చేశారు. దర్యాప్తులో.. పచ్చయప్పన్, వెట్రి స్నేహితులని, కొన్ని నెలల క్రితం పచ్చయప్పన్.. తనకు వేలూర్‌లో ఉన్న స్థలాన్ని విక్రయించాలని చెప్పడంతో వెట్రి వేరొకరికి విక్రయించేందుకు రూ.లక్ష ధర మాట్లాడి అడ్వాన్స్ ఇప్పించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పచ్చయప్పన్ వద్ద డబ్బులు ఎక్కువగా ఉన్నాయని భావించిన వెట్రి. . తన స్నేహితులతో కలిసి స్నేహితుడిని కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. ఈ కేసులో పరారీలో ఉన్న మరి కొందరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న నకిలీ వైద్యుడు...

టీనగర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొందరు ఓ కారులో అత్యాధునిక స్కానింగ్ యంత్రాన్ని ఉంచి, గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వైద్యాధికారులకు ఫిర్యాదులందాయి. ఈ క్రమంలో ఆ ముఠా సేలం జిల్లా వాళప్పాడి సమీపంలోని బేలూరు ప్రాంతంలో మకాం వేసినట్లు సమాచారం అందడంతో సేలం గ్రామీణ వైద్య సేవల సంయుక్త డైరెక్టర్ డాక్టర్ నందిని నేతృత్వంలో వైద్యుల బృందం ఆ ప్రాంతంలో సోదాలు నిర్వహించింది. అక్కడి ఓ ఇంట్లో స్కానింగ్ తీస్తున్నట్లు గుర్తించింది. అక్కడకు వెళ్లి స్కానింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకుంది. నకిలీ వైద్యుడు విరుదాచలానికి చెందిన వెంకటేశ్ 12వ తరగతి వరకే చదివి చికిత్స అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో వెంకటేశ్, అతనికి మధ్యవర్తిగా వ్యవహరించిన విలారిపాళయానికి చెందిన లత, మారియమ్మాళ్‌ను అదుపులోకి తీసుకుని వాళప్పాడి పోలీసులకు అప్పగించారు.

చెన్నై విమానాశ్రయంలో గంజాయి, విదేశీ తాబేళ్లు స్వాధీనం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయానికి ఆదివారం మలేసియా విమానంలో బ్యాంకాక్, కౌలాలంపూర్ మీదుగా వచ్చిన భారతీయుడి వద్ద ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ అధికారులు సోదా చేశారు. బ్యాగులో దాచి తెచ్చిన 3.42 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.2 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. * ఆదివారం థాయ్ లయన్ ఎయిర్‌లైన్స్‌లో బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద సోదా చేసి రూ.24.3 లక్షల విలువైన 693 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లో నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. * సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో మలేసియా, కౌలాలంపూర్ మీదుగా 28వ తేదీ చెన్నైకి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద తనిఖీ చేసి 2,805 ఎరుపు రంగు చెవులతో ఉన్న స్లైడర్ తాబేళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల రక్షణ చట్టం కింద నిందితుడిని అరెస్టు చేశారు. తాబేళ్లను అదేరోజు ఏ దేశం నుంచి తీసుకొచ్చారో అక్కడికి తిప్పి పంపారు.

సేలం జైలు వార్డెన్ నుంచి నిషేధిత వస్తువులు...

టీనగర్: సేలం సెంట్రల్ జైలు వార్డెన్ సెల్వరాజ్ వద్ద గత నెల 28వ తేదీ అధికారులు తనిఖీ చేశారు. అతని బ్యాగులో మూడు సెల్‌ఫోన్లు, 80 గ్రాముల గంజాయి, 30 మత్తుమాత్రలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిని అస్తంబట్టి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో సెల్వరాజ్‌ను సస్పెండు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో అస్తంబట్టి పోలీసులు నిందితుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

అత్తను హత్య చేసిన అల్లుడు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీపం తిరుక్కాళిమేడు అరుంధతి నగర్‌కు చెందిన లక్ష్మణన్(54) రాజాజీ మార్కెట్‌లోని మరుగుదొడ్డి వద్ద రుసుము వసూలు చేసే పని చేస్తున్నాడు. ఇతనికి భార్య సంతవల్లి(48), ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. లక్ష్మణన్ ప్రతిరోజూ రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వెళ్లిన లక్ష్మణన్ భార్యతో గొడవకు దిగాడు. వారించిన అత్త తిలగం(70)పై సుత్తితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తరువాత భార్య తలపై సుత్తితో కొట్టడంతో ఆమె స్పృహకోల్పోయింది. ఇరుగుపొరుగు వారు లక్ష్మణన్ కుమార్తె రోజాకు సమాచారం ఇవ్వడంతో ఆమె ఇంటికి వచ్చి గాయపడిన తల్లిని కాంచీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. కాంచీపురం తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తిలకవతి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పరారీలో ఉన్న లక్ష్మణన్ కోసం గాలిస్తున్నారు.

శివగంగై బస్సు ప్రమాదంలో విద్యార్థిని మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత

ప్యారిస్, న్యూస్‌టుడే: శివగంగై జిల్లా తిరుప్పత్తూర్ వద్ద రెండు బస్సులు ఢీకొన్న ప్రమాదంలో 11 మంది మృతిచెందారు. వారిలో 10 మంది మృతదేహాలను సోమవారం గుర్తించారు. 11వ మృతదేహం తిరుచ్చికి చెందిన డయానా(17) అనే విద్యార్థినిదిగా మంగళవారం గుర్తించారు. ఆమె హాస్టల్‌లో ఉంటూ కారైక్కుడి అళగప్పా ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది చదువుతోంది. సెలవులపై సొంతూరికి వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే తల్లిదండ్రులు ఆమె సెల్‌ఫోన్‌కి కాల్ చేసినా కలవలేదు. కళాశాలకు వెళ్లి ఉంటుందని భావించారు. పోలీసులు వారికి సమాచారం అందించడంతో కారైక్కుడి ఆస్పత్రికి వచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు

ఐటీఐ విద్యార్థిపై కత్తితో దాడి



గాయపడిన శబరీష్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా పరమత్తి వేలూర్ సమీపం పాలపట్టి ఇందిరా నగర్‌కు చెందిన శబరీష్(20) పుగళూర్‌లోని పేపర్ మిల్లు ఐటీఐలో రెండో ఏడాది చదువుతున్నాడు. ఇతను సోమవారం ఐటీఐకి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు శబరీష్‌ను కత్తితో పొడిచి పారిపోయారు. గాయపడిన శబరీష్‌ను స్థానికులు వేలూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియురాలిని చంపిన యువకుడు జైల్లో ఆత్మహత్యాయత్నం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ పునైనల్లూర్ ప్రాంతానికి చెందిన కావ్య అనే ఉపాధ్యాయురాలిని అదే ప్రాంతానికి చెందిన అజిత్‌కుమార్(29) అనే యువకుడు ప్రేమించాడు. ఈ క్రమంలో ఆమెకు మరో వ్యక్తితో నిశ్చితార్థం జరిగింది. దీంతో ఆగ్రహించిన అజిత్‌కుమార్ గత నెల 17వ తేదీ ప్రియురాలిని హత్య చేసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పుదుకోట్టై జైల్లో ఉన్న అజిత్‌కుమార్ మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని జైలు సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా పరదరామి సమీపం నల్లకవునియూరు గ్రామానికి చెందిన చిన్నరాజ్, అతని తమ్ముడు సింధుదురై కుటుంబాల మధ్య పాతకక్షలున్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఒకరిపై ఒకరు ఆయుధాలతో దాడి చేసుకున్నారు. ఘర్షణలో సింధుదురై, అతని మేనల్లుడు నెపోలియన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని గుడియాత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల బస్సు బోల్తాపడి విద్యార్థులకు...

ఆర్కేనగర్: దిండుక్కల్ జిల్లా ముల్లిప్పాడి సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో 500 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో పాఠశాల బస్సు మంగళవారం విద్యార్థులను ఎక్కించుకొని వస్తుండగా మార్గమధ్యంలో అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ప్రమాదంలో అందులో ఉన్న 12 మంది విద్యార్థినీ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు కాపాడి ఆస్పత్రికి తరలించారు

కారును ఢీకొని బోల్తాపడిన గ్యాస్ సిలిండర్ల లారీ

పలువురికి గాయాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా సెంజి సమీపం తిరువణ్ణామలై రోడ్డులో వంట గ్యాస్ సిలిండర్ల లోడుతో ఓ లారీ వెళ్తోంది. ముందు వెళ్తున్న కారును అధిగమించే క్రమంలో లారీ కారును ఢీకొని అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ఉన్న 350 గ్యాస్ సిలిండర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. అదృష్టవశాత్తు అవి పేలలేదు. కారులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సిలిండర్లను తొలగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాలువలో పడి 18నెలల చిన్నారి మృతి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా సేత్తియాతోపు సమీపం పాలయంకోట గ్రామానికి చెందిన పళని కుమారుడు 18నెలల వయసున్న సాయిరక్షణ్ ఇంటి సమీపంలో ఉన్న వర్షపు నీటి కాలువలో సోమవారం ప్రమాదవశాత్తు పడి కొట్టుకుపోయాడు. కుటుంబీకులు, గ్రామస్థులు గాలించినా ఆచూకీ లభించలేదు. సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని శిశువు కోసం గాలించారు. ఆ ప్రాంతంలో ఉన్న చెరువులో మృతదేహం తేలుతుండటాన్ని గుర్తించి సాయంత్రం వెలికితీశారు.

విద్యుదాఘాతంతో నెమలి...

పళ్లిపట్టు: తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకా నొచ్చిలి గ్రామం సమీపంలో మంగళవారం ఓ నెమలి మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. సిబ్బంది అక్కడకు వెళ్లి రెండున్నరేళ్ల మగ నెమలి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పళ్లిపట్టు పశు వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తెలిసింది.

పోక్సో కేసులో యువకుడికి 20ఏళ్ల జైలుశిక్ష

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా కాట్పాడి సమీపం కాంగేయనల్లూరు ప్రాంతానికి చెందిన రామచంద్రన్(28) ఎలక్ట్రీషియన్. ఇతను కాట్పాడి తాలూకాకు చెందిన 17ఏళ్ల బాలికను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు కాట్పాడి ఆల్ ఉమెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి పోక్సో చట్టం కింద రామచంద్రన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు వేలూరు పోక్సో కోర్టులో విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో తుది విచారణ సోమవారం జరిగింది. నేరం రుజువు కావడంతో రామచంద్రన్‌కు 20ఏళ్ల జైలుశిక్ష, రూ.11వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో నర్సింగ్ విద్యార్థినిని మోసగించిన యువకుడు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి పట్టణంలోని తొట్టియం ప్రాంతానికి చెందిన హరీష్(22).. నర్సింగ్ కళాశాలలో చదువుతున్న బంధువైన 17ఏళ్ల బాలికను చూసేందుకు అప్పుడప్పుడూ వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆమెను ప్రేమిస్తున్నట్లు నమ్మబలికాడు. జులై 23వ తేదీ బాలికకు మాయమాటలు చెప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత బెదిరించి పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి హరీష్ కోసం గాలిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

పూడ్చకపోతే ఎలాగండి!

ఏలూరు నగరవాసుల దాహార్తిని తీర్చే ఆశ్రమం జాతీయ రహదారి కూడలి సమీపంలోని మంచినీటి చెరువుకు ఏప్రిల్‌లో గండి పడినా ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేయలేదు. నాడు తాత్కాలికంగా ఇసుకబస్తాలు, తడికెలు, పరదాలతో నీటి వృథాను అరికట్టారు. గండి నేపథ్యంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉంచడం లేదని ఏఈ పవన్ తెలిపారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నా -ఈనాడు, ఏలూరు

నేడు వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక విడుదల

374 రైతు సేవాకేంద్రాల్లో ఏర్పాట్లు

ఈనాడు-ఏలూరు: జిల్లాలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో భాగంగా లాభసాటి వ్యవసాయం కోసం సీఎం సూచించిన పంచ సూత్రాలను లక్ష్యానికి మించి అన్నదాతలను కలుసుకుని అధికారులు తెలియజేశారు. గత నెల 24 నుంచి వారం రోజులు సాగిన కార్యక్రమంలో 1.60 లక్షల రైతు కుటుంబాలను కలిసి వివరించాలని ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని నిర్దేశించగా 1.72 లక్షల కుటుంబాలకు చేరువయ్యారు. చివరగా బుధవారం జిల్లాలోని 374 రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే) పరిధిలో గ్రామసభ నిర్వహించి ఆ గ్రామ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికను విడుదల చేసి ఆమోదిస్తారు.

ఇదీ లక్ష్యం వ్యవసాయ, దాని అనుబంధ శాఖల యంత్రాంగం పాల్గొని ఆ గ్రామంలో పంటల వారీగా సాగు ప్రణాళికలను వెల్లడిస్తారు. మంచి దిగుబడులనిచ్చే మేలైన వంగడాలు, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు ఎలా ఉంటుందో తెలియజేసి రైతులను రబీసాగుకు కార్యోన్ముఖులను చేస్తామని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

అదే దందా...ఆగేదుందా?

చింతలపూడి, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగు నెలలుగా తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు తరలిపోతుంది. మైనింగ్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదుతోపాటు భారీగా అపరాధ రుసుములు వసూలు చేస్తున్నా.. పరిస్థితిలో మార్పు రావడం లేదు. జిల్లాలోని జీలుగుమిల్లిలో స్థానిక పోలీసులు సోమవారం రెండు ఇసుక లారీలు స్వాధీనం చేసుకోవడంతో అక్రమ రవాణా మళ్లీ తెరపైకి వచ్చింది.

కేసులు పెడుతున్నా తగ్గని అక్రమార్కులు

తెలంగాణకు యథేచ్ఛగా ఇసుక రవాణా

తూర్పు గోదావరి జిల్లాలోని కుమారదేవం, వాడపల్లి-1, 2, ఔరంగాబాద్-1, 2, గూటాల, ఏరినమ్మ, దొండగుంట, అరికిరేవుల-1, 2 రీచ్‌ల నుంచి సరిహద్దు మండలాలైన కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, చింతలపూడి మీదుగా తెలంగాణకు అక్రమ రవాణా జరుగుతోంది. గత నాలుగు నెలల కాలంలో మైనింగ్ అధికారులు సరిహద్దు మండలాల్లో తనిఖీలు చేపట్టి ఇసుక అక్రమ రవాణాపై 48 కేసులు నమోదు చేసి రూ. 24.60 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు.

చింతలపూడి నుంచి తెలంగాణ సరిహద్దు వైపు వెళ్తున్న లారీ

చెక్‌పోస్టుల ఊసే లేదు

గతంలో రాష్ట్ర సరిహద్దు అశ్వారావుపేట వద్ద చెక్‌పోస్టు పెట్టడంతో ఇసుక లారీలు అటుగా వెళ్లేవి కావు. ఇప్పుడు వాటిని తీసేయడంతో జీలుగుమిల్లి హైవే మీదుగా ఇసుక యథేచ్ఛగా సాగుతోంది. చింతలపూడి సరిహద్దు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది కొద్ది కాలం మార్కెటింగ్ చెక్‌పోస్టుల వద్ద పహారా ఉంటూ కొంత వరకు అడ్డుకున్నారు. ప్రస్తుతం రెవెన్యూ సిబ్బంది చెక్‌పోస్టుల వద్ద ఉండటం లేదు. మార్కెటింగ్ చెక్‌పోస్టు సిబ్బంది తమకు ఇసుక ఆపే అధికారం లేదంటున్నారు.

భయం లేకుండా.. ఇసుక రీచ్‌ల వద్ద టన్ను ఇసుక సుమారు రూ.250 ఉంది. రీచ్ సిబ్బందితో మాట్లాడుకుని పరిమితి కన్నా ఐదు నుంచి పది టన్నుల వరకు ఎక్కువగా లోడ్ చేసుకొని తరలిస్తున్నారు. అసలు సరిహద్దు గ్రామాల్లో ఇసుక బుక్ చేస్తున్న వ్యక్తులకు రీచ్ సిబ్బంది ఫోన్ చేసి మీకేనా? అని ఆరా తీయడం లేదు. ఎక్కడైనా పట్టుబడితే రూ.25 వేల నుంచి రూ.50 వేలు అపరాధ రుసుం కట్టి మళ్లీ రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేయడమో, ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడమో చేస్తేనే అక్రమకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

చర్యలు చేపడుతున్నాం : ఇసుక అక్రమ రవాణా జరిగితే మైనింగ్ శాఖకు సమాచారం అందించాలని సరిహద్దు గ్రామాల తహసీల్దార్లు, పోలీసులకు సూచించారు. అక్రమ రవాణా చేస్తే సహించేది లేదు.

- పాపారావు, మైనింగ్ డీడీ, ఏలూరు.

కాలుష్య రహిత నగరంగా హేలాపురి

సుందరీకరణ, వసతుల కల్పనకు రూ.453 కోట్లు

హాజరైన కార్పొరేటర్లు

మాట్లాడుతున్న నూర్జహాన్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. అజెండాలో ప్రవేశపెట్టిన అంశాలను కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. నగరాభివృద్ధి, సుందరీకరణ, ఉద్యోగులు, కార్మికుల జీతాలు తదితరాలపై సభ్యులు కూలంకషంగా చర్చించారు. మేయర్ మాట్లాడుతూ.. జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచనలకు అనుగుణంగా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం అమలుకు రూ.6.57 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నగరాన్ని రూ.453 కోట్లతో సుందరీకరిస్తూ.. మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. సాధారణ నిధులు రూ.49 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, ఫౌంటెయిన్లు నిర్మించామన్నారు. నగరంలోని అయిదు అర్బన్ పీహెచ్‌సీల ఆధునికీకరణ, నిర్మాణ పనులకు రూ.3 కోట్లు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రత్యేక పంచాయతీగా దొండపాడు

నగరపాలక సంస్థలో విలీనమైన దెందులూరు మండలం దొండపాడు గ్రామస్థులకు సరైన సేవలందడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామాన్ని నగరపాలక సంస్థ నుంచి వేరు చేసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.

ఆ ఆటలో.. తన్మయత్వం

బోసిబాల్‌లో ఒలింపిక్స్‌కు అర్హత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆ ఆటా.. నేను ఆడను.. నాకొద్దు అంటూ దూరం పెట్టిన ఆ అమ్మాయి ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపించి ఏకంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆమే పెంటపాడుకు చెందిన సత్తి తన్మయ శ్రీదేవి.

ఆడుతున్న తన్మయ శ్రీదేవి

తన్మయ మేధో వైకల్యంతో కూడిన డౌన్ సిండ్రోమ్ (జన్యుపరమైన లోపం)తో జన్మించిన విభిన్న ప్రతిభావంతురాలు. నలుగురితో కలవడం, తలెత్తి ముఖం చూస్తూ మాట్లాడటం తనకు చాలా కష్టమైన విషయాలు. వైకల్యంతో కలిగిన ఇలాంటి స్వాభావిక లక్షణాలను అధిగమించి ప్రత్యేక అవసరాలు విభాగంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో హైస్కూల్ ప్లస్‌లో రెండో ఏడాది ఇంటర్మీడియట్ చదువుతోంది.

భీమవరంలో గతేడాది జరిగిన విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో పరుగు పందెం, బోసిబాల్ స్లో, వాకింగ్ విభాగాల్లో పాల్గొంది. బోసిబాల్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికై ఏప్రిల్‌లో జరిగిన పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి చేరుకుంది. బిలాస్‌పుర్‌లో జులై 24 నుంచి 28 వరకు జరిగిన జాతీయ పోటీలో దూసుకెళ్లి బంగారు పతకం సాధించింది. 2027లో జరిగే ప్రత్యేక ఒలింపిక్స్‌కూ అర్హత సాధించింది. దీనికి సంబంధించి మూడు దశల్లో ఇచ్చే శిక్షణలో భాగంగా గ్వాలియర్‌లో జరిగిన తొలిదశ నుంచి రెండో దానికి ఎంపికైనట్లు శిక్షకురాలు, ప్రత్యేక బోధన ఉపాధ్యాయిని సాయి స్వరూప తెలిపారు. 'కొన్ని సంవత్సరాల తపన, కుటుంబ ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణ తనకు ఎంతో దోహదపడ్డాయి' అని తన్మయ చెబుతోంది.

అడిగేదెవరు.. మడతెట్టేయ్

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: గుబురుగా పెరిగిన మొక్కలు... చిత్తడి నేలల్లో పాతుకుపోయే చెట్లు... ఎటుచూసినా ఆహ్లాదకర వాతావరణం... స్వచ్ఛమైన గాలితో తీరంలోని మడ అడవుల స్వాగతం పలికేవి. ప్రస్తుతం ఎటుచూసినా ఆక్వా చెరువులు.. విద్యుత్తు కోసం లాగిన తీగలు... రసాయనాల వాసనతో కూడిన గాలి దర్శనమిస్తున్నాయి. తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉండే మడ అడవుల సంరక్షణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చాపకింద నీరులా ఆక్రమణలు పెరుగుతున్నాయి.

నాడు: నరసాపురం, మొగల్తూరు తీర ప్రాంతాల్లో 1950 దశకంలో రెండు వేల ఎకరాల్లో మడ అడవులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాటిని సంరక్షించేందుకు అప్పట్లో రక్షణాధికారి(సెక్యూరిటీ గార్డు) సైతం ఉండేవారు.

నేడు: నరసాపురం తీరంలో 245, మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లో 265 ఎకరాల్లో మాత్రమే మడ అడవులున్నట్లు అధికారులు చెబుతున్నా, ఆ మేరకు అక్కడ కనిపించడం లేదు.

అన్నీ ఆక్రమణలే..కనుచూపు మేర ఆక్వా చెరువులే

పేరుపాలెంలో మడ అడవులను ఆనుకుని ఆక్వా చెరువులు

దొంగ పట్టాలతో: గతంలో నరసాపురం తీరం సముద్రపు కోతకు గురై మడ అడవులు కనుమరుగయ్యాయి. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లో 1960వ దశకంలో అప్పటి రాజకీయ నాయకులు కొంత మంది స్థానికులకు పట్టాలివ్వగా, మరికొంతమంది దొంగ పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలు జరిపారు. ఇంకొంతమంది ఆక్రమించుకుని ఆక్వా చెరువులు సాగు చేస్తున్నారు. ఫలితంగా మడ అడవులని చెప్పుకోవడమే తప్ప కనుచూపు మేర అంతా ఆక్వా చెరువులే దర్శనమిస్తున్నాయి.

ఇవిగో ఆక్రమణలు: మొళ్లపర్రులో భీమవరానికి చెందిన ఓ రైతు సుమారు 70 ఎకరాలు ఆక్రమించి విక్రయాలకు పాల్పడ్డాడు. భీమవరానికి చెందిన ఓ వ్యాపారికి పేరుపాలెం సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న భూములను పర్యాటకాభివృద్ధి పేరుతో దాదాపు 33 ఎకరాలు ప్రభుత్వం లీజుకిచ్చింది. పలు కారణాలతో అది కోర్టు విచారణలో ఉంది. దాన్ని ఆసరాగా చేసుకుని సమీపంలోని క్రీకులు, మడ చెట్లు ఉండే ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. అప్పటికే ఆక్రమించుకున్నవారికి కొంత సొమ్ములు ముట్టచెప్పి మొత్తం ఆక్వా చెరువులుగా మార్చేశారు.

వైకాపా నిర్లక్ష్యం: ఎన్నికలకు ముందు ఒక బృందం పేరుపాలెం, ముత్యాలపల్లిలో మడ అడవులపై సర్వే చేసి, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వైకాపా ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెబుతున్నారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఆక్వా చెరువులకు విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేసింది. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు, కొంతమంది బడాబాబులు ఉన్న భూములను ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మడ అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి ఉద్యోగులకూ బీమా

నూజివీడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. శ్రామికులతో పాటు ఉద్యోగులకూ భరోసా కల్పించేలా బీమా సదుపాయం అమలుకు నిర్ణయించింది. ఉద్యోగులకు ప్రమాదవశాత్తు ఏదేని ప్రమాదం వాటిల్లితే కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టింది.

- ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఏపీవోలు, ఈసీలు(ఇంజినీరింగ్ కన్సల్టెంట్), సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పొరుగు సేవల సాంకేతిక సహాయకులు బీమాకు అర్హులు.
- బీమా వర్తించాలంటే ఉపాధి హామీలో ఉద్యోగం చేస్తున్న వారికి తప్పనిసరిగా ఎస్‌బీఐ ఖాతా ఉండాలి. లేనివారు కొత్తగా తెరవాల్సి ఉంటుంది. అప్పుడే బీమా వర్తిస్తుందని డ్వామా ఇన్‌చార్జి పీడీ ఎం.రాజశేఖర్ తెలిపారు.
- రూ.10 వేల నుంచి రూ.25 వేల మధ్య వేతనం పొందే వారికి రూ.3 లక్షల వ్యక్తిగత బీమా వర్తిస్తుంది. రూ.25 వేల నుంచి రూ.50 వేల మధ్య వేతనదారులకు రూ.12 లక్షల ప్రమాద బీమాకు అర్హులు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వేతనం పొందేవారు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. బీమా అమలుతో జిల్లాలోని 249 మంది ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది.

రైతులతో మాట్లాడుతున్న పార్థసారథి, పక్కన సబ్ కలెక్టర్ తదితరులు

ఒక్క సెంటు ఆక్రమించినా చర్యలు: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాభూమి మినహా ఒక్క సెంటు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. 'ఈనాడు'లో 'అండ దండలతో గట్టు పుట్టా కొట్టి..', శీర్షికన ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీసినట్లు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. మంగళవారం మండలంలోని జంగంగూడెం, దేవరగుంట భూముల వ్యవహారంలో ఘర్షణ జరిగిన ప్రదేశాన్ని సబ్ కలెక్టరు బి.వినూత్న, డీఎఫ్‌వో పి.సందీప్ రెడ్డి, రేంజర్ సత్యనారాయణ, తహసీల్దారు భద్రు, తెదేపా మండల అధ్యక్షుడు యనమదల వాసు, మాజీ అధ్యక్షుడు ముసునూరు రాజా, జంగంగూడెం సర్పంచి పొట్లూరి అంజలి కుమారి, గ్రామ నాయకులు పొట్లూరి అశోక్, వల్లభనేని భాస్కర్ తదితరులతో కలసి పరిశీలించారు. అక్కడే ఇరు గ్రామాల రైతులు, నాయకులతో మాట్లాడారు. ఘర్షణ పడటంపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ సబ్ డివిజన్ చేయలేదన్న వంకతో ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. బోర్లు, చెట్లు ధ్వంసం చేసిన వారిని వారం రోజుల్లో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐలు రామకృష్ణ, సత్య శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ జ్యోతిబాసులను ఆదేశించారు. అందరూ కలిసిమెలిసి ఉండి సామరస్యంగా భూమి సాగు చేసుకుంటే అందరికి మంచిదన్నారు. మంత్రి చొరవకు ఇరు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తుపానుతో తంటా.. గట్టెక్కేనా పంట

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణం మబ్బులు పట్టడంతో రైతులు హడావుడిగా వరి కోస్తున్నారు. మంగళవారం వర్షం కురవడంతో పంట తడిసిపోయింది. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితుల్లో పంటను గట్టు మీదకు తీసుకురావాలనే తపనతో యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. వర్షంలోనే నూర్పిళ్లు సాగించి, ధాన్యం బస్తాలోకి ఎత్తి ఇళ్ల వద్దకు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలువురు రైతులు ఒకేసారి ఏకంగా రెండు, మూడు కోత యంత్రాలను ఏర్పాటు చేసుకుని కోతలు కోశారు. తుపాను మరోసారి నష్టం మిగుల్చుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాకరం వద్ద హడావుడిగా నూర్పిళ్లు

ముదినేపల్లిలో వర్షంలోనే తరలిస్తున్న ధాన్యం బస్తాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలకు మరింత ఊతమిచ్చేందుకు 'జీరో ఎఫెక్ట్.. జీరో డిఫెక్ట్' పథకాన్ని తీసుకొచ్చింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి దీన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పాలకోడేరు, వీరవాసరం, మొగల్తూరు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి జిల్లా నోడల్ అధికారిగా పరిశ్రమలశాఖ జిల్లా అధికారి మంగపతిరావు వ్యవహరిస్తున్నారు.

ఈ పత్రం ఉందా..!

పరిశ్రమలకు చేయూత ఇలా..

నమోదు ఎలా?

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కలిగిన వారు zed.msme.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉద్యమ్ సంఖ్య, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పరిశ్రమ ఉన్న ప్రాంతం దాని నిర్వహణ వివరాలన్నీ నమోదు చేయాలి. గుర్తింపు పొందిన ఏజెన్సీ ఆ వివరాలను పరిశీలించిన తర్వాత ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తుంది.

ఎవర్ని సంప్రదించాలి: శేషారత్నం ఎఫ్ఐఎఫ్ ఏజెన్సీ జిల్లా అధికారి. చరవాణి సంఖ్య: 99596 37789

ప్రయోజనాలివీ: బ్యాంకు రుణాలు తీసుకునేటప్పుడు ప్రాసెసింగ్ రుసుము, వడ్డీలపై రాయితీ ఇస్తారు. ప్రాథమిక దశలో సహకారం అందించడానికి రూ. 2 లక్షల వరకు రాయితీ ఇస్తారు. యూనిట్లను అభివృద్ధి చేసి విస్తరించేందుకు రూ.4 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు రుణాలు ఇస్తారు. బీసీ, ఎస్సీలకు ప్రత్యేక రాయితీలు అందిస్తారు. మహిళలకు అయితే వంద శాతం ఉంటుంది.

జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద తూకం వేయకుండా స్టేజ్ 1 లారీల నుంచి స్టేజ్ 2 లారీల్లోకి ఎక్కిస్తున్న బియ్యం

శభాష్ పిల్లలూ..

రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టు విజేత ఉమ్మడి పశ్చిమ

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పేరేచర్ల వేదికగా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. జట్టు సభ్యులను డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ మంగళవారం అభినందించారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి, ఉత్తమ బౌలర్‌గా ట్రోఫీ అందుకొని జాతీయ జట్టుకు ఎంపికైన వెంకటసాయిని ప్రత్యేకంగా కొనియాడారు. జాతీయ జట్టుకు అర్హత సాధించిన కార్తిక్, సాయి దీపక్, మణికంఠ సూర్యతేజ్‌ను అభినందించారు. సంఘ కార్యదర్శి కె.అలివేలు మంగ, జట్టు శిక్షకుడు ఓరుగంటి రామకృష్ణమరాజు, వ్యాయామోపాధ్యాయుడు కేవీడీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు | పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య | విభిన్నం.. ప్రతిభావంతుల పయనం 6లో

తార్‌మార్.. తక్కెడమార్!

గోదాము నుంచి వచ్చిన సరకు దించకుండానే డిపోలకు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ గోదాము నుంచి రేషన్ డిపోలకు పంపే బియ్యం, ఇతర సామగ్రి తూకానికి ఇక్కడి అధికారులు తిలోదకాలిస్తున్నారు. గిడ్డంగి నుంచి లారీల్లో వచ్చిన సరకును వచ్చినట్లే రేషన్ డీలర్లకు తరలించే స్టేజ్ 2 వాహనాల్లోకి ఎక్కించి పంపుతున్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఒక లారీ నుంచి మరో లారీకి బియ్యం మార్చడం కనిపించింది. నిబంధనల ప్రకారం గోదాము నుంచి వచ్చిన సరకును ఎంఎల్ఎస్ పాయింట్‌లో దించి డిపోల వారీగా పంపాల్సిన సరకులు తూకం వేసి స్టేజ్ 2 వాహనాల్లో పంపాలి. అయితే వచ్చిన సరకు వచ్చినట్లు తూకం వేయకుండా తరలిస్తున్నారు. ఇందుకు రేషన్ డీలర్లు కొందరు అభ్యంతరం లేదని చెప్పడం వల్లే తాము స్టేజ్ 1 లారీ నుంచి స్టేజ్ 2 లారీలోకి ఎక్కించి పంపుతున్నామని గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్ పేర్కొన్నారు. తూకం వేయాలని కోరిన డీలర్లకు మాత్రం తప్పనిసరిగా తూచే సరకులు పంపుతున్నామన్నారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం తూకం వేస్తే డీలర్లకు సరకుల్లో వ్యత్యాసం రాదు. లేదంటే తూకం తగ్గి వారు నష్టపోయే అవకాశం ఉంది. పౌరసరఫరాల శాఖలో పర్యవేక్షణ లోపమే ఇటువంటి అతిక్రమణలకు కారణమన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

హీరోలనుకుని.. విద్యావనంలో అపశ్రుతులు

డిష్యూం.. డిష్యూం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యా కేంద్రంగా పేరుగాంచిన పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని విద్యాలయాల్లో ప్రేమ వ్యవహారాలు, మద్యం,గంజాయి, పొగ తాగేటప్పుడు నెలకొంటున్న ఘర్షణలు విద్యార్థుల మధ్య తన్నులాటలకు దారి తీస్తున్నాయి. ఆపై కేసులతో భవితను నాశనం చేసుకుంటున్నారు.

- ఇటీవల భీమవరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కర్రలతో దాడి సంఘటనతో అక్కడ విద్యార్థులు కంగారు పడ్డారు. అంతా చూస్తుండగానే క్రికెట్ బ్యాట్‌లు, హాకీ స్టిక్‌లతో కొట్టుకోవడంతో పలువురు గాయపడ్డారు.
- భీమవరంలోని ఓ ప్రాంతంలో యువత గుమిగూడారు. కొద్దిసేపటికి బయట వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. ఒక్కసారిగా సీసాలు విసురుకున్నారు. ఈ సంఘటనలో విద్యార్థులు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.
- భీమవరంలో డిగ్రీ చదువుతున్న తోటి విద్యార్థులకు ఆహ్వాన వేడుకను సీనియర్లు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం తాగి వచ్చిన విద్యార్థులతో ఏర్పడిన ఘర్షణ రహదారి పైకి చేరింది. అందరూ చూస్తుండగానే కొట్టుకున్నారు.
- భీమవరంలో ఓ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు గొప్పలకు పోయి బయటి వ్యక్తులను రప్పించి దాడులు చేయించారు.

పర్యవేక్షక కమిటీలు ఎక్కడ?

గతంలో విద్యాశాఖ, పోలీసు, వైద్యులు, తల్లిదండ్రులతో పర్యవేక్షక కమిటీలు ఉండేవి. కళాశాలలో మానసిక వైద్య నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉండేవారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే సమయం ఇదేనని చెప్పేవారు లేకపోవడంతో కొందరిలో విచ్చలవిడితనం పెరిగిపోతోంది. అదికాస్తా రౌడీలుగా మారుస్తుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇవి ఏవీ..?

పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి టీమ్‌లు, సాధారణ వ్యక్తుల్లాగా పోలీసులు పర్యవేక్షణ లేదు. విద్యార్థి దశలో ఎలా ఉండాలి. ర్యాగింగ్‌కుపాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే ఇబ్బందులు గురించి చెప్పడం లేదు. దీంతో యువత పక్కదోవ పడుతోంది.

- చట్ట వ్యతిరేక సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. కేసుల్లో చిక్కుకుంటే జీవితం అంధకారం అవుతుందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి 'తత్కాల్'

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య పదో తరగతి, ఇంటర్‌లో 'తత్కాల్' పథకం ద్వారా ప్రవేశం పొందడానికి అవకాశం కల్పించారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 6లోపు రూ. 600 అపరాధ రుసుము చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు https://apopen-school.ap.gov.in వెబ్‌సైట్ సందర్శించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16 మంది వైద్య విద్యార్థుల సస్పెన్షన్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు వైద్య కళాశాల వసతి గృహంలో ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ విధించారు. జూనియర్లను మూడో సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ చేయడం.. వారు సోమవారం అర్ధరాత్రి దాటాక పోలీసులకు ఫిర్యాదు చేయడం విదితమే. ఈ ఘటనపై వైద్య కళాశాల ప్రధానాచార్యులు సావిత్రి విచారణ చేపట్టారు. బాధితుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడిన 16 మంది మూడో ఏడాది విద్యార్థులను వసతి గృహం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వార్డెన్లను ఆదేశించారు.

ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడు ఆయుర్వేద వైద్యశాలకు ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. రేపాకగొమ్ములోని ఆయుర్వేద వైద్యశాల భవనం నాలుగేళ్ల కిందట గోదావరి వరదలకు కొట్టుకుపోవడంతో ఏడాదిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇరుకు గదుల్లో వైద్యశాల కొనసాగుతున్న వైనంపై

ఈనాడు కథనానికి స్పందన

'ఇరుకైన వసతి.. సేవల్లో అధోగతి!' శీర్షికన ఈ ఏడాది మే 29న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ఆయుర్వేద వైద్యశాల నూతన భవన నిర్మాణానికి ఇటీవల జాతీయ ఆయుష్ మిషన్(ఎన్ఏఎం) ద్వారా రూ.30 లక్షలు నిధులు మంజూరవ్వడంతోపాటు రోగులకు సరిపడా ఔషధాలు సరఫరా అయినట్లు వైద్యాధికారిణి పి.మౌనిక యాదవ్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు పరిధిలో లేని మేడేపల్లిలో త్వరలో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆమె వివరించారు.

విభిన్నం.. ప్రతిభావంతుల పయనం!

వివిధ రంగాల్లో రాణిస్తున్న వైనం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: శారీరక లోపం వారిని కుంగనీయలేదు. తామందరిలా లేదన్న భావన దరిచేరనీయలేదు. సమస్య ఉందని జీవితాన్ని వదిలేయలేదు. తమ రాతను తామే రాసుకున్నారు. జీవనాన్ని అందరిలా మలచున్నారు. సమాజంలో స్ఫూర్తిని పంచుతూ విభిన్నంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా.. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

మారుస్తోంది తలరాత!

కామవరపుకోట సమీప ఉప్పలపాడుకు చెందిన వర నవ్య దివ్యాంగురాలు. పుట్టుకతోనే చేతుల్లేవు. తల్లిదండ్రులు సుబ్బారావు, రూతమ్మ వ్యవసాయం చేస్తుంటారు. బిడ్డ వైకల్యంతో జన్మించిందని వారెప్పుడూ కుంగిపోలేదు. చదివిస్తే తలరాతను మార్చుకుంటుందని నమ్మారు. స్థానికంగా ఆరో తరగతి వరకు చదివించారు. ఆ తర్వాత ఏలూరులోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. మోచేతుల వరకు లేకున్నా.. అందమైన చేతిరాతతో అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న నవ్య.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో చేతి రాతపై బాల్యం నుంచే ప్రత్యేక దృష్టి సారించినట్లు చెబుతున్నారు. క్రీడల్లోనూ కళాశాల స్థాయిలో బహుమతులందుకున్నారు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నవ్య

నడవలేనని.. పరుగు ఆపలేదు..

ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన నాగేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు బత్తిన లక్ష్మణుడు. పుట్టుకతోనే పోలియో సోకడంతో.. చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో ఉంటూ.. పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్నా.. లక్ష్మణుడు పరుగు ఆపలేదు. ఓవైపు చదువులో రాణిస్తూ.. మరోవైపు క్రీడల్లో మెరుస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల చక్రాల కుర్చీల పరుగు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి. . రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బ్యాంకు అధికారిగా స్థిరపడటమే ధ్యేయమని లక్ష్మణుడు చెబుతున్నారు.

లక్ష్మణుడు

క్రీడా మైదానాల అభివృద్ధికి సహకరిస్తాం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని క్రీడా మైదానాల అభివృద్ధికి, క్రీడాకారుల అవసరాలకు సహకరిస్తామని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. ఏలూరులోని ఏఎస్ఆర్ క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, పలు క్రీడా ప్రాంగణాలను మంగళవారం శాప్ ఛైర్మన్‌తో పాటు పలువురు డైరెక్టర్లు సందర్శించారు. అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం రవి నాయుడు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక క్రీడా మైదానాల్లో వివిధ రకాల ప్రయోజనాలు కల్పించామన్నారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా త్వరలోనే యాప్ తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు రవి నాయుడికి పలువురు అధికారులు, శిక్షకులు, క్రీడాకారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్టేడియంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. శాప్ డైరెక్టర్లు రవీంద్ర, కె.జగదీశ్వర్, వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలోని వసతి గదులను పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు తదితరులు

మద్ది క్షేత్రం కిటకిట

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామికి తమలపాకులతో అర్చనలు చేశారు. ఆలయానికి విచ్చేసి భక్తులు ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ. 2,15,450 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

నిమ్మలపై దాడి ఘటనలో వైకాపా నాయకులకు సీఐడీ నోటీసులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పంపిణీ సందర్భంగా 2022లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు, వైకాపా నాయకుల మధ్య తలెత్తిన ప్రొటోకాల్ వివాదంలో కొందరు నిమ్మలపై దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటనపై విచారణ నిమిత్తం రాజమహేంద్రవరంలోని కార్యాలయానికి రావాలని పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన పది మంది వైకాపా నాయకులకు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగా డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ మంగళవారం విచారణకు హాజరయ్యారు. బండి రమేశ్, ఖండవల్లి వాసు, మానుకొండ శ్రీను, గుణ్ణం నరసింహనాగేంద్రరావు, గవర సర్వేశ్వరరావు, కోట రత్నంరాజు, చందక సత్యనారాయణ, ఉచ్చుల స్టాలిన్, లంకే శ్రీనివాసరావు ఈ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. మొత్తం 24 మందిని ఈ కేసులో విచారించాల్సి ఉండగా తొలి విడతలో పది మందికి నోటీసులు అందాయి. రోజుకు ఒకరు చొప్పున విచారణకు హాజరు కావాల్సిఉంది.

ఆదమరిస్తే.. అంతే!

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారిలో ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రహదారిపై గుంతలు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు.

రహదారిపై ఏర్పడిన గుంత

అన్నదాతలూ అధైర్యపడొద్దు: డీఏవో

దెందులూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలెవరూ అధైర్య పడొద్దని.. తడిసిన ధాన్యాన్ని తుఫానుకు కొంటామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా భరోసానిచ్చారు. కొవ్వలి, పోతునూరు, దోసపాడు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పొలాల్లో కోత కోసి పనల్లోనే వరి కుప్పలు, ఆరబెట్టిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. వరి కోతలు కోయవద్దని సూచించారు. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా కప్పుకోవడానికి ఆర్ఎస్‌కేల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.03 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని.. అన్నదాతల నుంచి 1.80 లక్షల టన్నుల ధాన్యం సేకరించామన్నారు. మరో 17,435 టన్నుల ధాన్యం ఆరబెట్టి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఏడీఏ అనిల్‌కుమారి, ఏవో శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలిస్తున్న హబీబ్‌బాషా, వ్యవసాయాధికారులు

వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా.. ప్రజలు అందజేసిన వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మంగళవారం వివిధ శాఖల అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. శాఖల వారీగా అర్జీలను విభజించి, ఆయా శాఖల అధికారులకు పంపాలన్నారు. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు

- దుకాణ సముదాయాల్లో ఉల్లంఘనలు
- చోద్యం చూస్తోన్న అగ్నిమాపక, నగరపాలక సంస్థలు

ఈనాడు-ఏలూరు

ప్రజల ప్రాణాలు ఏమైపోతే మాకేంటి.. మా కమీషన్లు మాకు ముడితే చాలనుకుంటోంది యంత్రాంగం. ఆమ్యామ్యాలిస్తే ఎంతటి ఉల్లంఘనలైనా కప్పిపుచ్చుతామంటోంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో కొన్ని షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో అగ్నిమాపక రక్షణ చర్యల్లేవు. ముడుపులు తీసుకుని ఇటు మున్సిపల్, అటు అగ్నిమాపకశాఖలు మిన్నకుండిపోయాయి.

160 సముదాయాల్లో లోపాలు

జిల్లా వ్యాప్తంగా 160 వాణిజ్య సముదాయాలకు అగ్నిమాపకశాఖ నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ) జారీచేసింది. ఆనక ఉన్నత స్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో తనిఖీలు చేసి వాటిల్లో పలు లోపాలు ఉన్నాయని గుర్తించింది. ఐదు సముదాయాల్లో కనీసం పరికరాలు లేవని తెలుసుకుంది. బాధ్యులైన వర్తక, వాణిజ్య సంస్థలకు మొక్కుబడిగా నోటీసులిచ్చి సరిపుచ్చింది. ప్రజల భద్రతకు సంబంధించిన విషయాల్లో అగ్నిమాపక, నగరపాలక, మున్సిపల్ యంత్రాంగం ఎంత నిర్లిప్తంగా ఉన్నాయో అర్థమౌతోంది.

వేలాది మంది వచ్చే మాల్‌లో ఇదీ పరిస్థితి

✦ ఏలూరు చాణక్యపురికాలనీలో ప్రముఖ వస్త్రదుకాణ మాల్ ఒకటి ఉంది. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు షాపింగ్‌కు వస్తారు. దాని పక్కనే మరో సూపర్‌మార్కెట్, అక్కడే వందల ప్లాట్లు కలిగిన అపార్టుమెంట్లు ఉన్నాయి. ప్రమాదవశాత్తూ ఏమైనా షార్టు సర్క్యూట్ అయితే ప్రజల ప్రాణాలు గాల్లో దీపమేనని చెప్పాలి. మాల్‌లో అగ్నిమాపక పరికరాలు లేవు. ఒకటీ అరా ఉన్నా వాటికి కనెక్షన్లు ఇవ్వలేదని తెలిసింది.

✦ ఏలూరు నగరంలో మరో సూపర్‌బజార్‌లోనూ పరికరాలు లేవు. కొత్తగా ఏర్పాటు కావటం, ఆయా ఉత్పత్తులపై పండగ ఆఫర్లు ఉంటాయనే ఆశతో వినియోగదారులు బాగా వస్తున్నారు. అయితే ప్రజలభద్రత విషయంలో నిర్వాహకులు పట్టించుకోకపోవటంపై విమర్శలొస్తున్నాయి.

ఏం చూసి ఓసీ ఇచ్చారు?..

ఫైర్ ఎన్వోసీ లేకుండా నగరపాలక అధికారులు భవన వినియోగ పత్రం(ఆక్యుపెన్సీ సర్టిఫికెట్: ఓసీ) ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకమవుతోంది. దీని వెనక పెద్దమొత్తంలో చేతులు మారుంటాయనే అభిప్రాయం లేకపోలేదు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ఫైర్ ఎన్వోసీ లేకుండా నగరపాలక ఆక్యుపెన్సీ పత్రం ఇవ్వటం చాలా తప్పిదం. దీనిపై ప్రభుత్వానికి నివేదించి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేస్తామని విజిలెన్స్ వర్గాలు తెలిపాయి.

ఫైర్‌లో వణుకు.. అగ్నిమాపక ఎన్వోసీ లేదని విజిలెన్స్ నిర్ధారించుకున్న విషయం తెలియగానే అగ్నిమాపకవర్గాలు ఆగమేఘాలపై మంగళవారం ఆ వస్త్రదుకాణం పరిశీలనకు వెళ్లారు. 'అక్కడ ఫైర్ ఎన్వోసీ లేదు. ఉన్న అరకొర పరికరాలు ఉపయోగంలో లేవు. వాటిని ఏర్పాటు చేసుకోవాలని నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా మరో ఐదు మాల్స్‌కు ఫైర్ ఎన్వోసీ లేదు. వాటికి షోకాజ్‌లిచ్చి వివరణ కోరతాం. మరికొన్ని చోట్ల లైసెన్సులు పొందినా నిబంధనల ప్రకారం పరికరాలు ఏర్పాటు చేయలేదు. ఈ లోపాలను వారు అధిగమించేలా చూస్తాం' అని అగ్నిమాపకశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి రామకృష్ణ తెలిపారు.

21న పల్స్ పోలియో: డీఎంహెచ్‌వో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో పి.జె.అమృతం తెలిపారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో మంగళవారం వైద్యాధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలియో చుక్కల పంపిణీ, బూత్ వ్యవస్థ, ఇంటింటా సర్వే, కోల్డ్ చైన్, దస్త్రాల నిర్వహణ, హౌస్ టూ హౌస్ మార్కింగ్, లాజిస్టిక్స్, రిస్క్ ఏరియా ప్లానింగ్, క్షేత్ర స్థాయి సందర్శన తదితరాలపై అవగాహన కల్పించారు. టీకా భద్రత, బృందాల సమన్వయంపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శోభ సూచనలిచ్చారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No. 2422/E1/2023-24 Dated: 02-12-2025

S. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. In Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Electrical, Aspirational toilets, conservancy articles works-07	General Funds	98.18	03-12-2025	17-12-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- **Commissioner,** Tadepalligudem Municipality

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, పశుసంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా
ల్యాబ్ అటెండెంట్ (LAB ATTENDANT) పోస్టుల నియామక ప్రకటన

మొత్తము ఖాళీలు: 6 (పొరుగు సేవల క్రింద మెరిట్ ప్రాతిపదికన)

Category	BC-B		BC-E		SC		ST		Grand Total
	G	W	G	W	G	W	G	W	
Local	1	0	0	1	1	1	1	0	6

విద్యార్హత: S.S.C. ఉత్తీర్ణులై ఉండవలెను.
వేతనము: నెలకు రూ. 15,000/-. **వయస్సు:** ది. 30-11-2025నాటికి 18-42 సం. (SC/ST అభ్యర్థులకు-5 సం., BC అభ్యర్థులకు 3 సం., PH అభ్యర్థులకు 10 సం. సడలింపు కలదు.)
దరఖాస్తు ఫీజు: రూ. 200/- Bank Crossed D.D.ని Joint Director, Animal Husbandry, Vijayawada వారి పేర తీసి దరఖాస్తునకు జతపరచవలెను.
దరఖాస్తు స్వీకరణ తేది: సంబంధిత సర్టిఫికెట్ నకలు కాపీలను (10th Marks memo, 4th to 10th Study certificates, Caste Certificate, Nativity Certificate) జతపరచి పూర్తి బయోడేటాతో సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, ముత్యాలంపాడు, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర, శివాలయము ఎదురు, విజయవాడ నందు 18-12-2025 సా. 4.00 గం.లోపు అభ్యర్థులు స్వయంగా లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా సమర్పించవలెను. తదుపరి దరఖాస్తులు స్వీకరించబడవు. ఇతర వివరముల కొరకు: సంయుక్త సంచాలకులు (ప.సం.శాఖ) వారి కార్యాలయము, విజయవాడ, NTR జిల్లా నందు సంప్రదించవలెను. **ఫోన్ నెం. 92466 02731.**

సంయుక్త సంచాలకులు **సం/- శ్రీ D.K.బాలాజీ I.A.S.**
పశు సంవర్ధక శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా **కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేటు, ఉమ్మడి కృష్ణా జిల్లా**

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ,22బి -13-8, 2వ అంతస్తు, వెంకట రామ పవర్ ప్రెస్ రోడ్, సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా, పవర్‌పేట, ఏలూరు-534002.

(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారం (శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, చెన్నైలోని ఎన్‌సిఎల్‌టి యొక్క ఆర్డర్ ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్'తో విలీనం చేయబడిందని సమాచారం. తదనంతరం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరు ది. 30-11-2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా అమలులోకి వచ్చేలా మార్చబడినది. ది. 30-11-2022 నాటి ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్‌ను చూడగలరు) మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు: 1. **నాగిరెడ్డి ఉమా దేవి,** భర్త: గంగాధరరావు, డి.నెం: 4-82-1 దొండపాడు, శనివారపుపేట, ఏలూరు, పెదవేగి, పశ్చిమ గోదావరి. 2. **నాగిరెడ్డి గంగాధర రావు,** తండ్రి: వెంకటేశ్వర రావు, డి.నెం: 4-84, మెయిన్ రోడ్డు, సాయిబాబా గుడి దగ్గర, ఏలూరు, శనివారపుపేట, పశ్చిమ గోదావరి-534003. 3. **పెద్దాడ పాండు రంగారావు,** తండ్రి: సుదర్శన రావు, డి.నెం: 4-84, మెయిన్ రోడ్డు, సాయిబాబా గుడి దగ్గర, ఏలూరు, శనివారపుపేట, పశ్చిమ గోదావరి-534003. వారు అగ్రిమెంట్ నెం. **ELRUBTF1711220004** తాలూకు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 45,21,913/- (అక్షరాలా నలభై ఐదు లక్షల ఇరవై ఒక్క వేల తొమ్మిది వందల పదమూడు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. **30-07-2022**న డిమాండ్ నోటీసు జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టం ప్రకారం **ఏలూరు వద్ద గౌరవనీయ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, సి.ఆర్.ఎల్. ఎం.పి.నెం.134 ఆఫ్ 2025, తేది: 17-03-2025** ద్వారా సదరు చట్టములోని సెక్షన్ 14 కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని తేది. **01-12-2025**న భౌతికంగా స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 45,21,913/- (అక్షరాలా నలభై ఐదు లక్షల ఇరవై ఒక్క వేల తొమ్మిది వందల పదమూడు రూపాయలు మాత్రమే)** + ఇప్పటి వరకు వడ్డీ మరియు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జీకి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు

ఫైనాన్షియల్ సంస్థకు తాకట్టు పెట్టిన ఆస్తికి సంబంధించిన షెడ్యూల్:
నాగిరెడ్డి ఉమా దేవి, భర్త: గంగాధర రావు, గారిచే తనఖా పెట్టబడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 11181/2017 (ఎం.ఓ.డి), ఏలూరు ఎస్.ఆర్.ఓ.,
పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు రెవెన్యూ డివిజన్, వట్లూరు సబ్-జిల్లా, పెదవేగి మండలం, చోడిమెళ్ళ గ్రామ పంచాయతీ, దొండపాడు గ్రామ ఖాతాలలోని ఆర్.ఎస్. నెం. 65/1 నందు మొత్తం ఎకరా 12.78 సెంట్ల విస్తీర్ణంలో ఎకరా 1.60 సెంట్ల విస్తీర్ణాన్ని మరియు ఇతర భూమిని హౌస్ ప్లాట్లుగా అభివృద్ధి చేసి, నాగిరెడ్డి వెంకటేశ్వర రావు నగర్ పేరుతో గ్రామ పంచాయతీ ఆమోదం (వైడ్ డి.డిస్ నెం.4, తేది 06.11.2001) పొందారు. ఈ లేఅవుట్‌లో మొత్తం 200 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్ నెం. 14 లోని దక్షిణ భాగంలో గల 150 చదరపు గజాలు లేదా 125.420 చదరపు మీటర్ల స్థలం మరియు గ్రౌండ్‌తో పాటు రెండు పై అంతస్తులు గల ఆర్‌సిసి భవనం, పాత డి.నెం. 4-82, ప్రస్తుత డి.నెం. 6-76, అసెస్‌మెంట్ నెం. 784 & 996, కొలతలు మరియు హద్దులు: **తూర్పు:** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు - 30.0 అడుగులు, **దక్షిణం:** గరగ గంగాధర రావు గారికి చెందిన ప్లాట్ నెం. 15 - 45.0 అడుగులు, **పడమర:** కొలసాని భాస్కర రావు గారికి చెందిన ప్లాట్ నెం. 23 - 30.0 అడుగులు, **ఉత్తరం:** మహమ్మద్ ఇబ్రహీం గారికి చెందిన ప్లాట్ నెం. 14 లో మిగిలిన భాగం - 45.0 అడుగులు.

తేది: 01-12-2025 **అధీకృత అధికారి**
ప్రదేశం : ఏలూరు **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

హోటల్లో కాలిపోతున్న రాయితీ!

వాణిజ్య అవసరాలకు వాడేస్తున్న గృహ వినియోగ సిలిండర్లు

❐ ఇది చింతలపూడి నగర పంచాయతీలోని ఒక హోటల్‌లో తీసిన చిత్రం. గృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్‌లను వాణిజ్య అవసరాలకు ఎలా వినియోగిస్తున్నారో ఈ చిత్రం చూస్తే అర్థమవుతోంది. చింతలపూడి ప్రధాన రహదారిలో ఏ హోటల్‌కి వెళ్లినా.. గృహ వినియోగ సిలిండర్‌లే దర్శనమిస్తున్నాయి.

చింతలపూడి, న్యూస్‌టుడే: గృహావసరాలకు వినియోగించాల్సిన రాయితీ గ్యాస్ సిలిండర్లు నల్ల బజారుకు తరలుతున్నాయి. గ్యాస్ కంపెనీలు, దుకాణదారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటి దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి పట్టణాల్లోని పెద్ద పెద్ద హోటళ్లతో పాటు చిన్న చిన్న పంచాయతీల్లో సైతం గృహావసరాల సిలిండర్లు దర్శనమిస్తుండటం సర్వసాధారణం అయిపోయింది.

ఇదీ అసలు కథ గ్యాస్ కంపెనీల్లో పని చేసే సిబ్బందితో మూడు నెలలు పైబడి ఒకే సిలిండర్ వినియోగించే కుటుంబాల వివరాలు సేకరిస్తున్నారు. అలాంటి వారి పేరిట బుక్ చేసి అడ్డదారిలో రూ.250 నుంచి రూ.350కి అదనంగా విక్రయిస్తూ.. ఆయా గ్యాస్ కంపెనీలు అదనంగా ఆర్జిస్తున్నాయి. వంట గ్యాస్ సిలిండర్ వినియోగదారుడు బుక్ చేయకపోయినా.. చేసినట్లు చరవాణికి సంక్షిప్త సందేశాలు వచ్చేస్తున్నాయి. దీనిపై సరఫరాదారును ప్రశ్నిస్తే.. పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు చింతలపూడిలో సర్వసాధారణంగా మారింది.

ధరల్లో తేడాతోనే.. గృహావసరాలకు వినియోగించే 14.2 కేజీల సిలిండర్లను ప్రభుత్వం రాయితీపై రూ.877కి అందజేస్తోంది. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ.1780 వరకు ఉంటుంది. కేవలం ఐదు కేజీల వ్యత్యాసానికి సుమారు రూ.900 వరకు ఖర్చు చేయాల్సి ఉండటంతో దుకాణదారులు గృహావసరాల సిలిండర్లను అక్రమ మార్గంలో పొంది వినియోగిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారే కానీ పూర్తిస్థాయిలో నివారణ చర్యలు లేవు. 'గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే సహించేది లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.' అని డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు.

❐ చింతలపూడి మండలానికి చెందిన ఎం.మౌనిక అనే మహిళ ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో గ్యాస్ బుక్ చేయకపోయినా.. బుక్ చేసినట్లు చరవాణికి సందేశం వచ్చింది. ఇదేంటని సదరు గ్యాస్ సరఫరా కంపెనీ సిబ్బందిని ఆరా తీస్తే 'అలాగే సందేశాలు వస్తాయి.. పట్టించుకోవద్దు.' అంటూ సమాధానం ఇచ్చారు.

జిల్లాలో ఇలా.. మొత్తం కనెక్షను: 6,45,860, సాధారణ కనెక్షన్లు: 4,19,479
గ్యాస్ ఏజెన్సీలు: 55, ప్రతి నెలా వినియోగం సుమారు: 2 లక్షల సిలిండర్లు

పోలవరం పునరావాస కాలనీల్లో పనులు వేగవంతం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పోలవరం పునరావాస కాలనీల్లో పూర్తి కావాల్సిన పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో ఎం.వి.రమణ ఆదేశించారు. పనులు పర్యవేక్షిస్తున్న సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించి పనుల పురోగతి తెలుసుకున్నారు. మొత్తం 19 కాలనీలున్నాయి. కొన్ని కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మరి కొన్ని చోట్ల మౌలిక వసతులు పూర్తి కావాల్సి ఉంది. వీటిలో తాజాగా కొన్ని పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మరి కొన్నింటికి ఇంకా టెండర్లు కావాల్సి ఉంది. హౌసింగ్ ఈఈ కేవీవీఎస్ ప్రసాద్, ఐటీడీఏ ఈఈ లత, ఆర్అండ్‌బీ డీఈ హరికృష్ణ, పీఆర్ ఏఈ రామానుజం, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

నాలుగో అంతస్తుపై నుంచి తోసేసి... ప్రాణం తీసేసి

మద్యం మత్తులో సహజీవనం చేసిన వ్యక్తి ఘాతుకం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి తనతో సహజీవనం చేస్తున్న మహిళను భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసి హత్య చేసిన వైనమిది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యలమంచిలి మండలం గంగడపాలేనికి చెందిన తాడి సుధాకర్.. ఇద్దరు కుతుళ్లు, తండ్రి ఉన్న రాధ(29) అనే వివాహితతో సుమారు ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరంతా సంవత్సరం కిందట యలమంచిలి నుంచి పాలకొల్లు టిడ్కో గృహ సముదాయానికి అద్దెకు వచ్చారు. సుధాకర్ రోజూ తాగి ఇంటికి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటిన రాధ తండ్రికి వచ్చే పింఛను డబ్బులను సుధాకర్ తీసుకున్నాడు. అదేరోజు రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో రాధ భర్తను నిలదీసింది. మంగళవారం తెల్లవారుజాము సమయానికి వారిమధ్య గొడవ తారస్థాయికి చేరింది. సుధాకర్ భార్యను భవనం నాలుగో అంతస్తుపైకి తీసుకెళ్లి బలవంతంగా కిందకి తోసేశాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో సుధాకర్ అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై జి.జె.ప్రసాద్ కేసు నమోదు చేయగా గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అద్నాం నయీం అస్మి, నరసాపురం డీఎస్పీ శ్రీవేద పరిశీలించారు. మృతురాలి బంధువులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

రాధ(పాత చిత్రం)

పాత కక్షలతో.. వ్యక్తి దారుణ హత్య

నాగరాజు (పాత చిత్రం)

పూళ్ల(భీమడోలు), న్యూస్‌టుడే: పాత కక్షలు.. వివాహేతర సంబంధం.. వెరసి ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. భీమడోలు సీఐ యు.జె.విల్సన్, ఎస్సై మదీనాబాషా కథనం మేరకు.. పూళ్లకు చెందిన పాతల నాగరాజు(45), అదే గ్రామానికి చెందిన కాండ్రు నాగతేజకు పాత గొడవలున్నాయి. మంగళవారం ఉదయం నిద్రలేచి ఇంటి ముందు కూర్చొన్న నాగరాజుపై నాగతేజ, మరో ముగ్గురు కలిసి కత్తులతో దాడి చేశారు. నాగరాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో స్థానికులు హతాసులయ్యారు. సీఐ, ఎస్సై తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని ఆరా తీశారు. ఏలూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి నిందితుల వేలి ముద్రలు సేకరించారు. పాత కక్షలు, ఓ మహిళతో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. నాగరాజు భార్య మాధవి ఫిర్యాదు మేరకు.. నాగతేజతో పాటు ఇస్సాకు, కాలి రాజేశ్, అద్దంకి బాబిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రసాద్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయికి చెందిన నబిగిరి వెంకటేశ్వరరావు(62) చేపలు పడుతూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం ఉదయం స్థానిక ఎర్రకాలువ జలాశయంలోకి చేపల వేటకు వెళ్లాడు. దోనెపై కూర్చుని చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ వెంకటేశ్వరరావు నీటిలో పడి మృతిచెందాడు. ఎంతసేపటికీ అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు జలాశయం వద్దకు వెళ్లి చూడగా దోనెపై ఎవరూ లేకపోవడంతో తోటి మత్స్యకారులకు విషయం చెప్పారు. వారంతా పడవల సాయంతో వెళ్లి గాలించగా చేపల వలలో చిక్కుకొని వెంకటేశ్వరరావు మృతదేహం కనిపించింది. దీంతో వారు జంగారెడ్డిగూడెం పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. వెంకటేశ్వరరావు భార్య గంగారత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, **Kolluri** Anjani Padmalaya @ Thota Anjani Padmalaya, W/o.Thota Satya Sai Venkata Prasad and D/o. Kolluri Hemaveera Venkataramayya, R/o. Door No. 1-100, S. Kondepadu, Ganapavaram Mandal, West Godavari Dist., A.P-534134, have changed my name to Thota Kolluri Anjani for all purposes as per the affidavit dated 8th Nov 2025.

I, Thota Satya Sai Venkata Prasad, S/o. Thota Veera Ranga Rao, R/o. Door No. 1-100, S. Kondepadu, Ganapavaram Mandal, West Godavari Dist., A.P.-534134, have changed my name to Thota Venkata Prasad for all purposes as per the affidavit dated 8th November 2025.

JOBS

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

ఏలూరు నగరంలో ప్రముఖ HP పెట్రోల్ బంక్‌లో పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను. సంప్ర॥ ✆ 93921 80560.

అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్ బోధించుటకు పార్ట్‌టైమ్ లెక్చరర్స్ కావలెను. రత్నం కోచింగ్ సెంటర్, భీమవరం - 2. ✆ 98482 33141.

Elite సంస్థనందు పనిచేయుటకు రాజమండ్రి మరియు పాలకొల్లులో ఫీల్డ్ ఆఫీసర్, సెక్యూరిటీ ఆఫీసర్, (Ex. M) సూపర్‌వైజర్లు, గార్డులు కావలెను. జీతం, PF, ESI కలదు. సంప్ర: 97032 34276, 94937 85599.

ఏ బాదరబందిలేని 35 ఏళ్లలోపు పనిమనిషి కావాలి. 1 సం॥ బిడ్డ సంరక్షణ + ఇంటి పనుల కోసం. వసతి ఉచితం, వైజాగ్. ✆ 9989366363.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డిగ్రీ, జీతం:22,000/- (8గం॥ 26 రోజులు)+PF, ESI, 50 సం॥లోపు Ct: 9666985077, 8688776420.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.45 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ప్రయోజనాల కల్పనకు వినతి

మహేశ్‌కుమార్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లుల కార్మికులకు ప్రయోజనాలు కల్పించాలని ఇఫ్టూ నాయకులు యు.వెంకటేశ్వరరావు, బి.సోమయ్య విజ్ఞప్తి చేశారు. ఏలూరులో ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటిని మంగళవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఈ రెండు మిల్లులను అర్ధాంతరంగా మూసివేయడంతో కార్మికులు వీధిన పడ్డారన్నారు. వారిని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరించొద్దు

పెదవేగి, న్యూస్‌టుడే: పామాయిల్ పరిశ్రమను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగిలోని ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్‌పామ్ ఎక్కువగా సాగవుతున్నట్టు చెప్పారు. సహకార రంగంలోని ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం.. దాన్ని ప్రైవేటీకరించాలని యోచిస్తుండటం సబబు కాదని ఆయన పేర్కొన్నారు. సంఘ నాయకులు గోళ్ల అర్జునరావు, మెతుకుమిల్లి రాంబాబు, కూచిపూడి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? ...గూడెంలో ఇంటింటా చెత్త సేకరించడం లేదు. గ్రామంలోని చెత్త కుండీల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. - ఏసుపాదం, స్థానికుడు

✔ కార్మికులను పంపి ఇంటింటా చెత్త సేకరిస్తాం. కుండీల వద్ద వ్యర్థాలు తొలగింపజేస్తాం. - శివారెడ్డి, ఉప కమిషనర్

దెందులూరు, న్యూస్‌టుడే: ? స్థానిక ఎస్ఎంఆర్ గ్రీన్ సిటీ లోపల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. - వెంకటేశ్వరరావు, స్థానికుడు

✔ వీధి దీపాలను బాగు చేయిస్తాం. - స్టానిష్‌బాబు, కార్యదర్శి

వాన ఆగక.. తేమ ఆరక!

• పంటను కాపాడుకునేందుకు అగచాట్లు
• 'దిత్వా'తో అన్నదాతల ఆగమాగం

భీమడోలు, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పంట చేతికొస్తున్న చివరి దశలో.. దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. భీమడోలు మండల వ్యాప్తంగా ఓ మోస్తరు వానలు పడుతున్నాయి. ఇప్పటికే పంట మాసూళ్లు చేసుకున్న రైతులు.. ధాన్యం కొనుగోలులో ప్రధాన అడ్డంకిగా మారిన తేమ శాతం తగ్గించుకునేందుకు రహదారులపై ఆరబోస్తున్నారు.

బరకాలు కప్పుతున్నా..

రోజంతా జల్లులు కురుస్తుండటంతో.. ధాన్యం రాశులపై బరకాలు, టార్పాలిన్లు కప్పుతున్నాయి. అయినా, కింద నుంచి నీరు వెళ్లిపోయి ధాన్యం తడిసి మొలకలు వస్తుండటంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. బహిరంగ మార్కెట్లో టార్పాలిన్లకు డిమాండ్ ఉండటంతో.. వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వాటిని కొనలేక రైతులే ఎరువుల సంచులతో బరకాలుగా కుట్టించుకుంటున్నారు. ఇవి వర్షాల నుంచి ఏమాత్రం రక్షణ కల్పించలేక పోతున్నాయి. ఆర్ఎస్‌కేలు, సహకార సంఘాల్లో అరకొరగా టార్పాలిన్లు ఉన్నా.. అవి చాలడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

భీమడోలు రహదారిపై ఆరబోసిన ధాన్యం

20 శాతానికి పెంచితేనే..

తేమ 17 శాతం లోపున్న ధాన్యాన్ని మాత్రమే ఆర్ఎస్‌కేల ద్వారా మిల్లర్లు కొంటున్నారు. పంట మాసూళ్లు చేసేటప్పుడు సుమారు 20 శాతం వరకు తేమ ఉంటుంది. దీన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు అల్లాడిపోతున్నారు. భీమడోలు రైల్వే గేటు ప్రాంతంలో రోడ్లపై కొందరు ధాన్యం ఆరబోసుకోగా, వర్షానికి తడిసి అవి కాస్త మొలక వచ్చాయి. దాంతో నాణ్యత తగ్గిపోతుందని, బస్తాకు 3-4 కిలోల వరకు బరువు తగ్గిపోతుందని అన్నదాతలు వాపోతున్నారు. 'ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేశాం. తేమ 19 శాతమున్నా.. తీసుకోవాలని మిల్లర్లకు సూచించాం. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో ఇప్పటి వరకు 75 వేల టన్నుల ధాన్యం సేకరించాం' అని ఏడీఏ సీహెచ్ ఉషారాజకుమారి తెలిపారు.

స్వామివారికి హారతిస్తున్న భక్తులు

ఘనంగా హనుమాన్ చాలీసా పఠనం

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: తూర్పు వీధి గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు బాబుల ఆలయాల్లో జాతర కనులపండువగా సాగుతోంది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జాతర కన్వీనర్ వంకినేని భాను ప్రకాశ్, పలువురు సభ్యులు పర్యవేక్షించారు.

చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

భీమడోలు, న్యూస్‌టుడే: స్థానిక హెచ్‌పీ గ్యాస్ గోదాము సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను ఎట్టకేలకు తొలగించారు. 'చెప్పినా చెవికెక్కించుకోరు' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎల్.తనూజ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది వ్యర్థాలు తొలగింపజేసి.. బ్లీచింగ్ చల్లారు.

ఉత్తమ సేవలకు ఎస్పీ అభినందన

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు, కైకలూరులో జిల్లా పోలీసు అధికారుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మూడు పోలీసు సంక్షేమ పెట్రోలు బంకుల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ సేవలందించే సిబ్బందికి ప్రతినెలా నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆర్ఐ సతీశ్, ఏఆర్ ఎస్ఐ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు.. అన్నే దంపతులు

నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళా, వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి ఎనలేని సేవలందించిన అన్నే దంపతులు చిరస్మరణీయులని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి కొనియాడారు. స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో మంగళవారం అన్నే అనసూయ వర్ధంతి సభ నిర్వహించారు. వ్య.కా.సం. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జీవీఎల్ నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఐద్వా నాయకురాళ్లు హైమావతి, పంపన రవి, ఆదిశేషు, ఇస్సాకు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

అధికారులతో సమీక్షిస్తున్న ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. చేబ్రోలు, గోపీనాథపట్నం, గొల్లగూడెం, గోపాలపురం, నల్లమాడు, రామచంద్రపురం, యర్రమిల్లిపాడులో మంగళవారం ఆయన పర్యటించారు. ఆయా పంచాయతీల్లోని సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై నివేదిక సేకరించారు. చేబ్రోలులో ప్రధాన డ్రెయినేజీ, పోలవరం కుడి కాలువ నుంచి చెరువులను నీటితో నింపేలా ఎత్తిపోతలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆయిల్‌పామ్ తోటల మీదుగా వెళ్తోన్న 11 కేవీ విద్యుత్తు తీగలు, స్తంభాలు మార్చేందుకు పర్యవేక్షణ ఛార్జీలు తగ్గించేలా చూడాలని పలువురు విజ్ఞప్తి చేశారు. పీఆర్ డీఈ వేణుగోపాల్, ఎంపీడీవో రాజ్‌గోపాల్, తెదేపా మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అసమానతలతో అనర్థాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సామాజిక అసమానతలతో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని డీఎంహెచ్‌వో పి.జె.అమృతం అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా వైద్యాధికారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆమ్ల దాడులు, మానసిక హింస, సైబర్ వేధింపులు తదితరాలపై చర్చించారు. లింగ ఆధారిత హింసను నిరోధించడానికి చట్టపరమైన రక్షణ, బాధితుల సహాయక కేంద్రాలు తదితరాలను విశదీకరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శోభ, జిల్లా కుష్ఠు నివారణాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, మానసిక వైద్యుడు వంశీ, ఏవో గంగాభవాని, పూజా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనర్గళంగా.. అద్వితీయంగా! 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ

ఉపన్యాసమిస్తున్న విద్యార్థిని

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సూర్య పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యాన ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం'పై జరిగిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా అంశంపై బాలబాలికలు అనర్గళంగా మాట్లాడి ప్రతిభ కనబరిచారు. అయేషా సిద్దిక, పి.నస్రా నజీజ్, వై.జగదీశ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. వారికి పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖరరావు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు డేనియేల్, ఉపాధ్యాయులు ఎండీ తారిఖ్, ఈ.సురేశ్‌బాబు పర్యవేక్షించారు.

విజేతలతో కరస్పాండెంట్ చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు

దివ్యంగా.. భవ్యంగా!

చదువులో రాణిస్తున్న బాలికలు

నేడు అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం

ఆ బాలికలు ప్రత్యేక ప్రతిభావంతులు.. తమ శారీరక వైకల్యాన్ని తలచుకొని బాధపడలేదు. మేమూ అందరిలాగే.. ఎందులోనూ తగ్గేదే అంటూ ముందుకు సాగుతున్నారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల తోడ్పాటుతో చదువులో రాణిస్తున్నారు. నేడు అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కథనం. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

ఉపాధ్యాయ కొలువే లక్ష్యం

నా పేరు ఆవుల పూజిత. మాది ఏలూరు. నాన్న రంగయ్య కారు డ్రైవర్. అమ్మ రమణ గృహిణి. కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. పుట్టుకతోనే కుడి చెయ్యి లేదు. అమ్మానాన్న మాత్రం మహాలక్ష్మి పుట్టిందని సంబరపడిపోయారు. నా వైకల్యాన్ని గుర్తు చేయకుండా పెంచుతున్నారు. ఉపాధ్యాయుల సూచనలతో పట్టుదలతో చదువుతున్నా.. ఉపాధ్యాయినిగా జీవితంలో స్థిరపడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

వైద్యురాలినవుతా..

నా పేరు శెట్టి వెంకట కీర్తన. మాది ఏలూరు సమీప కొత్తముప్పర్రు. నాన్న ఆంజనేయులు, అమ్మ గంగాభవాని వ్యవసాయం చేస్తుంటారు. ఏలూరు కస్తూర్బా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. చిన్నతనంలో మా అన్నయ్యతో ఆడుకుంటూ ఉండగా.. ప్రమాదవశాత్తు చీపురు పుల్ల కుడి కంటికి తగిలి.. కన్ను కోల్పోయా. మనోస్థైర్యం కోల్పోకుండా చదువులో ముందుంటున్నా. వైద్యురాలిగా ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంతో విద్యాభ్యాసం చేస్తున్నా.

అందరితో సమానంగా..

ఈమె పేరు గొల్లమూడి అభిజ్ఞ. మాటలు రావు. చెవులు వినపడవు. ఏలూరు విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో ఉంటూ.. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. తనలోని లోపాలకు కుంగిపోకుండా చదువుల తల్లిగా రాణిస్తున్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిగమించేలా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు.

రోడ్డు చెంత.. గొయ్యితో చింత

నిడమర్రు పోలీస్‌స్టేషన్ నుంచి బాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి అంచున.. మంచినీటి వాల్వ్ ఏర్పాటుకు గొయ్యి తవ్వారు. పని పూర్తయి నెల రోజులు గడుస్తున్నా.. తిరిగి పూడ్చలేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

దాడి చేస్తూ.. బెంబేలెత్తిస్తూ..

గణపవరంలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ.. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. వీధుల్లో రాకపోకలు సాగించే వాహనదారుల వెంట పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రివేళ ఇంట్లో నుంచి బయటకొచ్చే పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. - న్యూస్‌టుడే, గణపవరం

అసంపూర్తి.. అయ్యేనా పూర్తి!

నిడమర్రు మండలం ఎనికేపల్లిలో గ్రామ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. గత ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో.. గుత్తేదారు చివరి దశలో పనులు ఆపేశారు. ఆరోగ్య కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

దారి.. ప్రమాదంగా మారి

గణపవరం- పిప్పర రహదారి ప్రయాణికులకు నరకం చూపుతోంది. ఇటీవలి వర్షాలకు రోడ్డు ఛిద్రంగా మారగా.. చిన్నపాటి మరమ్మతులు చేశారు. మార్గం మధ్యలో భారీ గుంత ఏర్పడటంతో.. అక్కడ ప్రమాదాలు సంభవించకుండా స్థానికులు బకెట్, దానిపై కర్ర పెట్టి.. ఎరువు సంచి కట్టారు. - న్యూస్‌టుడే, గణపవరం

బకాయి చెల్లించక.. వాహనాలు రోడ్డెక్కక

ఏలూరు నగరం, భీమవరం పట్టణానికి పలువురు లబ్ధిదారులకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద 3 వేల లీటర్ల సామర్థ్యమున్న నాలుగు సెప్టిక్ ట్యాంకు వాహనాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో.. ఏలూరు కార్యాలయానికి తీసుకొచ్చి మూలన పెట్టేశారు. - ఈనాడు, ఏలూరు

కొనసాగిన దీక్ష

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఐకాస నాయకులు రిలే నిరాహార దీక్షలను తొమ్మిదో రోజు మంగళవారం కొనసాగించారు. పెట్రోలు బంకులో చోటుచేసుకున్న అవినీతికి సంబంధించి నలుగురు ఉద్యోగులపై అక్రమంగా సస్పెన్షన్ విధించారని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎంప్లాయీస్ యూనియన్ డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. నాయకులు జేయూఎం రావు, ఓ.చిరంజీవి, పీవీ రమణ, వి.సూరన్న, నారాయణ, బీఎస్ చలం, కేపీ రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని అన్ని రవాణా వాహనాలకు ఏటీఎస్ కేంద్రాల్లో సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలని రవాణా శాఖాధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు సూచించారు. యజమానులు https:///vahan.parivahan.gov.in/AFMS వెబ్‌సైట్‌లో ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించి స్లాట్ నమోదు చేసుకోవాలన్నారు. నిర్ణీత తేదీల్లో ఏటీఎస్ కేంద్రాల్లో ఫిట్‌నెస్ చేయించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని మలేరియా నివారణ జిల్లా సహాయాధికారి జె.గోవిందరావు అన్నారు. ఆశా దినోత్సవం సందర్భంగా.. స్థానిక పవరుపేట, లంబాడీపేట, జేపీ కాలనీల్లోని పట్టణారోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. శీతాకాలంలో సంక్రమించే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో అయిదేళ్లలోపు బాలలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని ఆయన సూచించారు. వైద్యులు గౌతమ్, నీలిమ, ప్రగతి, మానస, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు సూచనలిస్తున్న గోవిందరావు

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపిక

నిడమర్రు, గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 27న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 8, 9వ తరగతి విద్యార్థినులు ఏంజెల్, గీతా మాధురి విశేష ప్రతిభ కనబరిచి.. రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. వారిని ఎంఈవో-1, 2 అనూరాధ, శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు నరేశ్‌బాబు అభినందించారు.

గీతా మాధురి, ఏంజెల్

నేటి నుంచి విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: గుడివాకలంక ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ విద్యుత్తు తీగలు లాగుతున్నందున.. లంక గ్రామాలకు బుధ, గురు, శుక్రవారాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. ప్రత్తికోళ్లలంక, పెదయాగనమిల్లి, కోమటిలంక ప్రాంతాలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటలు వరకు సరఫరా ఉండదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్టీఏ సభ్యత్వాల స్వీకరణ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) నాయకులు జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం స్వీకరించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు, సహాధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

'విజయకేతనం' పుస్తకాల పంపిణీ

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: నారాయణపురం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సర్పంచి దిడ్ల అలకనంద మంగళవారం విజయకేతనం పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు పోతురాజు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ సంధ్యారాణి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

రామ్‌బాయి (పాత చిత్రం)

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు దుర్మరణం చెందిన ఘటన 216ఏ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం దొంపాకకు చెందిన రావాడ రామ్‌బాయి(60) కొన్నేళ్ల కిందట చేబ్రోలుకొచ్చి స్థిరపడ్డారు. ఈమెకు మతిస్థిమితం సరిగా లేదు. మంగళవారం వేకువజామున జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీళ్లనుకొని.. కలుపు మందు తాగి!

● చికిత్స పొందుతూ రైతు మృతి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మంచినీళ్లు అనుకుని.. పొరపాటున కలుపు మందు తాగి ఓ యువ రైతు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. పెదవేగి మండలం జగన్నాథపురానికి చెందిన మేడికొండ పవన్‌కుమార్(35) గత నెల 21న తన పొలంలో కలుపు మందు కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో దాహం వేయడంతో.. పొరపాటున గట్టుపైనున్న కలుపు మందు కలిపిన నీరు తాగి అస్వస్థతకు గురయ్యారు. విషయాన్ని తన తమ్ముడు సాయికి చెప్పడంతో.. అతడు స్నేహితులు, కుటుంబ సభ్యుల సాయంతో గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఈ నెల 1న ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో మృతి చెందారు. యువ రైతు తండ్రి ఫిర్యాదు మేరకు పెదవేగి పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన చోదకుడు..



ధర్మయ్య(పాత చిత్రం)

ఉంగుటూరు: భీమడోలు మండలం ఎం.ఎం.పురానికి చెందిన యర్లపాటి ధర్మయ్య(48) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత నెల 26న ద్విచక్ర వాహనంపై ఉంగుటూరు వస్తుండగా.. మార్గం మధ్యలోని కైకరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ధర్మయ్యను 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య మరియమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. మరియమ్మ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు.

సంకల్ప్ మస్తు!

● ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
● 50 రోజులపాటు ప్రత్యేక తరగతులు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యా శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యసన సామగ్రి అందజేస్తోంది. తాజాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు సంకల్ప్-2026 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత నెల 24న ప్రారంభమైన కార్యక్రమం.. 50 రోజుల పాటు కొనసాగనుంది.

947 మంది విద్యార్థులు..

ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 496 మంది, ద్వితీయ ఏడాదిలో 451 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రోజూ మూడు గంటలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం మెరుగుపడేందుకు ఇంటర్ బోర్డు కమిషనర్ రంజిత్ బాషా ఆదేశానుసారం తరగతులు ఏర్పాటు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 23 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.



చదువుకుంటున్న నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

విద్యార్థుల వివరాలిలా..		
కళాశాల	ప్రథమ	ద్వితీయ
నారాయణపురం	138	107
ఏలూరు	225	195
పెదపాడు	58	69
గణపవరం	75	80

విభాగాల వారీగా విభజించి..

అర్ధ వార్షిక పరీక్షల మార్కులు ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి విభాగాలుగా విభజించారు. వారి సామర్థ్యాలు తెలుసుకుని మరింత సాన పెడుతున్నారు. ఇందుకు విద్యార్థులను అధ్యాపకులు దత్తత తీసుకుని, వారి సంరక్షకులుగా వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్నం వరకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి మూడు గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో ఇప్పటికే గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి తర్ఫీదునిస్తున్నారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న వ్యాన్

ఏలూరు గ్రామీణ: పెదవేగి మండలం సీతారామపురానికి చెందిన కొల్లి మణికంఠ తన స్నేహితుడిని రైలు ఎక్కించేందుకు గత నెల 28న ద్విచక్ర వాహనంపై ఏలూరు వెళ్తున్నారు. మార్గం మధ్యలోని ముండూరు సమీపాన వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పెదవేగి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం



సత్యనారాయణ (పాత చిత్రం)

ఉంగుటూరు: తిమ్మయ్యపాలెం మాజీ సర్పంచి మారిశెట్టి సత్యనారాయణ(60) మంగళవారం మృతి చెందారు. 2001-06 మధ్య గ్రామ సర్పంచిగా తిమ్మయ్యపాలెం అభివృద్ధికి ఎనలేని సేవలందించారు. సత్యనారాయణ మృతదేహాన్ని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ ఛైర్మన్ పాతూరి విజయ్‌కుమార్, సూరత్తుల అయ్యప్ప ఉన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కొదమసింహం
అంబిక మినీ	రాజు వెడ్స్ రాంబాయి
సాయిబాలాజీ	12ఏ రైల్వేకాలనీ
బాలాజీ	జుటోపియా
సత్యనారాయణ స్క్రీన్ 1	కాంత
సత్యనారాయణ స్క్రీన్ 2	రివాల్వార్ రీటా
సత్యనారాయణ స్క్రీన్ 3	స్కూల్ లైఫ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మఫ్టీ పోలీస్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఆంధ్రా కింగ్ తాలూకా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అమరకావ్యం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలూకా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	ప్రేమంటే
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	12ఏ రైల్వేకాలనీ
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కాంత

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

డిగ్రీ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పేపర్ ప్లేట్లు, గ్లాసులు, విస్తర్ల తయారీ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తయారీ తీరును విద్యార్థులు తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం సుప్రియన్‌పేట శివారు ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. - **వేణుగోపాల్**
✔ సుప్రియన్‌పేటలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ? కొయ్యలగూడెం గ్రంథాలయం సమీపంలో రహదారి పక్కన తాగునీటి పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి చాలా రోజులుగా అలానే వదిలేశారు. - **కొల్లూరు కిశోర్, స్థానికుడు**
✔ గొయ్యిని పూడ్చి సమస్య పరిష్కరిస్తాం.
- **జగదీష్, పరింపూడి పంచాయతీ కార్యదర్శి**

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ? బయ్యనగూడెం నుంచి ధర్మారావుపేట, కోయరాజమండ్రి, బొత్తప్పగూడెం మీదుగా నిమ్మలగూడెం రహదారి అధ్వానంగా ఉంది. - **పోతన తాతారావు, బయ్యనగూడెం**
✔ రహదారి అభివృద్ధికి రూ.5కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. - **అంకిరెడ్డి, ఏఈ పంచాయతీ రాజ్**

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ? బుట్టాయగూడెం శివాలయం ఎదురుగా దొరమామిడి వెళ్లే రహదారి మలుపులో పిచ్చిమొక్కలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. - **వాహనచోదకులు**
✔ చర్యలు తీసుకుంటాం. - **దేవప్రియుడు, పంచాయతీ కార్యదర్శి**

సరిచేసి.. సమస్య తీర్చి

స్పందనకు పందనం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: అల్లూరినగర్ గ్రామంలో పరివర్తకం ప్రమాదకర స్థితిలో ఉన్న నేపథ్యంలో మంగళవారం 'పరివర్తకం.. పట్టుకుంటే ప్రమాదం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో విద్యుత్తు స్తంభం సరిచేసి, పరివర్తకాన్ని ఎత్తులో ఉంచారు.

ఎమ్మెల్యేకు వినతి

చింతలపూడి, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లాకు గోదావరి లేదా ఉత్తర గోదావరి జిల్లాగా నామకరణం చేసేలా క్యాబినెట్ సబ్ కమిటీకి విన్నవించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు గోదావరి జిల్లా సాధన సమితి సభ్యులు చింతలపూడిలో మంగళవారం వినతిపత్రం అందజేశారు.

అంతా మా ఇష్టం.. అడిగితే మీకే కష్టం..!

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: మెట్ట మండలాల్లో మట్టి, గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంది. అక్రమ తవ్వకాలపై అధికారుల నియంత్రణ కొరవడటంతో అక్రమార్కులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారు. కొందరు అధికారుల కాసుల కక్కుర్తితో గుట్టలు, చెరువులు, కాలువ గట్లు కనుమరుగవుతున్నాయి. అనధికార లేఅవుట్లకు వందల కొద్దీ టిప్పర్లతో మట్టిని తరలించి, మెరకపనులు చేస్తున్నా. . పట్టించుకునే నాథుడు లేడు. చింతలపూడి చుట్టుపక్కల ప్రభుత్వ చెరువులన్నీ పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి.

చింతలపూడిలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

పగలు.. రాత్రి తేడా లేకుండా.. చింతలపూడి మండలంలో ఉన్న ఎత్తిపోతల పథకం కాలువ గట్లు చాలా వరకు కరిగిపోయాయి. దీంతో పర్యావరణానికి ముప్పువాటిల్లుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మట్టిని తరలించే వాహనాలు పగలు, రాత్రి తేడా లేకుండా మితిమీరిన వేగంతో ప్రధాన రహదారులపై పరుగులు పెడుతున్నాయి. దీంతో ప్రయాణికులు, చోదకులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. చింతలపూడి మండలంతోపాటు టి.నరసాపురం, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో ఇదే పరిస్థితి.

● అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేస్తే బాధ్యులపై రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం.
- **క్రాంతికుమార్, సీఐ, చింతలపూడి**

బరకాల కోసం రైతుల పాట్లు

గూటాల పుంత దారిలో ఆరబెట్టిన ధాన్యం

పోలవరం, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో పలు చోట్ల ఆరబెట్టిన ధాన్యం రహదారుల వెంబడి ఉంది. మంగళవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో ఎప్పుడు చినుకులు పడతాయో అన్న భయంతో రైతులున్నారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల పరిధిలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరినూర్పిడి యంత్రాలతో కోయించిన ధాన్యం బయటకు తీసుకొచ్చి రైతులు ఆరబెడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా బరకాలు అందజేయాలని ఆదేశించడంతో వాటి కోసం రైతులు ఎగబడుతున్నారు. మండలంలోని ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 120 బరకాలు మాత్రమే వచ్చినట్లు వ్యవసాయాధికారి కె.రాంబాబు చెప్పారు.

కౌశలం ఆన్‌లైన్ పరీక్ష ప్రారంభం

పోలవరం సచివాలయంలో పరీక్ష పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసబాబు

పోలవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో పోలవరం మండలంలో ఇంటి నుంచి పనిచేసేందుకు కౌశలం సర్వేలో 136 మంది యువత ముందుకు వచ్చారు. వారిలోని వృత్తి నైపుణ్యం పరిశీలించేందుకు మూడు రోజులపాటు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష సచివాలయాల్లో మంగళవారం ప్రారంభించారు. సచివాలయానికి ఇద్దరు చొప్పున 14 సచివాలయాల పరిధిలో రోజుకు 28 మంది చొప్పున ఆన్‌లైన్ పరీక్షలకు ఏర్పాటు చేశామని తొలి రోజు పరీక్షకు ఏడుగురు మాత్రమే హాజరైనట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాస్‌బాబు చెప్పారు.

ఆకట్టుకున్న ఉపన్యాస పోటీలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక ప్రతిభా ఆంగ్ల మాధ్యమం ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం అన్న అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఎం.సాక్షి, డి.భువన, జి.భాను శ్రీ దుర్గ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రిన్సిపల్ కాసర లక్ష్మీ సరోజ, డైరెక్టర్ సుభాష్‌రెడ్డి, ఉపాధ్యాయిని జ్యోతి బహుమతులు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విజయకేతనం పుస్తకాలతో చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కొయ్యలగూడెం మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం రాజవరం పంచాయతీ పరిధిలోని గంగవరంలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల వద్ద రూ.38.60లక్షలతో నిర్మించనున్న పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వరకు రూ.3.40 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. కొయ్యలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో పాల్గొని సాగుకు, రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. అనంతరం సచివాలయం వద్ద మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రజా వాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పామాయిల్ పరిశ్రమలను ప్రైవేటీకరించొద్దు

పెదవేగి న్యూస్‌టుడే: పామాయిల్ పరిశ్రమలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగిలోని ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్‌పామ్ ఎక్కువగా సాగవుతున్నట్లు చెప్పారు. సహకార రంగంలోని ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం.. దాన్ని ప్రైవేటీకరించాలని యోచిస్తుండటం సబబు కాదని ఆయన పేర్కొన్నారు.

నేడు హనుమద్వ్రతం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతం బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు చలువ పందిరి ఏర్పాటు చేశారు.

శ్రీవారికి అష్టదళ పాదపద్మారాధన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామికి మంగళవారం 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున శ్రీవారిని దర్శించారు. అయ్యప్ప స్వాములు వివిధ ప్రాంతాల నుంచి వచ్చారు. ఈవో కలగర శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

142 వినతుల స్వీకరణ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: మండల స్థాయిలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో 142 మంది వివిధ సమస్యలపై వినతులు ఇచ్చారని ఎంపీడీవో కింజకుమార్ పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై మరింత అప్రమత్తం

లంకలపల్లిలో వంటకాన్ని పరిశీలిస్తున్న డీడీ కొండలరావు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల ఆరోగ్యం విషయంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు (అడ్మినిస్ట్రేషన్, విజయవాడ), ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి ఐ.కొండలరావు ఆదేశించారు. బుట్టాయగూడెం మండలం లంకలపల్లి, కామయ్యకుంట, లంకపాకల, దొరమామిడి, అంకన్నగూడెం, తెల్లంవారిగూడెం ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. పోషకాహార తయారీ, వసతి సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై విద్యా ప్రమాణాల స్థాయిని తెలుసుకున్నారు. ఇన్‌ఛార్జి ఏటీడబ్ల్యూవో జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

ఆశాలకు సూచనలిస్తున్న గోవిందరావు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని మలేరియా నివారణ జిల్లా సహాయాధికారి జి.గోవిందరావు అన్నారు. ఆశా దినోత్సవం సందర్భంగా.. స్థానిక పవరుపేట, లంబాడీపేట, జేపీ కాలనీల్లోని పట్టణారోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. శీతాకాలంలో సంక్రమించే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో అయిదేళ్లలోపు బాలలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని ఆయన సూచించారు. వైద్యులు గౌతమ్, నీలిమ, ప్రగతి, మానస, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

యమపాశాల్లా తీగలు..!



పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం గ్రామంలోని ప్రధాన రహదారిలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. లోడు లారీలు, టూరిస్టు బస్సులు గ్రామంలోకి వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించి ఐదేళ్ల సంవత్సరాలు అవుతోంది. అప్పటికే విద్యుత్తు స్తంభాలు రహదారి పక్కనే ఉన్నాయి. రోడ్డు ఎత్తు పెరగడంతో విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. సిమెంట్, కిరాణా సామగ్రి తీసుకొచ్చే లారీల పైభాగంలో కట్టే టార్పాలిన్‌లు తొలగించే క్రమంలో పొరపాటున తీగలు తగిలితే పరిస్థితి ఏమిటని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. టూరిస్టు బస్సుల సిబ్బంది అయితే గ్రామంలో అడుగు పెట్టిన వెంటనే వెదురు కర్ర కూడా తెచ్చుకుని తీగలు పైకి ఎత్తాల్సిన పరిస్థితి. ట్రాన్స్‌కో అధికారులు తక్షణం స్పందించి తీగలను సరిచేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుంత.. చూడకుంటే చింత..!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక రాజులకాలనీ వినాయకుని గుడి రోడ్డు అంచుల్లో పైప్ లైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ కాలనీలో తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఇటీవల గుంత తవ్వారు. ఇందులోకి ప్రస్తుతం నీళ్లు చేరాయి. రహదారి వారగా ఉండటం, నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన మార్గం కావడంతో సత్వరమే మరమ్మతులు పూర్తి చేసి గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే మరమ్మతులు పూర్తి చేస్తామని పురపాలక కమిషనర్ రమణ పేర్కొన్నారు.

తూరలతో సరి.. రాకపోకలకు దారేది..

తూరలు పెట్టి వదిలివేయడంతో ఇలా..

పోలవరం, న్యూస్‌టుడే: ఇటుకలకోటలో సీసీ రోడ్డు వేయించిన అధికారులు ప్రధాన రహదారి నుంచి వీధుల్లోకి వెళ్లడానికి మధ్యలో తూరలు పెట్టి వదిలి వేయడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు కష్టంగా మారిందని గ్రామస్థులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి నాలుగు వీధుల్లోకి వెళ్లే మార్గంలో తూరలు పెట్టి, పైభాగంలో కాంక్రీటు చేయకుండా వదిలేయడంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై సచివాలయ కార్యదర్శి ఎస్.సురేశ్‌ను సంప్రదించగా పైభాగంలో శ్లాబ్‌లు వేయడానికి ఇటీవల పంచాయతీ బోర్డు సమావేశంలో ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా పీఆర్ ఏఈని కోరుతూ తీర్మానం చేయడం జరిగిందని చెప్పారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వేలేరుపాడు మండలంలోని జిన్నెలగూడెం-తెల్లపల్లి గ్రామాల మధ్య రహదారి అధ్వానంగా మారింది. నాలుగేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ఈ రెండు గ్రామాల మధ్యలో సుమారు 4.కి.మీ. గల పంచాయతీరాజ్ రహదారి పూర్తిగా దెబ్బతింది. పలు చోట్ల ఆనవాళ్లు లేకుండా కొట్టుకుపోవడంతో మారుమూలన గల చెరువుగొల్లగూడెం, తెల్లపల్లి గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ.. వెంటనే ఐటీడీఏ పీవోకు విన్నవించి త్వరలో మరమ్మతులు చేపడతామన్నారు.

జాతీయ పోటీలకు జంగారెడ్డిగూడెం విద్యార్థులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రగ్బీ, వాలీబాల్‌లో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు పట్నాల సోమశేఖర్ తెలిపారు. రగ్బీకి ఎంపికైన విద్యార్థిని వాడవలస దివ్యశ్రీ, వాలీబాల్‌కు కంచర్ల రామ్‌చైతన్య ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్, ఫిజికల్ డైరెక్టర్లు లాగు జయరాజు, ఎ.సాయి శ్రీనివాస్, ఎం.కామేశ్వరి, ఎం.భువనేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలోను బాగా రాణించాలని వీరు ఆకాంక్షించారు.

కొనసాగిన రిలే దీక్ష

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఐకాస నాయకులు రిలే నిరాహార దీక్షలను తొమ్మిదో రోజు మంగళవారం కొనసాగించారు. పెట్రోలు బంకులో చోటుచేసుకున్న అవినీతికి సంబంధించి నలుగురు ఉద్యోగులపై అక్రమంగా సస్పెన్షన్ విధించారని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎంప్లాయీస్ యూనియన్ డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాస్ దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

బస్సు అత్యవసర ద్వారం నుంచి కిందకు దిగుతున్న మహిళ

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సు డ్రైవర్లు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేటు బస్సును సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ప్రయాణ సమయంలో అనుకోని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. అత్యవసర ద్వారంతోపాటు ఇతర భద్రతా వస్తువులు ఎలా వినియోగించాలో వివరించారు. ఈ సందర్భంగా మహిళా ప్రయాణికులు అత్యవసరం ద్వారా ఎలా వినియోగించుకోవాలో చేసి చూపించారు.

పాఠశాల బస్సుల తనిఖీలు

తనిఖీ చేస్తున్న ఎంవీఐలు రవిగోపాల్, సత్యనారాయణమూర్తి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ప్రాంతీయ వాహన తనిఖీ అధికారులు మంగళవారం కొయ్యలగూడెంలో తనిఖీలు నిర్వహించారు. సహాయ వాహన తనిఖీ అధికారులు కేబీవీ రవిగోపాల్, సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మొత్తం ఆరు పాఠశాలలకు చెందిన 35 బస్సులను తనిఖీ చేశారు. వాటిలో ఒక బస్సుకు సరైన కాగితాలు లేనందున రూ.7,200 జరిమానా విధించారు. ఈ నెల 4వ తేదీ వరకు తనిఖీలు చేస్తామని అధికారులు చెప్పారు.

మహిళ అదృశ్యం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలో ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన గంగిరెడ్ల అప్పలరాజు గత 8 ఏళ్లుగా భార్య పిల్లలతో కలిసి బొర్రంపాలెంలో ఉంటున్నారు. ఇటీవల అతను భవానీ మాల ధరించాడు. గత నెల 27న గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో తన భార్య హిమజతోపాటు పిల్లలు కనిపించలేదు. వారి ఆచూకీ కోసం పలు చోట్ల వెతికిన అనంతరం అతను ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయబాబు తెలిపారు.

చౌక దుకాణాలపై విజిలెన్స్ దాడులు

దేవులపల్లి రేషన్ షాపులో పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని పలు చౌకదుకాణాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి వివరాల మేరకు... జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఉప్పలమెట్టలోని దుకాణం నం-35, మండలంలోని దేవులపల్లిలోని దుకాణం నం-14 లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి బియ్యం, పంచదారల్లో వ్యత్యాసాలు గుర్తించామని అన్నారు. రెండు దుకాణాల్లోని రూ.8,41,541 విలువైన భౌతిక నిల్వలు సీజ్ చేయడంతో పాటు ఆయా డీలర్లపై 6 ఏ కేసులు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతారాం, సీఎస్‌డీటీ వెంకటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ఎస్పీ అభినందన

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు, కైకలూరులో జిల్లా పోలీసు అధికారుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మూడు పోలీసు సంక్షేమ పెట్రోలు బంకుల్లో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ సేవలందించే సిబ్బందికి ప్రతి నెలా నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆర్ఐ సతీశ్, ఏఆర్ ఎస్ఐ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం వద్ద మంగళవారం పెను ప్రమాదం తప్పింది. భీమడోలు నుంచి ద్వారకాతిరుమల వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయట పడటంతో ప్రమాదం తప్పింది.

కలుషిత నీరు.. గ్రామస్థుల బేజారు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: కలుషిత నీరు తాగ లేక మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన టేకుపల్లి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. 2022 సంవత్సరంలో సంభవించిన గోదావరి వరదలకు ఈ గ్రామంలోని మంచినీటి ట్యాంకు పూర్తిగా పాడయ్యింది. ఇది పోలవరం ముంపు గ్రామం కావడంతో నూతన ట్యాంకు నిర్మాణానికి అవకాశం లేదు. దీంతో చిన్న ట్యాంకును ఏర్పాటు చేసుకుని గోదావరి నీటిని నేరుగా పట్టుకుని తాగుతున్నారు. దీంతో గ్రామంలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. కార్యదర్శి దావీదు మాట్లాడుతూ ముంపు గ్రామం కావడంతో ట్యాంకు నిర్మాణం చేయడం లేదని, ప్రతి ఇంటికీ క్లోరిన్ మాత్రలు ఇస్తున్నామని తెలిపారు.

రూ. 50 వేలు మించి నగదుతో వెళ్లొద్దు

వెంకటాపురంలో..

చాట్రాయి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడతో సరిహద్దుల్లో తనిఖీ మొదలయ్యాయి. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మంగళవారం నుంచి తనిఖీలు చేస్తున్నారు. చాట్రాయి మండలానికి వేంసూరు మండలం వెంకటాపురం సరిహద్దుగా ఉంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి నగదుతో తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లరాదు. అంతకన్నా ఎక్కువ నగదుకు సరైన పత్రాలను చూపకపోతే పోలీసులు సీజ్ చేస్తారు. లభ్యమైన నగదు రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారు. ఎక్కువ మొత్తంలో ఉంటే ఎన్నికల అధికారులు ఆదాయ పన్ను, జీఎస్టీ అధికారులకు సమాచారం అందించి ఆ నగదును కోర్టులో జమ చేస్తారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజు, వ్యాపారం, పెళ్లి వంటి ముఖ్యమైన అవసరాలకు డబ్బు తీసుకువెళ్లే వారు సరైన ఆధారాలు దగ్గర ఉంచుకుని అధికారులకు చూపాలి. తనిఖీల సమయంలో చూపలేకపోయినా.. తర్వాత పత్రాలను చూపితే జప్తు చేసిన డబ్బు తిరిగి ఇస్తారు. తెలంగాణలో కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు రవాణా, ప్రయాణాల్లో నిబంధనలు పాటించాల్సి ఉంది.

జిల్లాలో సరిహద్దు ప్రాంతాలు: లింగగూడెం, అల్లిపల్లి, మద్రిగూడెం, వేలేరు, కోయ మాదారం, కృష్ణారావుపాలెం, తాటియాకులగూడెం.

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలైన సంఘటన ఇది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోమర్రుకు చెందిన మోహన సాయి ద్విచక్రవాహనంపై మంగళవారం మధ్యాహ్నం ముదినేపల్లికి బయలుదేరాడు. ఆయనను వడాలిలోని కనక దుర్గాదేవి ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మోహన్ సాయి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో స్థానికులు గుడివాడ ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కార్యాలయం ప్రారంభానికి సిద్ధం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో ఈ నెల 4న డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కృష్ణప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమణబాబు

మండవల్లి, న్యూస్‌టుడే: సచివాలయ సిబ్బంది విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా సహించేది లేదని ఎంపీడీవో రమణబాబు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వాడలంక, పులపర్రు సచివాలయాలను మంగళవారం పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. సంపద కేంద్రాన్ని వాడుకలోకి తీసుకువచ్చి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీ ఆదాయ మార్గాలను పెంపొందించుకుని అభివృద్ధిలో ముందుకు సాగేలా చూడాలన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టండి

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పీరయ్య

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.పీరయ్య తెలిపారు. మంగళవారం నూజివీడులో 26వ వార్డులో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నవమి స్కూల్ రోడ్డులో రహదారి ప్రతిపాదనలు, నందనం తోటలో మురుగు కాల్వ నిర్మాణం చేపట్టాలని పట్టణ తెదేపా అధ్యక్షులు మల్లిశెట్టి జగదీశ్ కోరారు. కౌన్సిలర్ మండా శ్రీను, ఏఈ వికాస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు కొత్తపేట నుంచి ఆర్టీసీ బస్సు స్టాండుకు వెళ్లే సిమెంటు రోడ్డుపై డ్రెయినేజీ మురుగు నీరు తిష్ఠ వేయడంతో రాకపోకలకు ప్రజలు అవస్థ పడుతున్నారని స్థానికుడు గఫార్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వై.ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మురుగును మళ్లించి సమస్య పరిష్కరించారు.

భవిత కేంద్రం.. చిన్నారులకు వరం

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

నూజివీడు, న్యూస్‌టుడే

అడుగు తీసి అడుగు వేయలేరు.. కనీసం సరిగా మాట్లాడలేరు. తమ పనులు తాము చేసుకోలేరు.. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించే చిన్నారుల కోసం విద్యతో పాటు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వారి ఎదుగుదలకు అవసరమైన సేవలు అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా సాధారణ స్థాయికి వచ్చేలా మార్పు తీసుకొస్తున్నాయి. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో భవిత కేంద్రాల ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నారు. కొందరు అవగాహన లేక వీటిని అందిపుచ్చుకోలేకపోతున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

మండలానికి ఒకటి.. నూజివీడు, కైకలూరు మండలాల్లో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. ఒక్కోచోట ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు ఒక ఫిజియో థెరపిస్టు, ఒక స్పీచ్ థెరపిస్టు సేవలు అందిస్తారు. ఈ కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.700, బాలురకు రూ.500 రవాణా ఖర్చుల కింద నెలకు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.

నియోజకవర్గం	భవిత కేంద్రాలు	ప్రత్యేక అవసరాల పిల్లలు
నూజివీడు	04	462
కైకలూరు	04	339

సద్వినియోగం చేసుకోవాలి.. భవిత కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. అవగాహన లేక కొందరు ఈ సేవలను అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఇక్కడికి తీసుకొచ్చే చిన్నారులకు రవాణా భత్యం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

\- బి.భాస్కరరాజు, సహిత విద్య, జిల్లా సమన్వయకర్త

సమాజ సేవ.. అభివృద్ధి తోవ

పూడ్చిన గుంత వద్ద విద్యార్థులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు సమాజ సేవ అలవర్చుకోవాలని కళాశాల ఛైర్మన్ డా.రావి వెంకటరావు తెలిపారు. ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కనసానపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా మంగళవారం రహదారులపై గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.సి.నాగభాస్కర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన షష్ఠి వేడుకలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. పెయ్యేరులోని పూర్ణిమ థియేటరు వద్ద పంచ ముఖ శివ నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న షష్ఠి వేడుల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

రెగ్యులర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్లాన్‌ను చూపిస్తున్న సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణ పరిధిలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు సీఐ పి.సత్య శ్రీనివాస్ తెలిపారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ట్రాఫిక్ రెగ్యులర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సబంధించిన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లతో పాటు ఏ షాపుల వద్ద పార్కింగ్ లేదో పరిశీలిస్తున్నామన్నారు. షాపుల యజమానులు రహదార్ల పైకి చొచ్చుకుని రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ మేరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఉన్నతాధికారులకు పూర్తి స్థాయిలో నివేదిక ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు. వాహనదారులు విధిగా నిబంధనలు పాటిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలను నడపాలని కోరారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిత చిత్తు

విజేతలతో ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత ఉజ్వల భవిత నాశనమవుతుందని ప్రధానోపాధ్యాయులు పి.పుష్పలత, యామినీ కృష్ణ ప్రియ తెలిపారు. మాదక ద్రవ్యాలు- అనర్థాలపై మంగళవారం ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం ఎన్.పల్లవి(ఆగిరిపల్లి), ద్వితీయ స్థానం సీహెచ్ భవ్య(శోభనాపురం), వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానం ఎన్.హేమశ్రీ (శోభనాపురం), ద్వితీయ స్థానం వి.భార్గవ ప్రకాశ్(ఆగిరిపల్లి)లు గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలను ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్న బాస్కెట్ బాల్ క్రీడాకారిణులు

అస్రాకు అనుమతి పత్రం అందిస్తున్న అమరేంద్రకుమార్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో బాస్కెట్ బాల్ క్రీడాకారిణిలు ఎట్టకేలకు సీటు దక్కించుకున్నారు. మంగళవారం ట్రిపుల్ ఐటీలో జరిగిన ఒక కార్యక్రమంలో క్రీడాకారిణులకు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ అనుమతి పత్రాలను అందించారు. క్రీడాకారులు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకునేందుకు మంత్రి కొలుసు పార్థసారథితో పాటు శాప్ వీసీ, ఎండీ ఎస్.భరణి తదితరుల కృషితో నూజివీడు బాస్కెట్ బాల్ క్రీడాకారిణిలు ఎస్‌కే అస్రా, బి.ప్రభు దీపిక, బి.ప్రణవిలు సీటు దక్కించుకున్నారు. తమకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి అంశంపై అవగాహన అవసరం

కైకలూరు, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలతో పాటు సమాజాభివృద్ధికి దోహదపడే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు డి.రామారావు, వై.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పొగాకు వినియోగంతో అనర్థాలపై మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓరియంటల్ జడ్పీ పాఠశాలకు చెందిన ఎం.చిన్మయి వ్యాస రచనలో... మండలంలోని తామరకొల్లు జడ్పీ పాఠశాల విద్యార్థిని వక్తృత్వంలో ప్రథమ స్థానంలో నిలిచి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంఈవోలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సర్వే రాళ్లే రక్షణ గోడలు

మండవల్లి, న్యూస్‌టుడే: కానుకొల్లు వీఆర్వో కార్యాలయం చుట్టూ సర్వే రాళ్లే రక్షణ గోడలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో మొదటి దశ రీ సర్వేలో భాగంగా వీఆర్వో కార్యాలయం వద్ద భారీఎత్తున సర్వే రాళ్ల దిగుమతి చేశారు. సర్వే పూర్తయినా రాళ్లు చాలావరకు మిగిలిపోయాయి. దీంతో వీఆర్వో కార్యాలయానికి వచ్చే ప్రజలకు అడ్డుగా మారడంతో ఇబ్బందులు తప్పలేదు. ఈశాన్యం వైపు ఉండటంతో సెంటిమెంటుగా వాటిని ఎక్కడికైనా తరలించాలనే ఆలోచన చేశారు. కానీ కార్యాలయానికి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో సర్వే రాళ్లనే రక్షణగా పేర్చారు.

స్వచ్ఛ లక్ష్యానికి తుప్పు

నిరుపయోగంగా ఉన్న వాహనం

ముసునూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలు ప్రచార ఆర్భాటానికే పరిమితమవుతున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రాలకు గ్రామాల్లో చెత్తను తరలించి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని, అటు పల్లెల్లో స్వచ్ఛత ఇటు యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో గత తుదేపా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విద్యుత్తు ఆటోలు సమకూర్చింది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని నీరు గార్చింది. చెత్త తరలించే వాహనాలను విస్మరించి పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. దీంతో రూ.లక్షల విలువైన వాహనాలు తుప్పు పట్టి ముసునూరు మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేస్తే ప్రయోజనం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఏసుబాబును వివరణ కోరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చి'వరి'కి కష్ట కాలమేనా...?

కృష్ణారావుపాలెం: లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం

చాట్రాయి, న్యూస్‌టుడే: కాలం కలిసి వచ్చిందనే ఆనందాన్ని 'దిత్వా' తుపాను తుడిచి పెట్టేస్తోందనే ఆక్రోశం మెట్ట ప్రాంత రైతుల్లో కనిపిస్తోంది. చాట్రాయి మండలంలోని వందలాది ఎకరాల్లో వరి కోతలు ఇంకా పూర్తి చేయలేదు. మరోవైపు ధాన్యం ఇంకా రక్షణ లేని కల్లాల్లోనే ఉంది. వాటి వద్ద పట్టాలతో రైతులు కుటుంబ సభ్యులు సహా కాపలా ఉంటున్నారు. ఏదో రీతిలో ధాన్యాన్ని లారీల్లో ఎక్కించేస్తే చాలనే ఆలోచనతో హడావుడి పడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై వర్షం కురిసేలా ఉండగా.. సాయంత్రానికి ఒక్కసారిగా మారి.. ఈదురు గాలులతో వర్షం మొదలైంది. ధాన్యాన్ని కాపాడుకున్నా కోతలు కోయని పొలాల్లో పైరు నేలవాలుతుందనే కలవరంలో రైతులున్నారు. పైరు ఏ మాత్రం నేల వాలినా పెట్టుబడులు కూడా దక్కవని వాపోతున్నారు.

సచివాలయాల్లో సమయ పాలన శూన్యం

తాళాలు తీయని చనుబండ కార్యాలయం

చాట్రాయి, న్యూస్‌టుడే: సచివాలయాల్లో సమయ పాలన పాటించడం లేదు. జిల్లాలో మారుమూల మండలమైన చాట్రాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిన నేపథ్యంలో సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు రావడం పరిపాటిగా మారింది. మంగళవారం ఉదయం పదిన్నర దాటినా చనుబండ సచివాలయానికి తాళం తీయలేదు. వివిధ పనులపై వచ్చిన ప్రజలు అక్కడే కూర్చుని సిబ్బంది కోసం వేచి ఉన్నారు. కొందరు తాము ఇలా ప్రతిరోజూ సిబ్బంది కోసం ఎదురు చూస్తూ ఉండాల్సి వస్తోందని.. తాళాలతో ఉన్న సచివాలయం ఫొటోలను అధికారులకు పంపారు. మండల స్థాయి అధికారులు వెళ్లినా ఇవే దృశ్యాలు వారికి ఎదురైన ఘటనలున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో రాజును వివరణ కోరగా.. తాను స్వయంగా చూశానని, సచివాలయాల్లో సిబ్బంది విధిగా ఉండేలా చూస్తామన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	రాజు వెడ్స్ రాంబాయి
సత్యనారాయణ మినీ	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలుకా
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	రాజు వెడ్స్ రాంబాయి
మాగంటి సినిమాస్	బిజినెస్‌మెన్
శ్రీవెంకటరమణ సినిమాస్	ఆంధ్రా కింగ్ తాలూకా
ముదినేపల్లి: పూర్ణిమ	ఆంధ్రా కింగ్ తాలూకా

తెలంగాణ సరిహద్దుల్లో వాహన తనిఖీలు

వెంకటాపురంలో..

చాట్రాయి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సరిహద్దుల్లో తనిఖీ మొదలయ్యాయి. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది మంగళవారం నుంచి తనిఖీలు చేస్తున్నారు. చాట్రాయి మండలానికి వేంసూరు మండలం వెంకటాపురం సరిహద్దుగా ఉంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి నగదుతో తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లరాదు. అంతకన్నా ఎక్కువ నగదుకు సరైన పత్రాలను చూపకపోతే పోలీసులు సీజ్ చేస్తారు. లభ్యమైన నగదు రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారు. ఎక్కువ మొత్తంలో ఉంటే ఎన్నికల అధికారులు ఆదాయ పన్ను, జీఎస్టీ అధికారులకు సమాచారం అందించి ఆ నగదును కోర్టులో జమ చేస్తారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజు, వ్యాపారం, పెళ్లి వంటి ముఖ్యమైన అవసరాలకు డబ్బు తీసుకువెళ్లే వారు సరైన ఆధారాలు దగ్గర ఉంచుకుని అధికారులకు చూపాలి. తనిఖీల సమయంలో చూపలేకపోయినా.. తర్వాత పత్రాలను చూపితే జప్తు చేసిన డబ్బు తిరిగి ఇస్తారు. తెలంగాణలో కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్రంలో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు రవాణా, ప్రయాణాల్లో నిబంధనలు పాటించాల్సి ఉంది.

జిల్లాలో సరిహద్దు ప్రాంతాలు: లింగగూడెం, అల్లిపల్లి, మర్రిగూడెం, వేలేరు, కోయ మాదారం, కృష్ణారావుపాలెం, తాటియాకులగూడెం.

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలైన సంఘటన ఇది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోమర్రుకు చెందిన మోహన సాయి ద్విచక్రవాహనంపై మంగళవారం మధ్యాహ్నం ముదినేపల్లికి బయలుదేరాడు. ఆయనను వడాలిలోని కనక దుర్గాదేవి ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మోహన్ సాయి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో స్థానికులు గుడివాడ ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్వార్థ ప్రయోజనం కోసమే పీపీపీ విధానం: బొత్స

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: వ్యక్తిగత స్వార్థ ప్రయోజనం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పేరిట ప్రైవేటు పరం చేస్తున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత, ఉమ్మడి జిల్లా వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండవల్లి మండలం పెరికెగూడెంలో మంగళవారం నిర్వహించిన జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబుపై పలు ఆరోపణలు చేశారు. పీపీపీ నిర్ణయాన్ని వైకాపా పూర్తిగా వ్యతిరేకిస్తుందని, జగన్ ఆధ్వర్యంలో త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామన్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.. చంద్రబాబు మద్యం కంపెనీలకు, సరఫరా దారులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకున్నారడానికి తమ వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కొల్లేరు సమస్యను మానవీయ కోణంలో చూడాలని, ఇక్కడి ప్రజలకు న్యాయం చేసేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకుడు వంక రవీంద్ర, సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, జక్కంపూడి రాజా, మేకా ప్రతాప్ అప్పారావు, తెల్లం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించడం అభినందనీయం

ఉపాధ్యాయ క్రికెట్ విజేతలను అభినందిస్తున్న ఎంఈవో దేవ వర ప్రసాదరావు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు క్రీడల్లోను రాణించడం అభినందనీయమని నూజివీడు ఎంఈవో దేవ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం నూజివీడులో అన్నవరం క్రికెట్ గ్రౌండ్స్‌లో టీచర్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించారు. ఎంఈవో ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మండల క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా రాఘవేంద్రరావు, సభ్యులుగా ఎస్.రవి, ఎన్‌వీ ప్రసాద్, జె.రంగారావు, రామకృష్ణ, మురళి, శ్రీధర్, యువరాజ్, నాగేంద్రరావు, రఘుబాబు, అబీబుల్లా, గోపి, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, సతీశ్, ఈశ్వర ప్రసాద్‌లను ఎంపిక చేశారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్ర ప్రసాద్, ఎంఈవోలు కలిసి బహుమతులు అందించారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రికెట్‌ను పర్యవేక్షించారు.

ఎనిమిదేళ్ల తర్వాత మోక్షం

తీరిన పెనుమాకలంక గ్రామస్థుల కల

మండవల్లి, న్యూస్‌టుడే: కొల్లేరు అభయారణ్యంలో ఉన్న పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంక వరకు ఉన్న 2.7 కిలో మీటర్ల రోడ్డుకు ఎనిమిదేళ్ల తర్వాత మరమ్మతులు చేస్తున్నారు. ఏటా కొల్లేరు వరదల సమయంలో ఈ రోడ్డు నెలల తరబడి ముంపులో ఉంటుంది. దీంతో పెనుమాక లంక, నందిగామ లంక, ఇంగలిపాలక లంక గ్రామాలకు చెందిన 10 వేల మందికి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. నాటు పడవలపై ప్రమాదకరంగా ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్డు ముంపు సమయంలో 30 కిలో మీటర్లు అదనంగా దారుణమైన రోడ్డులో ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టడంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో చేపల రైతు కూనపరాజు రంగరాజు, గ్రామస్థుల ఆర్థిక సహకారంతో 2.7 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు.

నిర్మాణంలో ఉన్నపెనుమాకలంక రోడ్డు

40 ఏళ్లలో మూడు సార్లు మాత్రమే.. పెనుమాకలంక-పెదఎడ్లగాడి రోడ్డును 40 ఏళ్లలో కేవలం 3 సార్లు మాత్రమే మరమ్మతులు చేశారు. అటవీశాఖ పరిధిలో ఉన్నందున రోడ్డు అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు కావు. కానీ ఉన్న రోడ్డును స్థాయిని మార్చకుండా మరమ్మతులు చేసుకోవచ్చు. 2000, 2017, 2025లో మాత్రమే గ్రామస్థులు, స్థానిక నాయకుల చొరవతో ఈ రోడ్డును గ్రావెల్‌తో మరమ్మతులు చేశారు.

తీరనున్న కష్టాలు.. కొల్లేరులో వేటాడిన చేపలను సూర్యోదయానికి ముందే ఏలూరు మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకోకుంటే రోజు గడవదు. కొల్లేరు వరద సమయంలో కనీసం బియ్యం తెచ్చుకోవాలన్నా రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి. నేడు రోడ్డుకు మరమ్మతులు చేస్తుండటంతో గ్రామస్థుల కష్టాలు తీరుతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తృతీయ వర్ధంతి

జననం 6-3-1935

మరణం 03-12-2022

కీ॥శే॥ కామినేని వెంకట నరసయ్య గారు

Retd. C.P.O., ఏలూరు

ఆత్మీయతానురాగాలను మా అందరికీ పంచిన పుణ్యమూర్తి, మమ్మలను
ఆదర్శవంతులుగా తీర్చిదిద్ది మా అందరి అభివృద్ధికి బాటలు వేసి,
మా హృదయాలలో చెరగని ముద్రవేసుకున్న మీరు మా నుండి దూరమై
3 సం॥ గడిచిననూ మీ మధుర స్మృతులు స్మరించుకుంటూ..
మీ మధుర స్మృతులు మా మదిలోనే పదిలం. మీ పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య
సరోజినీ దేవి (లేటు)

కుమారులు : కామినేని రవికుమార్ - లక్ష్మీవిమల
కామినేని సత్యనారాయణ కుమార్ - హేమలలిత

కుమార్తె : సూరపనేని పైల - డా॥ ప్రేమ్‌చంద్ (లేటు), మనుమలు, మనుమరాండ్రు

రామవరం గ్రామస్తులు

(c) eenadu

కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ డా॥ కామినేని శ్రీనివాస్ గార్కి జన్మదిన శుభాకాంక్షలతో...
Advt Spl. Feature

కిట్లతో విద్యార్థులు

విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సాయం అభినందనీయం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల విద్యాభివృద్ధికి కార్పొరేట్ సంస్థల సాయం అందించడం అభినందనీయమని హెచ్.ఎం. బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. పెయ్యేరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఐడీఎఫ్‌సీ సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆ సంస్థ డివిజనల్ మేనేజరు మిరియాల రత్నం మాట్లాడుతూ సాయాన్ని విద్యార్థులు సద్వినియోగ పరచుకుని చక్కటి ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. బ్రాంచ్ మేనేజరు రాచప్రోలు వరప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన నిధుల సమస్య

★ ఆ పాఠశాలలకు రోడ్డు విస్తరణ శాపం ★ కూల్చారు.. ఎప్పటికి కడతారో

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి 165 రోడ్డు విస్తరణ రెండు పాఠశాలలకు శాపంగా మారింది. విడుదలైన నిధులు కొంతకాలం ఏలూరు, ప్రస్తుతం మచిలీపట్నం కలెక్టర్ అకౌంట్‌కు జమవ్వడంతో సమస్య మొదటికొచ్చింది. ఏళ్లుగా ఏలూరు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదు.. ఇప్పుడు మచిలీపట్నం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పక్కనే పాఠశాలలు ఉండటం.. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతారోనన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే పలు మార్లు ప్రహరీ నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

మండవల్లి పాఠశాల-1లో కూల్చేసిన గోడ

ఏలూరు నుంచి కృష్ణా జిల్లాకు బదిలీ

మండవల్లి పాఠశాల-1, పాఠశాల-2లోని ప్రహరీలను, చెట్లను రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉండడంతో 2022లో ఎన్‌హెచ్ అధికారులు కూల్చేశారు. దీనికి పరిహారంగా 22.01.2022న ఎన్.హెచ్. అధికారులు పాఠశాల-1కు రూ.13,78,951, పాఠశాల-2కు రూ.5,01,292ను పాఠశాల ఖాతాకు జమ చేశారు. కానీ వాటిని ఆ తర్వాత కలెక్టర్, ఛైర్మన్.. సమగ్ర శిక్షా ఏపీసీ ఖాతాకు బదిలీ చేశారు. పలు మార్లు ఎంఈవోలు, అధికారులు నిధుల కోసం నివేదికలు సమర్పించారు. ప్రస్తుతానికి ఉమ్మడి కృష్ణా జిల్లా సమగ్ర శిక్షా ఖాతాకు మొత్తాలను మళ్లించడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యింది.

దారుణంగా మండవల్లి-I బడి..

మండవల్లి పాఠశాల-1 ఆవరణలోని చెట్లు, చెత్తా చెదారాన్ని పాఠశాల వెనుక వైపు వేయడంతో దారుణంగా తయారయ్యింది. డ్రెయినేజీ కన్నా పాఠశాల స్థలం లోలెవల్‌లో ఉండటంతో మురుగు నీటి ఆవరణలోనే నిలిచిపోవడంతో చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. నీరు నిలబడి దోమలు, పాములతో చిన్నారులకు భయాందోళనలు చెందుతున్నారు. దీనిపై ఏపీసీ పంకజ్ కుమార్‌ను వివరణ కోరగా నిధులు మంజూరు చేయాల్సిందిగా నివేదిక పెట్టినట్లు తెలిపారు.

భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు చేయూతనివ్వాలి: కామినేని

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక కల్యాణ షష్ఠి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పుట్టలో పాలుపోసి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకు వెళ్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

పాతాళభోగేశ్వరుని ఆలయాభివృద్ధికి చేయూతనివ్వాలి..

కలిదిండి, న్యూస్‌టుడే : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి దాతలు చేయూతనివ్వాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 2026 ఫిబ్రవరిలో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈవో శింగనపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కలిదిండిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి చెరుకూరి శ్రీరంగనాథరాజు రూ.1.50 కోట్లతో రాజగోపురం నిర్మిస్తామని గతంలో మాట ఇచ్చిన నేపథ్యంలో అక్కడి నుంచే చరవాణి ద్వారా ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. దీనికి శ్రీరంగనాథరాజు మాటకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. అనంతరం దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. ఏ అవకాశం ఉన్నా.. ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు, తెదేపా మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చలి కోట్లు వితరణ

చాట్రాయి, న్యూస్‌టుడే: కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు పాల్సన్, ప్రేమ్‌కుమార్‌ల ఉమ్మడి మిత్రురాలైన సుకన్య నటరాజన్(హైదరాబాద్) 25 మంది విద్యార్థులకు చలి కోట్లను వితరణగా అందించారు. ఎంఈవో-1 మాసగిరి శ్రీనివాస్, ఎంఈవో-2 వీవీఎస్వీ బ్రహ్మాచారి వీటిని మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలల్లో వసతులకు కల్పనకు దాతలు ముందుకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయడం అభినందనీయమని వక్తలు తెలిపారు.

నీటి డిమాండ్.. సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గిద్దాం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాగునీటి డిమాండ్, సరఫరాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, భూ ఉపరితలంలో లభించే నీరు, భూగర్భ జలాల సమన్వయ వినియోగం ద్వారా సమాన, సమర్థమైన పంపిణీకి కృషి చేయాలని రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ (ఎన్.ఎస్.పి. పీసీ) ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సూచించారు. పంట క్యాలెండర్లు, వారా బందీ అమలులో సహకరించడం, జల వివాదాల పరిష్కారం, నేల, నీటి నాణ్యతను అంచనా వేయడం అంశాలు ముఖ్యమని వివరించారు. ఉమ్మడి కృష్ణా ఎన్.ఎస్.పి. పీసీ పరిధిలోని సాగునీటి వినియోగదారుల సంఘాలకు బాధ్యతలను పెంపొందించడంపై, నగరంలోని జలవనలరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విస్సన్నపేట సర్కిల్ ఎస్ఈ ఎం.ఆర్. మొహిద్దీన్ అధ్యక్షత వహించారు. ఎన్.ఎస్.పి. పీసీ ఛైర్మన్ కోట వీరబాబు మాట్లాడుతూ.. పీసీ పరిధిలో ఆయకట్టు పెంపుదలపై దృష్టిపెట్టాలని సూచించారు. నీటి సంఘాల అధ్యక్షులకు, డీసీ ఛైర్మన్లకు అప్పగించిన పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

లస్కర్ల నియామకానికి ప్రతిపాదనలు..

ఎస్ఈ మొహిద్దీన్ మాట్లాడుతూ.. నీటి నిర్వహణను మెరుగు పరచడానికి తొమ్మిది సబ్ డివిజన్ల పరిధిలో పొరుగు సేవల కింద 90 మంది లస్కర్లను (కళాసులను) నియమించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. వాగులపై చెక్ డ్యాంలను నిర్మించడం, సాగునీటి చెరువులు, కాల్వల్లో పూడిక తీత తదితర నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈఈలు కె.రామదాసు, కె.కిశోర్, డీఈఈలు, ఏఈఈలు, డీసీ ఛైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్ల అందజేత

చాట్రాయి, న్యూస్‌టుడే: చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందజేయాలని జనసేన నాయకుడు సవరం రామారావు మంగళవారం వైద్యాధికారిణి విజయలక్ష్మికి బెడ్ షీట్లను అప్పగించారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, నాయకులు పసుపులేటి మహేశ్, కొల్లు శ్రీకాంత్, తుమ్మలపల్లి పాపారావు, రంగా, గణేశ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

వ్యాధులపై అవగాహన అవసరం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన అవసరమని మలేరియా నివారణ జిల్లా సహాయాధికారి జె.గోవిందరావు అన్నారు. ఆశా దినోత్సవం సందర్భంగా.. స్థానిక పవరుపేట, లంబాడీపేట, జేపీ కాలనీల్లోని పట్టణారోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు. శీతాకాలంలో సంక్రమించే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో అయిదేళ్లలోపు బాలలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని ఆయన సూచించారు.

దివ్యాంగుడికి పింఛను అందించేలా చర్యలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గురజకు చెందిన తాడిగుడి రంగారావు కుల ధ్రువ పత్రం లేక దివ్యాంగుల పింఛను అందకపోవడంపై సోమవారం 'ఈనాడు'లో 'దివ్యాంగుడి పింఛనుకు కులధ్రువీకరణ అడ్డంకి' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన తెదేపా నాయకులు చల్లగుల్ల శోభనాద్రి చౌదరి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే పింఛను అందేలా చూడాలని సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు సంబంధిత పత్రాలు సేకరించి, పంచనామా నిర్వహించారు.

తెదేపా, జన సైనికుల సాయం.. దివ్యాంగుడు రంగారావు కుటుంబాన్ని మంగళవారం తెదేపా గ్రామ కమిటీ సభ్యులు పరామర్శించారు. నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు కమిటీ సభ్యులు అందించి తాము అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. గురజ జనసైనికులు రంగారావును పరామర్శించి రూ.6 వేలు నగదు ఆర్థిక సాయంగా అందించారు. పింఛను వచ్చేవరకు ప్రతి నెలా రూ.6వేలు అందించి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పింఛను మంజూరయ్యేలా కృషి చేస్తామని చెప్పారు. గురజ నాయకుడు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, చేడిగ అప్పారావు, జన సైనికులు పాల్గొన్నారు.

రంగారావుకు నిత్యావసర సరకులు అందిస్తున్న తెదేపా నాయకులు

ఈనాడు కథనాలకు స్పందన

భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమం

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం శివ మాలధారుల ఇరుముడి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో రావడంతో శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పలు రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శివ స్వాములు శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి పయనమయ్యారు.

శుభ్రం చేశారు..

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు బాలికల వసతి గృహం వెనుక భాగం దట్టమైన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఆవరణ పాములు, ఇతర క్రిమి కీటకాలకు ఆవాసంగా మారింది. రాత్రి సమయంలో విష పురుగులు వస్తున్నాయని, విద్యార్థినులకు అసౌకర్యంగా మారిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో 'వసతి గృహం.. పరిసరాలు అధ్వానం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. సంక్షేమాధికారి హిమబిందు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి, స్వీయ రక్షణకు కరాటే దోహదపడుతుందని ఎంఈవో-2 కె.నరేశ్‌కుమార్ అన్నారు. సింగరాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నిర్వహిస్తున్న కరాటే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాల స్థాయి నుంచే అందిస్తున్న ఈ శిక్షణ విద్యార్థినులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. శారీరకంగా బలోపేతమైతేనే బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టగలమన్నారు.

పోలీసుల చొరవతో బంధువుల వద్దకు చేరిన వృద్ధుడు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో చలికి వణుకుతూ బస్సు స్టాండులో పడిపోయిన వృద్ధుడిని పోలీసులు చొరవ చూపి బంధువుల వద్దకు చేర్చారు. గుడ్లవల్లేరు మండలం జేమ్స్‌పేటకు చెందిన దాసి థామస్ బంటుమిల్లి వెళ్లి పింఛను తీసుకుని తిరిగి సోమవారం రాత్రి బస్సులో ముదినేపల్లికి చేరుకున్నాడు. బస్సులో నుంచి దిగుతూ పడిపోయాడు. చలితో వణుకుతూ కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. స్థానిక ఆర్టీసీ బస్సు స్టాండు కంట్రోలర్ మద్దా కోటేశ్వరరావు అతనికి దుప్పటి, అల్పాహారం అందించారు. తొంటి జారిపోవడంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. తనపేరు, తన భార్య జేమ్స్‌పేటలో ఉన్నట్లు మాత్రమే తెలపగలిగాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై వీరభద్రరావు అక్కడ మహిళా పోలీసుతో మాట్లాడి సిబ్బందితో కలిసి ఆటోలో వృద్ధుడిని బంధువుల వద్దకు పంపించారు.

నేడు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.





భుజబలపట్నంలో తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ పంకజ్ కుమార్

పాఠశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పిస్తున్నాం: ఏపీసీ

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యనభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని సమగ్ర శిక్షా ఏపీసీ కురేళ్ల పంకజ్ కుమార్ అన్నారు. మండలంలోని భుజబలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతుల నిర్మాణ పనులను మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులు నిర్వహించడమా.. లేక కొత్తవి నిర్మించడమా నిర్ణయించి.. అవసరమైన నిధుల కోసం కలెక్టరును కోరుతామన్నారు. ప్రమాదకరంగా ఉన్న గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయుడు భాస్కర వర్మ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం.. సుమ యాగం

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం రాత్రి శ్రీపుష్ప యాగం వైభవంగా నిర్వహించారు. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఊంజల్ సేవ, ఉయ్యాల సేవ చేశారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.
– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

అడ్డంగా చెట్లు.. పారేదెలా నీళ్లు..

వేల ఎకరాలకు సాగునీటిని, లక్షల ప్రజలకు తాగునీటిని అందించే గోదావరి కాలువలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాకినాడ వరకు దారిపొడవునా భారీ చెట్లు ఇలా కూలిపోయాయి. . అసలే అంతంత మాత్రంగా ఉన్న నీటి ప్రవాహానికి ఇవి తీవ్ర అడ్డంకిగా మారాయి. దీంతో ఆయకట్టు చివరి రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఆయా ప్రదేశాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు స్పందించి వీటిని తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు .– ఈనాడు, కాకినాడ

వీరి ప్రతిభ విభిన్నం

నేడు దివ్యాంగుల దినోత్సవం

అన్ని అవయవాలు పని చేస్తున్నా.. వనరులు అందుబాటులో ఉన్నా.. లక్ష్యం లేక.. దిశానిర్దేశం లభించక.. చాలామంది ప్రతిభను చాలామంది చాటలేని పరిస్థితి. అలాంటిది దివ్యాంగులుగా సవాళ్లు ఎదుర్కొంటూ.. విభిన్న ప్రతిభావంతులుగా విలక్షణ శైలి చూపుతూ కొందరు సత్తా చాటుతున్నారు. ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వారిలో కొందరి పరిచయమే ఈ కథనం.

– న్యూస్‌టుడే, గాంధీనగర్, కాకినాడ నగరం, పిఠాపురం

మనో 'నేత్రం'.. సేవే సూత్రం

మత్స్యకార సోదరులకు నమస్కారం.. ఈరోజు సముద్రంలో అలల తీవ్రత ఐదు నుంచి ఆరడుగుల ఎత్తు ఉంటుంది... అలాగే అన్నవరం వైపు చేపలు ఎక్కువగా పడే అవకాశం ఉంది.. రిలయన్స్ వారు అందిస్తున్న ఈ సమాచారాన్ని మీకు తెలియజేస్తుంది గంగాధర్... నడి సంద్రంలో చేపల వేట కొనసాగిస్తున్న మత్స్యకారుల సెల్‌ఫోన్‌కు అందిన ఈ సమాచారంతో వారిలో ఎంతో ఆనందం కలిగింది. వెంటనే బోటును విశాఖ వైపు మళ్లించి బోటునిండా మత్స్యసంపదతో ఒడ్డుకు చేరారు.

పుట్టుకతో అంధుడైనప్పటికీ...

కాకినాడ ముత్తానగర్‌కు చెందిన మత్స్యకారుడు విశ్వనాథపల్లి వీర్రాజు, భాగ్యవతి దంపతుల సంతానంలో గంగాధర్ ఒకరు. పుట్టుకతోనే అంధుడు. తల్లిదండ్రులు, తోబుట్టువుల సహకారంతో అక్కడే నాలుగో తరగతి వరకు చదువుకున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేశారు. 2020లో దివ్యాంగురాలైన నూకరత్నాన్ని వివాహం చేసుకున్నారు.

రోజూ వందలాది మందికి..

కళ్లు లేకపోయినా గంగాధర్ సేవ చేస్తూ అందరి తలలో నాలుకలా ఉంటున్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా అందించే వాతావరణ హెచ్చరికలు, చేపలు లభ్యమయ్యే ప్రాంతాలపై మత్స్యకారులకు ఫోన్ చేసి చెప్పడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. వేటకు వెళ్లిన వారి ఫోన్ నంబర్లను ప్రతిరోజూ ఏటిమొగ బోటుయార్డు వద్ద తీసుకుని, వందలాది మందికి తెలియజేస్తుంటారు. తనవారికి సేవ చేయడంతో పాటు రిలయన్స్‌తో అనుబంధం కొనసాగాలన్నది తన కోరికని ఆయన చెబుతున్నారు.

చిన్మయి ముందు చిన్నబోయిన వైకల్యం

కాకినాడకు చెందిన వడ్లమాని కిరణ్మయి(14) పుట్టిన నాటి నుంచి నరాల సంబంధ వ్యాధితో బాధపడుతోంది. మెడను నేరుగా పట్టుకోలేదు.. ఇతర పిల్లల్లా సరిగా కూర్చోలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు నరసింహమూర్తి, ప్రీతి.. వైద్యులను సంప్రదించగా 'సెరిబ్రల్ పాల్సీ' వ్యాధిగా నిర్ధారించారు. జీవితాంతం ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. దీంతో వారు స్థానిక భవిత కేంద్రంలో చేర్పించారు. నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో చదివించారు. ఉపాధ్యాయులు, తల్లి ప్రోత్సాహంతో కిరణ్మయి అటు చదువు, ఇటు క్రీడల్లోనూ రాణిస్తోంది. దివ్యాంగుల పరుగు పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపింది. మచిలీపట్నంలో పారా యోగా పోటీల్లో సత్తా చాటింది. వైకల్యాన్ని అధిగమించి కిరణ్మయి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

చూసి నేర్చాడు.. 'మాటలు' కాదు..!



పిఠాపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి ఉమ్మిడి ఏసుకుమార్ బధిరుడు. తండ్రి సుబ్బారావు చనిపోగా వృద్ధురాలైన తల్లి వెంకటలక్ష్మి పోషణభారం తనదే కావడంతో చదువుతోపాటు వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. స్థానిక ఓబీఎస్ పాఠశాలలో ఏడో తరగతి చదివేటప్పుడు మాటలు రావని ఇతన్ని బాస్కెట్ బాల్ ఆడనివ్వలేదు. నొచ్చుకోకుండా అందరూ మెచ్చుకునేలా తనను తాను మార్చుకోవాలనుకున్నాడు. గోల్ వేసే విధానంలో ప్రత్యేకత చాటి.. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ పోటీల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో అంతర్జాతీయ డీఐబీఎఫ్ పోటీలకు అర్హత సాధించారు. ఆస్ట్రేలియాలో జరిగే ఈ పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి డెఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్‌కు ఏసుకుమార్ ఒక్కరే అర్హత సాధించారు.

విజయ ప్రస్థానం ఇదీ..

2016లో రాష్ట్ర యూత్ ఛాంపియన్ షిప్, 2017లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ ఛాంపియన్‌షిప్, 2022లో స్టేట్ సీనియర్ ఛాంపియన్ షిప్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభతో ఆస్ట్రేలియాలో జరిగే పోటీలకు అర్హత సాధించాడు. అందుకోసం ఏసుకుమార్‌కు రూ.2.50 లక్షలను కోచ్ బొజ్జా మాణిక్యాలరావు, దాతలు అందించారు.

గుడ్డు ధర.. మళ్లీ పెరుగుతోంది

హోల్‌సేల్‌గా ఒకటి రూ.6.45

రంగంపేట, న్యూస్‌టుడే: కోడిగుడ్డు ధర మళ్లీ పెరుగుతోంది. కార్తికమాసంలో రికార్డు స్థాయికి చేరి ఒక్కసారిగా తగ్గిన ధర మళ్లీ పైపైకి చేరుతుండడంతో కోళ్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నవంబరు 21న గుడ్డు ధర రూ.6.45కు చేరి రికార్డుని సృష్టించింది. దేశవ్యాప్తంగా చలి తీవ్రత ఎక్కువవ్వడంతో గుడ్ల వినియోగం పెరిగింది. మరోవైపు కోళ్లకు వ్యాధుల బెడద పెరగడం, అవి పెట్టే గుడ్ల శాతం తగ్గింది. దీంతో మళ్లీ క్రమక్రమంగా గుడ్డు ధర పెరిగింది. సంక్రాంతి వరకు దాదాపు ఇదే ధర కొనసాగవచ్చని కోళ్ల రైతులు, నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడేళ్ల కిందట 1.30 కోట్ల వరకు కోళ్లు ఉండగా రోజుకి కోటికిపైగా గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. దాణా ధరలు పెరగడం, గుడ్డు ధర తగ్గడంతో నష్టాలను భరించలేక కొందరు ఈ రంగం నుంచి వైదొలిగారు. కొన్ని రోజులపాటు గుడ్డు ధర తగ్గకుండా ఉంటే గత నష్టాల నుంచి కొంతైనా బయటపడవచ్చని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు.

ఐఐఎఫ్‌టీకి ప్రభుత్వం దన్ను

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.57.10 కోట్ల విడుదలకు సమ్మతి

ఈనాడు, కాకినాడ

భారత విదేశీ వాణిజ్య సంస్థ (ఐఐఎఫ్‌టీ)కు కాకినాడ జిల్లాలో సొంత క్యాంపస్ త్వరలోనే అందుబాటులోకి రాబోతుంది. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ఉన్నత విద్యా సంస్థకు కూటమి ప్రభుత్వం దన్నుగా నిలిచింది. కొలువుదీరిన ఏడాదిన్నరలోనే ఈ విద్యా సంస్థ నిర్మాణాలను 30 నుంచి 95 శాతానికి తీసుకువచ్చింది. తాజాగా ప్రాజెక్టు వ్యయంలో పరిశ్రమల వాటా ధనం 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి ముందుకు వచ్చింది.

ప్రతిష్ఠాత్మక సంస్థ..

రాష్ట్ర విభజన తర్వాత ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐఐఎఫ్‌టీ మంజూరు చేయించింది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కోనపాపపేటలోని 25 ఎకరాలను దీనికి కేటాయించారు. సుమారు రూ.229.11 కోట్ల అంచనా వ్యయంతో 2018లో నిర్మాణం మొదలుపెట్టారు. మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉన్నా ప్రభుత్వం మారిన తర్వాత పనులు మందగించాయి. నిర్మాణ వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:35 శాతం, పరిశ్రమలు 15 శాతం భరిస్తాయని ఒప్పందం చేసుకున్నాయి. తర్వాత పరిశ్రమలు నిధులు సమకూర్చలేమంటూ చేతులెత్తేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిధులివ్వడానికి సమ్మతించింది. ఈ ఏడాది విడుదల చేయాల్సిన రూ.57.10 కోట్లపై ఐఐఎఫ్‌టీ, కాకినాడ కేంద్ర విభాగాధిపతి లేఖ రాయగా.. అందుకు ఆర్థికశాఖ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కోనపాపపేటలో నిర్మాణాలు పూర్తిచేసుకున్న భవనాలు

వచ్చే ఏడాది సొంతగూటి లోకి..

ఐఐఎఫ్‌టీ క్యాంపస్ ప్రస్తుతం జేఎన్‌టీయూకే తాత్కాలిక ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. ● బీబీఏ, ఎంబీఏ కలిపి ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు, ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) రెండేళ్ల కోర్సు, ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ కోర్సులు బోధిస్తున్నారు. ● వచ్చే ఏడాది ఐఐఎఫ్‌టీ సొంతగూటిలోకి మారనుంది. 25 ఎకరాల్లో కళాశాల భవనాలు, పరిపాలన బ్లాకు, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, క్రీడా ప్రాంగణం, ఆడిటోరియం, ఇతర సౌకర్యాలన్నీ అందుబాటులోకి రానున్నాయి. ● కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ వీటి నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షించి పనులు వేగవంతమయ్యేలా చూశారు. వసతులన్నీ సమకూరితే మరిన్ని అదనపు కోర్సులతో కాకినాడలో కీలక విద్యాసంస్థగా ఐఐఎఫ్‌టీ ఎదుగుతుందని అధికారులు చెబుతున్నారు.

పాఠశాలల్లో విద్యా బోధకులు

● ఉమ్మడి జిల్లాలో 136 మంది నియామకానికి చర్యలు

పామర్రు, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాల్లోని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యా బోధకులను (అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల) నియమించడానికి మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో మొత్తం 1,146 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 136 పోస్టుల్లో వీరిని నియమిస్తారు. కాకినాడ జిల్లాలో 47, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 52, తూర్పుగోదావరి జిల్లాలో 21, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 పోస్టులను గుర్తించారు. వీరి నియామకాలతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు ఉండదని, వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు అవకాశం కలుగుతుందని విద్యావేత్తలు అంటున్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో పోస్టులు దక్కని వారికి ఇదొక సదావకాశమని చెబుతున్నారు.

ఇవీ వివరాలు..

◗ విద్యా బోధకులు ఆయా పాఠశాలల్లో ఈనెల ఎనిమిదో తేదీ నుంచే విధుల్లో చేరుతారు. వచ్చే సంవత్సరం మే నెల ఏడో తేదీ వరకు మొత్తం అయిదు నెలలు వీరు సేవలందిస్తారు. ◗ నియామకాలను ఆయా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖాధికారి, ఎంఈవోలు పర్యవేక్షిస్తారు. ◗ ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తులను సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో సమర్పించాలి. ◗ ఆరో తేదీకి ప్రక్రియను పూర్తిచేసి ఏడో తేదీన ఉత్తర్వులు అందిస్తారు. ఎనిమిదో తేదీ నుంచి విధుల్లో చేరాలి. ◗ సాధ్యమైనంత వరకు ఆసక్తి, అర్హతలున్న స్థానికులనే నియమిస్తారు. అనంతరం మండల పరిధిలోని వారిని ఎంపిక చేస్తారు.◗ స్కూల్ అసిస్టెంట్లకు రూ.12,500, సెకండరీ గ్రేడ్ అభ్యర్థులకు రూ.10 వేల చొప్పున నెలకు గౌరవ వేతనంగా చెల్లిస్తారు. ◗ అకడమిక్ ప్రమాణాలకు 75 శాతం, వృత్తి పరమైన ప్రమాణాలకు 25 శాతం మార్కుల ప్రతిభను గణించి మెరిట్ జాబితా ప్రకారం అభ్యర్థులను ఎంపికచేస్తారు. ◗ పాఠశాలల వారీగా ఖాళీల జాబితాలను రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారులు ఎంఈవోలకు పంపారు. ఆసక్తిగల అభ్యర్థులు వారి నుంచి వివరాలు తెలుసుకోవచ్చు.

బోర్డు కనిపించడం లేదు

చిన్నారుల్లో పెరుగుతున్న కంటి సమస్యలు

ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సక్రమంగా చదవడంలేదని తండ్రి మందలించే వారు. విషయం ఆరా తీస్తే బోర్డుపై అక్షరాలు సరిగా కనిపించడం లేదని చెప్పడంతో నేత్ర వైద్యుడిని సంప్రదించారు. పరీక్షించి మయోపియా ఉన్నట్లు నిర్ధారణ చేశారు.

న్యూస్‌టుడే, పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 15 శాతం మంది పలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. మయోపియా కారణంగా పిల్లల్లో కంటి చూపు మందగిస్తున్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. బోర్డుపై రాసిన అక్షరాలు కనిపించడంలేదనడానికి 80 శాతం మయోపియా, మరో 20 శాతం హైపర్ మెట్రోపియా కారణమని వైద్యులు తెలిపారు.

కాకినాడ జిల్లా వివరాలు

సంవత్సరం	పరీక్షలు	కళ్లజోళ్లు
2024	2,61,490	3,800
2025	2,61,490	3,400

పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

20-20-20 నియమం ఆచరించాలి..

పిల్లలు డిజిటల్ పరికరాలు ఉపయోగించే సమయం తగ్గించాలి. మూడేళ్లు కన్నా తక్కువ వయసు ఉన్న వారి చేతికి డిజిటల్ పరికరాలు ఇవ్వకూడదు. కంటికి దగ్గరగా పెట్టి చదవడం, రాయడం చేయకూడదు. ప్రతి 20 నిమిషాలు కంప్యూటర్ చూసిన తరువాత 20 సెకన్లు చూపు మరల్చాలి. 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువును చూడాలి. ఇది కంటి కండరాలను సడలిస్తుంది.

ఏం చేయాలి ?

ఏటా పిల్లలకు నేత్ర పరీక్షలు చేయించాలి. విద్యార్థుల చదువులతోపాటు క్రీడల్లోనూ పాలు పంచుకోవాలి. సహజ సూర్య కాంతి వల్ల మానవ నేత్రం మయోపియాకు గురికాకుండా రక్షిస్తుంది. ఒకరు మయోపియాకు గురైతే వారికి పుట్టిన వాళ్లకు పరీక్షలు చేయించాలి. వెంటనే అద్దాలు వాడితే సమస్య తీవ్రత పెరగదు.

జాగ్రత్తలు తీసుకోవాలి

పిల్లల్లో మయోపియా సంకేతాలను గుర్తించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు బ్లాక్ బోర్డు దగ్గరగా వెళ్లి చదవడం, ఇంట్లో దూరపు వస్తువులు చూడలేకపోవడం వంటి తదితర లక్షణాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందించాలి. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు, మాసం, గుడ్లు, పాలు అన్నీ ఉండేలా చూసుకోవాలి.

- శ్రీవిద్య, సీహెచ్‌సీ కంటి వైద్యురాలు, పెద్దాపురం

నేడు రైతన్నా - మీకోసం గ్రామసభలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతన్నా-మీకోసం' కార్యక్రమంలో ఆఖరి ఘట్టంగా బుధవారం జిల్లాలోని 385 రైతు సేవా కేంద్రాల వద్ద గ్రామసభలు నిర్వహించనున్నారు. రానున్న రబీ, ఖరీఫ్ పంట కాలానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే గ్రామసభలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, అభ్యుదయ రైతులు, మహిళా స్వశక్తి సంఘాల సభ్యులు, రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేశారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ సాయంపై అవగాహన కల్పిస్తారు. దీనిపై మంగళవారం డీఆర్వో వెంకటరావు వ్యవసాయ, రెవెన్యూ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

5న జేసీ అపూర్వభరత్ రాక

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాకు సంయుక్త కలెక్టర్‌గా నియమించిన అపూర్వభరత్ ఈనెల 5న రానున్నారు. 40 రోజుల కిందట బదిలీల్లో భాగంగా ఇక్కడ జేసీగా పనిచేస్తున్న రాహుల్‌మీనాను రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. అపూర్వభరత్ శిక్షణ నిమిత్తం ముస్సోరి వెళ్లడంతో ఇంకా చేరలేదు. ఆయన ఈ నెల 5న బాధ్యతలు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

నిర్లక్ష్యమే నిండుప్రాణం తీసింది..

● చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స అందక వ్యక్తి మృతితో కలకలం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటలప్పుడు వైద్య సిబ్బందిలేకపోవడంతో చికిత్స అందక ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన ఇమంది మాణిక్యం(56) మృతిచెందిన ఘటనపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమైంది. గొల్లప్రోలులోని తన హోటల్‌లో పనిచేస్తున్న మాణిక్యం గుండెనొప్పికి గురికాగా యజమాని నాగు అతన్ని చేబ్రోలు పీహెచ్‌సీకి తీసుకురాగా.. అక్కడ ఎవరూ లేకపోవడం, 108 ఆలస్యంగా రావడం, అప్పటికే మాణిక్యం మృతిచెందడంతో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నెల రోజులుగా ఆసుపత్రి రాత్రి వేళల్లో సేవలకు దూరంగా ఉంటోందని వారు ఆరోపించారు. వైద్య సిబ్బంది ఉంటే బతికేవాడని వాపోయారు. జడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు స్థానికులతో కలిసి అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ డిప్యుటేషన్‌పై మరో ప్రాంతానికి వెళ్లారని, ఎల్‌డీసీ, నైట్ వాచ్‌మెన్ మొత్తం నలుగురు సిబ్బంది లేకపోవడంతో రాత్రిపూట పీహెచ్‌సీ పనిచేయడం లేదన్నారు. మాణిక్యంకు కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని ఖననం చేశారు.

ఆసుపత్రి అరుగుపై మాణిక్యం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యుడికి బాధ్యతలు..

మాణిక్యం మృతి ఘటన నేపథ్యంలో చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యుడు, స్టాఫ్‌నర్స్‌పై డీఐవో సుబ్బరాజు, డీఎంవో ప్రభాకర్ ఇచ్చిన విచారణ నివేదిక నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో డీఎంహెచ్‌వో నరసింహనాయక్ చర్యలు తీసుకున్నారు. వైద్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉండడం లేదని, గతంలోనూ ఇక్కడ సేవాలోపాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని స్థానికులు విచారణ అధికారుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. స్థానికంగా నివాసం ఉండని సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ కోత విధిస్తామన్నారు. మార్పులేకపోతే బదిలీ చేస్తామన్నారు. సస్పెండ్ చేసిన వైద్యుడు సాయిరతన్ స్థానంలో తాళ్లరేవు పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కుమార్‌కు డిప్యుటేషన్‌పై బాధ్యతలు అప్పగించామన్నారు.

అమృతమూర్తికి ఆత్మీయ నీరాజనం

కీ.శే. శ్రీ చుండ్రు శ్రీవర ప్రకాష్ గారు
మాజీ మున్సిపల్ ఛైర్మన్, మండపేట
మంచి మనిషి, స్నేహశీలి, అందరి ప్రేమాభిమానాలను పొందిన నాయకుడు
శ్రీ చుండ్రు శ్రీవరప్రకాష్ గారి అకాల మరణమునకు చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...
వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...
శోకతప్త హృదయాలతో ....
వేగుళ్ల జోగేశ్వరరావు
శాసనసభ్యులు, మండపేట
రాష్ట్ర అంచనాల కమిటి ఛైర్మన్
వేగుళ్ల అజయ్ కుమార్
మండపేట
వల్లూరి నారాయణమూర్తి
(చినబాబు)
వల్లూరి సాయి కుమార్
(కుమార్ బాబు)
వల్లూరి రామన్న చౌదరి
మండపేట

(c) eenadu

గంటకొట్టే భాగ్యం కల్పించు స్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గంటకొట్టే భాగ్యం కల్పించాలని భక్తులు వేడుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి నిత్యం రాష్ట్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివస్తారు. బేడ మండప మార్గంలో ఉన్న ప్రధాన గంటను ఆలయ అధికారులు గతంలో తాళ్లతో కట్టేశారు. దీంతో గంటకొట్టే భాగ్యం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏసీ నాగవరప్రసాద్‌ను వివరణ కోరగా కట్టిన తాళ్లు తొలగిస్తామని వెల్లడించారు.

- న్యూస్‌టుడే, అంతర్వేది

భజగోవిందం.. జగమానందం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం మంగళవారం వేలాది మంది భక్తజనంతో అలరారింది. ఆలయంలోని ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రవిడ వేదపారాయణం, నీరాజన మంత్ర పుష్పం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు రమణీయంగా జరిగాయి.

- న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

బసవేశ్వరాయ.. అభిషేక ప్రియ

మండలంలోని రాచపల్లిలో ఆంధ్రా అరుణాచలంగా ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రంలో బసవేశ్వరునిగా కొలిచే మహానందికి 21 ద్రవ్యాలతో మంగళవారం అభిషేకాలు జరిగాయి. అరుణాచలేశ్వరునికి నిత్య అభిషేకాలు, ఉపాలయాల్లోని పరివార దేవతలకు అర్చనలు అనంతరం ఆలయ మండపంలోని నందికి భక్తులు అభిషేకాలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద పర్యవేక్షణలో అర్చకులు ఈ వేడుక నిర్వహించారు.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: దివ్యాంగులు ఏ విషయంలోనూ ఎవరికీ తీసిపోరని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో భవిత కేంద్రాలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాలను ఉపయోగించుకుని పిల్లలు ఆయా రంగాల్లో రాణించాలని కోరారు. సహిత విద్య సమన్వయకర్త గిరిప్రసాద్ దివ్యాంగ పిల్లల్లో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, డీఈవో పిల్లి రమేష్, ఎంఈవోలు సీహెచ్ రవి, తాడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. 21 మండలాల నుంచి 300 మందికిపైగా పోటీలకు హాజరయ్యారు.

క్రీడా పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ పిల్లలు

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రాజాట్యాంక్‌లోని స్కేటింగ్ రింక్‌లో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు పి.సుధారాణి, కె.శ్రీనివాసరావు, టోర్నమెంట్ సంయుక్త ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా జార్జి పర్యవేక్షించారు. అండర్-11, 14, 17, 19 తదితర కేటగిరీల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. రెండోరోజు విజేతలకు ముఖ్యఅతిథులుగా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మహబూబ్ బాషా, కోకనాడ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర చేతులమీదుగా పతకాలు అందజేశారు. బుధవారంతో పోటీలు ముగియనున్నాయి.

విజేతలకు పతకాలను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

నేడు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్...

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కర్నూలులో ఈ నెల 4 నుంచి జరిగే 11వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు బుధవారం నిర్వహించనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్షుడు ఎం.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ గ్రామీణం, పనసపాడులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఉదయం 10 గంటలకు జరిగే పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నేరుగా జట్టుతో కర్నూలు వెళ్లాల్సి ఉంటుందని, సన్నద్ధమై రావాలని సూచించారు.

దివ్యమైన భవిత

కేంద్రాల్లో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

దివ్యాంగ పిల్లల కోసం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అంధ, మానసిక, చెవిటి, మూగ పిల్లలకు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాధారణ స్థితికి తెస్తారు. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీతో పాటు ఆటలు, పాటలు నేర్పిస్తారు. వీరి కోసం ప్రత్యేక విద్యలో శిక్షణ పొందిన ఐఈఆర్‌టీలు సేవలందిస్తారు. మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 21 భవిత కేంద్రాలున్నాయి.

రవాణా, ఎస్కార్ట్ ఛార్జీలు..

భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు రవాణా ఛార్జీలను సైతం చెల్లిస్తారు. పైగా వారిని తీసుకొచ్చే తల్లిదండ్రులు, సహాయకులకు ఎస్కార్ట్ ఛార్జీలు అందిస్తారు. మానసిక వైకల్యం, శ్రవణ వైకల్యం, లోకో మోటార్, అంధత్వం తదితర 21 రకాల వైకల్యాలు గల పిల్లలకు రవాణా ఛార్జీ కింద నెలకు రూ.600 చొప్పున చెల్లిస్తారు. ఇలా ఏడాదిలో పది నెలల కాలానికి రూ.6వేలు అందిస్తారు. అలాగే అదే మొత్తాన్ని వారి తల్లులకు ఎస్కార్ట్ ఛార్జీల కింద చెల్లిస్తారు. దివ్యాంగుల్లో బాలికలు ఉంటే.. బాలికా స్టైఫండ్ కింద నెలకు రూ.200, గృహ ఆధారిత విద్యను పొందే దివ్యాంగులకు నెలకు రూ.300 చొప్పున ఇస్తారు.

భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న పిల్లలు

పిల్లలను గుర్తించి.. ఆదరించి

ప్రతి ఏటా ఆవాస ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తారు. వారిని సమీప భవిత కేంద్రాల్లో చేర్చుకుని వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లలకు సాధారణ విద్యార్థుల మాదిరిగానే మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా ఏకరూప దుస్తులను అందిస్తారు. అలాగే వినికిడి యంత్రాలు, కళ్లజోళ్లు, చంక కర్రలు, ట్రైసైకిళ్లు, బ్రెయిలీ లిపి పుస్తకాలు వంటివి పంపిణీ చేస్తారు. కేంద్రాలకు రాలేని పిల్లలకు గృహ ఆధారిత శిక్షణ ఇస్తారు. వారానికి ఒకరోజు వారి ఇళ్లకు వెళ్లి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ చేస్తారు. శిక్షణ అనంతరం నయమైన పిల్లలను సాధారణ పాఠశాలల్లో చేర్పిస్తారు. 5 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లలు భవిత కేంద్రాల్లో చేరేందుకు అర్హులు.

ఇవీ లెక్కలు..

జిల్లాలో భవిత కేంద్రాలు: 21

ప్రత్యేకావసరాలు గల చిన్నారులు: 3,612

కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న పిల్లలు: 2,340

ఆటిజం బాధితులు: 70

భీమేశ్వరాలయానికి 'కార్తిక' ఆదాయం రూ.1.05 కోట్లు

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయానికి కార్తిక మాసంలో వివిధ రూపాల్లో రూ 1,05,75,051 ఆదాయం చేకూరిందని ఆలయ ఈవో నీలకంఠం తెలిపారు. మంగళవారం ఆలయంలో దేవాదాయ శాఖ కాకినాడ తనిఖీ అధికారి ఫణికుమార్, ఆలయ ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో హుండీలు తెరిచి ఆదాయం లెక్కించామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 9 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ ఆదాయం లభించిందన్నారు. లెక్కింపులో ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయుల బదిలీ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం యండపల్లి జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు ఓ వర్గం విద్యార్థులపై వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ సోమవారం స్థానికులు ఆందోళన చేశారు. దాంతో కలెక్టర్ షాన్‌మోహన్ ఎంఈవో వేణుగోపాల్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్‌భూషణంను శంఖవరం, ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనుబాబును వేళంగి, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌రావును రౌతులపూడి పాఠశాలలకు బదిలీ చేసినట్లు ఎంఈవో మంగళవారం తెలిపారు.

నన్నయకు అయిదు ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు

రాజానగరం: ఉన్నత విద్యలో శ్రేష్టతను, నాణ్యతను అందిస్తూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ, తగిన వనరులను అందిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయానికి అయిదు ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు లభించాయని, త్వరలో 5 స్టార్ రేటింగ్ దక్కనుందని వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మంగళవారం తెలిపారు. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌వైఎం) అధిపతి ఆలపాటి శివయ్య వీసీ ఎస్.ప్రసన్నశ్రీకి ఐఎస్‌ఓ ధ్రువపత్రాలు అందించారు. ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టం, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, జండర్ సెన్సిటైజేషన్ ఆడిట్, అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ ధ్రువపత్రాలు లభించడం అభినందనీయమన్నారు.

పనితీరులో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌కు ద్వితీయ స్థానం

సర్పవరం: రాష్ట్రంలో కూటమి పార్టీల ఎంపీల పనితీరుపై పుణెకు చెందిన సెంటర్ ఫర్ పబ్లిక్ ఒపీనియన్ అండ్ సెఫాలాజికల్ సంస్థ నిర్వహించిన సర్వేలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు ద్వితీయ స్థానం దక్కిందని మంగళవారం ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండడం, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు తదితర అంశాలపై రాష్ట్రంలోని ఎంపీల పనితీరుపై సర్వే నిర్వహించగా 10 పాయింట్లకు 8.6 వచ్చాయి. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఎంపీకి అభినందనలు తెలిపారు.

క్యాన్సర్ కేర్ కార్యకలాపాలకు పెద్దపీట

ఎంపీ సానా ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

కాకినాడ నగరం: రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ కార్యకలాపాలకు పెద్దపీట వేస్తున్నట్లు కేంద్ర ఆయుష్ శాఖా మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ఏపీలో క్యాన్సర్ వ్యాధి నిరోధానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి సమాధానమిచ్చారని స్థానిక ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న క్యాన్సర్ కేర్ కార్యకలాపాలను ఏపీలోనూ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుపతిలో సిద్ధ వైద్య పరిశోధన విభాగం, స్విమ్స్ సంయుక్తంగా క్యాన్సర్ రోగులకు అందిస్తున్న వైద్య సాయానికి కేంద్రం చేయూతనిస్తోందని మంత్రి వివరించినట్లు ఎంపీ కార్యాలయం పేర్కొంది.

పరిషత్‌లతో నాటకరంగానికి పూర్వ వైభవం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రంగస్థల కళ నేటికి కళకళలాడుతూ ప్రజాబాహుళ్యంలో ఆదరణ పొందడానికి నాటక కళాపరిషత్‌లు ఎంతగానో కృషిచేస్తున్నాయని మాజీ మంత్రి కురసాల కన్నబాబు, పంతం గాంధీమోహన్ పేర్కొన్నారు. పంతం పద్మనాభ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో సూర్యకళామందిరంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా నాటక రంగ అభివృద్ధికి కృషి చేసిన పి.వి.రామ్‌కుమార్, మహ్మద్ ఖాజా వలీ, డి.రామసత్యనారాయణ, చెరుకువాడ సత్యనారాయణలను సత్కరించారు. సభ అనంతరం రాత్రి అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే సహానా, శ్రీశృంగార వల్లభ ఆర్ట్స్ తిరుపతి(దివిలి) వారిచే ఇది కదా ముగింపు నాటకాలను ప్రదర్శించారు. సంస్థ ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి బుర్రా పద్మనాభం, సభ్యులు, పలు కళాసంస్థలకు చెందిన ప్రతినిధులు గట్టి సత్యనారాయణ, ఎస్‌వివిఎస్‌ఎన్.మూర్తి, మార్ని జానకిరామ్ చౌదరి, సినీ నటుడు కాటంరెడ్డి, సిఎస్.మూర్తి, పంపన దయానందబాబు, నాదెళ్ల ప్రభుదాసు పాల్గొన్నారు.

సహానా నాటకంలోని సన్నివేశం

ఓటరు కార్డులో చిరునామా... మార్చుకోవచ్చు ఇలా..!

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డు ఎన్నికల సమయంలోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగానూ వినియోగించుకోవచ్చనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. పట్టణాల్లో అద్దెకు ఉండేవారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు ఆ కార్డులో చిరునామా మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటారు. అందులోని చిరునామా (ఫారం-8)ని మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నిర్ణీత సమయాల్లో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్(ఓటర్స్ సర్వీస్ పోర్టల్) ద్వారా ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించింది.

- న్యూస్‌టుడే, గోపాలపురం

చిన్న తేడా ఉన్నా..

ఆన్‌లైన్లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో అలాగే ఓటరు కార్డుల్లోనూ ఉండాలి. చిన్నపాటి మార్పులు ఉన్నా తిరస్కరణ అవుతుంది. ఆన్‌లైన్లో ఫారం-8 పూర్తి చేసిన తరువాత చివరిలో ఓటీపీ వెరిఫికేషన్ ఈ-సైన్ చేయాల్సి ఉంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్టు అవుతుంది. అదే విధంగా పేరులో ఒక్క అక్షరం తేడా ఉన్నా అది తీసుకోదు. ఆన్‌లైన్లో దరఖాస్తు పూర్తి చేసే ముందే ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని సూచన ఇస్తుంది. పేరులో తేడా ఉంటే ముందే సరిచేసుకుని తరువాత చిరునామా మార్చుకోవాలని చెబుతుంది. పేరులో ఏమాత్రం తేడా ఉన్నా సమీపంలోని బీఎల్వోని సంప్రదించాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు తిరస్కరణకు గురైతే..

రెండు కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్లో మార్చుకోవచ్చు. దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు వెంటనే స్థానిక బూత్ లెవెల్ అధికారిని సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బీఎల్వోని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆన్‌లైన్లో దరఖాస్తు పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆఫ్‌లైన్లో చిరునామా మార్చుకోవాలంటే ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే సదరు ఓటరు కార్డులో మారుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

ధాన్యం రైతులకు మద్దతు ధర

పెద్దాపురం: రైతులు పండించిన ధాన్యం దళారుల చేతికి చిక్కకుండా ప్రభుత్వం ప్రతి గింజకు కనీస మద్దతు ధర ఇచ్చి సేకరిస్తుందని, వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఛైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దాపురం మండలం కాండ్రకోట రైతుసేవా కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో ధాన్యంకోసం గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. నాణ్యతాప్రమాణాలున్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. వచ్చే రబీ సీజన్‌లో ప్రతి గ్రామంలో డ్రయర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏవో సంజయ్‌కుమార్, రైతులు చక్రప్రకాష్, రాగ స్రవంతి, సిబ్బంది గణేశ్వరరావు, ప్రవల్లిక, అఖిల్, అమృతవర్షిణి వెంట ఉన్నారు.

కాండ్రకోటలో ధాన్యం పరిశీలిస్తున్న తోట సుధీర్

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

పెద్దాపురం: ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులందరూ అహర్నిశలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దాపురం రామారావుపేటలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో మండల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన నూతన విద్యావిధానం పోకడలను వివరించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు, ఉపవిద్యాశాఖాధికారి ప్రభాకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్: వ్యక్తిగత కారణాలతో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం కాకినాడ గ్రామీణంలో చోటుచేసుకుంది. ఓ బాలిక(17) నగరంలోని ఓ ప్రభుత్వ కళాశాల్లో డిగ్రీ మొదటి ఏడాది చదువుతోంది. ఇటీవల ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ప్రేమించిన అబ్బాయితో వెళ్లిపోయింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆమె ఆచూకీ కనిపెట్టి అప్పగించారు. ఈ నేపథ్యంలో బాలిక ఇంటి వద్ద మంగళవారం సాయంత్రం చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు.

కెనరా బ్యాంక్ Canara Bank
కాకినాడ బ్రాంచ్ (0626)
కాకినాడ, ఫోన్ : 83310 18961

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

కారు వివరములు	రిజర్వు ధర
CAR MAHINDRA MARAZZO & STR M2 REGISTRATION NO. AP 39 J 7575	రూ. 4,00,000/-
CHASIS: MA1WA2ES1J2L48993 ENGINE NO: ESJZK03558, MODEL: 2019	ధరావత్తు: రూ. 40,000/-

ఋణగ్రహీత: శ్రీ మల్లిశెట్టి శేఖర్ కుమార్, C/o మల్లిశెట్టి సత్యనారాయణ రావు, 11 15 15/25/FF1 మానస ఒపేరా, బ్లాక్ ఎ రామారావుపేట, కాకినాడ, తూర్పుగోదావరి-533406.
చెల్లించవలసిన బకాయి మొత్తం: తేది. 05.11.2025 నాటికి రూ. 6,13,569.62/- + వడ్డీ & ఇతర ఛార్జీలు.

● వాహనం తనిఖీ కొరకు తేది. 01.12.2025 నుండి 17.12.2025 ఉ॥ 11:00 గం॥ల నుండి సా॥ 04:00 గం॥ల వరకు బ్యాంక్ పనిదినములలో సంప్రదించవలెను. ● వేలము తేదీ, సమయము : 18.12.2025 ఉ॥ 10:30 గం॥ల నుండి 12:30 గం॥ల వరకు (ధరావత్తు తేది.17.12.2025 వరకు స్వీకరించబడును). ● ఇ-వేలం అమ్మకం జరుగు పోర్టల్: https://baanknet.com ● రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది.17.12.2025, సా॥ 4:00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి. ● "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే" పద్ధతిలో విక్రయించబడును. ● బ్యాంక్ సంతృప్తి మేరకు కె.వై.సి. డాక్యుమెంట్ తప్పనిసరిగా సమర్పించవలెను. ● వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంక్ వారికి సర్వ హక్కులు కలవు. ● విజయవంతమైన బిడ్డరు వాహనం యొక్క గోడౌన్ పార్కింగ్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ మొదలైన వాటికోసం అయ్యే అన్ని ఛార్జీలు భరించవలసి ఉంటుంది. ● ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడరును సంప్రదించండి: M/s PSB Alliance (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com

తేది: 02.12.2025 సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

27 వారాలకే శిశువు జననం

ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఓ గర్భిణీ నవమాసాలు నిండక ముందే 6నెలలకే నొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా అంబులెన్సులోనే మగశిశువుకు జన్మనిచ్చిన ఘటన ప్రత్తిపాడు సీహెచ్‌సీ పరిధిలో చోటుచేసుకుంది. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన తూరంగి సుహాసిని 27 వారాల గర్భిణి. నొప్పులు రావడంతో 108 వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రసవించింది. పుట్టిన బిడ్డ 800 గ్రాముల బరువుతో ఉలుకూ పలుకూ లేకపోవడంతో కంగారు పడ్డారు. సీహెచ్‌సీలోని ఎస్ఎన్‌సీయూలో ఉంచి డాక్టర్ సౌమ్య బృందం వైద్యం చేసింది. కదలికలు, ఏడవడం తదితర సాధారణ లక్షణాలు శిశువులో కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. నెలలు నిండకుండా శిశువు జన్మించడం ఇబ్బందికరమేనని ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగానే ఉన్నారని సూపరింటెండెంట్ తెలిపారు.

శిశువును పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ సౌమ్య

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

కాజులూరు: విద్యుదాఘాతంతో దుగ్గుదూరు గ్రామానికి చెందిన కౌలు రైతు కొప్పిశెట్టి అన్నవరం (67) మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మూడున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని ఆయన సాగుచేస్తున్నారు. ఆదివారం పొలానికి వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు సోమ, మంగళవారాల్లో గాలిస్తుండగా సాయంత్రం పొలానికి సమీపంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల్లో తీగలకు చుట్టుకున్న స్థితిలో మృతదేహం కనిపించింది. ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ఆతని భార్య ఇటీవల మృతిచెందడంతో కుమార్తె ఇంటిలో ఆయన ఉంటున్నాడు. ప్రమాదంపై గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో ఏఎస్పీ పర్యవేక్షణలో సీఐతోపాటు, ఎస్సైలు మణికుమార్, జానీబాషాలతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ.75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌ట్యాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎంకార్డులు, పలు నెట్‌వర్క్‌లకు చెందిన సిమ్‌కార్డులు, రూ.53 వేల నగదు, 20 గ్రాముల బంగారం, సంబంధిత కంపెనీ దుస్తులు, ప్రమోషన్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఏఎస్పీ వివరించారు.

పిఠాపురంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మనీష్

ఇతర ప్రాంతాలకు చెందిన 8 మంది అరెస్టు..

పోలీసులు తమ దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మంది స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్(గుండుమల్ల, సత్యసాయి జిల్లా), సిద్దేశ్ శ్రీధర్, సిద్దేశ్ సుదీప్(మల్ల నాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్(హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య(పార్వతీపురం), నాగప్ప కావ్య(మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి(ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి		18,000
కురిడీ (వెయ్యింటికి): పాతకాయ:	గండేర	29,000
	గటగట	27,000
కొత్తకాయ:	గండేర	28,000
	గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ		15,000-16,000
కొత్త (పచ్చి) కాయ		14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	118-00
రిటైల్ లైవ్	145-00
డ్రెస్ట్	210-00
స్కిన్‌లెస్	239-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU eClassifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఋణాలు. పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

REAL ESTATE

HOUSE FOR SALE

RAJAMAHENDRAVARAM CITY

రాజమండ్రి, లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీ MIG-418లో 277 చ॥గ॥లో ఈస్ట్ ఫేసింగ్ ఇల్లు అమ్మకమునకు కలదు. Contact Cell: 63055 24046.

JOBS

Krishna Pradeep's 21st Century IAS
WE ARE HIRING
TELE MARKETERS
10 No's (ONLY FEMALE)
Qlf: Intermediate / Degree with Good communication skills in Telugu & English.
Attractive Pay & Incentives
OPP. Z.P. HIGH SCHOOL, TORREDU, RAJAHMUNDRY.
8247417713

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

Paytmలో చేయుటకు స్టాఫ్ కావలెను. జీతం, ఇన్సెంటివ్‌తో కలిపి 30,000/- సంపాదించొచ్చు. రాజమండ్రి మండపేట, రావులపాలెం పట్టణాలకు కావలెను. ✆ 98660 11262.

ప్రముఖ కంపెనీలలో కాంట్రాక్ట్ పద్ధతిలో (గ్రౌండ్‌లెవల్ స్టాఫ్) ఎనీ క్వాలిఫికేషన్, సిస్టం ఆపరేటర్, సూపర్‌వైజర్, స్టోర్ హెల్పర్స్. 8341177761, 9063222817

రాజమండ్రి: మహిళలకు మాత్రమే, డోర్ టు డోర్ వర్క్, పార్ట్ టైమ్ + ఫుల్‌టైమ్, 8 వేలు నుండి 10 వేలు జీతం + ఇన్సెంటివ్. Contact Cell: 93929 52551.

రాజమండ్రి J.N.రోడ్, ఐరన్ హిల్ పక్కన ఉన్న మా నూతన రెడీమేడ్ బట్టలషాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్ కావలెను. సంప్ర: 98664 11308, 70206 93543.

Wanted 1) Computer Operator 2) Tally Bell Fresh Foods ద్రాక్షారామం ఇండస్ట్రీ. Mobile: 9347336023.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 7702237945.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పనిచేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డ్యూటీ జీతం:22,000/- (8గం॥ 26 రోజులు)+PF, ESI, 50 సం॥లోపు Ct: 9666985077, 8688776420

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ఫ్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-45 పైసలు
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU for Advertisement Contact: 8008597607

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలో/కు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 27, వంకాయలు- 40, 54, బెండకాయలు- 60, పచ్చిమిర్చి- 40, 44, కాకరకాయ- 46, బీర- 50, 56, కాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 34, క్యారెట్- 48, దొండకాయలు- 30, బంగాళాదుంపలు- 23, 26, ఉల్లి- 22, 27, గోరుచిక్కుడు- 60, దోసకాయలు- 20, చిక్కుడు- 70, 80, చేమదుంపలు- 36, బీట్‌రూట్- 40, కీరదోస- 32, బీన్సుకాయలు- 60, అల్లం- 74, క్యాప్సికం- 78, బొబ్బర్లు- 40, చిలకడదుంపలు- 34, ఒకటి బొప్పాయి కాయ- 25, 30, పొట్లకాయ- 25, 30, అరటికాయ-5, 7, మునగకాడ- 15, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 24, 30.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినీ మాస్ 4మ్మీన్- ఆంధ్ర కింగ్ తాలూకా, మురుగరుమా, జుటోపియా 2, ఏషన్ అఖండ పేనిలిస్, దేవి మల్టీప్లెక్స్ 4స్క్రీన్- రివాల్వర్ రీటా, ప్రేమంటే, లక్ష్మీ జనతార్, సత్యగౌరి - ఆంధ్ర కింగ్ తాలూకా, తిరుమల - ఆంధ్ర కింగ్ తాలూకా, సీలండ్స్ 1- 12A రైల్వేకాలనీ, సీలండ్స్ 2- బిజినెస్ మేన్, శ్రీప్రియ - ఆంధ్ర కింగ్ తాలూకా, పద్మప్రియ- రాజు వెడ్స్ రాంబాయి, సూర్య(వాకలపూడి) - రాజు వెడ్స్ రాంబాయి, సూర్య 2 -ఆంధ్ర కింగ్ తాలూకా.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

వృథాను అరికట్టారు..

స్పందనకు వందనం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ శాంతినగర్‌లోని ఓ వీధిలో రహదారిపై పైపులైను పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పైపులైనుకు మరమ్మతులు చేపట్టడంతో వృథాను నిలువరించారు.

ప్రమాదాన్ని నివారించారు..

మసీదుసెంటర్: కాకినాడ గొడారిగుంట ప్రధాన రహదారి కూడలి వద్ద అడ్డుగా మట్టిగుట్ట ప్రమాదకరంగా ఉందని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

స్ఫూర్తిమంతులు..

క్రీడల్లో సత్తాచాటుతున్న దివ్యాంగులు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

లోపం ఎవరికీ శాపమని నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు ప్రతిభావంతులు. అటు క్రీడల్లో.. ఇటు జీవితంలో విజయాలు సాధిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పారా స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలను సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు వద్ద ఈతలో సాధన చేస్తూ పతకాలు సాధిస్తున్నారు.

ఈత కొడితే పతకమే..

కాకినాడ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న సతీష్‌కుమార్ ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి, అమ్మ చంద్రకళ గృహిణి. పుట్టుకతోనే కాలు, చెయ్యి వంకరపోయాయి. వైద్యుల సూచన మేరకు 2016 నుంచి ఈత సాధన చేస్తున్నా. తర్వాత పారా స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నా. ఇప్పటివరకూ 11 రాష్ట్రస్థాయి పతకాలు, 7 జాతీయస్థాయి పతకాలు సాధించా. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ పారా జూనియర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు, రజత పతకాలు గెలుచుకున్నా. గ్రూప్-1 అధికారి అవ్వాలనేది నా లక్ష్యం. - వి.దేవశ్రీ చంద్రేష్, కాకినాడ

అటు బోధన.. ఇటు ఆట

మాది కాకినాడ జగన్నాథపురం, మున్సిపల్ బీపీ వీధి. చిన్నతనం నుంచి పోలియోతో రెండు కాళ్లు పనిచేయవు. క్రీడలంటే ఇష్టం. 2018 డీఎస్సీలో టీచర్ కొలువు వచ్చింది. ఆ తర్వాత ఆ ఇష్టాన్ని కొనసాగిస్తున్నా. స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ నేర్చుకున్నా. అథ్లెటిక్స్‌లోనూ తలపడుతున్నా. ఇప్పటివరకూ స్విమ్మింగ్‌లో 8 రాష్ట్రస్థాయి పతకాలు సాధించా. మరో మూడుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. బ్యాడ్మింటన్‌లో ఒక రాష్ట్రస్థాయి పతకం సాధించా. అథ్లెటిక్స్‌లోని డిస్కస్ త్రో, షార్ట్‌పుట్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు పాల్గొన్నా. 'మీకు ఆటల పోటీలు ఉంటాయా..నువ్వు ఎలా ఆడతావు' అంటూ కొందరు చులకనగా మాట్లాడేవారు. నేను సాధించిన పతకాలే వారికి సమాధానం చెబుతాయి. అంతర్జాతీయ పతకం సాధించాలనేది నా లక్ష్యం. - నూకరాజు, జగన్నాథపురం

జాతీయస్థాయిలో రాణించాలని..

స్థానిక డైరీ ఫిష్ మార్కెట్‌లోని 30వ వార్డు సచివాలయంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యదర్శిగా పనిచేస్తున్నా. పోలియోతో ఒక కాలు పనిచేయదు. ఎంకామ్, బీఈడీ చేశా. కష్టపడి చదివి ఉద్యోగం సాధించా. చిన్నతనం నుంచి ఈత అంటే ఇష్టం. గత ఐదు నెలల నుంచి డీఎస్ఏలో స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ రెండు రాష్ట్రస్థాయి పతకాలు సాధించా. జాతీయస్థాయిలో సత్తా చాటాలని సాధన చేస్తున్నా. -ఎల్.నాగేశ్వరరావు, రామారావుపేట

సుందరంగా తీర్చిదిద్దారు

ఉపాధ్యాయుడు చలపతి రూ.2.50 లక్షలు సొంతంగా, కార్పొరేట్ సంస్థలు, స్నేహితుల ద్వారా సేకరించిన నిధులతో పాఠశాలను సుందరంగా అభివృద్ధి చేయడం స్ఫూర్తిదాయకమని ఆర్జేడీ నాగమణి తెలిపారు. రమణయ్యపేట ఎంపీపీ పాఠశాల, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మంగళవారం ఆర్జేడీ తనిఖీ చేశారు. క్లస్టర్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, మధుకుమార్, సత్యవతి, రామలక్ష్మి, దివ్య, నీలిమ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సర్పవరం

ఉద్యోగాలకు 150 మంది ఎంపిక

ఎంపికైన వారితో డీఆర్వో వెంకటరావు, వికాస పీడీ లచ్చారావు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలోని హోసూర్‌లో టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల్లో మొబైల్ ఆపరేటర్ల పోస్టులకు ఎంపికైన 150 మంది అభ్యర్థినులను వికాస ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ నుంచి ప్రత్యేక బస్సుల్లో పంపించారు. డీఆర్వో జె.వెంకటరావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అర్హత ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వికాస పీడీ కె.లచ్చారావు మాట్లాడుతూ టాటా ఎలక్ట్రానిక్స్‌లో 5వేల మంది మహిళలకు ఉద్యోగాలు కల్పన లక్ష్యమని, ఇప్పటికే 500 మంది కొలువులు పొందారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రహదారులు జలమయం

రోడ్డుపై నిలిచిన నీరు..

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్: కాకినాడ నగరంలో మంగళవారం ఉదయం నుంచి కురిసిన వర్షంతో ప్రధాన రహదారులతోపాటు కాలనీ వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తపేట మార్కెట్, సాంబమూర్తినగర్, రేచర్లపేట, కొత్తకాకినాడ, శాంతినగర్, భాస్కర్‌నగర్, పళ్లంరాజునగర్, గొడారిగుంట మూడుగుళ్ల ప్రాంతాలు, పలు కాలనీ వీధుల్లో వర్షం నీరు నిలబడింది. వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. దీనికి తోడు చలి తీవ్రత కూడా అధికంగా ఉండటంతో నగర వాసులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆదాయ వనరులను పెంపొందించుకుందాం

నగరపాలక సంస్థ సమీక్షలో ప్రత్యేకాధికారి షాన్ మోహన్

మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి షాన్ మోహన్, చిత్రంలో కమిషనర్ సత్యనారాయణ, అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఆదాయ వనరులను పెంపొందించుకుందామని ఆ సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ షాన్ మోహన్ అన్నారు. కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఉప కమిషనర్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతర కార్పొరేషన్లతో పోలిస్తే కాకినాడ నగరపాలక సంస్థ ఆదాయం తక్కువగా ఉందన్నారు. ఆదాయ వనరుల పెంపునకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ఇప్పటి వరకు చర్యల్లేవని చెప్పారు. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, తాగునీరు, తదితర విభాగాల నుంచి ఆదాయం పెంచుకునే అవకాశముందన్నారు. నగరంలో అనధికారిక కొళాయిలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయని, వాటి క్రమబద్ధీకరణకు ఈనెల 10 వరకు గడువు విధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ట్రేడ్ లైసెన్సుల జారీ, పార్కుల్లో ఫుడ్ కోర్టులు, ఎగ్జిబిషన్లు, తదితర ఏర్పాట్లు ద్వారా ఆదాయాన్ని పెంచుకునే ఆలోచనలు చేయాలని షాన్ మోహన్ తెలిపారు. టెండర్ విధానం ద్వారా పార్కుల అభివృద్ధికి ముందుకు వచ్చేవారికి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని పేర్కొన్నారు. ఎస్ఈ పి.వెంకట్రావు, ఎంహెచ్‌వో డా.పృథ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, లెక్కల అధికారి రామశాస్త్రి, టీపీఆర్‌వో శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాసంతో అదరగొట్టారు..

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్స్ ఎస్‌వీఎస్ఎన్ కిరణ్, జి.శ్రీను

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ లక్ష్మీనారాయణనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కళాశాల స్థాయిలో ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అంశంపై నిర్వహించిన ఉపన్యాసం పోటీలో కె.నగేష్ ప్రథమ, పి.సందీప్ కుమార్ ద్వితీయ, డీఎస్ ధనిష్ తృతీయ బహుమతులు సాధించారు. ప్రిన్సిపాళ్లు ఎస్‌వీఎస్ఎన్ కిరణ్, జి.శ్రీను అందజేశారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు కాకినాడ జేఎన్‌టీయూకేలోని అల్యూమిని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వీరి కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

కాలుష్యాన్ని అరికడదాం

ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థినులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎకో క్లబ్, రసాయనశాస్త్ర, వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అధ్యక్షత వహించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటనను స్మరించుకుంటూ, కాలుష్య నివారణ ప్రాముఖ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా.ఎం.సులక్షణ, పి.లీనా, పావని తదితరులు పాల్గొన్నారు.

నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే..

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని గొడారిగుంట నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న ప్రధాన మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడటంతోపాటు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

గుంతలతో అవస్థలు..

కాకినాడ, బాలాజీచెరువు కూడలి వద్ద దేవాలయం వీధికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. దాంతో వాహనదారులు ఆ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదాలకు గురవ్వడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ట్రాఫిక్‌కు సైతం అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదుసెంటర్

పొంచి ఉన్న ప్రమాదం..!

కాకినాడ పావురాల తూము నుంచి ఏఎంజీ పాఠశాలకు వెళ్లే దారిలో రాజీవ్ గృహకల్ప సముదాయాల ప్రాంతంలో 49వ బ్లాక్ వద్ద ఓ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పక్కకు ఒరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కింద భాగాన మట్టి గుల్ల బారడంతో స్థానికులు రాళ్లు అడ్డుగా ఉంచారు. భారీ వర్షం కురిస్తే మరింత కుంగి కూలే ప్రమాదముందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

బిల్లు కట్టాలంటే తడవాల్సిందే!

విద్యుత్తు శాఖ కాకినాడ సర్కిల్ కార్యాలయంలోని బిల్లులు చెల్లింపు కౌంటరు షెడ్ చిల్లులు పడి వర్షం నీరు కిందకు కారిపోతోంది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇదే పరిస్థితి. బిల్లుల చెల్లింపు కౌంటర్ షెడ్‌ను బాగు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

మా గోడు ఆలకించరా?

సాంబమూర్తినగర్ (కాకినాడ) న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ డిపో కార్యదర్శి పీఎల్ రాజు, పాలిక యజమాని, శ్రీనివాసరావు ఆరోపించారు. మంగళవారం యూనియన్ కార్యాలయం వద్ద వారు మాట్లాడారు. కాకినాడ ఆర్టీసీ డిపోలో గతంలో డ్రైవర్‌గా పనిచేసిన యజమాని.. చెన్నై వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయారు. గత 10 సంవత్సరాలుగా ఉద్యోగం లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ఆదుకోవాలని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆయన ఫొటోతో కాకుండా మరొకరు ఫొటో పెట్టి సమస్య పరిష్కరించినట్లు ఆర్టీసీ అధికారులు ఆన్‌లైన్‌లో పెట్టారన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నందుకు తనను తొలగించారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కోర్టుకు వెళ్లడంతో డిపో అధికారులు తనపై కక్షగట్టి ఉద్యోగం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీనిపై కూడా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో తప్పుడు నివేదికలతో ఉద్యోగం ఇవ్వకుండా చేశారన్నారు. కాకినాడ డిపో అధికారుల అవినీతిపై ఫిర్యాదు చేయడంతో తనపై వేధింపులు అధికమయ్యాయని కార్యదర్శి పీఎల్ రాజు తెలిపారు. డిపో అధికారుల తీరుతో తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నామని, న్యాయం చేస్తారని పీజీఆర్ఎస్‌ను ఆశ్రయిస్తే అక్కడ కూడా న్యాయం జరగడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చారు.

రగ్బీ పోటీల్లో బంగారు పతకాలు

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ మూర్తిరాజు, అధ్యాపకులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఇటీవల కర్నూలు, నెల్లూరులో జరిగిన స్కూల్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో కాకినాడ జగన్నాథపురానికి చెందిన అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీలతో బంగారు పతకాలు సాధించారు. అండర్ -19 విభాగంలో పి.సునంద తేజశ్రీ, ఎన్.కల్యాణి, జి.తేజస్వి, అండర్-17 విభాగంలో వై.జ్యోతి చంద్రిక, ఎన్.చందాని, పి.శ్రుతి ప్రతిభ చాటి త్వరలో దిల్లీ, భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిహెచ్ఎన్ మూర్తిరాజు తెలిపారు. గురజనాపల్లి జడ్పీహెచ్ఎస్ పీడీ, రగ్బీ కోచ్ క్రరి నాగేశ్వరరావు వీరికి శిక్షణ అందించారు. విద్యార్థినులను ప్రిన్సిపల్‌తో పాటు పీడీ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయ సంఘాలు సేవా దృక్పథంతో పనిచేయాలి

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ నాగమణి, యూటీఎఫ్ నాయకులు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యలపై పోరాటాలు చేయడానికే పరిమితం కాకుండా సేవా దృక్పథంతో పనిచేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు (ఆర్జేడీ) జి.నాగమణి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) రూపొందించిన పదో తరగతి పరీక్షల-2026 స్టడీ మెటీరియల్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సూరిబాబు, కేవీవీ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వద్దు.. వస్త్రసంచులు ముద్దు

రైతుబజార్‌లో సంచులు పంపిణీ చేస్తున్న అలయెన్స్ క్లబ్ సభ్యులు

గాంధీనగర్: ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి హాని కలుగుతుందని, అందరూ వస్త్రసంచులను వినియోగించాలని అలయెన్స్ క్లబ కాకినాడ శరవణ్ సభ్యులు పేర్కొన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా అలయెన్స్ క్లబ్ కాకినాడ శరవణ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద రైతుబజార్‌లో మంగళవారం రైతులు, వినియోగదారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు యాళ్ల రత్నారావు, ఎక్స్‌టెన్షన్ ఛైర్మన్ దిలీప్‌కుమార్ సదనాని, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి, యాళ్ల పద్మ, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణారావు, మురళీధర్, నారాయణ పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: బంగారు ఆభరణాల చోరీపై కాకినాడ మూడో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కాకినాడ సాంబమూర్తినగర్‌కి చెందిన షేక్ బషీరా ఈ ఏడాది సెప్టెంబర్ 4 నుంచి రెండు నెలల పాటు కుటుంబంతో సహా కొత్తలంక వెళ్లారు. గతనెల 4న ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో బీరువాలో ఉండాల్సిన 24 గ్రాముల విలువజేసే బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యత లోపిస్తే చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లలో ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా మెనూ అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. భోజనం, అల్పాహారం అమలు విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన మంగళవారం నగరంలోని పలు అన్న క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని చెప్పారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలపై ఆయా విభాగాల అధికారులు వేగంగా స్పందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు.

బాలికలకు ఆత్మరక్షణ విద్యల్లో ఉచిత శిక్షణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగర పరిధిలో అన్ని నగరపాలక సంస్థ పాఠశాలల్లో బాలికలకు మార్షల్‌ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు మల్లాడి రామారావు ఛారిటబుల్ ట్రస్ట్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ట్రస్ట్ ఛైర్మన్, జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జనవరి నుంచి కరాటే శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు నుంచి ఉత్తర్వులు అందినట్లు చెప్పారు. ఇందుకు సహకరించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాత్రి పూట ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనదారులు

ఇటొస్తే.. ఇక్కట్లే!

సైక్లింగ్ ట్రాక్ పక్కన ప్రమాదకరంగా బోల్టులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని రామారావుపేట ప్రకాశం రోడ్డులో గతంలో రాజాట్యాంకు పార్కు చుట్టూ సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో ట్రాక్‌లోకి వాహనాలు ప్రవేశించకుండా రేడియం స్టిక్కర్లతో ప్లాస్టిక్ గొట్టాలను బిగించారు. తర్వాత వాటిని ఆ గొట్టాలు, కొద్దిమేర సిమెంట్ దిమ్మెలను తొలగించారు. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు కొద్ది దూరం వెళ్లగానే రోడ్డులో ట్రాక్‌ను ఆనుకుని ఉన్న దిమ్మెలపైకి ఎక్కించి జారి పడుతున్నారు. మరోవైపు అక్కడ నట్లు తీయకపోవడంతో టైర్లు పంక్చరు అవుతున్నాయి. నగరపాలక అధికారులు స్పందించి సైక్లింగ్ ట్రాక్ చుట్టూ ప్లాస్టిక్ గొట్టాలైనా అమర్చాలని, సిమ్మెంట్ దిమ్మె మొత్తం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్ధార్థనగర్ కాలనీ సంక్షేమ కమిటీ ఎన్నిక

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని సిద్ధార్థనగర్ కాలనీ సంక్షేమ సంఘ కమిటీ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. సంఘ గౌరవాధ్యక్షుడిగా వై.డి.రామారావు కొనసాగుతుండగా, అధ్యక్షుడిగా తోట సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా టి.శ్రీనివాసరాజా, కోశాధికారిగా బి.త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా టి.రంగారావు, వైజికే.మూర్తి, బిఎల్‌జి.ప్రసాద్, ఎస్.గోపాల్‌లు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా సత్తి రవిరెడ్డి, జి.వెంకటేష్, ప్రత్యేక ఆహ్వానితులుగా బసవ ప్రభాకరరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ కాలనీలో పార్కుల సుందరీకరణ, ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు చేయూత

గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో సివిల్, ఫార్మసీ విభాగాల్లో విద్యార్థులకు అవసరమైన బోధనా పరికరాలు, యూపీఎస్ కొనుగోలుకు ఆర్థికసాయం అందించేందుకు భారతీయజనతాపార్టీ రాష్ట్ర భవన నిర్మాణ కమిటీ సభ్యుడు, ఇంజినీర్ గట్టి సత్యనారాయణ ముందుకు వచ్చారు. మంగళవారం మెహర్‌నగర్‌లోని కళాశాలను సందర్శించారు. కళాశాల భవనంలో స్లాబు లీకేజీలు పరిశీలించిన ఆయన మరమ్మతులు ఎలా చేయాలో సూచించారు. ప్రిన్సిపల్ కె.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సర్పవరం: తుపాను కారణంగా కురిసిన అకాల వర్షాలకు రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది, కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. చీడిగ బైపాస్‌రోడ్డులో తడిచిన ధాన్యాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సర్పవరం: తుపాను కారణంగా కురిసిన అకాల వర్షాలకు రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది, కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని, వెంటనే మంత్రి మనోహర్, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ గ్రామీణం చీడిగ బైపాస్ రోడ్డులో తడిచిన ధాన్యాన్ని ఎమ్మెల్యే అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాపరీక్షకు ఎంపిక

సామర్లకోట గ్రామీణం: రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని పవర జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నిమ్మన తేజశ్రీ ఎంపికైందని హెచ్ఎం గోపాలరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొనే 12 మందిలో తమ విద్యార్థిని ఉండడం అభినందనీయమని ఎంఈవో శివరామకృష్ణయ్య పేర్కొన్నారు.

తేజశ్రీని అభినందిస్తున్న ఎంఈవో శివరామకృష్ణయ్య

శ్రీపాదవల్లభుడికి అర్చన

పిఠాపురం: పిఠాపురంలోని శ్రీపాద వల్లభ మహాసంస్థానంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అయిదు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం శ్రీపాదవల్లభుడికి సహస్ర లిల్లీపూల అర్చన నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని మాధురీ విద్యాలయంలో రెండు రోజులపాటు 2,500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మంగళవారం విద్యాసంస్థల అధినేత తమ్మయ్యనాయుడు, సీతాదేవి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్, శివప్రసాద్ పాల్గొన్నారు. కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించారు.

కృషితో లక్ష్య సాధన

సామర్లకోట: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లోనూ కృషితో రాణిస్తే లక్ష్యం సాధించవచ్చని క్రీడాకారుడు, పోస్టల్ ఉద్యోగైన పెగడరెడ్డి సాగర్ అన్నారు. మంగళవారం సామర్లకోట బీబీఆర్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. తనలా క్రీడా కోటాలో సులువుగా ఉద్యోగాలు సాధించవచ్చున్నారు. హెచ్ఎం లలితామాణిక్యాంబ పాల్గొన్నారు.

సుందరంగా తీర్చిదిద్దారు..

సర్పవరం: ఉపాధ్యాయుడు చలపతి రూ.2.50 లక్షలు సొంతంగా, కార్పొరేట్ సంస్థలు, స్నేహితుల ద్వారా సేకరించిన నిధులతో పాఠశాలను సుందరంగా అభివృద్ధి చేయడం స్ఫూర్తిదాయకమని ఆర్జేడీ నాగమణి తెలిపారు. రమణయ్యపేట ఏపీఎస్పీ ఎంపీపీ పాఠశాల, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మంగళవారం ఆర్జేడీ తనిఖీ చేశారు. క్లస్టర్ హెచ్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సత్తా..

కరప: ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలో మంగళవారం నిర్వహించిన పోటీల్లో తమ చిన్నారులు సత్తా చాటారని కరప భవిత కేంద్రం ఐఈఆర్‌పీ స్వాతి తెలిపారు. ఎనిమిది మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఐఈ కోఆర్డినేటర్ గిరిధర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారన్నారు.

విభిన్నం.. ఆలోచిస్తే విజయం

పుట్టుకతో దివ్యాంగులుగా జన్మించిన వారిని చూసి జాలిపడొద్దు. వారిలో ఇంకేదో ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెతకండి. ప్రోత్సహించండి. అది తల్లిదండ్రుల బాధ్యత. అందుకు మీకు సాయంగా భవిత కేంద్రాలున్నాయి. స్వచ్ఛంద సంస్థలూ సేవలందిస్తున్నాయి. దాతలూ ముందుకొస్తున్నారు. కావాల్సిందల్లా సేవలను సద్వినియోగం చేసుకోవడం. ప్రపంచానికి వారిని విజేతలుగా పరిచయం చేయడం. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కథనం.

– న్యూస్‌టుడే, కరప, సర్పవరం

దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్న ఉమా మనోవికాస కేంద్రం వాలంటీర్లు

కరప: భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

ఆత్మస్థైర్య నిలయాలు..

పిల్లల్లో వైకల్యాన్ని చూసి బాధపడుతున్న తల్లిదండ్రుల్లో భవిత కేంద్రాలు కొత్త ఆశలు నెలకొల్పుతున్నాయి. కేంద్రాల్లో అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలు క్రమంగా ఫలితాలిస్తున్నాయి. తమ పనులు తామే చేసుకునేలా వారికి ఐఈఆర్‌పీలు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కరప, కాకినాడ గ్రామీణ మండలాల్లో రెండు భవిత కేంద్రాలున్నాయి. ఎనభై మంది వరకు ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవలందుతున్నాయి. ఇక్కడ ఫిజియో, స్పీచ్ థెరపీలు, దృష్టి ప్రేరణ, తల్లిదండ్రులకు సూచనలు, మార్గదర్శకాలు, ప్రత్యేక విద్యాపరమైన సహకారం అందిస్తున్నాయి. చిన్నారులకు అవసరమైనవారికి ఉచితంగా ట్రైసైకిళ్లు, కాలిపర్స్ వంటివి అందిస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. సేవలు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నిరుపమాన సేవలు..

వాకలపూడిలో ఎస్.పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో 1988లో 9 మందితో ఉమాఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ(ఉమా మనోవికాస కేంద్రం) ప్రారంభమైంది. 37 ఏళ్లుగా వేలాది మందికి ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, సాధికారత తదితర సేవలందిస్తోంది. కాకినాడతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలు, యానాంలోని దివ్యాంగులూ ఇక్కడ లబ్ధి పొందారు. పెద్దిరెడ్డి రాష్ట్రపతి నుంచి రెండు సార్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆరు సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఇక్కడికే పరిమితం కాకుండా తాళ్లరేవులోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక సహకారంతో ధీరూభాయ్ అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. బధిర, అంధ చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అజీమ్ ప్రేమ్‌జీ సహకారంతో 420 మందికి సేవలందించారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో ప్రతి గురువారం నవజాత శిశువులకు వినికిడి సమస్యలపై వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు, దాతల సహకారంలో సేవలందిస్తున్నామని సంస్థ ఈడీ ఎస్.పెద్దిరెడ్డి చెబుతున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు, న్యూస్‌టుడే: కుయ్యేరు నుంచి కాజులూరు వరకు కొత్త విద్యుత్తు లైన్ వేసే పనులు చేపట్టిన కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆర్యవటం సబ్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. కుయ్యేరు సబ్‌స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని కుయ్యేరు, అయితంపూడి, దుగ్గుదూరు, ఉప్పుమిల్లి, చింతలంక, రేగుబాడవ, పల్లిపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు

వెంకటేశ్వరరావు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం విధుల్లో చేరారు. ఈయన సచివాలయాలను పర్యవేక్షిస్తారని ఎంపీడీవో సలాట్ రాజు చెప్పారు.

త్వరితగతిన స్వామిత్వ సర్వే

కాజులూరు, న్యూస్‌టుడే: మండలంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో జె.రాంబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. స్వామిత్వ ద్వారా గ్రామాల్లో భూ హక్కులను స్పష్టంగా నిర్ధారించడంతో పాటు ప్రజలకు శాశ్వత హక్కు పత్రాలు అందించడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు మండల పరిధిలో 53 శాతం మాత్రమే సర్వే పనులు పూర్తయ్యాయని వివరించారు. కోలంక, పెదలంక, నామవానిపాలెం, పెనుమళ్ల గ్రామాల్లో 100 శాతం పూర్తయ్యాయని, అన్ని గ్రామాల్లో వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, డిప్యూటీ ఎంపీడీవోలు చక్రపాణిరావు, ముద్రగడ సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి

కరప మండలం పెనుగుదురులో ఏర్పాటుచేసిన పశువుల తొట్టెలో నీళ్లు నింపే వారు లేక నిరుపయోగంగా ఉంది. పశువులకు పుష్కలంగా నీరు అందించేందుకు నిర్మించిన ఈ తొట్టె వినియోగంలో లేక ప్రస్తుతం అలంకారప్రాయంగా మారిందని రైతులు వాపోతున్నారు. నీటిని నింపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో ఎస్వీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

ఇళ్లపట్టాలు మంజూరుచేయాలి

ధర్నాలో పాల్గొన్న రైతుకూలీ సంఘం నాయకులు

పెద్దాపురం: పట్టణంలోని ఒకటోవార్డు పరిధి దమ్ములపేటలో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు రాజబాబు, సతీష్, అంజిబాబు, దుర్గాదేవి, వీరబాబు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఉచిత శిక్షణ

కాకినాడ: కాకినాడ నగర పరిధిలో అన్ని నగరపాలక సంస్థ పాఠశాలల్లో బాలికలకు ఉచిత మార్షల్ శిక్షణ ఇచ్చేందుకు మల్లాడి రామారావు ఛారిటబుల్ ట్రస్ట్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ట్రస్ట్ ఛైర్మన్, జనసేన నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జనవరి నుంచి కరాటే శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావు నుంచి ఉత్తర్వులు అందినట్లు చెప్పారు.

అధ్వానంగా తాగునీటి ట్యాంకులు

తాళ్లరేవు: మండలంలోని 17 పంచాయతీల పరిధిలో 22 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను 1995లో నిర్మించారు. 30 ఏళ్ల నుంచి వాటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా జరుగుతోంది. ఈ ట్యాంకుల లోపల భాగంలో శ్లాబ్ పెచ్చులూడి, మెట్లు ధ్వంసమయ్యాయి. ఆ ట్యాంకులను శుభ్రం చేసేందుకు పంచాయతీ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్యాంకులన్నీ మసిబారి రంగులు వెలిసి అధ్వానంగా కనిపిస్తున్నాయి. చుట్టు పక్కల పిచ్చి మొక్కలు, చెత్తతో నిండి ఉన్నాయి. ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుకీర్తి దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకులను పరిస్థితిని పరిశీలించి వాటికి రంగులు వేయించి శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లక్ష్మీపతిపురంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ పరిసరాల్లో పరిస్థితి ఇలా

భారతీయ సంస్కృతి బలోపేతానికి కృషి

పెదపూడి, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు అన్నారు. మంగళవారం పెదపూడి మండలం జి.మామిడాడ కోదండరామాలయంలో సమరసత దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఏర్పాటై 10 సంవత్సరాలైన సందర్భంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. తితిదే ఆర్థిక సాయంతో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణం చేపట్టి అదే సామాజిక వర్గానికి చెందిన వారిని పూజారులుగా నియమిస్తామన్నారు. ఎం.శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, శివాజీ, డి.దుర్గాప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

రక్షణ గోడలు ఏవండీ..?

కరప మండలం గొర్రిపూడి-వేములవాడ దారిలోని వంతెనకు రక్షణ గోడలు లేక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఇరుపక్కలా రక్షణ గోడలు ధ్వంసం కావడంతో ఎప్పుడేం పడిపోతారో తెలియకుండా ఉంది. ఏఈ సుబ్బారావును అడగ్గా ఉన్నతాధికారులతో మాట్లాడి రక్షణ గోడలు నిర్మిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కరప

అయ్యో.. జారిపడాల్సిందేనా..

పిఠాపురం మండలంలోని భీమనగర్ నుంచి గోకివాడ వరకు దాదాపు పదేళ్ల తరువాత ర.భ.శాఖ రహదారి నిర్మించింది. ఇటీవల వరి కోత యంత్రాలు తిరగడంతో పొలాల్లోని మట్టి రహదారిపై చేరి ప్రస్తుత తుపాను జల్లులకు బురదమయంగా మారుతోంది. వాహనచోదకులు పడిపోతున్నారు. అధికారులు శుభ్రం చేయించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

కూడలిలో వెలగని దీపం

పిఠాపురంలోని రాపర్తి జంక్షన్ వద్ద విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రోడ్డు మధ్యలోని ఎల్ఈడీ దీపాలు స్తంభం నుంచి కిందకు [illegible] వుతోంది. నేటికీ సరిచేయడం లేదు. దాంతో కూడలిలో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. సీఐ శ్రీనివాస్‌కు చెప్పగా హైవే నిర్వహణ అధికారులతో చర్చించి మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

దారి తీరు.. ఎలా వెళ్లేరు..

పెద్దాపురం పురపాలిక కార్యాలయం ఎదుట 2014లో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంటు రహదారి ఛిద్రమై వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతో రద్దీగా ఉండే దారిది. కంకర రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

దుర్వాసన భరించేదెలా..

నడకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ పక్కన చెత్త, వ్యర్థాలు వేస్తుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావును వివరణ కోరగా పంచాయతీ సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

చట్టపరమైన చర్యలకు డిమాండ్

కొత్తపల్లి: యండపల్లి జడ్పీ పాఠశాలలో ఓ వర్గం విద్యార్థులపై వివక్ష చూపిన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

పెద్దాపురం: విశాఖలో డిసెంబరు 31న నిర్వహించనున్న అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దాపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షుడు టి.గంగా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కాకినాడ అర్బన్ 2వ డివిజన్ దుర్గావిద్యుత్తు నగర్‌లోని మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. **- సరస్వతి**

పరిష్కారం: పారిశుద్ధ్య బాధ్యుడు జగన్‌కు చెప్పగా సిబ్బందితో కాలువను శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, రమణయ్యపేట

సమస్య: ఉప్పాడ పంచాయతీ పల్లిపేటలో వీధి కుళాయిలు సరిగా పనిచేయడం లేదు. బాగు చేయాలి. **- స్థానికులు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: కరప మండలం సిరిగలపల్లిలంకలోని దుర్గాదేవి ఆలయం వద్ద వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. **- శ్రీనివాస్**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరికి చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కరప

సమస్య: గొల్లప్రోలు పాపయ్య చావిడి వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

పరిష్కారం: పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: పిఠాపురంలోని సీతయ్యగారితోటలో మురుగు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనవస్తోంది. **- కిరణ్**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆయా ప్రాంతాల్లో పూడికతీత చేపట్టారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: పట్టణ పరిధిలోని రామారావుపేటలో కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **- నారాయణరావు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు చెప్పగా కార్మికులతో శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, పెద్దాపురం

రాశుల్లో ధాన్యం.. వర్షభయం

గొల్లప్రోలు, కొత్తపల్లి: దిత్వా తుపాను కారణంగా రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిసి నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలతో కోసి నూర్పిడి చేసిన ధాన్యాన్ని గొల్లప్రోలు శివారున రోడ్లపై, పొలాల్లోని కళ్లాలు, చెరువు, కాలువగట్లపై రాశులుగా పోసి బరకాలు కప్పి ఉంచారు. ప్రస్తుతానికి బరకాలపై నీరు నిలిచింది. పన దశలో ఉన్న పంటపై ఆందోళన నెలకొంది. కోయని పంట ఈదురుగాలులకు నేలవాలింది. గొల్లప్రోలు మండలంలోని గ్రామాల్లో ఏవో సత్యనారాయణ, సిబ్బంది మంగళవారం పర్యటించి రైతులకు సూచనలు చేశారు. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను దక్కించుకునేందుకు రైతులు ప్రయాస పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తడిచిపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

గొల్లప్రోలు శివారున వర్షానికి తడుస్తున్న రోడ్డుపై ధాన్యం రాశులు

తాళ్లరేవులో ఒబ్బిడి చేస్తున్న రైతులు

రైతులకు తప్పని అవస్థలు

తాళ్లరేవు: దిత్వా తుపాను ప్రభావంతో మంగళవారం రోజంతా హోరున వర్షం కురిసింది. చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు ధాన్యం రాశులను బరకాల కప్పి ఉంచారు. జార్జిపేటలో రెండు ఎకరాల వరి ధాన్యం తడిసి పోవడంతో ఒబ్బిడి చేసేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

కాలుష్యాన్ని అరికడదాం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎకో క్లబ్, రసాయనశాస్త్ర, వృక్షశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అధ్యక్షత వహించారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటనను స్మరించుకుంటూ, కాలుష్య నివారణ ప్రాముఖ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అధ్యాపకులు డా.ఎం.సులక్షణ, పి.లీనా, పావని తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో నినదిస్తున్న విద్యార్థులు

'ప్రజల బాగుకు ఆలోచించడం లేదు'

సర్పవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా సాగుతోందని, ప్రజల బాగుకు ఆలోచించడం లేదని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆరోపించారు. కాకినాడలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒక రోజు చేసే అప్పుతో ఒక్కొక్క వైద్య కళాశాల పూర్తవుతాయని పేర్కొన్నారు.

గ్రామీణంలో సారా విక్రయాలపై ఆగ్రహం

ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వరరావును ప్రశ్నిస్తున్న సభ్యులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గ్రామాల్లో సారా, బెల్టుషాపుల్లో మద్యం అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లప్రోలులో మండల సమావేశం మంగళవారం జరిగింది. ప్రత్యేకాధికారిణి, మెప్మా పీడీ ప్రియంవద పాల్గొన్నారు. ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతుండగా ఎంపీపీ అచ్చియమ్మ, ఉపసర్పంచి మణిబాబు తమ గ్రామంలో ఆరు బెల్టుషాపులున్నాయని, మరో రెండు ఇస్తే అందరికీ అందుబాటులో మద్యం దొరుకుతుందని ఎద్దేవా చేశారు. నెల రోజుల్లో తాము 26 కేసులు నమోదు చేశామని ఆయన వివరణ ఇచ్చారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఉప ఎంపీపీ మంగ, ఎంపీటీసీ సభ్యులు బాబ్జీ, శ్రీను తదితరులు ధ్వజమెత్తారు. ధాన్యం సేకరణలో దళారులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారని ఎంపీపీ ఆరోపించారు. మల్లవరంలో కేంద్రం ప్రారంభం కాలేదన్నారు. దుర్గాడలో తమకు తెలియకుండా రోడ్ల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారని ఉపసర్పంచి సూర్యచంద్ర, రీసర్వేలో పొరపాట్లపై బాబ్జీ పేర్కొన్నారు. చెరువునీటి కాలుష్యంపై ఉపసర్పంచి మణిబాబు చెప్పారు. ఎ.కె.మల్లవరం, ఎ.పి.మల్లవరంలలో సమస్యలు ప్రస్తావించారు. ఉప ఎంపీపీ ఆదివిష్ణు, ఎంపీడీవో సలాట్ రాజు, రామయ్యదొర పాల్గొన్నారు.

పల్లెసీమకు సౌర దీప్తి

గోకివాడలో ఏర్పాటు చేసిన దీపం

– న్యూస్‌టుడే, పిఠాపురం

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో సోలార్ వెలుగుల శోభ నెలకొంది. పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో ప్రత్యేకంగా పలు పంచాయతీలను ఎంపిక చేసి సెంటర్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్ అండ్ యాక్టివిటీస్(పుణె) స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో సర్వే చేసింది. కాస్త అభివృద్ధి చెందుతున్న పంచాయతీలను గుర్తించింది. గతంలో సర్పంచులతో సంస్థ తరపున సోలార్ దీపాల ఏర్పాటుకు అంగీకారం తీసుకున్నారు. దాంతో రెండు రోజులుగా సంస్థ సభ్యులు వచ్చి సోలార్ లైట్ల అమర్చుతున్నారు. ప్రధాన కూడళ్లు వెలుగులు సంతరించుకుంటున్నాయి.

నియోజకవర్గంలో వివరాలివి..

- పుణె సంస్థ సర్వే చేసిన పంచాయతీలు: 13
- పిఠాపురం మండలంలో..: బి.కొత్తూరు, గోకివాడ, జములపల్లి
- కొత్తపల్లి మండలంలో..: సుబ్బంపేట, యండపల్లి, అమరవల్లి, ఇసుకపల్లి, పొన్నాడ వాకతిప్ప, కుతుకుడుమిల్లి, గోర్స, కొమరగిరి
- ప్రస్తుతం దీపాలు ఏర్పాటు పూర్తయింది : గోకివాడ
- ఒక్కో గ్రామంలో పది దీపాలకు ఖర్చు: రూ.35 వేలు

సహకారం అందిస్తున్నాం..

గతంలో పంచాయతీల్లో సర్పంచి, ఇతర అధికారులతో పుణె సంస్థ సభ్యులు సమావేశం నిర్వహించారు. గ్రామాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంలో భాగంగా ఆ సంస్థ తొలుత సోలార్ దీపాలు మంజూరు చేసి అమర్చుతోంది. వారికి పంచాయతీల తరపున సహకారం అందిస్తున్నారు.

- జేవీఎస్ రామకృష్ణ, ఈవోపీఆర్డీ

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారిపై కోరింగ వద్ద మంగళవారం రాత్రి ఓ కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ వైపు నుంచి వస్తున్న కారు.. తాళ్లరేవు వైపు నుంచి కోరింగ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. పెద బొడ్డువెంకటాయపాలేనికి చెందిన ద్విచక్రవాహనదారుడు దండుప్రోలు బాబ్జీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతడిని తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించారు.

అక్రమ మద్యం కట్టడికి పర్యవేక్షణ

పిఠాపురం: అక్రమ, కల్తీ మద్యం కట్టడికి నిత్యం పర్యవేక్షిస్తున్నామని ఎక్సైజ్ సీఐ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరులో ముగ్గురిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. వారి నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

(c) eenadu

పెదమల్లాపురంలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గిరిజనులు

సానుకూల ప్రకటనతో క్షీరాభిషేకం

శంఖవరం: పెదమల్లాపురం మండల కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలం ఏర్పాటు, ఐటీడీఏలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఐటీడీఏ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పెదమల్లాపురం గిరిజనులు, మండల సాధన సమితి సభ్యులంతా కలిసి పెదమల్లాపురంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎంపీ, ఎమ్మెల్యే సత్యప్రభ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

భూసార పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ

శంఖవరం, న్యూస్‌టుడే: ఏపీ ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం వ్యవసాయాధికారి గాంధీ భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రాధాన్యత, మట్టి నమూనాల సేకరణ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆత్మ బీటీఎం బాబూరావు, ఏఈవో శ్రీనివాస్, సహాయకులు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలను సేకరిస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

ఉ. 10 - మ. 1

సమస్య: ఏ.కొత్తపల్లి ప్రధానరహదారి పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పందులు, కుక్కలు చేరి పాడు చేస్తున్నాయి. - విశ్వనాథం

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి చెత్తకుప్పలు తీయించి సమస్య పరిష్కరిస్తాం. - రాము, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మండలంలోని తిరుమాలి కాలనీలో రహదారి చెంతనే చెత్త వేస్తున్నారు. డ్రైనేజీ చెత్త రహదారిపై వేయిస్తున్నారు. - కిషన్, తిరుమాలి

సమాధానం: చెత్త తొలగింపునకు పంచాయతీ సిబ్బందికి ఆదేశిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులు చేయిస్తాం. - రామరాజు వర్మ, డిప్యూటీ ఎంపీడీవో

– న్యూస్‌టుడే, తొండంగి, ఏలేశ్వరం

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

భవిత వికసించాలి

▲ నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ప్రత్యేక అవసరాలతో పుట్టిన చిన్నారుల వికాసానికి భవిత కేంద్రాలు దోహదపడుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో ఆందోళన చెందకుండా భరోసా ఇస్తున్నాయి. మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో 25 మంది విభిన్న ప్రతిభావంతులకు సహిత విద్య అందుతోంది. ప్రత్తిపాడు, లంపకలోవ, ధర్మవరం, రాచపల్లిల నుంచి చిన్నారులు నిత్యం ఈ కేంద్రానికి వస్తుంటారు. వీరి సహజ సామర్థ్యాలను బట్టి బోధన సాగిస్తున్నారు. ఆటపాటలు, సాంకేతిక వనరుల సాయంతో పిల్లలను క్రియాశీలకంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి లోపం ఉన్న చిన్నారులు కీబోర్డు సాయంతో రాయగలిగే స్థాయికి తీసుకొచ్చారు. రాచపల్లికి చెందిన ఎస్.గంగాభవాని, లోకేశ్ తదితర చిన్నారులు కేంద్రానికి వచ్చాక సామర్థ్యాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. కేంద్రానికి తీసుకురాలేని చిన్నారుల ఇళ్లకే వెళ్లి బోధన చేస్తున్నారు. ఇలా 10 మంది చిన్నారులకు ఇంటివద్దే సహిత విద్య అందుతోందని ఉపాధ్యాయుడు కుమార్‌రాజా తెలిపారు.

వనరుల కొరత లేదు..: ప్రతి బుధవారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరం ద్వారా 15 మంది చిన్నారులకు సేవలు అందుతున్నాయి. విభిన్న ప్రతిభావంతులను సాధారణ పిల్లల మాదిరి తీర్చిదిద్దేందుకు వనరుల కొరత లేదని, అవసరమైన ఉపకరణాలు అందించేందుకు ఐఈఆర్‌టీ శివరాజు నిరంతరం కృషి చేస్తున్నారని ఎంఈవో రాజబాబు తెలిపారు.

ధర్మవరం భవిత కేంద్రంలో బాలలు

ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా కన్యాకుమారి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ మీసాల కన్యాకుమారి నియమితులయ్యారు. ఈమెను తూర్పుగోదావరి డీసీహెచ్‌ఎస్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో పాలనా పరమైన వ్యవహారాలపై ఐదేళ్ల వివాదాలు జరిగాయి. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త విచారణ చేసి వెళ్లారు. ఈక్రమంలో ఈ మార్పు జరిగింది.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ న్యాయవాదిగా దేవి

ఏలేశ్వరం: ఏలేశ్వరం నగర పంచాయతీ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ న్యాయవాదిగా ఆనసూరి దేవి నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. లింగంపర్తి గ్రామానికి చెందిన దేవి సీనియర్ న్యాయవాది. ఇప్పటికే ఆమె మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్‌గా పనిచేస్తూ ప్రజలకు మేలు చేసే పలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆమె మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

డిప్యూటీ ఎంపీడీవోగా చినవెంకాయమ్మ

శంఖవరం: శంఖవరం డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.చిన వెంకాయమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నుంచి పదోన్నతిపై వచ్చారు. మండలంలోని గ్రామ సచివాలయాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. సచివాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల్లో 'దిత్వా' తుపాను గుబులు

జగ్గంపేట గ్రామీణం: దిత్వా తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. జగ్గంపేట మండల పరిధిలో 10230 ఎకరాల్లో ఖరీఫ్‌సాగు చేపట్టగా ఇప్పటివరకు 7270 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని వ్యవసాయాధికారి నరసింహం అన్నారు.

మల్లేపల్లి జాతీయరహదారిపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

తుని గ్రామీణం, తొండంగి, గండేపల్లి: తుని నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతానికి కేవలం 10 శాతం మాత్రమే వరికోతలు పూర్తికావడంతో తుపాను పంటకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● తొండంగి మండలంలో 13 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 3 వేల ఎకరాల్లో మాత్రమే ఇప్పటి వరకు పంట ఒబ్బిడి అయ్యింది. ● మల్లేపల్లి జాతీయరహదారిపై ముసురుతో భయం, భయంగా ధాన్యాన్ని ఆరబెడుతున్నామని రైతులు వాపోతున్నారు.

తెదేపాలో వైకాపా నాయకుల చేరిక

యనమల సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

తుని గ్రామీణం: మండలంలోని తేటగుంట పార్టీ కార్యాలయంలో మంగళవారం తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో తెదేపాలోకి చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యనమల రాజేష్, దడాల సింహాచలం, నొక్కి సూరిబాబు, పులుగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మే ఆదర్శం

జగ్గంపేట గ్రామీణం: ఆకలిగొన్న వారందరికి కడుపునిండా భోజనం పెట్టి ఆకలితీర్చే డొక్కా సీతమ్మ అందరికీ ఆదర్శనీయమని భూపతి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ప్రతి మంగళవారం పాత పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో జనసైనికులు భోజనాలు వడ్డించారు.

ఉపన్యసించారు.. బహుమతులు సాధించారు

● 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని శ్రీరాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశం గురించి అనేక మంది పిల్లలు ఆసక్తిగా ఉపన్యాసం ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో దేవ రేవతి, దేశెట్టి ఆదిత్య, పిక్కి జాన్‌వెస్లీ వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని మట్టపర్తి లక్ష్మీ కుమారి, ఉపాధ్యాయులు భళ్లమూడి సత్యవతి, కందాళ కృష్ణకుమారి, చిక్కాల శ్రీనివాసు, కిల్లాడ రమేష్, తంగెళ్ల నూకరత్నం, ఆర్.శాంతి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు.

రాజా ఉన్నతపాఠశాలలో ఉపన్యాసం ఇస్తున్న విద్యార్థి

బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్న విజేతలు

ఎస్వీ జూనియర్ కళాశాలలో..

పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో 'కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కళాశాల అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. పోటీల్లో కె.అపూర్వ, ఎల్.శివ, కె.శివదుర్గ మొదటి మూడు స్థానాలు కైవశం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపకుడు పి.దేవుళ్లు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.

ఎస్వీ కళాశాలలో ఏఐపై ఉపన్యసిస్తున్న విద్యార్థిని

బహుమతులతో విజేతలైన విద్యార్థులు

కిర్లంపూడిలో ఉద్యమ్ ఆధార్ నమోదు

కిర్లంపూడి: మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పరిశ్రమల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఉద్యమ్ ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ డీపీఎం బాబూరావు, ఏపీఎం విజయలక్ష్మి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. సందీప్, వేదకుమారి, సీసీలు బుల్లియ్య, లోవరాజు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

తుని పట్టణం: ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జి.ఎఫ్ఎల్ఎన్ సర్వేను రాజమహేంద్రవరం డైట్ కళాశాల అధ్యాపకుడు ఎస్.రవికుమార్ పరిశీలించారు. వీరవరపుపేట, మెయిన్‌బజార్ ప్రాథమిక పాఠశాలల్లో సర్వే జరుగుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో పి.గీతాదేవి పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఏలేశ్వరంలో కొవ్వొత్తులు వెలిగించిన ఎమ్మెల్యే సత్యప్రభ, ఛైర్‌పర్సన్ సత్యవతి

ఏలేశ్వరం, తొండంగి: క్రీస్తు బోధనలు అనుసరణీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఏలేశ్వరంలోని జీసస్ మినిస్ట్రీస్ సెమీ క్రిస్టమస్, విజయ హాస్పిటల్ తొలి వార్షికోత్సవ వేడుకలు వైద్యులు సఖిరెడ్డి విజయబాబు, వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఎమ్మెల్యే సత్యప్రభ, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి తదితరులు కొవ్వొత్తులు వెలిగించి కేక్ కోసి సందడి చేశారు. కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి పాల్గొన్నారు. ● తొండంగి బ్లెస్సింగ్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ పావని ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా చిన్నారులు వేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పచ్చని చెట్లపై గొడ్డలివేటు

తొండంగి-ఒంటిమామిడి ప్రధాన రహదారి పక్కనే కిలోమీటరు పరిధిలో ఉన్న పచ్చని చెట్లను మంగళవారం నరికివేయడంతో పర్యావరణ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పెరిగిన చెట్లను తొలగించడమేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువవుతున్న నేపథ్యంలో చెట్లను పెంచాలని ప్రభుత్వం చెప్తుంటే ఉన్న చెట్లను తొలగించడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అంటున్నారు. – న్యూస్‌టుడే, తొండంగి

గుంత.. ఆదమరిస్తే ప్రమాదమే

జగ్గంపేట ప్రధాన రహదారిపై ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పడిన గుంత ప్రమాదాన్ని తలపిస్తుంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో ఏర్పడిన గుంత పెద్దదిగా మారడంతో వాహనచోదకులు బోల్తాపడుతున్నారు. బస్సులు బయటకు వచ్చే సమయంలో ఈ గుంతను తప్పించుకుని వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల గుంతలో మట్టివేయడంతో అదికాస్త వర్షానికి బురదగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, కాలినడకన వెళ్తున్న వారు అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

తుప్పు పట్టిపోతున్నాయ్

సచివాలయాల్లో చెత్త సేకరణ కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన పలు రకాల పరికరాలు నేడు మూలకు చేరి తుప్పుపట్టిపోతున్నాయి. గత అయిదేళ్లలో పంచాయతీలకు కనీసం నిధులు లేకపోవడంతో ఇవి వినియోగానికి నోచుకోక ఇలా మారాయి. మండలంలోని చేపూరు, తిమ్మాపురం, రేఖవానిపాలెం, డి.పోలవరం, దొండవాక అన్ని సచివాలయాల్లో పెద్ద ఎత్తున చెత్త సేకరణ పరికరాలు, బల్లలు మూలకు చేరాయి. వీటిని విక్రయిస్తే మరి కొన్నింటిని మరమ్మతులు చేపట్టవచ్చని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

వానరాల గుంపు.. ప్రయాణికుల బిక్కుబిక్కు..

జగ్గంపేట గ్రామీణం గుర్రంపాలెం రోడ్డులో పోలవరం కాలువ వంతెనపై వానరాలు నిత్యం గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. మండల కేంద్రం నుంచి సేకరించిన చెత్తను ఈ ప్రదేశంలో వేయడంతో తినుబండారాలు కోసం ఇక్కడే తిష్టవేస్తున్నాయి. వంతెనకు ఇరువైపులా ఉన్న గోడలపై కూర్చోవడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం కళాశాల, పాఠశాలకు సైకిల్, ద్విచక్రవాహనాలపై వెళ్లే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

శివాలయంలో సర్పం

రౌతులపూడి శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలోకి మంగళవారం ఓ సర్పం వచ్చింది. దీనిని భక్తులంతా ఆసక్తిగా తిలకించారు. ఆలయంలోని నందీశ్వరుని విగ్రహం వద్దకు వెళ్లి అనంతరం ధ్వజస్తంభం వద్దకు చేరుకుంది. విషయం తెలుసుకున్న భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఆలయ పరిసరాల్లో సర్పానికి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, రౌతులపూడి

ట్రాక్టర్ తొట్టె మీదపడి చోదకుడి మృతి

మంచిర్యాల: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తొట్టె మీదపడి పెద కాపు దరాకొండ(58) అనే ట్రాక్టర్ చోదకుడు మృతిచెందిన ఘటన సోమవారం అర్ధరాత్రి మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం గంగారం ఎక్స్‌రోడ్డు సమీపంలోని మామిడితోటలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుని మండలం కె-సీతయ్యపేటకు చెందిన దరాకొండ మామిడి చెట్లు కటింగ్ చేయడానికి చెన్నూరు ప్రాంతానికి వచ్చి అంగ్రాజ్‌పల్లిలో నివాసముంటున్నారు. వృత్తిలో భాగంగా గంగారం ఎక్స్‌రోడ్డులోని మామిడితోటలో చెట్లను కటింగ్ చేశారు. వాటిని ట్రాక్టర్‌లో లోడ్ చేసేందుకు వెనుకభాగంలో ఉన్న తొట్టెను లిఫ్ట్‌తో పైకి లేపగా అది మధ్యలోనే జామ్ అయింది. దానికి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చి దరాకొండపై పడటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

కత్తిపూడిలో ఉపాధ్యాయులకు ఆటలు పోటీలు

శంఖవరం: మండల స్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలు కత్తిపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగాయి. మహిళలకు త్రోబాల్, పురుషులకు క్రికెట్‌లో పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి ఎంఈవో ఎస్వీ రమణ బహుమతులు అందజేశారు.

భారీ అన్నసమారాధన

కిర్లంపూడి,: మండలంలోని రామచంద్రపురంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, శేఖర్, చందు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. తామరాడ, వీరవరం, గోనేడ, పాలెం, మర్లావ, వీరవరం, సోమరాయణంపేట, తదితర గ్రామాల నుంచి సుమారు 10వేల మంది భక్తులు హాజరయ్యారు. కార్యక్రమానికి రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), మాజీ మంత్రి తోట నరసింహం, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, తోట నవీన్, ఎంపీపీ తోట రవి, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

అభివృద్ధి పనుల ప్రారంభంపై హర్షం

రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెం- ఎన్.ఎన్.పట్నం వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల రహదారిని రూ.2.6 కోట్ల నిధులతో అభివృద్ధి పరిచేందుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఇటీవల భూమిపూజ చేశారు. ఆపనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. అప్పలనాయుడు, అల్లం ప్రసాద్, చిన్నబాబు, నాయుడు, ఎం.వరహాలబాబు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలకు తరలిరావాలి

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో ఈ నెల 20న భగత్ సింగ్, కామ్రేడ్ చారు మజుందార్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్నామని సీపీఎం ఎంఎల్ పార్టీ కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. సభకు శ్రేణులు తరలిరావాలన్నారు. కందుల కృప ప్రసాద్, దొమ్మేటి రాజులమ్మ, ఎం.నాగమణి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

అదుపుతప్పి చెట్లని ఢీకొన్న కళాశాల బస్సు

గండేపల్లి: కళాశాల బస్సు ప్రయాణిస్తుండగా స్టీరింగ్ రాడ్డు విరగడంతో అదుపు తప్పి చెట్లను ఢీకొట్టిన ఘటన గండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. సామర్లకోటకు చెందిన ఓ ప్రైవేట్ కళాశాల బస్సు మంగళవారం ఉదయం గండేపల్లి మండలంలోని యల్లమిల్లి, నాయకంపల్లి గ్రామాల్లోని విద్యార్థులను ఎక్కించుకుని వస్తోంది. పి.నాయకంపల్లి శివారునకు వచ్చేసరికి ఒక్కసారిగా స్టీరింగ్ కింద ఉండే రాడ్డు విరగడంతో బస్సు అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా పుంతవారగా వెళ్లి చెట్లను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 50 మంది విద్యార్థులు బస్సులు ఉన్నారని.. వీరిలో కొందరికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.

ఆత్మరక్షణలో బాలికలకు శిక్షణ

▲ ఆకతాయిలను ఎదుర్కొనేందుకు పాఠశాలల్లో కసరత్తు

రౌతులపూడి, తొండంగి, న్యూస్‌టుడే: అత్యవసర సమయంలో భయపడకుండా ధైర్యంగా ప్రతిస్పందించడం, దాడులను దీటుగా ఎదుర్కోవడం, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో బాలికలు రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ఆత్మరక్షణ శిక్షణ అమలవుతోంది. దిశ, నిర్భయ వంటి పలు చట్టాలు ఉన్నప్పటికీ బాలికలపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆత్మరక్షణ విద్య వారికి ఉపయోగకరంగా ఉండనుంది. తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూలోని మెళకువలు ఈశిక్షణ ద్వారా నేర్పిస్తున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేకంగా నియమించిన కోచ్‌లు శిక్షణ ఇస్తున్నారు.

నెలలో 20 రోజులు శిక్షణ

బాలికల్లో ధైర్యసాహసాలు పెంపొందించే లక్ష్యంతో ఆర్ఎంఎస్ఏ, ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు, తుని నియోజకవర్గంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈశిక్షణ అమలవుతోంది. రౌతులపూడి మండలంలో 580, తొండంగి మండలంలో 900, కోటనందూరు మండలంలో 600, శంఖవరం మండలంలో 700 మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ఆయా పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి, ప్లస్ టూ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ బాలికలు ఈశిక్షణ ద్వారా ప్రయోజనం పొందనున్నారు. నెలకు 20 రోజులు ఈశిక్షణ నిర్వహిస్తారు. ప్రతిరోజూ 45 నిమిషాల పాటు కోచ్ ఆత్మరక్షణ పాఠాలు తెలియజేస్తున్నారు.

రౌతులపూడి పాఠశాలలో శిక్షణ పొందుతున్న బాలికలు

నన్ను నేను రక్షించుకోగలను

పాఠశాలలో నేర్చుకున్న ఆత్మరక్షణ విద్యతో నన్ను నేను రక్షించుకోగలను. గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సమయంలో ఏవిధంగా స్పందించాలో వివిధ పంచ్‌ల ద్వారా నేర్చుకున్నాను. బంగారం, నగదు దొంగిలించే సమయంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించడం తెలుసుకున్నాను.

- బి.అలేఖ్య, పదో తరగతి, విద్యార్థిని, గిడజాం

మానసికోల్లాసం అలవడుతుంది..

ఆకతాయిల ఆగడాలు, బ్యాడ్ టచ్ వంటి ఆపద సమయాల్లో ఇతరులను రక్షించగలిగేలా శిక్షణ పొందాను. శిక్షణతో మానసికోల్లాసం అలవడుతుంది. ఎటువంటి ఖర్చు లేకుండా ఆత్మరక్షణ విద్యను ఉచితంగా నేర్చుకోవడం ఆనందంగా ఉంది.

- పర్వీన్, పదో తరగతి విద్యార్థిని, రౌతులపూడి

పంచ్‌ల ద్వారా విద్యార్థులకు రక్షణ..

పులి పంజా, స్నేక్ పంజా, ట్రిబుల్ లెవల్ పంచ్, షూటో, హేమర్ పంచ్, డిఫెన్స్ బ్లాక్‌ల ద్వారా ఆత్మరక్షణకు సంబంధించిన శిక్షణ ఇస్తున్నాం. రౌతులపూడి, ఎస్.అగ్రహారం, లచ్చిరెడ్డిపాలెం, బలరాంపురం, ములగపూడి, పారుపాక తదితర పాఠశాలల్లో బాలికలకు శిక్షణ ఇస్తున్నాను.

- మణికుమార్, తైక్వాండో కోచ్, అన్నవరం

ఆదర్శమూర్తికి
అశ్రునివాళి

మీరు భౌతికంగా మా మధ్య లేకపోయినా మీ జ్ఞాపకాలు, మీతో గడిపిన క్షణాలు ఎల్లప్పుడూ మా వెన్నంటే ఉంటాయి. మీరు లేనిలోటు తీర్చలేనిది. మీ ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

స్వర్గీయ శ్రీ జల్లు నాగేశ్వరరావు గారు
తుని
జననం: 09-10-1961 మరణం: 20-11-2025

భార్య: చింతా మేరీగ్రేస్
కుమార్తెలు: శ్రీమతి జల్లు శిరీష, శ్రీమతి జల్లు స్పందన, కుమారి జల్లు స్నేహ
అల్లుళ్లు: బండి వేణుగోపాలరావు, రావి శ్రీకాంత్
మనుమలు: బండి ఇషాన్ అఖిల్, రావి దిషాన్
మనుమరాండ్రు: బండి హనీషా, రావి ఇషిక
తమ్ముడు: జల్లు నాగవెంకట సత్యశ్రీను మరదలు: బండి కృష్ణతులసి అక్క: కూరపాటి జ్యోతి
కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

పెదకార్యం: ది.03-12-2025 బుధవారం తుని, గెడ్లబీడు అతిథి ఫంక్షన్ హాల్ నందు జరుపబడును. సెల్: 80082 85459

ఈనాడు
కర్నూలు
బుధవారం డిసెంబరు 3, 2025 5

కళ్ల ముందే నీరు.. పంటకు అందక కన్నీరు

కర్నూలు గ్రామీణ మండలం గార్గేయపురం మీదుగా వెళ్లే హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నీటిని పంటలకు పెట్టుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రబీలో పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. కాలువ ఆనుకునే చేలున్నా.. పంటలకు నీరందని దుస్థితి. ఈ నేపథ్యంలో పైపులు ఏర్పాటుచేసుకుని నీటిని తరలిస్తున్నారు. – ఈనాడు, కర్నూలు

అలారుదిన్నెకు ఇలా రావద్దు

దేవనకొండ మండలంలోని అలారుదిన్నె వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హంద్రీ వాగుపై అలారుదిన్నె వంతెనను బ్రిటిష్ కాలంలో నిర్మించారు. 85 ఏళ్లు పూర్తయింది. రక్షణ గోడలు కూలిపోయాయి. వంతెనపై దారంతా చెదిరిపోయి, గుంతలమయంగా మారింది. నేటికీ ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన దెబ్బతిందని, పక్కనే మరో వంతెన నిర్మించాలని బళ్లారి, కర్నూలు జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రాకపోకలు నిలిపివేశారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, దేవనకొండ, ఆస్పరి

విధిని ఎదిరించి.. విజయాన్ని ఆస్వాదించి

వీల్‌ఛైర్‌లో నుంచే బౌలింగ్ చేస్తూ..

నంద్యాల పట్టణంలోని ముల్లాన్‌పేటకు చెందిన ఫకృద్దీన్ చిన్నప్పుడే పోలియో బారిన పడ్డారు.. నడవలేనని కుంగిపోలేదు.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగారు.. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నారు. వీల్‌ఛైర్‌లో కూర్చొనే బ్యాటింగ్, బౌలింగ్ చేస్తారు. 2018లో ఆంధ్రప్రదేశ్ జట్టులో సభ్యుడిగా స్థానం సంపాదించారు. రైట్‌హ్యాండ్ బ్యాటర్‌గా రాణించడమే కాక బౌలర్‌గానూ ప్రతిభ చాటి ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2022లో సౌత్‌జోన్ జట్టులో స్థానం సాధించి ఉత్తమ క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది తమిళనాడులో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొని బౌలింగ్‌లో ప్రతిభ చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్వాలియర్‌లో జరిగిన 4వ జాతీయ స్థాయి వీల్‌ఛైర్ క్రికెట్ కప్ పోటీల్లో రాణించి బహుమతులు అందుకున్నారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు బెంగళూరులో జరిగే ఏఎస్ఏల్ కప్పులో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ఎంబీఏ వరకు చదివిన అతను బండిఆత్మకూరు తహసీల్దారు కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

పెద్దల గుప్పిట్లో పేదల పట్టాలు

నిఘా నేత్రం

ఆదోని పట్టణంలో పేదల ఇంటి స్థలాల పట్టాలపై పెద్దలు పెత్తనం చేస్తున్నారు. వాటిని మరొకరికి కట్టబెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి వెనుక భాగంలో సర్వే నంబరు 211ఏ, 212బి1లో, నీలో ఒకరికి కేటాయించిన ఇంటి స్థలంలో ఇద్దరు అక్రమ పట్టా పొందారు. సదరు వ్యక్తి రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా ఒకటి రెండు కాదు.. వందల సంఖ్యలో బాధితులు తమ గోడు వెళ్లబోసుకొంటున్నారు. పది స్థలాలకు రూ. 30 లక్షలు, వంద స్థలాలకు రూ. మూడు కోట్ల వరకు బేరం పెట్టారు. పేదలు పట్టాలు అడిగితే.. రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

శిరుగుప్ప జాతీయ రహదారి ఆనుకుని ఉన్న పేదల ఇళ్ల స్థలాలు

"హమాలీగా పనిచేస్తున్నా. శిరుగుప్ప రహదారిలో ఇంటి స్థలం మంజూరు చేశారు. పట్టా ఇవ్వలేదు.. ఎవరిని అడగాలో తెలియడం లేదు.. పట్టా లేకపోవడంతో సొంతిల్లు నిర్మించుకోలేకపోతున్నాం.. ఇప్పటికే పట్టా మంజూరైందని మరో పథకం కింద ఇల్లు ఇవ్వడం లేదని" శారద ఆందోళన వ్యక్తం చేశారు.

"నేను మిద్దె కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నా.. నెలకు రూ.2,500 చెల్లిస్తున్నా. 2008లో ఇంటి స్థలం కేటాయించారు.. అప్పట్లో ఇచ్చిన స్థలం అన్యాక్రాంతమైంది. ఇప్పటి వరకు పట్టా ఇవ్వలేదు. డీడీ వివరాలూ ఉన్నాయి.. వాటిని తీసుకొని అధికారుల వద్దకు వెళ్తే.. ఎవరూ సమాధానం చెప్పడం లేదని" పద్మ పేర్కొన్నారు.

మూడొందల ఎకరాలు సేకరణ

- ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని శిరుగుప్ప జాతీయ రహదారి ప్రాంతంలో 120 ఎకరాలు, ఈఎస్ఐ ఆసుపత్రి వెనుక భాగంలో 80-90 ఎకరాలను పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించారు.
- ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇచ్చేలా ప్లాట్లు వేశారు. స్థలాల కోసం పేదలు రూ.2,100 డీడీ చెల్లించారు. 2004-09లో కొందరికి పట్టాలు ఇచ్చి.. మరికొందరికి ఇవ్వలేదు. ఆ పట్టాలను నేతలు తమ వద్దే ఉంచుకున్నారు. గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రెండు చోట్ల ఇళ్ల నిర్మాణానికి పునాదులు వేశారు. తర్వాత తలెత్తిన రాజకీయ కారణాల నేపథ్యంలో నిర్మాణం ఆగిపోయింది.
- 2014లో అధికారంలోకి వచ్చిన తెదేపా ప్రభుత్వం ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంతంలో మిగిలిన భూమిలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు వంద ఎకరాలు తీసుకొంది. ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు కోల్పోయిన కొందరు లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు కేటాయించారు.

గుట్టుగా పేరు మార్పిడి

- టిడ్కో ఇళ్ల ముందు భాగంలోని ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు శిరుగుప్ప రహదారికి ఆనుకుని ఉన్నాయి. ఈఎస్ఐ ఆస్పత్రి వెనుక భాగంలో 167వ జాతీయ రహదారి ఏర్పాటు కావడం, డీఎస్పీ బంగ్లా మీదుగా బైపాస్ వంతెన మంజూరవడంతో స్థలాలకు విలువ పెరిగింది.
- సెంటు రూ.3-4 లక్షలు పలుకుతోంది. 'ఖాళీ' స్థలాలపై నేతలు కన్నేశారు. ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనతో 'పట్టాల' దుమ్ము దులుపుతున్నారు.
- రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని పేర్లు మార్పిస్తున్నారు. ఇందుకు రెవెన్యూ సిబ్బందికి రూ.20 వేల వరకు ఇస్తున్నారు. దళారుల గుంపు నిత్యం ఆదోని తహసీల్దార్ కార్యాలయంలో తిష్ట వేసి పని కానిచ్చేస్తోంది.

ఫిర్యాదుల వెల్లువ

- తమకు పట్టాలు ఇప్పించాలని జనసేన ఓ కాలనీకి చెందిన కొందరు ఎమ్మెల్యే ప్రజాదర్బారుకు వచ్చారు. విషయంపై ఆరా తీస్తే.. వార్డులో 120 మంది దరఖాస్తు చేసుకున్నారు. 40 మందికి పట్టాలు వచ్చాయి.. అందులో 12 మందికే పంపిణీ చేసి మిగిలినవి సదరు వార్డు నాయకుడి ఇంట్లో ఉన్నట్లు తేలింది.

పెద్దలు జైకిసాన్ పిల్లలు జైజవాన్

దేశమే తమ ఊరుగా.. సరిహద్దే ఇల్లుగా.. చెట్టూ చేమలే చుట్టాలుగా.. దేశ రక్షణే తమ లక్ష్యంగా కోవెలకుంట్ల మండలం బిజినవేముల యువతరం ముందుకు నడుస్తోంది. పెద్దలు జైకిసాన్ అంటే వారి పిల్లలు జైజవాన్ అంటున్నారు..

"డిగ్రీ వరకు చదివి వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. మా గ్రామానికి చెందిన పలువురు సైన్యంలో పని చేస్తున్నారు. వారు సెలవుల్లో సొంతూరుకొచ్చి యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు.. వారిచ్చిన మెలకువలతో నేను ఏడేళ్ల కిందట సైన్యంలో చేరా. ప్రస్తుతం లాన్స్ నాయక్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్నా" అని నాగేశ్వరరెడ్డి చెప్పారు.

కుటుంబాలు	విధుల్లో సైనికులు	విశ్రాంత సైనికులు	ఇతర ఉద్యోగాల్లో
650	60	102	342

- 45 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన సంజీవరాయుడు సైన్యంలో చేరారు. ఆయన స్ఫూర్తితో మిగిలిన ఇద్దరు సోదరులు చేరి సేవలందించారు. ఆ తర్వాత గ్రామంలో ఒకరిని చూసి ఒకరు సైన్యంలో చేరిపోయారు. యువకులు విశ్రాంత జవాన్ల సూచనలు, సలహాలు తీసుకొని విజయకేతనం ఎగురవేస్తున్నారు. సీనియర్లు యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు ఇస్తున్నారు.. పరుగు, వ్యాయామం, ఎంపిక విధానం, రాత పరీక్ష తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. "సీనియర్లను ఆదర్శంగా తీసుకొని 2004లో సైన్యంలో చేరా. జమ్మూకశ్మీర్, సిక్కిం, దిల్లీ తదితర ప్రాంతాల్లో 17 ఏళ్లపాటు సేవలందించి 2021లో ఉద్యోగ విరమణ చేశా. ప్రస్తుతం హైదరాబాద్‌లో పీఎఫ్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్నా" అని హబీబుల్లా తెలిపారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

పక్షులు చెక్కిన కళాకృతి

వందలాది పక్షులు ఒకేసారి గుంపుగా ఎగిరితే.. ఓ అద్భుత కళాకృతి ఆవిష్కృతమవుతుంది. ఇలాంటి చిత్రమే పగిడ్యాల మండలం ముచ్చుమర్రి శివారులో కనిపించింది. పంట పొలాలపై వందలాది గోరింకల గుంపు ఎగురుతూ కనిపించిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. – ఈనాడు, నంద్యాల

ఇనుప ఖనిజం ఖద్దరు పెత్తనం

■ నేతల మధ్య ఐరన్ వార్

వెల్దుర్తి, న్యూస్‌టుడే : అక్రమంగా తవ్వకాలు చేపట్టిన ఖనిజాన్ని సక్రమం చేసేందుకు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. డోన్ నియోజకవర్గం నుంచి వస్తున్న సరకును పత్తికొండ నియోజకవర్గంలోని లీజు మైన్స్‌కు తరలించడంపై రెండు నియోజకవర్గాల నేతల మధ్య ఐరన్‌వార్ తలెత్తింది. వారి కారణంగా లీజు గనుల నిర్వాహకుడు ఇబ్బందులకు గురవుతున్నారు. సరకు తీసుకోకుంటే ఒకరి నుంచి సమస్య.. లేదంటే మరో నేత నుంచి బెదిరింపులు తప్పడం లేదని లీజుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామళ్లకోటలో నిల్వ ఉంచిన ఇనుప ఖనిజం

అనుమతి లేకుండానే..

వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి ప్రాంతంలో అనుమతులు లేకనే ఇనుప ఖనిజంతోపాటు సిలికా శాండ్, పచ్చసుద్ద తవ్వకాలు సాగుతున్నాయి. బేతంచెర్ల మండలంలోని ముద్దవరం, పెండేకల్లు, గూటుపల్లి ప్రాంతాల్లోనూ తవ్వకాలు చేపట్టారు. ఒక్కో టిప్పరులో 12 టన్నుల చొప్పున వారంలో 20 టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. జిల్లా సరిహద్దులు దాటించి మరో జిల్లాకు సంబంధించిన లీజు మైన్స్‌కు తరలిస్తున్నారు. నేతల ప్రమేయం ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. "వెల్దుర్తి మండలంలోని లీజు మైన్స్‌లో తవ్వకాలు చేపట్టి సరకు తరలిస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. మైన్స్‌లోని సరకు నమూనాలు సేకరించాం. పరిశీలించి చర్యలు తీసుకుంటామని" గనుల శాఖాధికారి రామ్‌చందర్ పేర్కొన్నారు.

అక్కడ తవ్వి.. ఇక్కడ నిల్వ చేసి

- వెల్దుర్తి, బేతంచెర్ల, డోన్ మండలాల్లో ఇనుప ఖనిజం నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. తవ్వకానికి లీజుకు తీసుకొన్న భూముల్లో నిక్షేపాలు తక్కువగా ఉండటం.. నాణ్యత అంతగా లేకపోవడంతో అక్రమ తవ్వకాలకు తెరతీశారు. నిక్షేపాలు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో తవ్వకాలు సాగిస్తున్నారు.
- తవ్విన ఇనుప ఖనిజాన్ని వెల్దుర్తి మండలం రామళ్లకోటలోని లీజు అనుమతులు ఉన్న మైన్స్‌కు రాత్రికిరాత్రే తరలిస్తున్నారు. లీజు మైన్స్‌దారుడిని బెదిరించి బిల్లులు పొందుతున్నారు. లీజు మైన్స్‌లో తవ్విన ఇనుప ఖనిజం గ్రేడ్‌ను.. సరకు గ్రేడ్‌ను అధికారులు సరి చూడాలి. వ్యత్యాసముంటే రాయల్టీలు అందించకూడదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఈ నిబంధనలేవీ అమలుకావడం లేదు.

మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు రేపు

మీ కోసం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఈనెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి మంగళవారం తెలిపారు. 30 ఏళ్ల పైబడిన వారు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివిధ ఏజ్ గ్రూపుల ప్రకారం స్త్రీ, పురుష అథ్లెట్లను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన మాస్టర్ అథ్లెట్లు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 7989328018 నంబరును సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీలోపు ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తు పత్రంతో పాటు విద్యార్హత పత్రాలు సమర్పించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లు 153, ఎస్జీటీ ఖాళీలు 13 భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. వీరు ఐదు నెలల పాటు ప్రభుత్వ బడుల్లో పాఠాలు బోధించాల్సి ఉంటుందన్నారు. ఎస్జీటీకి రూ.10 వేలు, స్కూల్ అసిస్టెంట్‌కు రూ.12,500 గౌరవ వేతనం వస్తుందన్నారు.

అధిక సంపత్తి

- లాభాలు తెచ్చిన ప్రయోగాత్మక సాగు

జిల్లాకు చెందిన పలువురు రైతులు పత్తి అధిక సాంద్రత పద్ధతిని ప్రయోగాత్మకంగా సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ (నాగ్‌పుర్) సహకారంతో అధిక సాంద్రత పత్తి విధానాన్ని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం రెండేళ్లుగా ప్రయోగాత్మకంగా సాగు చేసింది. జాతీయ పత్తి పరిశోధన సంస్థ సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తోంది. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

1,250 ఎకరాల్లో

సంప్రదాయ, అధిక సాంద్రత పద్ధతికి ఒకటే పెట్టుబడి అవుతుంది. అధిక సాంద్రత పద్ధతిలో పంట కాలం స్వల్పంగా ఉంటుంది. గతేడాది 50 ఎకరాలు, ఈసారి 1,250 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేశారు. రెండేళ్లు అధిక దిగుబడి సాధించారు. ఎదుగుదల నియంత్రణ మందు 45, 60 రోజుల దశలో మెపిక్వాట్ క్లోరైడ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే కొమ్మలు అధికంగా వచ్చి కాపు బాగా కాస్తుంది.

సంప్రదాయ పద్ధతి	(ఎకరాకు)	అధిక సాంద్రత పద్ధతి
7–8 క్వింటాళ్ల దిగుబడి		13 నుంచి 15 క్వింటాళ్లు
ఎకరాకు 7–8 వేల మొక్కలు		25–29 వేల మొక్కలు
పంట కాలం.. 150–160 రోజులు		130–140 రోజులు
మూడు తీతలు.. మూడు విడతలు		రెండు తీతల్లో పత్తి పంట పూర్తి.
		కూలీ ఖర్చు ఎకరాకు రూ.3–4 వేలు తగ్గుతుంది.

రూ.1.35 లక్షల ఆదాయం లభించింది

- వెంకటేశ్వర్లు, హనుమాపురం

రెండెకరాల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టా. ఎకరాకు రూ.30 వేల చొప్పున రూ.60 వేలు ఖర్చు చేశా. ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున మొత్తం 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.6,500కు విక్రయించా. పంటంతా అమ్మగా రూ.1.95 లక్షలు చేతికందింది. పెట్టుబడి పోనూ రూ.1.35 లక్షలు మిగిలింది. బోరు కింద వేసినప్పటికీ కేవలం పంటంతా కలిపి ఒక తడి మాత్రమే అందించా.

అలక్షమా.. అక్రమాలకు సాక్ష్యమా

- 1.02 లక్షల స్మార్ట్ రేషన్‌కార్డులు వెనక్కి

చౌక ధరల దుకాణాల ద్వారా సరకుల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబరులో ఉమ్మడి జిల్లాకు 12.10 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపారు. రెండు నెలలకు పైగా గడిచిపోయినా ఇప్పటికీ పంపిణీకి నోచుకోని స్మార్ట్ కార్డులు లక్షకు పైగా ఉండటం గమనార్హం. దీంతో పంపిణీకి నోచుకోని కార్డులను సరెండర్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

వారంతా ఏమయ్యారు..?

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12.01 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు ఉండగా.. చౌక దుకాణాల డీలర్ల ద్వారా గత రెండు నెలల్లో 3,40,787 కార్డులను పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 7,58,183 మందికి కార్డులను అందజేశారు. ఇంకా 1,02,544 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి నోచుకోలేదు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు ఉన్నారా లేరా.. ఉంటే ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. దీంతో ఈ కార్డులు చౌకదుకాణాల డీలర్ల వద్ద, సచివాలయాల్లోనే ఉండిపోయాయి.
- వీటి పంపిణీకి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు నవంబరు 30 వరకు గడువు ఇచ్చింది. కార్డుల పంపిణీ ఎందుకు జరగలేదో కారణాలు పేర్కొంటూ వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గడువు ముగిసిన నేపథ్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను సరెండర్ చేసేందుకు పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అడ్డగోలు మ్యాపింగ్‌తో చిక్కులు

- గత వైకాపా ప్రభుత్వంలో వాలంటీర్ల ద్వారా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. వారు ఇష్టానుసారం చేయడంతో పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. ఒక ప్రాంతంలోని లబ్ధిదారుల కార్డులో మరో ప్రాంతంలోని చౌకదుకాణం పరిధిలో చూపారు. దీంతో తమ కార్డు ఎక్కడుందో లబ్ధిదారులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా పలువురు స్మార్ట్‌కార్డులు వచ్చినా తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది.
- మరణించిన కుటుంబ సభ్యుల పేర్లను కార్డుల నుంచి తొలగించలేదు. మ్యాపింగ్ కూడా సరిగా చేయలేదు. ఈ తప్పులను సరిదిద్దకుండానే సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి జాబితా పంపించడంతో హడావుడిగా కొత్తకార్డులు ఇచ్చేశారు. కొన్ని ప్రాంతాల్లో కుటుంబానికి రెండుమూడు, మృతుల పేరుతోనూ కార్డులు ఇచ్చేసిన దాఖలాలున్నాయి. అప్పట్లో రేషన్ పంపిణీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.
- కూటమి ప్రభుత్వం కూడా అదే జాబితాను అనుసరించడంతో పెద్దసంఖ్యలో కార్డులు మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు మిగిలిపోయిన కార్డులు సాక్ష్యంగా నిలుస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చావురస్తా

- ఇసుక టిప్పర్ ఢీ
- ఇద్దరు యువకుల దుర్మరణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు నగరం సంతోష్ నగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమతల చంద్రమోహన్ (29), జి.సుమన్ (30) మృతి చెందారు. మాల నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గూడూరుకు చెందిన చంద్రమోహన్ పాలిష్‌బండల పనిచేసేవారు. ఇతనికి వివాహమైంది. ఇతని బంధువు, స్నేహితుడైన ఇందిరాగాంధీనగర్‌కు చెందిన జి.సుమన్ అమీలియో ఆసుపత్రిలో పనిచేసేవారు. ఇతనికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. చంద్రమోహన్ మేనత్త కుమారుడైన నవీన్ ఎమ్మిగనూరులో నివసించేవారు. రెండు రోజుల కిందట అతను కుటుంబ సభ్యులతో కలిసి గూడూరులోని చంద్రమోహన్ ఇంటికి వచ్చారు. మంగళవారం మధ్యాహ్నం చంద్రమోహన్, నవీన్‌లు కలిసి కర్నూలుకు వచ్చి సుమన్‌ను కలిశారు. ముగ్గురూ పల్సర్ వాహనంపై హైదరాబాద్‌వైపు నుంచి కర్నూలుకు బయలుదేరారు. సంతోష్ నగర్ వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ వీరిని ఢీకొట్టింది. కిందపడిన సుమన్ తలపై టిప్పర్ వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన చంద్రమోహన్ కూడా అక్కడే ప్రాణాలు వదిలారు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను హైవే గస్తీ పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వల్ల ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోవడంతో మృతదేహాలను ఆసుపత్రికి తరలించి రాకపోకలను పునరుద్ధరించారు. టిప్పర్ డ్రైవర్ వాహనం వదిలి పరారయ్యాడు. చంద్రమోహన్ అన్న చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సుమన్ చంద్రమోహన్ (పాత చిత్రాలు)

శివోహం

శ్రీశైల మహాక్షేత్రంలో శివ దీక్షా భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈనెల 5వ తేదీ వరకు జ్యోతిర్ముడి కలిగిన శివ దీక్షా భక్తులకు దేవస్థానం అధికారులు స్పర్శ దర్శనం కల్పించనున్నారు.

–న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

కర్నూలు ఎంపీపీ పీఠంపై తెదేపా జెండా

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు మండల ఎంపీపీ, ఉల్చాల ఎంపీటీసీ సభ్యురాలు డి.వెంకటేశ్వరమ్మపై ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఎంపీపీ మండల నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, తోటి ఎంపీటీసీ సభ్యులను లెక్కచెయ్యకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆమెను పదవి నుంచి తొలగించి మండల అభివృద్ధికి సహకరించాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు గత నెల 7వ తేదీన ఎంపీపీ వెంకటేశ్వరమ్మపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్‌ను కలిసి ఫారం-2ను అందజేశారు. వారి అభ్యర్థన మేరకు ఆర్డీవో మండల పరిధిలోని 19 మంది ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేసి అందరూ తప్పక హాజరుకావాలని సూచించారు. కర్నూలు జిల్లా పరిషత్‌లోని మండల సమావేశ భవనంలో ఆర్డీవో అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, ఆమె తరఫు ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. అవిశ్వాసానికి అభ్యర్థించిన 13 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరై తీర్మానాన్ని నెగ్గించుకున్నట్లు ఆర్డీవో సందీప్‌కుమార్ ప్రకటించారు.

మాట్లాడుతున్న కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

అమ్మాయిలకు ఆరు కోర్సులు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు ఇతర నైపుణ్యాలు ఉండాల్సిందే.. దీన్ని దృష్టిలో పెట్టుకొని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని అమ్మాయిలకు వృత్తి విద్య పాఠాలు బోధిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 కేజీబీవీలు ఉన్నాయి. వృత్తి విద్యపై ఆసక్తి ఉన్న 9, 10, ఇంటర్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. త్వరలో ఆరో తరగతి నుంచే శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

సాగులో మెలకువలు నేర్చుకుంటూ..

- బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సు పూర్తి చేస్తే బ్యూటీ పార్లర్లు ఏర్పాటుచేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు. ప్రభుత్వం ప్రకటన ఇచ్చిన సమయంలో దరఖాస్తు చేసుకుంటే బాలికల పాఠశాలల్లో బ్యూటీషియన్ ట్రైనీగా ఉద్యోగం పొందే అవకాశం ఉంటుంది.
- అపెరల్‌లో భాగంగా ముత్యాలు, పగడాలు వంటి హారాల తయారీలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఈ కోర్సు స్వయం ఉపాధికి దోహదపడుతుంది.
- ఐటీ-ఐటీ సెల్ కోర్సు పూర్తి చేసినవారు ప్రైవేటు సంస్థల్లో మంచి ఉద్యోగాలు సాధించొచ్చు.
- ఎలక్ట్రికల్‌కు సంబంధించి పలు మెలకువలు నేర్పిస్తున్నారు. స్వయం ఉపాధి పొందడానికి వీలుంటుంది.
- ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సు పూర్తి చేసినవారు ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చదివితే ఆహార నియంత్రణ శాఖలో ప్రభుత్వ కొలువులు సాధించేందుకు వీలుంది. సొంతంగా హోటల్ నిర్వహణ ద్వారా పలువురికి ఉపాధి చూపొచ్చు.
- ఏ పంటతో ఎలాంటి రాబడి సాధించొచ్చు.. తెగుళ్లు తట్టుకునే రకాలు తదితర వాటిని 'సాగు'లో భాగంగా వివరిస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయిస్తారు. అగ్రికల్చర్ డిగ్రీ పూర్తైన తర్వాత వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశాలు ఏర్పడుతాయి.

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : 03.12.2025.
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

మహానందీశునికి నిత్యకల్యాణ సేవ

అలంకరణలో దేవతామూర్తులు

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలో దేవస్థానం ఆధ్వర్యంలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిత్యకల్యాణ సేవ నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మాంగల్యధారణ, మహా మంగళ హారతుల కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అహోబిలంలో కైశిక ద్వాదశి పురాణ పఠనం

కైశిక పురాణ పఠనం చేస్తున్న ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: కైశిక ద్వాదశి సందర్భంగా అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధనలు చేశారు. గర్భగుడి మండపంలో అర్చకులు కైశిక పురాణం పఠించి శ్లోకాలను వివరించారు. అనంతరం ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్‌కు అర్చకులు బహుమానం సమర్పించి మఠానికి తీసుకువచ్చారు.

వైభవంగా ప్రహ్లాదరాయల స్వర్ణ రథోత్సవం

శ్రీమఠం ప్రాకారంలో స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం మఠం ప్రాకారంలో ప్రహ్లాదరాయల విగ్రహాన్ని కొయ్య, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి అర్చకులు హారతి ఇచ్చారు. మేళతాళాల మధ్య శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. సహాయ పీఆర్వో వ్యాసరాజాచార్, మఠం అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ద్వాదశి పురస్కరించుకుని శ్రీమఠంలో ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర మఠంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు, నవరత్న కవచాలు, విశేష పూలతో అలంకరించి మూల బృందావనానికి హారతి ఇచ్చారు.

చరవాణికి దూరంగా ఉంటేనే ఉజ్వల భవిత

చిప్పగిరి: విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సిరి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఉత్తమ భవిష్యత్తు కావాలంటే విద్యార్థులు టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ.సిరి సూచించారు. చిప్పగిరి మండలంలో మంగళవారం పర్యటించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆమె మాట్లాడారు. టీవీలు, చరవాణుల్లో ఉపయోగ పడే మంచి విషయాలు ఉంటాయి. అరగంటకు మించి సమయం కేటాయించరాదన్నారు. పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆమె కోరారు. ఆలూరు నియోజకవర్గంలోని పాఠశాల ప్రహరీలు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చిప్పగిరిలోని పీహెచ్‌సీని పరిశీలించి వైద్యసేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్‌పాల్, తహసీల్దారు ఇజాజ్ అహమ్మద్, ఎంపీడీవో అల్లాబకాష్, ఎంఈవోలు సావిత్రమ్మ, ఎండీ ఫరూక్, హెచ్‌ఎం లతీఫ్, డాక్టరు అఫ్రోజ్ జహాన్, ఏఈలు సోమప్ప, వెంకటరమణి, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు- బళ్లారి రోడ్డును ఎన్‌హెచ్‌గా మార్చండి

కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి టీజీ భరత్, చిత్రంలో ఎంపీ నాగరాజు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు- బళ్లారి రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. దిల్లీలో మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి కేంద్ర మంత్రిని కలిసినట్లు ఆయన వెల్లడించారు. రవాణా, భద్రత విషయాలపై చర్చించినట్లు వివరించారు. ఇటీవల జరిగిన పలు బస్సు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రమాద నివారణకు ప్రయాణికుల బస్సు భద్రత చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంక్ సర్కిల్ నుంచి పెద్దటేకూరు వరకు పెండింగ్‌లో ఉన్న హైవే లైటింగ్ గురించి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లా.. ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉందని ఆయన తెలిపారన్నారు.

30 క్వింటాళ్ల పత్తి దగ్ధం

హొళగుంద, న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆ రైతు ఇంటిముందే కాలిబూడిదైన ఘటన లింగంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాల సిద్దప్ప అనే రైతు తేమగా ఉన్న పత్తిని ఇంటి ఆవరణలో ఆరబెట్టారు. ఆరిన తర్వాత క్షిపణికి తరలిద్దామని అనుకున్నారు. ఈ క్రమంలోనే అనుకోకుండా పత్తికి మంటలు వ్యాపించాయి. మంటలు అదుపు చేయలేని పరిస్థితి. ఈ ఘటనలో దాదాపు 30 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోయింది. వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు విన్నవించారు.

నాయకుడిగా ఎదిగి.. దేశభక్తి పెరిగి

◆ ఎన్‌సీసీలో రాణిస్తున్న బనవాసి జవహర్ నవోదయ విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించడం కోసం ఎన్‌సీసీ ఎంతో తోడ్పడుతోంది. చిన్నప్పటి నుంచి దేశభక్తి అలవర్చుకొని సాధన చేస్తూ జాతీయ స్థాయిలో ప్రదర్శన ఇస్తున్నారు. ఎన్‌సీసీలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులకు ప్రత్యేక కోటా కింద రిజర్వేషన్ ఉంటుంది. కొన్నింటిలో మార్కులకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుతం బనవాసి పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయం ఎమ్మిగనూరు విద్యార్థులు అనంతపురం, బనవాసిలో జరిగిన క్యాంపుల్లో ఉత్తమ క్యాడెట్‌గా ప్రదర్శనలు ఇచ్చారు.

ప్రదర్శన ఇస్తూ..

అపార అవకాశాలు

- పిల్లలకు చిన్నప్పటి నుంచి విద్యతో పాటు క్రమశిక్షణ నేర్చుకుంటారు.
- దేశభక్తి పెరుగుతుంది.
- సేవా గుణంపై అవగాహన.
- సమాజంలో ప్రజల్లో చైతన్యం వస్తుంది.
- విద్యార్థులతో ప్రాధాన్యత ఉంటుంది.
- ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుంది.
- ఇంజినీరింగ్, వైద్యం, పాలిటెక్నిక్, బీఈడీ, పోలీసు ఉద్యోగులకు 1 శాతం కోటా ఉంటుంది.
- ఆర్మీలో, పోలీసు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.
- సీ సర్టిఫికెట్ ఉన్నవారు ఎన్‌డీఏ ద్వారా డైరెక్టర్ కమిషనర్లు ఆఫీసర్లుగా తీసుకుంటారు.
- పదోతరగతి వరకు 'ఏ' సర్టిఫికెట్, ఇంటర్, డిగ్రీ వరకు 'బీ, సీ' సర్టిఫికెట్ పంపిణీ చేస్తారు.

సైన్యంలో చేరాలని లక్ష్యం
- హర్ష, తొమ్మిదో తరగతి

నా పేరు హర్ష మాది ఆలూరు గ్రామం. అమ్మానాన్నలు జ్ఞానచంద్రబాబు, రమాదేవి వ్యాపారం చేస్తున్నారు. ఎన్‌సీసీలో రెండేళ్లు సాధన చేశా. 2024, 2025లో అనంతపురంలో జరిగిన యూనిట్‌లో ప్రదర్శనలు ఇచ్చా. ఇక్కడ రైఫిల్ షూటింగ్‌లో 200 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాను. క్యాడెట్ ప్రదర్శనల్లో రాణించాను. కమాండర్‌గా ప్రదర్శనలు చేశా. కవాతు, ఆటలు, డ్రిల్, నాట్యం, ప్రదర్శనలు పోటీతత్వ పరీక్షలు వంటి వాటిలో ప్రతిభ పురస్కారం అందుకున్నా. రైఫిల్ షూటింగ్‌లో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. భవిష్యత్తులో సైనికుడి కావాలని లక్ష్యం.

శత్రువులను ఎదిరిస్తా
- పవన్‌కుమార్, తొమ్మిదో తరగతి

దేశభక్తి అలవర్చుకొని శత్రువులను ఎదిరించాలని లక్ష్యం. అమ్మానాన్న సులోచన, సునీల్. ప్రైవేటు రంగంలో పని చేస్తున్నారు. ఎన్‌సీసీలో చేరి రెండేళ్లపాటు వివిధ క్యాంపుల్లో ప్రదర్శనలు ఇచ్చా. రైఫిల్ పోటీల్లో సత్తాచాట. మొదట ఎన్‌సీఎల్ విభాగంలో అనంతపురంలో జరిగిన పోటీల విభాగంలో రైఫిల్, ఇతర సాధనలు చేశా. ఇక్కడ కవాతు, ఇతర పోటీలకు ఉత్తమ క్యాడెట్‌గా అవార్డు అందుకున్నా. బెటాలియన్‌లో రైఫిల్‌లో గురి చేసి పతకం సొంతం చేసుకొన్నా. జాతీయ స్థాయిలో రాణించి ఉత్తమ క్యాడెట్‌గా రాణించాలని నా తపన.

కవాతు ప్రదర్శనలో పాల్గొన్నా
- సాకేతు, తొమ్మిదో తరగతి

నాన్న శ్రీనివాసులు, అమ్మ విశాలాక్షి. ఆదోనిలో అమ్మానాన్నలు వ్యాపారంలో రాణిస్తున్నారు. సైనికులుగా రాణించాలని నాకల. 2023లో ఎన్‌సీసీలో చేరి అనంతపురం, బనవాసిలో జరిగిన క్యాంపుల్లో రైఫిల్, కవాతులో ప్రదర్శనలు ఇచ్చాను. 2024లో అనంతపురం బెటాలియన్‌లో రైఫిల్ గురి చేసి పతకం సొంతం చేసుకున్నా. రెండు సార్లు ప్రదర్శనలు ఇచ్చాను. కొండలు ఎక్కడం, సాధన చేయడం వంటివి నేర్పించారు. భవిష్యత్తులో దేశరక్షణ అధికారిగా రాణించాలని నా ఆశయం.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఉలిందకొండ (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఉలిందకొండ పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలు దస్త్రాలు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఎస్పీ మాట్లాడుతూ.. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చూడాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీలు చేయాలన్నారు. బాధితులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, డీసీఆర్‌బీసీఐ గుణశేఖర్‌బాబు, ఎస్సై ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మంగరాయ జాతరకు శ్రీకారం

ప్రత్యేక అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి

కోటఅశ్వర్థనగర్ (ఆదోని పాతపట్టణం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని కోట అశ్వర్థనగర్‌లో కొలువుదీరిన కోట మంగరాయ ఆంజనేయస్వామి జాతర సందర్భంగా మంగళవారం పూజలు మొదలయ్యాయి. మంత్రాలయం గురురాఘవేంద్ర స్వామి అనుబంధంగా ఉన్న ఈ ఆలయంలో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు నకాతే శ్యాంప్రసాద్‌రావు మాధవరం గోపి, భీమరావు, అర్చకులు గురురాజాచార్, శ్రీధర్, ఎస్డీ. గిరి, రామచంద్ర, వాదిరాజ్, చక్రవర్తి దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలపై రసాయనాల ప్రభావం

తుగ్గలి, న్యూస్‌టుడే: జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు వల్ల సమీప గ్రామాల వ్యవసాయ బోర్ల నీటిలో రసాయనాలు కలుస్తున్నాయని, దీంతో పండ్ల మొక్కల ఆకులు ఎండిపోతున్నాయని రైతులు జేసీ నూరుల్ ఖమర్‌కు వివరించారు. బొల్లవానిపల్లి గ్రామ రైతు హేమ సుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు జేసీ మంగళవారం తనిఖీ చేశారు. బొల్లావానిపల్లి గ్రామ పరిసరాల్లో బాధిత రైతు జామ, సపోట పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. సమీప గ్రామాల బోర్ల నీటిని సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపాలని అక్కడే ఉన్న ఆర్డీవో భరత్‌నాయక్‌ను జేసీ ఆదేశించారు. గోల్డ్ ప్రాజెక్టు వల్ల రైతులు ఎవరూ నష్ట పోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఆర్ఐ వెంకటరాముడు, వీఆర్వో రంగన్న తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలను పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్ తదితరులు

ఆదోని జిల్లా సాధనకు 'మేము సైతం'

రిలే దీక్షల్లో కూర్చున్న ఆటో డ్రైవర్లు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు మేము సైతం ముందుంటామని పలు వర్గాల ప్రజలు ముందుకొస్తున్నారు. ఆదోని పట్టణంలోని కోట్ల కూడలిలో జిల్లా సాధన ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరంలో మంగళవారం ఆదోని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కమిటీ నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, లలితమ్మ, టి.వీరేశ్, కుంకునూరు వీరేశ్, సాయిరాం, సుదర్శన్ తదితరులు మాట్లాడారు. దీక్షలో టి.వీరేశ్, బి.చిట్టిబాబు, ఈరన్న, నరసింహ, రాఘవేంద్ర, మునిస్వామి, రామకృష్ణ, రమేశ్‌గౌడు, ప్రేమ్‌కుమార్, శివరాజ్, లింగప్ప, షేక్షావలి, శ్రీనివాసులు, జిలాన్ కూర్చొని తమ మద్దతు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన ప్రగతిశీల మహిళ సంఘం ఆధ్వర్యంలో ఆదోని జిల్లా సాధన కోసం మహిళలు రిలే నిరాహారదీక్ష శిబిరానికి వచ్చి తమ మద్దతు తెలిపారు.

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కురువ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ దేవేంద్రప్ప అన్నారు. కర్నూలులో మంగళవారం దేవేంద్రప్ప మాట్లాడారు. ఆదోని మండలంలో 1.30 లక్షల జనాభా ఉందని, నాలుగు మండలాలుగా విభజించే అవకాశం ఉందన్నారు.

ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లాగా చేయాలనే పశ్చిమ ప్రాంత ప్రజల ఆకాంక్షను కూటమి ప్రభుత్వం గుర్తించాలని వైకాపా నాయకురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులతో తరలివచ్చి మంగళవారం స్థానిక కోట్ల కూడలిలో జిల్లా సాధనకు చేస్తున్న దీక్షలకు మద్దతు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ లోకేశ్వరి, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దహరివాణం మండలంలో విలీనం చేయొద్దు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దహరివాణం మండలంలో విలీనం చేయొద్దని ఆదోని మండలం నారాయణపురం గ్రామస్థులు మంగళవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి, డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. అధికారులు ప్రభుత్వానికి వాస్తవాలు తెలపడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కారెప్ప, గ్రామస్థులు కారుమంచప్ప, పురుషోత్తంరెడ్డి, పంపారెడ్డి, గిరెప్ప, షాషావలి, గాదిలింగ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

■ కర్నూలు కలెక్టరేట్ వద్ద ఆదోని మండలం గణేకల్, బసాపురం, ఢణాపురం, చిన్నగోనేహాళ్, చాగి, చిన్నహరివాణం, తదితర గ్రామాల ప్రజలు మంగళవారం ధర్నా చేశారు. పెద్దహరివాణం మండలంలో మా గ్రామాలను కలపొద్దని డిమాండు చేస్తూ ఆందోళన చేసి వినతి పత్రం అందజేశారు. పెద్దహరివాణం మండలంలో విలీనం చేయడాన్ని 16 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి, సమస్య పరిష్కరించాలన్నారు. ప్రజా అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామాల నాయకులు గోపాల్‌రెడ్డి, రామస్వామి, చంద్రశేఖర్, విరుపాక్షి, మల్లికార్జున, శేషన్న, రాము, ఈరన్న గౌడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న నారాయణపురం గ్రామస్థులు

బీఈడీ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఈడీ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ కింద 3,225 మందికి గాను 3,121 మంది, సప్లిమెంటరీలో 122కు 118 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

PERSONAL CLASSIFIEDS

MISSING

PASSPORT MISSING

I, PATHURI PANDU BABU, (Aadhar No.2099 1423 8972), age 55 Years, S/o. Pathuri Basava Shankar Rao, Presently Residing at Flat No.301, Juturu Residency, Narasimha Reddy Nagar, Opp: Railway Station, Kurnool, Kurnool District. Andhra Pradesh Iam the holder of Passport bearing No.B9834743 and the said passport has been issued on 14-02-2024 and expires on 13-02-2034, Place of issue VIJAYAWADA. That the Passport has been lost by me while I was travelling from Narasimhareddy Nagar to Old Busstand, Kurnool for Xerox purpose on 29-11-2025, I have lost my cover which contains my PASSPORT within the limits of II TOWN POLICE STATION, Kurnool. I made Sincerely efforts in search of it and it is lost beyond recovery. Contact No.94416 88340.

PASSPORT MISSING

I, PATHURI KASI ANNAPURNA, (Aadhar No.9762 7750 5299), age 47 Years, W/o. Pathuri Pandu Babu, Presently Residing at Flat No.301, Juturu Residency, Narasimha Reddy Nagar, Opp: Railway Station, Kurnool, Kurnool District. Iam the holder of Passport bearing No.B8538211 and the said passport has been issued on 21-12-2023 and expires on 20-12-2033, Place of issue VIJAYAWADA. That the Passport has been lost by me while I was travelling from Narasimhareddy Nagar to Old Busstand, Kurnool for Xerox purpose on 29-11-2025, I have lost my cover which contains my PASSPORT within the limits of II TOWN POLICE STATION, Kurnool. I made Sincerely efforts in search of it and it is lost beyond recovery. Contact No.9959427456.

TO LET

For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

JOBS

Wanted Male Academic Principals qualification any Degree/P.G, Salary: 25000/- to 30,000/- Having Experience in Educational sector will be preferable, Age limit: 30 to 45 years. Working Location: Kurnool. Contact: 92487 33342.

కోయిలకుంట్లలో RV రెసిడెన్సి ఎ/సి లాడ్జి నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి: ✆ 99899 07171.

టెలికాలింగ్ & Data Entry వర్క్ ఫ్రమ్ హోమ్/ఆఫీసు చేయుటకు M/F కావలెను. 10th క్లాస్‌పైన, Age:18 to 35, జీతం: 18k to 25k. ✆ 6305186209

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జంట హత్యల కలకలం

■ నంద్యాలలో ఇద్దరు యువకుల దారుణ హత్య

■ అమ్మను ఎందుకు కొట్టావని ప్రశ్నించినందుకు దాడి

కొమ్ము పెద్దన్న

సురేష్ (పాత చిత్రాలు)

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : 'మా అమ్మను ఎందుకు కొట్టావు' అని అడిగేందుకు వెళ్లిన బావ తమ్ముడు, అతడి మిత్రుడిని.. బావమరిది కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేసిన ఘటన నంద్యాల పట్టణంలో కలకలం రేపింది. నంద్యాల పట్టణం హరిజనపేటకు చెందిన కొమ్ము నాగలక్ష్మమ్మ, కొమ్ము వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరు పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండో కుమారుడు కొమ్ము మధు, భార్య మహాలక్ష్మి సోమవారం గొడవ పడ్డారు. అదే కాలనీలో ఉంటున్న మహాలక్ష్మి తమ్ముడు చట్ల రాజ్‌కుమార్ విషయం తెలుసుకొని అక్క ఇంటికి వెళ్లి బావతో గొడవ పడుతుండగా.. నాగలక్ష్మమ్మ అడ్డుగా వెళ్లారు. రాజ్‌కుమార్ ఆగ్రహంతో ఆమెను కొట్టడంతో గాయాలయ్యాయి. ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న చిన్న కుమారుడు కొమ్ము పెద్దన్న (25) రాత్రి 9 గంటలకు విధులు ముగిశాక ఇంటికి వెళ్లేసరికి తల్లి గాయాలతో ఉండటంతో స్థానిక సర్వజన ఆసుపత్రిలో చేర్పించాడు. తన తల్లిని కొట్టాడన్న కోపంతో కొమ్ము పెద్దన్న.. తన మిత్రుడు ఉప్పరిపేటకు చెందిన చాకలి సురేష్ (25)తో కలిసి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లాడు. మా అమ్మను ఎందుకు కొట్టావని గట్టిగా నిలదీశాడు. దీంతో 'మా ఇంటికే వస్తారా?' అని కోపోద్రిక్తుడైన రాజ్‌కుమార్ కత్తితో సురేష్, పెద్దన్నను పొడిచాడు. స్థానికులు వెంటనే వారిద్దరిని సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే పెద్దన్న చనిపోయాడు. సురేష్ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. రాజ్‌కుమార్, అతని తండ్రి లక్ష్మయ్య, తల్లి సరస్వతి, మహాలక్ష్మిని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి సీఐ అస్రర్‌బాషా తెలిపారు.

★ జంట హత్యల నేపథ్యంలో హరిజనపేటలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. నిందితుడి ఇంటి వద్దనున్న ద్విచక్ర వాహనానికి బాధితుల బంధువులు నిప్పంటించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. ఆసుపత్రికి ఇరువర్గాల వారు చేరుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మకానికి ప్రభుత్వ ప్లాట్లు

పత్తికొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను అమ్మకానికి పెట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనర్హులు లబ్ధి పొంది, వాటితో వ్యాపారం చేస్తున్నారు. స్థలాలు పొందిన వారు వాటిని విక్రయిస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్దికెరలోని లేఅవుట్ కాలనీలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో 570 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇప్పటికే వాటిలో 50 మందికి పైగా ఇళ్లు నిర్మించుకుని, అక్కడే జీవనం సాగిస్తున్నారు. సుమారు మరో 50 మందికి పైగా లబ్ధిదారులు తమ స్థలాలు అమ్ముకున్నారు. మండలంలోని యడవలిలో 41 మందికి స్థలాలు ఇవ్వగా.. 24 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇక్కడ సైతం స్థలాలు అమ్ముకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ప్లాటు ఖరీదు రూ.2.50 లక్షలకు పైగా ఉంటుందని స్థానికులు తెలిపారు. అనర్హులు లబ్ధిపొందడంతో పాటు ఇళ్లు నిర్మించకుండా వాటిపై స్థిరాస్తి వ్యాపారం చేయడం సరికాదంటున్నారు.

నలుగురికి జైలు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నలుగురు చోదకులకు ఆదోని కోర్టు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిందని ఆదోని డీఎస్పీ మల్రిపాటి హేమలత తెలిపారు. వాహన చోదకుడు మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవరు అనిల్‌ప్రసాద్‌కు పది రోజులు, ఐవీఆర్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు డ్రైవరు గణేశ్‌కు 15 రోజులు, ఐవీఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవరు సుధీర్‌కు ఏడు రోజులు, రామచంద్రకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించిందన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని డీఎస్పీ హెచ్చరించారు.

అమాయక రూప హంతకులు

◆ స్థానికంగా మంచివారిగా నటన.. ఇతర ప్రాంతాల్లో నేరాలు

◆ ముఠాలుగా ఏర్పడి కిరాయి హత్యలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాకు చెందిన పలువురి నేరచరిత పొరుగు రాష్ట్రాల్లో వెలుగుచూస్తోంది. ఇక్కడ అమాయకులుగా నటిస్తూ.. మంచివారిగా గుర్తింపు పొందిన వ్యక్తులు ముఠాలుగా ఏర్పడ్డారు. డబ్బు కోసం ప్రాణాలు తీసే కరుడుగట్టిన కిరాయి హంతకులుగా మారారు. ఇతర ప్రాంతాల్లో నేరాలు చేసి పోలీసు దస్త్రాల్లోకి ఎక్కుతున్నారు. పోలీసు అరెస్టు చేసిన సందర్భంలో పత్రికలు, టీవీల్లో వీరిని చూసి వారి చుట్టుపక్కల ఇళ్ల ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. జిల్లాలో ఇలాంటి ముఠాలు ఒక్కొక్కటే వెలుగు చూస్తుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది.

డబ్బు కోసం నేరాల బాట

జిల్లాలో పలువురు జల్సాలు, వ్యసనాలకు అలవాటుపడి డబ్బు కోసం కిరాయి హంతక ముఠాలుగా ఏర్పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన సర్వేయర్ తేజేశ్వర్ ఈ ఏడాది జూన్‌లో దారుణ హత్యకు గురైన ఘటన తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. అతని భార్య ఐశ్వర్య కర్నూలులో ఓ బ్యాంకు మేనేజరు తిరుమలరావు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి తేజేశ్వర్‌ను అడ్డు తొలగించుకోవాలని హత్యకు కుట్ర పన్నారు. కర్నూలులోని కృష్ణానగర్‌కు చెందిన వ్యాపారి నగేష్‌కు రూ.5 లక్షలు సుపారీ ఇచ్చి ఒప్పందం చేసుకున్నారు. నగేష్ తన ముఠాతో కలిసి తేజేశ్వర్‌ను కారులో ఎక్కించుకొని గొంతుకోసి దారుణంగా చంపారు. ఈ కిరాయి హంతక ముఠాలో సభ్యులైన కర్నూలుకు చెందిన నగేష్, చాకలి రాజు, చాకలి పరశురాముడు, తిరుపతయ్యను గద్వాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

◆ ఇటీవల గద్వాల జిల్లాలో నందిన్నె గ్రామ మాజీ సర్పంచి బోయ చినభీమారాయుడు ఈ ఏడాది నవంబరు 21వ తేదీన హత్యకు గురయ్యారు. అదే గ్రామానికి చెందిన కురువ వీరన్న అలియాస్ మిల్లు వీరన్న రాజకీయ, వ్యక్తిగత కక్షతో ఇతన్ని చంపించాలని నిర్ణయించుకున్నాడు. కర్నూలు జిల్లాకు చెందిన ఈశ్వర్‌గౌడ్ ముఠాకు రూ.25 లక్షల సుపారీ ఇచ్చాడు. అడ్వాన్సుగా రూ.8 లక్షలు చెల్లించడంతో వారు వాహనంతో ఢీకొట్టి చంపారు. గద్వాల జిల్లా పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో కర్నూలు మండలం పంచలింగాలకు చెందిన తెలుగు మధుబాబు, ఇ.తాండ్రపాడుకు చెందిన తెలుగు కృష్ణ, సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన బైరి సుంకన్న, బైరి కేశన్న అలియాస్ సంసోన్, గోనెగండ్ల మండలం పుట్టపాశంకు చెందిన రాజేష్ ఉన్నారు. ఈశ్వరగౌడ్‌తో పాటు మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉంది.

◆ గతంలో జిల్లాకు చెందిన పలువురు నేరగాళ్లు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో పలు హత్యలు, డోపీడీలు, దొంగతనాలు ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఉదంతాలున్నాయి.

కొరవడిన పోలీసుల నిఘా

జిల్లాలో 44 మంది కిరాయి హంతకులు, దాదాపు 1300 మంది రౌడీషీటర్లు ఉన్నారు. హత్య కేసుల్లో నిందితులపైన స్థానిక పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు తెరుస్తున్నారు. పొరుగు రాష్ట్రాల్లో హత్యలు, ఇతర తీవ్ర నేరాలకు పాల్పడిన వారిపై మాత్రం జిల్లాలోని పోలీసు స్టేషన్లలో ఎలాంటి షీట్లు తెరవడం లేదు. హత్య జరిగిన స్టేషన్‌లో తెరిచే రౌడీషీట్‌ను ఇక్కడి ఠాణాకు బదిలీ చేయడం లేదు. ఈ తరహా నేరగాళ్ల విషయంలో పోలీసు అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వారి కదలికలపై పోలీసు నిఘా ఉండటం లేదు. దీంతో మరికొన్ని నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో నేరచరిత కలిగిన వ్యక్తులు స్థానిక స్టేషన్‌లో రౌడీషీట్ తెరవగానే తెలివిగా మరో ప్రాంతానికి మకాం మారుస్తున్నారు. అక్కడి స్టేషన్‌కు రౌడీషీట్‌ను బదలాయించడం లేదు. గతంలో కర్నూలులో ఓ రౌడీషీటర్ ఇలాగే మకాం మార్చి ఏకంగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం సంచలనం సృష్టించింది.

మొక్కుబడి మంత్రణం

ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు విధిగా మంత్రణం నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా కొందరు పోలీసు అధికారులు పెడచెవిన పెడుతున్నారు. కొన్ని స్టేషన్లలో మొక్కుబడిగా నిర్వహించే మంత్రణానికి సగం మంది రౌడీషీటర్లు రావడం లేదన్న ఆరోపణలున్నాయి. నేరాల నియంత్రణలో భాగంగా పొరుగు రాష్ట్రాల్లో తీవ్ర నేరాలకు పాల్పడిన జిల్లా వాసులపై స్థానిక పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

డిపాజిట్ల లెక్క తప్పుతోంది

మద్దికెర, న్యూస్‌టుడే: తపాలా శాఖ ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా పిల్లల పేరుపై చేస్తున్న డిపాజిట్లలో అవకతవకలు జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. మద్దికెరకు చెందిన గోపాలు మల్లికార్జున తన కుమార్తె పేరుపై 2015 నుంచి డిపాజిట్ చేస్తున్నారు. 2023లో రూ.20 వేలు చెల్లించారు. అప్పటి తపాలా శాఖ అధికారి రమణమూర్తి ఖాతా పుస్తకంలో రూ.20వేలు రాశారు. ఆన్‌లైన్‌లో మాత్రం కేవలం రూ.2వేలు నమోదు చేశారు. ఈ విషయమై ప్రస్తుత అధికారి రమేష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

హత్తిబెళగల్ (ఆలూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. హత్తిబెళగల్ గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇంటింటికి వైకుంఠం జ్యోతి కార్యక్రమం నిర్వహించారు.

ఎక్స్‌రే యంత్రం ప్రారంభం నేడు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఎక్స్‌రే యంత్రాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి కార్యనిర్వహణాధికారి బాలచంద్రారెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా ఆస్పత్రిలోని ఎక్స్‌రే యంత్రం నిరుపయోగంగా ఉందన్నారు. ఈ యంత్రం ప్రారంభంతో ప్రజలకు ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండల పరిధిలోని, నంచెర్ల గ్రామంలో ప్రధాన రహదారిలో మురుగు పారుతోంది. రహదారిలో మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలి. - గోపాల్, నంచెర్ల

✔: రహదారిలో మురుగు వదిలే వారికి నోటీసులు జారీ చేస్తాం. రెండు రోజుల్లో పంచాయతీ సిబ్బందితో రహదారులు శుభ్రం చేయిస్తాం. - అల్లాబకాష్, ఎంపీడీవో, చిప్పగిరి

హొళగుంద: ?: సమ్మతగేరి గ్రామంలో కొన్ని కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు, రాత్రి వేళల్లో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. - తిక్కన్న, సమ్మతగేరి

✔: పరిశీలించి, సమస్య పరిష్కరిస్తాం. - రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి, సమ్మతగేరి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని నాగుల బావి వద్ద వ్యర్థాలు పేరుకు పోయాయి. తొలగించాలి. - వెంకటరాముడు, మద్దికెర

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

హొళగుంద, న్యూస్‌టుడే: ?: వందవాగిలి గ్రామం అంగన్వాడీ కేంద్రం ఎదుట మురుగు నిలిచింది. పరిష్కరించండి. - మల్లికార్జున వందవాగిలి

✔: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - నాగరాజు పంచాయతీ కార్యదర్శి వందవాగిలి

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెర మద్దమ్మకుంట కదుమ్మెట్లు వద్ద మినీ ట్యాంకు నుంచి నీరు వృథాగా పోతోంది. - విజయప్రసాద్, మద్దికెర

✔: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. - మయూరీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మద్దికెర

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ?: వెల్దుర్తి బ్రహ్మగుండం మార్గంలో వంతెన వద్ద మాంసం దుకాణదారులు కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. - రామలక్ష్మీ, వెల్దుర్తి

✔: మాంసం దుకాణదారులతో మాట్లాడి కోళ్ల వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనాథ్, పంచాయతీ ఈవో, వెల్దుర్తి

ఆస్పరి: ?: చిగళి గ్రామంలో ప్రధాన వీధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. - శంకర్, చిగళి

✔: రహదారులకు ఇరువైపులా సీసీ రహదారి, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. - నబిసాహెబ్, పంచాయతీ కార్యదర్శి, చిగళి

దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు

పరుగు పందెంలో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

ఆలూరు, న్యూస్‌టుడే: దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలూరు భవిత కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక కోయనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్, చదరంగం, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బుధవారం బహుమతులు అందజేస్తామని భవిత కేంద్రం ఉపాధ్యాయుడు రామదాసు తెలిపారు.

సవాళ్లు దాటారు.. విజయాలు సాధించారు

★ క్రీడల్లో ప్రతిభ చాటి.. సేవల్లో తరించి

★ నేడు దివ్యాంగుల దినోత్సవం

లోపం ఉందని వెనకడుగు వేయలేదు.. విజయాలకు బాటగా మార్చుకున్నారు. ఆటంకాలు ఎదురయ్యాయని ఆగిపోకుండా.. ముందుకు సాగారు. సవాళ్లకు సమాధానాలు చెప్పారు. బాధలు దిగమించి.. సంతోషాలు పంచారు. ప్రత్యేకతను చాటుతూ.. అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. బుధవారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కథనం.

పరుగుల మనోజ్

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన రమేశ్, సరిత దంపతుల కుమారుడు వై. ఎస్. మనోజ్‌కుమార్ సాదాపురం బీసీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. విభిన్న ప్రతిభావంతుడైనా.. ఆటల్లో తన ప్రత్యేకత చాటుతున్నాడు. ఆదోని భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. చదువుతో పాటు పరుగు పందెంలో సాధన చేస్తున్నాడు. కేంద్రం నిర్వాహకుడు శాంతకుమార్ ప్రత్యక శిక్షణతో సాధన చేయిస్తున్నాడు. గత నెల కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి విభిన్న ప్రతభావంతుల క్రీడా పోటీల్లో మనోజ్‌కుమార్ పాల్గొని 100 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. 2025 ఏప్రిల్ 21 నుంచి 23వ తేదీల్లో ఏలూరు జిల్లా తోటపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి విభిన్న ప్రతిభావంతుల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న మనోజ్ వంద మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాధికారులు, కేంద్రం నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపి సత్కరించారు.

కాంస్య పతకం అందుకుంటున్న మనోజ్‌కుమార్

లక్ష్మన్న, జూనియర్ అకౌంట్స్ అధికారి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఈఆర్వో కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్నారు వి. లక్ష్మన్న. పత్తికొండ మండలం దేవనబండ గ్రామానికి చెందిన ఆయనకు చిన్నతనంలోనే పోలియో సోకి దివ్యాంగుడిగా మారారు. పేదరికంలో ఎదరైన సవాళ్లను అధిగమిస్తూ..

సేవల్లో ముందడుగు

తల్లిదండ్రుల సహకారంతో పీజీ వరకు చదివారు. వారి కష్టానికి ఫలితంగా 1995లో విద్యుత్తుశాఖలో ఉద్యోగం వచ్చింది. నిరుపేదలు, దివ్యాంగులు ఎదుర్కొనే కష్టాలు ఆయన ప్రత్యక్షంగా చవిచూశారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవారికి సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. దివ్యాంగులకు దుస్తులు అందజేయటం, చదువుకు అవసరమైన పుస్తకాలు, ఫీజులు చెల్లిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్న వారికి నెల నెలా మందులకయ్యే ఖర్చు ఆయనే భరిస్తుంటారు. అనాథలు, అభాగ్యులు కనబడితే వారికి అవసరమైన వైద్య చికిత్సల కోసం సాయం చేయడం నిత్యకృత్యం. ఉద్యోగిగా తనకొస్తున్న వేతనంలో సుమారు 30 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు లక్ష్మన్న. ఉద్యోగ సమస్యలపై సంఘం తరపున పోరాడటంలో కూడా ముందుంటున్నారు.

దారిలో ప్రమాదం.. రాకపోకలకు ఆటంకం

హాలహర్వి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం వరిగడ్డి ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. గూళ్యం నుంచి ఆలూరు వైపు వెళ్తుండుగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బళ్లారి - ఆదోని రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చివరికి ఇతర వాహనాల సాయంతో ట్రాక్టర్ పక్కకు తొలగించడంతో అరగంట తర్వాత వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగాయి.– న్యూస్‌టుడే, హాలహర్వి

సంపుంది.. సంపుద్ది

దేవనకొండ మండలం కుంకనూరు ఉన్నత పాఠశాల ఆవరణలో సంపు ప్రమాదకరంగా మారింది. నాడు-నేడు కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో మరుగు దొడ్లు, నీటి సంపుల కోసం తవ్విన గోతులను అలానే వదిలేయడంతో.. ముప్పు పొంచి ఉందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కుంకనూరు (దేవనకొండ)

అదుపు తప్పితే.. టాపు లేచిపోద్ది

ఎలాంటి రక్షణ లేకుండా సరకు రవాణా చేసే వాహనాల్లో ప్రాణాలు పణంగా పెడుతూ.. అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. మద్దికెర సమీపంలోని కసాపురం ఆంజనేయస్వామి దర్శనానికి ఇలాంటి వాహనాల్లో మంగళవారం భారీగా తరలి వెళ్లారు. టాపుపై అదనంగా ఏర్పాటు చేసిన పలకలపై నిలబడి కొందరు, కాళ్లు కిందికి వేళాడుతూ కొందరు ప్రయాణిస్తూ. . కనిపించారు. ఇలాంటి వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా భారీగా ప్రాణ నష్టం తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే మద్దికెర

కాలుష్య నివారణకు కృషి చేయాలి

చెట్ల వేషధారణలో విద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: కాలుష్య నివారణ కోసం ప్రతి విద్యార్థి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ప్రవీణ్, సహాయక గురువు ఫాదర్ విన్సెంట్, ప్రధానోపాధ్యాయుడు జి. కేశవయ్య అన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు పచ్చని చెట్ల వేషాధారణలో పట్టణంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారెన్న, సిస్టర్ రేణుక, శామ్యూల్, వరప్రసాద్, నరసన్న, రవి, సంధ్య పాల్గొన్నారు.

స్పందనకు వందనం

ముప్పు తప్పించారు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రిలో ప్రసవాల గది ముందు భాగంలో పైకప్పునకు సీసీ ప్లాస్టరింగ్ చేయించారు. ఇక్కడి విభాగం ముందు ప్రాంతంలో పైకప్పునకు పెచ్చులూడి, ఇనుప కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. నిత్యం ఓపీతో పాటు ప్రసవాలకు వస్తున్న గర్భిణులకు పొంచి ఉన్న ప్రమాదంపై గత నెల 17న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మధుసూదన్ సీసీ పనులు చేయించారు. ఆస్పత్రికి వచ్చే వారికి ముప్పు తప్పినట్లైంది.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండు చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం మండల కార్యదర్శి విరుపాక్షి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ఈ నెల 10వ తేదీన ఆస్పరి చౌరస్తాలో రోడ్డు దిగ్బంధం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ రానున్నారని తెలిపారు. కర్షకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేంద్రయ్య, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, రామాంజనేయులు, కృష్ణ, రాజశేఖర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

ఆలూరు, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని డీఆర్‌డీఏ పీడీ వెంకటరమణారెడ్డి సూచించారు. ఆలూరు స్త్రీశక్తి భవనంలో మంగళవారం వెలుగు వీఏవోలు, ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజరు నవీన్, ఏపీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: మహిళలకు పొదుపు రుణాలు అందిస్తూ ఆర్థికంగా ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ వైవీ రమణారెడ్డి సూచించారు. హాలహర్విలో మంగళవారం మండల మహిళ సమైక్యతా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ మండల సమైక్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, సీపీఎం నరసమ్మ, నవీన్, ఏపీఎం నాగార్జున వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల నోట.. గెలుపు మాట

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీలతో విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందుతుందని పత్తికొండ యశోద గార్డెన్ హైస్కూల్ డీన్ సుధాకర్ అన్నారు. ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చక్కగా ప్రసంగించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఫౌజియా అంజుమా, ఆర్. హారిక, పి. దీపికకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ కె. నారాయణ, ఇక్బాల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డీన్ సుధాకర్ తదితరులు

బసాపురాన్ని ఆదోనిలోనే కొనసాగించాలి

ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బసాపురం (ఆదోని ఎస్కేడీ కాలనీ), న్యూస్‌టుడే: కొత్తగా ప్రకటించిన పెద్దహరివాణం మండలంలో బసాపురం గ్రామాన్ని కలపకుండా ఆదోని మండలంలోనే కొనసాగించాలని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి మాట్లాడారు. అనంతరం ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మహాదేవమ్మ, లక్ష్మి, యల్లమ్మ, హనుమంతమ్మ, ఈరమ్మ, లక్ష్మీ, ఉరుకుందమ్మ, జానమ్మ, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆలూరు, న్యూస్‌టుడే: వసతిగృహ విద్యార్థులు పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రాధిక సూచించారు. ఆలూరు సమీకృత బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆమె రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. వసతి గృహ సంరక్షకుడు మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: పెండింగ్‌లోని గృహనిర్మాణాలను వెంటనే పూర్తిచేసుకోవాలని గృహనిర్మాణ శాఖ పీడీ చిరంజీవి అన్నారు. గృహనిర్మాణాలు పూర్తిచేసుకోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొన్నారు. 2026 మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న 300 గృహనిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి ఏఈ బాలకృష్ణకు సూచించారు. కొత్త ఇళ్ల మంజూరు కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో లలిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ గిడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో గెలిచింది జనాదరణతోనే

హొళగుంద, న్యూస్‌టుడే: జనాదరణతోనే ఆలూరు నియోజకవర్గంలో వైకాపా గెలిచిందని వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె. గిరి, మండల కన్వీనర్ షఫీయుల్లా, ఇంగళదహాళ్ ఎంపీటీసీ మల్లికార్జున అన్నారు. వాస్తవాలు తెలుసుకుని, గౌరవంగా మాట్లాడాలని సూచించారు. స్థానిక ఎల్ఎల్సీ విశ్రాంతి భవనంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైకాపా జెండా ఎగరడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఇమ్రాన్, శ్రీనివాసరెడ్డి, ఆనందగిరి, సుదర్శన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండలం బాపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న(32) కనిపించడం లేదని ఎస్సై మారుతి తెలిపారు. కొన్ని నెలలుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ.. భార్యకు చరవాణిలో అందుబాటులో ఉన్నారన్నారు. నాలుగు నెలలుగా ఎలాంటి ఆచూకీ, సమాచారం లేకపోవడంతో బంధువులు, ఇతర తెలిసిన వారిని విచారించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. భార్య ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పింఛను పెంచి మాట నిలబెట్టుకుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శివారులోని మండగిరి పంచాయతీ పరిధిలో మంగళవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పెంచిన పింఛన్లను చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయన్నారు. దీనిని ప్రజలు నమ్మడం లేదన్నారు.

పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

పిల్లల్లో మానసిక స్థైర్యం నింపాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లల లోపాన్ని తలచుకొని బాధపడకుండా.. వారిలో మానసిక స్థైర్యం నింపేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలెస్కో సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన ఉపకరణాలను దివ్యాంగ పిల్లలకు అందజేశారు. వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బీఎస్ లోకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ సురేంద్రబాబూజీ, అలెస్కో సంస్థ ప్రతినిధి ప్రియావర్మ, మండల విద్యాధికారులు రాజారామ్మోహన్, సీఐ జయన్న, రమేశ్, భవిత కేంద్రం ఐఈఆర్టీలు శ్రీనివాసులు, తేజ కుమార్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

కూటమి ప్రభుత్వంతోనే ప్రగతి సాధ్యం

హత్తిబెళగల్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆలూరు మండలం హత్తిబెళగల్, హుళేబీడు గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. హత్తిబెళగల్ గ్రామంలోని 3వ అంగన్‌వాడీ నూతన భవనాన్ని, హుళేబీడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బిల్లేకల్లు వెంకటేష్, తెదేపా నాయకులు ఈరన్న, శేక్షావలి, సామాజిక కార్యకర్త కమలాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు సత్కారం

అర్చకుడు శ్రీధర్‌శర్మను సన్మానించిన అయ్యప్ప భక్తులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అయ్యప్ప మాల ధరించిన భక్తులకు 41 రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేసిన వెల్దుర్తి జర్నలిస్టు కాలనీ అయ్యప్పస్వామి సమూహ ఆలయాల ప్రధాన అర్చకుడు, ఆలయ కమిటీ కోశాధికారి యార్లపాటి శ్రీధర్‌శర్మను దీక్షాధారులు మంగళవారం సన్మానించారు. ఆలయ ప్రధాన గురుస్వామిగా గోపినాథ్‌నాయుడు, గురుస్వాములుగా గౌండసూరి, చిరంజీవిని ఎంపిక చేశారు. సుమారు 50 మంది అయ్యప్ప భక్తులు ఆలయంలో ఇరుముడి కట్టుకొని శబరిమలకు బయల్దేరారు.

శిశు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: నవజాత శిశు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం కూడదని, వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లల వైద్య నిపుణుడు, ఐఎంకే కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ గోపినాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మాతా, శిశు ఆస్పత్రిలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ఆధ్వర్యంలో హ్యాబిలిటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రఘునాథ్, హరీష్, ఆదిత్య, శ్రీలక్ష్మి, బాలాజీ, మధుసూదన్‌రెడ్డి, సందీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని డీఎస్పీ హేమలత

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ.. కష్టపడి చదవి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఆదోని పట్టణంలోని శ్రీబాలాజీ జూనియర్ కళాశాలలో ఈగల్ టీం, శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె. ఎస్. మురళీబాబు, ప్రిన్సిపల్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమయానికి రారు.. సమస్యలు ఆలకించరు

ఉదయం 11 గంటల సమయంలో ఖాళీ కుర్చీలు

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించడం లేదని అర్జీదారులు ఆరోపించారు. ఆర్ఐ భాస్కర్, కంప్యూటర్ సిబ్బంది తప్పితే ఉదయం 11 గంటలు అయినా రెవెన్యూ సిబ్బంది కనబడలేదన్నారు. క్షేత్రస్థాయి అధికారుల పర్యటించకపోవడం, క్రమశిక్షణ చర్యలు చేపట్టకపోవడంతో అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. సోమవారం దేవనకొండ మండలం నల్లచెలిమల్లకు చెందిన వీఆర్వో ఏసీబీ అధికారులకు పత్తికొండలో చిక్కారు.

పట్టా ఇచ్చారు.. స్థలం చూపడం లేదు

- రేష్మా, దేవనకొండ

గత ప్రభుత్వం జగనన్న ఇంటి పట్టా మంజూరు చేసింది. పట్టా నంబరు 32. పట్టా ఇచ్చారు కానీ స్థలం చూపడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కనీసం సమాధానం చెప్పడం లేదు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాను. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

కార్డు పనిచేయడం లేదన్నారు

- నాగవేణి, దేవనకొండ

ఈ నెల 1వ తేదీన బియ్యం కార్డు తీసుకొని చౌక దుకాణానికి వెళ్లగా..కార్డు నంబరు 2813769337 పని చేయడం లేదన్నారు. మరో దుకాణానికి వెళ్లగా.. స్మార్ట్ కార్డు పని చేయలేదు. ఏమి చేయాలో తెలియక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాను.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరిస్తాం

మద్దికెరలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సిరి

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలో ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్‌తో కలిసి మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. లేఅవుట్ కాలనీలో విద్యుత్తు సౌకర్యం లేక అక్కడ నివాసం ఉంటున్న వారు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ.. గృహనిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు గుండాల నాయక్, ఎంపీడీవో కొండయ్య, వైద్యాధికారిణి రాగిణి, ఎంఈవో రంగస్వామి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు రూ.15 వేల పింఛనివ్వండి

చిప్పగిరి, న్యూస్‌టుడే: దివ్యాంగులకు రూ. 15 వేల పింఛను మంజూరు చేయాలని చిప్పగిరి ఉన్నత పాఠశాల విద్య కమిటీ ఛైర్మన్ కె. నాగరాజు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరిని కోరారు. చిప్పగిరి ఉన్నత పాఠశాలలో నాగరాజు దంపతులు కలెక్టరును కలిసి వినతిపత్రం అందించారు.

(c) eenadu

రహదారి పనులు చేపట్టారు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజీ - ఈదులదేవరబండ రహదారి గుంతలమయంగా మారింది. ఆ విషయంపై ఈనెల 22వ తేదీన 'కంకర దారి.. అధ్వానంగా మారి' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు చేపట్టారు.

స్పందనకు వందనం

కూటమి సర్కారులో అభివృద్ధి పరుగులు

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక అభివృద్ధి పరుగులు పెట్టించామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పెసలదిన్నె, గార్లదిన్నె గ్రామంలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఇంటి పట్టాలు, కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రోడ్లు, మరుగుదొడ్లు, వీధిదీపాలు, నాడునేడు కింద నిలిచిపోయిన భవనాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బంగారమ్మ, ఏఈ జయన్న, ఏవో శివశంకర్, తెదేపా మండల అధ్యక్షులు వెంకటేశు, కొండన్న, విరూపాక్షిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, పార్లపల్లి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెసలదిన్నెలో కొత్త పింఛను అందజేసిన ఎమ్మెల్యే బీవీ

6న విద్యుత్తు అదాలత్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుత్తు కార్యాలయంలో ఈనెల 6వ తేదీన విద్యుత్తు అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు విజయరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులకు ఏమైనా సమస్యలు ఉన్నా నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

పాఠశాల బస్సుల తనిఖీ

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి పాఠశాల బస్సుల్లో అత్యవసర ద్వారం, ప్రథమ చికిత్స కిట్టు, అగ్నిమాపక పరికరం ఉండాలని ఆర్టీవో రవీంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కోడుమూరు పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను తనిఖీలు చేశారు. పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను ఎక్కించకూడదని యాజమాన్యాలకు సూచించారు.

విధిని ఎదిరించి.. విజయం సాధించి

■ పదిమందికి సాయం చేస్తున్న విద్యావంతులు
■ నేడు దివ్యాంగుల దినోత్సవం

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విధి వారిని చిన్నచూపు చూసినా అనుకున్న లక్ష్యాలను సాధించారు. దివ్యాంగులైనా ఏనాడు నిరాశపడకుండా లక్ష్యం దిశగా సాగుతున్నారు. పేదరికం, అంగవైకల్యం అడ్డురాదని నిరుపించారు. విద్యలో రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు ఆసరా నిలుస్తున్నారు. సామాజిక సేవల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆ విజేతలపై ప్రత్యేక కథనం.

కూలీ పనులు చేసి..
-తిమ్మన్న, ఉపాధ్యాయుడు ఎమ్మిగనూరు

మాది రాళ్లదొడ్డి గ్రామం. అమ్మానాన్నలు యంకమ్మ, లక్ష్మన్న కూలీ పనులు చేసి చదివించారు. బీఏ, బీఈడీ, ఎంఏ ఇంగ్లీషు, ఎంఎస్సీ సైకాలజీ, ఎంఏ ఎకానమిక్స్ కోర్సులు చదివాను. అమ్మానాన్న చనిపోయి మూడేళ్లు అయింది. భార్య, ఇద్దరు అమ్మాయిలు, బాబు ఉన్నారు. ఉద్యోగం రాక ముందు కూలీ పనులు చేశా. పోలియో వచ్చి పూర్తిగా నడవలేని పరిస్థితి. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కూలీ సొమ్ముతో పుస్తకాలు, ఇతర కోర్సులకు ఫీజులు చెల్లించి పూర్తి చేశా. డీఎస్సీ 2008లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. గోనెగండ్ల, అల్వాల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించా. ఎంఎస్ నగర్‌కు 2023లో పదోన్నతిపై సోషల్ టీచర్‌గా ఎంపికయ్యాను. విద్యార్థులకు పోటీ పరీక్షలు పెట్టి బహుమతులు ఇవ్వడం, పిల్లల పుట్టిన రోజున అనాథ ఆశ్రమంలో భోజనాలు పెట్టించడం, పదోతరగతిలో పేద పిల్లలకు ఫీజులతో పాటు, ఉచితంగా పుస్తకాల ఇవ్వడం వంటివి చేస్తున్నా.

మూడు చక్రాల వాహనంలో వెళ్లి
-రాఘవేంద్ర, ఉపాధ్యాయుడు, ఎమ్మిగనూరు

మాది పేద కుటుంబం. చిన్నప్పుడే పోలియో సోకింది. భార్య, ముగ్గురు అమ్మాయిలు. ఇంటర్, డీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాను. కొన్ని రోజుల పాటు దుకాణంలో పని చేశా. 2008లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాను. మొదట పెద్దకడబూరు మండలం పీకలబెట్ట గ్రామంలో పని చేశాను. అక్కడ నుంచి చిన్నతుంబళం రోజూ మూడు చక్రాల వాహనాల్లో వెళ్లాను. ప్రత్యేక తరగతులు తీసుకొని పిల్లలను చదువు నేర్పించా. గ్రామస్థులు సైతం నాకు సన్మానం చేశారు. అనంతరం ఎమ్మిగనూరు ఆదిఆంధ్ర, ప్రస్తుతం ఎన్టీఆర్ కాలనీ డీపీఈపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నా. పిల్లలకు ప్రయోగాత్మకంగా పాఠాలు నేర్పిస్తున్నా.

పిల్లలకు బోధిస్తూ..
లింగన్న, గువ్వలదొడ్డి, ఎమ్మిగనూరు

పుట్టుకతో కాళ్లు చచ్చుబడ్డాయి. ఉన్నత విద్య సాధించాలనే లక్ష్యంతో బీఏ, బీఈడీ పూర్తి చేశా. రెండు మార్కుల తేడాలతో రెండు సార్లు ఉపాధ్యాయ పోస్టు తప్పిపోయింది. ఉద్యోగం రాకున్నా గ్రామంలోని పిల్లలను విద్యావంతులను చేయాలని సంకల్పించాను. 150 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు, గురుకుల, నవోదయ పాఠశాలలకు అవసరమైన పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాను. 2010 నుంచి 20 మంది గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ పిల్లలకు సైతం సబ్జెక్టుల్లో అనుమానాలు నివృత్తి చేస్తున్నా. ఉత్తమ సేవలకు గాను 2022లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నా.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

కౌతాళం, న్యూస్‌టుడే: ?: హాల్విలో బైపాస్ రహదారిలో ఇసుక లారీలు, టిప్పర్లు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండటంతో, రహదారి మొత్తం దుమ్ము కమ్మేస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.- **క్రిష్ణయ్య, హాల్వి**

✔: నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్‌కరీం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, హాల్వి**

కోడుమూరు, న్యూస్‌టుడే: ?: కోడుమూరు గ్రామ పంచాయతీ కొండపేట కాలనీలో మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. శుభ్రం చేయాలి. **-హేమంత్‌కుమార్, కొండపేట కాలనీవాసి**

✔: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం.- **వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టరు, కోడుమూరు గ్రామ పంచాయతీ**

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని తెలుగు వీధి కాల్వల్లో మురుగు ముందుకు పోవటంలేదు. **- గణేష్, స్థానికుడు**

?: పట్టణంలోని అన్న క్యాంటీన్ పరిసరాలలో అపరిశుభ్రత నెలకొంది.- **భరత్, స్థానికుడు**

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మాలపల్లి గ్రామంలోని సంత మార్కెట్‌లో నీటి ట్యాంకు వృథాగా మారింది. **- సోమన్న, మాలపల్లి.**

✔: కుళాయి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్**

?: గాంధీనగర్ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- కుమార్, కాలనీవాసి**

✔: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. **- శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: ముచ్చిగేరి గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. **-ఈరన్న, ముచ్చిగేరి గ్రామం**

✔: అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. **-ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు**

నియంత్రిక.. ఆదమరిస్తే ప్రమాదం

కోడుమూరు పట్టణంలోని బేసారం వీధికి వెళ్లే దారిలోని నియంత్రిక ప్రమాదకరంగా మారింది. విద్యుత్తు నియంత్రిక, చెత్త కుప్ప, నీటి ట్యాంకు వరుసగా ఉన్నాయి. దీంతో నీటి కోసం వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్ల ముందుకు చెత్త వస్తోందని, ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తింటున్నాయి. మరోపక్క విద్యుత్తు నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేదు. దీంతో ఈ ప్రాంతంలో సంచరించే ప్రజలకు ప్రమాదకరంగా మారింది. కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

కుళ్లి.. దుర్వాసన వెదజల్లి

వ్యవసాయ మార్కెట్‌లో కుళ్లిన కూరగాయలు పత్తి మార్కెట్ చుట్టూ పారబోశారు. రోజుల తరబడి శుభ్రం చేయక కుళ్లి దుర్గంధం వ్యాప్తి చెంది మార్కెట్‌కు వెళ్లే రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. కుళ్లిన కూరగాయలను ఎప్పటికప్పుడు బయటకు తరలించకుండా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. -న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

రోడ్డుపై చేరిన మురుగు

మండల కేంద్రంలో మురుగు కాల్వల్లో పూడిక నిండి ప్రధాన సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఈ రహదారిపై నిత్యం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. పూడిక తీతపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెద్దకడబూరు

కనిపించని పరిశుభ్రత

కోడుమూరు పట్టణంలోని కల్లుపేట వీధిలో చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమలకు నిలయంగా మారుతోంది. దోమ కాటుతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి చెత్త తొలగించకపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తదిబ్బలు గాలికి వచ్చి పడుతున్నాయని వారు చెబుతున్నారు. -న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మసీదుపురానికి చెందిన బూషప్ప(24) అనే యువకుడు మంగళవారం తెల్లవారుజామున కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. బూషప్ప నవంబరు 30వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో మంగళవారం ఉపాధి హామీ పనులు, భద్రత పింఛన్లపై ఎస్ఆర్‌పీ ఈ.కాంతయ్య, డీఆర్‌పీ ఏ.లక్ష్మయ్య ఆధ్వర్యంలో వీలేజ్ సోషల్ ఆడిటర్ పీ.షేక్షావలి సామాజిక తనిఖీలు నిర్వహించారు. పింఛనుదారుల వివరాలు తనిఖీలు చేశారు.

ప్రణాళికతో ముందుకు వెళ్లాలి

కొండాపురం(సి.బెళగల్),న్యూస్‌టుడే: స్థానిక సంస్థ ఎన్నికల్లో తెదేపాను గెలిపించేందుకు బూత్ స్థాయి ఇన్‌ఛార్జులు ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టరు రామకృష్ణ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం బూత్ నంబరు 8ని సందర్శించారు. కొండాపురం గ్రామ తెదేపా అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ఎక్కడ నిర్లక్ష్యం చేయవద్దని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. పట్టణంలో కొత్త ఇందిరానగర్ కాలనీలో రూ.20లక్షలతో చేపడుతున్న పైపులైన్ పనులను మంగళవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పైపుల కోసం తవ్విన గుంతలో మట్టి, ఇతర వాటితో చేపట్టాలన్నారు. పైపుల లీకేజీ, ఇతర సమస్యలు రాకుండా చూడాలన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. డీఈ నీరజా, ఏఈ కరుణాకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం

వాలీబాల్ కోర్టు ప్రారంభోత్సవంలో విద్యా కమిటీ ఛైర్మన్ తదితరులు

నందవరం(ఎమ్మిగనూరు), న్యూస్‌టుడే: క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రదర్శనలు ఇవ్వాలని, క్రీడలకు ప్రోత్సహిస్తామని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ భీమన్న అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో కొత్త వాలీబాల్ కోర్టును మంగళవారం ప్రారంభించారు. భీమన్న మాట్లాడుతూ కేజీబీవీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండల విద్యాధికారి శ్రీలేఖ, వ్యవసాయ అధికారిణి సరిత, పీఈటీ శిరోమణి, జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప, వైస్ ఛైర్మన్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు

క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఘట్కా పోటీల్లో క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా అండర్-17,19 విభాగానికి పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో సోతి, ఫెర్రీ సోతి వ్యక్తిగత క్రీడాకారులకు ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్లను నేరుగా రాష్ట్ర సభ్యులు ప్రకటిస్తారన్నారు.

ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్

కౌతాళం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కౌతాళం మండలంలోని కామవరం పశు వైద్యశాలలో పనిచేస్తున్న మహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కర్నూలులో ఉద్యోగుల సంఘం ఎన్నికల అధికారి సుబ్బనారాయణ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. వీరందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. మహమ్మద్‌ను తోటి కార్యవర్గ సభ్యులు, సహచర ఉద్యోగులు సన్మానించారు.

విద్యా బోధకులకు దరఖాస్తుల ఆహ్వానం

కౌతాళం, మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు రామాంజనేయులు, శోభారాణి, రాఘన్న తెలిపారు. కౌతాళం, మంత్రాలయం మండల పరిధిలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టులు, మీడియం వారిగా 5 నెలల కాలానికి విద్యా బోధకులుగా విధులు నిర్వహించడానికి ఈనెల 5వ తేదీలోగా ఎంఈవోలకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఏదైనా డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారని అన్నారు.

కుడా అనుమతి తప్పని సరి

మంత్రాలయం, న్యూస్‌టుడే: కుడా అనుమతి లేకుండా లాడ్జింగ్‌లు నిర్మిస్తే చర్యలు తప్పవని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంత్రాలయంలో మంగళవారం ఆయన సిబ్బందితో కలసి మాధవరం, మంత్రాలయంలో అనుమతి లేని నిర్మాణాలను పరిశీలించి, నోటీసులు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా లాడ్జింగ్‌లను అనుమతి లేకుండా నిర్మించుకున్నారని అన్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, కుడా సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు ర్యాలీ

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు రాజు, బతకన్న, డాక్టర్ గణేష్‌కుమార్ తదితరులు డిమాండు చేశారు. పట్టణంలో మంగళవారం ప్రజా, విద్యార్థి సంఘాలు ఇతర నాయకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ఆదోని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సురేష్, విజయేంద్ర, మహేంద్ర, ఆఫ్రిదీ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దందాపై విచారణ

సి.బెళగల్, న్యూస్‌టుడే: గత మూడు రోజులుగా సి.బెళగల్‌లోని పడమటి కొండల్లో కంబదహాల్ గ్రామానికి చెందిన కొందరు ఎర్రమట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్థులు ఆ విషయంపై కలెక్టర్ ఎ.సిరికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ అక్రమంగా తరలిస్తున్న ఎర్రమట్టిపై చర్యలకు ఆదేశించారు. దాంతో మంగళవారం తహసీల్దార్ వెంకటలక్ష్మీ గనులశాఖ అధికారి ఏడిఏ వెంకటేశ్వర్లు మట్టిని తవ్విన గుంతలు పరిశీలించి కొలతలు వేశారు. విచారించి నివేదిక పంపిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రాజు కోరారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంగళవారం సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ. . ఇటీవల తమ పార్టీ జీపు జాత నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించామన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఆర్ఐ అశోక్ కుమార్‌కు అందచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మన్న, బుడ్డప్ప, గఫూర్, శేఖర్, పరమేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కౌతాళం, న్యూస్‌టుడే: మండలంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ మండలాధ్యక్షుడు పి.అంజినయ్య, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, ఆర్థిక కార్యదర్శి పరమేష్, తదితరులను ఏకగ్రీవంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఈవోకు వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

ఉపన్యాస పోటీలతో విజ్ఞానం పెంపు

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ప్రిన్సిపల్ శారద

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉపన్యాస పోటీలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని మాచాని సోమప్ప ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపల్ శారద అన్నారు. మంగళవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా పాఠశాలలో ఉపన్యాసన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సృజనాత్మక శక్తి వెలికి తీసేందుకు పోటీల పరీక్షలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాయిభరత్, శ్రీరేణుక, విరాట్ సాధించారు. ఉపాధ్యాయులు వీరగంగాధర్, విశ్వనాథ్, నరసింహులు, విజయలక్ష్మీ, రంజిని, రాజేశ్వరి, ఇందిరా పాల్గొన్నారు.

ప్రతిభ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్త సమాచారం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం కార్యకర్తలకు అండగా ఉంటుందని తెదేపా నాయకుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహేశ్ కుమారుడిని, మాధవరం వాటర్ మేన్ యేసు, శివ కృష్ణలను పరామర్శించారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న కడ్డీలు తొలగించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సత్యన్న ఆరోపించారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని సీఐ రామానుజులు ఆటో చోదకులను హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వారికి మంత్రణం నిర్వహించారు.

ఎమ్మిగనూరు: చదువు, క్రీడల్లో వీటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ సూచించారు. పాఠశాల ఏజీఎం రమేష్ ఆధ్వర్యంలో ఎన్‌పీఎల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు.

పోలకల్ (సి.బెళగల్),న్యూస్‌టుడే: మండలంలోని పోలకల్ గ్రామంలో ఏవో మల్లేషకుమార్ పర్యటించి రైతు సేవా కేంద్రాన్ని అన్నపూర్ణ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువు, పురుగుమందుల నమూనాలు తీసి ప్రయోగశాలకు పంపుతున్నట్లు తెలిపారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని మండల వైద్యాధికారులు కేజియా, శేఖన్‌బాను సిబ్బందికి సూచించారు. దాతలకు నిక్షయ్ మిత్ర ధ్రువపత్రాలు అందజేశారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్రీమఠంలో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కొత్త సెక్యూరిటీ సర్వీస్‌ను నియమించినట్లు శ్రీమఠం అధికారులు తెలిపారు.

గూడూరు: హమాలీలంతా ఐక్యతతో పోరాడి హక్కులను సాధించుకుందామని ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు పేర్కొన్నారు. 5వ తేదీన మహాసభను నిర్వహిస్తున్నామన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: గూడూరు నగర పంచాయతీలో 13వ తేదీన హిందు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పరుశరాముడు, డమాం సురేష్ పేర్కొన్నారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: వాల్మీకుల ఎస్టీ సాధనకు సహకరించాలని జనసేన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ వేముల అజయ్‌కుమార్‌కు.. జనసేన ఇన్‌ఛార్జి లక్ష్మన్న వినతి పత్రం అందజేశారు.

ధీమా ఇవ్వని బీమా

◆ నిధులు లేక ఆగిన మూగజీవాల బీమా ప్రీమియం

ఎమ్మిగనూరు గ్రామీణం, పెద్దకడబూరు, కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పశ్చిమ ప్రాంతంలో గొర్రెలు, మేకల పెంపకంతో చాలా మంది జీవనం సాగిస్తున్నారు. అధిక వర్షాలు, పిడుగులు, చలి తీవ్రతకు జీవాలు మృతి చెందితే యజమానులకు బీమా ధీమా ఇస్తుంది. కానీ నిధుల కొరతతో కొన్ని నెలలుగా బీమా పథకం ఆగిపోయింది.


అధిక వర్షాలకు సోగనూరులో మృతి చెందిన గొర్రెలు(పాత చిత్రం)

పరిశీలన

ఆదోని డివిజన్‌లో 7,1200

జిల్లాలో 18.12లక్షల గొర్రెలు, మేకలు ఉంటే ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, గోనెగండ్ల, కోసిగి, కౌతాళం తదితర మండలాల్లో 7,1200 ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో జీవాలు చనిపోతే ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. గొర్రెలు, మేకలు చనిపోతే రూ.6వేలు అందజేస్తుంది. ఇందుకు ప్రీమియం బీపీఎల్, ఎస్సీ, ఎస్టీలు ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187 చెల్లించాలి. జీవాలు మృతి చెందినప్పుడు పెంపకందారులకు ఇది కొండంత ధీమా ఇస్తుంది.

అవగాహన తక్కువ

జీవాలు ఉన్న యజమానులు అవగాహన లేక బీమా చేయించుకోవడం లేదు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు ఎమ్మిగనూరు మండలంలోని సోగనూరు, వెంకటగిరి తదితర గ్రామాల్లో 150గొర్రెలు మృతి చెందాయి. పెద్దకడబూరు, కోసిగి, కోడుమూరు, గూడూరు, మంత్రాలయం, గోనెగండ్ల మండలాల్లో 400గొర్రెలు మృత్యువాతపడ్డాయి. వర్షాలు అధికమై ఇతర జబ్బు చేసి మరో 400 గొర్రెలకు పైగా చనిపోయాయి. బీమా చేయక రైతులు పరిహారం పొందలేకపోయారు. గొర్రె దాదాపు రూ.10వేల వరకు అమ్ముడుపోతుంది. ఈ లెక్కన రైతులు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు నష్టపోయారు.

భరోసా కల్పించాలి..

నిధులు లేక మూడు నెలలుగా గొర్రెల, మేకల బీమా ప్రీమియం నిలిచిపోయింది. ప్రభుత్వం బీమాపై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. జీవాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం బీమాకు నిధులు కేటాయించి పెంపకందార్లకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

40 గొర్రెలు మృతి చెందాయి
ఉరుకుంద, కల్లుకుంట

నాకు 200గొర్రెలు ఉన్నాయి. ఈసారి అధిక వర్షాలతో 40గొర్రెలు చనిపోయాయి. రూ.4లక్షల వరకు నష్టపోయా. బీమా చేయించలేదు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

రూ.1.8 లక్షలు నష్టపోయా
పెద్దలక్ష్మన్న, సోగనూరు

నాకు 200గొర్రెలు ఉన్నాయి. ఎడతెరిపిలేకుండా కురిసిన వానలకు 18గొర్రెలు చనిపోయాయి. ఎలాంటి పరిహారం అందలేదు. బీమా చేయించలేదు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలి.

మూడు నెలలుగా నిలిచింది
సుబ్రహ్మణ్యాచారి, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు, ఎమ్మిగనూరు

గొర్రెలు, మేకల ప్రీమియం నిధులు లేక మూడు నెలలుగా నిలిచింది. గతంలో నిధులున్నపుడు రైతులకు అవగాహన కల్పించినా.. ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో జీవాల యజమానులు ముందుకురాలేదు.

బుట్టా, చెన్నకేశవరెడ్డి మధ్య కోల్డ్‌వార్

భారీ వాహన శ్రేణిలో వెళ్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మధ్య కోల్డ్‌వారు కొనసాగుతోంది. ఇటీవల బుట్టా రేణుకను ఎమ్మిగనూరు నియోజకవర్గ వైకాపా బాధ్యతల నుంచి పార్లమెంట్ వైకాపా బాధ్యురాలిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. నియోజకవర్గ బాధ్యుడిగా మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడు రాజీవ్‌రెడ్డిని నియమించింది. అప్పటి నుంచి ఇద్దరి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి బుట్టా రేణుక తన అనుచరులతో 40 వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆదోని జిల్లా ఏర్పాటుపై నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలియజేసినట్లు మాజీ ఎంపీ వర్గీయులు తెలిపారు. అలాగే పట్టణంలో స్థానిక వైకాపా పార్లమెంట్ కార్యాలయం వద్ద నాయకులతో సమావేశం నిర్వహించారు. బుట్టా రేణుక ఎక్కువగా ఎమ్మిగనూరు పార్టీ కార్యాలయం కేంద్రంగా చేసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఇద్దరు యువకులు గత నెల 27న చించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరు వర్గాల మధ్య చిచ్చురాజేసింది. ఈ క్రమంలో భారీ వాహనశ్రేణితో ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి ర్యాలీగా వెళ్లడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఫ్లెక్సీ చించివేతపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఎమ్మిగనూరు మండలానికి చెందిన ఇద్దరు యువకులే ఫ్లెక్సీని చించినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

(c) eenadu

తల్లిపాలు శ్రేయస్కరం

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉమ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : పిల్లలకు ఆరు నెలల వయసు నుంచి తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉమ సూచించారు. ఆశా దినోత్సవం సందర్భంగా నగరంలోని ఎర్రబురుజు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డా.తేజశ్రీ, డీసీఎం ప్రసాద్, సూపర్‌వైజర్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

ఎండుమిర్చి క్వింటా గరిష్ఠ ధర రూ.15,601

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఎండుమిర్చి ఎరుపు రకాలు క్వింటా గరిష్ఠ ధర రూ. 15,601 పలికింది. వాము క్వింటా గరిష్ఠ ధర రూ. 14,218, వేరుసెనగకాయలు రూ. 7,489, ఆముదాలు రూ. 5,819, మొక్కజొన్న రూ. 1,751, కందుల వడకలు రూ. 2,766, ఉల్లి రూ. 1,409, మినుములు రూ. 6,980, సోయాబీన్స్ రూ. 3,550, సజ్జలను రూ. 2,155తో వ్యాపారులు కొనుగోలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, పత్తికొండ : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ?: సి.క్యాంపు రైతుబజారు వెనుకవీధిలో సచివాలయం సమీపంలో రోడ్డుపై వ్యర్థాలు పేరుకుపోయాయి. - **స్థానికులు**

?: కల్లూరు చెన్నమ్మకూడలి సమీపంలోని పైవంతెన కింద రహదారి అస్తవ్యస్తంగా మారింది. - **వెంకటేశ్**

✔: వ్యర్థాలు తొలగిస్తాం. రహదారికి మరమ్మతులు చేయిస్తాం. - **నగరపాలక సంస్థ అధికారులు**

ఉపన్యసించారు.. బహుమతులు గెలిచారు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని ఎన్ ఆర్ పేటలో ఉన్న సెయింట్ జోసఫ్ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఎన్.జుషికారెడ్డి (తొమ్మిదో తరగతి), సఫా ఖాతూన్ (ఎనిమిదో తరగతి), దుశెట్టి కృతిక (ఏడో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కె.ఐశ్వర, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పోటీల్లో ప్రసంగిస్తున్న విద్యార్థిని

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల (ఎంఎన్ బ్రాంచ్)లో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా మంగళవారం 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రసంగించారు. కె.జాయ్ ప్రవస్తి, ఎ.మేఘన (ఎనిమిదో తరగతి), ఎస్.రిహాన్ (ఏడో తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

బహుమతులు అందుకున్న విజేతలు

వీరికి పాఠశాల ప్రిన్సిపల్ ఆర్ఎండీ అల్తాఫ్ తదితరులు బహుమతులు అందజేశారు.

ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వైకల్యాన్ని ఓడించారు.. విజేతలై నిలిచారు

☛ వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రత్యేక ప్రతిభావంతులు

☛ నేడు దివ్యాంగుల దినోత్సవం

సాధించాలన్న పట్టుదల.. గెలవాలన్న కసి ఉండాలే గాని.. వైకల్యం ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్నారు ప్రత్యేక ప్రతిభావంతులు. పుట్టుకతోనే శారీరక వైకల్యంతో బాధపడుతున్నా.. ప్రోత్సాహం.. సౌకర్యాలు కరవైనా.. నిరాశ చెందకుండా.. నిరంతర శ్రమతో ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుతున్నారు. కొందరు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలుస్తూ గుర్తింపు పొందుతున్నారు. మరికొందరు చిత్రలేఖనం.. ఇతర కళల్లో ఆరితేరి అవార్డులు అందుకుంటున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే మరింత ఉన్నతంగా రాణిస్తామని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

అథ్లెటిక్స్‌లో భవ్య చరితం

పుట్టుకతోనే దివ్యాంగురాలైన భవ్యశ్రీ.. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపుతూ ఆదర్శంగా నిలుస్తోంది. రెండు కాళ్లు పని చేయకున్నా.. అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. క్రీడా మైదానంలోకి అడుగుపెట్టిన తొలిసారే ఆత్మవిశ్వాసంతో ఆడి విజేతగా నిలిచింది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తోంది.

★ నగరంలోని గుత్తి పెట్రోలు బంకు సమీప కాలనీలోని నివసిస్తున్న రత్నకీర్తి, భూపాల్ దంపతుల కుమార్తె భవ్యశ్రీ. పెద్దపాడులోని మోడల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపుతోంది.

★ కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో 2025 జులై 30వ తేదీన జరిగిన దివ్యాంగుల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తొలిసారి పాల్గొని.. షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో బంగారు పతకాలు సాధించింది.

★ 2025 ఆగస్టు 9వ తేదీన విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు గెలుచుకుని జాతీయ స్థాయి ఎంపికైంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఆగస్టులో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించింది. జాతీయస్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రస్తుతం డీఎస్‌ఏ శిక్షకుడు కాశీరావు వద్ద శిక్షణ తీసుకుంటోంది.

మనీషా.. కళలపై ధ్యాస

కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన మనీషా నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఈమె పుట్టుకతోనే దివ్యాంగురాలు. పోలియో బారినపడటంతో రెండు చేతులు పూర్తిగా ఎదగలేదు. వైకల్యాన్ని చూసి నిరాశచెందకుండా చదువుతో పాటు కళల్లో రాణించాలని నిర్ణయించుకుంది. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ చిత్రలేఖనం, గృహాలంకరణ వస్తువుల తయారీ నేర్చుకుంది. ★ ఈఏడాది జనవరిలో సంక్రాంతి పండగ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంది. ★ జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మొదటి బహుమతిని అందుకుంది. ★ ఉలన్ దారాలతో గృహ అలంకరణ వస్తువులు తయారు చేసి విక్రయిస్తూ ఆదాయం పొందుతోంది. చిత్రలేఖనంలో జాతీయస్థాయి బహుమతులు సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది మనీషా.

కృపవరం.. గెలుపు గోల్

కర్నూలు డాక్టర్స్‌కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం (సీఏ) తృతీయ సంవత్సరం చదువుతున్న కృపవరం ఫుట్‌బాల్, చదరంగం క్రీడల్లో రాణిస్తున్నాడు. 2018లో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యులు ఓ చెయ్యి తొలగించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో చదువులో, ఆటల్లో రాణిస్తున్నాడు. ఫుట్‌బాల్, చదరంగం క్రీడలు నేర్చుకుని నిత్యం సాధన చేస్తున్నాడు. ★ 2024 నవంబరు 23న ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన క్లస్టర్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పెనాల్టీ గోల్ కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. ★ 2024 జనవరిలో జరిగిన చదరంగం పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ★ ఫుట్‌బాల్, చదరంగంలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించాలన్న లక్ష్యంతో శిక్షణ తీసుకుంటున్నట్లు చెబుతున్నాడు కృపవరం.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌరవాధ్యక్షుడు పుల్లయ్య తదితరులు

పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గించాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : చదువు, మార్కులు, ర్యాంకుల పేరుతో పిల్లల్లో మానసిక ఒత్తిడి పెరిగిపోతోందని బాలోత్సవం గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య, అధ్యక్షుడు జంధ్యాల రఘుబాబు, కార్యదర్శి ధనుంజయ పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించకపోతే వారి మానసిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందన్నారు. స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం వారు బాలోత్సవం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం తల్లిదండ్రులు పిల్లలతో గడిపేందుకు సమయం కేటాయించకపోవడంతో వారు చరవాణులకు అలవాటు పడుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల నుంచి వారు బయటపడాలంటే బాలోత్సవం వంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో డిసెంబరు 9, 10 తేదీల్లో నిర్వహించే బాలోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డా. కె.స్వాతి, ప్రైవేటు విద్యా సంస్థల జిల్లా గౌరవాధ్యక్షుడు పి.బి.వి.సుబ్బయ్య, అధ్యక్షుడు వాసుదేవయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థల సీఈవో విల్సన్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా. అక్తర్‌బాను, బాలోత్సవం ప్రతినిధి జె.ఎన్.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలులో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటు చేయించాలని కోరుతూ కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డిని జిల్లా వడ్డెర సంఘం నాయకులు కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ.. కర్నూలులో వడ్డె ఓబన్న విగ్రహం ఏర్పాటుకు తమవంతు సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. తిక్కారెడ్డిని కలిసిన వారిలో జిల్లా వడ్డెర సంఘం నాయకులు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సాతునూరు మంజునాథ్, వడ్డెర

హైదరాబాద్‌లో తిక్కారెడ్డిని కలిసిన వడ్డెర కుల సంఘం నేతలు

కుల సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ కృష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, జాతీయ యువజన సంఘం అధ్యక్షుడు వేముల భరత్ తదితరులు ఉన్నారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా కేసీ నాగన్న

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని బీసీ భవనంలో మంగళవారం జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, రవీంద్ర విద్యా సంస్థల అధినేత గూడూరు పుల్లయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేసీ నాగన్న, ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, నగర కమిటీ అధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మకొండ రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కుమ్మర్లకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మాట్లాడుతున్న పుల్లయ్య

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించండి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల నుంచి స్థానిక పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని సంచార చికిత్స కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ రఘు సూచించారు. హుసేనాపురం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య, ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సుప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి రాబర్ట్, పీహెచ్‌ఎన్ సిల్లజ్యోతి, పర్యవేక్షకులు ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రఘు

కార్మిక చట్టాల రద్దును వ్యతిరేకించాలి

మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు గోపాల్

ఓర్వకల్లు న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయాలని ప్రయత్నిస్తోందని, దీనిని కార్మికులు వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గోపాల్ పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తల దినోత్సవం సందర్భంగా నన్నూరు పీహెచ్‌సీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో కొత్తగా నాలుగు కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల గొంతు నొక్కేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు అఖిల భారత మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు షాజాహాన్, శ్రీధర్, ఆశా వర్కర్ల సంఘం నాయకులు కాంతమ్మ, సరోజ, సుశీల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు

ఓర్వకల్లు న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మీదివేముల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 1న ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు పాల్గొని మొదటి స్థానంలో నిలిచి కప్పు గెలిచారన్నారు. ఈ సందర్భంగా కప్పు సాధించిన స్వాతి, మైత్రిని, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, అరుణకుమారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పన్నుల వసూలులో నిర్లక్ష్యం తగదు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పన్నుల వసూలులో నిర్లక్ష్య వైఖరి తగదని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. నగరపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ విభాగ సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్షించారు. మొండి బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగ అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
ఈ.పి.నెం. 12/2025 in ఓ.యస్. 710/2023
ఎ.సత్యనారాయణ - డిక్రీ హోల్డర్
వర్సెస్
ఎస్.రాఘవేంద్ర చారి - జె.డి.ఆర్
నోటీసు అండర్ ఆర్డర్ 21 రూల్ 34 ఆఫ్ సిపిసి టూ జె.డి.ఆర్
ఎస్.రాఘవేంద్ర చారి, తండ్రి. సోమలింగం ఆచారి, షాప్ నెం.102, కెపియస్‌యస్ షాపింగ్ కాంప్లెక్స్, కొండారెడ్డి బురుజు ఎదురుగా, కర్నూలు. యాస్ ఫర్ సేల్ డీడ్, తేది: 11-02-2020 రెసైడింగ్ అట్, ఇంటి నెం. 42/19, గాలి గేరి, కర్నూలు.
ప్రెసెంట్లీ రెసైడింగ్ అట్ ఇంటి నెం. 45/24/ఎ-29-4, పాల కొట్టాలు, అశోక్ నగర్, కర్నూలు- 518 005.
పై అమలు అర్జీని డి.హెచ్.ఆర్, జె.డి.ఆర్ అయిన నీ నుంచి డిక్రీ మేరకు డిక్రీ తాలూకా షెడ్యూల్ షాపు విక్రయ పత్రం తన పేరున రిజిస్టర్ చేసి ఇవ్వమని అమలు అర్జీ దాఖలు వేసియున్నాడు. పై ఈ.పి నీ హాజరుకై 10-12-2025 ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసియున్నాడు. ఆ దినము నీవు ఇద్దునగాని, వకీలు ద్వారా గాని, హాజరై నీకు గల అభ్యంతరములు తెలుపుగొనగలవు. లేని యెడల పై అర్జీ నీ పరోక్షమున తీర్మానించబడును.
షెడ్యూలు: షాపు నెం.102, మొదటి అంతస్తు, కర్నూలు పట్టణ స్వర్ణకార సంఘం షాపింగ్ కాంప్లెక్సు, కొండారెడ్డి బురుజు ఎదురుగా, కర్నూలు టౌన్.
హద్దులు: తూర్పు: పాత బస్టాండ్, **పడమర:** రస్తా, **ఉత్తరం:** షాపు నెం.101, షైపుల్లాకు చెందినది, **దక్షిణం:** షాపు నెం.103, మక్బుల్‌కు చెందినది.
(By Order of the Court)
సం/- యెదిరె శ్రీనివాసులు,
డి.హెచ్.ఆర్.పరం వకీలు, కర్నూలు.
Cell: 94402 53979

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేస్తాం

మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు, నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు రోడ్డులో రహదారి విస్తరణ పురోగతిపై నగరపాలక కార్యాలయంలో మంగళవారం ఆయన పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షించారు. రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి సిటీ ప్లానర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో తప్పుల్లేకుండా పూర్తి చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మంగళవారం ఆయన బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఓటరు వివరాలు, చిరునామా, ధ్రువీకరణ కుటుంబ సభ్యుల సమాచారం యాప్‌లో నమోదు చేయాలన్నారు. మ్యాపింగ్ శాతం పెంచాలన్నారు. సమావేశంలో తహసీల్దారు రవికుమార్, అదనపు ఏఈఆర్వోలు ఆర్జీవీ కృష్ణ, సతీష్‌కుమార్‌రెడ్డి, పీవీ శేషసాయి పాల్గొన్నారు.

925 మందిపై కేసులు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : చరవాణిలో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా కట్టడి చేసేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు 30వ తేదీ వరకు 925 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని సూచించారు.

ఎండు ఫలాల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగరంలోని ఎండు ఫలాల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, తూనికలు కొలతలశాఖ, ఆహార భద్రత శాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా దాడులు చేశారు. కర్నూలులోని బార్‌కాటి ట్రేడర్స్, ఎం/ఎస్ మదీనా డ్రై ఫ్రూట్స్ హౌస్ దుకాణాలపై దాడి చేశారు. లీగల్ మెట్రాలజీ ప్రీ-ప్యాకేజ్డ్ కమోడిటీ నిబంధనలు పాటించకపోవడంతో ఒక్కో దుకాణానికి రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. బ్లాక్‌బెర్రీ, స్ట్రాబెర్రీ, రోస్ బెర్రీ, మాంగో డ్రైఫ్రూట్ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఎం/ఎస్ మదీనా డ్రైఫ్రూట్స్ హౌస్‌లో పాకిస్థాన్ దేశానికి చెందిన ఆరు రూహ్‌అఫ్జా (షర్బత్) సీసాలు లభ్యమయ్యాయి. నేరుగా దిగుమతి చేసుకున్నట్లు పరిగణించి వాటిని జప్తు చేసి సెంట్రల్ ఎక్సైజ్‌శాఖకు అప్పగించి పరిశీలించాలని సూచించారు.

మహిళా దొంగ అరెస్టు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని జొహరాపురానికి చెందిన షేక్ యాస్మిన్‌ను కర్నూలు మూడో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితురాలు ఇళ్లలో పనిచేసేది. ఈనెల 1వ తేదీన జయరాంనగర్‌కు చెందిన దేవమ్మ (67) రేషన్ దుకాణం నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా యాస్మిన్ దాడి చేసి ఆమె గొంతుపై కాలు పెట్టి బెదిరించి మెడలోని బంగారు గొలుసు తెంచుకొని పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలిని యాస్మిన్‌గా గుర్తించిన పోలీసులు ఆమెను అరెస్టు చేసి బంగారు గొలుసుతో పాటు కత్తి, కత్తెర, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

ఇద్దరికి జైలుశిక్ష.. జరిమానా

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : మహిళపై దాడి కేసులో కర్నూలులోని గణేశ్‌నగర్‌కు చెందిన ఇద్దరికి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అనిల్‌కుమార్ మంగళవారం తీర్పు ఇచ్చారు. స్థానిక గణేశ్‌నగర్‌కు చెందిన ఉప్పరి లక్ష్మీదేవికి బ్యాంకు రుణం ఇప్పిస్తామని పిడతల వెంకటస్వామిలు రూ.70 వేలు తీసుకున్నారు. లోను ఇప్పించకపోవడంతో ఆమె 2018 మే 23న వెంకటస్వామి చెల్లెలు పిడతల లక్ష్మీదేవిని ప్రశ్నించారు. ఆమె అన్నకు ఫోన్‌చేసి పిలిపించింది. అక్కడికి చేరుకున్న వెంకటస్వామితో కలిసి ఉప్పరి లక్ష్మీదేవిపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఇద్దరిపైన నేరం రుజువు కావడంతో పిడతల లక్ష్మీదేవికి ఏడాది జైలుశిక్ష రూ.13 వేల జరిమానా, పిడతల వెంకటస్వామికి ఏడాది జైలుశిక్ష రూ. 11 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు
ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడే న్యాయమూర్తులకు, న్యాయవాదులందరికీ న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు..

G.S.Vijaya Bhaskar Reddy
Advocate / Legal Advisor
H.No. 87-1077-1, Ganesh Nagar, Kurnool. Cell: 99854 74567.

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు
ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడే న్యాయమూర్తులకు, న్యాయవాదులందరికీ న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు...
M.R.క్రిష్ణా, Advocate, కర్నూలు. Cell: 94410 92644
సి.సి.వి.రంగారెడ్డి, Advocate, నందికొట్కూరు, Cell: 94410 32210

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు
శ్రీ కళాజ్యోతి హ్యాండిక్రాఫ్ట్ వేల్ఫేర్ సొసైటి
చేనేత మేళ
తేది: 1-12-2025 నుండి 7-12-2025 వరకు
స్థలం: విజ్ఞాన మందిర్, బి.క్యాంపు, కర్నూలు

ప్రమాదాలకు అడ్డాదారి

■ సంతోష్‌నగర్‌లో తరచూ పాదచారుల మృత్యువాత

■ ఆర్‌యూబీ నిర్మించాలని ప్రజల విన్నపం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : నగర పరిధిలోని సంతోష్‌నగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ జాతీయ రహదారికి ఒకవైపు సంతోష్‌నగర్, విజయలక్ష్మినగర్, గీతాముఖర్జీనగర్ ఇతర కాలనీలు ఉండగా.. మరోవైపు బాలాజీనగర్, స్టాంటన్‌పురం ఇతర కాలనీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 60 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అత్యధికులు కార్మికులు, పేదలు కావడంతో ఉపాధి నిమిత్తం నిత్యం హైవే దాటి నగరంలోకి వచ్చి వెళ్తుంటారు. ఇటువైపు వారు అటువైపు.. అటువైపు వారు ఇటువైపు వెళ్లేందుకు రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. రాత్రిళ్లు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఏటా పదిమందికి పైగా మృతి చెందుతుండగా.. వందలాది మంది గాయపడుతున్నారు.

☛ గతంలో సంతోష్‌నగర్, బాలాజీనగర్ కాలనీలకు మధ్య హైవేలో కూడలి ఉండేది. వాహనచోదకులు, పాదచారులు ఆ కూడలి మీదుగా హైవే దాటేవారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరిగేవి. దీంతో అధికారులు కూడలిని మూసివేశారు.

☛ కూడలి మూసివేశాక సంతోష్‌నగర్ వాసులు బాలాజీ నగర్ వైపు వెళ్లాలన్నా.. అటువైపు వారు ఇటువైపు రావాలన్నా ఈద్గా వద్ద ఉపరితల వంతెన కింద ఉన్న అండర్‌పాస్ మార్గం ద్వారా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇందుకోసం

సంతోష్‌నగర్ వద్ద డివైడర్ మీదుగా హైవే దాటుతున్న మహిళలు

సుమారు 2 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. పాదచారులు అంత దూరం వెళ్లలేక గతంలో కూడలి ఉన్న ప్రాంతంలోనే రోడ్డు దాటుతూ ప్రమాదాల్లో పడుతున్నారు. సంతోష్‌నగర్- స్టాంటన్‌పురం కూడలి వద్ద ఆర్‌యూబీ (రోడ్ అండర్ బ్రిడ్జ్) నిర్మించి ప్రమాదాలు నివారించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు దాటే మార్గం చూపండి

గాల్లో ప్రాణాలు

☛ బాలాజీనగర్ సమీప కొండారెడ్డి నగర్‌కు చెందిన నాగరాజు సంతోష్‌నగర్‌వైపు ఉండే ఓ వాహన షోరూంలో రాత్రి కాపలాదారుడిగా పనిచేసేవారు. మూడు రోజుల కిందట రాత్రి సమయంలో భోజనం కోసం హైవే దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మృత్యువాతపడ్డారు.

☛ సంతోష్‌నగర్ వెనుక ఉన్న గీతాముఖర్జీనగర్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ ఇటీవల లోకాయుక్త కార్యాలయం ఎదుట హైవే దాటుతుండగా గుర్తు తెలియని ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయారు.

☛ గుజరీ దుకాణంలో పనిచేసే మొహ్మద్‌బాషా సంతోష్‌నగర్ కూడలిలో హైవే దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతి చెందారు.

☛ గీతాముఖర్జీనగర్‌కు చెందిన స్థిరాస్తి ఏజెంట్ వహీద్ బాలాజీనగర్ వైపు ఉన్న మసీదులో ప్రార్థన పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లేందుకు హైవే దాటుతుండగా కారు ఢీకొట్టడంతో మృత్యుఒడికి చేరారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు పిలుపునిచ్చారు. స్థానిక కేకేభవన్‌లో మంగళవారం మహాసభల గోడపత్రాలు విడుదల చేశారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ఎమ్మిగనూరులో ఈనెల 4న నిర్వహించే ఏపీ మహిళ సమాఖ్య జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిలు పిలుపునిచ్చారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : స్థానిక చంద్ర రాజేశ్వరరావునగర్‌లో సర్వనా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు మంగళవారం దుప్పట్లను పంపిణీ చేసినట్లు సంస్థ డైరెక్టర్ సుప్రజిత్తు, పాస్టర్ జావోబ్, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : జనవరి 7వ తేదీన నిర్వహించే హోటల్స్ అండ్ బేకరీ కార్మికుల సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, వెంకటేష్, కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు
ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడే న్యాయమూర్తులకు, న్యాయవాదులందరికీ న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు...

కనికే రవికుమార్
అడ్వకేట్ & Ex.O.R.
కర్నూలు. సెల్: 94405 03215

న్యాయ వాదుల దినోత్సవ శుభాకాంక్షలు
ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడే న్యాయమూర్తులకు, న్యాయవాదులందరికీ న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు..

వై.ప్రకాష్ రెడ్డి, B.A. BL.
Advocate & Notary
ఇ.నెం. 62/230, సెంట్రల్ లైబ్రరీ వెనుక, యస్.నాగప్ప వీధి, కర్నూలు
సెల్: 99490 79234, 08518-243234

(c) eenadu

ప్రమాదం అంచున ప్రయాణం

నంద్యాల నుంచి భీమవరానికి వెళ్లే దారిలో మద్దిలేరు వాగుపై వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు కూలాయి. వంతెనకు అడుగు భాగంలో ఇనుప చువ్వలు బయటపడ్డాయి. వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. వాహనాలు ఎదురుపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు నూతన వంతెనను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

గుంతల్లో నీరు.. గుప్పిట్లో ప్రాణాలు

నందికొట్కూరు నుంచి కొణిదేల వెళ్లే మార్గంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన లేఅవుట్‌లో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీ చుట్టూ క్వారీ గుంతలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఉండేందుకు సుముఖత చూపడం లేదు. ఫలితంగా చాలా ఇళ్లు నిరుపయోగంగా మారాయి. – ఈనాడు, నంద్యాల

విధిని ఎదిరించి.. గెలుపును ఆస్వాదించి

వీల్‌ఛైర్‌లో నుంచే బౌలింగ్ చేస్తూ..

నంద్యాల పట్టణంలోని ముల్లాన్‌పేటకు చెందిన ఫక్రుద్దీన్ చిన్నప్పుడే పోలియో బారిన పడ్డారు.. నడవలేనని కుంగిపోలేదు.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగారు.. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నారు. వీల్‌ఛైర్‌లో కూర్చొనే బ్యాటింగ్, బౌలింగ్ చేస్తారు. 2018లో ఆంధ్రప్రదేశ్ జట్టులో సభ్యుడిగా స్థానం సంపాదించారు. రైట్‌హ్యాండ్ బ్యాటర్‌గా రాణించడమే కాక బౌలర్‌గానూ ప్రతిభ చాటి ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2022లో సౌత్‌జోన్ జట్టులో స్థానం సాధించి ఉత్తమ క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. గతేడాది తమిళనాడులో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొని బౌలింగ్‌లో ప్రతిభ చాటారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్వాలియర్‌లో జరిగిన 4వ జాతీయ స్థాయి వీల్‌ఛైర్ క్రికెట్ కప్ పోటీల్లో రాణించి బహుమతులు అందుకున్నారు. ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు బెంగళూరులో జరిగే ఏఎస్‌పీఎల్ కప్పులో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు. ఎంబీఏ వరకు చదివిన అతను బండిఆత్మకూరు తహసీల్దారు కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల గాంధీచౌక్

సర్వీసు ఇనామమే

■ 16 ఎకరాల భూమిపై కన్ను ■ రిజిస్ట్రేషన్‌కు విశ్వప్రయత్నాలు

సర్వీసు ఇనాం భూమిలో నిర్మించిన ప్రహరీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : గ్రామానికి సేవ చేసే వ్యక్తులకు ఇచ్చే సర్వీసు ఇనాం భూములపై అక్రమార్కులు కన్నేశారు. రూ.కోట్ల విలువ చేసే పొలాన్ని అభివృద్ధి పేరుతో తీసుకున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, మున్సిపల్ శాఖలపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు.

సాగు మరిచి బేరం

నంద్యాల పురపాలక సంఘంలో విలీన గ్రామం.. వెంకటేశ్వరపురం. ఐదేళ్ల కిందటి వరకు నంద్యాల మండలంలోని ఉడుమాల్పురం పంచాయతీకి మజరా గ్రామం. ఈ గ్రామంలోని ఓ వర్గానికి చెందిన కొంతమందికి సర్వీసు ఇనాం కింద సర్వే నంబరు 611లో సుమారు 16 ఎకరాలను ప్రభుత్వం ఇచ్చింది. ఈ పొలాన్ని సదరు వ్యక్తులు సాగు చేసుకునేందుకు మాత్రమే అర్హులు. విక్రయించేందుకు, భూములపై రుణాలు తీసుకునేందుకు, ఇతర ఏ రకమైన లావాదేవీలు జరిపేందుకు వీలు లేదు.

అభివృద్ధి పేరుతో ఒప్పందం

ప్రభుత్వం సర్వీసు ఇనాంగా ఎవరికైతే ఈ భూమిని స్వాధీనం చేసిందో.. సదరు వ్యక్తులను ఓ ‘రియల్టర్’ కలిశాడు. తాను అన్ని వ్యవహారాలు చక్కబెడతానని నమ్మించాడు. అభివృద్ధి పేరుతో తనకు అధికారికంగా రాసివ్వాలని ‘షరతు’ పెట్టాడు. ‘తనకు 60 శాతం.. వారికి 40 శాతం’ చొప్పున ఒప్పందం చేసుకున్నాడు. కొన్ని నెలల కిందట హడావుడిగా 16 ఎకరాల స్థలంలో గోడ కట్టారు. ప్లాట్లు వేసేందుకు కంకర తదితర నిర్మాణ సామగ్రి తోలాడు. ఆ తర్వాత రెవెన్యూ దస్త్రాల్లో సర్వీసు ఇనాం పేరును తొలగించుకునేందుకు పావులు కదిపాడు.

రూ.50 కోట్ల పైమాటే..

● 40వ నంబరు జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ భూమి విలువ బహిరంగ విపణిలో సుమారు రూ.50 కోట్లు పైమాటే. దీనిపై కన్నేసిన స్థిరాస్తి వ్యాపారి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు గాను ప్రణాళికలు రూపొందించాడు. గత కొన్ని నెలలుగా సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. రాజకీయ నేతల అండదండలతో స్వాధీనం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. మరోవైపు సర్వీసు ఇనాం భూమిలో ప్రహరీ నిర్మించినా అధికారులు పట్టించుకోలేదు.

● ఈ పొలాల పక్కనే ఉన్న రహదారి వెంకటేశ్వరపురం నుంచి బలపనూరు, పోలూరు గ్రామాలకు వెళుతుంది. దీని మీదుగానే ‘రింగు రోడ్డు’ వస్తుందని ప్రచారం చేశారు. రాజధాని స్థాయిలోనూ కొందరు అధికారులను కలిసి ల్యాండ్ కన్వర్షన్‌కు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

శివోహం

శ్రీశైల మహాక్షేత్రంలో శివదీక్షా భక్తుల రద్దీ కొనసాగుతోంది. కార్తిక మాసంలో శివదీక్షలు ధరించిన భక్తులు జ్యోతిర్ముడులు సమర్పించేందుకు భారీగా శ్రీశైలానికి తరలివస్తున్నారు. శివదీక్షా భక్తులకు దేవస్థానం అధికారులు ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. భక్తులతో ఆలయ క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. ఈనెల 5వ తేదీ వరకు జ్యోతిర్ముడి కలిగిన శివదీక్షా భక్తులకు స్పర్శ దర్శనం కల్పించనున్నారు. –న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

పెద్దలు జైకిసాన్ పిల్లలు జైజవాన్

దేశమే తమ ఊరుగా.. సరిహద్దే ఇల్లుగా.. చెట్టూ చేమలే చుట్టాలుగా.. దేశ రక్షణే తమ లక్ష్యంగా కోవెలకుంట్ల మండలం బిజినవేముల యువతరం ముందుకు నడుస్తోంది. పెద్దలు జైకిసాన్ అంటే వారి పిల్లలు జైజవాన్ అంటున్నారు..

“డిగ్రీ వరకు చదివి వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. మా గ్రామానికి చెందిన పలువురు సైన్యంలో పని చేస్తున్నారు. వారు సెలవుల్లో సొంతూరుకొచ్చి యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు.. వారిచ్చిన మెలకువలతో నేను ఏడేళ్ల కిందట సైన్యంలో చేరా. ప్రస్తుతం లాన్స్ నాయక్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్నా” అని నాగేశ్వరరెడ్డి చెప్పారు.

కుటుంబాలు	విధుల్లో సైనికులు	విశ్రాంత సైనికులు	ఇతర ఉద్యోగాల్లో
650	60	102	342

● 45 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన సంజీవరాయుడు సైన్యంలో చేరారు. ఆయన స్ఫూర్తితో మిగిలిన ఇద్దరు సోదరులు చేరి సేవలందించారు. ఆ తర్వాత గ్రామంలో ఒకరిని చూసి ఒకరు సైన్యంలో చేరిపోయారు. యువకులు విశ్రాంత జవాన్ల సూచనలు, సలహాలు తీసుకొని విజయకేతనం ఎగురవేస్తున్నారు. సీనియర్లు యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు ఇస్తున్నారు.. పరుగు, వ్యాయామం, ఎంపిక విధానం, రాత పరీక్ష తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. “సీనియర్లను ఆదర్శంగా తీసుకొని 2004లో సైన్యంలో చేరా. జమ్మూకశ్మీర్, సిక్కిం, దిల్లీ తదితర ప్రాంతాల్లో 17 ఏళ్లపాటు సేవలందించి 2021లో ఉద్యోగ విరమణ చేశా. ప్రస్తుతం హైదరాబాద్‌లో పీఎఫ్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్నా” అని హబీబుల్లా తెలిపారు. – న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

పక్షులు చెక్కిన కళాకృతి

వందలాది పక్షులు ఒకేసారి గుంపుగా ఎగిరితే.. ఓ అద్భుత కళాకృతి ఆవిష్కృతమవుతుంది. ఇలాంటి చిత్రమే పగిడ్యాల మండలం ముచ్చుమర్రి శివారులో కనిపించింది. పంట పొలాలపై వందలాది గోరింకల గుంపు ఎగురుతూ కనిపించిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. – ఈనాడు, నంద్యాల

ఇనుప ఖనిజం ఖద్దరు పెత్తనం

■ నేతల మధ్య ఐరన్ వార్

రామళ్లకోటలో నిల్వ ఉంచిన ఇనుప ఖనిజం

వెల్దుర్తి, న్యూస్‌టుడే : అక్రమంగా తవ్వకాలు చేపట్టిన ఖనిజాన్ని సక్రమం చేసేందుకు అక్రమార్కులు అడ్డదారులు తొక్కుతున్నారు. డోన్ నియోజకవర్గం నుంచి వస్తున్న సరకును పత్తికొండ నియోజకవర్గంలోని లీజు మైన్స్‌కు తరలించడంపై రెండు నియోజకవర్గాల నేతల మధ్య ఐరన్‌వార్ తలెత్తింది. వారి కారణంగా లీజు గనుల నిర్వాహకుడు ఇబ్బందులకు గురవుతున్నారు. సరకు తీసుకోకుంటే ఒకరి నుంచి సమస్య.. లేదంటే మరో నేత నుంచి బెదిరింపులు తప్పడం లేదని లీజుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి లేకుండానే..

వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి ప్రాంతంలో అనుమతులు లేకనే ఇనుప ఖనిజంతోపాటు సిలికా శాండ్, పచ్చసుద్ద తవ్వకాలు సాగుతున్నాయి. బేతంచెర్ల మండలంలోని ముద్దవరం, పెండేకల్లు, గూటుపల్లి ప్రాంతాల్లోనూ తవ్వకాలు చేపట్టారు. ఒక్కో టిప్పరులో 12 టన్నుల చొప్పున వారంలో 20 టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. జిల్లా సరిహద్దులు దాటించి మరో జిల్లాకు సంబంధించిన లీజు మైన్స్‌కు తరలిస్తున్నారు. నేతల ప్రమేయం ఉండటంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. “వెల్దుర్తి మండలంలోని లీజు మైన్స్‌లో తవ్వకాలు చేపట్టి సరకు తరలిస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. మైన్స్‌లోని సరకు నమూనాలు సేకరించాం. పరిశీలించి చర్యలు తీసుకుంటామని” గనుల శాఖాధికారి రామ్‌చందర్ పేర్కొన్నారు.

అక్కడ తవ్వి.. ఇక్కడ నిల్వ చేసి

✦ వెల్దుర్తి, బేతంచెర్ల, డోన్ మండలాల్లో ఇనుప ఖనిజం నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. తవ్వకానికి లీజుకు తీసుకొన్న భూముల్లో నిక్షేపాలు తక్కువగా ఉండటం.. నాణ్యత అంతగా లేకపోవడంతో అక్రమ తవ్వకాలకు తెరతీశారు. నిక్షేపాలు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో తవ్వకాలు సాగిస్తున్నారు.

✦ తవ్విన ఇనుప ఖనిజాన్ని వెల్దుర్తి మండలం రామళ్లకోటలోని లీజు అనుమతులు ఉన్న మైన్స్‌కు రాత్రికిరాత్రే తరలిస్తున్నారు. లీజు మైన్స్‌దారుడిని బెదిరించి బిల్లులు పొందుతున్నారు. లీజు మైన్స్‌లో తవ్విన ఇనుప ఖనిజం గ్రేడ్‌ను.. సరకు గ్రేడ్‌ను అధికారులు సరిచూడాలి. వ్యత్యాసముంటే రాయల్టీలు అందించకూడదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఈ నిబంధనలేవీ అమలుకావడం లేదు.

విత్తన కలవరింత

ఆళ్లగడ, రుద్రవరం, న్యూస్‌టుడే : రైతులకు అండగా నిలవాల్సిన వ్యవసాయ శాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. విత్తనాలు అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కాలువల్లో నీరు సమృద్ధిగా ప్రవహిస్తుండటంతో రబీలోనూ వరి సాగుకే అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు. కేసీ, తెలుగు గంగ, ఎస్సార్బీసీ కింద ఆరుతడి పంటలే సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ నుంచి విత్తనం పరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందవు. దీంతో గత్యంతరం లేక రైతులు విత్తనం కోసం ప్రైవేటు ఏజెన్సీలనే ఆశ్రయిస్తున్నారు.

అన్నదాతకు తప్పని కష్టాలు

- ఆళ్లగడ్డ పరిధిలో రబీలో ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా, షుగర్‌లెస్) రకంపై ఎక్కువ మంది దృష్టి పెట్టారు. ఈ రకం వంగడాన్ని వ్యవసాయ శాఖ గుర్తించనప్పటికీ మంచి దిగుబడితోపాటు రుచి నేపథ్యంలో విత్తనాల సేకరణకు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ రకం పంట కాలం 120 రోజులు. ఎకరాకు 40 బస్తాల దిగుబడి వరకు వస్తుంది. గతేడాది రబీలో నంద్యాల జిల్లావ్యాప్తంగా 30 వేల ఎకరాల్లో ఈ రకం వరి సాగైనట్లు అంచనా.
- రబీలోనూ అత్యధికంగా సాగు చేసే ఎన్‌డీఎల్ఆర్, బీపీటీ5204 (నంద్యాల, కర్నూలు సోనా) రకాల వరి విత్తనాలను పలువురు రైతులు ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గతేడాది నంద్యాలలోని ఓ ఏజెన్సీ నుంచి ఎక్కువమంది విత్తనాలు కొనుగోలు చేశారు. మంచి దిగుబడులు రాక నష్టపోయారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో ఈ రకం విత్తనాల కోసం ఇతర ప్రైవేటు ఏజెన్సీల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

జంట హత్యల కలకలం

■ నంద్యాలలో ఇద్దరు యువకుల దారుణ హత్య
■ అమ్మను ఎందుకు కొట్టావని ప్రశ్నించినందుకు దాడి

కొమ్ము పెద్దన్న

సురేష్ (పాత చిత్రాలు)

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ‘మా అమ్మను ఎందుకు కొట్టావు’ అని అడిగేందుకు వెళ్లిన బావ తమ్ముడు, అతడి మిత్రుడిని.. బావమరిది కత్తితో పొడిచి అతి దారుణంగా హత్య చేసిన ఘటన నంద్యాల పట్టణంలో కలకలం రేపింది. నంద్యాల పట్టణం హరిజనపేటకు చెందిన కొమ్ము నాగలక్ష్మమ్మ, కొమ్ము వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరు పశువులను మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండో కుమారుడు కొమ్ము మధు, భార్య మహాలక్ష్మి సోమవారం గొడవ పడ్డారు. అదే కాలనీలో ఉంటున్న మహాలక్ష్మి తమ్ముడు చట్ల రాజ్‌కుమార్ విషయం తెలుసుకొని అక్క ఇంటికి వెళ్లి బావతో గొడవ పడుతుండగా.. నాగలక్ష్మమ్మ అడ్డుగా వెళ్లారు. రాజ్‌కుమార్ ఆగ్రహంతో ఆమెను కొట్టడంతో గాయాలయ్యాయి. ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న చిన్న కుమారుడు కొమ్ము పెద్దన్న (25) రాత్రి 9 గంటలకు విధులు ముగిశాక ఇంటికి వెళ్లేసరికి తల్లి గాయాలతో ఉండటంతో స్థానిక సర్వజన ఆసుపత్రిలో చేర్పించాడు. తన తల్లిని కొట్టాడన్న కోపంతో కొమ్ము పెద్దన్న.. తన మిత్రుడు ఉప్పరిపేటకు చెందిన చాకలి సురేష్ (25)తో కలిసి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లాడు. మా అమ్మను ఎందుకు కొట్టావని గట్టిగా నిలదీశాడు. దీంతో ‘మా ఇంటికే వస్తారా?’ అని కోపోద్రిక్తుడైన రాజ్‌కుమార్ కత్తితో సురేష్, పెద్దన్నను పొడిచాడు. స్థానికులు వెంటనే వారిద్దరిని సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే పెద్దన్న చనిపోయాడు. సురేష్ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. రాజ్‌కుమార్, అతని తండ్రి లక్ష్మయ్య, తల్లి సరస్వతి, మహాలక్ష్మిని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి సీఐ అస్రర్‌బాషా తెలిపారు.

★ జంట హత్యల నేపథ్యంలో హరిజనపేటలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. నిందితుడి ఇంటి వద్దనున్న ద్విచక్ర వాహనానికి బాధితుల బంధువులు నిప్పంటించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. ఆసుపత్రికి ఇరువర్గాల వారు చేరుకోవడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలక్షమా.. అక్రమాలకు సాక్ష్యమా

■ 1.02 లక్షల స్మార్ట్ రేషన్‌కార్డులు వెనక్కి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : చౌక ధరల దుకాణాల ద్వారా సరకుల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబరులో ఉమ్మడి జిల్లాకు 12.10 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపారు. రెండు నెలలకు పైగా గడిచిపోయినా ఇప్పటికీ పంపిణీకి నోచుకోని స్మార్ట్ కార్డులు లక్షకు పైగా ఉండటం గమనార్హం. దీంతో పంపిణీకి నోచుకోని కార్డులను సరెండర్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

● ఉమ్మడి జిల్లాలో 12.01 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు ఉండగా.. డీలర్ల ద్వారా గత రెండు నెలల్లో 3,40,787 కార్డులను పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 7,58,183 మందికి కార్డులను అందజేశారు. ఇంకా 1,02,544 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీకి నోచుకోలేదు. వీటికి సంబంధించిన లబ్ధిదారులు ఉన్నారా లేరా.. ఉంటే ఎక్కడున్నారో తెలియని పరిస్థితి.

● వీటి పంపిణీకి ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు నవంబరు 30 వరకు గడువు ఇచ్చింది. పంపిణీ ఎందుకు జరగలేదో కారణాలు పేర్కొంటూ వివరణ ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గడువు ముగిసిన నేపథ్యంలో కార్డులను సరెండర్ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అడ్డగోలు మ్యాపింగ్‌తో చిక్కులు

▸▸ గత వైకాపా ప్రభుత్వంలో వాలంటీర్ల ద్వారా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. వారు ఇష్టానుసారం చేయడంతో పెద్దఎత్తున తప్పులు దొర్లాయి. ఒక ప్రాంతంలోని లబ్ధిదారుల కార్డులో మరో ప్రాంతంలోని చౌకదుకాణం పరిధిలో చూపారు. దీంతో తమ కార్డు ఎక్కడుందో లబ్ధిదారులకు తెలియని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా పలువురు స్మార్ట్‌కార్డులు వచ్చినా తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది.

▸▸ మరణించిన కుటుంబ సభ్యుల పేర్లను కార్డుల నుంచి తొలగించలేదు. మ్యాపింగ్ కూడా సరిగా చేయలేదు. ఈ తప్పులను సరిదిద్దకుండానే సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి జాబితా పంపించడంతో హడావుడిగా కొత్తకార్డులు ఇచ్చేశారు. కొన్ని ప్రాంతాల్లో కుటుంబానికి రెండు మూడు, మృతుల పేరుతోనూ కార్డులు ఇచ్చేసిన దాఖలాలున్నాయి. అప్పట్లో రేషన్ పంపిణీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి.

▸▸ కూటమి ప్రభుత్వం కూడా అదే జాబితాను అనుసరించడంతో పెద్దసంఖ్యలో కార్డులు మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు మిగిలిపోయిన కార్డులు సాక్ష్యంగా నిలుస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంచి కోరారు.. నిండా ముంచారు

బాధితుడు సుబ్బ గోవిందయ్య

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పది మందికి పనికొచ్చే పంట కాలువే కదా.. అని ఆయన ముందూ వెనక ఆలోచించకుండా ఉన్న కొద్దిపాటి పొలం అప్పగించారు. పరిహారం ఇస్తామని అధికారులు చెబితే నమ్మి వారు చెప్పినచోటల్లా సంతకాలు పెట్టారు. తీరా పైకం ఇచ్చేటప్పుడు దస్త్రాలు సరిగా లేవని వెనక్కి పంపేశారు. అన్నింటినీ సక్రమంగా చేసుకొచ్చిన తర్వాత అదిగో ఇదిగో అంటూ తిప్పుతున్నారు. అవుకుకు చెందిన సుబ్బ గోవిందయ్య (65)కు సర్వే నంబరు 391లో 34 సెంట్లు, 392లో 30 సెంట్లు కలిపి 64 సెంట్లు ఉండేది. గొల్లలేరు డ్రెయిన్ నిర్మాణంలో భాగంగా భూమి సేకరించారు. భూసేకరణలో భాగంగా ఎస్సార్బీసీ అధికారులు 11 ఏళ్ల కిందట తీసుకున్నారు. అప్పట్లో అందరికీ పరిహారం అందజేశారు. సుబ్బ గోవిందయ్యకు చెందిన పొలానికి సరైన యాజమాన్య హక్కులు లేవంటూ పక్కన పెట్టారు. వారసులందరితో ఒప్పందం చేసుకుని రావాలని చెప్పడంతో దస్త్రాలు సిద్ధం చేసుకుని అధికారుల వద్దకెళ్లారు. అంతలో భూసేకరణ దస్త్రం కనిపించలేదంటూ ఆయన్ను తిప్పుకొంటూనే ఉన్నారు.. 11 ఏళ్లు గడిచిపోయినా పరిహారం మాత్రం ఇవ్వలేదు. ఆయనకున్న ఏకైక ఆధారం పొలమే.. కాలువ కింద అదీ పోవడంతో కూలీగా మిగిలిపోయారు. పరిహారం ఇప్పిస్తే వృద్ధాప్యంలో కాసింత భరోసా దక్కుతుందని ఆయన పేర్కొంటున్నారు.

బస్తామే సవాల్

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై జూపాడుబంగ్లా ప్రాంతంలో ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై బస్తాలు వేసుకోవడమేకాక మరో వ్యక్తి దానిపై ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణించాడు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రాణాలు పోయే పరిస్థితి. ఇలా ప్రమాదకరంగా రాకపోకలు సాగించేవారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, నంద్యాల

చెరపట్టిన మట్టిమాఫియా

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.పెండేకల్లు గ్రామ సమీపంలోని చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండటంపై పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొక్లెయిన్ ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా మూడు రోజుల నుంచి మట్టి తరలిస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. పెండేకల్లు, మర్రికుంట, వెంకటగిరి, రేపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతులు చెరువు వద్దకు వచ్చి అడ్డుకున్నారు. స్థానికేతరులు ఇటుకల బట్టీలకు టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఉలిందకొండలోని ఇటుకల బట్టీలకు అధికారుల అనుమతి తీసుకొనే మట్టి తవ్వుతున్నట్లు టిప్పర్ల డ్రైవర్లు పేర్కొంటున్నారు. దీనిపై కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేయగా.. విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

అమ్మాయిలకు ఆరు కోర్సులు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు ఇతర నైపుణ్యాలు ఉండాల్సిందే.. దీన్ని దృష్టిలో పెట్టుకొని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని అమ్మాయిలకు వృత్తి విద్య పాఠాలు బోధిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 కేజీబీవీలు ఉన్నాయి. వృత్తి విద్యపై ఆసక్తి ఉన్న 9, 10, ఇంటర్ విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. త్వరలో ఆరో తరగతి నుంచే శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

సాగులో మెలకువలు నేర్చుకుంటూ..

● బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సు పూర్తి చేస్తే బ్యూటీ పార్లర్లు ఏర్పాటుచేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు. ప్రభుత్వం ప్రకటన ఇచ్చిన సమయంలో దరఖాస్తు చేసుకుంటే బాలికల పాఠశాలల్లో బ్యూటీషియన్ ట్రైనీగా ఉద్యోగం పొందే అవకాశం ఉంటుంది.

● అపెరల్‌లో భాగంగా ముత్యాలు, పగడాలు వంటి హారాల తయారీలో మెలకువలు నేర్పిస్తున్నారు. ఈ కోర్సు స్వయం ఉపాధికి దోహదపడుతుంది.

● ఐటీ-ఐటీఈ సెల్ కోర్సు పూర్తి చేసినవారు ప్రైవేటు సంస్థల్లో మంచి ఉద్యోగాలు సాధించొచ్చు.

● ఎలక్ట్రికల్‌కు సంబంధించి పలు మెలకువలు నేర్పిస్తున్నారు. స్వయం ఉపాధి పొందడానికి వీలుంటుంది.

● ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సు పూర్తి చేసినవారు ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చదివితే ఆహార నియంత్రణ శాఖలో ప్రభుత్వ కొలువులు సాధించేందుకు వీలుంది. సొంతంగా హోటల్ నిర్వహణ ద్వారా పలువురికి ఉపాధి చూపొచ్చు.

● ఏ పంటతో ఎలాంటి రాబడి సాధించొచ్చు.. తెగుళ్లు తట్టుకునే రకాలు తదితర వాటిని ‘సాగు’లో భాగంగా వివరిస్తారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయిస్తారు. అగ్రికల్చర్ డిగ్రీ పూర్తైన తర్వాత వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశాలు ఏర్పడుతాయి.

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : 03.12.2025.
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

కృష్ణవేణి సంగీత నీరాజనోత్సవం

కర్ణాటక సంగీత కీర్తనలు ఆలపిస్తున్న అంజలీ శ్రీరామ్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని ఆలయ దక్షిణ మాడవీధిలో మంగళవారం కేంద్ర పర్యాటక-సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో కృష్ణవేణి సంగీత నీరాజనోత్సవం జరిగింది. కార్యక్రమానికి రాత్రి 7 గంటలకు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రమేశ్‌నాయుడు, దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, భారత పర్యాటకశాఖ సహాయ సంచాలకుడు ఆర్.కృపాకర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బెంగళూరుకు చెందిన విదుషి అంజలీ శ్రీరామ్ పలు కీర్తనలను ఆలపించి భక్తులను, స్థానికులను అలరింపజేశారు. పర్యాటకశాఖ డీవీఎం లక్ష్మీనారాయణ, హరిత మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

మహానందీశునికి నిత్యకల్యాణ సేవ

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలో దేవస్థానం ఆధ్వర్యంలో గంగా కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిత్యకల్యాణ సేవ నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మాంగల్యధారణ, మహా మంగళ హారతుల కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

దేవతామూర్తులు

అహోబిలంలో కైశిక ద్వాదశి పురాణ పఠనం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: కైశిక ద్వాదశి సందర్భంగా అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధనలు చేశారు. గర్భగుడి మండపంలో అర్చకులు కైశిక పురాణం పఠించి శ్లోకాలను వివరించారు. అనంతరం ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్‌కు అర్చకులు బహుమానం సమర్పించి మఠానికి తీసుకువచ్చారు.

కైశిక పురాణ పఠనం చేస్తున్న ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్

వైభవంగా ప్రహ్లాదరాయల స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం మఠం ప్రాకారంలో ప్రహ్లాదరాయల విగ్రహాన్ని కొయ్య, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి పూజలు చేసి హారతి ఇచ్చారు. మేళతాళాల మధ్య శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. సహాయ పీఠాధిపతి వ్యాసరాజాచార్, మఠం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ద్వాదశి పురస్కరించుకుని శ్రీమఠంలో ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర మఠంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు, నవరత్న కవచాలు, విశేష పూలతో అలంకరించి మూల బృందావనానికి హారతి ఇచ్చారు.

శ్రీమఠం ప్రాకారంలో స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

చిరుతల కలకలం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మండలంలోని చనుగొండ్ల గ్రామ కొండల్లో రెండు చిరుతలు కనిపించడం కలకలం రేపింది. వారం రోజులుగా గ్రామ కొండల్లో మేతకు వెళ్లిన దున్న, కుక్కలు, దూడలను చంపి తిన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు గ్రామానికి చేరుకుని విచారించారు. గ్రామ సమీపంలోని కొండల్లో చిరుతలు సంచరిస్తున్నాయని, అందుకే పొలాలకు వెళ్లే రైతులు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. పశువుల కాపరులు కొండలకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు.

పులిగోర్ల కొనుగోలు కేసులో ఇద్దరి అరెస్టు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాలలో పులిగోర్ల కొనుగోలు చేసినట్లు అనుమానాలపై అటవీ అధికారులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. పాణ్యం అధికారులతోపాటు మూడో పట్టణ సీఐ కంబగిరి రాముడు సమక్షంలో మంగళవారం శ్రీనివాసనగర్‌లోని టాటూ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనితో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారు పులిగోర్లు కొనుగోలు చేసినట్లు సమాచారం మేరకే అరెస్టు చేసినట్లు తెలిసింది. త్వరలో వివరాలు వెల్లడించనున్నారు.

మెగా పీటీఎంను విజయవంతం చేయాలి: కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 5వ తేదీన నిర్వహించే మెగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ఆమె తన ఛాంబర్ నుంచి మంగళవారం మెగా పీటీఎంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థి ఇంట్లోని వారందరూ రావాలని ఆహ్వాన పత్రిక ఇవ్వాలని సూచించారు. ఎంఈవో ప్రతి ఒక్కరికి ఆహ్వానం వెళ్లిందా? అని చూసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారితోపాటు ఆర్డీవో, డీఎల్‌డీవో ఏదో ఒక పాఠశాలలో హాజరు కావాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

సాంకేతిక విద్య జోడించాలి

ఎం.చింతకుంట్ల, కానాలపల్లె(గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని ఎం.చింతకుంట్లలో డీఈవో జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు నేర్పుతున్న ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. సాంకేతిక విద్యను జోడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కానాలపల్లెలో మధ్యాహ్న భోజనం పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఎంఈవో అబ్దుల్‌కరీం, సీఆర్పీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకుడిగా ఎదిగి.. దేశభక్తి పెరిగి

◆ ఎన్‌సీసీలో రాణిస్తున్న బనవాసి జవహర్ నవోదయ విద్యార్థులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించడం కోసం ఎన్‌సీసీ ఎంతో తోడ్పడుతోంది. చిన్నప్పటి నుంచి దేశభక్తి అలవర్చుకుని సాధన చేస్తూ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. ఎన్‌సీసీలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులకు ప్రత్యేక కోటా కింద రిజర్వేషన్ ఉంటుంది. కొన్నింటిలో మార్కులకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రస్తుతం బనవాసి పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయం ఎమ్మిగనూరు విద్యార్థులు అనంతపురం, బనవాసిలో జరిగిన క్యాంపుల్లో ఉత్తమ క్యాడెట్‌గా ప్రదర్శనలు ఇచ్చారు.

ప్రదర్శన చేస్తూ..

అనేక అవకాశాలు

- పిల్లలకు చిన్నప్పటి నుంచి విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పుతుంటారు.
- దేశభక్తి పెంపొందుతుంది.
- సేవా గుణంపై అవగాహన.
- సమాజంలో ప్రజల్లో చైతన్యం తేవడం.
- విద్యార్థుల్లో ప్రాధాన్యత ఉంటుంది.
- ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుంది.
- ఇంజినీరింగ్, వైద్యం, పాలిటెక్నిక్, బీఈడీ, పోలీసు ఉద్యోగులకు 1 శాతం కోటా ఉంటుంది.
- ఆర్మీలో, పోలీసు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుంది.
- సీ సర్టిఫికెట్ ఉన్నవారు ఎన్‌డీఏ ద్వారా డైరెక్టర్ కమిషనర్లు ఆఫీసర్లుగా తీసుకుంటారు.
- పదోతరగతి వరకు 'ఏ' సర్టిఫికెట్, ఇంటర్, డిగ్రీ వరకు 'బీ, సీ' సర్టిఫికెట్ పంపిణీ చేస్తారు.

సైన్యంలో చేరాలని లక్ష్యం
- హర్ష, తొమ్మిదో తరగతి

నా పేరు హర్ష మాది ఆలూరు గ్రామం. అమ్మానాన్నలు జ్ఞానచంద్రబాబు, రమాదేవి వ్యాపారం చేస్తున్నారు. ఎన్‌సీసీలో రెండేళ్లు సాధన చేశా. 2024, 2025లో అనంతపురంలో జరిగిన యూనిట్‌లో ప్రదర్శనలు ఇచ్చా. ఇక్కడ రైఫిల్ షూటింగ్‌లో 200 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచా. క్యాడెట్ ప్రదర్శనల్లో రాణించా. కమాండర్‌గా ప్రదర్శనలు చేశా. కవాతు, ఆటలు, డ్రిల్, నాట్యం, ప్రదర్శనలు పోటీతత్వ పరీక్షలు వంటి వాటిలో ప్రతిభ పురస్కారం అందుకున్నా. రైఫిల్ షూటింగ్‌లో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. భవిష్యత్తులో సైనికుడి కావాలని లక్ష్యం.

శత్రువులను ఎదిరిస్తా
- పవన్‌కుమార్, తొమ్మిదో తరగతి

దేశభక్తి అలవర్చుకొని శత్రువులను ఎదిరించాలని లక్ష్యం. అమ్మానాన్న సులోచన, సునీల్. ప్రైవేటు రంగంలో పని చేస్తున్నారు. ఎన్‌సీసీలో చేరి రెండేళ్ల పాటు వివిధ క్యాంపుల్లో ప్రదర్శనలు ఇచ్చా. రైఫిల్ పోటీల్లో సత్తాచాట. మొదట ఎన్‌సీఎల్ విభాగంలో అనంతపురంలో జరిగిన పోటీల విభాగంలో రైఫిల్, ఇతర సాధనలు చేశా. ఇక్కడ కవాతు, ఇతర పోటీలకు ఉత్తమ క్యాడెట్‌గా అవార్డు అందుకున్నా. బెటాలియన్‌లో రైఫిల్‌లో గురి చేసి పతకం సొంతం చేసుకొన్నా. జాతీయ స్థాయిలో రాణించి ఉత్తమ క్యాడెట్‌గా రాణించాలని నా తపన.

పతకానికి గురిపెట్టి
- సాకేతు, తొమ్మిదో తరగతి

నాన్న శ్రీనివాసులు, అమ్మ విశాలాక్షి. ఆదోనిలో అమ్మనాన్నలు వ్యాపారంలో రాణిస్తున్నారు. సైనికులుగా రాణించాలని నాకల. 2023లో ఎన్‌సీసీలో చేరి అనంతపురం, బనవాసిలో జరిగిన క్యాంపుల్లో రైఫిల్, కవాతులో ప్రదర్శనలు ఇచ్చాను. 2024లో అనంతపురం బెటాలియన్‌లో రైఫిల్ గురి చేసి పతకం సొంతం చేసుకున్నా. రెండు సార్లు ప్రదర్శనలు ఇచ్చాను. కొండలు ఎక్కడం, సాధన చేయడం వంటివి నేర్పించారు. భవిష్యత్తులో దేశరక్షణ అధికారిగా రాణించాలని నా ఆశయం.

పుష్కరిణి.. అధ్వాన స్థితికి చేరి

ఎగువ అహోబిలంలో ఆలయానికి వెళ్లే మార్గంలోని కోనేరు ఇది. నీరు పాచి చేరి మురుగును తలపిస్తోంది. కొండ ప్రాంతంలో నుంచి నీరు కోనేరులోకి చేరుతుంటుంది. గతంలో ఆ నీటినే భక్తులు తాగడానికి వినియోగించేవారు. కాల క్రమంలో నిర్వహణ లేకపోవడంతో నీరు దుర్భరంగా మారి కోనేరు అధ్వాన స్థితికి చేరుకుంది. ప్రమాదాల నివారణకు భక్తులు పుష్కరిణిలోకి దిగకుండా చుట్టూ ఆలయ నిర్వాహకులు గోడ కట్టేశారు. కోనేరులో ఫౌంటేన్ ఏర్పాటు చేసి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. –న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

కనిపించని ప్రమాదం

నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి సంజీవనగర్ గేట్‌కు వెళ్లే దారిలో ఓ ఆటో ప్రమాదకరంగా ప్రయాణిస్తోంది. వస్తువులను లోపల, బయట ఒకదానిపై ఒకటి పరిమితికి మించి పేర్చారు. చోదకుడికి ముందు వాహనాలు కనపడకుండా అట్టపెట్టెలు ఉంచారు. ఆ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఏ మాత్రం ఆటో అదుపు తప్పినా పెద్ద ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రబీలో ఆరుతడి పంటలకే సాగునీరు

★ నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మంత్రులు, కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో వరి సాగు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన మంగళవారం నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి(ప్రొద్దుటూరు), భూమా అఖిలప్రియ(ఆళ్లగడ్డ), గౌరు చరిత(పాణ్యం), బుడ్డా రాజశేఖర రెడ్డి(శ్రీశైలం), గిత్త జయసూర్య(నందికొట్కూరు), జాయింట్ కలెక్టర్ కార్తీక్, కేసీ. కెనాల్ ఛైర్మన్ రామలింగారెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు ఛైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి, ఎస్సార్బీసీ ఛైర్మన్ కె.రాజశేఖరరెడ్డి, సాగునీటి సంఘాల నాయకులు, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగునీటి కాలువలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలనే అంశంపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. వారు మాట్లాడుతూ..తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల నిర్మాణం జరుగుతున్నందున ఈ సీజనుల్లో నీరు రాదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమస్యలు రాకుండా ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీంతో కేసీ. కెనాల్‌కు 120 కి.మీ వరకు, 120 నుంచి 150 కి.మీ వరకు నీటి విడుదల అసాధ్యమన్నారు. తెలుగుగంగ ఆయకట్టు పరిధిలో మార్చి చివరి వరకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రివర్స్ పంపింగ్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ..ఎస్సార్బీసీ ద్వారా రబీ పంటలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేసే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వెలుగోడు, బండి ఆత్మకూరు మండలాల్లో వరి సాగు ప్రారంభమైనట్లు చెబుతూ.. దిగువన ఉన్న ఆళ్లగడ్డకు నీరు ఇవ్వడం సాధ్యం కాదన్నారు. తుంగభద్ర డ్యాం గేట్ల మార్పు పనుల కారణంగా 0 కి.మీ నుంచి 50 కి.మీ వరకు ఉన్న 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడం కష్టసాధ్యమన్నారు. 0 నుంచి 120 కి.మీ పరిధిలో మల్యాల, ముచ్చుమర్రిలకు రివర్స్ పంపింగ్ ద్వారా కూడా నీరు అందించే అవకాశం తగ్గిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో పంటలు వేస్తే రైతులు నష్టపోతారన్నారు. 150 నుంచి 300 కి.మీల వరకు ఉన్న ఆయకట్టుకు అందుబాటులో ఉన్న సాగునీటి మేరకు మార్చి 31వ తేదీ వరకు ఆరుతడి పంటలకు మాత్రమే నీరు అందించనున్నట్లు స్పష్టం చేశారు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ.. తెలుగుగంగ, కేసీ. కెనాల్ డిస్ట్రిబ్యూటరీ విధానం సరిగ్గా లేకపోవడంతో నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ..పొన్నాపురం స్లూయిస్ వద్ద నీటి నిర్వహణ విషయంపై కేసీ. కెనాల్ ఈఈ ప్రతాప్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిమట్టాన్ని బట్టి ఎంత నీరు ఇస్తారో సమాధానం చెప్పమంటే.. పైస్థాయిలో నిర్ణయిస్తారని చెప్పడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మంచి వర్షాలు పడ్డాయని.. రబీకి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని కోరారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ. . సిద్ధాపురం చెరువు ద్వారా 23 వేల ఎకరాలకు నీరు అందించేలా చర్యలు ప్రారంభించినప్పటికీ 10వేల ఎకరాలకు మాత్రమే నీరు చేరుతుందన్నారు. ఎమ్మెల్యే చరిత మాట్లాడుతూ.. ఏప్రిల్ 15 వరకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ.. కేసీ.కాలువ కింద రైతులకు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆళ్లగడ్డ ప్రాంతానికి చెందిన రైతులు కేసీ. కెనాల్ ఈఈ ప్రతాప్‌తో ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో వాగ్వాదానికి దిగారు. నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలన్నారు.

సమావేశంలో మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

పోలీసుల తనిఖీల్లో పిస్టల్ లభ్యం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానం టోల్ గేటు వద్ద మంగళవారం సిబ్బంది వాహనాల తనిఖీలు చేస్తుండగా.. ఒక వాహనంలో నలుగురు వ్యక్తుల వద్ద పిస్టల్, 10 బుల్లెట్లు లభ్యమయ్యాయి. శ్రీశైలం ఒకటో పట్టణ సీఐ ప్రసాదరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లి విచారించారు. వారు మధ్యప్రదేశ్ పోలీసులుగా నిర్ధారించుకున్నారు. భోపాల్ క్రైం బ్యాచ్‌కు చెందిన ఎస్సై గోవింద్ యాదవ్, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్‌తో కలిసి శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం శ్రీశైలం వచ్చారు. క్రైం బ్రాంచ్ పోలీసులు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో నేర కేసుల నిమిత్తం వాహనంలో తిరుగుతున్నట్లు వెల్లడించారు.

తరలివచ్చిన భక్తులు..వాహనాల బారులు

శ్రీశైలానికి భక్తుల రద్దీ పెరిగితే పాలధార-పంచధార రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రహదారి పక్కనే దుకాణాలు ఉండడంతో భక్తులు ఆటబొమ్మలు, వస్తువులు, అటవీ ఫలాలు, వనమూలికలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో శ్రీశైలానికి వచ్చి పోయే వాహనాలన్నీ ఆ రోడ్డుపై నిలిచిపోతున్నాయి.

కొనుగోలుదారులు వాహనాలను పార్కింగ్ ప్రదేశంలో కాకుండా రహదారిపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం శివదీక్షా స్వాములు దీక్షా విరమణలకు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో అక్కడ వాహనాలు నిలిచిపోతున్నాయి. – న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

అరటికి మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్యాపిలి మండలంలో చాలా మంది రైతులు అరటి సాగుచేస్తున్నారని.. పంటకు కనీస మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని హుస్సేనాపురం, పీఆర్ పల్లి, చంద్రపల్లి గ్రామాల్లోని అరటి తోటలను ఆయన మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. చంద్రపల్లి నుంచి పీఆర్ పల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరలు లేక టమాటా, ఉల్లి, మొక్కజొన్న, అరటి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుతం అరటి ధర పూర్తిగా పడిపోయిందని, రైతులు అరటిపండ్లను తోటలోనే వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో కరోనా కష్టకాలంలో కూడా అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించామని తెలిపారు. ప్యాపిలిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు 25 ఎకరాల్లో భూమి పూజ నిర్వహించామన్న ఆయన ప్రస్తుతం దాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు శ్రీరాములు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ఫోన్ : 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 19.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 19.12.2025, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పీఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 18.12.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీతలు: 1) M/s సాత్విక్ ఇండస్ట్రీస్, ప్రొప్రయిటర్ : శ్రీమతి కాంబోజి శ్రీదేవి, భర్త : కె. సత్యనారాయణ, సర్వే నెం.613F, 607/A1, బేతంచర్ల రోడ్, ధర్మవరం గ్రామ పంచాయతీ, డోన్ (గ్రా & మ), కర్నూలు-518222. 2) శ్రీమతి. కాంబోజి శ్రీదేవి, M/s సాత్విక్ ఇండస్ట్రీస్ యొక్క ప్రొప్రయిటర్, భర్త: కె. సత్యనారాయణ, హెచ్ నెం.12/11/1-1, కొత్తపేట, డోన్, కర్నూలు-518222.
బకాయి మొత్తం: రూ. 87,06,299.07/- తేది.31.10.2025 నాటికి + తేది.01.11.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఛార్జీలు.
బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :
కర్నూలు జిల్లా, డోన్ మండలం యొక్క పరిధి, ధర్మవరం గ్రామం వద్ద సర్వే నెం. 613/F & 607/A1 నందు విస్తీర్ణం ఎకరా 0.40 & ఎకరా 0.10 సెంట్లులోని M/s. సాత్విక్ ఇండస్ట్రీస్ యొక్క ఫ్యాక్టరీ / యూనిట్ మరియు భవనం శ్రీమతి కె. శ్రీదేవి గారి పేరున గల ఆస్తి. హద్దులు : తూర్పు : రోడ్డు మరియు ప్రతాప్ రెడ్డి & ఇతరులు యొక్క భూమి, పడమర : అమ్మకందారు యజమానులు యొక్క భూమి, ఉత్తరం : సత్యనారాయణ గారి భూమి, దక్షిణం : గొల్ల బల్లయ్య మరియు ఇతరులు యొక్క భూమి.

రిజర్వు ధర: రూ. 13,50,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 1,35,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింకును రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పీఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 01.12.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ.75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌టాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎంకార్డులు, సిమ్‌కార్డులు, రూ.53వేల నగదు, 20 గ్రాముల బంగారం, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

ఇతర ప్రాంతాలకు చెందిన 8 మంది అరెస్టు..

రాజమహేంద్రవరంలో 8 మందిని స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్ (గుండుమల్ల, శ్రీసత్యసాయి జిల్లా), సిద్ధేశ్ శ్రీధర్, సిద్ధేశ్ సుదీప్(మల్ల నాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్ (హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య (పార్వతీపురం), నాగప్ప కావ్య (మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి (ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

మద్యం తాగి నిద్రలో వ్యక్తి మృతి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: మద్యం తాగి నిద్రిస్తున్న సమయంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగిందని నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ ఎస్సై హృషికేశ్ వివరాలు తెలిపారు. ఏపీ రాష్ట్రం నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన సతీష్ (33)కు కొల్లాపూర్ పురపాలిక పరిధిలోని చౌటబెట్ల గ్రామానికి చెందిన రాజశ్వరితో 10 ఏళ్ల కిందట ప్రేమ వివాహమైంది. అప్పటి నుంచి చౌటబెట్లలో కూలిపనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సోమవారం చౌటబెట్ల నుంచి సాయంత్రం కొల్లాపూర్‌కు వచ్చారు. మద్యం తాగి రోడ్డు పక్కనే నిద్రించాడు. నిద్రించిన వ్యక్తి మృతి చెందాడనే అనుమానంతో ఆ దారిన వెళ్లే వారు చూసి మంగళవారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బంగారు ఆభరణం చోరీ

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు ఎస్బీఐ బ్యాంకులో సినీఫక్కీలో చోరీ జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వెలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన నందమ్మగారి నాగమణి ఏడాది క్రితం వెలుగోడు ఎస్బీఐ బ్యాంకులో తాకట్టు పెట్టిన పాతబంగారు వస్తువులను విడిపించేందుకు బ్యాంకుకు వచ్చారు. తన వద్ద ఉన్న నల్లల దండ, కంకనం, నాన్ పథకం 35 గ్రాములున్న బంగారు ఆభరణాలు బ్యాంకు అధికారులకు చూపించారు. బంగారు రుణానికి సంబంధించి నల్లల దండ, కంకనం సరిపోతాయని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో తన వద్ద ఉన్న నాన్ పథకం బంగారు ఆభరణాన్ని తన హ్యాండ్ బ్యాగులో పెట్టుకున్నట్లు చెప్పారు. గుర్తుతెలియని మహిళలు బ్యాగ్‌లోని నాన్ పథకం ఆభరణాన్ని చాకచక్యంగా చోరీ చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఈ ఆభరణం విలువ 1.4 లక్షలు ఉంటుందని ఎస్సై వివరించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

JOBS

Wanted Male Academic Principals qualification any Degree/P.G, Salary: 25000/- to 30,000/- Having Experience in Educational sector will be preferable, Age limit: 30 to 45 years. Working Location: Kurnool. Contact: 92487 33342.

కోయిలకుంట్లలో RV రెసిడెన్సి ఎ/సి లాడ్జి నందు పనిచేయుటకు సిబ్బంది కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి: ✆ 99899 07171.

టెలికాలింగ్ & Data Entry వర్క్ ఫ్రమ్ హోమ్/ఆఫీసు చేయుటకు M/F కావలెను. 10th క్లాస్‌పైన, Age:18 to 35, జీతం: 18k to 25k. ✆ 6305186209

PERSONAL CLASSIFIEDS

MISSING

PASSPORT MISSING
I, PATHURI PANDU BABU, (Aadhar No.2099 1423 8972), age 55 Years, S/o. Pathuri Basava Shankar Rao, Presently Residing at Flat No.301, Juturu Residency, Narasimha Reddy Nagar, Opp: Railway Station, Kurnool, Kurnool District, Andhra Pradesh Iam the holder of Passport bearing No.B9834743 and the said passport has been issued on 14-02-2024 and expires on 13-02-2034, Place of issue VIJAYAWADA. That the Passport has been lost by me while I was travelling from Narasimhareddy Nagar to Old Busstand, Kurnool for Xerox purpose on 29-11-2025, I have lost my cover which contains my PASSPORT within the limits of II TOWN POLICE STATION, Kurnool. I made Sincerely efforts in search of it and it is lost beyond recovery.
Contact No.94416 88340.

PASSPORT MISSING
I, PATHURI KASI ANNAPURNA, (Aadhar No.9762 7750 5299), age 47 Years, W/o. Pathuri Pandu Babu, Presently Residing at Flat No.301, Juturu Residency, Narasimha Reddy Nagar, Opp: Railway Station, Kurnool, Kurnool District. Iam the holder of Passport bearing No.B8538211 and the said passport has been issued on 21-12-2023 and expires on 20-12-2033, Place of issue VIJAYAWADA. That the Passport has been lost by me while I was travelling from Narasimhareddy Nagar to Old Busstand, Kurnool for Xerox purpose on 29-11-2025, I have lost my cover which contains my PASSPORT within the limits of II TOWN POLICE STATION, Kurnool. I made Sincerely efforts in search of it and it is lost beyond recovery.
Contact No.9959427456.

TO LET

For Rent to Hospital, Polyclinics, Diagnostic Centers, 5200 Sft. G+1, 43/194-2, Line No-7, N.R.Peta, Kurnool. Cont: 89851 32552.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల
•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

వేంకటేశ్వరస్వామికి అష్టాదళ పాదపద్మారాధన

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం సంజీవనగర్ కోదండ రామాలయంలోని వేంకటేశ్వర స్వామికి భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే గణపతికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి ప్రత్యేక పూజ చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వాజ్‌పేయీ విగ్రహానికి శంకుస్థాపన

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహం ఏర్పాటుకు భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు శ్రీకారం చుట్టారు. స్థానిక సర్వజన ఆసుపత్రి ఎదుట ప్రధాన కూడలి వద్ద మంగళవారం ఆయన భూమి పూజ చేసి, మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజలో భాజపా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు

నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత

గడివేముల, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీవో వాసుదేవగుప్తా తెలిపారు. మండలంలో కౌసలం సర్వే ద్వారా గుర్తించిన నిరుద్యోగులకు మంగళవారం పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామసచివాలయాల్లో ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల్లో ఎంపికైన వారికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. మండలంలో 2,317 మంది నిరుద్యోగులు ఉన్నట్లు సర్వేలో గుర్తించినట్లు వివరించారు.

చూపు లేకున్నా.. సేవల్లో దిక్సూచి

■ నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

అంధులైనా కుంగిపోలేదు. సమస్యలు ఎదురైనా ఎనకడుగు వేయలేదు. పట్టుదలతో కృషి చేశారు. ఉన్నత స్థాయిలో నిలిచారు. అక్కడితో ఆగకుండా తమలాంటి చూపులేని వారికి అండగా నిలవాలని సంకల్పించారు. ఉద్యోగంలో రాణిస్తూనే.. వివిధ సంస్థలు స్థాపించి, దివ్యాగుల అభివృద్ధికి పాటుపడుతూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అన్ని విధాలా అండగా..

చంద్రశేఖర్

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన జి.చంద్రశేఖర్‌కు పుట్టుకతో చూపు లేదు. అయినా కుంగిపోకుండా పట్టుదలతో చదివి ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశారు. 2003లో గ్రూప్-4 ఉద్యోగం సాధించి కర్నూలు ఎస్పీ కార్యాలయంలో స్టెనో, టైపిస్టుగా చేరారు. ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2015లో స్పందన బెండ్ పీపుల్ అసోసియేషన్ ప్రారంభించారు. 40మంది దివ్యాంగులకు దాతలు, సొంత డబ్బులతో రూ.400 వరకు ఫించను అందిస్తున్నారు. సొంతంగా కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ పెట్టి 30 మంది చూపులేనివారికి శిక్షణ ఇప్పించారు. వారిలో కొందరు వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

★ లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా ఏటా జిల్లా వ్యాప్తంగా 30మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.1000 స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. కార్యక్రమానికి హాజరయ్యే 300 మందికి దుస్తులు, భోజనాలు పెడుతున్నారు. ఏటా దివ్యాంగులతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.

★ నంద్యాల టౌన్‌హాల్‌లో 2018లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ చేతుల మీదుగా ఉత్తమ దివ్యాంగుడిగా అవార్డు అందుకున్నారు.

★ 2022లో నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో రెడ్‌క్రాస్ సంస్థ వారు, వివిధ స్వచ్ఛంద సంస్థలు సన్మానం చేశాయి.

దివ్యాంగుల హక్కులు, సంక్షేమానికి కృషి

కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డీపీ మస్తాన్ వలి

నంద్యాల పట్టణానికి చెందిన దూదెకుల పెద్ద మస్తాన్ వలి నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఆరు నెలల వయసులో పోలియో సోకింది. వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్ అయినా.. దివ్యాంగుల హక్కులు, సంక్షేమం కోసం 2000లో నంద్యాల దివ్యాంగ సంఘం, 2003లో సుభాష్ వెల్ఫేర్ అసోసియేషన్, 2020లో ఏపీ డిజేబుల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

★ పైఅంతస్తుల్లో ఉన్న సచివాలయాలను కిందికి మార్పించడం, దివ్యాంగుల ఇంటికి రేషన్ అందేలా చూడడం, బస్‌పాసులు, రైల్వేపాసులు, ట్రై సైకిళ్లు ఇప్పించడం వంటివి చేస్తున్నారు.

★ గత ఐదేళ్లుగా రంజాన్ పండగ రోజు 150 మంది దివ్యాంగులకు రూ. 1000 విలువ చేసే నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు.

★ ఈ నెలలో నిర్వహించే దివ్యాంగుల వారోత్సవాల్లో ఏడుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు ఇవ్వనున్నారు.

★ 2024లో కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా, అధికారుల చేతులమీదుగా జిల్లా వికలాంగుల సేవా పురస్కారం అందుకున్నారు.

★ 2015లో నైస్ కంప్యూటర్స్ కర్నూలు వారితో అప్పటి ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, భూమా నాగిరెడ్డి చేతుల మీదుగా సన్మానం పొందారు.

★ 2023లో నంద్యాలలో హ్యూమన్ రైట్స్ వారితో సన్మానం.

విద్యాబుద్ధులు నేర్పుతూ..

నందికొట్కూరు, న్యూస్‌టుడే : జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామానికి చెందిన దేవన్నకు మూడో ఏడాదిలో కామెర్లు వచ్చాయి. తల్లిదండ్రులు కళ్లల్లో పసరు వేయించడంతో కనిపించకుండా పోయాయి. బ్రెయిలీ లిపిలో టీటీసీ పూర్తి చేసి.. 1995లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. పాములపాడు మండలం శాంతి నిలయంలో, జూపాడు బంగ్లా, లింగాపురం, 80 బన్నూరు, తర్తూరు, నందికొట్కూరు పట్టణంలోని కోటా పాఠశాలలో పనిచేశారు. ప్రస్తుతం హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. బ్రెయిలీ లిపిలో ఉన్న పాఠ్య పుస్తకాలను సొంతంగా కొనుగోలు చేసుకొని.. వాటి ద్వారా పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్నారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

విద్యార్థులకు పాఠం బోధిస్తున్న దేవన్న

పంటపొలాల్లో వ్యర్థాలు కాల్చొద్దు

గడివేముల, న్యూస్‌టుడే: పంటపొలాల్లో వ్యర్థాలు కాల్చొద్దని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. దుర్వేశి గ్రామంలో వ్యర్థాలు కాల్చిన పొలంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను కాల్చడంతో భూమికి పోషకాలు అందించే సూక్ష్మక్రిములు చనిపోతాయన్నారు. వ్యర్థాలను రోటావేటర్‌తో కలియదున్నాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని శ్రీనివాసనగర్, సాయిబాబానగర్‌లో కుక్కల బెడద అధికమైంది. బయటికి వెళ్లాలంటే భయంగా ఉంది.–రమ్య, నవీన్

?: కోటవీధి, నీలివీధిలో కోతుల బెడద అధికమైంది. – సుధాకర్, నారాయణ

?: సరస్వతినగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికమైంది. - బాబు

✔: త్వరలోనే కుక్కలను, కోతులను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం. కాల్వలను శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేసి సమస్యను పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాములపాడులో జూటూరు బస్సు షెల్టర్‌కు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. - రాము, స్థానికుడు

✔: వీధి దీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, ఎంపీడీవో

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ?: పాములపాడులోని మిట్టకందల గ్రామంలో ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నీరు పారుతుంది. - కిషోర్, స్థానికుడు.

✔: రహదారిపై మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. - చింతల నారాయణ, గ్రామ సర్పంచి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: అప్పలరావువీధిలో డీపాల్ పాఠశాల వద్ద రెండు నెలలుగా వీధి దీపం వెలగడం - షేక్ షాకీర్

✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. - షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.

పర్యావరణాన్ని సంరక్షించాలి

మాట్లాడుతున్న కిశోర్‌రెడ్డి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని రక్షించడంలో వ్యక్తిగత, సామూహిక చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. కళాశాల ఛైర్మన్ ఎస్.వెంకటరామిరెడ్డి, డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారి.. పడితే అంతే మరి

నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని గుడ్‌షెపర్డ్ పాఠశాల మలుపులో రహదారి ప్రమాదకరంగా మారింది. ఆ ప్రదేశంలో దారి కుంగి గుంతలమయమైంది. నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రజలు అదే దారిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం చోటుచేసుకుంటుంది. అధికారులు చర్యలు చేపట్టి రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. – నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే

రహదారిపై మురుగు.. పరుగు

నంద్యాల పట్టణం ఎస్బీఐ కాలనీ నుంచి భరత మాత గుడికి వెళ్లే దారిలో రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. కాల్వలు లేక ఇళ్లలో నుంచి వచ్చే మురుగు అంతా రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. ప్రజలు ఆ దారిలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రాంతంలో కాల్వ నిర్మించి ప్రధాన కాల్వలో అనుసంధానం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి త్వరగా సమస్యను పరిష్కరించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

బస్సు షెల్టర్ ఇలా.. ప్రయాణికులు నిలిచేదెలా

బ్రాహ్మణకొట్కూరు బస్సుషెల్టర్ అధ్వానంగా మారింది. నిలువ నీడ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లుకు కృష్ణజలాలు తీసుకెళ్లే పనుల్లో భాగంగా.. మిగులు మట్టిని బస్ షెల్టర్ ముందు వదిలేశారని స్థానికులు చెబుతున్నారు. వడ్డెమాను, కొణేటమ్మపల్లి, కోళ్లబావపురం గ్రామస్థులు బ్రాహ్మణకొట్కూరు కేంద్రంగా చేసుకుని కర్నూలు, నందికొట్కూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు బస్సుషెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

పంటకు రక్షణగా చీరలు

మండలంలోని నారాయణాపురం గ్రామ శివారులో ఉన్న పంటపొలాలను కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. పొలాలు నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉండడంతో రాత్రి అడవి జంతువులు పొలంలో పడి నాశనం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో రైతులు పొలం చుట్టూ కంచె వేసి, దాని వెంట రంగురంగుల చీరలు ఏర్పాటు చేసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చీరలు కట్టడంతో అడవి జంతువుల బెడద తగ్గిందని రైతులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, నారాయణాపురం(బండిఆత్మకూరు)

విద్యార్థినులకు అండగా శక్తి యాప్

అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులకు శక్తి యాప్ అండగా ఉంటుందని నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, వెంకటేశ్వర్లు, రఫీ పేర్కొన్నారు. మండలంలోని చాపిరేవుల జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని వివరించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రైతులు పంట బీమా చేయించుకుంటేనే దిగుబడి ఆధారంగా బీమా వర్తిస్తుందని సహాయ వ్యవసాయాధికారి హేమలత అన్నారు. కురుకుంద గ్రామంలో వరిలో పంట కోత ప్రయోగాన్ని మంగళవారం పరిశీలించారు. డిసెంబర్ 1-7 వరకు పదో పంటల బీమా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వరి, జొన్న, మినుము పంటలకు బీమా చేయించుకోవాలన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కడపలో ఈ నెల 6, 7వ తేదీలల్లో జరిగే సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నాయకుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీని సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వరనాయుడు ప్రారంభించారు.

పాణ్యం గ్రామీణం: విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని ఆంగ్ల అధ్యాపకులు పార్వతిదేవి అన్నారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శోభారాణి ఆధ్వర్యంలో బాషా, కంప్యూటర్ నైపుణ్యాల కోర్సులను ప్రారంభించారు.

పాణ్యం గ్రామీణం: శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వడ్డుగండ్ల గ్రామంలో మంగళవారం విద్యార్థుల బృందం పర్యటించి మురుగు కాల్వలు, రహదార్లను శుభ్రం చేసి అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పాణ్యం గ్రామీణం: గద్వాలకు చెందిన కృష్ణ పాణ్యం చెంచుకాలనీకి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి ప్రయాణంలో ఎస్సార్బీసీ కాల్వ సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టారు. ప్రమాదంలో గాయపడిన కృష్ణను నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కొత్తపల్లి: కొత్తపల్లి జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవోగా కేపీఆర్ శర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ.. పదోన్నతిపై వచ్చినట్లు ఆయన తెలిపారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు.

అవుకు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు పాఠశాలల వారీగా అవుకులో మంగళవారం నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. క్రికెట్ పోటీల్లో 40, త్రోబాల్ పోటీల్లో 20 మంది పాల్గొన్నారని మండల విద్యాధికారి శ్రీధర్‌రావు తెలిపారు.

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: బత్తలూరుకు చెందిన నంద్యాల చంద్రశేఖర్‌రెడ్డి(60) అదృశ్యమైనట్లు కుటుంబీకులు తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. ఆళ్లగడ్డ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

పోటీలతో ప్రతిభ గుర్తింపు

మాట్లాడుతున్న శ్రీగురురాజ పాఠశాల విద్యార్థి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతిభా పాటవ పోటీలు దోహదపడతాయని నంద్యాల శ్రీగురురాజ పాఠశాల సంచాలకుడు పి. షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని శ్రీగురురాజ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో హర్షవర్ధన్‌ఆచారి, నీరజ్, చరిత నిలిచారు. విజేతలకు పి. షేక్షావలిరెడ్డి, పాఠశాల సమన్వయకర్త జి.వీరయ్య బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గడివేముల, న్యూస్‌టుడే: 12 వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి మానపాటి రవి డిమాండ్ చేశారు. గడివేములలో మంగళవారం ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ. . 11 పీఆర్సీ కాలపరిమితి ముగిసి రెండున్నర ఏళ్లు అవుతోందన్నారు. ప్రభుత్వం వేతన సంఘాన్ని నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 2025లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రతాపరెడ్డి, బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పురపాలక సొమ్ము దుర్వినియోగం'

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పురపాలక సొమ్ము దుర్వినియోగం అవుతోందని ఛైర్మన్ దాసి సుధాకరరెడ్డి ఆరోపించారు. తన ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మారుతీనగర్, హాజీనగర్ కాలనీవాసుల అభ్యర్థన మేరకు ఎంపీ బైరెడ్డి శబరి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేశారు. స్థానిక అధికారులు స్థలం చూపకపోవడంతో నిధులు వెనక్కి పోయాయన్నారు. సంగయ్యపేట, సుబ్బరావుపేట, బైరెడ్డినగర్, విద్యానగర్, ఎస్ఎస్ఆర్‌నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీలకు సంబంధించిన అర్బన్ హెల్త్ సెంటర్ స్థలం కేటాయించడంలో పురపాలక కమిషనర్, పట్టణ ప్రణాళికాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఛైర్మన్ హెచ్చరించారు. పంక్చర్ అయిన ట్రాక్టరును బాగు చేయకుండా.. నెలకు రూ.40 వేలు పెట్టి అద్దెకు తీసుకుని ప్రజా సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలూప్రసాద్, నాయకుడు సప్లయర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను చూపుతున్న పురపాలక ఛైర్మన్, కౌన్సిలర్లు

సమగ్ర విచారణ జరిపించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి చినరాముడు కుమార్తె మాధురి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాధురి మృతికి కారణాలు వెలికి తీసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

క్రీడల ప్రాధాన్యాన్ని గుర్తించాలి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల ప్రాధాన్యాన్ని గుర్తించాలని జేఎన్‌టీయూఏ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ నారాయణరెడ్డి, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూఏ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన స్త్రీ, పురుషుల జట్లు తమిళనాడులో జరిగే సౌత్‌జోన్ ఆల్ ఇండియా పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా సురేష్‌బాబు, చంద్రమౌళిగౌడ్, ఫిజికల్ డైరెక్టర్లు చంద్రారెడ్డి, వెంకటేష్, నాయక్, మునిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1,56,888

లెక్కింపులో అధికారులు, సేవకులు

గడివేముల, న్యూస్‌టుడే: దుర్గాభోగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,56,888 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మార్చి నుంచి ఇప్పటివరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయ ఛైర్మన్ కంది శ్రీనివాసులు, సభ్యులు శంకర్‌రెడ్డి, ఎస్ అశోక్, శైలజ, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల భవిష్యత్తును రక్షించాలి

మాట్లాడుతున్న అబులైస్

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: సచివాలయ వ్యవస్థలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల భవిష్యత్తును రక్షించాలని ఆల్ మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆల్‌మేవా) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అబులైస్, అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా కోరారు. గిరినాథ్ సెంటర్‌లోని ఎస్పీఆర్ ట్యుటోరియల్‌లో మంగళవారం ఆల్‌మేవా నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలోని 11 వేల మంది ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల భవిష్యత్తు నేడు అనిశ్చితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ అడ్మినిస్ట్రేటివ్ ఫెసిలిటేటర్లుగా సమీకరించాలన్నారు. మహమ్మద్‌సలీం, ఖాసీం, ఫరూక్, మహమ్మద్ గౌస్, షేక్షావలి, అలీషేర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 5వ తేదీలోపు ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కొత్త కాలనీలు.. కానరాని వసతులు

◆ అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపాలు

ఎస్బీఐ కాలనీ
వార్డు : 16
జనాభా : 10 వేలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో జనాభా వేగంగా పెరుగుతోంది. దీంతో శివారు కాలనీలు కొత్తగా ఏర్పడుతున్నాయి. మౌలిక, మెరుగైన సౌకర్యాలు కల్పించి కొత్త కాలనీలను అభివృద్ధి చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. కానీ, పురపాలక అధికారులు వాటివైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో తిరుమల రెసిడెన్సీ, మధురనగర్, గ్రీన్ లైన్, నంద్యాల గార్డెన్స్, అయోధ్యనగర్, సింగ్‌కాలనీ, శిర్డీనగర్, బాలాజీనగర్, శ్రీసాయికాలనీ, చైతన్యనగర్ వంటి కాలనీలు కొత్తగా ఏర్పడ్డాయి. వీటిలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

తిరుమల గ్రీన్ సిటీలో ఒరిగిన విద్యుత్తు స్తంభం

సమస్యలు

★ పట్టణంలోని కాలనీల్లో కాల్వలు లేవు. దీంతో ఖాళీ స్థలాల్లో మురుగు వదులుతున్నారు. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

★ తిరుమల రెసిడెన్సీ, కాలనీ చివర్లో విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి.

★ కొన్నిచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. కొత్త రోడ్డు వేయాలి. బాలాజీనగర్ వద్ద రోడ్డు అసంపూర్తిగా వేశారు.

★ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. వీటిలో మురుగు చేరి దుర్వాసన, పాములు అధికంగా ఉన్నాయి.

★ విద్యుత్తు స్తంభాలకు అధిక సంఖ్యలో కేబుల్ తీగలు కట్టారు. దీంతో ఎప్పుడు, ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.

★ కాల్వల్లో పూడిక, చెత్తాచెదారం తొలగించడం లేదని, దోమలు ప్రబలి రోగాలబారిన పడాల్సి వస్తోందని చెబుతున్నారు.

★ వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. కాలు బయట పెట్టాలంటే భయపడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

★ రహదారుల పక్కనే చెత్తాచెదారం, వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

పరిమిత వేగంతో బస్సులు నడపండి

బస్సు చోదకులకు సూచనలు ఇస్తున్న సుబ్బయ్య

గడివేముల, న్యూస్‌టుడే: పరిమిత వేగంతో బస్సులు నడపాలని అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్య సూచించారు. గడివేములలోని రాజరాజేశ్వర పాఠశాలలో బస్సుచోదకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో, మలుపులు, పిల్లలు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామని, బస్సులకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు సక్రమంగా ఉండాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను తొలగించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను తొలగించాలని గిరిజ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు అక్రమ మార్గాల్లో ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఉద్యోగులను నియమించారన్నారు. వారు తప్పనిసరిగా టెట్ పాసై ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం నియమించాలన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కుందూ నదిలో మృతదేహం లభ్యం

సంతజూటూరు(బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: మండలంలోని సంతజూటూరు గ్రామ శివారులో ఉన్న పికప్ ఆనకట్ట వద్ద కుందూనదిలో మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం ఓ మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకురావడంతో స్థానికులు, జాలర్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై జగన్‌మోహన్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని జాలర్ల సాయంతో ఒడ్డుకు చేర్చారు. రెండు రోజుల క్రితం ఇదే ప్రదేశంలో ఓ మృతదేహం కొట్టుకువచ్చిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం నీటిలో కొట్టుకువచ్చిన మృతదేహం వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామానికి చెందిన పెద్దరామయ్య(65)గా గుర్తించి మృతుని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బోయిలకుంట్లమెట్ట(మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం బోయిలకుంట్లమెట్ట గ్రామం నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. గాజులపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాజులపల్లె ప్రాథమిక ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యం పొందిన తర్వాత నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహానంది పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

సేవలు అందించాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాయలంలో సచివాలయాల ఉద్యోగులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో నిర్మించిన విభాగిని మధ్యలో రూ.30 లక్షలతో విద్యుద్దీపాల ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. భౌతిక శాస్త్రం, ఉర్దూ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైనవారు ఈ నెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

సంజామల, న్యూస్‌టుడే: ?: గ్రామంలోని ప్రధాన రహదారిలో నిత్యం మురుగునీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణికులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - **వెంకటేశ్వర్లు, రెడ్డిపల్లి**

✔: వీధిలోకి మురుగునీటిని వదలకుండా చర్యలు తీసుకుంటాం. - **సాల్మన్, ఎంపీడీవో**

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆర్.కృష్ణాపురం గ్రామంలో ఎస్సీ కాలనీ వద్ద ప్రధాన రహదారి కాల్వ పూడికతో నిండింది. - **ఓబులేసు, ఆర్.కృష్ణాపురం**

✔: కాల్వ పూడికతీత పనులు చేయిస్తాం. - **అశ్విన్, ఈవోపీఆర్డీ**

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: పెట్నికోటలోని గుండు మల్లేశ్వరస్వామి దేవాలయం సమీపంలో గల కాలనీలో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నాం. - **కాలనీవాసులు.**

✔: గ్రామాన్ని సందర్శించి కాలనీలో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకొంటాం. - **చంద్రమౌళీశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో**

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ?: త్రివర్ణ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. - **జయకృష్ణ, త్రివర్ణ కాలనీ**

?: కొత్త ఇందిరానగర్‌లో పలు చోట్ల విద్యుద్దీపాలు రెండు వారాలుగా వెలగం లేదు. చీకట్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **మాధవి, కొత్త ఇందిరానగర్**

✔: ఆయా ప్రాంతాల్లో నూతన విద్యుద్దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - **సురేష్, మున్సిపల్ ఏఈ**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల నుంచి బిజనవేముల దారిలో జుర్రేరు వంతెన వద్ద గ్రామ పంచాయతీ సిబ్బంది చెత్త డంప్ చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొంటోంది. - **మహేష్, స్థానికుడు**

✔: పరిశీలించి తగు చర్యలు చేపడతాం. - **ప్రకాశ్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: నాగమ్మకుంటలో సుమారు 30 వీధి దీపాలు పనిచేయడం లేదు. - **గ్రామస్థులు**

✔: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధి దీపాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తాం. - **మల్లికార్జున, డిప్యూటీ ఎంపీడీవో**

?: నాగమ్మకుంటలో నీటి సమస్యను పరిష్కరించాలి. - **గ్రామస్థులు**

✔: గ్రామంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాం. - **రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

విజేతలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

పోటీతత్వం ఎంతో అవసరం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: నేటి సమాజంలో ప్రతిరంగంలోనూ పోటీ పెరిగిందని, విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ రమాదేవి అన్నారు. ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ వల్ల విద్యార్థులపై వచ్చే మార్పులు' అనే అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుప్రియ మొదటి స్థానం, జమీనా ద్వితీయ స్థానం, కిశోర్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు స్వప్న, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోటీలకు హాజరైన విద్యార్థులు

దివ్యతేజం.. భవ్యచరితం

◆ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న దివ్యాంగులు
◆ నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో వంటల తయారీలో బి.సుధానాగరాణి

వారి ఆత్మవిశ్వాసం ముందు విధి తలవంచింది. దివ్యాంగులమని నిరాశ చెందకుడా తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా కుటుంబానికి అండగా నిలుస్తున్నవారు ఒకరు కాగా. సేద్యంలో సాగుతూ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తున్న వారు మరొకరు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్న దివ్యాంగుల గాథలివీ..

కుటుంబానికి తానే అండ..

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్‌లోని పాతపేటకు చెందిన బి.సుధానాగరాణి దివ్యాంగురాలు. తన చిన్నతనంలోనే గుండెపోటుతో తండ్రి మృతి చెందడంతో కుటుంబ భారమంతా తనపై పడింది. ఈమె అదే కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కొన్నేళ్ల నుంచి వంట నిర్వాహకురాలిగా ఉన్నారు. అంతేగాకుండా సాయంత్రం పూట ఇంటి వద్దే బజ్జీలు తయారుచేసి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లితో పాటు సోదరి, సోదరి కుమారుడిని, అన్నను తానే పోషిస్తూ వచ్చారు. కాగా అన్న సురేష్ కుమార్ మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. సోదరి కుమారుడు సుధీర్‌ను కర్నూలులో బీఎస్సీ కంప్యూటర్ ప్రథమ సంవత్సరం చదివిస్తున్నారు. తల్లి రామాంజనమ్మ వారం కిందట ఇంట్లో కింద పడటంతో కాలిగా తీవ్ర గాయమైంది. ఆమెకు కర్నూలులోని ఓ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించి.. మందుల ఖర్చులను సైతం తానే భరిస్తున్నారు సుధానాగరాణి. మరోవైపు తాను కూడా చదవాలనే కోరికతో స్థానికంగా ఓపెన్‌స్కూల్ ద్వారా ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశారు. పట్టణంలోని శ్రీసుధ కళాశాలలో టీటీసీ సైతం పూర్తి చేశారు.

కృషీవలుడు.. సేవకుడు

బొప్పాయి తోటలో ఖలీల్

డోన్, న్యూస్‌టుడే: డోన్ మండలంలోని పెద్దమల్కాపురానికి ఖలీల్‌కు చిన్నతనం నుంచే పోలియోతో రెండుకాళ్లు సరిగా పని చేయని పరిస్థితి. గ్రామానికి చెందిన హుసేన్‌బాషా, ఖైరున్‌బీల మూడో కుమారుడు ఖలీల్. ఎంఏ హిందీ హెచ్‌పీటీ పూర్తి చేశారు. ఉద్యోగం రాకపోవటంతో తన తల్లితండ్రుల నుంచి వచ్చిన ఎకరన్నార పొలాన్ని సాగుచేస్తూనే తానే సొంతంగా మరో నాలుగున్నర ఎకరాలు కొనుగోలు చేసి ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. అరటి, బొప్పాయి, ఉల్లి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేయిస్తున్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం 2010లో ఏడుగురు సభ్యులతో చైతన్య జాతీయ అభివృద్ధి స్వచ్ఛంద సేవా సంస్థ (హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ)ను ఏర్పాటు చేశారు. ఇలా డోన్ డివిజన్‌లోని దివ్యాంగులందరినీ ఏకం చేసి వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారు. ప్రస్తుతం సంస్థలో 500 మందికి పైగా సభ్యులుగా ఉన్నారు. సంస్థ స్థాపించినప్పటి నుంచి 5 వేల మందికిపైగా పింఛన్లు అందేలా కృషి చేసినట్లు తెలిపారు. గట్టి సంకల్పం ఉండాలే గానీ వైకల్యం అడ్డుకాదంటారు ఖలీల్.

నందవరంలో బీసీ రాజారెడ్డి పూజలు

రాజారెడ్డికి ప్రసాదాలు అందజేస్తున్న నాగార్జునరెడ్డి

నందవరం(బనగానపల్లి గ్రామీణం): మండలంలోని నందవరంలో ఉన్న చౌడేశ్వరిఅమ్మవారి ఆలయంలో తెదేపా నేత బీసీ రాజారెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ నాగార్జునరెడ్డి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రపు డెక్క ఇలా.. నీరు పారేదెలా

మండలంలోని జుర్రేరు వాగు అంతటా పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కతో నిండి దర్శనమిస్తోంది. పట్టణంలో ఇటీవల జుర్రేరు వాగు అభివృద్ధికి పనులు చేస్తున్నారు. అయితే వాగు అంతట గుర్రపుడెక్క ఉండటంతో నీరు కిందకి పారాలంటే గగనమైంది. సంబంధిత అధికారులు వాగును శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

కోతలు ముమ్మరం.. దిగుబడులు ఆశాజనకం

అవుకు జలాశయం ఆయకట్టు పరిధిలో సాగుచేసిన వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో దాదాపు 20 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఖరీఫ్ పంటగా సాగు చేసిన పైరు ప్రస్తుతం చివరి దశకు చేరుకోవడంతో కోతలు ప్రారంభించారు. సగటున ఎకరాకు 34-40 క్వింటాళ్ల వస్తున్నట్లు రైతులు వెల్లడించారు. చీడపీడల బెడద తగ్గడటంతో పెట్టుబడి ఖర్చులు తగ్గాయన్నారు. వ్యవసాయ పనులతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. – అవుకు, న్యూస్‌టుడే:

పట్టుకుంటున్నారు.. వదిలేస్తున్నారు

ఆళ్లగడ్డలో రహదారులపై ఆవుల బెడద తీవ్రమైంది. రాత్రయితే చాలు రహదారులపై గుంపులుగా చేరి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాయి. యజమానులు నిర్లక్ష్యంగా వదిలేస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంతే గాకుండా పంట పొలాలపై పడి పంటలను నాశనం చేస్తుంటాయి. సమస్య తీవ్రత దృష్ట్యా అధికారులు ఇటీవల రెండుసార్లు ఆవులను పట్టుకుని మార్కెట్లో బంధించారు. తర్వాత వెంటనే వదిలేశారు. సమస్య పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

విద్యార్థుల భద్రత విషయంలో రాజీపడం

దస్త్రాలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో క్రాంతి కుమార్

బేతంచెర్ల: పాఠశాల బస్సుల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని.. లేకుంటే కఠిన చర్యలు తప్పవని డోన్ ఆర్టీవో క్రాంతికుమార్ హెచ్చరించారు. బేతంచెర్ల పట్టణంలోని అన్ని విద్యాసంస్థలకు చెందిన బస్సులకు శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహన తనిఖీలు చేసి పన్ను చెల్లించిన మూడు ట్రాక్టర్ ట్రైలర్‌లకు రూ.72,210 జరిమానా విధించారు.

ఆళ్లగడ్డ: మంగళవారం ఆళ్లగడ్డ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను ఎంవీఐ శంకర్ నాయక్ తనిఖీ చేశారు. ప్రమాణాలను పాటించని బస్సులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మూత్రపిండ బాధితుడికి చెక్కు అందజేత

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మూత్రపిండ సమస్యతో బాధపడుతున్న యువకుడికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేశారు. శిరివెళ్లకు చెందిన రిజ్వాన్‌కు సమస్య ఉండగా.. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి అతడి చికిత్సకు మంజూరు చేసిన రూ.10 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే రిజ్వాన్ బంధువులకు అందించారు. దీంతో బాధిత కుటుంబం ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది.

ఎల్‌వోసీ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జీవయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ 69వ బేస్‌బాల్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు అహోబిలంలో జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్-17 విభాగంలో 9వ తరగతి విద్యార్థి నిరంజన్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. అలాగే చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన పోటీల్లో అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి వెంకటసుశాంత్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

దొర్నిపాడు, న్యూస్‌టుడే: దొర్నిపాడు ఎంపీడీవోగా చంద్రమౌళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మజ ఎంపీడీవోగా పదోన్నతి పొంది అన్నమయ్య జిల్లాలోని నందలూరు మండలానికి బదిలీపై వెళ్లారు.

డిప్యూటీ ఎంపీడీవోగా తిరుమలేశ్వరరెడ్డి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల డిప్యూటీ ఎంపీడీవోగా తిరుమలేశ్వరరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డోన్ మండలం దొరపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బనగానపల్లికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగరాజుకు నియామకపత్రం అందజేశారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

డోన్‌పట్టణం: ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నంద్యాలలో నిర్వహించిన వన్డే స్పోర్ట్స్ మీట్ ఫర్ చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్స్ పోటీల్లో డోన్ పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సత్తా చాటింది. దివ్యాంగురాలైన బి.చందన అండర్-20 బాలికల విభాగంలో పాల్గొని మూడు రకాల క్రీడల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఐఈఆర్టీలు ఎం.మధుబాబు, బి.రాణి మంగళవారం తెలిపారు. విద్యార్థినిని అభినందించారు.

జాతీయ సైన్సు ఫెస్టివల్‌కు నందవరం ఉపాధ్యాయుడి ఎంపిక

ఉపాధ్యాయుడు కుమార్‌బాబు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కుమార్‌బాబు జాతీయ సైన్సు ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. ఇండియా ఇంటర్నేషనల్ సైన్సు ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్-2025)కు రెండు విభాగాల్లో ఎంపికైనట్లు ఆయన మంగళవారం తెలిపారు. సైన్సు సఫారీ, సైన్స్ లిటరేచర్ అనే అంశాలపై అక్కడ ప్రసగించనున్నారు. సైన్స్ ఫెస్టివల్‌ను డిసెంబరు 5 నుంచి 9వ తేదీ వరకు చండీగఢ్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వార్డుల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ ఛాంబర్‌లో కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం డీఈ రఘు, ఏఈ సురేష్, సచివాలయాల వార్డు అమినిటీస్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో కుళాయి కనెక్షన్లకు సంబంధించి 303 డబుల్ ఎంట్రీ ఉన్నందున.. వాటిని తొలగించేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేసి సీడీఎంఏ కార్యాలయానికి పంపుతామని తెలిపారు. కుళాయి కనెక్షన్లలో డబల్ ఎంట్రీతో ఉండి ఇబ్బంది పడుతున్న వారు మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో సంప్రదించాలని సూచించారు. సకాలంలో కుళాయి పన్నులను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని మేజర్ గ్రామ పంచాయితీలో పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం దుస్తుల పంపిణీ చేపట్టారు. విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ మండల గౌరవ సలహాదారుడు దేవేంద్రకుమార్ ఆచారి మనవడు దేవాన్ ఆచారి పుట్టిన రోజును పురస్కరించుకొని రూ.50 వేల విలువైన దుస్తులను అందజేశారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న దేవేంద్రకుమార్ ఆచారి

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు..

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ బీసీ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు అందాయి. మంగళవారం వార్డెన్ సురేష్ విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. చలికాలం కావడంతో ప్రతి విద్యార్థికి ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇక్కడ మొత్తం 90 మంది విద్యార్థులు ఉన్నారు. దుప్పట్లు అందడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రసాదు

బనగానపల్లి, న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బనగానపల్లికి చెందిన తప్పెట ప్రసాదును ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు నియామక పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రసాదు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీలో జిల్లా స్థాయిలో పదవి ఇచ్చారన్నారు. పెద్దల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు మధుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

వినియోగదారులకు సమస్యలు లేకుండా చూడాలి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఈఈ శ్రీనివాసులు మంగళవారం రాత్రి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినియోగదారులకు సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. లో ఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన ఎమ్మెల్యేకు తెలిపారు.

మహిళ కడుపులో 2.5 కిలోల కణితి తొలగింపు

డోన్, న్యూస్‌టుడే: డోన్ బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాలలో కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళ కడుపులో నుంచి 2.5 కేజీల కణితిని వైద్యులు అతికష్టంపై తొలగించారు. కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన ఆ మహిళకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు కడుపులో కణితి ఉందని గుర్తించారు. దీంతో ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించి తొలగించారు. మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శం

పలుకూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శమని జేకేఆర్ సంస్థ అధ్యక్షుడు బ్రహ్మానందచారి పేర్కొన్నారు. మండల పరిధిలోని పలుకూరులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గౌతమ బుద్ధుని జీవిత విశిష్టతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం భక్తి భావనకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అరటి పంటకు మద్దతు ధర కల్పించాలి

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన మెట్టుపల్లి సుదర్శన్

ప్యాపిలి, న్యూస్‌టుడే: అరటి పంటకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను తెదేపా ప్యాపిలి మండల అధ్యక్షుడు మెట్టుపల్లి సుదర్శన్ కోరారు. రాష్ట్ర తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర స్థాయి మండల శాఖ అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలకు నిర్వహించిన సమావేశంలో భాగంగా ఆయన మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్యాపిలి మండల సమస్యలు గురించి వివరించారు.

విద్యుత్తు బిల్లుల చెల్లింపు బాధ్యత పురపాలికలదే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: విద్యుత్తు బిల్లులను నెల నెలా సక్రమంగా చెల్లించాల్సిన బాధ్యత పురపాలికపైనే ఉందని పురపాలక శాఖ ఆర్డీ నాగరాజు అన్నారు. ఆళ్లగడ్డలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు శాఖకు బకాయిలు చెల్లించని పురపాలికలు ఆర్థిక సంఘం నిధుల నుంచి వాటిని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. కుక్కల నియంత్రణకు వాటికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నామన్నారు.

నైపుణ్య శిక్షణ.. కొలువుకు నిచ్చెన

○ నిరుద్యోగ యువతకు ఉపాధి బాట

ఇటీవల జరిగిన ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగ యువత

బనగానపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ఇచ్చే శిక్షణ తరగతులు వరంగా మారాయి. వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు ఎంతో భరోసానిస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమారు వంద రోజుల పాటు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ తీసుకుంటోంది. నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పది నెలలుగా సుమారు 200 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా వారి నైపుణాలను బట్టి ఇంటర్వ్యూలు జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

ఫోన్ చేసి అడ్మిషన్ పొందొచ్చు

– దస్తగిరి, శిక్షకుడు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి ఎంతో మంది యువత వస్తున్నారు. ఉద్యోగాలు పొందుతున్నారు. ఫోన్ చేసి అడ్మిషన్ పొందవచ్చు. సుమారు 90 రోజులు శిక్షణ ఉంటుంది. ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా శిక్షణ ఇస్తాం. శిక్షణ అనంతరం పెద్ద పెద్ద కంపెనీలను తీసుకొచ్చి ఉద్యోగాలు పొందేందుకు అవకాశం కల్పిస్తాం. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 9705998056 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ నెల 9 నుంచి కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నాం.

తప్పకుండా ఉద్యోగం సాధిస్తా

– బి.భరద్వాజ, మీరాపురం

నేను బీకాం కంప్యూటర్స్ చదివాను. సుమారు 30 రోజులకు పైగా శిక్షణ తీసుకుంటున్నా. ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్, ఓఎస్ ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ తీసుకుంటున్నా. ఇంటర్వ్యూలకు వెళితే తప్పకుండా ఉద్యోగానికి ఎంపిక అవుతానని ఆత్మస్థైర్యం వచ్చింది. ఏదో ఒక కంపెనీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగానికి ఎంపికవుతాననే నమ్మకం ఉంది.

ఎంతో ఉపయోగకరం – టి.మనోహర్, నందవరం

స్కిల్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణతో ఎన్నో మెలకువలు నేర్చుకుంటున్నాను. నేను నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీకాం చదువుకున్నా. శిక్షణ గురించి తెలుసుకుని దరఖాస్తు చేసుకొని వచ్చాను. కంప్యూటర్‌కు సంబంధించిన అన్ని విషయాలు చెబుతున్నారు. ఇక్కడ ఇచ్చే శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలని ఉంది.

గంజాయి పట్టివేత

డోన్ నేరవిభాగం: డోన్ రైల్వే స్టేషన్ బయట గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఈశ్వర్‌గౌడ్, పాతపేటకు చెందిన షేక్ హుసేన్, కొండపేటకు చెందిన చాకలి హరికృష్ణ గంజాయి తీసుకెళుతుండగా పట్టణ పోలీసులు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఉన్న 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి, రిమాండుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

చరవాణుల చోరీ

డోన్‌నేరవిభాగం, డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గేటు వద్ద నిలిపిన ద్విచక్ర వాహనాల్లోని చరవాణులను దుండగులు చోరీ చేశారన్న వార్త మంగళవారం సామాజిక మాధ్యమ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఐదో సెమిస్టర్‌కు సంబంధించి తృతీయ సంవత్సరం విద్యార్థులు పర్యావరణ విద్య పరీక్ష రాసేందుకు రాగా... 12 చరవాణులు చోరీకి గురయ్యాయి. నలుగురు విద్యార్థులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

డోన్: ఉద్యోగ విరమణ పొందిన మున్సిపల్ కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యం శెట్టి, శివరాంలు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌లతో సమస్యలపై చర్చించారు.

సర్వాయిపల్లె(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: 'పొలం పిలుస్తోంది'లో భాగంగా సర్వాయిపల్లె, ఆర్.జమ్ములదిన్నె గ్రామాల్లో మంగళవారం శనగ పంటను పరిశీలించారు. కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సిబ్బంది పంటలను పరిశీలించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే డీలర్లు రేషన్ సరుకులను అందించాలని తహసీల్దార్ విజయశ్రీ మంగళవారం పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. కోవెలకుంట్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: 40వ జాతీయ రహదారిపై మద్దూరు మెట్ట వద్ద మంగళవారం ఎస్సై సురేష్ వాహనాల తనిఖీ చేపట్టారు.

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రోబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు.

అవుకు, న్యూస్‌టుడే: పాఠశాలల వారిగా ఉపాధ్యాయులకు అవుకులో మంగళవారం నిర్వహించిన క్రీడాపోటీలు ముగిశాయి. క్రికెట్ పోటీల్లో 40, త్రోబాల్ పోటీల్లో 20 మంది పాల్గొన్నారని మండల విద్యాధికారి శ్రీధర్‌రావు తెలిపారు.

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: బత్తలూరుకు చెందిన నంద్యాల చంద్రశేఖర్‌రెడ్డి(60) అదృశ్యమైనట్లు కుటుంబీకులు తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదన్నారు. ఆళ్లగడ్డ గ్రామీణం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

బనగానపల్లి గ్రామీణం: చికిత్స పొందుతూ చంద్రశేఖర్‌గౌడ్ (37) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దరాజుపాలెంలో సోమవారం చోటు చేసుకుందని గ్రామస్థులు మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అప్పులబాధ తాళలేక గత నెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబసభ్యులు బనగానపల్లి వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించారు.

(c) eenadu

ఈనాడు పల్నాడు

ఆలోచనలు విరియాలి... ఆవిష్కరణలు మెరవాలి..!

ఈనాడు

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసేందుకు 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన' నిర్వహిస్తోంది. విద్యార్థి ఆలోచనలకు ప్రయోగాలుగా వేదికగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం, గుంటూరులో డిసెంబరు 11వ తేదీన మెగా సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తోంది.

నిబంధనలు.. ● 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే ● ప్రాజెక్టును ముందుగా నమోదు చేసుకోవాలి ● ఒక ప్రాజెక్టుకి ఇద్దరు విద్యార్థులకు అనుమతి ● పాఠశాల/ బ్రాంచ్‌కి ఒక ప్రాజెక్టుకు మాత్రమే అనుమతి ● మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ఉంటాయి. ● పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం ● **రిజిస్ట్రేషన్ చివరి తేదీ : డిసెంబరు 7**

నమోదు కొరకు: 91549 91113 సమయం : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గం॥ల వరకు..

పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావొద్దు

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించే రైతులు ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావద్దని సీసీఐ ఏజీఎం సంజయ్ ద్వివేది విజ్ఞప్తి చేశారు. నాదెండ్ల మండలం గణపవరం శ్రీ వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. నాణ్యమైన పత్తిని కేంద్రానికి తీసుకొచ్చి గరిష్ఠ మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తిని ప్లాస్టిక్ సంచుల్లో తెస్తే నాణ్యత తగ్గి ధర కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. తేమ శాతం 8 నుంచి 12లోపు ఉండాలని, రైతులు యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని నిర్దిష్ట సమయానికి సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకొచ్చి మంచిధర పొందాలని సూచించారు.

పత్తిని పరిశీలిస్తున్న సంజయ్ ద్వివేది

మామూళ్లు ఇస్తేనే బిల్లు!

ఐవీఆర్ఎస్‌లో లబ్ధిదారుల అభిప్రాయం

నరసరావుపేట, న్యూస్‌టుడే

వేదల సొంతింటి కల సాకారం చేసేందుకు పక్కా ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని.. లబ్ధిదారులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కూటమి ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసి బిల్లు పెట్టాలని కోరితే.. కొందరు అధికారులు, ఉద్యోగులు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు. తమ చుట్టూ కాళ్లరిగేలా తిప్పించుకుంటున్నారు. ప్రభుత్వం పక్కా ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులతో నిర్వహించిన ఐవీఆర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఇంటి బిల్లు మంజూరుకు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్కువమంది చెప్పారు. అలాగే బిల్లులు నిదానంగా పెడుతున్నారని, గృహ నిర్మాణ సమయంలో ఉద్యోగుల సహాయ సహకారాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వెల్లడించారు. ప్రభుత్వం అక్టోబర్లో ఐవీఆర్ సర్వే వివరాల్ని క్షేత్రస్థాయికి పంపింది. దీనిపై పర్యవేక్షక అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు.

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వివిధ పథకాల కింద సుమారు 75 వేల పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కింద వేలాది ఇళ్ల నిర్మాణాల్ని వచ్చే రెండేళ్లలో పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇలాంటి పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు నిర్మించుకునే ఇళ్ల నిర్మాణాల్లో బిల్లుల జాప్యం, అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ప్రభుత్వ పథకాల కింద చేపడుతున్న పక్కా ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సర్వే వివరాలిలా (శాతాల్లో)..

ఇల్లు నిర్మించినంత వరకు బిల్లులు అందుతున్నాయా?	త్వరగా 45.6	నిదానంగా 54.4
అధికారులు, ఉద్యోగులు సహాయ సహకారాలు అందిస్తున్నారా?	అవును 57.6	లేదు 42.4
బిల్లుల మంజూరుకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారా?	అవును 63.8	లేదు 36.2

నిర్మాణంలో ఇళ్లు

ఇంటికి రారు.. బియ్యం ఇవ్వరు

బెల్లంకొండ మండలం రామాంజనేయపురం తండాకు చెందిన ఈ వృద్ధురాలు 5 కి.మీ. దూరంలోని మన్నెసుల్తాన్‌పాలెం నుంచి రేషన్ బియ్యం మోసుకెళ్తోంది. సొంతూరులో చౌకధరల దుకాణం లేదు. గ్రామస్థులంతా ఇలా పక్క ఊరికొచ్చి రేషన్ తీసుకెళ్లాల్సిందే. ముసలివాళ్లమైనా సరే ఇంత దూరం వచ్చి బియ్యం తీసుకెళ్తున్నామని, ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయడం లేదని వృద్ధురాలు వాపోయారు.

గ్రామంలో 60 ఏళ్ల పైబడినవారికి ఇంటి వద్ద రేషన్ ఇవ్వడం లేదని, డబ్బులు తీసుకోవాలని డీలర్లు ఒత్తిడి చేస్తున్నారని నాదెండ్ల మండలం చందవరానికి చెందిన వృద్ధుడు రెండు వారాల కిందట కలెక్టరేట్‌లో ఫిర్యాదుచేశారు. చాలామందికి బియ్యం అవసరం ఉన్నా ఇవ్వడం లేదని, వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గణపవరంలోనూ రేషన్ ఇవ్వడం లేదని, తీసుకుంటే డబ్బులు.. లేకుంటే అదీ ఉండదని తెగేసి చెబుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ, బెల్లంకొండ

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ ఎక్కడా జరగడం లేదు. కేవలం బయోమెట్రిక్ తీసుకుని నగదు ఇస్తున్నారు. బియ్యం కావాలంటే రేషన్ దుకాణానికి వెళ్లాల్సిందే. అదీ రెండ్రోజుల్లోనే. లేకుంటే బియ్యం అయిపోయాయని తిప్పి పంపుతున్నారు. రాజకీయ జోక్యం ఎక్కువై అధికారులు ఏం చేయలేకపోతున్నారు.

జిల్లాలో రేషన్ దుకాణాలు **1,289**

వృద్ధుల రేషన్ కార్డులు **74,730**

దివ్యాంగులు, వృద్ధులు.. నడవలేని స్థితిలో ఉండేవారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచించింది. వీరికి ప్రతినెలా 20 నుంచి 30 తేదీల మధ్య రేషన్ పంపిణీ పూర్తయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ ఎక్కడా సరిగ్గా అమలు కావడం లేదు. చాలా మంది డీలర్లు వృద్ధుల ఇళ్ల వద్దకెళ్లి బయోమెట్రిక్ తీసుకుని బియ్యం బదులు నగదు ఇస్తున్నారు. కిలోకు రూ.10 చొప్పున అందిస్తున్నారు. కొంతమంది డీలర్లు దుకాణాల వద్ద బియ్యం ఇస్తున్నారు. ఇంకొందరు ఒకటో తేదీ తర్వాత అందజేస్తున్నారు.

'ఎట్టి పరిస్థితుల్లోనూ బియ్యమే పంపిణీ చేయాలని, నగదు ఇవ్వకూడదని ఆదేశాలు జారీ చేశాం. బియ్యం ఇవ్వడం లేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం' అని డీఎస్‌వో ప్రసాద్ తెలిపారు.

తల్లి కష్టం.. తనయ విజయం

తల్లి కష్టాన్ని బాల్యంలోనే చూసిన ఆ తనయ విజయాలతో అమ్మ మోములో చిరునవ్వు చూసేందుకు నిరంతరం సాధన చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రతిభ చాటుతోంది. తాజాగా ఏఎన్‌యూ అంతర్ కళాశాలల కస్తీ పోటీల్లో విజేతగా నిలిచింది. తనకు ఇష్టమైన ఫుట్‌బాల్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణిస్తోంది. క్రీడా ఆణిముత్యం.. మహేశ్వరి అని అందరూ అంటుంటే ఆ అమ్మ సంతోషానికి అవధుల్లేవు.

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

❖ 2018లో విజయవాడ, 2019లో మహారాష్ట్రలో జరిగిన సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటింది.

ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన మారాని విజయలక్ష్మి ఇంటి వద్ద అల్పాహారం విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. భర్త దూరమైన పరిస్థితుల్లో ఒక్కగానొక్క కుమార్తె మహేశ్వరిని చదివించి ప్రయోజకురాలిగా చేయాలని కష్టపడుతోంది. మహేశ్వరి ప్రస్తుతం పట్టణంలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

మూడు క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ .. మహేశ్వరి ఫుట్‌బాల్, కస్తీ, సెపక్‌తక్రా క్రీడల్లో ప్రతిభ చాటుతోంది. వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి పతకాలు గెలుపొందింది. 2020లో విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో విజేతగా నిలిచింది. గత నెల 26న ఒంగోలులో జరిగిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పోటీల్లో విజేతగా నిలవడమే కాకుండా ఏఎన్‌యూ సౌత్ జోన్ పోటీలకు ఎంపికైంది. మహేశ్వరి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చాటుతోంది. మిడ్ ఫార్వర్డ్, ఫార్వర్డ్, డిఫెన్స్.. ఇలా ఏ స్థానంలోనైనా మైదానంలో చిరుతలా పరుగులు తీస్తూ గోల్స్ చేస్తోంది. 2023లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన సంతోష్ ట్రోఫీ సీనియర్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రాయపూర్‌లో జరిగిన సీనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాణించింది. ఫుట్‌బాల్ జాతీయ రిఫరీగా నియామకం పొందింది. క్రీడల్లో రాణించి పోలీసు శాఖలో ఉద్యోగంతో ప్రజలకు సేవ చేయాలనేది తన లక్ష్యమని మహేశ్వరి చెబుతోంది. తల్లి విజయలక్ష్మి ప్రోత్సాహం, వ్యాయామోపాధ్యాయుడు రియాజ్ సుశిక్షణ, ప్రోత్సాహంతో మూడు క్రీడల్లో రాణిస్తున్నట్లు తెలిపింది.

మహేశ్వరి

ఎంత పనిచేశావమ్మా..!

మురుగు కాలువలో పసికందు మృతదేహం



తొమ్మిది నెలలు కడుపులో దాచుకున్నావు..
ప్రసవ వేదన భరించావు..
కళ్లు తెరవకనే కాలువలోకి చేర్చావు..
ఎందుకిలా చేశావమ్మా..

అమ్మ పొత్తిళ్లలో నిద్రపోవాలని..
గోరుముద్దలు తినాలని..
అక్కున చేర్చుకుని ముద్దాడతావని..
ఎన్నో ఆశలు పెట్టుకున్న బిడ్డను..
మురుగు కాలువలో పడేశావేంటమ్మా

శిశువు భూమి మీదకు వచ్చిన నిమిషాల్లోనే..
మనసు రాయి చేసుకున్నావు..
మానవత్వం మరిచావు..

కారంపూడి ఎస్సీ కాలనీ సమీపంలోని మురుగు కాలువలో మంగళవారం ఆడశిశువు మృతదేహం కనిపించింది. ప్రసవించిన నిమిషాల వ్యవధిలోనే పసికందును కాలువలో వేసిన ఘటన స్థానికులను కలచివేసింది. బిడ్డను చూసిన ఆ ప్రాంత మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంత పనిచేశావు తల్లీ అంటూ ఆవేదన చెందారు. మానవత్వం మంటగలిసిందని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎస్సై వాసు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను పోలీసు స్టేషన్‌కు పిలిపించి పసిబిడ్డ విషయమై వాకబు చేశారు.

- న్యూస్‌టుడే, కారంపూడి

నేడు కేంద్ర మంత్రి జుయల్ ఓరం పర్యటన

గుంటూరు: కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం బుధవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు కె.ఎల్.యూనివర్సిటీలో నిర్వహించే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్స్ స్కూల్స్ (ఇ.ఎం.ఆర్.ఎస్) జాతీయ సాంస్కృతిక, సాహిత్య, కళా ఉత్సవ్ (ఉద్భవ్) 2025లో కేంద్ర మంత్రి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన బయలుదేరి విజయవాడ చేరుకుని, అక్కడి నుంచి న్యూదిల్లీ వెళతారని తెలిపారు.

రాజధానికి భూములిస్తాం

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు సిద్ధమని కర్లపూడి రైతులు తెలిపారు. రెండో విడత భూసమీకరణ నేపథ్యంలో మంగళవారం కర్లపూడి రైతులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమావేశమయ్యారు. రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. భూములకు రిటర్నబుల్ ప్లాట్లు గ్రామ సమీపంలోనే ఇచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఎకరానికిచ్చే రూ.30 వేల కౌలు సరిపోదని, రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఎటువంటి అపోహలు వద్దన్నారు. గ్రామంలోని 2,944 ఎకరాల రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కర్లపూడి రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. భూములు ఇచ్చేందుకు సిద్ధమంటూ నినాదాలు చేశారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, కర్లపూడి రైతులు

ఆవేశం ఆయువు తీస్తోంది!

సత్తెనపల్లి, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

చిన్న చిన్న విషయాలకే హత్యలు

మొన్న నరసరావుపేట.. నిన్న ధూళిపాళ్ల.. రోజుల వ్యవధిలో జరిగిన హత్యలు కలకలం రేపాయి. చిన్న చిన్న విషయాలకే హత్యలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఫ్యాక్షన్, రౌడీయిజం కాకుండా కొత్త తరహా హత్యా సంస్కృతి జిల్లాలో పెరుగుతోంది. తమను చూసి ఉమ్మి వేశాడని.. కేసు పెడతానని భార్య బెదిరించిందని.. అప్పు తీర్చాలని అడిగారని.. గంజాయి, మద్యం మత్తులో ఆవేశంతో ప్రాణాలు తీస్తున్నారు. మరికొన్ని హత్యలు పక్కా పథకం ప్రకారం జరుగుతున్నాయి.

జిల్లాలో మచ్చుకు కొన్ని.. ✦ వినుకొండ పట్టణానికి చెందిన మరియబాబు ఈ నెల 10న మద్యం తాగి ఓబయ్య కాలనీలో ఓచోట నిలుచున్నాడు. అటుగా వెళ్తున్న రాంబాబు తనను చూసే ఉమ్మి వేశాడని మరియబాబు, అతడి కుటుంబసభ్యులు దాడి చేశారు. చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడు.

✦ సత్తెనపల్లి పట్టణంలో ఇటీవల సోదరికి విడాకులు ఇచ్చాడనే కోపంతో బావను బావమరిది హతమార్చాడు.

✦ ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 18 హత్యలు జరిగాయి. అందులో ఒకటి సొత్తు కోసం దొంగలు చేశారు. జులై నుంచి ఇప్పటివరకు మరో 15 వరకు హత్యలు జరిగాయి. హత్యాయత్నాలైతే వీటికి మూడింతలున్నాయి. వినుకొండతో పాటు కొన్ని స్టేషన్ల పరిధిలో నిఘాతో హత్యల్ని నిరోధించి నిందితుల్ని జైలుకు పంపించారు. ఇలాంటి పరిస్థితి అన్ని స్టేషన్లలో ఉండాలి. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచే పోలీసు యంత్రాంగం నిఘా పెంచి నేరాలకు కళ్లెం వేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

కారణాలివీ.. జిల్లాలో గత ఏడాదిన్నర కాలంలో చోటు చేసుకున్న హత్యలపై విచారణ జరిపి ప్రధాన కారణాలను పోలీసులు విశ్లేషించారు. అవి.. ✶ వివాహేతర సంబంధాలు ✶ ఆర్థిక వివాదాలు ✶ భార్యాభర్తల మధ్య కలతలు, కుటుంబ వైరాలు ✶ ఆస్తి గొడవలు, పొలం తగాదాలు ✶ సొమ్ముపై దురాశ (దోపిడీ ఆశ) ✶ స్నేహంలో గొడవలు, పాతకక్షలు ✶ గంజాయి, మత్తు పదార్థాలు, మద్యానికి బానిసలు కావడం.

ధూళిపాళ్ల: సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ



కూడలికి సామాన్యురాలి పేరు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే

ఏదైనా నగరం, పట్టణం, గ్రామాల్లో వీధులు, ప్రధాన కూడళ్లకు స్వాతంత్ర్య సమరయోధులు.. లేదా ప్రముఖులు.. రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం సర్వసాధారణం. అలా కాకుండా జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ఓ ప్రధాన కూడలికి సామాన్య మహిళ పేరు పెట్టారు. ఎందుకు ఆమెకు విశేష గౌరవం దక్కిందో తెలుసుకుందాం. పల్నాడు ప్రాంతానికి నరసరావుపేట ప్రధాన ముఖద్వారం. ఈ పట్టణంలో 'మల్లమ్మ సెంటర్' పేరు తెలియని వారుండరు. గుంటూరు, పల్నాడు, వినుకొండ, సత్తెనపల్లి మార్గాలకు ప్రధాన కూడలి ఈ 'మల్లమ్మ సెంటర్'. ఆమె పేరు చందనం మల్లమ్మ, భర్త కోటయ్య. 1945 ఫిబ్రవరిలో వీరు ఓ చిన్న మిఠాయి దుకాణం ప్రారంభించారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఇక్కడ పాలించిన జమీందారుకు (రాజు గారి కోట) ఈమె దుకాణం నుంచే మిఠాయిలు వెళ్లేవి. తనకు అవసరమైన పలు రకాల మిఠాయిలను జమీందారు ఈ దంపతుల ద్వారా చేయించుకునే వారని తెలుస్తోంది. పరిసర ప్రాంత ప్రజలు కూడా గుర్రపు బండ్లపై వచ్చి మిఠాయిలు తీసుకెళ్లడంతో మంచి ఆదరణ పొందింది. ఒకప్పటి రాజుగారి చౌత్రాలో భాగమై పెద్ద బజారుగా ఉన్న పేరు కాలక్రమేణా 'మల్లమ్మ సెంటర్'గా వాడుకలోకి వచ్చింది.

1980లో కోటయ్య చనిపోగా, 1990లో మల్లమ్మ మృతిచెందారు. ఆమె ఆధ్వర్యంలో 85 ఏళ్ల పాటు మిఠాయి దుకాణం నిర్వహించారు. ప్రస్తుతం ఆమె నాలుగో తరం వారసులు కూడలి వద్ద దుకాణం నిర్వహిస్తున్నారు. ఇలా కూడలికి ఆమె పేరు స్థిరపడింది.

భద్రత ఉండదు.. భరోసా దక్కదు!

ఏఆర్‌టీ మందులు వాడుతున్నా అందని పింఛను

నరసరావుపేట, న్యూస్‌టుడే

జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బారినపడి క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడుతున్నవారు 10,238 మంది ఉన్నారు. వీరిలో 60 నుంచి 80 శాతం మంది సామాజిక భద్రత పింఛను పొందేందుకు అర్హులని వైద్య సిబ్బంది చెబుతున్నారు. అయితే జిల్లావ్యాప్తంగా 1,531 మంది మాత్రమే సెర్ప్ నుంచి పింఛను పొందుతున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేటలలోని ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా వీరికి ప్రతినెలా రూ.4 వేల పింఛను అందిస్తున్నారు. సత్తెనపల్లిలో ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఉన్నా ఏఆర్‌టీ కేంద్రం ఇవ్వలేదు. ఇక్కడి లింక్ ఏఆర్‌టీ కేంద్రంలో ప్రతి నెలా మందులు అందుకుంటున్న వారిలో చాలామందికి పింఛను అందట్లేదు. అర్హులందరికీ పింఛన్ అందేలా అధికారులు చొరవ చూపించట్లేదనే విమర్శలున్నాయి. ✶ పులిరాజు (హెచ్‌ఐవీ, ఎయిడ్స్) పోలేదు. గత రెండేళ్లతో పోల్చితే జిల్లాలో మహమ్మారి బారిన పడే వారిలో మార్పు ఏమీలేదు. పురుషుల్లో వ్యాప్తి కాస్తంత తగ్గినట్లు ఉన్నా గర్భిణుల్లో గతేడాదికి మించి పాజిటివ్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని వైద్య ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి ఇలా (పురుషుల్లో)..

సంవత్సరం	రక్తపరీక్షలు చేసింది	వ్యాధి బారిన పడినవారు	పాజిటివిటీ శాతం
2023–24	42,994	569	1.32
2024–25	57,683	589	1.02
2025–26	35,840	285	0.80

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 0.80 శాతం పాజిటివిటీ నమోదైంది. 2026 మార్చి నాటికి పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

కొడవళ్లకు చిరునామా వి.కొప్పెరపాడు

వి.కొప్పెరపాడు.. కొడవళ్ల తయారీకి ప్రసిద్ధి చెందింది. ఇక్కడి కొడవళ్లు నాణ్యంగా ఉంటాయని పేరు రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు ప్రాంతానికి చెందిన రైతులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన ఏడు కుటుంబాల వారు మూడు దశాబ్దాల క్రితం బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు వలస వచ్చారు. మాగాణి వరి పంట ఎక్కువగా ఉండటంతో కోత కొడవళ్ల తయారీని ఉపాధిగా మలుచుకున్నారు. సొంతంగా సామగ్రి తెచ్చుకుని అందంగా, నాణ్యంగా తయారు చేయడమే కాకుండా అందుబాటు ధరలకు విక్రయిస్తుండటంతో తమ కొడవళ్లను కొనుగోలు చేస్తుంటారని తయారీదారులు వీరవల్లి వెంకట్రావు, సముద్రాచారి, వెంకటేశ్వరరావు తెలిపారు.

- న్యూస్‌టుడే, వి.కొప్పెరపాడు (బల్లికురవ, అద్దంకి)

పీఆర్‌లో నూతన అధ్యాయం / 4న డీఎల్‌డీవో కార్యాలయాలు ప్రారంభం

గుంటూరు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ వ్యవస్థలో నూతన అధ్యాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డివిజినల్ అభివృద్ధి అధికారుల కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్తూరు జిల్లాలో ప్రారంభించిన తర్వాత వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని 77 డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభిస్తారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల, రేపల్లె, బాపట్ల డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు.. డీఎల్‌డీవోలు పిచ్చిరెడ్డి, రాజగోపాల్, గబ్రూనాయక్‌లతో జడ్పీ కార్యాలయంలో మంగళవారం సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు.

❖ గుంటూరు డీఎల్‌డీవో కార్యాలయాన్ని జడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మిగిలిన ఆరు డివిజన్లలోనూ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మొత్తం రూ.1.15 కోట్లు ఖర్చు చేసి కార్యాలయాల్ని తీర్చిదిద్దారు.

ఆకర్షణీయంగా గుంటూరు డీఎల్‌డీవో ఛాంబర్

❖ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో మార్పులు చేస్తామని ప్రకటించి డీఎల్‌డీవో కార్యాలయాల ఏర్పాటుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. ఇకపై రెవెన్యూ శాఖలో డివిజనల్ స్థాయిలో ఆర్డీవోల మాదిరిగా డీఎల్‌డీవోలు కూడా అభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. ఉపాధి పథకం ఏపీడీ, డీఎల్‌పీవోలు కూడా డీఎల్‌డీవో పరిధిలో పనిచేస్తారు. మొత్తం 15 మంది సిబ్బందిని కేటాయించారు.

❖ **శాఖ బలోపేతం..** 'ఉమ్మడి జిల్లాలో ఏడు డీఎల్‌డీవో కార్యాలయాలను ఈ నెల 4న ప్రారంభించేలా ఏర్పాట్లు చేశాం. డీఎల్‌డీవో వ్యవస్థతో పంచాయతీరాజ్ శాఖ బలోపేతమవుతుంది. పీఆర్, ఆర్డీ విభాగాలను ఒకే వ్యవస్థలో చేర్చడంతో డీఎల్‌డీవోలు తనిఖీలు చేసి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తారు' అని జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు తెలిపారు.

పీఆర్ నాలుగో తరగతి సిబ్బందికి ఉద్యోగోన్నతులు

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖకు చెంది జిల్లా పరిషత్తు యాజమాన్య పరిధిలోని 18 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు రికార్డు, ల్యాబ్, లైబ్రరీ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ జిల్లాపరిషత్తు సీఈవో జ్యోతిబసు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 13 మంది రికార్డు అసిస్టెంట్లుగా, నలుగురు ల్యాబ్ అసిస్టెంట్లుగా, ఒకరు లైబ్రరీ అసిస్టెంటుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి ఆయా జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులు దీర్ఘకాలంగా ఉద్యోగోన్నతుల కోసం నిరీక్షిస్తున్నారు. ఒకేసారి 18 మందికి ఉద్యోగోన్నతులు కల్పించడంతో వారి నిరీక్షణ ఫలించినట్లయింది.

N.S. LAW COLLEGE
(Affiliated to Andhra Kesari University, Ongole)
Devarajugattu (V), Peddaraveedu (Mdl), Prakasam (Dt), AP - 523 320
SPOT ADMISSIONS
A Few seats are available in 3 and 5 Years LL.B Course
Spot Admissions on : **03.12.2025.**
For Admissions Contact: 86884 42544, 95025 40700
N.S. LAW College Secretary & Correspondent

అశ్రుతాంజలి



బాధ్యత, శ్రమ, పట్టుదల, నిజాయితీ, క్రమశిక్షణ మారుపేరుగా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న మా బావ కీ॥శే॥ చిగురుపాటి ఆదినారాయణ గారి మరణానికి చింతిస్తూ.... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ...

జననం 09-07-1939 మరణం 19-11-2025

కీ॥శే॥ చిగురుపాటి ఆదినారాయణ గారు
(మాజీ సర్పంచ్, మాజీ మండల అధ్యక్షులు, మాజీ ZPTC, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్)

మీ బావమరుదులు
కొత్త వెంకటాంజనేయులు - రోశమ్మ
కొత్త వెంకట రామయ్య - సామ్రాజ్యం
కొత్త శేషయ్య - నారాయణమ్మ
రూపెనగుంట్ల (గ్రామం), నగరికల్లు (మండలం)

(c) eenadu

ఉద్యోగప్రాప్తిరస్తు

నిరుద్యోగులకు కౌశలం పరీక్ష

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

సత్తెనపల్లిలోని వార్డు సచివాలయంలో పరీక్ష రాస్తున్న నిరుద్యోగి

నిరుద్యోగుల విద్యార్హత, నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగ, ఉపాధి అవకాశాల్ని కల్పించేందుకు ఉద్దేశించిన కౌశలం కార్యక్రమానికి సంబంధించి కీలక అడుగులు పడ్డాయి. ప్రభుత్వం నిర్వహించిన కౌశలం సర్వేలో వర్క్‌ఫ్రం హోమ్ (ఇంటి నుంచే ఉద్యోగం) చేస్తామని వివరాలు నమోదు చేయించుకున్న నిరుద్యోగులకు బహుళజాతి, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తుంది. మంగళవారం జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో పరీక్షలు మొదలయ్యాయి. ముందుగానే నిరుద్యోగులకు సమాచారం ఇవ్వడంతో వారు ఉత్సాహంగా ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొన్నారు.

☛ ఈనెల 2వ తేదీ నుంచి 6 వరకు సచివాలయాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి 12, సాయంత్రం 3 నుంచి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. కౌశలం పరీక్షల కోసం సచివాలయాల్లో కంప్యూటర్లు, అంతర్జాల సౌకర్యాన్ని కల్పించారు. తొలి రోజు మంగళవారం 1,076 మంది పరీక్షలకు హాజరయ్యారు.

తేదీ	పరీక్షరాసే నిరుద్యోగులు
3	1,071
4	1,066
5	1,060
6	1,051

☛ జిల్లాలో 85,133 మంది నిరుద్యోగులు కౌశలం కార్యక్రమ పరిధిలోకి వస్తారని ప్రభుత్వం గుర్తించింది. వారిలో ఇంటింటికీ సర్వేతో 51,859 మంది నిరుద్యోగుల సమగ్ర సమాచారాన్ని సేకరించారు. విద్యార్హతల్ని ప్రామాణికంగా తీసుకుని పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఫలితాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిభ ఉన్నవారికి నేరుగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

పంచసూత్రాల ఆధారంగా పంటల ప్రణాళిక

✤ నేడు జిల్లా వ్యాప్తంగా రైతన్నా మీకోసం గ్రామసభలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: రానున్న అయిదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పంచసూత్రాలు (నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు) ఆధారంగా పంటల ప్రణాళిక తయారీలో అధికారులు, రైతులు భాగస్వాములు కావాలని కలెక్టర్ కృతికా శుక్లా కోరారు. జిల్లా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఆమె మంగళవారం వెబెక్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం జిల్లా వ్యాప్తంగా 347 రైతుసేవా కేంద్రాల వద్ద రైతన్నా మీకోసం గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ గ్రామ సభల్లో 2025-26 రబీ, 2026 ఖరీఫ్, 2026-27 రబీ సీజన్ల పంట ప్రణాళికలపై రైతులతో చర్చించాలన్నారు.

పండగ వాతావరణంలో సమావేశం సాగాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం వీక్షణ సమావేశం ద్వారా విద్యాశాఖ అధికారులతో సమీక్ష చేశారు. ఈనెల 5న జిల్లాలోని ప్రభుత్వ, గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వాటిని తక్షణమే తయారు చేయించాలన్నారు. ప్రతి పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారులు, పోలీసు, వైద్యశాఖ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం, నాణ్యమైన విద్యాబోధన ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్న విషయాలపై కార్యక్రమాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాలలకు మంజూరైన పరికరాలు, ఆట వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ పాఠశాలల్లోనూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. పదోతరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకున్న చర్యలను వివరించాలని ఆదేశించారు.

వృక్ష బంధన్

పెనవేసుకుని పెరిగిన వేప, జువ్వి చెట్టు

చెట్ల చుట్టూ నిర్మించిన గోడ

బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామ శివారులో పోలేరమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో వేప, జువ్వి చెట్టు పెనవేసుకుని పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఏళ్ల కిందట మొక్కలుగా ఉన్నప్పుడే ఇవి ఇలా ఒకదానికొకటి కలిసి పెరిగి వృక్షాలుగా మారాయి. వీటి వద్ద రాతిపై చెక్కిన గ్రామ దేవత పోలేరమ్మ విగ్రహం ఉంది. గ్రామస్థులు గ్రామ దేవత విగ్రహంతో పాటు ఈ చెట్లకు పసుపు పూసి పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. ఈ చెట్లకు రక్షణగా చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు పెట్టారు. ఏటా మే 14న తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు పోలేరమ్మ గుడి పూజారి శీలం వెంకటేశ్వర్లు తెలిపారు.

\- న్యూస్‌టుడే, బొల్లాపల్లి, వినుకొండ

దర్శనం బుకింగ్ లేకుండా శబరిమల వెళ్లొద్దు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: కార్తిక మాసం వచ్చిందంటే అయ్యప్ప దీక్షలు తీసుకునే వారి సంఖ్య ఏటికేడాది పెరుగుతూనే ఉంది. దీక్ష పూర్తి చేసుకుని అయ్యప్ప దర్శనానికి బయల్దేరిన వారిని శబరిమలకు 22 కి.మీ. దూరంలో నీలక్కల్ వద్దే నిలిపివేస్తారు. అక్కడ నుంచి 5 కి.మీ. దూరం కొండపైకి కాలినడకతో వెళ్లాలి. దేవుని దర్శనం చేసుకోవాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ చేసుకోవాలి. దర్శనానికి రోజుకు 75 వేల మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. రోజులో (24 గంటల్లో) 70 వేల ఆన్‌లైన్ టిక్కెట్లు అందుబాటులో ఉంచగా 5 వేల టికెట్లు అక్కడికక్కడే పేర్లు నమోదు చేసి ఇస్తారు. అంతకు మించి ఒక్క టికెట్టు కూడా అదనంగా ఇవ్వరు. భక్తులు ఇది గమనించి ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసుకోవాలి. లేదంటే అక్కడకు వెళ్లాక ఇబ్బందులు తప్పవని కేరళ ప్రభుత్వం, ఆంధ్రాకు చెందిన గురుస్వాములు చెబుతున్నారు.

ప్రమాదాన్ని పసిగట్టే చాతుర్యం అవసరం

శిక్షణ పత్రం అందిస్తున్న డీపీటీవో అజిత కుమారి

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో ప్రమాదాలను ముందే పసిగట్టగలిగే చాతుర్యం డ్రైవర్లకు అవసరమని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా వాహనాలు నడిపే డ్రైవర్లకు అవకాశాలు దండిగా ఉంటాయని జిల్లా ప్రజా రవాణాధికారి అజిత కుమారి అన్నారు. నరసరావుపేట డిపోలోని డ్రైవింగ్ పాఠశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 21వ బ్యాచ్ డ్రైవర్లకు అర్హత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వృత్తిలో నిబద్ధతతో పనిచేసి వేగనియంత్రణ పాటిస్తూ, ఇంధన పొదుపులో మెలకువలు అలవరచుకోవాలన్నారు. సమాజంలో మంచి డ్రైవర్లుగా పేరు తెచ్చుకోవాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదన్నారు. ఆమె వెంట డిపో మేనేజర్ శ్రీనివాసరావు, శిక్షకులు మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

THE GUNTUR DISTRICT CO-OP. CENTRAL BANK LTD., TENALI.
Administrative Office, 2/13 Brodipet, Guntur.

E-Tender Notification

The Guntur District Co-operative Central Bank ltd., Tenali invites E-Tender from eligible bidders for providing Cash Management Services at 45 Bank Branches (including Head Office) through e-Procurement Portal. Tender documents maybe downloaded from www.apeprocurement.gov.in and tender commences from 03.12.2025 and the last date of Bid submission is 09.12.2025 at 11:00 AM.

Guntur
Dt: 02-12-2025

Sd/- Chief Executive Officer

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్‌క్యాష్) ✆ 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూపు, GNT.వృద్ధులకు, పేషెంట్ల సేవకు, ఇంటి/వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము ✆ 91540 85588, 91549 35588.

REAL ESTATE

FLAT FOR SALE

INNER RING ROAD

ఇన్నర్ రింగ్ రోడ్, ఫేజ్2 లోటస్ అపార్ట్‌మెంట్, శ్రీ కన్వెన్షన్ దగ్గర, మెయిన్ రోడ్ 3000 Sft ఫ్లాట్ అమ్మకం. ఫుల్ ఫినిష్. 94402 60714.

HOUSE FOR SALE

GENERAL

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq.Yards గజాలు Site 10,000 Sq.Ft విల్లా అమ్మకమునకు కలదు. నోబ్రోకర్స్ Ph.99662 28370.

JOBS

Wanted area SalesManager. Qua:Inter/Degre. Min Exp. 2Yrs in building Material Industry. Sal: 25K. Ema Timbers, Gnt. 9989920203.

Mirchi Godown Supervisor - Must have experience in Mirchi field and own a bike | Contact: 9032431999.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్ లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆: 97039 71968.

గుంటూరు ఓల్డ్ క్లబ్ రోడ్, ఆపిల్ డెంటల్ కేర్‌లో పనిచేయుటకు Male/ Female అసిస్టెంట్స్ కావలెను. గుంటూరు లోకల్ వారు మాత్రమే. 63022 43437.

హోటల్ కుంభకర్ణ, కొరిటిపాడు, గుంటూరు రూమ్ సర్వీస్ బాయ్స్ (ఉ॥8-సా॥6) హౌస్ కీపింగ్ స్టాఫ్ (M) (ఉ॥8-సా॥5) సెక్యూరిటీ గార్డ్స్ (సా॥6-ఉ॥6) కావలెను. 80564 30833.

R.K. ఇంజనీరింగ్ కాలేజీ వారికి బస్ డ్రైవర్స్ కావలెను. కంకిపాడు, ఎనికేపాడు, నందిగామ, మంగళగిరి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. సంప్ర కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. 97014 73399.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు ఆటో మరియు కారు నడుపుటకు డ్రైవర్లు కావలెను. తగిన లైసెన్స్ కల్గి ఉండవలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 94406 81862.

E-KART నందు అర్జెంటుగా Male/Female కావలెను. Q: Inter, Any Degree Salary 15000/- Online Available 9381912123.

మహానాడు మీడియా, గుంటూరులో పనిచేయుటకు "వీడియో ఎడిటర్" కావలెను. Ph: 73372 22004.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

పకడ్బందీగా అడవి జంతువుల వివరాలు సేకరించాలి

నాయుడుపాలెం బీట్ పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ, రేంజర్ మాధవరావు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: అడవిలో సంచరించే మాంసాహార, శాకాహార జంతువులకు సంబంధించి కచ్చితమైన వివరాలు సేకరించాలని జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణప్రియ వినుకొండ రేంజ్ పరిధిలోని సిబ్బందికి తెలిపారు. స్థానిక అటవీ శాఖాధికారులతో కలిసి వినుకొండ రేంజ్ పరిధిలోని పలు బీట్‌లలో తిరిగి సూచనలు చేశారు. నాలుగేళ్లకోసారి గణన నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 8 వరకు పులులు, ఇతర జంతువుల వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. జంతువుల వివరాలు ఈ ఏడాది నుండి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 1, 2, 3 తేదీల్లో రోజుకు 5 కి.మీ చొప్పున కాలి నడకన తిరుగుతూ పరిశీలించి మాంసాహార జంతువుల ఆనవాళ్లు ఉంటే వాటిని గమనించి సేకరించిన సమాచారాన్ని 4, 5 తేదీల్లో క్రోడీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 6, 7, 8 తేదీల్లో శాకాహార జంతువులు అడవి కుక్కలు, ఎలుగుబంట్లు వంటి వాటి వివరాలు సేకరిస్తారన్నారు. నేరుగా 2 కి.మీ దూరం పరిశీలిస్తూ వెళ్లాలని, ప్రతి 400 మీటర్లకు ఒకచోట ప్లాట్ వేయాలని, దాని పరిధిలో 30 మీటర్లు కొలతలు తీసి అందులో చెట్లు, గడ్డిజాతి మొక్కలు వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఈ సమయంలో జంతువులు కనిపిస్తే నేరుగా ఫొటోలు తీయాలని సిబ్బందికి సూచించారు. పశువుల కాపరులను విచారించి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. వినుకొండ రేంజ్ పరిధిలో ఉన్న 44,673 హెక్టార్ల అటవీ ప్రాంతం పరిశీలించి అన్ని వివరాలు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. నాయుడుపాలెం, కంద్రిక బీట్‌లను తనిఖీ చేశారు. జంతువుల అడుగులు, వాటి పెంటికలు గుర్తించారు. కార్యక్రమంలో రేంజర్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సన్నాహాలు

వివరాలు వెల్లడిస్తున్న డీఈవో చంద్రకళ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతన ప్రతిభ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా జిల్లావ్యాప్తంగా 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. డివిజన్ల వారీగా నరసరావుపేట, గురజాలలో 5 చొప్పున, సత్తెనపల్లిలో 4 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నామన్నారు. మొత్తం 2,905 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈ నెల 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యూడైస్ కోడ్ లాగిన్ ఉపయోగించి ప్రవేశపత్రాలు డౌన్‌లోడ్ చేసి అందించాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రవేశ పత్రంపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పరీక్ష కేంద్రం చిరునామా తెలుసుకోవచ్చని వివరించారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత పశ్చిమగోదావరి జట్లు

కప్పు అందుకుంటున్న బాలుర జట్టు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 560 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం తుది పోటీలు నిర్వహించారు. అండర్ 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, కడప, విజయనగరం జిల్లాల జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-15 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, విజయనగరం జట్టు ద్వితీయ, కడప, గుంటూరు జిల్లాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి.

చిన్న కీటకం.. పెద్ద భయం

✤ జిల్లాలో స్క్రబ్ టైఫస్ ఉనికి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినికి చిన్న కీటకం కాటేసింది. తొలుత జ్వరం, ఒంటినొప్పులు వచ్చాయి. జీర్ణకోశ సమస్యలు తలెత్తాయి. సాధారణ జ్వరం, అనారోగ్య సమస్య అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారింది. జ్వరం ప్రబలిన వారం రోజుల తర్వాత కీటకం కాటేసిన జాడ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షలో వెల్లడైంది. అప్పటికే నష్టం జరిగిపోయి ఇంటర్ విద్యార్థిని మృత్యువాత పడింది. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అనుమానిత లక్షణాలున్న వారికి రక్త పరీక్షలు

స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రా సుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమూనాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. నిర్ధారణ నుంచి చికిత్స వరకు జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ఔషధాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా స్క్రబ్ టైఫస్ దరిచేరకుండా చూసుకోవచ్చన్నారు.

ఏడాదిన్నర పని చేయించుకుని పొమ్మన్నారు

దేవాదాయ శాఖ అధికారుల తీరుపై ఎస్టీ యువతి ఆవేదన

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయంలో ఏడాదిన్నర పాటు కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేయించుకుని జీతం చెల్లించకుండా అధికారులు ఉద్యోగం లేదు వెళ్లిపొమ్మని చెప్పారని పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు చెందిన బి.మంగాబాయి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టరేట్లో మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి తనకు ఉద్యోగం ఇవ్వాలని సీఎంవో అధికారులు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని అందజేసి, న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఏసీ ప్రకాశరావును సంప్రదించగా యువతికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అధికారికంగా ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉన్నతాధికారులకు నివేదించి వేతనం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఉద్యోగం దక్కాలంటే రూ.లక్షల్లో నగదు చెల్లించాలని ఓ అధికారి యువతితో బేరసారాలకు దిగినట్లు తెలిసింది.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

మాచర్ల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మాచర్ల అభివృద్ధికి కాసు కుటుంబం ఏం చేసిందో బహిరంగంగా చర్చించటానికి సిద్ధంగా ఉన్నానని నీవు సిద్ధమా? అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విడదల రజనితో కలిసి పట్టణంలోని ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల గ్రామాన్ని పట్టణంగా మార్చింది, నాగార్జున సాగర్, బుగ్గవాగు కట్టింది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించింది కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలోనే అన్నారు. గురజాల రెవెన్యూ డివిజన్ చేసింది కాసు కృష్ణారెడ్డి అన్నారు. కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి పల్నాడులో విద్యాభివృద్ధికి సొసైటీగా ఏర్పడి విద్యా సంస్థలు ఏర్పాటు చేశారన్నారు. ఎయిడ్ ఉపసంహారణలో భాగంగా కొంత స్థలంలో కాంప్లెక్స్‌లు కట్టుకోవాలని ప్రభుత్వమే జీవోలు జారీ చేసిందని, దానిలో భాగంగా కాసు మాల్ కట్టామన్నారు. దానిపై వచ్చే అద్దెలతో కళాశాలలు, విద్యా సంస్థలు నడుపుతున్నామన్నారు.

త్రికోటేశ్వరుడికి నటుడు కిరణ్ పూజలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో కె-ర్యాంప్ చిత్ర హీరో కిరణ్ అబ్బవరం మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామిని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ త్వరలో విడుదల కానున్న చిత్రం విజయవంతం కావాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌యూ నెట్‌బాల్ జట్టులో చోటు

విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం మహిళల నెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. షేక్ దిల్‌అఫ్రోజ్, కుంచాల నందిని ఏఎన్‌యూ అంతర కళాశాలల మహిళల నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపారు. వీరు జనవరి 9 నుంచి మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల ఛైర్మన్ కాట రామకోటేశ్వరరావు, డైరెక్టర్లు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సురేష్ బాబు, కృష్ణారావు, క్రిష్ణకిషోర్, పీడీ రాజా మెర్సిన్ తదితరులు అభినందించారు

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం

మహేష్ (పాత చిత్రం)

కిష్టాపురం(శావల్యాపురం), న్యూస్‌టుడే : కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పొట్లూరు శివారు కిష్టాపురం శ్మశానవాటిక సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో బొందిలిపాలెం గ్రామానికి చెందిన బత్తుల మహేష్ (20) వినుకొండలో తన పిన్ని వద్దకు వచ్చి తిరిగి ఉదయాన్నే పేరేచర్లలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. సరిగ్గా కిష్టాపురం దాటిన తరువాత వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని తండ్రి బత్తుల నాగేశ్వరరావు అయిదేళ్లుగా పేరేచర్ల వద్ద తన ఇద్దరు కుమారులతో కలిసి వివిధ రకాలైన సిమెంటు పనులు చేసేవారు. వారిలో మహేష్‌బాబు పెద్దవాడు. చేతికి అందివచ్చిన కొడుకు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

వాహనాన్ని పట్టించిన బురద మట్టి

ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టినట్లు భావించారు. మహేష్ హెల్మెట్ ధరించి ఉన్నా ముఖానికి గాయాలు కావడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాద స్థలంలో పడి ఉన్న ద్విచక్ర వాహన ఆయిల్ ట్యాంకరు పగిలిపోవడంతో పాటు, బురద మట్టి అయింది. ఘటనాస్థలిలో దమ్ము ట్రాక్టరు చక్రాల గీతలు, రోడ్డు పాడై ఉండటాన్ని గమనించారు. వెంటనే ఎస్సై సిబ్బందితో కలిసి గీతల ఆధారంగా నడుచుకుంటూ 200 మీటర్లు వెళ్లిన తరువాత మాగాణి పొలంలో దమ్ము ట్రాక్టరు ఉండటాన్ని గమనించారు. దానికి ద్విచక్ర వాహనానికి సంబంధించిన విడి భాగం ఉంది. వెనుక ఇనుప కడ్డీ కొంత విరిగి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పొట్లూరు, కిష్టాపురం గ్రామాల్లో రబీలో వరి సాగుకు దమ్ము చేస్తున్న రైతుల వివరాలు సేకరించారు. మూడు గంటల పాటు శ్రమించిన అనంతరం గ్రామానికి చెందిన దావులూరి రాంబాబు పొలం దమ్ము చేయడానికి డ్రైవరు శావల్యాపురానికి చెందిన వారి ట్రాక్టరు తీసుకుని వెళ్తుతున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ట్రాక్టరును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చికిత్స పొందుతూ యువతి..

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఎలుకల మందు తిన్న ఓ జంటలో చికిత్స పొందుతూ యువతి మృతి చెందగా యువకుడు చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆరు నెలల క్రితం వినుకొండ శృంగారవనంకు చెందిన యువతి (18)కి ఈపూరు మండలం కొండ్రముట్లపాలెంకు చెందిన యువకుడు రెడ్డిబోయిన రమణబాబుతో పరిచయం ఏర్పడింది. ఒకరినొకరు ఇష్టపడి గత నెల 28న ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి వెళ్లిపోయారు. యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో ఆ జంట గుంటూరులో ఎలుకల మందు తిన్నారు. చికిత్స పొందుతూ మంగళవారం యువతి మృతి చెందగా రమణబాబు చికిత్స పొందుతున్నాడు. ఇతనికి గతంలోనే వివాహం కాగా యువతికి ఇటీవలే 18 ఏళ్లు నిండినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

అదుపు తప్పి పడి కౌలు రైతు..

కోటిరెడ్డి (పాత చిత్రం)

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు మండలం ఇనుమెళ్ల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిల్లి కోటి రెడ్డి (30) అనే యువ రైతు మృతిచెందాడు. రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెంలో పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేసేవాడు. ఉదయాన్నే ద్విచక్రవాహనంపై పొలానికి వెళుతుండగా ఇనుమెళ్ల- ముప్పాళ్ల మధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. అతని తల రాయికి తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీప రైతులు, బాటసారులు ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందాడు.

అతిగా మద్యం తాగి వ్యక్తి..

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం బీర్నెనిపల్లెకు చెందిన బందెల యాకోబు (65) వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన పడి మంగళవారం మృతిచెందాడు. ఎంతసేపటికీ లేవకపోవడంతో సమీప దుకాణాల వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇతను ఈపూరు మండలం అగ్నిగుండాలలో కూతురు వద్దకు వెళ్లడానికి వచ్చాడని అతిగా మద్యం తాగి పడిపోయి మృతి చెంది ఉండవచ్చని బంధువులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు..

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వృద్ధుడు (60) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై రాజమోహనరావు తెలిపారు. వివరాల్లోకెళితే... నరసరావుపేట పట్టణం ఏ1 ఫంక్షన్ హాల్ ఎదుట మంగళవారం గుర్తుతెలియని వృద్ధుడు పట్టాలు దాటుతుండగా రైలు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు నీలం గళ్ల లుంగీ, తెలుపు చొక్కా ధరించినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వాళ్లు రైల్వే ఎస్సైను సంప్రదించాలని కోరారు.

4న దాచేపల్లిలో సీపీఐ సమావేశం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : దాచేపల్లిలో ఈనెల 4న జరగనున్న సీపీఐ పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు కోరారు. చిలకలూరిపేట సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా దాచేపల్లిలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశం జరుగుతుందని వివరించారు. డిసెంబరు 26న శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు చెరుకుపల్లి నిర్మల, సుభాని, ఎలికా శ్రీనివాసరావు, కొండలరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ అంజయ్య

కారంపూడి, న్యూస్‌టుడే: మండలంలోని చింతపల్లి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీసీ చైర్మన్ పంగులూరి అంజయ్య ప్రారంభించారు. ఏవో నరసింహారావు మాట్లాడుతూ వరి ధాన్యంలో 17 శాతం తేమ ఉంటే 75 కిలోల బస్తా రూ.1792తో కొనుగోలు చేస్తారన్నారు. గోతాలు, కూలీ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

భోజన వసతి బాగుందా?

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జియాఉద్దీన్

గురజాల, న్యూస్‌టుడే: గురజాల సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జియాఉద్దీన్ మంగళవారం పరిశీలించారు. నిందితులకు సకాలంలో భోజన వసతి కల్పిస్తున్నారా.. వసతులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. వంట గది, స్టోర్‌రూమ్, నిందితుల ఉత్తరాల పెట్టెను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ రామారావు, న్యాయవాది ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? ఒలుకేమినపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పలుచోట్ల వీధి దీపాలు వెలగక రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. - **శ్రీను, కాలనీవాసి**
✔ పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. - **కొండలు, పంచాయతీ కార్యదర్శి**
? నెహ్రూనగర్‌తండాలోని మురుగు కాలువల్లో పూడిక నిండి దుర్వాసన వస్తోంది. - **శ్రీనివాసనాయక్, తండావాసి**
✔ సర్పంచి దృష్టికి తీసుకెళ్లి మురుగు తొలగించేందుకు కృషి చేస్తా. - **సైదులు, కార్యదర్శి**
? దుర్గి జడ్పీ పాఠశాల వద్ద చెత్తాచెదారం వేస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - **విద్యార్థులు**
✔ చెత్తను తొలగించి, నోటీసు బోర్డు ఏర్పాటు చేయిస్తాం. - **రత్నకుమారి, కార్యదర్శి** - న్యూస్‌టుడే, దుర్గి
? ఆర్టీసీ బస్సులు అతివేగంగా నడుపుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. - **నారాయణరావు**
✔ బస్సులకు వేగ నియంత్రణ ఉంది. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే చర్యలు తీసుకుంటాం. - **వీరాస్వామి, మాచర్ల డిపో మేనేజర్** - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ
? నగర పంచాయతీ పరిధిలోని ఐదోవార్డులో పైపులు మరమ్మతులకు గురై, నీరు వృథా అవుతోంది. - **లక్ష్మారెడ్డి, స్థానికుడు**
✔ పైపులకు మరమ్మతులు చేయించి, నీటి వృథా అరికడతాం. - **వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ కమిషనర్** - న్యూస్‌టుడే, దాచేపల్లి

నిర్లక్ష్యపు వెలుగులు!

పల్లెల్లో విద్యుత్తు వృథా

దాచేపల్లి, న్యూస్‌టుడే

శ్రీనగర్‌లో పగటిపూట వెలుగుతున్న వీధి దీపాలు

రాత్రివేళ వీధుల్లో కాంతులు నింపాల్సిన విద్యుత్తు దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగులు పంచుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దాచేపల్లి, గామాలపాడు, కేసానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు, భట్రుపాలెం, ముత్యాలంపాడు తదితర గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ కొరవడింది. ఆటో స్విచ్‌లు పని చేయక, టైమింగ్ సరిచేయకపోవడంతో సమస్య తలెత్తుతోంది. పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

పర్యవేక్షణ లోపం

గతంలో తెదేపా పాలనలో ఎల్ఈడీ దీపాలు అమర్చారు. వీటికి ఆటోమేటిక్ ఆన్/ఆఫ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే కొన్నిచోట్ల ఎల్ఈడీ లైట్లలో మూడు కండక్టర్లు అందుబాటులో లేవు. మరో వైపు సాంకేతిక పరికరాలు అమర్చే ఆలోచన చేయలేదు. వైకాపా ప్రభుత్వం రావడంతో వాటి గురించి పట్టించుకున్న వ్యక్తులే లేరు. సచివాలయ వ్యవస్థ వచ్చాక పర్యవేక్షించే వారే లేరు. నిరంతరాయంగా దీపాలు వెలుగుతూనే ఉండటంతో రూ.లక్షల్లో విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ఇది పంచాయతీలకు అదనపు భారంగా మారింది.

త్వరలో శాశ్వత పరిష్కారం .. త్రిఫేస్ లైన్లకు సంబంధించిన స్తంభాల ఏర్పాటు పనులు మండలంలో వేగంగా జరుగుతున్నాయి. ఇవి పూర్తయ్యాక నియంత్రికల ద్వారా వీధి దీపాలను ఆటోమేటిక్‌గా ఆపే సాంకేతిక పరికరాలు అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో విద్యుత్తు వృథా కాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటాం. **- గీతా లలిత కుమారి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, దాచేపల్లి**

జంట హత్యలకు పాల్పడిన వారిని ఊరేగించాలా?

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మాచర్ల ప్రాంతంలో జరిగిన ఏదు హత్య కేసుల్లో తనను నిందితుడిగా చేర్చారని, ఆ సమయంలో తాను అధినేత చంద్రబాబు పార్టీ నుంచి తొలగించారని, అది తమ పార్టీకి ఉన్న నిబద్ధత అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తెలిపారు. పిన్నెల్లి సోదరులు అరాచకాలకు పాల్పడినా, వారిపై పలు కేసులు నమోదైనా వైకాపా అధినేత జగన్ వారిని వెనకేసుకొస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం వెల్దుర్తిలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట హత్యలకు పాల్పడిన వారికి కిరీటాలు పెట్టి ఊరేగించాలా అంటూ ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని, ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని, వైకాపా నాయకులు మాత్రం అగ్గి రాజేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. నాగార్జునసాగర్ ద్వారా నిర్మాణానికి అడ్డు ముత్యాలరాజు ఏమయ్యారో ప్రజలందరికీ తెలుసన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి సవాల్ విసిరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖాధికారి శివనాగేశ్వరరావు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు, పాఠశాలల బస్సుల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సుఖవంతమైన ప్రయాణం చేయాలని పిడుగురాళ్ల సహాయ రవాణా శాఖాధికారి శివనాగేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన క్రోసూరు, అచ్చంపేటలో బడి బస్సులను తనిఖీ చేశారు. క్రోసూరు పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రహదారి భద్రత గురించి అవగాహన కల్పించారు. సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లీమారోజ్, ఉపాధ్యాయులు విజయ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టుకు శిక్షణ

శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొత్త సత్యనారాయణ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్టు సభ్యులకు మంగళవారం శిక్షణ ప్రారంభించారు. కొత్త హనుమయ్య అండ్ లక్ష్మీకోటమ్మ డిగ్రీ కళాశాల ఛైర్మన్ కొత్త సత్యనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 11వతేదీ వరకు శిక్షణ ఇస్తారు. సాఫ్ట్‌బాల్ జాతీయ పోటీలు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్‌లో జరగనున్నాయి. ప్రిన్సిపల్ ఆవుల జనార్దనరావు, డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సమంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన పైరు.. రైతన్న కంట నీరు

ముప్పాళ్ల మండలంలో నేలవాలిన వరి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలులతో వరి పైరు నేలవాలుతోంది. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో అధిక విస్తీర్ణంలో వరి సాగైంది. నకరికల్లు, రాజుపాలెం, క్రోసూరు మండలాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సగానికి పైబడి పైరు పొలాల్లో కోత దశలో ఉంది. గాలులకు వరి నేలవాలి నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన చెబుతున్నారు.

ప్రసంగం పోటీల్లో ప్రతిభ

విజేతలతో ఉపాధ్యాయినులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్లలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ ప్రసంగ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై పోటీలు నిర్వహించగా. . జె.నవ్య, షేక్ సమీర, ఎ.కావేరి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ కవిత, ఉపాధ్యాయులు నాగమణి, రాజీవ్ రత్న, దేవి బహుమతులు అందజేశారు.

విధులపై అలసత్వం వహిస్తే ఉపేక్షించం

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, న్యూస్‌టుడే: అధికారులు సమయపాలన పాటించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. మంగళవారం కర్లపూడిలో ప్రజల వద్దకే ప్రవీణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరు గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది సిబ్బంది ఎవరో కూడా తమకు తెలియదని, ఎప్పుడూ చూడలేదని గ్రామస్థులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు జరిగిన గ్రామసభలో ప్రజల అర్జీలను స్వీకరించారు. అర్జీలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో శివపార్వతి, తెదేపా నేతలు కిషోర్, రాంబాబు, శ్రీనివాసరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలకు సర్వం సిద్ధం

పోటీలు నిర్వహించే మైదానాన్ని పరిశీలిస్తున్న రైతు కమిటీ సభ్యులు

గురజాల, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఎద్దుల బండలాగుడు పోటీలకు రంగం సిద్ధమైంది. పాతపాటమ్మ తిరునాళ్ల పురస్కరించుకుని ఈనెల 5 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. గత 32 ఏళ్లుగా పోటీలను గురజాల రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఏర్పాట్లను రైతు కమిటీ సభ్యులు నెల్లూరి మల్లయ్య, బుచ్చిబాబు, నవులూరి శ్రీరామమూర్తి, పోటు నాగేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.

మద్యం గొలుసు దుకాణంలో ఘర్షణ

రెంటచింతల, న్యూస్‌టుడే: పాలువాయిజంక్షన్‌లోని మద్యం గొలుసు దుకాణంలో సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. ముగ్గురు యువకులు మద్యం తాగేందుకు దుకాణానికి వచ్చారు. ఛార్జింగ్ కోసం నిర్వాహకులకు చరవాణి ఇచ్చారు. పాత బాకీ ఇస్తే సెల్ ఇస్తానని నిర్వాహకుడు చెప్పడంతో యువకులు గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న మరికొందరు యువకులు అక్కడికి చేరుకుని రెండు గ్రూపులుగా దాడులకు పాల్పడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను వెళ్లగొట్టారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గతంలో పశర్లపాడు, పాలువాయి, తుమృకోట గ్రామస్థులు ఘర్షణలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. గొలుసు దుకాణాలను తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినా ఫలితం లేదు. దీనిపై గురజాల ఎక్సైజ్ సీఐ బుచ్చిబాబును అడగ్గా.. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్తు తీగలు మాయం

తీగలు లేని స్తంభాలు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలు, తీగల దొంగతనాలు పెచ్చుమీరుతున్నాయి. పెదకూరపాడు-పాటిబండ్ల మార్గంలో ఏకంగా స్తంభాలకు ఏర్పాటు చేసిన తీగలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మొంథా తుపాను ప్రభావంతో పంట పొలాల్లో ఒరిగిన స్తంభాలను సరిచేసేందుకు సరఫరా నిలిపేశారు. ఈ విషయం తెలుసుకున్న చోరులు డంపింగ్ యార్డు సమీపంలో రోడ్డు రెండు వైపులా ఉన్న స్తంభాల వైరు కట్‌చేసి, ఎత్తుకెళ్లారు. అర కిలోమీటరు మేర తీగలను చోరీ చేశారు. ఈ విషయం ఆ శాఖ అధికారులు, కింది స్థాయి సిబ్బందికి తెలియదంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ★ పెదకూరపాడు జగనన్న కాలనీలో విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసి రాగి తీగ తస్కరించారు. ఈ ఘటన జరిగి ఏడాదిన్నర అవుతున్నా కేసులో పురోగతి లేదు. పరస-కంభంపాడు మధ్య 1.5 కిలోమీటర్ల మేర తీగలు కత్తిరించుకుపోయి ఏడాది కావస్తున్నా చోరులు చిక్కలేదు. పెదకూరపాడు పెట్రోలు బంకు పక్కన బుచ్చయపాలెం డొంక మార్గంలో తీగలు చోరీకి గురై మూడు నెలలు గడుస్తున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసుల్లో పురోగతి లేదు.

రైతులకు పట్టల సరఫరా

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో కురిసే వర్షాలతో ధాన్యం తడవకుండా ఉండేందుకు పౌరసరఫరాల సంస్థ టార్పాలిన్ పట్టలను సమకూర్చింది. వ్యవసాయశాఖ జిల్లా అధికారి సూచనల మేరకు నకరికల్లు, కారంపూడి, రాజుపాలెం మండలాలకు 200 పట్టలను పౌరసరఫరాల సంస్థ అందజేసింది. ఒక్కో పట్ట రూ. 1,995తో కొనుగోలు చేశారు. మూడు మండలాలకు 200 పట్టలను ధాన్యం రైతులకు ప్రత్యేకంగా అందించినట్లు సంస్థ జిల్లా మేనేజర్ నారద ముని తెలిపారు. దీంతో రైతుల కష్టాలు కొంతమేర తగ్గాయి.

అయ్యప్పస్వామి పడిపూజ

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు విద్యానగర్‌లో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడిపూజ నిర్వహించారు. 5 మండపాలు, 18 కలశాలతో 18 అభిషేకాలతో పూజ, భజన భక్తిశ్రద్ధలతో జరిగింది. పెద్దసంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. అచ్చంపేట మండలం చామర్రులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పడిపూజ వైభవంగా జరిగింది.

ఇళ్ల దరఖాస్తులకు గడువు పెంపు

కారంపూడి: పీఎం ఆవాస్‌యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పెంచిందని హౌసింగ్ ఏఈ బాబూరావు తెలిపారు. అర్హులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

గంజాయి స్వాధీనం

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: లంకెలకూరపాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద యువకులు నాగరాజు, లక్ష్మీరెడ్డి, మహేశ్వరరెడ్డి, శివనాగిరెడ్డిలను అరెస్టు చేసి, వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నలుగురిపై గతంలోనూ కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల్ని బుధవారం కోర్టులో హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

తాగునీటి కష్టాలు తీరేదెప్పుడో?

నిరుపయోగంగా ట్యాంకు

దొడ్లేరు(క్రోసూరు), న్యూస్‌టుడే: క్రోసూరు మండలం దొడ్లేరులో నీటి కష్టాలు తీరేదెప్పుడో అని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షిత నీటి పథకాలు అటకెక్కాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.2.54 కోట్లతో జల్‌జీవన్‌మిషన్ పనులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామంలో 15 వేల జనాభా ఉంది. చెరువు నీటిని శుద్ధి చేసి, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపుల ద్వారా గ్రామస్థులకు సరఫరా చేసేందుకు రెండు దశాబ్దాల కిందట పథకం ప్రారంభించారు. ప్రస్తుతం పథకం పనిచేయడం లేదు. పైపులైన్‌కు తుప్పుపట్టి దెబ్బతిన్నాయి. తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఈ క్రమంలో 2022-23లో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.2.54 కోట్లతో బీసీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. దానికి అనుసంధానంగా పైపులైన్, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. పైపులైన్లు సరిగా లేకపోవడంతో నీరందడం లేదు. బొడ్రాయి కూడలి, పెరికపాడురోడ్డు కూడలిలో పైపులైన్ దెబ్బతిని, నీటి సరఫరా నిలిచింది. పదిచోట్ల లీకేజీలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. రెండు నెలల కిందట పనులు పరిశీలించేందుకు కేంద్ర బృందం రాగా.. అప్పట్లో తాత్కాలికంగా మరమ్మతులు చేసి మమ అనిపించారు. తర్వాత రోజు నుంచి నీటి సరఫరా లేకుండా పోయింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి కార్యదర్శి ఉమామహేశ్వరరావును అడగ్గా.. వారం రోజుల్లో తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ప్రణాళిక సిద్ధం.. పదిలో విజయమే లక్ష్యం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే

ఆదర్శ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు

విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కీలకం. మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గణితం, సైన్సు, ఆంగ్లం సబ్జెక్టులపై మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. చిన్నారుల్లో ఒత్తిడి లేకుండా నిత్యం 10 నిమిషాలు యోగా, ధ్యానం చేయిస్తున్నారు. గురజాల నియోజకవర్గంలో 2,379 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరంతా ఉత్తీర్ణులయ్యేలా.. ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక తరగతులు: ఈ నెల 1వ తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఈమేరకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రణాళిక రూపొందించింది. వంద రోజులు ప్రత్యేకంగా పాఠ్యాంశాలు చదివించి, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తారు. వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు.

ఏకాగ్రతతో చదువుతున్నా

ఏకాగ్రతతో చదివితే పాఠ్యాంశాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ప్రతి రోజు తెల్లవారుజామున లేచి చదువుతున్నా. ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలపై అనుమానాలు నివృత్తి చేసుకుంటున్నా. మంచి మార్కులు సాధిస్తా. **- నందిని**

భయం, ఒత్తిడి తగ్గింది

ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఎప్పటికప్పుడు చదువుతున్నాం. తరచూ పరీక్షలు నిర్వహిస్తుండటంతో భయం పోయింది. మంచి మార్కులు సాధించేందుకు సబ్జెక్టుల వారీగా మెలకువలు చెబుతున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం చదువుతున్నా. అధిక మార్కులు సాధిస్తాం. **- లోకేష్**

గాయపడిన వ్యక్తి మృతి

రెంటచింతల, న్యూస్‌టుడే: బయోడీజిల్ కేంద్రంలో మంటల్లో గాయపడిన సంగం భాగ్యరావు(52) మంగళవారం మృతి చెందాడు. పాలువాయి జంక్షన్‌లో అక్రమంగా నిల్వ చేసిన బయోడీజిల్ కేంద్రంలో మంటలు చెలరేగిన సంగతి పాఠకులకు విదితమే. ఆ ఘటనలో షేక్ రషీద్ సజీవ దహనం కాగా.. భాగ్యరావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం పిడుగురాళ్ల ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై నాగార్జున వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(భారత ప్రభుత్వ షెడ్యూల్డ్ బ్యాంక్)
పిల్లుట్ల బ్రాంచి, మాచవరం మండలం, పల్నాడు జిల్లా-522413
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. ఫోన్: 7337490044, email: bm0714@apgb.bank.In

Lr No. 7714/SARFAESI/2024-25/27 Date: 26-11-2025

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము **డిమాండ్ నోటీసు**

టు, ఋణగ్రహీత: 1) శ్రీ బత్తుల పుల్లారావు, తండ్రి: వీరవాసులు, డోర్ నెం.2-59M, మసీదు ప్రక్కన, ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గర, శ్రీరుక్మిణిపురం గ్రామము, మాచవరం మండలం, పల్నాడు-522413. 2) శ్రీమతి బత్తుల నాగలక్ష్మి, భర్త: బత్తుల పుల్లారావు, డోర్ నెం.2-59M, మసీదు ప్రక్కన, ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గర, శ్రీరుక్మిణిపురం గ్రామము, మాచవరం మండలం, పల్నాడు-522413. సహ-పూచీదారు/హామీదారు: 3) శ్రీ మేగావత్తు చిన్న శ్రీను నాయక్, తండ్రి: తులస నాయక్, డోర్ నెం. 6-24, నాగేశ్వరపురంతండా గ్రామము, మాచవరం మండలం, పల్నాడు-522413. తనఖాదారు/లు: 1) శ్రీ బత్తుల పుల్లారావు, తండ్రి: వీరవాసులు, డోర్ నెం.2-59M, మసీదు ప్రక్కన, ఓవర్ హెడ్ ట్యాంక్ దగ్గర, శ్రీరుక్మిణిపురం గ్రామము, మాచవరం మండలం, పల్నాడు-522413.

అయ్యా / అమ్మా,
ఈ నోటీసులో ఉదహరించిన నెం.1&2 పేర్కొనబడినవారు మా బ్యాంక్ యొక్క పిల్లుట్ల బ్రాంచి నుండి హౌసింగ్ లోన్ Account No. 77143010081844 (HLGNI) ద్వారా రూ.5,50,000/- (అక్షరాల ఐదు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే) ఋణసౌకర్యము పొందియున్నారు.
ఈ దిగువ ఆస్తిని తనఖావుంచడం ద్వారా:
రిజిష్టర్డ్ / ఈక్విటబుల్ తనఖావుంచిన స్థిరాస్తి యొక్క వివరములు ఈ దిగువ పేర్కొనబడినవి.
ఆస్తి యొక్క షెడ్యూలు

ఆస్తి యొక్క వివరములు	ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ భవనము
లొకేషన్	శ్రీరుక్మిణిపురం గ్రామపంచాయతీ లిమిట్స్, శ్రీరుక్మిణిపురం గ్రామము, మాచవరం మండలం,
సర్వే నెం.	డి.నెం.51/1
విస్తీర్ణము	252.57 చ॥గ॥ల స్థలము
యజమాని పేరు	శ్రీ బత్తుల పుల్లారావు
హద్దులు	తూర్పు : 71 లింకులు బజారు, దక్షిణం : 78 లింకులు ముడమల సాంబయ్య, పడమర : 71 లింకులు యస్‌కె.ఖాశీం సాహెబ్ మరియు యస్‌కె.జానీ భాషా యొక్క ఏజెంట్ బత్తుల కృష్ణ యొక్క మిగిలిన స్థలము, ఉత్తరం : 69 లింకులు బజారు

పైన ఉదహరించబడిన మీలో నెం.1&2 వారు ఋణమును/ సౌకర్యమును మరియు/ లేదా వాయిదాలలో/ వడ్డీని రెండింటిని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది.04-11-2025 నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది. మరియు మీరందరూ ఉమ్మడిగా మరియు విడివిడిగా ది.05.11.2025 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.5,68,052.53 (అక్షరాల ఐదు లక్షల అరవై ఎనిమిది వేల యాభై రెండు రూపాయలు మరియు యాభై మూడు పైసలు మాత్రమే)** మరియు అగ్రిమెంటు ప్రకారము తదుపరి వడ్డీ మరియు ఇతర చార్జీలు చెల్లించవలసియున్నది. కావున మీ యావన్మందిని ఈ నోటీసు తేదీ నుండి **60 దినముల లోపల** పైన నుదహరించిన మొత్తము వడ్డీ మరియు ఇతర ఖర్చులు కలిపి చెల్లించవలసినదిగా కోరటమైనది. లేనియెడల బ్యాంకువారు బకాయి రాబట్టుకొను నిమిత్తము సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 నందు పేర్కొనబడిన అధికారములతో, కోర్టువారి ప్రమేయములేకుండా, ఈ క్రింద పేర్కొనబడిన వాటిలో ఒకటిగాని లేదా అంతకుమించిగాని చర్యలను తమ బ్యాంకుకు తనఖావుంచిన ఆస్తులపై తీసుకొనుట అనివార్యమౌతుంది. ● ఋణగ్రహీత తనఖావుంచిన ఆస్తులను (పై తెలిపిన) లీజుద్వారా గాని అసైన్‌మెంట్ ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు హక్కుభుక్తములతో స్వాధీన పరచుకొనుట. ● ఋణగ్రహీత తనఖావుంచిన ఆస్తులను లీజుద్వారా గాని అసైన్‌మెంట్ ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు మేనేజ్‌మెంట్‌ను స్వాధీనపరచుకొనుట. ● ఈ ఆస్తుల వ్యవహారము చూచుటకు వ్యాపార లావాదేవీలు నడుపుటకు ఒక వ్యక్తిని నియమించుటము ● వ్యాపార నిర్వహణను బ్యాంక్ వారు స్వాధీనము చేసుకొనిన పిమ్మట వార్తా పత్రికలలో ప్రచురణ ద్వారా వ్యాపారము నిర్వహించుచున్న వ్యక్తులను, డైరెక్టర్లతో సహా తొలగించుట అంతేకాకుండా ఈ ఆస్తులపై ఆసక్తి గల వ్యక్తులను, మీకు ఋణపడి ఉన్నవారిని లేదా ఋణపడి ఉండబోవు వారిని ఆ మొత్తములను బ్యాంకుకు చెల్లించవలసినదిగా కోరవచ్చును. ఈ ప్రక్రియలో అన్ని విధములైన ఖర్చులు మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు విక్రయార్జితములో నుండి సర్దుబాటు చేయబడును. ఒకవేళ విక్రయార్జితములు బ్యాంకువారి మొత్తము బకాయికి సరిపోనిచో నిల్వబాకీ వసూలు చేసుకొనుటకు తగిన చట్టబద్ధమైన చర్య తమ అందరిపై ఉమ్మడిగా మరియు విడివిడిగా తీసుకొనబడును. చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనల ప్రకారం తనఖావుంచబడిన ఆస్తుల యొక్క బహిరంగ వేలము నోటీసు ప్రచురణకు ముందుగా గాని లేదా కొటేషన్లు ఆహ్వానించుటకు ముందుగా గాని లేదా టెండర్లను ప్రజల నుండి లేదా ప్రైవేట్ వ్యక్తుల నుండి ఒప్పందాల మేరకు స్వీకరించుటకు ముందుగా గాని ఆస్తులను బదిలీ చేయుటకు ముందుగా గాని, లీజుకు ముందుగా గాని, ఎవరికైనా కేటాయించుటకు ముందుగా గాని, అమ్మకమునకు ముందుగా గాని బ్యాంకు వారికి మీరు చెల్లించవలసిన బకాయిలు మరియు బ్యాంకు వారిచే చెల్లించబడిన అన్ని కాస్ట్‌లు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు కలుపుకొని చెల్లించినట్లయితే మీ ఆస్తులను విడిపించుకొను హక్కు కలదు. చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ 13 ప్రకారం ఈ నోటీసు అందిన తరువాత, మీరు బ్యాంకు ముందస్తు అనుమతి లేనిదే మామూలు వ్యవహారాలు మినహా పైన తెలిపిన సెక్యూరిటీలను విక్రయించుట లేదా మరే విధంగా లావాదేవీలు జరుపుటకు మీరు నిరోధించబడినారు. ఈ నోటీసు బ్యాంకు వారికి ప్రస్తుతము అమలు లోనున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగమువాటిల్లకుండా జారీచేయబడినది.

ప్రదేశం : పిల్లుట్ల
తేది : 26-11-2025
సం/- ఛీఫ్ మేనేజర్ కమ్ అధీకృత అధికారి
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వరంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
ఒప్పిచర్ల బ్రాంచి, మాచర్ల రోడ్డు, కారంపూడి, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. Ph: 6281003914 Email: bm0019@apgb.bank.in

Lr No. 7999/RONRT/SARFAESI/2025-26/65 Date: 01.12.2025

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకపు ప్రకటన. సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) / హామీదారు(లు)కు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు **బకాయి మొత్తం: 30.11.2025 తేదీనాటికి రూ.54,74,279.20** (అక్షరాల యాభై నాలుగు లక్షల డెబ్బై నాలుగు వేల రెండు వందల డెబ్బై తొమ్మిది రూపాయలు మరియు ఇరవై పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి తనఖాగా వుంచిన దిగువ తెలిపిన స్థిరాస్తులను ఒప్పిచర్ల బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక/సింబాలిక్ స్వాధీనత తీసుకోబడినది. సదరు స్థిరాస్తులను క్రింద సూచించిన విధంగా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించటమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలు మరియు హామీదారుల నుండి రావలసిన బకాయిమొత్తము, కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఒప్పిచర్ల బ్రాంచ్ వారిచే ఇ-వేలం ద్వారా ది.06.01.2026న** ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది. ధరావత్తు సొమ్మును **ది.05.01.2026, సా॥ 5.00 గం॥ లలోపు** డిపాజిట్ చేయవలెను. ఆస్తుల యొక్క రిజర్వుధర మరియు ధరావత్తు సొమ్ములను దిగువ పేర్కొనబడినవి.

ఋణగ్రహీత(లు) యొక్క పేరు: 1) M/s. శ్రీ శివతేజ ఫెర్టిలైజర్స్, యజమాని: శ్రీ బొమ్మిన వీరబ్రహ్మం (మరణించినారు), తండ్రి: వెంకయ్య, R/o. హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. **చట్టబద్ధవారసులు:** 1(ఎ): శ్రీమతి బొమ్మిన సత్యవతి, భర్త: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 1(బి): బొమ్మిన ఈశ్వరి, తండ్రి: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 1(సి): శ్రీ బొమ్మిన వెంకట శివ బ్రహ్మం, తండ్రి: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. **సహ-పూచీదారు/హామీదారు:** 2) శ్రీ బొమ్మిన పోతులూరయ్య, తండ్రి: బొమ్మిన వెంకయ్య, R/o. హెచ్.నెం.1-237/1, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 3) శ్రీమతి పురంశెట్టి వెంకాయమ్మ, భర్త: పురంశెట్టి వెంకటేశ్వర్లు, R/o. హెచ్.నెం.2-48, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. **తనఖాదారు:** 1) శ్రీ బొమ్మిన వీరబ్రహ్మం, తండ్రి: వెంకయ్య, R/o. హెచ్.నెం. 2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. **చట్టబద్ధవారసులు:** 1(ఎ): శ్రీమతి బొమ్మిన సత్యవతి, భర్త: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 1(బి): బొమ్మిన ఈశ్వరి, తండ్రి: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 1(సి): శ్రీ బొమ్మిన వెంకట శివ బ్రహ్మం, తండ్రి: బొమ్మిన వీరబ్రహ్మం, హెచ్.నెం.2-29, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614. 2) శ్రీ బొమ్మిన పోతులూరయ్య, తండ్రి: బొమ్మిన వెంకయ్య, R/o. హెచ్.నెం.1-237/1, తోట బజారు, కారంపూడి గ్రామము & మండలం, పల్నాడు జిల్లా-522614.

ఇ-వేలం తేది మరియు సమయం: 06.01.2026, ఉ॥ 11-00 గం॥ల నుండి

రిజర్వుధరలో 10% సొమ్మును ధరావత్తు సొమ్మును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఒప్పిచర్ల బ్రాంచ్ వారి అకౌంట్ నెం. 701911011100713, IFSC CODE: UBIN0CG7019 కు RTGS/NEFT/ ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ది.05.01.2026, సా॥ 5.00 గం॥లలోపు చెల్లించవలెను.

ఆస్తి యొక్క వివరములు
1వ ఆస్తి యొక్క వివరములు: బొమ్మిన వీరబ్రహ్మం యొక్క ఖాళీస్థలము. **లొకేషన్:** కారంపూడి గ్రామము మరియు గ్రామపంచాయతీ, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. **సర్వే నెం.** సర్వే నెం.347/B1. **విస్తీర్ణము:** 241.87 చ॥గ॥. **యజమాని పేరు:** బొమ్మిన వీరబ్రహ్మం. **సరిహద్దులు: తూర్పు:** బొమ్మిన పోతులూరయ్య యొక్క స్థలము-102.6 అ॥; **దక్షిణం:** పంచాయతీ బజారు-21.6 అ॥; **పడమర:** గ్రంధి నాగలక్ష్మి యొక్క ఇల్లు-100 అ॥; **ఉత్తరం:** నాగేటి వీరయ్య, నాగేటి లక్ష్మీ నర్సు యొక్క స్థలము-21.6 అ॥

రిజర్వుధర: రూ.23,95,000/-, ధరావత్తు: రూ.2,39,500/- బిడ్ పెంపుదల అమౌంట్: రూ.20,000/-

ఆస్తి యొక్క వివరములు
2వ ఆస్తి యొక్క వివరములు: బొమ్మిన వీరబ్రహ్మం యొక్క ఆర్‌సిసి రూఫ్ భవనము. **లొకేషన్:** కారంపూడి గ్రామము మరియు గ్రామపంచాయతీ, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. **సర్వే నెం.** సర్వే నెం.347/B1, డి.నెం.2-29/A, **విస్తీర్ణము:** 79.42 చ॥గ॥. **యజమాని పేరు:** బొమ్మిన వీరబ్రహ్మం. **సరిహద్దులు: తూర్పు:** పంచాయతీ బజారు-13.2 అ॥; **దక్షిణం:** బొమ్మిన కుమారి యొక్క ఇంటి ఆస్తి-54.4 అ॥; **పడమర:** కారంపూడి నుండి దాచేపల్లి ఆర్&బి రోడ్డు-13.2 అ॥; **ఉత్తరం:** బొమ్మిన పోతులూరయ్య యొక్క ఇంటి ఆస్తి-54.4 అ॥

రిజర్వుధర: రూ.16,80,000/-, ధరావత్తు: రూ.1,68,000/- బిడ్ పెంపుదల అమౌంట్: రూ.20,000/-

ఆస్తి యొక్క వివరములు
3వ ఆస్తి యొక్క వివరములు: బొమ్మిన పోతులూరయ్య యొక్క ఖాళీస్థలము. **లొకేషన్:** కారంపూడి గ్రామము మరియు గ్రామపంచాయతీ, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. **సర్వే నెం.** సర్వే నెం.347/B1, **విస్తీర్ణము:** 242.08 చ॥గ॥. **యజమాని పేరు:** బొమ్మిన పోతులూరయ్య. **సరిహద్దులు: తూర్పు:** పలిశెటి అచ్చయ్య యొక్క స్థలము-105 అ॥; **దక్షిణం:** పంచాయతీ బజారు-21 అ॥; **పడమర:** బొమ్మిన వీరబ్రహ్మం యొక్క స్థలము-102.6 అ॥; **ఉత్తరం:** నాగేటి వీరయ్య, నాగేటి లక్ష్మీ నర్సు యొక్క స్థలము-21 అ॥

రిజర్వుధర: రూ.23,96,000/-, ధరావత్తు: రూ.2,39,600/- బిడ్ పెంపుదల అమౌంట్: రూ.20,000/-

ఆస్తి యొక్క వివరములు
4వ ఆస్తి యొక్క వివరములు: బొమ్మిన పోతులూరయ్య యొక్క ఆర్‌సిసి రూఫ్ భవనము. **లొకేషన్:** కారంపూడి గ్రామము మరియు గ్రామపంచాయతీ, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. **సర్వే నెం.** సర్వే నెం.347/B1, డి.నెం.2-29/B. **విస్తీర్ణము:** 78.46 చ॥గ॥. **యజమాని పేరు:** బొమ్మిన పోతులూరయ్య. **సరిహద్దులు: తూర్పు:** పంచాయతీ బజారు-13 అ॥; **దక్షిణం:** బొమ్మిన వీరబ్రహ్మం యొక్క ఇల్లు-54.4 అ॥; **పడమర:** కారంపూడి నుండి దాచేపల్లి ఆర్&బి రోడ్డు-13 అ॥; **ఉత్తరం:** పెనుగొండ పున్నయ్య కుమ్మరి శివయ్య యొక్క ఇంటి ఆస్తి-54.4 అ॥

రిజర్వుధర: రూ.16,06,000/-, ధరావత్తు: రూ.1,60,600/- బిడ్ పెంపుదల అమౌంట్: రూ.20,000/-

బిడ్డర్లు తమ బిడ్లను సమర్పించే ముందు మరియు ఇ-వేలం విక్రయ ప్రక్రియలో పాల్గొనడానికి ముందు వేలం విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం వెబ్‌సైట్: **https://bankauctions.in** మరియు **https://apgb.bank.in/auctions** టెండర్స్ నందు సందర్శించాలని సూచించడమైనది. అధీకృత అధికారికి తెలిసినంత మేరకు ఈ ఆస్తిపై ఏవిధమైన తనఖాలు లేవు. పూర్తి మరియు సరియైన సమాచారం కొరకు అధీకృత అధికారిని సంప్రదించగలరు. వేలము వేయు స్థిరాస్తిని 03-01-2026 తేదీన తనిఖీ చేసుకోవచ్చును. మరింత సమాచారం కొరకు మొబైల్ నెం. **91009 10472**, మెయిల్ ఐడి: **bm0019@apgb.bank.in** ను సంప్రదించవచ్చు.

ప్రదేశం: ఒప్పిచర్ల; తేది: 01-12-2025 సం/- ఛీఫ్ మేనేజర్ కమ్ అధీకృత అధికారి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(c) eenadu

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

వ్యాయామంతో ఒత్తిడి దూరం

నూజండ్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని మానసిక వైద్య నిపుణురాలు పవిత్ర అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ఆదర్శ పాఠశాలలోని బాలికలకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మెంటల్ హెల్త్ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల భయం, జ్ఞాపకశక్తి సమస్యలు, ఒత్తిడి ఆందోళన, కుంగుబాటు, వ్యసనాలకు బానిసలు కావడం, ఓటమి భయం, ఒంటరితనం, సర్దుబాటు సమస్యలను ఎలా అధిగమించాలో వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మీ సమస్యలను అర్థం చేసుకొని, దాని నుంచి మీరు బయట పడేందుకు తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు. మానసిక సంబంధిత సమస్యలపై 14416 ట్రోల్‌ఫ్రీ నంబరులో తమను సంప్రదించాలని సూచించారు. వ్యాయామంతో ఒత్తిడి దూరం అవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ హనుమంతరావు, ఆదిలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? చిలకలూరిపేట చెరువు రోడ్డులోని టిడ్కో గృహ సముదాయంలో ఉంటున్న లబ్ధిదారులకు పట్టణంలోకి వచ్చేందుకు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. - **బాలకృష్ణనాయక్**

✔ టిడ్కో గృహ సముదాయం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు ట్రిప్పులు బస్సు తిరుగుతుంది. అవసరాన్ని బట్టి ట్రిప్పులు పెంచి టిడ్కో గృహ లబ్ధిదారులకు రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా చూస్తాం. - **రాంబాబు, ఆర్టీసీ డీఎం**

– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మసీదు వద్ద మున్సిపల్ స్థలం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వెంటనే ఆక్రమణలు తొలగించండి. - **శ్రీనివాసరావు** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - **సాంబయ్య, టీపీవో** – న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

శివారు.. సమస్యలతో ప్రజల బేజారు

శ్రీనివాసనగర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణ శివారు కాలనీ అయిన ఎస్ఆర్‌కేటీలో కనీస వసతులు కరవై ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. ఏదొక సమస్యతో కాలనీ వాసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. అరకొరగా ఉన్న కచ్చా కాలువలు పిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో మురుగు పారే దారి లేదు. వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారులు లేక స్థానికులు

అధ్వానంగా మట్టి రోడ్డు

అవస్థలు వర్ణనాతీతం. పాలకులు, అధికారులు మారుతున్నారే తప్ప.. తమ పరిస్థితులు మారడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.

పల్లపు ప్రాంతం.. ఈ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, లోతట్టు ప్రాంతం కావడంతో కొద్దిపాటి వర్షానికే ఇళ్లు నీట మునుగుతున్నాయి. వర్షపు నీరు వెళ్లే దారిలేక రోజుల తరబడి నీటి మధ్య జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్తు నియంత్రికలకు పిచ్చిమొక్కలు అలుముకుని మంటలు వస్తున్నాయి. కాలనీకి మంచినీటి పైపులైను కొంతమేర ఉన్నా నీరు రావడం లేదు. ట్యాంకర్లతో తెచ్చి పోసే నీరు సరిపోవడం లేదని, ఒక్కోసారి ట్యాంకర్లు వారంలో రెండుసార్లు మాత్రమే వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు ను సంప్రదించగా కాలనీవాసులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ట్యాంకర్లతో సక్రమంగా మంచినీటి సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు సమస్య లేకుండా చర్యలు చేపడతామన్నారు.

కాలనీ జనాభా	: 3.5 వేలకుపైగా
వీధులు	: 18
అంతర్గత రహదారులు లేనివి	: 6

రెడ్డిపాలెంలో ఉత్సవ సందడి

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం దివ్యబలి పూజ, సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన, మహిళల కోలాటం, రాత్రి ఫ్రాన్సిస్ శౌరి విగ్రహంతో తేరు ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని విచారణ గురువు ఫాదర్ జాకబ్‌రెడ్డి వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల ఒకటి నుంచి నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఫైనల్స్‌కు చేరాయి. ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు మంగళవారం చర్చిని సందర్శించి ప్రార్థన చేశారు. వాలీబాల్ పోటీల విజేతలకు శివశక్తి ఫౌండేషన్ తరపున బహుమతి ప్రకటించారు.

విద్యుత్తు దీపాల వెలుగులో ఆర్‌సీఎం చర్చి

ప్రసంగించి.. ప్రశంసలు పొంది..

ఉత్సాహంగా 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'ఈనాడు' నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నరసరావుపేట పట్టణంలో మంగళవారం శ్రీచైతన్య ఉన్నత పాఠశాల రాజాగారికోట సెంటర్, టైనీ టాట్స్ ఉన్నత పాఠశాలల్లో వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ వినియోగం వల్ల లాభ నష్టాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను స్పష్టంగా తెలిపారు. సెల్‌ఫోన్‌ను మితిమీరి వినియోగించవద్దన్నారు. శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థినులు లక్ష్మీప్రసన్న (9వ తరగతి), వర్షిత (8వ తరగతి), చరిత (9వ తరగతి) రాణించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని పి.శోభాదేవి, డీన్ కోటేశ్వరరావు బహుమతులు అందించి అభినందించారు. ఉపాధ్యాయిని శ్రావణి ఉన్నారు. ★ టైనీటాట్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలో విద్యార్థులు సుశీల్‌కుమార్ (9వ తరగతి), షేక్ ఆర్షియా (9వ తరగతి), లాలస (8వ తరగతి) సత్తా చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ హేమ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఉపాధ్యాయులు లక్ష్మీకల్యాణి, ఆదినారాయణమ్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజేత బాలికలతో ప్రిన్సిపల్ శోభాదేవి తదితరులు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ హేమ, ఉపాధ్యాయులు

గాంధీపేట (చిలకలూరిపేట (గ్రామీణ)), న్యూస్‌టుడే : చిలకలూరిపేట పట్టణం గాంధీపేటలోని చైతన్య జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. కృత్రిమమేధతో వచ్చే మార్పులు అనే అంశంపై జరిగిన ఉపన్యాసం పోటీల్లో విద్యార్థులు అనర్గళంగా ప్రసంగించారు. కృతిమమేధతో ప్రయోజనాలను వివరించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులు ఐ.శోభన్ హర్షద్ (సీనియర్ ఇంటర్), ఎస్కే అర్షియా, ఎస్కే బూస్రా (జూనియర్ ఇంటర్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి చైతన్య జూనియర్ కళాశాల డైరెక్టర్లు వలేటి వెంకటేశ్వరరావు, పి.ప్రసాదరావు, ప్రిన్సిపల్ ఎస్కే అబ్దుల్ రజాక్, వైస్ ప్రిన్సిపల్ తిరుమలరావు బహుమతులు అందించి అభినందించారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, ప్రిన్సిపల్ అబ్దుల్ రజాక్

నాదెండ్ల మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

నేడు

నాదెండ్ల(చిలకలూరిపేట (గ్రామీణ)), న్యూస్‌టుడే : నాదెండ్ల మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చినుకూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

హనుమత్ వ్రతాలు

వినుకొండ: మండలంలోని గంటి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వేదాధ్యాయశాంతిదాలు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వీధి వ్యాపారుల ఉన్నతికి సహకరించాలి

పండరీపురం(చిలకలూరిపేట (గ్రామీణ)): చిరు, వీధి వ్యాపారుల ఉన్నతికి బ్యాంకులు సహకారం అందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా 25 కుటుంబాలకు తోపుడు బండ్ల పంపిణీని జీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. చిరు వ్యాపారుల పనితీరు, ప్రతిభ, ఆదాయాన్ని కొలమానంగా చేసుకుని బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. జీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మాట్లాడుతూ రోటరీ అందిస్తున్న సేవలను చిరు, వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. చిలకలూరిపేట రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, బోడి రామసుబ్బారావు మాట్లాడుతూ రోటరీ చేయూత చక్రాల కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ డెక్కన్ రోటరీ క్లబ్, దాతలు ముత్తినేని వెంకటేశ్వర్లు, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి, మహ్మద్ యూసఫ్ అలీ, ఒ.సాంబశివరావు, షేక్ మహ్మద్ రఫీ, అడుసుమల్లి మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రముఖులు తేళ్ల సుబ్బారావు, చిలుకూరి శ్రీనివాసరావు, కందిమళ్ల అంజిబాబు, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు నార్నె విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ ప్రాంతంపై అధ్యయనం అవసరం

వినుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో దివ్యాంగులు మూడు శాతం ఉంటే వినుకొండలో 5-6 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కొత్తపేటలోని తన కార్యాలయం వద్ద మంగళవారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది దివ్యాంగులు ఉండటానికి ఫ్లోరైడ్ ప్రభావమా.. జన్యుపరమైన సమస్యలా.. తదితర అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన ప్రస్తుత గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కృషి ఫలితంగా ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారని సూచించారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల మాట్లాడుతూ భూమి కేటాయిస్తే వినుకొండలో గ్రంథాలయ భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, ఏడీసీ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, మున్సిపల్ కౌన్సిలర్ షకీల, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగశ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఆంజనేయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ తదితరులు

విద్యార్థినులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలో బొగ్గరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సర్పంచి పోట్లూరి హైమావతి మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొన్న 30మంది పాఠశాల విద్యార్థినులకు సర్పంచి హైమావతి సొంత ఖర్చులతో క్రీడా దుస్తులు సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్ఎం మీనగా రామారావు, పోట్లూరి వీరరాఘవులు, విద్యా కమిటీ ఛైర్మన్ వెంకట్రావు పాల్గొన్నారు.

వైకాపా హయాంలో టిడ్కో లబ్ధిదారులకు అన్యాయం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుల్లారావు, పక్కన పురపాలక సంఘ ఛైర్మన్ రఫాని తదితరులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలను నిరుపయోగంగా ఉంచి లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం చేశారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. టిడ్కో గృహాల నిర్మాణం, కేటాయింపు, లబ్ధిదారులకు రుణ మంజూరు తదితర అంశాలపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఉగాది నాటికి చిలకలూరిపేటలోని మొత్తం 5,520 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 'ఫేజ్-1లో అర్హత పొందిన 520 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, వారంతా ఒకేసారి పూర్తి సొమ్ము కట్టలేక లేదా బ్యాంకులు, ప్రైవేటు సంస్థల నుంచి రుణం తీసుకున్నా ఇళ్లు రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. వైకాపా నిరుపయోగంగా వదిలేయడంతో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో పురపాలకసంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, యార్డు ఛైర్మన్ కరీముల్లా, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో తంటా

అరండల్‌పేట(నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని పల్నాడు రోడ్డులో అంబేద్కర్ విగ్రహం సమీపంలో పల్నాడు నుండి మల్లమ్మ సెంటర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల మంచినీటి పైపు లీకులకు మరమ్మతు చేసేందుకు ఇక్కడ గుంత తవ్వారు. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. అనంతరం మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు తోడు, ఈ మార్గంలో నిత్యం పెద్ద వాహనాలు రాకపోకలు సాగించడంతో గుంతపై తారు తొలగిపోయింది. రాత్రిళ్లు గుంత కనబడక చోదకులు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ జ్యోతిని అడగ్గా పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ఈ ఏడాదైనా వినియోగంలోకి వచ్చేనా?

కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే : మండలంలో కనమర్లపూడి వద్ద కర్నూలు-గుంటూరు రహదారి వెంబడి రూ.లక్షల ప్రభుత్వ వ్యయం వెచ్చించి వేబ్రిడ్జి ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా ఇంత వరకు వినియోగంలోకి రాలేదు. దీంతో అది మందుబాబులకు నిలయంగా మారుతుంది. ప్రస్తుతం మండలంలో శావల్యాపురం, మతుకుమల్లి తదితర గ్రామాల్లో ముందస్తుగా సాగు చేసిన వరిపంట కోతకు వచ్చింది. అమ్మిన ధాన్యం కాటా వేయించేందుకు 10 కి.మీ దూరంలో ఉన్న వినుకొండకు వెళ్లాల్సి వస్తోంది. వేబ్రిడ్జి వినియోగంలోకి వస్తే రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈ విషయాన్ని తహసీల్దారు ఎం.అర్జున్ నాయక్‌ను సంప్రదించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

వంతెన కట్ట.. ఇలా వదిలేస్తే ఎట్టా

నూజండ్ల, న్యూస్‌టుడే: మండలంలో ఉప్పలపాడు వద్ద గుండ్లకమ్మ నదిపై వంతెన అంచున కట్టకు గొయ్యి ఏర్పడి కోతకు గురవుతోంది. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు వంతెన అంచుకు వెళ్తే ప్రమాదం తథ్యం. గొయ్యి వద్ద ప్రమాద హెచ్చరికగా కర్ర ఏర్పాటు చేసి దానికి గోతం తగిలించి వదిలేశారు. వర్షం వస్తే నీటి ఉద్ధృతికి ఇక్కడ మరింత కోతకు గురవడంతో పాటు వంతెన గోడ, రోడ్డు కోతకు గురై కొట్టుకు పోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రాథమిక దశలోనే మరమ్మతులు చేసి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.

అంధకారంలో అండర్‌పాస్‌లు దాటేదెలా ?

16వ నంబరు జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాలు వెలగక రాత్రిళ్లు చీకట్లు అలముకుంటున్నాయి. మండలంలో యడ్లపాడు, వంకాయలపాడు, బోయపాలెం గ్రామాల్లోని సర్వీసు రోడ్లలో రాత్రిళ్లు విద్యుత్తు దీపాలు వెలగటం లేదు. దీంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే స్థానికులు అండర్‌పాస్‌ల వద్ద ఇబ్బంది పడుతున్నారు. రాత్రయితే అండర్‌పాస్‌లు దాటడానికి మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. వంతెనలపై కూడా విద్యుద్దీపాలు సక్రమంగా వెలగక తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై హైవే సూపర్‌వైజర్ ఆరిఫ్‌ను వివరణ కోరగా విద్యుత్తు దీపాలు వెలగని చోట కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, యడ్లపాడుతి**

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి

రొంపిచర్ల, ఈపూరు, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రొంపిచర్ల ఇన్‌ఛార్జి ఎస్సై ఎ.హరిబాబు అన్నారు. రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై జాగ్రత్తలు, మత్తు పదార్థాలతో అనర్థాలు, మహిళల రక్షణ, రోడ్డు భద్రత తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించుకోవాలన్నారు. ఫోన్లలో వచ్చే లింకుల జోలికి పోవద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

★ ఈపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సై కె.వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కష్టపడి చదువుకోవాలన్నారు. నేరాలు శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనై పక్కదోవ పట్టకుండా ప్రయోజకులై తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

నరసరావుపేట అర్బన్, వినుకొండ, న్యూస్‌టుడే: మానవాళికి ప్రమాదకరంగా మారిన కాలుష్య నియంత్రణ బాధ్యత అందరిపై ఉందని వక్తలు అన్నారు. తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ మాట్లాడుతూ కాలుష్య నివారణ ప్రభుత్వం లేదా కొందరు వ్యక్తులతో సాధ్యం కాదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

★ వినుకొండలో వెల్లటూరు రోడ్డులోని శర్మ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై బాలబాలికలు బొమ్మలు గీసి ప్రతిభను చాటారు. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పాఠశాల డైరెక్టర్ శర్మ, శానిటరీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం ప్రారంభం

వినుకొండ, న్యూస్‌టుడే: వినుకొండలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు అభినందనీయమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. కారంపూడి రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం ఆయన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. మూడో తరగతి పట్టణాల్లో ఆధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో ప్రజలకు సత్వర వైద్య సేవలు లభించి మేలు చేకూరుతుందన్నారు. ఆసుపత్రి వైద్యులు సురేష్, మృదుల తేజస్విని ఆయన అభినందించారు.

ఆకట్టుకున్న మహిళల కోలాట ప్రదర్శన

సాతులూరు(చిలకలూరిపేట (గ్రామీణ)): నాదెండ్ల మండలం సాతులూరులో రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వినుకొండలో కొండవీడు ఎక్స్‌ప్రెస్ ఆపాలి

వినుకొండ, శావల్యాపురం, న్యూస్‌టుడే: మచిలీపట్నం-యశ్వంత్‌పూర్ నడుమ రాకపోకలు సాగించే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును వినుకొండ స్టేషన్‌లో ఆపాలని, అప్పుడే ఈ ప్రాంత ప్రజలు బెంగళూరు వెళ్లేందుకు మేలైన ప్రయాణ సౌకర్యం లభిస్తుందని పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు కోరారు. ఈ మేరకు స్థానిక స్టేషన్‌ను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే జడ్ఆర్‌యూసీసీ (జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ) సభ్యురాలు కె.రాధకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. రెండో ప్లాట్‌ఫారం వైపు షెడ్లు నిర్మించాలని, లిఫ్టులు వినియోగంలోకి తేవాలని, రైల్వే స్టేషన్‌కు వచ్చే రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. రైల్వేస్టేషన్ అధికారి రామ్మోహన్‌రెడ్డి ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన నియోజకవర్గ నేత నాగశ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ షకీల, భాజపా నాయకులు లెనిన్, గుంటి ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ చిలంకూరి కోటేశ్వరరావు, రెడ్డి నగేష్ తదితరులు ఆమెకు సమస్యలు వివరించారు.

వినుకొండలో వినతిపత్రం ఇస్తున్న పట్టణ ప్రజలు

నడికూడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గంలో న్యూ పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు రైలు మార్గం పూర్తయినా ఇంతవరకు సర్వీసులు ప్రారంభించలేదని తెలిపారు. తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు, బొల్లా పేరయ్య, కూటమి నేతలు ఆమెకు వినతిపత్రం అందచేశారు. స్టేషన్ ఆవరణలోని టిక్కెట్ బుకింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించి, రిజర్వేషన్ సౌకర్యం గురించి ఆరా తీశారు. వారితో పాటు స్టేషన్ మాస్టర్ ఎ.మధుబాబు తదితరులు ఉన్నారు.

ఎక్కువ సర్వీసులు నిలుపుదల చేసేందుకు కృషి

గుంటూరు-గుంతకల్లు మార్గంలో శావల్యాపురం జంక్షన్‌లో ఎక్కువ రైల్వే సర్వీసులు నిలుపుదల చేసేలా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహకారంతో కృషి చేస్తానని జడ్ఆర్‌యూసీసీ సభ్యురాలు రాధ తెలిపారు. మంగళవారం శావల్యాపురం స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు ఆమెతో మాట్లాడుతూ కరోనాకు ముందు స్టేషన్‌లో మొత్తం 12 సర్వీసులు నిలుపుదల చేసేవారని, తరువాత కేవలం హుబ్బళ్లి - గుంటూరు, మార్కాపురం డెమో సర్వీసు మాత్రమే నిలుపుతున్నారని వివరించారు. దీంతో వేల మంది ప్రజలు రైలు ప్రయాణానికి దూరం అయ్యారన్నారు. ముఖ్యంగా గుంటూరు- తిరుపతి రైలును నిలిపితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంద

మిరపలో సస్యరక్షణతో అధిక దిగుబడి

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: వాతావరణంలో మార్పులకు అనుగుణంగా మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నగేష్ అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు, రేమిడిచర్ల గ్రామాల్లోని మిరప పొలాల్లో రైతులకు సస్య రక్షణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆకుమచ్చ, కాయ కుళ్లు, ఎండుతెగులు, నల్లి, తామరపురుగు, వైరస్ తెగుళ్ల లక్షణాలు వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి నబిరసూల్, సహాయకులు నాగార్జున, వెంకటేశ్వర్లు నాయక్, రైతులు పాల్గొన్నారు.

గుమ్మనంపాడు మిరప పొలంలో అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారులు

క్షేత్రస్థాయి పర్యటనలతో విజ్ఞానం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా తమ పుస్తకాల్లో చదువుకున్న అంశాలను స్వయంగా పరిశీలించి విజ్ఞానం పొందవచ్చునని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవి నాయక్ అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు సాంఘిక శాస్త్రంలోని వ్యవసాయం అనే పాఠం బోధనలో భాగంగా మంగళవారం క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా విత్తనాలు విత్తుట, కలుపు తీయటం, ఎరువులు, పురుగు మందుల వాడకం, కోతకు వచ్చిన వరి కోసే విధానం తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటన ద్వారా పాఠ్యాంశంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. సాంఘిక శాస్త్ర అధ్యాపకులు ఎం.ప్రభుదాసు, కరీముల్లా, అబిదున్నీసా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వరి పొలం పరిశీలిస్తున్న విద్యార్థులు

కంది పైరుపై గడ్డిమందు పిచికారీ.. ముగ్గురిపై కేసు

ఈపూరు: పాతకక్షల నేపథ్యంలో పూతకొచ్చిన కందిపైరుపై గడ్డిమందు పిచికారీ చేసి నష్టపరిచిన సంఘటనలో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వేణుగోపాల్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఈపూరుకు చెందిన నాశన పేరమ్మ ఎకరన్నర పొలంలో కంది పైరు సాగు చేసింది. పైరు పూతదశలో ఉంది. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన నాశన ఏడుకొండలు, ఆయన కుమారులు గోవిందు, రమేష్ నవంబరు 28న పొలం వెళ్లి కందిపైరుపై గడ్డిమందు పిచికారీ చేశారు. దీంతో పైరు పూర్తిగా ఎండిపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుడి అదృశ్యంపై ఫిర్యాదు

యడ్లపాడు: రాతి క్రషర్‌లో పనిచేసే కార్మికుడు కనిపించకుండా పోయాడు. పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేట మండలం జొన్నలగడ్డకు చెందిన ఎన్.మహంకాళేశ్వరరావు (26) యడ్లపాడు మండలం బోయపాలెంలో ఓ క్రషర్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా అతడు గత నెల 23న క్రషర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతడికి అదేరోజు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో వారు మిల్లు యాజమాన్యం వద్దకు వెళ్లి ఆరా తీయగా.. మహంకాళేశ్వరరావు అదేరోజు ఉదయం క్రషర్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివరామకృష్ణ మంగళవారం తెలిపారు.

రైతులకు వసతులు కల్పించాలి

గణపవరం (చిలకలూరిపేట (గ్రామీణ)): గణపవరం సీసీఐ కేంద్రాన్ని నాదెండ్ల తహసీల్దార్ కుటుంబరావు మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పత్తిలో తేమశాతం పరిశీలించారు. గణపవరం సీసీఐ కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఈనెల 2 వరకు 5వేల క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. సీసీఐ కేంద్రంలో రైతులకు తాగునీరు, విశ్రాంతి తీసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు ఆదిలక్ష్మి, అంకమ్మరావు ఉన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

ఇందుమూలముగా టైటిల్ డీడ్స్ పోయినవన్న నిమిత్తం తెలియచేయునదేమనగా శ్రీమతి కొల్లా శ్రీదేవి భర్త పేరు వెంకట సుబ్బారావు, నివాసం చిలకలూరిపేట వారు మా బ్రాంచి నుంచి రూ.13,00,000/- (రూపాయలు పదమూడు లక్షలు మాత్రమే)ల ఇంటి రుణాన్ని అకౌంట్ నం.32188235340తో 13.02.2012న పొందారు మరియు సేల్ డీడ్ నం.3833/2000 తేది 16.11.2000ను ఒరిజినల్ టైటిల్‌డీడ్‌తో 13.02.2012న డిపాజిట్ చేసారు. బి.ఎ.నం. 394/2011/జి1 కింద 10.11.2011న కమిషనర్ చిలకలూరిపేట మునిసిపాలిటి ఆమోదించిన ఇంటి ప్లాను కూడా పోయినది. ఇటీవల వీటికి సంబంధించిన ఇంటి రుణం డాక్యుమెంట్లు మా చీరాల లోన్ ప్రాసెసింగ్ సెంటర్‌కు తరలించబడినవి, ఈ తరలించే క్రమంలో 25.06.2025న ఒరిజినల్ టైటిల్ డీడ్స్ పోయినవి. మేము ఈ టైటిల్ డీడ్స్‌ను రెండు బ్రాంచిలలో వెతికాము కానీ అవి కనిపించలేదు. ఎవరికైనా అవి దొరికినా లేదా పోయిన డాక్యుమెంట్ల ఆచూకీ తెలిసినా, దయచేసి బ్రాంచిమేనేజరుకు తెలపగలరు లేదా బ్రాంచిని వెంటనే సంప్రదించగలరు.

బ్రాంచి మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గణపవరం బ్రాంచి, నాదెండ్ల మండలం.

(c) eenadu

ఈనాడు
పార్వతీపురం మన్యం

బుధవారం డిసెంబరు 3, 2025 | 5

అంగవైకల్యమని కుంగిపోలేదు..
అవకాశాన్ని వదులుకోలేదు

న్యూస్‌టుడే – గరివిడి

వైకల్యాన్ని అడ్డంకిగా భావించలేదు.. నా వల్ల కాదు, చేయలేను అని సాకులు చెబుతూ కూర్చోలేదు. అంగవైకల్యాన్నే అవకాశంగా మార్చుకున్నారు. సాధించలేనిది లేదని నిరూపించారు.. తమ కంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరచుకుని సాగిపోతున్నారు ఈ యువకులు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆ స్ఫూర్తి ప్రయాణం తెలుసుకుందాం రండి.

బౌలింగ్ సాధనలో నాయుడు

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

ఆట.. చదువు.. అదుర్స్

గరివిడి మండలం కోనూరు గ్రామానికి చెందిన **రమేష్ సుబ్రహ్మణ్యం నాయుడు**కు పుట్టుకతోనే రెండు చేతులు, కాళ్లకు వేళ్ల నిర్మాణం సరిగా లేదు. కుడికాలి పాదానికి ఒక బొటన వేలు మాత్రమే ఉంది. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో ఉత్సాహంగా వెళ్లినా ఎవరూ ఆడించేవారు కాదు. ఆసక్తిని గమనించిన తండ్రి స్వయంగా మైదానానికి తీసుకెళ్లి ఆడించేవారు. క్రమం తప్పకుండా సాధన చేస్తూ నైపుణ్యం పెంచుకున్నాడు.

మద్రాస్ ఐఐటీలో ఇంజినీరింగ్

మద్రాసు ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ప్రస్తుతం అక్కడే ఎంటెక్ చదువుతున్నాడు రమేష్ సుబ్రహ్మణ్యం. కోచ్‌ల సారథ్యంలో క్రికెట్‌లో రాటుదేలాడు. ప్రతిభను గుర్తించిన తమిళనాడు రాష్ట్ర క్రికెట్ సంఘం దివ్యాంగుల క్రికెట్‌కు సిఫారసు చేసింది. ప్రతిభ చూపి, ఆ రాష్ట్ర దివ్యాంగుల జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక య్యాడు.

ఇవీ విజయాలు..

- 2024లో వారణాసిలో జరిగిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో సౌత్‌జోన్ టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా సారథ్యం వహించి జట్టును విజేతగా నిలిపాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో కోయంబత్తూరులో జరిగిన ఇండియన్ పారా క్రికెట్ లీగ్‌లో రాణించి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును దక్కించుకున్నాడు.
- 2026 ఏప్రిల్‌లో నిర్వహించనున్న ప్రపంచ దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు భారత క్రీడాకారుల ఎంపికకు ఈనెల 5 నుంచి నిర్వహించే ప్రాబబుల్స్ శిబిరానికి వైస్ కెప్టెన్‌గా ఈ వ్యవహరించనున్నాడు.

క్రీడ ఏదైనా సవ్యసాచి..

న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పాలకొండ పట్టణంలోని సనారివిశ్వేశర ఆలయ వీధికి చెందిన **బెహరా శివదుర్గాప్రసాద్** ఆటలపై ఆసక్తితో పలు క్రీడల్లో రాణిస్తున్నాడు. ఈ యువకుడికి పుట్టుక నుంచే ఎడమ చేయి సహకరించడం లేదు. అయినా పట్టుదలతో సాధన చేస్తూ సాగుతున్నాడు. దాతల సహకారంతో పోటీలకు వెళ్తున్నాడు. ఈ నెల శ్రీలంకలో జరగనున్న దక్షిణాసియా పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు.

- ఈ ఏడాది ఫిబ్రవరిలో గుంటూరులో జరిగిన దివ్యాంగుల పారా క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టును ప్రథమ స్థానంలో నిలిచేలా చేసి కప్ కైవసం చేసుకున్నాడు.
- ఈ ఏడాది జనవరిలో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించాడు. జట్టు తృతీయ స్థానంలో నిలిచింది.
- గత ఏడాది చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పారా కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడాడు. జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.
- నాలుగేళ్ల కిందట భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడు.

వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రేరణతో.. పేదరికం కారణంగా ఐటీఐతో చదువుకు స్వస్తి పలికినా ఆటలపై పూర్తి దృష్టిసారించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.రాములు ప్రేరణతో వివిధ క్రీడల్లో ప్రావీణ్యం సాధించినట్లు ఈ యువకుడు చెబుతున్నాడు.

క్రికెట్ ట్రోఫీతో దుర్గాప్రసాద్

4న జిల్లాకు మంత్రి లోకేశ్

భామిని, సీతంపేట న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 4న భామినిలో పర్యటించనున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఐహి రంగ సమావేశం ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి 9.30 వరకు నిర్వహించనున్నారు. భామినిలోనే బస చేసి.. 5న ఆదర్శ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్.. టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రితో కలిసి పాల్గొంటారని అధికారులు వివరించారు.

అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

సమావేశానికి సిద్ధం చేస్తున్న వేదిక

పార్వతీపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు భామినిలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్, పాలకొండ డీఎస్పీ రాంబాబు తదితరులు మంగళవారం పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాలకు ఎదురుగా హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపడుతున్నారు.

నచ్చినట్లు నాణ్యత కుదరదిక!

మిల్లర్లు తమకు నచ్చినట్లు ధాన్యం నాణ్యత చూడడం ఇక కుదరదు. గతంలో ఆర్‌ఎస్‌కేల్లో ధాన్యం నాణ్యత పరీక్షించి మిల్లులకు పంపేవారు. మిల్లర్లు ఏర్పాటు చేసుకున్న యంత్రాల ద్వారా నాణ్యత చూడడంతో తేడా వచ్చి రైతులు నష్టపోయేవారు. అధికారులు ఈ ఏడాది నుంచి మిల్లుల్లో ప్రభుత్వం అందించిన యంత్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఇవి తప్పనిసరని అధికారులు నిర్దేశించారు. కేంద్రాల్లో యంత్రాల ద్వారానే నాణ్యత పరీక్షించి కొనుగోలు చేయాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, పాలకొండ

పరుగెత్తు కన్నా.. నీవెనుక నేనున్నా

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: సరిగా నడవలేని వారు కొందరు.. వస్తువును రెండు చేతులతో పట్టుకోలేని వారు మరికొందరు.. అమ్మ ముద్దలు పెడితే తప్ప అన్నం కూడా తినలేని వారు ఇంకొందరు. కానీ క్రీడా పోటీల్లో వారి ప్రయత్నం చూసి చూపరులు ముచ్చటపడింది. ఇలా చేయూతనిచ్చే కన్నా.. నువ్వు పరిగెత్తగలవు చిన్నా.. నా బిడ్డ బంగారం.. చెబితే చేస్తాడంతే.. అంటూ పిల్లల వెన్నుతట్టిన తల్లుల సందడితో మైదానం మురిసింది. మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పారా ఒలింపిక్స్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లాస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలు జరిగాయి. 80 మంది పిల్లలు పాల్గొనగా.. పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. డీఈవో బి.రాజకుమార్, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త పి.భానుమూర్తి, జిల్లా క్రీడాసాధికారత సంస్థ అధ్యక్షుడు ఎస్.మురళి, ఎంఈవో-2 ప్రసాద్, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరుగు పోటీల్లో దివ్యాంగ బాలికలు

సుందరం నృత్యవందనం

పార్వతీపురం జూనియర్ కళాశాల మైదానంలో పుస్తక మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం బాలికల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాట్యం నేర్చుకుంటున్న పలువురు చక్కటి హావభావాలతో ఆహూతులను అలరించారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం, కలెక్టరేట్ ప్రాంగణం

రిజిస్ట్రేషన్ చేస్తున్నారా..?
స్లాట్ బుక్ చేసుకోండిలా..

న్యూస్‌టుడే – రాజాం

రిజిస్ట్రేషన్లకు తమకు అనుకూలమైన సమయం ఎంచుకునే వెసులుబాటు సంబంధిత శాఖ కల్పించింది. స్లాట్ విధానం తీసుకొచ్చింది. పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్(పీడీఈ)తో స్థిరాస్తుల క్రయవిక్రయాలకు ఎవరి దస్తావేజు వారే రూపొందించుకోవచ్చు. నమూనా పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లినా హెల్ప్‌డెస్క్‌ల్లో సహకరిస్తారు.

వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీల రిజిస్ట్రేషన్లకు నచ్చిన సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ముందస్తు బుకింగ్‌కు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన పన్లేదు. బుక్ చేసుకుని రద్దు చేసుకుంటే రూ.100, నిర్దిష్ట స్లాట్‌ను వాయిదా వేస్తే రూ.200 చెల్లించాల్సి ఉంటుందని, ఈ విధానం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఉపేంద్రరావు కోరారు.

ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 మధ్య

సమయాన్ని స్లాట్ బుకింగ్ కోసం వినియోగించు కోవచ్చు.

ఇలా బుక్ చేసుకోవాలి..

- ఏపీ రిజిస్ట్రేషన్లశాఖ వెబ్‌సైట్ registraion.ap.gov.in లోకి వెళ్లాలి.
- రిజిస్ట్రేషన్ చేయాలనుకున్న తమ ఆస్తులు, ఇతర వివరాలను నమోదు చేసి డాక్యుమెంట్‌ను రూపొందించాలి.
- ఆ తరువాత దరఖాస్తు ఐడీ వస్తుంది.
- దీని ఆధారంగా స్టాంపు డ్యూటీ, ఇతర ఫీజులు చెల్లించాలి.
- రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేందుకు ఏ సమయం అనుకూలమో చూసుకుని స్లాట్ నమోదు చేసుకోవాలి.
- ఇది పూర్తయ్యాక క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ టోకెన్ వస్తుంది.
- స్లాట్ సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే సబ్ రిజిస్ట్రార్ ప్రక్రియ పూర్తిచేస్తారు.

బాలామృతం.. గడువు దాటి విషం!

పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులైన మూడేళ్లలోపు పిల్లలకు ఇచ్చే బాలామృతం ప్యాకెట్లను గడువుదాటిన తర్వాత పంపిణీ చేశారు. జిల్లాలోని 10 ప్రాజెక్టుల లబ్ధిదారులకు నెలకు 27 వేల బాలామృతం ప్యాకెట్లను పంపిణీ చేస్తారు. ఉపయోగించాల్సిన గడువు తేదీ కనీసం మూడు నెలలుంటే తప్ప వీటిని పంపిణీ చేయకూడదనే నిబంధన ఉంది. అందుకు భిన్నంగా పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో వీటిని ఈ నెల 1న పంపిణీ చేశారు. విషయాన్ని స్త్రీశిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి టి.కనకదుర్గ వద్ద ప్రస్తావించగా.. వివరాలు తెలుసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

అభ్యుదయంతో అడుగేద్దాం..

మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర మంగళవారం సాలూరు మండలానికి చేరుకున్న సందర్భంగా కొరియా సీఐ కాంతికుమార్, సాలూరు గ్రామీణ ఎస్సై నర్సింహరావు స్వాగతం పలికారు. యువత పెద్ద ఎత్తున సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. విద్యార్థులు థింసా నృత్యాలు ప్రదర్శించారు. మామిడిపల్లి గ్రామం శంబర కూడలిలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో పార్వతి, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, వైద్యులు పాల్గొన్నారు. మక్కువలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎస్సై పి.నరసింహమూర్తి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం, మక్కువ

సంకల్పం మాది.. సాధన మీది..

విద్యార్థి దశలో అత్యంత కీలకమైన ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 'సంకల్ప్-2026' పేరుతో 50 రోజుల ప్రణాళిక అమల్లోకి తెచ్చింది. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి కేర్ టేకర్లను నియమించారు. ప్రత్యేక పరీక్షల నిర్వహణతో ఉత్తీర్ణులయ్యే విధంగా తీర్చిదిద్దుతున్నారు. నవంబరు 24 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు సంకల్ప్ కార్యక్రమం అమలుకు చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

- ఇంటర్ విద్యార్థులకు 50 రోజుల ప్రణాళిక

మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు-14, ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాలలు- 9, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ కాలేజీలు-5, మోడల్ స్కూల్స్-4, ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ కళాశాలలు 34 ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ ఏడాదిలో 18 వేల మంది వరకు విద్యార్థులున్నారు. జిల్లావ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం బాగున్నా.. కొన్ని జూనియర్ కళాశాలల్లో వెనుకబాటులో ఉన్నారు. వృత్తివిద్యా కోర్సుల్లో గత ఏడాది రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ముందుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

ఏం చేస్తారంటే..?

- జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి రోజు ఉదయం 9.10 నుంచి మధ్యాహ్నం 12.40 గంటల వరకు అపరిష్కృతంగా ఉన్న పాఠ్యంశాలు బోధిస్తారు.
- మధ్యాహ్నం 1.20 నుంచి 5 గంటల వరకు రివిజన్, ఇతర పరీక్షలు నిర్వహిస్తారు.
- ఈనెల 15 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.
- 22 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.
- విద్యార్థులు చూపుతున్న ప్రతిభ ఆధారంగా ఏ, బీ, సీ గ్రేడ్లుగా విభజిస్తారు. సీ గ్రేడు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు వస్తున్నాయో పరిశీలించి.. వాటిలో ఎక్కువ సాధించేలా కృషి చేస్తారు.

చర్యలు తీసుకున్నాం.. బోర్డు ఆదేశాల మేరకు సంకల్ప్ అమలుకు అన్ని చర్యలు తీసుకున్నాం. సూచనలను అమలు చేస్తూ శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఇది వెనుకబడిన విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు తోడ్పడుతుంది. – నాగేశ్వరరావు, డీఐఈవో, పార్వతీపురం

గొట్టాలతో పెద్దగెడ్డ జలాల పంపిణీ

- సాధ్యాసాధ్యాలు పరిశీలించిన బృందం

ముందస్తు పరిశీలనలో ఇంజినీరింగు అధికారులు

పార్వతీపురం, పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలం పెద్దగెడ్డ జలాశయ పథకం నుంచి సాగునీరు పంపిణీ వ్యవస్థను కాలువల నుంచి కాకుండా మొత్తం గొట్టాలతో నడిపించేందుకు వీలుగా జలవనరులశాఖ ప్రత్యేక ప్రతిపాదనలు రూపొందించింది. ఎంకేడ్ పథకం కింద రూ.72 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను పథక పర్యవేక్షణ విభాగానికి చెందిన ఇంజినీరింగు అధికారుల బృంద సభ్యులు జలవనరులశాఖ ముఖ్య ఇంజినీరు స్వర్ణకుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు యస్టినా, అప్పారావు, ఈఈ విజయానంద్, నిర్వహణ బాధ్యతలు తీసుకోనున్న భోపాల్‌కు చెందిన మహానా సంస్థ ప్రతినిధి విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆయకట్టు అభివృద్ధి విభాగం (కాడా) ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో స్థితిగతులను బృందం పరిశీలించింది. పార్వతీపురం జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజినీరు డీఎస్ ప్రదీప్‌కుమార్, పెద్దగెడ్డ సాంకేతిక సిబ్బంది ఉన్నారు.

రాయిరాయి పేర్చారు.. రత్నాల బావి నిర్మించారు..

సిద్ధమైన నుయ్యి

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కుంతేసు పంచాయతీ గిరిశిఖర గ్రామం బద్దిడి. ఇక్కడ 35 గిరిజన కుటుంబాలు పోడు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. దాహార్తి తీర్చుకునేందుకు ఊట నీరే ఆధారం. తాగునీటి పథకం ఏర్పాటు చేయాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అది సాధ్యం కాలేదు. చివరికి గ్రామస్థులే చేయిచేయి కలిపారు. దగ్గరలో ఉన్న రాయిరాప్ప సేకరించుకున్నారు. అవసరమైన సిమెంటు కొనుగోలు చేశారు. 20 రోజులపాటు శ్రమించి 38 అడుగుల మేర తవ్వి, నుయ్యి నిర్మించుకున్నారు. దానికి మోటారు ఏర్పాటు చేయాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అందించారు. పంచాయతీ నిధులు రూ.2.50 లక్షలతో మోటారుతోపాటు కుళాయిలు ఏర్పాటు చేసి, మంచి నీరు ఇళ్లకు చేరేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమేష్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, కొమరాడ

తవ్వకం పనుల్లో గిరిజనులు

(c) eenadu

ఆడారు.. పాడారు..
అదరగొట్టారు!

సినీ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న ఆరోతరగతి విద్యార్థినుల నాటిక ప్రదర్శన

పాటలతో అలరించారు.. నృత్యాలతో చిందులేశారు.. ఆటలతో సందడి చేశారు.. రోజంతా ఉత్సాహంగా గడిపారు.. సాలూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు వనమహోత్సవంలో ఆటపాటలతో అదరగొట్టారు. మంగళవారం పట్టణంలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటైన కార్యక్రమంలో వీరంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు తల్లిదండ్రులపై గౌరవం పెంపొందించేలా విద్యార్థులు అక్షర, అక్షయ, ఆనందిత, శ్రావ్యలు ప్రదర్శించిన కనువిప్పు నాటిక ఆలోచింపజేసింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ పెంటయ్యను ప్రిన్సిపల్ మహాలక్ష్మి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సత్కరించారు.
– న్యూస్‌టుడే, సాలూరు

పైన శ్రీకాకుళం.. దిగువ మన్యం!!

భామిని, న్యూస్‌టుడే: పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లా భామిని ప్రాంతం పార్వతీపురం మన్యం జిల్లాలో చేరింది. ఇది జరిగి మూడేళ్లు దాటినా ఆదర్శ పాఠశాల భవనంపైన మాత్రం ఇంకా పాత జిల్లా పేరే దర్శనమిస్తోంది. తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు మెగా సమావేశానికి సంబంధించి ఈ నెల 5న సీఎం చంద్రబాబు ఈ పాఠశాలనే సందర్శించనున్నారు. దీంతో పాఠశాలకు రంగులు వేయడంతో ఈ విషయం బయటపడింది.

అగాధం.. చూడకుంటే ప్రమాదం!

మక్కువ మండలం మార్కొండపుట్టి నుంచి గైశీల, నంద గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో చిట్టి గెడ్డపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డపై నిర్మించిన వంతెన అడుగు భాగం కొట్టుకుపోయి అగాధంలా మారింది. స్థానికులు రాళ్లు, మట్టి వేసి కప్పే ప్రయత్నం చేసినా కోతకు గురవుతోంది. పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలకు ఈ దారే ఆధారం. ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లేందుకూ వీల్లేకుండా పోయింది. ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులు పంటను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ జేఈ విజయ్‌కుమార్ వద్ద మాట్లాడగా గుత్తేదారుడితో మాట్లాడి రోడ్డు బాగుచేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, మక్కువ

సహస్ర కలశాభిషేకం

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో మహారుద్రయాగం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం మాల ధరించిన భక్తులు పంచముఖేశ్వరునికి అభిషేకాలు చేశారు. అనంతరం పార్థివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బరువులెత్తేస్తా.. పతకాలు పట్టేస్తా!

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్న పల్లవి

న్యూస్‌టుడే, నెల్లిమర్ల

ఆమె ఏ పోటీకి వెళ్లినా పతకంతో తిరిగొస్తుంది.. ఏ టోర్నీలో అడుగు పెట్టినా ఛాంపియన్‌గా నిలుస్తుంది.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి.. పతకాలను కొల్లగొడుతోంది. దేశ విదేశాల్లో కొండవెలగాడ గుర్తింపు తీసుకొస్తోంది గ్రామానికి చెందిన క్రీడాకారిణి శనపతి పల్లవి. అయిదు రోజుల కిందట రాజస్థాన్‌లో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించింది.

ఇవీ సాధించిన విజయాలు..

2020లో గువాహటిలో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీల్లో కాంస్యం, 2021లో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి యూత్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, అదే ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించింది. 2022 హరియాణా, ఉజ్బెకిస్థాన్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్, ఏషియన్ జూనియర్స్ పోటీల్లో స్వర్ణాలు సాధించింది. ఇటీవల మహిళా విభాగంలో జాతీయస్థాయి అంతర విశ్వవిద్యాలయాల ఖేలో ఇండియా పోటీల్లో 69 కిలోల విభాగంలో స్నాచ్ 90 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 110 కిలోలు కలిపి 200 కిలోలు బరువులెత్తి బంగారు పతకం కైవసం చేసుకుంది. కామన్వెల్త్ పోటీల్లో పతకమే లక్ష్యంగా నిరంతరం సాధన చేస్తున్నట్లు ఆమె చెబుతోంది.

కొండవెలగాడ.. ఈ పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకు వచ్చేది వెయిట్ లిఫ్టింగ్ క్రీడే. గ్రామంలో ఎందరో క్రీడాకారులు వివిధ వేదికలపై ప్రతిభ చూపుతుండటం, వారి ఆట చూస్తుండటంతో పల్లవికి చిన్నతనం నుంచి క్రీడపై ఆసక్తి పెరిగింది. వ్యవసాయ కూలీలుగా పనిచేసే తండ్రి లక్ష్మణనాయుడు, తల్లి నాగమణి కుమార్తె ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించారు. సొంతంగా సాధన చేస్తూ.. శిక్షకుల చల్లా రాము నుంచి క్రీడలో మెలకువలను తెలుసుకుని పతకాల పంట పండిస్తోంది. అంతర్జాతీయ వేదికల్లోనూ సత్తా చాటింది. ప్రస్తుతం విజయనగరంలో బొత్స గురునాయుడు డిగ్రీ కళాశాలలో చదువుతోంది.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాలకు గడువుపెంపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు. మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్‌లో ఈ నెల ఆరోతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో రూ.600 అపరాధ రుసుము చెల్లించాలని.తెలిపారు. పాత సిలబస్‌లో పదోతరగతి పరీక్ష రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.300 చెల్లించి ప్రవేశం పొందవచ్చని సూచించారు.

ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ.. ప్రోత్సాహం అందిస్తూ

న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందిస్తూ, ప్రోత్సహిస్తూ.. వారి భవిష్యత్తుకు బాట చూపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వివిధ ఉపకరణాలు, రుణాలు అందిస్తున్నా.. స్వయం ఉపాధి కల్పిస్తూ.. సమాజంలో గౌరవం, గుర్తింపు దక్కేలా చేస్తున్నాయి. జిల్లాలో 72 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 39 వేల మందికి ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లు అందజేస్తోంది. వివిధ ఉపకరణాలు, విద్యావంతులకు చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, మూడు చక్రాల పెట్రోల్ వాహనాలు, సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, చెవిటి మిషన్లు, చంక కర్రలు ఉచితంగా అందజేస్తున్నారు.

వివిధ పథకాలతో దివ్యాంగులకు ప్రభుత్వాల చేయూత

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందిస్తున్న ఆ శాఖ ఉద్యోగి

ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు.. ★ ఈ ఏడాది నియోజకవర్గానికి 10 చొప్పున ఒక్కొక్కటి రూ.1.35 లక్షల విలువైన మూడు చక్రాల పెట్రోలు వాహనాలు 70 అందజేశారు. ★ మూడు చక్రాలు కలిగిన సైకిళ్లు ఈ ఏడాది 10 వరకు అందజేశారు. అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ★ విద్యావంతులైన 30 మంది బధిరులకు ఒక్కొక్కరికీ రూ.15వేలు విలువైన చరవాణులను అందజేశారు. ★ గ్రాడ్యుయేట్, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న 29 మందికి రూ.45వేలు విలువ గల ల్యాప్‌టాప్‌లను అందించారు. ★ వినికిడి సమస్య ఉన్న 50 మంది వృద్ధులు, ఇతరులకు చెవిటి మిషన్లను అందజేశారు. ★ నడవ లేని 30 మందికి రూ.9వేలు గల వీల్‌ఛైర్స్ అందించారు. కాలు లేని వారికి రూ.1500 విలువజేసే చంక కర్రలు ఇస్తున్నారు.

రుణాలు..

దివ్యాంగులు ఒకరిపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించింది. 6 శాతం వడ్డీతో ఎంపిక చేసుకున్న యూనిట్ ఖరీదుకు అనుగుణంగా రూ.50 వేలు నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో కుటీర పరిశ్రమలు, పశువులు, కోళ్ల పెంపకం, కిరాణా దుకాణం, జెరాక్స్ మెషిన్, టెంట్ హౌస్ తదితర వాటికి 21 మందికి గానూ రూ.68 లక్షలు అందించింది.

యూడీఐడీ కార్డు...

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లాగే దివ్యాంగులకు యూడీఐడీ గుర్తింపు కార్డు అందజేస్తోంది. ప్రతి దివ్యాంగునికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందిస్తోంది. వైకల్యం ఆధారంగా పథకాల లబ్ధి పొందడానికి ఈ కార్డులను వినియోగించవచ్చు. వీటి ద్వారా బాధితులకు గుర్తింపు వస్తుంది. పాత ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు వెంట తీసుకెళ్లే అవసరం లేదు. దేశంలో ఎక్కడికెళ్లినా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలో 30 వేల కార్డులు అందజేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి నేరుగా వారి ఇళ్లకే కార్డు చేరుతుంది.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా జేఎన్‌టీయూ

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ ప్రాంగణంలో ప్లాస్టిక్ రహితంగా క్యాంపస్ ఉండాలని వైస్ ఛాన్సలర్ వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ విద్యార్థులకు సూచించారు. పెరుగుతున్న కాలుష్య సమస్యలను ఎదుర్కోవడంలో యువ ఇంజినీర్ల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విశ్వవిద్యాలయంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు పలు చర్యలను ప్రకటించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు, ఆచార్యులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

మెట్టపల్లిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం

రక్త నమూనాల సేకరణ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామాన్ని జిల్లా వైద్యశాఖ ర్యాపిడ్ రెస్పాన్స్ టీం మంగళవారం సందర్శించింది. స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మృతి చెందిన మహిళ ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తామని బృంద సభ్యులు ఆచార్య శరత్ నాయక్, వినోద్ లాల్వాని, శ్రావణి, డీఎస్‌వో సత్యనారాయణ తెలిపారు.

రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ జంబోరిలో ప్రతిభ

కొత్తవలస, విజయనగరం విద్యావిభాగం: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో గతనెల 23 నుంచి 29 వరకు జరిగిన భారత స్కౌట్స్, గైడ్స్ 19వ జాతీయ జంబోరి డైమండ్ జూబ్లీ గ్రాండ్ ఫినాలేలో కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల 8 మంది స్కౌట్స్, 18 మంది గైడ్స్ ప్రతిభ చూపారు. తొమ్మిది విభాగాల్లో ఉత్తమ గ్రేడ్‌లు సాధించారని మంగళవారం జిల్లాకు చేరుకున్న వీరిని డీఈవో మాణిక్యంనాయుడు సత్కరించి అభినందించారని గైడ్స్ కాంటింజెంట్ లీడర్, జిల్లా ట్రైనింగ్ మిషనర్, పీడీ ఎ.కనకలక్ష్మి చెప్పారు. కవాతు, రంగోలి, క్యాంప్ క్రాఫ్ట్, స్టేజ్ గేట్, బ్యాండ్, కలర్ పార్టీ, పేజెంట్ షో, అడ్వెంచర్ కార్యకలాపాలు, ఫిజికల్ డిస్‌ప్లే, మేధో వికాసం విభాగాల్లో పాల్గొన్నారని, తొమ్మిది విభాగాల్లో గ్రేడ్‌లు వచ్చాయన్నారు.

డీఈవో మాణిక్యంనాయుడుతో విద్యార్థులు

ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

మృతుడు తలపై గాయాలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: బుక్కూరు గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద మృతి కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విఠల్(45)కు కరుణతో మూడు నెలల కిందట వివాహమైంది. ఆమె శ్రీకాకుళంలోని పుట్టింటికి వెళ్లారు. సోమవారం రాత్రి విఠల్ ఒక గదిలో.. ఆయన తల్లిదండ్రులు వేరే గదిలో నిద్రించారు. మంగళవారం ఉదయం కుమారుడు విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించినట్లు తండ్రి రామయ్య పోలీసులకు చెప్పారు. విషయం తెలియడంతో శ్రీకాకుళం నుంచి వచ్చిన భార్య.. మృతుడి తలపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విఠల్ పాలకొండ డిపోలో డ్రైవర్.

కుటుంబ సభ్యుడే హంతకుడా?

విఠల్‌కు మద్యం అలవాటు ఉంది. సోమవారం రాత్రి మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో ఘర్షణ జరిగినట్లు భోగట్టా. దీంతో కుటుంబ సభ్యుడే పదునైన ఆయుధంతో దాడిచేసినట్లు తెలుస్తోంది. తీవ్రగాయాలతో రక్తస్రావం కావడం గుర్తించి అనుమానంతో ఆయన భార్య పోలీసులను ఆశ్రయించారు. సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనుమానమున్న పలువురిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

వ్యాన్, లారీ ఢీ: ఒకరి దుర్మరణం

దత్తిరాజేరు: రెండు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మర్రివలస కూడలి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న బొలెరో వ్యాన్, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న డ్రైవరు, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా డ్రైవరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. మృతుని వద్ద చిరునామాకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఒడిశా రాష్ట్రం జయపురానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘటనా స్థలంలో నుజ్జయిన వ్యాన్

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాల ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. తమ దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మంది స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన దేశరి సౌజన్య ఉన్నారు. అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజరుగా ఆదిలక్ష్మి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 3 నుంచి ఏడో తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ నేషనల్ టోర్నమెంట్‌కు రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజరుగా విజయనగరం నగరపాలక సంస్థ కస్పా ఉన్నత పాఠశాల పీడీ పి.ఆదిలక్ష్మిని ఎంపిక చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయిని విశాలక్ష్మి, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

అయ్యన్నపేట: వాహనాలను సక్రమంగా నడుపుతూ.. ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చి.. భవిష్యత్తులో మంచి చోదకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలలో హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. ఆందోళన పడకుండా ఏకాగ్రతతో వాహనాలను నడపాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణాధికారిణి జి.వరలక్ష్మి, డీఎం శ్రీనివాసరావు, శిక్షకుడు రాజు పాల్గొన్నారు.

చోదకులు, అధికారులతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

అమ్మా.. నాన్నా.. మీరాకే మాకు కానుక!

న్యూస్‌టుడే– కొత్తవలస, రాజాం

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సరికొత్త వేడుకకు సిద్ధమవుతున్నాయి. పాఠశాలల్లో పండగను తలపించేలా మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(మెగా పీటీఎం)3.0 డిసెంబరు 5న నిర్వహించాలని నిర్ణయించారు. పిల్లలు సృజనాత్మకతతో తీర్చిదిద్దిన ఆహ్వాన ప్రతులను తల్లిదండ్రులకు అందించి వేడుకకు ఆహ్వానించనున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫాంలో పాఠశాల తరపున ఆహ్వానాలు పంపుతున్నారు. 1.50 లక్షల మంది తల్లిదండ్రులు, మరో 50వేల మంది అతిథులు ఇందులో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు.

ఇవీ ప్రయోజనాలు..

● ప్రభుత్వ పాఠశాలల్లో సుహృద్భావ వాతావరణం ఏర్పాటు ● దాతల సాయంతో బడుల అభివృద్ధి ● పిల్లల చదువు, నైపుణ్యాలు, ఇష్టాలు గుర్తింపు ● నడవడిక అంచనా ● భవిష్యత్తు అవకాశాలపై అవగాహన ● పిల్లలు సన్మార్గంలో నడిచేలా దిశానిర్దేశం

ఇదీ పరిస్థితి..

● ప్రాథమిక పాఠశాలలు:1452, ప్రాథమికోన్నత పాఠశాలలు:319, ఉన్నత పాఠశాలలు: 464, ● కళాశాలలు: 67, ● విద్యార్థుల సంఖ్య: 2,24,051

క్రీడా పోటీలు... ఈ కార్యక్రమం ఉదయం 9గంటలకు మొదలై 12.45కు ముగిసేలా షెడ్యూలు ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చిస్తారు. బడులను అందంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు ప్రగతి నివేదికలు, ఆరోగ్యకార్డులు ఇస్తారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.



సమావేశం ఎలా నిర్వహించాలో తెలియజేస్తూ ప్రభుత్వం రూపొందించిన గోడపత్రిక

మార్గదర్శకాలిలా

5న విద్యాలయాల్లో ఎంపీటీఎం సమావేశాలు

విద్యార్థులంతా యూనిఫాం, బెల్ట్, సాక్సులు, బూట్లు విధిగా ధరించి హాజరుకావాలి. ప్రధానోపాధ్యాయులు సమకూర్చిన కార్డులు, పెయింట్లు, కలర్ పెన్సిల్, స్కెచ్‌పెన్నులతో విద్యార్థులు నమూనా ఆహ్వాన ప్రతులు తయారుచేస్తారు. తల్లిదండ్రుల్ని విద్యార్థులే ఆహ్వానించాలి. గుర్తించిన దాతలు, విద్యాంజలి వాలంటీర్లు, పూర్వ విద్యార్థులకు ఎస్ఎంసీ సభ్యులు ప్రతులను అందిస్తారు. నిర్వహణ ఖర్చులు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్, మెగా పీటీఎం 3.0 కోసం ప్రత్యేకంగా విడుదల చేసే బడ్జెట్‌ను వినియోగించాలి.

పక్కాగా ఏర్పాట్లు.. మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను 5న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతుంది. ప్రతిభను ప్రోత్సహించేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు, ఉత్తీర్ణతను పెంచేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయి.
–యు.మాణిక్యంనాయుడు, డీఈవో

EENADU Classifieds

HEALTH & CARE

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనున్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ బి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255
9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే
ప్రతి ఆదివారం శెలవు

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
I, undersigned KOTTURU SAMBAMMURTY SANYASI RAJU (Old Name) S/o Kotturu Ramakrishna, Plot No: 48, Kusuma Gajapathi Nagar, Cantonment, Vizianagaram-535003, Andhra Pradesh, changing my name from KOTTURU SAMBAMMURTY SANYASI RAJU to KOTTURU SAMBAMURTHY SANYASI RAJU (New Name), shall henceforth be called KOTTURU SAMBAMURTHY SANYASI RAJU (New Name) for all purposes.

PROFESSIONAL SERVICES

ASTROLOGY
Vastu Consultants Genuine India's Best Vastu for Industries / Houses Rural / Urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

FLAT FOR SALE
2BHK Flat 2nd Floor at UDA Colony, Paul Nagar, 7th Lane, Near Muchalamma Gudi, Vizianagaram. Contact: 9778527106.

PLOT FOR SALE
శ్రీ శ్రీనివాస రిసార్ట్స్ మరుపల్లి, గజపతినగరంలో 1000 గ॥, 500 గ॥, 200 గ॥ అమ్మకమునకు కలవు. గజం 4000/- ✆ 8179213275.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

JOBS

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్ M/F (200) కావలెను. జీ॥ 18-40K + Inc. ✆ 9804454445, 9989360902.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 9704146558.

ప్రముఖ కంపెనీ VZM బ్రాంచ్‌లో పనిచేయుటకు * మార్కెటింగ్ టెలికాలర్స్ స్త్రీ/పు * బ్రాంచ్ ఇన్‌ఛార్జ్ కావలెను. వసతి + భోజనం + మంచి జీతం & ఇన్సెంటివ్ కలదు. 9896939399.

FACULTY/ TEACHERS

VZM జిల్లాలో మండలాల వారీగా కొత్తగా ప్రారంభిస్తున్న The ABC Bridge ప్లేస్కూల్‌లో పనిచేయుటకు B.Ed, డైట్‌చేసిన యువతులు కావలెను ✆ 8639457893.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నమ్మండి.. ఇది తారురోడ్డే!

బలిజిపేట మండలంలోని గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారుతున్నాయి. ప్రధాన రహదారి కంటే మురుగు కాలువలు ఎత్తులో ఉండటంతో నీరు నిల్వ ఉంటోంది. దీంతో గోతులు ఏర్పడి, పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. వంతరాం నుంచి గళావల్లి వరకు రూ.33 లక్షలతో 15 ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా రూపుకోల్పోయింది. మరమ్మతులు చేయిస్తామని ర.భ.శాఖ జేఈ నాగభూషణరావు చెప్పారు. - న్యూస్‌టుడే, బలిజిపేట

ఆహ్లాదం చెంత అపరిశుభ్రత

పాలకొండ పట్టణంలో ఆహ్లాదం పంచాల్సిన ప్రాంతాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. విశాలమైన వెంకటరాయుడు కోనేరు గట్టుపై ఉదయం, సాయంత్రం చాలా మంది నడకకు వస్తుంటారు. పలువురు చెత్త, ఇతర వ్యర్థాలు ఇక్కడ పారబోస్తుండడంతో అపరిశుభ్రతకు నెలవుగా మారింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో కొందరు ఇటువైపు రావడమే మానేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి శుభ్రం చేయిస్తామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

కాలువ దాటాలంటే చెక్కలే దిక్కు

మక్కువ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో కాలువలపై పలకలు ఏర్పాటు చేయక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దుకాణాలు, ఇళ్లకు చేరేందుకు మార్గం లేక పలువురు ఇలా చెక్కలను ఏర్పాటు చేసుకున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించడంతో నాలుగు నెలల కిందట తాత్కాలిక కాలువలను ఈవో బి.శ్రీనివాస్ తవ్వించారు. తర్వాత అలాగే వదిలేశారు. కాలు జారితే బురదలో పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మక్కువ

ఇటు ప్రయాణం నరకం

కురుపాం మండలం ఉదయపురం పంచాయతీ కాకితాడకు వెళ్లే రోడ్డు తీరిది. రెండు కి.మీ మేర ఎక్కడికక్కడ రాళ్లు తేలడంతో చోదకుల రాకపోకలకు తీవ్ర అడ్డంకిగా మారుతోంది. అవస్థలు పడుతున్నామని, గతంలో ఉన్న ఆర్టీసీ సర్వీసును నిలిపేశారని స్థానికులు వాపోతున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు మంజూరైతే రోడ్డు బాగు చేస్తామని ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారి ఎస్.అప్పారావు తెలిపారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

సీఎం వస్తేనే శుభ్రం చేస్తారా?

మండల కేంద్రమైన భామిని ఆర్టీసీ కాంప్లెక్స్ ముందు భాగం పనికిరాని మొక్కలు, చెత్తతో డంపింగ్‌యార్డులా ఉండేది. ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బంది పడేవారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈ నెల 5న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు హడావిడిగా యంత్రాలు పెట్టి ఆర్టీసీ కాంప్లెక్స్ ముందుభాగం శుభ్రం చేయడం గమనార్హం. - న్యూస్‌టుడే, భామిని

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: జిల్లేడుపాడు కూడలిలోని విశ్రాంతి భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని విధంగా ఉంది. - **స్థానికులు** ❖ పంచాయతీ కార్యదర్శికి తెలియజేస్తాం. - **బి.బి.మిశ్ర, ఎంపీడీవో** - న్యూస్‌టుడే, సీతంపేట

?: పాలకొండ ప్రధాన రహదారిలో కాలువలు పూడికతో నిండిపోయాయి. - **కె.రమణ, ఉద్యోగి** ❖ పూడిక తొలగిస్తాం. - **రత్నరాజ్, కమిషనర్** - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: తాళ్లబురిడి పాత పాఠశాల భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. దీని చుట్టూ వీధి వాసులు చెత్త పడేస్తున్నారు. - **ప్రసాదు, తాళ్లబురిడి** ❖ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **పాపారావు, ఉప ఎంపీడీవో** - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

?: ఏగోటివలస గ్రామ కాలువలు మురుగుతో నిండిపోవడంతో రహదారిపై ప్రవహిస్తోంది. - **అప్పలస్వామి, స్థానికుడు** ❖ పూడికతీత పనులు చేపడతాం. - **రాధాకృష్ణ, సర్పంచి** - న్యూస్‌టుడే, సీతానగరం

ఏం తినాలి.. ఇంకెన్నేళ్లిలా బతకాలి?

వేతనాలందక వసతి గృహ సిబ్బంది వేదన

డోలీలో రాళ్లూరప్పలు.. కొండలు.. గుట్టలు దాటి ఆసుపత్రులకు చేరే గిరిశిఖర గ్రామ మహిళలు పడే ప్రసవ వేదన మాటల్లో చెప్పలేనిది. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు వదిలిన వారు చాలా మందే ఉన్నారు. ఇలాంటి తరుణంలో కాబోయే అమ్మకు కష్టం రాకూడదని 2018లో తెదేపా ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా గిరిజన గర్భిణుల వసతిగృహాలు ఏర్పాటు చేసింది. మెరుగైన సేవలందించడంతో సత్ఫలితాలు సాధించింది. కానీ అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బందికి మాత్రం కష్టాలు తప్పటం లేదు. ఐటీడీఏ నుంచి రావాల్సిన 41 నెలల జీతాలు చెల్లించకపోవడంతో కంటతడి పెడుతున్నారు. - న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

జాతీయస్థాయిలో ప్రశంసలు పొందినా..

మన్యం జిల్లాలోని సాలూరు, గుమ్మలక్ష్మీపురం గర్భిణుల వసతి గృహాల్లో ఇరవై నాలుగు మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరు రోజూ వైద్య పరీక్షలు, రక్తహీనత, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మాతృ మరణాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. సేవలను గుర్తించి అప్పట్లో రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రి, నీతి ఆయోగ్ కమిటీ సభ్యులు జాతీయ పురస్కారం అందజేశారు. సిబ్బంది సేవలను ప్రశంసించారు. కానీ వీరికి సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నెలల కిందట సిబ్బంది సేవలను నిలిపేస్తున్నట్లు అధికారులు చెప్పినా.. ఆపై వారినే కొనసాగించారు. తమ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

అప్పులు చేస్తున్నాం

ఏళ్లుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నాం. కుటుంబ పోషణకు అప్పులు చేసి, వడ్డీల భారం మోయాల్సి వస్తోంది. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించాలి. - ఓ వసతి గృహ ఉద్యోగి

బడ్జెట్‌లో కేటాయిస్తాం

గత ప్రభుత్వంలో, ఇప్పుడు వసతి గృహ సిబ్బందికి రావాల్సిన జీతాలను పరిశీలిస్తాం. బకాయిలు ఉంటే అధికారులతో మాట్లాడి, బడ్జెట్‌లో కేటాయించి వారికి చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. - జి.సంధ్యారాణి, గిరిజన శాఖ మంత్రి

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి

సాలూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని మంత్రి సంధ్యారాణి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధిని వివరించారు. చిట్టి, వేణు, యుగంధర్, పరమేశు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఎం.రమణమ్మకు రూ.60 వేలు, ఆర్.లక్ష్మణరావు-రూ.68,500, వి.రామకృష్ణ-రూ.1.30 లక్షలు, బి.జాహ్నవి-రూ.26,772, పి.రవితేజ-రూ.1.38 లక్షలు, కె.అనిల్ కుమార్-రూ.లక్ష, సీహెచ్.లక్ష్మి-రూ.57,586, టి.ఈశ్వరరావుకు రూ.41,084 విలువైన చెక్కులు అందజేశారు.

కూటమి పాలనలో రహదారులకు మోక్షం

రిబ్బను కత్తిరించి రహదారిని ప్రారంభిస్తున్న విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రభుత్వ విప్ టి.జగదీశ్వరి అన్నారు. రెల్ల నుంచి కొత్తవలస వరకు రూ.1.45 కోట్లతో నిర్మించిన రహదారిని మంగళవారం ప్రారంభించారు. గత పాలకులు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోలేదని విమర్శించారు. తాము అధికారం చేపట్టిన వెంటనే రూ.కోట్ల వ్యయంతో కొండలపై ఉన్న గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించి, ప్రతి గ్రామానికి అంబులెన్సు వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యుడు మల్లేశ్వరరావు, నరేష్, భూషణరావు, డీఈఈ చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాసం ఇచ్చారు.. బహుమతి పొందారు

పార్వతీపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ పి.అప్పారావు, డీన్ రమణబాబు

ఉపన్యసిస్తున్న పార్వతీపురం వేదాంత కళాశాల విద్యార్థిని

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. పార్వతీపురం పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎన్.భావన, సీహెచ్ శివగౌరి ప్రియ, ఎన్.పూజిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ పి.అప్పారావు, డీన్ రమణబాబు బహుమతులను అందజేశారు. సాలూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. పి.నిహారిక (10వ తరగతి) ప్రథమ, కె.జ్యోత్స్న (7వ తరగతి) ద్వితీయ, డి.హారిక (8వ తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. హెచ్‌ఎం.జ్యోతి, ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. పాలకొండ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో పి.నవ్య (పదో తరగతి) ప్రథమ, బి.ఝాన్సీలక్ష్మి (తొమ్మిదో తరగతి) ద్వితీయ, కె.చాందిని (తొమ్మిదో తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. హెచ్‌ఎం ఎస్.నిర్మల, ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం, సాలూరు, పాలకొండ

పాలకొండలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

సాలూరులో విజేతలకు బహుమతులు అందించిన హెచ్‌ఎం జ్యోతి

పూర్తి వివరాలతో వినతులు ఇవ్వాలి

అర్జీ స్వీకరిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యలతో వచ్చే వారు అవసరమైన పూర్తి వివరాలు, ధ్రువపత్రాలను జతచేసి ఇవ్వాలని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 12 అర్జీలు స్వీకరించారు. ● ఈనెల 5న నిర్వహిస్తున్న మెగా తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలని పార్వతీపురం జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ నాయుడు, పట్టణ, మండల నాయకులు ఉన్నారు. ● పురపాలక సంఘం 18వ వార్డులో విజయచంద్ర పర్యటించారు. వార్డు, వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా వ్యవహరించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక ఎస్సై సింహాచలం మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. జేకేపాడులో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో పలు విషయాలు వివరించారు. ప్రిన్సిపల్ శ్రీవరం, అధ్యాపకులు ఉన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

సీతంపేట, న్యూస్‌టుడే: మల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలని డిప్యూటీ డీఈవో జి.రామ్మోహనరావు మంగళవారం తనిఖీ చేశారు. వివిధ దస్త్రాలు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ ఆర్.వాసుదేవరావు, డిప్యూటీ డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆరోగ్య సర్వేలు

భామిని, న్యూస్‌టుడే: ఆరోగ్య సర్వేలు పారదర్శకంగా నిర్వహించి వ్యాధి లక్షణాలు స్పష్టంగా గుర్తించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. మంగళవారం భామిని పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో సేవలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామీణ వైద్య సేవలపై సమీక్షించారు. డీడీఎంహెచ్‌వో విజయపార్వతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే సీఐటీయూ అఖిలపక్ష మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ పిలుపునిచ్చారు. గరుగుబిల్లిలో దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డి.వెంకటనాయుడు, అప్పడు, పి.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

నర్సిపురం ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి దివ్యాంగుల పారా ఒలింపిక్ పోటీల్లో విజేతలకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. పరుగు పోటీల్లో కె.ప్రమీల, జి.మణి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. షాట్‌పుట్‌లో సీహెచ్ జాన్, రామ్‌నరేష్, లాంగ్‌జంప్‌లో ఎస్.శివ, పి.రామచంద్ర ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. జావెలిన్ త్రోలో వెంకట సాయి, మనీషా ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, గ్రామీణం

దివ్యాంగ విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్న తల్లులు

అమ్మే బలం.. పరుగులు తీస్తాం

పది రోజులైంది.. ఎవరో తెలియకుంది

ఈ చిత్రంలోని వ్యక్తి పది రోజుల క్రితం పార్వతీపురం రైల్వే స్టేషన్ రోడ్డులో గాయాలతో పడి ఉండటంతో ఎవరో మానవత్వంతో జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. గుర్తు తెలియని వ్యక్తిగా ఆసుపత్రిలో సిబ్బంది నమోదు చేసి చికిత్స అందిస్తున్నారు. గాయాలు కొంతవరకు మానాయి. కానీ ఆయన మాట్లాడటం లేదు. దీంతో ఆసుపత్రి వర్గాలు చిరునామా కనుక్కోలేకపోతున్నారు. స్కానింగ్‌లో తల లోపల గాయాలతో సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కానీ అక్కడికి తీసుకెళ్లే వారు లేక ఆరోగ్యం విషమంగా మారుతోంది. ఆసుపత్రిలో భోజనం ఇస్తున్నా.. సరిగా తినడం లేదు. దీంతో చిక్కిపోతున్నాడు. తమ పరిధి కాదని, పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చామని రైల్వే వారు చెబుతున్నారు. వైద్యం మాత్రమే చేయగలమని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. పోలీసులు చొరవ చూపితే ఓ ప్రాణాన్ని నిలిపిన వారవుతారని చూసిన వారు వ్యాఖ్యానిస్తున్నారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ మురళీధర్ అన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

ఒకే రోజు ముగ్గురిపై కుక్కల దాడి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పార్వతీపురం పట్టణంలో వీధి కుక్కలు భయపెడుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారి వెంటపడుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. మంగళవారం ఒక్క రోజే గంట వ్యవధిలో ముగ్గురిపై దాడి చేయడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తెలుకల వీధికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు టి.లక్ష్మణరావు పోలీసు స్టేషన్ వీధిలో పనికి వెళ్తుండగా ఓ కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. తూర్పువీధికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని ఎం.భాను ప్రియ ఉదయం పాఠశాలకు వెళ్తుండగా దంగుడు వీధి వద్ద కుక్క వెంటపడి గాయపరిచింది. రామాపురం కాలనీకి చెందిన అయిదో తరగతి విద్యార్థి బి.పార్థసారథి ఇదే మార్గంలో వెళ్తుండగా వీధి కుక్క కరిచింది. ఉన్నతాధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటామని కమిషనరు కె.కిషోర్‌కుమార్ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సాలూరుకు చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తానని మంత్రి అనధికార పీఏ ఆర్థికంగా దోచుకొని, లైంగిక వేధింపులకు గురిచేశారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే కుట్రపూరిత ధోరణితో సదరు మహిళ మంత్రి కుమారుడు, పీఏపై అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు ఆధారాలున్నాయని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిందని వచ్చిన ఫిర్యాదు మేరకు సాలూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. రెండు కేసులకు సంబంధించి సాక్ష్యాధారాలతో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని, దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారనేది అవాస్తవమని చెప్పారు.

నేటి నుంచి అవగాహన తరగతులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యులతో 8 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్ చలపతిరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైస్కూల్, ఇంటర్ విద్యార్థులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురం గ్రామీణం/కొమరాడ, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్వహిస్తున్న పులుల గణనలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారిణి జీఏపీ ప్రసూన సూచించారు. మంగళవారం పార్వతీపురం రిజర్వు పరిధిలోని రంగలగూడ, కోనవలస ప్రాంతాల్లో సర్వేను పరిశీలించి, మాట్లాడారు. సర్వేలో ముందుగా సమీప గ్రామాల ప్రజలు, రైతులకు అవగాహన కల్పించాలని, గతంలో పులులు తిరిగిన ప్రాంతాలు, కదలికలు ఉంటే చెబుతారని వివరించారు. రేంజి అధికారి మణికంఠేష్, సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని డిమాండు

పీడీకి వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, పాలకొండ గ్రామీణం, పాచిపెంట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈనెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. పార్వతీపురంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి జ్యోతిలక్ష్మి, ఇందిరా తదితరులు పీడీ కనకదుర్గకు వినతి పత్రాన్ని అందించారు. ● పాలకొండలో అంగన్‌వాడీ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.హిమప్రభ తదితరులు సీడీపీవో పి.రంగలక్ష్మికి సమస్యలు విన్నవించారు. పాచిపెంటలో సిటు ఆధ్వర్యంలో సీడీపీవో అనంతలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సిటు జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

కోటదుర్గమ్మ కరుణించు

రావాడ కూడలిలోని కోటదుర్గమ్మ తల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

ఉపాధి అవకతవకలపై విచారణ

సీతానగరం, న్యూస్‌టుడే: చినంకలాం గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై ఏపీడీ త్రివిక్రమరావు విచారణ చేపట్టారు. స్థానిక రామ మందిరం వద్ద గ్రామ పెద్దలు, వేతనదారుల సమక్షంలో విచారణ జరిపారు. క్షేత్ర సహాయకుడు వలస వెళ్లిన వారి జాబ్‌కార్డులు కొనసాగించడం, ఒకే రేషన్‌కార్డులోని లబ్ధిదారులకు రెండేసి జాబ్‌కార్డుల జారీపై విచారణ జరిపినట్లు ఏపీడీ తెలిపారు. పూర్తి నివేదికను పీడీ రామచంద్రరావుకు సమర్పించనున్నట్లు చెప్పారు. జేఈ సోమేశ్వరరావు, టీఏ శ్రీదేవి, సర్పంచి అప్పలనర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న అధికారులు

గిరిజనులకు రక్షణ కరవు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: తోలుంగూడ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న డోలీ ఘటనపై డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు చేసిన ప్రకటనపై గిరిజనులు మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబరు 28న 'ఈనాడు'లో 'డోలీ మోతలు పట్టించుకోండి సారూ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై డీఎంహెచ్‌వో విచారణ చేయకుండా పీహెచ్‌సీ సిబ్బంది సమాచారంతో.. రోడ్డు సమస్య పరిష్కారానికి డోలీ కట్టారని అనడం తగదన్నారు. గిరిజన గ్రామాల్లో రహదారులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో డోలీ మోయడం తప్ప మరో మార్గం లేదని వాపోయారు. అధికారులు ఏజెన్సీల్లో రోడ్లు, వైద్య సేవలు విస్తృతంగా అందించాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న తోలుంగూడ గ్రామస్థులు

7న హైందవ శంఖారావం

కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రీనివాసరావు, సభ్యులు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ఈనెల 7న హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా మోర్చా అధ్యక్షుల జాబితాను విడుదల చేసి, మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 7న నిర్వహించే కార్యక్రమంలో ధార్మిక, హైందవ సంస్థల సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఆర్.సింహాచలం, మహిళా మోర్చాగా డి.రమణమ్మ, ఎస్సీ మోర్చాగా జి.వెంకటేశ్వర్లు, ఎస్టీ మోర్చాగా వి.హేమానాయక్, కిసాన్ మోర్చాగా జి.శ్రీకాంత్‌ని నియమించినట్లు ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొండ, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం పాలకొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా పైల ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా రమేష్‌కుమార్‌తోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు, శ్రీకాకుళం ఎన్జీవో సంఘ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ కిశోర్, కార్యదర్శులు రంగాచారి, శ్రీను, ఉద్యోగులు ఎన్నికల్లో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా శక్తి బృందం ప్రతినిధి ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెదమరికి, కృష్ణపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. శక్తి యాప్ గురించి వివరించారు. 24 గంటల్లో ఎప్పుడైనా ఆపద వస్తే మహిళలు, పిల్లలు ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే చాలని, పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. హెచ్‌సీ గురుమూర్తి, మహిళా కానిస్టేబుళ్లు నిర్మల, పద్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీపై డేగ కన్ను

గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, న్యూస్‌టుడే: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద అనుమానితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పోలీసు బలగాలు గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధుల భద్రత కట్టుదిట్టం చేస్తున్నారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు కొమరాడ పోలీసు ఠాణా వద్ద ఎస్సై నీలకంఠం ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వారిపై కేసులు నమోదు చేశారు.

తనిఖీ నిర్వహిస్తున్న బలగాలు

(c) eenadu

నాయకుల దొంగ వేషాలు.. అధికారుల మీనమేషాలు..!

▶ ఆక్రమిత ప్రభుత్వ భూముల స్వాధీనానికి వెనుకంజ

'ప్రభుత్వం మారింది. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ, అసైన్డ్, పశువులబీడు భూములను స్వాధీనం చేసుకుంటారని ప్రజలు ఆశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అధికారులు హడావుడి చేశారు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటనలు చేశారు. ఏడాది దాటింది. రెండో ఏడాది కూడా పూర్తికావస్తోంది. ఇంతవరకు ఆక్రమణలపై చర్యల్లేవు. అక్రమార్కులు ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా మార్చి దర్జాగా విక్రయిస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, కనిగిరి

కనిగిరిలో విక్రయాలకు సిద్ధం చేసిన ప్లాట్లు

59.01 ఎకరాల ఆక్రమణ

కనిగిరి పురపాలక సంఘం, మండల పరిధిలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరా రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకు పలుకుతోంది. గత వైకాపా ప్రభుత్వం దిగిపోయేందుకు రెండు మూడు నెలలకు ముందు కనిగిరి-కంభం రోడ్డు, పామూరు రోడ్డు, ఒంగోలు రోడ్డు, గార్లపేట రోడ్డు, నందనమారెళ్ల రోడ్డు, కందుకూరు, బాల వెంకటాపురం, చినఇర్లపాడు, తుమ్మగుంట తదతర ప్రాంతాల్లో వైకాపా నేతలు, కౌన్సిలర్లకు సుమారు 59.01 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, డొంక పోరంబోకు, వాగు పోరంబోకు, రోడ్డు పోరంబోకు, పశువులబీడు భూములు అకమంగా కట్టబెట్టేశారు.

రూ.100 కోట్ల పైమాటే

కొందరు రెవెన్యూ, పురపాలక సంఘం అధికారులు అక్రమార్కులకు వంత పాడడం, నేతలతో చేతులు కలపడంతో యథావిధిగా ప్లాట్ల వ్యాపారం కొనసాగుతోంది. ఆక్రమణదారుల చేతుల్లో రూ.100 కోట్లకుపైగా విలువైన ప్రభుత్వ భూములున్నాయి. అధికారులు మాత్రం మాకెందుకు మాకు కొంత చేయి తడిపితే చాలు అన్నట్లు ఆక్రమణదారులు పెట్టమన్న చోటల్లా సంతకాలు పెట్టి ముడుపులు అందుకుని ప్రభుత్వ భూములను నాయకులకు పప్పుబెల్లాల్లా పంచిపెట్టేశారు.

నిఘా

అంతా హడావుడే

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కూటమి నాయకులు, ప్రజలు కలెక్టర్, జేసి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డీవో, తహసీల్దారు, కమిషనర్ ద్వారా విచారణ జరిపి వాస్తవమేనని తేల్చారు. అధికారికంగా అప్పటి కలెక్టర్. జేసి విచారించి వివిధ రకాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఆక్రమణల జాబితా సైతం విడుదల చేసి వెంటనే స్వాధీనానికి ఆదేశించారు. వైకాపా నేతలు ఆక్రమించి వేసిన ప్లాట్లను కూల్చివేశారు. అనంతరం ఆక్రమిత భూముల స్వాధీనం చేసుకోకపోగా, ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికావడం వాస్తవమే. వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నవారిని గుర్తిస్తాం. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. –జి.కేశవర్ధన్‌రెడ్డి, ఆర్డీవో

రాజధానికి రాచబాట

▶ శరవేగంగా బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణం

వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని విజయవాడ, బెంగళూరుతో అనుసంధానం చేయడంలో 544-జి జాతీయ రహదారి కీలకం కానుంది. జిల్లా పరిధిలో భూసేకరణ పూర్తికావడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఓవైపు ఇదే ప్రాంతంలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం పనులు సాగుతుండగా, ఇప్పుడు కీలకమైన రోడ్డు మార్గం కూడా అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి.

–ఈనాడు, ఒంగోలు

సీఎస్‌పురం వద్ద జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులు

మండలాల వారీగా రహదారి (కి.మీ.లలో)

మండలం	పొడవు
కనిగిరి	26.4
సీఎస్‌పురం	25.8
మర్రిపూడి	20.5
తాళ్లూరు	19.35
వెలిగండ్ల	7.8
చీమకుర్తి	6.7
పొదిలి	4.05

▶ జిల్లాలో సీఎస్‌పురం మండలం కొత్తపల్లి వద్ద నుంచి తాళ్లూరు మండలం మల్లాపురం గ్రామం వరకు 110 కిలోమీటర్ల పొడవున రహదారి నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 50 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. కాలువలపై వంతెనలు, అండర్ పాస్‌లు సంబంధించి కాంక్రీట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. పశ్చిమ ప్రకాశం ప్రాంతం నుంచి ఎక్కువగా బెంగళూరు, రాయలసీమ జిల్లాలకు వలస వెళ్లేవారికి ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఇక్కడ నుంచి రాజధాని అమరావతితో పాటు గుంటూరు, విజయవాడ నగరాలకు ఒంగోలు రావాల్సిన అవసరం లేకుండా అతి తక్కువ సమయంలో నేరుగా చేరుకోవచ్చు.

2,295 ఎకరాల సేకరణ

బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారికి జిల్లా పరిధిలోని ఏడు మండలాల్లోని 42 గ్రామాల పరిధిలో 2,295 ఎకరాల భూమి సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా దాదాపుగా పూర్తికావొచ్చింది. మొత్తం రూ.155 కోట్ల పరిహారానికిగాను ఇప్పటివరకు రూ.127 కోట్ల మేర రైతులకు చెల్లించారు. సీఎస్‌పురం మండలంలోని అటవీ ప్రాంతంలో అర కిలోమీటరు మేర అనుమతులు రావాల్సి ఉంది. విస్తరణలో భాగంగా తాజాగా మరో 47 ఎకరాల సేకరణకు ప్రకటన ఇచ్చారు.

అభివృద్ధికి చోదకం

జాతీయ రహదారి నిర్మాణంతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. రవాణా సౌకర్యం మెరుగైతే అభివృద్ధికి అడుగులు పడతాయి. రానున్న కాలంలో ఇక్కడ నుంచి వలసలను నిరోధించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇబ్బందులు అధిగమించి భూములను సేకరించి అప్పగించాం. – రోణంకి గోపాలకృష్ణ, జేసీ

మొక్కజొన్న పంట చేతికందే అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు రైతులు అతలాకుతలమయ్యారు. దిగుబడులు తగ్గిపోవడంతో నష్టపోయారు. పంటను కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం స్పందించి పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. గతేడాది 4 వేల హెక్టార్లలో సాగు చేయగా, ఈ ఏడాది 7 వేల హెక్టార్లలో సాగైంది. –ఈనాడు, ఒంగోలు

కొనుగోలుకు వేడుకోలు!

▶ రైతుల ఇళ్లల్లోనే సగానికిపైగా మొక్కజొన్న పంట

▶ జిల్లాలో ఈ ఏడాది పంట చేతికొస్తుందనుకునే సమయంలో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు మొక్కజొన్న రైతుల వెన్నువిరిచాయి. దీంతో ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, 25 క్వింటాళ్లకే పరిమితమైంది. జిల్లాలో మొత్తం 1,160 హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతింది. మరోవైపు పంట తడిసిపోవడంతో దళారులు ధర అమాంతం తగ్గించేశారు. తుపానుకు ముందు క్వింటా రూ.2 వేల వరకు కొనుగోలు చేయగా, అనంతరం ధర అంతకంతకు తగ్గించేశారు. దీంతో ఎటుపాలుపోని పరిస్థితుల్లో అప్పులు తీర్చేందుకు కొంత మంది రైతులు పంట అమ్ముకుంటున్నారు. కొందరు రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరుస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

▶ వాస్తవానికి మద్దతు ధర ప్రకారం క్వింటాకు రూ.2,400 అందజేయాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.1,700కు కొంటామని వ్యాపారులు అంటున్నారు. తుపానుతో పంట నష్టపోయామని, మద్దతు ధరకు పంట కొనుగోలు చేస్తే, పెట్టుబడైనా దక్కుతుందని రైతులు వాపోతున్నారు.

ఆదుకుంటాం

జిల్లాలో పౌల్ట్రీ, మెలాసిస్ తయారీదారులకు రోజుకు పదుల టన్నుల్లో మొక్కజొన్న వినియోగం ఉంటుంది. కొనుగోలు చేసే విషయమై వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేయాలని సూచించాం. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. – హరికృష్ణ, డీఎం, మార్క్‌ఫెడ్

కన్నేసి... కాజేసి

▶ రెండున్నర ఎకరాల్లో ఓ మాజీ ప్రజాప్రతినిధి పాగా

న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

యర్రగొండపాలెం సమీపంలోని జాతీయ రహదారి పక్కన మిల్లంపల్లె వద్ద సర్వే సంఖ్య 430-7లో వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. కాలనీలోని ముందు భాగంలో రూ.2 కోట్ల విలువైన రెండున్నర ఎకరాల స్థలంపై అప్పటి ప్రజాప్రతినిధి కన్నేసి ఎటువంటి నిర్మాణాలకు జరగకుండా ఖాళీగా ఉంచేశారు. మరోపక్క ఈ స్థలం విలువ పెంచేందుకు కాలనీ ముందు భాగంలో తన అనుచరులకే స్థలాలు కేటాయించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆ ఖరీదైన స్థలం ఇప్పటికీ అలాగే ఉండడం గమనార్హం.

జగనన్న కాలనీలో రెండున్నర ఎకరాల స్థలమిదే

▶ సుమారు 50.77 ఎకరాల్లో రెండున్నర ఎకరాల స్థలం ఖాళీగా ఉండగా, మిగిలిన స్థలంలో 1,316 మంది లబ్ధిదారులకు రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మరికొంత స్థలాన్ని రహదారులు, ప్రభుత్వ అవసరాలకు కేటాయించారు. అప్పట్లో ప్రజాప్రతినిధి సిఫార్సుల మేరకు పట్టాలు మంజూరు చేయడంతో నిజమైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఫలితంగా లబ్ధిదారుల్లో 600 మంది పట్టాలు రిజిస్టరుకు నోచుకోలేదు. ఒకరికి ఇచ్చిన పట్టాలు మరొకరు అమ్ముకోవడంపాటు, గుడి, బడి, పార్కులకు కేటాయించిన స్థలాలు సైతం మారిపోయాయి. ఇక్కడ ఇప్పటివరకు కేవలం 30 ఇళ్లు మాత్రమే పూర్తికావడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దారు మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ ముందు భాగంలోని ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు.

పదిలమైన ఫలితాలకు పక్కా ప్రణాళిక

▶ ఈ నెల 6 నుంచి వంద రోజుల కార్యాచరణ
▶ రాష్ట్ర కార్యాలయం నుంచి సిబ్బంది కేటాయింపు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళిక రూపొందించింది. పరీక్షల విధానంలో పలు మార్పులు చేసింది. అక్రమాలకు ఆస్కారం లేకుండా ఈసారి రాష్ట్రస్థాయి సిబ్బంది నియామకాలు చేపట్టనుంది. పరీక్ష కేంద్రాల్లో పనిచేసే ఇన్విజిలేటర్లు, చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల నియామకాలు, మూల్యాంకం విధుల కేటాయింపు కమిషనర్ కార్యాలయం నుంచే జరపనుంది. వినూత్నంగా ఈ సారి గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సేవలు వినియోగించు కోనుంది. ఇందుకోసం మొత్తం సిబ్బందిలో 30 శాతం మందిని నియమించనుంది. మంగళవారం విద్యాశాఖ కమిషనర్ నిర్వహించిన వెబ్ సమావేశంలో ఈ నెల 5న జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం, పదోతరగతి పరీక్షల నిర్వహణపై కొన్ని ఆదేశాలిచ్చారు.

జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు: 29,096 మంది

అధికారులు ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలు: 171

వచ్చే ఏడాది మార్చి 15 వరకు

పదోతరగతి విద్యార్థుల కోసం విద్యాశాఖ వంద రోజల ప్రణాళికను ఈ నెల 6వ తేదీ నుంచి అమలు చేయనుంది. వచ్చే ఏడాది మార్చి 16 నుంచి పరీక్షలు మొదలు కానున్నందున 15వ తేదీ వరకు ప్రణాళిక అమలు చేయనుంది. ఉన్నత పాఠశాలల సమయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాగా, పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్టడీ అవర్, రోజువారి స్లిప్ టెస్టులు నిర్వహించనుంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలను బట్టి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఏడీసీడీ గ్రేడ్లుగా విభజించింది. వీరిలో సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది.

ఇరుక్కుపోయారు

తరగతి గదిలో కనిపిస్తున్నవారు మార్కాపురం మండలం పెద్దనాగులవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయినులు. ఇక్కడ గత కొంతకాలంగా తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఒక్క గదిలోనే ప్రధానోపాధ్యాయుల కార్యాలయం, సిబ్బంది విశ్రాంతి గది, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించే బియ్యం, సరకులు, కోడిగుడ్లు తదితర వస్తువులు భద్రపరచడంతోపాటు విద్యార్థుల తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం. పదుల సంఖ్యలో పిల్లలు ఒకే గదిలో ఇలా కిక్కిరిసి కూర్చోవడంతో బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ విషయమై ఎంఈవో శార్వాణి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలకు నూతన భవనాలు నిర్మించారని, త్వరలోనే ఉన్నత పాఠశాలను అక్కడకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రూ.53.79 లక్షల మంజూరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 5న మూడో విడత మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరగనుంది. ఇందు కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. పాఠశాలల్లో పండగ వాతావరణంలో ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. జిల్లాలో 2,409 ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశం నిర్వహణకు మొత్తం రూ.53,79,750 విడుదల చేశారు.

రంధ్రం... జరభద్రం

చిత్రంలో కనిపిస్తోంది ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం ముందున్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. గర్భిణులు, బాలింతలు, వైద్య విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదం తప్పదు. –ఈనాడు, ఒంగోలు

మండలం ఇక్కడ... పోలీసుస్టేషన్ అక్కడ!

▶ ఇదీ జిల్లాలో వివిధ గ్రామాల పరిస్థితి

జిల్లాలోని కొన్ని మండలాల్లోని గ్రామాల్లో ఏదైనా నేరం జరిగితే మరో మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లాల్సిందే. ఆయా మండల కేంద్రాలకు నిమిషాల వ్యవధిలోనే వెళ్లగలిగే ప్రజలు పోలీసుస్టేషన్‌కు వెళ్లాలంటే మాత్రం వ్యయప్రయాసలకు గురికావాల్సిందే. తమ గ్రామాలను తమ మండల పరిధిలోని పోలీసుస్టేషన్ పరిధిలోకి చేర్చాలని అక్కడ ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునేవారు లేరు. –న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

జిల్లా పోలీసు కార్యాలయం

▶ జిల్లా కేంద్రమైన ఒంగోలు మండలంలోని యరజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాలు జిల్లా కేంద్రానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలోపే ఉంటాయి. ఈ రెండు కూడా టంగుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఉండడం గమనార్హం. ప్రతి చిన్న పనికీ ఒంగోలు వచ్చే ఇక్కడ ప్రజలు పోలీసుస్టేషన్‌కు వెళ్లాలంటే మాత్రం టంగుటూరు వెళ్లాల్సిందే. ఒంగోలు-చీరాల రహదారిలోని మద్దిరాలపాడు నాగులుప్పలపాడు మండల కేంద్రానికి కేవలం 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనికి సమీపంలోనే ఉండే చేకూరపాడు గ్రామం నాగులుప్పలపాడు మండల పరిధిలోనే ఉన్నప్పటికీ పోలీసు స్టేషన్ మాత్రం ఒంగోలు తాలూకాకు రావాల్సిందే.

▶ జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో జిల్లాలో పనిచేసిన ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి కొంతమేర కృషి చేశారు. నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం, ముప్పాళ్ల గ్రామాలు బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీసుస్టేషన్ పరిధిలోనూ, అదే మండలంలోని మట్టిగుంట గ్రామం బాపట్ల జిల్లా వేటపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో ఉండేవి. వీటిని నాగులుప్పలపాడు పోలీసుస్టేషన్ పరిధిలోకి చేర్చారు. తాజాగా మార్కాపురం జిల్లా ఏర్పాటుకానున్న నేపథ్యంలో జిల్లాలో ఒకే మండలంలోని గ్రామాలు ఒకే పోలీసుస్టేషన్ పరిధిలోకి వచ్చే విధంగా పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

బోధనకు బెంగ లేదిక

▶ 131 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల మంజూరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ అనంతరం మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో బోధకుల కొరత నెలకొంది. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలోని ఎక్కువ మండలాల్లో పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. పుల్లలచెరువు, యర్రగొండపాలెం, అర్ధవీడు మండలాల్లో ఉపాధ్యాయుల్లేని పాఠశాలలున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ తాత్కాలిక నియామకాలు చేపట్టింది. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పేరిట 5 నెలలపాటు పనిచేసేవిధంగా నియామకాలు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాలల జాబితాతో సహా కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులిచ్చింది.

8 లోగా నియామకాలు: టీటీసీ అర్హత గలవారిని ఎస్జీటీ, బీఎడ్ అర్హత గలవారిని స్కూలు అసిస్టెంట్ పోస్టుల్లో నియమిస్తారు. ఎస్జీటీలకు నెలకు రూ.10 వేలు, స్కూలు అసిస్టెంట్లకు రూ.12,500 వేతనంగా చెల్లిస్తారు. వీరు ఏప్రిల్ ఆఖరి వరకు పనిచేయాల్సి ఉంటుంది. త్వరలో దరఖాస్తుల స్వీకరణ చేపడతారు. జిల్లాకు 131 పోస్టులు మంజూరు కాగా, 24 మండలాల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 8వ తేదీలోగా నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

కీ॥శే॥ యెండ్లూరి పిచ్చమ్మ గారు
మరణం: 17-11-2025

మా ఇంటి ఆరాధ్యదైవం శ్రీమతి యెండ్లూరి పిచ్చమ్మ గారు తేది 17-11-2025 సోమవారం స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో..

భర్త : యెండ్లూరి బ్రహ్మయ్య

కుమారుడు - కోడలు: యెండ్లూరి గోపాలకృష్ణ - సుచరిత

కుమార్తెలు - అల్లుళ్లు: మన్నం వరలక్ష్మి - శ్రీనివాసులు; గనిపినేని శ్రీదేవి - వెంకట్రావు

మనుమలు, మనుమరాళ్లు మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది:03-12-2025 బుధవారం ఉదయం 9 గంటలకు మా స్వగృహం విక్కిరాలపేట, కందుకూరు(మం), నెల్లూరు జిల్లా నందు జరుగునని బంధుమిత్రులకు తెలియజేయడమైనది

మరిచిపోలేక.. మమకారం చంపుకోలేక

చిత్రంలో కనిపిస్తున్న ఈయన పేరు మోపర్తి నారాయణ. ఈయనది కొండపి మండలం పెరిదేపి. ఈయనకు ఒంగోలు జాతి గోవుల పెంపకమంటే ఆసక్తి. ఇప్పటివరకు 50కిపైగా ఆవులను సాకారు. తాను ఇష్టంగా పెంచుకుంటున్న గోవుల్లో ఒకటి అనారోగ్యానికి గురవ్వడంతో వైద్యానికి రూ.లక్ష వరకు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. అది దూరం కావడంతో గోవు విగ్రహం తయారు చేయించి ప్రతిష్ఠించారు. ఏటా గోవు చనిపోయిన రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. – ఈనాడు, ఒంగోలు

కొత్త పంచాయతీలకు పచ్చజెండా!

▶ పల్లె ప్రజల కల సాకారానికి అవకాశం
▶ ప్రతిపాదనలకు ఈ నెల 20 వరకు గడువు

న్యూస్‌టుడే, కలెక్టరేట్

శివారు గ్రామాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత 30 ఏళ్ల పల్లె ప్రజల కల సాకారమయ్యే అవకాశం లభించింది. గ్రామ పంచాయతీల విభజనకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ పచ్చ జెండా ఊపడంతో కొత్త పంచాయతీలు ఏర్పడనున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి ప్రస్తుత పాలకవర్గాలు గడువు తీరనున్న నేపథ్యంలో ప్రస్తుత పంచాయతీలతో పాటు కొత్త వాటికి ఒకేసారి ఎన్నికలు నిర్వహించనున్నారు.

▶ **ప్రతిపాదనలు :** పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు పంచాయతీరాజ్‌శాఖ సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది. తద్వారా ఒక పంచాయతీని రెండింటిగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకే దానిగా మార్చడం, ఒక పంచాయతీలోని గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేసే అవకాశం ఉంది. క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి వినతుల స్వీకరణతోపాటు కొత్త వాటికి ప్రతిపాదనలు కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి ఎంపీడీవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈనెల 20వ తేదీ లోగా ప్రతిపాదనలు పంపాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

▶ జిల్లాలోని గ్రామపంచాయతీలు: 729
▶ వీటిలోని మేజరు పంచాయతీలు: 81
▶ 500లోపు జనాభా గల గ్రామాలు: 05
▶ 2011 లెక్కల ప్రకారం జనాభా : 17,68,931
▶ ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: సర్వేరెడ్డిపాలెం (ఒంగోలు), మంగమూరు (సంతనూతలపాడు), కనపర్తి (నాగులుప్పలపాడు), మార్కాపురం (గజ్జలకొండ)

▶ **మార్గదర్శకాలు:** ● పంచాయతీల ప్రస్తుత పాలకవర్గం తీర్మానం చేయాలి. ● మార్పులు, చేర్పులు మండల పరిధిలోనే చేస్తారు. ఒక మండలానికి చెందిన శివారు/పంచాయతీని మరో మండలంలో కలపడం లేదా వేరు చేయడం కానీ కుదరదు. ● పాలకవర్గాలు లేని పంచాయతీల్లో ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో గ్రామసభ ద్వారా తీర్మానం చేస్తారు. ● తీర్మానాలను కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు అందజేయాలి.

స్టార్ హాస్పిటల్స్ వైద్యనిపుణులను ఇప్పుడు స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్, ఒంగోలులో సంప్రదించగలరు

STAR HOSPITALS Expertise • Excellence • Empathy Hyderabad

డా. జ్యోత్స్న గుత్తికొండ
MBBS, MD, AB Nephrology (USA)
సీనియర్ కన్సల్టెంట్, నెఫ్రాలజీ & ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్
హెచ్.ఓ.డి - నెఫ్రాలజీ & ట్రాన్స్‌ప్లాంట్

మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• దీర్ఘకాలిక బి పి & చక్కెర వ్యాధి ఉన్నవారు
• మూత్రపిండముల యొక్క వైఫల్యం
• దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి సమస్య
• మూత్రం ఆపుకొనలేని సమస్య
• కిడ్నీ ఇన్ఫెక్షన్
• అధిక స్థాయి లో యూరియా మరియు క్రియేటినిన్ ఉన్న వారు
• దీర్ఘకాలంగా డయాలసిస్ పై ఉన్నవారు
• కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ పై రెండవ అభిప్రాయం కోరకు

FREE CONSULTATION
డా. వి. అపూర్వ
MBBS, MS (General Surgery), DrNB Vascular Surgery
కన్సల్టెంట్ - వాస్కులర్ & ఎండోవాస్కులర్ సర్జరీ

మీరు ఈ క్రింది సమస్యలతో బాధపడుతున్నారా?
• కాళ్ళ వాపులు
• రక్తనాళాలు ఉబ్బటం
• వెరికోస్ వీన్స్
• డయాబెటిక్ ఫుట్
• మానని పుండ్లు, గాయాలు
• డీప్ వీన్ థ్రాంబోసిస్
• రక్తనాళాలు చిట్లుట
• రక్తప్రసరణ నెమ్మదించడం
• రక్తనాళాలలో అవరోధం

04 డిసెంబర్, 2025 (ప్రతి నెల 1వ గురువారం అందుబాటులో కలరు)
ఉ॥ 10:00 - సా॥ 04:00

స్టార్ ఇన్ఫర్మేషన్ సెంటర్ & సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్
వేమూరి మెడికల్స్ వెనుక, సుందరయ్య భవన్ రోడ్, ఒంగోలు

అపాయింట్‌మెంట్స్ కొరకు, కాల్ చేయండి:
9849 133 956 | 9063 443 707

స్టార్ హాస్పిటల్స్: నానక్‌రామ్‌గూడ । బంజారాహిల్స్

(c) eenadu

వైకల్యానికి వైద్యం.. భవిత దివ్యం

● నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

శారీరక, మానసిక వైకల్యం చిన్నతనంలో గుర్తించి తగు చికిత్స అందిస్తే భవిత బాగుంటుంది. 'అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం (డిసెంబరు 3) సందర్భంగా జిల్లాలో లభిస్తున్న వైద్య సేవలపై 'న్యూస్‌టుడే' కథనం.

-న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

చిన్నారికి చికిత్సనందిస్తున్న ఫిజియోథెరపీ వైద్యుడు యశ్వంత్

ఎన్నెన్నో కారణాలు..

చిన్నారుల్లో పుట్టుకతో లోపాలు, పోషకాహార లోపం, ప్రమాదాలు, వనరులలేమి వంటి అనేక కారణాల వల్ల శారీరక, మానసిక వైకల్యం ఉత్పన్నమవుతోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తొందరగా గుర్తించి వైద్యం, పునరావాసం అందిస్తే చాలా సమస్యలను తగ్గించవచ్చు.

జిల్లా ఆసుపత్రుల్లో వైద్యం

బాలల్లో వచ్చే దివ్యాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రుల్లో జాతీయ ఆరోగ్య పథకంలో భాగంగా జిల్లా బాల భవిత కేంద్రాలు(డీఈఐసీ-ఆర్‌బీఎస్‌కే) అందుబాటులో ఉన్నాయి. ఒంగోలు, మార్కాపురాల్లో ఈ కేంద్రాలు సేవలందిస్తున్నాయి.

వైద్యనిపుణులు సైతం సేవలందిస్తున్నారు

ఎక్కువగా పుట్టుకతో వచ్చే లోపాల చికిత్సకు ఈ కేంద్రానికి వస్తుంటారు. ప్రత్యేక చికిత్సలకు చెన్నై, తదితర ప్రాంతాలనుంచి స్పెషలిస్టులు కూడా నెలకు ఒకసారి వస్తున్నారు. మరింత సమాచారం కోసం 08596-222363 నంబరును సంప్రదించవచ్చు.

- యశ్వత్, ఫిజియోథెరపీ వైద్యుడు

నెల రోజులుగా చికిత్సకు వస్తున్నాం

మాది కంభం. మా పాప రిషిక నడవడంలో ఇబ్బందిని గుర్తించి, తెలిసిన వాళ్లు మాకు చెప్పారు. నెల రోజులనుంచి రోజూ ఇక్కడకు వచ్చి చికిత్స తీసుకుంటున్నాం. పురోగతి కనిపించింది.

- యు.పుష్ప

పాప ఎదుటివాళ్లను గుర్తుపడుతోంది

మాది మార్కాపురం. పాప పాకృతికలో లేటుగా పెరుగుదల ఉన్నట్లు గుర్తించి చికిత్స నిమిత్తం చేర్పించాం. ఫ్లాట్ హెడ్‌తో జన్మించడం వల్ల ఈ సమస్య అని సిబ్బంది చెప్పారు. మా పాప ఇప్పుడిప్పుడే ఎదుటివారిని గుర్తుపడుతోంది.

- మహాలక్ష్మి, మార్కాపురం

బాబు ఏడుపు తగ్గించాడు..

మా బాబు పేరు అభిషేక్, వయసు 14 నెలలు. ఎప్పుడూ ఏడుస్తూ ఉంటాడు. కేంద్రానికి తీసుకువచ్చిపుడు పరిశీలించిన డాక్టర్లు చిన్న పుర్రెతో జన్మించడం వల్ల ఈ సమస్య అని చెప్పారు. మూడు నెలలుగా చికిత్స అందించడంతో బాబు ఏడవడం తగ్గించాడు.

- లక్ష్మి, అభిషేక్, సహాయకురాలు

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లాలోని మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండపి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు. స్థానిక అధికారులు వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. తాగునీటి పథకాలు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు రక్షిత జలాలు అందించాలని ఆదేశించారు. ఒక్కో అధికారి ఒక్కో సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని దత్తత తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, సీపీవో సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కుల హననం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్లు ఉపసంహరించే వరకు ఉద్యమం చేపట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్మికుల హక్కులను పూర్తిగా హరించేలా, కార్పొరేట్లకు బానిసలుగా మార్చేలా ఈ కోడ్‌లు రూపొందించారని విమర్శించారు. కంపెనీల్లో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కొరవడుతుందన్నారు. పీఎఫ్, గ్రాట్యుటీ కోతలతో కార్మికుల చేతికి అందే వేతనం గణనీయంగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం అమలుతో పాటు పని గంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు, నాయకులు పునాటి ఆంజనేయులు, జీవీ.కొండారెడ్డి, ఎస్డీ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ సంక్షేమాధికారి, వంట సిబ్బంది సస్పెన్షన్

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొనకనమిట్ల ఎస్సీ బాలుర వసతిగృహం సంక్షేమాధికారి ఎం.శివశంకర్, వంట నిర్వాహకురాలు లక్ష్మీదేవిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వంట సిబ్బంది రాక, వార్డెన్ పర్యవేక్షణ లేక మొన్నటి ఆదివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో ఇక్కడ ఉంటున్న 70 మంది విద్యార్థులు ఆకలితో అలమటించారు. చివరకు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయమై 'పిల్లలను ఆకలితో మాడ్చారు' శీర్షికన ఈ నెల 1న 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. సంక్షేమాధికారి, వంట నిర్వాహకురాలి నిర్లక్ష్యమే కారణమని తేలడంతో వారిని సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తెలిపారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ బ్రహ్మతేజ

జిల్లా జైలు వైద్యుడికి పురస్కారం

ఒంగోలు, న్యూస్‌టుడే: ఖైదీల ఆరోగ్య పరిరక్షణతో పాటు ఎయిడ్స్‌పై అవగాహన, నియంత్రణకు కృషి చేస్తున్న ఒంగోలులోని జిల్లా జైలు వైద్యాధికారి డాక్టర్ కె.ఎస్.వి.ఎస్.బ్రహ్మతేజకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ చేతులమీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కారాగార వైద్య బృందాన్ని పర్యవేక్షణాధికారి వరుణారెడ్డి, అధికారులు, సిబ్బంది అభినందించారు.

పెంచలయ్య హంతకులను శిక్షించాలని నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గంజాయి మాఫియాకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా నాట్య మండలి కళాకారుడు కె.పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. జిల్లా కార్యదర్శి కె.రమాదేవి మాట్లాడుతూ... రాష్ట్రంలో గంజాయి, మత్తు మందుల వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. విద్యాసంస్థల్లోనూ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొందరు రాజకీయ నాయకులు వీటిని ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. పెంచలయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, డి.తిరుపతమ్మ, నాగమణి, అనిత, సీఐటీయూ నాయకులు జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఐద్వా ప్రతినిధులు

భాజపా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఒంగోలు, న్యూస్‌టుడే: భాజపా అనుబంధ విభాగాల అధ్యక్షులను మంగళవారం నియమించారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు ఆ వివరాలు వెల్లడించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దండు శ్రీనివాసరావు, మహిళా మోర్చా... తీగల సత్యవతి, ఎస్సీ మోర్చా... పెరిక లక్ష్మణ్, కిసాన్ మోర్చా... కాపూరి వాసు, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సిగోతు రాజేష్‌వర్మను నియమించారు. ఆయా విభాగాల కార్యకలాపాలను విస్తృతం చేసి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నూతన సభ్యులకు సూచించారు.

వాసును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అపరిశుభ్ర ట్యాంకు.. రోగాల బ్యాంకు

కంభం మండలం నడింపల్లిలోని మినీ మంచి నీటి ట్యాంకును నెలలుగా శుభ్రం చేయడంలేదు. దీంతో పాచిపట్టి నీరు స్వచ్ఛత కొరవడి రోగాలకు తావిస్తోంది. బాగు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మినీ ట్యాంకు చుట్టూ నెలకొన్న అపరిశుభ్రత తొలగిస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. - న్యూస్‌టుడే, కంభం

ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఎంపిక

పెద్దారవీడు, న్యూస్‌టుడే: పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అండర్-17 విభాగంలో అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనిత తెలిపారు. 69వ పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసులు, విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకాశం భవన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా ఏడీ సువార్త తెలిపారు. ఈ సందర్భంగా గత నెల 29న నిర్వహించిన ఆటలపోటీల విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నాటక రంగానికి అందరూ సహకరించాలి

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కళా పరిషత్‌ల నిర్వహణ అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు కోట శంకరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తోలేరు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో 21వ జాతీయ స్థాయి నాటిక పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక రంగాన్ని బతికించేందుకు కళాపరిషత్‌ల నిర్వాహకులకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం సినీ నటుడు కోట శంకరరావు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకట రామారావులను సత్కరించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ

సోమాజిగూడ: తెలుగు రాష్ట్రాల్లో నమోదైన పలు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ విచారించారు. జాతీయ ఎస్సీ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ దిల్‌ఖుషా అతిథి గృహంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పలు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఘటనలపై విచారణ చేపట్టారు. విచారణలో జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల రక్షణ చట్టాలపై అవగాహన అవసరం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వయో వృద్ధులు వారి సంరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ పేర్కొన్నారు. ఒంగోలులోని సమతా మహిళా వృద్ధాశ్రమాన్ని మంగళవారం సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. వృద్ధుల యోగక్షేమాలతో పాటు భోజనం, వసతి సదుపాయాలపై ఆరా తీశారు. న్యాయపరంగా ఎటువంటి సాయం కావాలన్నా వెంటనే న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం రామనగర్‌లోని బాలసదన్, శిశుగృహ, బాల, బాలికల వసతి గృహాలను పరిశీలించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సువర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వసతులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్

చిట్టీల పేరుతో మోసగించిన మహిళ అరెస్టు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ గ్రామం హనుమాన్‌నగర్‌లో అనుమతులు లేకుండా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ పలువురిని మోసం చేసిన కేసులో ఒక మహిళను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల మేరకు.. చిమటా లక్ష్మీదేవమ్మ నాలుగేళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తూ సదరు సభ్యులకు నగదు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతుంది. దీంతో బాధితుడు చేజర్ల తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లక్ష్మీదేవమ్మను ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఆమెతోపాటు మరికొంత మంది మహిళలు చిట్టీల పేరుతో సుమారు రూ.4 కోట్లు పాటదారులకు చెల్లించకుండా మోసం చేసినట్లు పలువురు బాధితులు ఇప్పటికే ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. త్వరలో సమగ్ర దర్యాప్తు చేపట్టి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు.

గొలుసు చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గోనెపల్లె వద్ద గత నెల 11న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ జరిగిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు గిద్దలూరు గ్రామీణ సీఐ జె.రామకోటయ్య తెలిపారు. కడప జిల్లా సీకే దిన్నె మండలం గుంప తండా గ్రామానికి చెందిన బుక్కే సతీష్ నాయక్, మూడే ఆంజనేయుల నాయక్‌లు మిత్రులు. సతీష్ నాయక్ బీ.ఫార్మసీ చదివాడు. వివాహమైంది. అనంతరం ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. సతీష్‌కు ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు స్నేహితులతో తరచూ చెప్పేవాడు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకోటయ్య

● **దొంగతనాలు చేస్తే డబ్బు వస్తుందని.. :** దొంగతనాలు చేస్తే సులువుగా డబ్బు సంపాదించవచ్చునని భావించాడు. గత నెల 11న కొమరోలు మండలం గోనెపల్లె గ్రామంలోని రాష్ట్రీయ రహదారి పక్కన పండ్లు విక్రయిస్తున్న ఏలూరి వెంకట సుబ్బమ్మ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు వారి కంట పడింది. దాంతో ఆమెను మాయమాటలు చెప్పి గొలుసు లాక్కుని ద్విచక్రవాహనంపై సతీష్, ఆంజనేయులు నాయక్‌లు వేగంగా వెళ్లి పోయారు. ఆ మేరకు ఆమె స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్న సీఐ రామకోటయ్య, ఎస్సై జె.నాగరాజులు దర్యాప్తు చేపట్టి నిందితులను సోమవారం రాత్రి తాటిచెర్ల మోటు సమీపంలో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఏడుగుండ్లపాడు చెరువులో మృతదేహం లభ్యం

మద్దిపాడు, న్యూస్‌టుడే: ఏడుగుండ్లపాడు చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మద్దిపాడు ఎస్సై వెంకటసూర్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు మండలం త్రోవగుంటకు చెందిన అన్నవరపు కిరణ్ (42) మద్యం దుకాణంలో పనిచేస్తుంటారు. మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యమూ దెబ్బతింది. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయి ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి పొద్దుపోయినా రాకపోవడంతో కుటుంబీకులు పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం... ఏడుగుండ్లపాడు చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో సహా ఎస్సై అక్కడకు చేరుకుని వెలికి తీయించారు. ద్విచక్ర వాహనం, చరవాణి ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఒంగోలు రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య సుప్రజ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనుమళ్లకు రాయి రవివర్మ (23) ట్రాక్టరు చోదకుడుగా పనిచేస్తుంటాడు. గత నెల 22న సింగరాయకొండకు చెందిన ఓ వివాహితతో మాట్లాడుతుండగా, ఆమె కుటుంబ సభ్యులు గమనించి అతడిని నిలదీశారు. దీంతో రవివర్మ తండ్రి మాధవరావు కూడా అతడిని మందలించడంతో గత నెల 28న గ్రామంలోని చెరువు వద్ద గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు సింగరాయకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం ఒంగోలులోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. యువకుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 125, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

'ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం పలుసార్లు పేర్కొన్నా క్షేత్రస్థాయిలో సరైన అడుగులు పడలేదు. దీంతో విద్యార్థులకు నేటికీ కష్టాలు తప్పడంలేదు.

- న్యూస్‌టుడే, తాళ్లూరు

వెలుగువారిపాలెంలో పునాదుల స్థాయిలోనే నిలిచిన తరగతి గదులు

నిర్మాణాలు అసంపూర్ణం.. అవస్థలు నిరంతరం

● నిధుల్లేక కొలిక్కిరాని పాఠశాలల భవనాలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడులలో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు, కనీస వసతుల కల్పనకోసం 'నాడు- నేడు' పథకాన్ని అమలు చేసింది. ఈకోవలో జిల్లా పరిధిలోని దాదాపు 150 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 401 అదనపు తరగతి గదుల నిర్మాణానికి, అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు అప్పటి ప్రభుత్వం నాడు-నేడు రెండోవిడత ద్వారా రూ.48 కోట్లమేరకు నిధులను మంజూరు చేసింది. అయితే పలు

రూ.48 కోట్లకు అరకొర మంజూరు

దఫాల్లో సుమారు రూ.30 కోట్లమేరకు మాత్రమే నిధులను విడుదల చేసింది. పూర్తిస్థాయిలో నిదులు రానందువల్ల ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా నిలిచి పోయాయి. కొన్ని పాఠశాలలకు నిధుల విడుదలలో జాప్యం కారణంగా నిర్మాణాలు పునాదుల స్థాయిలోనే ఆగిపోయిన దాఖలాలున్నాయి.

పనుల కోసం ఎదురుచూపులు

సుమారు వందకుపైగా పాఠశాలల్లో నిర్మాణాలు 75 శాతంమేరకు పూర్తయినా తదుపరి పనులు పూర్తి కావడానికి ఎదురు చూస్తున్నారు. ● జిల్లా వ్యాప్తంగా 16 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కూడా పనులన్నీ అసంపూర్తిగా ఆగి పోయాయి. ఆయా చోట్ల ఫ్లోరింగు, ప్లాస్టరింగు, రంగులు వేయడం, విద్యుత్తు సౌకర్యం కల్పించడం, ఇతరత్రా పనులు చేయాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు

వైకాపా అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు 'మనబడి - మన భవిష్యత్తు' పథకం అమలు చేస్తోంది. దీని ద్వారానైనా అసంపూర్తి పనులన్నింటినీ పూర్తి చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా పరిధిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా సమగ్రశిక్ష విభాగం ఈఈ వెంకటరత్నం తెలియజేశారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తదుపరి తగుచర్యలు చేపడతామన్నారు.

ఆగిన కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొట్టాలపల్లి గ్రామ సమీపంలోని రహదారిపై ఆగి ఉన్న కారును ఓ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం.. కారు టైరు పంక్చరు కావడంతో రహదారి పక్కన నిలిపి ఉంచారు. కంభం నుంచి మార్కాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు కారును వెనుక నుంచి స్వల్పంగా ఢీకొట్టింది. దీంతో కారు పక్కనున్న ముళ్ల పొదల్లోకి వెళ్లింది. ఆ సమయంలో కారులో ఉన్న మహిళ, చిన్న బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసు కేసు ఏమీ నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ముళ్లపొదల్లోకి వెళ్లిన కారు

వాహన చోదకుడిపై కక్ష.. స్కూల్ బస్సు దహనం

అర్ధవీడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి వాహన చోదకుడిపై కక్షతో స్కూల్ బస్సు తగలబెట్టాడు. ఈ సంఘటన అర్ధవీడు మండల పరిధిలోని పాపినేనిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు. .గ్రామానికి చెందిన నబి కంభంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సుకు చోదకుడిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన గోపాల్‌యాదవ్ కూడా నబి దగ్గర క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇద్దరి మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో గోపాల్ కక్ష పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం బస్సు పాఠశాలకు తరలించే క్రమంలో నబి మరమ్మతులు చేస్తుండగా..గోపాల్ పెట్రోల్ పోసి నిప్పు అంటించి పరారయ్యాడు. బస్సులో నుంచి తప్పించుకునే క్రమంలో నబికి మంటలు అంటుకుని వీపు తీవ్రంగా కాలిపోయింది. స్థానికులు నబిని ఆటోలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై శివనాంచారాయ్య కేసు నమోదు చేసి..గోపాల్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

మంటల్లో కాలిపోతున్న బస్సు

సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలకు పాపినేనిపల్లి విద్యార్థిని

అర్ధవీడు, న్యూస్‌టుడే: భారతీయ విజ్ఞాన మండలి, ఆఫ్‌కాస్ట్ సంయుక్తంగా నిర్వహించిన కౌశల్ 25 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలలో పాపినేనిపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని సమీరా ఎంపికైనట్లు గైడ్ టీచర్ లూథర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 27న తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర కౌశల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలిక పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమావేశం నిర్వహించి అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9701112824
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008535779

EENADU Classifieds

REAL ESTATE

ఇల్లు అపార్ట్‌మెంట్సు ల్యాండ్ డెవలప్‌మెంట్ కొరకు సంప్రదించండి. మాచే నిర్మించబడే నిర్మాణాలకు 5సంవత్సరాలవరకు వారంటి లభించును. www.mistermason.in ✆6300923212

JOBS

ఒంగోలు, మార్కాపురం APSRTC కార్గో కౌంటర్ నందు పనిచేయుటకు (M) కావలెను. మంచి జీతం కలదు. సెల్: 95428 67588, 80081 22450

టెలికాలింగ్ & Data Entry వర్క్ ఫ్రమ్ హోమ్/ఆఫీసు చేయుటకు M/F కావలెను. 10th క్లాస్ పైన, Age:18to35, జీతం: 18to25K. ✆8464016870

చీరాల నర్సింగ్ కాలేజి హాస్టల్‌కి స్టే చేసే వార్డెన్ కావలెను. వెంటనే సంప్రదించండి. సెల్: 82474 63509, 73969 95852.

WANTED
సాయిగౌతమి ఎర్త్ మూవర్స్ & టిప్పర్ సర్వీసెస్ & కన్‌స్ట్రక్షన్‌లో పనిచేయుటకు M.S. ఆఫీస్, Excel లో అనుభవం కల్గిన (స్త్రీ) కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంతనూతలపాడు, శాలరీ 15 వేలు
Cell: 9000429888 9949961572

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మార్కాపురం
•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

ఉత్సాహంగా ఉపన్యాసం.. ఆదరణ ఆసాంతం

☛ ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కంభం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్కే మహమ్మద్ సమీర్ (10వ తరగతి), జి.వి.వింధ్య (9వ తరగతి), ఎస్కే సిద్ధిక (9వ తరగతి) విద్యార్థులు మొదటి మూడు బహుమతులు సాధించారు. వారికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వీరనారాయణ, ఉపాధ్యాయులు ఎం.మూర్తిరెడ్డి, జి.సత్యరామారావు, ఎస్.సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేశారు.

◗ మార్కాపురం పట్టణం: పట్టణంలోని వాసవి విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జి.ఫ్లోరెన్ జి.ధృతి, సిహెచ్.హర్షిణిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ కె.రంగయ్య, ఇతర సిబ్బంది బహుమతులు అందజేసి అభినందించారు.

◗ అదే విధంగా పట్టణంలోని వివేకానంద విద్యాపీఠంలోనూ ఈ పోటీలు నిర్వహించారు. కె.మేఘనా రెడ్డి, వి.సుజన్, ఎస్.అమూల్యలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకొన్నారు. వీరికి పాఠశాల ప్రెసిడెంట్ పి.సత్యనారాయణ, సెక్రెటరీ వి.ప్రసాద్, ఎం.వెంకటప్రసాద్, ప్రిన్సిపల్ మల్లికార్జునలు బహుమతులు అందజేశారు.

◗ యర్రగొండపాలెం: పట్టణంలోని వాగ్దేవీ బాలికల జూ.కళాశాలలో జరిగిన పోటీల్లో వంద మంది బాలికలు పాల్గొన్నారు. సీహెచ్ఎన్ఎస్వీ హాసిని (ప్రథమ), ఎస్.దీపిక (ద్వితీయ), బి.అంకితాబాయి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. బహుమతులను విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ కె.అంకమ్మరావు, ఏవో బాలునాయక్, జాస్మిన్, వసుమతి అందించారు.

మార్కాపురం: గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న వాసవి విద్యానికేతన్ సిబ్బంది

వై.పాలెం: బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

రాయితీపై రైతులకు ఎరువులు, పరికరాలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రైతుల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం రాత్రి 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నట్లు చెప్పారు. రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నట్లు చెప్పారు. త్వరలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అవుతుందన్నారు. చిరుధాన్యాలు సాగు చేయాలన్నారు. పశువుల దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, వ్యవసాయాధికారి షేక్.మహమ్మద్, ఉద్యాన శాఖ అధికారిణి శ్వేత, పశువైద్య శాఖ ఏడీ యోగానంద ప్రసాద్, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ కేతం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు పరివర్తకాల మరమ్మతుల కారణంగా మండలంలోని మొద్దులపల్లి ఫీడరు పరిధిలో విద్యుత్తు సరఫరా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. దీంతో ఫీడరు పరిధిలోని మొద్దులపల్లి, పెద్దయాచవరం, బోడపాడుల్లో వ్యవసాయ కనెక్షన్లు పనిచేయవని, రాత్రి వేళల్లో 9 గంటలమేర విద్యుత్తు ఉంటుందని రైతులు సహకరించాలని ఆయన సూచించారు. ◗ గిద్దలూరు పట్టణం : గిద్దలూరు మండలంలోని అంబవరం 33కేవీఏ విద్యుత్తు లైనులో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.శేషగిరిరావు తెలిపారు. మండలంలోని కంచిపల్లె, బురుజుపల్లె, కృష్ణంశెట్టిపల్లె విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

నేడు హనుమత్ వ్రత మహోత్సవం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బొడిచెర్ల గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నేడు (బుధవారం) హనుమాన్ వ్రత మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులతో పాటు ఈవో చెన్నకేశవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యావాలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కంభం: మండలంలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న విద్యా వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్ సత్తార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు బయాలజీ, పీఎస్, సోషల్, మ్యాథ్స్, ఉర్దూ లాంగ్వేజ్ పోస్టులు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 5 లోగా దరఖాస్తులు ఎంఈవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

పెద్దనాగులవరం వీఆర్‌ఏ విధుల నుంచి తొలగింపు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దనాగులవరం గ్రామ రెవెన్యూ సహాయకునిగా పనిచేస్తున్న కె.నాగయ్యను విధుల నుంచి తొలగిస్తూ మార్కాపురం తహసీల్దారు చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వీడాలని పలుసార్లు హెచ్చరించినా పంథా మార్చుకోలేదు. ఈ కారణంగా విచారణ జరిపి ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్‌జీవోల సమస్యలు పరిష్కరించండి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు తాలుకా ఎన్‌జీవో సంఘం నాయకులు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్జీవోలను సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ◗ గిద్దలూరు మండలం బలిజ సేవా సంఘం నూతన అధ్యక్షుడు కమతం శ్రీనివాసులు మంగళవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘీయుల అభివృద్ధికి కృషిచేయాలని నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దుత్తా బాల ఈశ్వరయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

పొదిలి, న్యూస్‌టుడే: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని మార్కాపురం వైకాపా ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు అన్నారు. మంగళవారం కంభాలపాడు గ్రామంలో వైకాపా కోటి సంతకాల సేకరణలో పాల్గొని మాట్లాడారు.

అందని బిల్లులు.. అసంపూర్తి నిర్మాణాలు

• కూటమి ప్రభుత్వం చొరవ అవసరం

న్యూస్‌టుడే, బేస్తవారపేట

యాచవరంలో కొలిక్కిరాని గ్రామ సచివాలయ భవనం

గ్రామం యూనిట్‌గా ప్రజలకు విభిన్న రకాల సేవలు అందించే లక్ష్యంతో గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గుత్తేదారులకు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపుల్లో నెలకొన్న జాప్యం కారణంగా చాలాచోట్ల పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు సగంలో నిలిచిన భవనాలు ఇప్పటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కనీసం ఇప్పుడైనా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 85 గ్రామ సచివాలయ భవనాలను మంజూరు చేయగా వాటిలో 14 భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఇక రైతుసేవా కేంద్రాల విషయానికొస్తే మొత్తం 85 కేంద్రాలకు 8 కేంద్రాల పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. సగం వరకు నిర్మించిన వాటిని పూర్తి చేయిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

బకాయిల కోసం ఎదురుచూపులు..

ఈ భవనాలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల కోసం గుత్తేదారులు ఇంకా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు సేవా కేంద్రానికి రూ.21.80 లక్షల నిధులను కేటాయించింది. పనులను దక్కించుకున్న గుత్తేదారులకు ఇప్పటివరకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల బిల్లులు మాత్రమే అందాయి. బిల్లులను వైకాపా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు ఆయా నిర్మాణాలను పంచాయతీలకు అప్పగించలేదు. నాలుగేళ్ల క్రితం నాటి ధరల ఆధారంగా వైకాపా ప్రభుత్వం నిధులు కేటాయించిందని ప్రస్తుతం సిమెంట్, ఇనుము, ఇసుక, కూలీల ధరలు పెరిగిపోవడంతో కూటమి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తేనే తప్ప పనులు పునఃప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదని గుత్తేదారులు తెగేసి చెబుతున్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న రాష్ట్ర తెదేపా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గంగరాజు యాదవ్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మూరబోయిన గంగరాజు యాదవ్ అన్నారు. సాధారణ ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చిన బూత్ కన్వీనర్లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు షేక్ మాబు, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి, నాయకులు వల్లభనేని కాశయ్య, సుబ్బారెడ్డి, చంటి, శేషాద్రి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని కొత్త అన్నసముద్రంలో జరిగిన విద్యుత్తు ప్రమాద స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించి.. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎరిక్షన్‌బాబు బాధిత కుటుంబాలతో కూడా మాట్లాడించారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు త్వరలోనే రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం గాయపడిన బాధితులకు రూ.40 వేల సొంత నగదును అందించారు. ఆయన వెంట విద్యుత్తు శాఖా డీఈఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ కృష్ణమోహన్, ఏఈఈ సురేష్ రెడ్డి, సాగర్ నీటి సరఫరా విభాగం ఛైర్మన్ చలమయ్య, తెదేపా మండల అధ్యక్షుడు వలరాజు, స్థానిక నాయకులు అంకారావు, తదితరులు ఉన్నారు.

సాంకేతికత, నిరంతర కృషితోనే ఉద్యోగావకాశాలు

ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: నియామక ప్రక్రియలో సాంకేతికత, నిరంతర కృషి వల్లే ఉద్యోగ అవకాశాలు వస్తాయని ప్రిన్సిపల్ రంగనాయకులు అన్నారు. కళాశాలకు చెందిన 20మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, ప్రసన్న మురళి, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

పొదిలి, న్యూస్‌టుడే

?: పట్టణంలోని టైలర్స్ కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారిపోతున్నాయి. దీంతో రాకపోకలకు కష్టంగా ఉంటోంది. సిమెంటు రోడ్లు వేస్తే సౌకర్యంతంగా ఉంటుంది. – సుబ్బారావు, పొదిలి.

✓: రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. నిధులు మంజూరైతే అవసరమైన చోట్ల రోడ్లు వేయిస్తాం. – శంకర్‌నాయక్, ఏఈ, పొదిలి.

విద్యుత్తు దీపాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్లలో విద్యుత్తు దీపాలు మరమ్మతులకు గురై వెలగడం లేదని గత నెల 26న "మేమున్నాం మీకు తోడుగా"లో సమస్యను ప్రచురించగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్, సర్పంచి ఇండ్లా రజితారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని స్తంభాలకు విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభావంతులకు గుర్తింపు

యర్రగొండపాలెం పట్టణం: వై.పాలెం మండల స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్ ప్రతిభా పరీక్షలు స్థానిక క్విన్‌ఆల్కలీన్ వాటర్ కంపెనీ వారు గత నెల 25న నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో వీటిలో విజేతలైన విద్యార్థులకు ఎంఈవో ఆంజనేయులు, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ప్రదీప్ బహుమతులు అందజేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దదోర్నాల: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో ప్రసూనదేవి తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణ శివారులోని చెన్నరాయునిపల్లి సమీపంలో గతంలో జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వాటిని కొందరు ప్రైవేటు వ్యక్తులు చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దారు చిరంజీవికి స్థానిక జర్నలిస్టులు వినతి పత్రం అందించారు.

లింగ వివక్ష వద్దు

మార్కాపురం గ్రామీణం: మార్కాపురం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో లింగవివక్ష అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో డీఆర్డీఏ వెలుగు ఏపీఎం పిచ్చయ్య మాట్లాడారు. జండర్ సమానత్వంపై అవగాహన కల్పించాలన్నారు.

లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

హామీ నెరవేర్చిన కూటమి సర్కారు

ర్యాలీలో భారీగా పాల్గొన్న ప్రజలు, విద్యార్థులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం మార్కాపురాన్ని జిల్లా చేసి ఇచ్చిన హామీని నెరవేర్చిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం ఉదయం గిద్దలూరు పురపాలకంలో మార్కాపురం జిల్లా సాధన కమిటీ, ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో మార్కాపురాన్ని జిల్లాగా చేశారన్నారు. ముందుగా గిద్దలూరు గాంధీబొమ్మ కూడలిలో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పూలమాలవేసి ర్యాలీని ప్రారంభించారు. మార్కాపురం జిల్లా సాధన కమిటీ సభ్యులు, నియోజకవర్గంలోని తెదేపా నాయకులు, పలు పాఠశాలల, కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి జిల్లా ఏర్పాటుపై కృతజ్ఞతలు తెలియజేశారు. గిద్దలూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గిద్దలూరు, కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, జిల్లా సాధన కమిటీ సభ్యులు కె.రాజు, పాలుగుళ్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరఫరాలో ఇబ్బందులొస్తే వెంటనే సరిచేయాలి

పొదిలి, న్యూస్‌టుడే: దిత్వా తుపాను నేపథ్యంలో విద్యుత్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దర్శి ఈఈ పి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పొదిలి విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా వెంటనే సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అమృత్-2.0... ఆశల చిగురింత

☛ అమలైతే తాగునీటి కష్టాలకు చెల్లు

న్యూస్‌టుడే, పొదిలి

పొదిలిలో కుళాయి వద్ద తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

పొదిలి నగర పంచాయతీలో నీటి కొరత తీర్చేందుకు అమృత్-2.0 కింద మూడేళ్ల క్రితం రూ.110 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అమృత్ పథకం పనులకు టెండర్లు పిలవాలని నిర్ణయించడంతో పొదిలి ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

కేంద్రం కరుణించినా చర్యలు శూన్యం

మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిధులు సరిగ్గా కేటాయించక పోవడంతో పనులు మొదలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమృత్ పథకం పనులపై దృష్టి పెట్టారు. పనులు మొదలుకాని వాటికి మరో మారు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు ఇంజినీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే పొదిలిలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

రామతీర్థం నుంచి పైపులైన్..

పొదిలి నగర పంచాయతీతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు ఈ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. మండలంలోని 45,400 మంది జనాభా ఉన్నారు. ప్రతి కుటుంబానికి తలసరికి రోజుకు 135 లీటర్ల నీరు అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం రామతీర్థం నుంచి పైపులైను ద్వారా నీటిని తీసుకు రానున్నారు. కాటూరివారిపాలెం సమీపంలో 5.26 ఎకరాల్లో నీటిని నిల్వచేసేందుకు పెద్ద ప్లాంట్‌కు, పట్టణంలోని ఐదు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించి నీటిని పంపింగ్ చేసేలా ప్రతిపాదించారు. 104 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

దర్శి సమ్మర్ స్టోరేజీ ట్యాంకే ఆధారం

ఇప్పటివరకు దర్శి సమ్మర్‌స్టోరేజి ట్యాంకు నుంచి వారానికి మూడురోజులు మాత్రమే సరఫరా అయ్యే నీటిని ఎన్ఏపీ సంపులో నిల్వ ఉంచి పట్టణంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పనులు వేగవంతం చేసి నీటి కష్టాలుతీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారులే మార్కెట్లు.. విక్రయాలకు పాట్లు

☛ రైతు బజారు నిర్మించాలంటున్న చిరు వ్యాపారులు

న్యూస్‌టుడే, పొదిలి

పెద్దబస్టాండ్ రోడ్డు అంచుల్లో తోపుడు బండ్ల వ్యాపారులు

పొదిలి నగర పంచాయతీలో రైతు బజారు లేక పోవడంతో పండ్లు, చేపలు, మాంసం, కూరగాయల వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు.

మార్కెట్ కేంద్రాలు లేవు..

పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఆర్ అండ్ బీ రహదారి మార్జిన్లలో తోపుడు బండ్లను తాత్కాలికంగా ఏర్పాటుచేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. నగర పంచాయతీ స్థాయికి ఎదిగినా పట్టణంలో చేపలు, మటన్, కూరగాయల మార్కెట్ కేంద్రాలు లేవు.

◗ ఒంగోలు రోడ్డులో వీర్లమాన్యం రోడ్డుపక్కనే జాలర్లు చేపలు అమ్ముకోవాల్సి వస్తోంది. సీటీబీసీ చర్చి సమీపంలో పెద్దచెరువు అలుగు వాగు స్థలంలో మటన్ మార్కెట్ కొనసాగుతోంది.

ఎండకూ.. వానకూ ఇబ్బంది..

కాటూరివారిపాలెం ఎస్టీకాలనీ, జాఫ్లాపురం కాలనీ వాసులకు చేపల వేటే ప్రధాన జీవనాధారం. సుమారు వంద కుటుంబాలకు పైగా వీరు మూడు దశాబ్దాలుగా చేపలు అమ్ముకుని జీవిస్తున్నారు. వీరితోపాటు పొదిలిలో జాలర్ల సంఘం వారు ఇతర ప్రాంతాల నుంచి చేపలను తెచ్చి పలు చోట్ల అమ్ముకుంటున్నారు. ఎండకు, వానకు వీరంతా ఇబ్బంది పడుతున్నారు. గతంలో వీరు పొదిలి పెద్దచెరువు, చిన్నచెరువుల్లో చేపలు పెంచి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేశారు. ఇక కూరగాయలకు సంబంధించి ప్రైవేటు గదుల్లోనే వ్యాపారాలు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లోను రోడ్డుపక్కన తాత్కాలిక గదులు, రోడ్డు అంచుల్లో దుకాణాలు ఉన్నాయి.

నేరుగా వినియోగదారులకే విక్రయించవచ్చు

అధికారులు నగర పంచాయతీలో రైతుబజారు ఏర్పాటు చేస్తే పట్టణంలోని చిరువ్యాపారులు పండ్లు, కూరగాయలు అమ్ముకునే అవకాశం ఉంటుంది. చుట్టుపక్కల కూరగాయలు పండించుకునే రైతులు రైతుబజారు ఉంటే నేరుగా వినియోగదారులకు అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. నగర పంచాయతీ అధికారులు రైతు బజారు నిర్మాణానికి కృషి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

స్వామిత్వతో హక్కు పత్రాలు

మాట్లాడుతున్న ఎంపీడీవో వీరభద్రాచారి

కంభం, న్యూస్‌టుడే : స్వామిత్వ సర్వేతో హక్కు పత్రాలు వస్తాయని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. సర్పంచి తిరుపాలమ్మ అధ్యక్షతన కందులాపురం పంచాయతీలో మంగళవారం స్వామిత్వ ఫేజ్-2 గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభ్యంతరాలు, అనుకూలతలు వేర్వేరు దస్త్రాల్లో పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

తహసీల్దారు చిరంజీవికి అర్జీ సమర్పిస్తున్న విశ్రాంత సైనికులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భారత సైన్యంలో సేవలందించి రిటైర్ అయిన మాజీ సైనికోద్యోగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విశ్రాంత జవాన్లు మంగళవారం తహసీల్దారు చిరంజీవికి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ ఎంప్లాయిస్ హౌసింగ్‌బోర్డు వెల్ఫేర్ సొసైటీ మార్కాపురం అధ్యక్షుడు ఎం.చిన్నయ్య మాట్లాడారు. రికార్డుల ప్రకారం మార్కాపురం నియోజకవర్గంలో సుమారు 700 మంది విశ్రాంత సైనికులు ఉన్నారని, భారత సైన్యంలో 20 సంవత్సరాలకు పైగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో జైజవాన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి, విశ్రాంత సైనికులు పాల్గొన్నారు.

శౌచాలయాల నిర్మాణానికి స్థలం చదును పనులు

జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయిస్తున్న ఏఈ తావునాయక్

బేస్తవారపేట, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బంది అత్యవసరం కోసం నూతన మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తావు నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలకు కలిపి రెండు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఒకటి మొత్తం 3 చొప్పున మంజూరైన నిర్మాణాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని స్థలాలను మంగళవారం ఆయన జేసీబీతో శుభ్రం చేయించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.3 లక్షల అంచనా వ్యయం కాగా స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

(c) eenadu

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

కనిగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రన రసింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది.

నూతన ఎక్స్‌రే యంత్రాన్ని పరిశీలిస్తు న్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యాధికార్లు అందుబాటులో ఉండి స్వార్థం లేకుండా సేవలందించాలన్నారు. రాబోయే రోజుల్లో వైద్యశాలకు నూతన పరికాలు తీసుకొస్తామన్నారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడమే ధ్యేయమని తెలిపారు. తొలుత సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన నూతన ఎక్స్‌రే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, వైద్యాధికార్లు తిరుపతిరెడ్డి, సునీత, స్రవంతి, సురేష్, సుప్రియ, అభివృద్ధి కమిటీ సభ్యులు బాలబాబు, అక్బర్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

టంగుటూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఎంఈవో ఆనందరావు మంగళవారం తెలిపారు. వాసేపల్లిపాడు, పొందూరు, ఎం.నిడమానూరు, కందులూరు, కాకుటూరిపాలెం గ్రామాల్లోని పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున ఎస్జీటీ పోస్టులు ఖాళీలున్నాయి. కొణిజేడులో 2 స్కూల్ అసిస్టెంట్‌లు ఖాళీలున్నాయి. అభ్యర్థులు టంగుటూరు ఎంఈవో కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● దొనకొండ: మండలంలో విద్యా శిక్షకుల పోస్టుల కోసం ఈ నెల 5లోపు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో అర్హులైన వారు దరఖాస్తులు అందజేయాలని ఎంఈవో సాంబశివరావు చెప్పారు. ప్రాథమిక పాఠశాలల్లో 11, స్కూల్ అసిస్టెంట్లు 2 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం వరకు వారిని బోధనకు నియమించటం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు వచ్చిన తర్వాత వెంటనే అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి పాఠశాలలకు కేటాయిస్తామని తెలిపారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం పక్కాగృహాలను మంజూరు చేయనున్నట్లు కనిగిరి డీడీవో, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఒంగోలు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సీఎస్‌పురం తహసీల్దార్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి రవాణా, మహిళలపై నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలో అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రతాప్ రెడ్డి, ఎంఈవో జె.ప్రసాదరావు, ఏవో పి.మధుబాబు, ఉప ఎంపీడీవోలు వి.బ్రహ్మానందరెడ్డి, ఎంపీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన డీడీవో శ్రీనివాసరెడ్డి, అధికారులు

కనిగిరి సీఐగా శ్రీనివాసరావు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి నూతన సీఐగా ఉప్పు శ్రీనివాసరావు మంగళవారం విధుల్లో చేరారు. ఈయన బాపట్ల నుంచి బదిలీపై రాగా ప్రస్తుతం సీఐగా పని చేస్తున్న షేక్ ఖాజావలి వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. నేరాల కట్టడికి తన వంతు కృషి చేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హనుమంతునిపాడు: మండలంలోని కూటాగుండ్లలో హెచ్ఎంపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 40 మందికి సేవలందించారు. వైద్యాధికారి సందీప్‌తోపాటు సిబ్బంది పాల్గొని ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అమ్మానాన్నా.. మా బడికి రారండి!

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ పరిధి చింతలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి అయిదోతరగతి వరకు విద్యనభ్యసిస్తున్న చిన్నారులు తమ చిట్టి బుర్రలకు పదును పెట్టారు. ఈ నెల 5న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని పురస్కరించుకుని ఆహ్వాన పత్రాలు తయారు చేశారు. 35 మంది బాలబాలికలు వీటిని తయారు చేసి ప్రదర్శించారు. వీటిని ఇళ్లకు తీసుకెళ్లి తల్లిదండ్రులకు అందజేసి మెగా పీటీఎం సమావేశాలకు ఆహ్వానిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

తాము తయారు చేసిన ఆహ్వాన పత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

524 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి గ్రామీణం(టంగుటూరు), న్యూస్‌టుడే: కొండపి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 524 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. నేలటూరిపాలెం, రామచంద్రాపురం, కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1,397 బేళ్లను తీసుకురాగా.. 873 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.310, కనిష్ఠ ధర రూ.50, సరాసరి ధర రూ.89 పలికిందన్నారు.

చేతికందే ఎత్తులోనే ప్రమాదం!

❖ కనిగిరిలో అస్తవ్యస్తంగా విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

న్యూస్‌టుడే, కనిగిరి

పట్టణం	కనిగిరి
విద్యుత్తు	21 వేల
వినియోగదారులు	మంది
విద్యుత్తు స్తంభాలు	900
నియంత్రికలు	120

కనిగిరి పట్టణంలో విద్యుత్తు స్తంభాలు అధ్వానంగా ఉండడంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ప్రస్తుతం తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో విద్యుదాఘాతాలు జరుగుతాయని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మున్సిపల్ కార్యాలయం, ఉప్పు రోడ్డు, పెద్ద మసీదు ప్రాంతం, కొట్లబజారు, నక్కల దిబ్బ, ఎంఎస్సార్ రోడ్డు, కొత్తపేట, బీసీ కాలనీ, సాయి నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి.

ఎక్కడపడితే అక్కడే..

కొన్ని చోట్ల ఏకంగా గృహాల ఆవరణలో, మరి కొన్ని చోట్ల మురుగు కాలువల్లో, రహదారి మధ్యలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. చాలా చోట్ల ఇనుప స్తంభాలు తుప్పుపట్టి పోయి ఉన్నాయి. వర్షాలు పడిన సమయంలో ఇలాంటి వాటి నుంచి విద్యుదాఘాతం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. ఒంగోలు బస్టాండ్, గార్లపేట రోడ్డు, పంచాయతీ రాజ్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు అధ్వానం, అత్యంత కిందికి ఉన్నాయి. దీనికితోడు రక్షణ కంచె లేకపోవడం, వైర్లు చేతికి అందుతుండడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. మరో విషయం ఏమిటంటే పలుకుబడి ఉంటే స్తంభాలను మారుస్తున్నారని, లేదంటే అలాగే ఉంచుతున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. అడిగితే స్తంభాలు లేవని చెప్పి సిబ్బంది తప్పించుకుంటున్నారని వినియోగదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు స్పందించి అడ్డదిడ్డంగా ఉన్న స్తంభాలను మార్పు చేయాలని, సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై పట్టణ ఏఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా.. ప్రజల ఇబ్బందుల మేరకు అక్కడక్కడ స్తంభాలు మార్చుతున్నామన్నారు. అన్నిచోట్ల కూడా ఎలాంటి విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద విద్యుత్తు నియంత్రిక ఇలా..

కొట్లబజారులో రోడ్డుపై ఉన్న స్తంభం

తాళ్లూరులో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. తాళ్లూరు, లక్కవరం, ఆర్వీపాలెం, తదితర గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. క్రైస్తవుల నివాస కాలనీల్లో క్రిస్మస్ స్టార్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. దీంతో పల్లెల్లో క్రిస్మస్ స్టార్లు కనువిందు చేస్తున్నాయి.

వేతనాలు ఇవ్వాలని కార్మికుల వినతి

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని బెల్లం కొండవారిపాలెం పంచాయతీలో హరితరాయబారులుగా పనిచేస్తున్న తమకు 26 నెలల నుంచి వేతనాలు అందజేయక పోవడంతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము జీవనం సాగించడం చాలా కష్టతరంగా ఉందని, వెంటనే వేతనాలు అందించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీవో పి.అజితను కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే పరిశీలించి తగుచర్యలు చేపడతామని ఆమె తెలియజేశారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు

తాళ్లూరు: మండలంలోని లక్కవరం జడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని చీమకుర్తి లయన్స్ క్లబ్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. హెచ్ఎంలు పద్మనాభశర్మ, పి.శేషుల ఆధ్వర్యంలో మంగళవారం ఆ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, గ్రానైట్ వ్యాపారి చలువాది బదరీనారాయణల చేతులమీదుగా మైక్‌సెట్, గాంధీజీ చిత్రపటం, విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఆర్వోప్లాంటుకు మరమ్మతులు చేస్తామని, గ్రంథాలయ నిర్వహణకు అవసరమైన ర్యాకులు అందజేస్తామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు చలువాది పార్థసారథి, గౌతమ్‌ప్రసాద్, అంజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేస్తున్న బదరీనారాయణ, వైద్యుడు జవహర్ తదితరులు

స్పందించారు.. చిన్నారులకు బహుమతి ఇచ్చారు..

పీసీపల్లి, న్యూస్‌టుడే: దాత సమకూర్చిన టీవీతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. రెండు రోజుల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ మండలంలోని వెంగళాయపల్లి వెళ్లారు. అక్కడి ప్రాథమిక పాఠశాలల ఆవరణలో విద్యార్థులు చేస్తున్న యోగాసనాలను తిలకించారు. వారు చేస్తున్న ప్రదర్శన ఆయనను ఆకట్టుకుంది. స్పందించిన ఆయన పాఠశాలకు ఏమైనా కావాలా.. అని విద్యార్థులను అడిగారు. వారు టీవీ కావాలని కోరారు. మంగళవారం రూ. 20 వేల విలువగల ఎల్ఈడీ టీవీని తమ సిబ్బంది, మండల అధికారుల ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వర్ణ వెంకట రమణయ్యకు అందించారు. ఈ సందర్భంగా దాతను విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో జీవీ కృష్ణారావు, ఎంఈవో శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ అందించిన టీవీతో విద్యార్థులు

మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ

లోక్ అదాలత్ విజయవంతానికి పిలుపు

కనిగిరి, న్యూస్‌టుడే: ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ ఆదేశించారు. మంగళవారం స్థానిక కోర్టులో పోలీసులు, బ్యాంకు అధికారులు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. కక్షిదారులు రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునేటట్లు చూడాలన్నారు. వాది, ప్రతివాదులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకునేలా పోలీసులు కృషి చేయాలని సూచించారు.

చల్లగిరగల.. మురుగుతో విలవిల

కనిగిరి మండలం చల్లగిరగల గ్రామంలోని మురికి కూపంలా ఉన్న కుళాయి వద్ద మంచి నీరు పడుతున్న మహిళను చిత్రంలో చూడవచ్చు. సుమారు 300 కుటుంబాలు నివాసం ఉండే ఇక్కడ ..ఏ వీధిలో చూసినా మురుగునీరే కనిపిస్తుంది. మంచి నీటి ట్యాంకులు పాచిపట్టి మరింత అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు వేసినా.. కాలువలు నిర్మించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కనిగిరి

భవనానికి కావాలి చికిత్స

తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శస్త్ర చికిత్సలకోసం ప్రత్యేక భవనాన్ని దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం శస్త్ర చికిత్సలు చేసేందుకు ప్రత్యేకంగా వైద్యులు లేకపోవడంతో దీనిని గర్భిణుల ప్రసవాలకు ఉపయోగిస్తున్నారు. ఆ భవనం పైభాగంలో నెర్రెలు, పగుళ్లు బారి దుస్థితికి చేరింది. రోగులున్న సందర్భంలో పెచ్చులు రాలి పడితే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఈ విషయమై వైద్యుడు ప్రవీణ్‌ను సంప్రదించగా భవన మరమ్మతులకు నిధుల మంజూరుకోసం ప్రతిపాదించామని, త్వరలోనే పనులు చేయించేందుకు తగు చర్యలు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

దిగి వచ్చిన నారు ధరలు



మొన్నటి వరకు కొండెక్కి కూర్చున్న పొగాకు నారు ధరలు దిత్వా తుపాను కారణంగా కాస్త దిగివచ్చాయి. గత ఏడాది సైతం పలకని ధరలు ఈ ఏడాది ఉండడంతో నర్సరీ రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రెండు రోజుల వరకు రూ.6 వేల నుంచి రూ.7 వేలు పలికిన ధరలు.. వర్షాలు పడితే మొక్కలు నీట మునిగి చనిపోతాయనే భయంతో రైతులు కాస్త వెనకడుగు వేశారు. దీంతో మంగళవారం జరుగుమల్లి మండలంలోని పలుచోట్ల నారు మూట ధరలు రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు పలికాయి. ఓ రైతు ఆటోలో తరలిస్తున్న పొగాకు నారు మూటలివి. -న్యూస్‌టుడే, టంగుటూరు

కామేపల్లి విద్యార్థులు.. సత్తా చాటారు

జరుగుమల్లి మండలం కామేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జూడో పోటీల్లో సత్తా చాటారు. శ్రీసత్యసాయి జిల్లాలో గత నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 14, 19 పోటీల్లో వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు తెలిపారు. మొత్తం ఆరు పతకాలు కైవసం చేసుకున్న వీరిని ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామ పెద్దలు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. -న్యూస్‌టుడే, జరుగుమల్లి

ఆ ఊరిలో రహదారే కాలువ

తాళ్లూరు మండలం తూర్పుగంగవరంలో మురుగు కాలువలు లేక పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తాళ్లూరు వైపు మార్గంలో బ్రహ్మంగారి ఆలయం సమీపాన రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు పారుతుంది. దీంతో దోమలు వ్యాపించి వ్యాధులు ప్రబలుతాయని గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ.. వెంటనే సమస్యపై విచారించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లూరు

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: హెచ్ఎంపాడు మండలం హాజీపురం పంచాయతీ కొత్తూరులో ఇంటింటి కొళాయిల ఏర్పాటులో పైపులైన్ కోసం గుంతలు తీసి పూడ్చలేదు. గ్రామంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. – నాగూర్, గ్రామస్థుడు

✓: సర్పంచి, పంచాయతీ కార్యదర్శికి సూచనలిచ్చి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. – శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: మర్రిపూడి మండలం కూచిపూడి పంచాయతీలోని చెంచిరెడ్డిపల్లి బీసీకాలనీలో వీధిదీపాలు వెలగక రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. –వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –నాగూర్‌వలీ, ఎంపీడీవో

-న్యూస్‌టుడే, హనుమంతునిపాడు, మర్రిపూడి

విద్యతోపాటు నైతిక విలువలు తప్పనిసరి

దర్శి, న్యూస్‌టుడే: విద్యతో పాటు విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలని మానవత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈవో యలమందారెడ్డి సూచించారు. దర్శి పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అనే అంశంపై హెచ్ఎం ఖాదర్‌మస్తాన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవం ఉండాలని సూచించారు. తోటివారితో స్నేహంగా మెలగాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని వివరించారు. ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ధైర్యంగా చెప్పాలని సూచించారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. మనోవికాసం గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానవత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు యలమందారెడ్డి, పక్కన ఉపాధ్యాయులు

రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం

స్పందనకు వందనం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: 15 రోజులుగా నిలిచిపోయిన కనిగిరి - కంభం రహదారి విస్తరణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రూ.వంద కోట్ల ప్యాకేజీతో ఎన్‌డీబీ కింద జరుగుతున్న ఈ పనులు మెటీరియల్‌కు అనుమతులు లేకపోవడంతోపాటు, బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో రాళ్లుతేలిన రహదారిలో చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ విషయమై 'ఈనాడు'లో గత నెల 22న 'నిలిచిన పనులు.. పైకి తేలిన రాళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఎట్టకేలకు మెటీరియల్ అందుబాటులోకి రావడంతో పనులు పునః ప్రారంభమయ్యాయి.

కేజీబీవీలో పరిశుభ్రత అవసరం

తాళ్లూరు, న్యూస్‌టుడే: తాళ్లూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం మండల ప్రత్యేకాధికారి ఎ.కుమార్, ఇతర అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, వసతులను పరిశీలించారు. వివిధ రకాల దస్త్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వడ్డించిన ఆహార పదార్థాల నాణ్యతను తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో కలిసి స్వయంగా ఆహారాన్ని తిని రుచి చూశారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అసంపూర్తి భవన నిర్మాణాలవల్ల బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో పి.అజిత, ఎంఈవో జి.సుబ్బయ్య, ఆర్ఐ సుధీర్, ఎస్వో సుజిత తదితరులు పాల్గొన్నారు.

బాలికలు తింటున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సొంతింటి కల.. సాకారమయ్యేలా..!

☛ పీఎంఏవై 2.0తో గృహ నిర్మాణాలకు అవకాశం

న్యూస్‌టుడే, తాళ్లూరు

ఎంతోమంది పేదలు సొంత గూడు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో కొందరి ఇళ్ల స్థలాలు అందించినా అందులో గృహ నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి. దీంతో ఎంతో మంది లబ్ధిదారులు పక్కా గృహాలు దక్కక నిరాశకు గురయ్యారు. దీంతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదల ఇబ్బందుల ఇబ్బందులను గుర్తించింది. సొంత గృహాల నిర్మాణానికి చేయూతనివ్వాలని తలచింది. ఈ కోవలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0ను ఉపయోగించుకోవాలని భావించింది. ముందుగా పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు అర్హులైన పేదల జాబితాలను సిద్ధం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించింది. ఇందుకోసం సొంత స్థలాలున్న పేదలు ఎంత మంది ఉన్నారనే విషయమై గత నెలలో వారం దరూ కలిసి గ్రామాల వారీగా పర్యటించి సర్వే చేశారు. తొలుత నవంబరు ఆఖరు వరకే పేదల గుర్తింపునకు అవకాశం ఇవ్వడంతో దర్శి నియోజకవర్గంలో 2,598 మందిని గుర్తించారు. వారందరికీ స్థలాలు ఉండడం, బియ్యం కార్డు కలిగి ఉన్నందువల్ల పక్కా గృహాల మంజూరుకు అవకాశం ఏర్పడింది. గడువు పూర్తవుతుందని కొందరు ఉరుకులు పరుగులు తీసి వివరాలను సర్వేలో నమోదు చేయించారు. ప్రభుత్వం పేదల ఇబ్బందులను గమనించి ఈ నెల 14వ తేదీ వరకు సర్వే పొడిగించింది. దీంతో మరికొందరికి అవకాశం లభించనుంది.

దర్శి నియోజకవర్గంలో లబ్ధిదారుల ఎంపిక సర్వే వివరాలు

మండలం	గుర్తించిన పేదలు
దర్శి	596
తాళ్లూరు	528
దొనకొండ	527
కురిచేడు	485
ముండ్లమూరు	462 మంది

దోసకాయలపాడులో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ హనుమంతరావు

పది విద్యార్థులకు ఉపయుక్తం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల కోసం యూటీఎఫ్ తయారు చేసిన టెస్ట్ పేపర్ల పుస్తకాలు ఉపయుక్తంగా ఉంటాయని సి.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.డేవిడ్ తెలిపారు. ఆ పాఠశాలలో మంగళవారం మోడల్‌పేపర్ల పుస్తకాలను ఆవిష్కరించారు. నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులచే రూపొందిన ఈ పుస్తకాలను విద్యార్థులు చక్కగా చదివితే మంచి మార్కులు వస్తాయని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా, నాయకులు జె.వెంకటరావు, జి.శ్రీనివాసరాజు, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ టెస్టు పేపర్ల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయుడు డేవిడ్, ఉపాధ్యాయులు

జల్లులు.. ఆందోళనలో వరి రైతులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో మండలంలో చిరు జల్లులు పడుతున్నాయి. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రచారంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలోని పసుపుగల్లు, పెదఉల్లగల్లు, వేముల, రెడ్డినగర్ గ్రామాల్లో ముందుగా సాగు చేసిన వరి కోతకు వచ్చింది. రైతులు కోతలు కోసి నూర్పిళ్లు చేసి ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోశారు. పట్టలతో ధాన్యం తడవకుండా కప్పివేశారు. కొందరు రైతులు గోతాల్లో నింపి ఇళ్లకు తరలించారు. కొందరు వెంటనే వచ్చిన ధరకు విక్రయించేశారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు యంత్రాల ద్వారా కోసిన గింజలను ఇళ్లకు చేర్చుకున్నారు. అధికారులు గ్రామాల్లో పంట నష్టం కాకుండా అవగాహన కల్పిస్తున్నారు.

ఆరబోతలో మెలకువలు పాటించాలి..

తాళ్లూరు, న్యూస్‌టుడే: వరి ధాన్యం నాణ్యత పెరగడానికి ఆరబోతలో మెలకువలు పాటించాలని, తద్వారా కొనుగోలుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు సూచించారు. మాధవరంలో ఆరబోసిన ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ధాన్యంలో 17 శాతం మేరకు తేమ ఉండాలన్నారు. వాతావరణ పరిస్థితులను గమనించి వరి కోతలు కోయాలన్నారు.

మూడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలో మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు దర్శి వ్యవసాయ సహాయ సంచాలకుడు బాలాజీ నాయక్ తెలిపారు. మంగళవారం కల్లూరు, పడమర నాయుడుపాలెం, ఆవులమంద గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏవో సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మేలైన రకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,389లు మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వీటితోపాటు గోనె సంచికి రూ.4.74లను, హమాలీ ఖర్చుల నిమిత్తం క్వింటాకు రూ.22లను ప్రభుత్వమే రైతులకు అందజేస్తుందని తెలిపారు. వరి రైతులెవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద మాత్రమే పంటను అమ్ముకోవాలని ఏడీఏ సూచించారు.

తాళ్లూరు: ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో ప్రసాదరావు

కురిచేడు: ధాన్యం కొనుగోలుకు సంబంధించి కరపత్రాలు ప్రదర్శిస్తున్న అధికారులు

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

ప్రసంగాలతో ప్రతిభ చాటారు

బహుమతులు అందుకున్న పీవీఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజేతలతో సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రం ప్రతినిధులు

ఒంగోలు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, మంగమూరు రోడ్డులోని సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉపన్యాస పోటీలు ఉత్సాహంగా సాగాయి. 'విద్యార్థులపై సెల్‌ఫోన్ ప్రభావం' అన్న అంశంపై... 7, 8, 9, 10 తరగతుల వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పీవీఆర్ ఉన్నత పాఠశాలలో బి.తిమ్మయ్య, సీహెచ్ చమన్‌సాయి, ఎస్‌కే మొయినుద్దీన్ బాషా ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయిని ఎం.రాధిక, ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ● సత్యసాయి విద్యాకేంద్రంలో రాచపూడి సాయివర్షిత (ప్రథమ), దేసు తనూజ (ద్వితీయ), టి.రూపలక్ష్మి (తృతీయ) విజేతలుగా నిలిచారు. కేంద్రం ప్రతినిధులు ఎంవీ కృష్ణయ్య, ఒ.నాగేష్, ఆర్.సుబ్బారావు వీరికి బహుమతులు అందజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్, పాస్టర్ సతీష్‌కుమార్ తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తర బైపాస్‌లోని కల్వరి టెంపుల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సతీష్‌కుమార్ దైవ సందేశం వినిపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్... కేక్ కోసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, యక్కల తులసీరావు, బండారు మదన్, గుర్రాల రాజ్‌విమల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

పూజిత, స్టీఫెన్, దీపిక, హర్ష

చీమకుర్తి, న్యూస్‌టుడే: బండ్లమూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థిని ఎ. పూజిత జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. చిత్తూరు జిల్లా కలికిరిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటడంతో రాష్ట్ర జట్టులో స్థానం లభించింది. గుండ్లాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కందుల స్టీఫెన్ అండర్-14 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. జనవరిలో రాజస్థాన్‌లో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కరశాస్త్రి, ప్రభాకర్; వ్యాయామ ఉపాధ్యాయులు మాలకొండయ్య, మాధవీలత, విజయ్‌కుమార్, ఇతర సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. ● బాలికల విభాగంలో గుండ్లాపల్లి విద్యార్థినులు కుంచాల దీపిక, తలకాయల హర్ష ఉత్తమంగా రాణించి జిల్లా జట్టు రన్నరప్ సాధించడంలో ముఖ్య భూమిక పోషించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

వాగు పోరంబోకులో 35 అక్రమ నిర్మాణాలు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: పేర్నమిట్టలో రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నారాయణరెడ్డి నేతృత్వంలో సర్వేయర్ రాజేష్, సిబ్బంది ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రతిభ కళాశాల పక్కన సర్వే నంబరు 215ఎ/1ఎలో 4.62 ఎకరాల వాగు పోరంబోకు స్థలాలను ఆక్రమించి మొత్తం 35 నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. గ్రామస్థుల ఫిర్యాదు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలివిడతగా ఈ సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ స్థలం చుట్టూ హద్దులు ఏర్పాటు చేశామని... నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఇరిగేషన్, ఎన్నెస్పీ భూములనూ సర్వే చేయనున్నట్లు వెల్లడించారు.

ఓటర్లు స్థానికంగానే ఉన్నారా...?

అర్హులైన ఓటర్లను తొలగించారని బిహార్ సార్వత్రిక ఎన్నికల ముగింట ప్రతిపక్షాలు ఆరోపించిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లాలోనూ సెప్టెంబర్ నుంచి చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. ప్రక్రియ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఒంగోలు నగరంలో ఇప్పటి వరకు 81,244 మంది (45.89 శాతం) ఓటర్లను మాత్రమే మ్యాపింగ్ చేశారు. క్షేత్రస్థాయిలో బీఎల్వోలు, తహసీల్దార్లు దృష్టి సారించకపోవడమే ఈ పరిస్థితికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- న్యూస్‌టుడే. ఒంగోలు గ్రామీణం

ఒంగోలు నగరం గద్దలగుంటలో ఓటర్ల వివరాలు సేకరిస్తున్న బీఎల్వోలు

ఆన్‌లైన్‌లో మ్యాపింగ్...

పోలింగ్ కేంద్రాల వారీగా బోగస్ ఓటర్లను గుర్తించేందుకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి సదరు కుటుంబ సభ్యుల ఓటుహక్కుపై ఆరా తీస్తున్నారు. ఓటు ఎక్కడున్నా ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేస్తున్నారు. రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించి... ఒకటి తొలగిస్తున్నారు. వివాహం అనంతరం ఎక్కువ మంది మహిళలకు పుట్టినిల్లు, మెట్టినింట్లో ఓటు హక్కు ఉన్నట్లు గుర్తించారు. వాటిని నిశితంగా పరిశీలించి ఒకటే మాత్రమే ఓటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగడం లేదు.

• క్షేత్రస్థాయిలో జాబితాల పరిశీలన

వలస ఓటర్ల గుర్తింపు...

2002 జాబితాతో పోలిస్తే ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఆ మేరకు ఇంటి నంబర్ల వారీగా వివరాలు పరిశీలిస్తున్నారు. కొత్తగా చేరిన వారిని వలసదారులుగా గుర్తించి... రెండు, మూడు చోట్ల వివరాలుంటే తొలగిస్తున్నారు. పాత జాబితాలో పేరుండి... ప్రస్తుతం ఓటుహక్కు లేనివారి పేర్లను నమోదు చేస్తున్నారు. పాత, కొత్త జాబితాల పరిశీలన పూర్తయితే వలసదారుల శాతం ఎంతన్నది తేలుతుందని అధికారులు చెబుతున్నారు.

మండలం	మొత్తం ఓటర్లు	మ్యాపింగ్ పూర్తయినది
ఒంగోలు నగరం	1,77,046	81,244
ఒంగోలు	20,438	15,799
సంతనూతలపాడు	55,498	29,541
చీమకుర్తి పట్టణం	22,864	12,927
చీమకుర్తి	38,674	26,640
నాగులుప్పలపాడు	56,097	34,503
కొత్తపట్నం	42,589	28,886
మద్దిపాడు	41,026	30,567

విద్యాసంస్థల బంద్‌కు సంఘాల పిలుపు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు విద్యార్థి, యువజన ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ తెలిపారు. ఈ మేరకు ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబుకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు నష్టం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం దిగుమతులను ప్రోత్సహిస్తున్నందునే స్థానికంగా పండిన శనగ, పత్తి, ఇతర పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక సంక్షోభం తలెత్తిందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పేర్కొన్నారు. మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాత విధానంలోనే జామాయిల్, సుబాబుల్ కర్ర కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నాయకులు పమిడి వెంకటరావు, చుండు శేషయ్య, సాగర్, బీమవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుద్ధ్య పనులపై సమీక్ష

పారిశుద్ధ్య పరికరాలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్)లో పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు, ఏవో ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఒప్పందం ప్రకారం అన్ని రకాల పరికరాలు, మానవ వనరులను సిద్ధంగా ఉంచాలని ఏజెన్సీ వారిని ఆదేశించారు. సంబంధిత పరికరాలను పరిశీలించారు. సిబ్బందికి ఏకరూప దుస్తులు, అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మెడికల్ వేస్ట్ నిర్వహణ, కాలువల్లో పూడిక తొలగింపునకు సంబంధించి పలు సూచనలు చేశారు. అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

ఏడుగుండ్లపాడులో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కౌశలం పరీక్షలు ప్రారంభం

మద్దిపాడు, న్యూస్‌టుడే: కౌశలం పేరిట ఇంటికే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పించాలన్న కూటమి ప్రభుత్వం లక్ష్యంలో భాగంగా మంగళవారం సచివాలయాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మద్దిపాడు మండల పరిధిలో 18 సచివాలయాల నుంచి మొత్తం 178 మంది పరీక్ష నిర్వహిస్తున్నారు. రోజుకు 36 మంది చొప్పున ఆరో తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. తొలిరోజు సర్వర్ సక్రమంగా పనిచేయక కొంత సమస్య తలెత్తింది. సచివాలయాల సిబ్బంది సమస్యను పరిష్కరించారు.

వేడుకగా పడి భజన

ప్రత్యేకంగా అలంకరించిన మండపం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి... కనక దుర్గాభవాని, శివపార్వతుల పడి భజన వేడుకగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భజనలు చేపట్టారు. సర్వ మాలధారణ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరికీ భిక్ష ఏర్పాటు చేశారు.

ఆటపై ఇష్టం.. సాధనతో విజయం

• జాతీయ స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు

గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. పూర్తి స్థాయిలో వసతులు లేకున్నా పాఠశాల్లో పీఈటీ శిక్షణతో చిన్నతనం నుంచే హాకీ క్రీడ నేర్చుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతున్నారు.

- న్యూస్‌టుడే, మైనంపాడు (సంతనూతలపాడు)

వెన్నంటి నిలిచిన తల్లి

తండ్రి లేకున్నా తల్లి ప్రోత్సాహంతో నిరంతర శిక్షణతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగింది తన్నీరు సాయి శ్రీవాణి. మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతిలో ఉండగానే శిక్షణ ప్రారంభించింది. పీఈటీ రవి కుమార్ సారథ్యంలో రోజుకు 4 గంటలపాటు సాధన చేసింది. మైనంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ చదువుతున్న శ్రీవాణి అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. తల్లి వనిత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. హాకీలో బంతిని వేగంగా పక్క వారికి అందించడంలో బాగా రాణిస్తోంది.

- తన్నీరు సాయి శ్రీవాణి

6వ తరగతి నుంచే మక్కువ

హాకీ క్రీడలో మంచి ఫార్వార్డ్ ప్లేయర్‌గా రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు పాతపాటి గిరివర్ధన్. మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న ఇతను 6వ తరగతి నుంచే హాకీ క్రీడలో శిక్షణ పొందుతున్నాడు. చిత్తూరు జిల్లా చంద్రగిరిలో అండర్-14లో విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అమ్మానాన్న మౌనిక, వెంకటేశ్వర్లు చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు.

- పాతపాటి గిరివర్ధన్

నందిపాడుకు బస్సు నడపాలని వినతి

మద్దిపాడు, న్యూస్‌టుడే: నందిపాడు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని తెదేపా సీనియర్ నాయకుడు కొర్రపాటి మాధవరావు... ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా ఆర్ఎం సత్యనారాయణను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇచ్చిన సిఫారసు లేఖను సమర్పించారు.

నైతిక విలువలు తప్పనిసరి

దర్శి, న్యూస్‌టుడే: విద్యతో పాటు విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలని మానవత సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈవో యలమందారెడ్డి సూచించారు. దర్శి పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అనే అంశంపై హెచ్ఎం ఖాదర్‌మస్తాన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవం ఉండాలని సూచించారు. పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. మనోవికాసం గురించి కూడా వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **ఒంగోలు నగరం:** సమతానగర్‌లో సిమెంట్ రోడ్లు, కాలువలు లేక ఇళ్ల మధ్యనే మురుగు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- రమేష్, ఉపాధ్యాయుడు**

✓: మరో మూడు నెలల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి టెండర్లు పిలవబోతున్నాం. మీ ప్రాంతానికి ప్రాధాన్యం కల్పించి పనులు చేపడతాం. **- ఐసయ్య, మున్సిపల్ ఇంజినీర్**

?: **ఒంగోలు నగరం:** లాయర్‌పేట అడపా వారి బ్యారన్‌ల వద్ద వీధి దీపం వారం రోజుల క్రితం బాగు చేసినా వెలగడం లేదు.

- కాటా నాగేశ్వరరావు

✓: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

?: **ఒంగోలు నగరం:** పండరీపురంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి తరుముతున్నాయి.

- సోమసుందరరావు

✓: విడతల వారీగా అన్ని ప్రాంతాల్లో కుక్కలను పట్టించి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, వాక్సినేషన్ చేపడుతున్నాం. మీ ప్రాంతంలోనూ ఈ ప్రక్రియ చేపడతాం.

- పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

?: **మద్దిపాడు:** పారిశ్రామికవాడలో వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

- వల్లెపు సుబ్బయ్య, బూరేపల్లి కాలనీ

✓: హైవే మొబైల్ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **- వెంకట సూర్య, ఎస్సై**

వెలిగిన వీధి దీపం

స్పందనకు వందనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: పట్టణ ప్రధాన రహదారిలో కెనరా బ్యాంకు వద్ద వీధి దీపం వెలగక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విషయం 'ఈనాడు- మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితం కావడంతో పురపాలక సంఘం అధికారులు వెంటనే స్పందించి మంగళవారం మరమ్మతులు చేపట్టారు.

శ్రీగిరి దర్శనాలు రద్దు

నేడు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహిస్తున్నందున భక్తుల దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి యథావిధిగా దర్శనాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. అందరూ ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

సచివాలయ సిబ్బందితో సమావేశం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తేళ్ల రవికుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది విధివిధానాలు, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు.

కారుమంచి పునరుద్ధరణకు అడుగులు

• పూర్తయిన మట్టి నమూనాల సేకరణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: గ్రానైట్ క్వారీల ప్రాంతంలో కోతకు గురై దెబ్బతిన్న కారుమంచి మేజర్ కాలువ కట్ట పునర్నిర్మాణ పనులకు రంగం సిద్ధమైంది. అందులో భాగంగా అక్కడి నేల స్వభావం తెలుసుకొనేందుకు మట్టి నమూనాలు సేకరించారు. విజయవాడ నుంచి వచ్చిన సిబ్బంది కోర్ డ్రిల్లింగ్ పద్ధతిలో పది రోజుల పాటు ఈ ప్రక్రియ చేపట్టారు.

రూ.2.69 కోట్లు మంజూరు...

మధుకాన్ గ్రానైట్ క్వారీ ప్రాంతంలో కాలువ కట్ట కోతకు గురై క్వారీలోకి పడిపోయింది. అప్పటి వైకాపా ప్రభుత్వం పునరుద్ధరణకు చర్యలు తీసుకోక రైతులు అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ నిర్మాణానికి డీఎంఎఫ్ నిధులు రూ.2.69 కోట్లు మంజూరు చేసింది. సాంకేతిక పరమైన అనుమతులు కోసం స్థానిక అధికారులు దస్త్రాన్ని గుంటూరు పంపారు. తరువాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆ ప్రాంతంలో కట్టల నిర్మాణానికి నేల అనుకూలంగా ఉన్నదీ లేనిదీ నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో చెన్నై ఐఐటీ నిపుణులు పరిశీలించి వెళ్లారు. వీరు తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. దీంతోపాటు నాలుగు ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించారు. జలవనరుల శాఖ అధికారులు, నీటి పంపిణీ సంఘం అధ్యక్షులు పర్యవేక్షించారు.

డ్రిల్లింగ్ పద్ధతిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

పెంచలయ్య హత్య దారుణం

కె.వి.పాలెంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి, న్యూస్‌టుడే: నెల్లూరులో ప్రజా నాట్య మండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్యోదంతాన్ని ఖండిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కె.వి.పాలెం, నిప్పట్లపాడులో మంగళవారం రాత్రి నిరసన ర్యాలీలు చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ... హత్యకు పాల్పడిన గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పుత్తూరి సురేష్, కొల్లూరి వెంకటేశ్వర్లు, రామారావు, నల్లూరి క్రిష్ణయ్య, నుగ్గు శ్రీను, ప్రభుదాసు, ప్రసాద్, శ్రీను, దర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ● **నాగులుప్పలపాడు:** ఉప్పుగుండూరులో చేపట్టిన నిరసనలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి కృషి చేస్తున్న ఆయనను హత్య చేయడం దారుణమన్నారు. కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. సామాజిక సేవా కార్యకర్త శామ్యూల్, బసవపున్నయ్య, వెంకటేశ్వర్లు, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహంపై కేసు నమోదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహంపై మహిళా పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు బలరాం కాలనీకి చెందిన ఓ బాలిక తొమ్మిదో తరగతి చదువులోంది. కుటుంబీకులు ఆమెను... నెల్లూరు జిల్లా కావలికి చెందిన హరీష్‌రెడ్డికి ఇచ్చి గత నెల 28న కందుకూరులో వివాహం జరిపించారు. పెళ్లి ఇష్టం లేని బాలిక ఆ తరువాతి రోజు 1098కు ఫిర్యాదు చేసింది. దీంతో జిల్లా మహిళా, శిశు సంరక్షణ అధికారిణి సువర్ణ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. బాధిత బాలికను అదే రోజు రామ్‌నగర్‌లోని బాలసదన్‌కు తరలించి... మహిళా పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. మైనంపాడులో గణితం, రుద్రవరంలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని... ఆసక్తి గల వారు ఈ నెల 5లోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ నెల 8 నుంచి వచ్చే ఏడాది మే 7 వరకు విధుల్లో కొనసాగుతారని, నెలకు రూ.12,500 గౌరవ వేతనం ఇస్తారని వివరించారు.

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

సంతనూతలపాడు: మైనంపాడు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఆయనను ఘనంగా సన్మానించారు.

ఆటో ఎక్కితేనే ఉచిత బస్సు!

• వైకాపా హయాంలో సర్వీసులు నిలిపేయడంతో సమస్య

న్యూస్‌టుడే - మద్దిపాడు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. అతివలూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... సంతనూతలపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మాత్రం ఇది అందని ద్రాక్షలానే మిగులుతోంది. గత వైకాపా ప్రభుత్వం కరోనా సమయంలో చాలా వరకు పల్లె వెలుగు సర్వీసులు నిలిపేసింది. తరువాత పరిస్థితి చక్కబడినా వాటిని పునరుద్ధరించలేదు. దీంతో నేటికీ సమస్య కొనసాగుతోంది. ప్రస్తుతం ఆయా పల్లెల వారు ఉచిత బస్సు కోసం... ప్రధాన రహదారి వరకు ఆటోల్లో రావాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి...

● మద్దిపాడు మండలంలోని రాచవారిపాలెం, అన్నంగి, నందిపాడు తదితర గ్రామాలకు గతంలో బస్సులు తిరిగినా ప్రస్తుతం లేవు. దీంతో వారంతా ఆటోలు, ఇతర వాహనాల్లో జాతీయ రహదారి కూడలికి చేరుకోవాల్సి వస్తోంది. నేలటూరు, పెదకొత్తపల్లి, లింగంగుంట గ్రామాలకు అరకొరగానే బస్సు సర్వీసులు తిరుగుతున్నాయి. ● చీమకుర్తి మండలంలో నాయుడుపాలెం, ఎర్రగుడిపాడు, గోనుగుంట, రామచంద్రాపురం, పిడతలపూడి, మువ్వావారిపాలెం, బూదవాడ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఈ ప్రాంతాల మహిళలు చీమకుర్తి వరకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ● సంతనూతలపాడు నియోజకవర్గంలో మొత్తం 88 పంచాయతీలు ఉండగా దాదాపు సగం గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం సమస్యగా మారింది. పాత సర్వీసులను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే మహిళలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులకూ మేలు కలుగుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వెల్లంపల్లి నుంచి మద్దిపాడు కూడలికి ఆటోలో వెళ్తున్న మహిళలు

బహిరంగ ప్రకటన

మా క్లయింటు మద్దులూరి రవీంద్రబాబు కుమార్తె సాయి ప్రణవరవళి భాగ్యనగర్, ఒంగోలు అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

మా క్లయింటు షెడ్యూలు ఆస్థిని దోనేపూడి జాలరామయ్యగారి కుమార్డు చక్రవరిగారి నుండి ద.నెం. 2849/1992 ద్వారా విక్రయం పొందిన ఆస్థిని కొనుగోలు చేయబోవుచున్నదని, అందులకుగాను ఎవరికైనా ఏలాంటి అభ్యంతరములున్నా వారం రోజులలోగా మాకుగానీ, మా క్లయింటకుగానీ తెలియజేయవలసినది.

షెడ్యూలు:- ఒంగోలు స.రి. యిలాకా పెళ్ళూరు గ్రామ స.నెం. 50/1, 50/2, 50/3రుల లో ప్లాటు నెం. 77గా గల 241 చ.గ. స్థలమునకు హద్దులు. **తూర్పు:** 25 అడుగుల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ప్లాటు నెం. 76, **పడమర:-** దోనేపూడి సుబాకర్ స్మయిల్స్ గారి స్థలం, **ఉత్తరం:** 30 అడుగుల వెడల్పుగల రోడ్డు.

ఇట్లు సం/- **అడుసుమల్లి రామయ్య**
ఒంగోలు, అడ్వకేటు, ఒంగోలు.
2.12.2025 సెల్ నెం: 94403 90288

INDIRA PRIYADARSHINI LAW COLLEGE
South by-pass, Pelluru, ONGOLE - 523272.
SPOT QUOTA (A/Y 2025-26)
Eligibility
▸ For 3 Year LL.B Course- 10+2 + Any Degree with 45% Marks
▸ For 5 Year B.A., LL.B Course- 10+2 or Equivalent with 45% Marks
▸ For LL.M (C.A & C.S branches) - Graduation degree in Law
▸ For details of vacancies and guidelines Contact: 08592 234156, 8008164156 or Visit Website: https://iplcongole.in/
C.V. RAMAKRISHNARAO M.A., M.L
Secretary & Correspondent

మేయర్‌పై అవిశ్వాసం 18న

కలెక్టర్ ఉత్తర్వుల జారీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి పదవికి గండం ఏర్పడింది. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభంకానుంది. నగరంలో 54 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి 40 మంది సంతకాలు చేశారు. మరో ఇద్దరు తెదేపాలో చేరడంతో బలం 42కు పెరిగింది. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ రాజీనామా చేయగా.. వైకాపాకు 11 మందే కార్పొరేటర్లు ఉన్నారు. మేయర్ తమ పార్టీ కాదని ఇప్పటికే వైకాపా ప్రకటించింది. 53 మంది సభ్యుల్లో కనీసం ఒక్కరి మద్దతు కూడా మేయర్ కూడగట్టుకోలేకపోయారు. తెదేపాకు 42 మంది కార్పొరేటర్లతో పాటు ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఓట్లు వేసే అవకాశం ఉంది.

వర్షం.. వరి నాట్లకు నష్టం దిత్వా తుపానుతో కురుస్తున్న వర్షాలకు వరి రైతులకు నష్టం వాటిల్లింది. కోలగట్ల, పెరమన, సంగం, పడమటిపాళెం, వెంగారెడ్డిపాళెం, మర్రిపాడు, జంగాలకండ్రిక, చెర్లో వంగల్లు, దువ్వూరు, తరుణవాయి, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకుపైనే నారుమడులు, వంద ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. – న్యూస్‌టుడే, సంగం

కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తు

కార్పొరేటర్లు, నాయకులతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(నగరపాలకసంస్థ): తెదేపాలో కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తు ఉంటుందని మంత్రి నారాయణ అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో 28 డివిజన్లకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేయాలని వారితో ప్రమాణం చేయించారు. ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. 2024 ఎన్నికల్లో 72,489 ఓట్ల మెజార్టీతో తనను గెలిపించారని.. 3,600 మంది కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడ్డారన్నారు. ప్రజల ఆకాంక్షలు తీరుస్తూ.. కార్యకర్తలకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమానికి రూ.10కోట్లు సొంత నిధులు ప్రకటించానని గుర్తు చేశారు. మాట ప్రకారం ఆర్థిక సాయం కోరిన కార్యకర్తలకు రూ.25వేల వంతున ఇస్తున్నట్లు వెల్లడించారు. డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్‌యాదవ్, తహసీన్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అమ్మో ఆ ఇళ్లు.. నాణ్యతకు నీళ్లు!

థర్డ్‌పార్టీ తనిఖీల్లో విస్తుబోయే విషయాలు వెలుగులోకి

ఈనాడు, నెల్లూరు: ఉదయగిరి, న్యూస్‌టుడే: ఇళ్లు కాదు.. ఊళ్లే కట్టిస్తున్నామని ప్రగల్భాలు పలికిన వైకాపా ప్రభుత్వం.. ఆ పేరుతో పేదల ప్రాణాలతోనే చెలగాటమాడింది. పునాదుల దశ నుంచి పైకప్పు వరకు అన్ని దశల్లో నాణ్యతను తీసికట్టుగా మార్చింది. జిల్లాలో ఆప్షన్-3లో 28,224 మందికి ప్రభుత్వమే ఇళ్లు కట్టిస్తుందని చెప్పి.. తమ పార్టీ అనుయాయులనే గుత్తేదారులుగా ఎంపిక చేసింది. వారు ఇష్టానుసారం వ్యవహరించిన ఫలితంగా కొన్నిచోట్ల గృహ ప్రవేశాలు చేయకముందే పైకప్పులు కూలిపోతున్నాయి. మరికొన్ని చోట్ల వర్షానికి ఉరుస్తున్నాయి. పైగా చేపట్టిన 28,224 ఇళ్లలో వైకాపా ప్రభుత్వం పూర్తి చేసింది 6,509 మాత్రమే. 10,666 పునాది.. అంత కంటే తక్కువ స్థాయి లోనే ఉండగా.. ప్రస్తుతం వీటిని పూర్తి చేయడం కూటమి ప్రభుత్వానికి సవాలుగా మారింది.

ఉదయగిరి మండలం గంగిరెడ్డిపాళెంలో ఆప్షన్-3 కింద చేపట్టిన 141 నిర్మాణాలను థర్డ్ పార్టీ బృందం పరిశీలించింది. రీబౌండ్ హేమర్‌తో పరీక్షించింది. ఆ ప్రకారం నాణ్యత బాగుంటే 28 పాయింట్లు చూపిస్తుంది. ఇక్కడి నిర్మాణాల్లో 90 శాతం 18 నుంచి 23 పాయింట్లే చూపించినట్లు సమాచారం. తద్వారా ఎక్కువ శాతం తదుపరి పనులకు పనికి రావని తేలింది.

లోపాలు తేలకుండా..

జిల్లాలో ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్లను 17 మంది అధికారుల బృందం తనిఖీ చేస్తోంది. ఇప్పటి వరకు 24వేల వరకు పరిశీలించగా.. వీటిలో చాలా వరకు నిర్దేశిత నాణ్యత మేరకు లేవని స్పష్టమైంది. 50 శాతం మళ్లీ నిర్మించాల్సి ఉంటుందని గృహ నిర్మాణశాఖ అధికారులే చెబుతుండటం గమనార్హం. కాగా, ఈ లోపాలు వెలుగులోకి రాకుండా జిల్లాకు చెందిన ఓ బడా కాంట్రాక్టరు పావులు కదుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడు సంపాదించిన సొమ్ముతో.. ఈ ప్రభుత్వంలోనూ అధికారులకు మామూళ్లు ఎరవేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి.

● దీనిపై గృహ నిర్మాణశాఖ అధికారులను వివరణ కోరగా.. ఇంకా థర్డ్‌పార్టీ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారని, పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

పెంచలయ్య హత్యోదంతం అమానుషం

జిల్లా బంద్ విజయవంతం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు రాష్ట్రంలో లేకుండా చేసేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. ప్రజా నాట్యమండలి, సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం వామపక్షాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా బంద్ విజయవంతమైంది. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో పెద్ద ఎత్తున కార్యకర్తలు మానవహారం నిర్వహించారు. అంతకుముందు గంజాయిని తరిమికొట్టాలంటూ ఆ మహమ్మారి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్‌సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. గంజాయి ముఠా కార్యకలాపాలను వ్యతిరేకించిన పెంచలయ్యను నరికి చంపడం దారుణమన్నారు. జిల్లాలో, రాష్ట్రంలో గంజాయిని అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు, సాయి, కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, మోహన్‌రావు, జానకి ప్రసాద్, సిరాజ్, ఇన్సాఫ్, ఆవాజ్ నాయకులు అజీజ్, అహ్మద్, రషీద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు అనిల్, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముష్కాన్ గురి చూస్తే.. పతకమే

పట్టణానికి చెందిన షేక్ ముష్కాన్ గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎయిర్‌గన్ షూటింగ్ పోటీలకు హాజరై ప్రతిభ చాటింది. తద్వారా అండర్-19 కేటగిరీలో.. 75 కిలోల విభాగంలో.. వచ్చే నెలలో దిల్లీలో జరిగే పోటీలకు ఎంపికైంది. ఈమెకు తండ్రి లేరు. తల్లి కున్నిమా ప్రైవేట్ ఉద్యోగిని. ఆమె కష్టమే ప్రేరణగా షూటింగ్‌లో సాధన చేసిన ముష్కాన్.. 2018లో అమరావతిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణం, అదే పోటీల్లో మరో విభాగంలో రజతం గెలుపొందింది. 2019లో ఒంగోలులో జరిగిన పోటీల్లోనూ రెండు స్వర్ణాలు సాధించింది. అదే ఏడాది కనిగిరిలో రజతం, విజయవాడలో స్వర్ణం, కాంస్యం, 2021లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకాలు సాధించింది. 2019, 2020ల్లో విశాఖలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రజతం, 2022లో హైదరాబాద్‌లో నిర్వహించిన టోర్నీలో రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. కరాటేలోనూ ప్రావీణ్యం ఉన్న ముష్కాన్.. ముమ్ముందు మరింత ప్రతిభ కనబరిచి జీవితంలో నిలదొక్కుకోవడంతో పాటు పట్టణానికి పేరుతెస్తానని అంటోంది. – న్యూస్‌టుడే, కావలి

అమృత్ ధారలు.. వేగంగా దారులు!

రూ.449.60 కోట్లు ఖర్చు చేసేందుకు నిర్ణయం

నెల్లూరు నగరంలో యూజీడీ పనులు

ఈనాడు, నెల్లూరు: పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేలా... మురుగునీటి శుద్ధి పనులు గాడిన పడేలా.. అమృత్ 2.0 పథకం పనులను ప్రభుత్వం పట్టాలెక్కించనుంది. నగర, పురపాలకాల్లో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా- ఇందు కోసం జిల్లాలో రూ. 449.60 కోట్లతో పనులు చేపట్టేందుకు మూడు నెలల కిందట టెండర్లు పిలిచారు. అవి 2024-25 పాత ఎస్‌వోఆర్ ప్రకారం ఉండటంతో గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో 2025-26 కొత్త ధరల ప్రకారం టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదించగా.. ఆర్థికశాఖ నుంచి రివైజ్డ్ అనుమతులు వచ్చినట్లు సమాచారం.

రానున్న 20 ఏళ్లను..

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. వచ్చే 20 ఏళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ), అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్(యూఐడీఎఫ్) సాయంతో చేపట్టిన ప్రాజెక్టులను డిసెంబరు నాటికి ప్రారంభించి.. 2028 చివరి కల్లా పూర్తి చేయాలని భావిస్తోంది. అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడం.. పైప్‌లైన్ల పునరుద్ధరణ, జలాశయాల సామర్థ్యం పెంపు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, ఇంటింటికీ కనెక్షన్లు వంటివి చేపట్టనున్నారు.

“వైకాపా ప్రభుత్వంలో అనేక పనులు ప్రతిపాదించగా.. ఏళ్లుగా పట్టాలెక్కలేదు. రాష్ట్ర నిధులు కేటాయించని కారణంగా.. బిల్లులు సరిగా చెల్లించక.. ప్రారంభించినవీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టింది. గత జూన్‌లో ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రారంభించింది. గడువు పొడిగించినా.. స్పందన లేదు. దాంతో కొత్త ఎస్‌వోఆర్ ప్రకారం సుమారు 4 శాతం మేర ధరల వ్యత్యాసంతో టెండర్లు పిలిచేందుకు కసరత్తు జరుగుతోంది.”

ఇదీ పరిస్థితి! (రూ.కోట్లలో)

పథకం	అమృత్ 2.0
మొత్తం నిధులు	449.60
తాగునీటి సరఫరా	199.11
మురుగునీటి వ్యవస్థ అభివృద్ధి	230.95
నీటి వనరుల పునరుజ్జీవనం	19.54

● దీనిపై ప్రజారోగ్యశాఖ అధికారి మోహన్ మాట్లాడుతూ.. అమృత్ 2.0 పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తాం. సంబంధిత ప్రతిపాదనలు ఉన్నతాధికారుల దగ్గర ఉన్నాయి. అనుమతులు రాగానే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళల ఆరోగ్యానికి అభయం

ఈ నెల 6 నుంచి ఉచిత పరీక్షలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: మెప్మా ఆధ్వర్యంలో పట్టణ స్వయం సహాయ సంఘాల్లోని 30 ఏళ్ల పైబడిన వారికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం సఖి సురక్ష హెల్త్ కేర్ స్క్రీనింగ్ పేరుతో నగర, పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత, రక్తహీనత, విటమిన్, పోషకాహార లోపాలతో పాటు మూడు రకాల క్యాన్సర్, నాలుగు రకాల మానసిక ఆరోగ్య సమస్యలు.. ఇలా 16 రకాల నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. తొలి విడతగా ఈ నెల ఆరో తేదీ నుంచి ఆరోగ్య శిబిరాలు ప్రారంభమవుతాయని మెప్మా పీడీ లీలారాణి మంగళవారం తెలిపారు.

నగరం, పట్టణం	తేదీ	యూపీహెచ్‌సీలు
కావలి	6.12.2025	రాజీవ్‌నగర్‌పార్కు, వెంగళరావునగర్ పార్కు
నెల్లూరు నగరం	8	వైఎస్సార్‌నగర్, కిసాన్‌నగర్
	9	పడారుపల్లి, కపాడిపాలెం
	10	ఎన్‌బీటీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్
	11	చింతారెడ్డిపాలెం, మూలాపేట, మల్లికార్జునపురం
కందుకూరు	10	కోటారెడ్డినగర్ యూపీహెచ్‌సీ

అగ్రి ల్యాబ్‌లు.. అక్కరకొస్తేనా!

పొదలకూరులో విత్తనాలు పరిశీలిస్తున్న సిబ్బంది

కందుకూరు పట్టణం, పొదలకూరు, న్యూస్‌టుడే: రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు రైతులకు అరకొరగానే సేవలందిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కందుకూరు, కావలి, ఆత్మకూరు, పొదలకూరు(సర్వేపల్లి), కోవూరు, ఉదయగిరిల్లో.. ఒక్కో చోట రూ. కోటితో ఈ నిర్మాణాలు చేపట్టారు. ఉదయగిరి మినహా.. దాదాపు అన్ని చోట్ల భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు తదితర పరీక్షలు చేస్తామని అప్పట్లో ఆర్భాటంగా ప్రకటించారు. కానీ, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. వ్యవసాయశాఖ అధికారులనే.. వాటి బాధ్యతలు చూసుకోవాలని చెప్పడంతో.. ఒక్కో ల్యాబ్‌కు ఒక ఏవో, ఇద్దరు ఏఈవోలను నియమించారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన నమూనాలు.. జరిపిన పరీక్షలు

నియోజకవర్గం	విత్తనాలు	ఎరువులు
కందుకూరు	273	196
కావలి	215	113
ఆత్మకూరు	211	39
పొదలకూరు	45	8
కోవూరు	363	0

15 రోజుల్లోనే నివేదికలిస్తాం

వచ్చే నమూనాలు పరీక్షించి.. 15 రోజుల్లోగా నివేదికలు ఇస్తాం. రైతులు ఎరువులు, విత్తనాలు తీసుకొచ్చి పరీక్షలు చేయించుకోవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – గీతాప్రకాష్, ఏవో, కందుకూరు ల్యాబ్ ఇన్‌ఛార్జి

అరకొరగానే పరీక్షలు

జిల్లాలోని ఏ ల్యాబ్‌లోనూ పురుగు మందుల పరీక్షలు జరగడం లేదు. ఎరువులు, విత్తనాలను నాలుగు విధాలుగా నమూనాలు సేకరించి.. అందుకు అనుగుణంగా పరీక్షలు చేయాల్సి ఉంది. వ్యవసాయ శాఖ అధికారులు దుకాణాల్లో సేకరించే విత్తనాలు, ఎరువుల నమూనాలను అమరావతి, తిరుపతి, వైజాగ్, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లోని రీజినల్ కోడింగ్ కేంద్రాలకు పంపుతారు. అక్కడి నుంచి జిల్లాలోని ల్యాబ్‌లకు వస్తాయి. ఈ తరహా పరీక్షలే ఎక్కువగా జరుగుతున్నాయి. రైతు సేవా కేంద్రానికి వచ్చే వాటిని అగ్రిల్యాబ్‌ల్లో పరీక్షించిన తర్వాతే.. ఫలితాల ఆధారంగా సరఫరా చేయాల్సి ఉన్నా.. అలా జరగడం లేదు. డీలర్లు సైతం తమ దుకాణాల్లోని సరకును పరీక్షలు చేయించాల్సి ఉండగా.. ఒక్కటీ జరగడం లేదు. రైతులు నేరుగా తెచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకునే అవకాశం ఉన్నా.. సరైన అవగాహన లేక.. సేవలు కొద్దిమందికే పరిమితమవుతున్నాయి.

బీపీసీఎల్‌కు భూసేకరణే అజెండా

5న ప్రజాభిప్రాయ సేకరణ

కావలి, గుడ్లూరు, న్యూస్‌టుడే: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణపై ఈ నెల అయిదో తేదీ బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించనున్నారు. గుడ్లూరు మండలం చేవూరు పరిధిలో దీన్ని జరిపేందుకు ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. అందులో భాగంగానే కలెక్టర్ హిమాన్షుశుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారం గ్రామంలో పర్యటించారు. అనంతరం కావలి ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఈ విషయమై చర్చించారు. బందోబస్తుపై కావలిలో పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షించారు.

గుంత.. ప్రమాదమంత

తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నగరంలోని రోడ్లు దెబ్బతిని ప్రయాణం నరకంగా మారింది. ఎంజీ మాల్, ప్రధాన, ఆత్మకూరు బస్టాండ్ రోడ్డు, అయ్యప్ప ఆలయం, చంద్రబాబు నగర్ కాలనీతోపాటు శివారు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. గుంతల్లో వర్షపు నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. –ఈనాడు, నెల్లూరు

జైన్ దేవాలయం వద్ద విద్యార్థులు

విహారం.. విజ్ఞాన వీక్షణం

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య) : విద్యార్థులకు చదువుతో పాటు విహార, విజ్ఞాన యాత్రలు అవసరమే. అందుకే.. ప్రభుత్వం సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే వారిని నిర్దేశిత ప్రాంతాలకు తీసుకువెళ్లే కార్యక్రమం జిల్లాలో మొదలైంది.

పీఎంశ్రీ పాఠశాలల్లో.. జిల్లాలో 2,527 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా- 1,64,791 మంది చదువుతున్నారు. 43 బడుల్లో పీఎంశ్రీ పథకం అమలవుతుండగా.. వీటిలో 9, 10 తరగతులు చదువుతున్న 7,405 మందిని విజ్ఞాన యాత్రలకు తీసుకువెళుతున్నారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ. 500 చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. పది మంది విద్యార్థులకు ఒక సంరక్షకుడితో పాటు మార్గదర్శక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేశారు.

ఇదీ లక్ష్యం..

నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా వీక్షించి.. పూర్తి అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నూతన పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా విజ్ఞాన వికాసం కలుగుతుంది. మానసికంగానూ ఉత్తేజితులు అవుతారు.

● దీనిపై సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ డాక్టర్ డి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ... విద్యార్థులను మొదటి విడతగా ఇప్పటికే విజ్ఞాన యాత్రలకు తీసుకువెళ్లాం. కొత్త విషయాలను తెలుసుకుంటున్నామనే ఆసక్తి వారిలో పెరుగుతోంది. మిగిలిన వారినీ సన్నద్ధం చేస్తున్నామని అన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: వైద్య కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్ వెల్లడించారు. రెండు నెలల వ్యవధిలో ఇద్దరు మెడికోలు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆయన నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలను తనిఖీ చేశారు. సర్వజన ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించారు. అనంతరం వైద్యులు, విద్యార్థులు, హెచ్‌వోడీలు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవితో వేర్వేరుగా సమావేశమయ్యారు. విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి 12 మంది విద్యార్థులను ఒక బృందంగా విభజించి.. మొదటి, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను, నాలుగు, అయిదు సంవత్సరం చదువుతున్న వారికి ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌ను ఇన్‌ఛార్జిగా నియమిస్తామన్నారు. వారు విద్యార్థులతో మమేకమవుతూ.. వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తారన్నారు.

ఉపాధిలో అవినీతి ఊడలు

జాబితాల్లో వేలాది మంది మృతుల పేర్లు

పేర్ల వారీగా తనిఖీ చేస్తున్న పీడీ గంగా భవాని

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: ‘ఉపాధిహామీ’లో వెలుగు చూస్తున్న అవినీతి ఊడలు.. జాడలు విస్తుగొలుపుతున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. నాటి ప్రజాప్రతినిధుల హెచ్చుమీరిన జోక్యం పథకం అక్రమాలకు చిరునామాగా మారడం.. ఆ క్రమంలో నిధులు పెద్దఎత్తున దుర్వినియోగమైన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో జాబ్‌కార్డుదారులకు ఈకేవైసీ ప్రక్రియ చేపట్టగా.. ఒక్కొక్కటిగా అవన్నీ వెలుగు చూస్తున్నాయి.

28వేలకుపైగా కార్డులు రద్దు

ఇప్పటికే 28,352 జాబ్‌కార్డులు అనర్హమైనవిగా గుర్తించి.. రద్దు చేశారు. వీటితో పాటు మరో 18,054 మృతుల పేర్లతో ఉన్నట్లు తేల్చారు. స్థానికంగా లేని మరో ఏడు వేల మందికీ జాబ్‌కార్డులు ఉన్నట్లు తేలింది. అల్లూరు మండలంలో 102 మంది ఈకేవైసీకి హాజరుకాకపోవడంపై ఆరా తీయగా.. అందులో 101 మంది మృతి చెందిన సంగతి తెలిసింది. అంటే.. అసలు భూమి మీద, ఊళ్లలో లేని వారు పనులకు హాజరవుతున్నట్లు చూపి నిధులు స్వాహా చేసినట్లు స్పష్టమవుతోంది.

ప్రత్యేక కార్యాచరణ లేక..

గత కొంత కాలంగా జాబ్‌కార్డులపై ఎలాంటి కార్యాచరణ లేకపోవడంతో ఇన్ని రోజులు ఈ లోపాలు వెలుగులోకి రాలేదు. ఇప్పటి వరకు 28వేలకుపైగా రద్దు చేశాం. కొత్తగా 8,200 మందికి జాబ్‌కార్డులు ఇస్తున్నాం. ఇకపై చేసే ప్రతి పనిని సర్వే చేసి.. ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకుంటాం. – గంగా భవాని, పీడీ, నెల్లూరు

(c) eenadu

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు చివరిసారిగా తత్కాల్ పద్ధతిన చివరి అవకాశం ఉందని డీఈవో ఆర్.బాలాజీరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఫీజు రూ.600 చెల్లించి ఈ నెల 6వ తేదీ లోగా అడ్మిషన్లు పొందొచ్చని.. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

NOTICE

IN THE COURT OF THE FOURTH ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIJAYAWADA.
O.S.No. 548/2024

Between:
State Bank of India, Ibrahimpatnam Branch, Rep. by its Chief Manager. ..Plaintiff
And
Sanagala Penchalaiah, S/o. Pedda Penchalaiah, Nellore District. ..Defendant

To:
Sanagala Penchalaiah, S/o Pedda Penchalaiah, Regd.No. 206511, BTC 9th Betallion, APSP, R/o. Valliveedu, Venkatagiri Town, Nellore District.

Please take notice that the above SUIT filed by the Plaintiff Bank against you being borrower of the Loan from the Plaintiff Bank for the recovery of the amount basing on the Loan Agrement dated: 19-03-2021 and the same is stands posted for your appearance on **09-12-2025 at 10.30 AM** and to answer the same.

If no appearance is made by yourself, on your behalf, your pleader, in this suit on the date and day mentioned here under, it will be heard and decided in your absence.

Hearing date: 09-12-2025
//By Order of the Court//
Ch.Markondaiah, B.A., LL.M., Advocate for the Plaintiff.
Vijayawada, Dated: 03-12-2025.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగంలోకి టీవీలు

దుత్తలూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో టీవీలను అధికారులు వినియోగంలోకి తెచ్చారు. 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో మొదటి విడతగా 401 కేంద్రాలకు టీవీలతోపాటు నీటి శుద్ధి యంత్రాలను పంపిణీ చేశారు. వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. దీనిపై సోమవారం 'సక్షం... సమస్యలే సాక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఐసీడీఎస్ అధికారులు సోమ, మంగళవారాల్లో టీవీలతోపాటు నీటి శుద్ధి యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చారు. త్వరలో అన్నింట్లో వాడుకలోకి తెస్తామని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తెలిపారు.

స్పందనకు వందనం

ఇలా ఉంటే రాకపోకలు ఎలా?

నెల్లూరు నగరం భక్తవత్సల నగర్‌లోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద తారురోడ్డు సమాంతరంగా నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోతోంది. అక్కడ పనిచేసే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

మైపాడు వంతెన

నెల్లూరు- మైపాడు బీచ్ రోడ్డులో బకింగ్‌హాం కాల్వపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. వారాంతపు రోజుల్లో బీచ్‌కి సందర్శకుల, వాహనాల తాకిడి అధికంగా ఉంటుంది. వంతెనపై రక్షణ గోడలు దెబ్బతినడంతో రాకపోకలకు చేసేవారికి ప్రమాదం పొంచి ఉంది.

అధికారులు మరమ్మతులు చేయించాలని పర్యాటకులు కోరుతున్నారు. – ఈనాడు, నెల్లూరు

ఒకటికి వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే



ఆ పాఠశాలలో వర్షం పడితే విద్యార్థులు సాహసం చేయక తప్పడం లేదు. అది ఎక్కడంటారా.... ఏఎస్‌పేటలో ఉర్దూ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చారు. 86 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆవరణ చెరువును తలపిస్తోంది. విద్యార్థులు పక్కనే ఉన్న మరుగుదొడ్లకు వెళ్లాలంటే నీటిలోకి దిగకుండా గేటుపైనే సాహసం చేస్తున్నారు. తరగతుల్లోకి వెళ్లాలన్నా మడుగులోనే వెళ్లాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గుత్తేదారు బయటి రోడ్డు కంటే దిగువన టెయిల్స్ వేసి వదిలేయడంతో ఈ సమస్య నెలకొంది. – న్యూస్‌టుడే, ఏఎస్‌పేట

కాలువలపై కళ్లు.. కనిపించని ఆనవాళ్లు

నగరం, పట్టణాల్లో యథేచ్ఛగా ఆక్రమణ

మూలాపేటలో ఆక్రమణలకు గురైన పంట కాలువ

జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలేకాదు.. కాలువలను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ఫలితంగా వర్షాకాలంలో వరద నీరు వెళ్లే పరిస్థితి లేక ముంపు సమస్య తలెత్తుతోంది. ఆక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు పంపడం తప్ప.. స్థలాలు తిరిగి స్వాధీనం చేసుకోవడం లేదు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్), కావలి, ఆత్మకూరు

పూడ్చివేసి కలుపుకొంటూ..

నెల్లూరు నగరంలో స్వర్ణాల చెరువు నుంచి నగరం మీదుగా వెళ్లే రామిరెడ్డికాలువ, జాఫర్‌సాహెబ్‌కాలువ, పీటర్‌సన్ కాలువ, మల్లపు కాలువ, ఉయ్యాల కాలువ, గచ్చుకాలువ తదితర 14 పంట కాలువలపై రాబందుల కళ్లు పడ్డాయి. వాటిని పూడ్చివేస్తూ స్థలాల్లో కలుపుకొంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వీరిలో కొందరు ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు, సంఘాల పేరు చెప్పుకొనే వివిధ వర్గాల వారు ఉన్నారు. వీటితో పాటు మురుగు కాలువలనూ వదలడం లేదు. వాటిని పూడ్చి నిర్మాణాలు చేపడుతున్నారు.

పరిశీలన చేసి పట్టించుకోలేదు

ఆత్మకూరు పట్టణం తిప్పపైన మాగాణి ప్రాంతంలో విస్తరించింది. ఆత్మకూరు చెరువు పరిధిలోని రెండో నంబర్ పంటకాలువ, అలుగు కాలువలు జగన్నాథరావుపేట, ఎల్‌ఆర్‌పల్లి ప్రాంతాల్లో విస్తరించింది. పంటకాలువ, అలుగుకాలువ స్థలాలు సమీపంలోని గృహాల వారు ఆక్రమించారు. కొన్నింటిపై వ్యాపార భవనాలు నిర్మించారు. సోమశిల రోడ్డు సెంటర్, జగన్నాథరావుపేట, ఎల్‌ఆర్‌పల్లిల్లో ఆక్రమణల సమస్య అధికంగా ఉంది. వీటిపై గతంలో అధికారులు పరిశీలన చేసి మిన్నకుండి పోయారు.

కావలిలో వరవకాలువ వెంట ఆక్రమణలు

కుచించుకుపోయి కష్టాలు

కావలి పట్టణ పరిధిలో ఒకప్పటి పంట కాలువలన్నీ ప్రస్తుతం పురపాలక మేజర్ డ్రైన్లుగా మారాయి. ఒక్కొక్కటి రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవు ఉండగా.. ఇరువైపులా ఆక్రమిస్తున్నారు. ప్రధానమైన వరవకాలువ అనపగుంత, కళుగోళమ్మ పేట, ట్రంకురోడ్డు, ఎనిమిదోవార్డు, తుమ్మలపెంట బస్టాండ్ కూడలి, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల మీదుగా పాపిరెడ్డిచెరువులో కలుస్తుంది. ప్రతిచోటా ఆక్రమణదారులు కలుపుకొంటున్నారు. దాంతో చాలాచోట్ల కుచించుకుపోయింది. ట్రంకు రోడ్డు వద్ద ఓ మద్యం దుకాణం నిర్వాహకులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. సంకులవారితోట నుంచి వచ్చే కాలువ వెడల్పు 12 అడుగుల వరకు ఉండేది.. ప్రస్తుతం సగం కూడా లేదు.

● 'కాలువల ఆక్రమణలను ఇప్పటికే అడ్డుకున్నామని, ఇంకా ఎక్కడైనా సమస్య ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం తాత్కాలిక పద్ధతిన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో తిరుపాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2 ఎస్జీటీ, 7 ఎస్ఏ తెలుగు, 5 ఎస్ఏ ఇంగ్లిష్, 5 ఎస్ఏ మ్యాథ్స్, 4 ఎస్ఏ హిందీ, 2 ఎస్ఏ ఫిజికల్ సైన్స్, ఎస్ఏ బయాలజీ మొత్తం 27 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ లోగా నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులోని నెల్లూరు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

జిల్లాలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు వాస్తవమేనా?

లోక్‌సభలో ఎంపీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లాలో టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేసింది వాస్తవమేనా అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు ప్రశ్న వేశారు. ప్రాజెక్టు వ్యయం రూ.103కోట్లు కాగా.. పార్కులో 10 యూనిట్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై ఆయన ప్రశ్నించారు. కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరెటా లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు పథకం కింద ప్రభుత్వం 2015 మార్చి 24న జిల్లాలో తారకేశ్వర టెక్స్‌టైల్ పార్కు ప్రైవేట్ లిమిటెడ్‌ను ఆమోదించిందన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.103.44 కోట్లు కాగా.. పెట్టుబడి రూ.223 కోట్లని.. ఉపాధి లక్ష్యం 2,275 ఉద్యోగాలని వివరించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.40 కోట్లలో ఇప్పటి వరకు రూ.20కోట్లు విడుదలయ్యాయని తెలిపారు.

వీఎస్‌యూలో రెండో రోజు శిక్షణ

వెంకటాచలం, న్యూస్‌టుడే: వీఎస్‌యూలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'బోధన పరిశోధనలో ఏఐ అనుసంధానం' అనే అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం కొనసాగింది. రెండో రోజు వీసీ అల్లం శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఎన్ఐఈపీఏ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు హెడ్ ఆచార్య శ్రీనివాస్ ఏఐపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము
మాలకొండ గ్రామం, వలేటివారిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

e-Procurement Tender

దేవస్థానము నందు లడ్డు ప్రసాదము, అన్నదానం మరియు ఇతర అవసరముల కొరకు ఆవునెయ్యి సరఫరా చేయుటకు ఆంధ్రప్రదేశ్ నందు గల కో-ఆపరేటివ్ సొసైటీలు / పాల ఉత్పత్తిదారుల సంఘాలు / రైతు ఉత్పత్తిదారుల సంఘాలు / సహకార పాడిపరిశ్రమల వారి నుండి 01-01-2026 నుండి 31-12-2026 వరకు ఒక సంవత్సర కాలమునకు సరఫరా చేయుటకు ఈ టెండర్స్ కోరబడుచున్నవి. వివరములకు www.apeprocurement.gov.in నందు చూచి తెలుసుకొనగలరు. మరిన్ని వివరములకు దేవస్థానము కార్యాలయములో సంప్రదించగలరు.

శ్రీస్వామి వారి సేవలో.. సం/- యస్.చంద్రశేఖర్, ఉపకమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి, ఫోన్.నెం: 94910 00732

దిత్వా నష్టం పెద్దగా లేదు: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

కావలి, న్యూస్‌టుడే: దిత్వా తుపాన్‌తో జిల్లాలో చెప్పుకోదగ్గ నష్టాలు లేవని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రకటించారు. మంగళవారం కావలిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఎలాంటి నష్టం లేదన్నారు. కొన్నిచోట్ల వరి నాట్లు నీటమునిగిన సంగతి తెలిసిందన్నారు. వర్షాలు తగ్గగానే ఆ నీరు వెలుపలకు వెళ్లే వీలుందన్నారు. కొన్ని చోట్ల చెరువుల మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు కలిసి సీనియర్ సిటిజన్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ.12,231
సవర ధర:	రూ.97,848
వెండి గ్రాము :	రూ.184.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	136
లేయర్	130
బ్రాయిలర్స్	246
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	221

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలోని 14 మండలాల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో)లను ఏర్పాటు చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగ రాజకుమారి తెలిపారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ మందిరంలో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఫ్‌పీవోలలో ఉన్న రైతులు పండించే పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, మందులు ఏర్పాటు చేసుకునేందుకు కావాల్సిన అనుమతులు వ్యవసాయశాఖ సహాయంతో తీసుకోవాలన్నారు. మార్కెటింగ్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, ప్యాకింగ్ కోసం అవసరమైన శిక్షణ, నైపుణ్యాలు, యంత్రాల ఏర్పాటుకు నిధులను బ్యాంకుల నుంచి పొందేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌పీవోల ద్వారా రైతులందరికీ సహాయపడాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎన్‌వీఆర్ గణేష్, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

5 నుంచి వన్య ప్రాణుల గణన

ఏర్పాట్లు పూర్తి ● డీఎఫ్‌వో మహబూబ్ బాషా

న్యూస్‌టుడే, నెల్లూరు(అటవీశాఖ)

ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న మృగ, వన్యప్రాణుల లెక్కింపు కార్యక్రమం వర్షాలతో వాయిదా పడిందని.. 5వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి కదిరి మహబూబ్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ క్రూర మృగాల గణన, జిల్లా అటవీ విస్తీర్ణానికి చేపడుతున్న చర్యలను వివరించారు.

నాలుగేళ్లకోసారి..

జిల్లాల వారీగా క్రూర మృగాలు, వన్య ప్రాణుల లెక్కింపు ప్రతి నాలుగేళ్లకోసారి జరుగుతుంది. ఈనెల ఐదు నుంచి ఎనిమిది రోజుల వరకు జరగనుంది. తొలి మూడు రోజులు జిల్లా అటవీ ప్రాంతంలో క్రూర మృగాలు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అటవీ కుక్కలు, నక్కలు తదితరాలను లెక్కిస్తారు. పాదముద్రల ఆధారంగా పులుల సమాచారం సేకరిస్తారు. ప్రతి దాన్ని ఫొటోలు తీసుకుంటారు. ఆ తర్వాత రెండు రోజులు సేకరించిన వివరాలు ఉన్నతాధికారులకు పంపిస్తాం. తర్వాత మూడు రోజులు అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లపై పరిశీలన జరగనుంది.

పది శాతమే ఎర్రచందనం..

జిల్లా అటవీ ప్రాంతంలో ప్రస్తుతం కేవలం పది శాతమే ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. అవి కూడా ప్రారంభ దశలో ఉన్నాయి. జిల్లాలోని అటవీ ప్రాంతంలో 800 ఎకరాల్లో మొక్కలు నాటాం. వాటిలో ఎర్రచందనం చెట్లు కూడా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2,29,454 హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. 22వేల హెక్టార్లలో ఎర్రచందనం చెట్లు పెరుగుతున్నాయి. ఇవి కూడా రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి అడవుల్లో ఉన్నాయి. ఇటీవల కాలంలో ఉదయగిరి ప్రాంతంలో ప్రత్యేకంగా రెండువేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించాం. అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాం. ఎక్కడా ఎలాంటి రవాణా జరగడం లేదు. జిల్లా తీర ప్రాంతం మొత్తం గ్రేట్ గ్రీన్‌వాల్‌కు ఆమోదం లభించింది. త్వరలో ఇది కార్యారూపం దాల్చనుంది.

ఏడు కేజీల గంజాయి స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేంద్రబాబు

కొడవలూరు, న్యూస్‌టుడే: నార్త్‌రాజుపాళెం వద్ద దంపతులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం తనిఖీలు చేసి ఏడు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేంద్రబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... నార్త్‌రాజుపాలెం సమీపంలో గండవరం వెళ్లే మార్గంలోని జాతీయ రహదారి వంతెన వద్ద నెల్లూరులోని డైకస్ రోడ్డుకు చెందిన చిన్నరాజ, లక్ష్మీ దంపతులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. వారి వద్ద ఏడు కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి డిప్యూటీ ఎంపీడీవో సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధికి వచ్చి.. జలాశయంలో గల్లంతై

సౌరభ్‌కుమార్ (పాతచిత్రం)

ఉదయగిరి, న్యూస్‌టుడే : పొట్ట చేతబట్టుకొని ఉపాధి కోసం రాష్ట్రాలు దాటి వచ్చాడు. ప్రమాదవశాత్తు జలాశయంలో పడి గల్లంతయ్యాడు. ఈఘటన మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాలెం జలాశయం వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లా సగన్వ గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్ (24), అనోస్ బెంగళూరులో స్థిరపడిన వరికుంటపాడు మండలం గువ్వాడి గ్రామానికి చెందిన ప్రసాద్‌రావు ఇంటికి పెయింటింగ్ పనులు చేసేందుకు వచ్చారు. వారం రోజుల క్రితం గండిపాలేనికి చెందిన బెంజిమెన్‌తో కలిసి గువ్వాడి వెళ్లి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో నిత్యావసర సరకులు తెచ్చుకొనేందుకు ముగ్గురు కలిసి గండిపాలెం గ్రామానికి వచ్చారు. జలాశయాన్ని సందర్శించేందుకు వెళ్లారు. సౌరభ్‌కుమార్ తన చేతులకున్న పెయింట్ శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోయాడు. అతని వెంట వెళ్లిన వారు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు వచ్చి నీటిలో దిగి గాలించినా ఫలితం లేదు. జలాశయంలో నీటి లోతు ఎక్కువగా ఉండడంతో మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్సై శ్రీను సిబ్బందితో కలిసి వచ్చి వివరాలు సేకరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

ఆత్మకూరులో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు పురపాలక పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో పలువురికి రూ.35.21లక్షలు విలువైన చెక్కులు అందజేశారు. అనంతరం పురపాలక, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు, కాలువల నిర్మాణానికి రూ.7.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ బీరాపేరు వాగుపై వంతెన, రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. నల్లపురెడ్డిపల్లి, మురగళ్ల, కనుపూరుపల్లి రహదారి నిర్మాణానికి రూ.5.4 కోట్లు, చాబోలు రోడ్డు అభివృద్ధికి రూ.2.2 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆర్డీవో పావని, డీఎస్పీ వేణుగోపాల్, ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం 5న

నెల్లూరు(విద్య): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0) నిర్వహించనున్నట్లు డీఈవో ఆర్.బాలాజీరావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

ఏడాదిగా ఆశ.. నిధులు రాక నిరాశ

న్యూస్‌టుడే, సంగం

ప్రధాన కాలువ రెగ్యులేటరు వెనక భాగంలో ఏడాది కిందట గండి పడగా.. శాశ్వత మరమ్మతులు చేయకపోవడంతో.. రైతులు ఆందోళన చెందుతున్నారు. కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలో సుమారు రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకి కనిగిరి జలాశయం ప్రధాన కాలువ రెగ్యులేటరు నుంచి నీటిని సరఫరా చేస్తారు. దీని వెనక భాగంలో ఏడాది క్రితం గండిపడగా.. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. తొలుత బండరాళ్లతో, ప్రస్తుతం ఇసుక బస్తాలతో అడ్డు పెట్టారు. శాశ్వత పనులు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

4.96 కి.మీ వద్ద..

సంగం ఆనకట్ట నుంచి 9.6 కి.మీ దూరంలోని కనిగిరి జలాశయానికి సాగునీటిని తరలించే ప్రధాన కాలువకి 4.96 కి.మీ వద్ద గాంధీజనసంఘం సమీపంలో బెడ్ రెగ్యులేటరు నిర్మించారు. 14 తూములను నియంత్రించి సంగం మండలంలోని వివిధ కాలువల ద్వారా సుమారు 10వేల ఎకరాల ఆయకట్టుకి దీని నుంచి నీటిని తరలిస్తున్నారు. అత్యంత పురాతనమైన కట్టడం కావడంతో 20 ఏళ్ల క్రితం జలవనరుల శాఖ మరమ్మతులు చేసినా, ఆ తరువాత నిర్వహణ విస్మరించారు. ఫలితంగా ఒకటో నంబరు తూము వెనక వైపు గతేడాది గండి పడింది. దాంతో నీటి ప్రవాహం రెగ్యులేటరు అడుగు భాగం నుంచి ముందుకు చేరుతుండటంతో ప్రమాదం పొంచి ఉండటంతో జలవనరుల శాఖాధికారులు పెద్ద బండరాళ్లతో గండిని పూడ్చారు.

అడ్డుగా ఉంచిన ఇసుక బస్తాలు

ప్రస్తుతం ఇసుక బస్తాలు

కాంక్రీటు వినియోగించకుండా చేయడంతో తిరిగి అక్కడ లీకేజీ ప్రారంభం కావడంతో ఆందోళన చెందుతున్నారు. దాంతో జలవనరుల శాఖాధికారులు ప్రస్తుతం ఇసుక బస్తాలు అడ్డుగా వేశారు. అయిదువేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం కలిగిన కాలువ కావడంతో ఇసుక బస్తాలు ఎలా అడ్డుగా ఉంటాయని అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

● రూ.కోటితో మరమ్మతులకు ప్రతిపాదించామని, ఆమోదం లభిస్తే పనులు చేస్తామని జలవనరుల శాఖ ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ...విశ్వాసానికి మరోపేరు

CO- SAM (స్ట్రెస్డ్ అస్సెట్ మేనేజ్‌మెంట్) డి.నెం.9-35, కావూరి టవర్స్, కామయ్య తోపు, కానూరు, విజయవాడ-520007. మొబైల్ నెం.: 6362844637 ఈ-మెయిల్: cs8332@pnb.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) r/w 9(1) నిబంధనలతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ, యావన్మంది ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)కు నోటీసు జారీచేస్తూ తెలియజేయునది ఏమనగా, దిగువ సెక్యూర్డు క్రెడిటార్ గారికి తనఖా ఉంచిన/ఛార్జిలో ఉన్న స్థిరాస్తులను నిర్మాణాత్మకంగా / భౌతికంగా / లాంఛనాత్మకంగా బ్యాంకు అధీకృత అధికారిగారు సెక్యూర్డు క్రెడిటార్ గారు స్వాధీనత తీసుకుని వాటిని "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నదో అదే పద్ధతిపై" దిగువ పట్టికలో తెలిపిన తేదీలలో బ్యాంకు/సెక్యూర్డు క్రెడిటార్ గారు సదరు ఋణగ్రహీత(లు), హామీదారు(లు) నుండి రావలసిన బకాయిలను వసూలు నిమిత్తం ఈ నోటీసు జారీచేస్తున్నారు. ప్రతి ఆస్తికి ఎదుట దిగువ పట్టికలో రిజర్వు ధర & ధరావత్తు వివరములు తెలుపబడినవి.

ఇ-వేలం తేది, సమయం : 05-01-2026 ఉ॥ గం॥ 11.00 నుండి సా॥ గం॥ 4.00 వరకు

బయానా చెల్లింపునకు ఆఖరు తేది : 05.01.2026, సాయంత్రం 4 గం॥ల లోపు. బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-

1) ఋణగ్రహీత పేరు / బ్యాంకుకు మొత్తం బకాయిలు : మెస్సర్స్ ఏ యస్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ :తుమ్మల పెన అహరోన్ (ఖాతా నెం.1230306007810) డి.నెం.6-213-ఎ నార్త్ రాజుపాలెం, కొడవలూరు మండలం, యస్‌పియస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 524366. 2. శ్రీ తుమ్మలపెన అహరోన్, తండ్రి : ఆనందం, డి.నెం. 1-157 చర్చి స్ట్రీట్, నార్త్ రాజుపాలెం, కొడవలూరు మండలం, యస్‌పియస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్- 524366.
బ్రాంచ్ ఆఫీస్ : 037000-నెల్లూరు
డిమాండ్ నోటీసు తేది : 18-11-2021 స్వాధీనతా తేది : 22.02.2022
బకాయి మొత్తం : తేది.30-09-2025 నాటికి బకాయి రూ.17,43,471/- మరియు తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలు మరియు ఇతర ఖర్చులు. స్వాధీనతా స్వభావం : లాంఛనాత్మక
సెక్యూరిటీ / ఆస్తి వివరాలు : తనఖా చేసిన / యజమాని పేరు (తనఖాదారుల ఆస్తి(లు)) : డాక్యుమెంట్ నెం.1146/2013, తేది.20-04-2013 ప్రకారం శ్రీ తుమ్మలపెంట అహరోన్ గారి పేరున గల ఆస్తి.: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కొవూరు సబ్ రిజిస్ట్రేషన్, కొడవలూరు మండలం, నార్త్ రాజుపాలెంగ్రామ పంచాయితీ, హరిజనపాలెం సర్వే నెం.లు 47/1-ఎ మరియు 47/1-బి, వార్డు నెం.6, డోర్ నెం.1789/ఎ, అసెస్‌మెంట్ నెం.1563, ప్లాటు నెం.73గా గల 30 అంకణములు లేదా 240 చ.గ.లు విస్తీర్ణంలోని ఆర్‌సిసి భవనమునకు హద్దులు : తూర్పు : రాజవీధి, దక్షిణం : బండి జాన్ గారికి చెందిన స్థలము, పడమర : కోవూరు తిరుపాలు గారికి చెందిన ఇల్లు, ఉత్తరం : చెన్నయ్య గారికి చెందిన స్థలము.
సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు తెలిసిన మేరకు ఋణభారముల వివరాలు : ఋణ భారములు ఏమీ లేవు.
రిజర్వు ధర: రూ.9,35,000/- ధరావత్తు : రూ.93,500/-

ఇ-వేలం నియమ నిబంధనలు : 1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లోని నియమ & నిబంధనలను అనుసరించి దిగువ తదుపరి తెలిపిన నిబంధనలను అనుసరించి అమ్మకం జరుపబడును. 2) ఆస్తులను 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే పద్ధతి, అక్కడ ఏమున్నవో అదే పద్ధతిపై" విక్రయించబడతాయి. 3) అధీకృత అధికారి గారి పద్ధగల షెడ్యూలులోని సెక్యూర్డు ఆస్తికి సంబంధించిన ఉత్తమ వివరముల మేరకు తెలుపబడినవి. కాని సదరు వివరములలోని తప్పులకు, తప్పుడు వివరములకు, పదిలివేయబడుటలకు అధీకృత అధికారి గారు సమాధానం తెలుపవలసిన అవసరం లేదు. 4) అమ్మకం ఇ-వేలం పోర్టల్ https://baanknet.com ద్వారా ఆన్‌లైన్‌లో దిగువ సంతకందారు తేది.05-01-2026, ఉదయం గం.11-00 ల నుండి సాయంత్రం గం.4-00 ల వరకు నిర్వహించెదరు. 5) అమ్మకం యొక్క పూర్తి వివరములతో నియమ నిబంధనల కొరకు దయజేసి https://baanknet.com & www.pnbindia.in వెబ్‌సైటులు చూడవలెను.

సర్ఫేసి చట్టం 2002 లోని రూలు 8(6) r/w 9(1) ప్రకారం చట్టబద్ధమైన అమ్మకం ప్రకటన

ప్రదేశం: విజయవాడ, తేది : 01-12-2025 సం/- అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్ కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అలిపిరి, తిరుపతి-517501. ఫోన్ : 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 20.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 20.12.2025, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 19.12.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీతలు: 1. M/s కామాక్షి ఎయిర్ ప్రోడక్ట్స్, ప్రొప్రయిటర్ శ్రీమతి లేఖరాజు కామాక్షి కళ్యాణి, 26-13-439, బిజెపి ఆఫీస్ ఎదురుగా, సాయిబాబా గుడి దగ్గర, నెల్లూరు-524004. 2. శ్రీమతి లేఖరాజు కామాక్షి కళ్యాణి, భర్త : లేఖరాజు బాల సుబ్రమణ్యం, 26-3-1479, 2వ వీధి, చంద్రమౌళి నగర్, DFO ఆఫీస్ దగ్గర, వేదాయపాలెం, నెల్లూరు-524004. హామీదారు: శ్రీ లేఖరాజు బాల సుబ్రమణ్యం, తండ్రి : లేఖరాజు బాబూరావు, 26-3-1479, 2వ వీధి, చంద్రమౌళి నగర్, DFO ఆఫీస్ దగ్గర, వేదాయపాలెం, నెల్లూరు-524004.

బకాయి మొత్తం: రూ. 37,54,250.87/- తేది. 30.11.2025 నాటికి + తేది. 01.12.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

ఐటమ్ నెం. 1: డాక్యుమెంట్ నెం. 2577/2019: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజబుజ నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, వెంకటాచలం మండలం, చెముడుగుంట గ్రామ పంచాయతీ పరిధి, కాకుటూరు రెవెన్యూ గ్రామం, బురాన్‌పూర్ గ్రామం, కాకుటూరు శివారు, సర్వేనెం. 508 లోని ఎ.3.05 సెంట్లు విస్తీర్ణంలో ఉత్తరం వైపు ఎ.0.50 సెంట్లు విస్తీర్ణం, సర్వే రిపోర్టు ప్రకారం సర్వే నెం. 508/1, రెవెన్యూ రికార్డ్స్ ప్రకారం 508/1, చెముడుగుంట గ్రామ పంచాయతీ అనుమతితో ఇంటి ప్లాట్స్ గా వేసిన "సింధు నగర్" లేఅవుట్‌లో ప్లాట్ నెం.32 లోని 33 అంకణములు 24 చ॥అ॥ లేదా 266.66 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: ఎగ్జిక్యూటింట్ యొక్క స్థలం, దక్షిణం: ప్లాట్ నెం 33, పడమర: లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం 31.

ఐటమ్ నెం. 2: డాక్యుమెంట్ నెం. 2578/2019: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, బుజబుజ నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్, వెంకటాచలం మండలం, చెముడుగుంట గ్రామ పంచాయతీ పరిధి, కాకుటూరు రెవెన్యూ గ్రామం, బురాన్‌పూర్ గ్రామం, కాకుటూరు శివారు, సర్వేనెం. 508 లోని ఎ.3.05 సెంట్లు విస్తీర్ణంలో ఉత్తరం వైపు ఎ.0.50 సెంట్లు విస్తీర్ణం, సర్వేరిపోర్టు ప్రకారం సర్వే నెం. 508/1, రెవెన్యూ రికార్డ్స్ ప్రకారం 508/1, చెముడుగుంట గ్రామ పంచాయతీ అనుమతితో ఇంటి ప్లాట్స్ గా వేసిన "సింధు నగర్" లేఅవుట్‌లో ప్లాట్ నెం.33 లోని 33 అంకణములు 24 చ॥అ॥ లేదా 266.66 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: ఎగ్జిక్యూటింట్ యొక్క స్థలం, దక్షిణం: ప్లాట్ నెం 34, పడమర: లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం 32.

రిజర్వు ధర: రూ. 19,73,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,97,300/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 01.12.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU Classifieds

REAL ESTATE
LEASE/ RENT

నెల్లూరు అయ్యప్పగుడి ఉడ్ కాంప్లెక్స్ మెయిన్ రోడ్ నందు 230 అంకణాలు గోడౌన్, షోరూంలకు అద్దె / లీజుకు కలదు. సంప్ర॥ Contact ✆ 95157 96172

JOBS

గాయత్రి హోండా స్పేర్స్ నందు పనిచేయుటకు వర్కర్స్ కావలెను. వయస్సు:35 సంవత్సరాలు లోపు. Qly: 10th Contact ✆9581400025, 9000196265

వెంకటాచలం (మం) కాకుటూరు జైన్ టెంపుల్ దగ్గర క్రొత్తగా ప్రారంభిస్తున్నకుంభకోణం డిగ్రీ కాఫీ కేఫ్ నందు పనిచేయుటకు యువకులు కావలెను. ✆ 88015 53938

నెల్లూరు హైవే దగ్గర గల ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు అనుభవంగల వెయిటర్స్, కెప్టెన్స్ (Male/Female) కావలెను. జీతం: 18,000/-. ✆ 9858598555

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే. వివరాలకు.. నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

నేడు టిడ్కో లబ్ధిదారులకు రుణమేళా

కావలి, న్యూస్‌టుడే: టిడ్కో లబ్ధిదారుల కోసం బుధవారం గృహ రుణమేళా నిర్వహిస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సిబిల్ స్కోర్, వయసు మీరడం వంటి కారణాలతో బ్యాంకు రుణాలు పొందలేని వారి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ కుటుంబ సభ్యుల్ని సంయుక్త లబ్ధిదారుగా నియమించుకోవాలన్నారు. వారి ఆధార్, బ్యాంక్ ఖాతా పుస్తకం, పాన్‌కార్డు, టిడ్కో పట్టా తీసుకురావాలని సూచించారు.

ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్‌గా ఇంద్రాణి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టరు ఇంద్రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలపై సబ్‌కలెక్టర్‌కు వినతి

వరికుంటపాడు, న్యూస్‌టుడే: పంచాయతీలో సమస్యలు పరిష్కరించాలని సర్పంచి కొండెపోగు దిలీప్‌కుమార్ సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కందుకూరులో సబ్‌కలెక్టర్ హిమవంశీని మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దారు హేమంత్‌కుమార్ అనుమతితో గ్రామంలో పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తామని, రావాలని కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు సర్పంచి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698

కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: పట్టణంలో అమృత్ పథకంలో భాగంగా ఇంటింటికీ ఇస్తున్న కుళాయి కనెక్షన్లకు ప్లాస్టిక్ పైపులు వేస్తున్నారు. వాటి నాణ్యతపై సందేహాలున్నాయి.
- వల్లాపురం సురేష్, ఇందిరమ్మ కాలనీ

సమాధానం: డిజైన్ ప్రకారమే పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటుచేస్తున్నాం. పీవీసీ ప్లాస్టిక్‌తోనే తయారయ్యాయి. **- జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్ - కావలి, న్యూస్‌టుడే**

? స్థానిక బస్టాండు కూడలిలో అపరిశుభ్రంగా ఉండడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. **- డి.భార్గవి, ప్రయాణికురాలు**

✓ పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. **-నరేశ్, కార్యదర్శి - గుడ్లూరు, న్యూస్‌టుడే**

? అల్లూరుపేటలోని ఆయుర్వేద ఆసుపత్రి వద్ద చెత్త వేస్తున్నారు. దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. **- శశిధర్, అల్లూరు**

✓ అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ - అల్లూరు, న్యూస్‌టుడే**

పెంచలయ్య హత్యపై సీపీఎం నిరసన

కావలి: ఉదయగిరి కూడలిలో రాస్తారోకో... బిట్రగుంట: ధర్నాలో పాల్గొన్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

న్యూస్‌టుడే, కావలి, ఉదయగిరి, బిట్రగుంట, గుడ్లూరు, అల్లూరు, దగదర్తి: నెల్లూరులో ఇటీవల జరిగిన సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా వామపక్షాల నాయకులు, కార్యకర్తలు మంగళవారం బంద్ పాటించారు. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. కావలిలోని ట్రంకురోడ్డులో రాస్తారోకో చేశారు. బోగోలు, విశ్వనాథరావుపేటలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అల్లూరులో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన చేశారు. కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఉదయగిరిలో పంచాయతీ బస్టాండ్ సెంటర్ నుంచి మెయిన్‌బజార్ మీదుగా ఆర్టీసీ డిపో వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దగదర్తిలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాలు మూసివేయించారు. గుడ్లూరులోని ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు వరకు ప్రదర్శన నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరి: ప్రదర్శనలో సీపీఎం నాయకులు.. గుడ్లూరు: బస్టాండులో మానవహారంగా ఆందోళనకారులు

ఎమ్మెల్యే ప్రజాదర్బార్ వాయిదా

దగదర్తి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి దగదర్తిలో మంగళవారం చేపట్టాల్సిన ప్రజా దర్బార్ కార్యక్రమం వాయిదా పడింది. వర్షం కారణంగా నిలిపివేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వర్షాలతో నిర్వహించడం కష్టమని అధికారులు పలుమార్లు చెప్పినా నాయకులు పట్టించుకోకుండా ఏర్పాట్లు చేశారు. చివరి క్షణంలో వాయిదా వేశారు.

అనధికార భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు 120 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ కె.అనూష తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిర్మించిన అన్ని అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకోవచ్చని సూచించారు.

పారిశుద్ధ్యం అధ్వానం
వ్యాధుల భయం
వర్షాలతో ముసురుతున్న దోమలు

న్యూస్‌టుడే, దుత్తలూరు

తుపానుతో జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించి దోమల ఉద్ధృతి అధికమైంది. వీటి కాటుతో ప్రాణాంతక వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలుతున్నాయి. అయినా అధికారులు పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలో ఎనిమిది మండలాలున్నాయి. 143 పంచాయతీలుండగా 250కు పైగా మజరా గ్రామాలు ఉన్నాయి. వీటిలో మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురుస్తున్న చిరు జల్లులతో కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి.

సీతారామపురంలో చెత్తాచెదారంతో నిండిన కాలువ

నామమాత్రంగా స్వచ్ఛ ఆంధ్ర

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఇది మండల కేంద్రాలకే పరిమితమవడంతో పాటు అధికారులు ప్రచారం చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గ్రామాల్లో ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాల్లేవు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు దోమ కాటుతో అల్లాడిపోతున్నారు. గతంలో ప్రతి సచివాలయానికి రూ. 45 వేల విలువైన ఫాగింగ్ యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. నిధుల లేమి సాకుతో వాటిని గ్రామపాలకులు మూలన పడేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో దోమల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు, పాలకులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. పారిశుద్ధ్యం లోపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

వెంకటరమణ, డీఎల్‌పీవో, కావలి

ప్రకాశంలో కలపడంపై ఎమ్మెల్యేకు అభినందనలు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేలా రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించడం హర్షణీయమని, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కందుకూరు ఎంఈవోలు అభినందనలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంఈవోలు ఎం.నాగకుమారశర్మ, కె.సుబ్బారెడ్డి ఎమ్మెల్యేను సన్మానించారు.

కుర్చీల బహూకరణ

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెమిడిదిపాడు సచివాలయానికి గ్రామస్థులు మల్లికార్జున, నాగేశ్వరరావు, సి.మల్లికార్జున రూ.20 వేల విలువైన కుర్చీలు బహూకరించారు. మంగళవారం కార్యాలయంలో వీటిని కార్యదర్శి చిన్నయ్యకు అందజేశారు. పాఠశాల సిబ్బంది దాతలను అభినందించారు.

గడువు పొడిగింపు

ముంగమూరులో అవగాహన కల్పిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

బిట్రగుంట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్, గ్రామీణ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో పక్కా గృహాల కోసం దరఖాస్తుకు ఈ నెల 14వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు బోగోలు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం ఆయన గృహ నిర్మాణ శాఖ సిబ్బందితో కలిసి ముంగమూరులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ ఆమోదం రాగానే బిల్లులు చెల్లిస్తామని వివరించారు.

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి, న్యూస్‌టుడే : హైదరాబాద్‌కు చెందిన హజరత్ ఖాజా అబుల్‌ఫైజ్‌షా మహ్మద్‌ఖాలిది వజూది షంషీ గంధ మహోత్సవం ఉదయగిరిలో బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆన్‌లైన్‌లో నిరుద్యోగులకు పరీక్ష

వింజమూరు, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువతకు కౌశలం కార్యక్రమంలో ఆన్‌లైన్ పరీక్ష మండలంలోని అన్ని సచివాలయాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సచివాలయాల ద్వారా నిరుద్యోగుల వివరాలు సేకరించామన్నారు. వీరికి మంగళవారం నుంచి శనివారం వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆతరువాత వారి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

కూలితేనే స్పందిస్తారా!

గ్రామంలోని ప్రధానవీధి నుంచి పడమటి వీధికి వెళ్లే మార్గంలో స్తంభం దెబ్బతిని ఊచలు కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం చోటుచేసుకుంటే కానీ స్తంభం మార్చరా అని ప్రశ్నిస్తున్నారు. **- సీతారామపురం, న్యూస్‌టుడే**

రహదారి సొగసు చూడతరమా!

మండలంలోని పూరేటిపల్లి నుంచి దారకానిపాడు వెళ్లే మార్గం అడుగుకో గుంతతో అధ్వానంగా తయారైంది. దీంతో పాదచారులు, వాహనదారులు నానాఇబ్బందులు పడుతున్నారు. దారకానిపాడులో ధాన్యం మిల్లు వద్ద నడిచేందుకు కూడా వీలు కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- గుడ్లూరు, న్యూస్‌టుడే**

అసంపూర్తి భవనం.. విద్యార్థులకు కష్టం

మండలంలోని ఏరుకొల్లు ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల భవనం మూడేళ్లగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ భవనాల గుత్తేదారుడికి బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిపేశారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయమై పీఆర్ ఏఈ హజరత్‌ను వివరణ కోరగా దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. **- దుత్తలూరు, న్యూస్‌టుడే**

మునిగిన కొటార్లు.. ఉప్పు రైతు కన్నీరు

తీరంలోని ఉప్పు కొటార్లు నీటిలో మునిగిపోయాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పైడేరు పొంగడంతో నీరు కొటార్లలోకి వచ్చింది. రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు నష్టపోయామని, మళ్లీ సాగు చేయాలని ఉప్పు సాగుచేసే రైతులు వాపోతున్నారు. **- అల్లూరు, న్యూస్‌టుడే**

తీరని నీటి సమస్య

పట్టణంలోని బుడంగుంట కాలనీలో నీటి సమస్యకు నిదర్శనం ఈ చిత్రం. ఆ ప్రాంతానికి సమీపంలోనే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఉంది. అయినా ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు. నిత్యం 27 ట్యాంకర్ల వరకు రవాణా చేస్తున్నట్లు పురపాలక లెక్కలు చెబుతున్నాయి. అయినా సమస్య తీరడం లేదని స్థానికులు చెబుతున్నారు. **- కావలి, న్యూస్‌టుడే**

రోడ్డు విస్తరణకు కొలతల నమోదు

కలిగిరి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ 167 బీజీ కలిగిరి మెయిన్ రోడ్డు విస్తరణ ప్రక్రియలో భాగంగా భూసేకరణ కొలతలను మంగళవారం రెవెన్యూ సిబ్బంది నమోదు చేశారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు రోడ్డు విస్తరణలో పోతున్న స్థలాలు, వివిధ నిర్మాణాల యజమానుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వీఆర్వో శేషయ్య, వీఆర్‌ఏ సత్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు పట్టణం : పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఉపాధ్యాయులను(ఇన్‌స్ట్రక్టర్లు)ఒప్పంద ప్రాతిపదికన తీసుకుంటున్నట్లు ఎంఈవో ఎం.నాగకుమారశర్మ తెలిపారు. దూబగుంటలో ఎస్‌జీటీ, పలుకూరు ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ ఇంగ్లిష్, ఖాజీపాలెం ఉర్దూ పాఠశాలలో ఎస్‌ఏ బయాలజీ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈనెల 5వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

ఉదయగిరి : మండలంలో ఖాళీగా ఉన్న అయిదు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మూడు ఉర్దూ, రెండు స్కూల్ అసిస్టెంట్ ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఉర్దూ బోధకుల నియామకానికి..

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ ఉపాధ్యాయ (అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్) పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో జయమ్మ కోరారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఉదయగిరి, న్యూస్‌టుడే : ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి దాని బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలని ఎమ్మార్ఆర్ ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపల్ నారాయణస్వామి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కళాశాల నుంచి పంచాయతీ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అన్వర్, విక్రమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతులు క్రీడల్లో విజేతలు

కావలి, న్యూస్‌టుడే

పట్టణంలోని జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద కుటుంబాల యువతులు క్రీడల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. విద్యతోపాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, టేబుల్‌టెన్నిస్ తదితర వాటిలో రాణిస్తున్నారు. ఇటీవల విక్రమ సింహపురి అంతర్ కళాశాలల పోటీల్లో టేబుల్ టెన్నిస్, కబడ్డీ క్రీడల్లో సత్తా చాటి పతకాలు అందుకున్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తున్నారు. ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి వీరికి తర్ఫీదు ఇస్తున్నారు.

వాలీబాల్ పోటీల్లో యువతులు

చాందిని.. ఆటల్లో మేటి

ఎంసీఏ చదువుతున్న గువ్వాడి చాందిని టేబుల్‌టెన్నిస్‌తో పాటు ఇతర ఆటల్లోనూ రాణిస్తోంది. ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో టేబుల్‌టెన్నిస్ డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచింది. గత ఏడాది వివిధ పోటీల్లో పతకాలు సాధించింది. ఈమెది శ్రీకాకుళం జిల్లా పలాస. పట్టణంలోని పీజీ కళాశాలలో చదువుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనే లక్ష్యంతో శ్రమిస్తోంది.

నందిని.. టేబుల్‌టెన్నిస్‌లో మేటి

విద్యతోపాటు టేబుల్ టెన్నిస్ మేటిగా రాణిస్తున్న కె.నందిని ఇటీవల విశ్వవిద్యాలయం స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెది ప్రకాశం జిల్లా సింగరాయకొండ. తండ్రి నాగరాజు వ్యవసాయ కూలీ. తల్లి మల్లీశ్వరి గృహిణి. టేబుల్‌టెన్నిస్ దక్షిణ జోన్‌లో విజేత కావాలనే లక్ష్యంతో సాధన చేస్తోంది.

ఆదిలక్ష్మి కబడ్డీలో కూత

కావలి మండలంలోని పెద్దపట్టపుపాలేనికి చెందిన గంగన్నగారి ఆదిలక్ష్మి కబడ్డీలో మూడు సంవత్సరాలుగా సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. ఈమె ప్రాతినిధ్యం వహించిన జట్టు ఇటీవల ద్వితీయ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపడంతోపాటు ఎన్ఎస్ఎస్‌లో చేరి సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటుంది.

దత్తాత్రేయుడి హుండీ ఆదాయం రూ.19.45 లక్షలు

లింగసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని మొగిలిచర్లలో ఉన్న దత్తాత్రేయ స్వామికి హుండీ ద్వారా రూ. 19.45 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్త పవని ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 1485251, అన్నదానానికి రూ. 460262 విరాళంగా వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని కందుకూరు దేవాదాయ శాఖాధికారి సత్యనారాయణ పర్యవేక్షించారు. శ్రీకృష్ణ సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు హాజరుకావాలి

ఉదయగిరి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (మెగా పీటీఎం) సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతారన్నారు. దీనికి అందరూ హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల రక్తదానం

రక్తదానం చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఉదయగిరి, న్యూస్‌టుడే : గ్రామంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో గండిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో వీరు రక్తదానం చేశారు. విద్యార్థులు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది 59 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. దీన్ని థలసీమియాతో బాధపడుతున్న రోగులకు ఉపయోగిస్తామని రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. శిబిరం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారిణి సునీత సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణపాల్గొన్నారు.

థలసీమియా కేంద్రంలో సేవలు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని రెడ్‌క్రాస్ బ్రాంచి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న థలసీమియా చికిత్స కేంద్రంలో బాధిత చిన్నారులకు పలువురు సేవలందించారు. మంగళవారం పౌష్టికాహారం, భోజనం అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సుజల్‌కుమార్, గ్రీన్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వేమూరు గాయత్రి, విశ్రాంత ఉపాధ్యాయులు సీతారామయ్య, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బాపట్ల, న్యూస్‌టుడే: బస్టాండ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ కర్రెద్దుల లలితను అరెస్టు చేసినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. నిందితురాలి నుంచి రూ.15 లక్షల విలువైన 136 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని వైకుంఠపురానికి చెందిన లలిత అలియాస్ పద్మ తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీగా ఉండే కూడళ్లు, వ్యాపార సముదాయాల్లో చోరీలకు పాల్పడుతోంది. నిందితురాలిపై ఏపీ, తెలంగాణాలో 17 చోరీ కేసులు నమోదయ్యాయి. ఓ చోరీ కేసులో 2020లో వరంగల్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. మహిళల సంచుల్లో ఉన్న విలువైన వస్తువులపై కన్నేసి చాకచక్యంగా చోరీ చేస్తుంది. ఇటీవల ఇంకొల్లు, పలుచోట్ల ఆర్టీసీ బస్టాండ్లలో చోరీ కేసులు నమోదు కావటంతో సిబ్బంది నిఘా పెటారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్సై సురేష్ పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా లలితను గుర్తించి పట్టుకున్నారు. నిందితురాలిపై ఇంకొల్లు, అద్దంకి, నరసరావుపేట, తుని పీఎస్‌లలో చోరీ కేసులు ఉన్నాయి. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్న ఇంకొల్లు సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. చీరాల డీఎస్పీ మోయిన్ పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తేనే.. ప్రయాణికులకు సౌకర్యం

సీతారామపురం, న్యూస్‌టుడే

గ్రామం మూడు జిల్లాల సరిహద్దు.. నిత్యం వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. అటువంటి చోట ఏళ్లుగా బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. గ్రామంలోని విద్యుత్తు ఉపకేంద్రం ఎదుట 13 ఏళ్ల కిందట దీన్ని ఏర్పాటుచేశారు. కొన్నాళ్లు బస్సులు ఇక్కడికి వచ్చి వెళ్లేవి. ప్రజలు కూడా వచ్చేవారు. బస్‌షెల్టర్ మాత్రమే ఏర్పాటు చేసిన అధికారులు సౌకర్యాలు కల్పించలేదు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటుచేయలేదు. ఫలితంగా ప్రయాణికులు ఇక్కడకు రావడం లేదు. గ్రామానికి దూరంగా ఉండడంతో దాహమైతే ప్రయాణికులు నానాఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. ఈ విషయాన్ని ఇటీవల ఇక్కడికి వచ్చిన ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి దృష్టికి పలువురు తీసుకెళ్లడంతో వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో షెల్టర్ వద్దకు బస్సులు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీలు ఏర్పాటు చేయలేదు. విద్యుత్తు సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు ఆదిశగా చర్యలు తీసుకుని సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామంలోని బస్‌షెల్టర్

ప్రతిపాదనలు పంపించాం

- రమేష్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఉదయగిరి

షెల్టర్‌లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ప్రహరీ ఏర్పాటు చేయిస్తాం. దాతల సాయం కూడా తీసుకుంటాం. ప్రస్తుతానికి ప్రయాణికులకు అలవాటయ్యేందుకు బస్సులు అక్కడికి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకున్నాం. త్వరలో వసతులు కల్పిస్తాం.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

సచివాలయాల్లో కౌశలం పరీక్ష

సంగం, న్యూస్‌టుడే: సంగం మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం జరిగిన కౌశలం పరీక్షకు ఎనిమిది మంది అభ్యర్థులు హాజరయ్యారు. కొంత కాలం క్రితం జరిగిన పరిశీలనలో భాగంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇంటి వద్ద నుంచి చేస్తామనే అభిప్రాయం వ్యక్తం చేసిన వారి అర్హత నిర్ధారించేందుకు పరీక్ష జరిగింది. అయితే పలు రకాల సాంకేతిక సమస్యల దృష్ట్యా. ఉపాధి అవకాశాల కోసం నిర్వహించిన కౌశల్ పరీక్షకు 140 మంది ఎంపికైనట్లు మనుబోలు ఎంపీడీవో జలజాక్షి తెలిపారు. మండలంలోని సచివాలయాల్లో జరుగుతున్న పరీక్షలను మంగళవారం ఆమె పరిశీలించారు. 6 వరకు కౌశల్ పరీక్షలు జరుగుతాయన్నారు. 14 సచివాలయాల పరిధిలో 140 మందిని ఎంపిక చేసి రోజుకు ఇద్దరు చొప్పున ఆన్‌లైన్‌లో పరీక్షలు రాస్తారన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారికి వర్క్ ఫ్రం హోమ్ కింద ఉద్యోగం ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు గరుడయ్య, శ్రావణి, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు రద్దు చేస్తాం

సంగం, న్యూస్‌టుడే: రవాణాశాఖ మార్గదర్శకాలు పాటించని పాఠశాల వాహనాల అనుమతులు రద్దు చేస్తామని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ ఆత్మకూరు విభాగం అధికారి రాములు మంగళవారం సంగంలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాటి సామర్థ్యం, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: కొడవలూరు మండలం రేగడిచెలికలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. -స్థానికుడు
సమాధానం: ఫాగింగ్ చేయిస్తాం. – వెంకట సుబ్బారావు, ఎంపీడీవో

? మర్రిపాడు మండలం కదిరినేనిపల్లిలో పలు వీధులకు సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాలకు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. – వెంకటేష్, స్థానికుడు
✓ సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. – నాగేశ్వరప్రసాద్, ఎంపీడీవో

? ఏఎస్‌పేట మండలం రాజవోలులోని కాలనీల్లో వీధిదీపాలు నిత్యం వెలుగుతున్నాయి. వీటికి విద్యుత్తు స్తంభాల వద్ద స్విచ్ బోర్డులను ఏర్పాటు చేయాలి. పగలు వెలగకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాసులు, గ్రామస్థుడు.
✓ పరిశీలించి స్విచ్‌లను ఏర్పాటు చేస్తాం. – నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి.

? సంగం మండలం దువ్వూరులో మిట్టపాలెం వద్ద వర్షపునీటి నిల్వతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. – వెంకయ్య, దువ్వూరు
✓ నీటి నిల్వ తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – హమీద్, పంచాయతీ కార్యదర్శి

? పొదలకూరు మండలం కనుపర్తి రోడ్డు వర్షానికి గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – వెంకయ్య
✓ నిధులు మంజూరైన వెంటనే నిర్మిస్తాం. – సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం కలుజు వద్ద కాలువలో గుర్రపుడెక్క నిండిపోయింది. వర్షాలు కురుస్తుండడంతో వరద నీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – విజయకుమార్, స్థానికుడు
✓ వర్షాలు తగ్గిన వెంటనే చర్యలు తీసుకుంటాం. –అలీ, నీటిపారుదలశాఖ ఏఈ

? అనంతసాగరం మండలం కొత్తపల్లి పరిధిలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. –ప్రసాద్, గ్రామస్థుడు
✓ శుభ్రం చేయిస్తాం. –రమణారావు, ఈవో

? పొదలకూరు రూరల్ పరిధిలోని ఇనుకుర్తి గిరిజన కాలనీలో పైడ కాలువల నిర్మాణం లేక [illegible] – వెంకయ్య, స్థానికుడు
✓ శుభ్రం చేయిస్తాం. –బాలకృష్ణయ్య, ఈవో

? విడవలూరు మండలం పార్లపల్లిలో కాలువలు శుభ్రం చేయడం లేదు. – స్థానికులు
✓ పరిశీలించి పూడిక తీయిస్తాం. – తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? కోవూరు పట్టణంలోని పీహెచ్‌సీ వద్ద పందులు సంచరిస్తున్నాయి. – స్థానికులు
✓ పరిష్కరిస్తాం. –శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

? విడవలూరులోని ఇందిరమ్మ కాలనీలో వీధిదీపాలు కొన్ని వెలగడం లేదు. [illegible] ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు
✓వీధిదీపాలు వేయిస్తాం. – జగదీశ్, ఈవో

? కోవూరు బజారు కూడలి వద్ద కూరగాయల మార్కెట్లో చెత్త రోడ్డు మీద వేస్తున్నారు. పందులు రోడ్డు మీదకొస్తున్నాయి. –స్థానికులు
✓ దూర ప్రాంతాలకు తరలిస్తాం. – శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ

గ్రామాల్లో క్లోరినేషన్ చేయకుంటే చర్యలు

సమావేశానికి హాజరైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

పొదలకూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాల్సిన బాధ్యత పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో నరసింహారావు అన్నారు. మంగళవారం పొదలకూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచి ప్రసన్న మాట్లాడుతూ.. పార్లపల్లిలో మిక్స్‌డ్ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు తాగునీటి సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ మాట్లాడుతూ.. పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఉపాధిహామీపథకం పనుల ప్రగతి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బారాయుడు, సొసైటీ అధ్యక్షులు మస్తాన్‌బాబు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చూసేదెవరు.. ఆపేదెవరు..!

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, కోవూరు

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమైతే సంబంధిత అధికారులనే బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో అక్రమాలు ఆగడం లేదు. కోవూరు, కొడవలూరు, బుచ్చి, విడవలూరు, ఇందుకూరుపేట, నార్త్‌రాజుపాళెం, ఇనమడుగు, పడుగుపాడు, గుమ్మళ్లదిబ్బ, పోతిరెడ్డిపాళెం, గంగవరం, పెనుబల్లి, రేబాల, దామరమడుగు, కొత్తూరు, మైపాడు, గండవరం గ్రామాల్లో ప్రభుత్వ భూములను గత పాలనలో వైకాపా నాయకులు ఇష్టారాజ్యంగా చెరువులు, నీటిపారుదల కాలువల ఉన్న స్థలాలను ఆక్రమించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. విజిలెన్స్‌తో పాటు, వివిధ శాఖల అధికారులతో విచారించి ఉన్నతాధికారులకు నివేదించారు. భారీగా ఆక్రమణలున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ● కొత్తూరు వద్ద కోవూరు చెరువు సమీపంలోని విస్తారంగా ఉన్న పంట కాలువ ఆక్రమించి వెంచర్ వేశారు. గండవరం వెళ్లే కాలువ కుంచించుకుపోయింది. ఆయకట్టుదారులు సాగునీరందక అల్లాడుతున్నారు. ● ఇనమడుగు పంచాయతీ పరిధిలోని చెర్లోపాలెం కూడలి రోడ్డు పక్కనే ఉన్న ప్రభుత్వం స్థలాన్ని ఒకరు ఆక్రమించి చదును చేసి కలిపేసుకున్నారు. రూ.లక్షల రూపాయల విలువైన స్థలాలు ఆక్రమించినా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు తమకు సంబంధంలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ● నార్తురాజుపాళెం బస్టాండ్ సెంటర్ వద్ద ఈస్ట్రన్ ఛానల్ ద్వారా కొడవలూరు, విడవలూరుకు వెళ్లే పారుదల కాలువ ఆక్రమించి భారీ భవంతులు నిర్మించారు. గత వైకాపా పాలనలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కూటమి పాలనలోనైనా ఆక్రమణలు తొలగించాలని స్థానికులు విన్నవిస్తున్నారు. ● ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెర్లోపాలెం కూడలి వద్ద ఆక్రమించి చదును చేసిన స్థలం

● కోవూరు నియోజకవర్గంలో 150కి పైగా లేఅవుట్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వేశారని అధికారులు గుర్తించారు. 500 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని ఎల్ఆర్ఎస్ చేసుకోవాలని నిర్ణయించారు. గత వైకాపా పాలనలో నాయకుల సహకారంతో పోరంబోకు, అసైన్డ్ భూములు, పంట కాలువలు, వాగులు ఆక్రమించి గోడలు కట్టేశారు. భారీ వర్షం పడితే నీరు కాలనీల్లో చేరి కొన్ని రోజుల వరకు పేరుకుపోతోంది.

● కోవూరు పట్టణ పరిధిలోని సీహెచ్‌సీ ఎదుట పంట కాలువ దిశను మార్చేసి స్థిరాస్తి వెంచర్ వేశారు. పొలాలకు నీరు రావడం లేదని సాగుదారులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. నెల్లూరులో సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు కనీసం పరిశీలించలేదు. ప్రస్తుతం పంట కాలువ మురుగు కూపంగా మారింది.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని చాబోలు పంచాయతీ వెంకటాపురంలో భూ ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఇన్‌ఛార్జి తహసీల్దారు అనిల్‌కుమార్‌కు కోరారు. మంగళవారం వినతి పత్రం కూడా అందజేశారు. వేరే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వెంకటాపురంలో భూ ఆక్రమణలు పాల్పడుతున్నారని, దొంగ పత్రాలు సృష్టించి ఈ పొలాల వారివే అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఆక్రమణదారులను అడ్డుకొని భూమి లేని పేదలకు విడతల్లో పట్టాలు ఇవ్వాలని కోరారు.

సోమశిలకు బస్సుల రాకపోకలు నిలిపివేత

అనంతసాగరం, న్యూస్‌టుడే: జిల్లాకు సాగునీరు పక్క రాష్ట్రానికి తాగునీరందిస్తున్న జిల్లాకు గర్వ కారణంగా ఉన్న సోమశిల గ్రామానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిపివేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి సోమశిల గ్రామానికి నిత్యం నాలుగు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే రోడ్డు మార్గం గుంతలమయంగా ఉండటంతో ఆర్టీసీ సేవలను సోమవారం నుంచి ఉప్పలపాడు గ్రామం వరకు పరిమితం చేశారు. దీంతో కమ్మవారిపల్లి, పడమటి కంభంపాడు, సోమశిల గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మంగళవారం ఉదయం ఆత్మకూరు, సాయంత్రం నెల్లూరు ఆర్టీసీ(హైర్) బస్సులు ఒకసారి గ్రామానికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

పొలాల్లో నీరు... రైతులకు కన్నీరు

విడవలూరు పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

విడవలూరు, బుచ్చి, కోవూరు, ముత్తుకూరు, చేజర్ల, న్యూస్‌టుడే: దిత్వా తుపాను కారణంగా వరుసగా మూడు రోజుల పాటు వర్షం రావడంతో వరి పంటకు నష్టం ఏర్పడింది. ముత్తుకూరు, బుచ్చి, కోవూరులోని పలు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. వ్యవసాయ నష్టాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని సంగం ఏవో శశిధర్ తెలిపారు. విడవలూరు మండలంలోని పొలాల్లో నీరు నిలిచింది. నీరు బయటకు పంపేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చేజర్ల మండల పరిధిలో నల్లవాగు, పందల వాగుల్లో ప్రవాహ ఉధ్ధృతి తగ్గింది. నీరు చప్టాలకు కిందకు చేరడంతో చేజర్ల-సంగం, చేజర్ల-కలువాయి మార్గంలో రాకపోకలకు అధికారులు అనుమతించారు.

వీఆర్వో సంతకం ఫోర్జరీ

అనంతసాగరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఒక ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వీఆర్వో సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ స్టాంపులతో పత్రాలను తయారు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. వరికుంటపాడు గ్రామంలో ఒక ఇంటిని రిజిస్ట్రేషన్ చేసేందుకు వీఆర్వో జగదీశ్ సంతకాన్ని ఫోర్జరీ చేశారు. దీంతో పాటు నకిలీ స్టాంపు వరికుంటపాడు సచివాలయంగా తయారు చేసి ఆస్తి ధ్రువీకరణ పత్రాలను ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఉప్పలపాడు సచివాలయం పరిధిలో ఉండే వరికుంటపాడు గ్రామ సచివాలయం స్టాంపు ఉండటంతో రిజిస్ట్రార్‌కు అనుమానం వచ్చి ఉప్పలపాడు సచివాలయం వీఆర్వో జగదీశ్‌ను చరవాణి ద్వారా సంప్రదించారు. తాను ఎలాంటి సంతకం చేయలేదని ఇది ఫోర్జరీ అని తేల్చడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. వీఆర్వో జగదీశ్ వెంటనే స్పందించి తహసీల్దార్ జయవర్ధన్‌కు ఫిర్యాదు అందించారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు సర్వే నంబర్‌తో పాటు పూర్తి నివేదిక వివరాలను పొందుపరిచి ఫిర్యాదు చేయాలని కోరినట్లు తెలిపారు. నివేదికను సిద్ధం చేసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లాలో కలపొద్దని ఆందోళన

కలువాయి బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ మంగళవారం గ్రామంలో యువత ఆటో కార్మికులతో కలసి కలువాయి బస్టాండ్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లాలోనే కలువాయిని ఉంచుతామనే ప్రకటన ప్రభుత్వం నుంచి వచ్చే వరకు నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉంటామని గ్రామంలోని యువత పేర్కొన్నారు.

త్రివిధ దళాల పతాక దినోత్సవానికి చర్యలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: త్రివిధ దళాల పతాక దినోత్సవం ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో త్రివిధ దళాలకు సంబంధించిన స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలు అందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు ఈ దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పౌరుడు సంఘీభావం తెలుపుతూ తమవంతుగా త్రివిధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వాలని కోరారు.

గుంతల రోడ్డు..ప్రయాణం నరకం

తోటపల్లిగూడూరు మండలం కోడూరు పంచాయతీ పాత కోడూరు వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. పెద్ద గుంతలు పడడంతో పాటు వర్షాలు రావడంతో నీరు గుంతల్లో చేరాయి. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

చేతిపంపు నిరుపయోగం

కోవూరు పట్టణంలోని గ్రంథాలయం వద్ద ఉన్న చేతిపంపు కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. సమీపంలో ఆలయాలు, ఉదయం విద్యుత్తు సరఫరా లేనపుడు ఉపయోగపడుతుందని, మరమ్మతులు చేయాలని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. చేతిపంపు బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

పీటర్ కాలువ పనులు వేగవంతం

కోవూరు బజారు కూడలి సమీపంలో పీటర్ కాలువ వంతెన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్డు కావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇటీవల ఆదేశించారు. త్వరగా పనులు పూర్తి చేసి రోడ్డు విస్తరణ పనులు చేపడితే ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతో పాటు ప్రమాదాలకు అడ్డుకట్టపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

పట్టించుకునేదెవరు...!

కోవూరులో చెత్త కుండీలు నిరుపయోగంగా పడేశారు. కోవూరు మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో సచివాలయం వద్ద ఇవన్నీ వృథాగా పడేశారు. బజారు కూడలి, స్టేషన్ రోడ్డు, పలు ఆలయాలు, దుకాణాల కూడళ్ల వద ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు సూచించిన చోట్ల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

పూడిక తీయించండి సారూ..

కోవూరు పట్టణంలోని పడుగుపాడు బండారుమాన్యంలో సచివాలయం- 3 సమీపంలో మురుగు కాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పూడిక తీయకపోవడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉంది. వర్షాకాలంలో మురుగునీరు పొంగి ఇళ్లలోకి వస్తున్నాయని పంచాయతీ, సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయించాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

ఎట్టకేలకు తొలగించారు

స్పందనకు వందనం

కోవూరు మండలం ఇనమడుగు కూడలి సమీపంలో విద్యుత్తు నియంత్రికపై చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకుపోయి తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోంది. 'ఈనాడు'లో మంగళవారం 'ముట్టుకుంటే షాకే' శీర్షికతో కథనం ప్రచురితమైంది. డిస్కం అధికారులు స్పందించి నియంత్రికకు అల్లుకున్న మొక్కలను తొలగించారు సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, కోవూరు

వేడుకగా కాత్యాయని వ్రతం

నెల్లూరు : నెల్లూరు దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం కాత్యాయని వ్రత పూజలు అలివేట్టి మండపంలో ఘనంగా జరిగాయి. అమ్మవారిని పూలతో అలంకరించి.. అర్చకులు భక్తుల చేత పూజలు చేయించారు. ఆలయ ఈవో జనార్దన్ రెడ్డి ఏర్పాట్లు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండల పరిధిలోని అయ్యగారిపాళెం - నందివాయి గ్రామాల మధ్య ఉన్న వంతెనకు మంగళవారం రంధ్రం పడింది. దీంతో వాహనాల రాక,పోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. స్థానికులు కొందరు రంధ్రానికి గడ్డి, చెత్త వంటివి చుట్టి తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయ్యగారిపాళెం, నందివాయి, అమ్మవారిపాళెం, ప్రభగిరిపట్నం నావూరు, చెన్నారెడ్డిపల్లి, నావూరుపల్లి, బోగసముద్రం గ్రామాలను కలిపే ప్రధాన రోడ్డు లో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రి వేళల్లో గుర్తించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. పీఆర్ సహాయ ఇంజినీరు సుధాకర్ మాట్లాడుతూ... తమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

నిందితులను శిక్షిద్దాం.. గంజాయి నిర్మూలిద్దాం

మర్రిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు బృందం, న్యూస్‌టుడే: గంజాయి మాఫియా చేతుల్లో హత్యకు గురైన పెంచలయ్య మృతికి కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నరుకూరు కూడలిలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మత్తు పదార్థాలను ప్రజలకు దూరం చేసేందుకు పోరాటం చేసిన వ్యక్తిని చంపడం దారుణమన్నారు. రాజా, అన్నపూర్ణమ్మ, లక్ష్మయ్య తదిదరులు పాల్గొన్నారు. పొదలకూరు-నెల్లూరు ప్రధాన రహదారిపై కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. సీఐటీయూ నాయకులు గౌరి, మహేంద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మనుబోలులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. భాస్కర్, శివ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ● ఏఎస్‌పేటలో స్థానిక దర్గా సెంటర్ నుంచి నగరాఖానా, మెయిన్‌బజారు మీదుగా బస్టాండు వరకు నిరసనకారులు ర్యాలీ నిర్వహించారు. అనంతసాగరంలోని బస్టాండ్ సెంటర్లో సీపీఎం నాయకులు బైఠాయించి నిరసన చేపట్టారు. నాయకులు అన్వర్ బాషా, సుబ్బరాయుడు, సందాని, ఫక్రూసా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. ● ఆత్మకూరు సోమశిల రోడ్డు సెంటర్‌లో బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. మర్రిపాడులో ప్రజాసంఘాల నాయకులు ఆధ్వర్యంలో పెంచలయ్య హత్యకు నిరసన ప్రదర్శన చేట్టారు. ప్రమీల, శ్యామలమ్మ, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. ● కోవూరు నియోజకవర్గంలోని బుచ్చి, విడవలూరు, కొడవలూరు, కోవూరు మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పభ్రుత్వ కార్యాలయాలు, పాఠశాలలను మూయించారు. విడవలూరు సీపీఎం నాయకులు గోపాల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.

పొదలకూరు బస్టాండు వద్ద...

అక్రమంగా గ్రావెల్ తరలింపు

కోవూరు మండలం ఇనమడుగులో కొందరు అక్రమార్కులు గ్రావెల్ కొల్లగొడుతున్నారు. రాత్రి సమయాల్లో పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టి వివిధ స్థిరాస్తి వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి స్థానికులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. పోతిరెడ్డిపాళెం, కోవూరు, నార్త్‌రాజుపాళెం, గండవరం తదితర గ్రామాల్లో గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.10 వేలు చొప్పున అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని పల్లిపాడు ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్ఏ ఉర్దూ పోస్టుకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో సునీల్ కుమార్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు అప్లికేషన్‌ను నింపి 3 నుంచి 5వ తేదీలోగా ఇందుకూరుపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

మడుగు కాదు రోడ్డు దుస్థితి

సైదాపురం మండల పరిధిలో పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. జోగిపల్లి రోడ్డు సమీపంలో పొదలకూరు ప్రధాన రోడ్డుపై వర్షాలకు గుంతల్లో నీరు చేరాయి. ఆ మార్గంలో వెళ్లే వాహనచోదకులు గుర్తించక అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం ప్రజలకు నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.– న్యూస్‌టుడే, సైదాపురం

విద్యార్థులకు అపార్ కష్టాలు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

నూతన జాతీయ విద్యా విధానంతో విద్యార్థులకు తప్పనిసరి చేసిన అపార్ గుర్తింపు సంఖ్య కేటాయించడానికి నియోజకవర్గాల్లో సరైన వివరాలు అందించలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ఐడీ కేటాయించాలి. ఇది ఉంటేనే విద్యార్థులు పది, ఇంటర్ పరీక్షలకు ఫీజులు చెల్లించే వెసులుబాటు ఉంటుంది. దీంతో విద్యాశాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. పలు పాఠశాలల్లో సామూహికంగా అపార్ నమోదు చేపట్టారు. దీనికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తప్పనిసరి. కానీ ఇక్కడే సమస్య తలెత్తుతోంది. పాఠశాల దస్త్రాల వివరాలు సరిపోక వాటిని సరి చేయించుకోవడానికి పాఠశాల స్థాయిలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా అత్యధిక తల్లిదండ్రులకు వీటిపై అవగాహన లేకపోవడంతో వాటి సేవలను సద్వినియోగం చేసుకోలేక పోయారు. మరి కొద్ది రోజుల్లో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల రుసుము చెల్లించే తేదీ దగ్గర పడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ● సర్వేపల్లి నియోజకవర్గంలో 358 ప్రాథమిక, 67 ప్రాథమికోన్నత, 27 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 50 వేల మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. అన్ని మండలాల్లో 30 చోట్ల పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహించారు. మొత్తం మీద సుమారు అయిదు వేల మంది విద్యార్థులు ఆధార్‌లో సవరణ చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ● ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... మండల విద్యాశాఖాధికారి లాగిన్‌లో విద్యార్థులు తమ పేర్లు, తదితరాలు సరిచేయించుకోవచ్చన్నారు. ఆధార్‌లో తప్పు ఉంటే సరి చేయించుకోవాల్సిందేనని, అపార్ వివరాల నమోదు కోసం గ్రామ స్థాయిలో పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నారన్నారు. వాటిలో ఆధార్ కార్డుల్లో తప్పులను సవరణ చేయించుకుంటే మేలని పేర్కొన్నారు.

అక్షర దోషాలతో..

పాఠశాల దస్త్రాలు, యూడైస్ ప్లస్ వివరాలు, విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆధార్ కార్డుల్లోని వివరాల్లో తేడాలు లేకుంటేనే అపార్ ఐడీ వస్తుంది. ఆధార్‌లో విద్యార్థి పుట్టిన తేదీ, ఇంటిపేరు, విద్యార్థి తల్లిదండ్రుల పేర్లలో అక్షర దోషాల కారణంగా పాఠశాల దస్త్రాల వివరాలతో సరిపోక చాలా మందికి కార్డులు జారీ చేయడం లేదు. పుట్టిన తేదీ, ధ్రువపత్రం లేక వాటిని పొందడం సులభం కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవం

నెల్లూరు జిల్లా వికలాంగులు అందరికి
ప్రపంచ వికలాంగుల దినోత్సవ
శుభాకాంక్షలు తెలుపుతూ...
అంధులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని
మనస్ఫూర్తిగా కోరుకుంటూ...
అనంతసాగరం మండల ప్రజలు

లాయర్స్ డే శుభాకాంక్షలు

జిల్లా మరియు కోవూరు పట్టణ న్యాయాధికారులకు, కోవూరు బార్ అసోసియేషన్ సభ్యులకు, సహచర న్యాయవాదులకు మరియు కక్షిదారులకు లాయర్స్ డే శుభాకాంక్షలు.

Ch. తిరుమలేష్, B.L.,
అడ్వకేట్, కోవూరు . Cell: 98488 50197

(c) eenadu

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

వేడుకగా కాత్యాయని వ్రతం

పూజలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

నెల్లూరు(దుర్గామిట్ట), న్యూస్‌టుడే: నెల్లూరు దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం కాత్యాయని వ్రత పూజలు అలివేట్టి మండపంలో ఘనంగా జరిగాయి. అమ్మవారిని పూలతో అలంకరించి.. అర్చకులు భక్తుల చేత పూజలు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు వ్రత మహిమలు వివరించారు. ఆలయ ఈవో జనార్దన్ రెడ్డి ఏర్పాట్లు చేశారు.

ప్రతిభకు పురస్కారం

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: నెల్లూరు నారాయణ డెంటల్ కళాశాలలో ఆర్థోడాంటిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. గౌరిశంకర్ అవుట్ స్టాండింగ్ ఆర్థోడాంటిస్ట్ అవార్డు పొందారు. వైజాగ్‌లో ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ(ఐవోఎస్) జాతీయ సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా ఎంపికైన ఐదుగురిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన మొదటి వ్యక్తి డాక్టర్ గౌరిశంకర్.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: వేదాయపాలెం చైతన్యపురి కాలనీలో ఎల్‌ఎల్‌ఎఫ్ స్కూల్ ప్రాంతంలో చెత్తను తీసుకెళ్లే వారు సరిగా రావడం లేదు. వారానికి ఒకసారి వస్తున్నారు. ఇళ్లలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – మానస, స్థానికురాలు

సమాధానం: ప్రతి రోజూ చెత్తను సేకరించేలా చర్యలు చేపడతాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

? శివగిరికాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. బయటకు రావాలంటే ఆందోళన చెందుతున్నాం. – రమ్యశ్రీ

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఇద్దరు కార్పొరేటర్లు తెదేపాలో చేరిక

కార్పొరేటర్ అమృత, భర్త రాజేష్‌కు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో వైకాపాకు ఎదురు దెబ్బ తగిలింది. ఇద్దరు కార్పొరేటర్లు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, 38వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత, ఆమె భర్త రాజేష్ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. మంగళవారం రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మూలెం విజయభాస్కర్, పామూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డొస్తే.. అడ్డంగా నరికేస్తాం!

నగరంలో చెట్లపై వేటు.. పచ్చదనంపై ప్రభావం

నగరంలో కాలుష్య తీవ్రత తగ్గించడానికి నెల్లూరు నగరపాలకసంస్థ ఉద్యాన విభాగం ఏటా రూ.2కోట్ల వరకు వెచ్చిస్తూ మొక్కలను నాటిస్తోంది. అవి ఏపుగా పెరిగి చెట్లుగా మారుతున్న తరుణంలో.. కొందరు ప్రైవేటు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాలకు నరికేస్తున్నారు. వీరితో పాటు పలు ప్రభుత్వ శాఖలు తొలగిస్తున్నాయి.
– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నెల్లూరు నగరపాలకసంస్థ నాటి, సంరక్షించిన మొక్కలను ఎవరైనా నరికితే వారిపై పోలీసు కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు చట్ట ప్రకారం రూ.లక్షల్లో అపరాధ రుసుం వసూలు చేయాల్సి ఉంది. అయితే ఉద్యాన విభాగంలో పని చేస్తున్న కొందరు ప్రైవేటు వ్యక్తులతో బేరం కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వెంటనే సిబ్బంది, కార్మికులు క్షేత్రస్థాయిలో చెట్లను నరికేస్తున్నారు. గత కొంతకాలం నుంచి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

పోలీసు కాలనీ రెండో వీధిలో..

వాణిజ్య సముదాయాలకు అడ్డుగా ఉన్నాయని..: నగరంలోని జీఎన్‌టీ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. వాహనాల రాకపోకలతో కాలుష్య తీవ్రత అధికమే. రహదారి డివైడర్ల మధ్యలో ఏడెనిమిదేళ్ల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి.. చెట్లయ్యాయి. రహదారి పక్కన ఉన్న వ్యాపార ప్రకటనల హోర్డింగులకు, వాణిజ్య సముదాయాల ముఖద్వారాలకు ఇవి అడ్డుగా ఉంటున్నాయనే కారణంతో గుట్టుచప్పుడు కాకుండా నరికేస్తున్నారు. మూలాపేట, పోలీసు కాలనీ, పొదలకూరురోడ్డు, కోటమిట్ట, బాలాజీనగర్, కరెంటాఫీసు తదితర ప్రాంతాల్లో కొందరు ప్రైవేటు వ్యక్తులు చెట్లను తొలగిస్తున్నారు. కాగా విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలు తొలగించకుండా కాండం వరకు నరికేస్తున్న ఘటనలు నగరంలో చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఆర్థిక స్థోమత లేని వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 24 మంది పేదలకు రూ.16లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 33వ డివిజన్ నేతాజీనగర్‌లో రూ.35లక్షలతో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పెంచలనాయుడు, జలదంకి సుధాకర్, కరణం హజత్‌నాయుడు, మేఘనాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: రెవెన్యూ సిబ్బంది వారాంతపు లక్ష్యాలను కచ్చితంగా వసూలు చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ సూచించారు. మంగళవారం కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వీస్ రిక్వెస్ట్‌లను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదు చేసే సమయంలో సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని నిర్దేశించిన సమయంలోపు సర్వీస్ రిక్వెస్ట్‌లు పూర్తిచేయని సిబ్బంది జీతం నుంచి రికవరీ చేస్తామన్నారు. ఖాళీ స్థలాలు పన్ను వసూళ్లపై శ్రద్ధ చూపి సత్వరమే వసూళ్ల చర్యలు చేపట్టాలని, బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నయ్య, టీపీఆర్‌వో వాసుబాబు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ): నెల్లూరునగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మాగుంట లేఅవుట్ కేకేఆర్ గౌతం పాఠశాల సమీపంలోని వీధిలో నిలిచిన నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు కచ్చ కాలువను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంఎస్‌ఆర్ పార్కు సమీపంలో రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజయమహల్‌గేటు ప్రాంతంలోని నేతాజీ వైట్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో, కొత్త హాలు సమీపంలోని జయదర్శన్ అపార్టుమెంటు సమీపంలో మెగా డ్రైను కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వెంకటరమణ హోటల్ సమీపంలో కాలువలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన తొలగించి, నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలన్నారు.

గంజాయికి వ్యతిరేకంగా పోరాటం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పెంచలయ్య కుటుంబానికి సీపీఎం అండగా ఉంటానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కార్యాలయంలో సీపీఎం నాయకులు పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరురూరల్ నియోజకవర్గంలో కలిసివచ్చే అన్ని పార్టీలతో ప్రత్యేక కార్యాచరణతో గంజాయిని రూపుమాపుతామని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, బాబుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఎస్‌ఏ ఉర్దూ పోస్టుకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో సునీల్ కుమార్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు అప్లికేషన్‌ను నింపి 3 నుంచి 5వ తేదీలోగా ఇందుకూరుపేటలోని విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా

నెల్లూరు(జడ్పీ) న్యూస్‌టుడే: నగరంతోపాటు గ్రామీణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ అధికారులు, కొందరు సీడీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సక్షం పథకం కింద ఇచ్చిన టీవీలు పనిచేస్తున్నాయా లేదా.. పిల్లలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తున్నారా లేదా అనే అంశంపై తనిఖీలు జరిగాయి. సక్షం పథకం కింద అంగన్‌వాడీలకు ఇచ్చిన టీవీలు, మంచి నీటి పథకాలు పనిచేయడం లేదంటూ 'ఈనాడు'లో ఈనెల 1న సక్షం సమస్యలే సాక్ష్యం శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ శాఖ పీడీ హేనాసుజాన్ స్పందించి కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. దీంతో సీడీపీవోలు పరిశీలించారు.

కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

త్రివిధ దళాల పతాక దినోత్సవానికి చర్యలు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: త్రివిధ దళాల పతాక దినోత్సవం ఈ ఏడాది కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో త్రివిధ దళాలకు సంబంధించిన స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలు అందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు ఈ దినోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పౌరుడు సంఘీభావం తెలుపుతూ తమవంతుగా త్రివిధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వాలని కోరారు.

భవన శిథిలాలే రక్షణ

నగరంలోని వాకర్స్‌రోడ్డు వర్షాలకు అధ్వానంగా తయారైంది. ఆర్ అండ్‌బీ రోడ్డు అంతా గోతులు పడటంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు గుంతల్లో భవన శిథిలాలు వేసి చదును చేశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

పడిపోతున్నా.. పట్టించుకోండి

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం జొన్నవాడ రోడ్డు పొట్టేపాళెం ప్రాంతంలో కొండ్లపూడి రోడ్డు ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి ప్రధానమార్గం వెంబడి హైటెన్షన్ విద్యుత్తు వైర్లు వెళ్లే స్తంభాలు ఓ వైపునకు ఒరిగి ఉన్నాయి. మూడు స్తంభాల వరకు ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (నెల్లూరుగ్రామీణం)

రాళ్లు పోసి మమఅనిపించారు

నగరంలోని ఆరోగ్యశాఖ అధికారులు చేయిస్తున్న పనులు విమర్శలకు ఆస్కారమిస్తున్నాయి. పలుచోట్ల నీటి పైపుల కనెక్షన్లు ఇచ్చేందుకు గుంతలు తవ్వారు. వాటిని తిరిగి పూడ్చి ప్యాచ్ పనులు చేయడం లేదు. పైగా కస్తూరి దేవి స్కూలు ఎదురుగా గుంత అలాగే వదిలేశారు. శాంతినగర్‌లో భారీగా రాళ్లు పోసి వదిలేశారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

రహదారి అధ్వానం

నెల్లూరు నగరం జీఎన్‌టీ రోడ్డు గోతులమయంగా మారింది. వర్షాలకు రహదారి పలుచోట్ల దెబ్బతినడంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. శబరి క్షేత్రం వద్ద రహదారి రాళ్లు తేలి భారీ గోతులు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

వాగు కాదు.. కృషి విజ్ఞాన కేంద్రం రోడ్డే

పడారుపల్లి వద్ద ఉన్న ఆచార్య ఎన్జీరంగా కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలోని పొలంలోకి వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఎగువ నుంచి నీరు ఎక్కువగా రావడం కాలువలు లేకపోవడంతో నీరు ఎటూ వెళ్లలేక రోడ్డుపై, ఆవరణంలో చేరుతోంది.నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్)

ఘనంగా మండల పూజ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో జరుగుతున్న మండల పూజల్లో భాగంగా మంగళవారం స్వామివారికి పాలాభిషేకం నిర్వహిచారు. గణపతి హోమం, స్వామివారికి శ్రీవేలి ఉత్సవం, పూలంగిసేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు, ఉభయకర్తలు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వర స్వామికి ప్రదోషకాల పూజ

పూజలు అందుకున్న నందీశ్వరస్వామి

నెల్లూరు(జడ్పీ): నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ సుందరేశ్వరస్వామిఆలయంలో త్రయోదశి ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ముందుగా వినాయకస్వామికి, అమ్మవారికి, స్వామివారికి పూజలు చేపట్టారు. అనంతరం సుందరేశ్వరస్వామి ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో డ్రోన్ శిక్షణ

నెల్లూరు (విద్య): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ ఆధ్వర్యంలో డ్రోన్ శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి గణేశ్ మాట్లాడుతూ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, ప్రిన్సిపల్ రవిప్రసాద్, ఎన్‌సీసీ అధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో డ్రగ్స్‌ను అరికట్టాలి

పొట్టేపాళెం వద్ద సీపీఎం నాయకుల నిరసన

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: సీపీఎం నాయకుడు, ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్యను గంజాయి, డ్రగ్స్ మాఫియా హత్య చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో పొట్టేపాళెం గ్రామం ప్రధాన రహదారిపై బంద్ నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు ఆలూరి తిరుపాలు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు చంద్రమౌళి, ముత్యాల నాగయ్య, రమణయ్య, జానా లక్ష్మీ ప్రసాద్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల ప్రదర్శన: నెల్లూరు(మార్కెట్ సెంటర్): గంజాయి ముఠా చేతిలో హత్యకు గురైన పెంచలయ్య కుటుంబ సభ్యులను మంగళవారం జనసేన నాయకులు పరామర్శించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు జనసేన తోడుగా ఉంటుందని చెప్పారు. జిల్లాలో గంజాయి సమస్యను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుధాకర్, ప్రశాంత్, హేమచంద్ర, నరహరి, వర్షన్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహంపై కేసు నమోదు

ఒంగోలు గ్రామీణం: బాల్య వివాహంపై మహిళా పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు బలరాం కాలనీకి చెందిన ఓ బాలిక తొమ్మిదో తరగతి చదువులోంది. కుటుంబీకులు ఆమెను.. నెల్లూరు జిల్లా కావలికి చెందిన హరీష్‌రెడ్డికి ఇచ్చి గత నెల 28న కందుకూరులో వివాహం జరిపించారు. పెళ్లి ఇష్టం లేని బాలిక ఆ తరువాతి రోజు 1098కు ఫిర్యాదు చేసింది. దీంతో జిల్లా మహిళా, శిశు సంరక్షణ అధికారిణి సువర్ణ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. బాధిత బాలికను అదే రోజు రామ్‌నగర్‌లోని బాలసదన్‌కు తరలించి... మహిళా పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని అరవింద్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతున్న పొనుగోటి యశస్విని ఇటీవల ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా పెనకాక్ శిలాట్ పోటీల్లో ప్రతిభ చూపింది. సోలో విభాగంలో బంగారు పతకం సాధించింది. మంగళవారం రాష్ట్ర క్రీడా సీఈవో మనోజ్ పతకం అందించి అభినందించారు.

శివారు.. వానొస్తే బేజారు

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

వానొస్తే నగరంలోని శివారు ప్రాంత ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తరచూ కాలనీలు ముంపునకు గురవుతుండంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. దిత్వా తుపాన్ కారణంగా కురిసిన వర్షంతో తల్పగిరికాలనీ, ఆర్టీసీకాలనీలు మరో సారి ముంపునకు గురయ్యాయి. ఇటీవల వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో ముంపునకు గురై ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ఈ కాలనీలు మళ్లీ జలమయం కావడంతో స్థానికుల బాధలు వర్ణనాతీతం. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో ప్రస్తుతం ఈ కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. పలు వీధులను వరద ముంచెత్తగా, నివాసాల చుట్టూ నీరు చేరింది.

తల్పగిరికాలనీలో వాహనదారుల అవస్థలు

దెబ్బతిన్న రహదారులు

వర్షాలకు పలు రహదారులు దెబ్బతిన్నాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న చంద్రబాబునగర్ రోడ్డు మరింత అస్తవ్యస్తంగా మారింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం అడ్డంగా తవ్వేసిన రహదారులు బురదమయంగా మారి స్థానికులను అవస్థలపాల్జేస్తున్నాయి. అధికారులు స్పందించి శివారు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచి, రహదారులపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనదారులకు కష్టాలు

మోకాటిలోతు నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో సరైన డ్రైనేజీ సౌకర్యం లేక వర్షం నీరు రోజుల తరబడి కాలనీల్లోనే నిల్వ ఉంటోంది. వర్షం వస్తే అయ్యప్పగుడి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుపైకి వరద పెద్దఎత్తున చేరుతోంది. నగరంలోకి ప్రవేశానికి ఈ రహదారి కీలకం కావడంతో వాహనాలు మోకాటిలోతు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ద్విచక్రవాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భక్తవత్సలనగర్, జొన్నవాడ రహదారుల పక్కన వర్షం నీరు చేరుతోంది. పొట్టేపాలెం కలుజు వద్ద వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

నెల్లూరులో హత్యలపై ఆందోళన: కాకాణి

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: ప్రశాంతతకు మారు పేరైన నెల్లూరులో హత్యలపై ఆందోళన వ్యక్తం అవుతోందని, పెంచలయ్య హత్యపై తెదేపా ద్వంద్వ వైఖరి ఆపాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరులో గంజాయి డాన్ అరవ కామాక్షి తెదేపాకు చెందిన వారని, ఆ పార్టీ ఎమ్మెల్యేనే ఆమెకు అండగా ఉన్నారని, అందుకు ఎన్నో ఫొటోలు ఉన్నాయన్నారు. ఆమె వైకాపాకు చెందిందంటూ తమ పార్టీకి మసి అంటించాలని చూస్తున్నారని ఆరోపించారు. చివరకు ముఖ్యమంత్రి సైతం అవే మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

మహారాజశ్రీ నెల్లూరు 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 588 of 2023
షేక్ అవేజ్ - వాది
Vs
1. మారంరెడ్డి వర్షిణి మరియు ఇతరులు - ప్రతివాదులు
నోటీసు
To
D1. మారంరెడ్డి వర్షిణి, W/o శేషురెడ్డి, వయస్సు 41 సం॥, చిరునామా : డో॥ నెం॥ 16-3-948, బ్యాంక్ కాలనీ, ముత్యాలపాళెం, నెల్లూరు సిటీ.
D2. అమ్మనబ్రోలు శ్రీధర్‌రెడ్డి, S/o వెంకట రమణరెడ్డి, వయస్సు 55 సం॥, చిరునామా: డో॥ నెం॥ 16-3-948, ముత్యాలపాళెం, నెల్లూరు సిటీ.
D3. M/s. ఆదిత్య రియల్ ఎస్టేట్స్, నెల్లూరు, పార్టనర్‌షిప్ ఫర్మ్, Rep by. మేనేజింగ్ పార్టనర్, Smt. వివరం నాగరాజమ్మ మరియు పార్టనర్ గుత్తా తిరుపాల్ నాయుడు, రూమ్ నెం. I, D- బ్లాక్, సాయికృష్ణ కాంప్లెక్స్, జొన్నలగడ్డ వారివీధి, నెల్లూరు
పై నెంబరు కేసును పై తెలిపిన వాది మీ మరియు ఇతరులపై షెడ్యూలు ఆస్తిపై వాది హక్కును డిక్లేర్ చేయమని కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు కేసు మీ నోటీసుకుగాను తేది 10-12-2025 దికి వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజు అనగా తేది 10-12-2025 దిన ఉ॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై వారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
యస్.శ్రీనివాసమూర్తి, B.A., B.L.
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు

పచ్చని పల్లెలపై.. బెల్ట్ పడగ..!

నెల్లూరు రూరల్ మండలంలో అనధికార మద్యం దుకాణాలు

న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

● గొల్లకందుకూరు 4, సజ్జాపురం 3, కొత్తవెల్లంటి 3 ఇవేమి లెక్కలు అనుకుంటున్నారా.. ఇవన్నీ ఆయా గ్రామాల్లో అనధికారికంగా నడుస్తున్న బెల్టు దుకాణాలు.

● నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామ పంచాయతీల్లో 32,836 మంది ఓటర్లు ఉండగా 50వేల మందికి పైగానే జనాభా ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన గ్రామాలు ఇవి. వీటిలో ప్రస్తుతం విచ్చల విడిగా అనధికార దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు.

దుకాణానికి రూ.25వేలు

18 పంచాయతీల పరిధిలో పది లోపే ప్రభుత్వ మద్యం దుకాణాలుంటాయి. అనధికార బెల్టుషాపులు గ్రామానికి మూడు, నాలుగు ఆపైనా ఉన్నాయి. ముఖ్యంగా పొట్టేపాళెం నుంచి గొల్లకందుకూరు, ఆమంచర్ల పరిధిలో 14 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో పాత వెల్లంటి మినహా మిగతా 13 గ్రామ పంచాయతీ పరిధిలో చాలావరకు ఓ నాయకుడి కనుసన్నల్లో బెల్టు దుకాణాలు నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బెల్టుషాపు ఏర్పాటు చేసుకోవాలంటే ఆ నాయకుడికి రూ.25 వేలు చెల్లించాల్సి ఉంది. డబ్బులు కడితే మద్యం బాటిళ్లు ఎమ్మార్పీ ధరకే సదరు నాయకుడు సరఫరా చేస్తాడు. ఇందులో కూడా ఓల్డ్ అడ్మిన్ దీనిని తలకాయగా పిలుస్తారు. ఈ రకం మద్యం క్వాటర్ బాటిల్ రూ.130. దీనికి మాత్రం రూ.10 అదనంగా చెల్లించాలి. మిగతావి అంతా ఎమ్మార్పీకే సరఫరా చేస్తారు. బెల్టు దుకాణదారులు క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దుకాణాల కారణంగా గ్రామాల్లో వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయనే మాటలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి బెల్టుషాపులు కట్టడి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

ఎక్కువైపోతున్నాయి

– పూడిపర్తి జనార్దన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు

గ్రామాల్లో బెల్టుషాపులు ఎక్కువైపోతున్నాయి. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. గొడవలు పెరుగుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. ● దీనిపై ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ బెల్టు దుకాణాలను అడ్డుకుంటామని తెలిపారు.

అభివృద్ధికి దూరంగా ఆర్‌డీటీ కాలనీ

ఇళ్ల మధ్యలోనే పాత సామాన్ల దుకాణం

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద గల ఆర్‌డీటీ కాలనీలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. శివారు ప్రాంతం కావడంతో నాయకులెవరూ ఈ ప్రాంతం వైపు దృష్టి పెట్టలేదు. 2022లో ఇక్కడ ఆర్‌డీటీ కాలనీ ఏర్పాటైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఇక్కడ నివాసాలు మంజూరు చేసింది. దినసరి కూలీలే ఇక్కడ జీవిస్తున్నారు. అధికారులెవరూ ఇక్కడ పట్టించుకోకపవడం, అభివృద్ధి లేకఅసాంఘిక, చీకటి కార్యకలాపాలు జరుగుతుంటాయి. రాత్రయితే చాలు అనుమానిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంటోంది. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతంలో పోలీసులు, అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ఇలాంటివి జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో అభివృద్ధి చేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

తెరపై ఈనాడు

ఎం.I సినిమాస్.: స్క్రీన్.1 తేరే ఇష్క్ మె (హిందీ), బిసినెస్ మాన్ (తెలుగు) స్క్రీన్.2 ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు) స్క్రీన్.3 రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు) **స్పైస్.సినిమాస్:** స్క్రీన్.1 బిసినెస్ మాన్ (తెలుగు) స్క్రీన్. 2 జూటోపియా 2.3డీ (తెలుగు, ఇంగ్లిష్) స్క్రీన్. 3 రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు), రివాల్వర్ రీటా (తెలుగు) స్క్రీన్. 4 తేరే ఇష్క్ మె (హిందీ) స్క్రీన్.5.. ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్.1. జూటోపియా 2..3డీ (తెలుగు, ఇంగ్లిష్), రివాల్వర్ రీటా (తెలుగు) స్క్రీన్.2. ఆంధ్రా కింగ్ తాలుకా (తెలుగు) స్క్రీన్.3. తేరే ఇష్క్ మె (హిందీ) స్క్రీన్.4. రాజు వెడ్స్ రాంబాబు (తెలుగు), రివాల్వర్ రీటా (తెలుగు)

(c) eenadu

కలెక్టరే మాస్టారు

ఆంగ్ల పాఠం చెబుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

బుక్కపట్నం, న్యూస్‌టుడే : నిత్యం జిల్లా పాలనా వ్యవహారాల్లో తీరికలేకుండా ఉండే కలెక్టర్.. ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించారు. పిల్లలతో సరదాగా మాట్లాడుతూ వారిలో ఉత్తేజాన్ని నింపారు. సమాజంలో ఎలా నడుచుకోవాలో వివరించారు. బోర్డుపై రాస్తూ అర్థవంతంగా బోధించారు. వీటన్నింటికి మంగళవారం బుక్కపట్నం మండలంలోని పాముదుర్తి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు వేదికయ్యాయి. ఆయన వెంట డీఈఓ కిష్టప్ప అధికారులు ఉన్నారు.

ఖాద్రీశుడికి వెండిరథ ప్రాకారోత్సవం

కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి మంగళవారం రాత్రి వెండిరథ ప్రాకారోత్సవాన్ని జరిపారు. ఉత్సవంలో వసంత వల్లభ సమేత దేవేరులను పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

మురారీ.. దశావతారధారీ..

చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల వేణుగోపాలస్వామి ఆలయంలో ఎవరికీ తెలియని విశేషాలున్నాయి సుమా.. సంవత్సరంలో రెండు మార్లు అదీ పౌర్ణమి వేళలలో సూర్యకిరణాలు గుడిలోకి ప్రసరించే విధంగా ఏర్పాట్లున్నాయి. గుడిలోని శ్రీకృష్ణుడి విగ్రహంలో వెంకటేశ్వరుడు ఇమిడి ఉండటమే కాకుండా.. తల చుట్టూ దశావతార ముఖాలుండటం మరో ప్రత్యేకత. కోవెలను నిర్మించింది మాత్రం క్రీస్తు పూర్వం జనమేజయ మహర్షి.

- న్యూస్‌టుడే, కనుముక్కల (చెన్నేకొత్తపల్లి)

విశేషాలు ఆలయ ముఖద్వారం, గర్భగుడి రాతి స్తంభాలపై గజ మహాలక్ష్మి గుర్తులు (ఈ ఆనవాళ్లు కేవలం ఉడిపి శ్రీకృష్ణాలయం, అహోబిల లక్ష్మీనరసింహ స్వామి, మహానంది ఆలయాల్లోనే ఉంటాయి)

విశ్వాసం ఉత్తరాయణ పౌర్ణమి ఘడియల్లో దర్శించుకుంటే.. వృద్ధాప్యంలో ఈతి బాధలు తొలగి మానసిక ప్రశాంతత చేకూరుతుందని భక్తుల నమ్మకం

ప్రకృతిలో ఆరోగ్య పాఠాలు!

గుత్తి కోటపై బృంద సభ్యులు

ఈనాడు, అనంతపురం: ప్రస్తుతం దేహ దారుఢ్యం, ఆరోగ్యంపై అన్ని వయసుల వాళ్లు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. యోగాతోపాటు వ్యాయామశాలల్లో చేరి కసరత్తులు చేస్తున్నారు. ఆసనాలతోపాటు బరువులెత్తడం, ట్రెడ్‌మిల్‌పై పరుగు, సిక్స్‌ప్యాక్ కోసం కసరత్తు చేస్తూ శరీర దృఢత్వాన్ని పెంచుకుంటున్నారు. జిమ్‌లో చేసే ఈ ప్రక్రియలు యాంత్రికంగా మారిపోయాయనే భావన యువతలో మొదలైంది. ఈనేపథ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూనే ఫిట్‌నెస్ పొందవచ్చని చెబుతున్నారు నగరానికి చెందిన తాజమ్ముల్.. అతని మిత్ర బృందం. 'ట్రెక్కర్స్ ఆఫ్ అనంతపురం' పేరుతో వారు నిర్వహిస్తున్న ఆరోగ్య పాఠాలు ఆసక్తిగా మారాయి.

బరువును బట్టి..

శరీర బరువునే ఆసరాగా చేసుకుని వ్యాయామం చేస్తూ ఫిట్‌నెస్ పొందే ప్రక్రియను కలిస్తానిక్ అంటారు. ఈ విధానంలో డిప్‌బార్‌లు, పుల్-అప్ బార్‌లు, స్ట్రెచింగ్ తదితరాలు ఉంటాయి. నిర్వాహకులు వ్యాయామంతో పాటు వారాంతాల్లో సమీపంలోని కొండల్లో ట్రెక్కింగ్ చేపడుతున్నారు. నడవడం, వాగులు, వంకలు దాటడం, ఒక రాయి నుంచి ఇంకో రాయికి దూకడం తదితర ప్రక్రియలతో శరీరంలోని కొవ్వు సహజసిద్ధంగా కరిగిపోతుందని చెబుతున్నారు.

ప్రతి వారాంతంలో..

- తాజమ్ముల్, దినేష్, వసీం, సిద్ధార్థ్ మిత్ర బృందం అనంత చుట్టుపక్కల కొండల్లో ప్రతి ఆదివారం ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 20 మంది సభ్యులు ఉన్నారు. ఆసక్తి ఉన్నవారిని ట్రెక్కింగ్‌లో పాల్గొనేలా చేస్తున్నారు.
- ట్రెక్కింగ్‌లో జాగ్రత్తలు, నియమాలపై ముందుగా వివరిస్తారు. అనుమతి పత్రంపై సంతకం తీసుకున్న తర్వాతే తీసుకెళ్తున్నారు. బయట నుంచి వచ్చేవారి కోసం మెడికల్ కిట్ అందిస్తున్నారు.
- గంపమల్లయ్యకొండ, దేవరకొండ, గోనిమడుగుల ఆలయం, గుత్తి కోట వంటి ప్రాంతాల్లో ట్రెక్కింగ్ చేపట్టారు. ఇప్పటివరకు 30 ప్రాంతాల్లో నిర్వహించారు.

పాలు పితకరు.. కంది, ఉలవలు, కొర్రలు తినరు



చదం గొల్లదొడ్డి

అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం చదం గొల్లదొడ్డి గ్రామంలో 400 కుటుంబాలు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాయి. వీరిలో శ్రీనిగారా ముత్యాలమ్మను కొలిచే కుటుంబాలు 200లకు పైగా ఉన్నాయి. వీరందరికీ ఓ విచిత్ర సంప్రదాయం ఉంది. ఈ స్వామిని కొలిచే కుటుంబాల ఇళ్లలో పెంచే ఆవులు, గేదెల నుంచి ఆది, సోమవారాలు పాలు పితకరు. దేవుడి పేరుతో లెగ దూడలకు వదిలేస్తారు.. కంది, ఉలవ, కొర్రలతో ఆహార పదార్థాలను ఇళ్లలో వండరు. నిల్వ చేసుకోవడం కూడా తప్పుగా పరిగణిస్తారు. వందేళ్ల నుంచే ఈ ఆచారం కొనసాగుతోందట. ఎవరైనా ఆంక్షలను ధిక్కరిస్తే ఏడాదిలో ఒక్కసారి నిర్వహించే ఆవుల దేవర పండగనాడు ప్రాయశ్చిత్తం చేసుకుంటారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

అత్యవసర సేవలకు 1033 ఉందండోయ్!

మీకోసం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జాతీయ టోల్ ట్యాక్స్ కట్టడమే కాదు.. కొన్ని సేవలనూ పొందవచ్చు. ప్రధానంగా 1033 సేవలు వినియోగం. అత్యవసర సేవలు పొందాలంటే ఆ టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సేవల్ని పొందవచ్చు.

✦ వాహనాలు బ్రేక్‌డౌన్, ప్రమాదాలు జరిగినపుడు, టోల్‌ప్లాజా, ఫాస్టాగ్ సమస్య తదితరాలు. రోడ్డు వినియోగదారుల సౌకర్యార్థం వివిధ భాషల్లో వినియోగించుకోవచ్చు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ నంబరును నిర్వహిస్తుంది. 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయి.

✦ జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగినపుడు, వాహనాలు మరమ్మతుకు గురైనపుడు 1033కి ఫోన్ చేస్తే హైవే అంబులెన్సులు, పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులోకి వస్తాయి. ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలిస్తారు. పెట్రోలు, డీజిల్ లేక వాహనాలు ఆగిపోయినా ఇంధనంతోపాటు ఆహార పదార్థాలు కూడా అందిస్తారు.

ఫిర్యాదులూ చేయవచ్చు..

✦ రోడ్లు బాగోలేకపోయినా, గుంతలు, వీధిలైట్లు వంటి సమస్యలు ఈ నంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ✦ టోల్‌ప్లాజా నిర్వహణపై ఫిర్యాదులు కూడా చేయవచ్చు.

✦ టోల్‌ప్లాజా వద్ద తప్పకుండా మరుగుదొడ్లు ఉంటాయి. వాటిని శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గుత్తేదారుపై ఉంటుంది. శుభ్రంగా లేకపోతే వాహనదారులు మొబైల్‌ఫోను ద్వారా ఫొటో తీసి 'రాజమార్గ యాత్ర' యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఇలా ఫిర్యాదు చేస్తే జాతీయ రహదారులశాఖ బహుమతి ఇస్తుంది. ఫాస్టాగ్‌లో రూ.1000 జమ చేస్తారు.

ఆ ఊరి పెరుగు తింటే.. మళ్లీ కావాలంటారు

రాయదుర్గం పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామం. రెండు వందల కుటుంబాలకు పాడి పోషణే ఆధారం. ఉదయం పితికిన పాలను పట్టణంలో విక్రయిస్తారు. సాయంత్రం పాలను తోడు వేసి ఉదయాన్నే రాయదుర్గం పట్టణంలో పెరుగును మహిళలు విక్రయిస్తారు. ఎన్ని పాల ప్యాకెట్లు కంపెనీలు వచ్చినా సిరిగేదొడ్డి పెరుగుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. నాణ్యత, రుచిలో దేనికదే సాటి. గత 50 ఏళ్లుగా పట్టణంలో పెరుగును విక్రయిస్తూ భర్తలకు తోడుగా నిలుస్తున్నారు. సుమారు వంద మంది మహిళలు ఉదయాన్నే నెత్తిన పెరుగు పాత్ర పెట్టుకుని నడుచుకుంటూ వచ్చి పట్టణంలో విక్రయించేవారట. ప్రస్తుతం కూడా 40 మంది దాకా ప్రతి రోజూ ఆటోలో వెళ్లి.. విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

కక్ష కట్టకు నా ఊపిరి తీయకు..

- నీది చిన్న పిల్లల మనస్తత్వం. కోపం వస్తే తట్టుకోలేవు. భావోద్వేగాలను అదుపులో పెట్టుకోలేవు. ఎదుటి వాడికి హాని తలపెట్టి అందులో ఆనందం చూస్తావు. చివరకు నా ఊపిరి తీస్తావు. ఇది నీకే చేటు

- నిన్ను ఊపిన ఊయలనై చెబుతున్నా..

- ఎవరినీ నొప్పించకు.. కొన్ని గాయాలు మానవు.. మనసును కుదుట పర్చుకొని ఎదుటి వారి సుఖశాంతుల కోసం పరిశ్రమించు. ఆనందంగా జీవించు..

- నీ తనువు గాయాన్ని మాన్పిన ఔషధాన్నై చెబుతున్నా..

- లేనిపోని స్వార్థాలు, అపోహలు, అపనమ్మకాలతో నిన్ను నువ్వు దిగజార్చుకోకు.. మంచి మనసున్న మనిషివి నీవు.. స్వచ్ఛంగా ఆలోచించు.. గొప్పగా జీవించు, నలుగురినీ బతికించు..

- నిన్ను కాపాడే అమ్మగా చెబుతున్నా..

నియోజకవర్గం	నేలకూలినవి జనవరి నుంచి
శింగనమల	12,700
కళ్యాణదుర్గం	6,570
తాడిపత్రి	1600
ధర్మవరం	1000
మడకశిర	796
ఉరవకొండ	220

కరవు నేలలో ఉన్నావు. ఇక్కడ బతకడమే నిత్య సమరం. నెత్తురుంది, సత్తువుంది.. నాకు తెలుసు నీవు శ్రమ జీవివని.. ఎలా కష్టపడాలో నీకు అన్నీ తెలుసు.. ముందుగా నీడ, నీరు, తిండి అవి ఎలా వస్తున్నాయో తెలుసుకో..

- నిన్ను నడిపించే శ్వాసనై చెబుతున్నా..

- నీ కోసం ఏమైనా చేస్తా.. నువ్వు కూర్చుంటే కుర్చీనౌతా.. నిద్రపుచ్చే పందిరి మంచాన్నవుతా. నింగిలో పరిగెత్తే మేఘాల్ని సైతం నీ కోసం కరిగించేసి వర్షంలా తీసుకొస్తా.. నీవు పీల్చే ప్రతి ఊపిరిలో నేనుంటా, కడకు నీ చితిలో సైతం తోడుగా నేను నడుస్తా.. తెలిసీ తెలియక నన్ను నరికినా. చిగురులేసి నీ కోసం మళ్లీ పుడతా.. నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా.. ఎందుకు నాపై ఇంత కక్ష.

- పచ్చని చెట్టు చెబుతున్న ఆవేదన

✹ ఈ నెల ఒకటో తేదీ.. ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రిలో ఒక మహిళా రైతు తోటలో 75 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నేలకూల్చారు.

✹ ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెట్లను నరికే విషసంస్కృతి కొనసాగుతుండటం ఆందోళన కల్గించే అంశం. కక్షలు పెంచుకొని ఎదుటి వారిని దెబ్బతీయడం కోసం వారి ఆర్థిక దన్నుగా ఉన్న చీనీ, అరటి చెట్లను నరికివేయడం అమానుష చర్యే. ఇప్పటికే వేల చెట్లు ఇలా కక్షల పేరుతో కూలిపోయాయి. క్షణక్షణం మారుతున్న కాలంలో ఉంటున్నాం. ఈ దారుణం ఇకనైనా ఆగాలి.

- న్యూస్‌టుడే, అనంత నేరవార్తలు

అంగన్‌వాడీల్లో నకిలీలు.. అడ్డదారుల్లో కొలువులు

జిల్లా : శ్రీసత్యసాయి	
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	అప్‌గ్రేడ్ అయినవి
618	548

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కొందరు అడ్డదారుల్లో కార్యకర్తల ఉద్యోగాలు తెచ్చుకున్నారు. ఈ తతంగం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూ వచ్చింది. ఇటీవల మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్ అయ్యాయి. ఈ సందర్భంగా ధ్రువపత్రాలను పునఃపరిశీలన చేస్తుండగా నకిలీల బాగోతం వెలుగుచూసింది. కొందరు కర్ణాటకలో చదివినట్లుగా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. కొలువులు దక్కించుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆయా పాఠశాలల్లో చదివినట్లు ఎక్కడా దస్త్రాలు లేకపోవడం గమనార్హం. మరికొందరు పదో తరగతి మార్కుల జాబితాలో ఫొటోలు మార్చి కొన్ని, పేర్లు మార్చి మరికొన్ని నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేరినట్లు తేల్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 శాతం ధ్రువపత్రాలు పరిశీలన చేయగా... అందులో దాదాపు 25 శాతానికి పైగా నకిలీవని గుర్తించడం గమనార్హం.

సమగ్రంగా పరిశీలిస్తున్నాం

-ప్రమీల, పీడీ, ఐసీడీఎస్

మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పదో తరగతి మార్కుల జాబితా పరిశీలన ప్రక్రియ జరుగుతోంది. వాటిల్లో నకిలీవి బయటపడుతున్నాయి. సమగ్రంగా పరిశీలించి.. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తాం. నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాల్లో చేరిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

చర్యలకు రంగం సిద్ధం

✦ రాయలసీమ జిల్లాలతో పాటు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలోని సంబంధిత కార్యాలయాలకు అంగన్‌వాడీ కార్యకర్తల ధ్రువపత్రాలను పరిశీలన నిమిత్తం అధికారులు పంపారు.

✦ శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాల్లో 19 మంది నకిలీ పత్రాలు సమర్పించారని... ఇప్పటికే బత్తలపల్లి, ఓడీసీ మండలాల్లో నలుగురిని ఉద్యోగం నుంచి తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. వారికి వేతనం ఇవ్వకుండా నిలిపివేశారు.

పంట తెగుళ్ల భరతం పట్టారు!

సుడోమోనాస్ పొడి మందును సిద్ధం చేస్తోన్న కూలీలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరవు నేల. ఇక్కడ ఏ పంట వేసినా వాతావరణం అనుకూలించకపోవడం, అన్నీ బాగున్నా వివిధ రకాల తెగుళ్ల బెడదతో పంట నాశనమవడం చూస్తూనే ఉన్నాం. తెగుళ్ల భరతం పట్టేందుకు అనంతపురంలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని జీవ నియంత్రణ ప్రయోగశాల నడుం బిగించింది. ఎన్నో ప్రయోగాలు చేపట్టి ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాస్‌ను తయారు చేసింది. వీటిని ఉమ్మడి జిల్లా పరిస్థితితులను దృష్టిలో పెట్టుకొని చేయడం విశేషం. వేరుకుళ్లు, కాండం కుళ్లు, మాగుడు ఎండు తెగుళ్ల నివారణ, బ్యాక్టీరియా జాతికి చెందిన జీవన క్రిమినాశిగా పని చేస్తున్నాయి. విత్తన శుద్ధిలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. చెట్టు కాండానికి రక్షణ కవచంలా ఉంటూ అధిక దిగుబడులకు ఊతమిస్తాయి. ఆయా మందులను వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలకు 50 శాతం రాయితీ, రైతులకు పూర్తి ధరతో విక్రయిస్తున్నామని జీవ నియంత్రణ ప్రయోగశాల బాధ్యుడు సుంకర 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వలసొచ్చి.. అదే పేరు పెట్టి !

అమరాపురం మండలంలో ఓ గ్రామం పేరు విచిత్రంగా ఉంటుంది. కారణాలు ఆరాతీస్తే ఆసక్తికర విషయం తెలుస్తుంది. మండలంలో పాతూరు అనే గ్రామం ఉండేది. ఇక్కడ 25 నుంచి 30 కుటుంబాలు నివసించేవి. వందేళ్ల క్రితం భూములు ఉన్నా నీరు ఉండేది కాదు. ఏళ్ల తరబడి గ్రామంలో కరవు కాటకాలు ఉండటంతో ఆ గ్రామాన్ని వదిలి వేరో చోటికి వెళ్తే ఏమైనా ఫలితం ఉంటుందని ఊరికి కి.మీ దూరంలో ఉన్న స్థలంలోకి మారారు. వెళ్లి నివసించడం ప్రారంభించారు. అందరూ ఇళ్లు నిర్మించుకుని అక్కడే స్థిరపడ్డారు. గ్రామం పేరు వలస అని పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ గ్రామంలో 500 ఇళ్లు 3 వేల జనాభా ఉంది. పాతూరు ఊరి వాకిలి వద్ద పురాతన చిన్న మారెమ్మ దేవి ఆలయం ఉండేది. అక్కడ ఉన్న విగ్రహాన్ని కూడా ఇక్కడికే తీసుకు వచ్చి ప్రతిష్ఠించుకుని పూజలు చేసుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, మడకశిర, అమరాపురం

సాధనా తరుణి.. పావని

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో క్షణం తీరిక లేదు. కానీ ఏదో సాధించాలన్న ఆరాటం ఆమెను ఏకంగా అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. తాడిమర్రి మండలం ఆత్మకూరులో పుట్టి పెరిగిన ఎం. పావనికి బాల్ బ్యాడ్మింటన్ అంటే పంచప్రాణాలు. ఇంటర్ చదివే సమయంలోనే రెండుసార్లు రాష్ట్ర సాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. నాలుగేళ్లు బీఎస్సీ నర్సింగ్ కోర్సు నంద్యాలలో పూర్తి చేసింది. ఎంతో ఇష్టపడిన ఆటకు విరామం ఇచ్చింది. చదువు తర్వాత అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం సాధించింది. ఆ ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాల్లో సాధన చేసి అంతర్జాతీయ పోటీలకు ఎంపికై ఆదర్శంగా నిలిచింది.

జాతీయ జట్టులో స్థానం లభిస్తుందని ఊహించలేదు. ఉద్యోగం చేస్తూ సాధన చేయడానికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం సభ్యులు అవకాశం కల్పించారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, కార్యదర్శి బాలాజీలు సహకారం అందించడం వల్లే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యా. నేపాల్‌లో జరగనున్న పోటీల్లో కూడా సత్తాచాటి దేశ జట్టును గెలిపించాలన్నదే నాలక్ష్యం.

- పావని

తల్లిదండ్రులు ఇద్దరూ కూలీలే..

తాడిమర్రి మండలం ఆత్మకూరుకు చెందిన ఎం.ఈరప్ప, శివమ్మ దంపతుల కుమార్తె ఎం.పావని. తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీలే. వీరి రెక్కల కష్టంతోనే కూతుర్ని చదివించారు. ఆటల్లో ప్రోత్సహించారు. ఇంటర్ చదువుతూ బాల్ బ్యాడ్మింటన్ సాధన చేసింది. బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి వెంకటేశులు ఈమెకు మెలకువలు నేర్పించడంతోపాటు అన్ని విధాలా ప్రోత్సహించారు. గత సెప్టెంబరు చివరి వారంలో తమిళనాడు దిండిగల్ పట్టణంలో జాతీయస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఈమె అద్వితీయ ప్రతిభ పాటవాలతో ఆకట్టుకుంది. ఆటతీరును మెచ్చిన సెలెక్టర్లు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ లీగ్ పోటీలకు ఎంపిక చేశారు. జనవరి ఒకటి నుంచి ఖాట్మాండులో అంతర్జాతీయ పోటీల్లో దేశం తరపున ఆడుతుంది.

మట్టి రేణువుల్లో స్వర్ణకాంతులు

బంగారం నిక్షేపాలకు రాప్తాడు నియోజకవర్గం రామగిరి ఎంత ప్రసిద్ధో అందరికీ తెలిసిందే. మట్టిని తవ్వి బంగారు తీసిన పల్లె మరి.. 30 ఏళ్ల కిందటే గనుల్లో తవ్వి తీసే ప్రక్రియ గిట్టుబాటు అయ్యే పరిస్థితులు లేక ఆగిపోయింది. దీంతో గనుల్ని మూసివేశారు. ఇప్పుడు ఆ గ్రామానికి చెందిన 70 కుటుంబాలకు ఉపాధి మార్గం అయింది. ప్రత్యేక సారువలు, టబ్బులు ఏర్పాటు చేసుకొని మట్టిని తరలించి, శుద్ధిచేసి అందులోని నల్లని పదార్థంలో దాగిన పచ్చని వర్ణం ముక్కలను పాదరసంతో ఒడిసి పట్టి బంగారాన్ని వెలికి తీస్తున్నారు. సేకరించిన ముక్కలకు ధర్మవరం తదితర పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండటంతో పలువురికి ఆర్థిక చేయూతగా ఉంది.

- న్యూస్‌టుడే, రామగిరి

సంచుల కూర్పు.. సులువుగా మొక్కల మార్పు

అనంతపురం కోర్టు రోడ్డులో మొక్కల పెంపకంలో కొత్త పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇంటి ముందు ఇనుప కుర్చీలు వేసి దానిపైన రెండు సంచుల్లో మొక్కలను ఇలా పెంచుతున్నారు. యూరియా బస్తాలను ఇలా చిన్న సంచులుగా తయారు చేసుకొని అందులో మట్టిని వేసి మొక్కలను ఇంటి ముందు మెట్ల వద్ద ఆకర్షణీయంగా కనిపించేలా పెట్టారు. రోడ్డు మీద పోయే ప్రతి ఒక్కరు ఈ సంచులేంటి అంటూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇంకోచోటికి మార్చాలంటే సులువుగా ఉండాలని ఈ మార్గాన్ని అనుసరిస్తున్నారు.

- ఈనాడు అనంతపురం

రైలు బండి.. రిపేరు చేస్తారండి

మహిళా మెకానిక్‌లు అదుర్స్

విధులకు హాజరవుతున్న మహిళా మెకానిక్‌లు

గుంతకల్లు, న్యూస్‌టుడే: మనసు పెడితే ముదితల్ నేర్వలేని విద్య అంటూ ఉండదని ఈ అతివలు నిరూపిస్తున్నారు. ఎంతో కష్టమైన రైల్వే ఇంజిన్ల మరమ్మతులను సులభంగా చేసేస్తున్నారు. ఓ మహిళ డీజిల్ షెడ్డులో హెల్పర్‌గా చేరి పురుషులతో సమానంగా పనిచేసి శభాష్ అనిపించుకున్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు రాణిస్తున్నారు.

ఎక్కడ పని: గుంతకల్ డీజిల్ షెడ్
ఎందరు: 60 మంది మహిళలు
ఏం చేస్తున్నారు: విద్యుత్తు ఇంజిన్లకు మరమ్మతులు
ఎన్ని చేశారు: 25 డీజిల్, 150 విద్యుత్తు లోకోలు
ప్రత్యేకత: కళాసీలు, హెల్పర్లుగా చేరి 3, 2, 1 గ్రేడ్ మెకానిక్‌లుగా పదోన్నతి
గ్రేడ్-I మెకానిక్‌లు: పుష్ప, టి.రాజేశ్వరి, మహబూబ్‌బీ
ప్రోత్సాహం: డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్త, ఏడీఆర్ఎం సుధాకర్

ఇంజిన్ లోపల మరమ్మతులు చేస్తున్న మహబూబ్‌బీ

అతివలకు ఆషామాషీ కాదు..

రైలు డీజిల్ షెడ్లలో పనిచేయడం పురుషులకే కష్టం. అలాంటిది అతివలకు కత్తిమీద సామే. ఎంతో బరువైన ఇంజిన్ విడిభాగాలను బయటకు తీసి షెడ్డులోకి తీసుకెళ్లాలంటే శారీరక దారుఢ్యం అవసరం. పైగా ఇంజిన్ల కింద దూరి మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఎంతో ఒత్తిడితో కూడుకున్న పని. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇనుము విడి భాగాలు తగిలి గాయాలవుతాయి. మరోవైపు చెప్పిన గడువులోపు రిపేర్లు ముగించాలి. ఇన్ని ప్రతికూలతల నడుమ విధులు నిర్వహిస్తున్నారంటే శభాష్ అనాల్సిందే.

ధైర్యంగా ముందుకు: -పుష్ప, గ్రేడ్-I మెకానిక్

లోకో షెడ్డులో మొట్టమొదటి మహిళా మెకానిక్ నేనే. మొదట హెల్పర్‌గా చేరి ఎంతో కష్టపడి గ్రేడ్-1 మెకానిక్ స్థాయికి చేరుకున్నా. ఇంజిన్లలో లోపాలను కచ్చితంగా గుర్తించడంలోనే మన సామర్థ్యం దాగి ఉంటుంది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది మహిళలు ధైర్యంగా షెడ్లలో పనికొస్తున్నారు.

10వ తరగతి విద్యార్థినులకు ఉపకారవేతనాలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రతిభ కలిగిన 10వ తరగతి విద్యార్థినులకు ఉపకార వేతనాలు ట్రస్టు ద్వారా అందజేస్తున్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. గర్ల్స్‌ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ టెస్ట్ - 2026 ఈ నెల 14న నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఉపకార వేతనాలు అందిస్తారు. ఆసక్తి గల వారు www.ntrcollegeforwomen.education వెబ్‌సైట్‌లో ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7660002627/28 ఫోను నంబర్లను సంప్రదించవచ్చు.

మొదటి 10 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5వేలు, ఆ తరువాత 15 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.3వేలు చొప్పున ఇస్తారు.

(c) eenadu

ఆధ్యాత్మిక సమాచారం

ఖాద్రీశుని ఆర్జిత కల్యాణోత్సవ తేదీలివే!

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి డిసెంబరులో భక్తుల ఆర్జిత కల్యాణోత్సవాలు జరిపించేందుకు తేదీలను ఖరారు చేశారు. ఈనెల 3 నుంచి 15 వరకు 10 రోజులు కల్యాణానికి అనువైన సుముహూర్తాలను నిర్ణయించారు. ఈనెల 3, 4, 5, 7వ తేదీలు, 9 నుంచి 15వ తేదీ వరకు వరుసగా ముహూర్తాలు పెట్టారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 ఆలయంలోని కల్యాణ మండపంలో వేడుక జరుపుతారు. భక్తులు ముందస్తుగా టికెట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

టోల్‌ప్లాజా చెంతన ఆక్రమణలు

వాహనదారులకు తప్పని తిప్పలు

టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కాశేపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద జాతీయరహదారిపై ఇరువైపుల స్థలాలను కొందరు ఆక్రమించుకుని హోటళ్లను ఏర్పాటు చేసుకోవడంతో పలు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. టోల్‌ప్లాజా సమీపంలో వాహనాల నిలుపుదలకు స్థలాలు కేటాయించగా కొందరు దర్జాగా కబ్జాచేశారు. దంతో పాటు మరికొందరు వ్యాపారాలు సాగిస్తున్నారు. వాహన డ్రైవర్లు విశ్రాంతి కోసం కేటాయించిన పార్కింగ్ స్థలాలను సైతం ఆక్రమించుకుంటున్నారు. నాలుగు వరసల రహదారిలో ఇరువైపుల నాటించిన మొక్కలను తీసివేసి హోటళ్లు ఏర్పాటు చేసుకున్నారు. సంబంధిత అధికారులు, పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని పలువురు వాహనదారులు వాపోతున్నారు.

వేబ్రిడ్జి సైతం.. నిత్యం రద్దీగా ఉండే కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద యాజమాన్యం ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి సైతం కొందరు ఆక్రమించుకున్నారు. ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉంటున్నాయి. వేబ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో పగలు, రాత్రివేళల్లో వాహనాలు నిలిపివేసి హోటళ్లలో భోజనం చేయడానికి వెళుతున్నారు. దీంతో అటుగా వాహనదారులు అనేక ఇబ్బందులకు గురై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

● ఈ విషయంపై జాతీయ రహదారి ఉప తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టిని వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారికి కేటాయించిన హద్దులను గుర్తిస్తాం. ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గం విద్యార్థి అదుర్స్

అండర్-14 క్రికెట్ జట్టులో చోటు

మహమ్మద్ తన్వీర్

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై ఉన్న మక్కువకు తోడు తల్లిదండ్రుల శ్రద్ధ, ప్రత్యేకంగా ఇప్పించిన శిక్షణతో ఆ విద్యార్థి అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం అండర్-14 జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. కళ్యాణదుర్గం పట్టణంలోని మారెంపల్లికి చెందిన షేక్ దాదాపీర్(సత్యసాయి జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్)- ఆయిషా కుమారుడు షేక్ మహమ్మద్ తన్వీర్. కుడిచేతి వాటం బ్యాటింగ్ చేస్తూ ఆటలో సత్తాచాటుతున్నాడు. నవంబరు 29, 30, డిసెంబరు 1న గుంటూరులో నిర్వహించిన ఎస్జీఎఫ్ స్కూల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభతో జాతీయస్థాయి జట్టుకు ఎంపికవడం గమనార్హం.

● ప్రస్తుతం అనంతపురంలో 9వ తరగతి చదువుతున్న మహమ్మద్ తన్వీర్ ఆరో తరగతి నుంచే ఆర్ట్స్ కళాశాలలో దాదాఖలందర్ నిర్వహించే శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. అనంతపురం ఆర్డీటీ, మదనపల్లి వాయల్పాడు, గుత్తి, తాడిపత్రి తదితర ప్రాంతాలతోపాటు బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో అకాడమి తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నిరంతరం కృషిచేసే జాతీయస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు.

భక్తిశ్రద్ధలతో నెట్టికంటయ్య శోభాయాత్ర

రథంలో అంజన్న ఉత్సవమూర్తి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 3న జరిగే హనుమద్ వ్రతం సందర్భంగా గుంతకల్లులో మంగళవారం ఉదయం హనుమాన్ సర్కిల్ నుంచి కసాపురం ఆలయం వరకు స్వామి శోభాయాత్ర కనులపండువగా కొనసాగింది. తెదేపా మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, ఈవో విజయరాజు తదితరులు స్వామి రథానికి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు మీదుగా ఊరేగింపు కసాపురానికి చేరింది. దీక్ష చేపట్టిన మాలధారులు పరుమటితో కాలినడకన కసాపురానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులు, మాలధారులతో కిక్కిరిసిపోయింది. బుధవారం ఆలయంలో హనుమద్ వ్రతం, దీక్ష విరమణ ఉంటుందని ఈవో తెలిపారు.

ఘనంగా బాబయ్యస్వామి ఉరుసు మహోత్సవం

బాబయ్యస్వామి దర్గాకు ప్రభుత్వం తరఫున ఊరేగింపుగా చాదర్ తీసుకెళుతున్న మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్

పెనుకొండ, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన పెనుకొండ బాబయ్యస్వామి దర్గా 753వ గంధం, ఉరుసు వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత దర్గాకు చాదర్ సమర్పించారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రి సవిత భక్తి శ్రద్ధలతో చాదరను తలపై మోసుకుని ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, బాషాలు స్వామి సమాధికి చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జాతీయ సర్వమత సమ్మేళనం నిర్వహించారు. రాత్రికి బాబయ్యస్వామి సమాధికి పీఠాధిపతి నజరీమ్‌స్వామి ఆధ్వర్యంలో గంధం సమర్పించారు. పలువురు ఉరుసులో పాల్గొన్నారు. గంధం వేడుకలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

'ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి'

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: వైకాపా నాయకుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అతని కుమారుడు భీమిరెడ్డి నుంచి తమకు ప్రాణహాని ఉందని శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భాగస్వాములు శ్రీనివాసరావు, రామచంద్ర, శ్రీలతలు ఎస్పీ జగదీష్‌కు విన్నవించుకున్నారు. వారు మంగళవారం సాయంత్రం ఎస్పీ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. అందులో వారు పేర్కొన్నారు. సాయినగర్ మూడో క్రాస్‌లో ఉన్న పాత పావని ఆసుపత్రి భవనాన్ని తమతోపాటు సత్యనారాయణరెడ్డి 30 శాతం వాటాతో కొనుగోలు చేశామన్నారు. అయితే ఆసుపత్రిని సుందరీకరణ చేసే క్రమంలో నిర్మాణాలను తొలగించాలని అనుకున్నాం. అయితే అతను తమ ముగ్గురు, సత్యనారాయణరెడ్డితో పదేళ్ల పాటు లీజు ఒప్పందం చేసుకున్నామన్నారు. ఆతనికి భవనం అద్దెలో మాత్రమే వాటా ఉంది. అయితే అతడు తనకు ఆసుపత్రిలో కూడా వాటా ఇవ్వాలని పట్టు బిగించి, బెదిరింపులకు పాల్పడేవాడన్నారు. కాగా ఆసుపత్రిని సుందరీకరణ పూర్తి చేసి ప్రారంభించాలని అనుకుంటున్న సమయంలో గత నెల 23న ఆసుపత్రిపై సత్యనారాయణరెడ్డి, అతని అనుచరులు దాడి చేసి రూ.కోట్ల విలువైన సామగ్రి, యంత్రాలను ధ్వంసం చేశారన్నారు. అందులో తమకు తీవ్రమైన నష్టం జరిగిందన్నారు. అయితే ఈ దాడి వెనుక ముందస్తుగా కుట్ర పన్నినట్లు తమకు తెలిసిందన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కుమారుడు భీమిరెడ్డికి ఆసుపత్రిలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. అందుకు తాము అంగీకరించలేదని, తమపై కక్ష పెట్టుకుని పథకం ప్రకారం దాడి చేశారన్నారు. వారికి మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మద్దతు ఉందని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.

వైకాపా నాయకుడి రాసలీలలు

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల నియోజకవర్గానికి చెందిన ఓ వైకాపా నాయకుడి రాసలీల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. నార్పల మండలానికి చెందిన వజీంద్ర కొద్దినెలల కిందటి వరకు విలేకరిగా పనిచేశాడు. మూడు నెలల కిందటే అతన్ని వైకాపా అధిష్ఠానం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈక్రమంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆమె ఏకాంతంగా ఉన్న సమయంలో తన ఫోన్‌లో వీడియో తీశాడు. మంగళవారం ఉదయం సదరు రాసలీలల వీడియోను స్థానిక వాట్సప్ గ్రూపులో పోస్టు చేసి వెంటనే తొలగించాడు. అప్పటికే ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డిబార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు ఆచార్య జీవీ రమణ తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, గుంతకల్లులోని ఎస్‌వీవీ డిగ్రీ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

టెట్ నిర్వహణకు కేంద్రాల సమస్య

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2025 నిర్వహణకు పరీక్ష కేంద్రాల సమస్య తలెత్తింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్లు పుష్కలంగా ఉంటాయి. ఇంజినీరింగ్ కళాశాలల్లోనే టెట్, డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో 6 కేంద్రాలు నిర్ణయించారు. ఇందులో 3 కళాశాలలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అంగీకరించలేదు. తాడిపత్రి, గుత్తి, రుద్రంపేటలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి కేంద్రాల నిర్వహణకు అభ్యంతరం తెలిపారు. 3నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు షెడ్యూల్‌లో ప్రకటించారు. బుధవారం నుంచి హాల్‌టికెట్లు తీసుకోవాల్సి ఉండగా మంగళవారం సాయంత్రం వరకు పరీక్ష కేంద్రాలు ఓ కొలిక్కిరాలేదు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా అధికారులతో చర్చిస్తున్నారు. కానీ కళాశాలల నుంచి సుముఖత లేదు. ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షలు, కంప్యూటర్ల కొరత కారణంగా పరీక్ష కేంద్రాలకు అభ్యంతరం తెలిపినట్లు సమాచారం. ఉపాధ్యాయ ఉద్యోగార్థులు మాత్రమే కాకుండా, ఈ సంవత్సరం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్‌కు దరఖాస్తు చేశారు. ఈ నెల 10 నుంచి 20 వరకూ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలోని కళాశాలలు అంగీకరించకపోతే ఇతర జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. అభ్యర్థులు దూరప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాయడానికి వ్యయప్రయాసలు తప్పవు.

పట్టణ రక్షణకు కొరియన్ల చేయూత

రూ.15 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలు, డ్రోన్లు వితరణ

జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, సిబ్బందికి సీసీ కెమెరాలు, డ్రోన్లు అందజేస్తున్న కొరియన్ అసోసియేషన్ ఇన్ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్, సభ్యులు

పెనుకొండ,న్యూస్‌టుడే: పెనుకొండ పట్టణ రక్షణ చేయూతనిస్తూ కాబా(కొరియన్ అసోసియేషన్ ఇన్ బెంగళూరు, ఆంధ్రప్రదేశ్) ఛైర్మన్ జంగ్ యంగ్‌హో ఆధ్వర్యంలో 6 సీసీ కెమెరాలు, 3 డ్రోన్లు జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్‌కు మంగళవారం స్థానిక పోలీస్ సర్కిల్‌కార్యాలయం వద్ద అందజేశారు. పట్టణ అభివృద్ధి, రక్షణకు సహకరించిన కొరియన్ బృందాన్ని జిల్లా ఎస్పీ సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అవసరమైన 1 నైట్ విజన్ డ్రోన్లు, 2డే విజన్‌డ్రోన్లు, 6ఏఎన్‌పీఆర్(ఆటోమెటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్) సీసీ కెమెరాలు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. కాబా వైస్‌ఛైర్మన్ జిన్ ఊ యంగ్, సీనియర్ సలహాదారులు రా బ్యాంగ్ గీ, కిమ్ టే హైప్, సీక్ యంగ్ లీ, డీఎస్పీ నరసింగప్ప, సీఐ రాఘవన్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర జట్టు 415 పరుగులకు ఆలౌట్

ఎదురీదుతున్న కర్ణాటక జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర రాష్ట్ర అండర్-19 కూచ్‌బెహార్ నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు పట్టుబిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 122 ఓవర్లలో 415 పరుగులకు ఆలౌటైంది. కర్ణాటక జట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 62 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసి కష్టాల్లో పడింది. రాయలసీమ క్రికెట్ మైదానంలో ఉదయం ఓవర్‌నైట్ స్కోర్ 300/5తో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ఆరంభించిన ఆంధ్ర జట్టు మరో 115 పరుగులు జోడించి ఆలౌటైంది. కర్ణాటక బౌలర్ల ధీర్ రతన్ 4/80, ఎం.హిరేమత్ (3/120) మెరుగైన బౌలింగ్‌తో ఆంధ్ర బ్యాటర్లను కట్టడి చేశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్ణాటక జట్టు 78 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఎదురీదుతున్న సమయంలో మణికంఠ శివానంద్ (56), సిద్ధార్థకులకర్ణి (60 బ్యాటింగ్) ఆదుకున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఆంధ్ర జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించే అవకాశం మెండుగా ఉంది. పోటీలను ఆంధ్ర సెలెక్షన్ కమిటీ సభ్యులు శ్రీవాస్‌రెడ్డి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శర్మాస్‌వలి, ఏసీఎల్‌ఓ సి.వెంకటేష్, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ.యుగంధర్‌రెడ్డి ఆంధ్ర లైజన్ మహేశ్వర్ పర్యవేక్షించారు.

ట్రైనీ ఇంజినీర్లుగా 139 మంది ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హెచ్‌సీఎల్ బెంగళూరు వారు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల విద్యార్థులు మొత్తం 400 మంది ఈ ప్రాంగణ నియామకాల పరీక్షలకు హాజరయ్యారు. వీరికి రాత పరీక్ష, బృంద చర్చలు, టెక్నికల్ రౌండ్లలో ప్రతిభ చూపిన వారిని ట్రైనీ ఇంజినీర్లుగా ఎంపిక చేశారు. మొత్తం 139 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి వార్షిక వేతనం రూ. 2.40 లక్షలుగా నిర్ణయించారు. ఎంపికైన వారిని కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు, నియామకాల అధికారి ఎం.సురేంద్రనాయుడులు అభినందించారు.

8న ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ మేళా

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 8న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాయపరెడ్డి తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో కోర్సులు పూర్తిచేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాల్గొనాలని ఆయన సూచించారు. పదో తరగతి, ఐటీఐ మార్కుల జాబితాలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్, రెండో ఫొటోలు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, కుల ధ్రువీకరణలు మూడు సెట్లు తీసుకుని ఈ మేళాలో హాజరు కావాలని ఆయన సూచించారు. ఐటీఐ ఉత్తీర్ణులైన లేదా చివరి సంవత్సరం చదువుతూ పరీక్షలు రాసిన వారు కూడా ఈ మేళాలో పాల్గొనవచ్చని సూచించారు. ఐటీఐ పూర్తిచేసి నిరుద్యోగులు ఉన్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు

మాట్లాడుతున్న పౌరసరఫరాల డీఎం, జేడీఏ

కణేకల్లు, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 4 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకొంటున్నట్లు పౌరసరఫరాల జిల్లా మేనేజరు రమేష్‌రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం కణేకల్లు ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ, సొసైటీ సిబ్బందికి ధాన్యం కొనుగోళ్లు, తేమ శాతం, నాణ్యత పరిశీలనపై శిక్షణ ఇచ్చిన సందర్భంగా వారు మాట్లాడారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాలతో పాటు 13 సొసైటీ కేంద్రాల పరిధిలోని ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. 25 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ధర క్వింటాలు రూ. 2,389, కామన్ రకం రూ. 2,369గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పౌరసరఫరాల సహాయ మేనేజరు ప్రసాద్, తహసీల్దారు బ్రహ్మయ్య, ఏఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకి తల్లిదండ్రులు హాజరుకండి

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో జరిగే మెగా పీటీఎం కార్యక్రమాన్ని ఆయా పాఠశాలలోల చదివే విద్యార్థుల తల్లిదండ్రులందరూ తప్పకుండా హాజరుకావాలని డీఈవో ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పాఠశాలకు హాజరు, వారి అభ్యసన తీరు, సాధించిన మార్కులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేస్తారన్నారు. పాఠశాల ప్రగతి, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రధానోపాధ్యాయుడు నివేదిస్తారు. తమపిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలంటే తల్లిదండ్రులు సమావేశంలో విద్యార్థుల గురించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు హాజరవుతారని తెలిపారు. మెగా పీటీఎం కార్యక్రమానికి అనధికార వ్యక్తులకు అనుమతి లేదని డీఈవో తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

ఉద్యోగాల ఆశ చూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఆశ చూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ. 75 లక్షలు కాజేశారు. దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడు పాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ. 35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ. 24 వేలు కాజేశారు. ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ. 13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజ మహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్' పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. ఇలా సొమ్మును మేనేజర్ మంజునాథ్ తీసుకుని సంస్థకు డిపాజిట్ చేస్తున్నట్లు, ఏడాదిగా రూ. 75 లక్షలు నిరుద్యోగుల నుంచి దోచుకున్నట్లు తేల్చారు. వారి నుంచి ల్యాప్‌ట్యాప్‌లు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఏటీఎం కార్డులు, పలు నెట్‌వర్కులకు చెందిన సిమ్‌కార్డులు, రూ. 53 వేల నగదు, 20 గ్రాముల బంగారం, సంబంధిత కంపెనీ దుస్తులు, ప్రమోషన్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

ఇతర రాష్ట్రాలకు చెందిన 8 మంది.. దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మందిని స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో మేకల మంజునాథ్ (గుండుమల్ల, సత్యసాయి జిల్లా), సిద్ధేశ్ శ్రీధర్, సిద్ధేశ్ సుదీప్ (మల్లనాయికనపల్లి, తమకూరు జిల్లా, కర్ణాటక), వడ్డే యశ్వంత్‌కుమార్ (హనుమంతు కుండ, నంద్యాల జిల్లా), వడ్డే జయరాముడు (మార్తాడు, అనంతపురం), దేశరి సౌజన్య (పార్వతీపురం), నాగప్ప కావ్య (మద్దన్నకుంట, అనంతపురం), రేపు మహాలక్ష్మి (ఎస్.యానాం, ఉప్పలగుప్తం)లను అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.

భార్య గొంతుకోసిన భర్త

ఇన్‌స్టాగ్రామ్‌లో యువకుడితో పరిచయమే కారణం

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని కొత్తపేటలో ఓ వివాహితపై భర్త కత్తితో దాడి చేసి గొంతుకోశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని మంగళవారం కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శాంభవికి ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు పరిచయమయ్యాడు. సదరు వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండటంతో భర్త పలుమార్లు దండించాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఫోన్‌లో యువకుడితో మాట్లాడుతున్న భార్యను గుర్తించి కత్తితో దాడి చేసి మెడపై కోశాడు. తర్వాత తన ఇద్దరు కుమారులను తీసుకెళ్లాడు. ఈవిషయాన్ని స్థానికులు గుర్తించి బాధితురాలి తల్లికి సమాచారమిచ్చారు. బాధితురాలు ఆసుపత్రిలో కోలుకుంటోంది. తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కేజీబీవీ ఆవరణలోకి ముంపు నీరు!

విద్యాలయం ప్రవేశ గేటు వద్ద ఇలా...

కణేకల్లు, న్యూస్‌టుడే: కొత్తపల్లి సమీపంలోని కేజీబీవీ ఆవరణలోకి కణేకల్లు చెరువు నీరు చేరింది. మంగళవారం ప్రధాన ప్రవేశ గేటువద్ద అడుగులోతు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సిబ్బంది వాపోయారు. ప్రతిఏటా చెరువు నీటితో విద్యాలయం ఆవరణ ముంపునకు గురవుతున్నా.. అధికారులు నివారణ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఎస్ఓ మంజుళ వాపోయారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఎంపీడీఓలకు ఆమె వినతిపత్రం సమర్పించారు. సమస్య ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఎస్ఎస్ఏ డీఈ, ఏఈ, పీఆర్ ఏఈలు క్షేత్రస్థాయిలో విద్యాలయం పరిశీలించి నివారణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పురిటి బిడ్డలపై ప్రత్యేక దృష్టిసారించాలి

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: పురిటి బిడ్డలపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించి వారిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సకాలంలో వైద్య చికిత్సలు అందిస్తే మెదడు ఎదుగుదల ఉంటుందని తద్వారా మానసిక వైకల్య సమస్యలు తలెత్తవని సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ రవికుమార్, డాక్టర్ షంషాద్‌బేగం, డిప్యూటి ఆర్‌ఎంవో డాక్టర్ హేమలత తెలిపారు. మంగళవారం అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో నిర్వహించిన చిన్నపిల్లల మెదడు ఎదుగుదలకు ప్రోత్సాహం చూపించటం (న్యూరోడెవలప్‌మెంటల్‌హాబిటేషన్‌డే) కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఎన్‌సీయూలో చేరిన బిడ్డలకు సకాలంలో వైద్యసేవలు అందించటంతో పాటు తల్లిపాలు తాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎద్దుల బండిపై నుంచి పడి ఒకరి మృతి

పవన్‌కుమార్

బ్రహ్మసముద్రం: ఎద్దుల బండిపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... కళ్యాణదుర్గానికి చెందిన పవన్‌కుమార్(35) బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లిలో పెయింటింగ్ పనులు చేసుకొంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి సూగేపల్లి చన్నమల్లప్ప స్వామి జాతరకు వెళ్లేందుకు స్థానికులతో కలిసి ఎద్దుల బండిలో బయలుదేరాడు. ప్రమాదవశాత్తు బండిపై నుంచి కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

అశోక్‌కుమార్

బత్తలపల్లి న్యూస్‌టుడే : భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయిందని మనస్థాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనా బత్తలపల్లిలోని ఎస్‌బీఐ కాలనీలో జరిగింది. బత్తలపల్లికి చెందిన మినమనూరి మధు పెద్దకుమారుడు అశోక్‌కుమార్ (28)కు కొన్ని రోజుల నుంచి భార్యతో గొడవలున్నాయి. ఈక్రమంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె ఇంటికి రాలేదని దిగులు చెంది మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల కిందట తల్లిదండ్రులు, తమ్ముడు స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చారు. ఎంత సేపటికీ ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులను పిలిచారు. తలుపులు తెరచి చూడగా హాల్‌లో ఉరేసుకొని వేళాడుతూ అశోక్ కుమార్ కనిపించారు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందారని తండ్రి మధు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం

హిందూపురం: హిందూపురం పట్టణం డీబీ కాలనీ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి శ్రీకంఠపురం వైపు నడచుకొని వెళుతున్న శంకర్(40)ను వెనకవైపు నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికి అక్కడే దుర్మరణం చెందారు. ఇతను తాపి పనిచేసుకొని జీవనం సాగిస్తుండగా ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను ఏమార్చి నగదు చోరీ

సీసీ ఫుటేజీలో దుండగులు

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వద్దకు వచ్చిన ఓ మహిళను ఏమార్చి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె వద్ద నుంచి నగదును చోరీ చేశారు. బాధితురాలు రమణమ్మ తెలిపిన మేరకు వివరాలు ఇలా... మంగళవారం పులిమివాండ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొండ రమణమ్మ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు బ్యాంకు వద్దకు వచ్చింది. బ్యాంకు అధికారులు సూచనతో నగదుకు సంబంధించిన ఓచర్ రాసుకొని నగదు డిపాజిట్ చేయడానికి క్యూలైనులో నిలబడింది. రమణమ్మను గమనించిన ఇద్దరు దుండగులు నగదును డిపాజిట్ చేయడానికి వచ్చిన విధంగా ఆమె వెనకే నిలుచుని ఆమె నగదును డిపాజిట్ చేస్తుండగా ఓచర్లో సంతకం తప్పుగా ఉందంటూ ఓ వ్యక్తి ఆమెను వెనక్కి పిలిచారు. ఈక్రమంలో ఆమె చేతిలోని ఖాతా పుస్తకం తన చేతిలోకి తీసుకొని కొంత నగదును తన జేబులోకి వేసుకొని తిరిగి మళ్లీ బాధితురాలు చేతికి ఇచ్చి అక్కడి నుంచి ఇద్దరు దుండగులు జారుకున్నారు. ఇది గమనించకుండా బాధితురాలు డిపాజిట్ చేయడానికి క్యాషియర్ వద్దకు వెళ్లగా రూ. 52 వేలు ఓచర్ రాసి అందులో రూ. 18,500 తక్కువగా ఉండటంతో క్యాషియర్ బాధితురాలకు చెప్పాడు. వెంటనే ఖాతా పుస్తకం తీసుకొన్న వ్యక్తి కోసం వెతగ్గా అక్కడ లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బ్యాంకులోని సీసీకెమెరా సీసీ ఫుటేజ్ తీసుకొని పోలీసులు గాలింపు చర్యలు తీసుకున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంకు/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నచో మా ద్వారా విడిపించి అమ్ముకొనుటకు సంప్రదించండి. స్వాస్తిక్ గోల్డ్ ట్రేడింగ్ కం||. ✆ 7382114647.

REAL ESTATE

FLAT FOR SALE

3BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అందుబాటు ధరతో అనంతనగర నడిబొడ్డున నిర్మిస్తున్న మీనాక్షిఅపార్ట్మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. 7416560179, 9515651111

JOBS

Wanted: (1) ITI Electrician/ Operators (Cold Storage) (2) Supervisor @ Fresh Cart Agro (P) Ltd., Kldroad, ATP (Intervie 03/12/2025) Cell: 9490571605, 8143697965

ట్రాక్టర్ అమ్మకంలో 4-5 సం||ల అనుభవం కల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. స్వరాజ్ ట్రాక్టర్స్ మార్కెటింగ్ కొరకు రామగిరి, నార్పల, గుత్తి, వజ్రకరూరు, తాడిపత్రి, పప్పూరు, BKS, కనగానపల్లి, యల్లనూరు, పుట్లూరు మండలాలకి. 8465066566, 8374559867.

ప్రభుత్వ పాఠశాలలో అవుట్సోర్సింగ్ పద్ధతిలో Vocational Faculty కావలెను, జీ: 28000, అన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలకు # 9848771117, 9849848817

FACULTY/ TEACHERS

Wanted Teachers to Teach Maths, Physics Classes 8 to 10 in ATP. 3 yrs Experience & Residential Preferred Send CV to 9346511313.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ANANTAPUR DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD.,

Sahakara Bhavan, Subash Road, ANANTAPURAMU - 515001

Estd: 1919 Email: adccbankatp@gmail.com, Web: anantapurdccb.com

EXPRESSION OF INTEREST

ADCC Bank Ltd., Anantapur, Invites expressions of Interest for the Printing and Supply of Calendars, Diaries and Table Calendars for the year 2026, For details regarding quantity, specifications and other information, Please Visit the Bank's Website: anantapurdccb.bank.in

02-12-2025 Sd/- Cheif Executive Officer

(c) eenadu

నైపుణ్యాభివృద్ధిని సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. సోమవారం మంత్రి మాట్లాడుతూ స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్‌లో ఉచిత కోర్సులను ఈనెల 15వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణలో అప్లికేషన్ డెవలపర్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఆటోమేటిక్ కస్టమర్ రిలేషన్ మేనేజర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. శిక్షణ కాలం 3నెలలు, పూర్తయిన తర్వాత ధ్రువపత్రంతోపాటు, వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. కోర్సులో చేరడానికి ఆసక్తి గల అభ్యర్థులు 9966682246 నంబరును సంప్రదించాలన్నారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

సత్యసాయి మార్గం అనుసరణీయం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రతి సాయి భక్తుడు సత్యసాయి చూపిన మార్గంలో ముందుకెళ్లాలని సత్యసాయి సేవా సమితి కోఆర్డినేటర్ శ్రీరామ్ పేర్కొన్నారు. బాబా శతజయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పాండురంగనగర్‌లో ఉన్న సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో రాచపల్లి, చిన్నగుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, బీరేపల్లి గ్రామాల్లోని 100 మంది నిరుపేదలకు సింగపూర్‌లో స్థిరపడిన సాయి భక్తుడు మాధవన్ కుటుంబసభ్యులు, భక్తులు నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయిసేవా సంస్థల జిల్లాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త శంకర్‌నారాయణ, మహిళా సమన్వయకర్త శ్రీదేవి, నాగరాజు, పెద్ద సంఖ్యలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కట్టకొర్తం బీసీ కాలనీలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. -తిప్పేస్వామి
సమాధానం: వెంటనే ఏర్పాటు చేస్తాం. -లక్ష్మీనారాయణ, సర్పంచి, రొళ్లపల్లి
సమస్య: గుడిబండ పల్లి ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. -నాగమ్మ
సమాధానం: సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. -కలందర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి, కరికెర
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్యలు పరిష్కారం

పరిగి: మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికలో ప్రచురితమైన పరిగి ఇందిరమ్మ బీసీ కాలనీలో వెలగని వీధి దీపాల వార్తకు పంచాయతీ కార్యదర్శి నారాయణ స్పందించారు. పంచాయతీ సిబ్బంది చేత కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

హిందూపురం గ్రామీణం: కొటిపి పంచాయతీలోని బసవేశ్వరకాలనీలో మురుగు కాలువలను డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ శుభ్రం చేయించారు. పూలకుంట పంచాయతీలోని మరవపల్లిలో సర్పంచి మంజునాథ్ చౌదరితోకలిసి కొత్త దీపాలను ఏర్పాటు చేయించారు.

గుడిబండ: మద్దనకుంట కాలనీలో నాలుగు రోజులుగా రక్షిత నీటి పథకం మోటారు, స్టార్టరు చెడిపోయి తాగునీటికి ఇబ్బందులు పడేవారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి అమరీశ్ దృష్టికి తీసుకెళ్లగా మోటారు, స్టార్టరు మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో సర్పంచి సతీశ్‌బాబు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. నాచేపల్లి ఎస్సీ కాలనీలో మురుగునీరును సర్పంచి తిప్పేస్వామి పారిశుద్ధ్యకార్మికుల ద్వారా తొలగించారు. దీంతో ఈనాడుకు స్పందించిన బాధ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీలు ప్రసవాలకు దూరం

రొళ్ల పీహెచ్‌సీలో వృథాగా ఉన్న ఎక్స్‌రే పరికరం

మడకశిర, రొళ్ల, అగళి, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకు కనీసం ఐదు కాన్పులు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ఎక్కడా కూడా అలా జరగడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. నియోజకవర్గంలో 9 పీహెచ్‌సీలు, ఒక సీహెచ్‌సీ ఉన్నాయి. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉండాలి. అయితే కదిరేపల్లి, గుండుమల ఒకరు, గుడిబండ, మోరుబాగల్, అగళి కేంద్రాల్లో ఒక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ ప్రసవాలు చేసేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నా ఏదో ఒక సాకు చెప్పి 108 వాహనంలో బయటకు పంపుతున్నారు. ఇందుకు ఉదాహరణ అగళి పీహెచ్‌సీలో 3 నెలల్లో 2 ప్రసవాలు మాత్రమే జరిగాయి.

కర్ణాటక సరిహద్దు కావడంతో..

నియోజకవర్గం చుట్టూ సరిహద్దు ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా కర్ణాటకలోని శిరా, పావగడ, తుమకూరు, మధుగిరి పట్టణాలకు వైద్యం కోసం వెళ్తుంటారు. గర్భం దాల్చినప్పటి నుంచి మహిళలు కర్ణాటకలోని ప్రైవేటు ఆసుపత్రులనే ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. రాత్రి వేళల్లో వస్తే సాకు చెప్పి బయటకు పంపుతుండటంతోనే ఒకేసారి కర్ణాటకకు వెళ్తున్నారని, సమయానికి వైద్యులు అందుబాటులో ఉండి సాధారణ ప్రసవాలు చేస్తే ఇక్కడికే వస్తామని గర్భిణులు చెబుతున్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమస్యలు ఇలా..

• రొళ్ల సీహెచ్‌సీలో 300మందికి పైగా రోగులు వస్తారు. అయితే భవనం చాలా ఇరుకుగా ఉంది. 25 బెడ్లు ఉండాల్సి ఉండగా కేవలం 5 మాత్రమే ఉన్నాయి. ఎక్కువ మంది రోగులు వస్తే ఇబ్బందిగా మారింది. రాత్రి వేళల్లో అత్యవసరమైన రోగులను వస్తే హిందూపురానికి తరలిస్తారు. ఎక్స్‌రే పరికరం ఉన్నా ప్రత్యేక గది లేక వృథాగా ఉంది. ఎక్స్‌రే టెక్నీషియన్ ఉన్నా గది లేకపోవడంతో అతడిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి డిప్యుటేషన్‌పై పంపారు. దీంతో ఎక్స్‌రే తీయాలంటే మడకశిర లేదా హిందూపురానికి పంపుతున్నారు.

• అగళి పీహెచ్‌సీలో 14మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఆరుగురే ఉన్నారు. ఇందులో సీనియర్ సహాయకుడు, పబ్లిక్ హెల్త్ నర్సు, కమ్యూనిటీ హెల్త్ అధికారి, మేల్ సూపర్వైజర్లు, అటెండర్, మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్ నర్సులు లేరు. రాత్రి వేళల్లో ఒక్కరే నర్సు ఉంటున్నారు. దీంతో రాత్రివేళల్లో వాచ్‌మెన్ లేక భయాందోళనతో విధులు నిర్వర్తిస్తోంది.

మెమోలు ఇస్తున్నాం

మడకశిర నియోజకవర్గంలో ప్రసవాలకు సంబంధించి పీహెచ్‌సీ సిబ్బంది తీరు అసంతృప్తిగా ఉందని అమరాపురం, అగళి పీహెచ్‌సీలకు మెమోలు ఇచ్చాం. దీనిపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తప్పనిసరిగా పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలియజేశాం. - ఫైరోజా బేగం, డీఎంహెచ్‌వో, శ్రీసత్యసాయి జిల్లా

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

పరిగిలో హనుమంతుడికి విశేష అలంకరణ

స్వర్ణాభరణాలతో సూగూరు హనుమంతుడు

అమరాపురం, హిందూపురం సాంస్కృతికం, పరిగి, న్యూస్‌టుడే: పురంలో సూగూరు ఆంజనేయస్వామికి, పరిగి, కొడిగెనహళ్లిలోనూ అమరాపురం మండలం నడింపెం, వలస, హొళ్లికుంట, అమరాపురం కోటవీధి, చెరువు కట్ట ఆంజనేయస్వామి, అలుకూరు, కాచికుంట ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు హారతులను తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. పెద్దఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అగళి: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. అగళి మండలం గ్యారహళ్లి దడపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి జ్యోతులు సమర్పించారు.

నడులుదెంలో హారతులు మోస్తున్న మహిళలు

డిప్యూటీ ఎంపీడీవోగా భాస్కర్

చిలమత్తూరు, న్యూస్‌టుడే: కోడూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భాస్కర్ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఈ మేరకు సత్యసాయి జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేస్తానని ఆయన వివరించారు. పంచాయతీ కార్యదర్శులతోపాటు అదనపు బాధ్యతలు అప్పగించారు.

గ్రామస్థులతో చర్చించాకే జలాశయ నిర్మాణం

గుడిపల్లిలో రహదారి నిర్మాణానికి మంత్రి భూమి పూజ

పనులు ప్రారంభిస్తున్న మంత్రి సవిత, అధికారులు, నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: గుడిపల్లి గ్రామస్థులతో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే జలాశయ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం గుడిపల్లిలో రూ.2.80 కోట్ల నిధులతో పాపిరెడ్డిపల్లి-తుంగోడు గ్రామాల మధ్య చేపట్టనున్న రహదారి నిర్మాణానికి భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ముందుగా గ్రామంలో వెలసిన సజ్జగంట రంగనాథస్వామి వారిని దర్శించుకొని విశేష పూజలు చేపట్టాక గ్రామ సచివాలయం వద్ద సభలో మంత్రి మాట్లాడారు. ఇక్కడ జలాశయ నిర్మాణం విషయంలో ఏ ఒక్కరికీ నష్టం లేకుండా చూస్తామని, ఇంకా పరిశీలనలోనే ఉందని ప్రజలకు వివరించారు. సీఎం చంద్రబాబు అపర భగీరథుడు అని, ప్రజలకు తాగునీరు-రైతులకు సాగునీటి సమస్య తొలగిపోయిందన్నారు. పూర్తిస్థాయిలో అధికారం అప్పగించిన ప్రజలపై కక్షసాధింపు చర్యలు లేవని, పార్టీలకు అతీతంగా దరఖాస్తు చేసుకొన్న అర్హులందరికీ త్వరలోనే పక్కా గృహాలతో పాటు పింఛన్లను మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించినట్లు మంత్రి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి గిరిజమ్మ, సగర, వాల్మీకి కార్పొరేషన్‌ల ఛైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ ఆంజనేయులు, మార్కెట్ యార్డు ఛైర్మన్ శైలజ, నాయకులు సంజీవరెడ్డి, సిద్ధలింగప్ప, నరసింహులు, రంగప్ప, రామకృష్ణ, చలపతి, మద్దిలేటి, అనసూయమ్మ, వరలక్ష్మి, సుమిత్ర, శిరీషా, రత్నమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సోదరికి ఎంపీ నివాళులు

రొద్దం: మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన రామాంజనమ్మ(85) ఎంపీ బీకే పార్థసారథికి చెల్లెలు. ఆమె అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ, ఆయన సతీమణి కమలమ్మలు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. ఆయన వెంట తెదేపా జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు రామాంజనేయులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ కేసులో ఒకరి అరెస్ట్

మడకశిర గ్రామీణం: నాలుగు రోజుల క్రితం రేకులకుంటలో వ్యక్తి ద్విచక్రవానం చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసుకు సంబంధించిన ఆ వ్యక్తిని సోమవారం ఆర్.అనంతపురం ఆర్డీటీ ఆఫీస్ సమీపంలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

తపాల బీమా కింద రూ.5.57 లక్షలు అందజేత

హిందూపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురైై రొళ్లకు చెందిన శివకుమార్ మృతి చెందగా మంగళవారం తపాలా బీమా కింద అతని భార్య మాలతికి రూ.5.57లక్షల చెక్కును తపాలా ఎస్పీ విజయ్‌కుమార్ అందించారు. ఆయన మాట్లాడుతూ శివకుమార్ 2023, ఏప్రిల్ 20న రూ.5లక్షల తపాలా బీమా పాలసీ తీసుకొని ప్రీమియం చెల్లించాడని ఈ సంవత్సరం జనవరి 23న విద్యుదాఘాతంలో మృతి చెందడటంతో బీమా మొత్తం అందించామన్నారు.

పీకేఎస్‌ఆర్ మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో..

ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విజేతలతో..

ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాలయంలో..

చరవాణి మంచికి వాడితే ఎంతో ఉపయోగం

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలోని పీకేఎస్‌ఆర్ మున్సిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 9వ తరగతి చదువుతున్న వి.మోక్షిత్ ప్రథమ, ఎన్.చరణ్ ద్వితీయ, 8వ తరగతి చదువుతున్న బి.మానస తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెన్నోబులం, ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాసులు, రామాంజినేయులు, కిష్టప్ప, నాగప్ప, బాలకృష్ణ, హేమలత బహుమతులు అందజేశారు.

● హిందూపురంలోని ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో 8వ తరగతి చదువుతున్న చాందిని ప్రథమ, అభినయ్ ద్వితీయ, 9వ తరగతికి చెందిన కావేరి తృతీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు రంగనాయకులు, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

● హిందూపురంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యాలయంలో పోటీలు నిర్వహించారు. 7 తరగతి చదువుతున్న సాయిలహరి ప్రథమ, 8వ తరగతి చదువుతున్న పి.రేవతి ద్వితీయ, 9వ తరగతికి చెందిన ఎ.పవిత్ర తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ నాగమణి, వైస్ ప్రిన్సిపల్ ఇందిర, లైబ్రేరియన్ జబీనా, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పాపసానిపల్లిలో..

సిద్ధగిరిలో విజేతలతో..

మడకశిర గ్రామీణం: ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో మడకశిర మండలం పాపసానిపల్లి, సిద్ధగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ నిర్వహించారు. పాపసానిపల్లిలో 10వ తరగతి చదువుతున్న దినేశ్‌గౌడు ప్రథమ, 8వ తరగతి అఖిలేశ్ ద్వితీయ, 7వ తరగతి సాయిలేఖన తృతీయ స్థానంలో నిలిచారు. సిద్ధగిరి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి సమీరా ప్రథమ, 8వ తరగతి అనిల్ ద్వితీయ, 9వ తరగతి నవ్య తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, సునీతల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేశ్, ఉమేశ్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

రొళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని చెరువుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలించినా, ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్షావలి, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు హెచ్చరించారు. సీ.ఎం.ఘట్ట చెరువులో పలువురు అన్యాక్రాంతంగా ఆక్రమించుకున్నారని రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు తెలియజేయగా మంగళవారం అధికారులు చెరువును పరిశీలించి అక్కడ గొర్రెల కాపర్లు కంచె వేసుకుని ఉన్నట్లు గుర్తించి వెంటనే కంచెను తొలగించాలని ఆదేశించారు. సత్వరమే సర్వే చేయించి హద్దుల్లో బౌండరీ ట్రెంచ్‌లు తవ్వించాలని ఎంపీడీవోకు తెలియజేశారు. ఏఎస్సై ఇదాయతుల్లా, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, నాయకులు రామకృష్ణ, చంద్రప్ప, బిలియన్న తదితరులు ఉన్నారు.

సీఎమ్.ఘట్ట చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసులు

సీసీ రోడ్డు నిర్మించండి

ముతుకూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతునానరు. వర్షం వస్తే చాలు నడిచేందుకు సైతం ఇబ్బందిగా ఉంటుంది. ఇప్పటికైనా సీసీదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అమరీశ్ మాట్లాడుతూ సీసీదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

ఇదేం చెత్త పని

రొళ్లలోని మసీదు ప్రాంతంలో అగళి ప్రధాన రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఈప్రాంతంలోని పలు ఇళ్లవారు, చికెన్ దుఖాణదారులు, ఇతర వ్యాపారస్తులు వ్యర్థ పదార్థాలను ప్లాస్టిక్ పేపర్లు వేస్తున్నారు. ఈ దారిలో వెళ్లే వారు దుర్గంధం భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఈవోఆర్డీ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రొళ్ల

ఆర్ఎస్‌కే భవన నిర్మాణం పూర్తి చేయండి

ఆర్.అనంతపురం రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయి ఐదేళ్లపైబడుతోంది. ప్రస్తుతం పాత భవనం అసౌకర్యంగా ఉండడంతో సిబ్బంది, కార్యాలయానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఛత్రం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వికాస్ మాట్లాడుతూ పూర్తయ్యేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. -న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

ఆరు నెలలుగా నీరు రాని కుళాయి

ఎర్రగుంటపల్లిలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి కుళాయి నుంచి ఆరు నెలలుగా నీరు రావడం లేదని గ్రామస్థులు వాపోయారు. బోర్ల నుంచి నీరు సరఫరా చేస్తున్నా ఆనీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటంతో తాగడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ విషయమై ఉప ఎంపీడీవో ప్రసాద్‌ను వివరణ కోరగా ఎస్ఆర్ ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి కుళాయిల ద్వారా నీరందేలా చూస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, అమరాపురం

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం గ్రామీణ మండలం భరత్‌నగర్ లయోలా కళాశాల వద్ద రైల్వే పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి(53) మృతదేహం లభించిందని రైల్వే పోలీసులు తెలిపారు. ఇతని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని అందువలన గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇతనికి సంబంధించిన వ్యక్తులు ఎవ్వరైనా ఉంటే రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలు

హిందూపురం: పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ వద్ద రెండు ద్విచక్రవాహనాలు రహదారిపై వెళుతున్న ఉమాపతిని ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఝార్ఖండ్ బాలికకు..

గోరంట్ల: గోరంట్ల మండల పరిధిలో జరుగుతున్న బెంగళూరు - అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేయడానికి ఝార్ఖండ్ రాష్ట్రం నుంచి వచ్చిన కుటుంబానికి చెందిన నేహ అనే బాలిక మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి హిందూపురం పంపించారు. దిగే క్రమంలో వాహనం ముందుకు కదలడంతో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడినట్లు తెలిసింది. ఈ బాలిక అక్కాబావ ఇక్కడ పనులు చేయడానికి వచ్చిన నేపథ్యంలో వారింటికి వచ్చినట్లు సమాచారం.

జాతీయస్థాయి చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

ధ్రువపత్రాలతో విద్యార్థులు

హిందూపురం, న్యూస్‌టుడే: ముంబయికి చెందిన మాస్టర్ ఆర్ట్స్ వారు అక్టోబరులో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 8వ తరగతికి చెందిన దీక్షిత ప్రథమ, 7వ తరగతికి చెందిన దనేంద్రచారి ద్వితీయ, 8వ తరగతికి చెందిన పి.తేజశ్వని తృతీయ స్థానంలో ప్రతిభ చాటారు. వీరికి ట్రోఫీతోపాటు పసిడి, రజత పతకాలు అందించారు. చిత్రలేఖనంలో ప్రతిభ చాటిన విద్యార్థులను, చిత్రలేఖనంలో రాణించేలా కృషి చేసిన డ్రాయింగ్ టీచర్ పాండురంగని ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు అభినందించారు.

స్వామిత్వ సర్వేపై డీపీవో ఆరా

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలో కొనసాగుతున్న స్వామిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి సమత మంగళవారం పరిశీలించారు. ఉదయం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న డీపీవో మొదట రైతన్నా మీకోసం సభలు, అనంతరం ఈనెల అయిదోతేదీ నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ (పీటీఎం) సమావేశంపై మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. అనంతరం వడిగేపల్లి సచివాలయాన్ని సందర్శించి స్వామిత్వ సర్వేతోపాటు అన్ని విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కమలాబాయి, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, సర్పంచి నరసింహమూర్తి పాల్గొన్నారు.

రెండు కాళ్లు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు..

కృత్రిమ కాళ్లతో సొంతంగా నిలబడిన నారాయణస్వామి

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని చింతలపల్లిలో కూలీగా జీవనం సాగిస్తున్న నారాయణస్వామికి మధుమేహవ్యాధి సోకి రెండు కాళ్లు కోల్పోయాడు. అయినా భయపడకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి కృత్రిమ కాళ్లతో నేడు నడుస్తున్నాడు. పుట్టపర్తి మండలం దిగువచెరువుపల్లికి చెందిన నారాయణస్వామికి 25ఏళ్ల వయసు వచ్చేవరకు ఆరోగ్యంగా ఉన్నాడు. ఉపాధి కోసం చింతలపల్లికి వచ్చాడు. భార్య, ఇద్దరు కుమారులతో ఆనందంగా ఉన్న అతను ఉపాధి కోసం భార్య పిల్లలతో బెంగళూరు వెళ్లాడు. అక్కడ మధుమేహ వ్యాధి సోకింది. సరైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. దీంతో వ్యాధి ముదిరి 2020లో ఒకేసారి రెండు కాళ్లు తీసేశారు. దీంతో తిరిగి ఆకుటుంబం చింతలపల్లికి చేరింది. అప్పటి నుంచి ఎందరినో సహకారం కోసం అర్థించాడు.

ఆపదలో ఆసరాగా ఉపాధ్యాయుడు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు జగదీశ్వర్ అతని పరిస్థితిని గుర్తించి పుట్టపర్తికి చెందిన సత్యసాయి భక్తులచేత కొంతకాలం ప్రతినెలా నిత్యావసరాలు, కొంత నగదు ఇప్పించాడు, మరోవైపు అధికారులను సంప్రదించి ప్రభుత్వ వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాడు. అప్పటి నుంచి పరిస్థితిలో కొంతమార్పు వచ్చింది. ఏడాది క్రితం ఆ ఉపాధ్యాయుడి సహకారంతో రెండు కృత్రిమ కాళ్లు ఉచితంగా అమర్చారు. ప్రస్తుతం సులభంగా ఎక్కడికైనా వెళ్లగల్గుతున్నాడు. శ్రీహనుమాన్ వికలాంగుల మండల సమాఖ్యలో సభ్యుడిగా చేరానని రుణం తీసుకుని వ్యాపారం ప్రారంభించి తన కాళ్లపై తనే నిలబడతానన్న ధైర్యం వచ్చిందని చెబుతున్నాడు నారాయణస్వామి.

'హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే'

మాట్లాడుతున్న రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ

మడకశిర, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు పరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప మడకశిరకు పోలీసు సబ్ డివిజన్ కావాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం రెవెన్యూ డివిజన్ మంజూరు చేశారన్నారు. వైకాపా నాయకులు వారి ఉనికిని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ప్రజలు దీన్ని గమనిస్తున్నారని అన్నారు. ఆరోపణలు మానుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ రాజా, మండల, పట్టణ కన్వీనర్‌లు నాగరాజు, నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుతి పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడి.. ఫిర్యాదు


దాడి ఘటనకు సెల్‌లో పరిశీలిస్తున్న ఎస్సై రమేశ్ బాబు

సోమందేపల్లి; న్యూస్‌టుడే: సోమందేపల్లి అంబేడ్కర్ కూడలికి సమీపంలో పుట్టయ్య కాంప్లెక్స్ వద్ద మంగళవారం రాత్రి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సాయికుమార్, నరేశ్ తదితరులపై ఏడుగురు యువకులు దాడి చేశారు. మొదట ఓవర్గం యువకులు గంజాయి మత్తులో ఒకరికొకరు కొట్టుకొన్నారు. అనంతరం వ్యాపార సముదాయం గదుల వద్ద కూర్చొని మాట్లాడుకొంటున్న సాయికుమార్, నరేశ్‌లపై ఎలాంటి కారణం లేకుండా పిడి గుద్దులు గుద్దుతూ..కాళ్లతో తన్నుతూ దాడి చేశారు. బాబ్‌జాన్ అలియాస్ జబీవుల్లా, అర్షద్, సందీప్‌తోపాటు మరో నలుగురు తమపై దాడి చేశారని బాధిత యువకులు తమ తల్లిదండ్రులు సంజీవరాయుడు, వసుంధర, ఆదినారాయణలతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబయ్య ఉర్సు బందోబస్తులో ఉన్న ఎస్సై రమేశ్‌బాబు, హెచ్‌సీలు ఆదినారాయణ, సత్యనారాయణ, సిబ్బందితో స్టేషన్‌కు చేరుకొన్నారు. ఇదే సమయంలో బాధితులకు మద్దతుగా విశ్వహిందూ పరిషత్తు సభ్యులు, భాజపా నాయకులు, హిందూ యువకులు, అయ్యప్ప స్వామి భక్తులు 100 మంది వరకు స్టేషన్‌కు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. వీహెచ్‌పీ నాయకులు పెనుకొండ వేదవ్యాస్, స్థానిక నాయకులు ఎర్రిస్వామి, గంగాధర్, సురేశ్‌బాబు, మంజునాథ్, నరేశ్, రామాంజనేయులు, సతీశ్, ప్రసన్న తదితరులు చేరుకొని ఎస్సైతో చర్చించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై, సిబ్బంది నిందితుల ఇళ్లకు చేరుకొని, వారి కుటుంబ సభ్యులను తీసుకువచ్చి విచారణ చేపట్టారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ధర్మవరం న్యూస్‌టుడే : ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఉన్న తెదేపా కార్యాలయంలో మంగళవారం ఏడుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.4.77 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. వైద్యం చేయించుకున్నవారికి ఆర్థికభారం పడకుండా సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయాన్ని సీఎం చంద్రబాబు అందిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. అనంతరం తెదేపా నాయకులతో నిర్వహించిన సమావేశంలో శ్రీరామ్ మాట్లాడారు. ఈనెల 14 వరకు పీఎం ఆవాస్ యోజన, జియో ట్యాగింగ్‌కు అవకాశం ఉందన్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కమతం కాటమయ్య, నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లపల్లి షరీఫ్, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరి, పట్టణాధ్యక్షుడు సుధాకర్,సందా రాఘవ, నాగూర్ హుసేన్ పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

అరటి గెలలను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తాడిమర్రి, న్యూస్‌టుడే : అరటి పంటకు గిట్టుబాటు ధర లేక గెలలన్నీ తోటలోనే మగ్గిపోతున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని దాడితోట, చిల్లకొండాయపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి పంటలను ఏపీ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి నష్టపోయిన వారి వివరాలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పోతులయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపం నుంచి అమిదాలకుంట గ్రామం వరకు రహదారి పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - **రామ్మోహన్‌రెడ్డి, వెంకటాంపల్లి**

సమాధానం: దారి పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదించాం. నిధుల మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం. **అబ్దుల్ ఖాదర్, మండల ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ**

***సమస్య:** మేడాపురంలోని పలు వీధులలో కాలువలను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. -**మల్లికార్జున, స్థానికుడు**

***సమాధానం:** పరిశుభ్రతా చర్యలు చేపట్టేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచిస్తాం, **అశోక్‌నాయక్, ఈఓఆర్డీ**

– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

గండ్లు పూడ్చక.. మరమ్మతులకు నీళ్లు

శిథిలావస్థలో వైవీఆర్ కాలువలు

చెరువులకు వెళ్లాల్సిన కుడికాలువ నీరు (వృత్తంలో గండిపడిన ప్రాంతం)

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు యోగి వేమన జలాశయం ప్రాజెక్టు నిండింది. ఇటీవల కుడి, ఎడమ కాలువల ద్వారా దిగువ ప్రాంతంలోని చెరువులకు అధికారులు నీటిని విడుదల చేశారు. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలు పలుచోట్ల గండ్లు పడి సాగునీరంతా వృథాగా పోతోంది. ఫలితంగా కాలువ పరిధిలోని నక్కలపల్లి, దొరిగల్లు 1,2, దానామునపల్లి, ఈదులపల్లి, కొడవండ్లపల్లి, బూదనాంపల్లి, గాండ్లవారిపల్లి చెరువులకు తక్కువ సామర్థ్యంతో నీరు వెళ్లడంతో సగమే నిండుతున్నాయి. వేసవిలోకూడా సాగునీటి కొరత ఉండకూడదంటే చెరువులు పూర్తిస్థాయిలో నింపాలి. అందుకోసం గండ్లుపూడ్చి వృథానీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆయకట్టు రైతుల ఇక్కట్లు

కుడి కాలువ జలాశయం దగ్గర గండ్లుపడి భారీగా సాగు నీరంతా వృథాగా పోతోంది. గండ్లు పూడ్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. ఏటా జలాశయం నుంచి విడుదల చేసిన నీరంతా గండ్ల రూపంలో వృథాగా మద్దిలేరు వాగులో కలిసిపోతున్నాయని, ఫలితంగా వేసవిలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి.

గుత్తేదారు నిర్లక్ష్యం

జలాశయం ఆయకట్టు కింద 12 వేల ఎకరాల భూములున్నాయి. కాలువ గట్లు దెబ్బతిని, శిథిలం కావడంతో నీళ్లు వృథాగా పోయేవి. కాలువల ఆధునికీకరణలో భాగంగా గట్లు నిర్వహణ, మరమ్మతులు చేసేందుకు రూ.31 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో గుత్తేదారు పనులు దక్కించుకుని గట్లపై ఉన్న కంపచెట్లను తొలగించారు. కాలువల్లో పూడుకుపోయిన మట్టి కొంతమేర తొలగించారు. ప్రధానంగా గండ్లు పడిన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. తాత్కాలికంగా ఇసుక సంచులు అడ్డుగా పెట్టినా నీటివృథా ఆగలేదు. జలాశయం నుంచి కుడి, ఎడమ, ఉప కాలువలు మొత్తం 38 కిలోమీటర్లు ఉన్నాయి. అనేక చోట్ల గండ్లుపడటం, మట్టితో పూడుకుపోయాయి. నిర్వహణ లేకపోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. నిధులున్నా గుత్తేదారు నిర్లక్ష్యంతో సకాలంలో పనులు పూర్తి చేయలేదు. దీంతో సాగునీటి వృథాకు అడ్డుకట్టపడలేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- కృష్ణకుమార్, ఇరిగేషన్ జేఈ

సాగునీరు వృథాకాకుండా వెంటనే గండ్లు పూడ్చాలని, కాలువల నిర్వహణ చేపట్టాలని గుత్తేదారుకి సూచిస్తాం. శిథిలమైన, గండ్లు పడిన ప్రాంతాలను పరిశీలించి నీటి వృథాలేకుండా మరమ్మతులు చేయిస్తాం.

వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

పూజలో పాల్గొన్న భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, హరీష్‌బాబు

ధర్మవరం న్యూస్‌టుడే : ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కూడలి వద్ద మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటుకు మంగళవారం భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు భూమి పూజ చేశారు. పూజా కార్యక్రమం నిర్వహించి విగ్రహ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ మాట్లాడుతూ దేశానికి సేవలందించిన మాజీ ప్రధాని వాజ్‌పేయీ స్ఫూర్తిదాయక నాయకుడన్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ ఈనెల 11న ఘనంగా నిర్వహించనున్నామన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, పట్టణాధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, గుండా పుల్లయ్య, రాజు, బిల్లే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న తెదేపా నాయకుడు సందా రాఘవ

ధర్మవరం న్యూస్‌టుడే : క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన ధర్మవరం విద్యార్థులను మంగళవారం తెదేపా నాయకుడు, చేనేత పట్టుచీరల వ్యాపారి సందా రాఘవ సన్మానించారు. రాష్ట్ర స్థాయి కరాటే స్కూల్ గేమ్స్‌లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు మహిధర్, సాహిత్య, హారిక, సుష్మిత, అఖిలభాను, చిగిచెర్లలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన సింధూ, ద్రాక్షాయని, సంధ్యలను శాలువాలతో సందా రాఘవ సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సందా రవి, కేశగాళ్ల శ్రీనివాసులు, జింకా పురుషోత్తం పాల్గొన్నారు.

పోలీసులు నిబద్ధతతో విధుల్లో రాణించాలి: ఎస్పీ

డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ధర్మవరం న్యూస్‌టుడే: పోలీసులు నిబద్ధతతో విధుల నిర్వహణలో అంకితభావంతో కర్తవ్యం నిర్వహించాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం ధర్మవరం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషన్‌లో దస్త్రాలు, పెండింగ్ కేసులను ఎస్పీ సమీక్షించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్, రెండో పట్టణ సీఐ రెడ్డప్పతో ఎస్పీ సమీక్షించారు. ఫిర్యాదుదారులు పోలీసుస్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో పోలీసు మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ సూచించారు. స్థానిక సంస్థల రాజోతున్న తరుణంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రాత్రి వేళ పోలీసు గస్తీ పెంచాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ వెంకటరమణ, సీసీ చిరంజీవి ఉన్నారు.

'రాజకీయంగా దెబ్బతీసేందుకే తప్పుడు కథనాలు'

అనంతపురం (రుద్రంపేట) న్యూస్‌టుడే: రాజకీయంగా దెబ్బతీసేందుకే సాక్షి తప్పుడు కథనాలు రాస్తోంది.. తన కళాశాల, ప్రభుత్వంపై వస్తోన్నవన్నీ అవాస్తవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఖండించారు. మంగళవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతూ.. ఫీజు చెల్లిస్తేనే తరగతి గదిలోకి వెళ్లనిస్తారు అంటూ ఆ పత్రికలో తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 40 శాతం మందికి ఉచితంగా విద్యను అందించానని పేర్కొన్నారు. మా విద్య సంస్థల్లో చదువుకున్న లక్షల మంది విద్యార్థులు విదేశాలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారని, అటువంటి వారిని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోటాలో సీటు పొంది వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులపై ఎటువంటి ఫీజు ఒత్తిడి చేయలేదన్నారు.

ప్రతి అర్జీదారుడికి న్యాయం చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళ, శుక్రవారం ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. మొత్తం 22 ఫిర్యాదులు రాగా, కదిరి 8, హిందూపురం 4, పుట్టపర్తి 10 ఫిర్యాదులు వచ్చాయి. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని ఆదేశించారు.

అజాగ్రత్తగా ఉంటే ప్రమాదమే!

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చెత్త సేకరణ కేంద్రం వద్ద వృథాగా పడి ఉన్న డస్టర్‌బిన్ ప్రమాదకరంగా ఉంది. దీనికి రంధ్రాలు పడటంతో దానికి సంబంధించిన రేకులు రోడ్డుపైకి చొచ్చుకుని వచ్చాయి. ద్విచక్ర వాహనదారులు రేకును గమనించకపోతే తగిలే అవకాశం ఉందని చోదకులు వాపోతున్నారు. దీనిపై పట్టణ శానిటేషన్ అధికారి శ్యామ్‌సన్ స్పందిస్తూ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఉపన్యాసాలతో అదరగొట్టారు!

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేట పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం అనే అంశంపై వక్తృత్వపోటీలు జరిగాయి. 7,8,9,10 తరగతుల విద్యార్థులు చక్కగా ఉపన్యసించారు. ఎమ్.నాగప్రణీత, పి.తరుణశ్రీ, యు.తరుణీ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు చంద్రమోహన్, పద్మజరాణి పాల్గొన్నారు.

కదిరి, న్యూస్‌టుడే : ఉపన్యాసానికి విషయ పరిజ్ఞానం ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయురాలు శైలజ తెలిపారు. కదిరి వీవర్స్‌కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. పదోతరగతికి చెందిన జి.కార్తికేయ ప్రథమ, పి.తనీష్‌తేజ ద్వితీయ, జి.సింధు తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు శైలజ చేతుల మీదుగా బహుమతులు, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు దశరథ, సుజాత, నాగరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం : విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్.

కదిరి : బహుమతులు పొందిన విజేతలతో ప్రధానోపాధ్యాయిని శైలజ, ఉపాధ్యాయులు

31 నుంచి సీఐటీయూ మహాసభలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: సీఐటీయూ ఆల్ ఇండియా మహా సభలు ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4 వరకు జరుగుతాయని వాటిని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. మంగళవారం పట్టణంలోని పీఆర్టీ స్ట్రీట్‌లో సీఐటీయూ మహాసభల గోడప్రతాలను ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. అనంతరం పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణను కలిసి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలకు కార్మికులకు వర్తింపజేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని గొర్రెల కాపరి దుర్మరణం

గంగులప్ప

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే : పెద్దగుట్లపల్లికి చెందిన గొర్రెల కాపరి వగ్గనగారి గంగులప్ప(57) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం పెద్దగుట్లపల్లి ఊరు బోరు సమీపంలో గొర్రెల మేపుతూ రోడ్డుపై ఉన్న కాపరి గంగులప్పను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన అతడిని ఓడీసీ ప్రభుత్వవైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం

మంటల్లో కాలిపోయిన కారు

తనకల్లు, న్యూస్‌టుడే: కారు లోని ఇంజిన్‌లో నుంచి పొగ రావడంతో కారుపూర్తిగా కాలిపోగా చోదకుడు క్షేమంగా బయటపడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున మండ్లిపల్లి వద్ద జరిగింది. కుటాగుళ్లకు చెందిన భూక్యా వెంకటేష్ నాయక్ కారులో తనకల్లు మండలంలోని రెడ్డివారిపల్లి తండాకు ఒంటరిగా వెళ్తున్నాడు. మండ్లిపల్లి వద్దకు రాగానే పొగలు రావడంతో పక్కకు తిప్పగా గుంతల్లోకి వెళ్లిపోయింది. వెంకటేష్‌నాయక్ క్షేమంగా బయటపడ్డాడు. కారు పూర్తి కాలి బూడిదయినట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

దొంగతనం కేసులో రెండేళ్ల జైలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : దొంగతనం కేసులో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ కదిరి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించినట్లు ముదిగుబ్బ టౌన్ సీఐ శివరాముడు మంగళవారం తెలిపారు. ధర్మవరం మండలం ఉప్పునేసేపల్లికి చెందిన భీమినేని అమర్నాథ్‌నాయుడు 2020 ఫిబ్రవరి 15న ముదిగుబ్బలోని రైల్వేక్వార్టర్స్‌లో ఉన్న ఓ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు.3 తులాల బంగారం, రూ.10వేలు నగదు దొంగిలించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ముదిగుబ్బ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు అమర్నాథ్‌నాయుడిని అరెస్టు చేసి, అతని నుంచి బంగారు నగలను రికవరీ చేశారు. కదిరి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌లో హాజరుపరచగా ముద్దాయిని రిమాండ్‌కు పంపారు. అనంతరం కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ముద్దాయికి రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య

రామగిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ బాలిక (16) ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు రామగిరి మండలం పి.ఆర్.కొట్టాల గ్రామానికి బాలిక కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నకిలీ ధ్రువీకరణ పత్రంతో భూవివాదం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : వంశవృక్షం జారీ చేసే అధికారం రెవెన్యూ విభాగంలో తహసీల్దార్‌కు ఉంటుంది. నల్లచెరువు రెవెన్యూగ్రామంలో ఓ వీఆర్‌ఓ జారీచేసిన వంశవృక్షం పత్రంతో రైతుల మధ్య వివాదానికి దారితీసింది. నల్లచెరువు రెవెన్యూ పొలంలోని సర్వేనంబరు 577లో షబీనాకు తండ్రి నుంచి సంక్రమించిన భూమి ఉంది. ఈ భూమిలో తమకు హక్కు ఉందంటూ నల్లచెరువు మండలం దేవిరింటిపల్లికి చెందిన దాదుసాబ్ కుమారుడు ముస్తఫా వీఆర్‌ఓ జారీ చేసిన వంశవృక్షంతో ఆర్డీఓ కోర్టులో అప్పీల్ చేశారు.తహసీల్దార్ ఇవ్వాల్సిన వంశవృక్షాన్ని తేదీ, కార్యాలయ రెఫరెన్స్‌నంబరు లేకుండా కిందిస్థాయి ఉద్యోగి ఇచ్చిన సర్టిఫికెట్‌ను ఎలా అనుమతించారని షబీనా కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.వంశవృక్షంలో మృతిచెందిన వ్యక్తి మరణ ధృవీకరణ పత్రాలు లేకుండానే నకిలీ ధ్రువపత్రాలతో రెవెన్యూ కోర్టులో అప్పీల్‌ను స్వీకరించడం వల్ల తాము వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని షబీనా కుటుంబసభ్యులు అంటున్నారు. వీఆర్‌ఓ వంశీవృక్షం జారీ చేసిన విషయాన్ని కదిరి ఆర్డీఓ వీవీఎస్‌శర్మ దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్ ఇవ్వాల్సిన వంశవృక్షం వీఆర్‌ఓ ఇవ్వడంపై విచారిస్తామని, అధికారం లేకుండా ధ్రువపత్రం ఇచ్చినట్లు తెలితే ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

ఎరువుల బస్తా బరువులను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి కృష్ణయ్య నేతృత్వంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని సిరి వెంకట్ ఫర్టిలైజర్స్, బాలాజీ ఫర్టిలైజర్స్, వైటీఆర్ అగ్రి సొల్యూషన్స్, మన గ్రోమోర్ దుకాణాల్లో స్క్వాడ్ అధికారులు ఎరువుల విక్రయాలను పరిశీలించారు. వీటిలో సిరివెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో రూ.1,64,500 విలువల గల ఎరువులను నిలుపుదల చేసినట్లు కృష్ణయ్య తెలిపారు. ధరలు తెలిపే పట్టికలను దుకాణాల ముందు భాగంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదాలపై అప్రమత్తం

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న మోటర్ వెహికల్ అధికారిణి రాణి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : బస్సుల్లో అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలపై వాటి చోదకులకు అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని మోటార్ వెహికల్ అధికారిణి రాణి తెలిపారు. మంగళవారం నాగలూరు గ్రామ సమీపంలోని రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల్లో బస్సు ప్రమాదాలపై చోదకులకు మోటార్ వెహికల్ అధికారి రాణి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను ఆమె తనిఖీ చేశారు. అనంతరం బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ఆ సమయంలో ఏ విధంగా స్పందించాలో అనే అంశంపై చోదకులు శిక్షణ ఇచ్చారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చోదకుల లైసెన్స్‌లు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీల్లో క్రీడాస్ఫూర్తి చాటుదాం

పోటీలను ప్రారంభిస్తున్న విద్యాశాఖాధికారులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ఉద్యోగుల మధ్య క్రీడలు నిర్వహించడం హర్షిందగ్గ విషయమని, పోటీలను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. వీటిని ఇన్‌ఛార్జి కమిషనర్ సాయికృష్ణ, ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి ప్రారంభించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

In the Court of the Principal Junior Civil Judge Cum Judicial Magistrate of First Class, Ananthapuramu
O.S.No. 218/2024

BETWEEN:
State Bank Of India, Tilak Road Branch, Rep. by its Branch Manager, Anantapuramu. **... Plaintiff**
And
Devana Prasad **... Defendant**

NOTICE TO THE DEFENDANT

To,
Devana Prasad S/o C.Vemaiah, D.No: 5-3-A, Indukoori Palli Village, S.V.Palli Post, Talupula Mandal, Kadiri taluk, Sri Sathya Sai Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 09-01-2026వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

K.Chandra Sekhar Rao, Advocate, Ananthapuram. Cell: 9848504780

బిందు సేద్యంతో నీటి వనరుల ఆదా : కలెక్టర్

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

బుక్కపట్నం, న్యూస్‌టుడే : బిందు సేద్యంతో నీరు వనరులను ఆదా చేసుకోవచ్చని కలెక్టరు శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుక్కపట్నం మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ ఉపాధిపథకం పనులను, ఉద్యాన తోటలను మంగళవారం జిల్లా కలెక్టరు శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. చెంద్రాయునిపల్లి గ్రామంలో బిందుసేద్యంతో పండించుకుంటున్న చిక్కుడు పంటను పరిశీలించారు. అక్కడే తవ్విన ఫారంపాండులోని నీటిని రైతుల సద్వినియోగం చేసుకోవటాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రాశింపల్లి వద్ద ఉపాధి పథకంతో పెట్టిన పండ్లతోటలను చూశారు. అక్కడ అధిక సాంద్రత పద్ధతితో నాలుగెకరాల్లో 1600 మామిడి మొక్కలు నాటిన రైతు శ్రీనివాసులు తోటను సందర్శించారు. అందులో బంగినపల్లి, హిమయత్, అల్ఫాన్స్, కేసర్, సువర్ణరేఖ లాంటి మామిడి రకాలు ఉన్నట్లు రైతు కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టరు పాముదుర్తిలో నిర్వహిస్తున్న భూ రీసర్వేను కలెక్టరు నేరుగా వెళ్లి తనిఖీ చేశారు. జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏఓ నటరాజ్, ఏపీఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపడాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లా ఆసుపత్రుల్లో వైద్య సేవల మెరుగుదల, భవన నిర్మాణ పనుల ప్రగతిపై అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన, ఆసుపత్రి భవన నిర్మాణ పురోగతి శానిటేషన్ మెరుగుదలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా వైద్యాధికారిణి ఫైరోజాబేగం, డీసీహెచ్ఎస్ అధికారి మధుసూదన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమూనా పత్రాల పంపిణీ

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నమూనా పరీక్షల పత్రాలను పంపిణీ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మాదిరి ప్రశ్న పత్రాల పుస్తకాలకు సిమ్స్ ఆసుపత్రి ఎండీ నిసార్ యాసిన్‌ఖాన్ విరాళం అందించారు. పఠనా సామగ్రిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నిసా, ఎంఈఓ చెన్నకృష్ణలతో కలిసి ఆయన పంపిణీ చేశారు. పుస్తకాలను పట్టణంలోని ఉర్దూ మెయిన్, కుటాగుళ్ల, వీవర్స్ కాలనీల్లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందజేశారు.

కొత్తచెరువు: ఏటా యూటీఎఫ్ పదో తరగతి విద్యార్థుల కోసం నిపుణులైన ఉపాధ్యాయులు రూపొందించిన నమూనా పరీక్ష పత్రాలను మంచి ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పంపిణీ చేశామని యూటీఎఫ్ నాయకులు సుధాకర్, భాస్కర్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు తెలిపారు.

పది పరీక్ష రుసుం మంత్రి చెల్లింపు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్ష రుసుమును మంత్రి సత్యకుమార్‌యాదవ్ చెల్లించారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న 2087 మంది పదో తరగతి విద్యార్థుల రుసుము రూ.2,60,875లను మండల విద్యాశాఖాధికారులు అందుకున్నారు. మంత్రి కార్యాలయం ఇన్‌ఛార్జి హరీష్‌బాబు చేతుల మీదుగా చెక్కును వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి, రమణప్ప, కృష్ణమోహన్, వెంకటేష్, చాముండేశ్వరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన మహిళ సమాఖ్య కార్యవర్గ సభ్యులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ప్రగతి మండల సమాఖ్య వార్షిక మహసభ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం సూర్యానారాయణ తెలిపారు.మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య సంఘం మండల అధ్యక్షురాలిగా శైలజ, ఉపాధ్యక్షురాలిగా సుజాత, కోశాధికారిగా ఈశ్వరమ్మ, కార్యదర్శిగా మౌనిక, సహయ కార్యదర్శిగా అఖిలభానును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి సత్కారించారు.ఈకార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి, కార్యదర్శి రాములమ్మ, సీసీలు షాకీర్, ప్రసాద్, నిర్మలమ్మ, రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the Prl. District Judge, Anantapuramu.
E.P. No: 71/2025 in Arbitration Case No. 683/2023

Between:
M/s. Five Star Business Finance Limited, Chennai. Represented by its Authorized Signatory, G.Giddaiah, Kurnool. **...Petitioner/D.Hr**
And
A.Nagaraju and Another **... Respondents/J.Drs**

To,
J.Dr.1: Avula Nagaraju S/o Venkataramudu, business, D.No.1-623-1, Shanthinagar, Dharmavaram, Anantapur Dist. Now at Sri Satyasai Dist.

J.Dr 01 కి Order 21 Rule-54 CPC నోటీసు

డిక్రీహోల్డర్‌కు రావలసిన ఇ.పి. మొత్తము వసూలు చేయుటకు గాను E.P.లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసియున్నారు. సదరు E.P. వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 29-12-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షము నందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

M.SURESH KUMAR, Advocate, Ananthapuram. Cell: 9441168233.

ఈనాడు
శ్రీకాకుళం
బుధవారం డిసెంబరు 3, 2025

అడ్డగోలుగా అడ్డుగోడ..!

జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ కాలనీలో జేసీ బంగ్లా సమీపంలో దారికి అడ్డంగా నిర్మించిన గోడ ఇది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని రక్షించుకోవాలనే ఉద్దేశంతో అధికారులు దీన్ని నిర్మించారు. దీంతో పాటు పోస్టాఫీసుకు వెళ్లే దారిలోనూ మరో గోడ కట్టారు. ఈ మార్గాల్లో బ్యాంకర్స్ కాలనీ, ఆదిత్యనగర్, లక్ష్మీనగర్, రామకృష్ణానగర్ తదితర కాలనీవాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. స్థానికంగా ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల, పాఠశాల ఉండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఉంటుంది. ఇప్పుడు అడ్డంగా గోడలు నిర్మించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయం చూపకుండా గోడలు కట్టడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోడలు నిర్మించాం. సమీప కాలనీలకు వెళ్లేందుకు ప్రధాన మార్గం ఉంది' అని రూడా అధికారులు.. ఈఈ దీకొత ధనుంజయ రావు తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో అతిసారం లక్షణాలతో 8 మంది అనారోగ్యం బారిన పడగా.. ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం గ్రామంలో పర్యటించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. - న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

వైకల్యం ఓడింది.. విజయం తోడైంది..!

- న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఆ యువకుడి కుడి కాలు చిన్నగా ఉంటుంది. నడిచేందుకూ ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. అయితేనేం అనుకున్నది సాధించేందుకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు మంత్రి లోకేశ్. అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తున్నాడు. 'ఈనాడు' సీఎస్ఆర్ 'లక్ష్య' తోడ్పాటుతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకునేందుకు సన్నద్ధమవుతున్న ఈ యువకుడి విజయప్రస్థానంపై **నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం** సందర్భంగా కథనం...



పలాస మండలం రెంటికోటకు చెందిన లోకేశ్ తండ్రి కామన్న తాపీమేస్త్రీ, తల్లి జయలక్ష్మి గృహిణి. చిన్నతనం నుంచి దివ్యాంగుడైనా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటల్లో రాణించేవాడు. అతని ప్రతిభకు 'లక్ష్య-ఈనాడు' 2022 నుంచి తోడుగా నిలుస్తోంది. పలాసలో శిక్షకుడు కొణతల రామారావు వద్ద ప్రాథమిక తర్ఫీదు పొందాడు. జాతీయ, రాష్ట్రస్థాయిలో పతకాలు కొల్లగొట్టాడు. హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో 'లక్ష్య' ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ.. కోచ్ రమేష్ వద్ద మెలకువలు నేర్చుకుంటున్నాడు.

★ ఈ నెలలో జరగనున్న పారా యూత్ ఏషియన్ గేమ్స్‌లో ప్రతిభ చూపేందుకు సాధన చేస్తున్నాడు. 2028లో పారా ఒలింపిక్స్‌లో స్థానం దక్కించుకోవడమే తన లక్ష్యమని చెబుతున్నాడు లోకేశ్.

అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారుడు

విశ్వవేదికలపై విజయ బావుటా..

★ 2022లో రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్‌లో హైజంప్‌లో స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజత పతకాలు పొందాడు. 2023లో జాతీయస్థాయిలో సత్తాచాటాడు.

★ 2024 డిసెంబరులో థాయిలాండ్ వేదికగా జరిగిన ప్రపంచ ఎబిలిటీ స్పోర్ట్ యూత్ గేమ్స్‌లో హైజంప్‌లో 157 సెం.మీ. దూకి స్వర్ణపతకం పొందాడు. 3.75 మీటర్లు లాంగ్‌జంప్ చేసి రజతం కైవసం చేసుకున్నాడు.

★ ఈ ఏడాది ఫిబ్రవరిలో దుబాయ్‌లో జరిగిన పారా వరల్డ్ గ్రాండ్‌ప్రిక్స్ పోటీల్లో రజతం, జులైలో బెంగళూరులో జరిగిన ఓపెన్ పారా ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం, ఆగస్టులో మధ్యప్రదేశ్‌లో జరిగిన జాతీయ పారా పోటీల్లో రజత పతకాలు సొంతం చేసుకున్నాడు.

ఆశల తీరాన.. ప్రగతి పథాన..!

★ శరవేగంగా మూలపేట పోర్టు పనులు

- న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

మూలపేట పోర్టు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. కూటమి ప్రభుత్వం పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల మంత్రి కె.అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పోర్టు నిర్మాణంపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో 60 శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. నిర్దేశిత గడువులోగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు.

2. బెర్తుల వద్ద కాలువల కోసం రోజుకు 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని 3 డ్రెడ్జింగ్ యంత్రాలతో తవ్వుతున్నారు. త్వరలో విదేశాల నుంచి అత్యాధునిక డ్రెడ్జర్లను తీసుకురానున్నారు.

3. ఓడలు నిలిపే బెర్తుల నిర్మాణం పైలింగ్ నుంచి బీమ్స్ దశకు చేరుకుంది. 4 బెర్తుల్లో 64 మీటర్ల లోతు నుంచి పిల్లర్లు ఏర్పాటు చేశారు. తూర్పు వైపున 3 జనరల్ బెర్తులు, పశ్చిమాన కోల్ బెర్త్ రానున్నాయి. 2 జనరల్ బెర్తుల పనులు కొలిక్కి వచ్చాయి. కోల్ బెర్తు పైలింగ్ పనులు ఈ మధ్యనే ప్రారంభమయ్యాయి.

1. వాటర్ బ్రేక్ నిర్మాణం తొలి దశ పూర్తయ్యింది. 2,300 మీటర్ల పొడవైన సౌత్ వాటర్ బ్రేక్ వాల్, 580 మీటర్ల నార్త్ వాటర్ బ్రేక్ వాల్ నిర్మించారు. ప్రస్తుతం అక్కడ కొండ రాళ్లు, ఇండో పార్ట్స్ అమరుస్తున్నారు.

★ పోర్టుకు వెళ్లే రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రావెల్ పనులు జరిగాయి. నౌపడలో పైవంతెన, క్రీక్ వద్దకు దారి ఏర్పాటు చేయాల్సి ఉంది.

★ మూలపేట పోర్టు నుంచి హర్షనాథపురం, యామలపేట, పోతునాయుడుపేట, కోటపాడు మీదుగా రైల్వే ట్రాక్ లైన్ కోసం మట్టి చదును పనులు ఊపందుకున్నాయి.

★ విద్యుత్తు సౌకర్యం కోసం నౌపడలో స్తంభాలను అమరుస్తున్నారు.

★ పరిపాలన భవనాలతో పాటు 4 భారీ గోదాముల నిర్మాణం మొదలుపెట్టారు.

రానుంది వంతెన.. ఇదిగో నమూనా..!

జాతీయ రహదారిపై రణస్థలంలో నిర్మించనున్న పైవంతెనకు సంబంధించి గుత్తేదారు సంస్థ విడుదల చేసిన నమూనా చిత్రం ఇది. 4.7 కిలోమీటర్ల పొడవున వంతెన నిర్మాణం జరగనుంది. రామతీర్థాలు కూడలి నుంచి సినిమాహాలు జంక్షన్ వరకు 800 మీటర్ల మేర 21 స్తంభాలు.. ఇరువైపులా 600 మీటర్ల పొడవున గోడలు కడతారు. వంతెన పైభాగంలో 24 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలు, కింద పది స్తంభాల మీటర్ల వెడల్పుతో సర్వీసు రహదారులు నిర్మించనున్నట్లు ప్రాజెక్టు మేనేజరు రాధాకృష్ణ తెలిపారు. - న్యూస్‌టుడే, రణస్థలం

మిగులు సీట్ల భర్తీకి తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని మహాత్మజ్యోతిరావు పులే న్యాయకళాశాలలో నిర్వహిస్తున్న మూడేళ్ల న్యాయవిద్య కోర్సులో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 4న తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య మంగళవారం తెలిపారు. లాసెట్-25 అర్హత సాధించి, గడిచిన రెండు కౌన్సెలింగ్‌ల్లో ఏ కళాశాలలోనూ చేరని అభ్యర్థులు హాజరయ్యేందుకు అర్హులన్నారు. ధ్రువపత్రాలతో న్యాయకళాశాలకు హాజరు కావాలన్నారు.

అదిరేటి స్టెప్పు మేమేస్తే..

శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో 'సంగ్యాన్ - 2025' రెండో రోజు మంగళవారం మరింత ఉత్సాహంగా సాగింది. నృత్యప్రదర్శనలతో యువత అందరిలో హుషారు నింపారు. విద్యార్థులు 45 కార్యక్రమాల్లో పాల్గొని ఆహుతులను ఆకట్టుకున్నారు. నర్సింగ్ విద్యార్థినుల దాండియా నృత్యం, ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. - న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

దళారులకే ధాన్యం.. ఇదేం విధానం..?

- ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏకపక్షంగా సాగుతోంది. జిల్లాలో దళారులు, మిల్లర్లు ఏకమై అన్నదాతను ముప్పుపెట్టి దోచుకుంటున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు సేకరించిన దానికి, మిల్లుల్లో ఉన్న ధాన్యానికి మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోంది ప్రతి మిల్లులు వేల బస్తాలతో దర్శనమిస్తున్నాయి. అవి కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చినవి కావు. సగానికిపైగా దళారుల ద్వారా మిల్లుకు చేరినవే కావడం గమనార్హం.

ఏకపక్షంగా సాగుతున్న కొనుగోలు ప్రక్రియ

వీరికి పట్టదు..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి. అదెక్కడా జరగట్లేదు. అధికారులు పర్యవేక్షిస్తూ.. పర్యటనలు చేస్తున్నా సిబ్బంది తీరులో మార్పు రావట్లేదు.

సరుబుజ్జిలి మండలం సూర్యనారాయణపురంలో ఓ రైతు నుంచి దళారులు కొనుగోలు చేసిన ధాన్యం

దోపిడీ జరుగుతోందిలా..

కొనుగోలు కేంద్రాల సిబ్బంది కంటే ముందుగానే దళారులు రైతును సంప్రదిస్తున్నారు. బస్తాకు రూ.1,500 నుంచి రూ.1,700 ఇచ్చేసి అదనంగా మూడు నుంచి నాలుగు కిలోల వరకు తూకం వేస్తున్నారు. దగ్గరుండి రైతు ద్వారానే మిల్లుకు తరలిస్తున్నారు. ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత దళారి తెలిపిన కొనుగోలు కేంద్రానికి వెళ్లి సంతకం చేసి.. ట్రక్ షీట్ జనరేట్ చేస్తున్నారు.

జిల్లాలో వివరాలిలా...

★ మొత్తం కొనుగోలు కేంద్రాలు: 406
★ ప్రారంభించినవి: 219
★ మిల్లులు: 264
★ షెడ్యూల్ చేసిన ధాన్యం: 49,108 మెట్రిక్ టన్నులు
★ సేకరించింది: 34,379 మెట్రిక్ టన్నులు

దళారుల ద్వారా మిల్లులకు చేరింది ఎక్కువగా ఇక్కడి నుంచే..

● **నరసన్నపేట(మండలం):** కంబకాయ, కరగాం, సత్యవరం
● **జలుమూరు:** చల్లవానిపేట, దూగాం, తిమడాం
● **పోలాకి:** ఈదులవలస, జడూరు, మాకివలస
● **సారవకోట:** బుడితి, బద్రి, చీడిపూడి, అవలింగి
● **ఎల్ఎన్‌పేట:** దబ్బపాడు, చిట్టిమండలం, కోవిలాం, తురకపేట, కృష్ణాపురం
● **సరుబుజ్జిలి:** కొత్తకోట, షళంత్రి, సరుబుజ్జిలి, గోనెపాడు, కొండవలస, రొట్టవలస, పురుషోత్తపురం.

వారికి చుక్కలు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా వెళ్లిన రైతుకు మిల్లర్లు చుక్కలు చూపిస్తున్నారు. పలు సాకులు చూపి ఏకంగా ఆరు కిలోలు తూకం వేస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయిస్తే అధిక లబ్ధి చేకూరుతుంది. లేదంటే నష్టపోతారు. నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం సేకరణ జరిగితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

- ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జేసీ

సారొచ్చారు.. సిబ్బందే రాలేదు..

ఎల్ఎన్ పేట(పెద్దకోట-1) సచివాలయాలన్ని డిప్యూటీ ఎంపీడీవో వెంకట అప్పలనాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10:45 గంటలకు ఆయన సచివాలయం వద్దకు వెళ్లినా.. అప్పటికీ ఒక్క ఉద్యోగి కూడా విధులకు రాలేదు. 11:15 గంటల తర్వాత ఒక్కొక్కరిగా వచ్చారు. దీంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయానికి వచ్చి సచివాలయం సమీపంలో అంతర్జాలంలో హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

ఈ నగరానికి ఏమైంది..?

- న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

ఒకప్పుడు పేదల ఊటీగా పిలుచుకునే శ్రీకాకుళం కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. రోజురోజుకీ గాలి నాణ్యత తగ్గిపోతోంది. తాజాగా హిందుపురం ఎంపీ బీకే పార్థసారథి లోక్‌సభలో కాలుష్యంపై అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఇచ్చిన సమాధానంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 2017 నుంచి 2025 మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 10 నగరాల్లో కాలుష్యం తగ్గితే.. శ్రీకాకుళం నగరంలో మాత్రం పెరుగుతున్నట్లు ప్రకటించారు.

వాయు కాలుష్య కోరల్లో జిల్లా కేంద్రం

నిధుల్లో కోత

సంవత్సరం	నిధులు (రూ.లలో..)
2020–21	3 కోట్లు
2024–25	2.57 కోట్లు
2025–26	96 లక్షలు

కాలుష్య నియంత్రణకు జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం కింద శ్రీకాకుళం నగరపాలక సంస్థకు 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులిస్తోంది. రోడ్ల అభివృద్ధితో పాటు వాయు కాలుష్య నియంత్రణకు మాత్రమే వాటిని వినియోగించాలి. నిబంధనల ప్రకారం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకుని.. కాలుష్యం తగ్గినట్లయితే అదనపు నిధులు మంజూరు చేస్తారు. నగరంలో పెరగడంతో నిధుల శాతం తగ్గిపోతుండటం గమనార్హం.

వాహనాల రాకపోకలతో రద్దీగా డే అండ్ నైట్ కూడలి

ఇవే ప్రధాన కారణాలు..

● ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాల నుంచి పెద్ద ఎత్తున పొగ విడుదల కావడం
● రహదారుల పక్కన బెర్ములు విడిచి పెట్టడంతో దుమ్ముధూళి ఎగిరి గాలిలో కలవడం
● ఇష్టానుసారం చెట్లను నరికేయడం
● జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎచ్చెర్ల, పైడి భీమవరంలోని పరిశ్రమల నుంచి గాలి కాలుష్యం

★ ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) ఆచార్యులు గతంలో ఓ నివేదిక ఇచ్చారు. వారు నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ఐదు హాట్ స్పాట్లుగా గుర్తించారు. ఎక్కువగా వాహనాలు తిరగడం, ప్లాస్టిక్, కుళ్లిన కూరగాయలు, ఇతర వ్యర్థాలతో నగరంలో వాయు కాలుష్యం పెరుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు.

నగరంలో వాయు కాలుష్యం ఇలా..(ప్రతి ఘనపు మీటర్‌లో మైక్రోగ్రాం ధూళికణాలు)..
2017–18: 76
2024–25: 101

★ అయినప్పటికీ అధికారులు కాలుష్య నియంత్రణలో విఫలమవుతూనే ఉన్నారు. ఎయిర్ ఇండెక్స్ ఏర్పాటుకు గతంలో తీసుకొచ్చిన పరికరాలు ఇంత వరకు అమర్చలేదు. పెట్రో వాహనాల స్థానంలో విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడట్లేదు.

ఇంటి నుంచే పాస్‌పోర్టు పొందొచ్చు..!

మీకోసం

- న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ఉన్నత చదువులు, ఉపాధి, పర్యాటక ప్రాంతాల సందర్శన ఇలా అనేక అవసరాలకు పాస్‌పోర్టు అవసరమవుతుంది. అది కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాలని చాలా మంది అనుకుంటారు. అవసరం లేదండీ.. ఇంటి నుంచే సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. అది ఎలాగో తెలుసుకుందాం రండి..

ఇదీ ప్రక్రియ..

★ ముందుగా https://www.passportindia.gov.in వెబ్‌సైట్‌లో మెయిల్ ఐడీ లేదా ఫోన్ నంబరుతో రిజిస్టర్ అయ్యాక దరఖాస్తు నింపాలి. ★ వ్యక్తిగత వివరాలు, చిరునామా, ఇతర వివరాలు నమోదు చేయాలి. ★ దరఖాస్తు సబ్మిట్ చేయగానే రిఫరెన్స్ నంబరు(ఏఆర్ఎన్) వస్తుంది. ★ పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.1000 చొప్పు రుసుము చెల్లించాలి. ★ ఆ తర్వాత ఏ రోజు, ఎన్ని గంటలకు, ఎక్కడి రావాలో సూచిస్తారు.

ఇవి మర్చిపోవద్దు

★ ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుతో పాటు జనన ధ్రువపత్రం ఉండాలి. ప్రభుత్వ సూచించిన 12 రకాల పత్రాల్లో ఏ ఒక్కటి తీసుకెళ్లినా చిరునామా గుర్తింపుగా పరిగణిస్తారు.

★ దరఖాస్తు ఫీజు చెల్లించిన రసీదుతో పాటు అన్ని ధ్రువపత్రాల అసలు, నకళ్లతో కేటాయించిన సమయానికి అరగంట ముందే పాస్‌పోర్టు సేవా కేంద్రానికి చేరుకోవాలి.

★ పత్రాలు పరిశీలించాక ఫొటో, వేలిముద్రలు తీసుకుని నంబరు కేటాయిస్తారు. అనంతరం పోలీసు విచారణ పూర్తయ్యాక.. అన్నీ సక్రమంగా ఉంటే ఎలక్ట్రానిక్ చిప్‌తో కూడిన పాస్‌పోర్టు ఇంటికే వస్తుంది.

అమ్మానాన్నకు ఇదే మా ఆహ్వానం..!

5న మెగా పీటీఎం-3.0

- న్యూస్‌టుడే, పొందూరు

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య నందించడంతో పాటు విద్యార్థులు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులు తెలుసుకునేలా సమావేశం నిర్వహించనున్నారు. పిల్లల ప్రగతి తెలియజేయడమే కాకుండా బడి అభివృద్ధికి ఏం చేయాలో సలహాలు తీసుకోనున్నారు. ఇందుకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సరైన వేదికగా భావిస్తున్నారు. ఈ నెల 5న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించేందుకు మార్గదర్శకాలు విద్యాశాఖ విడుదల చేసింది. గతంలో జులై 10న పీటీఎం-2.0ని నిర్వహించారు.

★ ఆరోజు ఉదయం తల్లిదండ్రులు, సామాజిక సేవకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులను సాదరంగా ఆహ్వానించి, పిల్లల వద్ద కూర్చోబెడతారు.

★ తల్లిదండ్రుల ఎదుటే వారి అభ్యసన సామర్థ్యాలపై మాట్లాడతారు. బోధనలో నూతన పద్ధతుల్ని వీడియోల రూపంలో ప్రదర్శిస్తారు. మంచి, చెడు స్పర్శ, నైపుణ్య ఆంధ్ర తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తారు.

★ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనతోపాటు సమావేశం ఉంటుంది. ప్రగతి నివేదికలు చదివి వినిపించి విద్యార్థులకు అందజేస్తారు.

★ సమావేశం పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు సూచనలు అందించాం. విజయవంతం చేసేలా పర్యవేక్షిస్తున్నాం. అని సమగ్రశిక్షా ఏపీసీ పి. వేణుగోపాలరావు తెలిపారు.

ఆర్జీయూకేటీలో మైనర్ డిగ్రీ కోర్సులు ప్రారంభం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో మైనర్ డిగ్రీ కోర్సులుగా ఈ ఏడాది నుంచి కొత్తగా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతాన్ని ప్రారంభిస్తున్నట్లు క్యాంపస్ డైరెక్టర్ డా. కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మంగళవారం కోర్సులను ప్రారంభించారు. మైనర్ డిగ్రీ ఇంజినీరింగ్ ద్వితీయసంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు కొనసాగుతుందన్నారు. వీటితోపాటు కృత్రిమ మేధ, క్వాంటమ్ టెక్నాలజీలపై తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులు ఆసక్తి మేరకు ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. చివరిలో ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు మైనర్ డిగ్రీ కూడా అందజేస్తామన్నారు.

అమ్మా.. అంతా బాగుందా..?

జిల్లాలోని 4 కేజీబీవీలను సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యదర్శి డి.దేవానంద్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విజయపథం, ముందుచూపు, 100 రోజుల ప్రణాళిక అమలుపై ఆరా తీశారు. శ్రీకాకుళం ఆర్అండ్‌బీఈ వసతి గృహంలో సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాలరావు, డీఈవో ఎ.రవిబాబు, అధికారులతో సమావేశమయ్యారు. లావేరు మండలంలోని మురపాక కేజీబీవీ విద్యార్థులతో కలిసి

- న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

తారుమారు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మట్టి రోడ్డు అనుకుంటే పొరబడినట్లే. ఇది అలికాం-బత్తిలి ప్రధాన రహదారి(తారు రోడ్డే). సరుబుజ్జిలి మండలం తమ్మినాయుడుపేట-అవతరాబాదు గ్రామాల మధ్య ఇలా తయారైంది. ఇటీవల వరి కోతల సమయంలో ఇక్కడ యంత్రాలను పొలాల్లో దింపారు. పనయ్యాక యంత్రాలు వచ్చే సమయంలో చక్రాలతో వచ్చిన మట్టి రోడ్డుపై పడింది. రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షానికి మట్టి ముద్దలు కరిగిపోవడంతో తారు రోడ్డు ఇలా మట్టి దారిగా మారింది. వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

(c) eenadu

తీరంలో ఆలివ్‌రిడ్లేల మరణ మృదంగం!

జిల్లాలోని పలు సముద్ర తీరాలకు కొన్ని రోజులుగా అరుదైన ఆలివ్‌రిడ్లేల కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. భావనపాడు, దేవునల్తాడ, మంచినీళ్లపేట, కొత్తపేట, అక్కుపల్లి, నువ్వలరేవు, డోకులపాడు, తోటూరు, రట్టి, ఇస్కలపాలెం, బారువ, గొలగండి తదితర తీరాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆయా తీరాలకు ఏటా డిసెంబరు మొదలు మార్చి ఆఖరి వరకు వేల కి.మీ. ప్రయాణం చేసి గుడ్లు పెట్టేందుకు చేరుకుంటాయి. ఈ క్రమంలో చేపల వేట సాగించే పెద్ద ఇంజిన్ బోట్లు, నిషేధిత వలలకు తగిలి మృత్యువాత పడుతున్నాయి. ఒడ్డున పడి ఉన్న కళేబరాలను కుక్కలు, కాకులు పీక్కుతింటుండటంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. చేపల ఉత్పత్తితో పాటు పర్యావరణానికి మేలు కలిగించే సముద్ర తాబేళ్ల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకే క్రీడలు

పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు

దివ్యాంగులకు ఆటల పోటీల ద్వారా ఆత్మవిశ్వాసం వృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబు అన్నారు. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి క్రీడామైదానంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల క్రీడలను ఆయన ప్రారంభించారు. ప్రతిభ చాటేందుకు పోటీలను వినియోగించుకోవాలని సమగ్రశిక్షా ఏపీసీ పి.వేణుగోపాల్ అన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.55.11 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామికి భక్తులు సమర్పించే మొక్కులు, కానుకల రూపంలో రూ.55.11 లక్షల ఆదాయం సమకూరింది. ఆలయ అనివెట్టి మండపంలో హుండీలను మంగళవారం భక్తులు, దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించారు. కొందరు పలు దేశాలకు చెందిన కరెన్సీని సైతం సమర్పించారు. 45 గ్రాముల బంగారం, 992 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ అధికారులు ప్రసాద్‌బాబు, జి.గురునాథరావు, పి.శ్యామలరావు, సుకన్య ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ప్రజారోగ్యం విషయంలో రాజీ పడబోం

తాళ్లవలసలో ఓ ఇంటి వద్ద చేసిన నీటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రజారోగ్య విషయంలో రాజీ పడబోమని మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో మంగళవారం ఆయన పర్యటించారు. అతిసార లక్షణాలతో బాధపడుతున్నవారిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.60 లక్షలతో ట్యాంక్ ఏర్పాటు చేసి, ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని మంత్రి ప్రకటించారు. కలెక్టర్ అధికారులు, వైద్య సిబ్బందితో ఊరంతా తిరిగారు. గ్రామంలో నేల బావితో పాటు నాలుగు చోట్ల స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా తాగునీటి పరీక్షలను పర్యవేక్షించారు. ఎటువంటి సమస్య లేదని ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శి విజయ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 8 మంది ఆరోగ్యంగా ఉన్నారని, వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు చేపట్టి నివేదిక అందించాలని డీఎంహెచ్‌వో కె.అనితను కలెక్టర్ కోరారు. టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఉన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

కాసారంపై కబ్జాదారుల కన్ను..!

– న్యూస్‌టుడే, హిరమండలం

హిరమండలం తుంగతంపర గ్రామ పరిధిలోని పెద్దచెరువు కబ్జాకు గురవుతోందని గ్రామస్థులు, ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలో వంశధార నదికి కుడివైపున ఎల్పీ సంఖ్య 3, సర్వే సంఖ్య 1లో 52.46 ఎకరాలు, మరికొన్ని సర్వే నంబర్లలో 22 ఎకరాల్లో చెరువు ఉంది. ఈ భూమి 22ఏలో నమోదై ఉంది. 2015లో స్థానికుల విశాఖకు చెందిన ఒక వ్యక్తికి దీన్ని లీజుకిచ్చారు. గ్రామాభివృద్ధికి కొంత సొమ్ము ఇచ్చేలా అప్పట్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐదేళ్ల తర్వాత అదే వ్యక్తికి మళ్లీ లీజుకిచ్చారు.

పెద్ద చెరువు

పాసుపుస్తకాల మంజూరుకు దరఖాస్తు

ఇటీవల కాసారం వద్ద ఈ భూమికి సంబంధించి ట్రిబ్యునల్‌లో కేసు ఉందని, కొంతమంది వ్యక్తులు ఒక బోర్డు ఏర్పాటు చేయడాన్ని గుర్తించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. పెద్ద చెరువుగా పిలవబడే 74 ఎకరాలు భూమి తాము కొనుగోలు చేశామని, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని తహసీల్దారు కార్యాలయంలో కొంతమంది వ్యక్తులు కొద్ది నెలల కిందట దరఖాస్తు చేసినట్లు గుర్తించారు.

దర్యాప్తునకు డిమాండ్

చెరువు కబ్జాకు గురవుతున్నట్లు గుర్తించిన స్థానికులు ఇటీవల టెక్కలి ఆర్డీవోను కలిసి సమస్యను తెలియజేశారు. దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఇంతవరకు ఎటువంటి కదలిక లేకపోవడం గమనార్హం.

హక్కులు కల్పించలేదు

తుంగతంపర గ్రామ సమీపంలో ఉన్న భూమి కొనుగోలు చేశామని, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కొంతమంది వ్యక్తులు దరఖాస్తు చేశారు. అది రెవెన్యూ దస్త్రాల్లో ప్రభుత్వ భూమిగానే నమోదై ఉంది. దీంతో ఎటువంటి హక్కులు కల్పించలేదు.

– ఎన్ని జోగారావు, తహసీల్దారు, హిరమండలం

5 నుంచి రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు పన్నాల నరసింహమూర్తి, బంటుపల్లి రామచంద్రదేవ్ ప్రకటనలో తెలిపారు. బాపూజీకళా మందిరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఆహ్వాన నాటిక పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు రెండు ప్రదర్శనలుంటాయని వారు తెలిపారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ధర్మారావు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కాశీబుగ్గకు చెందిన లక్కోజు ధర్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీకాకుళంలో మంగళవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ధర్మారావుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ధర్మారావుకు నియామక పత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

వైద్య విద్యలో కార్యశాలలదే కీలకపాత్ర

వైద్య విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రసన్నకుమార్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వైద్య విద్యలో కార్యశాలలదే కీలకపాత్ర అని ఎముకల విభాగాధిపతి ఆచార్యులు ప్రసన్నకుమార్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంగ్నాన్ అకడమిక్ ఫెస్ట్‌లో భాగంగా ఆర్థో విభాగంలో కార్యశాలలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను కార్యశాలల ద్వారా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. 50మంది వైద్య విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో వైద్యులు అచ్యుతరావు, సీనియర్ రెసిడెంట్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ ప్లాంట్ ఆలోచన విరమించకుంటే పోరాటం తప్పదు

మాట్లాడుతున్న వాబయోగి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ థర్మల్‌పవర్ ప్లాంట్ ప్రతిపాదన విరమించుకుంటే ఆదివాసీల పోరాటం తప్పదని థర్మల్‌పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ వాబయోగి హెచ్చరించారు. మంగళవారం స్థానిక అమ్మా కల్యాణ మండపంలో మాట్లాడారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాలను ఎడారి చేయాలని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఆలోచన విరమించుకోవాలని హితవు పలికారు.

వృద్ధురాలిని హతమార్చారా..?

వడ్డి పార్వతమ్మ

లావేరు, న్యూస్‌టుడే: పొలంలో ఉన్న ఆవులకు మేత తీసుకెళ్లిన వృద్ధురాలు పార్వతమ్మ(65) అదృశ్యమైన ఘటన లావేరు మండలం మురపాకలో జరిగింది. సోమవారం ఉదయం 11.30 గంటలకు వెళ్లిన ఆమె 3 గంటలు అవుతున్నా మేత తీసుకుని రాకపోవడంతో ఓ మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుమారుడు చేరుకుని సమీపంలోని తోటలు, ఇతర చోట్ల గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి మెడలో రెండున్నర తులాల బంగారం ఉందని పొలంలో ఒక చోట విరిగిన గాజులు, చెప్పులు, రక్తపు మరకలు ఉన్నట్లు పేర్కొన్నారు. లావేరు, రణస్థలం ఎస్సైలు కె.అప్పలసూరి, ఎస్.చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాలు సేకరించారు. పార్వతమ్మ మెడలో ఉన్న బంగారం కాజేసేందుకు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూర్జలో చోరీ

బూర్జ, న్యూస్‌టుడే: బూర్జలోని వడ్డి వీధిలో సోమవారం రాత్రి ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. యజమాని వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని రమేష్.. భార్య, పిల్లలతో శనివారం సాయంత్రం విశాఖ వెళ్లారు. అనంతరం శ్రీకాకుళం వచ్చి బంధువులతో కలిసి పాడేరు, అరకు ప్రాంతాలను సందర్శించి సోమవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. రవాణా వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో అక్కడ ఉండి మంగళవారం ఇంటికి వచ్చారు. తలుపు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా చోరీకి గురైన ఆనవాళ్లు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సత్యనారాయణ, ఆమదాలవలస ఎస్సై బాలరాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రధాన వీధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. 6 తులాల బంగారం, 23 తులాల వెండి, రూ.లక్ష నగదు పోయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. 40 ఏళ్లుగా అల్పాహార దుకాణాన్ని నడుపుతూ సంపాదించిన సొమ్ము పోవడంతో బాధిత కుటుంబం వేదనలో మునిగిపోయింది.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తప్పిన పెను ప్రమాదం..!

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న పోర్టు వాహనం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం కూర్మనాథపురం గ్రామస్థులు పోర్టు వాహనాలను అడ్డుకుని ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామ ప్రవేశమార్గంలో ఇటీవల పోర్టు రైల్వే లైన్ ఏర్పాటుకు మట్టి తరలింపు పనులు చేపడుతున్నారు. టిప్పర్ వాహన చోదకులు తరచూ విద్యుత్తు స్తంభాలను ఢీకొనడంతో ట్రిప్పయి గృహోపకరణాలు దగ్ధమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం పోర్టు టిప్పర్ వాహనం విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీకొని వేలాడుతున్న తీగలను ఒక్కసారిగా లాగేయడంతో పలువురి ఇళ్లల్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. అక్కడే భూమి కొలతలు తీస్తున్న సిబ్బందితో పాటు నౌపడ సర్పంచి ప్రతినిధి రవి కుమార్‌రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. దీంతో గ్రామానికి చెందిన మహిళలు, యువత డీపీఎన్ రహదారి మార్గంలో రాకపోకలు చేస్తున్న పోర్టు టిప్పర్ వాహనాలను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం, సిబ్బంది అక్కడికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. పోర్టు యాజమాన్యం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని వారంతా డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన పోర్టు టిప్పర్ వాహనం అక్కడే ఉంచడంతో వారంత శాంతించి వెనుదిరిగారు.

పోర్టు వాహనం వద్ద గుమిగూడిన కూర్మనాథపురం గ్రామస్థులు

శునకాల దాడిలో 42 గొర్రెలు, మేకలు మృతి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కొంచాడ గ్రామంలోని కుక్కల దాడిలో 42 గొర్రెలు, మేకలు మంగళవారం మృతి చెందాయి. వర్షం పడుతుందన్న ఉద్దేశంతో కురమాన రమణ, రాములమ్మ దంపతులు కళ్లంలోని పశువుల శాలలో మేకలను కట్టేయగా శునకాలు దాడి చేసి చంపేశాయి. కాసేపటి తర్వాత ఘటనా స్థలానికి వెళ్లిన వీరు నిర్జీవంగా పడి ఉన్న జీవాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

గిరిజనుల నిరసన

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస వద్ద నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్ తమకు వద్దని గిరిజనులు నిరసన తెలిపారు. మంగళవారం వెన్నెలవలస గ్రామంలో ప్రతిపాదన ప్రతులను మంటల్లో దహనం చేశారు.

వెన్నెలవలస వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

కృత్రిమ మేధస్సు విద్యార్థులకు చేరువ చేయాలి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధస్సును విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా శ్రీకాకుళం మహిళా కళాశాలలో మంగళవారం కార్యశాల నిర్వహించారు. ఏఐ టూల్స్, అనువర్తనాలు అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అవధుల్లేని స్థాయికి తీసుకెళ్లేందుకు ఏఐ సాధనంగా వినియోగించుకోవచ్చన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు విద్య, పరిశోధన, కంటెంట్ తయారీ, డేటా విశ్లేషణ, ప్రజెంటేషన్ రూపకల్పన వంటి అనేక అంశాల్లో మెలకువలు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు, కె.స్వరూప, కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ పద్మావతి పాల్గొన్నారు.

EENADU Classifieds

HEALTH & CARE

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలెక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలెంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే

ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255
9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే ప్రతి ఆదివారం శెలవు

PROFESSIONAL SERVICES

ASTROLOGY
Vastu Consultants Genuine India's Best Vastu for Industries / Houses Rural / Urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

PLOT FOR SALE
ఆమదాలవలస టౌన్, వెంగళరావు కాలనీ, రోడ్డు పాయింట్, షాపులు లేదా ఇల్లుకై 42x12.5, పిల్లర్స్‌తో పునాదులు సేల్ ✆ 7989280721.

JOBS
విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్ M/F (200) కావలెను. జీ॥ 18-40K + Inc. ✆ 9804454445, 9989360902.
Wanted Collection Telecallers & Field Executives for Bank. Experience and Freshers can whatsapp your detail 7207502157.

RDMS ప్రమోటర్స్‌లో సొంత మండలంలో ఉంటూ పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9492266133.
శ్రీకాకుళంలోని ఇంటర్నెట్ సెంటర్‌లో పనిచేయుటకు పురుష మరియు మహిళా కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ప్రొఫైల్ ఆధారంగా జీతం ఇవ్వబడును. సంప్ర: 9000657516.
శ్రీకాకుళం ప్రముఖ సోలార్ ఆడ్రెజ్ డిస్ట్రిబ్యూటర్ సందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ TA+DA ✆ 8985834777, 8919884223.
E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 9704146558.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిం దిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సొంతింటి కల నెరవేర్చుకోండి..

దరఖాస్తు చేయండి..

ఈనెల 14వ తేదీ వరకూ గడువు పొడిగింపు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లులేని పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం లబ్ధిదారులను గుర్తించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0లో (పీఎంఏవై-జి) ఇళ్లు మంజూరుకు ఆవాస్ + 2024 పేరుతో సర్వే చేపడుతోంది. సర్వే గడువు నవంబరు 30వ తేదీతో ముగిసింది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేకపోయారు. వారంతా తమకు అవకాశమివ్వాలని కోరటంలో ఈనెల 14వ తేదీ వరకూ గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలం ముద్దాడలో సర్వే చేస్తున్న గృహనిర్మాణ సంస్థ, సచివాలయ సిబ్బంది

నియోజకవర్గం	వచ్చిన దరఖాస్తులు
శ్రీకాకుళం	4.708
ఆమదాలవలస	7,979
పాతపట్నం	7,437
ఎచ్చెర్ల	9,671
టెక్కలి	6,061
ఇచ్ఛాపురం	6,133
నరసన్నపేట	8,331
పలాస	5,695
మొత్తం -	56,015

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్లున్న వారికే స్థలం, ఇల్లు మంజూరయ్యాయి. జగనన్న కాలనీల్లో ఆరేళ్లు పూర్తవుతున్నా నేటికీ సగం మంది లబ్ధిదారులు కూడా ఇళ్లు నిర్మించుకోలేదు. ఈ పరిస్థితిని మార్చి అర్హులకు గృహాలు మంజూరు చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సర్వే చేసి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీరందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునేందుకు దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత నిర్ధయించేందుకు సర్వే చేస్తున్నారు. స్థలం లేకున్నా వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తుకు జత చేయాల్సినవి

సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవాలని అనుకునే వారు గ్రామ సచివాలయంలోని ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించి దరఖాస్తు అందజేయాలి. ఇంటి స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్, రేషన్, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు, బ్యాంక్ ఖాతా ధ్రువ పత్రాలు దరఖాస్తుకు జతచేయాలి.

యూనిట్ విలువ

సొంత స్థలంలో పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుంది. ఇంటి నిర్మాణానికి రూ.1.20 లక్షలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు, ఉపాధి పథకం కింద రూ.27 వేలు అందజేస్తారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తం జతచేసి పథకం మంజూరు చేస్తుంది. ఎంతనేది ఇంకా నిర్ణయించలేదు. గడిచిన కొన్ని రోజుల నుంచి సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తుండగా లబ్ధిదారుల రద్దీ నెలకొంది. దరఖాస్తులను సచివాలయ సిబ్బంది యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

అర్హులకు అవకాశం

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులకు ఇదో మంచి అవకాశం. తమ పేర్లు నమోదుచేసుకొని సంబంధిత ధ్రువపత్రాలు అందజేయాలి. గడువు పెంపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – బి.రమాకాంతారావు, పీడీ, జిల్లా గృహనిర్మాణ సంస్థ

భమిడిపాటి రచనల ప్రచురణపై అభినందన

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: యూజీసీ నిర్వహణలో వెలువడే ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ రీసెర్చ్ నవంబరు సంచికలో తన రచన ప్రచురించినట్లుగా ఆ సంస్థ సమాచారమిచ్చిందని భమిడిపాటి గౌరీ శంకర్ తెలిపారు. అనేక కథలు, వ్యాసాల డిగ్రీ, యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కోర్సులకు తెలుగు మెటీరియల్ రాసిన గౌరీ శంకర్ శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేట గాయత్రి కళాశాలలో తెలుగు అధిపతిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపల్ కె.వి.వి.సత్యనారాయణ అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మణెమ్మకు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ డిమాండ్ చేశారు. పది ప్రధాన అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఐసీడీఎస్ నోడల్ అధికారిణి మణెమ్మకు జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం అమలు, మినీ వర్కర్లకు విద్యార్హతల సడలింపు చేసి మెయిన్‌గా మార్చాలని, ఉద్యోగోన్నతుల్లో నిర్దిష్టమైన నిబంధనలు పాటించాలని తదితర డిమాండ్లు తెలియజేశారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీసు తప్పనిసరి: కలెక్టరు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీసు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ విభాగాల వారీగా దస్త్రాల పరిష్కారంపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సంక్లిష్టమైనవి, ఆర్థికాంశాలతో ముడిపడిన దస్త్రాలే తప్ప తక్కినవన్నీ త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో వెనకబడిన ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస మున్సిపాలిటీలు, ఏపీఎస్ఐడీసీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సోమవారం నాటికి ప్రగతి కనబర్చకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాళ్లవలస ఘటనపై మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రభుత్వ విభాగాలు అప్రమత్తం కావాలని, ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ధాన్యం సేకరణ, రవాణా, తుపాను తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణానికి భూసేకరణ చేయాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ఊసవానిపేట సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై రైల్వేగేటు వద్ద రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి భూసేకరణ వేగవంతం చేయాలని తహసీల్దారు రాంబాబును సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. అధికారులతో కలిసి రైల్వేగేటు నుంచి కృష్ణాపురం, ఊసవానిపేట వరకూ స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ, రైల్వే అధికారులు ఉన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

పార్కింగ్ స్థలం కాదు.. పర్యాటక తీరం..

ఈ చిత్రం చూసి ఇదేదో పార్కింగ్ స్థలం అనుకుంటున్నారా.. కాదండీ బాబూ.. అక్కుపల్లి శివసాగర తీరం. ఇక్కడ మత్స్యకారుల విశ్రాంతి భవనం వద్ద పర్యాటకులు తీసుకొచ్చిన వాహనాలు ఇలా నిలిపివేశారు. ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో నేరుగా వాహనాలతో తీరం లోపల వరకు వచ్చేస్తున్నారు. దీంతో పిక్‌నిక్‌లకు పెద్ద సంఖ్యలో తరలొచ్చిన సందర్శకులకు అవస్థలు తప్పడం లేదు. గంటలకొద్దీ ఇక్కడ చిక్కుకొని నరకయాతన అనుభవిస్తున్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

బాగా మాట్లాడారు..

విద్యార్థులు మనసులోని భావాలు చెప్పేందుకు భయం వీడాలని సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డి.పద్మజీ, డైరెక్టర్ కామేశ్వరరావు అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులపై ఇంటర్ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో కె.మనీషా (ద్వితీయ ఇంటర్), ఎం.లహరి (ద్వితీయ), బి.మోహిని(ప్రథమ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్, డైరెక్టర్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. అధ్యాపకుడు వజ్జ మురళీరామ్ పాల్గొన్నారు.– న్యూస్‌టుడే, పలాస

ఓబీసీ విభాగంలో దువ్వాడకు గుర్తింపు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఓబీసీ విభాగం జాతీయ సమన్వయకర్తగా కాశీబుగ్గకు చెందిన **దువ్వాడ జీవితేశ్వరరావు**ను అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు ఓబీసీ విభాగం ఛైర్మన్ అనీల్ జైహింద్, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడినట్లు జీవితేశ్వరరావు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి పాటల పోటీలు

సోంపేట, న్యూస్‌టుడే: దత్తాత్రేయస్వామి 71వ వార్షికోత్సవం సందర్భంగా పలాసపురంలో ఈనెల 4న జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. నగదుతోపాటు ఇతర బహుమతులు అందజేస్తామని, ఆసక్తిగల వర్ధమాన గాయకులు 91337 31962, 94935 78025 చరవాణి నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ నెల 3 నుంచి 5 వరకు దత్తాత్రేయ ఉత్సవాలు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

ప్రధాన రోడ్లా.. మరుగుదొడ్లా..!

బహిరంగ మలవిసర్జనతో అవస్థలు

– న్యూస్‌టుడే, సోంపేట

రహదారుల పక్కన బహిరంగ మలవిసర్జనతో దుర్వాసన మధ్య రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఆయా గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రధాన మార్గాల పక్కనున్న కొన్ని గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇంట్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా ఆరుబయట అలవాటు పడటంతో సమస్యలు పెరుగుతున్నాయి. వర్షాలు పడితే పరిస్థితి మరీ దారుణంగా తయారవుతోంది. దీన్ని కట్టడి చేయడానికి పంచాయతీ స్థాయిలో ప్రత్యేక చర్యలు అవసరం.

❖ సోంపేట-కవిటి-ఈదుపురం, సోంపేట-బారువ, ఇచ్ఛాపురం నుంచి పురుషోత్తపురం మీదుగా వెళ్లే ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. సోంపేట, బారువ, ఇతర పంచాయతీలకు సంబంధించిన శ్మశాన వాటికలకు వెళ్లి రావాలంటే సాహసం చేయాల్సిందే. ఆయా మార్గాలతోపాటు శ్మశాన వాటికలు మలవిసర్జనతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితి వల్ల ప్రధాన మంచినీటి చెరువులూ కలుషితమవుతున్నాయి. రోగాలు విజృంభిస్తున్నాయి.

కిడ్నీ వ్యాధులకు కారణం..

❖ ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు ఇకోలి బ్యాక్టీరియా కారణమని ఆంధ్ర యూనివర్సిటీ పరిశోధకులు స్పష్టం చేశారు. ఉద్దానం ప్రాంతంలో ఎక్కువగా బహిరంగ మలవిసర్జన చేస్తుండటంతో కిడ్నీ వ్యాధులు సోకడానికి ఓ కారణంగా పేర్కొన్నారు. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించకపోవడం దురదృష్టకరం. ఎస్-కె-ఈ రోడ్డు పక్కనున్న గ్రామాల్లో ఎక్కువ శాతం కిడ్నీ వ్యాధిగ్రస్తులుండటానికి ఇకోలి కారణమై ఉండొచ్చని ఏయూ పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

అవగాహన కల్పిస్తాం..

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉన్నప్పటికీ ప్రజలు బహిరంగ మలవిసర్జనకు పాల్పడటం శోచనీయం. ఈ విషయమై పంచాయతీల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మరుగుదొడ్లు వినియోగించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– ఐ.వి.రమణ, డివిజనల్ పంచాయతీ అధికారి, టెక్కలి

అధిక సమస్యలుండే ప్రాంతాలు

❖ సోంపేట మండలం జింకిభద్ర, ఇసకలపాలెం, గొల్లగండి, కొర్లాంతోపాటు తీర ప్రాంతంలో బహిరంగ మలవిసర్జన ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. కంచిలి మండలంలో పురుషోత్తపురం, ఎస్ఆర్‌సీపురం, తలతంపర, కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ పరిధిలో రహదారుల మీదుగా ప్రయాణం సాగించాలంటే దుర్వాసన భరించాల్సి ఉంటుంది.

❖ ఇచ్ఛాపురం మండలంలో కేదారిపురం, హరిపురం, తేలుకుంచి, ఇచ్ఛాపురం పుర పరిధిలో పురుషోత్తపురం, కవిటి మండలంలో మాణిక్యపురం, బల్లిపుట్టుగ, బీజీపుట్టుగ, నెలవంక, తిప్పనపుట్టుగ, రాజపురం, కొజ్జిరియా రహదారుల మీదుగా రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

సమస్య: ఆసుపత్రి రోడ్డులో వేగనియంత్రికలు శిథిలమై, ప్రమాదకరంగా మారాయి. **- ఎల్.సింహాచలం, ఇచ్ఛాపురం** **సమాధానం:** అవి అవసరం లేని పక్షంలో తొలగిస్తాం. **- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం దానగోరలోని పాఠశాల సమీపంలో కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు** **సమాధానం:** త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, తర్లాకోట** – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

సమస్య: మంగళవారంపేటలో కల్వర్టు వద్ద అప్రోచ్ సరిగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. **- పి.వెంకటరావు, ఇచ్ఛాపురం** **సమాధానం:** నిధులు కేటాయించాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. **- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పొదల తొలగింపు

స్పందనకు వందనం

కస్పా గౌడవీధి నుంచి కృష్ణసాగర్‌కు వెళ్లే మార్గంలో ఇబ్బందికరంగా ఉన్న ముళ్ల పొదలు, పనికిరాని మొక్కలను పూర్తిగా తొలగించారు. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానికులు పురాధికారులకు నివేదించారు. దీనిపై స్పందించిన కమిషనర్ రమేష్, పుర సిబ్బంది ద్వారా సమస్యను పరిష్కరించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇరుకు.. వెళ్లాలంటే బెరుకు

రత్తకన్న శివారులోని భీమసముద్రం గెడ్డ వంతెనకు ఇరువైపులా రక్షణ గట్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఇరుకురోడ్డు.. అంచులోనే గెడ్డ ఉంది. ఎదురుగా వస్తున్న ఆటోలను తప్పించే క్రమంలో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనం వస్తే, దాని పక్కనుంచి నడిచి వెళ్లేందుకు ఇబ్బంది. సమస్యను పరిశీలించి, ప్రతిపాదనలు పంపిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ డి.విక్రమ్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కాలువ లేక పాట్లు

రెంటికోటలోని పొందర వీధిలో ఒక పక్క కాలువ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాడుకనీరు రోడ్డు మీదే ప్రవహిస్తోందని, చిన్నపాటి వర్షం పడినా నీరు నిల్వ ఉండి బురదమయంగా తయారవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సద్గుణ దృష్టికి తీసుకెళ్లగా కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఆగాయి నీళ్లు... పెరిగాయి పొదలు

పద్రిపుట్టుగ కాలనీ వద్ద గత తెదేపా హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల పథకం కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. దీంతో చుట్టూ పచ్చని పొదలు ఏపుగా పెరిగాయి. సుదూర ప్రాంతం నుంచి శుద్ధ జలం తెచ్చుకుంటున్నామని, పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీన్ని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

చెత్త నిండింది.. మురుగు పారనంది

పలాస అన్నపూర్ణ థియేటర్ నుంచి విద్యావాహిని కళాశాలకు వెళ్లే రహదారిలోని కాలువల్లో చెత్త పడేస్తున్నారు. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోతోంది. సమీప ఇళ్ల నుంచి చెత్త వేస్తుండటంతో ఇబ్బందిగా మారుతోందని, వ్యర్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య పనులు చేపడతామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పలాస

మార్పు కోసం మహిళల ముందడుగు

వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలు ముందడుగు వేస్తున్నారని వెలుగు ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. మండలంలో మహిళా సంఘాలకు లింగ ఆధారిత వివక్షత వ్యతిరేకంగా క్రియాశీల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస

కార్యకర్తలే తెదేపాకు బలం

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కార్యకర్తలే తెదేపాకు బలమని పార్టీ మండల పరిశీలకుడు, పలాస ఏఎంసీ ఛైర్మన్ మల్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎంఎస్‌పల్లి, కంచిలిలోని పలు వార్డుల్లో పర్యటించారు. 2024 ఎన్నికల్లో తెదేపాకు తక్కువ ఓటింగ్ నమోదైన 182, 183, 184, 198 ఓటింగ్ బూత్‌లను సందర్శించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

తోటి న్యాయవాదులకు, జడ్జీలకు, బార్ అసోసియేషన్ సభ్యులకు, కోర్టు సిబ్బందికి, సీనియర్ న్యాయవాదులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు "న్యాయవాదుల దినోత్సవ" శుభాకాంక్షలు...

యవ్వారి హేమకుమార్, B.A.B.L, న్యాయవాది, పలాస

సెల్: 9440592204

గ్రిగ్స్ పోటీల్లో సత్తా

పెద్దకర్రివానిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రిగ్స్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. బాలికల సీనియర్స్ విభాగంలో ద్వితీయస్థానం కైవసం చేసుకొని నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని ప్రధానోపాధ్యాయుడు ఎం.మురళీప్రకాష్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను అభినందించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

రెడ్డిక సామాజికవర్గ అభ్యున్నతికి అవకాశం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఏపీ రెడ్డిక కార్పొరేషన్ అధ్యక్షుడిగా బెల్లుపడ ప్రాంతానికి చెందిన కొండ శంకర్‌రెడ్డిని నియమించడంతో రెడ్డిక అభ్యున్నతికి అవకాశం లభించిందని సామాజికవర్గ పెద్దలు కొనియాడారు. బెల్లుపడ పంచాయతీ ప్రాంగణంలో మంగళవారం శంకర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా బెల్లుపడ రైతులు వరదముంపును తప్పించే విధంగా గట్టు నిర్మాణం, బాహుదా గ్రోయిన్ల అభివృద్ధి, రైతు సేవా కేంద్ర భవన నిర్మాణం తదితర సమస్యలను ఆయనకు వివరించారు. వీటిపై ప్రభుత్వ విప్ ఇప్పటికే దృష్టి సారించారని, ప్రణాళికాబద్ధంగా అన్ని పనులూ జరుగుతాయని శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. రెడ్డిక సమాజం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వానికి నివేదించి, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. నీటి సంఘం అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి ఆశీ లీలారాణి, పెద్దరెడ్డి దొడ్డబాబురెడ్డి, కార్యదర్శి బాల్లరెడ్డి, మాజీ పెద్దరెడ్డి కేశవరావు, రామారావు, భాస్కర్, రమణ పాల్గొన్నారు.

కొండ శంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న బెల్లుపడ రెడ్డిక పెద్దలు, యువకులు

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతో ప్రగతిపథం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు చక్కటి సౌకర్యాలతోపాటు భవితకు ఉపకరించే కోర్సులు అందిస్తోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు అన్నారు. ఇంటర్‌లో ప్రవేశాల కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కళాశాలలో అందించే బోధనాంశాలు, పథకాలు వివరించారు. నీట్, ఐఐటీ తదితర పోటీ పరీక్షలకు అవసరమైన విద్యా సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అధ్యాపకులు రమేష్, సురేష్, సురేష్‌కుమార్, ప్రధాన్, రవిరెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

కళాశాలలో లభించే సౌకర్యాలు, విద్యాప్రగతిని వివరిస్తున్న ప్రిన్సిపల్ శరత్‌బాబు

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోండి

పలాస పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ఆవశ్యకత ఎంతో ఉందని, ప్రతి విద్యార్థి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.వెంకటలక్ష్మి సూచించారు. కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయాధికారి బి.నరసింహులు, అధ్యాపకులు వై.వెంకటలక్ష్మి, పి.తారకేశ్వరరావు, హేమరాజు, పి.వి.సత్యనారాయణ, ఎం.హేమాచలం, బి.ప్రసాదరావు, వై.రాజేష్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యం కాపాడాలి

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ సాగులో భాగంగా పొడి దుక్కిలో మినుము, కంది, గోంగూర, తోటకూర వంటి విత్తనాలు జల్లడం ద్వారా భూమిలో జీవ వైవిధ్యం వృద్ధి చెంది ప్రధాన పంటకు ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. ఈ మేరకు మంగళవారం అంపురంలో రైతులకు పొడి దుక్కు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ అంతర పంటలతో భూమిలో తేమ శాతం పెరిగి సారవంతమవుతుందన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) కార్యక్రమంలో భాగంగా రెండోరోజు విద్యార్థులు స్థానిక పుచ్చవీధి, గొల్ల, బజారు, సాయిరాం వీధుల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. రహదారులకు ఇరువైపులా పొదలు తొలగించి పరిసరాలు శుభ్రం చేశారు. మురుగు నీటి కాలువల వద్ద బ్లీచింగ్ వెదజల్లారు. తెలుగు అధ్యాపకులు కేశవరావు వాలంటీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ రమేష్, క్యాంప్ పీవో రూప్‌సుందర్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పురస్కార గ్రహీతలకు అభినందన

ఇటీవల విశాఖపట్నంలో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక కళా రంగం విశిష్ట సేవలందించిన ఈదుపురం గ్రామానికి చెందిన నర్తు గంగయ్య, బొరివంకకు చెందిన మద్దిలి కేశవరావు పురస్కారాలు పొందారు. ఈ సందర్భంగా తిప్పనపుట్టుగలో వీరిని మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ మంగళవారం అభినందించారు. టి.ధనుంజయ, లక్ష్మణమూర్తి, టి.దాలయ్య, రామారావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నిక

యూటీఎఫ్ ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా సాగాయి. కవిటి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో జి.జానకిరావు అధ్యక్షతన కొర్రాయి రామారావు, దుదిష్టి రౌతో సమక్షంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా మామిడి శ్రీను, అధ్యక్షుడిగా నారద కామేష్, ప్రధాన కార్యదర్శిగా టి.సూర్యం, సహాధ్యక్షులుగా ఏవీ రమణ, సుజాత, కోశాధికారిగా ఎస్.శ్రీధర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి జిల్లా కార్యదర్శి మురళీ ప్రకాష్, అధ్యక్షుడు బాబూరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కళాశాల పోరాటానికి సంఘీభావం

మందస, న్యూస్‌టుడే: మందస జూనియర్ కళాశాలను సంరక్షించుకోడానికి మందస ప్రజలు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వామపక్ష నాయకులు తెలిపారు. ఈ మేరకు ప్రిన్సిపల్ తేజేశ్వరరావుతో తాజా పరిస్థితులపై చర్చించారు. వామపక్ష నాయకులు రామారావు, నర్సింగరావు, మాధవరావు, జ్యోతి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం.. కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: గొండ్యాలపుట్టుగకు చెందిన రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబం, తండ్రి మృతితో ఇద్దరు చిన్నారులు రోడ్డున పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు రూ.20,500 నగదును బాధిత కుటుంబానికి అందించారు.

పరామర్శ.. కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి కాలనీలో పి.శ్యామ్, బెజ్జిపుట్టుగకు చెందిన బి.హైమావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు జనసేన రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ ఆయా కుటుంబాలను పరామర్శించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

21 మంది మందుబాబులకు జరిమానా

కాశీబుగ్గ: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో ముగ్గురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి మాధురి మంగళవారం తీర్పు ఇచ్చారని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసుల్లో 18 మందికి రూ.1000 చొప్పున జరిమానా విధించారని సీఐ తెలిపారు.

ఆదాయ వృద్ధికి రుణాలు

మందస, న్యూస్‌టుడే: మహిళా స్వయంశక్తి సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రాప్తికి ఆదాయ వృద్ధి కార్యక్రమాలకు రుణాలు మంజూరు చేయనున్నట్లు గ్రామీణాభివృద్ధి ప్రాంతీయ మేనేజరు ఎల్.అనంతరావు పేర్కొన్నారు. మందసలో మంగళవారం వెలుగు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రుణాలకు సంబంధించి పలు విషయాలు చెప్పారు. వెలుగు ఏపీఎం కూర్మారావు, మందస గ్రామీణ బ్యాంకు మేనేజరు జనార్దనరావు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ఉమాపతి

పలాస గ్రామీణం: పలాస డిప్యూటీ ఎంపీడీవో(గ్రామ సచివాలయాలు)గా సవర ఉమాపతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు టెక్కలి డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఉమాపతిని ఎంపీడీవో వసంతకుమార్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు అభినందించారు. పంచాయతీ కార్యదర్శులు సద్గుణ, సుధాకర్, రవి, రేవతీపతి, ఖగేశ్వరరావు, ఆశ, మీనా మర్యాదపూర్వకంగా కలిశారు.

నారీ శక్తిపై అవగాహన.. కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో మహిళల ఆత్మ గౌరవానికి, భద్రతకు అధిక ప్రాధాన్యం ఉంటుందని సీఐ మంగరాజు, ఎస్సై పారినాయుడు పేర్కొన్నారు. కర్తలిలో మంగళవారం సాయంత్రం నారీ శక్తిపై మహిళలకు అవగాహన కల్పించారు.

సదుపాయాలు అడగకండి

– న్యూస్‌టుడే, పలాస

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో నిత్యం వేలాదిమంది ప్రయాణికులతో కిటకిటలాడే కాశీబుగ్గ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. తెల్లవారుజాము 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు ఈ బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల కోసం వేచి ఉండే సమయాల్లో కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు.

❖ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు వేచి ఉండేందుకు బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా కేవలం రెండు కుర్చీలు మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రజలు బస్సుల కోసం నిలబడే వేచి ఉంటున్నారు. భవనం పిల్లర్ల చుట్టూ వేసిన దిమ్మలు, ప్లాట్‌ఫాం పూర్తిగా శిథిలమవ్వడంతో ఇబ్బందుల నడుమే రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు ప్లాట్‌ఫాం చిరువ్యాపారులతో నిండిపోవడంతో ప్రయాణికులు నిలబడేందుకూ అవకాశం లేకుండా పోతోంది.

బస్టాండ్‌లో బస్సుల కోసం నిల్చుని ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ప్రమాదకరంగా మెట్లు

బస్టాండ్ ఆవరణలో మెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. 2002లో బస్టాండ్ నిర్మాణం చేపట్టడంతో మెట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పశువులు ప్లాట్‌ఫాంపైకి చేరి పేడ, మూత్రం వేస్తుండటంతో పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి. గతంలో రోజూ బస్టాండ్ ప్రాంతం నీటితో కడిగేవారు.. ప్రస్తుతం తూతుమంత్రంగా తుడుస్తూ వదిలేస్తున్నారు. బస్సులు నిలిచే స్థలం కూడా అధ్వానంగా ఉండటంతో అవస్థలు తప్పడం లేదు.

❖ ప్రయాణికుల అవసరాల కోసం బోరు వేసి కుళాయిలు అమర్చితే పరిసర ప్రాంతాల వ్యాపారులు వినియోగిస్తున్నారు. దీంతో అధికారులు బోరును తొలగించారు. దీంతో తాగేందుకు నీరు లేక దుకాణాల వద్ద నీటి సీసాలు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ ఒకే దీపం వెలుగుతుండటంతో చీకటిగా మారి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోంది.

చర్యలు చేపడతాం

'కాశీబుగ్గ బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతాం. మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. కౌన్సిల్ దృష్టిలో పెట్టి బస్టాండ్ ఆధునికీకరణ జరిగేలా చూస్తామ'ని ఇన్‌ఛార్జి కమిషనర్ డి.కనకరాజు తెలిపారు.

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

సమాజంలో న్యాయవాదులు పోషించే కీలక పాత్రను, వారి త్యాగాలను స్మరించుకోవడం. న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులకు, న్యాయవాదులందరికీ న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సొంపేటలో జాబ్ వచ్చే వరకు కోచింగ్ & ఫ్రీ హాస్టల్

పదో తరగతి అర్హతతో సెంట్రల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు

SSC-GD కానిస్టేబుల్స్

25487 Vacancies... Notification Out..

రైల్వే NTPC

SSC CGL, CHSL, MTS

BANKING (PO & CLERK)

AP POLICE SI & కానిస్టేబుల్

• సబ్జెక్టులో నిష్ణాతులైన అధ్యాపకులచే కోచింగ్ • డైలీ టెస్టులు • స్టడీ మెటీరియల్ • మోడల్ ఎగ్జామ్స్ • గ్రౌండ్ ప్రాక్టీస్ • సిలబస్ పూర్తి అయ్యే వరకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సదుపాయాలు

ఈ బ్యాచ్‌లకు అడ్మిషన్లు ఈరోజు, రేపు ఇవ్వబడును.

NARGITA COMPETITIVE CLASSES

Behind RTC COMPLEX- SOMPETA

9938583230

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: జడితి కూడలి నుంచి గ్రామానికి వెళ్లే మార్గాన్ని ఆక్రమించి వ్యాపారులు విక్రయాలు చేపడుతుండటంతో రోడ్డు ఇరుకుగా మారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.
– సాయికృష్ణ, అమ్మతాపురం

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వ్యాపారులతో మాట్లాడతాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.
– జి.అనిల్‌కుమార్, ఎస్ఐ, సారవకోట

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

చింతలబడవంజలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బందులు కలిగించే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. చింతలబడవంజ, రావిచెంద్రి, మోదుగువలస గ్రామాల్లోని రైస్ మిల్లులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. బ్యాంకు గ్యారెంటీలు చెల్లించకుండా ధాన్యం సేకరిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని తహసీల్దారు ఈశ్వరమ్మను ఆదేశించారు. మండల వ్యవసాయాధికారిణి కిరణ్‌వాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే రాణింపు

టెక్కలి మండలం సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులు రాణించగలరని ప్రధానోపాధ్యాయురాలు టి. పద్మావతి తెలిపారు. వై. షర్మిల (10వ తరగతి), బి. లిఖిత్‌కుమార్ (10వ తరగతి), ఐ. సోనియా(8వ తరగతి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఫైబర్ నెట్ వర్క్

న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట గ్రామీణం, పోలాకి, జలుమూరు

గ్రామాల్లో సచివాలయాల ద్వారా అంతర్జాల సదుపాయాలు అందించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు అవసరమైన పరికరాలను సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో అమర్చారు. దీని కోసం ఒక్కో చోట సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు అయినట్లు అంచనా. అంతా బాగున్నా నిర్వహణను గాలికొదిలేయడంతో పరిస్థితి మొదటికొచ్చింది. పరికరాలు మూలకు చేరి తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. దీంతో సిబ్బంది ప్రైవేటు కంప్యూటర్ సెంటర్లు, చరవాణుల ద్వారా పనులు చేయాల్సి వస్తోంది.

వాండ్రాయిలో నిరుపయోగంగా మారిన పరికరం

పలుమార్లు సంప్రదించాం

సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో ఉన్న ఫైబర్ నెట్‌వర్క్ పరికరాలు పనిచేయడం లేదు. వీటిపై ఉన్న చరవాణి నంబర్లకు కార్యదర్శులతో పాటు మేము పలుమార్లు సంప్రదించాం. ఎటువంటి స్పందన లేదు. జిల్లా అధికారులకు సైతం సమస్యను తెలియజేశాం.
– మోహన్‌కుమార్, వెంకటేశ్వరప్రసాద్, జీవీ రవికుమార్, ఉమామహేశ్వరరావు, ఎంపీడీవోలు

ఇదీ పరిస్థితి.. నరసన్నపేట నియోజకవర్గంలోని 140 పంచాయతీలకు గాను 132 చోట్ల వీటిని ఏర్పాటు చేశారు. జలుమూరు మండలంలో 50 శాతం, మిగతా మండలాల్లో 10 శాతం వరకు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల ఉన్నా.. ఉపయోగం లేకుండా పోయింది. ఫైబర్ నెట్‌వర్క్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల, ఇళ్లకు వీటి ద్వారా సేవలందించాలని భావించినా బాలారిష్టాలు వీడలేదు. పాలకులు దృష్టి సారించి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గం వివరాలు

మండలం	పంచాయతీలు	ఏర్పాటు చేసిన పరికరాలు
సారవకోట	35	35
నరసన్నపేట	34	34
జలుమూరు	40	40
పోలాకి	31	23

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

సంతబొమ్మాళి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. దండుగోపాలపురంలో కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ధాన్యం తేమ శాతం పరీక్ష నుంచి ట్రక్ షీట్ జనరేట్ వరకు పలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి తిరుమలరావు, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సమయపాలన అవసరం

కొత్తూరు: మండల పరిషత్తు ఉద్యోగులు, సచివాలయ సిబ్బందికి సమయపాలన అవసరమని ఉప ఎంపీడీవో ఎల్.తులసీవరప్రసాద్ తెలిపారు. కొత్తగా విధుల్లో చేరిన డిప్యూటీ ఎంపీడీవోలు లక్ష్మణరావు, వెంకటరమణ, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏవో రాంబాబు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు స్థల పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ సుబ్రహ్మణ్యం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ సుబ్రహ్మణ్యం మలగాంలో మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. గరీబుల గెడ్డ నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని ఒడిసిపట్టేందుకు దీన్ని నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. తెదేపా నాయకులు అప్పిని వెంకటేశ్, చిదపాన ధర్మార్జునరెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.



పోటీతత్వం అలవర్చుకోవాలి

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని టెక్కలి ఓక్లాండ్ పాఠశాల ప్రిన్సిపల్ మధులత అన్నారు. విద్యాలయంలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. బి.ఆకాంక్ష (8వ తరగతి), హెచ్. వసంత (9వ తరగతి), బి.తపస్విని (7వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. గెలుపొందిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

పాఠశాల బస్సుల తనిఖీ

టెక్కలి పట్టణం: పాఠశాల బస్సులను టెక్కలి ఎంవీఐ సంజీవరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై బస్సులను పరిశీలించి నిబంధనల మేరకు నడపాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొట్లాట కేసులో ఇద్దరి అరెస్టు

సారవకోట: మండలంలోని అగదల గ్రామంలో గత నెల 20న భూముల కోసం కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన బమ్మిడి జయరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనుమంతు రామకృష్ణ, జలజాక్షిలను మంగళవారం అరెస్టు చేసి, పాతపట్నం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు ఎస్సై బి.అనీల్ కుమార్ తెలిపారు.

క్రీడా స్ఫూర్తి నింపేందుకే పోటీలు

జలుమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు మాధవరావు, ప్రసాదరావు అన్నారు. మంగళవారం జలుమూరు ఉన్నత పాఠశాల ఆవరణలో క్రికెట్, త్రోబాల్ పోటీలను వారు ప్రారంభించారు.

మహాసభలు విజయవంతం చేయండి

కొత్తూరు, న్యూస్‌టుడే: ఈ నెల 31 నుంచి విశాఖలో జరిగే అఖిల భారత సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. కొత్తూరులో మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, గౌరమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమన్వయంతో చేపట్టాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీల ప్రక్రియ సమన్వయంతో చేపట్టాలని పీపీసీఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. మెళియాపుట్టి మండలానికి సంబంధించి సుమారు రూ.27 కోట్లతో పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఏపీడీ శైలజ, ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా, ఏపీవో రవి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం: సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామానికి చెందిన మైలపల్లి అప్పలస్వామి సోమవారం రాత్రి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద అదృశ్యమైనట్లు బంధువు పిచ్చుక ఆదిలక్ష్మి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉమిలాడ నుంచి విజయనగరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్‌లో శ్రీకాకుళం చేరుకున్నారు. అక్కడి నుంచి విజయనగరం బస్టాప్ వద్ద నుంచి కనిపించకుండా వెళ్లి పోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ పి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన

హిరమండలం: గులుమూరు పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే గోవిందరావు అభినందించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో బాలుడ్ని సన్మానించారు. మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఎంఈవోలు రాంబాబు, దాలయ్య పాల్గొన్నారు.

వైభవంగా నవచండీ యాగం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: సుబ్బారావుపేట విజయ వేంకటేశ్వరుని ఆలయంలో నవచండీ మహాయాగం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రాంగణంలోని శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. పురోహితులు రాజాబాబు, శ్రీనుబాబు, కశ్యపుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదం చెప్పి వస్తుందా..?

నౌపడ- మెళియాపుట్టి రహదారిలో మెళియాపుట్టి సమీపంలో కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా ఉంది. ఆంధ్ర- ఒడిశా రాష్ట్రాలను కలిపే ఈ మార్గంలో నిత్యం వందల మంది ప్రయాణిస్తుంటారు. భారీ వాహనాల రాకపోకలతో ఇప్పటికే రక్షణ గోడ కూలిపోయిందని, కింద భాగంలో పెచ్చులూడి ఊచలు కనిపిస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సమస్యను ర.భ.శాఖ ఏఈ హరనాథ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, మెళియాపుట్టి

కుక్క కాట్లు.. యంత్రాంగం కునుకుపాట్లు

కొత్తూరులోని బత్తిలి రహదారిపై శునకాల సంచారంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గుంపులుగా తిరుగుతూ దాడి చేస్తున్నాయని, వాహనాల వెంబడి పరుగు తీస్తుండటంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై పశు వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ.. కుక్కల సంఖ్యను అరికడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ప్రారంభించారు.. పక్కన పెట్టారు

సారవకోట మండలం వాండ్రాయి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలు వ్యయంతో విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను నిర్మించారు. 2024 మార్చిలో ప్రారంభించారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించక పోవడంతో భవనం అప్పగించలేదు. దీంతో సేవలందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని బొంతు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుస్మిత వద్ద ప్రస్తావించగా.. జిల్లా అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

ఖాళీ స్థలాలు.. పాములకు ఆవాసాలు

సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పనికిరాని మొక్కలు పెరిగిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పాములు, విష కీటకాలు రాత్రి వేళల్లో ఇళ్లలోకి వస్తున్నాయని వారంతా భయాందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తక్షణమే పనికిరాని మొక్కలు తొలగిస్తామని నౌపడ ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఉమాపతి స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

పనికిరాని మొక్కల తొలగింపు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలంలో జర్జంగి- పింద్రువాడ మార్గంతో పాటు, పలు రహదారులకు ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. దీనిపై గత నెల 17న 'నిర్వహణ కరవు.. ప్రమాదాలకు నెలవు' శీర్షికతో కథనం వచ్చింది. ర.భ.శాఖ డీఈ తిరుపతిరావు స్పందించి, చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

ఆలయ పరిసరాలు శుభ్రం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు గుడి వద్ద వ్యర్థాలు వేస్తుండటంతో భక్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొనే వారు. ముక్కు మూసుకుని రాకపోకలు చేస్తుండే వారు. సమస్యపై ఈనెల 2న 'ఆలయం వద్ద అధ్వానం' శీర్షికతో ఈనాడులో వార్త వెలువడింది. దీంతో ఇన్‌ఛార్జి ఎంపీడీవో కిల్లారి నారాయణరావు స్పందించి, పరిష్కారం చూపారు.

బాధ్యతల స్వీకరణ

పాతపట్నం, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ అధికారిగా కృష్ణారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన రాజాం పంచాయతీ గ్రేడ్ వన్ అధికారిగా పనిచేశారు. ఉద్యోగోన్నతి ద్వారా పాతపట్నంకు బదిలీపై వచ్చారు.

కండల వీరుడికి స్వాగతం

నరసన్నపేట, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాడీబిల్డింగ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన పాగోటి సతీష్‌కు మంగళవారం స్వగ్రామం కంబకాయలో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో సతీష్ సత్తా చాటిన విషయం తెలిసిందే.

చంగుడి గ్రామంలో వ్యక్తి అదృశ్యం

పాతపట్నం: చంగుడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనపడటం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం పొలం పనులకు వెళ్లిన ఆనంద్ పరిడ ఇంటికి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా చెప్పులు, చేతి కర్రను మహేంద్ర తనయ నదీ పరివాహక ప్రాంతంలో గుర్తించారు.

ఆటలకు ప్రాధాన్యమివ్వాలి

టెక్కలి పట్టణం (నందిగాం), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలని ఉప విద్యాశాఖాధికారి పి. విలియమ్స్ సూచించారు. లఖిదాసుపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. వ్యాయామోపాధ్యాయుల సంఘ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణయ్య, ఎంఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్

ప్రతి కార్యకర్తకు గుర్తింపు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, న్యూస్‌టుడే: పార్టీ కోసం పాటుపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. తెదేపా సీనియర్ నాయకుడు త్రిపురాన వెంకటరావు సంతాప సభ మంగళవారం నరసన్నపేటలోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పాతపట్నం, న్యూస్‌టుడే: పెద్దమల్లిపురానికి చెందిన ఏనుగుతల చలపతిరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో సీఎం సహాయనిధి సాయం మంజూరైంది. ఈ మేరకు మంగళవారం రూ.82,384 చెక్కు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బాధిత కుటుంబానికి అందించారు.

రగ్గుల వితరణ

సంతబొమ్మాళి: మండల కేంద్రంలో ఆంజనేయస్వామి మాలాధారులకు టెక్కలి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త పేరాడ తిలక్ 60 రగ్గులను మంగళవారం పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకుల పాల్గొన్నారు.

రైసుమిల్లుల్లో తనిఖీలు

నరసన్నపేట దేశవానిపేట రైసుమిల్లులో ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు

నరసన్నపేట: అధికారుల బృందం నరసన్నపేటలోని పలు రైసుమిల్లులను మంగళవారం తనిఖీ చేసింది. జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామితోపాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త మధుకుమార్, ఏడీఏ ఎల్. విమధు, ఎఫ్‌సీఐ మేనేజర్ అనుదీప్ నాయుడు దేశవానిపేటలోని బాలాజీ, లక్ష్మీనారాయణ రైసుమిల్లుల్లోని ధాన్యం నమూనాలు సేకరించారు. పౌరసరఫరాల శాఖ ఏఎంటీ విజయరాజ్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా.. టెక్కలి పట్టణం, నరసన్నపేట, మెళియాపుట్టి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ నిందితులకు న్యాయమూర్తులు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువడించారు. టెక్కలి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ యు.మాధురి టెక్కలి పరిధిలో ముగ్గురికి, మెళియాపుట్టి మండలానికి సంబంధించి ఇద్దరికి చెరో రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఏడుగురు రూ.వెయ్యి చెల్లించాలని పేర్కొన్నారు. నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి నలుగురికి జరిమానా విధించారు.

పింఛను కోసం పడిగాపులు

పెద్దకోట-I సచివాలయం వద్ద పింఛనుదారులు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: పెద్దకోట-1 సచివాలయ సిబ్బంది కోసం పింఛనుదారులు పడిగాపులు కాశారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఎదురు చూసి వెనుదిరుగుతున్న సమయంలో డిప్యూటీ ఎంపీడీవో జి.వెంకట అప్పలనాయుడు వచ్చి వారితో మాట్లాడి కూర్చోపెట్టారు. అనంతరం వచ్చిన సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేయించారు.

రైతులకు న్యాయం చేయండి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: దాలిచెరువు ముంపు ప్రభావంతో పంటలు నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని జయకృష్ణాపురం గ్రామస్థులు కోరారు. మంగళవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడును కలిసి సమస్య వివరించారు. అంతకుముందు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిబాబ్జి దెబ్బతిన్న పంటలు పరిశీలించారు.

క్వాంటమ్ టెక్నాలజీతో భవిష్యత్తు

నరసన్నపేట: క్వాంటమ్ టెక్నాలజీపై యువత దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత సూచించారు. మంగళవారం కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. విద్యార్థులు సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలని ఆమె పేర్కొన్నారు.

ప్రహసనం వీడేనా.. ప్రహరీ వచ్చేనా..?

న్యూస్‌టుడే, పోలాకి, జలుమూరు, సారవకోట, నరసన్నపేట

నాడు- నేడుతో సర్కారు బడుల రూపురేఖలు మారుస్తామని వైకాపా పాలకులు గొప్పలు చెప్పారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పలుచోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కనీసం రక్షణ గోడలు సైతం పూర్తి కాక పోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.

విద్యాలయాల ఎంపిక ఇలా..

మండలం	క్లస్టర్లు	పాఠశాలలు
జలుమూరు	5	14
పోలాకి	7	23
సారవకోట	1	6
నరసన్నపేట	1	4

రక్షణ గోడ లేని గంగివలస ప్రాథమిక పాఠశాల

ఉపాధి నిధుల కేటాయింపు

బడుల్లో ప్రహరీల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున ఉపాధి పథకం నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో మొక్కలు నాటడం, ఉన్నవి సంరక్షించడం, ఖాళీ స్థలాల ఆక్రమణ గురవకుండా ఉండేందుకు రక్షణ గోడలు ఎంతగానో సహకరిస్తాయని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఈమేరకు ఆయా వివరాలను సమగ్ర శిక్షా ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు అందజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు

ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. బడి ఆవరణలో నాటిన మొక్కలను పశువులు తినేస్తున్నాయని చెబుతున్నారు. వాటి వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో సరస్వతీ నిలయాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయని, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

వివరాలు అందాలి.. పాఠశాలల వారీగా ప్రహరీల నిర్మాణం ఏ దశలో ఉన్నాయో వివరాలు అందాల్సి ఉంది. పనులు జరిగిన మేరకు బిల్లులు చెల్లిస్తాం. – జీవీ రవికుమార్, ఎంపీడీవో, పోలాకి

శ్మశానవాటిక ఏర్పాటు చేయండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: జమ్ము సమీపంలో గడ్డెయ్యపేట జగనన్న కాలనీలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపి తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

పాతపట్నం, న్యూస్‌టుడే: పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని గురుకుల పాఠశాలల అదనపు సెక్రటరీ రాజ్‌కుమార్, జిల్లా అధికారిణి యశోదలక్ష్మి పేర్కొన్నారు. ప్రహరాజపాలెంలోని డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం వారు సందర్శించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ పద్మావతి పాల్గొన్నారు.

HAPPY ADVOCATES DAY
Being a lawyer is not easy, It demands lot of hard work, dedication and devotion may you always shine bright as a lawyer.
Happy Advocates Day to All
V. SUDHAKAR
Advocate, Notary
Secr: Bar Association, Kotturu
Cont: 9441468677, 8179948144

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఉపన్యాసం అదిరింది

ఆమదాలవలస మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తొగరాంలో మంగళవారం ఈనాడు ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు'పై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఎ.దీపిక (ద్వితీయ సంవత్సరం ఎంపీసీ), బి.బాబురావు (మొదటి సంవత్సరం హెచ్ఈసీ), సీహెచ్.కల్యాణి (మొదటి సంవత్సరం బైపీసీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ యు.వి.ఎన్ వర్మ, అధ్యాపకులు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

మాటలతో మెప్పించారు..

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చదువుకునే వయసులో విద్యార్థులకు చరవాణి ఎంతవరకు ఉపయోగమనేది మాటలతో వివరించి ఆకట్టుకున్నారు. హాజరైన విద్యార్థుల్లో జి.చక్రిత (9వ తరగతి), పి.నవనీత్ (10వ తరగతి), టి.అక్షయ (10వ తరగతి) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సీతంనాయుడు, ఉపాధ్యాయులు గోవిందరావు, నగేష్, త్రినాథరావు విజేతలకు బహుమతులు అందజేశారు.

– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను వసూలు చేయాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధిపై సిబ్బంది దృష్టిసారించాలని డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల అన్నారు. జి.సిగడాం మండల పరిషత్తు కార్యాలయంలో స్వర్ణ పంచాయతీల సర్వేను పరిశీలించారు. ఇంటి పన్ను వసూళ్లు నగదు రహితంగా జరగాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉంచాలన్నారు. గెడ్డకంచరాం గ్రామంలో స్వామిత్వ సర్వే పరిశీలించారు.

గెడ్డకంచరాంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీవో గోపీబాల

ఆడుతారు.. పాడుతారు..

ఆరోగ్యంగా ఉంటారు..!

న్యూస్‌టుడే, బూర్జ

బూర్జ మండలంలోని భవిత కేంద్రంలో ఇచ్చిన ఉపకరణాలతో దివ్యాంగ బాలలు

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసాన్ని భవిత కేంద్రాలు పెంపొందిస్తున్నాయి. ప్రత్యేక శిక్షణ, ఆటపాటలు, ప్రత్యేక పరికరాలతో నైపుణ్యాలు మెరుగయ్యేలా చేస్తున్నారు సమన్వయకర్తలు. ఫిజియో థెరపీతో ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

- జిల్లాలోని జిల్లాలో 30 భవిత కేంద్రాల్లో 56 మంది సిబ్బంది, 10 మంది, ఫిజియో థెరపిస్టులు ఉన్నారు.
- గతంలో దివ్యాంగ చిన్నారులను తల్లిదండ్రులు విధిలేక ఇళ్లలోనే ఉంచి పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం భవిత కేంద్రాలు వీరి పాలిట దేవాలయాలుగా మారుతున్నాయి.
- ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో దివ్యాంగుల సర్వే నిర్వహించి వారిని గుర్తించి 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసున్న వారికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఆటలపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించి వారిలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి సాకారం అందిస్తున్నారు.
- మేధో వైకల్యం, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, హియరింగ్, విజువల్ ఇంపెర్‌మెంట్, లెర్నింగ్ డిజేబులిటీ తదితర వైకల్యాలు కలిగిన పిల్లలకు రిసోర్స్ పర్సన్ ప్రైనందిన, అకడమిక్ శిక్షణ కార్యక్రమాలు, కరిక్యులర్ ఆక్టివిటీస్ చేయిస్తారు. వైద్య సేవలతో మెరుగయ్యేలా చేసి సమీప పాఠశాలల్లో చేర్పించి చదువు చెప్పిస్తున్నారు. ఫిజియోథెరపీ, యోగా, వ్యాయామాలతోపాటు అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

- దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. ఫిజియో థెరపీ, మానసిక, శారీరక వికాసానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం విద్యాశాఖ నిరంతర పర్యవేక్షణ ఉంటోంది.' అని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త, బుడుమూరు గోవిందరావు తెలిపారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో సమస్యలా?

4న డయల్ యువర్ ఎమ్మెల్యే

ఎచ్చెర్ల నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులా, రహదార్లు అసంపూర్తిగా ఉన్నాయా, మౌలిక వసతుల సమస్య వేధిస్తోందా, రెవెన్యూ సమస్యలు పీడిస్తున్నాయా, అర్హత ఉన్నా.. సంక్షేమపథకాలు అందడం లేదా? సాగునీటి సమస్యలా ఏదైనా.. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశం 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లో సమస్యలు నేరుగా తెలిపి పరిష్కారం పొందొచ్చు. నిర్దేశించిన సమయంలో కింద సూచించిన నంబరుకు ఫోను చేయడమే.

● తేదీ 04-12-2025 (గురువారం) ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు
సంప్రదించాల్సిన నంబరు: 94417 07625, 98662 29477

తేనెటీగల పెట్టెలు పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ శైలజ

తేనెటీగలతో అధిక దిగుబడి

రణస్థలం, న్యూస్‌టుడే : తేనెటీగలు లేకుంటే మానవ మనుగడే ఉండదని హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఎంటమాలజీ సహాయ ప్రొఫెసర్ వి.శైలజ అన్నారు. డాక్టర్‌రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పైడిభీమవరంలో తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. తేనెటీగల పరాగ సంపర్కం వల్ల పంటలు అధిక దిగుబడులు పొందుతాయన్నారు. రైతులకు తేనెటీగలతో కూడిన పెట్టెలను అందజేశారు.

తెరపై ఈనాడు

- మారుతి: బిజినెస్ మేన్
- కిన్నెర : ప్రేమంటే ● కీర్తన: జనతా బార్
- కీర్తిక: స్కూల్ డేస్
- ఎస్‌వీసీ(రామలక్ష్మణ): గర్ల్ ఫ్రెండ్
- సూర్యమహల్: రాజు వెడ్స్ రాంబాయి
- సన్‌మ్యాక్స్ : తేరే ఇష్క్ మైనే
- సరస్వతి : ఆంధ్రా కింగ్ తాలూకా

– న్యూస్‌టుడే,పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: మెట్టక్కివలస పుట్టవీధిని ఆనుకొని ఉన్న చక్కెర కర్మాగారం శిథిలావస్థకు చేరింది. – హరినారాయణ, స్థానికుడు... సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస ? పంతులుపేట గ్రామానికి చేరుకునే రహదారిలో మురుగునీరు చేరుతోంది. – గురయ్య, స్థానికుడు ● సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

వర్షితకు వీసీ అభినందన

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించి వర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన గుజ్జల వర్షితను మంగళవారం ఆమె అభినందించారు. రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఏ.భాస్కర్ తదితరులు అభినందించారు.

వర్షితను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.ఆర్.రజని తదితరులు

అధ్వానం.. అసౌకర్యం

పైడిభీమవరంలోని సరగడపేట సమీపంలోని రహదారి బురదమయంగా మారింది. రసాయనిక, పలు చిన్నతరహా పరిశ్రమలు, లైసెన్సుల్లు నిర్మాణంలో ఉంది. రహదారి అసౌకర్యంగా ఉండటంతో పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా అప్పన్న వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైన వెంటనే నిర్మిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, రణస్థలం

శిథిల భవనం.. ప్రమాదం..!

సరుబుజ్జిలి మండలంలోని పెద్దపాలెం ప్రాథమిక పాఠశాల పక్కన శిథిలావస్థకు చేరుకున్న భవనం ఉంది. పచ్చని తీగమొక్కలు పెరిగి, విష కీటకాలు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ఎంఈవో బాలరాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

చివరి మజిలీకి స్థలం లేదు..

గార మండలం వత్సవలస పంచాయతీ మొగదాలపాడులో శ్మశానవాటిక లేదు. ఇంతవరకు ఉన్న స్థలం తమది అంటూ కొమరవాని పేట గ్రామస్థులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో వేరే చోట ఉన్న స్థలానికి స్థానికుల అభ్యంతరాలున్నాయి. ప్రస్తుతం తీరానికి వెళ్లే దారిలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామని గ్రామస్థులు అంటున్నారు. ఈ దారిలో వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను వీఆర్వో అచ్యుతరావు వద్ద ప్రస్తావించగా స్థలం గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. – న్యూస్‌టుడే, గార

సమస్యల దారి

పొందూరు మండలం బాణాంకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గోతులమయమై వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. వర్షం పడితే సమస్య రెండింతలు అవుతోందని వాపోయారు. బాణాం గ్రామం నుంచి లావేరు మండలం గుర్రాలపాలెం వెళ్లే దారిలో బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆర్అండ్‌బీ ఏఈ పేటీరాజుతో ప్రస్తావించగా రహదారి మరమ్మతులకు నిధుల ప్రతిపాదించామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు

ఇలా వదిలేశారు..

గార మండలం కళింగపట్నం - మత్స్యలేశం సాగరతీరంలో పర్యాటకుల విశ్రాంతి భవనం వద్ద జనరేటర్ నిరుపయోగంగా పడి ఉంది. భవనాన్ని ఏపీటీడీసీ నిధులు రూ.51.50 లక్షలతో 2012లో నిర్మించి అత్యవసర విద్యుత్తు సౌకర్యం కోసం జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ పట్టించుకోలేదు. దీంతో అది పాడై వినియోగానికి పనికిరాకుండా పోయింది. ఈ విషయమై జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు వద్ద ప్రస్తావించగా మరమ్మతులకు గురైందని, పర్యాటక అభివృద్ధి సంస్థకి తెలియజేసినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, గార

ప్రజాప్రతినిధికి నాయకత్వ లక్షణాలు ఉండాలి

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రాజకీయాల్లో రాణించాలంటే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెదేపా మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు శిక్షణ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రజల మధ్య ఉంటూ.. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. అండగా ఉంటామని భరోసా కలిగించే వాడే నాయకుడని అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం తగదు

సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై అసత్య ప్రచారాలు తగదని వైకాపా నాయకుడు చింతాడ రవికుమార్‌పై తెదేపా మండల అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూడలేక రవికుమార్ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలే తప్ప అసత్య ఆరోపణలు వద్దని హితవు పలికారు.

ప్రధానోపాధ్యాయుడిపై ఆరోపణలు సరికాదు

పొందూరు, న్యూస్‌టుడే: తాడివలస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై గ్రామంలో కొంత మంది తప్పుడు ఫిర్యాదు చేయడం తగదని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు కేత దర్మారావు ఖండించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు బల్ల కంటయ్య తాడివలస ఉన్నత పాఠశాలకు రాకముందు జరిగిన చెట్ల విక్రయంపై ఎలాంటి సంబంధం లేదన్నారు.

పరామర్శ... శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జడివాన ఆనార్యోగానికి గురైన నాగావళి హోటల్ యజమాని వరదా గోవిందరాజులు (కొండబాబు)ను లయన్స్ క్లబ్ మెంటార్, పూర్వపు అధ్యక్షులు నటుకుల మోహన్ పరామర్శించారు. కుటుంబ సభ్యులతో విభేదించిన ఆయన నగరంలోని 80 అడుగుల రోడ్డులో ప్రస్తుతం నివాసముంటున్నారు.

తొలగించినా.. మళ్లీ ఆక్రమణ

ఆమదాలవలస మండలం గోపీనగరంలో ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి కొత్తరోడ్డు వంతెన కింద ఫుట్‌పాత్ ఆక్రమించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈనాడులో కథనం ప్రచురించగా అధికారులు తొలగించారు. అయినప్పటికీ మళ్లీ ఆక్రమించి తోపుడు బళ్లు పెట్టుకోవడంతో సర్వత్రా ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు నిలిపి, శ్రీకాకుళం, విశాఖ, నరసన్నపేట, పలాసతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అక్కడే బస్సుల కోసం వేచి చూస్తారు. అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. ఆర్అండ్‌బీ జేఈ శ్రీనివాసరావు వివరణ కోరగా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, గోపీనగరం(ఆమదాలవలస గ్రామీణం)

రహదారిని ఆక్రమిస్తే చర్యలు

వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ రామారావు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు మార్కెట్లో రోడ్డుకు అడ్డంగా కూరగాయల దుకాణాలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలగజేస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ రామారావు హెచ్చరించారు. మంగళవారం మార్కెట్‌ను సందర్శించిన ఆయన చిరు వ్యాపారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగించారు. కేటాయించిన చోటే విక్రయాలు జరుపుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు సైతం పార్కింగ్ స్థలాల్లోనే ఆపాలని, మార్కెట్ లోపలికి వస్తే అపరాధరుసుం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎస్ఐ ఎం.సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయగణపతికి క్షీరాభిషేకం

మార్గశిర మాసం సందర్భంగా నగరంలో పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం విజయగణపతికి క్షీరాభిషేకం, విశేషఅర్చన, అలంకరణ, స్వర్ణ పుష్పార్చన పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు పెంట శ్రీధర్, సూర్యనగేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. మంగళవారం అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ప్రజల విజ్ఞాపనల మేరకు అవసరమైన చోట్ల సీసీ రహదారులు, కాలువల పనులకు ప్రతిపాదనలు తయారు చేసి నిధులు అందుబాటులో ఉన్న సమయంతో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ పర్యవేక్షణాధికారి, సహాయ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, ఇన్‌ఛార్జి కమిషనర్ బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు, నగదు అందజేత

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం జాడ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. భాజపా మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు నిత్యావసర సరుకులను, ఆర్థిక సాయం అందించారు.

పొంచి ఉన్న ప్రమాదం

శ్రీకాకుళం నగరంలో పీఎన్ కాలనీ, ముచ్చావారి పేట, పాజుల్‌బేగ్‌పేట తదితర ప్రాంతాల నుంచి గుజరాతీపేటకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో కాలువపై పలక విరిగిపోయి గొయ్యి ఏర్పడింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.శ్రీనివాసులును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

పతకాలతో ప్రతిభ చాటారు..

పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా అస్మిత కిక్ బాక్సింగ్, ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన జేవై అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని వైఎస్ఆర్ కల్యాణ మండపంలో గత ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వివిధ జిల్లాల క్రీడాకారులతో పోటీపడి ఉత్తమంగా రాణించారు. 17 మంది ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాల పంట పండించారు. విజేతలను పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శంకరరావు, ప్రిన్సిపల్ రాణి, ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాల వద్ద అభినందించారు.

ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలి

రణస్థలం, న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తలకు వేతనాల పెంపుతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు తెలిపారు. మంగళవారం రావాడ పీహెచ్‌సీ వద్ద ఆశాకార్యకర్తల మాట్లాడారు. 5జీ సపోర్ట్‌తో పని చేసే చరవాణులు ఇవ్వాలన్నారు.

ఆశా కార్యకర్తలతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందని మాజీ సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మంగళవారం తన నివాసంలో మాట్లాడారు. విద్యా రంగం నానాటికీ దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల రియంబర్స్‌మెంట్ విడుదల కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించాలని లేదంటే వైకాపా తరఫున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ తనయుడు తమ్మినేని చిరంజీవినాగ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ సభాపతి తమ్మినేని సీతారాం

మిల్లుల్లో ధాన్యం నిల్వలు సక్రమంగా ఉండాలి

గార (శ్రీకూర్మం), న్యూస్‌టుడే: మిల్లుల్లో ధాన్యం నిల్వలు అధికారుల ధ్రువీకరణ ప్రకారం సక్రమంగా ఉండాలని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష అన్నారు. గార మండలం శ్రీకూర్మం కూడలి, శ్రీకూర్మంలోని ధాన్యం మిల్లులను తహసీల్దారు చక్రవర్తితో కలిసి మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, ట్రక్‌షీట్, మిల్లర్ల లాగిన్ వంటి అంశాలపై కస్టోడియన్ అధికారులకు సూచనలు చేశారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిప్రత్యూష

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల అన్నారు. మంగళవారం ఆమదాలవలస మండలం సైలాడ పంచాయతీ దివంజిపేట గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జోగి ఉపేంద్రకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 24, 500 చెక్కును పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

నిర్వహించక విధులు..

రోగాల బారిన ప్రజలు..!

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై మనిషి ఆరోగ్యం ముడిపడి ఉంటుంది. పట్టణాల్లో పరిసరాలను పరిశుభ్రం చేసి ప్రజారోగ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవల్సిన ప్రధాన బాధ్యత పురపాలక సంఘాలది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పురపాలికల్లో, పారిశుద్ధ్యం అదుపు తప్పుతోంది.

● నగరంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణకు నగరపాలక సంస్థలో ఓ ప్రత్యేకంగా ప్రజారోగ్య విభాగం ఉంది. ఓ ప్రజారోగ్యాధికారి, మేస్త్రీలు, సచివాలయ పరిధిలో శానిటరీ కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో సిబ్బంది, అవసరమైన వాహనాలు అందుబాటులో ఉన్నాయిఅధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యంతో నగరంలో పారిశుద్ధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగక అపరిశుభ్రతతో దోమలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ● ప్రధాన రహదారులు, ప్రజాప్రతినిధులు ఉన్న ప్రాంతాల్లో మినహా ఇతర చోట్ల పూడికతీత పనులు విస్మరిస్తున్నారు. దీంతో మురుగునీరు నిల్వ ఉండిపోతోంది

న్యూ కాలనీలోని కాలువలో నిలిచిన మురుగు

● దోమలు లేకుండా వీధులను పరిశుభ్రం చేసి చెత్త నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. బ్లీచింగ్ చల్లాలి. కానీ మురుగు కాలువల్లో లార్వాలు దోమలుగా మారకుండా గంబూషియా చేపలు విడిచి పెట్టాలి. ఫాగింగ్ ఇతర అన్ని చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. అవేమీ జరగడం లేదు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

● నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగు పరిచి దోమల నివారణకు అన్ని చర్యలు చేపడుతున్నాం. పూడికలు తొలగింపు, దోమల నివారణపై దృష్టి సారిస్తాం. అని శ్రీకాకుళం నగరపాలకసంస్థ ఈఈ, ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

● నగరంలో మొత్తం వార్డులు : 50 ● జనాభా: 1.85 లక్షలు ● మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది: 496 మంది

సమయపాలన అవసరం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆమదాలవలస మండలం సచివాలయ అధికారి సీపాన రామ్మోహన్ అన్నారు. మంగళవారం ఆమదాలవలస మండలం దూసి సచివాలయాన్ని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. చర్యలు తప్పవని హెచ్చరించారు. దస్త్రాలు చూశారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న సచివాలయ అధికారి రామ్మోహన్

(c) eenadu

పదికి గురువుల కొరత

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఐదేళ్ల డీఎస్సీ ద్వారా జిల్లా వ్యాప్తంగా నియామకాలు చేపట్టినప్పటికీ జిల్లాలోని పలు పాఠశాలల్లో కొరత ఉంది. మరోవైపు పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతుండటంతో ఇతర ఉపాధ్యాయులకు ఆ బాధ్యతలు అప్పజెబుతున్నారు. దీంతో ఫలితాలు అయోమయం పరిస్థితుల్లో ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా సాంఘికశాస్త్రం ఖాళీలు ఉండగా మొత్తంగా పాఠిక వరకు పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. **- న్యూస్‌టుడే, తిరుపతి (విద్య)**

త్వరలో తాత్కాలిక నియామకాలు

ఈనెల 8వ తేదీ నుంచి తాత్కాలిక పద్ధతిలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తీసుకోనున్నట్లు విద్యాధికారులు చెబుతున్నారు. అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరించి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. తాత్కాలిక ప్రాతిపదికన ఐదునెలల కాలానికి భర్తీ చేయనుండటంతో అర్హుల నుంచి ఎంతవరకు స్పందన ఉంటుందనేది వేచిచూడాలి.

ఫలితాలు ఇలా..

ఏడాది	ఉత్తీర్ణత	రాష్ట్రర్యాంకు
2022-23	77.70%	8
2023-24	90.71%	10
2024-25	79.83%	19

గత విద్యా సంవత్సరంలో అనుత్తీర్ణత
గణితం 3,958 సైన్స్ 3,079
సోషల్ 1,609 తెలుగు 1,326
ఇంగ్లిష్ 779 హిందీ 91
హాజరు: 26,679
పాఠశాలల సంఖ్య : 320
ప్రస్తుత విద్యార్థులు : 14,647

లోటుపాట్లు అధిగమిస్తాం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధిగమిస్తాం. నూతనంగా 25 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను తీసుకుంటున్నాం. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల బోధనాంశాలకు సంబంధించి ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఈనెల 6 నుంచి వంద రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలుపరిచి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.
- కేవీఎన్ కుమార్, జిల్లా విద్యాధికారి

భారతీయ విజ్ఞాన సమ్మేళన్‌కు ముఖ్యఅతిథులు

తిరుపతి(విద్య): తిరుపతి వేదికగా ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఏడో భారతీయ విజ్ఞాన సమ్మేళన్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ అధినేత డాక్టర్ మోహన్ భగవత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర, మంత్రులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ప్రారంభ లేదా ముగింపు వేడుకలకు ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

కాళంగి గేట్లు.. ఎంతవరకు భద్రం..?

కాళంగి జలాశయం ప్రధానగేట్ల నుంచి భారీగా నీరు లీకవుతుండటంతో భద్రతపై రైతుల్లో అనుమానం వ్యక్తమవుతోంది. జలాశయ సామర్థ్యం 240 ఎంసీఎఫ్‌టీలకు గాను అధికారులు ముందుచూపుతో 170 ఎంసీఎఫ్‌టీలకు మాత్రమే ఉంచి మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. 2015 నవంబర్‌లో జలాశయం 18 గేట్లతో పాటు అత్యవసర గేట్లు ఎత్తివేసేందుకు అధికారులు యత్నించగా.. ప్రధాన గేట్లలో ఒకటి కొట్టుకుపోయింది. అప్పట్లో తాత్కాలిక ఏర్పాటుతో నీరు నిండేలా చర్యలు తీసుకున్నారు. పదేళ్లవుతున్నా దాన్నే కొనసాగిస్తున్నారు. సమస్యపై డీఈ రత్నాకర్‌రెడ్డిని వివరణ కోరగా వర్షాలు తగ్గితే లీకేజీలు పూర్తిస్థాయిలో నివారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కేవీబీపురం**

సహకార సంఘాలు.. దోచేశారు

■ పొలం లేకున్నా.. పంట వేయకున్నా రుణాలు
■ గత పాలనలో వైకాపా నేతల ఇష్టారాజ్యం

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

2022 నుంచి చిన్నగొట్టిగల్లులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నకిలీ బంగారం (వన్‌గ్రామ్ గోల్డ్) తాకట్టు పెట్టి స్థానిక నేతలు రూ.72 లక్షల రుణం తీసుకున్నారు. రెన్యువల్ చేసుకుంటూ వస్తుండగా నవంబరులో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నకిలీ పాసు పుస్తకాలు కుదువపెట్టడంతోపాటు స్వల్ప, దీర్ఘకాలిక రుణాల పేరుతో మరో రూ.1.65 కోట్లు కొల్లగొట్టారని తేలింది. ఇదంతా వైకాపా నేత కనుసన్నల్లోనే జరిగింది.

ఈనాడు– చిత్తూరు, తిరుపతి

ఐదేళ్ల జగన్ పాలనలో సహకార సంఘాలు భ్రష్టుపట్టాయి. రైతులకు అండగా నిలవాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సింగిల్ విండో), జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) వైకాపా నాయకుల దాసోహమయ్యాయి. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అర్హతా లేని వ్యక్తులకు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. గృహనిర్మాణం, ఇతర రుణ విభాగాల్లో రూ. 12 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు తేలింది.

పక్కదారి పట్టిన నిధులు
బైరెడ్డిపల్లె రూ.2 కోట్లు
పలమనేరు రూ.80 లక్షలు
శ్రీకాళహస్తి రూ.60 లక్షలు
సత్యవేడు రూ.60 లక్షలు

అధికారులూ కుమ్మక్కు

వైకాపా హయాంలో 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేశారు. పాలకవర్గాలతో అప్పటి అధికారులు కుమ్మక్కయ్యారు. దాంతో అటు సభ్యులైన వైకాపా నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అందరూ ఎడాపెడా రుణాలు తీసుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి డీసీసీబీకి చెల్లించలేదు. చాలాచోట్ల ఇదే పరిస్థితి. పనులు చేయాల్సిన అధికారులు తమ పని కాదన్నట్లుగా వ్యవహరించారు.

సభాసంఘం సిఫార్సులే తరువాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఆర్వో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారు. ఈ క్రమంలోనే 11 మంది ఉద్యోగులపై సస్పెన్షన్ వేటుపడింది. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సభాసంఘాన్ని నియమించారు. ఛైర్మన్‌గా జిల్లాకే చెందిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోని కమిటీ అక్రమాలపై ఎలాంటి చర్యలకు సిఫార్సు చేస్తుందన్నది చూడాలి.

ఇళ్ల నిర్మాణాలకూ

స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకోవాలంటే పాస్‌పుస్తకాలను కుదువపెట్టాలి. లేదంటే అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని బ్యాంకర్లు నిర్ధారించుకోవాలి. భూమిని తాకట్టు పెడితే సంబంధిత మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలి. బైరెడ్డిపల్లె, వి.కోట, పలమనేరు, పుంగనూరు, నగరి, మదనపల్లె, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు తదితర శాఖల్లో వైకాపా నేతల కోసం ఈ నిబంధనలను పక్కన పెట్టారు. పొలం లేకున్నా, పంట వేయకున్నా విచ్చలవిడిగా అప్పులు ఇచ్చి ఆ పార్టీ నాయకులను ఆర్థికంగా బలోపేతం చేసి సహకార సంఘాలను నిర్వీర్యం చేశారు. వి.కోట మండలంలో వైకాపా నేత ఇంటి నిర్మాణానికి రూ.40 లక్షల అప్పు ఇచ్చారు. అదే నేతకు రూ.1.60 కోట్ల పంటరుణం మంజూరు చేశారు. ఇదేతరహాలో మరికొందరికి గృహ రుణాలు ఇచ్చారు.

చలికి వణుకుతోంది 'రొయ్యో'

■ వైరస్‌బారిన పడి మృత్యువాత ■ రైతులకు వరుస నష్టాలు

రొయ్య రైతులు వరుసగా నష్టపోతున్నారు. ప్రస్తుతం దిత్వా తుపాను దాటికి నాలుగురోజులుగా నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల కంటే పడిపోయాయి. ఈ నేపథ్యంలో రొయ్య చలితో గజగజలాడుతోంది. మేత తినకుండా స్తబ్దుగా ఉంటోంది. వైరస్ బారిన పడుతూ చివరికి మృత్యువాత పడుతోంది. దీంతో కొందరు రైతులు తక్కువ కౌంట్‌తోనే వాటిని పట్టి విక్రయిస్తున్నారు. పెట్టుబడులు రాకపోగా ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టపోతున్నట్లు ఆక్వారైతులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, కోట**

మత్స్యశాఖ ఎఫ్‌డీవో రెడ్యానాయక్ సూచనలు

సాగు విస్తీర్ణం : 9,000 ఎకరాలు

60 రోజులకు 10 - 12 గ్రాములు ఉండాల్సి ఉండాలి. ప్రస్తుతం అందులో సగం కూడా లేన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● చెరువులో కనీసం 5 అడుగుల మేర నీరు ఉండేలా చూసుకోవాలి. ● పక్క చెరువు నుంచి వైరస్ వ్యాపించకుండా బయో సెక్యూరిటీ విధానాలు పాటించాలి. ● రోజులో ఉష్ణోగ్రత అధిక ఉన్న సమయంలో మేత ఎక్కువగా వేయాలి. ● రోగనిరోధకశక్తిని పెంచే సీ విటమిన్, పొటాషియం, మెగ్నీషియం ఖనిజాలు తగు మోతాదులో అందించాలి. ● తగినన్ని ఏరియేటర్లు అమర్చి ఆక్సిజన్ సక్రమంగా అందేటట్లు చూస్తే నాణ్యత కలిగిన రొయ్య పెరుగుతుంది.

భవితకు.. పటిష్ఠ నిర్మాణం

☛ లీన్ కన్‌స్ట్రక్షన్స్ కాన్ఫరెన్స్‌లో వక్తలు

ప్రదర్శనలను తిలకిస్తున్న పరిశోధక విద్యార్థులు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: లీన్ కన్‌స్ట్రక్షన్స్‌పై నిరంతర పరిశోధనలతో వినూత్న మార్పులకు అవకాశం లభిస్తోంది. ప్రస్తుతం సాధించిన దానికంటే మరింత సులభతరంగా, తక్కువ సమయంలో, ఖర్చులు తగ్గించుకునేందుకు మరిన్ని సులభతర మార్గాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అవసరమైన ఆవశ్యకతలపై తిరుపతి ఐఐటీ వేదికగా నిర్వహించిన '8వ లీన్ కన్‌స్ట్రక్షన్స్ కాన్ఫరెన్స్' మరింత దోహదపడుతుందని ఔత్సాహిక పరిశోధకులు స్పష్టం చేశారు.

నిరంతర ప్రణాళికలు అవసరం

నిర్మాణరంగంలో నిర్దేశిత ప్రాజెక్టు ప్రారంభం నుంచి నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రణాళిక ప్రకారం పనులు చేయాలి. చేపట్టాల్సిన పనుల గురించి వారానికో పర్యాయం విధిగా చర్చించుకోవడం, అటు నిర్మాణ యాజమాన్యానికి, మానవ వనరుల విభాగానికి మధ్య వారధిగా లీన్ కన్‌స్ట్రన్స్ నిలుస్తుంది. ఆసక్తిగల వారు 'లీన్ బిల్డర్స్' పుస్తకం ద్వారా మరింత సమాచారాన్ని అందిపుచ్చుకోవచ్చు. **- రాఘవి ప్రభాహరన్, అసిస్టెంట్ మేనేజరు, యూఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్**

నవీన పద్ధతులు ప్రోత్సహించాలి

నిర్మాణరంగంలో మూస విధానం విడనాడి నవీన పద్ధతులు ప్రోత్సహిస్తే పనుల్లో నిర్దిష్ట వేగం స్పష్టంగా కన్పిస్తుంది. యాంత్రికీకరణతో పనులు త్వరగా పూర్తిచేసుకోవచ్చు. నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు నిర్మాణరంగంలో మార్పులు గమనిస్తూ చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీన్ కన్‌స్ట్రక్షన్స్ ఎక్సలెన్స్ (ఐఎల్‌సీఈ) లాభాపేక్ష లేకుండా ఈ తరహా పద్ధతులు ప్రోత్సహిస్తోంది. **- క్రైజాద్ కరంజవాల్, సెక్రెటరీజనరల్, ఐఎల్‌సీఈ**

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సాంకేతికను అందిపుచ్చుకోవడంలో నిర్మాణసంస్థలు, ఔత్సాహిక పరిశోధకుల పాత్ర ఎంతో ఉంది. వీటిని కూలీలు మొదలు పర్యవేక్షించే వాళ్లందరికీ తెలియజేయడం, ప్రణాళికాబద్ధంగా పనులు అప్పగించడం, నిర్దేశిత సమయంలోగా పనులు జరుగుతున్నాయా లేదా అన్న విషయమై నిశిత పరిశీలనతో పనుల్లో పురోగతి తీసుకురావచ్చు. **- ఆల్బర్ట్ థామస్, అసోసియేటెడ్ ప్రొఫెసర్, ముంబయి**

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం శ్రీవారిని 70,345 మంది దర్శించుకున్నారు. రూ. 3.43 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

15 వేల టోకెన్ల జారీ

తిరుపతి (తితిదే): తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు మంగళవారం 15 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం వేకువజామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

8 నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈనెల 8వ తేదీన పాఠశాల, పదో తేదీన మండల, 12వ తేదీన జిల్లా స్థాయి ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో గత నెల 3 నుంచి 12 వరకు నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ నారాయణమ్మ మంగళవారం విడుదల చేశారు. 95 శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

10 వరకు పరీక్ష రుసుం గడువు

చిత్తూరు విద్య: సార్వత్రిక పాఠశాల పరిధిలోని పది, ఇంటర్ పరీక్షలకు తత్కాల్ అపరాధ రుసుము రూ. 600తో ఈనెల 10 వరకు చెల్లించవచ్చని డీఈవో వరలక్ష్మి తెలిపారు. దరఖాస్తులను మీ సేవా లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

ఆరోగ్య సవాళ్లపై.. అతివల శోధన

పరిష్కారం దిశగా మహిళా వర్సిటీ గృహవిజ్ఞాన విభాగం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం సాధ్యమవుతుంది. ఆ దిశగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ గృహవిజ్ఞానశాస్త్రం ముందడుగు వేస్తోంది. ఈ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థినులు సమాజంలో మహిళలు ప్రధానంగా యుక్తవయసు బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు సూచించేదిశగా శాస్త్రీయపద్ధతుల్లో పరిశోధనలు చేస్తున్నారు. బత్తుల అర్చన, రామినేని సాహిత్య, విశాలాక్షి లోతైన అధ్యయనాలకు ఆచార్య బిందు మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

రక్తహీనత నియంత్రించేలా..!

జిల్లాకు చెందిన కౌమార బాలికల్లో రక్తహీనత ఎక్కువగా కనిపిస్తోంది. ఈ లోపంతో శరీరంలోని అవయవాలకు ఆక్సీజన్ సరఫరా సరిగ్గా జరగకపోవడం తద్వారా అలసట, బలహీనత, తలనొప్పి, ఏకాగ్రతలోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యకు సహజంగా లభించే ఆకుల నుంచి ఏదైనా పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో మునగ ఆకులపై పరిశోధనలు చేశా. మునగ ఆకు, సజ్జలు, నల్లనువ్వులు, బెల్లంతో లడ్డూ తయారు చేసి క్రమం తప్పకుండా రక్తహీనత ఉన్న బాలికలకు అందించా. రెండునెలల్లోనే వారిలో హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. రక్తహీనత తగ్గించడంలో మునగాకు పాత్ర కీలకంగా మారింది. **- విశాలాక్షి**

పీసీవోఎస్ సమస్యకు చెక్

పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీవోఎస్) అనేది మహిళల్లో కనిపించే హార్మోన్ల అసమతుల్యత. దీనివల్ల అండోత్పత్తి సక్రమంగా జరగక అండాశయాల్లో చిన్నగడ్డల వంటి సిస్టులు ఏర్పడతాయి. కౌమారదశలో ఉన్న యువతుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. పరిష్కారానికి అవిసె గింజలతో పరిశోధనలు చేస్తున్నా. వాటిలో లభించే లిగ్నాన్స్ శరీరంలో ఈస్ట్రోజెన్ ఉత్పత్తిని నియంత్రించి హార్మోన్ల అసమతౌల్యం తగ్గించడంలో సహాయపడతాయి. **- రామినేని సాహిత్య**

యువతుల్లో ఊబకాయంపై..

'అధిక బరువు, ఊబకాయం ఉన్న బాలికల పోషకస్థితి, ఒత్తిడి'పై పరిశోధన చేస్తున్నా. పౌష్టికాహారం లోపం, జంక్‌ఫుడ్, శారీరక శ్రమలేమితో ఊబకాయం బారినపడిన 18, 19 ఏళ్ల వయసున్న 75 మంది బాలికలను గుర్తించా. నా పరిశోధనలో భాగంగా ఆరునెలలపాటు వారితో డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం రోజూ యోగా, ఏరోబిక్స్ చేయించా. డైట్ ఫాలో అయ్యేలా చేశా. తర్వాత 55 శాతం మంది సాధారణ బరువుకు వచ్చారు. **- బత్తుల అర్చన**

తీర ప్రాంతాల్లో దిత్వా జడి

తడ : ఇంట్లో చేరిన నీరు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా దిత్వా వర్షాలు మంగళవారం కొనసాగాయి. ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షాలతో ప్రజానీకం ఇక్కట్లకు గురయ్యారు. సముద్ర తీర ప్రాంతాల్లో జోరుగా వర్షం కురుస్తోంది. వాకాడు, కోట, తడ, చిట్టమూరు మండలాల్లో రాత్రి అత్యధిక వర్షపాతం నమోదైంది. బుధవారం తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఆస్తి, ప్రాణనష్టం లేకపోయినా పంటపొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వర్షపాతం (మి.మీ.లలో)

వాకాడు:	92.08
చిట్టమూరు:	87.02
తడ:	80.08
దొరవారిసత్రం:	64.00
కోట:	58.02
సత్యవేడు:	57.00
సూళ్లూరు పేట:	55.00
బీఎన్‌కండ్రిగ:	50.06
వరదయ్యపాళెం:	46.08

జేసీబీ సాయంతో తరలిస్తున్న అధికారులు

భక్తులు సురక్షితం.. ఏర్పేడు: ముసలిపేడు అటవీప్రాంతంలో కొండపై వెలసిన శ్రీబత్తినయ్య ఆలయానికి వెళ్లిన భక్తులను అధికారులు సురక్షితంగా తీసుకొచ్చారు. శ్రీకాళహస్తికి చెందిన 22 మంది భక్తులు సోమవారం రాత్రి బత్తినయ్యకోనలో నిద్రచేశారు. మంగళవారం తిరిగొస్తున్న క్రమంలో కొండకింద అటవీప్రాంతంలో వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో కాలువ దాటలేక భయంతో కుటుంబ సభ్యులకు చరవాణిలో సమాచారమిచ్చారు. ఏర్పేడు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో అధికారుల బృందం వాగు వద్దకు చేరుకుంది. జేసీబీతో అతికష్టమ్మీద కొందరు ఎస్టీకాలనీ వాసులను భక్తుల వద్దకు చేర్చారు. వీరు అటవీ ప్రాంతంలోని కాలినడక దారి నుంచి రాత్రికి సురక్షితంగా ముసలిపేడుకు చేర్చడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

తితిదే ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన తితిదే ఉద్యోగులకు బహుమానంగా 10 శాతం పెంపుదలతో మంగళవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. శాశ్వత ఉద్యోగులకు రూ. 1,540 పెంచి రూ. 15,400, ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు రూ. 754 పెంచి రూ. 7,535 మంజూరు చేస్తున్నట్లు జీవోలో పేర్కొంది.

13న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తెలిపారు. సివిల్, ప్రమాద బీమా, చెక్ బౌన్స్, కుటుంబ వివాదాలు, రెవెన్యూ తదితరాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

అరుణసారిక, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మహిళలకు ఆపదా.. ఉందిగా 181

సమాజంలో హింసకు గురవుతున్న లేదా ఆపదలో ఉన్న మహిళలకు అండగా ఉచిత ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబరు 181 ఉపయోగపడుతుందని రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద వాహనం ఉంటుందని.. ఈ వాహనాన్ని ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి వినియోగించుకోవచ్చన్నారు. **- న్యూస్‌టుడే, తిరుపతి(కలెక్టరేట్)**

గ్రేటర్‌తోనే తిరుపతి అభివృద్ధి

సమావేశంలో మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన తిరుపతి మరింత అభివృద్ధి చెందాలంటే గ్రేటర్‌తోనే సాధ్యమవుతుందని.. ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు అడుగులేస్తూ ఎన్నికలకు సిద్ధం చేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం తిరుపతిలోని కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై మంత్రి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో చర్చించిన అంశాలను మంత్రి మీడియాకు వివరించారు. 'గతనెల విశాఖలో సీఐఐ సమ్మిట్ ద్వారా రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడులతో 15 లక్షల మందికి ఉపాధి రానుంది. తిరుపతి కేంద్రంగా రాయలసీమ జోన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా పర్యాటక ప్రాంతం కావడంతో ఎక్కువ ఆదాయం ఈ రంగం నుంచే వస్తోంది. సందర్శకులకు మరిన్ని సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తాం. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో జలాశయాలు నిర్మిస్తాం. త్వరలో శెట్టిపల్లి భూముల లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తాం' అని మంత్రి అన్నారు. కలెక్టర్ డా. వెంకటేశ్వర్, జేసీ మౌర్య, ఎస్పీ సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్సీలు కల్యాణ చక్రవర్తి, సిపాయి సుబ్రహ్మణ్యం, కార్పొరేషన్ల ఛైర్మన్లు నరసింహయాదవ్, సుగుణమ్మ, సీఆర్ రాజన్, రుద్రకోటి సదాశివం, డీసీసీబీ ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరుగెడితే హర్షా తిరేకమే

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: ఏడేళ్ల వయసులో విద్యుత్తు ప్రమాదంతో కుడి చేయి సగం కోల్పోయినా లక్ష్యం కోసం పరుగు తీస్తున్నాడు తిరుపతికి చెందిన పారా అథ్లెట్ ఉయ్యాల మోహన్ హర్ష(24). క్రీడలకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు. బలహీనతను విడిచి సాధారణ వ్యక్తుల్లా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ప్రపంచ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఇతని ప్రస్థానంపై కథనం.

● తల్లి సుకన్య గృహిణి, తండ్రి బాబు ఎన్ఎఆర్ఎల్‌లో సహాయ టెక్నికల్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్న హర్ష విద్యలోనూ రాణిస్తున్నాడు. ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ నేతృత్వంలో శిక్షణ పొందుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నాడు. వచ్చే ఏడాది జరగనున్న ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీలకు సన్నద్ధమవుతున్నాడు.

ఇవీ విజయాలు

■ దుబాయ్‌లో ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్-2023లో 100మీ పరుగులో రజతం.
■ బెంగళూరులో భారత పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్- 2024లో 100మీ పరుగులో కాంస్య పతకం.
■ పుణెలో జరిగిన జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్- 2023లో 100మీ పరుగులో కాంస్య పతకం.
■ బెంగళూరులో జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 100, 200మీ పరుగులో, 2022లో జరిగిన 100మీ పరుగులో స్వర్ణ పతకాలు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

పర్యాటక శాఖ మనుగడ ప్రశ్నార్థకమేనా..?

☛ తిరుపతి డివిజన్‌లో ఇదీ దుస్థితి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: నిన్నటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యాటకానికి పెట్టింది పేరు. రాష్ట్రంలో అత్యధిక ఆదాయం ఆర్జిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన తిరుపతి పర్యాటక డివిజన్ ఇప్పుడు మనుగడ సాగించడమే కష్టంగా మారింది. పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించిన ప్రభుత్వం పర్యాటక శాఖను గాలికొదిలేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పురాతన, ప్రఖ్యాత ఆలయాలు, చారిత్రాత్మక ప్రాంతాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జలపాతాలు వంటి విభిన్న పర్యాటకావకాశాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి, హార్సిలీ హిల్స్, శ్రీకాళహస్తి, కుప్పం, చంద్రగిరి కోట, కైలాసనాథ కోన, పులిగుండు ప్రాంతాలు పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు రిసార్టులు, కాటేజీలు, అద్దె గదులు, సమావేశ మందిరాలు, హోటళ్లు, ఇతర సదుపాయాల ద్వారా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం ఆర్జించేది.

పడిపోయిన ఆదాయం

నిన్న మొన్నటి వరకు ఏటా రూ.7 కోట్లకు పైగా ఆదాయం ఆర్జించిన పర్యాటకశాఖ ప్రస్తుతం రూ.2.50 కోట్లకు మించి ఆదాయం దక్కించుకున్న దాఖలాలు లేవు. అందులో జీతభత్యాలు, ఇతర ఖర్చులు రూ.2.10 కోట్ల దాకా వెచ్చిస్తున్నారు. 400 మందికి పైగా ఉద్యోగులు పర్యాటకశాఖలో సేవలు అందిస్తున్నారు.

తిరుమల దర్శన ప్యాకేజీలతోనే ఊరట

పర్యాటక శాఖకు ప్రధాన ఆదాయ వనరు తితిదే. సింహభాగం ఆదాయం తిరుమల దర్శన ప్యాకేజీలు, తిరుమలలో పర్యాటకశాఖ హోటళ్ల ద్వారా లభిస్తోంది. హార్సిలీహిల్స్ మినహా అన్ని యూనిట్లు నామమాత్రంగా ఆదాయం పొందుతున్నాయి. పర్యాటకశాఖ ద్వారా నిత్యం వెయ్యి నుంచి 1500 మంది వరకు శ్రీవారి దర్శనం కోసం అనుమతించేవారు. వారికి అవసరమైన బస్సులు, బస, భోజన వసతి, గైడ్ సౌకర్యాలను పర్యాటకశాఖ సమకూర్చి ఆదాయాన్ని ఆర్జించేది.

పునరుద్ధరిస్తేనే నష్టాలు తీరేది?

ఏడాది క్రితం పర్యాటకశాఖకు కేటాయించే రూ.300 టికెట్లను తితిదే రద్దు చేయడంతో పర్యాటకశాఖకు చెందిన 18 అధునాతన వాహనాలు షెడ్డుకే పరిమితమయ్యాయి. 60 మందికి పైగా డ్రైవర్లు, సిబ్బంది విధులు లేక ఖాళీగా ఉంటున్నారు. తిరుమల శ్రీవారి దర్శన ప్యాకేజీలు పునరుద్ధరిస్తే తప్ప పర్యాటకశాఖకు నష్టాల నుంచి ఊరట లభించదు.

ప్రక్షాళన చేసే అధికారులేరీ?

తిరుపతి జిల్లా పర్యాటకశాఖను పట్టిపీడిస్తున్న మరో కీలక సమస్య డిప్యూటేషన్‌పై వచ్చే అధికారులు. ప్రస్తుతం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా రమణ ప్రసాద్ కొనసాగుతున్నారు. పులివెందులలో వైకాపా నేత సమీప బంధువు కావడంతో కడప, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల పర్యవేక్షణ బాధ్యతల్ని, రాష్ట్రంలోని ఏకైక స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ బాధ్యతల్ని అప్పగించారు. పర్యాటకశాఖ విధులను పక్కనబెట్టి వ్యక్తిగత ప్రచార కార్యక్రమాలతో ఆయన కాలం గడిపారు. మంత్రి రోజాకు అనధికారిక వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన నాటి సెట్విన్ సీఈవో మురళీకృష్ణారెడ్డి సైతం ఆ పదవిని దక్కించుకునేందుకు కూటమి నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారు. తిరుపతి జిల్లా పర్యాటక శాఖాధికారి జనార్దన్‌రెడ్డి సైతం వైకాపా హయాంలో కీలక పదవులు అనుభవించి కూటమి ప్రభుత్వం రాగానే తిరిగి జిల్లా స్థాయి పదవికి వచ్చారనే విమర్శలున్నాయి. ఇలాంటి అధికారులతో పర్యాటకశాఖకు పూర్వవైభవం తీసుకుని రావడం ఎలా సాధ్యమనే చర్చ జరుగుతోంది.

గూడు కరవై..

తిరుపతి పర్యాటక శాఖకు ప్రస్తుతానికి నిలువ నీడ లేదనే చెప్పాలి. గతంలో తితిదేకి చెందిన శ్రీనివాసం, శ్రీదేవి కాంప్లెక్స్‌లలో పర్యాటకశాఖ కార్యాలయాలను నడిపింది. అద్దె భారం ఎక్కువ కావడంతో అలిపిరి బైపాస్ లోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో తలదాచుకుంటున్నారు. రుయా ఆసుపత్రి ఎదురుగా పర్యాటకశాఖకు చెందిన భవనం 2011 నుంచి అసంపూర్తిగా ఉంది. దీన్ని పూర్తిచేసి పాలన సాగించాలన్న ఆశ దశాబ్దాలుగా కలగానే మిగిలింది.

నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించండి

మంత్రికి ఎమ్మెల్యేల విన్నపాలు

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: తమ నియోజకవర్గాల్లోని సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి సహకారం అందించాలంటూ ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యేలు కోరారు.

సమావేశంలో ఎమ్మెల్సీ చక్రవర్తి, ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, నాని, సుధీర్‌రెడ్డి, నేతలు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ఓజిలి, పెళ్లకూరు, తడ మండలాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేసి పేదల ఇళ్ల స్థలాలకు పంపిణీ చేయాలి. మేనకూరు సెజ్‌లో ఆక్రమణలు తొలగించాలి. **- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే**

రేణిగుంటను తిరుపతిలో చేర్చాలి

తిరుపతి గ్రేటర్ చేయడాన్ని సమర్థిస్తున్నాం. అయితే రేణిగుంట మండలాన్ని పూర్తిగా గ్రేటర్ తిరుపతిలో చేర్చాలి. మారిటోరియల్ పీరియడ్ పదేళ్లు ఉండేలా చూడాలి. మహాశివరాత్రి నాటికి తొండమనాడు నుంచి శ్రీకాళహస్తి వరకు రోడ్డు నిర్మించాలి. శ్రీకాళహస్తి పరిధిలోని పోలీసు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలి.
- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

నిషేధిత జాబితా నుంచి మినహాయించండి

తిరుపతి నియోజకవర్గం పరిధిలోని అనేక కాలనీలు 22ఏ పరిధిలో ఉన్నాయి. నిషేధిత భూములకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలి. మంగళం ప్రాంతానికి కొత్త పైపులైన్లు వేయాలి. శెట్టిపల్లె ఆదాయాన్ని తిరుపతి అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలి. **-ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే**

కనకదుర్గమ్మ ఉత్సవాల తరహాలో నిర్వహించాలి

'విజయవాడ కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల తరహాలో తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై కొత్తగా బ్రిడ్జి పనులు చేపట్టాలి. తుమ్మగుంటలోని తుడా క్రికెట్ స్టేడియం, జిమ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి **- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే**

సత్యవేడు డివిజన్ చేయాలి

సత్యవేడును రెవెన్యూ డివిజన్‌గా చేయాలి. రాయలచెరువు తెగిపోవడంతో నష్టపోయిన ప్రజానీకాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. నష్టపరిహారం అందించాలి.
-కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

వంతెన పూర్తి చేయండి

గూడూరులో ఓవర్ బ్రిడ్జ్ పనులు 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పూర్తి చేయాలి. తిక్కవరం పాఠశాలలో 300 మంది విద్యార్థులకు తల్లికి వందనం తల్లి ఖాతాల్లో జమ కాలేదు.
-పాశం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

సెజ్ ఏర్పాటు చేయాలి

వెంకటగిరి నియోజకవర్గం పరిధిలో దాదాపు 1000 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. అందులో సెజ్ ఏర్పాటు చేయాలి. **- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి ఎమ్మెల్యే**

❖ గరుడ వారధిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాల రాకపోకలు నిషేధించాలి.
- దివాకర్‌రెడ్డి, తుడా ఛైర్మన్

శంఖువేది గోవిందా!

తిరుపతి నుంచి తిరుచానూరుకు వెళ్లే మార్గంలో ఉన్న శ్రీనివాస ఉద్యానవనంలో నిరుపయోగ వాహనాల విడిభాగాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, శంఖుచక్రనామాలు తయారు చేశారు. పార్కుకు వచ్చే సందర్శకుల్లో భక్తి భావాన్ని పెంపొందించేలా ఏర్పాటు చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తుప్పు పట్టి పడిపోయిన శంఖు.. శ్రీదేవి అమ్మవారి నమూనాలు కనిపిస్తున్నాయి.
-ఈనాడు, తిరుపతి

బస్సులే కాదు.. నీళ్లూ నిలుస్తాయ్

తిరుపతిలోని ఏడుకొండల బస్టాప్ వద్ద తాజా వర్షాలకు దుస్థితిది. చినుకు పడితే చాలు సెంట్రల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయం అవుతుంది. రహదారి రాళ్లు తేలి గుంతలమయమై ప్రమాదకరంగా మారుతుంది. రాకపోకలు సాగించే భక్తులు, విద్యార్థులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

వైభవంగా చక్రతీర్థ ముక్కోటి

శ్రీచక్రత్తాళ్వారు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీవారి ఆలయ అర్చకులు, పరిచారకులు, భక్తులు ఊరేగింపుగా చక్రతీర్థానికి చేరుకున్నారు. అక్కడ శ్రీచక్రత్తాళ్వార్, శ్రీ నరసింహస్వామి, శ్రీఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం, హారతి చేపట్టారు.

శాస్త్రోక్తంగా భరణీ వైభవం

దీపాలను ఊరేగింపుగా తెస్తున్న అర్చకులు, అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తికం, భరణీ నక్షత్రం సందర్భంగా భరణీ దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చొక్కాని ఉత్సవానికి నాందిగా మంగళవారం ముక్కంటి ఆలయ ఆవరణలోని జ్ఞానాంబిక ఆలయం వద్ద ఈ విశేషోత్సవాన్ని ఆగమోక్తంగా జరిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
హెల్త్ డిపార్ట్‌మెంట్
ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Roc.No.TTD-33021(40)/3/2025-HEALTH-TPT తేదీ: 01-12-2025

తి.తి.దే., తిరుపతి హెల్త్ డిపార్ట్‌మెంట్ వారిచే టెండరు ఐడి.870435 మరియు NIT No:TTD-33021(40)/3/2025-HEALTH ప్రకారం 04 నెలల కాల వ్యవధికి గాను అనగా డిసెంబరు-2025 నుంచి మార్చి-2026 వరకు విఐపి బంగ్లాలకు పంపిణీ చేసేందుకు గాను స్పెషల్ శానిటరీ ఐటమ్స్ సేకరణ నిమిత్తం స్వల్ప కాలిక ఈ-టెండర్లు (1వ పిలుపు) ఆహ్వానించడమైనది. తదుపరి వివరాల కొరకు లాగాన్ అవ్వవలసిన తితిదే వెబ్‌సైట్ www.tirumala.org లేదా https://tender.apeprocurement.gov.in.

TTD-40021/10/2025-PRO SEC (Adv.No:306), Dt: 02-12-2025 కార్యనిర్వహణాధికారి

శ్రమించారు.. విజేతలయ్యారు!

జాతీయ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా ఆటగాళ్లు

సాధనలో ఆటగాళ్లు

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: క్రమశిక్షణ, నిత్య సాధనతో ఖోఖో బరిలో దిగి ప్రత్యర్థిని మట్టి కరిపిస్తున్నారు. ప్రయత్నిస్తే అసాధ్యమేమీ కాదని నిరూపిస్తున్నారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బాలబాలికలు. విశాఖలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఆటల కోటలో కుంభ స్థలాన్ని కొడతాం అంటూ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

యువశ్రీ కేక

పట్టుదల, నిరంతర సాధనతో ఖోఖోలో సత్తాచాటింది యువశ్రీ. బంగారుపాళ్యం మండలం టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. నాలుగేళ్లుగా సాధన చేస్తోంది. గతంలో ఖేలో ఇండియా జాతీయ పోటీల్లో పాల్గొంది. తాజాగా రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం గెలిచి.. జాతీయ పోటీలకు అర్హత సాధించింది. జాతీయ స్థాయిలో పతకం సాధిస్తానని ధీమాగా చెబుతోంది.

గాయాల్ని అధిగమించి..

సూర్యనారాయణ.. బంగారుపాళ్యంలోని ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఇతను ఖోఖో అంటే ఆసక్తితో శిక్షణలో చేరాడు. పలుసార్లు గాయాలపాలైనా మొక్కవోని దీక్షతో ఆటంకాల్ని అధిగమించి నైపుణ్యం సాధించాడు. తాజాగా రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం గెలిచి.. జాతీయ పోటీల్లో పతకం సాధించాలన్న తపనతో సాధన చేస్తున్నాడు.

పరుగు నుంచి ఖోఖోకు

జయశ్రీ.. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. పరుగు పోటీల్లో చురుగ్గా ఉన్న బాలికను గమనించిన శిక్షకులు ఖోఖో శిబిరంలో చేర్పించారు. సాధన చేసిన జయశ్రీ.. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్వర్ణం గెలిచి.. జాతీయ పోటీలకు అర్హత సాధించింది.

బద్రీనాథ్ సత్తా

బద్రీనాథ్.. ఖోఖోలో చిచ్చర పిడుగులా రాణిస్తున్నాడు. బంగారుపాళ్యం ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు దినసరి కూలీలు. విశాఖలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంలో కీలకంగా వ్యవహరించాడు. జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

అతిథికి కలంకారి సత్కారం

తిరుపతి ఐఐటీ ఏర్పడినప్పటి నుంచి శ్రీకాళహస్తి కలంకారీకి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ప్రతిఏటా నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో పట్టభద్రులు, ఆచార్యులు కలంకారీ వస్త్రాలను ధరిస్తుండటం తెలిసిందే. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరేషన్(ఐఎల్‌సీ)లో పాల్గొన్న ముఖ్య అతిథిలకు సైతం కలంకారీ వస్త్రంతో ప్రత్యేకంగా తయారు చేసిన చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి సత్కరించారు. దేశ, విదేశాలకు చెందిన ప్రతినిధులకు ఇక్కడి కలంకారీ ప్రాముఖ్యతను గురించి ఐఐటీ ప్రతినిధులు గొప్పగా వివరించడం విశేషం. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

కలంకారి వస్త్రంతో తయారు చేసిన జ్ఞాపిక

సమస్యల పరిష్కారానికి 48 గంటల దీక్ష

స్టేషన్‌లోని క్రూలాబీ ముందు దీక్షలో పాల్గొన్న రన్నింగ్ సిబ్బంది

రేణిగుంట, న్యూస్‌టుడే: లోకో పైలెట్లు, సహాయ లోకో పైలెట్లకు నాలుగు నైట్ డ్యూటీల బదులు రెండు నైట్ డ్యూటీలు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఐఎల్‌ఆర్ఎస్ఏ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు జయరామ్, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో క్రూలాబీ ఎదుట సమస్యల పరిష్కారానికి 48 గంటల పాటు నిరాహార దీక్షను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఏ 50 శాతం పెరిగిన దాంతో ఇవ్వాల్సిన 25 శాతం రన్నింగ్ అలవేషన్స్ పెంచాలని, లోకో పైలెట్లు, సహాయ లోకో పైలెట్లకు హెడ్ క్వార్టర్స్ నుంచి డ్యూటీకి వెళ్లిన తర్వాత 36 గంటల లోపల తిరిగి వారి హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకురావాలని, పీరియాడికల్ రెస్టు 46 గంటలు ఉండే విధంగా ఇవ్వాలని, ఇన్‌కం టాక్స్‌లో 70 శాతం మైలేజ్ పై రిడక్షన్ ఇవ్వాలని, మహిళా లోకో పైలెట్లకు, అసిస్టెంట్ లోకో పైలెట్లకు రన్నింగ్ రూమ్‌లో తగిన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట బ్రాంచి కార్యదర్శి శ్రీధర్, నాయకులు రామకృష్ణ, రవీంద్రబాబు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

తిరుపతి - చంద్రగిరి టౌన్‌లో మెయిన్‌రోడ్‌కు అనుకొని హౌస్ - విల్లా - హోమ్‌స్టే & అపార్ట్‌మెంట్ కట్టుకునే TUDA అప్రూవల్ కొత్త వెంచర్‌లో కమర్షియల్ - రెసిడెన్షియల్ - ఇన్వెస్ట్‌మెంట్ కొరకు 100% వాస్తు Plots అమ్మబడును. సంప్ర॥ 9505502346

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

TO LET

తిరుపతి శ్రీనివాసం పక్కన వెజ్ రెస్టారెంట్ బాడుగకు ఇవ్వబడును. సంప్రదించండి. Ph: 90303 41903.

JOBS

TELE CALLERS Female Q: Any Degree & Basic System Knowledge. N.Sreenatha reddy Recovery Agency, Bairagipatteda, TPT. 9032801545.

REQUIRE Female Tele callers for Well Reputed Educational Organisation. Qual: Any Degree, Languages: Tamil/ Telugu. Sal: 8000. ✆ 91774 51646.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

ప్రభుత్వ పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో Vocational Faculty కావలెను, జీ: 28000, అన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలకు # 98487 71117, 98498 48817

అన్న క్యాంటీన్‌కు తిరుపతి నుండి చిత్తూరుకు Food Transport చేయడానికి దోస్త్ వెహికల్‌కు పర్మనెంట్ డ్రైవర్స్ కావలెను. ✆ 99661 29199.

తిరుపతి- ప్రముఖ హోటల్లో పనిచేయుటకు మేనేజర్, రూమ్ బాయ్స్ కావలెను. మంచి జీతం. అనుభవం బాషలు తెలిసిన వారికి ప్రాధాన్యం. రోజు మార్చి రోజు పని. Cont: ✆ 90303 41903.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్, రిటైర్డ్‌పర్సన్స్, వివాహితులు & యువత కావలెను. Age: 30 to 65, Qua: Inter to PG ✆ 7675095860

AP ట్రాన్స్‌కో 220 KVSS చదళ్ళ పుంగనూరు చిత్తూరు జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు కావలెను. (1) High Skilled - B.Tech (BE), డిప్లొమా EEE- OC, BC-B (W), OC (W), OC. (2) Skilled - ITI Electrical- BC-E, BC-A(W), OC, SC (W). Unskilled - 10th Pass, ST, OC, SC. సంప్ర: P.ఉదయ్‌భాస్కర్, కాంట్రాక్టర్. ✆ 70931 17989, 94402 09459.

మద్యం మత్తులో యువకుడి హత్య

హరి (పాత చిత్రం)

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో పాతగొడవల ప్రస్తావనతో మాటామాట పెరిగి ఒకరిని హత్య చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై మల్లికార్జున్ కథనం మేరకు.. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట ఎస్సీకాలనీకి చెందిన పోలూరు హరి(33)కి అదేకాలనీలోని గౌతమ్‌కు మధ్య గొడవలు జరిగాయి. తదనంతరం సఖ్యత నెలకొనడంతో ఆదివారం మధ్యాహ్నం గౌతమ్, అతని సోదరుడు ప్రేమ్‌కుమార్‌తోపాటు తమిళనాడుకు చెందిన స్నేహితులు కలిసి మద్యం తాగడానికి పోలూరు హరిని తమ ఇంటికి పిలిచారు. అందరూ మద్యం మత్తులో ఉండగా పాతగొడవల ప్రస్తావనతో వారి మధ్య మాటామాటా పెరిగింది. అన్నదమ్ములు గౌతమ్, ప్రేమ్‌కుమార్‌లు ఆగ్రహంతో అక్కడే ఉన్న బండరాయితో పోలూరు హరి తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఎవరికీ తెలియకుండా ఇంటి పక్కనే ఖాళీగా ఉన్న ఓ ఇంటి మరుగుదొడ్డిలో మృతదేహాన్ని పడేశారు. మేకలు మేపుతున్న కాపరి మృతదేహాన్ని గుర్తించి గ్రామస్థులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ రవికుమార్, సీఐ మురళి, ఎస్సై మల్లికార్జున్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. పోలీసులు నిందితుడు గౌతమ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సమాచారం. మరో నిందితుడు ప్రేమ్‌కుమార్ పరారీలో ఉన్నాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐఐటీలో క్వాంటం సాంకేతికతపై కార్యశాల

మాట్లాడుతున్న శాస్త్రవేత్త అమిత్ సక్సేనా

ఏర్పేడు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నైపుణ్యవంతమైన మానవ వనరులను బలోపేతం చేసేందుకు క్వాంటం టెక్నాలజీ పెంపొందించాల్సిన ఆవశ్యకతపై ఐఐటీలో క్వాంటం నాలెడ్జ్ క్లస్టర్(క్యూకేసీటీ) కార్యశాల నిర్వహించారు. ఐఐటీ, ఐసర్ సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించే నేషనల్ క్వాంటం మిషన్(ఎన్‌క్యూఎం)ను మంగళవారం ప్రారంభించారు. క్వాంటం కంప్యూటరింగ్, ఆల్గోరిథం, సురక్షిత కమ్యూనికేషన్, ఎర్రర్ కరెక్షన్, క్వాంటం సిస్టమ్‌లకు సంబంధించిన థర్మోడైనమిక్ సూత్రాలను పుణేకు చెందిన సీడీఏసీ శాస్త్రవేత్త అమిత్ సక్సేనా వివరించారు. మద్రాస్ ఐఐటీలోని సంగ్యాన క్వాంటం కమ్యూనికేషన్ హబ్‌తో నేషనల్ క్వాటంమిషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ , సీడీఏసీ ఆధ్వర్యంలో నైపుణ్యాలు పెంపొందించేందుకు భాగస్వామిగా మారడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్లు అరిజిత్‌శర్మ, అరవింద్, ఐఐటీఎం, హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ, పుణేతో పాటు పలు ప్రాంతాల ఆచార్యులు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వినికిడి నిర్ధారణ పరీక్షలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్థానిక కొంకావీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్‌లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఉచిత వినికిడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆడియాలజిస్టు డాక్టర్ గోపినాథ్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉచిత సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. హియరింగ్ ఎయిడ్స్ రాయితీపై అందించనున్నట్లు ప్రకటించారు.

తక్కువ ధర చెల్లించే పరిశ్రమల సీజ్

క్రషింగ్ రద్దు చేస్తామని హెచ్చరికలు

చిత్తూరు(వ్యవసాయం): తోతాపురి మామిడి రైతులకు కిలోకు రూ.8 చెల్లించాలని గుజ్జు పరిశ్రమలను ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశిత ధర కంటే తక్కువ చెల్లించే పరిశ్రమలను సీజ్ చేస్తామని జిల్లా ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి హెచ్చరించారు. గుడిపాల మండలంలోని తాసా మామిడి గుజ్జు పరిశ్రమ కిలోకు రూ.3.50, రూ.4 చొప్పున చెక్కులు జారీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీడీ పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడారు. తక్కువ చెల్లిస్తే పరిశ్రమను సీజ్ చేసి, రానున్న ఏడాదిలో మామిడి క్రషింగ్‌ను నిలిపేస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

సంజనారెడ్డి (పాతచిత్రం)

తొట్టంబేడు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక ఉరేసుకుని ఇంటర్ విద్యార్థిని సంజనా రెడ్డి(17) బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాద ఘటన తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రెండో పట్టణ ఎస్సై పార్థసారధి కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి, జయలక్ష్మి దంపతుల కుమార్తె సంజనారెడ్డి తొట్టంబేడు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కడుపునొప్పితో బాధపడుతున్న యువతి మంగళవారం తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాల కోసం వచ్చి.. బంగారు నగలు దోచి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పాల ప్యాకెట్ కావాలని దుకాణం తలుపుతట్టిన దుండగుడు వృద్ధురాలి నుంచి బంగారు ఆభరణాన్ని దోచుకెళ్లాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి శివారులోని రాజీవ్‌నగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కాలనీకి చెందిన వృద్ధురాలు నర్సమ్మ చిల్లర దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తి పాల ప్యాకెట్ కావాలని దుకాణం తలుపులు తట్టాడు. తలుపు తీసే యత్నం చేస్తున్న నర్సమ్మను వెనక్కి నెట్టేశాడు. కింద పడిపోయిన ఆమె మెడలోని 28 గ్రాముల బంగారు చైను, దుకాణంలోని కొంత నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన శకుంతల(57), కోయంబత్తూరుకు చెందిన మనోజ్(23)లు తరచూ గంజాయిని చెన్నైలోని కోయంబేడు మార్కెట్ వద్ద విక్రయిస్తున్నట్లు సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు రోజుల కిందట అనకాపల్లి వద్ద 10 కిలోల గంజాయిని రూ.50 వేలకు కొనుగోలు చేశారని తెలియడంతో సోమవారం తనిఖీల్లో ఇద్దరు పట్టుబడినట్లు తెలిపారు. వీరి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆలస్యంగా విమానం

రేణిగుంట: ప్రతి రోజు బెంగళూరు నుంచి రేణిగుంటకు చేరుకుని ఇక్కడి నుంచి విజయవాడకు వెళ్లనున్న ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం ఆలస్యంగా నడిచింది. నిర్ణీత సమయం గం.5.40లకు విమానం ఇక్కడికి చేరుకున్నా వాతావరణం అనుకూలించక పోవడంతో కాసేపు విమానం గాలిలో చక్కర్లు కొట్టింది. గం.6.20లకు అనుకూలించడంతో పైలెట్లు విమానాన్ని ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను ఎక్కించుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లింది. ఇదే విమానంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ విజయవాడకు వెళ్లారు.

(c) eenadu

తిరుపతి
• తిరుపతి • చంద్రగిరి

ప్రణాళికాధికారులతో తుడా ఛైర్మన్ సమీక్ష

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తుడా కార్యాలయంలో మంగళవారం ప్రణాళికాధికారులతో తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఎల్ఆర్ఎస్ అండ్ బీపీఎస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించి, అనధికారిక, అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రోత్సహించాలని సూచించారు. తుడా కార్యదర్శి శ్రీకాంత్ బాబు, సీపీవో దేవికుమారి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని మంగళవారం సినీ హీరో అల్లుఅర్జున్ సతీమణి స్నేహారెడ్డి, జబర్దస్త్ నటుడు రాకేష్ దర్శించుకున్నారు.

కళాశాల పేరు మార్పు

చిన్నగొట్టిగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పేరు పెట్టింది. కళాశాల పేరుని 'సిద్ధరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల'గా పిలవాలని పేర్కొంది. సిద్ధరామిరెడ్డి కుటుంబ సభ్యులు సొంత నిధులతో కళాశాల భవనం నిర్మిస్తుండటంతో ఈ పేరు పెట్టినట్లు తెలుస్తోంది. భవనం పూర్తయిన వెంటనే అధికారికంగా కళాశాల పేరుని మార్చనున్నట్లు అధికారులు తెలిపారు.

వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజనితో ఎంపికైన విద్యార్థినులు

62 మందికి ఉద్యోగాలు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: గత నెల 13 నుంచి 15 వరకు జరిగిన ప్రాంగణ ఎంపికల్లో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీకి చెందిన 62 మంది విద్యార్థినులు ఉద్యోగాలు సాధించారని వీసీ ఆచార్య వి.ఉమ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను మంగళవారం వీసీ, రిజిస్ట్రార్ ఎన్.రజని అభినందించారు.

వైకుంఠ ఏకాదశి టికెట్లు పెంచాలని వినతి

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తితిదే ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం మంగళవారం వేర్వేరుగా ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. గతంలో కేటాయించిన ఇంటి స్థలాల అంశం, ఈహెచ్ఎఫ్, ఉద్యోగుల కారుణ్య నియామకాలు, ఉద్యోగుల వెల్ఫేర్ ఫండ్ తదితర అంశాలపై చర్చించారు. ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులకు వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో 6 నుంచి 10 టికెట్లకు పెంచాలని నేతలు కోరారు.

- తితిదే నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం తరపున అధ్యక్షుడు సైలేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి వాసు, గౌరవ అధ్యక్షుడు రాజకుమార్ తదితరులు ఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులకు ఈహెచ్ఎఫ్ స్కీంలో నాలుగో తరగతి ఉద్యోగులకు అమలుపరుస్తున్న జనరల్ వార్డుకు బదులుగా షేరింగ్ రూముకు ఆమోదించినట్లు వారు తెలిపారు.

దయచేసి వినండి.. సమస్యలు పట్టించుకోండి

తిరుపతి- రేణిగుంట మధ్య ఉన్న తిరుచానూరు రైల్వేస్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. దీంతో తిరుపతి, రేణిగుంట స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ ప్రభావం పడుతోంది. ఇటీవల రెండు ప్రత్యేక, రెండు ప్యాసింజర్ రైళ్లకు టెర్మినల్‌ను ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా ప్రయాణికులకు సౌకర్యాలు లేకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.
తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే:

- ప్రయాణికులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి స్టేషన్
- దశల వారీగా అభివృద్ధి పనులతో కాలయాపన

తిరుచానూరు రైల్వేస్టేషన్

ఇవీ కేటాయింపులు

తిరుపతి, రేణిగుంట రైల్వేస్టేషన్‌లో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రేణిగుంటకు సమీపంలో తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ద.మ.రైల్వే నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు మొదటి దశలో 2016- 17లో రూ.56.38 కోట్లు మంజూరు చేసి, అందులో రూ.36 కోట్లతో బీ క్లాస్ స్టేషన్‌గా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆ పనులు 2022 నాటికి 1, 2, 3 ప్లాట్‌ఫాంలు, స్టేషన్ మేనేజర్, బుకింగ్ కార్యాలయాలు, ప్రయాణికులు వేచి ఉండే విశ్రాంతి గదులు, ప్లాట్‌ఫాంలకు రాకపోకలు సాగించడానికి సబ్‌వే వంటి పనులు పూర్తి చేశారు. రెండో దశలో రూ.10 కోట్లతో రైళ్ల రాకపోకలకు అధునాతన వీడియో డిస్‌ప్లే యూనిట్‌తో సిగ్నలింగ్ కార్యకలాపాలు ఏర్పాటు చేశారు. ఇలా దశల వారీగా మొత్తం రూ.120 కోట్లతో అభివృద్ధి చేసినప్పటికీ.. పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులోకి రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

హడావుడిగా కొన్ని రైళ్లకు టెర్మినల్

తిరుచానూరు రైల్వేస్టేషన్‌ను వెలుగులోకి తెచ్చేందుకు ఇటీవల హడావుడిగా కొన్ని రైళ్లకు టెర్మినల్ ఏర్పాటు చేశారు. తిరుపతి నుంచి ఉన్న జల్నా, సికింద్రాబాద్, చర్లపల్లి, నాందేడ్‌కు ప్రత్యేక రైళ్లు, చెన్నై, అరక్కోణం ప్యాసింజర్ రైళ్లకు తిరుచానూరుకు టెర్మినల్ మార్పు చేశారు. కానీ అందుకు తగ్గట్టుగా ప్రయాణికులకు సౌకర్యాలు లేవు. సాధారణ ప్రయాణికులు వేచి ఉండటానికి గదులు ఉన్నప్పటికీ, తాగునీరు, తినుబండారాల స్టాల్స్ వంటివి అందుబాటులో లేవు. రైలు బయలుదేరి రేణిగుంట వెళ్లాక తాగునీరు, తినుబండారాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ద.మ.రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వేస్టేషన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి, మరిన్ని రైళ్లకు టెర్మినల్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే డివిజన్ ఏర్పాటుకు సహకారం

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఎంతైనా అవసరమని ఎంపీ లావు కృష్ణదేవరాయలు అన్నారు. రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు మంగళవారం దిల్లీలో ఎంపీని కలిసి బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను వివరించారు. సంపూర్ణ సహకారం అందిస్తానని ఎంపీ తెలిపారు.

సమయపాలనతో వర్సిటీ అభివృద్ధికి కృషి

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఎస్వీయూ వీసీ నరసింగరావు అన్నారు. మంగళవారం వర్సిటీ ఆవరణలోని శ్రీనివాస ఆడిటోరియంలో బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. విధుల్లో అలసత్వం వహించరాదని, సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయరాదని వీసీ సూచించారు.

బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ రుణం మంజూరు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సమాచార మిత్ర ద్వారా రూ.2 లక్షల రుణ మంజూరు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కొత్తగా రూ.10 లక్షల తనఖా రుణాలకు దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు, పూర్వపు కోఆర్డినేటర్ హనుమంతరావు, సభ్యులు కుమార్, కార్తిక్, లీలావతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతర ఘనంగా నిర్వహించాలి

గ్రామ పెద్దలతో ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరిలో నాలుగు నడివీధుల గంగమ్మ జాతరను గ్రామస్థుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం నిర్వహించనున్న మహోత్సవాల పినపెద్దలు, గ్రామపెద్దలు మంగళవారం ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు తమవంతుగా ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామస్థులు సతీష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు, శ్రీమూలస్థానమ్మ దేవస్థానం ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గౌస్‌బాషా, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

సర్వం సిద్ధం: బుధవారం నుంచి జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. వీధులను చలువ పందిళ్లు, స్వాగత తోరణాలు, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

చౌక దుకాణం ప్రారంభం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: స్థానిక పదో డివిజన్ పరిధిలోని 35వ చౌక దుకాణాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం పునర్‌ప్రారంభించారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, ఉప మేయర్ ఆర్‌సీ మునికృష్ణ కూటమి నేతలు పులిగోరు మురళి, సామంచి శ్రీనివాస్, రాజారెడ్డి, మహేష్ యాదవ్, హేమంత్ యాదవ్, రుద్ర కిషోర్, భరణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు. చిత్రంలో కూటమి నేతలు

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ పట్టా

గోవిందు నాయక్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ ఫిజియోథెరపీ విభాగం పరిశోధక విద్యార్థి ఎం.గోవిందు నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎంఎస్ డాక్టర్ రామ్ ప్రకటించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కుమారి పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ వర్చువల్ రియాలిటీ ట్రైనింగ్ ఆన్ హ్యాండ్ ఫంక్షన్ ఇన్ సబ్జెక్ట్ విత్ స్ట్రోక్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శిల్పా కడియాల పరిశీలించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

సామాజిక సేవకు డాక్టరేట్

రమాదేవి

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతి యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ విద్యాసంస్థల అధ్యక్షురాలు ఎం.రమాదేవికి గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ యూనివర్సిటీ ఆఫ్ అమెరికా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమె పలు సేవా కార్యక్రమాలతో పాటు 44 సంవత్సరాలుగా విద్యా, సామాజిక అంశాల్లో ప్రగతి సాధించడంతో వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విద్యాసంస్థల అధినేత కె.రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్ శ్వేతా రెడ్డి, సభ్యులు ఎం.శేఖర్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కేఆర్ సుస్మిత, ఎంసీ లక్ష్మి, ప్రిన్సిపల్ వై.పద్మశ్రీ ఆమెను అభినందించారు.

వకుళమాత సేవలో మంత్రి అనగాని

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: పేరూరు బండపై వెలసిన వకుళమాత అమ్మవారిని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు.

సహస్ర దీపాలంకరణ

ముత్యాలరెడ్డిపల్లి, న్యూస్‌టుడే: రాయల్ నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సహస్ర దీపాలంకరణ కనుల పండువగా జరిగింది. రాత్రి స్వామివారికి ఊంజల్ సేవను భక్తులు ఘనంగా నిర్వహించారు.

అనుసంధాన రోడ్లు పూర్తి చేయాలి

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: స్థానిక పెద్దకాపు లేఔట్ నుంచి శ్రీనివాసం ఎదురుగా ఉన్న తిరుపతి బైపాస్ రోడ్డుకు అనుసంధాన రోడ్ల పనులు పూర్తి చేయాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రి సత్యప్రసాద్, కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్. చిత్రంలో రజనీకాంత్‌నాయుడు

కాలుష్య రహిత వాతావరణం అందించాలి

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, తనపల్లి సమీపంలోని శ్రీవాత్సల్ గురుకుల విద్యాలయం సంయుక్తంగా మంగళవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించాయి. కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజినీరు సి.హెచ్.రాజశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ శైలజ, ప్రిన్సిపల్ కె.దుర్గారావు, సహాయ పర్యావరణ ఇంజినీర్ వి.మదనమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలుష్య భావితరాలకు రహిత వాతావరణం అందించాలని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని శైలజ

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION): TIRUPATI
O.S.NO. 649 / 2024
Kadimpati Suguna ...Plaintiff
Vs.
Dhurgam Bhaskaraiah ..Defendant
SUMMONS TO DEFENDANT
Dhurgam Bhaskaraiah S/o D.Changalrayulu, Flat No.202, Vinayaka Towers, Chenna Reddy Colony, Tirupati Town & Urban Mandal, Tirupati district.
Please take summons that the plaintiff filed the above suit for recovery of suit amount against you and the same was posted for your appearance. So your are hereby called upon to appear before the Hon'ble Court on 18-12-2025 at 10.30 A.M., failing which the matter will be decided exparte.
Hearing Date:18-12.2025
// by order of court//
G.SUDHEER KUMAR REDDY
Advocate for Plaintiff, Tirupati

పొదల్లో స్తంభం.. అధికారుల చోద్యం

నేంద్రగుంట-పెనుమూరు రహదారి పక్కనే కె.ఒడ్డేపల్లి సమీపంలోని చెంచులక్ష్మి కాలనీ వద్ద విద్యుత్ స్తంభానికి చుట్టూ ముళ్లపొదలు, తీగలు అల్లుకుపోయాయి. ఆ శాఖ సిబ్బంది, అధికారులు ఇదే మార్గంలో నిత్యం ప్రయాణిస్తున్నా ఈ చోద్యం కొనసాగుతోంది. ఇదే స్తంభం ద్వారా గ్రామంలోని ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. నిత్యం స్థానికులతో పాటు పశువులు, జీవాలు ఈ స్తంభం పరిసరాల్లో సంచరిస్తుంటాయి. **-న్యూస్‌టుడే, పాకాల**

కుంగి.. ప్రమాదకరంగా మారి

చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం కూడలిలో భారీ వాహనాల రాకపోకల కారణంగా రహదారి పక్కన ఉన్న మ్యాన్‌హోల్ పైకప్పు ప్రమాదకరంగా కుంగిపోయింది. నిత్యం ఈ మార్గంలో శ్రీవారి భక్తులు వస్తుంటారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

కార్యాలయాల ప్రాంగణం ఇలా..!

కొత్తపేటలోని ఒకే ప్రాంగణంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఉపఖజానా, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వర్షాలకు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం బురద కుంటలా మారింది. ఆయా కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రజలు, అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురదలో జారిపడుతున్నారు. భారీ వర్షమొస్తే వరద ఉపఖజానా, ఇరిగేషన్, రెవెన్యూ కార్యాలయాల గడప వద్దకు చేరుకుంటోంది. **-న్యూస్‌టుడే, చంద్రగిరి**

అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణ

ఇరుకుగా ఉన్న తెలుగునగర్ రోడ్డు ఇది. నగరపాలిక పరిధిలోని రేణిగుంట రోడ్డు నుంచి తెలుగునగర్, శ్రీనివాసపురం వెళ్లే దారి చాలా ఇరుకుగా ఉంటుంది. ఇరువైపులా కొంతమంది భవన యజమానులు, దుకాణదారులు రోడ్డు ఆక్రమించి మెట్లు నిర్మించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)**



ప్రభుత్వ భూమి కబ్జా

ఆక్రమిత భూమిలో చేపడుతున్న ప్రహరీ నిర్మాణం

చంద్రగిరి, న్యూస్‌టుడే: మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఓ వైద్యుడు దర్జాగా కబ్జా చేయడంపై మంగళవారం పెద్దఎత్తున దుమారం రేగింది. తొండవాడ రెవెన్యూ లెక్కదాఖలాలోని సర్వే సంఖ్య 34లో రూ.కోట్ల విలువైన 1.5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వైద్యుడు ఆక్రమించుకున్నారు. దీంతోపాటు పంచాయతీకి సంబంధించిన రోడ్డుపై ఇనుప గేటు నిర్మించుకుని తాళాలు వేసుకున్నారు. తమ పొలాలకు ఎలా వెళ్లాలంటూ రైతులు పంచాయతీ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుడు ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలం చుట్టూ ఏకంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారని అన్నదాతలు వాపోయారు. మంగళవారం పలువురు రైతులు రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను ఆశ్రయించి ఫిర్యాదులు చేశారు. తహసీల్దారు శివరామసుబ్బయ్య మాట్లాడుతూ ఈ విషయంగా ఇప్పటికే కబ్జాదారులకు నోటీసులు ఇచ్చామని, ప్రహరీ నిర్మాణ పనులు నిలుపుదల చేయించామన్నారు. చట్టరీత్యా ఆక్రమిత ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

సజావుగా వైకుంఠ ద్వార దర్శనాల టోకెన్ల కేటాయింపు

ఈ-డిప్ ద్వారా 1.76 లక్షల టోకెన్లు జారీ చేసిన తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి ప్రారంభంకానున్న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల(మొదటి మూడు రోజులకు సంబంధించి)ను ఈ-డిప్ ద్వారా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కేటాయించారు. దాదాపు 24,05,237 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 1.76 లక్షల మందికి టోకెన్లు జారీ చేశారు. డిసెంబర్ 30వ తేదీ 57 వేలు, 31వ తేదీ 64 వేలు, జనవరి ఒకటో తేదీ 55 వేల మందికి టోకెన్లు ఉండగా వాటిని ఈ-డిప్‌లో కేటాయించారు. ఇప్పటికే డిప్‌లో టోకెన్లు జారీ అయిన భక్తులకు తితిదే ఐటీ శాఖ ఎస్ఎంఎస్‌లను పంపింది. అందులో దర్శనానికి వెళ్లే ప్రవేశమార్గం రూట్ మ్యాప్‌ను ఉంచారు. భక్తులు సులభంగా దర్శన ప్రాంతానికి చేరుకునేలా మ్యాప్ రూపొందించారు.

శేషాచలం కొండపై యువత రీల్స్

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: ఐదుగురు యువకులు ప్రమాదకరంగా శేషాచలం కొండపై రీల్స్ చేస్తూ పట్టుబడ్డారు. ఒడిశాకు చెందిన వలస కూలీలు ముఖేష్, పీటర్, ములు షికార్, బిశ్వంత్ ప్రసాద్ నౌరి, లింగం ప్రదీప్ జీవకోనలో కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరు మంగళవారం మాల్వాడి గుండం వద్దకు వెళ్లి రీల్స్ చేస్తుండగా అలిపిరి నుంచి ఏవీఎస్ఓ రమేష్ కృష్ణ గమనించారు. విజిలెన్స్ సిబ్బందిని పంపించి యువకులను తీసుకువచ్చి అలిపిరిలోని ఏవీఎస్వో కార్యాలయంలో కౌన్సిలింగ్ ఇచ్చి అలిపిరి పోలీసులకు అప్పజెప్పారు. వారు కూడా కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.

తెలుగుగంగ ప్రాజెక్టు ఇంజినీరుకు సత్కారం

దినకర్‌రెడ్డిని సత్కరిస్తున్న సహోద్యోగులు, ఆత్మీయులు

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తెలుగుగంగ ప్రాజెక్ట్ సహాయ ఇంజినీర్‌గా పానగం దినకర్ రెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. మంగళవారం ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉద్యోగ విరమణ ఆత్మీయ సత్కార కార్యక్రమానికి జలవనరుల శాఖ అధికారులు, సహోద్యోగులతో పాటు నగరంలోని పలువురు ప్రముఖులు హాజరై దినకర్‌రెడ్డి దంపతులను సత్కరించారు. విశ్రాంత సీఈలు పీవీ సుబ్బారావు, ఎం.నారాయణస్వామి, ఈఈ బాబురెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ శారద, తెలుగుగంగ ఈఈ రత్నాకర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు మంత్రికి ఆహ్వానం

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: మహిళా వర్సిటీ ఎదురుగా జనవరి 3న ప్రారంభించనున్న సావిత్రిబాయి పులే విగ్రహావిష్కరణకు రావాలంటూ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య ఆహ్వానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రిని కలిసి ఆయన ఆహ్వానపత్రికను అందజేశారు.



వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న దుంగలతో అధికారులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: వాహనం సహా తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ అటవీశాఖాధికారి వెంకటరమణ తెలిపారు. ఈనెల 2వ తేదీ భాకరాపేట-తలకోన రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా కారు వదిలి కొందరు వ్యక్తులు పారిపోయారు. కారులో ఉన్న 280 కిలోల 9 దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక డైరెక్టరేట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అన్వేషణ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ నారాయణమ్మ తెలిపారు. పోస్టర్ ప్రజంటేషన్ పోటీలో మానస గీత, కుసుమ ప్రథమ బహుమతి, ప్రేమేంద్రిక, దీపికరాజ్ ద్వితీయ బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు. మంగళవారం విద్యార్థినులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భువనేశ్వరిదేవి, నాగపద్మ, ఎస్వీయూ కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

మళ్లీ ఏనుగుల దాడులు: పంటల ధ్వంసం

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: మండలంలో మళ్లీ ఏనుగుల దాడులు ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి చిట్టేచెర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లికి చెందిన రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకరయ్య, చలపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి వరి పైరు, టెంకాయ చెట్లను ధ్వంసం చేశాయి.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

దారుల తీరు మారేనా..?

● వాహన చోదకులకు ప్రమాదాలు నిత్యకృత్యం

గుంతలమయమైన బీఎన్‌కండ్రిగ-సంతవేలూరు రహదారి

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. గడిచిన ఏడు సంవత్సరాల్లో రహదారుల నిర్వహణ పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారింది. రాష్ట్రంలో రహదారుల ఆధునికీకరణ జరుగుతున్నా సత్యవేడులో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

సిబ్బందికి ఇబ్బంది

ప్రపంచఖ్యాతి గాంచిన శ్రీసిటీలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో సిబ్బంది పని చేస్తున్నారు. వీరు నిత్యం తమ సొంత వాహనాలు, కంపెనీల బస్సుల్లో పరిశ్రమలకు చేరుకుంటారు. సత్యవేడు నుంచి ఏడు కి.మీ.ల దూరంలోని పరిశ్రమల చెంతకు వెళ్లాలంటే రెండు అడుగుల మేర లోతు గుంతల రహదారిలో ప్రయాణించాల్సి వస్తోంది. బీటీ రహదారి ఉన్నా అక్కడ తారు కనిపించే పరిస్థితి లేదు. దీంతో సత్యవేడు నుంచి వాహన ప్రయాణం నరకప్రాయంగా మారింది. నాగలాపురం నుంచి శ్రీసిటీకి వెళ్లాలన్నా అంతకంటే దారుణమైన పరిస్థితులున్నాయి.

● నాగలాపురం నుంచి 35 కి.మీ.ల దూరంలోని పరిశ్రమలకు వెళ్లేందుకు కీలకమైన టీపీకోట రహదారి ఎనిమిది సంవత్సరాల కిందట వైకాపా నేతల నడిపిన ఇసుక, గ్రావెల్ టిప్పర్‌ల ధాటికి ఛిద్రమైంది. 19 కి.మీ.ల నాగలాపురం-పీవీపురం గ్రామాల నడుమ ప్రయాణించేందుకు రెండు గంటల సమయం పడుతుందంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

● టీపీపాళెం నుంచి కన్నావరం మీదుగా వెంకటరెడ్డికండ్రిగకు వెళ్లే 14 కి.మీల రహదారిలోనూ గుంతలు అధికమవడంతో నిత్యం వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. బీఎన్‌కండ్రిగ నుంచి సంతవేలూరుకు వెళ్లే రహదారి సైతం నాలుగు సంవత్సరాల కిందట భూమిపూజ చేసినా పనులకు నోచుకోక పోవడంతో గుంతలమయమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరునిలిచి బురదమయమవడంతో ద్విచక్ర వాహన చోదకులు గుంతలను గుర్తించలేక వాహనాన్ని అదుపుచేయలేని పరిస్థితుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను ఆధునికీకరించాల్సి ఉంది.

రూ.16 కోట్లు మంజూరు

నాగలాపురం-పీవీపురం రహదారికి రూ.11 కోట్లు, కన్నావరం రహదారికి రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. ఏళ్ల తరబడి నిర్వహణకు నోచుకోని ఈ రహదారులను ఆరు నెలల్లో ఆధునికీకరిస్తాం.

- కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే

వేడుకగా ప్రదోష పూజలు

కామధేను వాహనంపై ఉత్సవమూర్తుల విహారం

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన సర్వమంగళ సమేత పల్లికొండేశ్వరుడికి ఉదయం అర్చకులు తైలాభిషేకంచేసి వెండితొడుగులతో అలంకరించారు. సాయంత్రం ఆలయంలోని ఏకాంత నందీశ్వరునికి పంచతీర్థాలతో అభిషేకించారు. అనంతరం ఉత్సవమూర్తులను కామధేనువాహనంపై ఆసీనులను చేసి ఆలయంలో ముమ్మార్లు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు, ఈవో లతలు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన యామిని

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని యామిని రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో సత్తా చాటింది. శ్రీసత్యసాయి జిల్లా చిగిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబర్ 30న జరిగిన 44కే జీల జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ప్రధానోపాధ్యాయులు మారయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు పుష్పవాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: నాగలాపురం గణపతివీధిలో మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలతో మురుగు పేరుకుని దోమలకు ఆవాసాలుగా మారాయి. **- మంజుల**

సమాధానం: రెండు రోజుల్లో కాలువలను శుభ్రం చేయిస్తాం. **- చిన్నదురైసుధ, సర్పంచి**

సత్యవేడు, న్యూస్‌టుడే: సమస్య: సత్యవేడు నుంచి శ్రీసిటీ వరకు రోడ్డు గుంతలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. **- చంద్ర, గాంధీపురం**

సమాధానం: సత్యవేడు నుంచి కదూరు రహదారి వరకు మరమ్మతులు చేయడానికి నివేదిక పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనుల ప్రారంభిస్తాం.

- ఇజ్రాయిల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

విభేదాలు విడనాడి.. విజయానికి నాంది పలకండి

వరదయ్యపాళెం, సత్యవేడు, న్యూస్‌టుడే: 2029 ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా పటిష్టమైన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తెదేపా బలోపేతంపై దృష్టి సారించాలని తెదేపా నియోజకవర్గ పరిశీలకులు మర్రెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మర్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, రమణారెడ్డి, సురేష్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగలలో తెదేపా సంస్థాగత సమన్వయ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ వర్గవిభేదాలను విడనాడి, సమష్టిగా ఏకాభిప్రాయంతో గ్రామ కమిటీలను నియమించాలని నాయకులను కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారికే ప్రాధాన్యం కల్పిస్తామని, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేరే నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వబోమని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి(సత్యవేడు), యుగంధర్‌రెడ్డి(వరదయ్యపాళెం), సుధాకర్‌నాయుడు(బీఎన్‌కండ్రిగ), తెలుగుయువత అధికారప్రతినిధి పవన్, సింగిల్‌విండో ఛైర్మన్ నందకిషోర్‌రెడ్డి, స్థానిక నాయకులు పన్నెం నిర్మల్, పరమశివం, నరసరాజు, కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తెదేపా నాయకులు

పిచ్చిమొక్కల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కస్తూరిపురంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న పిచ్చిమొక్కలను ఈవోపీఆర్‌డీ తరుణాక్ష్యరెడ్డి తొలిగించారు. మంగళవారం పిచ్చి మొక్కలు తొలిగించాలని 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈవోపీఆర్‌డీ పిచ్చిమొక్కలు తొలిగించి విద్యుత్తు సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

ఏర్పేడు: మోదుగులపాళెం ప్రధాన రహదారిపై స్వర్ణముఖినది కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద

ఏర్పేడు: బొగడ పడిన ఇసుకతాగేలి చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

కేవీబీపురం: శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డుపై కోవనూరు వద్ద వరద

రహదారులపై వరద ప్రవాహం

నిలిచిన రాకపోకలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖినదికి వరదనీరు చేరింది. మంగళవారం ఏర్పేడు-మోదుగులపాళెం రహదారిలోని స్వర్ణముఖినది కాజ్‌వేపై వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. పాపానాయుడుపేట-గుడిమల్లం ప్రధాన రహదారిలోని సీతకాలువ వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో రహదారిపై రాకపోకలు నిలిచాయి. ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని కాజ్‌వేలపై రాకపోకలు సాగించకుండా అధికారులు రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. వరదనీరు తగ్గేంత వరకు భక్తులు ఆలయానికి రాకూడదని సూచనలు జారీ చేశారు. ఇసుకతాగేలి చెరువు కలుజుకట్టకు బొగడ పడటంతో నీరు వృథా అవుతోంది. తహసీల్దార్ భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ కట్టను పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. **తొట్టంబేడు:** చిట్టత్తూరు కాజ్‌వే, కారాకొల్లు వాగులపై వరదనీటి ప్రవాహంతో సుమారు 20 గ్రామాలకు, శ్రీకాళహస్తి-కాసరం ప్రధాన మార్గంలోనూ స్వర్ణముఖినది కాజ్‌వేలపై నీటి ప్రవాహంతో 10 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. **శ్రీకాళహస్తి:** సువర్ణముఖి నదిలో ప్రవాహ ఉద్ధృతి పెరిగింది. ప్రస్తుతం చెంబేడు కాల్వకు నీటి మళ్లింపును నిలుపుదల చేశారు. సువర్ణముఖి ఆనకట్ట వద్ద ప్రస్తుతం ఐదు వేల క్యూసెక్కుల మేర ప్రవాహం సాగుతోంది. **కేవీబీపురం:** శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రహదారిలో వాహనాల రాకపోకలు నిలచిపోయాయి. ఎంఏరాజులకండ్రిగ, ఎగువపూడి కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరినాట్లు ముంపునకు గురయ్యాయి.

సువర్ణముఖి నదిలో ప్రవాహ ఉద్ధృతి

ఆధునికీకరణకు నిధులు కేటాయించండి

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలోని రహదారులను ఆధునికీకరించడానికి నిధులను కేటాయించాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. తిరుపతిలో డీఆర్సీ సమావేశానికి వచ్చిన మంత్రిని మంగళవారం ఎమ్మెల్యే కలసి వినతి పత్రం అందించారు. నియోజకవర్గంలో పలు రహదారులు అధ్వానంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిధులు విడుదలైన రెండు రహదారుల పనులను వేగవంతం చేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ర.భ. ఎస్ఈ రాజానాయక్‌ను ఎమ్మెల్యే కలసి రహదారుల పట్ల మరింత శ్రద్ధ చూపించాలని కోరారు.

మంత్రి సత్యప్రసాద్‌కు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

గంగమ్మకు విశేష అలంకరణలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని వాటర్ వర్క్స్ కాలనీలో గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు. భక్తులు పొంగళ్లు నివేదన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల వితరణ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు హరిప్రియ మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ దాత డా.రమేష్‌నాథ్ సహకారంతో అంద చేసినట్లు తెలిపారు.

తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వీకేఎం వీధివాసులు

న్యాయం చేయాలని వినతి

నాగలాపురం: మా ఇండ్ల వద్ద ఉన్న స్థలంపై కొందరు వ్యక్తులు అపోహలు సృష్టిస్తూ మమ్మల్ని వేధిస్తున్నారని వీకేఎం వీధి వాసులు తహసీల్దారు హనుమాన్‌నాయక్‌కు మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. పూర్వీకుల కాలం నుంచి తమ అనుభవంలోని భూమిని తితిదేకు చెందినదిగా చెబుతూ తమపై అభాండాలు మోపుతున్నారన్నారు. భూమిపై పూర్తి హక్కులు ఉన్న తమకు న్యాయం చేయటంతో పాటు ఆరోపణలు చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాను సమగ్రంగా విచారించి న్యాయం చేస్తానని తహసీల్దారు హామీ ఇచ్చారు.

ఆక్రమణల పట్టు.. సామాన్యులకు సిగపట్టు

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధానమార్గానికి ఉన్న వారధులను స్థానికులు ఆక్రమిస్తున్నారు. రోడ్డుకు ఆనుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో చిన్నపాటి వరదనీరు ప్రధానమార్గంపై ప్రవహిస్తోంది. ఫలితంగా రోడ్లు ఛిద్రమవుతున్నాయి. కోతలకు గురై వర్షపునీటిలో మార్గం తెలియక వాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

ఎంఏరాజులకండ్రిగ, కేవీబీపురం గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులే రోడ్డు వారధులను పూడ్చి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఒకరు పోలీసు, మరొకరు రెవెన్యూశాఖలో పనిచేసే ఉద్యోగులే ఇలా చేయడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సమస్య తెలిసినా ఆక్రమణలకు పాల్పడిన వారికి వంతు పలుకుతుండటం పట్ల వారిపై పలు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

వర్షానికి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా అధికారులు స్పందించి వరదనీరు ప్రవహించే వారధులను ఆక్రమించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. రోడ్డుకు అడ్డంగా ప్రవహిస్తున్న వరదనీటిని వారధిలో ప్రవహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సమస్యపై ఆర్అండ్‌బీ ఇన్‌ఛార్జి ఏఈ దుర్గేష్‌ను వివరణ కోరగా సమస్య ఉందని దీనిపై ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రసంగం

పట్టుపట్టి.. పతకాలు చేపట్టి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పట్టుపట్టి పతకాలను సొంతం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో మంగళవారం 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అన్న అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన లిఖిత, జాహ్నవి, రూపశ్రీలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుచరిత బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు మంజుల, రవిబాబు, బుజ్జమ్మ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుచరిత

ముక్కంటి సేవలో సీఎం కార్యదర్శి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సభ్యులతో కలసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఈయనకు ఆలయ ఈవో బాపిరెడ్డి మంగళవారం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలో రాహు, కేతు సర్పదోష నివారణ పూజలతో పాటు దర్శనం పూర్తయ్యాక ఆలయం తరపున తీర్థ ప్రసాదాలను అందజేశారు. తహసీల్దార్ జనార్దన్‌రాజు, ప్రొటోకాల్ ఏఈవో మోహన్, ఏపీఆర్వో రవి, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు

రేణిగుంట : మండలంలో సుమారు మూడు వేల మంది అర్హులకు త్వరలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు మునిచంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబుబ్‌బాషా మంగళవారం తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సమావేశంలో ఈ సమస్యను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారన్నారు. వైకాపా ప్రభుత్వంలో సుమారు మూడు వేల మంది పేదలకు పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించక పోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైకాపా నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న పేదలకు ఆన్‌లైన్లో నమోదు చేసే సమయంలో ముందే ఇచ్చినట్లు చూపించడంతో నమోదు కావడం లేదన్నారు. వారి సమస్య త్వరలో పరిష్కారమౌతుందని తెలిపారు.

ఏనాడైనా రూ.100 విరాళమిచ్చారా..?

నాగలాపురం : ఏడు సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలం ఏనాడైనా పల్లికొండేశ్వరాలయానికి రూ.100 విరాళమిచ్చారా చెప్పాలంటూ ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు ధ్వజమెత్తారు. ఆలయ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాత చేసిన విరాళానికి మర్యాద చేస్తే ఎమ్మెల్యే ఇష్టానురీతిన మాట్లాడటం దారుణమన్నారు. నాపైన కేసులేమీ నిర్ధారణకాలేదన్నారు. ఈవో లత, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తత అవశ్యం

నాగలాపురం: ఎయిడ్స్ పట్ల సమగ్ర అవగాహన, అప్రమత్తత అవశ్యమని ప్రిన్సిపల్ శ్రీలత పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు వేలాయుధం, హిమబిందు, దేవేంద్ర, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు సర్వేయర్లను వీధిన పడేయకండి సారూ..!

కేవీబీపురం: రాష్ట్రంలో లైసెన్సు సర్వేయర్‌ల కుటుంబాలను వీధినపడేయకండంటూ జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్‌లు విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిరసన తెలిపారు. మంగళవారం రెండోరోజు రాష్ట్ర సర్వేయర్ సంఘం నాయకులతో కలిసి జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్‌లు నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ వచ్చే సరికి లైసెన్స్ సర్వేయర్‌లు రోడ్డున పడ్డారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగిలి ఉన్న సర్వేయర్ పోస్టుల్లో లైసెన్స్ సర్వేయర్‌లను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఎంపిక చేయడం, 800 జీవో ప్రకారం మా లైసెన్స్‌లను రెన్యువల్ చేయాలన్నారు.

కాళంగి ఆరుగేట్లు ఎత్తివేత

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని కాళంగి జలాశయంలోకి వరదనీరు పోటెత్తడంతో ఇరిగేషన్ అధికారులు జలాశయం ఆరు గేట్ల ద్వారా వరదనీటిని దిగువకు పంపుతున్నారు. మంగళవారం జలాశయానికి పైభాగంలో వర్షం పడటంతో జలాశయానికి వరద భారీగా వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు జలాశయం ఆరు గేట్ల ద్వారా మూడు అడుగుల ఎత్తు ఎత్తి వరదనీటిని దిగువకు పంపుతున్నారు. జలాశయం సామర్థ్యం 220 అడుగులు కాగా ప్రస్తుతం 218 అడుగుల మేర నీరు చేరింది. జలాశయానికి 2,280 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా ముందస్తు 2200 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు. రాత్రి వర్షం పడుతూనే ఉండటంతో వరద ఉద్ధృతిని బట్టి మరిన్ని గేట్లు ఎత్తివేసే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతం వారు గ్రామం విడిచి కాళంగినదీ పరివాహక ప్రాంతానికి రావద్దని సూచించారు.

జలాశయం గేట్లు ఎత్తివేయడంతో పరవళ్లు తొక్కుతున్న వరద

యువతి అదృశ్యంపై కేసు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జున్ తెలిపారు. రైల్వేకోడూరుకు చెందిన యువతి(27) వివాహమై భర్తతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులు దగ్గరే ఉంటోంది. శ్రీసిటీలో ఉద్యోగ అన్వేషణలో భాగంగా వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని సోదరి ఇంటికి వచ్చింది. నవంబర్ 30వ తేదీన శ్రీసిటీలో ముఖాముఖీకి వెళుతున్నట్లు చెప్పి వెళ్లిన యువతి ఇంతవరకు రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: గుండెపోటుతో ప్రయాణికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన చంద్రన్(55) అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం కుటుంబ సభ్యులతో రేణిగుంటకు రైల్లో బయలుదేరాడు. రేణిగుంట సమీపంలోకి రాగానే రైల్లోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో పరీక్షించడంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: దిత్వా తుపాన్ నేపథ్యంలో నాలుగు రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో విద్యుత్తు స్తంభం కూలడంతో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. వరదయ్యపాళెం-పాండూరు మార్గంలో ఆదివారం ఉదయం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం హఠాత్తుగా నేలవాలడంతో అదే సమయంలో కార్మికులను తీసుకెళుతున్న ఓ కంపెనీకి చెందిన బస్సుపై వాలింది. దీంతో కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బస్సు నుంచి దిగేశారు. విద్యుతు సిబ్బందికి సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రాణగండం తప్పింది.

కంపెనీ బస్సుపై వాలిన విద్యుత్తు స్తంభం

అసలే ఇరుకు రోడ్డు.. ఆపై పార్కింగ్

స్థానిక సీహెచ్‌సీ ప్రధాన ద్వారం వద్ద బయట వ్యక్తులు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీహెచ్‌సీ మార్గంలో శ్రీసిటీలో విధులు నిర్వహించే తమిళనాడులోని ఊత్తుకోట, నాగలాపురం, సత్యవేడు మండల పరిసర గ్రామాలకు చెందిన వ్యక్తులు ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనాలను అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అంబులెన్స్, వైద్యుల కారు ఇరుక్కుపోయి అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

కాస్త మరమ్మతులైనా చేయరూ..

స్థానిక బస్టాండు ప్రాంగణం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. బస్టాండు వద్ద దుకాణ సముదాయాల చెంత అద్దెల వసూలులో ఆర్టీసీ అధికారులు చూపిస్తున్న నిబద్ధత బస్టాండు నిర్వహణలో పూర్తిగా విస్మరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో బస్టాండు ప్రాంగణం బురదమయంగా మారడంతో పాటు మరుగుదొడ్లు లేక ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. బీటీ రహదారి సైతం అధ్వానంగా మారింది. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

పైపువేస్తేనే నీరు

ఎల్లమండ్యం పంచాయతీ మర్రిగుంత ఎంపీపీ పాఠశాల ఎదుట నీటి కుళాయి మురుగులోకి చేరింది. ఇక్కడ జాతీయ రహదారి ఎత్తు పెంచడంతో మురుగు నిలుస్తోంది. దీంతో కుళాయి పక్కనే వెళ్తున్న కాలువ నీరు మొత్తం కుళాయిచుట్టూ నిలుస్తోంది. నీరు పట్టుకునే సౌకర్యం లేకపోవడంతో ఇలా పైపులు వేసి నీరు పట్టుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, రేణిగుంట

(c) eenadu

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

సమావేశంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు డివిజన్‌లో పోలీసులకు బందోబస్తు విధులను వేయడం వల్ల పట్టణంలో ట్రాఫిక్, శాంతిభద్రతలకు ఇబ్బందులు వస్తున్నాయని పరిశీలించాలని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో మంగళవారం ప్రస్తావించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసుల వాహనాలు పాతవి కావడంతో ఇబ్బందులు పడుతున్నారని కొత్తవి మంజూరు చేయాలని తెలిపారు. పట్టణంలోని పై వంతెన, పంబలేరు బ్రిడ్జి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

గ్రామానికి నీటి సరఫరా

వాకాడు: వాకాడు గ్రామ పంచాయతీ గొల్లపాలెంలో విద్యుత్తు తీగలు దెబ్బతినడంతో రెండు రోజులుగా విద్యుత్తు సరఫరా లేదు. దాంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయి. ఎట్టకేలకు గ్రామ పంచాయతీ వారు జనరేటర్ సాయంతో తాగునీటి మోటారు వేసి మంగళవారం నీరు సరఫరా చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

నాయుడుపేట, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట పట్టణం తుమ్మూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని వీధి దీపం నాలుగు రోజుల నుంచి వెలగడం లేదు. – వి.రాజేష్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – ఫజులుల్లా కమిషనర్

సమస్య: మేనకూరు గ్రామ పంచాయతీ పరిధిలో వీధి కుళాయిల వద్ద ఎక్కువగా బురద ఉంది. – శేఖర్, స్థానికుడు

సమాధానం: పాలకవర్గంతో చర్చించి కుళాయిల నియంత్రించే కార్యక్రమం చేపడతాం. – గోపాల్, పంచాయతీ కార్యదర్శి

సమస్య: మేనకూరు పంచాయతీలో వర్షాలకు తాగునీరు కలుషితం అవుతోంది. – స్థానికుడు

పరిష్కారం: పరిశీలించి క్లోరినేషన్ చర్యలు చేపడతాం. – గోపాల్, పంచాయతీ కార్యదర్శి

నాయుడుపేటపట్టణం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక విజయగణపతి ఆలయ పక్కవీధిలో రోడ్డుపై గుంతలు పడ్డాయి. – సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమాధానం: రోడ్డుపై గుంతలను పూడ్చుతాం – ఎస్‌కే.ఫజులుల్లా కమిషనర్

సమస్య: జువ్వలదిబ్బ రోడ్డులో రాకపోకలకు సమస్యగా ఉంది. – వంశీ, స్థానికుడు

సమాధానం: రోడ్డు బాగు చేసేందుకు నిధులు కేటాయించారు. పనులు చేస్తాం.

సమస్య: నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి సీఎస్‌తేజా సెంటర్ వరకు సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. – బాషా, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేస్తున్నాం – ఎస్‌కే.ఫజుల్లుల్లా, కమిషనర్

సమస్య: మేనకూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ ఆనుకుని ఉండే ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త విద్యుత్తు స్తంభాలు వేస్తున్నారు. – స్థానికులు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – హరికృష్ణ, ఏఈ

సమస్య: మల్లాం జాతీయ రహదారి వెళ్లే చోట రోడ్డు దెబ్బతింది. – విజయ భాస్కర్, స్థానికుడు

సమాధానం: రోడ్డుకు మరమ్మతులు చేస్తాం. – పరమేశ్వరి డీఈ

రూ.12 కోట్లతో చెరువుల మరమ్మతులు

మంత్రి సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: మండలంలోని 219 చెరువుల మరమ్మతులకు రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతిలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీఎంఎస్ ఛైర్మన్ గంగోడు నాగేశ్వరరావు, ఎంపీపీ తనూజారెడ్డి, సొసైటీ ఛైర్మన్ సీసీ నాయుడు, తెదేపా మండలాధ్యక్షులు పాల్గొన్నారు. **గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని గూడూరు జిల్లా సాధన సమితి నాయకులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విన్నవించారు. తిరుపతికి వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రిని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఐకాస నాయకులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్ట్ నాయకుడు పెంచలయ్యని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలి వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు.

బ్యారేజీ 8 గేట్ల ఎత్తివేత

వాకాడు : వాకాడు స్వర్ణముఖి బ్యారేజీలో మంగళవారం సాయంత్రం 8 గేట్లు ఎత్తివేసి 7 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. బాలిరెడ్డిపాలెం వంతెనపై వరదనీరు ప్రవహించే అవకాశం ఉండటంతో ముందస్తుగా తహసీల్దార్ ఇక్బాల్, ఎస్‌ఐ నాగబాబు సిబ్బందిని ఉంచి పహారా ఏర్పాటు చేశారు.

బాధ్యతల స్వీకరణ

నాయుడుపేట, న్యూస్‌టుడే: మేనకూరు గ్రామ పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా గోపాల్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. గొట్టిప్రోలు కార్యదర్శిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పుదూరు పంచాయతీ కార్యదర్శిగా గోవిందయ్య బాధ్యతలు స్వీకరించారు. నాయుడుపేట మండలం జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా గూడూరు పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులు నియమితులయ్యారు.

వేడుకగా నిప్పో వ్యవస్థాపక దినోత్సవం

తడ : నిప్పో వ్యవస్థాపకులు పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి శత జయంతి సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం తడలో వేడుకగా నిర్వహించారు. పారిశ్రామిక అభివృద్ధికి తొలి బీజం వేసిన పారిశ్రామికవేత్తగా ఓబుల్‌రెడ్డి గుర్తింపు పొందారు. ఆయన సేవలను గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం సోమవారం పొట్టిపాటి ఓబుల్‌రెడ్డి చిత్రంతో రూ.5ల పోస్టల్ స్టాంపును విడుదల చేసినట్లు నిప్పో చీఫ్ క్వాలిటీ అకౌంట్స్ అధికారి పేర్కొన్నారు.

అల్పపీడనాలు.. అధిక జలప్రవాహాలు

» బలహీనంగా చెరువు కట్టలు » ఆందోళనలో అన్నదాతలు

నాయుడుపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి గూడూరు డివిజన్‌లో గత రెండు నెలలుగా వరుసగా అల్పపీడనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో జలవనరులన్నీ నిండు కుండలా తొణుకుతున్నాయి. నిల్వ సామర్థ్యానికి తగ్గట్లు చెరువు కట్టలు పటిష్ఠంగా లేవు. దీంతో రబీలో పంటలు సాగు చేస్తున్న రైతుల్లో మరోసారి ఆందోళన నెలకొంది.

వివరాలిలా..
మొత్తం చెరువులు- 245
కట్టలు బలహీనంగా ఉన్నవి- 62
ప్రస్తుతం నాట్లు వేసిన విస్తీర్ణం - 82 వేల ఎకరాలు

స్వర్ణముఖిలో నీటి మట్టం

పూర్తి సామర్థ్యంతో నీటి వనరులు

గూడూరు, సూళ్లూరుపేట వెంకటగిరి నియోజకవర్గాల్లో స్వర్ణముఖి, కాళంగి, కైవల్య, పంబలేరు, తెలుగుగంగ ప్రధాన జలవనరులుగా ఉన్నాయి. వర్షాకాలంలో సోమశిల, కండలేరు, కల్యాణి జలాశయాల నుంచి వరద వీటి పరిధిలో ఉన్న చెరువులకు చేరుతోంది. ఈ ఏడాది రబీ సీజన్‌కు నాలుగు నెలల ముందే ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు జలాశయాలన్నీ పూర్తి సామర్థ్యంతో ఉన్నాయి. గత నెలలో మొంథా, ప్రస్తుతం దిత్వా తుపానుల ప్రభావంతో చెరువుల్లోకి మెరవ ప్రవహిస్తున్నాయి. చెరువు కట్టలు బలహీనంగా ఉండటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

గాడులు తీసి వదిలేసి

గత వైకాపా ప్రభుత్వం జలవనరుల పరిధిలో ఉన్న చెరువులు, కాలువలు కట్టలకు మరమ్మతులు చేయడం, పటిష్ఠ పరచడంలో నిర్లక్ష్యం చేసింది. తెదేపా చేపట్టిన నీరు- చెట్టు పథకం పనులు రద్దు చేసింది. తెలుగు గంగ పరిధిలోని ప్రధాన బ్రాంచి కాలువల నిర్వహణ గాలికి వదిలేసింది. సార్వత్రిక ఎన్నికల ముందు ఎన్నీఆర్ పథకం పనులన్నీ వైకాపా నాయకులు నాణ్యత లేకుండా చేశారు. చెరువుల విస్తీర్ణంలోని గ్రావెల్ తవ్వకాల కోసం కట్టలకు గాడులు తీసి సరిచేయకుండా వదిలేశారు. దీంతో చెరువు కట్టలు బలహీనంగా మారాయి.

ఇక్కడే అధికం

ఓజిలి మండలంలోని గ్రద్దగుంట, జొమ్ములవారికండ్రిగ, నాయుడుపేట మండలం విన్నమాల, తుమ్మూరు చెరువుల్లో మట్టి తవ్వకాల కోసం కట్టలకు గాడులు తీసి తూతూమంత్రంగా మరమ్మతులు చేశారు. దొరవారిసత్రం మండలం మేలనలుత్తూరు పాళెంపాడు, ఏకొల్లు, పెళ్లకూరు, చెంబేడు చెరువులు గతంలో తుపాను ధాటికి కట్టలు దెబ్బతిన్నాయి. నీటి ప్రవాహం పెరుగుతుండటంతో కట్టలు ఎక్కడ తెగుతాయోనని అన్నదాతలు బిక్కుబిక్కుమంటున్నారు.

విజేతలతో ఉపాధ్యాయ బృందం

విద్యార్థుల ఆలోచనకు పదును

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ వివేకానంద ఇంగ్లిష్ పాఠశాలలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను మంగళవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బి.జాహ్నవి, వి.త్రివేణి, బి.విద్యాశ్రీ గెలుపొందారు. కరస్పాండెంట్ కె.చంద్రమోహన్, ఉపాధ్యాయులు సునీత, స్నేహలత, రత్నశ్రీ, శివశంకర్, హరిత పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించిన ఏఈఎస్

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడులోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను మంగళవారం గూడూరు ఏఈఎస్ ఊహశ్రీ పరిశీలించారు. సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం, గంజాయి వంటి వాటిపై సీఐ ప్రసాద్‌తో చర్చించారు. ఎస్సై రసూల్ రషీద్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన (1,146) అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (892 స్కూల్ అసిస్టెంట్లు, 254 ఎస్జీటీల) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సునీల తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లకు రూ.12500, ఎస్జీటీలకు రూ.10000 గౌరవ వేతనంతో ఆరు నెలల కాల పరిమితికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. సూళ్లూరుపేట పరిధిలో ఒక ఉర్దూ స్కూల్ అసిస్టెంటు పోస్టుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: తుపానుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేనేత కార్మిక సంఘం నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వెంకటప్పయ్య, మురళీ, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న చేనేత కార్మికులు

కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హామీ అమలు చేయాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలంలో జీతాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పురపాలిక కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, కమిషనర్ వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కోటేశ్వరరావు,. జోగి శివకుమార్, రమణయ్య, మణి పాల్గొన్నారు.

ప్రతిపాదనలకు అయిదేళ్లు

గూడలి సమీపంలోని స్వర్ణముఖీ నదిపై నిర్మించిన వంతెనపై రోడ్డు అడుగుకో గుంత చందాన తయారైంది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వంతెన మీదుగా కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట మండలాలకు చెందిన 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ర.భ శాఖ అధికారులు అయిదేళ్లుగా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా పనులు మాత్రం చేపట్టలేదు. – న్యూస్‌టుడే, కోట

అంచులో నీరు నిలిచి.. పాచిపట్టి..

నాయుడుపేట విన్నమాల వద్ద 16వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా వంతెన అంచుల్లో నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉంటోంది. రింగు రోడ్డు పక్కన ఖాళీ రోడ్డుపై సిలికా శాండ్ వాహనాలు నిలుస్తుండటంతో ఇసుక కింద పడుతోంది. నీరు చేరడంతో అంచులు పాచిపడుతున్నాయి. రహదారి అంచులు శుభ్రం చేయాల్సి ఉంది. అంచుల్లో ద్విచక్ర వాహనదారులు జారీ ప్రమాదాల బారిన పడుతున్నారు. – న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

గుంత.. ప్రమాదాల చెంత

సూళ్లూరుపేట మండలంలోని మంగనెల్లూరు గ్రామంలో ర.భ శాఖ రహదారి గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి కుంగి పెద్ద గుంతగా మారింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే చోదకులు గుంత వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ర.భ శాఖ అధికారులు వెంటనే గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

కుండపోత వర్షం..స్తంభించిన జనజీవనం

తడలో జాతీయ రహదారిపై చేరిన వర్షపునీరు

కోనేపల్లి వద్ద నీట మునిగిన వరి పంట

నిండలి వద్ద కాజ్‌వేపై కైవల్య నది ప్రవాహం

తడ, న్యూస్‌టుడే: తడలో చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై నీరు చేరింది. కాదలూరు- వెండ్లూరుపాడు, మాంబట్టు- వెండ్లూరుపాడు కాజ్‌వేలపై వర్షపునీరు పొంగింది. **వెంకటగిరి:** పట్టణంలోని 14వ వార్డు బొగ్గులమిట్ట ప్రాంతంలోని నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది. **నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి:** పెళ్లకూరు కప్పగుంటకండ్రి, కలవకూరు వద్ద స్వర్ణముఖి కాజ్‌వే, ఓజిలి మండలం నెమళ్లపూడి వద్ద మామిడి కాలువ కాజ్‌పై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. **బాలాయపల్లి- డక్కిలి:** బాలాయపల్లి,డక్కిలి మండలాల్లో మంగళవారం 33.4 మి.మీ, 22 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్లు తెలిపారు. **సూళ్లూరుపేట గ్రామీణం:** మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాములకాలువ, నెర్రినాలువ, చాపా కాలువ ఉగ్రరూపం దాల్చడంతో పొలాలు నీటమునిగాయి. జంగాళపల్లి, కోనేపల్లి, జంగాళగుంట, పెద్దపడవ, పడమటకండ్రిగ, ఉలసాపడవ గ్రామాల్లో 200 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. **చిల్లకూరు:** తిప్పగుంటపాలెం జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. **కోట:** కోట, చెందోడు, కొక్కుపాడు, జరుగుమల్లి, అడ్డరోడ్డు, నెల్లూరుపల్లి, కర్లపూడి, గోవిందపల్లిపాళెం, సిద్ధవరం పరిసర ప్రాంతాల్లోని చల్లకాలువకు వరదనీరు చేరింది. చిట్టమూరు, మల్లాం సమీపంలోని రొయ్యల వాగు జోరుగా ప్రవహిస్తుంది.

మెరుగైన ఫలితాల సాధనకు సంకల్పం

✦ ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత పెంపే లక్ష్యం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులు సత్ఫలితాలు సాధించేలా కొన్ని రోజుల క్రితం సంకల్ప్ కార్యక్రమం ద్వారా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్ని ఏ, బీ, సీ గ్రేడ్లుగా విభజించింది. బాగా చదివే వారిని ఏ గ్రేడ్‌గా కేటాయించి మంచి మార్కులు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఒక మాదిరిగా చదివే వారిని బీ గ్రేడ్‌గా కేటాయించి ప్రథమ శ్రేణి మార్కులు సాధించడానికి కృషి చేస్తున్నారు. ఉత్తీర్ణత సాధించలేని వారిని సీ గ్రేడ్ కింద పరిగణించి ముఖ్యమైన ప్రశ్నలు చదివేలా సూచనలు ఇస్తున్నారు.

మూడు నియోజకవర్గాల పరిధిలో వివరాలిలా..
జూనియర్ కళాశాలలు : వెంగమాంబపురం, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు
విద్యార్థులు : 1100
లక్ష్యం : 100 శాతం ఫలితాలు
గతేడాది వచ్చినది : 75 శాతం
సంకల్ప్ అమలు : నవంబరు 24- ఫిబ్రవరి 25 వరకు(2025)
తరగతుల వేళలు :ఉదయం 9- 5 గంటల వరకు


శ్రీపెసల గురప్పశెట్టి జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు

ప్రత్యేక దృష్టి

ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం కళాశాలలోనే పోషకాహారం అందిస్తున్నారు. ప్రత్యేక తరగతులను దృష్టిలో ఉంచుకొని అల్పాహారం వడ్డిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల బోధనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విద్యార్థులు వెనుకబడిన అంశాల్లో బోధిస్తూ వారి అనుమానాలు నివృత్తి చేయడం, తరచూ పరీక్షలు నిర్వహించడం చేస్తున్నారు. సంకల్ప్ అమలు కోసం ప్రత్యేకంగా మెటీరియల్ అందిస్తున్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 18 వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. తిరుపతి ఆర్ఐవో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలల్లోని విద్యార్థులను సంకల్ప్ కార్యక్రమంతో పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని, అధ్యాపకులు పట్టుదలతో పనిచేసి సత్ఫలితాలు సాధిస్తారని తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ప్రస్తుత డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని విశ్వోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయశేఖరం అన్నారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు నారాయణ, చైతన్య, ఉమామహేశ్వరరావు, మాల్యాద్రి, యుగంధర్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

తొలగిన విద్యుత్తు స్తంభం

ఈనాడు కథనానికి స్పందన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఉగ్గుమూడి గ్రామం నుంచి డేగవారి కండ్రిగకు వెళ్లే రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభానికి ఊతంగా నిలిపిన మరో స్తంభాన్ని రోడ్డుపై నుంచి తొలగించారు. దీనిపై నేలకొరిగిన స్తంభం...రాకపోకలకు అంతరాయం..అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఏఈ జగదీష్ స్పందించి సిబ్బందితో సరిచేశారు.

కోళ్ల ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	136
లేయర్	130
బ్రాయిలర్స్	246
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	221

గూడూరులో నిమ్మ ధరలు



మొదటి రకం: కేజీ రూ. 16 నుంచి రూ. 20 వరకు
రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 15 వరకు

'అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే'

వెంకటగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే రామకృష్ణ విస్మరించారని వైకాపా సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నేదురుమల్లి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగు, తాగునీటికి మూలాధారమైన ఆల్తూరుపాడు రిజర్వాయర్, అమృత్ 2.0 వంటి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు.

బాధితులకు చెక్కు అందజేస్తున్న మాచాని గంగాధర్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: లోతువానిగుంటకు చెందిన పేట లక్ష్మణ్ బాధిత కుటుంబానికి ఎంజీ బ్రదర్స్ యజమాని మాచాని గంగాధర్ మంగళవారం రూ.6 లక్షల చెక్కును అందించారు. పేట లక్ష్మన్ పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వద్దనున్న ఎంజీ బ్రదర్స్ ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తూ మూర్తిరెడ్డి పాళెం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యాజమాన్యం రూ.6 లక్షల చెక్కు, మరో రూ.5 లక్షల ఇన్సూరెన్స్‌ను అందజేసింది. ఏజీఎం మల్లికార్జున్ హెచ్‌వోడీ బద్రి పాల్గొన్నారు.

WANTED
గొలగమూడి కన్‌స్ట్రక్షన్
నెల్లూరు, తిరుపతి జిల్లాలలో A.P.ట్రాన్స్‌కో నందు కాంట్రాక్ట్ పద్ధతిలో మా సంస్థ నందు పనిచేయుటకు అనుభవం కల్గిన డిప్లొమో EEE మరియు ITI ఎలక్ట్రీషియన్ అభ్యర్థులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
94408 00399

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన Cholamandalam Investment & Finance Co., Ltd., SME LAP, Nellore తరపున మేనేజర్ వారు ఇచ్చిన వివరముల మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్‌కి కస్టమర్ అయిన **కొమారి శ్రీనివాసులు** తండ్రి నన్నయ్య, వంజివాక గ్రామం, కోట మండలం, తిరుపతి జిల్లా అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని తనఖా ఉంచి ఋణసౌకర్యం పొందుటకు నా క్లయింట్‌ను సంప్రదించినారు. సదరు **కొమారి శ్రీనివాసులు** క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **ఇరగరాజు సుబ్రహ్మణ్యం** గారి వద్దనుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది: 25-11-2025 డాక్యుమెంట్ నెం. 3329/2025** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **ఇరగరాజు సుబ్రహ్మణ్యం** గారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **పిండి రాఘవయ్య** గారివద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది: 24-08-2012 డాక్యుమెంటు నెం. 1169/2012** ద్వారా కొనుగోలు చేసినారని, సదరు **పిండి రాఘవయ్య** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి ఆయన కుమార్తె అయిన **చిప్పల నవమణి** గారు రిజిష్టర్డు సెటిల్‌మెంటు పత్రం **తేది: 07-08-2009 డాక్యుమెంటు నెం. 1183/2009** ద్వారా చెందజేసినారని, సదరు **చిప్పల నవమణి** గారికి క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి ఆమె భర్తగారైన **చిప్పల వెంకటకృష్ణయ్య** గారు **అక్కరపాక మునికృష్ణయ్య** వగైరాల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం **తేది: 19-02-2001 డాక్యుమెంటు నెం. 147/2001** ద్వారా కొనుగోలు చేసుకొని, ఆయన హక్కు అనుభవములో ఉంటూవున్న ఆస్తిని గురించి ఎటువంటి వ్రాతపూర్వకమైన పత్రములు వ్రాయకనే **తేది:07-02-2007**న కాలంచేసినారని, ఆయన తదనంతరం హిందూ వారసత్వ రీత్యా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి ఆయన భార్య **చిప్పల నవమణి** గారికి సంక్రమించినదని, సదరు **ఇరగరాజు సుబ్రహ్మణ్యం** గారివద్ద ఒరిజినల్ **లింకు డాక్యుమెంటు నెం. 147/2001, తేది: 19-02-2001** వారి వద్ద పోయినదని, సదరు డాక్యుమెంటు పోయిన విషయం కోట పోలీసు స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చి, సదరు స్టేషన్ వారివద్దనుండి **తేది: 01-12-2025**న non traceable certificate పొంది వున్నారని చెప్పుచున్నారు. మరియు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికేని ఎటువంటి హక్కులు గానీ, ఆధమానములు గానీ మరియు ఏ ఇతరములైన అభ్యంతరములు గానీ ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. లేనిచో నా క్లయింట్ Cholamandalam Investment & Finance Co.,Ltd., SME LAP, Nellore వారు సదరు **కొమారి శ్రీనివాసులు** గారికి ఋణము మంజూరు చేసెదరు. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

తిరుపతి జిల్లా, తిరుపతి రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, కోట సబ్ రిజిస్ట్రారులో చేరిన కోట మండలం, కోట పంచాయితీ, కోట బిట్-1, కోట గ్రామంలో ఆర్.టి.సి. బస్టాండు సమీపములో పూలతోట అను ఏరియాలో సర్వే నెం. 1334/1-2 రు యు. 0.26ల్లలో నాకు హక్కు అనుభవము కలిగి నీరు విక్రయించిన డోర్ నెం. 5-4-698 రు గల ఆస్తికి హద్దులు :

ఉత్తరం : సిమెంటు రోడ్డు, దక్షిణం : మచ్చా సుబ్రమణ్యం, మచ్చా రత్నమ్మ గార్ల తాలూకు స్థలం, మిద్దె ఇల్లు, తూర్పు: ఈ బిల్డింగునకు దక్షిణపు వైపున ఉన్న మంచా సుబ్రమణ్యం రోడ్డుకు సంబంధించిన డ్రైనేజ నీరు పోవుటకు గాను ఉన్న ఒక్క అడుగు వెడల్పు గల పైపులైను దాని ప్రక్కన హద్దు పాలూరు బాలసుబ్రమణ్యం తాలూకు మిద్దె కట్టడము పడమర: పాలూరు బాలసుబ్రమణ్యం తాలూకు ఈ క్రింది షెడ్యూలు క్రింది అంతస్థును ఆనుకొనియున్న మెట్లు మరియు సదరు పాలూరు బాలసుబ్రమణ్యం తాలూకు మిద్దె ఇల్లు.

పై హద్దులలోని **7 అంకణములు లేక 56 చ॥గ॥ గల స్థలమున్నూ**, అందులో నిర్మించియున్న పంచాయితీ అసెస్‌మెంటు నెం. 363 రు గల సిమెంటు స్లాబు వేసిన దిగువ అంతస్తు 510 చ॥అ॥లున్నూ, సిమెంటు స్లాబు వేసిన ఎగువ అంతస్తు 510 చ॥అ॥లున్నూ, ఈ ఇంటికి అమర్చియున్న కరెంటు సర్వీసు నెం. 4316రు మరియు కిటికీలు, ద్వారబంధనములు, అలమరలులతో సహా.

యస్.వి.విజయలక్ష్మి, M.Com., B.L.,
అడ్వకేట్, డోర్ నెం. 20-1-189, మొదటి అంతస్తు, సరస్వతి సమాజం ప్రక్కన, మూలాపేట, నెల్లూరు - 524003, సెల్: 98660 22728

భూ వివాదంలో ఘర్షణ, ఆరుగురిపై కేసు

డక్కిలి, న్యూస్‌టుడే: నాగవోలు పంచాయతీ చెన్నసముద్రంలో వరలక్ష్మి, శేఖర్ కుటుంబాల మధ్య సోమవారం భూవివాదం విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. మంగళవారం ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకర్‌రావు తెలిపారు.

పాఠశాల బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

బోల్తాపడిన పాఠశాల బస్సు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేటు పాఠశాల బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం స్కూలు బస్సు గోపాల్‌రెడ్డి పాళెం నుంచి కేఆర్‌పీకి వెళ్తుండగా దావాతగుంట వద్ద బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి ఒరిగిపోయింది. ఘటనలో బస్సులోని విద్యార్థులంతా క్షేమంగా బయటపడ్డారు. వెంటనే అత్యవసర ద్వారం నుంచి పిల్లలను బయటకు తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు గోపినాథ్‌రెడ్డి, శరత్ కుమార్ ఎస్సైలు బ్రహ్మ నాయుడు, కొండప నాయుడు సంఘటన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.

వంట గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు

ఇంటిలో చెల్లాచెదురుగా పడిపోయిన సామానులు

వాకాడు, న్యూస్‌టుడే: వాలమేడు గిరిజన కాలనీలో మానికల శీనయ్య ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం వంట గ్యాస్ ప్రమాదవశాత్తు లీకైంది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. శీనయ్య కుటుంబీకులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు కాలిపోవడంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు శీనయ్య తెలిపారు. తహసీల్దార్ ఇక్బాల్, ఎస్సై నాగబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఇక్బాల్ రూ.4 వేలు ఆర్థిక సాయం, నిత్యావసర సరకులు అందజేశారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవం-డిసెంబరు-3
మనిషి అవిటితనం
మనిషిలోని ధైర్యానికి,
విజయానికి ఆటంకం కాదు..
మనసులోని అవిటితనం
ఎందరికో వారిని దూరం చేస్తుంది
ఆర్.విజయ శేఖర్- తమిళనాడు

ఈనాడు విశాఖపట్నం
బుధవారం 3 డిసెంబరు 2025 | సిటీ 5

పెద్ద 'ప్లానే'

హైకోర్టు తీర్పు ఇలా..
ఈస్ట్‌పాయింట్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలను కూల్చివేయడానికి జీవీఎంసీ నోటీసులు జారీ చేయగా, వాటిని సవాల్ చేస్తూ సంబంధిత వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 'పార్కింగ్‌లకు కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. సెల్లార్, స్టిల్ట్ ఫ్లోర్‌లోని అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించడం జరగదు' అని తాజాగా హైకోర్టు ఆదేశాలిచ్చింది.

★ జీవీఎంసీ అధికారులు, యజమానులు కుమ్మక్కు
★ సెల్లార్లలోనే ఇష్టారాజ్యంగా దుకాణాలు
★ రోడ్లపై వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు
★ హైకోర్టు తీర్పుతోనైనా యంత్రాంగం కదిలేనా?!

ఈనాడు–విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో కొన్ని భవనాల పార్కింగ్ సెల్లార్లను వ్యాపార సముదాయాలుగా మార్చేశారు. స్టిల్ట్ ఫ్లోర్‌లో అనధికార నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేస్తున్నా అధికారులు తూతూమంత్రంగా స్పందిస్తున్నారు. ఫలితంగా పార్కింగ్‌లో ఉండాల్సిన వాహనాలు రోడ్లపై పెట్టించి ట్రాఫిక్ సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, జనరేటర్లు పేలడం, వరద నీరు పోటెత్తినప్పుడు సెల్లార్లలో ప్రాణ నష్టం జరిగే అవకాశాలుండటం కలవరపెడుతోంది.

కన్నెత్తి చూడని ప్రణాళిక అధికారులు : సెల్లార్లను వాణిజ్య సముదాయాలుగా మార్చినా జీవీఎంసీ 'పట్టణ ప్రణాళిక' గుర్తించనవి చాలా ఉన్నాయి. సెల్లార్లలో బార్‌లు, హోటళ్లు, క్లీనిక్‌లు, వాటర్ సర్వీస్, మొబైల్ సర్వీస్ దుకాణాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ★ మరికొన్ని చోట్ల స్టిల్ట్ ఏరియాను పూర్తిగా వాణిజ్య సముదాయాలుగా మార్చి ఫైనాన్స్ సంస్థలు, స్టోర్‌లకు ఇస్తున్నారు. భవన నిర్మాణ ప్లాన్ అనుమతులిచ్చాక ఆ నిర్మాణం పూర్తయ్యే వరకు పట్టణ ప్రణాళిక పర్యవేక్షణ ఉండాలి. అయితే ప్లాన్ ఒకలా తీసుకుని వేరేలా వాణిజ్య సముదాయం నిర్మించినా, సెల్లార్లలో గదులు నిర్మించి అద్దెలకిస్తున్నా అడ్డుకోవడం లేదు. ★ కొందరు భవన నిర్మాణదారులు ఇచ్చే కాసులకక్కుర్తితో పలువురు అధికారులు కళ్లుమూసుకుంటున్నారు.

తెలుగుతల్లి పైవంతెన సమీపంలో సెల్లార్లలో దుకాణాలు, రోడ్లపై వాహనాలు ఇలా

సమన్వయంతో చేస్తేనే..
సెల్లార్లలో నిర్వహించే వాణిజ్య సముదాయాల వద్దకు వచ్చే వినియోగదారులు రోడ్లపైనే వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. ఇలాంటి భవనాల సెల్లార్లను గుర్తించి నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళికాధికారులపై ఉంది. జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పర్యవేక్షించే పోలీసులు ఈ అంశంపై ఉమ్మడిగా ముందుకు సాగాలి. ముఖ్యమైన కూడళ్లు, రద్దీ ప్రాంతాలలో సెల్లార్ల ఆక్రమణలను తొలగించడానికి నోటీసులు జారీ చేయాలి. అనంతరం వాటిలోని వ్యాపార సముదాయాలను తొలగించి, వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు.

నగరంలో షాపింగ్ మాల్స్, స్టోర్స్, వాణిజ్య సముదాయాలు:	రద్దీ ప్రాంతంలో ఉన్నవి:	నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో వ్యాపారాలు చేస్తున్నవి:	జీవీఎంసీ ఇచ్చిన నోటీసులు:
40,000(సుమారు)	10,000 (సుమారు)	2,752	90 (సుమారు)

గాల్లో తేలినట్టుందే.. ఊయల ఊగినట్టుందే..!

కైలాసగిరి గాజు వంతెనపై సందర్శకుల సందడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరానికి వచ్చే పర్యాటకులకు సరికొత్త అనుభూతి కల్పించడానికి కైలాసగిరిపై ఏర్పాటు చేసిన గాజు వంతెనకు తొలిరోజు విశేష స్పందన లభించింది. దీన్ని వీఎంఆర్‌డీఏ నిర్మించింది. దేశంలోనే అతి పెద్ద తేలియాడే గాజు వంతెన కావడంతో నగర పరిధి నుంచే కాక విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు బారులు తీరారు. వంతెన చివరికి చేరుకుని సముద్ర అందాలను వీక్షిస్తూ ఫొటోలు, వీడియోలు, సెల్ఫీలు దిగుతూ సందడి సందడి చేశారు.

ఛార్జీలు ఇలా..: ఒకరికి రూ.250, దంపతులు ఒక కిడ్‌కు రూ.650, ఫ్యామిలీ కాంబో కింద తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలకు రూ. 800, గ్రూపు 10 మందికి మించితే ఒక్కో టికెట్ రూ.200, ఫ్రెండ్స్ కాంబో ఐదుగురు ఉంటే ఒక్కో టికెట్ రూ. 220గా నిర్ణయించారు. ★ ఒక దఫాలో 40 మందిని వంతెనపైకి పంపించారు. అక్కడి నుంచి పది నిమిషాలపాటు ప్రకృతి అందాలు వీక్షించడానికి అవకాశం కల్పించారు. తొలిరోజు మంగళవారం వెయ్యి మంది సందర్శకులు రాగా, రూ.2 లక్షలకుపైగా ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

ఆకాశంలో విహరిస్తున్నట్లు: చల్లని గాలుల నడుమ గాజు వంతెనపై నడుస్తుంటే చాలా కొత్తగా అనిపించింది. ఆకాశంలో విహరిస్తున్న విధంగా ఉంది. సముద్రం, మేఘాలు, కొండలు చాలా బాగా కనిపించాయి. మళ్లీ కుటుంబం అంతా కలిసి వస్తాం. – కల్పన, గాజువాక

మరింత పర్యాటక శోభ: దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాలలో చూసి స్నేహితులమంతా వచ్చాం. వంతెనపై నుంచి చూస్తే తీర అందాలు అద్భుతంగా కనిపించాయి. ఇది ఒక మధురానుభూతి. గాజు వంతెనతో విశాఖ నగరానికి మరింత పర్యాటక శోభ వస్తుందని భావిస్తున్నాం. - డాక్టర్ బురిడి కల్యాణి, సీతంపేట

భయంపోయింది: దీనిపై నడుస్తుంటే కళ్లు తిరిగినట్టు అనిపించింది. మాలాగే చాలా మంది రావడంతో భయం పోయి ఉత్సాహం వచ్చింది. ఫొటోలు దిగి వాట్సప్, ఇన్‌స్టాగ్రాంలో పోస్టుచేసి స్నేహితులు, బంధువులతో పంచుకున్నాం. –శ్రీనివాస్ దంపతులు, విజయనగరం

రాసపోలమ్మకు నీరాజనం

భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత శ్రీరాసపోలమ్మను మంగళవారం పంచదార ప్యాకెట్లతో అలంకరించారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. –న్యూస్‌టుడే, తగరపువలస

'స్క్రబ్ టైఫస్' ప్రాణాంతకం కాదు | 6లో

అందం.. ఆరోగ్యం!

జిమ్‌లలో మహిళలకు ప్రత్యేక శిక్షకులు

గురుద్వారా, న్యూస్‌టుడే: అందమే కాదు... ఆరోగ్యమూ ముఖ్యమే అనే అవగాహన ఇటీవల బాగా పెరిగింది. అందుకే జిమ్‌లో సాధన చేసేందుకు వెళ్తున్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విశాఖ నగరంలో దాదాపు 250 జిమ్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో మహిళల కోసం ప్రత్యేక సమయాలు కేటాయిస్తున్నారు. కొన్నైతే మహిళలకే ఏర్పాటు చేశారు. దీంతో ఆయా వేళల అనువుగా ఉన్న వారు సాధనకు వెళ్తున్నారు. నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అదనపు సౌకర్యాలు, ప్రత్యేకంగా మహిళా శిక్షకులను అందుబాటులో ఉంచుతున్నారు. ఆరోగ్యంతో పాటు రోజంతా ఉల్లాసంగా ఉండటానికి పలు వ్యాయామాలు తోడ్పడుతున్నాయంటున్నారు.

'జుంబా డ్యాన్స్'... సంగీతానికి అనుగుణంగా నృత్యరూపంలో చేసే వ్యాయామం ఇది. మహిళలు సులువుగా సాధన చేసేందుకు ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది. ఇందులో చిన్న వయసు నుంచి 50 ఏళ్ల పైబడిన వారూ సాధన చేయొచ్చు. అధిక బరువు సమస్య నుంచి బయటపడటానికి, మంచి శరీరాకృతి కావాలనుకునే వారికి ఈ వ్యాయామం ఉపయుక్తం.

ఏరోబిక్స్.. బరువు తగ్గించేందుకు సత్వర ఫలితం కోసం ఈ తరహా వ్యాయామాలు చేస్తుంటారు. ఇవి కాస్త కష్టతరమైనప్పటికీ తొందరగా ఫలితాలు కనిపిస్తాయని నగర మహిళలు ఎక్కువగా వీటిపై దృష్టి సారిస్తున్నారు.

సరైన పద్ధతిలో సాధన చేస్తేనే: రోజూ కనీస వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. అరగంట చేసినా అది ఆయుష్షు కాలాన్ని పెంచుతుంది. ప్రస్తుత రోజుల్లో ఆహారపు అలవాట్ల వల్ల, వ్యాయామం చేయకపోవడంతో ఊబకాయ సమస్య వస్తోంది. సరైన పద్ధతిలో వ్యాయామం సాధన చేస్తే మంచి ఫలితాలు ఇస్తుంది. – కిలారి గణేష్, జిమ్ ట్రైనర్

శిక్షకుల పర్యవేక్షణలోనే..: వ్యాయామం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తవు. శీతాకాల ప్రభావంతో కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, మధుమేహం ఉన్న వారికి కాస్త ఇబ్బందికరంగా ఉంటుంది. అదే పనిగా కాకుండా రోజులో అరగంట పాటు సాధన చేస్తే మేలు. ఏదైనా శిక్షకుల పర్యవేక్షణలో చేయడం ఉత్తమం. – డాక్టర్ శ్రీనివాస్ శైలేస్, వైద్యుడు

నేడు ఏయూలో ఉద్యోగ మేళా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలోని మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టట్యో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, క్యూస్ కార్ప్ లిమిటెడ్ - టాటా ఎలక్ట్రానిక్స్, భారత్ బ్యాంక్ సంస్థలు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు **employment.ap.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఇక్కడ.. సాగరంతో జాగ్రత్త..!

కాళీమాత ఆలయం ఎదురుగా తీరంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సహజ సిద్ధమైన విశాఖ తీరం ఎంతో అందమైనదిగా గుర్తింపు పొందింది. దేశవిదేశాల నుంచి నిత్యం పర్యాటకులు తీర అందాలు చూడటానికి వస్తుంటారు. అలల మాటున ప్రమాదం దాగి ఉందనే విషయం చాలా మంది గుర్తించడం లేదు. సరదాగా ఈత కొట్టడానికి వెళ్లి రాకాసి కెరటాల్లో చిక్కుకుపోయి మృత్యువాత పడుతున్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి నగర పోలీసు కమిషనర్ ప్రమాదకర తీర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది.

మృతులు		(ఇప్పటి వరకు)
6	7	6
2023	2024	2025

తీరంలో ప్రమాదాల నివారణకు చర్యలు

ఇదిగో ఇక్కడ: మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు తీర ప్రాంతాల్లో ఇప్పటికే జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఉన్నాయి. ఇటీవల మరికొన్ని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించామని, అక్కడ ఆరు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని సీఐ పైడయ్య తెలిపారు. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా, పాండురంగాపురం డౌన్లో, వై.ఎం.సి.ఎ., పార్కు హోటల్ వెనుక, లైట్ హౌస్ వద్ద, పెదజాలరిపేట ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా షిఫ్ట్‌కు ఆరుగురు చొప్పున 12మంది గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు, బీచ్ పర్యవేక్షణ సిబ్బంది నిత్యం పహారా కాస్తుంటారని చెప్పారు.

కాటేస్తున్న 'కరెంట్'
విశాఖ తీరం తూర్పు కనుమల్లో భాగం కావడంతో ఇక్కడ సముద్రంలో కొండలు, గుట్టలు, రాళ్లు అధికంగా ఉన్నాయి. అదే విధంగా హఠాత్తుగా అలల మధ్య 'కరెంట్' జలాలు పుట్టుకొస్తుంటాయి. వాటిల్లో చిక్కుకుంటే బయటపడటం అంత సులువు కాదు. దీంతో స్నానాలు చేయడానికి అనువైన తీరం కాదని సముద్ర అధ్యయన శాస్త్రవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. సంవత్సరాలుగా యంత్రాంగం సరైన చర్యలు తీసుకోకపోవడంతో తీరంలో తరచూ పలువురు మృత్యువాత పడుతున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

స్థలాలు ఉక్కువైనా.. అక్రమార్కులకు లోకువే!

గాజువాక(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో ఉక్కు నిర్వాసితుల కోసం ఇచ్చిన స్థలాలకు రక్షణ కరవైంది. రాత్రికి రాత్రే షెడ్లు వేస్తూ, అనధికార నిర్మాణాలు సాగిస్తూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఉక్కు భూసేకరణ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మాయగాళ్లు రంగంలోకి దిగి నకిలీ డాక్యుమెంట్లు, ప్రొసీడింగ్ ఆర్డర్లు తెరముందుకు తెచ్చి కబ్జాపర్వం కొనసాగిస్తున్నారు. దీంతో వీటి రక్షణ భారం మండల రెవెన్యూ అధికారుల మీద పడుతోంది.

★ 1970 దశకంలో గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో 64 గ్రామాలను స్టీల్‌ప్లాంట్ కోసం తరలించి అప్పట్లో 22 వేల ఎకరాల భూములను సేకరించారు. ఆయా గ్రామాలకు అర్బన్ ప్రాంతాల్లో పునరావాసం కల్పించారు. ఈ భూములన్ని స్టీల్‌ప్లాంటు భూసేకరణ, పునరావాస విభాగం పరిధిలో ఉంటాయి. అయితే వీరు దృష్టిపెట్టకపోవడంతో క్రమంగా అన్యాక్రాంతమవుతున్నాయి.

ఎక్కడికక్కడ నిర్భీతిగా ఆక్రమణ

ఇదిగో ఇలా..

1 ఇటీవల గాజువాక వికాస్ నగర్ ఐటీఐ రోడ్డు వద్ద సర్వే నెంబర్-153 భూముల్లో తమకు అన్ని హక్కులు ఉన్నాయంటూ రాత్రికి రాత్రే 18 షెడ్ల నిర్మాణాలకు ఆక్రమణదారులు తెగించారు. రెండు రోజుల తర్వాత ఎస్‌డీసీ కార్యాలయ సిబ్బంది ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులను పాతారు.

ఉక్కు స్థలంలో నిర్మాణాలు

2 బీసీ రోడ్డు శివాలయం వద్ద 2.5 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే ఆరేళ్లుగా ఉక్కు అధికారులు పట్టించుకోలేదు. చుట్టూ ఫెన్సింగ్ వేసినా పట్టనట్లున్నారు. ఆ తర్వాత ఇవి ఉక్కు భూములని తేలాక అక్కడ హెచ్చరిక బోర్డులను పాతారు.

భూములు ఇక్కడ.. కార్యాలయం అక్కడ: ఉక్కు భూసేకరణ విభాగం కార్యాలయం నగరంలో జడ్పీ కార్యాలయ సమీపంలో ఉంది. అక్కడ ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ), ఆర్‌ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దిగువస్థాయి సిబ్బంది ఉన్నారు. ఉక్కు నిర్వాసితకాలనీలు, భూములన్నీ ఇక్కడున్నాయి. అదే అక్రమార్కులకు అనుకూలంగా మారింది. ఆయా మండలాల్లో ఆక్రమణలు, స్థలాల చదును జరిగితే అనేకమంది మండల కార్యాలయాలకు ఫిర్యాదు చేస్తుంటారు. అవి ఉక్కు భూసేకరణ పరిధిలో ఉన్నాయని రెవెన్యూ సిబ్బంది చెబుతూ వాటికి కాపలా కాయాల్సి వస్తోంది. నగర కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసే వీల్లేక మండల కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు.

కార్యాలయం వచ్చేలా చర్యలు: 'ఉక్కు భూసేకరణ కార్యాలయాన్ని గాజువాక రప్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. రూ.కోట్లు విలువైన స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉక్కు అధికారులదే. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి ఆ శాఖ అధికారులు గాజువాకలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం' అని గాజువాక ఎమ్మెల్యే **పల్లా శ్రీనివాసరావు** పేర్కొన్నారు.

ఎన్ని గదులలో... అన్ని ఏసీలు

ఇల్లు, కార్యాలయం, వసతిగృహాలు ఎక్కడ చూసినా ఇప్పుడు ఏసీ వినియోగం సర్వసాధారణమైంది. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఏసీ వాడకానికి చేరువయ్యారు. అవసరాన్ని బట్టి ఒకటో, రెండో గదులకు ఏసీలు ఏర్పాటు చేసుకోవడం సహజం. కానీ, ఎండాడ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఓ కళాశాలలో గదికి ఒకటి చొప్పున 33 ఏసీలు ఏర్పాటు చేశారు. అవన్నీ క్రమ పద్ధతిలో అందంగా కనిపించడం, ఒక భవనానికి అన్ని ఏసీలా అని చూసిన వారు ఆశ్చర్యపోతున్నారు. – న్యూస్‌టుడే, మధురవాడ

బాగా చదువుకుని కలెక్టర్ అవుతా!

బాగా చదువుకుని పెద్దయ్యాక ఏమవుతావని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఓ విద్యార్థిని అడగ్గా కలెక్టర్ అవుతానని చెప్పడంతో సంతోషంతో భుజం తట్టారు. ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీఎస్ మోడల్ ప్రైమరీ పాఠశాలలను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపరుతో తయారు చేసిన పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తాము నేర్చుకున్న పాఠాలను అప్పజెప్పారు. – ఎండాడ, న్యూస్‌టుడే

ఉత్పత్తి మేరకే జీతాలు

ఈనాడు–విశాఖపట్నం, ఉక్కునగరం–న్యూస్‌టుడే: ఉక్కు ఉద్యోగులకు నవంబరు నెల జీతాలను ప్లాంటు ఉత్పత్తిని బట్టి చెల్లించారు. గతంలోనూ ప్రతి నెలా 75 శాతం జీతాలు చెల్లించి, మిగిలిన 25శాతం బకాయిలుగా చూపించి తర్వాత చెల్లించేవారు. అయితే ఉక్కు ఉత్పత్తికి తగినట్లు జీతాలు చెల్లిస్తామని ఈ ఏడాది నవంబరు 15న యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులపై కార్మిక, ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నా అనుకున్న ప్రకారమే యాజమాన్యం అడుగులు వేసింది. మేనేజ్‌మెంటు సర్వీసెస్, ప్రొడెక్ట్స్ విభాగాలు ఈ నెల వచ్చిన ఉత్పత్తిని అంచనా వేసి ఆ మేరకు ఎంత జీతం చెల్లించాలో లెక్కలు తేల్చారు. గత నెల రూ.2,200 కోట్ల ఉత్పత్తులు వచ్చినట్లు సమాచారం. కోకోవెన్ విభాగానికి 93 శాతం, సింటర్ ప్లాంట్‌కు 80, బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి 83, ఎస్ఎంఎస్ విభాగానికి 81, రోలింగ్ మిల్స్‌కు 79, మార్కెటింగ్‌కు 84, ఇతరులకు 83శాతం జీతాలు ఖాతాల్లో జమైనట్లు తెలుస్తోంది. మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగానికి అత్యంత తక్కువగా 66 శాతమే జీతాలు చెల్లించినట్లు సిబ్బంది చెబుతున్నారు.



'రాతి'చరామి!
యారాడ డాల్ఫిన్ హిల్స్‌పై లైట్ హౌస్ గేటు వద్దకు వెళితే... ఓ మర్రిచెట్టు పెరిగిన తీరు ఆకట్టుకుంటుంది. అక్కడున్న రాతి కట్టడంపై వేర్లతో విస్తరించి పెరిగిపోయింది. ఇక్కడికి వచ్చే పర్యాటకులు సేదతీరుతూ, రాతిపై చెట్టు పెరిగిన తీరును ఆశ్చర్యంగా చూస్తుంటారు. –ఈనాడు, విశాఖపట్నం

ఆలస్యంగా 'షాలిమార్' ఎక్స్‌ప్రెస్

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : లింకు రైలు అందుబాటులో లేకపోవడంతో బుధవారం ఉదయం 4.30 గంటలకు చెన్నై సెంట్రల్‌లో బయలుదేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ (02842) ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.30 గంటలకు బయలుదేరేలా అధికారులు మార్పు చేశారు.

అమృతమూర్తికి అశ్రుతాంజలి
మా అమ్మగారు శ్రీమతి గొంగాళ రామలక్ష్మి గారు తేది. 27-11-2025 గురువారం ఉదయం గం॥ 5.30 ని॥లకు శివైక్యం పొందినారని తెలియజేయుటకు చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
జి. వెంకటరమణమూర్తి Cell: 9849043993
జి.వి. సత్య శ్రీరామకుమార్ Cell: 9848748759
శ్రీమతి గొంగాళ రామలక్ష్మి గారు
Retd. SBI
మరణం: 27-11-2025
10వ రోజు : తేది 06-12-2025 దశాహం & ధర్మోదకాలు
11వ రోజు : తేది 07-12-2025- షోడసము
12వ రోజు : తేది 08-12-2025 - సపిండీకరణ, వైకుంఠ సమారాధన & ఆశీర్వచనం
డో.నెం. 5-117 (MIG-492) Opp: C-2 Zone Park, సుజాతనగర్, విశాఖపట్నం-51 లో మా స్వగృహము నందు జరుపబడును.

ఆపదలో 'ఆరోగ్య ప్రదాయిని'..!

కేజీహెచ్ పిల్లల విభాగంలో మెరుగైన సేవలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) పిల్లల విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో నవజాతి శిశువులతో పాటు సాధారణ పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మూడేళ్ల నుంచి నవజాత శిశు మరణాల రేటు (ఎన్ఎంఆర్), శిశుమరణాల రేటు (ఎంఎంఆర్)ను 50 శాతం మేర తగ్గించడంతో రాష్ట్రస్థాయి అధికారుల ప్రశంసలు అందాయి.

పిల్లల చికిత్స విభాగంలో వైద్య పరికరాలు

ఇవీ వసతులు: ఈ విభాగంలో నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ), స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), ఫొటోథెరపి యూనిట్ ఉన్నాయి. ★ వాటిల్లో ఆధునిక వెంటిలేటర్లు, సీపీఏపీ, హెచ్ఎఫ్ఎన్‌సీ, మల్టీపారా మోనిటర్లు, 2డీ ఏకో, పోర్టబుల్ అల్ట్రాసౌండ్ పరికరాలతో పాటు, ఏబీజీ, సీఆర్‌పీ యంత్రాలు ఉన్నాయి.
★ పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులకు ఎన్ఆర్‌సీ వార్డు, డీఈఐసీ వార్డుల్లో సేవలు అందిస్తూ, స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలు అమలు చేస్తూ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.
★ ప్రభుత్వ ఆర్‌సీడీ, విక్టోరియా ఆసుపత్రుల్లో చికిత్స పొందే చిన్నారులను అత్యవసర సమయంలో కేజీహెచ్‌లో చేర్పించి, వైద్యం చేస్తున్నామని విభాగాధిపతి **డాక్టర్ బి.శ్రీనివాస చక్రవర్తి**, సూపరింటెండెంట్ **వాణి** తెలిపారు.

సిబ్బంది సంఖ్య	
విభాగాధిపతి	1
ప్రొఫెసర్లు	2
సహ ప్రొఫెసర్లు	3
నియోనెటాలజిస్టు	1
పీజీలు	36
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	8

★ హిమోఫిలియా, సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా బాధితులకు ఖరీదైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

సేవలు ఇలా..
★ సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ.
★ ఎన్ఐసీయూ, పీఐసీయూ వార్డుల్లో 24 గంటల సేవలు.
★ ఆయా వార్డుల్లో మొత్తం పడకలు: 250

ఆటాడుకుందాం రా..!

ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాలు
జిల్లాలో 587 స్కూళ్లకు పంపిణీ

పాఠశాలలకు పంపిణీ చేసిన క్రీడా పరికరాలు

మధురవాడ, న్యూస్‌టుడే: సర్కారు పాఠశాలల్లో క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు చర్యలు చేపడుతోంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో క్రీడా విభాగం పూర్తి నిర్లక్ష్యానికి గురైంది.
★ మూస ధోరణిలో ఒకే విధమైన క్రీడా సామగ్రి అందించడంతో విద్యార్థులు ఇష్టమైన ఆటలకు దూరమయ్యారు. దీన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం పాఠశాలలకు వివిధ రకాల క్రీడా సామగ్రిని అందించింది. దీని కోసం ఆయా పాఠశాలల నుంచి నివేదికలు సేకరించి క్లస్టరు విధానంలో కిట్లు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 587 స్కూళ్లకు ఆయా ఆట పరికరాలు అందాయి.

కిట్‌లో ఉండే ఆట పరికరాలు: క్రీడా కిట్‌లో ఆర్చరీ సంబంధిత విల్లులు, శరాలు, టార్గెట్లు, అథ్లెటిక్స్‌కు సంబంధించి హైజంప్ పోల్స్, జావెలిన్స్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, క్యారమ్, చెస్ బోర్డులు, ఫుట్‌బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, హాకీ స్టిక్‌లు, టెన్నిస్ రాకెట్లు, క్రికెట్ బ్యాట్, బంతులు, స్కిప్పింగ్ రోప్స్ తదితర 67 రకాల పరికరాలు ఉన్నాయి.

విద్యార్థుల్లో ఉత్సాహం: 'చాలా కాలం తర్వాత పాఠశాలలకు కొత్త క్రీడా సామగ్రి రావడంతో విద్యార్థులు ఆటల పట్ల ఉత్సాహం చూపుతున్నారు. వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ అందించి మెరికల్లా తయారయ్యేలా కృషి చేస్తాం. ప్రభుత్వం నాణ్యతకు ప్రాధాన్యమిచ్చి క్రీడా పరికరాలు అందజేసింది' అని పలు పాఠశాలల పీడీలు చెబుతున్నారు.

(c) eenadu

నీటి సరఫరా వేళల్లో మార్పు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ జోన్-5 పరిధి 44వ వార్డులో నీటి సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ తెలిపారు. గ్రీన్‌పార్కు కాలనీలో 1800 కేఎల్ జీవీఎల్ఎస్ఆర్ శ్లాబ్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 గంటలకు ఇవ్వాల్సిన సరఫరాను సాయంత్రం 4 గంటలకు మార్చినట్లు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం ప్రాంతం, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రామచంద్రనగర్, సాయిబాబా ఆలయ పరిసరాలు, అబిద్‌నగర్, రంగరాజుకాలనీ, పల్లవి అపార్టుమెంట్స్ ప్రాంతాల్లో బుధవారం నుంచి నీటి సరఫరా వేళలు మారుతున్నట్టు తెలిపారు.

డీసీసీబీ ఇన్‌ఛార్జిపై ఫిర్యాదు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి కోన తాతారావు ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సహకార శాఖ, సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయా పరిణామాలపై సెక్షన్-51 ప్రకారం విచారణకు ఆదేశించాలని ఆయన కోరారు. ★ ఉద్యోగుల పదోన్నతులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది, అద్దె వాహనాలు, నూతన బ్రాంచిల ఏర్పాటు, ఫర్నీచర్ కొనుగోళ్లు... తదితరాల్లో తాతారావు పాత్ర ఉందని మూర్తియాదవ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీ విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్
విశాఖ డెయిరీ, విశాఖపట్నం

విశాఖ డెయిరీలో RCC సర్క్యులర్ వాటర్ ట్యాంకు నిర్మాణము చేయుటకు అనుభవము కలిగిన GST కలిగిన కాంట్రాక్టర్లు నుండి టెండర్లు కోరడమైనది. వివరములకు www.visakhadairy.com ను సందర్శించగలరు. మేనేజింగ్ డైరెక్టర్

ఆధునిక 'గ్యాస్ట్రో' వైద్యసేవలు ఇక్కడే..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

➤ ఎంవీపీకాలనీకి చెందిన యువతి అన్నవాహిక దెబ్బతిన్నది. ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా తగ్గలేదు. చివరికి విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేయడంతో పూర్తిగా కోలుకుంది.

➤ మద్దిలపాలేనికి చెందిన మహిళకు కాలేయ క్యాన్సర్ రావడంతో పలు ప్రయివేటు ఆసుపత్రుల్లో చూపించగా రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పగా విమ్స్ తీసుకొచ్చారు. ఇక్కడ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించగా ఇప్పుడు ఆరోగ్యంగా జీవిస్తోంది.

➤ రాజమహేంద్రవరానికి చెందిన ఓ మహిళ కాలేయ కణితికి సంక్లిష్ట శస్త్రచికిత్స చేయగా, విజయనగరానికి చెందిన ఓ వ్యక్తి కాలేయ కణితులను విమ్స్ వైద్య బృందం విజయవంతంగా తొలగించింది.

విమ్స్(విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ)లోని గ్యాస్ట్రో విభాగంలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. మారుతున్న జీవనశైలి, మద్యం, గుట్కా, పాన్‌మసాలా, పొగతాగడం తదితర అలవాట్ల కారణంగా గొంతు, అన్నవాహిక, జీర్ణాశయం, కాలేయం, పిత్తాశయం, క్లోమ గ్రంధి చిన్నప్రేగు, పెద్ద ప్రేగు తదితర వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ సమస్యలకు ఎన్టీఆర్ వైద్య సేవ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బీమా, ప్రైవేటు ఆరోగ్య బీమా సంస్థల ద్వారా విమ్స్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

విమ్స్ గ్యాస్ట్రో విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

విమ్స్‌లో అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

వైద్య పరికరాలు..చికిత్సలు ఇలా..

ల్యాప్రోస్కోపీ(ఒలింపస్ ఎఫ్190), హార్మోనిక్ స్కల్‌పల్, సీయూఎస్ఏ కాలేయ శస్త్రచికిత్సలు, ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్, ఈఆర్‌సీపీ, బయాప్సీ పరికరాలు, ఎలక్ట్రోకేటరీ, రాపిడ్ ఇన్ఫ్యూషన్ పంప్.

గ్యాస్ట్రో సర్జికల్ విభాగంలో..

★ వైద్యుల సంఖ్య : 2 + హౌస్ సర్జన్లు
★ సహాయ సిబ్బంది : 15

2025 జనవరి నుంచి నవంబరు వరకు..

★ ఔట్‌పేషెంట్ (ఓపీ): 3057
★ ఇన్‌పేషంట్(ఐపీ): 224
★ శస్త్రచికిత్సలు: 204

కేజీహెచ్‌లో లేని సౌకర్యాలు లభ్యం

కేజీహెచ్‌లో లేని అన్నవాహిక, ప్లీహం, పిత్తాశయాలకు సంబంధించి సంక్లిష్టమైన లాప్రోస్కోపిక్, ఓపెన్ సర్జరీలు విమ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉచితంగా అందిస్తున్నాం. ఈ చికిత్సలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.లక్షలు వసూలు చేస్తున్నారు.

– డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

అన్నవరం రైతులకు న్యాయం చేస్తాం: గంటా

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంగా నిర్మిస్తున్న స్టార్ హోటళ్లకు భూములిచ్చిన భీమిలి మండలం అన్నవరం, భోగాపురం మండలం తూడెం గ్రామాల రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఎంవీపీకాలనీలోని తన నివాసానికి వచ్చిన అన్నవరం భూముల సాగుదారుల కుటుంబీకులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సంబంధిత రైతులకు అధికారిక దస్త్రాలేవీ లేకపోయినా దశాబ్దాలుగా జీడి, మామిడి తోటలు సాగు చేస్తూ ఉపాధి పొందుతున్నందున వారిని ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా భూములు కోల్పోయిన 28 మంది రైతులకు ఒక్కొక్కరికి ఆరు సెంట్ల స్థలం, ఆ ప్రాంతంలో నిర్మిస్తున్న హోటళ్లలో ఒక్కో ఉద్యోగం ఇవ్వనున్నామన్నారు. గతంలో ఈ భూములు తీసుకున్న అప్పటి ప్రభుత్వం చట్టపరంగా ఎలాంటి నష్టపరిహారం ఇవ్వడం కుదరదని తేల్చడంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత రైతులతో జిల్లా అధికారులు చర్చించారు. ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తహసీల్దారు పి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో అన్నవరం భూములకు చెందిన రైతు కుటుంబాలు

జాతీయ స్థాయిలో మెరిసిన 'విజ్ఞాన్ ఐడియా ల్యాబ్'

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : నూతన ఆవిష్కరణల అంశంలో 'విజ్ఞాన్ ఐడియా ల్యాబ్'కు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. దేశవ్యాప్తంగా ఉన్న 409 ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్‌ల్లో విజ్ఞాన్ ల్యాబ్ 5వ స్థానంలో నిలిచిందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జె.సుధాకర్ తెలిపారు. ఆవిష్కరణలు, నైపుణ్య ఆధారిత అభ్యాసం, పరిశ్రమ ఆధారిత సాంకేతిక వినియోగంలో ల్యాబ్ ప్రదర్శనకు ఏఐసీటీఈ ర్యాంకు ప్రకటించిందన్నారు. ఐడియా ల్యాబ్ ద్వారా నూతన ఆవిష్కరణలు సిద్ధం చేసిన విద్యార్థులను, కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌నాయక్‌ను మంగళవారం కళాశాలలో అభినందించారు.

నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు

'స్క్రబ్ టైఫస్' ప్రాణాంతకం కాదు

సీతంపేట, న్యూస్‌టుడే: 'స్క్రబ్ టైఫస్' వ్యాధి ప్రాణాంతకం కాదని, ప్రజలు భయాందోళన చెందొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జీవి కుట్టినపుడు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, ఆకలి లేకపోవడం, వినికిడి తగ్గుదల, దగ్గు, శ్వాస ఆడకపోవడం మొదలగు లక్షణాలు కనపడతాయన్నారు. డాక్సిసైక్లిన్, ఎజిత్రోమైసిన్ వంటి మందులు వాడటం ద్వారా నివారించవచ్చునన్నారు. ఇళ్లల్లో ఎలుకలు లేకుండా చూసుకోవాలని, యాంటీ ఇన్సెక్టిసైడ్స్ స్ప్రేలు వాడటం ద్వారా ఎలుకలు రాకుండా చూసుకోవచ్చున్నారు. ఈ ఏడాది జిల్లాలో 11 మంది ఈ వ్యాధి బారిన పడ్డారని, ఇప్పటివరకు ఒక్క మరణం కూడా సంభవించలేదని వెల్లడించారు. నల్లటి కురుపులు, శోషరస కణుపులు వాయడం, జ్వరం వస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుడిని సంప్రదించి తగు చికిత్స పొందాలని ప్రకటనలో పేర్కొన్నారు.

సెయిల్ విశ్రాంత అధికారికి జైలు, జరిమానా

విశాఖ లీగల్, న్యూస్‌టుడే : ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న నేరం రుజువు కావడంతో సెయిల్ విశ్రాంత అధికారికి మూడేళ్ల సాధారణ జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తూ సీబీఐ కేసుల ప్రధాన ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సీఎన్.మూర్తి తీర్పు ఇచ్చారు. మంగళవారం సీబీఐ అధికారులు అందించిన కేసు వివరాలివి. నగరానికి చెందిన ఆర్.కిషోర్ 1988-2000 కాలంలో విశాఖపట్నం సెయిల్‌లో రీజనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి, కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

రహదారి ప్రమాదాల నివారణపై దృష్టి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని, జాతీయ రహదారుల్లో జీబ్రా క్రాసింగ్ వద్ద సోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీతో కలిసి 'రహదారి భద్రత కమిటీ' సమావేశం నిర్వహించారు. గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో క్షతగాత్రులకు ప్రభుత్వం అందించిన పరిహార వివరాలు తెలుసుకున్నారు. ప్రధాన రహదారుల్లో పాఠశాలలు, కళాశాలల వద్ద వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట బస్‌షెల్టర్లు నిర్మించాలని, నడక మార్గాల్లో ఆక్రమణలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో సీపీ శంఖబ్రతబాగ్చీ

4న మార్గశిర పౌర్ణమి పూజలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఇసుకకొండ శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున 2 గంటల నుంచి స్వామి ఆరాధన, 4 గంటలకు ధ్వజస్తంభం పూజలు నిర్వహిస్తామన్నారు. 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ధ్వజస్తంభం పూజలో పాల్గొనే వారు రూ.1,116 టికెట్ కొనుగోలు చేయాలన్నారు. ఉదయం 7 గంటలకు జరిగే సామూహిక వ్రతాలకు రూ.1,116 టికెట్, 8.30 గంటల వ్రతాలకు రూ.516 టికెట్, 10.30 గంటల వస్త్రాలకు రూ.1,116 టికెట్లు కొనుగోలు చేయాలన్నారు.

శ్రీ సత్యనారాయణస్వామి

ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

సింధియా, న్యూస్‌టుడే: గిరిజన యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 6 వరకు పొడిగించినట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) సీవోవో గోపీకృష్ణ శివ్వం తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెంది 27 ఏళ్లలోపు వయసు కలిగి ఐటీఐలో ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్ ట్రేడుల్లో, అలాగే డిప్లొమాలో మెకానికల్ పూర్తి చేసిన అభ్యర్థులకు సీఎన్‌సీ ఆపరేటర్ కోర్సులో 2 నెలల ఉచితంగా శిక్షణ, వసతి ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. మరిన్ని వివరాలకు సింధియా దరి సెమ్స్ కార్యాలయంలో లేదా 8332861237, 0891-2704010 ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *GAJUWAKA* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT D	50	50,000	25,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT P	50	4,000	2,00,000
TT X	30	20,000	6,00,000
TT T	30	10,000	3,00,000

Please Contact Branch Manager **Mr. P.SATYANARAYANA RAJU,** for further details. **Mobile No's. 80082-48899, Landline: 0891-2516888.**

THE ARYAPURAM CO-OPERATIVE URBAN BANK Ltd.
Head Office, Rajamahendravaram, REG No:3127

TENDER NOTICE

No: **ACUB/MIS/2025-26/3** Dt: **03-12-2025**

Sealed quotations are invited from authorized vendors for the Supply, Installation and Service Support of **15 Nos. Sophos XGS 88 Firewall** Appliances for a period of 36 months.

Interested vendors may submit their sealed quotations to The Secretary, The Aryapuram Co Operative Urban Bank Ltd, D.No. 20-23-8, Near Gokavaram Bus Stand, Opp. BSNL Sanchar Bhavan, Rajahmundry - 533104. By Hand /Courier on or before 09-12-2025

Cont: 0883-2473550 **Sd/- Secretary/CEO**

4 నుంచి 7 వరకు ఆర్గానిక్ మేళా

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రకృతి ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల మేళా ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి తెలిపారు. మంగళవారం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు ఉదయం 10గంటలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మేళాను ప్రారంభిస్తారన్నారు. 6వ తేదీ రాష్ట్ర సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మేళాను సందర్శిస్తారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహీ ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ బృందాలు, గ్రీన్ క్లైమేట్ సంస్థ, అగ్రి డీఎన్ఏ వెంటర్స్ సంస్థల నేతృత్వంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యంవర్మ, కార్యదర్శి 'పాలెం నేచురల్స్' అశోక్, ప్రకృతి రైతులు రిషి, ఎన్.నరేంద్ర, గ్రీన్ క్లైమేట్ టీం అధ్యక్షుడు జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేళా కరపత్రం విడుదల చేశారు.

కరపత్రం విడుదల చేస్తున్న జలగం కుమారస్వామి తదితరులు

ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపల్‌గా ఎన్.సోలోమోన్

కంచరపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా(అదనపు బాధ్యతలు) ఎన్.సోలోమోన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కళాశాలలోని వివిధ ట్రేడ్‌లలో విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. విజయవాడలోని ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ట్రైనింగ్(ఏడీ)గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

చేపలరేవు ఆధునికీకరణపై సమీక్ష

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ చేపలరేవు ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హార్బర్‌లో ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రత, నీటి సరఫరా, తదితరాలపై అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. పోర్టు అథారిటీ ప్రధాన ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి, కార్యనిర్వాహక ఇంజినీర్ అరుణ్‌కుమార్ పలు అంశాలను వివరించారు. మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు, ఎంపెడా డీడీ మొహంతి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యురాలు సరోజిని మృతి

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్‌కు చెందిన ప్రముఖ విశ్రాంత వైద్యురాలు **వి.సరోజిని**(78) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. ఈమె ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సేవలందించారు. ప్రేమసమాజం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, చిన్మయ మిషన్, మా బాపు సేవా సదన్‌లో జీవితకాల సభ్యురాలిగా ఉన్నారు. గైనకాలజిస్ట్‌గా మాధవధార - మురళీనగర్ జంటకాలనీల్లో వాకర్స్ క్లబ్ సభ్యులకు అనేక సేవలందించారు. ఆమె మృతికి కాలనీవాసులు, వాకర్స్ క్లబ్ సభ్యులు సంతాపం ప్రకటించారు.

ఏయూ స్పెషల్ డ్రైవ్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 2010-11 సంవత్సరం నుంచి 2025వరకు వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు అర్హులన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి ఏయూ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఫిబ్రవరి 20న ఏయూ ప్రాంగణంలో పరీక్షలు జరుగుతాయన్నారు. థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.1500, ప్రాక్టికల్స్, వైవా ప్రాజెక్టు ఒక్కో సబ్జెక్టుకు రూ.3వేల చొప్పున ఫీజుగా చెల్లించాలన్నారు. పరీక్ష కేంద్రాలు, టైం టేబుల్ వివరాలను ఏయూ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. డిగ్రీ, పీజీ ప్రొఫెషనల్ కోర్సులలో బ్యాక్‌లాగ్ ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు www.exams.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

నాటక రంగానికి అందరూ సహకరించాలి

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కళా పరిషత్‌ల నిర్వహణ అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు కోట శంకరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తోలేరు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో 21వ జాతీయ స్థాయి నాటిక పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోసేను రాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక రంగాన్ని బతికించేందుకు కళాపరిషత్‌ల నిర్వాహకులకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ, వీరవాసరం, రాయకుదురు కళాపరిషత్‌ల అధ్యక్షులు గుండా రామకృష్ణ, కేఎస్ ఆర్‌కే.గోపాలకృష్ణ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా టి.వెంకటేశ్వరరావు, జవ్వాది దాశరథి శ్రీనివాస్, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు.

★ ఉత్తమ ప్రథమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖ వారి 'అసత్యం' నిలిచింది. ఈ నాటికకు పని చేసిన వారిలో పి.బాలాజీ నాయక్(ఉత్తమ దర్శకుడు), వై.అనిల్‌కుమార్ (ఉత్తమ ప్రతినాయకుడు), థామస్ (ఉత్తమ రంగాలంకరణ), పి.లీలామోహన్(ఉత్తమ సంగీతం)పురస్కారం పొందారు.

నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వ ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) రాష్ట్రస్థాయి ప్రాంతీయ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. గీతం ప్రొ-వీసీ ప్రొఫెసర్ డాక్టర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ యువతను నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడానికి గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్(వీడీసీ)ను నెలకొల్పామన్నారు. స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ తదితర సంస్థల సీఈవోలు డాక్టర్ బీవీఆర్.మోహన్‌రెడ్డి, డాక్టర్ పి.సుధాకర్, డాక్టర్ రవి ఈశ్వరప్ప, దయాకర్ ఎస్.మూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, సెల్వకుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ రాజాఫణి పప్పు మాట్లాడారు. ఉన్నత విద్యాసంస్థల్లో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'ఐఐసీ' పనిచేస్తుందని పేర్కొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

కొత్త రైల్వే జోన్ ఉద్యోగుల ఎంపికపై కసరత్తు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విశాఖ కేంద్రంగా ఏర్పడే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తో పాటు రాయగడ కేంద్రంగా ఏర్పడే రాయగడ డివిజన్‌లో పని చేయడానికి ఆసక్తి ఉన్న నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఎంపికపై రైల్వేశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ ఎంపికను హెచ్ఆర్ఎంఎస్ ద్వారా చేపట్టనున్నట్లు రైల్వే బోర్డు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియకు సంబంధించి డ్రాఫ్ట్ నోటీసులు సిద్ధం చేయాలని దక్షిణ కోస్తా, తూర్పు కోస్తా రైల్వే జీఎంలకు సమాచారం అందించింది. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్ల నుంచి స్వచ్ఛందంగా వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి వివరాలు సేకరించి, 15 రోజుల్లోపు రైల్వే బోర్డు ఆమోదం కోసం పంపాలని సూచించింది.

కాంగ్రెస్ బలోపేతంపై దృష్టి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఏఐసీసీ పరిశీలకులు సునీల్ కొండాజీ అహిరే అన్నారు. మంగళవారం బెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో గాజువాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక సమావేశం జరిగింది. పార్టీ సమన్వయకర్త గవర వెంకట రమణారావు అధ్యక్షత వహించగా, సునీల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తల మద్దతుతోనే జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మెరుగైన నాయకత్వం కోసం క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు మార్టిన్ లూథర్, అమర్ జహబేగ్, నాయకులు వేగి వెంకటేష్, హాసిని వర్మ, లక్కరాజు రామారావు, అప్పలనాయుడు, జెర్రిపోతుల ముత్యాలు, మురళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు సునీల్ కొండాజీ అహిరే, చిత్రంలో పార్టీ నాయకులు

9న జోన్-3 పరిధిలోని దుకాణాలకు వేలం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ జోన్-3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, సామాజిక భవనాలకు 9న వేలం నిర్వహించనున్నట్లు జెడ్సీ కె.శివప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంవీపీకాలనీ, డైమండ్‌పార్కు, జగ్గారావు బ్రిడ్జి సమీప వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలు, బీటీఆర్‌కాలనీ, రెల్లివీధిలో సామాజిక భవనాలకు ఆరోజు ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు కార్యాలయం పర్యవేక్షకుడిని సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	117	115
లైవ్	144	135
డ్రెస్డ్	209	240
స్కిన్‌లెస్	238	250

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై విశాఖ జిల్లా, విజయనగరం జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్, స్థిరాస్తి ఎక్కడ ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ✆ 9396 999 669.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

Vastu Consultants Genuine India's Best Vastu for Industries / Houses Rural / Urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

FLAT FOR SALE

GAJUWAKA

2 BHK Flats 2 Nos For Sale Jawahar Nagar Sriharipuram. Contact Phone : 9100062243.

N A D

3Bhk flat E/f.. 5th flor.. 2Bhk 865sft S/f 3rd & 5 flor 2Bhk 820sft N/f 5th floor for sale at Vimanagar. Ph: 9446139989.

LAND FOR SALE

MADHURAWADA

LAND FOR SALE
5.33 ఎకరాల భూమి
సర్వే నెం. 296/14
P.M పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా, మధురవాడ, వైజాగ్‌లో అమ్మకమునకు కలదు.
6300711986
7382716164

PLOT FOR SALE

GAJUWAKA

296 Sq. Yards North Facing. Srinagar, Ginger Hotel Backside. Gajuwaka, Visakhapatnam. Cont.: 9346717891, 9949839498.

TO LET

COMMERCIAL

GENERAL

Available 3000 sq.ft in Basement Floor, Crescent Towers, Seethammadhara, Visakhapatnam. Contact: 8332864233

JOBS

Wanted Business Managers (M/F), Telecallers (M/F), Customer Adviser age below 35 yrs. Walk-in 2nd Floor, RK Vijaya Lakshmi Nilayam, Visalakshinagar Main Rd. ✆ 7993187448.

Wanted Autocad Designer Min. 1 year experience req. to work in a leading interior off. Dwarakanagar. ✆ 9849332399.

WALK - IN - INTERVIEW
A Well Established ORG (ISO Certified) Urgently Required in the 3rd quarter Recruitment Financial Year 2025-26. The below Jobs are vacant for Vizag Branch.
❖ CHIEF ADMINISTRATIVE OFFICER : M/F
Qlf: Retd; Gazetted Officers. Package: 20 Lakhs to 30 Lakhs PA (Negotiable)
❖ BUSINESS DEVELOPMENT MANAGERS: M/F
Qlf: Min. 1Year Exp. in any Sector Package: 10 to 15 Lakhs PA (Nego.,)
Interview on: 3rd & 4th Dec-25
Con: M.B.N.SATYANARAYANA DOCTORS COLONY, VSP
Ph: 9573222999

రూ. 9 లక్షల బెస్ట్ ప్యాకేజీపై పనిచేయుటకు 3 సం॥ ఏదైనా ఫీల్డ్ Exp. ఉన్న M/F ఏజ్: 30+ & రిటైర్డ్ / గృహిణులు కావలెను. ✆ 9014737483.

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్ M/F (200) కావలెను. జీ॥ 18-40K + Inc. ✆ 9804454445, 9989360902.

మీ ఇంటి దగ్గరలో PRO జాబ్. లెస్ వర్క్, లెస్ టైమ్. ఈజీ వర్క్. నో టార్గెట్. గుడ్ కమీషన్. అందరూ అర్హులే. నో ఎక్స్‌పీరియన్స్. ✆ 9490972901.

శర్వాణి స్వీట్స్ వైజాగ్‌లో పనిచేయుటకు * సెక్యూరిటీ గార్డ్స్ మరియు * హౌస్‌కీపింగ్ స్టాఫ్ కావలెను. జీతం: 12000/- మరియు భోజన సదుపాయం కలదు. Cont: 9948557714, 8185880340.

ఆయా కావలెను: స్కూల్లో పనిచేయుటకు 45సం॥లోపు ఆడమనిషి కావలెను. N.T. స్కూలు, అక్కయ్యపాలెం, వైజాగ్-16. ✆ 9398709459, 9959094720.

విశాఖపట్నం R.T.C**డిపోనందు** అసిస్టెంట్ మెకానిక్‌గా పనిచేయుటకు ఐటిఐచదివిన అభ్యర్థులు కావలెను. జీతం:11500/- P.F. E.S.I కలదు. Ph:9848078290.

డొమెస్టిక్ కొరియర్ సర్వీసెస్‌లో వర్క్‌చేయుటకు గ్రౌండ్ స్టాఫ్ కావలెను. జీ॥ 18000/-to25000/- డ్యూటీ 8:00గం||లు. Cont: 77309 58410, 99819 51405.

Govt. & ప్రైవేట్ బ్యాంక్స్ అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో అటెండర్స్, క్లర్క్స్, మేనేజర్స్, సెక్యూరిటీ, క్యాషియర్స్, హౌస్‌కీపింగ్. 10th-డిగ్రీ, MBA. జీ॥ 28K-38K. 9573635594, 9121044796.

FACULTY/ TEACHERS

Primary Teachers 1-5th All Subj., Higher Maths & 10th (Incharge), Tutors 1-6.30pm, 2.30-7pm. Quincy School, Sec-8, MVP Colony. Ct: 9440693003, 8121406394.

గాజువాకలో విశాఖ డిఫెన్స్ అకాడమీ కొరకు టెలికాలర్స్ కావలెను. Qul: ఇంటర్ / డిగ్రీ. జీ॥ 8K, 9AM-6PM. ✆ 9848577745 / 9666694545.

MEDICAL

ఫార్మసిస్ట్ (M/F) కావలెను. 2-3 సం||లు అనుభవం ఉండవలెను. జీతం: 18వేలు, సంప్ర|| Medplus, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా ✆ 9959991783.

SECURITY GUARDS

సెక్యూరిటిగార్డులు కావలెను. గాజువాక, అనకాపల్లి, గోపాలపట్నం ఏరియాల్లో 30 రోజులు పనిచేయుటకు రోజుకి రూ॥ 500/-. వయస్సు: 20-50 సం॥ ✆ 9963157250 / 9381533726.

సెక్యూరిటీగార్డులు కావలెను RTC కాంప్లెక్స్, జగదాంబ ఏరియాలో 30రోజులు పనిచేయుటకు. రోజుకి రూ॥ 500/-. వయస్సు: 20-50 సం॥. సంప్ర: 9603216460, 6301352727.

సెక్యూరిటీగార్డ్స్: ఆటోనగర్, పెందుర్తి, శొంఠ్యాం ఏరియాల్లో చేయుటకు గార్డ్స్ కావలెను. అర్హత: 10th, 8గం॥ డ్యూటీ, Age:25-45. ✆ 2721672, 9440387815.

సెక్యూరిటీగార్డులు కావలెను. RTC కాంప్లెక్స్, జగదాంబ ఏరియాల్లో పనిచేయుటకు. జీతము: 12,000/- - 15,000/- ✆ 7780236249 / 6300725191.

పరవాడ ఫార్మాసిటీ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూ॥ 8 గం॥ మరియు 12 గం॥, వ॥ 45 సం॥లలోపు టెన్త్ క్లాస్ పాస్. 9177890332, 7893197794.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 ఆంధ్ర కింగ్ తాలూకా
స్క్రీన్-2 - రాజు వెడ్స్ రాంబాయి

నేడు హనుమత్ వ్రతం

లంకెలపాలెం(పరవాడ), న్యూస్టుడే: జీవీఎంసీ 79వవార్డుపరిధి లంకెలపాలెం కూడలిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఉదయం హనుమత్ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశినాడు నిర్వహించే ఈ వ్రతాన్ని 125జంటలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎఫ్ఎల్ఎన్ సర్వేపై శిక్షణ

సబ్బవరం, న్యూస్టుడే: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు ఏవిధంగా ఉన్నదీ అంచనా వేసేందుకు ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) సర్వేకు ఆదేశించింది. ఇప్పటికే మండలంలో 60శాతం సర్వేను సీఆర్పీలు నిర్వహించారు. మిగిలిన 40శాతం వెంటనే పూర్తి చేయాల్సి ఉన్నందున వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను పరిశీలించాల్సి ఉంటుందని ఎంఈవో ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం వారికి శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 5వతేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎంఈవో రవీంద్రబాబు, రిసోర్సుపర్సన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ.10 నుంచి మ. ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్టుడే: ?: అప్పన్నపాలెం-భరత్‌నగర్ రహదారిలో భూగర్భ డ్రైనేజీ సంప్‌ల వద్ద గోతులు ప్రమాదకరంగా మారాయి. -త్రినాథరావు, అప్పన్నపాలెం. ✓: భూగర్భ డ్రైనేజీ విభాగం అధికారులకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటాం. -శంకరరావు, ఇన్‌ఛార్జి జోనల్ కమిషనర్, జోన్-8

సబ్బవరం, న్యూస్టుడే: ?: సబ్బవరం పాత సినిమాహాలు వినాయక కాలనీ సమీప గెడ్డలో మురుగు పేరుకుపోయి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. -కె.రామారావు, సబ్బవరం. ✓: ఈ విషయాన్ని మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించి చర్యలు తీసుకుంటాం. -వై.రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో, సబ్బవరం

?: సబ్బవరం పీహెచ్‌సీకి వెళ్లే రహదారిపై గోతులు ఏర్పడి రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. -మామిడి శంకరరావు, బల్లిపాలెం ✓: రూ.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. -పి. పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

పరవాడ, న్యూస్టుడే: ?: పరవాడ గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద బస్‌షెల్టర్ లేక అవస్థలు పడుతున్నాం. -రమేష్, స్థానికుడు ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. -రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

?: పరవాడ మండలం వెంకటపతిపాలెంలోని సామాజిక భవనం శిథిలావస్థకు చేరింది. -నాయుడు, స్థానికుడు ✓: సంబంధిత భవనానికి మరమ్మతులు చేయించేందుకు కృషి చేస్తాం. -త్రినాథ్, పంచాయతీ కార్యదర్శి, నాయుడుపాలెం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వెలిగిన వీధి దీపాలు

పెందుర్తి, న్యూస్టుడే: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని దుర్గా ఆదర్శ్‌నగర్‌లో కొన్నాళ్లుగా వీధిదీపం వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలువురు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో వార్డు వీధిదీపాల నిర్వహణ ఏఈ సోమేశ్ స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

మెగా వేదిక.. విద్యా వేడుక..

పాఠశాలల్లో పీటీఎం సమావేశాలకు ఏర్పాట్లు

తోరణాలతో తీర్చిదిద్దిన బాపడుపాలెం పాఠశాల

పరవాడ, న్యూస్టుడే: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించి వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒక వేదికపైకి తీసుకొచ్చి వారి మధ్య స్నేహపూర్వక బంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేసేందుకు మెగా పీటీఎం-3 (పేరెంట్ టీచర్ మీటింగ్) ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు పీటీఎంల కంటే ఈసారి మరింత సమర్థంగా నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. వీటి నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం నిధులు సైతం కేటాయించింది.

నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలిలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	కళాశాలలు	విద్యార్థులు
పెందుర్తి	76	6827	02	783
పరవాడ	65	4579	02	360
సబ్బవరం	53	3758	01	590
పెదగంట్యాడ రూరల్	13	850	01	82
మొత్తం	207	16,014	06	1815

కార్యక్రమం నిర్వహణ ఇలా..

★ మెగా పీటీఎం ఈనెల 5వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉంటుంది. తొలుత తల్లిదండ్రులకు, పూర్వవిద్యార్థులు, దాతలు, పీఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు స్వాగతం పలుకుతారు. ★ 9.30 గంటల నుంచి విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, అసైన్‌మెంట్ బుక్‌లెట్, విద్యార్థుల బేస్‌లైన్ స్థాయి తదితర వాటిపై తల్లిదండ్రులకు వివరిస్తారు. విద్యార్థుల హోలిస్టిక్ కార్డులు, ఆరోగ్యంపై చర్చిస్తారు. కెరీర్, మానసిక, ఆరోగ్య కౌన్సెలింగ్, మాదకద్రవ్యాల వల్ల అనర్థాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధానంపై వీడియోలు ప్రదర్శిస్తారు. ★ 11 గంటల నుంచి స్పోర్ట్స్ కిట్‌లు, లైబ్రరీ పుస్తకాలు, ఏటీఎల్ ల్యాబ్, విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వస్తువులు, పోటీ పరీక్షల పుస్తకాలు, టీవీఎం ప్రదర్శన తిలకిస్తారు. తర్వాత ఉపన్యాసాలు ఉంటాయి. పాఠశాల ప్రగతిని, పదో తరగతి 100 రోజుల ప్రణాళిక హెచ్‌ఎంలు వివరిస్తారు. ★ 11.10 గంటల నుంచి విద్యార్థులతో పద్యాలు, కథలు, కవితలు, ఆత్మ రక్షణ విద్య తదితర వాటిపై చెప్పిస్తారు. ఎస్ఎంసీ ఛైర్మన్ ప్రసంగం, పాఠశాల అవసరాల కోసం దాతల నుంచి విరాళాలు సేకరించేందుకు విజ్ఞప్తి చేస్తారు. ★ 12.45 గంటల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. ★ ఈ సమావేశాల కోసం విద్యాలయాలను తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

పండగ వాతావరణంలో నిర్వహిస్తాం

మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను ఈనెల 5వ తేదీన పండగ వాతావరణంలో నిర్వహిస్తాం. ఈ మేరకు పాఠశాలల ఉపాధ్యాయులకు ఉత్తర్వులు పంపాం. ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టారు. అందరి సహకారంతో పీటీఎం-3ని విజయవంతం చేస్తాం.
-దివాకర్‌రావు, ఎంఈవో, పరవాడ

సమస్యలు పరిష్కరించేందుకే 'మన పల్లెకు-మన ఎమ్మెల్యే'..

అక్కిరెడ్డిపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

గుర్రమ్మపాలెం (పెందుర్తి), న్యూస్టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కారమార్గం చూపించడమే లక్ష్యంగా 'మన పల్లెకు-మన ఎమ్మెల్యే' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గుర్రమ్మపాలెం పంచాయతీ పరిధిలోని అక్కిరెడ్డిపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలను ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచి ఉగ్గిన గోవింద్, ఎంపీటీసీ సభ్యురాలు గండ్రెడ్డి మాలతి, ఎంపీడీవో గుండు అప్పలరాజు, తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు, సీఐ కె.వి.సతీశ్‌కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ సింహాచలంనాయుడు, భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

125 మంది బాలికలకు రగ్గుల పంపిణీ

రగ్గులు అందుకున్న బాలికలతో రాంకీ ప్రతినిధులు ఎర్రయ్య, శ్రీకాంత్

పరవాడ, న్యూస్టుడే: మండల కేంద్రం పరవాడ ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన 125 మంది బాలికలకు మంగళవారం విశాఖ ఫార్మాసిటీ ఆధ్వర్యంలోని రాంకీ ఫౌండేషన్ సహకారంతో రగ్గులు వితరణ చేశారు. రాంకీ సంస్థ సమన్వయాధికారి పి.ఎర్రయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి బాలికలకు రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, సహాయ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, వార్డెన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో అదృశ్యం.. పెందుర్తిలో ప్రత్యక్షం

వృద్ధురాలిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి, న్యూస్టుడే: మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు గాజువాకలో అదృశ్యం కాగా.. పెందుర్తిలో ఆచూకీ లభించినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో ఒంటిపై బంగారు ఆభరణాలున్న ఓ వృద్ధురాలు చలికి వణుకుతూ అనాథగా ఉండడాన్ని గ్రామానికి చెందిన కావ్య, చింతలమ్మ మంగళవారం గమనించి చేరదీశారు. తర్వాత పెందుర్తి పోలీసులకు సమాచారం అందించగా.. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆమెను చేర్పించారు. ఈ మేరకు సంబంధిత విషయాన్ని పలు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయగా.. గాజువాకలోని ఆమె బంధువులు స్పందించారు.

★ ఇదిలా ఉండగా గత నెల 30వ తేదీన బూరల పెంటమ్మ (65) అనే మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తప్పిపోయిన ఆ వృద్ధురాలి ఆచూకీని పెందుర్తి పోలీసులు గుర్తించడంతో ఆమెను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. ఆమెను సంరక్షించిన రాంపురం గ్రామ మహిళలను సీఐ అభినందించారు.

రేపు కథాకళి ఉత్సవాలు

మురళీనగర్, న్యూస్టుడే: మురళీనగర్ జాతీయ రహదారి సమీపంలోని కేరళ కళా సమితి ఆడిటోరియంలో గురువారం మెగా కథాకళి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళీయుల సంప్రదాయ కళలను ప్రోత్సహించే దిశగా సాయంత్రం 7 గంటలకు కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుందని కార్యదర్శి కె.హరిదాసు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకుని ప్రవేశ అనుమతి పత్రంతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 98481 98231 నెంబరులో సంప్రదించాలని కోరారు.

వైభవంగా భూలోకమాంబ పండగ

భక్తులకు వడ్డిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, తదితరులు

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం బీసీకాలనీలో గల భూలోకమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, భూలోకమాంబ యూత్ సభ్యులు, పెద్దలు ముత్తానాయుడు, సాలాపు రమణ తదితరులు పాల్గొన్నారు. సుమారు 3వేల మంది భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా అంబలం పూజ

సబ్బవరం, న్యూస్టుడే: సబ్బవరం మండలం ఎల్లుప్పి శివారు మర్రిపాలెంలో మంగళవారం దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. లోకిరెడ్డి దుర్గారావు, అమరపిన్ని నర్సింగరావుల ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు. లోకిరెడ్డి అప్పలరాజు, బాలాశ్రీ గురువుల సూచనల మేరకు దుర్గాదేవి పూజలు నిర్వహించారు. దుర్గాదేవి నామస్మరణతో ఆప్రాంతమంతా మార్మోగింది. అనంతరం హాజరైన వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

అలరించిన సాహితీ సభ

ప్రసంగిస్తున్న మాటూరి శ్రీనివాస్

సీతంపేట, న్యూస్టుడే: సమతా సాహితీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం సాహిత్య సభ నిర్వహించారు. గుంటూరు లక్ష్మీనరసయ్య సంకలనం చేసిన 'చిక్కనవుతున్న పాట' కవిత్వ సంపుటిను సాహితీవేత్త మాటూరి శ్రీనివాస్ విశ్లేషించారు. 1995లో వచ్చిన ఈ సంపుటి సంచలనం సృష్టించిందన్నారు. అక్షరాల్లో ఆర్ద్రత ఉండేదే గొప్ప కవిత్వమన్నారు. సమావేశంలో కత్తి పద్మ, ఉప్పల అప్పలరాజు, ఆచార్య వెలమల సిమ్మన్న, మరడాన సుబ్బారావు, కె.వి.ఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ మొరాయింపు.. 'కౌశలానికి' అవరోధం

వేపగుంట సచివాలయంలో పరీక్షకు హాజరైన అభ్యర్థి

పెందుర్తి, న్యూస్టుడే: ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహించ తలపెట్టిన కౌశలం పరీక్షకు పెందుర్తి మండలంలోని గ్రామీణ సచివాలయాల్లో తొలిరోజు ఆటంకం ఏర్పడింది. ఈ ప్రక్రియ కోసం ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రభుత్వం కౌశలం సర్వే నిర్వహించి వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల పేర్లు నమోదు చేసింది. వారందరికీ మంగళవారం నుంచి ఈనెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం సచివాలయాలకు వెబ్ కెమెరాలు, ఇతర పరికరాలు సరఫరా చేసింది. తొలిరోజు పరీక్షకు హాజరవ్వాల్సిన అభ్యర్థులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు. పెందుర్తి మండలంలోని పదిహేను పంచాయతీల నుంచి 90మందికి తేదీల వారీగా పరీక్షకు హాజరు కావాలని సందేశం అందింది. ఆ మేరకు గ్రామ సచివాలయాలకు అభ్యర్థులు హాజరు కాగా సర్వర్ మొరాయించింది. ఆధార్ అథెంటికేషన్ జరగనందున పరీక్ష జరగలేదు. ఉదయం 11 గంటలు, మధ్యాహ్నం 3 గంటల స్లాట్లకు ఇదే పరిస్థితి ఎదురైంది. వీరందరినీ రీషెడ్యూల్ చేసుకోవాలని సందేశాలు అందినట్లు అధికారులు తెలిపారు. బుధవారం నుంచి జరగాల్సిన పరీక్షలు యథావిధిగా ముందస్తు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పట్టణ పరిధిలో సజావుగా..

వేపగుంట, న్యూస్టుడే: ఈ పరీక్షలు జీవీఎంసీ జోన్-8 పరిధిలో సజావుగా జరిగాయి. జోన్ పరిధిలోని 73 వార్డు సచివాలయాల్లో మొత్తం 146 మంది హాజరైనట్లు జెడ్సీ శంకరరావు పేర్కొన్నారు. వేపగుంట 484వ సచివాలయంలో ఉదయం కార్యదర్శి కాశిమల్ల భవానీ ఈ పరీక్షలను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరీక్ష రాసే సమయంలో వెబ్ కెమెరాలో మరో వ్యక్తి కనిపిస్తే సంబంధిత అభ్యర్థి అనర్హులవుతారని అన్నారు. అందుకే ప్రజల నుంచి కాస్త దూరంగా అర్జీలు స్వీకరించినట్లు ఆమె పేర్కొన్నారు.

గురుకులంలో వన మహోత్సవం

లికేశ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నరవ(వేపగుంట), న్యూస్టుడే: నరవలోని జ్యోతిబా పులే గురుకుల పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రిన్సిపల్ ఎం.రూప ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మాక్ అసెంబ్లీకి వెళ్లిన ఎస్.లికేశ్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సత్కరించి అభినందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ముగిసిన గీతాజయంతి వేడుకలు

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట పరిసర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు చేపట్టిన గీతాజయంతి వేడుకలు మంగళవారం ముగిశాయి. చింతలగ్రహారం కృష్ణాలయంలో ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు, అర్చకులు సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో రెండు రోజులు ఆలయంలో గీతాజయంతి పూజలు జరిగాయి. 24 గంటల పాటు గీతాపారాయణం చేసి భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా 31 శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు నిష్కించన భక్తదాస ఆధ్వర్యంలో ప్రహ్లాదపురంలోనూ ఈ వేడుకలు జరిగాయి. స్థిరాస్తి వ్యాపారి కృష్ణమూర్తి దంపతులు భక్తులకు 108 భగవద్గీత పుస్తకాలను వితరణగా అందించారు.

పూజలందుకున్న శ్రీకృష్ణుని విగ్రహాలు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

విశాఖ క్రీడలు, న్యూస్టుడే : ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారుడు ఎం.తరుణ్ (88 కిలోల విభాగం) సత్తాచాటి రజత పతకం గెలుపొందాడు. పోటీలు రాజస్థాన్‌లోని పూర్ణిమ యూనివర్సిటీలో సోమవారం ముగిశాయి. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి తదితరులు తరుణ్‌ను అభినందించారు. కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ లక్ష్మణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తరుణ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ జి.ఎస్.కె.చక్రవర్తి, తదితరులు

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

వేపగుంట, న్యూస్టుడే: భూముల ధరలు బాగా పెరగడంతో కబ్జాదారులు ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపించినా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఆ వివరాలిలా..జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లి సమీప బ్రహ్మంగారి మఠం వెనుక సుమారు 7ఎకరాల వివాదాస్పద భూమి ఉంది. దానిని ఆనుకొని కొంత ప్రభుత్వ భూమి ఉంది. దాని విలువ సుమారు రూ.కోటి విలువ చేస్తుంది. ఆ స్థలంలో ఎరుకుల సామాజికవర్గానికి చెందిన కొందరు గుడారాలు వేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ఆర్.ఐ హరిప్రసన్న ఆధ్వర్యంలో పలువురు వీఆర్వోలు అక్కడకు చేరుకుని ప్రభుత్వ స్థలంలో వెలసిన గుడారాలను జేసీబీతో తొలగించారు. ఈ విషయంలో ఆక్రమణదారులకు కొందరు అధికారులు సహకరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

మల్లికార్జునరావును సత్కరిస్తున్న తెదేపా నాయకులు

పరవాడ, న్యూస్టుడే: పరవాడ మండలానికి డిప్యూటీ ఎంపీడీవోగా మల్లికార్జునరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెందుర్తి మండలం సరిపల్లి పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పరవాడ మండల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నెలపాలెం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు మల్లికార్జునరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

కాలుష్య నియంత్రణపై అవగాహన

పెందుర్తి, న్యూస్టుడే: వాతావరణ కాలుష్య నియంత్రణకు యువత నడుం కట్టాలని పెందుర్తి ఆదర్శ్ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కాలుష్య నియంత్రణపై ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రిన్సిపల్ ఫ్లోరా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, ఏవో రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, న్యూస్టుడే: విద్యార్థుల భద్రత విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. ఈ మేరకు పరవాడ పోలీస్‌స్టేషన్లో మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌తో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేటట్టు చూడాలని, బాలికల రక్షణ నిమిత్తం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీసులకు విద్యాసంస్థలకు మధ్య వేగవంతమైన సమాచారం మార్పిడి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు.

లంకెలపాలెం(పరవాడ), న్యూస్టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ మల్లికార్జునరావు అన్నారు. జీవీఎంసీ 79వవార్డు పరిధి లంకెలపాలెం శాంతి టాలెంట్ స్కూల్లో మంగళవారం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, రోడ్డుభద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బ తీస్తాయని వీటికి దూరంగా ఉండాలని చైతన్యపర్చారు. విద్యార్థులంతా బాల్యం నుంచే మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపల్ శ్రీధర్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ క్రీడా పోటీలకు జట్ల ఎంపిక

త్రోబాల్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయినులతో ఎంఈవోలు

పెందుర్తి, న్యూస్టుడే: బడిలో చదువుకునే పిల్లలతో పాటు ఉపాధ్యాయులకూ మానసిక ఉల్లాసం ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువులకు క్రీడాపోటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డివిజన్ స్థాయిలో జరగనున్న క్రీడాపోటీల కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు రెండు రోజుల పాటు జరిగాయి. పెందుర్తి మండలం పినగాడిలోని వెల్ఫేర్ క్రీడా మైదానంలో ఉపాధ్యాయినులకు త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే వారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గురువులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పెందుర్తి ఎంఈవో-1, 2 కె.సువర్ణ, మధుమూర్తి, పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన వారు

రహదారి విస్తరణ తొలి దశ పనులు ప్రారంభం

పనులు పరిశీలిస్తున్న ఏసీపీ రామలింగారెడ్డి, టీపీవో గోపన్న

వేపగుంట, న్యూస్టుడే: వేపగుంట-పినగాడి రహదారిని 60 అడుగులకు విస్తరించే పనుల్లో భాగంగా తొలి దశ పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చేపట్టారు. ఏసీపీ రామలింగారెడ్డి పర్యవేక్షణలో టీపీవో గోపన్న పలువురు సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా ఇటీవల జీవీఎంసీలో జరిగిన స్టాండింగ్‌కమిటీ సమావేశంలో వేపగుంట-పినగాడి, వేపగుంట-జుత్తాడ రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సర్కారు ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సౌకర్యాల కల్పనపై ఆరా

వన్‌టౌన్, న్యూస్టుడే : మార్గశిర మాసం సందర్భంగా బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయ పరిసరాల్లో పర్యటించి, ఏర్పాట్లు పరిశీలించారు. రెండో గురువారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రసాదాల కౌంటర్, క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ ఆనంద్‌కుమార్, రాజేంద్ర, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి
మంచితనానికి మారుపేరుగా నిలిచి కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి విలువలతో కూడిన జీవితము మాకు అందించిన మీరు భగవంతుని సన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...
కీ.శే. అమరపిన్ని జోగినాయుడు గారు
Ex. సర్పంచ్, దేశపాత్రునిపాలెం
Ex. బ్లాక్ కాంగ్రెస్ పరవాడ మండల ప్రెసిడెంట్
జననం: 15-07-1948, మరణం: 21-11-2025
కుమారుడు : అమరపిన్ని వీరవెంకటకిషోర్
కోడలు: జయరమ్యహేమ
కుమార్తెలు - అల్లుళ్ళు
కోన కమల - రామునాయుడు
కరణంరెడ్డి జ్యోతి - నర్సింగరావు
గడ్డం చిన్నారిచేతన - శ్రీనివాస్
మనవళ్ళు: అమరపిన్ని వేదాంత్ సాయి, అమరపిన్ని జెయంత్ సాయి, కోన సత్యేంద్ర ఫణికుమార్, కరణంరెడ్డి చిరుహాసన్, గడ్డం కోహిల్
మనవరాళ్ళు: కోన లక్ష్మి ఆశ్రిత, కరణంరెడ్డి సాహితి, గడ్డం పరిణిత
మరియు అమరపిన్ని కుటుంబ సభ్యులు
పెద్దకర్మ: తే. 03-12-2025 బుధవారం పరవాడ మండలం దేశపాత్రునిపాలెం మా స్వగృహం నందు జరుగును.

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- రివాల్వర్ రీటా
రాములమ్మ- జనతా బార్
తాతా- రాజు వెడ్స్ రాంబాయి
సప్తగిరి- ఆంధ్ర కింగ్ తాలూకా

తాత్కాలిక ప్రాతిపదికన హిందీ బోధకుని నియామకం

కొమ్మాది, న్యూస్‌టుడే: చినగదిలి మండల పరిధి బక్కన్నపాలెం ఉన్నత పాఠశాలలో 5 నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన హిందీ బోధకుని నియామక ప్రక్రియ చేపడుతున్నామని ఎంఈవో రవీంద్రబాబు తెలిపారు. ఆ పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. డిగ్రీ, హిందీ మెథడాలజీ ఉన్నవారు అర్హులని, నెలకు రూ.12,500 వేతనం ఇస్తారన్నారు. అర్హులు ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు వాడపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

యువతిని వేధిస్తున్న నిందితుడి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: ప్రేమిస్తున్నానంటూ యువతిని వేధిస్తున్న వ్యక్తిని ఎండాడ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన యువతికి ఇన్‌స్టాగ్రాం ద్వారా ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. మెడికల్ సీటు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో మాయ మాటలు చెప్పి ఆమె ఫొటోలు సేకరించాడు. మెడికల్ సీటు కోసం రూ.30 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి తాను చోరీ చేసిన సెల్‌ఫోన్ ద్వారా పంపించి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు యువతి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన మదీనాపాటి నాగుల్ మీరాగా గుర్తించారు. అతను గతంలో ఓ మహిళను ఇదే విధంగా మోసగించి రూ.3.50 లక్షలు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. గత నెల 29న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి జోన్ పరిధిలో రెండు జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల కింద తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హుల నుంచి ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పొట్టి శ్రీరాములు జీవీఎంసీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు, రాయిపాలెం అల్లూరి సీతారామ రాజు జీవీఎంసీ హైస్కూల్లో తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాబోయే పదో తరగతి పరీక్షల దృష్ట్యా ఈ పాఠ్యాంశాలను ఈనెల 8వ తేదీ నుంచి 2026 మే మధ్య బోధించేందుకు ఈ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 గౌరవ వేతనం అందిస్తారు. ఇందు కోసం తెలుగు, హిందీ భాషా పండితులు ఈనెల 5వ తేదీలోగా భీమిలిలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అర్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంఈవోలు శివరాణి, జయప్రద కోరారు.

ముందు జాగ్రత్తలతో సైబర్ నేరాల నియంత్రణ

పద్మనాభం, న్యూస్‌టుడే: సైబర్ నేరాల నియంత్రణ.. తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్డిపల్లి స్టేట్‌బ్యాంకు సౌజన్యంతో మ్యాజిక్ షో, తదితర వాటితో అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ కార్యాచరణ'కు రైతులకు పిలుపు

పద్మనాభం, న్యూస్‌టుడే: గ్రామ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం బోని గ్రామంలో బుధవారం నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్.చలం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో భీమిలి సన్ స్కూలు ఎనిమిదో తరగతి విద్యార్థి కొయ్యి సోహిల్ ప్రతిభ చాటాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి త్వరలో మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంబంధిత విద్యార్థిని అభినందించారు.

స్వర్ణ పతకం సాధించిన సోహిల్

బాలల హక్కులపై అవగాహన

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.ఎల్.రామలక్ష్మి ఆదేశాలతో సంబంధిత సోషల్ వర్కర్ ఐ.సులేఖ ఆయా అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాణీ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: జ్యూటుమిల్లు కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎలాంటి పోరాటాలకైనా తమ సంఘం సిద్ధమని ఐఎన్‌టీయూసీ (ఇంటక్) జాతీయ కార్యదర్శి, మిల్లు గుర్తింపు సంఘం అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు అన్నారు. చిట్టివలసలోని తమ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన నగరానికి రానున్న రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శిని కలిసి తమ సమస్యలపై చర్చించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరమణ, సరగడ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇంటక్ జాతీయ కార్యదర్శి వరహాలరాజు

రైతులకు కూటమి అండ..!

ధాన్యం విక్రయ కేంద్రాల్లో గిట్టుబాటు ధర

పద్మనాభం, న్యూస్‌టుడే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగం రూపురేఖలు మారుతున్నాయి. నూతన పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడంలో కూటమి ప్రభుత్వం రైతులకు దన్నుగా నిలుస్తుంది.

వెంటనే కొనుగోలు

గతంలో వరి పండించిన రైతులు, ఆ పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. పొలాల్లో కోతలు జరుగుతుండగానే... ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. రైతు కష్టానికి తగినట్టుగా గిట్టుబాటు ధర కల్పిస్తూ, ధాన్యం విక్రయించిన ఒక్క రోజు వ్యవధిలోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంది.

అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం

ఎక్కడెక్కడ..?
పద్మనాభం మండలంలో పద్మనాభం, రెడ్డిపల్లి, గంధవరం, పాండ్రంగి, బాందేవపురం పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఆయా చోట్ల విక్రయ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. క్వింటాకు గ్రేడు-1 రకానికి రూ.2389, గ్రేడు-2 రకానికి రూ.2369 ధరను ప్రభుత్వం కల్పిస్తుంది.

★ రైతు పండించిన పంట శాంపిల్స్‌ను పీఏసీఎస్ సాంకేతిక సిబ్బందికి ఇస్తే, వారు తేమ శాతం పరీక్షిస్తారు. 15 శాతం కంటే తక్కువ తేమ ఉన్న ధాన్యం వివరాలను రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుడి వద్ద నమోదు చేసుకోవాలి. ★ ఆ తర్వాత నిర్ణీత తేదీల్లో పీఏసీఎస్ సిబ్బంది పంపిణీ చేసిన గోనె సంచుల్లో ధాన్యం నింపుకొని మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. ★ ఇప్పటి వరకు మద్ది, అనంతవరం, పొట్నూరు గ్రామాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.

దళారులను నమ్మొద్దు..!
రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. తూకంలో ఎలాంటి తేడా లేకుండా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. విక్రయాల్లో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే.. వెంటనే వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించొచ్చు. –ఎంవీఎస్.చలం, మండల వ్యవసాయాధికారి.

రహదారి నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

కొమ్మాది, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని అప్పుడే ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉంటారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.రాజారావు పేర్కొన్నారు. పీఎంపాలెం బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్‌వైజాగ్) ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏపీ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజారావు మాట్లాడుతూ నిర్దేశించిన వేగంతోనే వాహనాలను నడపాలని, తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. యువత చరవాణి మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఏఎంవీఐ అధికారి ఎ.వరప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపల్ ఎం.రాజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

✦ కొమ్మాదిలోని కృష్ణ వికాస్ విజయం పాఠశాలలో విద్యార్థులతోపాటు బస్సు డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. బస్సుల్లో అత్యవసర ద్వారం పనితీరు, అగ్నినియంత్రణ సామగ్రి, డ్రైవర్ల లైసెన్సులు, ఇతర పత్రాలను నిశితంగా పరిశీలించారు. ప్రిన్సిపల్ కె.విజయలక్ష్మి, కరస్పాండెంట్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఐ అధికారి

ఉద్యోగ విరమణ సత్కారం

కొమ్మాది, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ధైర్యసాహసాలు నింపడమే కాకుండా చిత్రలేఖనంలో రాణించేలా ఉపాధ్యాయులు రొక్కం మధుసూదనరావు కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. 40 సంవత్సరాలు చిత్రలేఖనం ఉపాధ్యాయులుగా, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులంతా మంగళవారం ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. హెచ్ఎం మొలుగు వెంకటరావుతో పాటు పూర్వమిత్రులు, విద్యాకమిటీ సభ్యులు, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు తదితరులు మధుసూదనరావు దంపతులను సత్కరించారు.

మధుసూదనరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రూ.40లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డులో రూ.40లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంగళవారం వార్డు తెదేపా కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. పరదేశిపాలెంలో సామాజిక భవనం, అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. మారికవలసలో రహదారులు, కాలువల నిర్మాణ పనులు త్వరలో జరగనున్నాయన్నారు. తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణ్‌రావు, ఏఈ తిరుమలరావు, జనసేన వార్డు అధ్యక్షులు దేవర శివ, తెదేపా నాయకులు ముచ్చి రామునాయుడు, కొండపురాజు, మన్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మొల్లి హేమలత తదితరులు

సింహగిరిపై నేడు హనుమత్ వ్రతం

సింహాచలం, న్యూస్‌టుడే: మార్గశిర శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలకు పంచామృతాభిషేకం, 7.30గంటల నుంచి లక్ష నాగవల్లీ దళార్చన, 9గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 10.30గంటలకు పూర్ణాహుతి జరుగుతాయని దేవస్థానం ఈవో ఎన్.సుజాత తెలిపారు. ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న పూజల్లో భాగంగా మంగళవారం అర్చకులు స్వామికి విశేష అర్చనలు, హోమం నిర్వహించారు. సుందరకాండ పారాయణం చేశారు.

హనుమంతుడికి పూజలు చేస్తున్న అర్చక స్వామి

సంప్రదాయబద్ధంగా తిరునక్షత్ర పూజలు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రినాథుడి ఆలయంలో తిరుమంగై యాళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరులు, ఆళ్వారాచార్యుల సహితంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. ధూపదీప సేవలు చేసి నివేదనలు సమర్పించారు. నాలాయిర దివ్యప్రబంధ పారాయణం చేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు, ఆళ్వార్ సహితంగా గోవిందరాజ స్వామి

పార్కులో కొత్త కళాకృతులు

గౌతమబుద్ధుని విగ్రహం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జమ్మిచెరువు పార్కులో సరికొత్త కళాకృతులు కొలువుదీరాయి. భీమిలి చిన్న బజారు వద్ద సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన ఈ పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ రూ.42.50 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉద్యానవనంలోకి ప్రవేశించగానే ఆకట్టుకునే రీతిలో లవ్ భీమిలి ఆకృతి, స్నాన ఘట్టం పక్కన గౌతమ బుద్ధుని విగ్రహం, గడ్డి మేస్తున్నట్లు కనిపించే గుర్రం బొమ్మ ఏర్పాటు చేశారు. భీమిలి జోన్ ప్రజాపనుల ఉప కార్యనిర్వాహక ఇంజినీరు జి.సురేశ్ మాట్లాడుతూ వీటికి మరిన్ని హంగులు చేకూర్చి కనువిందు చేసేలా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో వ్యాయామ పరికరాలు కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న 'ఐ లవ్ భీమిలి' ఆకృతి

బెటాలియన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పద్మనాభం, న్యూస్‌టుడే: ప్రభుత్వ అవసరాల నిమిత్తం స్థలాల పరిశీలనకు పద్మనాభం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్డీవో సంగీత్ మాథుర్ మంగళవారం పర్యటించారు. రెడ్డిపల్లి, తునివలస, కృష్ణాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. కృష్ణాపురం పరిధిలో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ కోసం గతంలో ప్రతిపాదించిన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్.ఐ. శ్యామల తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాథుర్, అధికారులు

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అండర్-17 జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ వై.సునీత తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు కొండ్రగుంట జయ్‌రామ్, గరుడ స్వస్యాక్షర ప్రతిభ చాటారని పేర్కొన్నారు.

జయ్‌రామ్


స్వస్యాక్షర

కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.శ్రీవాణి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులకు, ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్సు అధ్యాపకురాలు రజని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎల్‌యూబీ'తో గీతం అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సహకరించడానికి లఘు ఉద్యోగ్ భారతి(ఎల్‌యూబీ) సంస్థతో గీతం డీమ్డ్ వర్సిటీ మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, ఎల్‌యూబీ ప్రతినిధులు ఓం ప్రకాష్‌గుప్తా, టి.యోగేష్‌చంద్ర, ఎ.కృష్ణబాలాజీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గీతం (విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు) ప్రాంగణాలను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని ప్రో-వీసీ గౌతమ్‌రావు పేర్కొన్నారు. ఎల్‌యూబీ జాతీయ కో-ఆర్డినేటర్ జయంతి గోయల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లోని దాదాపు 590 జిల్లాల్లో 60 వేలకు పైగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎల్‌యూబీలో సభ్యత్వం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.

ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

కౌశలం పరీక్షలు ప్రారంభం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వర్క్ ఫ్రం హోం ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న కౌశలం పరీక్షలు జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయా సచివాలయాల్లో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరిగాయి. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు చోటుచేసుకోగా అలాంటివారికి రీషెడ్యూల్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. తొలిరోజు జిల్లాలో సుమారు 90శాతం మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. చిన్నచిన్న సమస్యలు తప్పితే విజయవంతంగా పరీక్ష జరిగిందన్నారు.

✦ కౌశలం పరీక్ష తొలి సెషన్‌లో రాశాను. మంచి స్టాండర్డ్స్‌తో కఠినమైన ప్రశ్నలు ఇచ్చారు. అయినా సమాధానాలు బాగానే రాశాను. ఈ విధానంలో పరీక్షల నిర్వహణ చాలా బాగుంది. మాలాంటి నిరుద్యోగులకు సువర్ణావకాశమని చెప్పవచ్చు.
–శ్రేయ (పరీక్షకు హాజరైన అభ్యర్థిని)

✦ వర్క్ ఫ్రం హోం అసెస్‌మెంట్ అంటే మామూలుగా ఉంటుందనుకున్నా. చాలా కఠినంగా పేపరు ఇచ్చారు. నేను న్యాయశాస్త్ర విద్యార్థిని కావడంతో దానిపై ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి.
–అజయ్‌పాల్ (అభ్యర్థి)

సచివాలయంలో పరీక్షకు హాజరైన అభ్యర్థి

సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలు అందించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సాగర్‌నగర్ సచివాలయాల ఉద్యోగులను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన సాగర్‌నగర్- 1, 2 సచివాలయాల్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం-1లో నిబంధనల మేరకు పురోగతి లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సిటిజన్ సర్వే, ఈకేవైసీ చేయడంలో నిర్లక్ష్యంగా ఉండటంపై ప్రశ్నించారు. పక్కాగా దస్త్రాల నిర్వహణ లేకపోతే సహించేది లేదన్నారు. ఇదే భవన సముదాయంలోని యూపీహెచ్‌సీని సందర్శించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ ఉషారాణి, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజా రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

PUBLIC NOTICE

Under the instructions of my client, **Mandapati Madhava Varma S/o. Satyanarayana Raju,** Dr.No. 4-3-98, Madhavapuram Road, Pithapuram, Andhra Pradesh, it is hereby informed the general public that he entered an agreement with the owners for purchase of property in an extent of 200 sq yards covered by the schedule annexed hereunder belonging to Smt. Thota Anantha Krishna Tulasi Parvathi D/o.Rama Mohana Rao of srikakulam and therefore, anybody having objections or claims with regard to title and possession of the schedule mentioned property, they may submit their objections to the undersigned within (5) five days from the date of publication of this notice with all relevant documents in support of their objections or claims. In case no objections are received within the stipulated time it will be presumed that the schedule mentioned property is free from all encumbrances and claims and my client intends to purchase the same.

SCHEDULE

All that piece and parcel of land admeasuring 200 sq. yards or 167.209 Sq.mtrs in LP No.44/2004 Layout, land out of entire extent Ac.4-56 cents in Survey Nos. 207/1,2,3,4,5,6 &7, all situate at Kapuluppada Village, Bheemunipatnam Mandal, Visakhapatnam District Registration, Sub District S.R.O. Bheemunipatnam and bounded by

East: Plot No.26 (30'-0"), **West:** Plot No.40 Road (30'-0"), **North:** Plot No.29 (60'-0"), **South:** Plot No.31 (60'-0").

PATIVADA APPANNA, M.Com:BL.
Advocate
Door No. 48-3-45, Srinagar,
Visakhapatnam Mob: No. **9989334755**
Visakhapatnam.
Date: 02-12-2025

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు అయిన విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం బస్తీ, నాతయ్యపాలెం, పెదగంట్యాడ, డోర్ నెం. 32-7-33/2వ కాపురస్తులు పువ్వల హనుమంతరావు గారి కుమారుడు పువ్వల రాజేష్ గారు నాకిచ్చిన భోగట్టాపై ఈ క్రింది బహిరంగ ప్రకటన జారీచేయడమైనది.

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి భీమునిపట్నం S.R.Oలో రిజిస్ట్రీ కాబడిన Sale Deed Nos. 4480/2020, 4626/2020, 5519/2020, 5566/2020, 5567/2020, 5623/2020, 72/2021, 721/2021, 878/2021, 5518/2020, 2924/2021, 2186/2021, 2119/2021, 4067/2021, 4190/2021, 4188/2021, 4192/2021, 5709/2021, 6345/2021, 1301/2022, 3813/2021, 6344/2021 రుగా **M/s. NAVARATNA ESTATES,** represented by its Managing Partner Sri **SURESH KUMAR JAIN** S/o Late G.C. Jain గార్లకు దఖలు పడినటువంటి ఆస్తిని Visakhapatnam Urban Development Authority (VUDA) వారిచే L.P.No. 3/2023/1086/Z1/DPMSరుగా అనుమతి పొంది **"NAVARATNA HARBOUR CITY PHASE-IV"** వెంచర్‌గా ప్లాట్లు వేయగా మరియు యావత్తు రెవెన్యూ రికార్డుపై వారి పేరు పై ఉన్న ఈ క్రింది షెడ్యూలు గల ఆస్తిని వీరి వద్ద నుండి నా క్లయింటు కొనుగోలు చేసుకొనుటకు నిశ్చయించుకుని ఉన్నారు.

సదరు ఆస్తిపై ఎవరికైనను ఎట్టి క్లెయిములు, అభ్యంతరములు వగైరాలు ఉన్నచో ఈ దినము నుండి 7 రోజులలోగా ఈ క్రింది అడ్రసుకు లిఖితపూర్వకముగా, సంబంధించిన రికార్డులతో వచ్చి కలియవలెను. అట్లు కానియెడల సదరు ఆస్తి నిర్వివాద ఆస్తిగా పరిగణించి పై వ్యక్తి నుండి సదరాస్తిని నా క్లయింటు కొనుగోలు చేసి క్రయ దస్తావేజు చేయించుకోగలరు. తరువాత వచ్చే ఎట్టి అభ్యంతరములైనా పరిగణించబడవనియు అవియేవియు నా క్లయింటును బంధింపజాలవనియు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్

All that site measuring **183.33 Sq.yards** or 153.28 Sq.meters being **Plot No.59** within residential layout called **"NAVARATNA HARBOUR CITY PHASE-IV"** Layout approved by GVMC vide **L.P.No.3/2023/1086/Z1/DPMS** in **Survey No. 10/4** Ramayogi Agraharam Village, Nidigattu Grama Panchyat, Bheemunipatnam Mandal, Visakhapatnam, Sub Registry of Bheemunipatnam, Visakhapatnam District and it is bounded by:

Boundaries: East: Plot No. 68, **West:** 40 feet Layout Road, **North:** Plot No. 60, **South:** Plot No. 58

ముమ్మిడిశెట్టి సునీల్, న్యాయవాది
ప్లాటు నెం. 304, బ్లు జే మెజెస్టిక్ అపార్టుమెంటు,
ఫుట్‌బాల్ గ్రౌండ్ వెనుక, భీమునిపట్నం,
విశాఖపట్నం జిల్లా-531163, సెల్. 9849668442.
భీమునిపట్నం,
తేది. 02-12-2025

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

స్వర్ణ పతకం సాధించిన గ్రేస్ ద్వారక

తగరపువలస, గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: కేథరిన్ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని గ్రేస్ ద్వారక రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కేథరిన్ విద్యా సంస్థల అధినేత అలీవర్ రాయ్ విజేతను మంగళవారం అభినందించారు. ఈ ఏడాది క్రీడా ర్యాంకింగ్‌లో తమ పాఠశాల జిల్లాలో ద్వితీయ, మండలంలో ప్రథమస్థానంలో ఉందన్నారు.

▌లక్ష్మీపురం జిల్లా పరిషత్తు పాఠశాల పదో తరగతి విద్యార్థిని కరుభుక్త శ్రావ్య నెల్లూరులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వెంకటరెడ్డి తెలిపారు. సంబంధిత బాలికను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

శ్రావ్యను అభినందిస్తున్న దృశ్యం

బిందు సేద్యం పరికరాల పంపిణీ

తాటితూరు(గ్రామీణ భీమిలి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ఆధ్వర్యంలో భీమిలి మండలం తాటితూరు గ్రామంలోని రైతులకు ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.మన్మథరావు రాయితీపై బిందు సేద్యం పరికరాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మంది రైతులకు రూ.67 లక్షల విలువైన పరికరాలను 50శాతం రాయితీపై అందిచామన్నారు. ఎంఐఏవో శ్రీదేవి, ఏవో శివ కోమలి, వీఏఏ వాసంతి, సర్పంచి సిరిగిడి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

పరికరాలు అందుకున్న రైతులతో పీడీ మన్మధరావు తదితరులు

ముగిసిన మండలదీక్ష అన్నదానం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరోవార్డు పీఎంపాలెం అయ్యప్ప అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో మండలం(41 రోజులు) రోజులు అయ్యప్ప దీక్షాధారులకు అందించిన ఉచిత అన్నదానం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గురుస్వామి పోతిన పరశురాంను పీఠం ప్రధాన శిష్యులు పోతిన ఎల్లాజి, వాండ్రాసి భాస్కర్ తదితరులు సత్కరించారు. రోజుకు సుమారు రూ.90 వేల చొప్పున 41 రోజులకు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. పలువురు దాతల సహకారంతో నాలుగేళ్లుగా నారాయణ సేవ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోతిన మురళి, పి.అప్పన్న, విశ్వ కళాశాలల ఛైర్మన్ జనార్దన్, బొడ్డేపల్లి చిరంజీవి, కె.చిన్న(మాస్టర్), సంతోష్ పాండే తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి పోతిన పరశురాంను సత్కరిస్తున్న పీఠం ప్రధాన శిష్యులు

బ్యూటీ థెరపిస్టు శిక్షణ ప్రారంభం

చిప్పాడ(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం చిప్పాడ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో స్థానిక నమ్మివానిపాలెంలోని ఆ సంస్థ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో బ్యూటీ థెరపిస్టు ఉచిత శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన దివీస్ డిప్యూటీ జనరల్ మేనేజరు పి.జగదీశ్ మాట్లాడుతూ గ్రామీణ నిరుద్యోగ మహిళల స్వయం ఉపాధికి ఇలాంటి కోర్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలివిడతలో అన్నవరం, చిప్పాడ, పెద నాగమయ్యపాలెం, మూలకుద్దు పంచాయతీల్లోని 60 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దివీస్ సీఎస్ఆర్ మేనేజరు డి.సురేశ్‌కుమార్, ఇతర ప్రతినిధులు శ్రీనివాస్, శేఖర్, బిందు శిరీషా, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న దివీస్ డీజీఎం జగదీశ్, తదితరులు

(c) eenadu

విశాఖ తూర్పు

తాత్కాలిక ప్రాతిపదికన హిందీ బోధకుడి నియామకం

కొమ్మాది, న్యూస్‌టుడే: చినగదిలి మండల పరిధి బక్కన్నపాలెం ఉన్నత పాఠశాలలో 5 నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన హిందీ బోధకుడు నియామక ప్రక్రియ చేపడుతున్నామని ఎంఈవో రవీంద్రబాబు తెలిపారు. ఆ పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. డిగ్రీ, హిందీ మెథడాలజీ ఉన్నవారు అర్హులని, నెలకు రూ.12,500 వేతనం ఇస్తారన్నారు. అర్హులు ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3గంటలలోపు వాడపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు రాయితీపై రుణాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు సూచించారు. మంగళవారం సిరిపురంలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు మార్కెటింగ్ రంగంలో నైపుణ్యాలు, డిజిటల్ రంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ప్రభుత్వం రూ.లక్ష నుంచి రుణ సౌకర్యం అందజేస్తోందన్నారు. వీటికి బడుగుతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.ఎ. రామరాజు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ జేడీ సెంథిల్‌కుమార్, ఏడీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న జీఎం వి.ఆదిశేషు, తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769 మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 23వ వార్డు ప్రియదర్శినికాలనీలో రహదారిపై చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. – కిషోర్, ప్రియదర్శినికాలనీ. ✓: తక్షణమే సిబ్బందిని పంపి చెత్త తరలిస్తాం. – సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: డాక్టర్స్ కాలనీ రామాలయంపాలెం పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. – రామిరెడ్డి, డాక్టర్స్ కాలనీ ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. – ప్రకాష్, శానిటరీఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: విశాలాక్షినగర్ రైతుబజారు కూడలి నుంచి హనుమంతువాక కూడలి వరకు నూతనంగా నిర్మించిన 60 అడుగుల రహదారిలో పలుచోట్ల గుంతలు పడ్డాయి. – సీతారాం, విశాలాక్షినగర్. ✓: రహదారిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – ప్రసాద్, పర్యవేక్షకుడు, వర్క్స్ విభాగం

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పాండురంగాపురం పోస్టాఫీసు నుంచి నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో ప్రధాన కాలువకు రక్షణ గోడ లేదు. ద్విచక్రవాహన చోదకులు, సైకిల్‌పై వెళ్లే చిన్నారులు కాలువలో పడిపోతున్నారు. – జగన్నాథం, నేతాజీనగర్. ✓: రక్షణగోడ నిర్మాణానికి టెండరు అనుమతి వచ్చింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. – వెంకటరావు, డీఈ.

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు బీటీఆర్ నగర్ ప్రధాన వీధిలో యూజీడీ మ్యాన్‌హోల్స్ మూతలు దెబ్బతిన్నాయి. కొన్ని మూతలు భూమిలోకి కుంగిపోవడంతో గుంతలు పడ్డాయి. వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. – కె.గోవిందరావు, బీటీఆర్ నగర్. ✓: యూజీడీ మ్యాన్‌హోల్ మూతలు కొత్తవి ఏర్పాటు చేసి రోడ్డును సమాంతరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. – కె.శ్రీనివాసరావు, యూజీడీ విభాగ ఇన్‌ఛార్జి ఏఈ

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 19వ వార్డు శివాజీనగర్, ముప్పలవారిపాలెం ప్రాంతాల్లోని కాలువల్లో మురుగు పారుదల కావడం లేదని మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్పందించారు. వెంటనే సిబ్బంది చేత కాలువల్లో పూడిక తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జోడుగుళ్లపాలెంలో రోజు విడిచి రోజు కుళాయిలు వస్తున్నాయని, మంచినీరు సరిపోవటం లేదని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంగళవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి ఏఈ శ్రీనివాస్ స్పందించారు. కుళాయిలను పరిశీలించి నీటి ధార పెరిగేలా చర్యలు తీసుకున్నారు.

నిధుల్లేక.. పనులు సాగక..!

నిలిచిపోయిన పిల్లల పార్కు నిర్మాణం

ఇప్పటికే రూ.2కోట్ల వ్యయం

ఆరిలోవ, న్యూస్‌టుడే

విశాఖలోని చిన్నపిల్లల పార్కుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.2కోట్ల వ్యయంతో జరిగిన పనులు వృథాగా మారుతున్నాయి. ఇక్కడి జీవీఎంసీ నర్సరీ ప్రాంగణంలో సుమారు 3 ఎకరాల స్థలంలో పిల్లల పార్కు ఏర్పాటుకు 2022లో అప్పటి జీవీఎంసీ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. రూ.4 కోట్ల అంచనా వ్యయంతో 2023లో పనులు ప్రారంభించారు. 3-14 ఏళ్ల పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామని అప్పటి కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. 2025 మార్చి నాటికి ఉద్యానవనం సిద్ధమవుతుందని నాటి వైకాపా నాయకులు హామీలు ఇచ్చారు. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా ఇంత వరకు సగం కూడా పూర్తి కాలేదు.

చెత్తతో నిండిన వాకింగ్ ట్రాక్

నిండిపోయింది. రక్షణ గోడ లేకపోవడం, గేటు నిర్మించకపోవడంతో చీకటి పడితే మందుబాబులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారుతోంది. ఆదే విధంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ: ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలు, చెట్ల వ్యర్థాలతో నిండి ఉంది. ఇటీవల తుపాను సమయంలో వీచిన గాలులకు కొన్ని చెట్లు విరిగి పడ్డాయి. అవి ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో అవరణ చెత్తతో

నిలిచిపోయిన ప్రధాన ద్వారం పనులు

ఆరు నెలలుగా ఆగిన పనులు: వైకాపా హయాంలో నిధులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులు మధ్యలో నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై 'ఈనాడు'లో కథనాలు రావడంతో ఎమ్మెల్యే వెలగపూడి స్పందించి నిధులు విడుదలకు చొరవ చూపారు. గుత్తేదారు ఆ మేర పనులు చేశారు. తర్వాత చేసిన పనులకు మళ్లీ నిధులు రాకపోవడంతో ఆపేశారు. దాదాపు ఆరు నెలల నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది.

మరో రూ.2కోట్ల నిధులు రావాలి..: పార్కులో సుమారు రూ.2 కోట్లతో భూమిని చదును చేయడంతోపాటు సుమారు కిలో మీటరు మేర వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ప్రధాన గేటు, పరిపాలన భవనం, ఉద్యానవనం అభివృద్ధి చెయ్యాల్సి ఉంది. పిల్లల ఆట పరికరాలు బిగించాలి. మిగతా రూ.2కోట్ల నిధులు వస్తే పనులు పూర్తవుతాయి. – వెంకటరావు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగ డీఈ

అధికారులతో మాట్లాడుతా..!: పార్కుపై అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తీసుకుంటా. మేయర్, కమిషనర్‌తో మాట్లాడి నిధుల విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో పనులు పూర్తి చేసి పిల్లల పార్కును అందుబాటులోకి తెస్తాం. – వెలగపూడి రామకృష్ణబాబు, తూర్పు శాసనసభ్యులు

ఎన్‌ఎంయూకు కౌన్సిల్‌లో సభ్యత్వంపై హర్షం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్.ఎం.యు.)కు ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కల్పించినందుకు సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వాల్తేరు డిపోలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సభ్యులు సంబరాలు జరుపుకొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్.ఎం.యు.ఎ. రాష్ట్రంలో అతిపెద్ద యూనియన్‌గా గుర్తింపు ఉందని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అవకాశం కల్పిస్తూ జీవో నెంబరు 129 విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కోశాధికారి పి.వి.మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి పి.జి.పతి, జిల్లా కార్యదర్శి ఎ.కె.శివాజీ, డిపో అధ్యక్షుడు ఎస్.ఎం.నాయుడు, కార్యదర్శి ఆర్.వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న మహిళా ఉద్యోగులు

తరుణ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ జి.ఎస్.కె.చక్రవర్తి, తదితరులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

విశాఖ క్రీడలు, సీతంపేట, న్యూస్‌టుడే: ఖేలో ఇండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారుడు ఎం.తరుణ్ (88 కిలోల విభాగం) సత్తాచాటి రజత పతకం గెలుపొందారు. పోటీలు రాజస్థాన్‌లోని పూర్ణిమ యూనివర్సిటీలో సోమవారం ముగిశాయి. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి తదితరులు తరుణ్‌ను అభినందించారు. కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ లక్ష్మణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'22ఎ' నుంచి తొలగించాలని వినతి

కొత్తవెంకోజీపాలెం గ్రామస్థుల వినతిపత్రాలు చూస్తున్న సర్వేయర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17వ వార్డు కొత్తవెంకోజీపాలెం సర్వే నంబరు-4లోని భూములను 22ఎ నుంచి తొలగించాలని స్థానిక గ్రామ సేవా సంఘం సభ్యులు జిల్లాల ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కోరారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం వీఆర్వో వినోద్, అర్బన్ సర్వేయర్ కృష్ణ కొత్తవెంకోజీపాలెంలో సర్వే చేపట్టారు. గ్రామస్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్నామని, 22ఎ కారణంగా వారసత్వంగా వచ్చిన ఇళ్లు, స్థలాల విక్రయాలు, రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

డేటింగ్ యాప్‌లను నిషేధించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: డేటింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధించాలని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్.ఎల్.ఎన్.వాసు డిమాండ్ చేశారు. మంగళవారం శివాజీపాలెంలోని ప్రెసిడెన్సీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆడవాళ్లను ఆంగ్లో సరకులా మార్చే డేటింగ్ యాప్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో వాటిని నిషేధిస్తూ చట్టం తీసుకురావాలని కోరారు. జనజాగరణ సమితి సభ్యులు టి.దుర్గాప్రసాద్, దేవర శంకర్, చింతపల్లి సునీల్‌కుమార్, శివ, విక్రమ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన చేపడుతున్న సంఘం నాయకులు

మార్చి వరకు బాలలకు పోషకాహారం

పోషకాహార ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారిలో ఉత్సాహం, ఏకాగ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాహారం కిట్లను మంగళవారం ఈస్ట్‌పాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సభ్యులు జిత మిత్రదాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి వరకు బాలలకు పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పోషకాహార ప్యాకెట్లు పంచిపెట్టారు. హెచ్‌ఎం సుమతీబాయి, తెదేపా నాయకులు పోతన్నరెడ్డి, కంబాపు శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ.36లక్షలతో అభివృద్ధి పనులకు భూమి పూజ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 21వ వార్డు కావ్యవీధిలో రహదారులు, కాలువల నిర్మాణానికి మంగళవారం ఉదయం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు భూమిపూజ చేశారు. రూ.36 లక్షలతో ఆయా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. రహదారులు బాగుంటే కాలనీవాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. జోన్ కమిషనర్ శివప్రసాద్, ఏఈ దేవి, నాయకులు పీతల అమరేంద్ర, అవినాష్, పోతన్న రెడ్డి, వినయ్, శేఖర్, గౌరి, సురేష్ పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

తవ్వి వదిలేసి.. అవస్థలు పెంచేసి..!

11వ వార్డు పార్వతీనగర్ వీధుల్లో మంచినీటి పైపులైను ఏర్పాటుకు రెండు నెలల క్రితం రోడ్డు తవ్వారు. పైపులు వేసిన తరువాత గోతులు పూడ్చకుండా వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహన చోదకులు గుంతల్లో పడిపోతున్నారు. కాలినడకన ఆటోలు రావడం లేదు. దీంతో స్థానికులు పావు కిలోమీటరు దూరం వచ్చి ఆటోలు, బస్సులు ఎక్కుతున్నారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని కాలనీ ప్రజలు తెలిపారు. నిత్యావసరాలు, బియ్యం, బరువైన వస్తువులు మోసుకుని వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆరిలోవ

దర్పణం

పార్వతీనగర్‌లో అడ్డంగా రోడ్డు తవ్విన దృశ్యం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. మంగళవారం పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు కల్చరల్ సింఫోని పేరిట వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా బాలలు నృత్యాలు చేసి అలరించారు. పాఠశాల డైరెక్టర్ మళ్ల రామునాయుడు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

వ్యర్థాలు వీడుదాం.. సముద్రాన్ని కాపాడుకుందాం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: పెదజాలరిపేటలో మంగళవారం ఉదయం ఎ.ఎస్.రాజా కళాశాల విద్యార్థులు బీచ్ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ఒకసారి వాడిపారేసిన ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని, మన సముద్రాన్ని మనమే కాపాడుకోవాలని ఆలోచనతో బీచ్ శుభ్రత నిర్వహించారు. గ్రీన్‌క్లైమేట్ సంస్థ వ్యవస్థాపకులు రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి విన్నపం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : స్మాల్ ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం డీఈఓ ప్రేమకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బి.వి.మురళీమోహన్, మూర్తి, సూరిబాబు, ఆదినారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: సీఐటీయూ జాతీయ మహాసభలను తొలిసారిగా విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ప్రతినిధులు పేర్కొన్నారు. సాలగ్రామపురంలోని పోర్టు ఆసుపత్రి వద్ద మంగళవారం మహాసభలకు సంబంధించిన గోడపత్రికను సీఐటీయూ జోన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 2 వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. జనవరి 4న ఆర్కే బీచ్‌లో ర్యాలీ, బహిరంగ సభ, డిసెంబరు 27 నుంచి జనవరి 2 వరకు శ్రామిక్ ఉత్సవ్ పేరుతో సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు ప్రకాశరావు, స్వతంత్ర కుమార్, సత్యనారాయణ, మాధవి, లీల, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి వద్ద గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

'ఎల్‌యూబీ'తో గీతం అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సహకరించడానికి లఘు ఉద్యోగ్ భారతి(ఎల్‌యూబీ) సంస్థతో గీతం డీమ్డ్ వర్సిటీ మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ప్రొ-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, ఎల్‌యూబీ ప్రతినిధులు ఓం ప్రకాష్‌గుప్తా, టి.యోగేష్ చంద్ర, ఎ.కృష్ణబాలాజీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గీతం (విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు) ప్రాంగణాలను అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని ప్రొ-వీసీ గౌతమ్‌రావు పేర్కొన్నారు. ఎల్‌యూబీ జాతీయ కో-ఆర్డినేటర్ జయంతి గోయల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లోని దాదాపు 590 జిల్లాల్లో 60 వేలకు పైగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎల్‌యూబీలో సభ్యత్వం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.

ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

భవానీ మాలధారుల ప్రత్యేక పూజలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: పెదగదిలి కూడలి పోలమాంబ ఆలయంలోని దుర్గాదేవి పీఠం వద్ద భవానీ మాలధారులు మంగళవారం ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. నెల రోజుల నుంచీ పీఠం ఏర్పాటు చేసుకుని దీక్షతో సామూహికంగా పూజలు చేస్తున్నామని, ఈ నెల 11న విజయవాడ దుర్గమ్మను దర్శించుకుని దీక్ష ముగిస్తామని భవానీలు తెలిపారు.

పెదగదిలి పోలమాంబకు పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

33కేవీ అండర్ గ్రౌండ్ కేబుల్ ప్రారంభం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సబ్‌స్టేషన్‌కు ఏర్పాటు చేసిన 33కేవీ అండర్ గ్రౌండ్ కేబుల్‌ను మంగళవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. సుమారు రూ.కోటి వ్యయంతో దీన్ని ఏర్పాటు చేసినట్టు ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్తు సరఫరా నాణ్యత గణనీయంగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ అధికారులు జి.శ్యాంబాబు, పోలాకి శ్రీనివాసరావు, సుమన్, సురేష్, తెదేపా కార్పొరేటర్ గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

యరబోలు డేవిడ్ విజయ్‌కుమార్ S/o Y. వెంకటరావు తెలియజేయునది ఏమనగా, మా పిన్నిగారు శ్రీమతి P.రాజేశ్వరి గారి యొక్క ఒరిజినల్ టైటిల్ డీడ్ డాక్యుమెంట్ (Document No.1988/1981) తీసుకొని నేను మద్దిలపాలెం నుండి ఆంధ్రాయూనివర్శిటీ వైపు వెళుచుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది నెంబరులో తెలియజేయగలరు.

Y. డేవిడ్ విజయ్‌కుమార్, Ph: 8341973918

రైళ్లకు అదనపు బోగీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : క్రిస్మస్ పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యేక రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 7 నుంచి 28 వరకు విశాఖ- ఎస్ఎంవీ బెంగళూర్ (08581), 8 నుంచి 29 వరకు ఎస్ఎంవీ బెంగళూర్- విశాఖ (08582) రైళ్లకు, 3 నుంచి 31 వరకు విశాఖ- తిరుపతి (08547), 4 నుంచి జనవరి 1 వరకు తిరుపతి- విశాఖ (08548) రైళ్లకు, 5 నుంచి 26 వరకు విశాఖ- చర్లపల్లి (08579), 6 నుంచి 27 వరకు చర్లపల్లి- విశాఖ (08580) రైళ్లకు ఒక్కో థర్డ్ ఏసీ ఎకానమీ బోగీని జత చేయనున్నట్లు తెలిపారు.

సింహగిరిపై నేడు హనుమత్ వ్రతం

సింహాచలం: మార్గశిర శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలకు పంచామృతాభిషేకం, 7.30గంటల నుంచి లక్ష నాగవల్లీ దళార్చన, 9గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 10.30గంటలకు పూర్ణాహుతి జరుగుతాయని దేవస్థానం ఈవో ఎన్.సుజాత తెలిపారు. ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న పూజల్లో భాగంగా మంగళవారం అర్చకులు స్వామికి విశేష అర్చనలు, హోమం నిర్వహించారు.

ఏయూ సమాచారం

సవాళ్లను ఎదుర్కొంటున్న ఆక్వా కల్చర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ మెరైన్ లివింగ్ రిసోర్స్ (ఎం.ఎల్.ఆర్.) విభాగం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా మంగళవారం 'ప్రాక్టికాలిటీస్ ఇన్ సస్టైనబుల్ ఆక్వా కల్చర్' అంశంపై ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టెక్నో కమర్షియల్ సేల్స్ అండ్ మార్కెటింగ్ - ఆక్వా కల్చర్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్.రాయప్రోలు ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు.. వాటికి పరిష్కారాలను సూచించారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయప్రోలును సత్కరిస్తున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు

ఏయూ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చూపిస్తే ఉన్నత స్థానాలు అందుకుంటారని ఏయూ వ్యాయామ విద్య, క్రీడల విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ అన్నారు. అంతర కళాశాలల పోటీల్లో పాల్గొనే ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందని, దాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. వివిధ కళాశాలల వ్యాయామ విద్య సంచాలకులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఆచార్య ఎన్.విజయమోహన్

సెమిస్టర్ పరీక్షల పరిశీలన

ఏయూ పారంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరుగుతున్న మూడో సెమిస్టర్ పరీక్షలను ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మంగళవారం పరిశీలించారు. ఏయూ సోషల్ సైన్స్ భవనంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రిన్సిపల్ ఆచార్య కె.సత్యనారాయణ, జర్నలిజం విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం పాల్గొన్నారు.

ఘనంగా స్వాగతోత్సవం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగంలో మంగళవారం నూతన విద్యార్థులకు స్వాగతోత్సవం నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం అధ్యక్షతన టీఎల్ఎన్ సభా హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడారు. ఈ విభాగంలో చదివి ఉన్నస్థానాలకు చేరుకున్న వారి గురించి వివరించారు. ప్రతి విద్యార్థి తాను కోరున్న స్థానాల్లో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చివరి ఏడాది విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు



(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

'ఎల్‌యూబీ'తో గీతం అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: దేశంలోని ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు సహకరించడానికి లఘు ఉద్యోగ్ భారతి(ఎల్‌యూబీ) సంస్థతో గీతం డీమ్డ్ వర్సిటీ మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం ప్రో-వీసీ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ రాజాభరణి పప్పు, ఎల్‌యూబీ ప్రతినిధులు ఓం ప్రకాశ్‌గుప్తా, టి.యోగేష్‌చంద్ర, ఎ.కృష్ణబాలాజీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గీతం (విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు) ప్రాంగణాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని ప్రో-వీసీ గౌతమ్‌రావు పేర్కొన్నారు. ఎల్‌యూబీ జాతీయ జాయింట్ సెక్రటరీ జయంతి గోయల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల్లోని దాదాపు 590 జిల్లాల్లో 60 వేలకు పైగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎల్‌యూబీలో సభ్యత్వం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.

సంప్రదాయబద్ధంగా తిరునక్షత్ర పూజలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు, ఆళ్వార్ల సహితంగా గోవిందరాజ స్వామి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రినాథుడి ఆలయంలో తిరుమంగైయాళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ ఆధ్వర్యంలో అర్చకులు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరులు, ఆళ్వారాచార్యుల సహితంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. ధూపదీప సేవలు చేసి నివేదనలు సమర్పించారు. నాలాయిర దివ్యప్రబంధ పారాయణం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 31వ వార్డు యల్లమ్మతోటలో దోమలు ఎక్కువగా ఉండటంతో, జ్వరాలు వ్యాపిస్తున్నాయి. -ప్రభావతి, స్థానిక మహిళ ✓: పరిశీలించి, దోమల నివారణ మందు చల్లిస్తాం. - మల్లయ్యనాయుడు, జోన్-4 జేడీ.

అల్లిపురం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 32వ వార్డు నేరేళ్ళకోనేరు ప్రాంతంలోని కాలువల్లో వ్యర్థాలను సకాలంలో తొలగించడం లేదు. దోమలు వృద్ధి చెందుతున్నాయి. - స్థానికులు ✓: సిబ్బందిని పంపి, శుభ్రత పనులు చేయిస్తాం. -డాక్టర్ కృష్ణంరాజు, ఏఎంహెచ్ఓ.

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార డాక్టర్స్ కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. - సత్యనారాయణ ✓: పరిశీలించి వెలిగేలా చేస్తాం. - వీధి దీపాల నిర్వహణ కార్యదర్శి, 15వ వార్డు

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు రైవాడ వాటర్ ట్యాంకు సమీపంలోని 565/ఏ/2 స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగక రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. - శరణ్య ✓: సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. - అర్చన, వీధిదీపాల ఏఈ

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడాకాలనీలోని చెత్త కుండీలు వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. - పి.కామేశ్వరరావు ✓: సిబ్బందిని పంపి వ్యర్థాలను తరలించేలా చేస్తాం. - వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

ఎట్టకేలకు శుభ్రత పనులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 37వ వార్డు రెల్లివీధి నుంచి చేపలరేవుకు వెళ్లే రహదారిలో భూగర్భడ్రైనేజీ లీకై తీవ్ర దుర్వాసన వస్తోందన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

ముఖాముఖి

వాహనదారులు సురక్షితంగా గమ్యాన్ని చేరుకునేలా చేయడమే తమ లక్ష్యమని ద్వారకా సబ్ డివిజన్(ఎంవీపీ, ఆరిలోవ, ద్వారకా పోలీస్‌స్టేషన్ల) ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.ప్రభాకరరావు అన్నారు. రహదారి ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పరంగా తీసుకుంటున్న చర్యలపై మంగళవారం 'న్యూస్‌టుడే' ఆయనతో ముఖాముఖి నిర్వహించింది. - న్యూస్‌టుడే, గురుద్వారా

వాహనాల మధ్య నిర్దేశించిన దూరం పాటిస్తే: నగరంలోని ప్రధాన కూడళ్లలోని సిగ్నల్స్ వద్ద భారీ వాహనాల కిందపడి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. మలుపు తిప్పేటప్పుడు భారీ వాహనాలలో ఉన్న డ్రైవర్‌కు పక్కన ఉండే చిన్న వాహనదారులు కనిపించరు. ద్విచక్ర వాహనదారులు భారీ వాహనాలు వెళ్లిన తర్వాత బయలుదేరితే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చు. ముఖ్యంగా వాహనాల మధ్య నిర్దేశించిన దూరం పాటిస్తే చాలా ప్రమాదాలు తగ్గుతాయి.

తరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నాం: జాయ్ రైడింగ్, రేసింగ్, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. రాత్రుళ్లు నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

నిర్లక్ష్యం, అతివేగం ప్రధాన కారణాలుగా గుర్తించాం: జాతీయ రహదారిలో సంభవిస్తున్న ప్రమాదాల్లో అతివేగం, భద్రతా నిర్లక్ష్యం ప్రధాన కారణాలుగా గుర్తించాం. వాహన చోదకుల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వారితో పాటు కుటుంబాన్ని రోడ్డున పడేలా చేసుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం.

జరిమానాల నుంచి తప్పించుకోవడానికి: చాలా మంది ట్రాఫిక్ సిబ్బంది వేసే జరిమానాల నుంచి తప్పించుకోవడానికి పోలీసులను చూసి అప్పటికప్పుడు మొక్కుబడిగా శిరస్త్రాణం ధరిస్తున్నారే తప్ప జాగ్రత్తలు తీసుకోవడం లేదు. శిరస్త్రాణం ధరించిన తర్వాత దాని కిందనున్న లింకు సక్రమంగా పెట్టారో లేదో గమనించుకోవాలి. లేకుంటే రహదారిపై పడిన తర్వాత శిరస్త్రాణం పక్కకు పడిపోయి తలకు దెబ్బ తగిలి మృతి చెందుతున్నారు. అలా చేయకుంటే శిరస్త్రాణం పెట్టుకున్నా ఫలితం ఉండదు.

ట్రావెల్స్ యాజమాన్యాలకు జరిమానాలు విధిస్తున్నాం: జాతీయ రహదారులపై ప్రైవేటు బస్సులు ఇష్టానుసారంగా నిలిపేస్తున్నారని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు బస్సులు నిలపకూడదనే విషయాన్ని ట్రావెల్స్ యజమానులకు చెబుతున్నాం. అయినప్పటికీ మార్పు లేకుంటే జరిమానాలు విధిస్తున్నాం.

★ **విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పిస్తున్నాం:** బీఆర్టీఎస్ మధ్య రహదారిలో మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ రహదారిలో ద్విచక్ర వాహనదారుల ప్రవేశాన్ని చాలా వరకు నిలిపివేశాం. రహదారి నిబంధనలపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన కల్పించేలా పాఠశాల, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధాన కూడళ్లల్లో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అభ్యర్థిస్తున్నాం.

ప్రసంగంతో ఆకట్టుకుని.. బహుమతి గెలుచుకొని..

'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో ప్రిన్సిపల్ టి.శంకర్రావునాయుడు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చరవాణికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని రైల్వేన్యూకాలనీలోని హరగోపాల్ పాఠశాల ప్రిన్సిపల్ టి.శంకర్రావునాయుడు పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం ఈ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమలోని ప్రతిభను నిరూపించుకున్నారు. చరవాణిని కాలక్షేపం కోసం కాకుండా, అవసరమైన సందర్భాల్లో సద్వినియోగం చేసుకొంటే విద్యలో ఉన్నతంగా రాణించవచ్చునని తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. అన్షు గుప్తా(9వ తరగతి) ప్రథమ, వై. దీన(7వ తరగతి) ద్వితీయ, జి. జయశ్రీ(9వ తరగతి) తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ టి.శంకర్రావు నాయుడు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సీఐటీయూ మహాసభల విజయవంతానికి పిలుపు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: సీఐటీయూ జాతీయ మహాసభలను తొలిసారిగా విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ప్రతినిధులు పేర్కొన్నారు. సాలగ్రామపురంలోని పోర్టు ఆసుపత్రి వద్ద మంగళవారం మహాసభలకు సంబంధించిన గోడపత్రికను సీఐటీయూ జోన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 2 వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. జనవరి 4న ఆర్కే బీచ్‌లో ర్యాలీ, బహిరంగ సభ, డిసెంబరు 27 నుంచి జనవరి 2 వరకు శ్రామిక్ ఉత్సవ్ పేరుతో సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు ప్రకాశరావు, స్వతంత్ర కుమార్, సత్యనారాయణ, మాధవి, లీల, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి వద్ద గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నిత్య అన్నసమారాధన గొప్ప కార్యక్రమం

మండపంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర తదితరులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వ్యయప్రయాసలు తట్టుకుని అయ్యప్ప, భవాని మాల ధారణ ధరించిన వేలాది మంది భక్తులకు నిత్య అన్న సమారాధన(భిక్ష) నిర్వహించడం గొప్ప విషయమని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర పేర్కొన్నారు. పోర్టు ఆసుపత్రి ఎదురుగా జాతీయ రహదారి పక్కనున్న ఖాళీ మైదానంలో యెరిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న భిక్ష కార్యక్రమంలో మంగళవారం పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ముందుగా మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు నారాయణరావు, మోహనరావు, గోపీచంద్, సూపరింటెండెంట్ నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

తరుణ్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ జి.ఎస్.కె.చక్రవర్తి, తదితరులు

సీతంపేట, న్యూస్‌టుడే : ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బుల్లయ్య కళాశాల క్రీడాకారుడు ఎం.తరుణ్ (88 కిలోల విభాగం) సత్తా చాటి రజత పతకం గెలుపొందాడు. పోటీలు రాజస్థాన్‌లోని పూర్ణిమ యూనివర్సిటీలో సోమవారం ముగిశాయి. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి తదితరులు తరుణ్‌ను అభినందించారు. కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ లక్ష్మణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా పోషకాహారం పంపిణీ చేయడం అభినందనీయమని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేద విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పంపిణీ చేసే ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాదిక్, కూటమి నాయకులు కొల్లి సింహాచలం, ప్రణీత్, తాతారావు, హెచ్ఎం జోగేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరించిన దృశ్యం

● **విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు**

కంచరపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 48వ వార్డులో నెలకొన్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. వార్డులోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఇక్కడ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ గంకల కవిత ఈపీడీసీఎల్ సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు వార్డులో క్షేత్ర పర్యటన చేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ శ్యామ్‌బాబు, జోన్-2 ఈఈ బి.కె.నాయుడు, ఏఈ సుగుణ, జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● **రేపు కథాకళి ఉత్సవాలు**

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ జాతీయ రహదారి సమీపంలోని కేరళ కళా సమితి ఆడిటోరియంలో గురువారం మెగా కథాకళి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళీయుల సంప్రదాయ కళలను ప్రోత్సహించే దిశగా సాయంత్రం 7 గంటలకు కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుందని కార్యదర్శి కె.హరిదాసు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను నమోదు చేసుకుని ప్రవేశ అనుమతి పత్రంతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848198231 నెంబరులో సంప్రదించాలని కోరారు.

● **పౌష్టికాహారంతో సంపూర్ణ విద్య సాకారం**

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో పిల్లల్లో సంపూర్ణ విద్య సాకారమవుతుందని ఛైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం పేర్కొన్నారు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీ ఓఎస్‌కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం అక్షయ పాత్ర ఫౌండేషన్ అందించిన న్యూట్రిషన్ బార్ ప్యాకెట్లను ఆయన చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎంఈవో రామారావు, ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, అక్షయ పాత్ర ఫౌండేషన్ విశాఖ ప్రతినిధి రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **రైళ్లకు అదనపు బోగీలు**

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : క్రిస్మస్ పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యేక రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 7 నుంచి 28 వరకు విశాఖ-ఎస్ఎంవీ బెంగళూర్ (08581), 8 నుంచి 29 వరకు ఎస్ఎంవీ బెంగళూర్- విశాఖ (08582) రైళ్లకు, 3 నుంచి 31 వరకు విశాఖ- తిరుపతి (08547), 4 నుంచి జనవరి 1 వరకు తిరుపతి-విశాఖ (08548) రైళ్లకు, 5 నుంచి 26 వరకు విశాఖ- చర్లపల్లి (08579), 6 నుంచి 27 వరకు చర్లపల్లి- విశాఖ (08580) రైళ్లకు ఒక్కో థర్డ్ ఏసీ ఎకానమీ బోగీని జత చేయనున్నట్లు తెలిపారు.

● **సెమిస్టర్ పరీక్షల పరిశీలన**

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న మూడో సెమిస్టర్ పరీక్షలను ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మంగళవారం పరిశీలించారు. ఏయూ సోషల్ సైన్స్ భవనంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రిన్సిపల్ ఆచార్య కె.సత్యనారాయణ, జర్నలిజం విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తిని ఇంటికి చేర్చిన పోలీసులు

మూర్తి డేవిడ్‌రాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎయిర్‌పోర్టు పోలీసులు

మాధవధార, న్యూస్‌టుడే: గాజువాక వెళ్లి వస్తానని చెప్పి ఎన్ఏడీ వద్ద అదృశ్యమవ్వడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి వెతికి వారికి అప్పగించారు. దీనికి సబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బుచ్చిరాజుపాలెంలో నివాసముంటున్న మూర్తి డేవిడ్ రాజు(56) సోమవారం ఉదయం గాజువాక వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు చుట్టు పక్కల గాలించగా అంబేడ్కర్ కాలనీ సాయిబాబు గుడి వద్ద ఉండటం గమనించి తక్షణమే ఇంటికి తీసుకెళ్లి అప్పగించారు. డేవిడ్ రాజుకు మతిమరుపు ఉందని, ఆలయంలో ఉండిపోయాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

సింహగిరిపై నేడు హనుమత్ వ్రతం

సింహాచలం, న్యూస్‌టుడే: మార్గశిర శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహగిరి మెట్లమార్గంలో కొలువైన ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతం నిర్వహించనున్నారు. ఉదయం 6గంటలకు పంచామృతాభిషేకం, 7.30గంటల నుంచి లక్ష నాగవల్లీ దళార్చన, 9గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 10.30 గంటలకు పూర్ణాహుతి జరుగుతాయని దేవస్థానం ఈవో ఎన్.సుజాత తెలిపారు. ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న పూజల్లో భాగంగా మంగళవారం అర్చకులు స్వామికి విశేష అర్చనలు, హోమం నిర్వహించారు. సుందరకాండ పారాయణం చేశారు.

తరలిన వ్యర్థాలు... మెరిసిన ముగ్గులు..!

పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నగరాన్ని డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ తీర్చిదిద్దే క్రమంలో జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం అధికారులు దశల వారీగా రహదారి పక్కన బిన్నులు తొలగిస్తున్నారు. ఇంకా 92 ప్రాంతాల్లో బిన్నులు ఉండగా, వాటిని త్వరలోనే తీసేయనున్నారు.

ఎంవీపీకాలనీలో రహదారి పక్కన ముగ్గులు వేసిన దృశ్యం

అలవాటుగా మార్చాలని..!

★ ప్రతి ఇంట్లో పోగయ్యే చెత్తను ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా, గతంలో ఆయా ప్రాంతాల్లో జీవీఎంసీ ఆధ్వర్యంలో బిన్నులు ఏర్పాటు చేశారు. వాటిల్లో వ్యర్థాలను నిత్యం వాహనాలతో తీసుకెళ్లి, డంపింగ్ యార్డులో డంప్ చేసిన తర్వాత.. ఖాళీ బిన్నును అదే ప్రాంతంలో పెట్టేవారు.

★ అయితే ఘనవ్యర్థాల నిర్వహణ-2016 ప్రకారం బిన్నులు తొలగించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వాహనాలను ఇంటి వద్దకే పంపించి, చెత్త సేకరించేలా చర్యలు చేపట్టారు.

★ అయినా కొంత మంది నివాసితులు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోస్తున్నారు. ఆ అలవాటు మార్చేలా జీవీఎంసీ పారిశుద్ధ్యం విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

★ ఆ మేరకు 598 క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. కొండవాలు ప్రాంతాల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు పుష్‌కార్టుల ద్వారా చెత్తను కొండల పైనుంచి కిందకు దింపుతున్నారు.

మార్పు వస్తోంది..!

» స్థానికులు ఎక్కడైతే వ్యర్థాలు పారబోస్తున్నారో... ఆయా ప్రాంతాల్లో అందమైన ముగ్గులు వేసి, రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

» వారానికి ఒక రోజు ముగ్గులు వేయడం ద్వారా చెత్త వేయడానికి వచ్చే వారు, వాటిని చూసి వెనకడుగు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పూల మొక్కల కుండీలు ఏర్పాటు చేస్తున్నారు. వాటి పర్యవేక్షణ బాధ్యతలను వార్డు సచివాలయం కార్యదర్శులకు అప్పగిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలన్నీ చెత్త రహితంగా మారుతున్నాయి.

అధికారుల అప్రమత్తత

» పాతనగరంలో వార్డుబాయ్స్ కాలనీ, ఏవీఎన్ కళాశాల డౌన్, రెల్లివీధి, స్ప్రింగ్‌రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం పరిసరాలు, అల్లిపురం ప్రాంతాల్లో స్థానికులు ఎక్కువగా చెత్త పారబోస్తున్నారు.

» ఇటీవల ఆయా ప్రాంతాలను అందమైన ముగ్గులతో తీర్చిదిద్దారు. అంతేకాకుండా చెత్త సేకరించే క్లాప్ వాహనాల సిబ్బంది ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

» స్వచ్ఛ సర్వేక్షణ్-26కు సంబంధించి త్వరలో నగరంలో సర్వే జరుగనుంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యం విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు.

ఇంద్రాణి సేవలు ప్రశంసనీయం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పేదల విద్యాభివృద్ధికి ఇంద్రాణి అందించిన సేవలు ప్రశంసనీయమని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్, వైస్ ఛైర్మన్ ఏవీ అదీప్ భానోజీరావు అన్నారు. కళాశాల పూర్వ కరస్పాండెంట్ ఇంద్రాణి స్మారకంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పాల్గొని... నివాళి అర్పించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణకుమారి, ఇంద్రాణి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు భానుమతి, అర్చన, రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రాణి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్, వైస్ ఛైర్మన్ ఏవీ అదీప్ భానోజీరావు, తదితరులు

సౌకర్యాల కల్పనపై ఆరా

ఆలయ పరిసరాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : మార్గశిర మాసం సందర్భంగా బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయ పరిసరాల్లో పర్యటించి, ఏర్పాట్లు పరిశీలించారు. రెండో గురువారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రసాదాల కౌంటర్, క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ ఈఓ శోభారాణి, ఏఈఓ ఆనంద్‌కుమార్, రాజేంద్ర, ఈఈ రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి విన్నపం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : స్మాల్ ప్రైవేట్ స్కూల్స్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు కొణతాల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం డీఈఓ ప్రేమకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బి.వి.మురళీమోహన్, మూర్తి, సూరిబాబు, ఆదినారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ప్రేమకుమార్‌కు వినతి అందజేస్తున్న ప్రతినిధులు

ఆకట్టుకున్న భక్తి గీతాలాపన

కార్యక్రమంలో పాల్గొన్న ప్రచార సమితి సభ్యులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీకృష్ణ భక్తి గీతాలాపన ఆకట్టుకుంది. మంగళవారం పాతనగరం గీతా భవనంలో శ్రీ గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడిని అలంకరించి పూజలు చేశారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్.విశ్వేశ్వరరావు, ప్రతినిధులు రాజశేఖర్, ప్రసాద్, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మలు తొలగించి.. తరలించకుండా వదిలేసి..

దర్పణం

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ ప్రధాన రహదారిలో విద్యుత్తు తీగలను తాకుతున్న పలు చెట్ల కొమ్మలను విద్యుత్తు శాఖ అధికారులు వారం రోజుల క్రితం తొలగించారు. వాటిని తరలించకుండా అక్కడే వదిలేశారు. ప్రధాన రహదారిలో మొత్తం ఐదు చోట్ల ఎక్కడికక్కడే వదిలేయడంతో రాకపోకలు సాగించే చోదకులు, చుట్టు పక్కల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకులు ఎండిపోయి గాలికి ఇళ్లలోకి చేరడంతో పాటు దోమల ప్రబలి జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చెట్ల వ్యర్థాలను తరలించాలని కోరుతున్నారు.

విశాల దారి.. ఇరుకుగా మారి..

గురుద్వారా, న్యూస్‌టుడే: పోర్టు స్టేడియం వెనుక మార్గంలో ఉంచిన కంకర పిక్కతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఆ ప్రాంతంలో జరుగుతున్న మంచినీటి సరఫరా పనులు నిమిత్తం కంకర పిక్కను కుప్పలుగా పోశారు. దీంతో విశాలవంతమైన రహదారి కాస్త ఇరుకుగా మారిపోవడంతో ప్రయాణాలకు ఆటంకం ఏర్పడుతోంది. రాత్రి సమయాల్లో వీటిని ఢీకొని పలువురు గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా ఇలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వీలైనంత త్వరగా వాటిని తరలించేలా చూడాలని చుట్టు పక్కల కాలనీవాసులు కోరుతున్నారు.

నీటి సరఫరా పనుల వేగవంతం

మురళీనగర్, న్యూస్‌టుడే: నగర ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించేందుకు జీవీఎంసీ చేపట్టి అమృత్ 2.0 పథకం పనులను అధికారులు వేగవంతం చేశారు. జీవీఎంసీ 49వ వార్డు అయ్యప్ప నగర్ కూడలిలో గోతులను తవ్వి గొట్టాలను అమర్చే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పనులు మరికొద్ది రోజుల్లో పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

గోతుల్లో అమర్చిన గొట్టాలు

అలరించిన సాహితీ సభ

ప్రసంగిస్తున్న మాటూరి శ్రీనివాస్

సీతంపేట, న్యూస్‌టుడే: సమతా సాహితీ ఆధ్వర్యంలో పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం సాహిత్య సభ నిర్వహించారు. గుంటూరు లక్ష్మీనరసయ్య సంకలనం చేసిన 'చిక్కనవుతున్న పాట' కవిత్వ సంపుటిను సాహితీవేత్త మాటూరి శ్రీనివాస్ విశ్లేషించారు. 1995లో వచ్చిన ఈ సంపుటి సంచలనం సృష్టించిందన్నారు. అక్షరాల్లో ఆర్ద్రత ఉండేదే గొప్ప కవిత్వమన్నారు. సమావేశంలో కత్తి పద్మ, ఉప్పల అప్పలరాజు, ఆచార్య వెలమల సిమ్మన్న, మరడాన సుబ్బారావు, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

'బంగారు కుటుంబానికి' సాయం అందజేత

కరాస, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు పీ4 పథకం లబ్ధి కోసం నమోదు చేసుకున్న వారికి మార్గదర్శులుగా సాయం అందజేస్తున్నామని ప్రత్యేక అధికారి జి.మాధవి తెలిపారు. జీవీఎంసీ 57వ వార్డు, సాకేతపురంలో నివాసముంటున్న పేద మహిళ రమణమ్మ కుటుంబానికి మార్గదర్శి, దాత పి.కె.జోషి చేతులమీదుగా రేషన్ సరుకులు, టిఫిన్ సెంటర్ ఏర్పాటుకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ పట్టణ ప్రణాళిక కార్యదర్శి వరలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రమణమ్మకు రేషన్ సరుకులు అందజేస్తున్న మార్గదర్శి పి.కె.జోషి, అధికారులు

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

వైభవంగా హనుమత్ వ్రతం

సింధియా, న్యూస్‌టుడే: జింక్ మైదానంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమత్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో పద్మావతి అధ్యక్షతన ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే వెంట తెదేపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక ?: గాజువాక వంతెన సమీపంలో అనధికార దుకాణాలు, తోపుడుబళ్ల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - సుభాష్, గాజువాక. ✓: బీటు కానిస్టేబుల్‌తో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. -హుస్సేన్, సీఐ

?: చినగంట్యాడ మున్సిపల్‌రోడ్డు, జగ్గుసెంటర్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. -సన్యాసిరావు, చినగంట్యాడ. ✓: సిబ్బందిని పంపి, నివారణ చర్యలు తీసుకుంటాం. -కిరణ్ కుమార్, ఏఎంఓహెచ్

దోమల నియంత్రణ చర్యలు

స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే: కాలనీల్లో అపరిశుభ్రత, దోమల బెడదపై జీవీఎంసీ వల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తలకు జీవీఎంసీ అర్బన్ మలేరియా, ప్రజారోగ్యం సిబ్బంది స్పందించారు. పెదగంట్యాడ, వడ్లపూడి ఉక్కు నిర్వాసితకాలనీలో ఫాగింగ్ చేసి లార్వా నివారణ చేపట్టారు.

నిధులు... చకచకా పనులు..!

మెరుగుపడుతున్న మురుగు వ్యవస్థ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాకలో ఏళ్ల కిందట నిర్మించి, సరైన నిర్వహణ లేక అధ్వానంగా మారిన మురుగునీటి పారుదల వ్యవస్థకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. కొద్దిపాటి వర్షాలకే గెడ్డలు, కాలువలు పొంగి లోతట్టుకాలనీలను జలమయం చేస్తున్నాయి. దీనిపై అధ్యయనం చేసిన జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తొలిదశలో రూ.కోటి వ్యయంతో పనులు చేపట్టారు. జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శినికాలనీ, వికాస్‌నగర్, అశోక్‌నగర్‌లో చేపడుతున్న పనులు కొలిక్కి వచ్చాయి.

గత పాలకుల నిర్లక్ష్యం..!: వాంబేకాలనీ కొండ పైనుంచి నేరుగా ప్రవహించే వరద నీటికి అడుగడుగునా ఆటంకాలు ఉన్నాయి. ప్రియదర్శినికాలనీ నుంచి ప్రభుత్వ స్టీల్‌సిటీ ఐటీఐ రోడ్డు మీదుగా వికాస్‌నగర్, అశోక్‌నగర్, దిబ్బపాలెం, యాతపాలెం వరకు విశాలమైన గెడ్డ వాగు ఉంది. ★ గత వైకాపా పాలకుల నిర్లక్ష్యంతో పూడికలు నిండిపోయి నీటి ప్రవాహానికి వీల్లేకుండా తయారైంది. వేలాది కుటుంబాల ఇబ్బందుల్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించారు. జోన్-6 ఇంజినీరింగ్ అధికారులను రంగంలోకి దింపి ప్రత్యేక ప్రణాళికతో పనులు ప్రారంభించారు.

ఇటీవల కొత్తగా నిర్మించిన కాలువ

తొలి దశలో..: జీవీఎంసీ సాధారణ నిధులతో 'పేజ్-1 కింద 62 మీటర్ల పొడవైన గెడ్డ వాగును 6 మీటర్ల వెడల్పుతో కొత్తగా నిర్మించారు. అంత కొండవాలు ప్రాంతం కావడంతో ప్రత్యేక యంత్రాలతో తవ్వకాలు చేపట్టి, మూడు మీటర్ల లోతున గెడ్డను పునరుద్ధరించారు. ★ ఆలాగే 6 మీటర్ల పొడవు, 18 మీటర్ల వెడల్పుతో ఐటీఐ రోడ్డులో మినీ వంతెనను అనుసంధానంగా నిర్మించారు. దిబ్బపాలెం వైపు వెళ్లే అవుట్‌లెట్ గెడ్డవాగును 'పేజ్-2 కింద ప్రత్యేక నిధులతో పునరుద్ధరించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

నడుపూరులో..: తరచూ ముంపునకు గురవుతున్న 76వ వార్డు నడుపూరు గ్రామ అనుసంధాన పనులను రూ.3 కోట్లతో చేపట్టారు. గెడ్డకు రెండు వైపులా కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో నడుపూరు, డెయిరీకాలనీ, బర్మాకాలనీ, శీరంవానిపాలెం ప్రజల ముంపు కష్టాలు తీరుతాయి. ఆయా పనులు నెల రోజుల్లో పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు.

ముంగిట్లో మురుగు..!

దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: శ్రీనగర్‌లో జనావాసాల మధ్య ఉన్న జీవీఎంసీ చెరువు పార్కు మురికికూపంగా తయారైంది. నిర్వహణ చూసే వారు లేక, తీవ్ర దుర్గంధంతో నివాసితులు నానా అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న పార్కును ఆరేళ్ల కిందట అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.12 లక్షలు వెచ్చించి హడావుడిగా వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలు, చెరువును తీర్చిదిద్దారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు.

రైళ్లకు అదనపు బోగీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: క్రిస్మస్ పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రత్యేక రైళ్లకు తాత్కాలికంగా అదనపు బోగీలు జత చేయనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 7 నుంచి 28 వరకు విశాఖ- ఎస్ఎంవీ బెంగళూర్ (08581), 8 నుంచి 29 వరకు ఎస్ఎంవీ బెంగళూర్- విశాఖ (08582) రైళ్లకు, 3 నుంచి 31 వరకు విశాఖ-తిరుపతి (08547), 4 నుంచి జనవరి 1 వరకు తిరుపతి- విశాఖ (08548) రైళ్లకు, 5 నుంచి 26 వరకు విశాఖ-చర్లపల్లి (08579), 6 నుంచి 27 వరకు చర్లపల్లి- విశాఖ (08580) రైళ్లకు ఒక్కో థర్డ్ ఏసీ ఎకానమీ బోగీని జత చేయనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌కు విన్నపం

గాజువాక, న్యూస్‌టుడే: జీవీఎంసీ 72వ వార్డు ఎస్సీకాలనీలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ యువజన సేవా సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం వారు గాజువాక తహసీల్దార్‌ను కలిసి వినతి అందించారు. సంఘం అధ్యక్షుడు కొల్లి దేవుడు, నాయకులు పరదేశి, సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి

గాజువాక, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరంగా పెండింగ్ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాలని, అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గాజువాక క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ జోన్-6 అధికారులతో సమావేశమై, పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపాదిత 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు అంచనాలు రూపొందించి, టెండర్లు పిలవాలన్నారు. రహదారుల విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు మంజూరు చేయాలన్నారు. జెడ్సీ శేషాద్రి, ఈఈ రాయల్‌బాబు, ఏసీపీ వెంకట్రావు, డీఈ నారాయణ, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తదితరులు

నృత్య పోటీలు ప్రారంభం

కళాకారుల నృత్య ప్రదర్శన

చినగంట్యాడ(గాజువాక), న్యూస్‌టుడే: త్రిశక్తి భజన మండలి, భజరంగీ భజన మంజరి, హిందూ ధర్మ ప్రచార మండలి ఆధ్వర్యంలో మంగళవాం రాత్రి చినగంట్యాడలో భజన యజ్ఞం-10లో భాగంగా నాట్య, పాటల పోటీలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో అలరించారు. పోటీలను సాహిత్య సుధ వ్యవస్థాపకులు అద్దంకి రాఘవాచార్యులు, భజన యజ్ఞం నిర్వాహకులు బి.రాజారావు, బిరుదురాజు అమ్మాజీ ప్రారంభించారు. కళాకారులను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసిన పోటీల ముగింపు ఉత్సవాన్ని 9న నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రూ. 1.16 లక్షల ఆర్థికసాయం

గాజువాక: సామాజిక సేవలో భాగంగా 70వ వార్డు సాయి విద్యానికేతన్ యాజమాన్యం నగరంలోని స్నేహ నేత్ర నిరుద్యోగ అంధుల సంస్థకు రూ. 1,16,436 విరాళం అందజేసింది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ పాల్గొని సంస్థ ఆర్గనైజర్ రాజుకు విరాళం అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎన్.రవికుమార్, మానవత సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డి.కృష్ణంరాజు, నాయకులు సతీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తదితరులు

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
W.P. No.4959 OF 2025

BETWEEN:
Madaka Appa Rao, S/o Madaka Polipalli, aged 60 years, residing at D.No.2-12, Mantri palem, Paravada, Pedamushidiwada, Visakhapatnam-531019 and 3 others. ...Petitioners

AND

The LokAdalat Bench, Anakapalli, represented by it's Chairman and Presiding Officerand 19 others ....Respondents

NOTICE TO:
1. Nagamantri Venkata Padmavathi, W/o N.Pattabhi Ramarao, aged 56 years, D.No. 9-87/c, Ravi Nagar, Naidu Thota, Pendurthi Mandal, Visakhapatnam District -530047.
2. Potnuri Venkata Uma Maheswari. W/o Sikharamahanathi Stephen, aged about 50 years, R/o D.No. 9-139/1, Kuttu Gramam, Ramalayam Veedhi, Thummapala, Anakapalli Mandal, Anakapalli - 531001.
3. Sekharamantri Triveni, W/o Late S.S Ramesh, aged about 67 years, R/o Quarter No. 359, LIG quarters, PedaGantyada, Viskhapatnam.
4. Sekharamantri Bhaskar, S/o Late S.S Ramesh, aged about 45 years, R/o Quarter No. 359, LIG quarters, PedaGantyada, Viskhapatnam.
5. Sekharamantri Lokesh, S/o Late S.S Ramesh, aged about 40 years, R/o Quarter No. 359, LIG quarters, PedaGantyada, Viskhapatnam.

NOTICE

It is submitted that a Writ Petition bearing WP No. 4959 of 2025 is filed before the Hon'ble High Court of Andhra Pradesh, at Amaravathi by my clients Madaka Appa Rao and 3 others against 20 Respondents as aggrieved by the Award dated 14.09.2019 passed by "The Lokadalat Bench, Anakapalli" in L.A.C.No. 225 of 2019 in I.A 154 of 2003 in O.S.No.11 of 1991 on the file of Hon'ble Principal Senior Civil Judge at Anakapalli.The above writ petition came up for admission before Hon'ble High Court on 25.02.2025 and the on the said date theHon'ble Court has directed the petitioner counsel to take out notice on the Respondents 1 to 20 by way of registered post with acknowledgement due. Notice sent to the Respondents No. 3,7 to 12, 13, 15 and 20 was served and few Respondents i.e., no. 2, 4, 6, 8 to 11 were died and whereas, notice sent to respondents No.14,16 to 19 was 'Returned unserved' as 'No such addressee'. As such we have filed I.A No. 3 of 2025 seekingsubstituted servicefor the Respondents No. 14 and 16 to 19 and the Hon'ble High Court of AP was pleased to allow the same vide its order dated 04.12.2025 by the next date of hearing. As such the present notice is published as per the directions of the Hon'ble Court. The matter is likely to be listed on 16.12.2025, therefore, you are hereby directed to appear before Hon'ble High Court of Andhra Pradesh either in person or through an Advocate or duly authorized Agent, in support of your defence to show cause on the date of listing at 10.30 A.M (Forenoon) as to why the relief prayed for shall not be granted. TAKE NOTICE that in default to appear before the Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi, the said WP No. 4959 of 2025 will be heard and determined in your absence.

\\\ By the Order of Hon'ble High Court of Andhra Pradesh \\\
SRI SVSS SIVA RAM, Advocate, Amaravathi

దత్త జయంతికి ఏర్పాట్లు

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి శ్రీ శిర్డీసాయి ధ్యాన మందిరంలో 4న దత్త జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి బాబాకు ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం పల్లకీ సేవ, ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

'పూర్తిస్థాయి జీతాలు చెల్లించాలి'

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే: ఉక్కు ఉద్యోగులకు పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలని ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.రామచంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం కర్మాగారంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉత్పత్తి ఆధారంగా జీతాల చెల్లింపులను వాయిదా వేయడం దారుణమన్నారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కార్మికులపై చిన్నచూపు తగదన్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం స్పందించి, వేతనాల చెల్లింపుపై దృష్టి సారించాలని కోరారు.

వార్డు అభివృద్ధిపై మంత్రికి వివరణ

కరాస, న్యూస్‌టుడే: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన తెదేపా వార్డు అధ్యక్షులు, కార్యదర్శులకు మంగళగిరిలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో జీవీఎంసీ 57వ వార్డు తెదేపా అధ్యక్షుడు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు మంగళవారం పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ వార్డులో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పలు విషయాల గురించి మంత్రికి వివరించారు.

కరాటే సాధనతో ఆత్మరక్షణ

పాతకర్నవానిపాలెం(గాజువాక), న్యూస్‌టుడే: గత నెల 28 నుంచి 30 వరకు గాజువాక ఆర్‌జీఎ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి బాలల కరాటే పోటీల్లో యూనివర్సల్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపి, పతకాలు సాధించారు. మంగళవారం చినగంట్యాడ అమరావతి పార్కులో విజేతలను అభినందించారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే కరాటే నేర్చుకుంటే, ఆత్మరక్షణ మెలకువలు తెలుస్తాయన్నారు. అకాడమీ అధ్యక్షుడు శరత్, కోచ్‌లు శ్రీహరి, నాయుడు, పార్కు కమిటీ అధ్యక్షుడు వెంకటరావు పాల్గొన్నారు.

కరాటే విజేతలతో నర్సింగరావు, కోచ్‌లు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: సమతానగర్ ఒకినోవా స్కూల్ ఆఫ్ కరాటే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కరాటే పోటీలు విజయవంతంగా ముగిశాయి. ప్రతిభ చూపిన హర్షితరెడ్డి, త్రిశూల్‌రెడ్డి, కార్తిక్ నిశాంత్, విష్ణువర్ధన్‌నాయుడును కోచ్ జి.శివాజీ అభినందించారు.

రాష్ట్ర జేఎస్‌సీలో ఏపీటీడీకి చోటు

సింధియా, న్యూస్‌టుడే: రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ)లో ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు విభాగానికి చెందిన మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు చోటు కల్పించడంపై ఏపీ రీజినల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో ఏపీటీడీ రీజినల్ నాయకులు వై.శ్రీనివాసరావు, పిల్లా శంకరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ ఉద్యోగుల సమస్యలను నేరుగా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి సులభతరం కానుందని స్పష్టం చేశారు. గాజువాక డిపో కార్మిక సంఘం ప్రతినిధులు ఉన్నారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతి అందజేస్తున్న ఏపీటీడీ నాయకులు

పోషకాహారంతో బాలల ఆరోగ్యం

విద్యార్థులతో ఎమ్మెల్యే గణబాబు, అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

కరాస, న్యూస్‌టుడే: అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56వ వార్డులోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో చాలా మంది అల్పాహారం తీసుకోకుండా వస్తున్నారనే విషయాన్ని గుర్తించి అక్షయపాత్ర ద్వారా చిరు ధాన్యాలతో తయారు చేసిన చెక్కీలు, ప్రొటీన్ బార్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అక్షయపాత్ర ప్రాంతీయ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస, సభ్యులు గోపేశ్వరదాస స్వామి, మేనేజర్ రామ్‌మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి మూడు రోజులు పోషకాహారం అందించడం అభినందనీయమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. మంగళవారం కణితి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. విద్యార్థులకు పోషకాహారం అందించారు. వార్డు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: నిత్యం పోషకాహారం తీసుకోవడంతో బాలలు ఆరోగ్యంగా ఉంటారని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మంగళవారం మింది, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆంజనేయ, కుమారస్వామి, స్థానిక నాయకుడు లతీశ్ పాల్గొన్నారు.

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, హెచ్ఎం విజయప్రశాంతి పాల్గొని.. విద్యార్థులకు పోషకాహారం అందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కణితి ఉన్నత పాఠశాలలో పోషకాహారం అందజేస్తున్న కార్పొరేటర్ జగన్, తదితరులు

హిందీ ఉపాధ్యాయుడి ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

మల్కాపురం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రాం షిప్‌యార్డు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పొరుగు సేవల విధానంలో పని చేసేందుకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో త్రినాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 08-12-25 నుంచి వచ్చే ఏడాది 07-05-2026 వరకు విధులు నిర్వహించడానికి నెలకు రూ. 12,500/- గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

చురుగ్గా రహదారి విస్తరణ

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి హోమీ భాభా క్యాన్సర్ ఆసుపత్రి నుంచి ఫార్మాసిటీ పునరావాస కాలనీ వరకు ఉన్న రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ నుంచి రూ.కోటి నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టారు. మంగళవారం 85వ వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దశేంద్ర, జీవీఎంసీ అధికారులు నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచించారు.

పనులు జరుగుతున్న దృశ్యం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరాస, న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో జీవీఎంసీ నిధులు రూ. 35 లక్షలతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణ పనులకు మంగళవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రజాపనుల విభాగం ఇంజినీరింగ్ ఏఈ వెంకటలక్ష్మి, పర్యవేక్షకులు రామకృష్ణ, వార్డు సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న కూటమి నాయకులు, ప్రభుత్వ సిబ్బంది

అదృశ్యమైన వ్యక్తిని ఇంటికి చేర్చిన పోలీసులు

మాధవధార, న్యూస్‌టుడే: గాజువాక వెళ్లి వస్తానని చెప్పి ఎన్ఏడీ వద్ద అదృశ్యమవ్వడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి వెతికి వారికి అప్పగించారు. దీనికి సబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బుచ్చిరాజుపాలెంలో నివాసముంటున్న మూర్తి డేవిడ్ రాజు(56) సోమవారం ఉదయం గాజువాక వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు చుట్టు పక్కల గాలించగా అంబేడ్కర్ కాలనీ సాయిబాబు గుడి వద్ద ఉండటం గమనించి తక్షణమే ఇంటికి తీసుకెళ్లి అప్పగించారు. డేవిడ్ రాజుకు మతిమరుపు ఉందని, ఆలయంలో ఉండిపోయాడని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మూర్తి డేవిడ్‌రాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎయిర్‌పోర్టు పోలీసులు

తెదేపాలో కార్యకర్తలే కీలకం

గాజువాక, న్యూస్‌టుడే: తెదేపాలో కార్యకర్తలే కీలకమని ఎమ్మెల్యే పల్లా అన్నారు. కార్యకర్తల మనోభావాలు తెలుసుకోవడంలో భాగంగా మంగళవారం గాజువాక పార్టీ కార్యాలయంలో 'నా కార్యకర్త' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 30 మంది కార్యకర్తలతో ఎమ్మెల్యే పల్లా వ్యక్తిగతంగా మాట్లాడారు. పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, వ్యక్తిగత అంశాలపై ఆరా తీశారు. వార్డు ప్రతినిధులు కదిలి పోలరాజు, శంకరరావు, కె.కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనపై ఆరా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మార్గశిర మాసం సందర్భంగా బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆలయ పరిసరాల్లో పర్యటించి, ఏర్పాట్లు పరిశీలించారు. రెండో గురువారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రసాదాల కౌంటర్, క్యూలైన్లను పరిశీలించారు. ఈఓ శోభారాణి పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధురాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు గాజువాకలో అదృశ్యం కాగా.. పెందుర్తిలో ఆచూకీ లభించినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో ఒంటిపై బంగారు ఆభరణాలున్న ఓ వృద్ధురాలు చలికి వణుకుతూ అనాథగా ఉండడాన్ని గ్రామానికి చెందిన కావ్య, చింతలమ్మ మంగళవారం గమనించి చేరదీశారు. తర్వాత పెందుర్తి పోలీసులకు సమాచారం అందించగా.. స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆమెను చేర్పించారు. ఈ మేరకు సంబంధిత విషయాన్ని పలు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయగా.. గాజువాకలోని ఆమె బంధువులు స్పందించారు. ★ ఇదిలా ఉండగా గత నెల 30వ తేదీన బూరల పెంటమ్మ (65) అనే మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తప్పిపోయిన ఆ వృద్ధురాలి ఆచూకీని పెందుర్తి పోలీసులు గుర్తించడంతో ఆమెను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. ఆమెను సంరక్షించిన రాంపురం గ్రామ మహిళలను సీఐ అభినందించారు.

వృద్ధురాలి బంధువులతో పెందుర్తి మహిళా పోలీసు

సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోజనం

చైతన్యనగర్(గాజువాక), న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని గాజువాక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమహాలక్ష్మి అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. డైరెక్టర్ కామేశ్వరి, అధ్యాపకులు వరలక్ష్మి, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, తదితరులు

క్రీడల్లో ప్రతిభ చూపితే గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. మంగళవారం అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇటీవల ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన పాఠశాల విద్యార్థులు తరుణ్‌కుమార్, దిల్లీశ్వరిని అభినందించారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం కుమారస్వామి, పీడీలు ఇస్మాయిల్, నర్సింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేటర్ అనూష, తదితరులు

శ్రద్ధాంజలి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, కుటుంబం కోసం నిరంతరం పరితపించిన మీరు స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తూ... దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.., అశ్రునయనాలతో..

కీ॥శే॥ శ్రీమతి విరోతు సింహాచలం
మరణం: 20-11-2025
భర్త: విరోతు పెంటయ్య (లేటు)
తండ్రి: కోన జోగినాయుడు (లేటు)

కోడలు: విరోతు కనకవేణి W/o. విరోతు యర్ర అప్పారావు (లేటు)
మరియు కుటుంబ సభ్యులు

పెద్దకర్మ: తేది. 03-12-2025 బుధవారం కాపుతుంగ్లాంలో గల మా స్వగృహమునందు జరుగును.

శ్రద్ధాంజలి

మంచి తనం, మంచి వ్యక్తిత్వం కలిగి సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించిన మీరు మా నుండి దూరమైనను, మీ మధుర స్మృతులు మేము మరవలేకపోతున్నాం. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ గుడివాడ రాజశేఖర్ గారు
విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్
జననం: 9-9-1972 మరణం: 20-11-2025

చిన్నాన్న: గుడివాడ జోగా రావు
పిన్ని: గుడివాడ పద్మావతి
తమ్ముళ్ళు - మరదళ్ళు:
గుడివాడ భవానీ శంకర్ - గుడివాడ నిరీష (లాస్య)
గుడివాడ ప్రదీప్ కిరణ్ - గుడివాడ మనీషా
పిల్లలు: శ్రేయాన్సిక, శ్రీ సమృద్ధ్

శ్రద్ధాంజలి

మంచి తనం, మంచి వ్యక్తిత్వం కలిగి సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించిన మీరు మా నుండి దూరమైనను, మీ మధుర స్మృతులు మేము మరవలేకపోతున్నాం. మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

అమ్మ: గుడివాడ లక్ష్మిదేవి
భార్య: గుడివాడ ప్రమీల
కుమారుడు: గుడివాడ రోహిత్
కుమార్తె: గుడివాడ మేఘన
అన్నా - వదిన:
గుడివాడ ప్రసాద్ - గుడివాడ లత
పిల్లలు: రాహుల్, రేవంత్
చెల్లి - బావ:
సియ్యాద్రి నాగమణి - సియ్యాద్రి కొండ బాబు
పిల్లలు: శరణ్య, వినీత్, అల్లుడు: సందీప్
మనవడు: గీతాన్ష్ సాయి

కీ॥శే॥ గుడివాడ రాజశేఖర్ గారు
విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్
జననం: 9-9-1972 మరణం: 20-11-2025

అంగవైకల్యమని కుంగిపోలేదు.. అవకాశాన్ని వదులుకోలేదు

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

న్యూస్‌టుడే – గరివిడి

వైకల్యాన్ని అడ్డంకిగా భావించలేదు.. నా వల్ల కాదు, చేయలేను అని సాకులు చెబుతూ కూర్చోలేదు. అంగవైకల్యాన్నే అవకాశంగా మార్చుకున్నారు. సాధించలేనిది లేదని నిరూపించారు.. తమ కంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరచుకుని సాగిపోతున్నారు ఈ యువకులు. నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆ స్ఫూర్తి ప్రయాణం తెలుసుకుందాం రండి.

బౌలింగ్ సాధనలో నాయుడు

ఆట.. చదువు.. అదుర్స్

గరివిడి మండలం కోనూరు గ్రామానికి చెందిన **రమేష్ సుబ్రహ్మణ్యం నాయుడు**కు పుట్టుకతోనే రెండు చేతులు, కాళ్లకు వేళ్ల నిర్మాణం సరిగా లేదు. కుడికాలి పాదానికి ఒక బొటన వేలు మాత్రమే ఉంది. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై మక్కువతో ఉత్సాహంగా వెళ్లినా ఎవరూ ఆడించేవారు కాదు. ఆసక్తిని గమనించిన తండ్రి స్వయంగా మైదానానికి తీసుకెళ్లి ఆడించేవారు. క్రమం తప్పకుండా సాధన చేస్తూ నైపుణ్యం పెంచుకున్నాడు.

మద్రాస్ ఐఐటీలో ఇంజినీరింగ్

మద్రాసు ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ప్రస్తుతం అక్కడే ఎంటెక్ చదువుతున్నాడు రమేష్ సుబ్రహ్మణ్యం. కోచ్‌ల సారథ్యంలో క్రికెట్‌లో రాటుదేలాడు. ప్రతిభను గుర్తించిన తమిళనాడు రాష్ట్ర క్రికెట్ సంఘం దివ్యాంగుల క్రికెట్‌కు సిఫారసు చేసింది. ప్రతిభ చూపి, ఆ రాష్ట్ర దివ్యాంగుల జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

ఇవీ విజయాలు..

- 2024లో వారణాసిలో జరిగిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో సౌత్‌జోన్ టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా సారథ్యం వహించి జట్టును విజేతగా నిలిపాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో కోయంబత్తూరులో జరిగిన ఇండియన్ పారా క్రికెట్ లీగ్‌లో రాణించి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును దక్కించుకున్నాడు.
- 2026 ఏప్రిల్‌లో నిర్వహించనున్న ప్రపంచ దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌కు భారత క్రీడాకారుల ఎంపికకు ఈనెల 5 నుంచి నిర్వహించే ప్రాబబుల్స్ శిబిరానికి వైస్ కెప్టెన్‌గా ఈ వ్యవహరించనున్నాడు.

క్రీడ ఏదైనా సవ్యసాచి..

న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పాలకొండ పట్టణంలోని సనారివిశ్వేశర ఆలయ వీధికి చెందిన **బెహరా శివదుర్గాప్రసాద్** ఆటలపై ఆసక్తితో పలు క్రీడల్లో రాణిస్తున్నాడు. ఈ యువకుడికి పుట్టుక నుంచే ఎడమ చేయి సహకరించడం లేదు. అయినా పట్టుదలతో సాధన చేస్తూ సాగుతున్నాడు. దాతల సహకారంతో పోటీలకు వెళ్తున్నాడు. ఈ నెల శ్రీలంకలో జరగనున్న దక్షిణాసియా పారా త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు.

- ఈ ఏడాది ఫిబ్రవరిలో గుంటూరులో జరిగిన దివ్యాంగుల పారా క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టును ప్రథమ స్థానంలో నిలిచేలా చేసి కప్ కైవసం చేసుకున్నాడు.
- ఈ ఏడాది జనవరిలో విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించాడు. జట్టు తృతీయ స్థానంలో నిలిచింది.
- గత ఏడాది చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పారా కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడాడు. జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.
- నాలుగేళ్ల కిందట భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి పారా అథ్లెటిక్ పోటీల్లో 100 మీటర్ల విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానం సాధించాడు.

వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రేరణతో.. పేదరికం కారణంగా ఐటీఐతో చదువుకు స్వస్తి పలికినా ఆటలపై పూర్తి దృష్టిసారించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఆర్.రాములు ప్రేరణతో వివిధ క్రీడల్లో ప్రావీణ్యం సాధించినట్లు ఈ యువకుడు చెబుతున్నాడు.

క్రికెట్ ట్రోఫీతో దుర్గాప్రసాద్

4న జిల్లాకు మంత్రి లోకేశ్

భామిని, సీతంపేట న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ నెల 4న భామినిలో పర్యటించనున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో బహిరంగ సమావేశం ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి 9.30 వరకు నిర్వహించనున్నారు. భామినిలోనే బస చేసి.. 5న ఆదర్శ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్.. టీచర్ మీటింగ్‌లో ముఖ్య మంత్రితో కలిసి పాల్గొంటారని అధికారులు వివరించారు.

అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

సమావేశానికి సిద్ధం చేస్తున్న వేదిక

పార్వతీపురం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు భామినిలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్, పాలకొండ డీఎస్పీ రాంబాబు తదితరులు మంగళవారం పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు నిర్వహిస్తున్నారు. ఆదర్శ పాఠశాలకు ఎదురుగా హెలిప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపడుతున్నారు.

రిమ్‌జిమ్ ఎప్పటికో..

పట్టణాల్లో అంతంతమాత్రమే బహిరంగ వ్యాయామ శాలలు

న్యూస్‌టుడే– రాజాం, విజయనగరం పట్టణం, బొబ్బిలి, నెల్లిమర్ల

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజల జీవనశైలి మారి వ్యాధుల బారిన పడుతున్నారు. ఉన్నంతలో కాస్త ఉపశమనం కలిగించేలా ఉదయపు నడక బాట పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నగరాలు, పట్టణాలు పెద్దగా కనిపించే ఓపెన్ జిమ్(బహిరంగ వ్యాయామ శాలలు)లు మన పురపాలికల్లో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏర్పాటు చేసిన అరకొర జిమ్‌ల నిర్వహణ గాలికొదిలేశారు.

నగరం: విజయనగరం — జనాభా: 3,04,000

రాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్ పార్కు, మహిళా పార్కు, రాజీవ్ క్రీడా ప్రాంగణం, పూల్‌బాగ్ కాలనీ బిట్-2 పార్కు, ఆచంట గార్డెన్స్ ప్రస్తుతం ఓపెన్ జిమ్‌లు ఉన్నాయి. రోజూ 10 వేల మంది వరకు ఉదయపు నడకకు వెళ్తుంటారు. పెద్ద చెరువు, నీలాటి చెరువు, గాంధీ పార్కు, నెహ్రూ చిల్డ్రన్స్ పార్కు, అయ్యకోనేరు, విజ్జీ స్టేడియం, ఎంఆర్ కళాశాల మైదానం, ఉడాకాలనీ ఫేజ్-2 చెరువు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అవసరం మేరకు గాంధీపార్కు, బొందిల గూడెం, శుద్ధవీధి పార్కుల్లో ఏర్పాటునకు ప్రతిపాదించామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

బొబ్బిలి 62,000

పట్టణం నాలుగు దిక్కులా నిత్యం రెండు వేల మంది వాకింగ్‌కు వెళ్తుంటారు. రాణిమల్లమ్మ దేవి పార్కులో ఏర్పాటు చేసిన జిమ్ పిల్లలు, యువతకు కొంత ఉపయోగపడుతోంది. యుద్ధ స్తంభం, మల్లంపేట, ఐటీఐ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో జిమ్‌లు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు.

నెల్లిమర్లలో అమర్చకుండా వదిలేసిన పరికరాలు

రాజాం 48,229

సారథి రహదారిలోని కోనేరు వద్ద ఓపెన్‌జిమ్ పరికరాలు ఏర్పాటు చేసినా.. వ్యాయామానికి ఏమాత్రం సరిపోవడం లేదు. పట్టణానికి ఆనుకుని పాలకొండ, చీపురుపల్లి, శ్రీకాకుళం, బొబ్బిలి, బుచ్చెంపేట, బాలకవివలస, సారథి, గోపాలపురం రహదారుల్లో రోజూ వేల మంది నడకకు వెళ్తున్నారు. ప్రైవేటు జిమ్‌ల్లో నెలకు రూ.వేలల్లో వసూలు చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతిపాదనలు పెడతామని కమిషనర్ ఎ.రామచంద్రరావు చెప్పారు.

నెల్లిమర్ల 28,252

ఇక్కడ ఒక్క ఓపెన్ జిమ్ కూడా లేదు. ఓ చోట ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చిన పరికరాలు నిరుపయోగంగా వదిలేశారు. తుప్పు పడుతున్నాయి. థామస్‌పేట, జరజాపుపేట, కొండవెలగాడ రహదారి, తదిరత ప్రాంతాల్లో రెండు వేల మంది వరకు నడకకు వెళ్తుంటారు. జిమ్ పరికరాలు వెంటనే ఏర్పాటు చేస్తామని కమిషనర్ జనార్దనరావు చెప్పారు.

సొంతింటి కల సాకారానికి మరో అవకాశం

14 వరకు గడువు పెంపు

న్యూస్‌టుడే– రాజాం

సొంతిల్లు లేని పేదలు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పెంచింది. పీఎం ఆవాస్ గ్రామీణ్ యోజన పథకం 2.0 కింద ప్రస్తుతం సర్వే చేయడంతో పాటు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సొంత స్థలం ఉన్నవారు ఇల్లు మంజూరు చేయాలని, స్థలం లేని వారు స్థలం, ఇల్లు కావాలని దరఖాస్తు చేయొచ్చు. జిల్లాలో 35,024 కుటుంబాలకు సొంతిల్లు లేదని, 4,932 మందికి స్థలం లేదని డిమాండ్ సర్వేలో గతంలో గుర్తించారు. పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ పీడీ మురళీమోహన్ తెలిపారు.

మంగళవారం రాత్రి వరకు దరఖాస్తుల వివరాలు..

నియోజకవర్గం	లబ్ధిదారులు
బొబ్బిలి	5,896
చీపురుపల్లి	4,733
గజపతినగరం	6,692
నెల్లిమర్ల	5,199
రాజాం	6,933
ఎస్.కోట	2,593
విజయనగరం	841

మహిళల పేరునే అధికం..

ఇంటి స్థలం ఉన్నవారు దస్తావేజు, లేకుంటే హక్కులు నిరూపించే పత్రం, బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఉండాలి. ★ ఇంటి స్థలం లేని వారు దస్తావేజు మినహా మిగిలిన పత్రాలు సమర్పించాలి. ★ జిల్లాలో పురుషుల పేరున 1,141, మహిళల పేరుతో 31,744, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు నమోదు చేసుకున్నారు. మొత్తం దరఖాస్తుదారుల్లో 132 మంది దివ్యాంగులు ఉన్నారు. 32,746 మంది ఈ- కేవైసీ పూర్తయింది.

వైద్యో నారాయణో.. ఏరీ!

ఈనాడు, విజయనగరం

జీజీహెచ్ డయాలసిస్ కేంద్రంలో అరకొర సేవలు

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో రోగులకు పూర్తిస్థాయి సేవలు అందడం లేదు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉండక అవస్థలు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం ఆసుపత్రిలోని ఈ కేంద్రంలో వారానికి 82 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వారంలో రెండు లేదా మూడు సార్లు వారికి డయాలసిస్ చేస్తుంటారు. పీపీపీ విధానంలో దీన్ని ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహిస్తోంది. రోగులకు అవసరమైన మందులు సరఫరా చేస్తోంది. ఈ కేంద్రాన్ని ఆ సంస్థకు చెందిన బీఎం సహా సుమారు పది మంది ఉద్యోగులతో నడుపుతున్నారు. ఇక్కడ సరఫరా చేసిన మందులతో పాటు రోగి బంధువులు ప్రైవేటుగా కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన వైద్యులు అందుబాటులో ఉండడం లేదు.

డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు

చుట్టం చూపుగా వచ్చి..

డయాలసిస్ కేంద్రానికి చుట్టం చూపుగా వైద్యులు వచ్చిపోతున్నారు. ఈ కేంద్రాన్ని నెలకు రెండుసార్లు ప్రభుత్వ మూత్రపిండాల వైద్య నిపుణుడు సందర్శిస్తారు. ప్రభుత్వాసుపత్రిలోనూ ఆయన అందుబాటులో ఉండరు. మరో వైద్యుడు ఓపీలో రోగుల చికిత్సకే పరిమితం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ ఉదయం ఒకసారి, సాయంత్రం మరోసారి బయోమెట్రిక్(వేలిముద్ర) వేసి వెళ్లిపోతారు. గత శని, సోమ, మంగళవారాలు మూడు రోజులు ఈ కేంద్రాన్ని పలుమార్లు సందర్శించగా వైద్యుల జాడ కనిపించలేదు. కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. ప్రైవేటు సంస్థ ఉద్యోగులే రోగులకు సేవలు అందిస్తున్నారు.

కీలక వ్యవస్థపై పర్యవేక్షణ తక్కువే

ఈ యూనిట్‌లో ఆర్వో ప్లాంటు రోగులకు ప్రాణాలు నిలిపే కీలక వ్యవస్థ. ఇది పడకేస్తే డయాలసిస్ రోగికి రక్తంలో విష పదార్థాలు చేరి ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం ఉంది. ఇందులో రోజూ టీడీఎస్, కండక్టవిటీ పరీక్షలు, వారానికి ఒకసారి బ్యాక్టీరియల్, నెలకోసారి ఎండో టాక్సిన్ టెస్ట్, ప్రతి ఆరు నెలలకు నీటి నాణ్యత నివేదిక నమోదు చేయాలి. ఇవన్నీ నామమాత్రంగా జరిపి మమ అనిపిస్తున్నారు.

అందుబాటులో లేక అవస్థలు

శీతాకాలం నేపథ్యంలో రోగులకు చలి, వణుకు, శ్వాస సమస్యలు ఉత్పన్నమవుతాయి. అత్యవసర పరిస్థితుల్లో డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోతే ప్రాణాలకే ప్రమాదం. వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల అవస్థ పడుతున్నామని.. పేరు చెప్పేందుకు నిరాకరించిన రోగి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడమే కాకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత వైద్య నిపుణుడ్ని సంప్రదించగా 'తీరిక సమయంలో నేనే మాట్లాడతా..' అని ఫోన్ పెట్టేశారు.

డీఆర్సీ.. సమగ్ర సమాచారం సిద్ధం చేసుకోండి!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 4న జరగనున్న జిల్లా సమీక్షా సమావేశం (డీఆర్సీ) నిర్వహణకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ విషయమై కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, జేసీ సేధు మాధవన్‌లు మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి జిల్లా మంత్రి, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశమున్నందున అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైన సమగ్ర సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. నివేదికలు కేవలం అంకెలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పొందుపర్చాలన్నారు. గత సమావేశానికి సంబంధించిన నివేదిక, తీసుకున్న చర్యలపై చర్చించారు. సీపీవో బాలాజీ పాల్గొన్నారు.

భూసేకరణపై సమీక్ష

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. తన ఛాంబర్లో జాతీయ రహదారులు 130(సీడీ), 516(బీ), రైల్వే ఆర్వోబీలు, జి.సిగడాం -విజయనగరం మూడో రైల్వేలైన్, కొత్తవలస- విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. ప్రతి ప్రాజెక్టును నిర్ణీత వ్యవధిలోగా పూర్తిచేయాలన్నారు.

రిజిస్ట్రేషన్ చేస్తున్నారా..? స్లాట్ బుక్ చేసుకోండిలా..

న్యూస్‌టుడే– రాజాం

రిజిస్ట్రేషన్లకు తమకు అనుకూలమైన సమయం ఎంచుకునే వెసులుబాటును రిజిస్ట్రేషన్లశాఖ కల్పించింది. స్లాట్ విధానం తీసుకొచ్చింది. పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్(పీడీఈ)తో స్థిరాస్తుల క్రయవిక్రయాలకు ఎవరి దస్తావేజు వారే రూపొందించుకోవచ్చు. ఇందుకు నమూనా పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లినా హెల్ప్‌డెస్క్‌ల్లో సహకరిస్తారు.

జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు: 11
అక్టోబరు నాటికి ఆదాయ లక్ష్యం: రూ.194.99 కోట్లు
సాధించింది: రూ.188.06 కోట్లు

వివాహ రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీల రిజిస్ట్రేషన్లకు నచ్చిన సమయంలో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 మధ్య సమయాన్ని వినియోగించుకోవచ్చు. ముందస్తు బుకింగ్‌కు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన పన్లేదు. బుక్ చేసుకుని రద్దు చేసుకుంటే రూ.100, నిర్దిష్ట స్లాట్‌ను వాయిదా వేస్తే రూ.200 చెల్లించాల్సి ఉంటుందని, ఈ విధానం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఉపేంద్రరావు కోరారు.

ఇలా బుక్ చేసుకోవాలి..

● రిజిస్ట్రేషన్లశాఖ వెబ్‌సైట్ registraion.ap.gov.in లోకి వెళ్లాలి. ● రిజిస్ట్రేషన్ చేయాలనుకున్న తమ ఆస్తులు, ఇతర వివరాలను నమోదు చేసి డాక్యుమెంట్‌ను రూపొందించాలి. ● ఆ తరువాత దరఖాస్తు ఐడీ వస్తుంది. ● దీని ఆధారంగా ఆస్తుల విలువ ప్రామాణికంగా స్టాంపు డ్యూటీ, ఇతర ఫీజులు చెల్లించాలి. ● రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేందుకు ఏ సమయం అనుకూలమో చూసుకుని స్లాట్ నమోదు చేసుకోవాలి. ● ఇది పూర్తయ్యాక క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ టోకెన్ వస్తుంది. ● స్లాట్ సమయం ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే సబ్‌రిజిస్ట్రార్ ప్రక్రియ పూర్తిచేస్తారు.

దివ్యంగా ఆడేశారు..

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజ్జీ మైదానంలో సమగ్రశిక్షా ఆధ్వర్యంలో జిల్లా పారా ఒలింపిక్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో పోటీల్లో బాలలు పాల్గొన్నారు. విజేతలకు సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త ఎ.రామారావు, సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు, డీఎస్ఎఫ్ కార్యదర్శి గోపాల్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా పారా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె.దయానంద్, సహ సమన్వయకర్త ఎం.భారతి, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్ష ఫీజులోనూ కక్కుర్తేనా!

హెచ్ఎంలు, పాఠశాలల నిర్వాహకులపై ఫిర్యాదులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పరీక్ష రుసుము పేరిట పదోతరగతి విద్యార్థుల నుంచి కొందరు పాఠశాల నిర్వాహకులు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే అదనంగా కొన్ని ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్నట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చింది. కొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపైనా ఫిర్యాదులు అందినట్లు అధికారులు ధ్రువీకరించారు. ప్రైవేటులో అధికంగా వసూలు చేస్తే జరిమానాలతో పాటు గుర్తింపు రద్దు చేస్తామని, ప్రభుత్వ ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో 443 పాఠశాలల నుంచి 23,193 మంది విద్యార్థులు పది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరిలో ప్రైవేటు యాజమాన్యంలో 140 పాఠశాలల నుంచి 6,878 మంది విద్యార్థులు ఉన్నారు.

చెల్లించాల్సింది రూ.125 మాత్రమే: సాధారణ (రెగ్యులర్) విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125గా బోర్డు ఖరారు చేసినట్లు డీఈవో యు.మాణిక్యం నాయుడు తెలిపారు. అనధికార వసూళ్లపై తల్లిదండ్రులు ఎంఈవో, ఉప విద్యాశాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, ఆర్జేడీలకు ఫిర్యాదు చేయవచ్చని, అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. రుసుములను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

లోక్ అదాలత్ విజయవంతానికి పిలుపు

విజయనగరం లీగల్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13వ తేదీ శనివారం నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత చెప్పారు. రాజీపడదగిన క్రిమినల్, మోటారు ప్రమాద బీమా, చెక్కు బౌన్సు తదితర కేసులు పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత, చిత్రంలో న్యాయమూర్తి కృష్ణ ప్రసాద్

డీడీవో కార్యాలయాలు సిద్ధం

4న ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమల్లో పర్యవేక్షణ పెంచేందుకు డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4న ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనికి జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నారు.

తాత్కాలికంగా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పల్లె పాలనను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. డీఎల్‌డీవోలను డివిజన్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్పు చేసింది. సొంత భవనాలు నిర్మించేలోగా పూర్తిస్థాయి డీడీవో కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో విజయనగరంలో జడ్పీలో, చీపురుపల్లి, బొబ్బిలిలో గ్రామ సచివాలయాల భవనాల్లో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించడానికి, డీడీవో, డీఎల్‌పీవో, ఉపాధిహామీ ఏపీడీ, ఇతర ఉద్యోగులు విధులు నిర్వర్తించడానికి సరిపడా సిద్ధం చేశారు.

మన్నించు.. మహాకవి!

న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

గురజాడ గృహంలో సామగ్రి ధ్వంసం చేసిన దుండగులు

గృహంలో స్నానపు గది తలుపు పగులగొట్టిన దుండగులు

జాతిని జాగృతం చేసి పలువురిలో స్ఫూర్తి నింపిన మహాకవి గురజాడ. ఆయన గృహానికి రక్షణ లేకుండా పోతోంది. విజయనగరంలోని ఈ భవనమే లక్ష్యంగా గుర్తుతెలియని ఆకతాయిలు, మద్యం బాబులు రాత్రివేళల్లో లోనికి ప్రవేశించి సామగ్రి ధ్వంసం చేస్తున్నారు. పలుమార్లు ఇలా జరుగుతున్నా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరించడంతో తాజాగా మంగళవారం వేకువజామున మరోసారి ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బాత్‌రూం, భవనం వెనక తలుపులు పగులగొట్టారు. గురజాడ వినియోగించిన వస్తువులున్న గదిని ధ్వంసం చేశారు. విద్యుత్తు దీపాలు విరగ్గొట్టారు.

గతంలోనూ ఇలానే..

నాలుగేళ్ల కిందట భవనంలో గురజాడ రచనలు, వస్తువులను ఇలానే ధ్వంసం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 11న మందుబాబులు ఈ ప్రాంగణాన్ని అడ్డాగా మార్చుకున్నారు. వీటిపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని నగర వాసులు, సాహితీవేత్తలు, గురజాడ అభిమానులు, వారి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురజాడ వారసురాలు ఇందిరతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గృహాన్ని పురావస్తు శాఖ నుంచి సాంస్కృతిక శాఖకు అప్పగించాలని ఆమె కోరారు. మంత్రి దుర్గేష్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

ఆడారు.. పాడారు..
అదరగొట్టారు!

సినీ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న ఆరోతరగతి విద్యార్థినుల నాటిక ప్రదర్శన

పాటలతో అలరించారు.. నృత్యాలతో చిందులేశారు.. ఆటలతో సందడి చేశారు.. రోజంతా ఉత్సాహంగా గడిపారు.. సాలూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపులే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు వనమహోత్సవంలో ఆటపాటలతో అదరగొట్టారు. మంగళవారం పట్టణంలోని పాఠశాల ఆవరణలో ఏర్పాటైన కార్యక్రమంలో వీరంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు తల్లిదండ్రులపై గౌరవం పెంపొందించేలా విద్యార్థులు అక్షర, అక్షయ, ఆనందిత, శ్రావ్యలు ప్రదర్శించిన కనువిప్పు నాటిక ఆలోచింపజేసింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ పెంటయ్యను ప్రిన్సిపల్ మహాలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సత్కరించారు.
– న్యూస్‌టుడే, సాలూరు

పైన శ్రీకాకుళం.. దిగువ మన్యం!!

భామిని, న్యూస్‌టుడే: పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లా భామిని ప్రాంతం పార్వతీపురం మన్యం జిల్లాలో చేరింది. ఇది జరిగి మూడేళ్లు దాటినా ఆదర్శ పాఠశాల భవనంపైన మాత్రం ఇంకా పాత జిల్లా పేరే దర్శనమిస్తోంది. తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు మెగా సమావేశానికి సంబంధించి ఈ నెల 5న సీఎం చంద్రబాబు ఈ పాఠశాలనే సందర్శించనున్నారు. దీంతో పాఠశాలకు రంగులు వేయడంతో ఈ విషయం బయటపడింది.

అగాధం.. చూడకుంటే ప్రమాదం!

మక్కువ మండలం మార్కొండపుట్టి నుంచి గైశీల, నంద గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గంలో చిట్టిగెడ్డపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డపై నిర్మించిన వంతెన అడుగు భాగం కొట్టుకుపోయి అగాధంలా మారింది. స్థానికులు రాళ్లు, మట్టి వేసి కప్పే ప్రయత్నం చేసినా కోతకు గురవుతోంది. పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలకు ఈ దారే ఆధారం. ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లేందుకూ వీల్లేకుండా పోయింది. ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రైతులు పంటను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ర.భ.శాఖ జేఈ విజయ్‌కుమార్ వద్ద మాట్లాడగా గుత్తేదారుడితో మాట్లాడి రోడ్డు బాగుచేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, మక్కువ

సహస్ర కలశాభిషేకం

సాలూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో మహారుద్రయాగం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం మాల ధరించిన భక్తులు పంచముఖేశ్వరునికి అభిషేకాలు చేశారు. అనంతరం పార్థివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బరువులెత్తేస్తా.. పతకాలు పట్టేస్తా!

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్న పల్లవి

న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మంగళవారం పల్లవిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్

ఆమె ఏ పోటీకి వెళ్లినా పతకంతో తిరిగొస్తుంది.. ఏ టోర్నీలో అడుగు పెట్టినా జ్ఞాపికతో జతకడుతుంది.. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటి.. పతకాలను కొల్లగొడుతోంది.. దేశ విదేశాల్లో కొండవెలగాడకు గుర్తింపు తీసుకొస్తోంది గ్రామానికి చెందిన క్రీడాకారిణి శానపతి పల్లవి. అయిదు రోజుల కిందట రాజస్థాన్‌లో జరిగిన ఖేలో ఇండియా జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో ఈమె ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించింది.

ఇవీ సాధించిన విజయాలు..

2020లో గువాహటిలో జరిగిన జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ పోటీలో కాంస్యం, 2021లో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి యూత్, జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో రజతం, అదే ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్వర్ణం, రెండు రజత పతకాలు సాధించింది. 2022 హరియాణా, ఉజ్బెకిస్థాన్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్, ఏషియన్ జూనియర్స్ పోటీల్లో స్వర్ణాలు సాధించింది. ఇటీవల మహిళా విభాగంలో జాతీయస్థాయి అంతర విశ్వవిద్యాలయాల ఖేలో ఇండియా పోటీల్లో 69 కిలోల విభాగంలో స్నాచ్ 90 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 110 కిలోలు కలిపి 200 కిలోలు బరువులెత్తి బంగారు పతకం కైవసం చేసుకుంది. కామన్‌వెల్త్ పోటీల్లో పతకమే లక్ష్యంగా నిరంతరం సాధన చేస్తున్నట్లు ఆమె చెబుతోంది.

కొండవెలగాడ.. ఈ పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకొచ్చేది వెయిట్ లిఫ్టింగ్ క్రీడే. గ్రామంలో ఎందరో క్రీడాకారులు వివిధ వేదికలపై ప్రతిభ చూపుతుండడం, వారి ఆట చూస్తుండడంతో పల్లవికి చిన్ననాటి నుంచి క్రీడపై ఆసక్తి పెరిగింది. వ్యవసాయ కూలీలుగా ఉన్న తండ్రి లక్ష్మణనాయుడు, తల్లి నాగమణి కుమార్తె ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించారు. సొంతంగా సాధన చేస్తూ.. శిక్షకుడు చల్లా రాము నుంచి క్రీడలో మెలకువలను తెలుసుకుని పట్టుదలతో రాణించింది. అంతర్జాతీయ వేదికల్లోనూ సత్తా చాటింది. ప్రస్తుతం విజయనగరంలో బొత్స గురునాయుడు డిగ్రీ కళాశాలలో చదువుతోంది.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాలకు గడువుపెంపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్‌లో ఈ నెల ఆరోతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో రూ.600 అపరాధ రుసుము చెల్లించాలని.తెలిపారు. పాత సిలబస్‌లో పదోతరగతి పరీక్ష రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.300 చెల్లించి ప్రవేశం పొందవచ్చని సూచించారు.

ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ.. ప్రోత్సాహం అందిస్తూ

న్యూస్‌టుడే, విజయనగరం ఉడాకాలనీ

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందిస్తూ, ప్రోత్సహిస్తూ.. వారి భవిష్యత్తుకు బాట చూపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వివిధ ఉపకరణాలు, రుణాలు అందిస్తూ.. స్వయం ఉపాధి కల్పిస్తూ సమాజంలో గౌరవం, గుర్తింపు దక్కేలా చేస్తున్నాయి. జిల్లాలో 72 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 39 వేల మందికి ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లు అందజేస్తోంది. వివిధ ఉపకరణాలు, విద్యావంతులకు చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, మూడు చక్రాల పెట్రోల్ వాహనాలు, సైకిళ్లు, కృత్రిమ అవయవాలు, చెవిటి మిషన్లు, చంక కర్రలు ఉచితంగా అందజేస్తున్నారు.

వివిధ పథకాలతో దివ్యాంగులకు ప్రభుత్వాల చేయూత

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ అందిస్తున్న ఆ శాఖ ఉద్యోగి

ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు..: ★ ఈ ఏడాది నియోజకవర్గానికి 10 చొప్పున ఒక్కొక్కటీ రూ.1.35 లక్షల విలువైన మూడు చక్రాల పెట్రోలు వాహనాలు 70 అందజేశారు. ★ మూడు చక్రాలు కలిగిన సైకిళ్లు ఈ ఏడాది 10 వరకు అందజేశారు. అవసరమైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ★ విద్యావంతులైన 30 మంది బధిరులకు ఒక్కొక్కరికీ రూ.15వేలు విలువైన చరవాణులను అందజేశారు. ★ గ్రాడ్యుయేట్, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న 29 మందికి రూ.45వేలు విలువ గల ల్యాప్‌టాప్‌లను అందించారు.★ వినికిడి సమస్య ఉన్న 50 మంది వృద్ధులు, ఇతరులకు చెవిటి మిషన్లను అందజేశారు. ★ నడవ లేని 30 మందికి రూ.9వేలు గల వీల్‌ఛైర్స్ అందించారు. కాలు లేని వారికి రూ.1500 విలువజేసే చంక కర్రలు ఇస్తున్నారు.

రుణాలు..

దివ్యాంగులు ఒకరిపై ఆధారపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించింది. 6 శాతం వడ్డీతో ఎంపిక చేసుకున్న యూనిట్ ఖరీదుకు అనుగుణంగా రూ.50 వేలు నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో కుటీర పరిశ్రమలు, పశువులు, కోళ్ల పెంపకం, కిరాణా దుకాణం, జెరాక్స్ మెషిన్, టెంట్ హౌస్ తదితర వాటికి 21 మందికి గానూ రూ.68 లక్షలు అందించింది.

యూడీఐడీ కార్డు...

ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లాగే దివ్యాంగులకు యూడీఐడీ గుర్తింపు కార్డు అందజేస్తోంది. ప్రతి దివ్యాంగునికి ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందిస్తోంది. వైకల్యం ఆధారంగా పథకాల లబ్ధి పొందడానికి ఈ కార్డులను వినియోగించవచ్చు. వీటి ద్వారా బాధితులకు గుర్తింపు వస్తుంది. పాత ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు వెంట తీసుకెళ్లే అవసరం లేదు. దేశంలో ఎక్కడికెళ్లినా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లాలో 30 వేల కార్డులు అందజేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి నేరుగా వారి ఇళ్లకే కార్డు చేరుతుంది.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా జేఎన్‌టీయూ

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ ప్రాంగణంలో ప్లాస్టిక్ రహితంగా క్యాంపస్ ఉండాలని వైస్ ఛాన్సలర్ వి.వి.సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ విద్యార్థులకు సూచించారు. పెరుగుతున్న కాలుష్య సమస్యలను ఎదుర్కోవడంలో యువ ఇంజినీర్ల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విశ్వవిద్యాలయంలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు పలు చర్యలను ప్రకటించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

ప్రదర్శనగా వెళ్తున్న విద్యార్థులు, ఆచార్యులు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

మెట్టపల్లిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందం

రక్త నమూనాల సేకరణ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామాన్ని జిల్లా వైద్యశాఖ ర్యాపిడ్ రెస్పాన్స్ టీం మంగళవారం సందర్శించింది. స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మృతి చెందిన మహిళ ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో మాట్లాడారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తామని బృంద సభ్యులు ఆచార్య శరత్ నాయక్, వినోద్ లాల్వాని, శ్రావణి, డీఎస్‌వో సత్యనారాయణ తెలిపారు.

రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

జాతీయ జంబోరిలో ప్రతిభ

కొత్తవలస, విజయనగరం విద్యావిభాగం: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో గతనెల 23 నుంచి 29 వరకు జరిగిన భారత స్కౌట్స్, గైడ్స్ 19వ జాతీయ జంబోరి డైమండ్ జూబ్లీ గ్రాండ్ ఫినాలేలో కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల 8 మంది స్కౌట్స్, 18 మంది గైడ్స్ ప్రతిభ చూపారు. తొమ్మిది విభాగాల్లో ఉత్తమ గ్రేడ్‌లు సాధించారని మంగళవారం జిల్లాకు చేరుకున్న వీరిని డీఈవో మాణిక్యంనాయుడు సత్కరించి అభినందించారని గైడ్స్ కాంటింజెంట్ లీడర్, జిల్లా ట్రైనింగ్ మిషనర్, పీడీ ఎ.కనకలక్ష్మి చెప్పారు. కవాతు, రంగోలి, క్యాంప్ క్రాఫ్ట్, స్టేజ్ గేట్, బ్యాండ్, కలర్ పార్టీ, పేజెంట్ షో, అడ్వెంచర్ కార్యకలాపాలు, ఫిజికల్ డిస్‌ప్లే, మేధో వికాసం విభాగాల్లో పాల్గొన్నారని, తొమ్మిది విభాగాల్లో గ్రేడ్‌లు వచ్చాయన్నారు.

డీఈవో మాణిక్యంనాయుడుతో విద్యార్థులు

ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

మృతుడు తలపై గాయాలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: బుక్కూరు గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్ అనుమానాస్పద మృతి కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విఠల్(45)కు కరుణతో మూడు నెలల కిందట వివాహమైంది. ఆమె శ్రీకాకుళంలోని పుట్టింటికి వెళ్లారు. సోమవారం రాత్రి విఠల్ ఒక గదిలో.. ఆయన తల్లిదండ్రులు వేరే గదిలో నిద్రించారు. మంగళవారం ఉదయం కుమారుడు విగత జీవిగా పడి ఉండడాన్ని గుర్తించినట్లు తండ్రి రామయ్య పోలీసులకు చెప్పారు. విషయం తెలియడంతో శ్రీకాకుళం నుంచి వచ్చిన భార్య.. మృతుడి తలపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విఠల్ పాలకొండ డిపోలో డ్రైవర్.

కుటుంబ సభ్యుడే హంతకుడా?

విఠల్‌కు మద్యం అలవాటు ఉంది. సోమవారం రాత్రి మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో ఘర్షణ జరిగినట్లు భోగట్టా. దీంతో కుటుంబ సభ్యుడే పదునైన ఆయుధంతో దాడిచేసినట్లు తెలుస్తోంది. తీవ్రగాయాలతో రక్తస్రావం కావడం గుర్తించి అనుమానంతో ఆయన భార్య పోలీసులను ఆశ్రయించారు. సీఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనుమానమున్న పలువురిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

వ్యాన్, లారీ ఢీ: ఒకరి దుర్మరణం

దత్తిరాజేరు: రెండు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మర్రివలస కూడలి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న బొలెరో వ్యాన్, లారీ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న డ్రైవరు, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా డ్రైవరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. మృతుని వద్ద చిరునామాకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఒడిశా రాష్ట్రం జయపురానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘటనా స్థలంలో నుజ్జయిన వ్యాన్

ఉద్యోగాల ఆశచూపి రూ.75 లక్షలు దోచేశారు..

పిఠాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాల ఆశచూపి యువత నుంచి ఏడాది కాలంలో రూ.75 లక్షలు కాజేశారు. తమకు అందిన ఫిర్యాదుతో దర్యాప్తు నిర్వహించి 8 మందిని అరెస్టు చేశామని ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ తెలిపారు. మంగళవారం పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులకు ఆయన వివరాలు వెల్లడించారు. కాకినాడ గ్రామీణం రాయుడుపాలేనికి చెందిన నాళం గంగాభవానీ గత నెల 24న ఓ గోడపత్రికపై ఉన్న నంబరుకు ఫోన్ చేయగా.. నెలకు రూ.35 వేల వరకు జీతం ఇచ్చే ఉద్యోగాలున్నాయని, ఇప్పిస్తామంటూ ఆమె నుంచి రూ.24 వేలు కాజేశారు. దాంతో ఆమె పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ దర్యాప్తు చేపట్టారు. ఇదే నంబరుకు ఫోన్ చేసి రూ.13 వేల చొప్పున ఇచ్చి తామూ మోసపోయామని కోటపల్లి సాయి, అతని స్నేహితులు పోలీసులకు చెప్పారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసింది. కాల్ డేటా ఆధారంగా కొందరు మోసగాళ్లను గుర్తించారు. రాజమహేంద్రవరం కేంద్రంగా 'ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. తమ దర్యాప్తులో రాజమహేంద్రవరంలో 8 మంది స్త్రీ, పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన దేశరి సౌజన్య ఉన్నారు. అరెస్టు చేసి, పిఠాపురం జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజరుగా ఆదిలక్ష్మి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: బెంగళూరులో ఈనెల 3 నుంచి ఏడో తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ నేషనల్ టోర్నమెంట్‌కు రాష్ట్ర జట్టుకు కోచ్, మేనేజరుగా విజయనగరం నగరపాలక సంస్థ కస్పా ఉన్నత పాఠశాల పీడీ పి.ఆదిలక్ష్మిని ఎంపిక చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయిని విశాలక్ష్మి, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

అయ్యన్నపేట: వాహనాలను సక్రమంగా నడుపుతూ.. ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చి.. భవిష్యత్తులో మంచి చోదకులుగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలలో హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. ఆందోళన పడకుండా ఏకాగ్రతతో వాహనాలను నడపాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణాధికారిణి జి.వరలక్ష్మి, డీఎం శ్రీనివాసరావు, శిక్షకుడు రాజు పాల్గొన్నారు.

చోదకులు, అధికారులతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

అమ్మా.. నాన్నా.. మీరాకే మాకు కానుక!

న్యూస్‌టుడే– కొత్తవలస, రాజాం

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సరికొత్త వేడుకకు సిద్ధమవుతున్నాయి. పాఠశాలల్లో పండగను తలపించేలా మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(మెగా పీటీఎం)3.0 డిసెంబరు 5న నిర్వహించాలని నిర్ణయించారు. పిల్లలు సృజనాత్మకతతో తీర్చిదిద్దిన ఆహ్వాన ప్రతులను తల్లిదండ్రులకు అందించి వేడుకకు ఆహ్వానించనున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫాంలో పాఠశాల తరపున ఆహ్వానాలు పంపుతున్నారు. 1.50 లక్షల మంది తల్లిదండ్రులు, మరో 50వేల మంది అతిథులు ఇందులో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు.

ఇవీ ప్రయోజనాలు..

- ప్రభుత్వ పాఠశాలల్లో సుహృద్భావ వాతావరణం ఏర్పాటు
- దాతల సాయంతో బడుల అభివృద్ధి
- పిల్లల చదువు, నైపుణ్యాలు, ఇష్టాలు గుర్తింపు
- నడవడిక అంచనా
- భవిష్యత్తు అవకాశాలపై అవగాహన
- పిల్లలు సన్మార్గంలో నడిచేలా దిశానిర్దేశం

ఇదీ పరిస్థితి..

- ప్రాథమిక పాఠశాలలు:1452, ప్రాథమికోన్నత పాఠశాలలు:319, ఉన్నత పాఠశాలలు: 464,
- కళాశాలలు: 67,
- విద్యార్థుల సంఖ్య: 2,24,051

క్రీడా పోటీలు... ఈ కార్యక్రమం ఉదయం 9గంటలకు మొదలై 12.45కు ముగిసేలా షెడ్యూలు ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చిస్తారు. బడులను అందంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు ప్రగతి నివేదికలు, ఆరోగ్యకార్డులు ఇస్తారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.



సమావేశం ఎలా నిర్వహించాలో తెలియజేస్తూ ప్రభుత్వం రూపొందించిన గోడపత్రిక

5న విద్యాలయాల్లో ఎంపీటీఎం సమావేశాలు

మార్గదర్శకాలిలా

విద్యార్థులంతా యూనిఫాం, బెల్ట్, సాక్సులు, బూట్లు విధిగా ధరించి హాజరుకావాలి. ప్రధానోపాధ్యాయులు సమకూర్చిన కార్డులు, పెయింట్లు, కలర్ పెన్సిల్, స్కెచ్‌పెన్నులతో విద్యార్థులు నమూనా ఆహ్వాన ప్రతులు తయారుచేస్తారు. తల్లిదండ్రుల్ని విద్యార్థులే ఆహ్వానించాలి. గుర్తించిన దాతలు, విద్యాంజలి వాలంటీర్లు, పూర్వ విద్యార్థులకు ఎస్ఎంసీ సభ్యులు ప్రతులను అందిస్తారు. నిర్వహణ ఖర్చులు స్కూల్ కాంపోజిట్ గ్రాంట్, మెగా పీటీఎం 3.0 కోసం ప్రత్యేకంగా విడుదల చేసే బడ్జెట్‌ను వినియోగించాలి.

పక్కాగా ఏర్పాట్లు.. మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను 5న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతుంది. ప్రతిభను ప్రోత్సహించేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు, ఉత్తీర్ణతను పెంచేందుకు ఈ సమావేశాలు దోహదపడతాయి.
–యు.మాణిక్యంనాయుడు, డీఈవో

EENADU Classifieds

HEALTH & CARE

గుండెపోటు, కేన్సర్ తస్మాత్ జాగ్రత్త
డాక్టర్ రెడ్డి
టోటల్ బాడీ చెకప్ సెంటర్
కలక్టర్ ఆఫీస్ జంక్షన్, కోస్టల్ బేటరీ రోడ్డు, కెనరా బ్యాంక్ ప్రక్కనఉన్న LUCID బిల్డింగ్, 4వ అంతస్తు, విశాఖపట్నం
శరీరంలో సైలంట్‌గా దాగిఉన్న గుండెపోటును మరియు కేన్సర్‌ను 6 నెలల ముందుగానే గుర్తించే టోటల్ బాడీ చెకప్
రూ. 7,500/- విలువచేయు పరీక్షలు కేవలం 3,500/- కే
ప్రముఖ హృద్రోగ నిపుణులు, చికిత్సరత్న డా॥ జి. శివప్రసాద్‌రెడ్డి గారి పర్యవేక్షణలో చేయబడును.
9393752255
9393122525
ఈ పథకం 10 రోజులు మాత్రమే
ప్రతీ ఆదివారం శెలవు

PROFESSIONAL SERVICES

ASTROLOGY
Vastu Consultants Genuine India's Best Vastu for Industries / Houses Rural / Urban Ph:9676119507, 9014285369.

REAL ESTATE

FLAT FOR SALE
2BHK Flat 2nd Floor at UDA Colony, Paul Nagar, 7th Lane, Near Muchalamma Gudi, Vizianagaram. Contact: 9778527106.

PLOT FOR SALE
శ్రీ శ్రీనివాస రిసార్ట్స్ మరుపల్లి, గజపతినగరంలో 1000 గ॥, 500 గ॥, 200 గ॥ అమ్మకమునకు కలవు. గజం 4000/- ✆ 8179213275.

JOBS

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్‌లీడర్స్ M/F (200) కావలెను. జీ॥ 18-40K + Inc. ✆ 9804454445, 9989360902.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Salary:15,000/-. Online Available. 9704146558.

ప్రముఖ కంపెనీ VZM బ్రాంచ్‌లో పనిచేయుటకు * మార్కెటింగ్ టెలికాలర్స్ స్త్రీ/పు * బ్రాంచ్ ఇన్‌ఛార్జ్‌స్ కావలెను. వసతి + భోజనం + మంచి జీతం & ఇన్సెంటివ్ కలదు. 9896939399.

FACULTY/ TEACHERS
VZM జిల్లాలో మండలాల వారీగా కొత్తగా ప్రారంభిస్తున్న The ABC Bridge ప్లేస్కూల్‌లో పనిచేయుటకు B.Ed, ట్రైన్‌చేసిన యువతులు కావలెను ✆ 8639457893.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
I, undersigned KOTTURU SAMBAMMURTY SANYASI RAJU (Old Name) S/o Kotturu Ramakrishna, Plot No: 48, Kusuma Gajapathi Nagar, Cantonment, Vizianagaram-535003, Andhra Pradesh, changing my name from KOTTURU SAMBAMMURTY SANYASI RAJU to KOTTURU SAMBAMURTHY SANYASI RAJU (New Name), shall henceforth be called KOTTURU SAMBAMURTHY SANYASI RAJU (New Name) for all purposes.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? రాజాం పట్టణం పరిధి డోలపేట చెక్ పోస్టు వద్ద ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు వేస్తున్నారు. ఇబ్బంది పడుతున్నాం. - **స్థానికులు** ★ వ్యర్థాలు తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

? రామభద్రపురం- ఇట్లామామిడిపల్లి రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగాయి. రోడ్డు కనిపించడంలేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. - **యువత** ★ తుప్పలు తొలగింపజేస్తాం. - **త్రినాథరావు, ఏఈవో** – న్యూస్‌టుడే, రామభద్రపురం

? మదనాపురం జాతీయ రహదారిలో చెట్టు ఎండిపోయి, కూలేందుకు సిద్ధంగా ఉంది. రాకపోకలు సమయంలో భయంగా ఉంది. - **ప్రయాణికులు** ★ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **రమణమూర్తి, ఎంపీడీవో, గంట్యాడ** – గంట్యాడ గ్రామీణం

? పెదమానాపురం గ్రామంలోని యాతవీధి వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. అవస్థలు పడుతున్నాం. - **స్థానికులు** ★ సమస్యను పరిష్కరిస్తాం. - **సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

వ్యర్థాల సమస్య తీరింది

రాజాం పట్టణం, న్యూస్‌టుడే: పొనుగుటివలస వార్డు సచివాలయ పరిధి విద్యానగర్‌లో మురుగునీరు, వ్యర్థాలు నిల్వ ఉండి, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యాల బారినపడతామేమోనని భయపడుతున్నారు. దీనిపై నవంబరు 29న 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించి, క్లోరినేషన్ చేయించారు.

రక్షణ కల్పించారు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం: సిరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో రక్షణగోడ లేక పశువులు, విషసర్పాలు లోపలికి వచ్చేవి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. దీనిపై వార్త ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. రక్షణగోడ నిర్మాణం పూర్తి చేశారు. ఇక్కట్లు తొలగించారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలని వినతి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బేబినాయన సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. తెర్లాం మండలం లోచర్ల, బొబ్బిలి మండలం శివడవలస వద్ద తోటపల్లి కాలువపై ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరానని, సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ధ్యానంతో వ్యక్తిత్వ వికాసం

గరివిడి: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

గరివిడి, న్యూస్‌టుడే: ధ్యానంతో ఏకాగ్రత పెరిగి మానసిక, శారీరక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం మెరుగవుతుందని విజయనగరం బ్రహ్మకుమారీ కేంద్రం రాజయోగి బీకే సుబ్బారెడ్డి అన్నారు. గరివిడిలో అవంతీస్ సెయింట్ థెరెసా కళాశాలలో మంగళవారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ★ **చీపురుపల్లి:** బాలికల కళాశాల వసతి గృహంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు తదితరులు మాట్లాడారు.

వైకల్యాన్ని ఓడించి.. విజయాలు సాధించి

న్యూస్‌టుడే- బొబ్బిలి గ్రామీణం, తెర్లాం, రాజాం

అంగవైకల్యం అడ్డంకిగా భావించలేదు.. అవకాశంగా మలుచుకుని ముందుకుసాగుతున్నారు.. అన్నీ సక్రమంగా ఉన్నవారికి మేమేం తక్కువ కాదని నిరూపిస్తున్నారు.. కళలు, ఆటలు, చదువులో రాణిస్తున్నారు.. కొలువులు సాధించి, కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. **నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం** సందర్భంగా కొంతమంది గురించి తెలుసుకుందాం.

జీఎస్టీ హవల్దార్‌గా నారాయణరావు..

బొబ్బిలి మండలం వెలగవలసకు చెందిన రెడ్డి నారాయణరావు చిన్నప్పుడే పోలియో బారిన పడ్డారు. ఎడమ కాలు పనిచేయడంలేదు. తల్లిదండ్రులు సింహాచలం, లక్ష్మి కొన్నాళ్లు బాధపడ్డారు. తండ్రి చేయి అందించి నడక నేర్పించారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని నారాయణరావు పరుగు ప్రారంభించాడు. డిగ్రీ చదువుతూ విజయనగరం విజ్జీ మైదానంలో సాధన చేశాడు. అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ పోటీల్లో 200 మీటర్ల పరుగులో బంగారు, 100 మీటర్ల పరుగులో రజత పతకం సాధించాడు. ఇటీవల క్రీడా కోటాలో జీఎస్టీ హవల్దార్‌గా ఉద్యోగం పొందాడు.

చిన్నతనంలో చూపు పోయినా..

బొబ్బిలి మండలం సీతయ్యపేటకు చెందిన మూడడ్ల శంకరరావుకు చిన్నతనంలోనే కళ్లకు వైరస్ సోకింది. ఆరు నెలల వయసులో చూపు పోయింది. తల్లిదండ్రులు స్వామినాయుడు, లక్ష్మి కుంగిపోయారు. వ్యవసాయ కుటుంబం కావడంతో పొలానికి వెళ్లనిదే గడవడం కష్టం. తండ్రి పనులకు వెళ్తే.. తల్లి ఇంటివద్దే ఉండి చూసుకునేది. కొంత వయసు వచ్చాక బొబ్బిలి మండలం మెట్టవలస సమీపంలోని అంధుల పాఠశాలలో చేర్పించారు. బ్రెయిలీ లిపి నేర్చుకోవడానికి మొదట్లో ఇబ్బంది పడినా.. నెమ్మదిగా పట్టుసాధించాడు. డిగ్రీ పూర్తిచేసి, ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో కొలువు సాధించాడు. అసిస్టెంట్ మేనేజర్‌గా ప్రస్తుతం విశాఖలో పనిచేస్తున్నాడు.

సంకల్పించి.. సాధించి

బాడంగి మండలం పూడివలస గ్రామానికి చెందిన మురళీకృష్ణ చిన్నప్పుడు క్రికెట్ ఆడుతుండగా కంటికి కర్ర గుచ్చుకుని ఒక కన్ను పోయింది. తల్లిదండ్రులు పోలయ్య, అప్పమ్మ కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయిదు నుంచి పదోతరగతి వరకు ఏషియన్ ఎయిడ్ అంధుల పాఠశాలలో చదివాడు. ఇంటర్, డిగ్రీ బొబ్బిలిలో పూర్తిచేసి, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని, రైల్వేశాఖలో క్లర్క్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం చీపురుపల్లిలో పనిచేస్తున్నాడు.

ఇంటి బాధ్యతలు తీసుకుని..

రాజాం మండలం కొత్తకంచరాం గ్రామానికి చెందిన ముచ్చర్ల రామినాయుడుకు పుట్టుకతోనే వినికిడిలోపం. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. పిడుగురాళ్లలో డిగ్రీలో చేరేందుకు సన్నద్ధమవుతుండగా.. ఇంటి బాధ్యతలు నెత్తిన పడ్డాయి. పొలం పనులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తండ్రి స్వామినాయుడు పక్షవాతంతో మంచాన పడడంతో రామినాయుడు ఇంటి బాధ్యతలను తలకెత్తుకున్నాడు. ఇంటర్‌లో వృత్తి విద్యలో నేర్చుకున్న ఎలక్ట్రీషియన్ కోర్సును వృత్తిగా మలుచుకున్నాడు. ఇతను కుంచెపడితే అద్భుత చిత్రాలు రూపుదిద్దుకుంటాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పారా ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో 2021 నుంచి వరుసగా నాలుగేళ్లు చిత్రలేఖనంలో ప్రథమ స్థానంలో నిలిచి, ప్రతిభ చాటాడు.



ఎన్జీజీవో యూనిట్లకు ఎన్నికలు

చీపురుపల్లి గ్రామీణం, గజపతినగరం, తెర్లాం, బొబ్బిలి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీజీవో తాలూకా యూనిట్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ★ చీపురుపల్లి, తెర్లాం యూనిట్లకు ఈనెల 8న నామినేషన్లు, ఈనెల 15న ఎన్నిక ఉంటుందని ఎన్నికల అధికారులు దుర్గారావు, జి.సూర్యనారాయణ తెలిపారు. ★ బొబ్బిలి యూనిట్‌కు 12న నామినేషన్లు, ఈనెల 19న ఎన్నిక.. గజపతినగరం తాలూకాకు 5న నామినేషన్లు, 12న ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తామని రామారావు, జె.విక్టర్ పేర్కొన్నారు.

ఆటో చోదకులకు అవగాహన

రాజాం, న్యూస్‌టుడే: ఆటోలు నడిపే సమయంలో చోదకులు తమ కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. మంగళవారం రాజాంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో చోదకుల కుటుంబ ఫొటోను ఉంచుకోవాలన్నారు. ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందన్న జాగ్రత్తతో ప్రమాదాలను తగ్గించుకు అస్కారం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సీఐ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అనుమతులివ్వండి

గరివిడి, న్యూస్‌టుడే: కొండపాలెం (గరివిడి) మేజరు పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు విశ్వభారత్ సేవా ట్రస్టు సహకారంతో గరివిడి రీ యూనియన్ ముందుకొచ్చింది. దీనికి అనుమతులు ఇవ్వాలని సర్పంచి పి.ప్రమీల, ఈవో నాగమణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటిక, రోడ్ల నిర్మాణం కోసం రూ.15 లక్షలు వెచ్చించనున్నట్లు స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.జగన్నాథరాజు తెలిపారు. పంచాయతీ అనుమతులు ఇచ్చి సహకరించాలని కోరారు. హరి గంగాధర్, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల జాబితా సిద్ధం చేయాలి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలకు ఏజెంట్లను నియమించుకుని, రెండు రోజుల్లో జాబితా అందజేయాలని ఎన్నికల డీటీ గౌరీశంకరరావు నాయకులను కోరారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతమున్న పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని, శిథిల భవనాల్లోని కేంద్రాలను ఏకాభిప్రాయంతో అక్కడే అందుబాటులో ఉన్న నూతన భవనంలోకి మార్చాలన్నారు.

ఉపన్యసించి.. పతకం పొందారు

బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చారు. కె.భువనేశ్వరి (9వ తరగతి), జి.గౌతమి (7వ తరగతి), భార్గవిలత (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం లక్ష్మణదొర, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, డి.రమేష్ విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

ఇదేం చెత్త నిర్వహణ?

రాజాం పట్టణ పరిధి పొనుగుటివలసలో రాజాం- సంతకవిటి ప్రధాన రహదారి పక్కన చెత్త పోగులు వేస్తున్నారు. చెత్త బిన్ ఉన్నప్పటికీ అందులో వేయకుండా పక్కన విసిరేస్తున్నారు. దోమల బెడద ఎక్కువవుతోందని, దుర్వాసన భరించలేకపోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రత వల్ల రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

మత్తుతో జీవితాలు చిత్తు

బాడంగి, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు అన్నారు. మంగళవారం బాడంగి మండలం పిన్నవలసలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడుల గురించి వివరించారు. ఎస్సై తారకేశ్వరరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

రామభద్రపురం, న్యూస్‌టుడే: బకాయి వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండు చేశారు. మంగళవారం రామభద్రపురంలో సీఐటీయూ నాయకుడు బలస శ్రీను ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈనెల 16న బకాయి వేతనాలు చెల్లిస్తామని పంచాయతీ ఈవో సూరిబాబు చెప్పారు.

కౌశల్ ప్రతిభా పరీక్షకు ఎంపిక

గరివిడి, న్యూస్‌టుడే: భారతీయ విజ్ఞాన మండలి నిర్వహించే రాష్ట్ర స్థాయి కౌశల్ (సైన్స్, గణితం ప్రతిభ పరీక్ష) టెస్ట్ 2025కు గరివిడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్ సూర్యప్రకాష్, ఎల్.నిత్యసారధి ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.నిర్మల తెలిపారు. ఈ నెల 27న తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని చెప్పారు.

రాష్ట్రస్థాయి రగ్బీలో సత్తా

గజపతినగరం, న్యూస్‌టుడే: మధుపాడకు చెందిన సాయిగౌతమి పాఠశాల విద్యార్థులు రగ్బీ క్రీడలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్ఎస్ నాయుడు తెలిపారు. అండర్- 17 బాలుర విభాగంలో బి.సాయికుమార్, బాలికల విభాగంలో పి.కావ్య, ఎస్.జాహ్నవి, ఒ.శ్రీవిద్య ఎంపికయ్యారన్నారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై జ్ఞానప్రసాద్ అన్నారు. మంగళవారం బొబ్బిలి పట్టణంలోని పలుచోట్ల సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. పత్రాలు సక్రమంగా లేనివారికి అపరాధ రుసుము విధించారు. ఒకరి నిర్లక్ష్యం మరొకరి కుటుంబంలో చీకటి నింపకూడదని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండలంలో గొట్లాం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌కి చెందిన ఉపాధ్యాయుడు జామి రవికుమార్ దంపతులు 50 కుటుంబాలకు నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు విలువైన వస్తువులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కోరాడ ప్రకాష్, చంద్రపాల్, పి.సతీష్, టి.రోహిత్ పాల్గొన్నారు.

ప్రసంగం.. బహుమతులు సొంతం

గజపతినగరం మండలం మరుపల్లి కస్తూర్బా పాఠశాలలో మంగళవారం ''ఈనాడు'' ఆధ్వర్యంలో ''ప్రతిభా పాటవ పోటీలు'' జరిగాయి. 'విద్యార్థుల జీవితంపై సెల్‌ఫోన్ ప్రభావం'' అనే అంశంపై జరిగిన ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపారు. పదో తరగతికి చెందిన పి.అలేఖ్య, పి.కళ్యాణి, జి.గౌతమిశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రత్యేకాధికారి ఆర్.హైమ, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

మురుగు.. వేసేదెలా అడుగు

గుర్ల మండలం కొండగండ్రేడులో ప్రధాన రహదారికి కాలువలు లేక మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. దీని మీదుగా గేదెలపేట, మునకాలపేట, ముద్దాడపేట, గజపతినగరం మండలం కొత్తవలస, రంగుపురం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్లుగా ఇదే దుస్థితి. వాహన చోదకులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని వాపోతున్నారు. విషయం ఎంపీడీవో రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గుర్ల

మొక్కలను సంరక్షించాలి

రాజాం, న్యూస్‌టుడే: మొక్కలు నాటి, సంరక్షిస్తేనే పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు వీలవుతుందని పురపాలిక కమిషనర్ ఎ.రామచంద్రరావు అన్నారు. మంగళవారం రాజాం విద్యానికేతన్ పాఠశాలలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవంలో మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని, బహిరంగ ప్రదేశాలను వనాలుగా తీర్చిదిద్దాలని, పాలిథిన్ సంచుల వినియోగం ఆపాలని సూచించారు. విజయకోదండ రామాశ్రమం అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి, కరస్పాండెంట్ గట్టి పాపారావు, డైరెక్టర్ గట్టి పద్మావతి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రహదారులపై పశువులతో ప్రమాదాలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలో రహదారులపై తీవ్రంగా ఉన్న పశువుల సమస్యకు చెక్‌పెట్టేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. మంగళవారం పురపాలిక కార్యాలయంలో కమిషనర్ రామచంద్రరావు, సీఐ కె.అశోక్‌కుమార్ పశువుల యజమానులతో సమావేశం నిర్వహించారు. పశువులు రోడ్డుపై తిష్ఠ వేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల పలువురు తీవ్రంగా గాయపడ్డారని, రహదారులపైకి వదలకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. మూడు రోజుల్లో స్పందించకపోతే సింహాచలం దేవస్థానం గోశాలకు తరలిస్తామన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్రనాథ్ అన్నారు. మంగళవారం బొబ్బిలిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మువ్వల శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీని బలపర్చాల్సిన అవసరముందన్నారు. కార్యకర్తలు, నాయకులు మరింతగా కష్టపడి పనిచేయాలన్నారు. జిల్లా నాయకులు మరిపి విద్యాసాగర్, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల పరిశీలన

ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆరా తీస్తున్న డీఎస్పీ

చీపురుపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు సూచించారు. పట్టణంలోని పలు వసతి గృహాలను సీఐ శంకరరావు, ఎస్సై దామోదరరావుతో కలిసి పరిశీలించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలతో తలెత్తే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి గురించి ఆరా తీశారు. వసతి గృహ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేసేదెన్నడో?

రాజాం మండలం గడ్డిముడిదాం శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణాలు స్తంభాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం శ్మశానవాటిక పనికిరాని మొక్కలతో నిండి ఉంది. వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఎవరైనా మృతిచెందితే బంధువులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విషయం ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా.. కార్యదర్శితో మాట్లాడి, పనులు జరిగేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వంగర, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలు అందించాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు సిబ్బందితో అన్నారు. మంగళవారం వంగర పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు దస్త్రాలను పరిశీలించారు. ఎస్పీ ఆదేశాలతో ప్రతి మంగళవారం వంగరలో, బుధవారం రేగిడిలో, శుక్రవారం సంతకవిటిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తాను అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించాలన్నారు. అనంతరం సచివాలయాల మహిళా పోలీసులతో మాట్లాడారు.

చదువుతోనే ఉన్నతి

రామభద్రపురం: విద్యార్థులంతా ఏ గ్రేడ్‌లో నిలవాలని ఎంఈవో తిరుమల ప్రసాద్ అన్నారు. మంగళవారం నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. దస్త్రాలను తనిఖీ చేశారు. అనంతరం పిల్లలతో మాట్లాడారు. చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ నెల 5న నిర్వహించనున్న సమావేశానికి తప్పనిసరిగా తల్లిదండ్రులను తీసుకురావాలన్నారు. హెచ్ఎం రెడ్డి వేణు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాలిథిన్ నిర్మూలనతో మేలు

జగన్నాథపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలిలోని వాసు, శివిద్య జూనియర్, ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జగన్నాథపురం, గున్నతోటవలస, కొత్తపెంట గ్రామాల్లో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలంతా ముందుకు రావాలని జగన్నాథపురంలో ర్యాలీ నిర్వహించారు. గున్నతోటవలస పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. ప్రోగ్రాం అధికారులు సీతారాం, సాయిరాం, శివకృష్ణ పాల్గొన్నారు.

ప్రజలతో గౌరవప్రదంగా మెలగాలి

తెర్లాం: సచివాలయాలకు పనులపై వచ్చే ప్రజలతో సిబ్బంది గౌరవభావంతో మెలగాలని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్, ఎంపీడీవో రేగిరాంబాబు అన్నారు. మంగళవారం తెర్లాం తహసీల్దారు కార్యాలయంలో సచివాలయాల డీఏలు, వెల్ఫేర్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. విధులకు సకాలంలో హాజరుకావాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

రామభద్రపురం: ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థి కోరాడ నిఖిల్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని పీడీ బొత్స రత్నకిషోర్ తెలిపారు. ఇటీవల కడప జిల్లాలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చూపాడన్నారు. మంగళవారం హెచ్ఎం గుళ్లిపల్లి కృష్ణవేణి తదితరులు అభినందించారు.

సహాయనిధి అందజేత

బాడంగి: సీఎం సహాయనిధితో పేదలకు మేలని బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన మరిపి దినేష్‌కు రూ.35 వేలు మంజూరైంది. సంబంధిత మంజూరు పత్రాన్ని మంగళవారం అందించారు. నాయకులు భాస్కరరావు, తెంటు రవిబాబు పాల్గొన్నారు.

గోకులం.. బిల్లులకు ఇంకెంతకాలం?

న్యూస్‌టుడే- రేగిడి

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పాడి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా మినీ గోకులాలు మంజూరు చేసింది. మొత్తం వ్యయంలో 90 శాతం నిధులు ప్రభుత్వమే భరిస్తుందని, 10 శాతం లబ్ధిదారు వాటాగా పెట్టుకోవాలని చెప్పారు. ఉపాధిహామీ నిధులతో మొదటి విడత 2024- 25లో మంజూరు చేసిన గోకులాలకు చాలావరకు నేటికీ బిల్లులు అందలేదు. దీంతో రెండో విడత మంజూరు చేస్తున్నా.. నిర్మాణాలు చేపట్టడంలేదు.

రేగిడి: పనసలవలసలో బిల్లు అందని గోకులం

నియోజకవర్గంలో ఇదీ ప్రగతి..

మండలం	మంజూరు 2024-25	మంజూరు 2025-26	పూర్తయినవి	బిల్లులు అందనివి
రేగిడి	0	71	13	5
సంతకవిటి	12	68	6	4
వంగర	16	54	10	2
రాజాం	30	36	11	3

ముందుకురావడంలేదు..

రెండు పశువులకు గోశాల నిర్మాణానికి రూ.1.15 లక్షలు, నాలుగు జీవులకు రూ.1.35 లక్షలు, ఆరింటికి రూ.2 లక్షలు అని ప్రకటించారు. దీనిలో లబ్ధిదారుడి వాటా 10 శాతం అన్నారు. మిగతాది ప్రభుత్వం భరిస్తుంది. రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు రెండు విడతల్లో కలిపి 268 గోకులాలు మంజూరు చేశారు. ఇంతవరకు పూర్తయినవి కేవలం 40 మాత్రమే. మరో 25 నుంచి 30 వరకు వివిధ దశల్లో ఉన్నాయని చెబుతున్నారు. మిగతావారు ముందుకు రావడంలేదని సమాచారం. ముందుగా పెట్టుబడి పెడితే బిల్లులు రావనే భయంతో వెనుకడుగు వేస్తున్నారు.

రైతులు నిర్మాణాలు చేపట్టాలి..

నిర్మాణాలు పూర్తయిన వాటికి బిల్లులు పెట్టాం. లబ్ధిదారులు వ్యక్తిగత ఖాతాలకు నగదు జమచేస్తారు. మార్చి లోపల నిర్మించిన వారికి బిల్లులు సకాలంలో జమయ్యాయి. మిగతావారికి త్వరలో పడతాయి. ఎలాంటి ఇబ్బంది ఉండదు. గోశాలలు మంజూరైన రైతులు సకాలంలో నిర్మించుకోవడానికి ముందుకురావాలి.

– చంద్రకుమారి, ఏపీడీ, రాజాం

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

న్యాయ పరిరక్షణ కొరకు నిరంతరం శ్రమిస్తున్న గౌరవ న్యాయమూర్తులకు, సహ న్యాయవాదులకు, న్యాయ సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు అంతర్జాతీయ న్యాయదినోత్సవ శుభాకాంక్షలు...

CH. వేణుగోపాలరావు B.Com, B.L, న్యాయవాది, జి.అగ్రహారం చీపురుపల్లి సెల్: 7989225018

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

న్యాయవాద వృత్తిలో ఎంతో మంది సంఘ విద్రోహక శక్తులకు శిక్ష పడేటట్లు చేసి, అభాగ్యులకు న్యాయం చేసి ప్రజాసేవలో అంకితం అవుతున్న న్యాయవాదులకు రాజాం సబ్‌కోర్టు మా న్యాయవాద మిత్రులకు, అందరికి

న్యాయవాదుల దినోత్సవ శుభాకాంక్షలు

అల్లెన సత్యన్నారాయణ, M.Com, B.L న్యాయవాది, తాలాడ, రాజాం Cell: 9949176936

ప్రపంచ వికలాంగుల దినోత్సవం

15-8-1998లో జిల్లా ఉత్తమ అధికారి అవార్డు స్వీకరిస్తున్న శ్రీ అడపా కూర్మదాసు గారు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వికలాంగులకు "చేయూత" పథకం ద్వారా అప్పటి జిల్లా కలెక్టరు వారి ఉత్తర్వులతో అనేక ప్రయోజనాలు కల్పించగా సదరు చేయూత పథకం అప్పటి ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి విజయనగరం క్యాంపునకు వచ్చు సందర్భంలో శ్రీమతి పూనం మాలకొండయ్య గారు I.A.S., కలెక్టర్ వారు ముఖ్యమంత్రివర్యులకు విశదీకరించగా, సదరు పథకం మెచ్చి, అన్ని జిల్లాలలో అమలు పరచుటకు ఆదేశములిచ్చి, విజయనగరం జిల్లాలో అంధులకు, బధిరులకు చెరో ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేస్తూ నా స్వ జిల్లాలోనే ప్రభుత్వం ఉత్తమ అధికారిగా మంత్రివర్యులు చేతులమీదుగా తే. 15-8-1998 సం.న ప్రశంసా పత్రం అందించుట నా జీవితంలో మరపురాని సుమధుర ఘట్టం.

అడపా కూర్మదాసు - స్వర్గీయ రమణమ్మ (2003, విశ్రాంత వికలాంగుల జిల్లా సంక్షేమశాఖాధికారి/ జిల్లా మేనేజర్) (దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ/ సంస్థ) బొబ్బిలి, Cell: 9441878010



(c) eenadu

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

ప్రతిభ కనబర్చి.. విజేతలుగా నిలిచి..

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరంలోని న్యూసెంట్రల్ పాఠశాలలో మంగళవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'విద్యార్థుల జీవితాల్లో 'సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పలువురు ప్రతిభ కనబర్చారు. డి.ఎస్.ఎస్. సరిత్ (తొమ్మిదో తరగతి), ఎం.లాలస (తొమ్మిదో తరగతి), ఎ.యోషిత్ ప్రియ (తొమ్మిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. కరస్పాండెంట్ రవితేజ, ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు, కె.సాయి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

దరఖాస్తులు పెరిగేలా చూడండి



30వ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనరు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ప్రణాళిక అధికారులను నగర పాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎల్పీజీలతో సమావేశమయ్యారు. దరఖాస్తులు పెరిగేలా చూడాలన్నారు. ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, టీపీఎస్ అనిత పాల్గొన్నారు. ● అనుమతిలేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దన్నారు. 30వ నంబరు సచివాలయాన్ని కమిషనరు ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రకాశం పార్కు వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

తెరపై ఈనాడు

★ ఎస్వీసీ : ఆంధ్రాకింగ్ తాలూకా ★ శ్రీకృష్ణ : రాజు వెడ్స్ రాంబాయి ★ అదితి : జనతా బార్ ★ లీలామహల్ : రివాల్వర్ రీటా ★ రంజనీ స్క్రీన్– 1 ఆంధ్రాకింగ్ తాలూకా ★ శివరంజనీ స్క్రీన్–2 : రివాల్వర్ రీటా ★ హిమగిరి : 12ఎ రైల్వే కాలనీ ★ సప్తగిరి : మఫ్టీ పోలీస్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

స్త్రీనిధి.. భవితకు పెన్నిధి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీనిధి ఆలంబనగా నిలుస్తోంది. రుణాలు 98 శాతం మంది తిరిగి చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఎక్కువ రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి. గతంలో ఒక సభ్యురాలికి రూ.75వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.లక్ష వరకు పెంచారు. యూనిట్ల ఏర్పాటుకు పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద రూ.20లక్షల వరకు ఇస్తున్నారు. నియోజకవర్గంలో 2025-26 ఏడాదికి 4,799 మందికి రూ.47.98 కోట్లు రుణాలిచ్చేందుకు లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 3,522 మందికి రూ.33.36కోట్లు అందించారు.

మహిళా సంఘం సభ్యులు

రుణాల లక్ష్యం, మంజూరు ఇలా

మండలం	సభ్యులు	రుణ లక్ష్యం (రూ.కోట్లలో)	తీసుకున్నవారు	మంజూరు (రూ.కోట్లలో)
జామి	1034	10.34	853	8.1
కొత్తవలస	1175	11.75	964	9.14
ఎల్.కోట	979	9.79	706	6.46
ఎస్.కోట	974	9.73	548	5.33
వేపాడ	637	6.37	451	4.33

అదనపు రుసుము లేదు..

స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలకు బ్యాంకులు డాక్యుమెంటేషన్, ప్రాసెసింగ్, ఆలస్య రుసుములు, దరఖాస్తు ఖర్చులు వసూలు చేయరు. సభ్యురాలు రూ.10 వేలు రుణం తీసుకుంటే 12 నెలల్లో, రూ.25వేలు 24 నెలల్లోనూ, రూ.50వేలు 24 నెలల్లోనూ, రూ.లక్ష 36 నెలల్లో చెల్లించాలి. గడువు ముందే చెల్లిస్తే 48 గంటల్లో రెన్యువల్ చేస్తారు.

డిజిటల్ యాప్ సౌకర్యం..

ఈ రుణాలకు సంబంధించి కొత్తగా డిజిటల్ యాప్ తీసుకొచ్చారు. తీసుకున్న రుణం, చెల్లించింది, బకాయి తదితర వివరాలు తెలుసుకోవచ్చు. బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేదు. అవకతవకలకు ఆస్కారం ఉండదు. సభ్యులు క్యూఆర్ కోడ్, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు.

లక్ష్యం చేరువలో..

చాలా వరకు లక్ష్యాలకు చేరువయ్యాం. జనవరి నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. డిజిటల్ పేమెంట్ యాప్‌తో ఎప్పటికప్పుడు వివరాలు తెలుస్తున్నాయి.

–వై.చిట్టిబాబు, ఏజీఎం, స్త్రీనిధి, విజయనగరం.

రైల్వేలో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలి

మయూరి కూడలి: రైల్వేలో చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని ఆలిండియా రైల్వే లోకో పైలెట్ స్టాఫ్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం విజయనగరంలో లోకో పైలెట్లు చేపడుతున్న 48 గంటల నిరవధిక సమ్మెకు సీఐటీయూ నాయకులు రమణ, గౌరినాయుడు, జగన్‌మోహన్‌రావు మద్దతు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	-80089 02900
విజయనగరం గ్రామీణం	-80085 74317
ఎస్.కోట	-80085 74326
భోగాపురం	-70959 54646

?: సబ్బవరం రోడ్డులోని శివాజీనగర్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. - కె.చంద్రశేఖర్ ❖ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. - ఎంఎస్ఎల్ఎస్ ప్రసాద్, శానిటరీ మేస్త్రీ, - న్యూస్‌టుడే, కొత్తవలస

?: అరకుగెడ్డ వేపచెట్టు, అవనాపువీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇబ్బంది పడుతున్నాం - స్థానికులు ❖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అదుపు చేస్తాం - పి.నల్లనయ్య, కమిషనరు – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

?: వైఎస్సార్ నగర్ ప్రధాన దారిలో వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికులు ❖ అక్కడ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - ప్రసంతి, ఏఈ, నగర పాలక సంస్థ -న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

సఖి సేవలు వినియోగించుకోవాలి

అయ్యన్నపేట: మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన సఖి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ శక్తి సమన్వయకర్త సుజాత సూచించారు. మంగళవారం జొన్నగుడ్డిలో అవగాహన కల్పించారు. ఇబ్బందులుంటే 181 నంబరును సంప్రదించాలన్నారు.

కుంగిన కల్వర్టు.. ప్రజలకు ఇక్కట్లు

ఎల్.కోట మండలంలోని కల్లంపూడి గ్రామంలో ప్రధాన రహదారిలో మురుగు కాలువపై కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఏళ్ల నాటిది కావడంతో పాడైంది. పలకలు విరిగిపోయి ఇనుప ఊచలు బయటకు తేలిపోయాయి. వాహనదారులు, పాదచారులు రాత్రుళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు చేస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

గుంతల్లో పడుతున్నా పట్టించుకోరా?

డెంకాడ మండలంలోని పెదతాడివాడ కూడలి నుంచి గుండాలపేట వెళ్లే మార్గంలో రహదారి పాడై మరమ్మతులకు గురైంది. పలుచోట్ల పెద్ద గుంతలు ఏర్పడడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో భవానీ వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ.

ఇలాగైతే రాకపోకలెలా..?

నగరంలో పలు రహదారులపై కల్వర్టులు శిథిలమై, పలకలు లేకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. అయ్యన్నపేట గాయత్రినగర్ దారిలో రోడ్డు పాడైంది. కల్వర్టుపై పలకలు ఊడిపోయాయి. భారీ వాహనాల రాకపోకల వల్ల దారుణంగా మారాయి. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

మట్టిదారులకు మోక్షం కలిగేనా.!

నగరంలో నేటికీ పలుచోట్ల మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా శివారు కాలనీలు, విలీన పంచాయతీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వర్షాలు పడితే బురదతో రాకపోకలు చేయలేకపోతున్నారు. సకాలంలో పన్నులు చెల్లిస్తున్నా, మౌలిక సదుపాయాలు కరవయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామాక్షినగర్‌లో ఏళ్ల గడుస్తున్నా, రోడ్లు, ఎటువంటి ప్రగతి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. నిధుల లభ్యత మేరకు ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు నిర్మిస్తామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నీళ్లు తెచ్చుకో.. దాహం తీర్చుకో

నెల్లిమర్ల మండలం టెక్కలి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడున్న శుద్ధజల ప్లాంట్ మరమ్మతులకు గురై ఆర్నెల్లవుతున్నా బాగు చేయలేదు. దీంతో ఇంటి నుంచే నీరు తెచ్చుకుంటున్నారు. చేతి బోరున్నా ఆ నీరు తాగితే రోగాలు వస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. సంబంధిత ఏజెన్సీకి సమాచారం ఇచ్చామని, త్వరలో బాగు చేస్తామని ఎంఈవో-1 యు.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

తెదేపా ఆత్మీయ సమావేశం

విజయనగరం అర్బన్, పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా నగరపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జమ్ములోని మారమ్మ తల్లి ఆలయం వద్ద ఆత్మీయ సమావేశం జరిగింది. నగరపార్టీ అధ్యక్షుడు గంటా రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పీపీఎస్ అధ్యక్షుడు కె.వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, కోరాడ వెంకటరావు, జోగేష్, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే

రంగస్థల కళాకారుడికి సన్మానం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: రంగస్థల కళాకారుడు మండా రమేష్‌ను జడ్పీ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ప్రశంసించి, సన్మానించారు. రంగస్థల రారాజుగా పేరుగాంచిన ఆచంట వెంకట రత్నం నాయుడు దశమ వర్ధంతి సందర్భంగా ఆచంట ఆర్ట్స్ అకాడమీ, రావి నాంచారయ్య ట్రస్ట్ సంయుక్తంగా దుర్యోధన మయసభ ఏకపాత్రాభినయం పోటీలు గుంటూరులో నిర్వహించారు. సుమారు 25 మంది పాల్గొనగా విజయనగరానికి చెందిన మండా రమేష్ ప్రథమస్థానంలో నిలిచారు.

సేవలకు పురస్కారం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: హజరత్ ఖాదర్ వలీ బాబా దర్గా ముతవల్లీ ఖలీల్‌బాబు సేవలను గుర్తించి మైభారత్ కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ సేవక్ రత్న, అలుపెరగని అన్నదాత పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ సభ్యులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఎం.జైచంద్రనాయుడు, మైభారత్ విజయనగరం సమన్వయకర్త భరత్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు మంగళవారం ఘనంగా సత్కరించి, పురస్కారం అందజేశారు. తన పుట్టినరోజు సందర్భంగా ఖలీల్ రక్తదానం, నేత్ర, వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. సెట్విజ్ సీఈవో వి.విశ్వేశ్వరరావు, జేవీవీ నాయకుడు ఎం.కృష్ణాజీ, ఎం.సత్యవేణి పాల్గొన్నారు.

సాటివారికి చేయూతే పండగ

నగరంలోని అంబటిసత్రంలోని ఏసు ప్రేమాలయం వార్షికోత్సవం మంగళవారం జరిగింది. కాకినాడకు చెందిన రెవరెండ్ నోవాహు వల్లూరి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ముఖ్యఅతిథి ప్రేమ్ భరత్ మాట్లాడుతూ సాటివారికి సాయం చేయాలన్నారు. డాక్టర్ జెర్మియా మాట్లాడుతూ ఇతరులకు చేయూతనివ్వడమే క్రిస్మస్ ముఖ్య ఉద్దేశమన్నారు. జోసెఫ్ బృందం పిల్లలు క్రీస్తు పాటలకు నృత్యం చేయగా, యూత్ ఫర్ జీసస్ బృందం పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, అలజంగి వాక్టర్‌బాబు, సిస్టర్ సువర్ణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఉచిత శిక్షణ వినియోగించుకోండి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి కోర్సుల్లో అందజేస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. నగరంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మంగళవారం రిఫ్రిజరేషన్ అండ్ ఏసీ మెకానిక్, వీడియో గ్రాఫిక్స్ అండ్ ఫొటోగ్రఫీ కోర్సుల్లో శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం జూనియర్ బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. సంస్థ సంచాలకుడు డి.భాస్కరరావు, విశ్రాంత ఎల్డీఎం ఎ.శ్రీనివాసరావు, కెనరా బ్యాంకు విశ్రాంత ప్రబంధకుడు ప్రభాకరరావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 64 మందికి జరిమానా

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నగరంలో ఇటీవల చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో ఇద్దరికి జైలు శిక్ష, 64 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి ఎంఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ మంగళవారం తెలిపారు. రహదారి ప్రమాదాల నియంత్రణలో భాగంగా, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు నిర్వహించిన తనిఖీల్లో 66 మందిపై కేసులు నమోదు చేయగా, 64 మందికి జరిమానా, ఒకరికి రెండు, మరొకరికి 5 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వచ్చిందన్నారు.

ఒక్క మెట్టూ ఎక్కలేం.. చుక్క నీరు తాగలేం

నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ప్రాంతంలో తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ట్యాంకు మెట్లు పాడై పెచ్చులూడుతున్నాయి. శుభ్రం చేయడానికి సిబ్బంది పైకి వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. వాల్వు వద్ద పనికిరాని మొక్కలు, నాచు పెరిగిపోయింది.

పనికిరాని మొక్కల మధ్య నాచుతో వాల్వు

రోగాలు వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో క్లోరినేషన్ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ శివకుమార్ వద్ద వివరణ కోరగా ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, గతంలో నాలుగుసార్లు టెండర్లు పిలిచామని ఎవరూ రాలేదన్నారు. మళ్లీ పిలుస్తామన్నారు.

–న్యూస్‌టుడే, జరజాపుపేట (నెల్లిమర్ల)

పాఠశాలలకు సాయం

జరజాపుపేట(నెల్లిమర్ల), న్యూస్‌టుడే: జరజాపుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద మంగళవారం సిమెంట్ ర్యాంపు నిర్మాణ పనులు చేపట్టారు. ర్యాంపు పాడవడంతో ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య రూ.25 వేలు సొంత నిధులు అందజేశారని ప్రధానోపాధ్యాయురాలు కామేశ్వరి తెలిపారు. ఆయనను అభినందించారు. ● జామి: జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు చదువుకునేందుకు ఆవరణ శుభ్రం చేసి, క్రషర్ బుగ్గి వేసి చదును చేశారు. దీనికోసం జామికి చెందిన బండారు వేణుమాధవి 30 ట్రాక్టర్ల క్రషర్ బుగ్గి వేయించారు. ట్రాక్టరు యజమానులు వాహనాలు ఉచితంగా ఇచ్చారు. స్టోన్ క్రషర్ యజమాని శ్రీమన్నారాయణ అయిదు లోడ్‌లు ఉచితంగా అందచేశారు. పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు కొత్తలి శ్రీను, హెచ్ఎం ఎస్వీ శేఖర్‌కుమార్, వి.వీరాంజనేయులు, వి.నాయుడుబాబు పాల్గొన్నారు.

జరజాపుపేటలో జరుగుతున్న పనులు

కరాటేలో బంగారు పతకం

శిక్షకుడు నూకరాజుతో విద్యార్థులు

ఎస్.కోట, కొత్తవలస, న్యూస్‌టుడే: సర్వేపల్లి పాఠశాల విద్యార్థిని చిప్పాడ అక్షయ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపింది. గత నెల 30న విశాఖలో ఒకినావా స్పోర్ట్సు కరాటే డోజో అసోసియేషన్, ఏపీ ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్ 2.0 పోటీల్లో అండర్-10 విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ పి.పైడిరాజు తెలిపారు. విద్యార్థినిని కరస్పాండెంటు సన్యాసిరావు, డైరెక్టర్లు వెంకటరావు, సుశీల, ఉపాధ్యాయులు అభినందించారు. ● కొత్తవలస ఛాంపియన్స్ డోజో విద్యార్థులు 11 బంగారు పతకాలు సాధించినట్లు శిక్షకుడు కర్రి నూకరాజు తెలిపారు. దీంతోపాటు 13 మందికి వెండి, 16 మందికి కాంస్య పతకాలు లభించాయన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరాలతో నాయకత్వ లక్షణాలు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం మంగళవారం బర్మాకాలనీలో ప్రారంభమైంది. ఇందులో ప్రిన్సిపల్ సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సమాజ సేవ, నిబద్ధత అలవడతాయన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టరు చుక్కా శ్రీకాంత్ సీజనల్, అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. పీవో భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ వాసు దేవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

వేపాడ, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 5న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకన్న మంగళవారం కోరారు. ఈ మేరకు తహసీల్దారు జె.రాములమ్మకు వినతిపత్రం అందించారు.

దివ్యాంగులతో డీఎస్పీ ముచ్చట

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తవలసలోని చైతన్య బధిరులు, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలను డీఎస్పీ గోవిందరావు, సీఐ సీహెచ్ షణ్ముఖరావు మంగళవారం సందర్శించారు. దివ్యాంగులకు అందిస్తున్న విద్య, శిక్షణ, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు అందజేశారు. ఎస్సై ఎన్.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు. ★ ఇటీవల కొత్తవలస పోలీసుస్టేషన్‌లో నమోదైన ఎస్సీ అట్రాసిటీ, వరకట్న వేధింపుల కేసు సంబంధించి రాంజీనగర్‌లో ఉంటున్న ఫిర్యాదు దారును విచారించారు.

16న ఏపీఎన్జీవో ఎస్.కోట తాలూకా ఎన్నికలు

ఎస్.కోట, న్యూస్‌టుడే: ఏపీఎన్జీవో శృంగవరపుకోట తాలూకా యూనిట్ ఎన్నికలు 16న నిర్వహించనున్నట్లు యూనిట్ అధ్యక్షుడు జేవీ ప్రసాదరావు తెలిపారు. 15 పోస్టులకు జరుగుతాయని, 9న ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

రూ.లక్షల వ్యయం.. నిరుపయోగం

వినియోగంలో లేని భవన సముదాయం

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా డెంకాడ మండలం అక్కివరం గొల్లపేట వద్ద నిర్మించిన హుద్‌హుద్ గృహ సముదాయాలు నిరుపయోగంగా మారాయి. రూ.63.68 లక్షలతో నిర్మించిన 16 గృహాలను 2019లో అప్పటి ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు ప్రారంభించారు. గ్రామానికి దూరంగా ఉండడంతో లబ్ధిదారులు అక్కడ ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. చీకటి పడితే మందు బాబులకు అడ్డాగా మారుతోంది. విద్యుత్తు నియంత్రికను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టేశారు. బోరు పైపులు దొంగిలించారు. పర్యవేక్షణ లేక రూ.లక్షలు ప్రజాధనం నిరుపయోగంగా మారిందని విమర్శిస్తున్నారు. దీనిపై గృహనిర్మాణ శాఖ పీడీ మురళీరావు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్లు అప్పట్లో అప్పగించామని, స్థానిక నాయకులతో చర్చించి, అక్కడ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, డెంకాడ

భవనం లోపల మెట్ల కింద మందు సీసాలు, గ్లాసులు, ఇతర వ్యర్థాలు

బాధ్యతల స్వీకరణ

నెల్లిమర్ల: నెల్లిమర్ల డిప్యూటీ ఎంపీడీవోగా పీఎం రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా చేస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

మర్యాదపూర్వక కలయిక

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల కొత్తగా ఏర్పడిన డిస్ట్రిక్ట్ అర్బన్ సచివాలయం ఎంప్లాయీస్ విజయనగరం అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీను, శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు రమాదేవి, ఈసీ సభ్యుడు ఉమామహేశ్వరి, ఉపాధ్యక్షుడు ఎం.కమలాకర్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: పెంచలయ్యను హత్య చేసిన గంజాయి మూకలను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండు చేశారు. విజయనగరంలో స్థానికులతో కలిసి ఆయన ర్యాలీ చేపట్టారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అనంతరం ఆయనకు నివాళులర్పించారు.

బకాయిలు చెల్లించాలి

జామి, న్యూస్‌టుడే: భీమసింగి చక్కెర కర్మాగారం కార్మికులు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. కార్మికులతో సమావేశం నిర్వహించారు. వైకాపా నిర్వాకంతో ఇబ్బందుల్లో పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వమైనా ఆదుకోవాలన్నారు. కర్మాగార ఎండీ సన్యాసినాయుడును కలిసి సమస్యలు వివరించారు. నాయకులు కనకరాజు, శ్రీను, ఆదిబాబు, వెంకటరావు, బంగారయ్య ఉన్నారు.

ప్రైవేటీకరణ తగదు

కొత్తవలస: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.జయప్రకాష్ నారాయణ, జేసీఎస్ ఇన్‌ఛార్జి బి.వెంకటరావు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రపంచ వికలాంగుల దినోత్సవం

15-8-1998లో జిల్లా ఉత్తమ అధికారి అవార్డు స్వీకరిస్తున్న శ్రీ అడపా కూర్మదాసు గారు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వికలాంగులకు "చేయూత" పథకం ద్వారా అప్పటి జిల్లా కలెక్టరు వారి ఉత్తర్వులతో అనేక ప్రయోజనాలు కల్పించగా సదరు చేయూత పథకం అప్పటి ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి విజయనగరం క్యాంపునకు వచ్చు సందర్భంలో శ్రీమతి పూనం మాలకొండయ్య గారు I.A.S., కలెక్టర్ వారు ముఖ్యమంత్రివర్యులకు వివరించగా, సదరు పథకం మెచ్చి, అన్ని జిల్లాలలో అమలు పరచుటకు ఆదేశములిచ్చి, విజయనగరం జిల్లాలో అంధులకు, బధిరులకు చెరో ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేస్తూ నా స్వ జిల్లాలోనే ప్రభుత్వం ఉత్తమ అధికారిగా మంత్రివర్యులు చేతులమీదుగా తే. 15-8-1998 సం.న ప్రశంసా పత్రం అందించుట నా జీవితంలో మరపురాని సుమధుర ఘట్టం.

అడపా కూర్మదాసు - స్వర్గీయ రమణమ్మ

(2003, విశ్రాంత వికలాంగుల జిల్లా సంక్షేమశాఖాధికారి/ జిల్లా మేనేజర్)

(దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ/ సంస్థ)

బొబ్బిలి. Cell: 9441878010

(c) eenadu

50 వాహనాలు వెళ్లే విధంగా... స్వాతంత్ర్యం రాక ముందు బ్రిటిషు పాలనలో గోదావరి బోర్డు ఆధ్వర్యంలో 1933లో కేవలం స్థానికుల అవసరాలకు తగ్గట్టుగా నన్ను నిర్మించారు. అప్పట్లో ఎడ్ల బండ్లు అధికంగా రాకపోకలు సాగించేవి. ఆ రోజుల్లో నిత్యం 50 వాహనాలకు మించి వెళ్లేవి కావు. ప్రస్తుతం ఎన్ని వెళ్తాయో లెక్క ఉండదు.

ఇన్నేళ్లూ మోశా.. ఇన్నాళ్లూ చూశా!!

➤ భీమవరం- పిప్పర ప్రధాన మార్గంలో గరగపర్రులో ఉండి కాలువపై నన్ను 92 ఏళ్ల కిందట కట్టారు.

➤ నాటి నుంచి ఇప్పటి వరకు నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించడంతో కింది భాగంలో పిల్లర్లు సైతం బీటలు తీశాయి.

➤ రెయిలింగ్ పూర్తిగా దెబ్బతింది.

➤ వంతెన ఇరువైపులా అప్రోచ్ రోడ్డు రక్షణ గోడలు కూలిపోయాయి.

➤ వాస్తవానికి సుమారు 10 ఏళ్ల కిందటే నాపై రాకపోకలకు ముగింపు పలకాలి. కానీ గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మోయలేని పరిస్థితికి చేరినా నేటికీ సేవలు అందిస్తున్నా.

చుట్టూ తిరిగి రావాల్సిందే.. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం, జాతీయ రహదారి మీదుగా విజయవాడ, విశాఖ, హైదరాబాద్, రాజమహేంద్రవరానికి వెళ్లే వాహనాలకు నేనే ప్రధాన మార్గం. నేను కూలితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అందుకే అధికారులు ఇప్పుడు మేల్కొని ఉండి, గణపవరం మీదుగా పిప్పర లేదా పాలకోడేరు, అత్తిలి మీదుగా పిప్పర మార్గంలో రాకపోకలు భారీ వాహనాలు సాగించాలని చెబుతున్నారు. దీని వల్ల అదనంగా సుమారు 8 కిలోమీటర్లు దూరం ప్రయాణించాలి. ఈ తప్పు నాది కాదు.. అధికారులు ముందే మేల్కొంటే ఈ బాధలు తప్పేవి.

కూలిపోయే స్థితికి చేరడంతో భారీ వాహనాల నిలిపివేతకు ఆర్‌అండ్‌బీ శాఖ నిర్ణయం తీసుకుంది.

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు.. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసినా కూటమి సర్కారు అధికారంలోకి రాగానే కొత్త వంతెన నిర్మాణానికి రూ.12 కోట్ల అంచనాతో అధికారులు ప్రతిపాదనలు నివేదించారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టే అవకాశం ఉందని ఆర్‌అండ్‌బీ డీఈ పీవీ రామరాజు తెలిపారు.

- న్యూస్‌టుడే, పాలకోడేరు

బీడు కాదు.. గూడు గోడు

పాలకోడేరు మండలం గొరగనమూడిలో అయిదెకరాల అసైన్డ్ భూమిని సేకరించి 120 మందికి పట్టాలిచ్చారు. వాటిని కేటాయించకుండా వదిలేశారు. వాటి లబ్ధిదారుల గోడు వర్ణనాతీతం.

ఇవన్నీ.. బీడు భూములు అనుకుంటే పొరపాటే... పేదలకు ఇచ్చిన స్థలాలు ఇవి. గత వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్వాకం ఇవి. గత అయిదేళ్లుగా లబ్ధిదారులకు జాగా ఇవ్వక వారి గూడు కల కలగానే మిగిలిపోయింది.

- ఉండి, పాలకోడేరు, న్యూస్‌టుడే

ఇది ఉండి మండలం మహదేవపట్నంలోని పేదల లేఅవుట్. 263 మంది కోసం 7.41 ఎకరాలు సేకరించారు. ఎన్నార్పీఅగ్రహారంలోని లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలు ఇచ్చారు. మట్టి పూడిక పనులు మధ్యలోనే ఆపేశారు. దీంతో ఆ స్థలాలు తమకొద్దంటూ ధర్నాలు, రాస్తారోకోలు చేసినా అధికారులెవరూ పట్టించుకోలేదు. తమ గ్రామంలోనే స్థలాలివ్వాలనే లబ్ధిదారుల డిమాండ్ నెరవేరలేదు. చివరికి ఈ లేఅవుట్ ఇలా తయారైంది.

ఆ ఆటలో.. తన్మయత్వం

బోసిబాల్‌లో ఒలింపిక్స్‌కు అర్హత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆ ఆటా.. నేను ఆడను.. నాకొద్దు అంటూ దూరం పెట్టిన ఆ అమ్మాయి ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపించి ఏకంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఆమే పెంటపాడుకు చెందిన సత్తి తన్మయ శ్రీదేవి. తన్మయ మేధో వైకల్యంతో కూడిన డౌన్ సిండ్రోమ్ (జన్యుపరమైన లోపం)తో జన్మించిన విభిన్న ప్రతిభావంతురాలు. నలుగురితో కలవడం, తలెత్తి ముఖం చూస్తూ మాట్లాడటం తనకు చాలా కష్టమైన విషయాలు. వైకల్యంతో కలిగిన ఇలాంటి స్వాభావిక లక్షణాలను అధిగమించి ప్రత్యేక అవసరాలు విభాగంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించింది. పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో హైస్కూల్ ప్లస్‌లో రెండో ఏడాది ఇంటర్మీడియట్ చదువుతోంది.

● భీమవరంలో గతేడాది జరిగిన విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో పరుగు పందెం, బోసిబాల్ స్లో, వాకింగ్ విభాగాల్లో పాల్గొంది. బోసిబాల్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికై ఏప్రిల్‌లో జరిగిన పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయికి చేరుకుంది.

● బిలాస్‌పూర్‌లో జులై 24 నుంచి 28 వరకు జరిగిన జాతీయ పోటీల్లో దూసుకెళ్లి బంగారు పతకం సాధించింది.

● 2027లో జరిగే ప్రత్యేక ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. దీనికి సంబంధించి మూడు దశల్లో ఇచ్చే శిక్షణలో భాగంగా గ్వాలియర్‌లో జరిగిన తొలిదశ నుంచి రెండో దానికి ఎంపికైనట్లు శిక్షకురాలు సాయి స్వరూప తెలిపారు. 'కొన్ని సంవత్సరాల తపన, కుటుంబ ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శిక్షణ ఎంతో దోహదపడ్డాయి' అని తన్మయ చెబుతోంది.

విభిన్నం.. ప్రతిభావంతుల పయనం!
వివిధ రంగాల్లో రాణిస్తున్న వైనం

సత్తా చాటి... పతకాలు పట్టి
జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

6 లో

అడిగేదెవరు.. మడతెట్టేయ్

అన్నీ ఆక్రమణలే.. కనుచూపు మేర ఆక్వా చెరువులే

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: గుబురుగా పెరిగిన మొక్కలు... చిత్తడి నేలల్లో పాతుకుపోయే చెట్లు.. ఎటుచూసినా ఆహ్లాదకర వాతావరణం.. స్వచ్ఛమైన గాలితో జిల్లాలోని మడ అడవుల స్వాగతం పలికేవి. ప్రస్తుతం ఎటుచూసినా ఆక్వా చెరువులు.. విద్యుత్తు కోసం లాగిన తీగలు.. రసాయనాల వాసనతో కూడిన గాలి దర్శనమిస్తున్నాయి. తీర ప్రాంతానికి రక్షణ కవచంగా ఉండే మడ అడవుల సంరక్షణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చాపకింద నీరులా ఆక్రమణలు పెరుగుతున్నాయి.

నాడు నరసాపురం, మొగల్తూరు తీర ప్రాంతాల్లో 1950 దశకంలో రెండు వేల ఎకరాల్లో మడ అడవులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాటిని సంరక్షించేందుకు అప్పట్లో రక్షణాధికారి(సెక్యూరిటీ గార్డు) సైతం ఉండేవారు.

నేడు నరసాపురం తీరంలో 245, మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లో 265 ఎకరాల్లో మాత్రమే మడ అడవులున్నట్లు అధికారులు చెబుతున్నా, ఆ మేరకు అక్కడ కనిపించడం లేదు.

పేరుపాలెం: మడ అడవులను ఆనుకుని చెరువులు

దొంగ పట్టాలతో: గతంలో నరసాపురం తీరం సముద్రపు కోతకు గురై మడ అడవులు కనుమరుగయ్యాయి. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి, పేరుపాలెం గ్రామాల్లో 1960వ దశకంలో అప్పటి రాజకీయ నాయకులు కొంతమంది స్థానికులకు పట్టాలివ్వగా, మరికొంతమంది దొంగ పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలు జరిపారు. ఇంకొంతమంది ఆక్రమించుకుని ఆక్వా చెరువులు సాగు చేస్తున్నారు. ఫలితంగా మడ అడవులని చెప్పుకోవడమే తప్ప కనుచూపు మేర అంతా ఆక్వా చెరువులే దర్శనమిస్తున్నాయి.

ఇవిగో ఆక్రమణలు.. మోళ్లపర్రులో భీమవరానికి చెందిన ఓ రైతు సుమారు 70 ఎకరాలు ఆక్రమించి విక్రయాలకు పాల్పడ్డాడు. భీమవరానికి చెందిన ఓ వ్యాపారికి పేరుపాలెం సముద్ర తీరానికి ఆనుకుని ఉన్న భూములను పర్యాటకాభివృద్ధి పేరుతో దాదాపు 33 ఎకరాలు ప్రభుత్వం లీజుకిచ్చింది. పలు కారణాలతో అది కోర్టు విచారణలో ఉంది. దాన్ని ఆసరాగా చేసుకుని సమీపంలోని క్రీకులు, మడ చెట్లు ఉండే ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. అప్పటికే ఆక్రమించుకున్నవారికి కొంత సొమ్ములు ముట్టచెప్పి మొత్తం ఆక్వా చెరువులుగా మార్చేశారు.

వైకాపా నిర్లక్ష్యం.. ఎన్నికలకు ముందు ఒక బృందం పేరుపాలెం, ముత్యాలపల్లిలో మడ అడవులపై సర్వే చేసి, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వైకాపా ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు చెబుతున్నారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, ఆక్వా చెరువులకు విద్యుత్తు కనెక్షన్లు మంజూరు చేసింది. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికులు, కొంతమంది బడాబాబులు ఉన్న భూములను ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మడ అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉండిలో రైల్వేగేటు మూసివేత

ఉండి, న్యూస్‌టుడే: ఉండి-ఆకివీడు 165 జాతీయ రహదారిపై ఆర్వోబీ నిర్మాణ ప్రాంతంలో రైల్వే గేటును మంగళవారం నుంచి మూసివేశారు. 20వ తేదీ వరకు ఉండి నుంచి ఆకివీడు, కైకలూరు, ఏలూరు, గుడివాడ, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు భీమవరం, జువ్వలపాలెం, అయిభీమవరం, ఆకివీడు, కైకలూరు మీదుగా రాకపోకలు సాగించాలని అధికారులు సూచిస్తున్నారు. ఉండి నుంచి ఆకివీడు వెళ్లే వారు పాములపర్రు, పెదకాపవరం, గుమ్ములూరు మీదుగా ప్రయాణం చేయాలన్నారు. విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు నుంచి వచ్చే వాహనాలు చెరుకువాడ, కలిసిపూడి, పెదపుల్లేరు వంతెన, పెదపుల్లేరు, సీసలి, జక్కరం, పెదఅమిరం మీదుగా భీమవరం చేరుకోవాలని సూచించారు.

5న తల్లిదండ్రుల సమావేశం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డిసెంబరు 5న అన్ని ప్రభుత్వ పాఠశాలలు-జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. సంబంధిత అధికారులతో ఆమె మంగళవారం సమీక్ష జరిపారు. తల్లిదండ్రులు నూరుశాతం హాజరయ్యేలా చూడాలని, ప్రభుత్వ బడుల్లో ఉండే సౌకర్యాలు నాణ్యమైన బోధన గురించి వారికి వివరించాలన్నారు.

పరిశ్రమలకు చేయూత

జడ్ పత్రం ఉంటే ఉపయోగాలెన్నో..

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలకు మరింత ఊతమిచ్చేందుకు 'జీరో ఎఫెక్ట్.. జీరో డిఫెక్ట్' పథకాన్ని తీసుకొచ్చింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి దీన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పాలకోడేరు, వీరవాసరం, మొగల్తూరు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి జిల్లా నోడల్ అధికారిగా పరిశ్రమలశాఖ జిల్లా అధికారి మంగపతిరావు వ్యవహరిస్తున్నారు.

నమోదు ఎలా? చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కలిగిన వారు zed.msme.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉద్యమ్ సంఖ్య, చరవాణి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పరిశ్రమ ఉన్న ప్రాంతం దాని నిర్వహణ వివరాలన్నీ నమోదు చేయాలి. గుర్తింపు పొందిన ఏజెన్సీ ఆ వివరాలను పరిశీలించిన తర్వాత ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తుంది.

ఎవర్ని సంప్రదించాలి: శేషారత్నం ఎఫ్ఐఎఫ్ ఏజెన్సీ జిల్లా అధికారి. చరవాణి సంఖ్య: 99596 37789

జిల్లాలో భారీ 9 పరిశ్రమలు | చిన్న, మధ్య తరహా 2,250

ప్రయోజనాలివీ: బ్యాంకు రుణాలు తీసుకునేటప్పుడు ప్రాసెసింగ్ రుసుము, వడ్డీలపై రాయితీ ఇస్తారు. ప్రాథమిక దశలో సహకారం అందించడానికి రూ.2 లక్షల వరకు రాయితీ ఇస్తారు. యూనిట్లను అభివృద్ధి చేసి విస్తరించేందుకు రూ.4 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు రుణాలు ఇస్తారు. బీసీ, ఎస్సీలకు ప్రత్యేక రాయితీలు అందిస్తారు. మహిళలకు అయితే వంద శాతం ఉంటుంది.

వర్షంలోనూ కృషీవలుడి పోరాటం

ఉండిలో ధాన్యం పట్టుబడి

ఉండి, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: నిన్న.. మొన్నటి వరకు ప్రకృతి వెంటాడినా.. ఎంతో శ్రమకోర్చి పండించిన పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. ఇంతలో అల్పపీడనంతో జిల్లాలో కురుస్తోన్న చినుకులతో పంటను దక్కించుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

జిల్లాలో 20 మండలాల్లో 2,15,068 ఎకరాల్లో 1.03 లక్షల మంది రైతులు వరి సాగు చేశారు. సెప్టెంబరు నుంచి అధిక వర్షాలు, మొంథా తుపానుతో ఎకరాకు 25-28 బస్తాల మధ్యే దిగుబడులు వస్తున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. గత పది రోజుల నుంచి పంట మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ దశలో అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలు దెబ్బకొడుతున్నాయి.

1.74 లక్షల టన్నుల కొనుగోళ్లు.. జిల్లాలో 5 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. మంగళవారం నాటికి 1.74 లక్షల టన్నుల పంటను 23,561 మంది రైతుల నుంచి కొన్నారు. రూ.374 కోట్లకు రూ.357 కోట్లు రైతుల ఖాతాల్లో జమైంది. జిల్లాలో అత్యధిక శాతం పంట కోత దశలోనే ఉండిపోయింది. యంత్రాల సహాయంతో ఒడ్డుకు చేర్చిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు ఆరబెట్టేందుకు కల్లాలు లేవు. మరోవైపు ప్రతికూల వాతావరణంతో ఎక్కువమంది రైతులు కొట్టు.. పట్టు పద్ధతిలో దళారులకు పంటను విక్రయిస్తున్నారు. అన్నదాతల అవసరాన్ని వారు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇక దగ్గరలోనే ఓటేయొచ్చు

కొత్తగా 123 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదన

నియోజకవర్గాల వారీగా ఓటర్లు | ప్రస్తుత పోలింగ్ కేంద్రాలు | కొత్తవి

నియోజకవర్గం	ఓటర్లు	ప్రస్తుత పోలింగ్ కేంద్రాలు	కొత్తవి
ఆచంట	1,79,840	187	5
పాలకొల్లు	1,94,919	190	13
నరసాపురం	1,70,784	169	12
భీమవరం	2,52,374	235	27
ఉండి	2,25,544	238	5
తణుకు	2,34,855	233	21
తాడేపల్లిగూడెం	2,14,104	209	40

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటుహక్కు వినియోగంలో గతం కంటే ప్రజల్లో బాగా చైతన్యం పెరిగింది. ఎన్నికలు జరిగిన ప్రతిసారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఎక్కువ మందికి తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉండటమే దానికి కారణమని భావించిన ఎన్నికల సంఘం వాటి సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించింది. గతంలో ఒక్కో కేంద్రానికి 1400 మంది ఓటర్లు ఉండేవారు. ఆ సంఖ్యను ఇప్పుడు 1200కే పరిమితం చేయనున్నారు. దీంతో జిల్లాలో 123 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం 1461 కేంద్రాలు ఉండగా వాటి సంఖ్య 1584కి చేరనుంది.

జిల్లాలో మొత్తం ఓటర్లు 14,72,420 మంది ఉన్నారు. కొత్త ఓటరు నమోదు, ఓటు తొలగింపు, సవరణల కోసం 16,236 దరఖాస్తులు రాగా 14,177 వినతులను పరిష్కరించారు. ఇంకా పరిష్కరించాల్సినవి 2,059 ఉన్నాయి. 2002లో జిల్లా ఓటర్లు 13,24,883 మంది ఉండగా ఈ ఏడాది ఆ సంఖ్య 14,72,420కి చేరింది.

నందమూరుగరువుకు ఉత్సవ శోభ

నందమూరుగరువు (వీరవాసరం), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందమూరుగరువు శ్రీరామ భక్తాంజనేయస్వామి 60వ వార్షిక మహోత్సవాలకు ముస్తాబయ్యాడు. బుధవారం నుంచి 15 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చివరి రోజు అఖండ అన్నసమారాధన కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. మొదటి రోజు హంస వాహనంపై స్వామి వారి ఊరేగింపును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా 13 రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అందుబాటులో ఉచిత బరకాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'దిత్వా' తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడవకుండా బరకాలను ఉచితంగా ఇస్తున్నట్లు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె ప్రాతిపదికన సేకరించిన 11 వేల బరకాలను రైతుల కోసం సహకార సంఘాల్లో, రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 2,750 బరకాలను తీసుకెళ్లారని, ధాన్యం విక్రయించిన వెంటనే వాటిని తిరిగి అప్పగించాలని సూచించారు.

నిలువు కాళ్లపై నిలబడి.. బస్సు కోసం ప్రాధేయపడి

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలో కళాశాల సెంటరులో బస్సులు ఆగకపోవడంతో విద్యార్థులు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలకు వెళ్లేందుకు ఈ సెంటరులో దిగాలి. ఇక్కడ బస్సులు ఆపకపోవడంతో ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నామని వారు చెబుతున్నారు. ఈ విషయమై నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డిని సంప్రదించగా కళాశాల సెంటర్‌లో బస్సులు ఆపేందుకు ఆర్టీసీ కంట్రోలర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వారానికి రెండు రోజులు చొప్పున తణుకు, నరసాపురం, భీమవరం డిపోల నుంచి ఒక కంట్రోలర్ అందుబాటులో ఉంటూ బస్సులు ఆగే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు.

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉండకూడదు : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఎస్పీ నయిం అస్మితో కలిసి ఆమె మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ అవరోధాలను అధిగమించేందుకు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి అంచులు ఆక్రమించిన వారిపై, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

నృత్య సంబరం!

అత్తిలి సుబ్బారాయుడి షష్ఠి కళా వేదికపై మంగళవారం రాత్రి చిన్నారుల జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించింది. దేవతామూర్తుల అలంకరణలో చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

- న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణం

ఉపాధి ఉద్యోగులకూ బీమా

నూజివీడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించింది. శ్రామికులతో పాటు ఉద్యోగులకూ భరోసా కల్పించేలా బీమా సదుపాయం అమలుకు నిర్ణయించింది. ఉద్యోగులకు ప్రమాదవశాత్తు ఏదేని ప్రమాదం వాటిల్లితే కుటుంబాలకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టింది.

● ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఏపీవోలు, ఈసీలు(ఇంజినీరింగ్ కన్సల్టెంట్), సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పొరుగు సేవల సాంకేతిక సహాయకులు బీమాకు అర్హులు.

● బీమా వర్తించాలంటే ఉపాధి హామీలో ఉద్యోగం చేస్తున్న వారికి తప్పనిసరిగా ఎస్‌బీఐ ఖాతా ఉండాలి. లేనివారు కొత్తగా తెరవాల్సి ఉంటుంది. అప్పుడే బీమా వర్తిస్తుందని డ్వామా ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజశేఖర్ తెలిపారు. ● రూ.10 వేల నుంచి రూ.25 వేల మధ్య వేతనం పొందే వారికి రూ.3 లక్షల వ్యక్తిగత బీమా వర్తిస్తుంది. రూ.25 వేల నుంచి రూ.50 వేల మధ్య వేతనదారులకు రూ.12 లక్షల ప్రమాద బీమాకు అర్హులు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వేతనం పొందేవారు రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది.

నిమ్మలపై దాడి ఘటనలో
వైకాపా నాయకులకు సీఐడీ నోటీసులు

6 లో

హీరోలనుకుని.. విద్యావనంలో అపశ్రుతులు

డిష్యూం.. డిష్యూం



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యా కేంద్రంగా పేరుగాంచిన పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని విద్యాలయాల్లో ప్రేమ వ్యవహారాలు, మద్యం,గంజాయి, పొగ తాగేటప్పుడు నెలకొంటున్న ఘర్షణలు విద్యార్థుల మధ్య తన్నులాటలకు దారి తీస్తున్నాయి. ఆపై కేసులతో భవితను నాశనం చేసుకుంటున్నారు.

● ఇటీవల భీమవరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కర్రలతో దాడి సంఘటనతో అక్కడ విద్యార్థులు కంగారు పడ్డారు. అంతా చూస్తుండగానే క్రికెట్ బ్యాట్‌లు, హాకీ స్టిక్‌లతో కొట్టుకోవడంతో పలువురు గాయపడ్డారు.

● భీమవరంలోని ఓ ప్రాంతంలో యువత గుమిగూడారు. కొద్దిసేపటికి బయట వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. ఒక్కసారిగా సీసాలు విసురుకున్నారు. ఈ సంఘటనలో విద్యార్థులు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.

● భీమవరంలో డిగ్రీ చదువుతున్న తోటి విద్యార్థులకు ఆహ్వాన వేడుకను సీనియర్లు నిర్వహించారు. ఆ సమయంలో మద్యం తాగి వచ్చిన విద్యార్థులతో ఏర్పడిన ఘర్షణ రహదారి పైకి చేరింది. అందరూ చూస్తుండగానే కొట్టుకున్నారు.

జిల్లాలో మొత్తం విద్యాసంస్థలు	2554
విద్యార్థుల సంఖ్య	3.20 లక్షలు
గత రెండేళ్లలో నమోదైన ఘర్షణలు	14

పర్యవేక్షక కమిటీలు ఎక్కడ?

గతంలో విద్యాశాఖ, పోలీసు, వైద్యులు, తల్లిదండ్రులతో పర్యవేక్షక కమిటీలు ఉండేవి. కళాశాలలో మానసిక వైద్య నిపుణులు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉండేవారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే సమయం ఇదేనని చెప్పే వారు లేకపోవడంతో కొందరిలో విచ్చలవిడితనం పెరిగిపోతోంది. అదికాస్తా రౌడీలుగా మారుస్తుందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇవి ఏవీ..?

పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి టీమ్‌లు, సాధారణ వ్యక్తుల్లాగా పోలీసులు పర్యవేక్షణ లేదు. విద్యార్థి దశలో ఎలా ఉండాలి. ర్యాగింగ్‌కుపాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే ఇబ్బందులు గురించి చెప్పడం లేదు. దీంతో యువత పక్కదోవ పడుతోంది.

● చట్ట వ్యతిరేక సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. కేసుల్లో చిక్కుకుంటే జీవితం అంధకారం అవుతుందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి 'తత్కాల్'

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య పదో తరగతి, ఇంటర్‌లో 'తత్కాల్' పథకం ద్వారా ప్రవేశం పొందడానికి అవకాశం కల్పించారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ నెల 6లోపు రూ.600 అపరాధ రుసుము చెల్లించి ప్రవేశం పొందవచ్చన్నారు. వివరాలకు https://apopenschool.ap.gov.in వెబ్‌సైట్ సందర్శించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

16 మంది వైద్య విద్యార్థుల సస్పెన్షన్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు వైద్య కళాశాల వసతి గృహంలో ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ విధించారు. జూనియర్లను మూడో సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ చేయడం.. వారు సోమవారం అర్ధరాత్రి దాటాక పోలీసులకు ఫిర్యాదు చేయడం విదితమే. ఈ ఘటనపై వైద్య కళాశాల ప్రధానాచార్యులు సావిత్రి విచారణ చేపట్టారు. బాధితుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం ర్యాగింగ్‌కు పాల్పడిన 16 మంది మూడో ఏడాది విద్యార్థులను వసతి గృహం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీలున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వార్డెన్లను ఆదేశించారు.

నేడు పారా ఒలింపిక్ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో జిల్లాస్థాయి పారా ఒలింపిక్ పోటీలు బుధవారం జరుగుతాయని ఎస్ఎస్ఏ సహిత విద్య జిల్లా సమన్వయకర్త టి.శ్రీనివాసు తెలిపారు. డీఎన్నార్ కళాశాల ప్రాంగణంలోని గన్నాబత్తుల క్రీడా మైదానం, చింతలపాటి బాపిరాజు పాఠశాల మైదానంలో పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్ తదితర పోటీలు ఉంటాయన్నారు.

రూ.125 మాత్రమే చెల్లించండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష రుసుములు ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని డీఈవో ఇ.నారాయణ తెలిపారు. సాధారణ అభ్యర్థులు రూ.125 ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలన్నారు. అదనంగా వసూలు చేస్తున్నట్లు కొన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఫిర్యాదులు అందుతున్నాయని, వాస్తవాలు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 10 ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక పద్ధతిలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో ఇ.నారాయణ తెలిపారు. అయిదు నెలల కాలానికి నెలకు రూ.12,500 చొప్పున వేతనం ఇస్తామని, పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విభిన్నం.. ప్రతిభావంతుల పయనం!

వివిధ రంగాల్లో రాణిస్తున్న వైనం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: శారీరక లోపం వారిని కుంగనీయలేదు. తామందరిలా లేదన్న భావన దరిచేరనీయలేదు. సమస్య ఉందని జీవితాన్ని వదిలేయలేదు. తమ రాతను తామే రాసుకున్నారు. జీవనాన్ని అందిరిలా మలచుకున్నారు. సమాజంలో స్ఫూర్తిని పంచుతూ విభిన్నంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా.. వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

మారుస్తోంది తలరాత!

కామవరపుకోట సమీప ఉప్పలపాడుకు చెందిన వర నవ్య దివ్యాంగురాలు. పుట్టుకతోనే చేతుల్లేవు. తల్లిదండ్రులు సుబ్బారావు, రూతమ్మ వ్యవసాయం చేస్తుంటారు. బిడ్డ వైకల్యంతో జన్మించిందని వారెప్పుడూ కుంగిపోలేదు. చదివిస్తే తలరాతను మార్చుకుంటుందని నమ్మారు. స్థానికంగా ఆరో తరగతి వరకు చదివించారు. ఆ తర్వాత ఏలూరులోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో విద్యాభ్యాసం చేస్తున్నారు. మోచేతుల వరకు లేకున్నా.. అందమైన చేతిరాతతో అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న నవ్య.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్న ఉద్దేశంతో చేతి రాతపై బాల్యం నుంచే ప్రత్యేక దృష్టి సారించినట్లు చెబుతున్నారు. క్రీడల్లోనూ కళాశాల స్థాయిలో బహుమతులందుకున్నారు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నవ్య

నడవలేనని.. పరుగు ఆపలేదు..

ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన నాగేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతుల కుమారుడు బత్తిన లక్ష్మణుడు. పుట్టుకతోనే పోలియో సోకడంతో.. చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలుర వసతి గృహంలో ఉంటూ.. పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. నడవలేని స్థితిలో ఉన్నా.. లక్ష్మణుడు పరుగు ఆపలేదు. ఓవైపు చదువులో రాణిస్తూ.. మరోవైపు క్రీడల్లో మెరుస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల చక్రాల కుర్చీల పరుగు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి. రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బ్యాంకు అధికారిగా స్థిరపడటమే ధ్యేయమని లక్ష్మణుడు చెబుతున్నారు.

లక్ష్మణుడు

నిమ్మలపై దాడి ఘటనలో వైకాపా నాయకులకు సీఐడీ నోటీసులు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పంపిణీ సందర్భంగా 2022లో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు, వైకాపా నాయకుల మధ్య తలెత్తిన ప్రొటోకాల్ వివాదంలో కొందరు నిమ్మలపై దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటనపై విచారణ నిమిత్తం రాజమహేంద్రవరంలోని కార్యాలయానికి రావాలని పాలకొల్లు నియోజకవర్గానికి చెందిన పది మంది వైకాపా నాయకులకు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిలో భాగంగా డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ మంగళవారం విచారణకు హాజరయ్యారు. బండి రమేశ్, ఖండవల్లి వాసు, మానుకొండ శ్రీను, గుణ్ణం నరసింహనాగేంద్రరావు, గవర సర్వేశ్వరరావు, కోట రత్నంరాజు, చందక సత్యనారాయణ, ఉచ్చుల స్టాలిన్, లంకే శ్రీనివాసరావు ఈ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. మొత్తం 24 మందిని ఈ కేసులో విచారించాల్సి ఉండగా తొలి విడత పది మందికి నోటీసులు అందాయి. రోజుకు ఒకరు చొప్పున విచారణకు హాజరు కావాల్సిఉంది.

కొబ్బరి రైతుల కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో కొబ్బరి రైతుల కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకు రుణాల సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర వాటాగా తొలి విడత రూ.4.49 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవం.. భక్తుల పరవశం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి ఉత్సవాలు 8వ రోజూ కొనసాగాయి. మంగళవారం స్వామివారి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తుల రద్దీ కొనసాగింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కళా వేదికపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల జానపద, కూచిపూడి నృత్యాలు అలరించాయి. స్వామివారిని గరుత్మంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

గరుత్మంత వాహనంపై స్వామివారు

ఉత్సవాల్లో భక్తజన సందోహం

పోలవరం పునరావాస కాలనీల్లో పనులు వేగవంతం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పోలవరం పునరావాస కాలనీల్లో పూర్తి కావాల్సిన పనులు వేగవంతం చేయాలని ఆర్డీవో ఎం.వి.రమణ ఆదేశించారు. పనులు పర్యవేక్షిస్తున్న సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించి పనుల పురోగతి తెలుసుకున్నారు. మొత్తం 19 కాలనీలున్నాయి. కొన్ని కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మరి కొన్ని చోట్ల మౌలిక వసతులు పూర్తి కావాల్సి ఉంది. వీటిలో తాజాగా కొన్ని పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మరి కొన్నింటికి ఇంకా టెండర్లు కావాల్సి ఉంది. హౌసింగ్ ఈఈ కేవీవీఎస్ ప్రసాద్, ఐటీడీఏ ఈఈ లత, ఆర్అండ్‌బీ డీఈ హరికృష్ణ, పీఆర్ ఏఈ రామానుజం, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ ప్రవీణ్ పాల్గొన్నారు.

నాటక రంగానికి అందరూ సహకరించాలి

తోలేరు (వీరవాసరం), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కళా పరిషత్‌ల నిర్వహణ అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు కోట శంకరరావు అన్నారు. తోలేరు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో 21వ జాతీయ స్థాయి నాటిక పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవం జరిగింది. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక రంగాన్ని బతికించేందుకు కళాపరిషత్‌ల నిర్వాహకులకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం సినీ నటుడు కోట శంకరరావు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకట రామారావులను సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ, వీరవాసరం, రాయకుదురు కళాపరిషత్‌ల అధ్యక్షులు గుండా రామకృష్ణ, కేఎస్ఆర్‌కే. గోపాలకృష్ణ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా టి.వెంకటేశ్వరరావు, జవ్వాది దాశరథి శ్రీనివాస్, మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు.

సినీ నటుడు శంకరరావు, వెంకట రామారావులకు సత్కారం

క్రీడా మైదానాల అభివృద్ధికి సహకరిస్తాం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలోని క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడాకారుల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. నగరంలోని ఏఎస్ఆర్ క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం, పలు క్రీడా ప్రాంగణాలను మంగళవారం శాప్ ఛైర్మన్‌తో పాటు పలువురు డైరెక్టర్లు సందర్శించారు. అక్కడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం రవి నాయుడు విలేకరులతో మాట్లాడుతూ. . రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక క్రీడా శిక్షకులు, సిబ్బందికి వివిధ రకాల ప్రయోజనాలు కల్పించామన్నారు. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా త్వరలోనే యాప్ తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు రవి నాయుడికి పలువురు అధికారులు, శిక్షకులు, క్రీడాకారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. శాప్ డైరెక్టర్లు రవీంద్ర, కె.జగదీశ్వరి, వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర అధ్యక్షుడు బడేటి వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలోని నడక దారిని పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు తదితరులు

మద్ది క్షేత్రం కిటకిట

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామికి తమలపాకులతో అర్చనలు చేశారు. ఆలయానికి విచ్చేసి భక్తులు ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ. 2,15,450 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.

కార్యకలాపాలు పారదర్శంగా ఉండాలి: సెర్ప్ సీఈవో

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: డ్వాక్రా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు పారదర్శకంగా ఉండాలని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ అన్నారు. నరసాపురం మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, బ్యాంకర్లు, వెలుగు అధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు సంబంధించి వివరాల నమోదు చేయడంలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం ప్రభుత్వం మన డబ్బులు- మన లెక్కలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్‌హెచ్‌జీ కార్యకలాపాల్లో డిజిటల్ లిటరసీ పెంపొందించడంతో పాటు సంఘాల సభ్యులకు దైనందిన ఆర్థిక లావాదేవీలపై సంపూర్ణ అవగాహన కలిగించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. శ్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ జీవీబీడీ హరి ప్రసాద్ మాట్లాడుతూ ఈ-నారీ వ్యవస్థ కార్యక్రమం ఉపయోగాలను వివరించారు. స్త్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు తీసుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్ల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ అన్నవరపు నాగేంద్ర ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ఎం.ఎస్.ఎస్. వేణుగోపాల్, డీసీఎంలు కొండేటి శ్రీనివాస్, మోకా శ్రీనివాస్, ప్రసాద్, బాలాజీ, కుసుమ కుమారి, స్త్రీనిధి ఏజీఎం రమణమ్మ, బ్యాంకుల కంట్రోలర్లు, బ్యాంకర్లు, జిల్లాలోని అన్ని మండలాల ఏపీఎం, డీపీఎం, సీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరుణ

షణ్ముఖి పురస్కారం ప్రదానం

తణుకు, న్యూస్‌టుడే: షణ్ముఖి ఆంజనేయరాజు కళాపీఠం ఆధ్వర్యంలో ఆంధ్ర బాలగంధర్వ షణ్ముఖి ఆంజనేయ రాజు జయంత్యుత్సవం సందర్భంగా సోమవారం రాత్రి షణ్ముఖి పురస్కారం ప్రదానం-2025 ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మరో రెండేళ్లలో జరగబోయే షణ్ముఖి శత జయంతిని ఆంధ్ర రాష్ట్ర పరిషత్ ఘనంగా నిర్వహించాలన్నారు. ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ జి. గోపాలకృష్ణ షణ్ముఖితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నట శిరోరత్న తుర్లపాటి రాధాకృష్ణమూర్తికి షణ్ముఖి పురస్కారాన్ని లయన్ గంటా భాస్కరరావు దంపతులు అందజేశారు. ఈ సభకు ప్రముఖ సినీ గేయ రచయిత రసరాజు అధ్యక్షత వహించగా షణ్ముఖి పీఠం కార్యదర్శి, ప్రముఖ రంగస్థల నటులు విజయ షణ్ముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ కవులు, రచయితలు, రంగస్థల నటులు తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తి దంపతులకు షణ్ముఖి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నాలుగో అంతస్తు పైనుంచి తోసేసి... ప్రాణం తీసేసి

సహజీవనం చేసిన వ్యక్తి ఘాతుకం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ వ్యక్తి తనతో సహజీవనం చేస్తున్న మహిళను భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసి హత్య చేసిన వైనమిది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యలమంచిలి మండలం గంగడపాలేనికి చెందిన తాడి సుధాకర్.. ఇద్దరు కూతుళ్లు, తండ్రి ఉన్న రాధ(29) అనే వివాహితతో సుమారు ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరంతా సంవత్సరం కిందట యలమంచిలి నుంచి పాలకొల్లు టిడ్కో గృహ సముదాయానికి అద్దెకు వచ్చారు. సుధాకర్ రోజూ తాగి ఇంటికి వస్తుండటంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటిన రాధ తండ్రికి వచ్చే పింఛను డబ్బులను సుధాకర్ తీసుకున్నాడు. అదేరోజు రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి రావడంతో రాధ భర్తను నిలదీసింది. మంగళవారం తెల్లవారుజాము సమయానికి వారిమధ్య గొడవ తారస్థాయికి చేరింది. సుధాకర్ భార్యను భవనం నాలుగో అంతస్తుపైకి తీసుకెళ్లి బలవంతంగా కిందకి తోసేశాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందడంతో సుధాకర్ అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై జి.జె.ప్రసాద్ కేసు నమోదు చేయగా గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అద్నాం నయిం అస్మి, నరసాపురం డీఎస్పీ శ్రీవేద పరిశీలించారు. మృతురాలి బంధువులు, స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

రాధ(పాత చిత్రం)

సత్తా చాటి... పతకాలు పట్టి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు వివిధ స్థాయిల్లో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల పాలకోడేరు మండలం శృంగవృక్షంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లాకు చెందిన అయిదుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెలలో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా వారు తమ మనోగతాన్ని 'న్యూస్‌టుడే'తో ఇలా వివరించారు.

నెట్‌బాల్ ఆడుతున్న బాలికలు

కప్పు కొడతాం..

మా పీడీ సలహాలు, సూచనలు పాటిస్తూ ఆటపై పట్టు సాధించా. ఫైనల్‌లో కేవలం రెండు పాయింట్లతో విజయం చేజారినా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఆ పోటీల్లో తప్పనిసరిగా కప్పు కొడతాం.

-జి.తేజశ్రీ, ఏడో తరగతి, శృంగవృక్షం, పాలకోడేరు మండలం

జాతీయ క్రీడాకారిణిగా రాణించాలని..

రాష్ట్ర జట్టులో స్థానం పొందాలనే పట్టుదలతో రెండు నెలల నుంచి సాధన చేస్తున్నా. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జాతీయ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకుంటా. ఈ పోటీల్లో ఆడేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా.

- పి.వసుంధర, తొమ్మిదో తరగతి, గొరగనమూడి

పాఠశాలలో ఇచ్చిన తర్ఫీదుతో..

పాఠశాలలో ఇచ్చిన తర్ఫీదుతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యా. చాలా ఆనందంగా ఉంది. అక్కడ కూడా విజయం కోసం ఇదే రీతిలో సత్తా చాటుతాం.

- కె.ఆంటోని, 9వ తరగతి, గొరగనమూడి

నిత్య సాధన

ఈ ఏడాది ఆగస్టు నుంచే సాధన చేయడం మొదలుపెట్టాం. లీగ్ నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు మెరుగైన ఆట తీరు ప్రదర్శించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. రాష్ట్ర జట్టును విజయపథంలో నిలిపేందుకు నిత్యం సాధన కొనసాగిస్తా.

- పి.బిందుశ్రీ, తొమ్మిదో తరగతి, తోలేరు, వీరవాసరం మండలం

ఫీజు చెల్లింపునకు మరో అవకాశం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు పరీక్ష రుసుము చెల్లించడానికి 6 వరకు గడువు పొడిగించినట్లు డీఈవో ఇ.నారాయణ తెలిపారు. రూ.600 అదనపు రుసుముతో తత్కాల్ అడ్మిషన్ చేసుకోవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సోదరిని చూడడానికి వస్తూ.. అనంతలోకాలకు

దేవరపల్లి, తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న అక్కను చూడడానికి మంగళవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వస్తుండగా కారు ఢీకొన్న ఘటనలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీకి చెందిన కొంపెల్లి శివనాగేంద్ర వరప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరప్రసాద్ నూనె వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సొంత అక్క అనారోగ్యంతో దేవరపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చూడడానికి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో యర్నగూడెం జాతీయ రహదారిలో ఏ6 హోటల్ వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. వరప్రసాద్ తల రోడ్డుకు తగలడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆయనకు భార్య నాగజ్యోతి, కుమారులు మణికంఠ(9), పాండ్విత్‌నంద(3) ఉన్నారు. పెద్ద దిక్కుగా కుటుంబానికి అండగా ఉంటాడనుకునే సమయంలో ఇలా జరగడం కుటుంబ సభ్యులతో పాటు స్థానికుల్లో కూడా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నాన్న ఇంకా రాలేదేంటని ఇంటినుంచి బయటకు వచ్చి చూసి వెళ్తున్న చిన్న కుమారుడ్ని చూసి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవరపల్లి పోలీసులు తెలిపారు.

శివనాగేంద్ర వరప్రసాద్ (పాత చిత్రం)

పాత కక్షలతో.. వ్యక్తి దారుణ హత్య

పూళ్ల(భీమడోలు), న్యూస్‌టుడే: పాత కక్షలు.. వివాహేతర సంబంధం.. వెరసి ఓ వ్యక్తి ప్రాణాలు తీసింది. భీమడోలు సీఐ యు.జె.విల్సన్, ఎస్సై మదీనాబాషా కథనం మేరకు.. పూళ్లకు చెందిన పాతల నాగరాజు(45), అదే గ్రామానికి చెందిన కాండ్రు నాగతేజకు పాత గొడవలున్నాయి. మంగళవారం ఉదయం నిద్రలేచి ఇంటి ముందు కూర్చొన్న నాగరాజుపై నాగతేజ, మరో ముగ్గురు కలిసి కత్తులతో దాడి చేశారు. నాగరాజు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో స్థానికులు హతాసులయ్యారు. సీఐ, ఎస్సై తమ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని ఆరా తీశారు. ఏలూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి నిందితుల వేలిముద్రలు సేకరించారు. పాత కక్షలు, ఓ మహిళతో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. నాగరాజు భార్య మాధవి ఫిర్యాదు మేరకు.. నాగతేజతో పాటు ఇస్సాకు, కాలి రాజేశ్, అద్దంకి బాబిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నాగరాజు (పాత చిత్రం)

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణంలోని ఓ లాడ్జిలో వ్యక్తి పంకాకు ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని నాచువారి సెంటర్‌కు చెందిన అడపా శివ అనే పైరు శివ (38) ప్రస్తుతం గొల్లలకోడేరు సమీపంలోని ఓ బహుళ అంతస్తు భవనంలో అద్దెకు ఉంటున్నారు. రొయ్యల వ్యాపారం చేస్తున్నారు. లాడ్జిలో గదిని సోమవారం అద్దెకు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం గది లోపలికి వెళ్లి చూడగా పంకాకు వేలాడుతున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.వై కిరణ్‌కుమార్ తెలిపారు.

ప్రేమ పేరుతో వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు

మొగల్తూరు, న్యూస్‌టుడే: బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సి.హెచ్.జయలక్ష్మి తెలిపారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు.. రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారి తోటకు చెందిన కొప్పర్తి అంజి వైఎన్ కళాశాలకు వస్తున్న బాలికను గత కొంత కాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రారంభమైన కౌశలం పరీక్షలు

వీరవాసరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఇంటి వద్దే ఉపాధి పొందేలా (వర్క్ ఫ్రం హోం) కూటమి ప్రభుత్వం కౌశలం పేరిట సర్వే చేపట్టింది. ఇందుకోసం జిల్లాలో 1,09,347 మందిని అర్హులుగా గుర్తించారు. కాగా.. వీరిలో 85,530 మంది పది, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై విద్యార్హతలు ఉన్న వారు. వీరికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. సదరు సంస్థల ప్రతినిధులు దరఖాస్తుదారులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి వర్క్ ఫ్రం హోంకు ఎంపిక చేసుకుంటారు. జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాల్లో మంగళవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి విడతలో 5,348 మందికి 6వ తేదీ వరకూ జరుగుతాయని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 145 చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత పశ్చిమగోదావరి జట్లు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 560 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మంగళవారం తుది పోటీలు నిర్వహించారు. అండర్ 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, కడప, విజయనగరం జిల్లాల జట్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-15 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ, విజయనగరం జట్టు ద్వితీయ, కడప, గుంటూరు జిల్లాల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి.

విజేత బాలుర జట్టుతో అతిథులు

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc No. 2422/E1/2023-24 Dated: 02-12-2025

S. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs. In Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1.	Electrical, Aspirational toilets, conservancy articles works-07	General Funds	98.18	03-12-2025	17-12-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender.apeprocurement.gov.in.

Sd/- **Commissioner,** Tadepalligudem Municipality

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అంతటా మార్టిగేజ్ ఫైనాన్స్ స్థిరాస్తి ఏ సంస్థలో ఉన్నా Xeroxపై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. సిబిల్ అవసరం లేదు. అయోధ్య కోఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ 9396999669.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Kolluri Anjani Padmalaya @ Thota Anjani Padmalaya, W/o.Thota Satya Sai Venkata Prasad and D/o. Kolluri Hemaveera Venkataramayya, R/o. Door No. 1-100, S. Kondepadu, Ganapavaram Mandal, West Godavari Dist., A.P-534134, have changed my name to Thota Kolluri Anjani for all purposes as per the affidavit dated 8th Nov 2025.

I, Thota Satya Sai Venkata Prasad, S/o. Thota Veera Ranga Rao, R/o. Door No. 1-100, S. Kondepadu, Ganapavaram Mandal, West Godavari Dist., A.P.-534134, have changed my name to Thota Venkata Prasad for all purposes as per the affidavit dated 8th November 2025.

JOBS

Wanted Male Counselors & Marketing Team Leaders. Qualification: Any Degree, Age Limit: 25 to 45 Years, Salary upto: 16000/- Location: Master Minds College, Rajahmundry. Contact: 92487 33370.

ఏలూరు నగరంలో ప్రముఖ HP పెట్రోల్ బంక్‌లో పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను. సంప్ర॥ ✆ 93921 80560.

అర్థమెటిక్, రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్ బోధించుటకు పార్ట్‌టైమ్ లెక్చరర్స్ కావలెను. రత్నం కోచింగ్ సెంటర్, భీమవరం - 2. ✆ 98482 33141.

Elite సంస్థనందు పనిచేయుటకు రాజమండ్రి మరియు పాలకొల్లులో ఫీల్డ్ ఆఫీసర్, సెక్యూరిటీ ఆఫీసర్, (Ex. M) సూపర్‌వైజర్లు, గార్డులు కావలెను. జీతం, PF, ESI కలదు. సంప్ర: 97032 34276, 94937 85599.

ఏ బాదరబందీలేని 35 ఏళ్లలోపు పనిమనిషి కావాలి. 1 సం॥ బిడ్డ సంరక్షణ + ఇంటి పనుల కోసం. వసతి ఉచితం, వైజాగ్. ✆ 9989366363.

SECURITY GUARDS

ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు *సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కావలెను. డిగ్రీ, జీతం:22,000/- (8గం॥ 26 రోజులు)+PF, ESI, 50 సం॥లోపు Ct: 9666985077, 8688776420.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

* For the Information of Trade & Industry
* గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ. 6.45 పైII తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

భీమవరం

•భీమవరం •ఉండి

అనర్గళంగా చెప్పారు.. ప్రశంసలు అందుకున్నారు

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

విజేతలతో శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపల్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను భీమవరంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. 'కృత్రిమ మేధ(ఏఐ) వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో ఇంటర్మీడియట్ విద్యార్థినులు వి.త్రిపుర సత్య లహరి (రెండో ఏడాది), యు. మౌనిక (ప్రథమ సంవత్సరం), ఐ. రిషిక (ద్వితీయ సంవత్సరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ ఎల్.సుధాకరరెడ్డి, ఏవో సీహెచ్ రామారావు బహుమతులు అందజేశారు.

✦ 'విద్యార్థుల జీవితాలపై సెల్ ఫోన్ ప్రభావం' అనే అంశంపై శ్రీచైతన్య ఆంగ్లమాధ్యమ పాఠశాలలో జరిగిన ఉపన్యాస పోటీలో ఎం.శ్రీనిజ (9వ తరగతి), ఆర్.రిషిత లిఖిత (8వ తరగతి), ఆర్.ధరణి సాయి కార్తీక (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా ప్రిన్సిపల్ టి.రామకృష్ణ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

విద్యార్థినులతో శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

అర్హులు సద్వినియోగం చేసుకోండి

ఉండి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన సర్వేను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీ పిచ్చయ్య సూచించారు. ఉండిలో మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేసేందుకు ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదుకు సర్వే గడువు తేదీని ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించారని చెప్పారు. సొంత స్థలాలున్న వారు బ్యాంకు పాస్ పుస్తకం, టెల్లరేషన్, ఆధార్ కార్డును సర్వే సిబ్బందికి అందించాలని కోరారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈఈ పి.శివరామరాజు, ఏఈ గోస్ బాషా ఉన్నారు.

ఉండిలో మాట్లాడుతున్న పీడీ పిచ్చయ్య

ధ్రువీకరణ పత్రాల అందజేత

దుంపగడప (ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పూర్తిచేసుకున్న 70 మంది నిరుద్యోగులకు ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సుజాత, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ సంఘం సమావేశం నేడు

భీమవరం పట్టణం, భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ సమావేశం భీమవరంలోని త్యాగరాజ భవనంలో బుధవారం నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు హాజరవుతారు.

రైతు గుండెల్లో తుపాను

నిలిచిన వరి కోతలు

ఆకివీడు, పాలకోడేరు, న్యూస్‌టుడే: ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్ వరి పంట చేతికొచ్చిన సమయంలో 'దిత్వా' తుపాను రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు రోజులుగా అడపాదడపా వర్షం కురుస్తుండటంతో తేమ శాతం తగ్గించేందుకు ఎండబెట్టిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కోతలకు అవరోధంగా మారింది.

ఆకివీడు: నేలకొరిగిన చేను

పాలకోడేరు: ఆరబెట్టిన ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

రెండు నియోజకవర్గాల్లో 47,576 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరిగింది. గత కొన్ని రోజులుగా కోతలు, మాసూళ్లు పనులు చేస్తున్నారు. ఇప్పటికి కేవలం 20 శాతం కోతలు పూర్తయ్యాయి. ఇందులో 10 శాతం ధాన్యం మాత్రమే రైస్‌మిల్లులకు చేరింది. సుమారు 15 శాతం పంట బరకాలు కింద ఉంది.

గడ్డినైనా దక్కించుకుందామని.. వరి చేలు కోతలు పూర్తయిన అనంతరం రైతులు ఎండుగడ్డిని పశువుల మేత కోసం జాగ్రత్త చేసుకుంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది ముందుగా ఎండుగడ్డిని సేకరించి ఇళ్లకు రవాణా చేసి మేటుగా వేసుకునే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోతే చివరికి ఎండు గడ్డి కూడా దక్కదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంప్యూటర్ విద్యపై నైపుణ్యం పెంచుకోండి

దుంపగడవ (ఆకివీడు), న్యూస్‌టుడే: దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో మంగళవారం 'ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత' దినోత్సవాన్ని నిర్వహించారు. కంప్యూటర్ బేసిక్ లాంగ్వేజ్‌పై విద్యార్థులు నైపుణ్యం కలిగి ఉండాలని ప్రిన్సిపల్ కె.సుజాత వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు

గృహయోగమెప్పుడో

స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారుల వేడుకోలు

ఉండి, పాలకోడేరు, భీమవరం అర్బన్, వీరవాసరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం పేదల కాలనీల కోసం ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో భూసేకరణ జరిపి లేఅవుట్లు వేశారు. విచిత్రం ఏమిటంటే.. నాడు లబ్ధిదారులుగా గుర్తించిన పేదలు నేటికీ గృహయోగానికి నోచుకోలేకపోయారు. ఆ స్థలాలు ఎక్కడున్నాయి.? ఇళ్లు నిర్మించుకునే అవకాశాన్ని ఎప్పుడు కల్పిస్తారంటూ వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ గోడు ఆలకించాలని లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు.

రెండు నియోజకవర్గాల్లో దాదాపు 85 చోట్ల మట్టిపూడిక పనులు చేపట్టలేదు. ఉండిలోని బొండాడ డ్రెయిన్, ఆరేడు గ్రామంలోని లేఅవుట్లల్లో ఇళ్లు నిర్మించుకునే మార్గం లేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. అర్తమూరు, పాములపర్రులోనూ అదే పరిస్థితి. ఉండి నియోజకవర్గంలో 120 లేఅవుట్లకు 318 ఎకరాలను సేకరించి 12,258 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. 48 చోట్ల 98.93 ఎకరాల్లో మట్టిని పూడ్చి చదును చేయాలి. ఈ లేఅవుట్ల కంటే చెరువులే నయమనే పరిస్థితి కనిపిస్తోంది. ఉండి నియోజకవర్గంలో 3,609 మంది లబ్ధిదారులు అనువైన స్థలాలు ఎప్పుడిస్తారంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భీమవరం మండలంలో 33 లేఅవుట్లకు 14 చోట్ల పూడిక పనులు చేయలేదు. కొన్నిచోట్ల బాగా పల్లపు భూములను లేఅవుట్లుగా చూపించారు. వీరవాసరం మండలంలోనూ కొన్నిచోట్ల ఇదే పరిస్థితి. దీంతో ఈ నియోజకవర్గంలో వేలాది మంది పేదలు పక్కా గూడు నిర్మించుకునేందుకు మౌలిక వసతులతో కూడిన స్థలాలివ్వాలని కోరుతున్నారు. లేఅవుట్లల్లో కొన్నిచోట్ల మట్టి పూడిక పనులు నిలిచాయని, వీటికి ప్రభుత్వం కొత్తగా అనుమతి మంజూరు చేయాలని ఉండి గృహ నిర్మాణ శాఖ డీఈఈ శివరామరాజు తెలిపారు.

✪ ఇది భీమవరం మండలం దెయ్యాలతిప్పలో చెరువును తలపిస్తున్న లేఅవుట్. బాగా పల్లపు ప్రాంతాన్ని సేకరించి వదిలేశారు. వర్షపునీటితో ఇలా కనిపిస్తోంది.

✪ వీరవాసరం మండలం నందమూరుగరువులోని లేఅవుట్‌లో మట్టిపూడిక పనులు సగంలో నిలిచాయి. ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే : ? ఉప్పుగుంట వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. వర్షాలకు జారుడు బల్లలా మారడంతో రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. తక్షణం మరమ్మతులు చేయించాలి.

- సాల్మన్ మోషే, ఉప్పుగుంట

✔ ఈ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు వెళ్లాయి. నిధులొచ్చిన వెంటనే పనులు చేపడతాం. **- శ్రీనివాసరావు, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ, ఆకివీడు**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? కుముదవల్లి రోడ్డులో చెత్త కుండీ లేదు. రహదారి అంచుల్లో వేస్తున్న చెత్తను కుక్కలు, పందులు ఈడ్చుకెళ్తున్నాయి. **- అనిల్, స్థానికుడు**

? పైవంతెన కింద రైల్వే జంక్షన్ స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా చెత్తతో నింపారు. దుర్వాసన భరించలేకపోతున్నాం.

- సాధిక్, విశ్రాంత ఉపాధ్యాయుడు

✔ ఆ ప్రాంతాలను చూసి పనులు చేయిస్తాం. చెత్త వేసేందుకు డబ్బాలు ఏర్పాటు చేయిస్తాం.

- ఎ.రాంబాబు, సహాయ కమిషనర్

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో మెంటేవారితోట, గ్రంధి చల్లారావు నగర్‌లోని డ్రెయినేజీల్లో మురుగు తొలగింపు సరిగా లేకపోవడంతో దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. **- స్థానికులు**

✔ చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

- ఆర్.సోమశేఖర్, పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ? భీమవరం-లోసరి మార్గంలో డీఎన్నార్ కళాశాల వద్ద గుంతలు ఏర్పడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. **- టి.శ్రీను**

✔ గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, ర.భ.శాఖ ఏఈ

ఏటీఎస్ వద్ద వాహన సామర్థ్య పరీక్షలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రస్తుతం రవాణా శాఖ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న రవాణా వాహనాల సామర్థ్య పరీక్షలు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) వద్ద చేయనున్నట్లు జిల్లా రవాణాధికారి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి అధికారి కృష్ణారావు మంగళవారం తెలిపారు. మచిలీపట్నం, అమలాపురం, రాజమహేంద్రవరంలోని ఏటీఎస్‌ల్లో లేదా మీకు దగ్గరగా ఉన్న కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

కొవ్వొత్తులతో పాస్టర్, చిన్నారులు

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: జంక్షన్ రైల్వేస్టేషన్ కూడలిలోని బేతేలు చర్చిలో క్రిస్మస్ నెల ప్రారంభ వేడుకలను మంగళవారం నిర్వహించారు. చర్చి ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వసంతోత్సవాలు జనవరి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ కృపావరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థన చేసి విశ్వాసులకు దేవుని ఆశీర్వాదం అందించారు. చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి కీర్తనలు ఆలపించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొణితివాడ (వీరవాసరం), న్యూస్‌టుడే: కొణితివాడ ఉప కేంద్రానికి కొత్త లైను ఏర్పాటు పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొణితివాడ, మడుగుపోలవరం, అండలూరు, పొలమూరు ఇండస్ట్రియల్ ఫీడర్, నవుడూరు, కొణితివాడ, అండలూరు, నేలపోగుల, గవరపాలెం, మడుగుపోలవరం, ఉత్తరపాలెం గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

మావుళ్లమ్మ సేవలో రాష్ట్ర సెర్ప్ సీఈవో

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి, సెర్ప్ సీఈవో వి.కరుణ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమెకు ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ శేషవస్త్రం, అమ్మవారి ఆశీర్వాదం అందించారు. సహాయ కమిషనర్ బి.ఎం.నగేష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

అమ్మవారి చిత్రపటం అందుకుంటున్న కరుణ

ఉచిత వైద్య పరీక్షలు

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: కాళ్లలో కోరమాండల్ గ్రూపు ఇన్సూరెన్స్, గ్రోమోర్ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 200 మందికి కంటి, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసినట్లు మేనేజర్ కొల్లి గణేష్ తెలిపారు.

సరైన పోషణతో అధిక పాల ఉత్పత్తి

తుందుర్రు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ చూపాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి కోటిలింగరాజు అన్నారు. తుందుర్రులో ఉచిత మెగా పశువైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 92 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 36 లేగదూడలకు నట్టల నివారణ మందు వేశారు. లేగదూడలకు అందాల పోటీలు నిర్వహించి వాటి యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సర్పంచి ఆరేటి వీరాస్వామినాయుడు, ఎంపీటీసీ ఆరేటి వాసు ఉన్నారు.

డంపింగ్ యార్డులా కాలువ గట్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగు, మురుగునీటి కాలువ గట్లపై చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. అవి గుట్టలుగా పెరిగిన అనంతరం వాటిని తగులబెడుతున్నారు. దీంతో నీరు కలుషితమవుతోంది. కాలువలు పూడిపోతున్నాయని స్థానికులు, రైతులు వాపోతున్నారు. చెత్తను తగులబెట్టినప్పుడు దట్టమైన పొగవల్ల అటుగా వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది.

దాదాపు ప్రతి గ్రామంలో సుమారు పదేళ్ల కిందట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల షెడ్లు నిర్మించారు. వీటిని కొన్ని గ్రామాల్లో శివారున నిర్మించడం, మరికొన్ని చోట్ల షెడ్లు వద్దకు వెళ్లే మార్గాలు సరిగా లేక, చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొన్ని పంచాయతీల పరిధిలో రోజువారీగా సేకరించే చెత్తను అయా గ్రామాల పరిధిలో ఉన్న కాలువ గట్టు వెంబడి దిగుమతి చేస్తున్నారు. గుమ్ములూరులో సేకరించిన చెత్తను చినకాపవరం డ్రెయిన్ గట్టు వెంబడి పోస్తున్నారు. కోళ్లపర్రు, చినమిల్లిపాడు, కాళింగగూడెం, అప్పారావుపేట, మందపాడు తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కంటితుడుపుగా ఉంది. ఈ విషయాన్ని ఆకివీడు ఎంపీడీవో బాబూరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా కాలువ గట్ల వెంబడి చెత్త వేయకుండా, సంపద కేంద్రాలను (షెడ్లు) వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేరులో పురం... సమస్యల హారం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం రెండో పట్టణంలోని శ్రీరాంపురం పలు ఆలయాలకు, ప్రసిద్ధి చెందిన విద్యాలయాలకు నెలవు. ఇక్కడే రహదారులు భవనాలశాఖ, బీఎస్ఎన్ఎల్, ఎక్సైజ్ వంటి కీలక కార్యాలయాలు, కోర్టు ఉన్నాయి. పురపాలక కమిషనర్ నివాస క్వార్టర్ ఇక్కడే ఉంది. ఈ ప్రాంతం కొన్నేళ్లుగా సమస్యలకు నిలయంగా మారింది. ముఖ్యంగా పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. స్థానికంగా గతంలో ప్రభుత్వ మీసేవా కేంద్రం కోసం నిర్మించిన భవనం ద్వారా వేల మందికి సేవలందేవి. తర్వాత దానిలో వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు.

బాబోయ్ దుర్వాసన.. ఈ ప్రాంత జనాభా సుమారు నాలుగువేలు. జువ్వలపాలెం రోడ్డు నుంచి డీఎన్నార్ న్యాయ కళాశాల వరకు ఉన్న ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ పలుచోట్ల అధ్వానంగా ఉంది. నిత్యం వాటిని శుభ్రం చేయకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రహదారి నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజల్లోకి అందుబాటులోకి తెస్తామని, డ్రెయినేజీల శుభ్రతకు చర్యలు తీసుకుంటామని ఎంఈ త్రినాథరావు తెలిపారు.

అధ్వానంగా అంతర్గత రహదారి

PUBLIC NOTICE

Under instructions of my client Axis Bank Ltd., T.Nagar, Rajahmundry rep.by its manager stating that his customer's named as **Sri.Thota Veera Venkata Naga Durga Bharat,** S/o.Venkata Rama Rao, Resident of **Undi Village, West Godavari District,** approached Axis Bank Ltd, T.Nagar, Rajahmundry for loan purpose who is the owner of an extent of Ac.0.87 cents, Situated in **R.S.Nos.316/3D and 316/4C1,** in **Undi Village,** within **Undi Sub-registry,** having acquired the same by virtue of a registered exchange deed dated **22-06-2017** under doc no.**1145 of 2017** executed between himself along with his grandfather **(Thota Surya Chandra Rao)** as **a first party** and **Sri Sagiraju Samba Siva Raju** as **a second party.** Later the said **Thota Surya Chandra Rao,** during his life-time executed a unregistered will dated 12-12-2018, in respect of his undivided and unspecified half share. The said **Sri.Sagiraju Samba Siva Raju,** in his turn derived the title by virtue of a registered sale deed dated **03-11-2016** under doc no.**2505 of 2016** from Bellapu Venkata Satyanarayana and Narasimha Rao, and they in their turn derived the title by virtue of two registered sale deeds dated **05.05.1999** under doc **no.464 of 1999** from Bellapu Palla Rao and others and on **06.06.2008** under doc **no.584 of 2008** from Bellapu Tata Rao and others. At this stage party intimated that the above documents in originals bearing nos.**2505 of 2016, 464 of 1999, 584 of 2008** were misplaced.

Public are herewith inviting objections if any within 7 days from the date of this publication regarding title or interest in the above mentioned property. The said person/persons are hereby invited to approach me and place before me their interest, if any and if not the above mentioned property will be decided as the absolute and unencumbered property and my client will consider his loan application.

Dudala Veera Venkata Trinadh, Advocate, Lalithanagar, Rajahmundry
Rajahmundry, Cell No.9246656575
Date: 02-12-2025. Party No. 8247293774

పురుగు మందు తాగి మృతి

పాలకోడేరు, న్యూస్‌టుడే: మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మోగల్లులో జరిగింది. పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మోగల్లుకు చెందిన ఆదిరెడ్డి దుర్గారావు (43) గత 14 ఏళ్లుగా భీమవరం ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పనిచేస్తున్నారు. మైగ్రేన్ నొప్పి కారణంగా మూడేళ్ల నుంచి ఇంటి వద్దే ఉంటున్నారు. గత నెల 30న తీవ్ర తలనొప్పి రావడంతో వంట గదిలో బాటిల్‌లో ఉన్న పురుగుల మందును మంచినీళ్లుగా భావించి తాగారు. తీవ్ర కడుపునొప్పితో ఇబ్బంది పడుతుంటే కుటుంబ సభ్యులు వెంటనే భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఏలూరు భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మట్టి తొలగిస్తుండగా.. పాలకోడేరు, న్యూస్‌టుడే: చేపల చెరువులో మట్టి తొలగిస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం గరగపర్రులో జరిగింది. పాలకోడేరు ఎస్సై ఎం.రవివర్మ తెలిపిన వివరాల ప్రకారం ఇరగవరం మండలం రేలంగి శివారు చుక్కావారిపేటకు చెందిన వీరవల్లి దానయ్య (43) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇద్దరు కూలీలతో కలిసి గరగపర్రులోని ఓ చెరువులో మట్టి తొలగిస్తుండగా దానయ్య ఒక్కసారిగా వెనుకకు కూలిపోవడంతో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని ఎస్సై తెలిపారు. చెరువు పైభాగంలో వెళ్లిన త్రీఫేజ్ విద్యుత్తు తీగల వల్ల విద్యుదాఘాతానికి గురై తన భర్త మృతి చెంది ఉంటాడని మృతుడు భార్య వీరవల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తులు చూపి.. నగదు డిమాండ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: బస్సు ఎక్కుతున్న విద్యార్థులను డబ్బులు ఇవ్వమని బెదిరించిన ఇద్దరు యువకులను అరెస్టు చేశామని సీఐ ఎం.నాగరాజు తెలిపారు. ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. నవంబరు 26న చినరంగనిపాలెం కూడలిలో డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని యువకులు బెదిరించారు. అక్కడే కొద్దిసేపు కత్తులతో తిరగడంతో ప్రజలు భయానికి గురయ్యారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించి నిందితులైన చినరంగనిపాలెం పుంతకు చెందిన ఆనంద్, ప్రకాష్‌లను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని, మరో ఇద్దరు దొరకాల్సి ఉందని ఎస్సై బి.వై.కిరణ్‌కుమార్ తెలిపారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

వీరవాసరం, న్యూస్‌టుడే: నందమూరుగరువు, వీరవాసరం, వడ్డిగూడెం, మత్స్యపురి సచివాలయాలను మండల సచివాలయ అధికారి పి.దుర్గాప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. సిబ్బంది సమయానికి బయోమెట్రిక్ హాజరు వేయాలని, విధులకు డుమ్మా కొట్టే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇక్కడ ఇంతే.. ట్రాఫిక్ అంతే

➡ ఒకటో పట్టణంలోని తాలూకాఫీసు రోడ్డు కూడలిలో రహదారిపైనే వాహనాలు పెడుతున్నారు. ఎంతో వెడల్పుగా ఉండే ఇక్కడ రెండొంతులు రోడ్డుపై ఉంచడంతో ఇరుకులోంచి వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని ట్రాఫిక్ కోరల్లోంచి బయట పడటానికి ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయిం అస్మి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలిచ్చారు. పురపాలక అధికారులు రంగంలోకి దిగి డ్రెయిన్‌ను దాటి ఉన్న వాటిని తొలగిస్తున్నారు. రహదారులపై నిలుపుతున్న వాహనాలను మాత్రం క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

ఎక్కడెక్కడ అంటే.. ఉండి రోడ్డు, జువ్వలపాలెంరోడ్డు, పీపీ రోడ్డు, ప్రకాశంచౌక్‌కూడలి, బుధవారంమార్కెట్, రెస్ట్‌హౌస్‌రోడ్డు, తాలూకాఫీసురోడ్డు, మావుళ్లమ్మ గుడి వీధి తదితర చోట్ల ఏమాత్రం మార్పు లేదు. ఆక్రమణలు తొలగించిన చోటే వాహనాలు నిలపడంతో పరిస్థితి గతం మాదిరిగానే ఉందని ప్రజలు చెబుతున్నారు.

ఏం చేస్తున్నారంటే.. జిల్లాల పునర్విభజన తర్వాత భీమవరం పట్టణానికి సీఐ హోదా కల్పిస్తూ పట్టణ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పడింది. సరిపడా సిబ్బంది లేరనే సాకుతో సేవలు పూర్తిగా విస్మరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రద్దీ కూడళ్లలో కొన్నిచోట్ల సిబ్బంది కనిపించరు. ఉన్నా చరవాణులతోనే కాలం వెళ్లదీస్తారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నిలిచిపోయినా క్రమబద్ధీకరించకుండా ట్రాఫిక్ ఐలాండ్‌లోని గదులకు పరిమితమవుతున్నారని, ప్రముఖుల వాహనాలు వెళ్లే సమయాల్లోనే బయటకు వస్తారని ప్రయాణికులు చెబుతున్నారు.

పంట కాలువలోకి ఆక్వా నీరు

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: దొడ్డనపూడికి తాగునీరు అందించే పంట కాలువలోకి కుప్పనపూడి పరిధిలో ఆక్వా చెరువుల కలుషిత నీటిని వదిలేస్తున్నారని చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని సర్పంచి కొల్లి సుబ్బారావు, గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంగళవారం గ్రామంలో జరిగిన గ్రామసభలో కొద్దిసేపు రగడ జరిగింది. దాంతో సభను అధికారులు వాయిదా వేసినట్లు ప్రకటించి వెళ్లిపోయారు. ఆకివీడు డీసీ ఛైర్మన్ గోకరాజు వెంకటశివరామరాజు, ఇరిగేషన్ డీఈ సత్యనారాయణమూర్తి, ఏఈ జయప్రకాష్, ఎంపీడీవో జి.స్వాతి పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

తాగునీరు.. రోడ్డు పాలు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: కొత్త బస్టాండ్ ఎదుట పాఠశాలను ఆనుకుని రహదారి ప్రారంభంలో, మధ్యలో ఉదయం, సాయంత్రం తాగునీటి పైపులు లీకేజీ అవుతున్నాయి. దీంతో రహదారి గుంతలతో కొలనుగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక నీటి సరఫరా విభాగం ఏఈ టి.సురేంద్ర మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు.

గుంతల లోతు తెలిస్తేనే క్షేమం

పాలకోడేరు, న్యూస్‌టుడే: వేండ్ర శివారు రామచంద్రపురం నుంచి కొండేపూడి మధ్యలో ఆర్అండ్‌బీ రహదారి గుంతలు పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలిచిపోయి రహదారి మరింత ఛిద్రంగా తయారైంది. దీంతో ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు భయపడుతున్నారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని డీఈ పీవీ రామరాజు తెలిపారు.

చదువే ప్రగతికి మూలం

కాళ్ల (భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: చదువే ప్రగతికి మూలమని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు సీహెచ్.పట్టాభిరామయ్య అన్నారు. మాలవానితిప్ప ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ప్రచురించిన పదో తరగతి మోడల్ ప్రశ్నాపత్రాల పుస్తకాలను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, సీహెచ్.కుమారబాబ్జి పాల్గొన్నారు.

"ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు" సామెతలు 31:28

సంస్మరణ - సన్నిధి

వాక్యానుసారమైన - మాటతీరు, నడవడికతో
ఆత్మానుసారమైన -ప్రవర్తన జీవన విధానముతో
ప్రార్థనాత్మతో - మా అందరి ఉన్నతికై పరమందు విజ్ఞాపనము చేయుచున్న
వాక్య నామధేయురాలి - దయను, సత్యమును స్మరిస్తూ....
- తంబాల సుగుణరావు (భర్త) హెడ్మాస్టర్ (రిటైర్డ్), M.A.,B.Ed.
కుమారులు:
షాలేమ్ రాజు M.C.A. - సుజ్ఞానకుమారి B.Tech.
షారోన్ M.B.A. - శైలజ M.Sc., B.Ed. Teacher
కుమార్తె:
షెకీనా M.Sc.,B.Ed. Teacher - G. అనిల్ కుమార్ B.Tech. Software Engineer
మనుమలు: రేహాన్, విలీల్ స్టీఫెన్
మనుమరాండ్రు: అమూల్య జెసింత్, సుజాన్ సెరాఫిమ్

వేదిక : St. మాథ్యూస్ లూథరన్ చర్చ్, చినరంగనిపాలెం, భీమవరం
తేది : 03-12-2025, సమయం : 10 AM Cell : 9160644622

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

మొక్కలతోనే మానవ మనుగడ

యలమంచిలి, న్యూస్‌టుడే: మొక్కలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని పాలకొల్లు ఎస్ఎస్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు తెలియజేశారు. మండలంలోని ఆడవిపాలెంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక శిబిరంలో భాగంగా స్థానికులకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్లలో మొక్కలు నాటారు. చెత్తాచెదారాన్ని తొలగించారు.

రేపు డయల్ యువర్ డీఎస్పీ

నరసాపురం, న్యూస్‌టుడే: మీరు నరసాపురం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారా..? నేరాలు, దాడులు జరిగిన సమయంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అక్కడ న్యాయం జరగలేదని భావిస్తున్నారా..? శాంతి భద్రతలు, ఇతర అంశాలపై మీరు పడుతున్న ఇబ్బందులను డీఎస్పీ జి.శ్రీవేదాంతరావు దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్ చేసి పేరు, ఊరు వివరాలతో సమస్యను స్పష్టంగా తెలియజేయడమే.

తేదీ: 4.12.25(గురువారం) | సమయం: ఉదయం 10-11 గంటల మధ్య | చరవాణి సంఖ్య: 94407 13567

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట :90631 44737
పాలకొల్లు : 80085 74510	పెనుగొండ :80085 74469
పోడూరు : 90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని వలందర్ రేవు రోడ్డులో చెత్త సక్రమంగా తొలగించడం లేదు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయి. -ఎస్.మల్లికార్జునరావు, నరసాపురం.

✔ చర్యలు తీసుకుంటాం. -పాతూరు,శానిటరీ ఇన్‌స్పెక్టర్, పురపాలక సంఘం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ? బ్రాహ్మణచెర్వు-సోదూరు రహదారిలో గోతులు గుర్తించక రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. -సుబ్బరాజు, పెనుమంట్ర

✔ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో బీటీ, సీసీ రోడ్ల పనులు ప్రారంభమవుతాయి. -యశ్వంత్, పీఆర్ఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

? నెగ్గిపూడి లాకులకు వెళ్లే మార్గంలో కాలువ గట్టుపై చెత్త చెదారం పడేస్తున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోంది. -శ్రీను

✔ చర్యలు తీసుకుంటాం -సత్యనారాయణ, కార్యదర్శి

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ? పాలకొల్లు పావురాల పేటలో డ్రైనేజీ పూడిపోయి మురుగునీరు రహదారిపై నిలిచిపోతోంది. దుర్వాసన, దోమలు బెడద భరించలేకపోతున్నాం. -శ్రీనివాస్, స్థానికుడు

✔ పూడిక తీయించి మురుగు నిలవకుండా చూస్తాం. -లక్ష్మణ్, పురపాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? పాలకొల్లు పట్టణ పరిధిలోని ముచ్చర్లవారి తోట లక్ష్మి టవర్స్ పక్కన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంటుంది. వర్షం వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - పీర్‌సాహెబ్, స్థానికుడు

✔ చర్యలు తీసుకుంటాం. -రాజ్‌కుమార్, పురపాలక డీఈ

విద్యార్థులు.. వాలీబాల్‌లో మెరికలు

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: వారంతా పాఠశాల స్థాయి నుంచి వాలీబాల్ సాధన చేస్తున్నారు. ప్రస్తుతం వైఎన్ కళాశాల క్రీడావిభాగం ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలోని అంతర్ కళాశాలల స్థాయి పురుషుల విభాగ పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

చాలా ఇష్టం..

నాకు వాలీబాల్ అంటే చాలా ఇష్టం. మా కళాశాల ఆవరణలోనే పోటీలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది. మా మిత్రబృందంతో కలిసి ఈ పోటీల్లో పాల్గొంటున్నా.

-జె.రవివర్మ , బీకామ్ కంప్యూటర్ సైన్సు, రెండో సంవత్సరం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

నాకు ఇష్టమైన వాలీబాల్‌లో ప్రతిభ కనబరిచి క్రీడా కోటాలో ఉద్యోగ సాధనకు కృషి చేస్తా. ఇక నుంచి ప్రతి రోజూ వాలీబాల్ సాధన చేస్తా. భవిష్యత్తులో తప్పకుండా లక్ష్యాన్ని సాధిస్తా.

-పి.సంతోష్‌కుమార్, బీకామ్ తృతీయ సంవత్సరం

క్రీడలతో సత్ప్రవర్తన..

క్రీడలతో సత్ప్రవర్తన అలవడుతుంది. క్రమశిక్షణ, సమయపాలన, ఆరోగ్యం అన్నీ సమకూరుతాయి. జయాపజయాలతో సంబంధం లేకుండా జట్టులోని సభ్యులందరి మధ్య స్నేహభావం పెంపొందుతుంది.

-చింతకాయల చైతన్య, బీఏ తృతీయ సంవత్సరం

పోలీస్ కావాలని..

నాకు చిన్నప్పటినుంచి పోలీసు ఉద్యోగమంటే ఆసక్తి. దాన్ని సాధించడమే ధ్యేయం. చదువుతోపాటు నాకు ఇష్టమైన వాలీబాల్ ఆడటం ద్వారా దేహదారుఢ్యం పెరుగుతుంది.

-జి.ఆది, ఎంబీఏ మొదటి సంవత్సరం

ఉపన్యసించి.. బహుమతులు గెలిచి

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

పాలకొల్లు: విజేతలతో ఉపాధ్యాయులు

నరసాపురం: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాలకొల్లు మార్కెట్, నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు పాలకొల్లు సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 21 మంది పాల్గొనగా.. వారిలో తొమ్మిదో తరగతికి చెందిన జి.శ్రీవిద్య, ఎ.గిడియాన్, కె.శ్రీరామచంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు పి.ఎం.ఎల్సీ, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ● నరసాపురం పట్టణంలోని శ్రీ భాష్యం ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి మూడు స్థానాల్లో వరుసగా కె.ప్రణవి నాగశ్రీ (తొమ్మిదో తరగతి), కె. శ్వేత (తొమ్మిదో తరగతి), టి.దర్శిని (ఏడో తరగతి) నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, ఉపాధ్యాయులు విజేతలకు బహుమతులు అందజేశారు.

యువ నైపుణ్యంపై విశ్వాసం

జ్యోతి వెలిగించి శిక్షణ ప్రారంభిస్తున్న ఆర్డీవో

పాలకొల్లు, న్యూస్‌టుడే: భారతదేశంలోని యువత నైపుణ్యంపై ప్రపంచమంతా అత్యంత విశ్వాసం కనబరుస్తోందని నరసాపురం ఆర్డీవో దాసిరాజు అన్నారు. స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు ఆయా వనరులు ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. శిక్షణ ఇవ్వడానికి విశాఖపట్నం నుంచి వచ్చిన కె.మురళీకృష్ణ మాట్లాడుతూ మూడు వారాల శిక్షణలో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ ఫండమెంటల్ ఓరియంటల్ తరగతులు చెప్పనున్నట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ కేవీఆర్ నరసింహారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి మండల అధికారి

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారిగా కె.ఆర్.కృష్ణవేణి మంగళవారం విధుల్లో చేరారు. సచివాలయాల పర్యవేక్షణ నిమిత్తం గ్రేడ్ 1 పంచాయితీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించారు. మండలంలోని 15 సచివాలయాల్లో వివిధ కార్యక్రమాలు పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బి.కృష్ణమోహన్ ఆమెకు సూచించారు.

భూసార పరీక్ష ఫలితాలతో ఎరువుల వాడకం

చినమల్లంలో నమూనాలను పరీక్షిస్తున్న విద్యార్థులు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: చినమల్లంలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో భాగంగా మంగళవారం మట్టి నమూనాల సేకరణ, క్షేత్ర సందర్శన, వెస్ట్ డీకంపోజర్ తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం భూసార విభాగ శాస్త్రవేత్త సీహెచ్ శ్రీనివాస్ హాజరయ్యారు. రైతులు వరి కోత తరువాత మిగిలే వరి దుబ్బు గడ్డిని పొలాల్లోనే కాల్చకుండా వెస్ట్ డీకంపోజర్ సహాయంతో కుళ్లబెట్టి భూమిని సారవంతం చేసే విధానాన్ని వివరించారు. మట్టి ఫలితాల ఆధారంగా మాత్రమే ఎరువుల వాడకం నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ టి.ఉషారాణి, పి.అమ్మాజీ, సీహెచ్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

జనవాణిలో పాల్గొన్న నాయకర్

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ● జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీకల్యాణం శివ శ్రీనివాస్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే నాయకర్ మంగళగిరిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై అవగాహన

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సంస్థాగత సేవల రక్షణ అధికారి పి.మమతశ్రీ అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల, వెలివెల జడ్పీ పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన లేక పిల్లలకు వివాహాలు చేస్తున్నారన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అరికట్టడంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098, తహసీల్దార్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు సమాచారమివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ పాల్గొన్నారు.

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

జిన్నూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

పోడూరు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రీ సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ సయ్యద్ మహ్మద్ ఫాజిల్ చెప్పారు. జిన్నూరులో రీసర్వే ముగింపు గ్రామ సభ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. గ్రామంలో 1279.46 ఎకరాల రైతుల జిరాయితీ భూమి, 198.01 ఎకరాల ప్రభుత్వ భూమి రీ సర్వే చేసి భూముల హద్దులు నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో గ్రామంలో మొత్తం 372 సర్వే నెంబర్లు ఉండగా వాటికి రీ సర్వేలో 2040 ఎల్‌పీఎం నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దేవళ్ల ప్రసాద్, తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు పాలవలస తులసీరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.సేవా కిషోర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రాంబాబు, వీఆర్వో నాగరాజు పాల్గొన్నారు. ● పెనుగొండ మండలం ములపర్రులో చేపట్టిన భూ రీ-సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు డి.రాజేశ్ సర్వే చేసిన వివరాలను రైతులకు వినిపించారు. కార్యక్రమంలో వీఆర్వో ఓంకార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులకు నిధుల మంజూరు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం గ్రామాల్లో అసంపూర్తిగా వదిలేసిన గ్రామీణ ఆరోగ్య కేంద్రం(వెల్‌నెస్)భవనాల పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పెనుమంట్ర మండల పరిధిలో మామిడూరుకు రూ.9.60 లక్షలు, మార్టేరు-2కు రూ.9.30 లక్షలు, నత్తారామేశ్వరానికి రూ.3.40 లక్షలు, పెనుమంట్ర-2కు రూ.8.40 లక్షలు, పొలమూరు-1కు రూ.8.60 లక్షలు, సోమరాజు ఇల్లింద్రపర్రు రూ.8.10 లక్షలు, వెలగలేరుకు రూ.8.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులను పూర్తి చేసి ఆయా భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని పీఆర్ ఏఈ అశోక్ తెలిపారు.

తాగునీరు కలుషితం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మల్లవరం- తిల్లపూడిపాలెం ప్రధాన రహదారి నుంచి అమ్మవారి గుడి మీదుగా ఎస్సీ ఏరియా వెళ్లే రక్షిత మంచినీటి పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. కచ్చా డ్రెయిన్ కింద ఈ పైపులైను ఉండటంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ కె.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి సూచిస్తానని పేర్కొన్నారు.

పెంచలయ్య హత్యకు నిరసన

పెనుగొండ, న్యూస్‌టుడే: గంజాయి ముఠా చేతిలో దారుణంగా హత్యకు గురైన నెల్లూరు జిల్లాకు చెందిన ప్రజా కళాకారుడు, సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ అన్నారు. మంగళవారం కళాశాల సెంటర్‌లో సీపీఎం పెంచలయ్య హత్యకు నిరసన తెలిపారు. హత్య చేసిన వారిని, గంజాయి ముఠాను కఠినంగా శిక్షించాలని, పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు ఏవీ?

రైతులకు పెరుగుతున్న సాగు వ్యయం

బ్రాహ్మణచెర్వు సమీపంలో బరకంపై చేరిన వర్షపునీరు

పెనుగొండ, మార్టేరు. న్యూస్‌టుడే: డెల్టాలో వరి మాసుళ్ల ముమ్మరంగా సాగుతున్న తరుణంలో దిత్వా తుపాను రైతులకు కష్టాలు తెచ్చిపెట్టింది. యాంత్రీకరణ పెరిగినప్పటికీ ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో రైతులు ధాన్యం ఆరుదలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొడి వాతావరణం లేక, వాన నుంచి పంట భద్రపర్చడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఈ తరుణంలో బరకాలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. బయట మార్కెట్‌లో వీటి ధరలు ఆకాశాన్ని అంటడంతో రైతులు రాయితీ బరకాల కోసం ఎదురు చూస్తున్నారు. రాయితీ టార్పాలిన్ల అవసరాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు ఏడీఏ రమేశ్ తెలిపారు.

8 హెక్టార్లలోనే మాసూళ్లు.. మార్టేరు, పాలకొల్లు, నరసాపురం వ్యవసాయ డివిజన్ల పరిధిలో 35 వేల హెక్టార్లలో వరి సాగు చేయగా.. ప్రస్తుతం 8 వేల హెక్టార్లలో మాత్రమే మాసూళ్ల ప్రక్రియ పూర్తయ్యింది. సుమారు 15 వేల హెక్టార్లలో పంట కోతకు సిద్ధంగా ఉండగా.. 13 వేల హెక్టార్లలో పంట మాసుళ్ల వివిధ దశల్లో న్నట్లు ప్రాథమిక అంచనా. వర్షం తీవ్రత పెరిగితే మాసుళ్ల దశలో ఉన్న పంటకు నష్టం జరిగే అవకాశం ఉంది.

వానొచ్చే.. ధరలు పెరిగే .. తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. గట్లు, రహదారులపై ఉన్న పంటపై కప్పేందుకు మార్కెట్‌లో బరకాల కోసం పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని వ్యాపారులు అందిన కాడికి దోచుకుంటున్నారు. నాణ్యతను బట్టి రూ.1800 నుంచి రూ.4 వేల వరకు బరకం ధర పలుకుతోంది. ఒక మాదిరి బరకం కొనుగోలు చేయాలంటే కనీసం రెండు వేలు వెచ్చించాల్సిందే. ఇక గ్రామాల్లో యూరియా, రొయ్యల మేత సంచులతో తయారు చేసిన బరకాలు అద్దెకు ఇస్తుంటారు. ప్రస్తుతం వర్షం పడుతున్న దృష్ట్యా రోజువారి అద్దె ఒక్కొక్క దానికి రూ.10 నుంచి రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారు. పంట మాసూళ్లు పూర్తి కావడానికి సుమారు వారం రోజులు పడుతుందని, ఈలోగా పంట రక్షణకు బరకాల అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన గణేష్ భవానీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖమంత్రి నారాలోకేశ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దాల గణేష్ భవానీ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన బడుగుబలహీన వర్గాల ప్రజలకు పింఛను ఇవ్వాలని, బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేయడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫిర్యాదులపై చర్యలేవీ?

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నడిపూడి పంచాయతీలో నిధుల అవకతవకలపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని తెదేపా నాయకులు పేర్కొంటున్నారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మన్నె రమేష్ మాట్లాడుతూ డివిజనల్ పంచాయతీ అధికారుల విచారణలో అవకతవకలు జరిగినట్లు అనేక ఆధారాలు కనబడినా.. నివేదిక సమర్పించకుండా ఫిర్యాదును ముగించడం సబబు కాదన్నారు. పంచాయతీ సొమ్మును రికవరీ చేసి, కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సత్యనారాయణ, చినబాబు, సురేష్‌బాబు, జగదీష్, వెంకట్రావు ఉన్నారు.

ఆరోగ్య సూచనలు చేస్తున్న రాజ్యలక్ష్మి

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే సమతుల ఆహారంతోనే సాధ్యమవుతుందని వైద్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. నరసాపురానికి చెందిన యునైటెడ్ కాపు వనితాక్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్యశిబిరాన్ని పాలకొల్లులో మంగళవారం నిర్వహించారు. శిబిరంలో మధుమేహ, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. విజయ ల్యాబ్ సిబ్బంది వృద్ధులకు అవసరమైన రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. రాహుల్ వృద్ధాశ్రమం నిర్వాహకుడు ఉమామహేశ్వరరావు, వనిత క్లబ్ అధ్యక్షురాలు బండి స్వర్ణలత పాల్గొన్నారు.

స్వచ్ఛంద సహకారం

రోడ్డు నిర్మాణానికి ఆటంకంగా ఉన్న గోడ తొలగిస్తూ..

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట రోడ్డు వెడల్పుకు ఆటంకాలు ఒక్కొక్కటిగా తొలగుతున్నాయి. మార్కెట్ నుంచి కచేరీ సెంటర్ వరకూ 200 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మూడు మలుపుల్లో కొన్ని నిర్మాణాలు ఆటంకంగా ఉన్నాయి. వాటిని తొలగిస్తే కాని రోడ్డు వెడల్పు సాధ్యం కాదు. దీనిపై ఆచంట తెదేపా సీనియర్ నాయకుడు గొడవర్తి శ్రీరాములు తదితరులు వాటి యజమానులను ఒప్పించడంతో స్వచ్ఛందంగా అడ్డు గోడలు తొలగిస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్ స్పందిస్తూ స్థానికులు, నాయకుల సహకారంతో అందర్నీ ఒప్పించి రోడ్డు నిర్మిస్తున్నామన్నారు.

పరిశుభ్రతను పాటించండి

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పెనుగొండ, న్యూస్‌టుడే: విద్యార్థినులు స్వచ్ఛతను, పరిశుభ్రతను పాటించి ఆరోగ్యానికి బాటలు వేసుకోవాలని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. వసతిగృహ గదులకు దోమలు రాకుండా మెస్‌లను ఏర్పాటు చేశారా లేదా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ పరిసరాల్లో చెత్త లేకుండా చూసుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎన్.సుభాషిణి, ఆరోగ్య సహాయకులు కె.వి.సత్యనారాయణ, వి.నాగార్జున, గ్రామ ఆరోగ్య కార్యదర్శి స్వర్ణలత పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి తమలపాకుల అర్చన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో మొగల్తూరు రోడ్డులోని భక్తాంజనేయ స్వామి ఆలయంతో పాటు పలు ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం క్షీరాభిషేకాలు, తమలపాకులతో అర్చనలు, విశేషంగా నిర్వహించారు. ● నరసాపురం పట్టణంలో మొగల్తూరు రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం సందర్భంగా బుధవారం ఉదయం రుద్రాభిషేకం, తమలపాకుల పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు కెనాల్ రోడ్డులో దాసాంజనేయస్వామి, యడ్ల బజారు పంచముఖ అంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం స్వామికి సిందూరం, తమపాలకుతో అర్చనలు చేశారు.

భవానీల నగర సంకీర్తన.. **పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** సిద్ధాంతంలో గురు భవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం భవానీ భక్తులు గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు.

పంచామృతాభిషేకాలు.. **పెనుగొండ, న్యూస్‌టుడే:** స్థానిక వాసవీశాంతిధాంను మంగళవారం అమెరికాకు చెందిన ఆకారపు రమేశ్, మాధవి దంపతులు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ అమెరికాలోని పలు ప్రాంతాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాలు ఉన్నాయని, ఇక్కడ 90 అడుగుల వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని చూసి తన్మయత్వానికి లోనయ్యామన్నారు. దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించగా.. ఆలయ కమిటీ సభ్యులు వారిని సత్కరించారు.

ప్రత్యేక పూజలు .. **పెనుగొండ, న్యూస్‌టుడే:** స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ఆలయ అర్చకుడు కందుకూరి ఫణి పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

మొగల్తూరు, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలుర రగ్బీ విభాగంలో మొగల్తూరు మండలం కేపీ పాలెంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.దానియేలు, బి.నాగేంద్ర జిల్లా స్థాయిలో ప్రతిభ చూపారు. వీరిలో జి.దానియేలు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పితాని ఇందిర తెలిపారు. ఈ నెలలో భువనేశ్వర్‌లో నిర్వహించే అండర్ 17 జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నట్లు పాఠశాల పీడీ గుత్తుల జయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, విద్యా కమిటీ ఛైర్మన్ బి.ప్రసాద్ అభినందించారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

మొగల్తూరు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సి.హెచ్.జయలక్ష్మి తెలిపారు. ఆమె కథనం మేరకు.. పట్టణానికి చెందిన రామాని గోపాలకృష్ణ(51) తన తల్లిని ద్విచక్ర వాహనంపై కాళీపట్నం పడమర పల్లవపాలెం నుంచి తీసుకొస్తూ టీ తాగేందుకు పట్టణంలో ఒకచోట ఆగారు. ఈ క్రమంలో దుకాణం దగ్గరకు వెళ్లేందుకు నడుస్తూ రోడ్డు దాటుతుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాలకృష్ణ సంఘటన స్థలంలో మృతి చెందారు. మృతుడి కుమారుడు ప్రసాదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

చివరిలో చిదిమేసింది

దిత్వా తుపానుతో అన్నదాతలకు నష్టం

కొడమంచిలిలో నేలకొరిగిన వరి

ఆచంట, పెనుగొండ గ్రామీణ, పోడూరు, న్యూస్‌టుడే: దిత్వా తుపాను ప్రభావంతో మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో పంట చేతి కందే దశలో రైతులు నష్టపోతున్నారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో 80కి పైగా గ్రామాల్లో 30 నుంచి 35 శాతం మాత్రమే ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యాయి. నరసాపురం డివిజన్‌లో 1,62,785 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా రైతుల అమ్ముకున్నది 20 వేల మెట్రిక్ టన్నుల లోపే. వర్షంతో ఆదివారం వరి కోతలు ఆగిపోయాయి. సోమవారం కాస్త నెమ్మదించినా మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ వర్షం పడుతూనే ఉంది. మరో రెండు రోజులు వాతావరణం ఇలాగే ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చేతికందిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం రాసుల కిందకు వర్షపు నీరు చేరడంతో నష్టం తప్పదని వాపోతున్నారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు పి.మురళీకృష్ణను సంప్రదించగా తేమ 22 శాతం ఉన్నా మిల్లర్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

దోబూచులాడిన వాతావరణం.. మంగళవారం ఉదయం వాతావరణం అనుకూలంగా ఉండటంతో యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టారు. మధ్యాహ్నం నుంచి వర్షం పడుతుండటంతో అన్నదాతలు ఉరుకులు పరుగులతో ధాన్యం ఒబ్బిడి చేసుకోవడంలో తలమునకలయ్యారు. పెనుగొండ మండలంలోని సిద్ధాంతం, ఇలపర్రు, ములపర్రు, వడలి, దేవ, తదితర గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. ● పోడూరు మండలంలోని జగన్నాథపురం, పండితవిల్లూరు, తూర్పుపాలెం, మినిమించిలిపాడు గ్రామాల్లో ధాన్యం తడవకుండా రైతులు టార్ఫాలిన్‌లు కప్పి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



జాతీయ సేవా శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో సీతారాంపురం సౌత్‌లో చేపట్టిన సేవా శిబిరం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్తు పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. 6, 7, 8 తరగతి విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కేవీ స్వామి, అడ్డాల శ్రీహరి, ఎస్.సురేశ్‌కుమార్, గోపీచంద్, ఎన్ఎస్ఎస్ పీవో ఎంవీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

అడబాల వెంకటసుబ్బారావు, S/o. సత్యనారాయణ అను నేను తూర్పుతాళ్ళు గ్రామంలోని మా ఇంటి వద్ద నుండి నరసాపురం జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా R.S.No. 41లో 774.4 Sq.Yds. లకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 263/1965 గలది పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడబాల వెంకట సుబ్బారావు, S/o. సత్యనారాయణ
H.No. 2-134, పులపర్తివారిపాలెం
తూర్పుతాళ్ళు గ్రామం, నరసాపురం మండలం

(c) eenadu

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్ఠి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అభిషేకాలు చేశారు. పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అలంకరణలో స్వామివారు

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

లేబర్ కోడ్స్ రద్దు చేయండి : ఐఎఫ్‌టీయూ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు దానవర్షప్రసాద్ కోరారు. ఇఫ్టూ రాష్ట్ర కమిటీ ముద్రించిన గోడపత్రాలను స్థానిక శేషమహల్ కూడలిలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు అవుతున్నప్పటికీ ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు.

శంకరమఠం ఆలయంలో కొలువైన అమ్మవారు

సర్వమంగళ అమ్మవారికి నవావరణార్చన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక చిన్నవంతెన వద్ద గల శంకరమఠం ఆలయంలో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి నవావరణార్చన పీఠాధిపతి వేదవిద్యానంద ఆధ్వర్యంలో శ్రీచక్రార్చన వైభవంగా నిర్వహించారు. తొమ్మిది వారాలు అమ్మవారికి పూజలు చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద ఏర్పాట్లు చేశారు.

కలగా ఈఎస్ఐ ఆసుపత్రి

వైద్య సేవలు అందక ఇబ్బందుల్లో కార్మిక కుటుంబాలు

తణుకు, న్యూస్‌టుడే: తణుకులో 30 పడకల కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ) ఆసుపత్రి నిర్మాణం శ్రామికులకు కలగా మిగిలింది. ఏళ్ల తరబడి స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నా ఈ కల సాకారం కావడం లేదు. దీంతో ఇది డిస్పెన్సరీకి మాత్రమే పరిమితమైంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి లేక కార్మికులు వైద్యం కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తణుకు ఈఎస్ఐ కార్యాలయం పరిధిలో సుమారు 15 స్పిన్నింగ్ మిల్లులు, ఆంధ్రా సుగర్స్ అట్లాస్, పేపర్ మిల్లు, రొయ్యలు, నూనె, హెయిర్ పరిశ్రమలతోపాటు పాఠశాలలు, షాపింగ్ మాల్స్ తదితర వాటిల్లో సుమారు 16 వేల మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు 13 వేల మంది వరకు ఉన్నారు. వారందరికీ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎంత ఖర్చయినా ఉచితంగా వైద్యం అందిస్తారు. ఈ సేవలు పొందలేకపోతున్నామని.. మరోవైపు డిస్పెన్సరీ కావడంతో గర్భిణులు, క్యాన్సర్ తదితర రోగులు రాజమహేంద్రవరం, విజయవాడ వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

డిస్పెన్సరీకి వచ్చిన శ్రామికులు

సెలవు పెడితే అంతే సంగతులు

ఈ డిస్పెన్సరీలో రోజూ సుమారు 130 మంది వరకు ఓపీ ఉంటోంది. వారికి సేవలు అందించేందుకు ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒకరు మాత్రమే పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. మరో వైద్యుడు వారంలో మూడు రోజులపాటు జిల్లా విధులు నిర్వహించాల్సి ఉండగా ఒక రోజు మాత్రమే వస్తున్నారని, అది కూడా సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న ఒక్క వైద్యుడు సెలవు పెడితే అంతే సంగతులు. అత్యవసర సమయాల్లో ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని చేయని ఎనలైజర్

పరికరాలు లేక పరీక్షలు సాగక

ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నప్పటికీ పరికరాలు పని చేయక డెంగీ, మలేరియా, మధుమేహం తదితర కిట్లు అందుబాటులో లేక రోగ నిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. ల్యాబ్ టెక్నీషియన్‌కు పని లేకపోవడంతో సమయం వృథా అవుతోంది. నిత్యం 5 నుంచి 10 కేసులు వరకు రిఫర్‌ల్లో పంపిస్తున్నారు. కిట్లు, పరికరాలు అందిస్తే సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం : 99488 53114
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం: 63005 79402
అత్తిలి : 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీ ఏఓ రోడ్డు రహదారిలో మురుగు బోదెలు లేక నీరు చేరి రహదారి పాడవుతోంది. - అమీనాథ్

✔ నీటి నిల్వలు లేకుండా చూస్తాం - ఎం.సుబ్బారావు, పురపాలక కమిషనర్

? తాడేపల్లిగూడెం నవ్వారుపేట శివారు రోడ్డులో చెత్త పేరుకుపోయి రహదారిపైకి వస్తోంది. - ప్రసాద్

✔ చెత్త తొలగింపజేస్తాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

ఇరగవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 5 నెలల కాలానికి ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు దరఖాస్తులు కోరుతున్నామని ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. తణుకు నియోజకవర్గ పరిధిలో ఖాళీలున్నట్లు చెప్పారు. ఇరగవరం మండలంలో గోటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాపాక ఎంపీయూపీ పాఠశాల, తణుకు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, తణుకు బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సంస్కృతం, అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉద్యోగాలు ఖాళీలున్నాయన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీలోగా నేరుగా ఎంఈవోలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 12,500 చొప్పున గౌరవ వేతనం అందిస్తారని వివరించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

బాల్య వివాహం నేరం

తణుకు, న్యూస్‌టుడే: బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్వీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళా చట్టాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : పెంటపాడు మండలంలోని పలు పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

చరవాణితో సమయం వృథా

తణుకు, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ఇరగవరం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనవసర విషయాలకు చరవాణి ఉపయోగించడంతో సమయం వృథాతోపాటు ఆరోగ్యం ఎలా హరించుకుపోతుందో ఉపన్యాసాలిచ్చి బాలలు ఆకట్టుకున్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బి. గౌతమి నాగ ప్రణయ్, కె.నందిని, కె.జ్యోత్స్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని కె.నాగమణి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కె.మునీంద్ర, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

కృత్రిమ మేధతో మానవాళిలో మార్పులు

కడకట్ల(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కడకట్లలోని గోయెంకా మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'కృత్రిమ మేధ వల్ల భవిష్యత్తులో వచ్చే మార్పులు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వి. గీతిక, సీహెచ్.అరుణగ్రేసి, డి.భవితకు కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ గణపతిరామ్, అధ్యాకులు బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ గణపతిరామ్, అధ్యాపకులు

గురుకుల విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

ధ్రువపత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో బొలిశెట్టి

గణేష్‌నగర్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరంలో బహుమతులు సాధించిన పెదతాడేపల్లిలోని అంబేడ్కర్ పీఎంశ్రీ గురుకుల పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజారావు, ఉపాధ్యాయులు మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలో జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరంలో పాల్గొని 9 విభాగాల్లో బహుమతులు గెలుచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రిన్సిపల్ రాజారావు మాట్లాడుతూ జంబోరీ శిబిరానికి అన్ని రాష్ట్రాల నుంచి 20 వేల మంది పాల్గొన్నారన్నారు. మన రాష్ట్రం నుంచి 450 మంది పాల్గొనగా పశ్చిమగోదావరి పెదతాడేపల్లి అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి 56 మంది పాల్గొన్నారని తెలిపారు. వారు పది పోటీల్లో పాల్గొనగా 9 పోటీల్లో మంచి గ్రేడులు సాధించారని వివరించారు. విద్యార్థులు ప్రత్యేకంగా పాల్గొన్న బ్యాండు ప్రదర్శనకు ప్రథమ బహుమతి వచ్చిందని తెలిపారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి వై.నారాయణ, సమగ్ర శిక్షా అధికారి శ్యాంసుందర్, డీసీవో ఉమాకుమారి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి ఉంగరాల నాగేశ్వరరావు అభినందించారు.

పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి

పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పల్లెల్లో పరిశుభ్ర వాతావరణం కనిపించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. అందుకు పంచాయతీలు, ప్రజలు కట్టుబడి పనిచేస్తే స్వచ్ఛ పల్లెలు సాకారమవుతాయని తెలిపారు. పెదతాడేపల్లి గ్రామంలో మంగళవారం ఇంటింటికీ చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యదర్శి రవి చంద్ర, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

హౌసింగ్‌బోర్డు కాలనీ కూడలిలో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: హౌసింగ్‌బోర్డు కాలనీ కూడలిలో ఆక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను మంగళవారం మున్సిపల్ అధికారులు పోలీసు సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో త్వరలో రైతు బజారు ఏర్పాటు చేయనున్నామని, ఈ ప్రాంతంలో ఒక శౌచాలయం కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ వద్ద గల ఆక్రమణలు కూడా తొలగించామని.. ఆ ప్రాంతంలో సుందరీకరణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే పవన్ మెస్ ప్రాంతంలో కొన్ని ఆక్రమణలు, చెట్లను తొలగించినట్లు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ అధికారి జగదీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు పారదు.. దుర్వాసన వీడదు

తాడేపల్లిగూడెం పట్టణం పరిధిలోని కడకట్ల కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్లే రహదారిలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మురుగు కాలువ వ్యవస్థ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని.. మురుగులో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

ఆ కూడలి.. ప్రమాదాల లోగిలి

తాడేపల్లిగూడెం పట్టణం పరిధిలోని వెంకట సుబ్బయ్య కాలనీలో డ్రెయినేజీపై ఉన్న రాళ్లు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గుంతలతో రాత్రి వేళ రాకపోకల సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని నెలలుగా ఇలాగే ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్

నిబంధనలకు పాతరేసి.. అడ్డదిడ్డంగా దూరేసి

పెదతాడేపల్లి వద్ద 216ఎ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. కమ్మ కల్యాణ మండపం సమీపంలో పెదతాడేపల్లికి వెళ్లడానికి విభాజకం వద్ద అనుసంధాన రహదారి లేక తణుకు వైపు నుంచి ఏలూరు వైపు వచ్చే వాహనచోదకులు ప్రమాదకరంగా విభాజకాన్ని దాటుతున్నారు. ఏలూరు నుంచి తణుకు వెళ్లే వాహనాలు వేగంగా వస్తున్నాయి. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు కొనసాగుతున్నాయి. గతంలో హైవే పహారా పోలీసులు నిఘా పెంచారు. ప్రస్తుతం అధికారులు వాహనాలను అదుపు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెదతాడేపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్)

ఆస్తి వేలం ప్రకటన
ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తాడేపల్లిగూడెం వారి కోర్టులో
EP96/2012 In OS No.653/2002

బిట్వీన్
మార్నిడి సత్యనారాయణ ...D.H.R
మరియు
1). గూడా రామచంద్రరావు ..1st JDR (Died)
2). మార్నిడి సావిత్రి
3). గుండా శ్రీనివాసరావు
4). గుండా ఈశ్వరరావు
5). గుండా దుర్గ 2to 5 JDR's

పై నెంబరు గల దావా డిక్రీ వసూలు బాకీ నిమిత్తం దిగువ షెడ్యూల్ ఆస్తి ది. 19.12.2025 వసం తేదిన ఉ॥ 10.30 ని॥లకు పైన తెలియజేసిన కోర్టు వారిచే వేలం వేయబడును. ఆసక్తి కలవారు సదరు వేలంలో పాల్గొనవసినదిగా తెలియజేస్తున్నాను.

షెడ్యూలు : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, 22వ వార్డు సవ్యిత పేటలో 9-7/7 కల్గిన అస్సెస్‌మెంట్ నెం.5707 గల 3 గదుల పోర్షను ఇంటికి **హద్దులు: తూర్పు** : వాసా రామారావు గారి ఇల్లు , **దక్షిణం:** ఎమ్.సూర్యకాంతం పోర్షన్ **పడమర:** సందు, మంగినీడి వెంకటరామారావు ఇల్లు **ఉత్తరం:** మట్టా మోహనరావు ఇల్లు .

పై హద్దులమధ్య గల 3 గదుల డాబా పోర్షను ఇల్లు ఎలక్ట్రికల్, వాటర్‌కనెక్షన్‌తో సహా, పై షెడ్యూలు ఇంటిలో 1/3వ వంతు 1st JDR (Died) జాయింటు అనిర్ధిష్టపు వాటా

డి.హెచ్.ఆర్. వాల్యు : 4,33,000/-
అమీనా వాల్యు : 13,00,000/-
(మొత్తం షెడ్యూలు ఆస్తికి)

పండూరి రామం
న్యాయవాది
సెల్ : 7382083577
తాడేపల్లిగూడెం
ది. 02.12.2025

బలహీన వర్గాల అభ్యున్నతికి సుబ్బరాజు కృషి

తణుకు, న్యూస్‌టుడే: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడు భూపతిరాజు సుబ్బరాజు అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు సుబ్బరాజు వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల ఉద్యానంలో ఆయన కుమారుడు బి.రమేష్ చంద్ర బాబు, కుమార్తె ఝాన్సీలక్ష్మి ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. విశ్రాంత ప్రిన్సిపల్ సంకు మనోరమ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, వైద్యుడు వత్సవాయి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ప్రముఖులు

శ్రీనివాసరావు సేవలు ఎనలేనివి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో గ్రేడ్-1 గ్రంథాలయాధికారిగా పని చేసిన వానపల్లి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠకుల సంఘం బాపయ్యశర్మ అధ్యక్షతన మంగళవారం ఆయన్ను సన్మానించింది. ముఖ్య అతిథులుగా పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల గ్రంథాలయాల కార్యదర్శులు శేఖర్‌బాబు, రవికుమార్ పాల్గొన్నారు. 40 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలందించారని పలువురు కొనియాడారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు. పస్తుత గ్రంథాలయ అధికారి వై.వి.సాయిబాబా, ప్రత్తి వీరాస్వామి, ఎ.వి.లక్ష్మణరావు, జనార్ధనరావు, కె.వి. ప్రకాష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల్లో అద్దెకు బరకాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో ధాన్యం రాశులపై కప్పేందుకు సహకార సంఘాల్లో రైతులకు టార్పాలిన్లు అద్దెకు ఇచ్చే ఏర్పాటు చేశామని మండల వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు మంగళవారం చెప్పారు. ఒక్కోదానికి రోజుకు అద్దె రూ.20 చెల్లించాలన్నారు. టార్పాలిన్లు కొనుగోలు చేయాలనుకుంటే రూ.1800కు విక్రయిస్తున్నారన్నారు. రేలంగిలో వరి చేలను పరిశీలించారు. ఇప్పటి వరకు 6 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు ఆయన వివరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలో యాచకత్వం చేస్తూ జీవించే వ్యక్తి మృతి చెందగా ఉందుర్తిపాల్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం కోర్టు సమీపంలో యాచకుడు మృతిచెందగా ఫౌండేషన్ సభ్యులు పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ ఉందుర్తి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ మనిషి చివరి ప్రయాణం కూడా గౌరవంతో ఉండాలని, అదే మానవత్వానికి నిజమైన అర్థమన్నారు. ఈ సేవలో దున్న అమర్ బాబు, తలపాకు అఖిల్, అభిషేక్ బోస్, నేకూరి రమేష్, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

తారకాపురి లయన్స్ సేవలు అభినందనీయం

తణుకు, న్యూస్‌టుడే: తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఇంపల్స్ జూనియర్ కళాశాల ఆవరణలో తారకాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆహారపు అలవాట్ల కారణంగా ఇటీవల కాలంలో క్యాన్సర్ వ్యాధి విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని చెప్పారు. ఈ నెల 7న తణుకులో నిర్వహిస్తున్న 2కె, 5కె, 10కె మారథాన్‌లో పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్లబ్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రసూతి, సాధారణ వ్యాధులు, దంత, నేత్ర సంబంధిత 500 మంది రోగులకు వైద్యులు సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు.

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న రాధాకృష్ణ

6న కొమ్మరలో.. **అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే :** ఈ నెల 6న అత్తిలి మండలం కొమ్మరలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ గ్రామ తెదేపా అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణ రాజు ఆర్థిక సహకారంతో ఉచిత క్యాన్సర్ చికిత్సా శిబిరం ఏర్పాటు చేశామని లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కొమ్మర పంచాయతీ వద్ద ఉచిత క్యాన్సర్ చికిత్సా శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ పరిశోధన శిక్షణ సంస్థ వైద్యుల ఆధ్వర్యంలో రోగులకు సేవలు అందిస్తామని బాలకృష్ణరాజు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభిస్తారని చెప్పారు.

5న తల్లిదండ్రుల సమావేశం

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 5న తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు మంగళవారం చెప్పారు. మండల స్థాయి అధికారులు ఒక్కొక్కరు ఏదో ఒక పాఠశాలకు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పాఠశాలకు హాజరయ్యేలా సమాచారం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో పెంటపాడు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిత్వా తుపానుతో అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సీహెచ్ రవికుమార్ గ్రామాల్లో పర్యటించి వ్యవసాయ అధికారులతో కలిసి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ మండలంలో 21,900 ఎకరాల్లో వరి సాగవుతుండగా 17,150 ఎకరాల్లో మాసూళ్లు పూర్తి చేశారన్నారు.

సుప్రీం లోకల్ శిక్షణ కేంద్రంపై అవగాహన

మారంపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మారంపల్లి గ్రామంలో సుప్రీం లోకల్ శిక్షణ కేంద్రంపై ఉమ్మడి జిల్లా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సమన్వయ అధికారి గుర్రాల ప్రసింగిరాజు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఆ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. చెత్త రహిత గ్రామంగా మారంపల్లిని తయారు చేసేందుకు ప్రజలను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, పంచాయతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు శ్రీ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్)
ఈ.పి.నెం. 25/2020 ఇన్ ఓ.యస్.నెం. 289/2012
బిట్వీన్:
కొత్త వీరభద్రరావు ... డిహెచ్‌ఆర్/వాది
అండ్
బోడ సత్యనారాయణ (డైడ్) అండ్ వగైరా ... జేడీఆర్స్

డి.హెచ్.ఆర్. తరపున చేసిన వేలం ప్రకటన

పై నెంబర్ ఈ.పి.లో జేడీఆర్స్ తాలూకా దిగువ షెడ్యూల్ ఆస్తిని ది. 19-12-2025వ తేదీన ఉదయం 10.30 గం. లగాయితు శ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్ట్, తణుకు వారి ఎదుట బహిరంగ వేలం జరుగునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.
షెడ్యూల్ ఆస్తి వివరం: పశ్చిమగోదావరి జిల్లా, తణుకు సబుడిలో చేరిన తణుకు మండలం, దువ్వ గ్రామం తాలూకా, జిరాయితీ మెరక ఆర్.యస్.నెం. 56/2కు పురా య. 1.61 సెంట్స్‌లో ఉత్తరం వైపు య. 0.80 1/2 సెంట్స్‌లో తూర్పు వైపు య. 0.50 సెంట్స్ భూమికి హద్దులు: **తూర్పు:** వంకాయల వెంకటరత్నం గారి భూమి, **దక్షిణం:** మానేపల్లి బాపిరాజు వగైరాల ఈ నెంబర్‌లో భూమి, **పడమర:** ఒబిలిశెట్టి రంగారావు గారి తాలూకా యీ నెంబర్‌లో భూమి, **ఉత్తరం:** గరగ రామయ్య గారి భూమి
యీ హద్దుల మధ్య య. 0.50 సెంట్స్ లేక హె. 0.202 ర్లు భూమి ఇందలి సమస్త యీజుమెంట్ హక్కులు వగైరాలతో సహా.
డిహెచ్ఆర్ విలువ: రూ. 5,00,000/–
జేడిఆర్ విలువ: తెలిపి వుండలేదు
మార్కెట్ విలువ: రూ. 24,00,000/– ఎకరానికి
అమీనా విలువ: రూ. 40,00,000/– ఎకరానికి
సం/- **ఐనంపూడి కామేశ్వరరావు**
ఐనంపూడి శ్రీదేవి కృష్ణవేణి
అడ్వకేట్స్, తణుకు
99664 99955, 73969 99447
తణుకు
01-12-2025

దారి.. గుంతలమయంగా మారి

గణపవరం- పిప్పర రహదారి ప్రయాణికులకు నరకం చూపుతోంది. ఇటీవలి వర్షాలకు రోడ్డు ఛిద్రంగా మారగా.. చిన్నపాటి మరమ్మతులు చేశారు. మార్గం మధ్యలో భారీ గుంత ఏర్పడటంతో.. అక్కడ ప్రమాదాలు సంభవించకుండా స్థానికులు బకెట్, దానిపై కర్ర పెట్టి.. ఎరువు సంచి కట్టారు. - న్యూస్‌టుడే, గణపవరం

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపిక

నిడమర్రు, గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 27న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 8, 9వ తరగతి విద్యార్థినులు ఏంజెల్, గీతా మాధురి విశేష ప్రతిభ కనబరిచి.. రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. వారిని ఎంఈవో-1, 2 అనూరాధ, శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు నరేశ్‌బాబు అభినందించారు.

ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్ - ఫ్రేమ్స్ ప్రమాణాల ప్రకారం జీవవైవిధ్యం - పర్యావరణం & భాగస్వామ్యం - సామాజికం ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపుల సమావేశం

	ఫార్మ్ పేరు	చిరునామా	జి.పి.ఎస్.	తేదీ
1.	నంద్యాల రవి ఆక్వా ఫామ్	కంచుమర్రు గ్రామం, అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా	16.6540883, 81.5878579	10-12-2025 10 AM
2.	పాండురాజు ఆక్వా ఫామ్	పాలూరు, మంచిలి గ్రామం, అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా	16.65892, 81.5906	10-12-2025 10 AM

ఎన్‌కె.మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ఎల్.ఎల్.పి,
సర్వే నెం: 750, దోసపాడు పుంతరోడ్, దువ్వ గ్రామం
తణుకు మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 534156.
మీ సూచనలు మరియు అభిప్రాయాలను services@greenranks.com ఇమెయిల్ ద్వారా తెలుపవచ్చు
గ్రీన్ ర్యాంక్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, www.greenranks.com

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
బుధవారం డిసెంబరు 3, 2025 5

ఇరుముడి కట్టి.. శబరిమలకి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని పెండ్లిమర్రి మండలం వెల్లటూరులో మంగళవారం వైభవంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీ చెన్నకేశవ స్వామి సన్నిధిలో అభిషేక ప్రియుడిని కొలువుదీర్చారు. అభిషేక, కలశ పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా దేవుళ్ల వేషధారణలో కళాకారులు అలరించారు. కేరళ వాయిద్యాలు, కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయ్యప్ప భక్తులు, మహిళలు దీపాలు పట్టుకుని స్వామి శరణమంటూ భక్తిగీతాలు అలపిస్తూ ఉత్సవంలో పాల్గొన్నారు.

గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు.. శ్రీరాముడి వేషధారణలో కళాకారులు.. (అంతర్‌చిత్రంలో) ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

వనం వీడి పాలాల్లో హరిణులు

అడవుల్లో చెంగు చెంగున గెంతుతూ కనిపించే జింకలు ఇప్పుడు పొలాల బాట పట్టాయి. ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు పంటలు సాగు చేశారు. దీంతో వనం వీడిన హరిణులు మైదాన ప్రాంతాలకు చేరుతున్నాయి. ఆహారం, నీరు సమృద్ధిగా దొరుకుతుండటంతో పొలాల్లోనే ఉంటిపోతున్నాయి. కమలాపురం- ఎర్రగుంట్ల మధ్య రైతులు సాగు చేసిన మినుము పొలాల్లో గుంపులుగా విహరిస్తున్న జింకలను చిత్రంలో చూడొచ్చు. - ఈనాడు, కడప

ఊళ్ల చుట్టూ కన్నీళ్లు

◆ నివాసాల్లోకి సోమశిల వెనుక జలాలు ◆ భయాందోళనలో ముంపు ప్రాంత వాసులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం ముంపు ప్రాంత వాసులకు అంతులేని శోకం మిగిల్చింది. బాధిలను కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు. పసిడి పంటలు పండే సారవంతమైన భూములకు పరిహారం చెల్లించారు. నివాస గృహాలకు మాత్రం అదిగో ఇదిగో అంటూ దశాబ్దం నుంచి ఊరిస్తూ వస్తున్నారు. ఇప్పుడేమో వెనుక జలాలు ఊళ్లను చుట్టుముట్టాయి. విష పురుగులతో భయాందోళన చెందుతున్నారు. చీకటి పడితే చాలు కంటి మీద కునుకు లేకుండా దోమలు దండయాత్ర చేస్తున్నాయి.

భూములను ముంచేసిన నీరు

● ప్రాజెక్ట్: నెల్లూరు జిల్లాలోని సోమశిల జలాశయం

● నిల్వ సామర్థ్యం: 77.988 శతకోటి ఘనపుటడుగులు

● ముంపు ప్రాంతాలు: ఒంటిమిట్ట, అట్లూరు, గోపవరం, సిద్దవటం, నందలూరు, పెనగలూరు మండలాల్లో 105 గ్రామాలు పూర్తిగా.. మరో తొమ్మిది పల్లెలు పాక్షికం.

● **ఇదీ సమస్య:** వెనుక జలాలతో ఒంటిమిట్ట మండలం తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు, వెంకటాయపల్లె, ఇబ్రహీంపేట, గంగపేరూరు, రాచగుడిపల్లె రైతులకు చెందిన భూములు 80 శాతం పూర్తిగా మునిగిపోయాయి. చాలామంది పొలాలకు పరిహారం చెల్లించారు. ఇంకా కొందరికి ఇవ్వాల్సి ఉంది. ● తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు గ్రామాల్లో నివాస గృహాలను నీరు తాకింది. ● ఇళ్లలోకి విష పురుగులు వస్తుండటంతో స్థానికులు భయపడుతున్నారు. ● ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటంతో మురుగులా మారి దుర్వాసన వస్తోంది. ● దోమలు వృద్ధి చెందుతున్నాయి. భూముల్లో నీరు ఉండటంతో గ్రాసం లభించక పశువులకు మేత సమస్య తలెత్తింది. ● ఎవరైనా మృతి చెందింతే అంత్యక్రియలు చేయడానికి గుంత తవ్వితే నీరే వస్తోంది. మృతదేహాలను సిద్దవటం శివారులోని పెన్నానదికి తీసుకెళ్లాల్సి వస్తోంది.

మునిగిన వారధులు

● ఒంటిమిట్ట మండలంలోని పెన్నపేరూరు- ఇబ్రహీంపేట రహదారి పూర్తిగా మునిగిపోయింది. గ్రామ సచివాలయాలకు వెళ్లాలంటే వెంకటాయపల్లె, ఇబ్రహీంపేట ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ● అట్లూరు మండలం కుంభగిరి- వేమలూరు గ్రామాలను అనుసంధానం చేయడానికి సగిలేరులో తక్కువ ఎత్తులో నిర్మించిన వారధి పూర్తిగా నీటిలో ఉంది. మండల కేంద్రమైన అట్లూరుకు రావాలంటే సగిలేరు అవతలి వైపున ఉన్న పల్లెల వాసులు చుట్టూ తిరిగి చేరుకోవాల్సి వస్తోంది. ● పెనగలూరు మండలంలోని ఎన్ఆర్ పురం శివారులో గుంజనేరుపై చేపట్టిన లో లెవల్ కాజ్‌వే పైకి కూడా నీరు చేరింది. గుంజనేరు అటువైపు ఉన్న పల్లె జనం మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

తప్పెటవారిపల్లెలో ఇళ్ల ముంగిట్లలోకి చేరిన సోమశిల వెనుక జలాలు

కష్టాలు తీర్చేందుకు రూ.5 కోట్లు

ఎంఎన్‌బీబీ రహదారికి మహర్దశ

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మైదుకూరు- నెల్లూరు- బళ్లారి- బాంబే(ఎంఎన్‌బీబీ) జాతీయ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోకపోవడంతో ఇరుకుగా రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మైదుకూరు రోడ్డు నుంచి బొల్లవరం వరకు విస్తరణ, అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు ఇటీవల టెండర్లు జారీ చేశారు. ఈ విషయమై రోడ్లు, భవనాల శాఖ డీఈ లక్ష్మీనరసింహులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నాలుగు వరుసల దారిగా విస్తరించనున్న మైదుకూరు రోడ్డు

అభివృద్ధి ఇలా

● ప్రొద్దుటూరులోని రిలయన్స్ పెట్రోల్ బంకు మీదుగా కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మైదుకూరు రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు.

● ఏడు మీటర్ల చొప్పున వెడల్పు, మధ్యలో విభాజకాలు, రెండు వైపులా నడక దారి ఏర్పాటు చేస్తారు.

● హనుమాన్ జంక్షన్ నుంచి కొత్తపల్లె కూడలి వరకు తారు రహదారిపై గుంతలు పూడ్చివేత పనులు సాగుతున్నాయి.

● పట్టణ పరిధిలోని వైవీఎస్ బాలికోన్నత పాఠశాల నుంచి బొల్లవరం రోడ్డులో అమృత్ పథకంలో తాగునీటి గొట్టాలకు తవ్విన మార్గంలో గుంతలు లేకుండా ఉత్తరం వైపు విభాజకం పక్కన 1,950 మీటర్లు కొత్తగా బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తారు.

ఇటు కేసీ చూస్తే స్వర్ణ శోభితం



కేసీ కాలువ జిల్లాకు ఓ వరం. ఆయకట్టులో ఈ ఏడాది 63 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం కోత దశకు చేరుకుని పంట స్వర్ణ శోభితంగా మారింది. మైదుకూరు మీదుగా ప్రయాణించే సమయంలో రహదారికి రెండు వైపులా ఉన్న వరి పొలాలు బంగారు రంగులో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి పంట నూర్పిళ్లు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

వైభవం ఉట్టిపడేలా గండికోట ఉత్సవాలు

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో వారసత్వ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. సాస్కి పథకం కింద గండికోటలో రూ. 77 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. పనులు, చిత్రపటాలను పరిశీలించి సలహాలిచ్చారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. లోయ వద్ద ఒబెరాయ్ స్టార్ హోటల్ నిర్మించే ప్రాంతాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, పీఆర్ ఎస్ఈ మద్దన్న, హౌసింగ్ పీడీ రాజారత్నం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ గోపీనాథ్, సైట్ ఇంజినీర్ విజయ్, ఆర్కిటెక్చర్ డిజైనర్ ఇర్ఫాన్, అబ్దుల్ తదితరులున్నారు.

పెన్నాలోయ వద్ద చేపట్టబోయే పనులు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

● అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు.. ● జనవరి మొదటి వారంలో ఉత్సవాలుటాయి. ఆలోగా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తాం. ● పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టాం. ● పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో టూరిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటరు, నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అమినిటీస్, ఇన్ఫర్మేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ● గండికోట ముఖద్వారం నుంచి సందర్శకుల సెంటర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మిస్తాం. ● వ్యూ పాయింట్‌తో పాటు చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని నెలకొల్పుతాం. ● లోయ సమీపంలో ఏకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్‌తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ● రోప్‌వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను ఏర్పాటు చేస్తాం. ● పెన్నా లోయను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలీరైడ్స్ సదుపాయం కల్పిస్తాం.

అల్లంత దూరాన ఏఎంసీ వసూళ్లు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: జిల్లాలో మొత్తం పది వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. వీటి పరిధిలో 21 చెక్‌పోస్టులున్నాయి. ప్రస్తుతం లైసెన్స్ తీసుకున్న వ్యాపారులు 397 మంది వరకు ఉన్నారు. అయితే సెస్ వసూళ్లలో వెనకబడ్డారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్యం రూ. 13.53 కోట్లు ఉండగా... ఇప్పటి వరకు రూ. 6.06 కోట్లే వసూలయ్యాయి. ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మార్కెట్ కమిటీ వసూళ్లలో వెనుకబడ్డాయి. ఈ విషయమై 'న్యూస్‌టుడే'తో కడప జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ ఆజాద్ వలి మాట్లాడారు. ఇప్పటి వరకు 44.79 శాతం సెస్ వసూళ్లయిందన్నారు. మిగతా మొత్తాన్ని మార్చి నెలాఖరుకు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఏఎంసీ	లక్ష్యం	వసూళ్లు (రూ.కోట్లల్లో)
కడప	2.05	1.43
ప్రొద్దుటూరు	1.99	61.19
బద్వేలు	2.05	1.02
జమ్మలమడుగు	1.20	33.65
పులివెందుల	1.08	58.32
మైదుకూరు	2.80	1.21
కమలాపురం	0.98	34.87
సిద్ధవటం	0.28	11.09
ఎర్రగుంట్ల	0.86	30.74
సింహాద్రిపురం	0.24	08.98
మొత్తం	13.53	6.06

ఏడాది పొడవునా నీటిలోనే పద్మనాభుడు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: సాధారణంగా దేవుళ్ల విగ్రహాలు ఎత్తులో ఉండి పూజలందుకుంటుంటాయి. పోరుమామిళ్ల మండలం చిన్నయరసాల పంచాయతీ టూకూరిపేట సమీపంలోని అనంత పద్మనాభ స్వామి విగ్రహం మాత్రం ఇందుకు భిన్నం. నేలపై శయనించిన భంగిమలోని విగ్రహం ఇక్కడ ఏడాది పొడవునా నీటిలోనే ఉంటుంది. పురాతనమైన ఈ విగ్రహం కూడా విచిత్రంగా వెలుగు చూసింది. 1930 ప్రాంతంలో కొందరు రైతులు ఎడ్ల బండ్లతో కొండకు వెళ్లేవారు. ఈ సమయంలో రాతిని ఎక్కి పడిపోతుండేవి. రాతిని తొలగించేందుకు తవ్వకాలు చేపట్టగా ఒకే రాతిపై మలిచిన అనంతపద్మనాభుడి విగ్రహం బయల్పడింది. వెలికి తీసేందుకు ప్రయత్నించి విఫలం కావడంతో అక్కడే గుడి నిర్మించారు. ఇదంతా చెరువు ప్రాంతం కావడంతో ఆలయం చుట్టూ నీరు ఉంటుంది. ఏటా వైకుంఠ ఏకాదశికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. మోటార్లతో నీటిని తోడి పూజలు నిర్వహిస్తారు.

జంబోరీ అజుంబరీ

బి.కోడూరు, న్యూస్‌టుడే: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబోరీ క్యాంపు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నోలో సాగింది. జిల్లా నుంచి దాదాపు 60 మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో ప్రదర్శించిన వేంకటేశ్వర స్వామి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, సిద్దయ్యస్వామి వేషధారణలు ప్రత్యేకంగా నిలిచాయి.

రాజు డైరీ.. వెంటాడుతోంది!

● ములకలచెరువు ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్
● మరో నలుగురిపై బదిలీ వేటు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- మదనపల్లె నేరవార్తలు: ములకలచెరువు అడ్డాగా అక్రమార్కులు రెచ్చిపోయారు. నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్ దుకాణాలకు విక్రయించి జేబులు నింపుకొన్నారు. తీరా విషయం వెలుగుచూడటంతో నిందితులు కటకటాలపాలయ్యారు. ఇప్పుడీ వ్యవహారంలో కేసులో ఏ2గా ఉన్న కట్టా రాజు రాసిన డైరీ పలువురిని వెంటాడుతోంది. ఎప్పుడు ఎవరిపై చర్యలుంటాయో తెలియక అధికార యంత్రాంగం భయపడుతోంది.

● **సిబ్బంది పాత్రపై ఆరా:** నకిలీ మద్యం తయారీ కేసు విచారణ చేపట్టిన ఎక్సైజ్ అధికారులు ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపారు. తాజాగా సిబ్బంది పాత్రపైనా ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో కేసులో నిందితుడిగా ఉన్న కట్టా రాజు రాసిన డైరీని పరిశీలిస్తున్నారు. లభించిన ఆధారాల సాయంతో దర్యాప్తు చేస్తున్నారు. తయారీదారులతో పాటు బెల్ట్ షాపులు నడిపిన వ్యక్తులతో ఫోన్ సంభాషణలు సాగించినట్లు గుర్తించి ఎక్సైజ్ కానిస్టేబుల్ భాస్కర్‌ను సస్పెండ్ చేశారు. మరో నలుగురిపై బదిలీ వేటు వేశారు. ఈ మేరకు ఎక్సైజ్ నోడల్ అధికారైన చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. నలుగురు కానిస్టేబుళ్ల పాత్రపై సమగ్ర విచారణ చేపట్టి తదుపరి చర్యలుంటాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

లంచమా.. పీచమణుచుదాం!

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా ప్రయోజనాలకు అడిగినంత ఇవ్వకుంటే కొందరు ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తుంటారు. ఈ పరిస్థితులపై విమర్శలు, ఫిర్యాదులకు కొదవ లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సుపరిపాలన, పారదర్శకం, జవాబుదారీతనం వంటి లక్ష్యాల సాధనకు కృషిచేస్తోంది. అందులో భాగంగా అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తోంది. సీఎం చంద్రబాబు చిత్రంతో కూడిన ప్రచార గోడ పత్రులపై టోల్‌ఫ్రీ నంబరు 1064ను ఇస్తోంది. ప్రజలకు అవగాహన, ప్రచారం కల్పించడానికి ప్రభుత్వ కార్యాలయాల గదులు, గోడలకు వీటిని అతికిస్తోంది. విజయవాడలోని ఏసీబీ కార్యాలయ ఇ-మెయిల్, ల్యాండ్ ఫోన్, చరవాణి సంఖ్యలను పొందుపరిచింది. జిల్లాలవారీగా ఏసీబీ డీఎస్పీల చరవాణి పైనా ప్రచారం చేస్తోంది. కడప జిల్లా ఏసీబీ శాఖలోని డీఎస్పీ చరవాణి 9440446191కు ఫిర్యాదు చేయాలంటూ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది.

అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ నంబరు ముద్రించిన ప్రచార పత్రం

ముకోసం

మట్టి నుంచి మట్లి రాజుల చిహ్నం

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటంలోని మట్లి రాజుల కోట చారిత్రక ప్రసిద్ధి. ఈ రాజుల అధికార రాజచిహ్నమైన 'గజారోహణ సింహం' ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రముఖ రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి ఈ విషయాన్ని గుర్తించారు. కోట ప్రవేశ ద్వారం ఎడమవైపు పైభాగంలో సుమారు ఇరవై అడుగుల ఎత్తులో చిహ్నం ఉన్నట్లు తెలిపారు. ఏనుగు పైకి లంఘించే సింహంతో పాటు ఖడ్గం, సూర్యచంద్రులు ఇందులో ఉన్నట్లు వివరించారు.

వీహెచ్‌సీల పూర్తికి రూ. 4.95 కోట్లు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలోని 11 మండలాల్లో 40 చోట్ల మధ్యలోనే నిలిచిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్(వీహెచ్‌సీ) కట్టడాలను నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద పూర్తిచేసేందుకు రూ. 4.95 కోట్లు మంజూరయ్యాయి. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. పీఆర్ ఇంజినీర్లతో వివరాలు సేకరించింది. ప్రొద్దుటూరు మండలంలో 11, కొండాపురం 8, రాజుపాళెం 4, జమ్మలమడుగు, ముద్దనూరు, బి.మఠం వేర్వేరుగా 3, మైలవరం, ఎర్రగుంట్ల, కమలాపురంలో 2 చొప్పున, పెండ్లిమర్రి, పెద్దముడియం మండలాల్లో 1 చొప్పున పూర్తి చేసేందుకు అనుమతి మంజూరైంది.

నాలుగోసారి.. బిగిసిన పీడీకిలి

చాపాడు, న్యూస్‌టుడే: దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ ఇరగంరెడ్డి నాగదస్తగిరిరెడ్డిపై నాలుగోసారి పీడీ యాక్ట్ కేసు నమోదైనట్లు మైదుకూరు గ్రామీణ సీఐ శివశంకర్ తెలిపారు. నాగదస్తగిరిరెడ్డిపై ఇప్పటివరకు మొత్తం 128 కేసులున్నాయి. వీటిలో ఎర్రచందనం అక్రమ రవాణకు సంబంధించినవి 90, మరో 38 చోరీ కేసులు. ఇతను ప్రస్తుతం కడప కేంద్ర కారాగారంలో ఖైదీగా ఉన్నారు.

మీ ఆట.. మీ ఇష్టం

పాఠశాలలకు కోరుకున్న క్రీడా సామగ్రి

కమలాపురం, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో పిల్లలు రాణించేలా కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే క్రీడా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచింది. దీంతోపాటు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించే క్రీడాకారులను వెన్ను తట్టి ప్రోత్సహిస్తోంది. గతంలో అన్ని పాఠశాలలకు ఒకే రకమైన క్రీడా సామగ్రిని అందించేవి. ఇష్టమున్నా లేకున్నా విద్యార్థులు వాటితోనే ఆటలు ఆడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పద్ధతి మారింది. కోరుకున్న వాటినే ఇస్తోంది. అందుకుగాను బడుల వారీగా ప్రతిపాదనలు స్వీకరించి సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కిట్లు సమకూరుస్తోంది.

● **స్థాయికి అనుగుణంగా అందజేత:** ఉన్నత పాఠశాలలకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు విలువజేసే క్రీడా సామగ్రి అందిస్తోంది. ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల లోపు విలువైన కిట్లు సరఫరా చేస్తున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. అథ్లెటిక్స్‌కు సంబంధించి అన్ని పాఠశాలలకు ఒకే తరహా సామగ్రి అందిస్తారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

● జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు: 1,839
● ప్రాథమికోన్నత పాఠశాలలు: 242
● ఉన్నత పాఠశాలలు: 669
● 1 నుంచి 10 వరకు విద్యార్థులు: 3,02,880

శ్రమకు తగ్గట్టు మెరవని శనగ

● గోదాముల్లో 80 వేల మెట్రిక్ టన్నులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: శనగ ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్లుగా గోదాముల్లోనే దిగుబడులు మగ్గిపోతున్నాయి. ఈ ఏడాది జనవరిలో క్వింటా ధర రూ. 6,500 పలకగా.. ప్రస్తుతం రూ. 5,400కు పడిపోయింది. విదేశాల నుంచి శనగలు దిగుమతి కారణంగా ఇక్కడ ధరల పతనానికి కారణమని రైతులు వాపోతున్నారు.

జమ్మలమడుగు శివారులో విస్తారంగా శనగ సాగు

● **మద్దతు ధరకు రైతుల ఎదురు చూపులు:** గతేడాది రబీలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల ఎకరాల్లో శనగ సాగైంది. ఎకరాకు రూ. 35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సరాసరి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా నాఫెడ్ కొనుగోలుకు ప్రయత్నించింది. జిల్లాలో 18 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధర క్వింటాకు రూ. 5,650 ప్రకటించింది. అయినా రైతులు విక్రయించేందుకు ముందుకు రాలేదు. ధర ఆశాజనకంగా లేకపోవడంతో గోదాముల్లోనే ఉంచారు. ఇలా ఇప్పటికీ సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల శనగలు గోదాముల్లో మగ్గుతున్నట్లు అంచనా. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

ఆ దారంతా ఆటంకమే!

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలోని రాజారెడ్డి వీధి అసలే ఇరుకు మార్గం. రోడ్డు మధ్యలో ఎలాంటి డివైడర్లు లేవు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వీటికి తోడు కొన్ని రోజుల కిందట భూగర్భ పైపులు (కేబుల్) పనుల కోసం అక్కడక్కడ గుంతలు తవ్వారు. అనంతరం వాటిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో ట్రాఫిక్ సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మెగా పీటీఎం.. విద్యార్థుల పురోభివృద్ధే లక్ష్యం

● అభ్యసన సామర్థ్యాలపై నివేదించనున్న ఉపాధ్యాయులు

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసి 2047 కల్లా వికసిత్ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ నెల 5వ తేదీన అన్ని పాఠశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం ద్వారా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పాఠశాల, కళాశాలల మధ్య సంబంధాలను బలపరచాలని సన్నాహాలు చేస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్, ఆర్జేడీ వెంకటేశ్వర్లు తెలిపారు.



కడప నగరంలోని సాయిపేట నగరపాలక పాఠశాలలో విద్యార్థులు

ప్రధాన లక్ష్యమిదే..

ఈ విద్యా సంవత్సరం జులై 10వ తేదీన మెగా పీటీఎం ఒకసారి జరగగా రెండో సారి ఈ నెల 5వ తేదీ జరగనుంది. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన అసెస్‌మెంట్ పరీక్షల్లో వారి నైపుణ్య వివరాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నదే ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. తమ పిల్లలు పరీక్షలు ఎలా రాశారు? ఎన్ని మార్కులు వచ్చాయి? ఏ మేరకు ఆయా సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం ఉంది వంటి విషయాలు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు స్థానికంగా పాఠశాలల్లో ఈ సమావేశంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. పూర్వ విద్యార్థులు, స్థానికంగా పాఠశాలలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్న దాతలను ఆహ్వానించేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణకు నిధులు మంజూరు

30 మందిలోపు విద్యార్థుల సంఖ్య కలిగిన ఒక్కో పాఠశాలకు రూ.900, 31 నుంచి 100 మంది వరకూ విద్యార్థుల సంఖ్య కలిగిన ఒక్కో పాఠశాలకు రూ.2,250, 101 నుంచి 250 మంది వరకూ విద్యార్థుల సంఖ్య కలిగిన ఒక్కో పాఠశాలకు రూ.5,375, 251 నుంచి వెయ్యి మంది వరకు విద్యార్థుల సంఖ్య కలిగిన ఒక్కో పాఠశాలకు రూ.6,750, వెయ్యి మందికిపైగా విద్యార్థుల సంఖ్య కలిగిన ఒక్కో పాఠశాలకు రూ.9 వేల చొప్పున మెగా పీటీఎం సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది.

జిల్లాలో పాఠశాలల వివరాలు		
మొత్తం పాఠశాలలు	:	2,818
విద్యార్థుల సంఖ్య	:	2,93,581
జూనియర్ కళాశాలలు		
మొత్తం జూనియర్ కళాశాలలు	:	155
మొత్తం విద్యార్థుల సంఖ్య	:	37,000

అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు

జమ్మలమడుగు, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాలు మరింత నాణ్యతగా, రుచిగా ఉండేలా చూడాలని వంట ఏజెన్సీలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ సూచించారు. మంగళవారం దేవగుడి, జమ్మలమడుగులోని పీజేఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌లను పరిశీలించారు. వంట నిర్వహణ ఏజెన్సీలతో మాట్లాడి రోజువారీ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని ప్రశ్నించారు. అదే సమయానికి మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఆయన కూడా ఆహారం కొంత తిని మరింత రుచిగా చేయాలన్నారు. రాష్ట్రానికే ఆదర్శంగా జిల్లాలోని అన్ని మండలాల్లో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ హబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీవో సాయిశ్రీ, హౌసింగ్ పీడీ రాజరత్నం, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో స్మార్ట్ కిచెన్‌లో వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజా రక్షణే పోలీసుల ప్రధాన కర్తవ్యం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల కర్తవ్యమని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జమ్మలమడుగు పోలీసు సబ్ డివిజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో జరిగిన నేరాల్లో ఎన్ని పరిష్కరించారు.. పెండింగ్ కేసులు ఎన్ని ఉన్నాయి తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల-పరిష్కార వేదిక నుంచి సంబంధిత స్టేషన్లకు బదలాయించే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను సూచించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రౌడీషీటర్లు, గొడవలు సృష్టించే వారిపై పోలీసులు నిఘా ఉంచాలన్నారు. డ్రోన్ కెమెరాలతో గంజాయి, డ్రగ్స్‌పై నిఘా పెంచాలన్నారు. పోలీసు బృందాలతో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, చిత్రంలో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు

రబీలో ఆరుతడి పంటలకే సాగునీరు

● నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మంత్రులు, కలెక్టర్

సమావేశంలో మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో వరి సాగు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన మంగళవారం నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజులురెడ్డి(ప్రొద్దుటూరు), భూమా అఖిలప్రియ(ఆళ్లగడ్డ), గౌరు చరిత(పాణ్యం), బుడ్డా రాజశేఖరరెడ్డి(శ్రీశైలం), గిత్త జయసూర్య(నందికొట్కూరు), జాయింట్ కలెక్టర్ కార్తీక్, కేసీ. కెనాల్ ఛైర్మన్ రామలింగారెడ్డి, తెలుగుగంగ ప్రాజెక్టు ఛైర్మన్ సంజీవకుమార్‌రెడ్డి, ఎస్సార్బీసీ ఛైర్మన్ కె.రాజశేఖరరెడ్డి, సాగునీటి సంఘాల నాయకులు, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగునీటి కాలువలకు ఏ మేరకు నీటిని విడుదల చేయాలనే అంశంపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల నిర్మాణం జరుగుతున్నందున ఈ సీజనులో నీరు రాదన్నారు. భవిష్యత్తులో మరిన్ని సమస్యలు రాకుండా ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీంతో కేసీ కెనాల్‌కు 120 కి.మీ వరకు, 120 నుంచి 150 కి.మీ వరకు నీటి విడుదల అసాధ్యమన్నారు. తెలుగు గంగ ఆయకట్టు పరిధిలో మార్చి చివరి వరకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. రివర్స్ పంపింగ్ వంటి ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

వైభవంగా.. వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: మఠంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మాస కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలకు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. అంగరంగ వైభవంగా, కనులపండువగా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వాముల వారి కల్యాణోత్సవాన్ని పండితులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను అందుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కల్యాణంలో మంగళ సూత్రాన్ని చూపుతున్న వేద పండితులు

రేపటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

భగవాన్ కాశినాయన సమాధి

కాశినాయన, న్యూస్‌టుడే: ఈ నెల 4, 5వ తేదీల్లో జ్యోతి క్షేత్రంలో కాశినాయన ఆరాధనోత్సవాలు జరుగనున్నాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం, నెల్లూరు జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో కాశిరెడ్డినాయన పేరుపై నిత్యాన్నదాన కేంద్రాలు నిర్వహించు శిష్య బృందం నిర్వహిస్తోంది. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు రానున్నందున నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల నిలుపుదల, దర్శనం వద్ద తోపులాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మాలధారులకు ప్రత్యేక వసతి కల్పించారు.

త్వరలో వీడనున్న గండికోట హత్య కేసు మిస్టరీ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో జులై 14న తేదీన జరిగిన ఇంటర్ విద్యార్థిని హత్య కేసు విచారణ వచ్చిందని త్వరలోనే ఛేదిస్తామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తనతో చెప్పారని జిల్లా కలెక్టర్ శ్రీధర్ మీడియాతో అన్నారు. మంగళవారం గండికోటకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. గండికోటలో విద్యార్థిని హత్యకు గురై నెలలు కావస్తున్నా ఇంకా నిందితులను పట్టుకోలేదని విలేకరులు ప్రశ్నించడంతో అందుకు ఆయన పైవిధంగా స్పందించారు. ఈ కేసును ఛేదించాలంటే మరికొన్ని ఆధారాలు కావాలి కాబట్టి, సాంకేతికపరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆ రోజు చెప్పారన్నారు. ★ గండికోట చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రెవెన్యూ సర్వే చేసి వాటిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

పెన్నాలోయ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వేడుకగా పురాతన సీఎస్ఐ చర్చి తిరునాల

కలసపాడులో తిరునాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. ఊరేగింపుగా తీసుకెళుతున్న బిషప్ సంతోష్‌ప్రసన్నరావు, బ్యూలా సంతోష్

కలసపాడు, న్యూస్‌టుడే: కలసపాడులోని పురాతన సీఎస్ఐ (ఎస్‌పీజీ) 'పరిపేతురు-పరిపౌలు' చర్చి వార్షికోత్సవం (తిరునాల) మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నంద్యాల డయాసిస్ బిషప్ కె.సంతోష్‌ప్రసన్నరావు, బ్యూలా సంతోష్, పలువురు ప్రముఖులను చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు చర్చిలో ప్రార్థనలుచేసి మొక్కులు తీర్చుకున్నారు. దీపాల ఆరాధన చేశారు. బిషప్ భక్తులకు సందేశమిచ్చారు. క్రైస్తవ సంగీత విభావరి, దీపాల ఆరాధన, రవికుమార్ చెక్కభజన, 'యేసుకృప' క్రైస్తవ బైబిల్ నాటకం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తుల కోసం జర్మన్ షెడ్, చలువపందిర్లు ఏర్పాటు చేశారు. చర్చి చరిత్ర ప్రతులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. సీఐ హేమసుందర్‌రావు, ఎస్సై తిమోతి 200 మంది పోలీసులతో భారీ ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. వైద్యాధికారులు శైలజ, సాయితేజ, ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటుచేసి సేవలు అందించారు. ఎం.ఎఫ్.ఎస్. ఆనంద్‌కుమార్, కార్యదర్శి బి.కిశోర్ వినయదాస్, ప్రెస్బిటర్ ఎస్.ఆశీష్‌గాబ్రియేల్, కోశాధికారి సైమన్‌సత్యబాబు, కమిటీ బృందం, యువజన, స్త్రీల మైత్రీ సభ్యులు సేవలందించారు.

జమ్మలమడుగు పూర్వ ఆర్డీవోపై చర్యల్లో సవరణ

ఈనాడు, కడప: గండికోట నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీతో పాటు ఇతరత్రా ఆర్థిక సాయం పంపిణీలో చోటు చేసుకున్న అక్రమాలపై జమ్మలమడుగు పూర్వ ఆర్డీవో కె.వి.వినాయక్‌పై తీసుకున్న చర్యల్లో సవరణలు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొండాపురం మండలంలో పరిహారం అందజేతలో భారీ అక్రమాలు చోటు చేసుకోగా గతంలో ఆయన పని చేసిన ఏపీపీఎస్ అధికారి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చారు. విచారణలో భాగంగా 21 ఆరోపణల్లో చాలా వరకు పూర్వ ఆర్డీవో అక్రమాలకు పాల్పడినట్లు నిరూపితమైంది. మొదట ఆయనపై ర్యాంకు తగ్గింపు శిక్ష విధించగా ప్రభుత్వం మరోసారి రివ్యూ పిటిషన్‌ను పరిశీలించి అయిదు సంవత్సరాల జీత వృద్ధిని నిలిపివేయడంగా మార్చింది. ప్రభుత్వం ఆ మార్పును ఆమోదిస్తూ తదుపరి చర్యలకు ఆదేశిస్తూ భూసంస్కరణల ముఖ్య కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో 24 భజన మందిరాలకు ప్రతిపాదనలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: జిల్లాలో 24 భజన మందిరాలను నిర్మించాలని తితిదే అధికారులకు ప్రతిపాదనలు అందాయి. ఒంటిమిట్ట, వేముల, చక్రాయపేట, జమ్మలమడుగు, కొండాపురం, మైలవరం, ముద్దనూరు, సింహాద్రిపురం మండలాల్లో అవసరమైన గ్రామాల్లో పనులు చేపట్టడానికి నిధులివ్వాలని నాయకులు తితిదే అధికారులకు అర్జీలు సమర్పించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవాదాయ శాఖ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్మాణాలను పర్యవేక్షణ చేస్తారు. నిధులను మాత్రం తితిదే మంజూరు చేయనుంది. ఈ మేరకు అంచనాలు రూపొందించి నివేదించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి.

విద్యార్థుల అస్వస్థతపై త్రిసభ్య కమిటీ విచారణ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని వసంతపేట పురపాలిక ఉన్నత పాఠశాలలో గత నెల 28న మధ్యాహ్న భోజనం తిని 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై మంగళవారం త్రీమెన్ కమిటీ విచారణ చేసింది. ఈ కమిటీలో కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య ఉన్నారు. వారు విద్యార్థులను విచారించి ఘటన పై లిఖితపూర్వకంగా రాయించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు. మూత్రశాలల పక్కనే ఉన్న వంట గదిని బడిలోని మరోచోటికి మార్చాలని ఆదేశించారు. కాగా విచారణకు వంట ఏజెన్సీ నిర్వాహకులు రాలేదని అధికారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

బీసీల సమస్యల పరిష్కారానికి చలో దిల్లీ

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లయినా బీసీలకు రక్షణ కరవైందని.. వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న చలో దిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగల్‌రావు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళిలు డిమాండ్ చేశారు. కడప ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. బీసీల్లో సుమారు మూడు వేల కులాలున్నాయి, 66 శాతం మంది బీసీలున్నారు. కానీ ఇప్పటికీ రాజ్యాధికారం చేపట్టలేదన్నారు. రానున్న రోజుల్లో బీసీలంతా ఏకమవుతారన్నారు. అప్పుడు బీసీ సీఎంను చూడొచ్చన్నారు. చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంఘం నాయకులు వెంకటకృష్ణ, పద్మయాదవ్, రవికుమార్ యాదవ్, రమణయాదవ్, యలమందరావులతో పాటు పలువురు ఉన్నారు.

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగల్‌రావుయాదవ్, చిత్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి

APS RTC
టెండరు ప్రకటన
పల్లె వెలుగు
YSR కడప జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాల్స్/ షాపులు, క్యాంటీన్, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు మరియు క్వాడ్ షెల్టర్లపై ప్రకటనలు ఇచ్చుటకు అనుభవం ఆసక్తి కలిగిన ఏజెన్సీలు/ సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ వారి కార్యాలయములలో తేది.03-12-2025 నుండి తేది.17-12-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥గం.5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.18-12-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥2.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, కడప నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్: https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కు పూర్తి అధికారము కలదు.
నెం.E2/797(5)/2025-DPTO/YSR, తేది:02-12-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, కడప.

12 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఈ నెల 12, 13, 14 తేదీల్లో తిరుపతి నగరంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులు విజయవంతం చేయాలని నగర అధ్యక్షుడు జాలా సుమంత్ కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. నగర ఉపాధ్యక్షుడు అఖిలేష్, నవీన్, కార్తిక్, మనోహర్, అభిలేష్, సాగర్, రాజేష్ పాల్గొన్నారు.

ఆర్సీడీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (ఆర్సీడీఎస్) సొసైటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా తమను ఎన్నుకున్నట్లు వరదారెడ్డి, పురుషోత్తంరెడ్డిలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తమను నియమించారన్నారు. సొసైటీ నియమాలను పాటించి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో సేవలను విస్తరించి సంఘానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

సతీష్

సిద్దవటం, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట ఏఎస్సైపై ద్విచక్ర వాహనంతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సతీష్ అనే నిందితుడికి మంగళవారం ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించారు. ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేసిన సుదర్శన్ 2018 జూన్ 18వ తేదీన సిద్దవటం మండలం భాకరాపేట సమీపంలో జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో సిద్దవటం మండలం పెద్దపల్లె పరిధిలోని మిట్టపల్లెకు చెందిన సతీష్ కడప నుంచి భాకరాపేటకు ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చారు. అతని రాకను గమనించిన ఏఎస్సై వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వేగంగా వెళ్తూ ఆయన్ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సుదర్శన్ కాలు విరిగి తీవ్ర గాయమైంది. ఈ ఘటనపై అప్పటి సిద్దవటం ఎస్సై అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై సిద్దవటం న్యాయస్థానంలో తుది విచారణ జరగగా సతీష్‌పై నేరం నిరూపణ కావడంతో సిద్దవటం ఇన్‌ఛార్జి న్యాయమూర్తి పద్మశ్రీ పైన పేర్కొన్న విధంగా తీర్పునిచ్చారని సిద్దవటం ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని అనుపమ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం మంగళవారం తెలిపారు. నవంబరు 28 నుంచి 30వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా లంకలపాలెంలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అనుపమ ఉత్తమ ప్రతిభ చూపినట్లు వివరించారు. రాజస్థాన్‌లో జరగబోయే జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో అనుపమ పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని, పీఈటీలు లక్ష్మి, సుధాకర్‌రెడ్డిలను పాఠశాల సిబ్బంది అభినందినట్లు వివరించారు.

చాపాడు: నరహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జ్ఞానఅక్షితసాయి ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కేఎల్.నరసింహశాస్త్రి తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఘట్కా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో జ్ఞానఅక్షితసాయి వి.సుబ్బలక్ష్మి, అండర్-19 విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. ఛత్తీస్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ పోటీలకు అక్షితసాయి వెళ్లనున్నట్లు పీడీ ప్రశాంతి వివరించారు.

హెచ్ఎం నరసింహశాస్త్రి, పీడీ ప్రశాంతితో పతకాలు సాధించిన విద్యార్థినులు

ఆలయ నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళం

వీఎన్ పల్లె: తంగేడుపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న చెన్నకేశవ స్వామి ఆలయానికి పులివెందులకు చెందిన తేరా పుల్లారెడ్డి రూ.2.5 లక్షలను వితరణగా ఆలయ కమిటీకి మంగళవారం అందజేశారు. ఈ నగదును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డితో కలిసి గ్రామ పెద్దలకు అందించారు. ఓబుళరెడ్డి, నాగసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి నగదును అందిస్తున్న తులసిరెడ్డి, పుల్లారెడ్డి

విద్యా వాలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాఠశాలల్లో విద్యా వాలంటీర్లుగా పని చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఎంఈవోలు రఫీక్‌అహ్మద్, ఇర్షాద్‌అహ్మద్‌లు పేర్కొన్నారు. ఈ నెల 5వతేదీలోగా ఎంఈవో కార్యాలయాల ఆఫీసు పని వేళల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర క్రికెట్ జట్టులో ఇద్దరికి చోటు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర అండర్-14 క్రికెట్ జట్టులో ప్రొద్దుటూరు, కడప విద్యార్థులైన సాద్ ఇర్ఫాన్, విష్ణువర్ధన్‌రెడ్డికి చోటు దక్కింది. గుంటూరులో నవంబరు 29 నుంచి ఈ నెల ఒకటో తేదీ వరకు సాగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో సెలెక్టర్లు ఎంపిక చేశారు. జట్టుకు వైస్ కెప్టెన్‌గా సాద్ ఇర్ఫాన్ ఎంపికయ్యాడని, ఈ టోర్నీలో ఉత్తమ బ్యాట్స్‌మెన్ పురస్కారాన్ని కూడా అందుకున్నాడని, మరో విద్యార్థి భాను వర్షిత్‌రెడ్డి స్టాండ్‌బైగా ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వీరు జాతీయ స్థాయికి ఎంపికైనందుకు తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 అంతర్ జిల్లాల మూడో రౌండ్ క్రికెట్ పోటీలు మంగళవారం డ్రాగా ముగిశాయి. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల నష్టానికి 190 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండోరోజు (మంగళవారం) బ్యాటింగ్‌ను ఆరంభించిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మరో మూడు పరుగులు మాత్రమే చేసి 193 స్కోర్ వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు బ్యాటింగ్ చేసి 78 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. జట్టులో రాజ్ 129 పరుగులు చేశారు. మరో బ్యాట్స్‌మెన్ వర్మ 56 పరుగులు చేసి రాణించారు. సౌత్‌జోన్ విన్నర్స్ బౌలర్లలో తరుణ్‌కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

★ కేవోఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్ల నష్టానికి 62 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్‌ను ఆరంభించిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు 63.5 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌట్ అయ్యింది. రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ బౌలర్లలో రోహిత్ ఆరు వికెట్లు తీసుకున్నాడు. ఆపై రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ చేసి మ్యాచ్ ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. జట్టులో హేమచంద్రనాయక్ 70 పరుగులు చేశారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

★ కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్‌ను ఆరంభించి 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 291 పరుగులు చేసింది. జట్టులో తమన్‌సాయి అజేయంగా 111 పరుగులు చేశారు. రితీష్ 58 పరుగులు చేసి రాణించారు. నార్త్‌జోన్ విన్నర్స్ బౌలర్లలో లోహిత్, రుత్విక్ చెరో రెండు వికెట్లు తీశారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

129 పరుగులు చేసిన రాజ్

ఆరు వికెట్లు తీసిన రోహిత్

సెంచరీ సాధించిన తమన్‌సాయి

70 పరుగులు చేసిన హేమచంద్రనాయక్

EENADU Classifieds

BUSINESS SERVICES

MH Fruits కంపెనీ నందు పట్టణాలవారిగా TLగా పనిచేయడానికి బాయ్స్ కావలెను. నెల జీతం: 15000 నుండి 20000/-. సెల్: 7075663936.

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| © 7382114647.

JOBS

ప్రభుత్వపాఠశాలలో అవుట్సోర్సింగ్ పద్ధతిలో Vocational Faculty కావలెను, జీ:28000, అన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలకు # 9848771117,9849848817

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ|| 350/- మాత్రమే
Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

'పుర' పరిపాలన మెరుగుకు బాధ్యతలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక కార్యాలయంలో పరిపాలన మెరుగుకు ఉద్యోగులకు బాధ్యతలను కేటాయించినట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. విభాగాల వారీగా టౌన్‌ప్లానింగ్‌కు షిబ్కతుల్లా, ఇంజినీరింగ్‌కు ఎ.ఎస్.జాఫర్ హుస్సేన్, సచివాలయ ఉద్యోగుల రికార్డు పరిశీలనకు వై.నరేష్, పారిశుద్ధ్య విభాగాధిపతిగా మధుసూదన్‌రావు, పారిశుద్ధ్య విభాగ సహాయకుడిగా జి.మహేష్‌బాబు, ఛైర్‌పర్సన్ క్యాంప్ క్లర్క్‌గా విజయ్‌బాబు, కోర్టు కేసులు, సమాచార విభాగానికి కె.శ్రీనివాసులు రెడ్డి, ప్రధాన కార్యాలయంలో సి-1కు సహాయకురాలిగా ఎం.శ్రీజ విధులు చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

డ్రోన్ కెమెరాతో నిఘా : మైదుకూరు: అసాంఘిక కార్యకలాపాలపై మైదుకూరు పోలీసులు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టారు. ముక్కొండ వద్ద కాలనీ, కొత్త బైపాస్‌రోడ్డు, ప్రొద్దుటూరు, నంద్యాలరోడ్డులో డ్రోన్‌తో అనుమానితుల గుర్తించే ప్రయత్నం చేశారు. సీఐ రమణారెడ్డి, సిబ్బంది అనుమానితుల కోసం వెతికారు. బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యపానం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని డ్రోన్‌తో పరిసరాల్లో వెతికారు.

అక్రమంగా చదును చేసిన భూమి పరిశీలన

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని శంఖవరం గ్రామ ప్రభుత్వ పొలం 2027 సర్వే నంబరులో అక్రమంగా చదును చేసిన 20 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. అటవీ అధికారులు కూడా పాల్గొన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆర్డీవో ఆదేశించారు. చెన్నుపల్లెలో దళితుల భూములు సబ్ డివిజన్ సమస్యపై చర్చించారు. బ్రాహ్మణపల్లెలో గతంలో ఆత్మహత్య చేసుకున్న రాచకొండు వెంకటరమణ మృతిపై ఆర్డీవోతోపాటు ఏడీఏ మురళీధర్‌రెడ్డి, సీఐ హేమసుందరరావు విచారించారు. అనంతరం పురాతన సీఎస్ఐ చర్చిని సందర్శించారు. తహసీల్దారు మధురవాణి, డీటీ మోహన్‌రాజు, ఏవో విజయకుమార్, ఎస్సై తిమోతి పాల్గొన్నారు.

వర్సిటీలో అవకతవకలపై చర్యలకు డిమాండ్

ఉప కులపతి రాజశేఖర్‌ను సత్కరిస్తున్న కొండారెడ్డి, రసూల్‌గౌస్

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయంల ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆ విశ్వవిద్యాలయ ఉప కులపతి బెల్లంకొండ రాజశేఖర్‌ను కోరారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం వీసీతో భేటీ అయ్యి పలు విషయాలు చర్చించారు. అనంతరం ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు యోగివేమన ఇంజినీరింగ్ కళాశాల నాన్‌టీచింగ్ యూనియన్ అధ్యక్షుడు రసూల్‌గౌస్ పాల్గొన్నారు.

పురపాలక అభివృద్ధికి ప్రత్యేక బృందాలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక అభివృద్ధికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయ వార్డు పరిపాలన, పట్టణ ప్రణాళిక, మహిళా, పారిశుద్ధ్య కార్యదర్శుల సమావేశం పుర కార్యాలయంలో జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో వ్యాపార, వాణిజ్య దుకాణాదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తదితర అనుకోని సంఘటనలో ఈ లైసెన్సు ఉపయోగపడుతుందన్నారు. సహాయక కమిషనర్ కొండయ్య, ఎంఈ శ్రీనివాసులు, టౌన్ టీపీ టీపీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ వ్రతం నేడు

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురంలోని రాఘవేంద్రస్వామి ఆలయం పక్కన కొండపై కొలువైన అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు భక్త బృందం సభ్యులు మంగళవారం తెలిపారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ఆకు పూజ, అర్చన, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పీఎంఎఫ్‌బీవై నమోదు తప్పనిసరి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే బీమా నమోదు చేసుకున్న ప్రతి పంటకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్తింపజేస్తాయని మండల వ్యవసాయశాఖాధికారి వరహరికుమార్ రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో పీఎంబీఎఫ్‌వై బీమా పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ రైతు సేవా కేంద్రాని కెళ్లి పంట సాగు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని, మీ సేవ కేంద్రంలో ప్రీమియం చెల్లించి రబీ-2025-26 పంట బీమా నమోదు చేయించుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలపై వైకాపా విష ప్రచారం

మైదుకూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తూ విషం చిమ్ముతున్నారని నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సాక్షిలో వస్తున్న కథనాలను ప్రజలు విశ్వసించ లేదన్నారు. రైతు శ్రేయస్సు కోసం చేస్తున్న కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్టీ నాయకులు గోవిందపల్లె కృష్ణయ్య, బద్వేలు బాబు, పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

GOP.No. 36/2025

1) షేక్ ఇస్మాయిల్, తండ్రి గైబుసా, వయస్సు 40 సం॥రాలు, 2) ఖాదర్‌బాద్ షేక్ సాలిహా, తండ్రి షేక్ ఇస్మాయిల్, మైనర్, వయస్సు 15 సం॥, 3) ఖాదర్‌బాద్ షేక్ సబిహా, తండ్రి షేక్ ఇస్మాయిల్, మైనర్, వయస్సు 13 సం॥.
2, 3 పిటీషనర్లు మైనర్లు అయినందున వారి తండ్రి అయిన షేక్ ఇస్మాయిల్ గార్డియన్‌గా ఉంటున్నాడు.
R/o D.No. 15/159, దస్తగిరి పేట, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా - పిటీషనర్లు

Vs

- Nil - - రెస్పాండెంట్స్

పై నెంబరు GOP లోని 2 & 3 పిటీషనర్లు మైనర్లు అయినందున వారి ఐరుపురుకు చెందిన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టు పర్మిషన్‌తో అమ్ముటకు పై పిటీషన్‌ను ఒకటవ పిటీషనరు దాఖలు చేసి ఉన్నాడు.
అట్టి పై పిటీషన్ నందు ఎవరికైన ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు యందు 30.01.2026వ తేదీన ఉదయం 10.30 గం॥లకు హాజరు కావలయును లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

SCHEDULE

Y.S.R. District, Proddatur Registration District, Proddatur Sub-District, Proddatur Mandal, Kothapalle Panchayat, Ward No.5 on southern side of Prakash Nagar, Dr.Prameela Ranga Reddy Colony, Plot Nos. 111, 112 and 113, Modameedipalle Village fields covered by Survey No.75/1 paiki Ac.0.09 cents or 0.36 hectors bounded by (the minor petitioners are having 3/4th share). **East:** Joint rastha with a width of 30 links, **West:** Site of Plot No. 102, 103 and 104, **North:** Site of Plot No. 110, **South:** Site of Plot No. 114
Within these boundaries an extent of Ac.0.09 cents or 0.36 hectors of site is situated with all easement rights.

వాయిదా : 30.01.2026
సి.పవన్‌కుమార్‌రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

(c) eenadu

జిలేబీలు వేసిన న్యూజిలాండ్ ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ జిలేబీలు వేస్తూ సందడి చేశారు. ఆక్లాండ్‌లోని టకానినిలో సిక్కు వర్గీయులు నిర్వహించిన క్రీడలకు స్థానిక ఎంపీ రిమా నఖ్లేతో కలిసి న్యూజిలాండ్ ప్రధాని హాజరయ్యారు. అందరితో ముచ్చటించిన అనంతరం జిలేబీలు వండుతున్న చోటుకు వెళ్లి.. సరదాగా కాసేపు జిలేబీలు వేశారు. అక్కడున్న వారికి స్వయంగా తానే జిలేబీలు అందించారు. ఈ వీడియోను క్రిస్టఫర్ సోషల్ మీడియాలో పోస్ట్‌చేయడంతో వైరల్‌గా మారింది.

హిట్లర్ కాలం నాటి 5 కిలోల ఫోను!

ఈటీవీ భారత్: అరచేతిలో ఇమిడే స్మార్ట్ ఫోన్లు వాడుతున్న నేటి తరానికి 5 కిలోల బరువైన ఫోను అంటే వింతగానే ఉంటుంది. జర్మన్ నియంత హిట్లర్ కాలం నాటి ఈ ఫోను చూడాలంటే వడోదరలో జరుగుతున్న హస్తకళా ప్రదర్శనకు వెళ్లాలి. రాజస్థాన్‌కు చెందిన వినయ్‌శర్మ పోలాండ్ నుంచి దీన్ని కొన్నారు. “గతకాలపు పిలుపు” పేరుతో ఆయన ఏర్పాటుచేసిన స్టాల్‌లో పాతకాలపు మొబైల్, ఫోను, గడియారాలు, రేడియోలు ఆకట్టుకుంటున్నాయి. గత కాలపు ప్రాధాన్యం, మన పెద్దల కృషిని ఈ తరం గుర్తించాలన్నదే తన అభిమతమని ఆయన చెబుతారు.

గొప్ప జీవక్రియతో శ్రమలేని ఆరోగ్యం

మన జీవక్రియల పనితీరు బాగుంటే శ్రమలేకుండానే ఆరోగ్యం సొంతమవుతుంది. అవి ఉత్తమంగా ఉన్నాయనడానికి నిదర్శనం ఇవి..
✦ గాఢమైన నిద్ర. ✦ రోజంతా స్థిరమైన శక్తిని కలిగిఉండటం. ✦ చక్కటి జీర్ణశక్తి. ✦ శరీరంలో కొవ్వు సులువుగా కరుగుతుండటం.. ఆకలిపై నియంత్రణ.
– సుమిత్ శర్మ, డాక్టర్

ఈఎన్‌టీ వైద్యుడి అంబులెన్స్ కారు
పేదలకు అండగా సేవలు

మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ నగరానికి చెందిన చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వ్యాధుల వైద్యుడు జి.ఎస్. గణ్వీర్ వృద్ధులు, పేదల సహాయార్థం టెలిమెడిసిన్ సేవలు ప్రారంభించి.. సొంత కారును అంబులెన్సుగా మార్చారు. చాలామంది పేద రోగుల ఇబ్బందులు చూసి వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచనతో తన కారు అంబులెన్సును పూర్తి టెలిమెడిసిన్ క్లినిక్‌గా మార్చినట్లు గణ్వీర్ తెలిపారు. ‘నేను, నా సహోద్యోగి డాక్టర్ సోనమ్ కలిసి ఈ అంబులెన్సులో రోగుల ఇళ్లకు వెళతాం. కారులో ఉన్న పరికరాలతో వారిని పరీక్షిస్తాం. ఇందౌర్‌లో ఉన్న మా క్లినిక్ నుంచి వీడియోకాల్స్, ఫోన్‌కాల్స్ ద్వారా టెలిమెడిసిన్ సేవలను అందిస్తాం” అని వివరించారు. ఈ సేవలకు అదనపు రుసుం లేనందున డాక్టర్ గణ్వీర్ ‘కారు అంబులెన్స్’ ఇందౌర్‌లో బాగా ప్రాచుర్యం పొందింది.

షాజహాన్‌కు ఓటేయాలని
సోషల్ మీడియాలో ప్రజల ప్రచారం

కేరళలోని నిలంబూర్ మున్సిపాలిటీ 11వ డివిజను కార్పొరేటరుగా బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న షాజహాన్ గురించి విస్తృతంగా చర్చ జరుగుతోంది. బరిలో ఇతర ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నా.. షాజహాన్ చర్చనీయాంశంగా మారారు. సామాజికసేవలో ముందుండే ఈయన గతంలో అంబులెన్స్ డ్రైవరుగా పనిచేశారు. గతేడాది వరద ప్రాంతాల సహాయక చర్యల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. అయినా నిలంబూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో షాజహాన్ ఇవేవీ చెప్పుకోవడం లేదు. ఆయన సేవాగుణం గురించి స్వయంగా ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో కొట్టాయంకు చెందిన ఓ కుటుంబం చేసిన వీడియో వైరల్ అవుతోంది. ఈ కుటుంబంలో అందరికంటే చిన్నదైన అక్షర్యకు ఉచితంగా కిడ్నీ ఇచ్చి షాజహాన్ ప్రాణదానం చేశారు.

సర్‌పై రుసరుస

- పట్టువీడని విపక్షాలు
- పార్లమెంటులో ప్రతిష్టంభన
- ప్రతిపక్ష నేతల్ని చర్చకు ఆహ్వానించిన ప్రభుత్వం

దిల్లీ: ఓటర్ల జాబితాల ‘ప్రత్యేక ముమ్మర సవరణ’ (సర్) అంశంపై విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీయడంతో మంగళవారం పార్లమెంటు ఉభయసభలు స్తంభించిపోయాయి. వివిధ అంశాలను చర్చకు చేపట్టాలని ప్రభుత్వం తరఫున ప్రయత్నం జరిగినా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయి. ప్రతిష్టంభనను తొలగించడానికి ప్రతిపక్ష నేతల్ని ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. అంశాన్ని చర్చించడానికి సిద్ధమేనని, నిర్దిష్ట సమయ పరిమితి మాత్రం విధించలేమని తెలిపింది. లోక్‌సభ ఉదయం సమావేశమయ్యాక రెండుసార్లు వాయిదాపడింది. భోజన విరామానంతరం మళ్లీ సమావేశమైనప్పుడు విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న సర్‌పై చర్చకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, సభను కొనసాగనివ్వాలని సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా కోరారు. ఓటమి చెందిన ఆగ్రహాన్ని సభలో చూపించరాదని, మాజీ ప్రధాని వాజ్‌పేయీకీ ఓటమి తప్పలేదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. శూన్యగంట పది నిమిషాల్లో ముగిసింది. స్థాయీసంఘాలు నివేదికల్ని సమర్పించాయి.

9న చర్చించడానికి అంగీకారం

వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తికావడంపై ప్రత్యేక చర్చను ఈ నెల 8న, ఎన్నికల సంస్కరణలపై 9న లోక్‌సభ చర్చించనుంది. సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశానికి ముందు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష నేతల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రిజిజు ‘ఎక్స్’లో తెలిపారు. ఒక్కో చర్చకు ఒక్కో సభకు 10 గంటలు చొప్పున సమయం కేటాయించారు. అంతకుముందు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆప్, ఎస్పీ, సీపీఎం తదితర పార్టీల సభాపక్ష నేతలతో జరిగిన సమావేశంలో రిజిజు

ఆందోళనలో పాల్గొన్న రాహుల్, కేసీ వేణుగోపాల్, సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

మకరద్వారం వద్ద నిరసన

విపక్షాలకు చెందిన ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కనిమొళి, టి.ఆర్.బాలు, జాన్ బ్రిట్టాస్ సహా పలువురు నేతలు పార్లమెంటు మకరద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమైన చర్చల నుంచి ప్రధాని మోదీ నిరంతరం తప్పించుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఓటుహక్కుకు మించిన పెద్ద అంశం ఇంకేం ఉంటుందని ప్రశ్నించారు.

మాట్లాడుతూ ప్రభుత్వానికి విపక్షాలు నిర్దేశాలు ఇవ్వజాలవని స్పష్టంచేశారు.

తిరస్కరణకు కారణమైనా చెప్పండి

ఇదే అంశంపై రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 267 నిబంధన కింద చర్చకు అనేక పార్టీలు పట్టుపడుతున్నప్పుడు చర్చ చేపట్టాల్సిందేనని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే చెప్పారు. వాయిదా తీర్మానానికి ఇచ్చిన 21 నోటీసులను తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఎవరి నోటీసులను తిరస్కరించారోనైనా చెప్పాలని ఖర్గే ప్రశ్నించారు. వందేమాతరంపై కంటే సర్‌పై చర్చకు తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం తిరస్కరించడంతో విపక్షఎంపీలు వాకౌట్ చేశారు.

నేడు విపక్ష నేతల భేటీ

సమావేశాల్లో ఉమ్మడిగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి విపక్ష నేతలు బుధవారం ఉదయం ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నారు.

రేపే భారత్‌కు పుతిన్

మన దేశంతో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు ఆమోదం

మాస్కో: భారత్‌తో వ్యూహాత్మక రక్షణ ఒప్పందానికి రష్యా పార్లమెంటు దిగువ సభ డ్యూమా ఆమోదం తెలిపింది. రవాణాలో పరస్పర మార్పిడి సహకారానికి (రెలోస్) గత ఫిబ్రవరిలో కుదుర్చుకున్న ఈ ఒప్పందానికి సై అంది. గురు, శుక్రవారాల్లో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఈ ఒప్పందానికి సభ ఆమోదం తెలపడం విశేషం. పుతిన్ తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. వాణిజ్యం, రక్షణ రంగాల్లో పలు ఒప్పందాలకు వారు శ్రీకారం చుట్టనున్నారు. అమెరికాతో సంబంధాలు దెబ్బతిన్న ఈ తరుణంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా, చైనా, భారత్ బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్దామని పుతిన్ తెలిపారు. ‘గత మూడేళ్లలో ఈ దేశాల మధ్య వాణిజ్య బంధం మరింత విస్తరించింది. ఇంధనం, పారిశ్రామికం, అంతరిక్షం, ఇతర రంగాల్లో ఇప్పటికే ఎన్నో సంయుక్త భాగస్వామ్యాలున్నాయి. నా భారత్ పర్యటనలో ఆర్థిక అంశాలపైనా చర్చిస్తాం’ అని పుతిన్ తెలిపారు.

రెలోస్ ఎంతో కీలకం

రెలోస్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాల మధ్య సైనిక నిర్మాణాలు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల పరస్పర మార్పిడి ఉంటుంది. బలగాల పంపిణీలోనే కాకుండా పరికరాలు, రవాణానూ రెలోస్ నియంత్రిస్తుంది. ఈ ఏర్పాటును సంయుక్త విన్యాసాలు, శిక్షణ, మానవతా సాయం, విపత్తుల సమయంలో వినియోగిస్తారు. డ్యూమా వెబ్‌సైట్‌లో నోట్ ప్రకారం.. రష్యా పార్లమెంటు ఆమోదించిన పత్రాల్లో.. రెండు దేశాల గగనతలాన్ని, పోర్టులను రష్యా, భారత్ యుద్ధ నౌకలు వినియోగించుకుంటాయి.

రెండు దశల్లో జన గణన

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు నిర్వహిస్తాం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

దిల్లీ: దేశంలో జన గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026 ఏప్రిల్-సెప్టెంబరు మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జన గణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నకు హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ సంబంధిత వివరాలను పేర్కొన్నారు. అదే సమయంలో కుల గణనను కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ■ తొలి దశలో... గృహాల లిస్టింగ్, గణన (2026 ఏప్రిల్-సెప్టెంబరు) ■ రెండో దశలో... జనాభా లెక్కల సేకరణ (2027 ఫిబ్రవరి- మార్చి 1) ■ లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ప్రతికూల వాతావరణ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబరు- అక్టోబరు 1. ■ ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగానే కుల గణన కూడా జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్ రాయ్ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

30 ప్రశ్నలతో వివరాల సేకరణ

వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా 30కి పైగా ప్రశ్నలతో జన గణన పత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏళ్లకు పైగా చరిత్ర ఉందన్నారు. ■ సర్వేలో... ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, మరుగుదొడ్డి వాడకం, వంటగది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధనం వివరాలు సేకరిస్తారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు నిర్మాణ తీరు, నివాసితుల సంఖ్య, గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

డిజిటల్ విధానంలో..

■ ఈ దఫా జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. మొబైల్ యాప్‌ల ద్వారా జనాభా లెక్కల సమాచారాన్ని సేకరిస్తాం, స్వీయ గణనకు కూడా అవకాశం ఉంటుందని చెప్పారు. ■ మన దేశంలో సాధారణంగా పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణనకు ఆటంకం ఏర్పడింది.

ఐరోపా కోరుకుంటే యుద్ధానికి సై: పుతిన్

మాస్కో: ఐరోపా ఒకవేళ యుద్ధం కోరుకుంటే తాము అందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో వివాదంపై ఒక అంగీకారం కుదరకుండా ఐరోపా నేతలు అడ్డు తగులుతున్నారని ఆయన ఆరోపించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంతానికి చర్చలు జరిపేందుకు అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మాస్కోకు వచ్చి తనతో సమావేశమైన తరుణంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. “యూరప్‌తో యుద్ధం చేయాలని మేం అనుకోవడం లేదు. యూరప్ తానుగా యుద్ధం కోరుకుంటుంటే, యుద్ధాన్ని ప్రారంభిస్తే మేం అందుకు సిద్ధంగా ఉన్నాం” అని పుతిన్ విలేకరులకు చెప్పారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో సవరణలపై జెలెన్‌స్కీ సానుకూలంగా స్పందించారు. మార్పుల అనంతరం ప్రణాళిక మెరుగ్గా ఉందన్నారు.

కర్ణాటకలో ప్రైవేట్ బస్సు బోల్తా

● ఒకరి మృతి.. కడపకు చెందిన పలువురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తున్న హరితా ట్రావెల్స్ బస్సు కర్ణాటక రాష్ట్రంలో మంచినీళ్లకోట వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తాపడిన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కడప నుంచి బెంగళూరుకు వెళ్తున్న బస్సు రాయల్పాడు, శ్రీనివాసపురం మధ్యలోని మంచినీళ్లకోట వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న కృష్ణగిరికి చెందిన అనిత (50) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న సుమారు 40 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో కడపకు చెందిన షేక్ ఫయాజ్ (27), సయ్యద్ జునైద్ (22), సి.అట్లయ్య (26), అట్లూరుకు చెందిన వి.నరసింహులు (29) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సల అనంతరం బెంగళూరుకు వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన పలువురిని రాయల్పాడు, శ్రీనివాసపురంలోని ఆసుపత్రులకు తరలించినట్లు రాయల్పాడు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బస్సు డివైడర్‌ను వేగంగా ఢీకొట్టి బోల్తాపడినట్లు తెలిపారు. బస్సు వేగంగా నడపడం, మంచు కారణంగా రహదారి కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని రాయల్పాడు పోలీసులకు తెలియజేశారు.

ఉల్లి గోదాముల నిర్మాణానికి రాయితీ

గోదాం నమూనా

మైదుకూరు, దువ్వూరు: ఉల్లి దిగుబడులకు ధర వచ్చే దాకా నిల్వ చేసేందుకు గోదాముల నిర్మాణానికి ఉద్యాన శాఖ రాయితీ కల్పిస్తోంది. యూనిట్ ధర రూ.1.75 లక్షలు కాగా 50శాతం రాయితీ రూ.87,500 అందిస్తోంది. ఒక్కో గోదాములో 25 టన్నుల మేరకు నిల్వ చేసుకోవచ్చునని ఉద్యాన అధికారి సి.రామకృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎగుమతి రకం కేపీఉల్లి పంట మైదుకూరు మండలంలో 250 ఎకరాలు, దువ్వూరు మండలంలో 800 ఎకరాల్లో సాగైనట్లు వెల్లడించారు. ఉల్లికి గిట్టుబాటు ధర అందని సమయంలో గోదాముల్లో నిల్వ చేసుకుని ధర వచ్చాక విక్రయించుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఉద్యాన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి సుధ

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే దాసరి సుధ అన్నారు. పోరుమామిళ్ల ఆసుపత్రిని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యుల కొరత అధికంగా ఉందన్నారు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాదు, మండల ఉపాధ్యక్షుడు సి.బాషా, వైకాపా నాయకులు నాగార్జునరెడ్డి, డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తాం: ఎమ్మెల్యే

తెలుగుగంగ కాలువ వద్ద కృష్ణాజలాలకు హారతిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

దువ్వూరు, మైదుకూరు, బ్రహ్మంగారి మఠం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని తెలుగుగంగ జలాశయం-1, 2, బ్రహ్మంసాగర్ జలాశయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పూర్తి స్థాయి నీటి సామర్థ్యంతో నీటిని నింపామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. దువ్వూరు మండలం చల్లబసాయపల్లె తెలుగుగంగ జలాశయం-1ను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి తెలుగుగంగ జలాలకు హారతిచ్చారు. తెదేపా కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ● గుడిపాడు గ్రామానికి చెందిన మార్తల గురివిరెడ్డి ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ఇతనికి తెదేపా సభ్యత్వం ఉండటంతో పార్టీ తరఫున రూ.5 లక్షల ఆర్థిక సహాయంతోపాటు మొత్తం నియోజకవర్గంలోని 31 మందికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.24,22,100 మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చెక్కులతోపాటు పత్రాలను ప్రొద్దుటూరులో అందజేశారు. ● మైదుకూరు మండలంలోని డయాంఖాన్‌పల్లెలో అభివృద్ధి చేసిన శ్మశానవాటిక శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 61 శ్మశాన వాటికలను అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె గ్రామ శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తేగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దారు రాజసింహ నరేంద్రను ఆదేశించారు. మండలాధ్యక్షుడు కడప థామస్, ఏపీడీ మైథిలి, ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు, డీఈఈ మధుసూదన్‌రావు, ఏఈ నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ● ప్రొద్దుటూరు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక అధికారి శిరీషా, ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు కార్తిక్, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో అక్రమంగా అంతర్జాలంలో నమోదు చేసుకున్న భూముల గుర్తింపుపై అధికారులతో చర్చించారు. ప్రొద్దుటూరులోని క్యాంపు కార్యాలయానికి బాధిత కుటుంబ సభ్యులను ఆహ్వానించి పత్రాలను అందజేశారు.

రాయితీ రుణాలిస్తే జీవితాలు బాగు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: చేతివృత్తిదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం బద్వేలు పట్టణంలో చేతివృత్తిదారుల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల సంప్రదాయ చేతి ఉత్పత్తులకు మార్కెట్లో గిరాకీ లేక జీవితాలు దయనీయంగా ఉన్నాయన్నారు. రాయితీ రుణాలిచ్చి, ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆ సంఘం నాయకులు వెంకటరాముడు, వీరశేఖర్, మస్తాన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామాంజనేయులు

సాహస క్రీడల శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

విద్యార్థులతో అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: సాహస క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలోని అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉన్నత పాఠశాలలు, కళాశాలలకు చెందిన 105 మంది విద్యార్థులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన అడ్వెంచర్ లీడర్‌షిప్ శిక్షణ మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణలో అడ్వెంచర్ యాక్టివిటీల ప్రాథమిక నైపుణ్యాలను, భద్రతా ప్రమాణాలను, టీమ్ కో ఆర్డినేషన్, ఫస్ట్ రిస్పాన్స్, నావిగేషన్, యాంకరింగ్, రెస్క్యూ టెక్నిక్ వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్‌కుమార్ అకాడమీని సందర్శించి అడ్వెంచర్ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ అధికారి రామ్‌కుమార్, కిలిమంజారో, ఎవరెస్టు శిఖరాలను అధిరోహించిన మురళీకృష్ణ, దుర్గారావు, ఎస్.ఆనంద్, అన్విత, ఆర్.ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల క్రికెట్ మండల జట్టు ఎంపిక

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండల ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రికెట్ పోటీల నుంచి ఉత్తమ ఆటగాళ్లతో మండల జట్టును మంగళవారం ఎంపిక చేశారు. అప్పనపల్లె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య నాయకత్వంలో 16 మంది సభ్యులతో టీమ్‌ను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ జట్టు ఈ నెల 13, 14వ తేదీల్లో జరుగనున్న కడప డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల్లో ఖాజీపేట మండలం తరఫున పాల్గొననుంది. ఎంఈవోలు నాగస్వర్ణలత, సత్యనాగరాజు, కోఆర్డినేటర్లు పాల్గొని మాట్లాడారు.

క్రికెట్ టీమ్ ఎంపిక అనంతరం ఉపాధ్యాయులు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థినులు, కళాశాల బృందం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని గౌతమి మహిళ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని గూడెంచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గౌతమి మహిళ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు ప్రత్యేక శిబిరాల నిర్వహణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు స్వరూప్, శ్రీనివాసులు, సింధూజ, పాఠశాల హెచ్‌ఎం కవిత కల్పవలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

పోరుమామిళ్ల: గత నెల 11న జరిగిన ప్రమాద ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని ఏఎస్సై మూర్తి తెలిపారు. స్థానిక పెట్రోలు బంకు వద్ద క్లీనర్ కశెట్టి చిన్నహుసేనయ్య లారీలో నుంచి కిందకు దిగుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడం వలన హుసేనయ్యకు కాలు విరిగింది. కడప రిమ్స్‌కు తరలించారు. మోకాలి వరకు తొలగించారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన బాధితుడి కుమారుడు హుసేనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై ఆటోడ్రైవర్ మృతి

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం అలవాటుకు బానిసై అనారోగ్యం బారిన పడి ప్రొద్దుటూరు పట్టణం యానాది కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ గౌస్ మొహిద్దీన్ (34) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఆసుపత్రికి వెళ్తున్నానని బయటకు వెళ్లగా.. రాత్రి గాంధీరోడ్డులో పడిపోయి ఉండటంతో అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ప్రొద్దుటూరు నేరవార్తలు: ప్రొద్దుటూరులోని ఓ ప్రాంతానికి చెందిన వివాహిత (26) అదృశ్యం అయ్యారు. సోమవారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడం భర్త తెలిసిన చోట్ల వెతికారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం ఒకటో పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

బోల్తాపడిన మినీ లారీ

అదుపుతప్పి పడిన లారీ

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని మామిళ్లపల్లె సమీపంలో మంగళవారం మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. కలసపాడు నుంచి మామిళ్లపల్లె మీదుగా వేగంగా వెళుతున్న మినీ లారీ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఎర్రగుంట్ల: మండల పరిధిలో వలసపల్లె గ్రామ పంచాయతీలోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంపీడీవో వెంకటరమణయ్య పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు అనంతరం తుమ్మలపల్లె ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్ వద్ద జరుగుతున్న పనులను ఎంపీడీవో పరిశీలించారు.

రాష్ట్ర స్థాయికి దువ్వూరు విద్యార్థిని ఎంపిక

విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం

దువ్వూరు, న్యూస్‌టుడే : కౌశల్-2025 జిల్లా స్థాయి క్విజ్ పరీక్షల్లో దువ్వూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అందె వంశిక ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థినికి మెమోంటో అందజేసి ఉపాధ్యాయ బృందం అభినందించింది.

అపరాధ రుసుం లేకుండా పన్ను చెల్లింపునకు అవకాశం

మైదుకూరు, న్యూస్‌టుడే : అపరాధ రుసుం లేకుండా 2025-26 రెండో అర్ధ సంవత్సరానికి డిసెంబరు చివరిలోగా ఇంటిపన్ను చెల్లించవచ్చునని కమిషనర్ వై.రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అపరాధ రుసుంతో చెల్లించాల్సి వస్తుందన్నారు. పురపాలక, సచివాలయ కార్యాలయాల్లో పన్ను చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

సర్టిఫికెట్ కోర్సుతో విద్యార్థినులకు లబ్ధి

ధ్రువ పత్రాలు అందుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

కడప విద్య, న్యూస్‌టుడే: పుట్టగొడుగుల పెంపకం సర్టిఫికెట్ కోర్సు ద్వారా లబ్ధి చేకూరనుందని కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సలీం బాషా అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నిర్వహించిన పుట్టగొడుగుల పెంపకం సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం జరిగింది. ఎస్‌బీఐ మేనేజర్ వెంకటరత్నం మాట్లాడుతూ.. పుట్టగొడుగులు పెంచి వ్యాపార పరంగా వృద్ధి చేస్తే దానికి అవసరమైన రుణాలు బ్యాంకు ద్వారా అందిస్తామన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి బస్సు సర్వీస్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప శివారులోని ఆలంఖాన్‌పల్లె నుంచి కేంద్రీయ విద్యాలయానికి మంగళవారం ఆర్టీసీ బస్సును పునః ప్రారంభించారు. 2014లో బస్సు సర్వీస్ ఉండగా కొన్నాళ్లకు ఆపేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మాధవి దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ సంఘం నాయకులు జితేంద్ర ఇటీవల తీసుకెళ్లడంతో ఆమె ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం నుంచి బస్సు సర్వీస్‌ను పునఃప్రారంభించారు.

ఆర్టీసీ బస్సు వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉపన్యసించి.. సత్తా చాటి

పోటీల్లో భాగంగా ఉపన్యసిస్తున్న విద్యార్థిని

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరం భాగ్యనగర్ కాలనీలోని శ్రీసాయికృష్ణ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈనాడు ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం (స్పీచ్) పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఎస్.ఖుతిజుతుల్ కుబ్రా (8వ తరగతి), జే.శ్రీవైష్ణవి (9వ తరగతి), ఏ.వెంకటగణేష్‌రెడ్డి (7వ తరగతి) నిలిచారు. విజేతలకు కరస్పాండెంట్ సుశీల, వైస్‌ప్రిన్సిపల్ శిరీష, సుచరిత బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్ సుశీల, వైస్ ప్రిన్సిపల్ శిరీష, సుచరిత

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: మండల కేంద్రమైన సీకేదిన్నెలోని కుంటలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. తద్వారా నీరు కలుషితమవుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. - సుబ్బరాయుడు, సీకేదిన్నె

✓: సీకేదిన్నెలోని కుంటలోని వ్యర్థాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. - కుళాయిబాబు, ఎంపీడీవో, సీకేదిన్నె, - న్యూస్‌టుడే, చింతకొమ్మదిన్నె

కలల ఇళ్లపైనే మృత్యు తీగలు

ఆలంఖాన్‌పల్లెలో ఓ నివాసంపై ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

కడప చిన్నచౌకు, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: కడప పరిధిలోని పలు నివాసాల ఇళ్ల మధ్య వేలాడుతున్న విద్యుత్తు తీగలు ప్రమాదాలను హెచ్చరిస్తున్నాయి. తక్కువ ఎత్తులో స్తంభాలు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్లుగా పలువురు ప్రమాదానికి గురైన సంఘటనలూ ఉన్నాయి.

● ప్రధానంగా ఆలంఖాన్‌పల్లెలో ప్రధాన వీధిలో ఏళ్ల కిందట విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేశారు. అనంతరం నివాసాలు ఏర్పాటయ్యాక కరెంట్ తీగలు మిద్దెలపై నుంచే వెళ్తున్నాయి. 11 కేవీ తీగలకు ప్లాస్టిక్ పైపులు అమర్చినా అవి మధ్యలో చీలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఆ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న తీగలను సరి చేసి కాస్త దూరంగా ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

● ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లిలో ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ-నివాస గృహాల సమీపంలో గంగపేరూరు ఫీడరు 11కేవీ విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. ఓ బాలుడు సోమవారం వాటిని ప్రమాదవశాత్తు తగలడంతో షాక్ గురై గాయపడ్డాడు. అదే విధంగా స్తంభాలు వాలిపోయి తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న లైన్లపై ఇప్పటికైనా దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

వీరపునాయునిపల్లె, వల్లూరు, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డు, పింఛన్లు, భూసమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయని ఆయన అన్నారు. వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు అనిమెల గ్రామంలో నల్లబై శాతం రాయితీతో వేరుసెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం వల్లూరు మండలం బీమవారిపల్లెకు చెందిన కార్యకర్త రామమోహన్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పార్టీ సభ్యత్వం ఉన్న కారణంగా రూ.5 లక్షల బీమా మంజూరైంది. బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు. పార్టీ వీఎన్‌పల్లి మండల కన్వీనర్ భాస్కర రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

స్థానికుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

మానసిక దివ్యాంగులకు చేయూత అవసరం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: మానసిక దివ్యాంగులపై జాలి, దయ కాకుండా చేయూతనివ్వాలని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. ఆల్షిఫా మానసిక వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలోని మానసిక దివ్యాంగులు నగరంలోని కలెక్టరేట్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్షిఫా వ్యవస్థాపకులు మహ్మద్‌రఫీ, పలువురు ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ శ్రీధర్‌తో మానసిక దివ్యాంగ చిన్నారులు

జీవన నైపుణ్యంగా ఆర్థిక జ్ఞానం

వెబినార్‌లో కడప ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు రవీంద్రనాథ్, అధ్యాపకులు

కడప విద్య, న్యూస్‌టుడే: నేటి ప్రపంచంలో ఆర్థిక జ్ఞానం ఒక ప్రధానమైన జీవన నైపుణ్యంగా మారిందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) ప్రధానాచార్యులు డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇండియా మ్యూచువల్ ఫండ్స్ సంఘం (ఏఎంఎఫ్ఐ) సహకారంతో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఏ లైఫ్ స్కిల్ అండర్ ఎన్ఈపీ 2020' అనే అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు మాట్లాడుతూ ఈ వెబినార్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు స్మార్ట్ ఫైనాన్షియల్ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ రమేష్, కన్వీనర్ నాగరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెన్నూరులో ఉద్రిక్తత

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు మండల కేంద్రంలో ఓ ప్రార్థన మందిరం నిర్మాణ విషయమై మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గతంతో ఇక్కడ చేపడుతున్న నిర్మాణ పనులు చట్టబద్ధంగా లేవని ఉన్నతాధికారుల సమక్షంలో విచారించారు. అనంతరం స్థల విషయమై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తేల్చాలని ఆదేశించారు. ఆ సమస్య నేటికీ పరిష్కారం కాలేదు. తాజాగా స్థల నిర్వాహకులు అనుమతులు వచ్చాయంటూ వారు భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో సమస్య సద్దుమణిగింది.

శక్తి యాప్ రక్షణ కవచం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మహిళలకు రక్షణ కవచం 'శక్తియాప్' అని సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి అన్నారు. మండలంలోని కృష్ణాపురంలోని వసతి గృహాల్లో మంగళవారం శక్తియాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

వేముల: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తుందని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాజా మొయినుద్దీన్ అన్నారు. వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. నీటినిల్వలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

IN THE COURT OF THE 7th ADDITIONAL DISTRICT JUDGE, KADAPA

Original Suit No.31 of 2025

Between:
1. Shaik Saira Banu alias Begum
2. Shaik Khaja Moinuddin @ Babu ...Plaintiffs

Versus

4. Md. Barkathulla, Son of late Azmathulla, Muslim, aged about 50 years, Business, residing in D.No.20/920, Radha Krishna Nagar, Co-Operative Colony, Kadapa City and District.
6. Smt. Shaik Sara, Wife of Shaik Ameera, Muslim, aged about 34 years, House-Hold, residing in D.No.20/920, Radha Krishna Nagar, Co-Operative Colony, Kadapa City and District.
10. Digital Flexy Stickering rep by its proprietor Pradeep, Room No.4, Gurrala Gadda, Kadapa District.
11. Sree Durga Fruits rep by its proprietor Dastagiri, Room No.5, Gurrala Gadda, Kadapa District.
12. Colour Shine Developers rep by its proprietor Malli, Room No.6, Gurrala Gadda, Kadapa District. ...Defendants

SUIT SUMMON TO DEFENDANTS Nos.6, 10 To 12

Please take summons that the plaintiffs have filed the above suit against you for against the defendants for partition in respect of the suit schedule property and for grant injunction, case stands posted for your appearance either personally or through an advocate, at 10.30 A.M. on **23.12.2025** before the said court and if you fail to appear, matter will be decided exparte.

I.A. No.174 of 2022 in Original Suit No. 31 of 2025

NOTICE TO RESPONDENTS Nos.4 AND 6 / DEFENDANT Nos.4 AND 6

Please take notice that the petitioners / plaintiffs have filed the above I.A. against you for grant of temporary injunction, case stands posted for your appearance either personally or through an advocate, at 10.30 A.M. on **23.12.2025** before the said court and if you fail to appear, matter will be decided exparte.

// By Order of the Court//
Sri **M.SURESH KUMAR**
M.A., B.L., Advocate, Kadapa,
Cell: 9440673990.

యూటీఎఫ్ ఒంటిమిట్ట మండల నూతన కమిటీ ఎన్నిక

మాలే బాబు

భాగ్యలక్ష్మి

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం ఒంటిమిట్ట మండలాధ్యక్షుడు గాజులపల్లి గోపీనాథ్ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నికల అధికారి రమణ, ఎన్నికల పరిశీలకులు నరసింహారావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల గౌరవాధ్యక్షులుగా రౌఫ్‌బాషా, అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి, సహాధ్యక్షులుగా విశ్వనాథ్, ప్రత్యూష, ప్రధాన కార్యదర్శిగా మాలే బాబు, ట్రెజరర్‌గా బ్రహ్మయ్య, జిల్లా కౌన్సిలర్లుగా.. మండల కార్యదర్శులుగా పలువురిని ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణి అయిన విజయదుర్గాదేవి అమ్మవారికి తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం రాహుకాల పూజలు చేశారు.

పూజలు చేస్తున్న మహిళలు

వేడుకగా భగవద్గీత పారాయణం

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లెలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం సామూహిక భగవద్గీత పారాయణం వేడుకగా నిర్వహించారు. గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా అర్చకుడు ఇంద్రకంటి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, కృష్ణ అష్టోత్తరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

మంగళగౌరీదేవికి అభిషేకాలు

వేంపల్లె: వేంపల్లె సంపంగివీధిలో వెలసిన మంగళగౌరీదేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శంకరమంచి సాయిప్రసాద శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కుంభగిరి నాగేంద్రబాబు, యడాల సుబ్బరాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.

బాలోత్సవం పోటీల్లో ప్రతిభ

సిద్దవటం: కడపలో ఇటీవల జరిగిన బాలోత్సవం-3.0 సంబరాల్లో సిద్దవటానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు కైవసం చేసుకున్నారు. నవంబర్ 29, 30వ తేదీల్లో కడపలో జరిగిన జిల్లా స్థాయి బాలోత్సవం-3.0 పోటీలలో సిద్దవటంలోని శ్రీనలంద పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు. పలు విభాగాల్లో హేమశ్రీ, రిశ్మిత, శ్రీలక్ష్మి, హేమశ్రీ, శ్రీలక్ష్మీ, శ్రీజ, వెంకటప్రణవి, ప్రదీప్‌లు ప్రతిభ కనబరచి సత్తా చాటారు. వారికి మంగళవారం సిద్దవటం ఎంఈవో-1 నాగరత్న, ఎంఈవో-2 అరుణలు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

వేంపల్లె: జిల్లా స్థాయి బాలోత్సవం పోటీలలో వేంపల్లె శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నవంబరు 29 నుంచి 30వ తేదీ వరకు కడపలో నిర్వహించిన సాంస్కృతిక విభాగం పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. నిర్వాహకులు వారికి ప్రశంసా పత్రాలు అందించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినందించారు.

పులివెందుల వసతి గృహాలంటే రాష్ట్రంలో మంచి పేరుండాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల అధికారులతో మంగళవారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వసతుల కల్పనలో రాజీ పడొద్దని ఆయన సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో రామాంజనేయులు, వసతి గృహాల అధికారులు, కడప పార్లమెంటరీ కార్యదర్శి మైసూరారెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల: విద్యా వ్యవస్థలో ప్రస్తుతం మూల్యాంకన విధానము, ప్రశ్నపత్రాల రూపకల్పన మొత్తం లోప భూయిష్టంగా ఉందని, దానిని రాబోయే విద్యా సంవత్సరంలో రద్దు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని ఎస్టీయూ కడప జిల్లా నేతలు కోరారు. మంగళవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వరరెడ్డి, పులివెందుల, వేంపల్లె రీజియన్ నాయకులు ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఈనెల 13, 14 తేదీలలో కడపలో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు, విద్యా సదస్సుకు హాజరుకావాలని ఎమ్మెల్సీని కోరారు.

ఎరుకుల హక్కుల పోరాట సమితి కార్యవర్గం ఎన్నిక

పులివెందుల, న్యూస్‌టుడే: ఎరుకుల హక్కులను సాధించుకునేంత వరకు పోరాటం సాగించాలని కడప జిల్లా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు జట్టింగు సుబ్బరాయుడు అన్నారు. పులివెందులలో మంగళవారం జిల్లా ఎరుకుల హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జట్టింగు సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా చిట్టిబోయిన శ్రీనివాసులు, జట్టింగు వెంకటలక్ష్మి, పూల రామాంజనేయులు, సొరకాయల బాలకొండయ్య, కాకి హరిక్రిష్ణ, పెనుగొండ రామయ్య, ప్రధాన కార్యదర్శిగా మాలిపాటి రామాంజనేయులు, న్యాయ సలహాదారుగా ద్రాక్షం రామాంజనేయులు, గౌరవ సలహాదారుడు గోర్ల నాగరాజు తదితరులు ఎన్నికయ్యారు.

ఖాళీలు భర్తీ చేయాలని వినతి

కడప విద్య, న్యూస్‌టుడే: అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా ఉమ్మడి కడప జిల్లాలోని ఎస్జీటీ ఖాళీలన్నీ భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం డీఈవో షంషుద్దీన్‌ను కలిసి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కొన్ని పోస్టులు మాత్రమే భర్తీచేయడంతో మిగిలిన ఉపాధ్యాయులు పాత స్థానాలలోనే కొనసాగాల్సి వస్తుందన్నారు. స్కూల్‌అసిస్టెంట్ ఖాళీలన్నీ భర్తీచేస్తున్నట్లుగానే ఎస్జీటీ పోస్టులన్నింటినీ భర్తీచేయాలని కోరారు.

భోజనం తయారీలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారీ చేస్తున్న భోజనం, కూరల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని చింతరాజుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవో-2 తనిఖీ చేశారు. అనంతరం ఎంఈవో-2 మాట్లాడుతూ.. నిర్దేశిత మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. గదులు సరిపడా లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. పలు సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. హెచ్ఎం మేరీ పాల్గొన్నారు.

చిత్రాన్నం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈవో-2 బ్రహ్మయ్య

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం కడపలో జరిగింది. మాధవరానికి చెందిన నారాయణ, సుబ్బారెడ్డిలు ద్విచక్రవాహనంలో కడప కలెక్టరేట్‌కు వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చారు. అనంతరం తిరిగి వెళ్తూ మహావీర్ కూడలి వద్ద వాహనంపై ఆగి ఉన్నారు. అదే సమయంలో లగేజీతో వస్తున్న ఓ ఆటో డ్రైవర్ వీరి వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-40, క్యాబేజీ-28, క్యారెట్-60, బీన్స్-55, బీట్‌రూట్-50, కీర-30, దోస-40, దొండకాయలు-50, ముల్లంగి-40, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-30, మిరపకాయలు 40, వంకాయలు-20, బెండకాయలు-40, బీర-40, కాకర- 40, మటిక్కాయ-40, చిక్కుడు-58, అలసందకాయలు-45, అనపకాయలు-60, ఉల్లిపాయలు-20, 25.

వాలీబాల్‌లో రిమ్స్ వైద్య విద్యార్థుల సత్తా

వైద్య విద్యార్థులు సాధించిన ట్రోఫీతో ప్రిన్సిపల్ డాక్టర్ జమున, వైద్యులు

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: రాజమండ్రిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక కళాశాలలో మంగళవారం వాలీబాల్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. కళాశాల ఇన్‌ఛార్జి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మనోజ్‌కుమార్ మార్గదర్శకంలో వైద్య విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని త్వరలో కళాశాలలో క్రీడా సౌకర్యాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగశ్రీలత, డాక్టర్ కళ్యాణి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కర్రసాము పోటీలకు ఎంపిక

విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఇందిరా, అధ్యాపకులు

పెండ్లిమర్రి: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీల్లో పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రూపశ్రీ, సుమలత బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

కమలాపురం, న్యూస్‌టుడే: పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలు దస్త్రాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని తెలుసుకున్నారు. సీఐ రోషన్, ఎస్సై విద్యాసాగర్ పాల్గొన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu